శ్రీ రామ సేవ

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

(మందరము) యుద్ధకాండము - 1

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

వాల్మీకి రామాయణము

(మందరము) యుద్ధ కాండము-1

రచన

వావిలికొలను సుబ్బారావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

(MANDARAMU) YUDDHA KANDAMU-1

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

Published by :
Sri A.V. Dharma Reddy, IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

శ్రీరస్తు

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణ

విషయసూచిక

యుద్ధకాండము

సర్గసంఖ్య.			పుటసంఖ్య.
1	శ్రీరాముఁడు హనుమంతుని బ్రశంసించుట	...	3
2	సుగ్రీవుఁడు శ్రీరామున కుత్సాహంబుఁ గలుగ భాషించుట	...	13
3	శ్రీరాముఁడు హనుమంతుని లంకయందలి దుర్గాదులవిధం బడుగుట	...	19
4	శ్రీరాముఁడు కపిసేనతో లంకపై దండయాత్ర వెడలుట	...	25
4	లక్ష్మణుఁడు శుభశకునములఁ గని శ్రీరామునితోఁ జెప్పుట	...	33
4	కపిసేనలు ప్రయాణమై పోవుట	...	39
4	శ్రీరాముఁడు కపిసేనతో సముద్రతీరముఁ జేరుట	...	45
4	సముద్రవర్ణనము	...	47
5	శ్రీరాముఁడు సీతం దలంచి దుఃఖించుట	...	50
6	రావణుఁడు మంత్రులతో నాలోచించుట	...	58
7	రాక్షసులు రావణు పరాక్రమంబుఁ బొగడుట	...	62
8	ప్రహస్తాదులు తమ పరాక్రమంబు రావణుతోఁ జెప్పుట	...	68
9	రభసాదులు విజృంభించి పలుకుట	...	73
9	విభీషణుఁడు రావణునకు రాజనీతిఁ దెలుపుట	...	74
10	విభీషణుఁడు రావణుగృహంబునకుఁ బోవుట	...	80
10	విభీషణుఁడు రావణునకుఁ బురంబున నపశకునంబులు పుట్టుట జెప్పుట		83
10	విభీషణుఁడు రావణుతో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట		86
11	రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట	...	88
11	రావణుఁ డెల్లరాక్షసుల సభకు రప్పించుట	...	92
12	రావణుఁడు రాక్షసుల సంబోధించుట	...	95
12	రావణుఁడు రాక్షసులతో సీతావృత్తాంతముఁ జెప్పుట	...	98
12	కుంభకర్ణుఁడు రావణునిఁ గోపించి పలుకుట	...	102

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
13	మహాపార్శ్వుఁడు రావణునితో సీతాదేవిని విడువరాదని చెప్పుట...	106
13	రావణుఁడు మహాపార్శ్వునితో బ్రహ్మ తన్ను శపించినవిధంబుఁ దెలుపుట	109
14	విభీషణుఁడు సీతాదేవిని శ్రీరామున కిమ్మని రావణునకు బోధించుట	112
14	విభీషణుఁడు ప్రహస్తుని గర్హించుట ...	115
15	ఇంద్రజిత్తు విభీషణుఁ దిరస్కరించి పలుకుట ...	122
15	విభీషణుఁ డింద్రజిత్తును నిందించుట ...	125
16	రావణుఁడు విభీషణునకు జ్ఞాతిలక్షణంబుఁ దెలిపి నిష్ఠురంబు లాడుట	127
16	విభీషణుఁడు సభ విడిచి మింటి కెగసి రావణునకు హితముఁ దెల్పుట	133
17	విభీషణుఁడు నలువురు మంత్రులతో శ్రీరాముఁడున్న చోటికిఁ బోవుట	138
17	విభీషణుఁడు తనరాక శ్రీరామునకుఁ దెలుప వానరుల వేఁడుట ...	147
17	సుగ్రీవుఁడు శ్రీరామునకు విభీషణురాక దెలిపి రాక్షసుల నమ్మరాదనుట	158
17	శ్రీరాముఁడు విభీషణుని విషయమై కపుల యభిప్రాయ మడుగుట	162
17	అంగదాదులు వారివారి యభిప్రాయంబులఁ దెలుపుట ...	164
17	విభీషణుని గ్రహింపవచ్చునని హనుమంతుఁ డభిప్రాయముఁ దెలుపుట	168
18	శ్రీరాముఁడు కపులతో విభీషణుఁడు గ్రాహ్యుఁడని చెప్పుట ...	177
18	శ్రీరాముఁడు సుగ్రీవునకు శరణాగతరక్షణం బవశ్యకర్తవ్యంబని చెప్పుట	191
18	శ్రీరాముఁడు విభీషణున కభయ మిచ్చుట ...	201
19	విభీషణుఁడు శ్రీరామపదంబులమీఁదఁబడి తన్ను నివేదించుకొనుట	240
19	విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసబలంబుఁ దెల్పుట ...	247
19	శ్రీరాముఁడు విభీషణునకుఁ బట్టాభిషేక మొనరించుట ...	251
20	శార్దూలుఁడు రావణునితో శ్రీరాముఁడు కపులతో సముద్రమునొద్దను దిగియుండు వార్త చెప్పుట ...	254
20	రావణుఁడు శుకుని సుగ్రీవునొద్దకు రాయబార మంపుట ...	255

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
20	వానరులు శుకుని మర్దించుట ...	257
20	సుగ్రీవుఁడు రావణునకుఁ బ్రత్యుత్తర మంపుట ...	258
21	శ్రీరాముఁడు దర్భశయనంబునఁ బరుండుట ...	262
21	శ్రీరాముఁడు సముద్రునిపై నాగ్రహపడుట ...	271
21	శ్రీరాముఁడు సముద్రునిపై బాణంబులు వైచి క్షోభిల్లఁజేయుట	276
22	శ్రీరాముఁడు సముద్రునిపై బ్రహ్మాస్త్రంబు వేయఁబూనుట ...	278
22	శ్రీరామునకు సముద్రుఁడు ప్రత్యక్ష మగుట ...	282
22	శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రమును ద్రుమకుల్యముపైఁ బ్రయోగించుట	285
22	నలుఁడు సేతువు నిర్మించుట ...	288
22	శ్రీరామలక్ష్మణులు కపిసేనతోడ సేతువు దాఁటుట ...	293
23	శ్రీరాముఁడు లక్ష్మణునకు కన్పడు దోఁచు శకునంబుల తెలంగాఱింగించుట	294
24	శ్రీరాముఁడు లంకలోని ధ్వని విని సీతను దలఁచి దుఃఖించుట...	298
24	శ్రీరాముఁడు సేనల వ్యూహంబు దీర్చుట ...	301
24	శుకుఁడు రావణుతోఁ దాను బోయివచ్చిన వృత్తాంతముఁ జెప్పుట	302
24	రావణుఁడు శుకునితో సీత నీయనని తనపరాక్రమముఁ దెలుపుట	306
25	రావణుఁడు శుకసారణులను వానరసేనఁ బరికించి రాఁ బనుచుట	309
25	విభీషణుఁడు శుకసారణులను బట్టి శ్రీరామున కప్పగించుట ...	311
25	శుకసారణులు రావణుతో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట	315
26	రావణుఁడు శుకసారణులతోఁ బ్రాసాద మెక్కి కపిసేనల జూచుట	317
26	సారణుఁడు రావణునకు నంగదాదుల నెఱింగించుట ...	319
27	సారణుఁడు రావణునకు హరాదియూథనాథుల నెఱింగించుట ...	323
28	శుకుఁడు రావణునకు మైందాదుల నెఱింగించుట ...	333
28	శుకుఁడు రావణునకు శ్రీరామలక్ష్మణులఁ జూపుట ...	337
28	శుకుఁడు వానరసేనాసంఖ్యను రావణునకుఁ దెలుపుట ...	342
29	రావణుఁడు శుకసారణుల నిందించుట ...	343
29	రావణుఁడు శార్దూలాదులను శ్రీరామునిచర్య కనుఁగొని రాఁ బంపుట	347
30	రావణునకు శార్దూలుఁడు కపులచేఁ దాను బడినపాటు దెలుపుట	349
30	శార్దూలుఁడు రావణునకుఁ గపుల బలపరాక్రమములు దెలుపుట	353

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
31	రావణుఁడు విద్యుజ్జిహ్వుని రామునిశిరస్సుఁజాపముఁగల్పింపనాజ్ఞాపించుట	357
31	రావణుఁడు సీతకు శ్రీరామాదులు హతులైరని చెప్పుట ...	358
31	రావణుఁడు సీతాదేవికి శ్రీరాముని కల్పితశిరశ్చాపంబులఁ జూపుట	364
32	శ్రీరాముని మాయాశిరశ్చాపంబులఁ జూచి సీత దుఃఖించుట...	365
32	మంత్రులు పిలువ రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట...	378
33	సరమ సీతాదేవిని సమాధానపఱుచుట ...	379
33	సీతాదేవికి సరమ యుద్ధసన్నాహముఁ దెలుపుట ...	383
34	సీతాదేవి సరమను రావణుమనోనిశ్చయం బెఱింగి రమ్మనుట...	388
34	సరమ సీతాదేవికి రావణు నిశ్చయం బెఱింగించుట ...	392
35	మాల్యవంతుఁడు సీతాదేవి నిమ్మని రావణునకు నీతి బోధించుట	395
36	రావణుఁడు మాల్యవంతుని ధిక్కరించుట ...	402
36	రావణుఁడు పురద్వారంబులఁ గాపుంచుట ...	406
37	శ్రీరామునకు విభీషణుఁడు రావణసేనాసన్నాహంబు విధంబుఁ దెల్పుట	407
37	శ్రీరాముఁడు లంకాద్వారముల సేనల నిలుపుట ...	410
38	శ్రీరాముఁడు సుగ్రీవాదులతో సువేలాద్రి నెక్కుట ...	412
39	శ్రీరాముఁడు లక్ష్మణ సుగ్రీవాదులతో లంకం జూచుట ...	414
40	సుగ్రీవుఁడు రావణు గోపురంబును దాఁటి యతనితోఁ బోరుట...	420
41	శ్రీరాముఁడు సాహసము చేయవలదని సుగ్రీవునకు బోధించుట	428
41	శ్రీరాముఁడు లక్ష్మణునకు శకునంబులఁ దెలుపుట ...	431
41	శ్రీరాముఁడు సువేలాద్రి దిగి లంక ముట్టడించుట ...	433
41	అంగదు రాయబారము ...	438
41	అంగదుఁడు రాక్షసులఁ జంపి మరలి శ్రీరాముకడకు వచ్చుట...	444
42	రాక్షసులు రావణుతో లంకను వానరులు ముట్టడించి రని తెలుపుట	447
42	శ్రీరాముఁడు లంకకోటకు లగ్గలుపట్ట వానరుల కనుజ్ఞ యిచ్చుట	449
42	రావణుఁడు రాక్షసుల యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిచ్చుట...	452
43	వానర రాక్షస ద్వంద్వయుద్ధము ...	454
44	వానర రాక్షసుల రాత్రి యుద్ధము ...	461
44	శ్రీరాముఁడు రాక్షసుల వధించుట ...	463

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
44	ఇంద్రజిత్తంగదుచేఁ బరాజితుఁడయి మాయాయుద్ధ మొనర్చుట	466
45	ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేయుట ...	470
46	సుగ్రీవాదులు బద్ధులైన శ్రీరామలక్ష్మణులఁ జూడవచ్చుట ...	477
46	ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణులు చచ్చిరని రాక్షసులతోఁ జెప్పుట	479
46	ఇంద్రజిత్తు వానరవీరుల నొప్పించుట ...	480
46	విభీషణుఁడు సుగ్రీవునకు ధైర్యముఁ జెప్పుట ...	482
46	ఇంద్రజిత్తు రావణునితోఁ దాను శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేసి వధించితి నని చెప్పుట ...	486
47	హనుమదాదులు శ్రీరామలక్ష్మణులఁ గాచియుండుట ...	487
47	రావణుఁడు రాక్షసస్త్రీలతో సీతాదేవికి శ్రీరామలక్ష్మణులఁ జూపుఁడని చెప్పుట ...	488
47	సీతాదేవి పుష్పకంబునందుండి శ్రీరామలక్ష్మణులఁ జూచుట ...	490
48	నాగపాశబద్ధులైన శ్రీరామలక్ష్మణులఁజూచి సీతాదేవి దుఃఖించుట	491
48	త్రిజట సీతాదేవికి శ్రీరామలక్ష్మణులు జీవించి యున్నారని చెప్పుట	502
49	శ్రీరాముఁడు మూర్ఛదేఱి లక్ష్మణుం జూచి దుఃఖించుట ...	505
49	శ్రీరాముఁడు సుగ్రీవునితోఁ గిష్కింధకుఁ బొమ్మని చెప్పుట ...	510
50	కపులు విభీషణుని నింద్రజిత్తని భ్రమించి పరువెత్తుట ...	512
50	దుఃఖించు విభీషణుని సుగ్రీవుండు దేర్చుట ...	515
50	సుగ్రీవునితో సుషేణుఁడు సంజీవకరణిఁ దెప్పింపుమని చెప్పుట...	517
50	గరుత్మంతుఁడు శ్రీరామలక్ష్మణులఁ జూడ వచ్చుట ...	518
50	నాగపాశబంధ విముక్తులై శ్రీరామలక్ష్మణులు గరుత్మంతుని ప్రశంసించుట ...	520
50	గరుడుఁడు శ్రీరామునకు హెచ్చరికగ యుద్ధముచేయ బోధించుట	521
50	శ్రీరామలక్ష్మణులఁ జూచి కపులు సింహనాదంబులు సేయుట...	523
51	రావణుఁడు కపుల సంతోషమునకుఁ గారణము విచారించుట...	524
51	శ్రీరామలక్ష్మణులు నాగపాశవిముక్తులగుటకు రావణుఁడు వ్యసనపడుట	527
51	ధూమ్రాక్షుఁడు యుద్ధమునకుఁ బోవుట ...	528
51	ధూమ్రాక్షున కపశకునంబు లగపడుట ...	530
52	ధూమ్రాక్షు సేనలు కపులతోఁ బోరుట ...	532
52	ధూమ్రాక్షుఁడు కపుల వధించుట ...	534

సర్గసంఖ్య.			పుటసంఖ్య
52	ధూమ్రాక్షుఁడు హనుమంతునిచే హతుండగుట	...	536
53	రావణుఁడు వజ్రదంష్ట్రుని యుద్ధంబున కనుచుట	...	538
53	వజ్రదంష్ట్రుఁడు యుద్ధమునకు వెడలుట	...	540
53	అంగదుఁడు శత్రుసేనపై విజృంభించుట	...	543
54	వానరులు వజ్రదంష్ట్రు సేనలఁ బోరిగొనుట	...	545
54	వజ్రదంష్ట్రుఁడు వానర సేనపై విజృంభించుట	...	546
54	వజ్రదంష్ట్రుఁ డంగదునితోఁ బోరి చచ్చుట	...	548
55	అకంపనుఁడు యుద్ధమునకుఁ బోవుట	...	551
56	అకంపనుఁడు వానరసేనపైఁ గవియుట	...	556
56	హనుమంతునిచే నకంపనుఁడు హతుం డగుట	...	558
57	రావణుఁడు ప్రహస్తుని యుద్ధమునకుఁ బొమ్మనుట	...	562
57	ప్రహస్తుఁడు యుద్ధమునకుఁ వెడలుట	...	567
57	ప్రహస్తున కవశకునంబు లగపడుట	...	570
58	ప్రహస్తసేనలు వానరులతోఁ బోరుట	...	572
58	ప్రహస్తుఁడు కపుల వధించుట	...	577
58	నీలుఁడు ప్రహస్తుని వధించుట	...	580
59	రావణుఁడు తొలిసారి యుద్ధమునకు వెడలుట	...	586
59	విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసవీరుల నిరూపించి చెప్పుట	...	591
59	శ్రీరాముఁడు రావణుఁ జూచి యాశ్చర్యపడుట	...	593
59	రావణుఁడు సుగ్రీవాదులతోఁ బోరుట	...	598
59	లక్ష్మణుఁడు రావణుతోఁ బోర రామాజ్ఞఁ గొనుట	...	601
59	రావణ హనుమంతుల యుద్ధము	...	604
59	రావణుఁడు నీలునితో యుద్ధము సేయుట	...	607
59	రావణ లక్ష్మణ సంవాదము	...	611
59	రావణ లక్ష్మణుల యుద్ధము	...	613
59	మూర్ఛిల్లిన లక్ష్మణు రావణుఁ డెత్తఁ బ్రయత్నించుట	...	617
59	హనుమంతుఁడు రావణుఁ దన్ని లక్ష్మణు నెత్తుకొని శ్రీరామునొద్దకుఁ బోవుట	...	622

శ్రీః

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

శ్రీహయగ్రీవ ప్రసన్న

శ్రీ శారదాయై నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణము

యుద్ధకాండము

వ! ప్రపద్యేడిత! దురి
తాపహా! కారుణ్యసీమ ♦ యరిజనభీమా!
తాపహరా! విధిహరనుత!
తాన్మప్రశ్రీలోల! రామ ♦ చంద్రనృపాలా!

మందరము

చెప్పఁబోవు యుద్ధకాండార్థమును విను మని కవి తన యిష్టదేవతయు, గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడిన కథానాయకుఁడు నగు శ్రీరామచంద్రమూర్తిని సంబోధించుచున్నాఁడు. శ్రీప = లక్ష్మీదేవిని పాలించువాఁడా! అరణ్య కిష్కింధా సుందర కాండములందు సీతా రామవియోగము చెప్పఁబడెను, దానివలన నింతవఱకు శ్రీరామచంద్రమూర్తి యశ్రీకుఁడనియే చెప్పవలసి యున్నది. ఈ కాండమున నా శబ్దము సార్థక మగుచున్నదని భావము. శ్రియఃపతీ! ప్రపద్య + ఈడిత =

ప్రపద్యేడిత. (౧) జనులచేత భజింపఁబడఁదగిన బ్రహ్మరుద్రాదులచేతను, ఈడిత= కొనియాడఁబడినవాఁడా! (౨) ప్ర + పద్య = ప్రకృష్ట పద్యములు = ఉత్తముల వాక్యములు, వానిచేతఁ గొనియాడఁబడినవాఁడా. (౩) ప్ర=ఉత్కృష్టమైన-పద్యా= మోక్షమార్గము కలవారిచేతఁ గొనియాడఁ బడినవాఁడా! "సరణిః పద్ధతిః పద్యా" యని యమరుఁడు - మోక్షమార్గము-లం దన్నిట శరణాగతి యనఁబడు ప్రపత్తియే కదా యుత్తమమైనదని శ్రుతి చెప్పఁబడుచున్నది. 'తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః ॥తైత్తి॥ "భక్త్యాపరమయావాపి ప్రపత్త్యావా మహామునే। ప్రాప్యోఽహం నాన్యథా ప్రాప్యః' ఇత్యాద్యనేక ప్రమాణములు; భగవద్గీతాదులు ప్రపత్తియాత్కృష్ట్యమును స్థాపించుచున్నవి కదా- భగవంతుఁడట్టి ప్రపన్నులచే స్తోత్రము చేయఁబడువాఁడని భావము. ప్రపన్నేడిత యనక ప్రపద్యేడిత యని క్లిష్టవచనరచన యేల యనినఁ బ్రతికాండాదిమ పద్యమునందుఁ దొలుత ద్వయమంత్రములోని పదము చేర్పవలయునని కవి పెట్టుకొన్న నియమమే దీనికిఁ గారణము. ఇట్టి నియమ మేల యుంచుకొనవలసివచ్చె ననిన శ్రీమద్రామాయణ మంతయు దీర్ఘశరణాగతి యని పూర్వాచార్యులు యథార్థముగ వచించిరి. శరణాగతిని విశేషముగఁ బ్రతికాండమందును బ్రతిపాదించుటచేతనే రామాయణము దీర్ఘశరణాగతి యనఁబడెను. అట్టి శరణాగతిని బోధించు మంత్రము ద్వయము. మంత్రార్థమును బోధించు గ్రంథమున మంత్రముకూడ నుండుట బాగని యీకవి యిట్టులా మంత్రమును కాండాదిమ పద్యములందు నిర్వహించెను. మంత్రార్థానుసంధానముతో మంత్ర ముచ్చరించినఁ గదా విశేషప్రయోజనము గలుగును. దురితాపహా=దురిత=పాపములను,అపహా= పోఁగొట్టువాఁడా! నీ విట్టివాఁడవని తెలిసికదా ప్రపన్నులు నిన్ను స్తోత్రము చేయుదురని భావము. వ్యవస్థ చెప్పక దురితాపహా యనుటచే సంచితాగాములను అనభ్యుపగత ప్రారబ్ధమును బోఁగొట్టువాఁడని భావము. "ప్రారబ్ధేతర పూర్వపాప మఖిలం ప్రామాదికంచోత్తరమ్, న్యాసేన క్షపయ న్ననభ్యుపగత ప్రారబ్ధఖండంచ నః" అని కదా ప్రపత్తిమహిమ చెప్పఁబడెను. కారుణ్యసీమ = దయకుఁ బొలిమేర యగువాఁడా! దయ యనునది యెంతయున్నదో యంతయు నీయందలోననే యున్నదని భావము. అట్టైన దయాప్రయోగమునకు వ్యవస్థ లేదా యనిన, అరిజనభీమా = శత్రువులకు భయంకరుఁడా - అనుగ్రహపాత్రులగు నాశ్రితులయందు మాత్రమే పూర్ణదయ వినియోగింపఁబడును గాని తన్ను ద్వేషించువారియందుఁ బూర్ణవినియోగము లేదు. పూర్ణవినియోగము లేదనుటచేత శత్రువులందును గొంత దయచూపునని భావము. 'రిపూణామపి వత్సల' యనికదా ప్రసిద్ధి- శత్రువులందును దయదలచువాఁడనికదా రామచంద్రమూర్తి గరుత్మంతునిచేఁ జెప్పఁబడెను.(౧౦౫౦౫.) దానికి నిదర్శనముగఁ జేజిక్కిన రావణుని "పొమ్మో లంక కనుజ్ఞ యిచ్చితిని బోపో" యన్నికదా రామచంద్రమూర్తి వదలిపెట్టెను. తాపహరా = తాపత్రయముల హరించు

వాఁడా! 'గ్రీష్మేశీతమివహ్రద' మ్మన్నట్లు సంసారసంబంధ తాపముల నెల్ల హరించువాఁడా - విధిహరనుత=బ్రహ్మరుద్రులచే స్తోత్రము చేయఁబడినవాఁడా! క్ష్మాపుత్రీలోల = సీతాదేవియం దాసక్తిగలవాఁడా - రామచంద్ర నృపాలా = రామచంద్రమహారాజా! అవధరింపు మని యర్థ్యాహార్యము.

ఈ కాండమందలి యర్థ మీ పద్యమున సూచింపఁబడెను. శ్రీప యనుటచే రాజలక్షణమైన సైన్యసంపత్తియు, ప్రపద్యేడిత యనుటచే విభీషణశరణాగతియు, దురితాపహ యనుటచే సముద్రముపై నేయఁదలచిన బాణమును సముద్ర ద్వీప వాసులైన పాపులపై నేసి చంపుటయు, కారుణ్యసీమ యనుటచే వధ్యులయిన శుక సారణుల వదలిపెట్టుటయు, అరిజనభీమ యనుటచే సమస్త రాక్షససంహారమును, తాపహరా యనుటచే సీతాపరిగ్రహమును, విధిహరనుత యనుటచే బ్రహ్మాది స్తోత్రమును, క్ష్మాపుత్రీలోల-రామచంద్ర నృపాలా యనుటచే సీతాయుక్తుఁడై పట్టాభిషేకముచేసికొని ప్రజల పాలించుటయు సూచింపఁబడియె.

—• శ్రీరాముఁడు హనుమంతునిఁ బ్రశంసించుట •—

క. కలది కలయట్లు చెప్పిన, వలిముఖమణి గాడ్పుపట్టి • వాక్యము లెల్లన్
జలజాక్షుఁడు రాముఁడు విని, యలరుమనంబునను నిట్టు • లను నుత్తరమున్. ౨

అర్థములు. కలదికలయట్లు=జరిగినది జరిగినట్లు-సీతాదేవిని దాను దర్శించినది మొదలు-రావణురాక-వాని బెదరింపులు-సీతాప్రత్యుత్తరము-రాక్షసస్త్రీలు బెదరించుట-సీతావిలాపము-సీతాదేవితోఁ దనకునైనసంభాషణము-ఆమెచెప్పినమాటలు-త్రిజటా స్వప్నము - రాక్షసస్త్రీల శరణాగతి - వారి కభయ ప్రదానము - సీతా సందేశము లోనైనవన్నియు నొకటియైన దాఁపక - సుందరకాండమున సీతాదేవి రామచంద్రుని నేయుపాయముగను నుపేయముగను గ్రహించుటయుఁ-పారతంత్ర్యము సీతాపురుషకారము చెప్పఁబడెను. ఇట్లు తమ్ము నుపాయముగను, నుపేయముగను గ్రహించినవారి నెట్లు సీతారాము లనుగ్రహింతురో యీ కాండమునఁ జెప్పఁబడును. సుందరకాండమందు ప్రపన్నునకుఁ దనవిషయమైన భగవదాశయముఁ దెలిపి భగవంతుఁడు నిన్ను రక్షించును, భయపడకు మని చెప్పి వాని విషయము వాఁడు భగవంతునియం దెట్టి నిష్ఠగలవాఁడై యుండుటయు భగవంతునకుఁ దెలుపుట చెప్పఁబడెను. ఈ కాండమందు నాచార్యుఁడు ప్రపన్నుని రక్షింప భగవంతుని ప్రేరించి యాయనచే నతని రక్షింపఁజేయుట తెలుపఁబడును. సుందరకాండమందు గురువుచే బోధింపఁబడిన యోగి మనస్సు ఆత్మాన్వేషణ మందాసక్తమై సంసార సాగరమునఁ గలుగు విఘ్నముల నెల్ల దాటి దేహమున నాత్మను వెదకి కనుఁగొని జీవాత్మ పరమాత్మలకుఁ గల సామ్యభేదముల విమర్శించి దేహమునఁ జిక్కుపడక దాని దహించి భగవంతునొద్దఁ జేరుట వివరింపఁబడెను. ఇందు జీవాత్మ పరమాత్మ

లకు నైక్యము సంపాదించి తాను సెలవు తీసికొనుట చెప్పఁబడును. ఇందుఁ బ్రథమమున భృత్యుఁడు కార్యము నెఱవేర్చి వచ్చినపిదప యజమానుఁ డాభృత్యుని విషయమున నెట్లు ప్రవర్తింపవలయునో యావిధము చెప్పుటకై సీతవార్త దెచ్చిన హనుమంతుని సుగ్రీవాదుల యుత్సాహాభివృద్ధికై రామచంద్రమూర్తి స్తోత్రము చేయుచున్నాఁడు.

వలిముఖమణి = వానర శ్రేష్ఠుఁడు - గాడ్పుపట్టి = వాయువు కొడుకు యొక్క - జలజాక్షుఁడు=కమలములవంటి కన్నులుగలవాఁడు. ఇది సంతోషమును దెలుపుచున్నది. అలరు మనంబునను=సంతోషించు మనస్సుతో - ఉత్తరమున్ = సమాచారము విన్న తరువాత విన్నవారు చెప్పుమాటను.

తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడైన హనుమంతుఁడు సీతావిషయమై లంకలో జరిగినది జరిగినట్లు చెప్పఁగా రామచంద్రమూర్తి విని సంతోషించి బదులుమాట యిట్లు చెప్పెను.

క. మనసుననే నన్యునకుం, బొనరింప నశక్య మగుచుఁ ♦ బోరి దుర్లభమై
తనరు మహాకార్యముఁ దీర్చెను హనుమకు నీడు జోడు♦క్షితిలోఁ గలరే ? ౩

ప్రత్యక్షే గురవః స్తుత్యాః । పరోక్షే మిత్రబాంధవాః ।
కర్మాంతే దాసభృత్యాశ్చ । న కదాచన పుత్రకాః ॥

గొప్ప కార్యములను సాధించిన గురువులను బ్రత్యక్షమున స్తుతింపవలెను. మిత్రులను జుట్టములను బరోక్షమున స్తుతింపవలెను. భృత్యులను దాసులను వారు కార్యము నిర్వహించిన పిమ్మటఁ బొగడవలయును. కొడుకుల నెప్పుడైనను బొగడరాదు. అది వారికి శ్రేయస్కరముగాదు. అని యుండుటచేఁ గార్యము నిర్వహించిన హనుమంతుని రామచంద్రమూర్తి పొగడుచున్నాఁడు.

అర్థములు. మనసుననేన్ = మనస్సుచే నైనను - అన్యునకున్ = హనుమంతునకుఁ దప్ప నితరునకు, పోరిన్ = మిక్కిలి - అశక్యము=శక్తికి మించినది. ఇది సముద్రతరణమును దెలుపును - దుర్లభము=లంకాప్రవేశమును దెలుపును. పోరి దుర్లభము = రావణాసురుని యింటఁ బ్రవేశించి సీతను జూచి లంక నల్లకల్లోలము చేయుట-మహాకార్యము=మరలఁ బ్రాణముతో వచ్చుటను దెలుపును-తీర్చెను = కార్యమెట్లు చేయవలయునో యట్లు చక్కఁగాఁ జేసెను. కలరే=లేరని భావము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి చెప్పుచున్నాఁడు. మన హనుమంతుఁడు చేసిన గొప్ప కార్యమును మఱియొక్కఁడు నేను జేసెదనని నోరఁ జెప్పుటకే కాదు, మనస్సులో ననుకొనుటకుఁగూడ వాని శక్తికి మించినది. మిగుల దుర్లభమైనది. అట్టి కార్యమును హనుమంతుఁడు చక్కఁగ నెఱవేర్చి వచ్చెను. ఈయనకు సమానుఁడని చెప్పఁదగినవాఁ డీలోకములో నున్నాఁడా - లేఁడు - లేఁడు.

క. ఈ వ్వాయుతనూజుఁడు గా, కవ్విహగాధీశ్వరుండు • ననిలుండును గా
కెవ్వరి కొకొ సాధ్యం బగు, నవ్వారిధి దాఁటఁ దోఁపఁ • దాత్మ నొకండున్. ౪

అర్థములు. విహగాధీశ్వరుండు=గరుత్మంతుఁడు - అనిలుఁడు=వాయువు - తోఁపదు=మనస్సునకు వచ్చినవాఁడు కాఁడు-ఆ విహగాధీశ్వరుఁడు ఆ యనిలుఁడని యన్వయింపవలెను. - వేగంబునఁ బ్రసిద్ధికెక్కిన గరుత్మంతుఁడు వాయుదేవుఁడని యర్థము-ఈ వ్వాయుతనూజుఁడు గాక - విహగాధీశ్వరుఁడు గాక-యనిలుఁడుగాక యని యుండవలసి యుండఁగా విహగాధీశ్వరుఁడును అనిలుండును గాక-యనటచే వారి యిరువుర వేగమును నొక్కటిగఁ గలిసిన హనుమంతుని వేగమునకు సరిపోవునని భావము. ఆ యిరువు రొకరయొత్తు-హనుమంతుఁ డొకఁడే యొక యొత్తని భావము.

తాత్పర్యము

ఈ హనుమంతుఁడు గాక గమనవేగమునకుఁ బ్రసిద్ధులైన గరుడానిలులుగాక మఱి యెవ్వరికైన నా సముద్రము దాఁట శక్యమా యని యాలోచించిన నొక్కఁడైన నంతటివాఁడు మనస్సునకు రాలేదు.

చ. అనిమిష యక్షరాక్షసమ • హాహిచయంబుల కైనఁ జక్కఁగాఁ
గనుఁగొన రానిదాని, దశ • కంధరపాలితమైన లంకనున్,
ఘనతరసత్త్వలక్ష్మిఁ జొరఁ • గాఁ గను టొక్కఁడెఁ? జొచ్చి నేనియున్
దనువునఁ బ్రాణముల్ గలుగఁ • దా మఱి వచ్చుట యెడ నెట్టిఁడున్? ౫

అర్థములు. అనిమిష........చయంబులకైనన్=దేవతల యొక్కయు-యక్షుల యొక్కయు-రాక్షసులయు- గొప్పసర్పములనియు సమూహములకైనను- ఘనతరసత్త్వలక్ష్మిన్ మిగుల గొప్పదగు బలసంపదచే - చొరఁగాన్+కనుట = ప్రవేశింప నాలోచించుట - ఎట్టిఁడున్=ఎట్టివాఁడైనను.

తాత్పర్యము

సుగ్రీవా - లంకను దేవతలకు - యక్షులకు - రాక్షసులకైనను దూరమునుండి దొంగతనముగాఁ జొంచితప్ప యథాదృష్టిపాఱఁజూచుటకును సాధ్యముగాదు. పదితలల రావణుఁడు పాలించునట్టి లంకను మఱి యెట్టివాఁడైనను తనబలసంపదచే ప్రవేశింప సాధ్యమా? ఒకవేళ రాక్షసుల నేమఱించి లోపలఁ బ్రవేశించినను మరలఁ బ్రాణముతో వచ్చుటకు సాధ్యమా? అట్లుచేయ మన హనుమంతున కొక్కనికిఁ జెల్లెనుగాక.

క. బలవీర్యము లున్న మహా,బలసుతుతో నీడు వచ్చు • వాఁడును గాఁడేన్
గలఁడే రక్షోరక్షిత, మల దుర్ధర్షంబు, లంక • నటువలెఁ జొరఁగన్. ౬

అర్థములు. ఉన్నన్=ఉండినను-మహాబలసుతునితో=హనుమంతునితో-ఇట్లు చెప్పుటచే కేవల స్వశక్తియేకాక పితృశక్తియుఁ గలసి యున్నదని భావము-మహాబలుఁడనుపేరు వాయువునకుఁదప్ప మఱియెవ్వనికి లేకుండుటచే నటువంటిశక్తియు

మతియెవ్వనికి లేదు. రక్షోరక్షితము= రాక్షసులచేఁ గాపాడఁ బడునది, అల= ఆ- దుర్ధర్షంబు = కలఁతపెట్టరానిది - అటువలెన్ = హనుమంతుఁడు ప్రవేశించినట్లు.

తాత్పర్యము

ఏమయ్యా మీ హనుమంతునితో సమానులగు బలము విక్రమము గలవారు లోకమున లేరా యందు వేమో - ఒకవేళ నుండినను నన్నివిషయముల వేగము బుద్ధి దృష్టి లోనైన వానియందును వాయునందనునితో సమానుఁడు కాఁడేని రాక్షసుల రక్షించుచున్న యిటువంటి ధర్షింపరాని లంకను హనుమంతుఁడు ప్రవేశించిన విధముగా లంకలోఁ బ్రవేశింప సాధ్యమా ?

క. రవితనయ భృత్యకార్యముఁ, బవమానసుతుండు దీర్చెఁ ♦ బ్రశస్తవ్యగతిన్
సవరన నిజవిక్రమతు, ల్యవిధంబుగ బలముఁ జూపె ♦ ననురూపముగన్. ౭

అర్థములు. రవితనయ భృత్యకార్యము=(౧)సుగ్రీవా! బంటుచేయవలసినపని (౨) సుగ్రీవునిబంటెటువంటి గార్యము చేయఁదగునో యట్టికార్యము - అల్పుని దూత యల్పకార్యమే చేయఁగలఁడు. సూర్యపుత్రుఁ డగు సుగ్రీవునంతటి గొప్పవాని బంటు గొప్పకార్యమే చేయఁగలఁడని భావము. పవమానసుతుండు=హనుమ- సుగ్రీవుఁడు సూర్యుని పుత్రుఁడు-సూర్యుని శిష్యుఁడు హనుమంతుఁడు- గురుపుత్రుని కార్యము శిష్యుఁడు తీర్పవలసినవాఁడేకదా- ప్రశస్తవ్యగతిన్ = మిక్కిలి స్తోత్రము చేయఁబడఁదగిన విధముగ- సవరన=చక్కన - అనురూపముగన్ = యజమానుని యోగ్యతకుఁ దగిన విధముగ - విక్రమము - అతిశక్తి.

తాత్పర్యము

సుగ్రీవునివంటివాని భృత్యుఁ డెట్లు కార్యము చేయవలయునో యట్లు మిక్కిలి పొగడ్తకుఁ దగిన విధముగ సీతాన్వేషణకార్యము నెఱవేర్చెను. అంత మాత్రమేకాదు. సుగ్రీవుని యోగ్యతకుఁ దగినట్లు తన యతిశయమైన శక్తికిఁ దగినట్లు బలముకూడఁ జూపి రాక్షసుల వధించి లంక కాల్చివచ్చెను.

ఆత్మశ్లాఘగా నుండునని హనుమంతుఁడు తాను జేసినకార్యములు చెప్పలేదని సుందరకాండాంతమున వ్రాయఁబడెనే-లంకాదహనాది కృత్యములు రామచంద్రున కెట్లు తెలిసెను అని సందేహింపఁ బనిలేదు. సీతావృత్తాంతము ప్రథమవక్తవ్యమగుట నది తొలుతఁ జెప్పఁబడెను. అంతటితో రామచంద్రమూర్తి సంతోషపడి యూరకుండునా? నీవు సముద్ర మెట్లు దాఁటితివి-ఎప్పుడు దాఁటితివి-ఎట్లులంకలోఁ బ్రవేశించితివి- రాక్షసులు నిన్నుఁ జూడలేదా? వారికిఁ గానరాకుండ సీత నెట్లు వెదకితివి. సీతతో సంభాషించునపుడు కావలికత్తెలెవ్వరు చూడలేదా - చూచియుండిన రావణునకుఁ జెప్పియుండరా- వాఁడు నిన్నూరకవిడచెనా-బాధించియుండునే ఇత్యాది ప్రశ్నలు పుట్టక మానవు- వీనికిఁ బ్రత్యుత్తరముగఁ దాను జేసినకార్యములన్నియుఁ జెప్పక తప్పదు-తన్ను గుఱించి తాను ముందుగఁ జెప్పరాదుగాని ప్రశ్న

లడిగినప్పుడు ప్రత్యుత్తరమీయకతప్పదు. అది యాత్మశ్లాఘ కాదు. రెండవ పద్యములోని కలది కలయట్టులను పద మీ యర్థమును సూచించుచున్నది.

తే. పతి సుదుష్కర మగుకని । బంప భక్తిఁ, దనకుఁ జెప్పనిదైనను । దదనుబంధ మైనదానిని ఘటియించు । నట్టి భృత్యు, వరుసఁ బురుషోత్తముండండ్రు । పరమమతులు.

సుగ్రీవుఁడు చెప్పని పనియైనను జూచిరమ్మనినఁ గాల్చివచ్చెనే యిది యధిక ప్రసంగితనము కాదా యను సందేహము నివర్తింపనట్లు చేయువాఁడే యుత్తమ దూతయని రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు.

అర్థములు. సుదుష్కరము = చేయుటకు మిగులఁ గష్టమైనది. పంపన్ = చేయనాజ్ఞాపింపఁగా - తదనుబంధ మైనదానిని - తత్ = యజమానుఁ డాజ్ఞాపించిన దానికి- అనుబంధము = అంటివచ్చినది - సంబంధించినది- పరమమతులు = గొప్ప మనస్సు గలవారు- బుద్ధిమంతులు, (చూ-సుందర-౧౦౦౮-౧౧౦౯) దూతలక్షణము (సుందర ప. ౯౫౯-౭౬౦ మందరము చూచునది).

తాత్పర్యము

యజమానుఁడు చేయుటకు మిక్కిలి కష్టమైన పని చేయుమని యాజ్ఞాపించె నే నాకింత కష్టమైన పని చెప్పెను, జూచితివా యని మనస్సునందు నొచ్చుకొనక మనయందు దను గహము, గొప్ప యభిప్రాయము కలిగి నేను నెఱవేర్పఁగల నను విశ్వాసముతోఁ డఁగదా నాకీపని చెప్పెను అని భర్తయందు భక్తిగలవాఁడై యాయన చెప్పిన పని చేయుటయే గాక యాపనికి సంబంధించినది యాయన చెప్పకున్నను నెఱవేర్చు దూతను బుద్ధిమంతులు పురుషోత్తముఁ డనుదురు. ఇది యుత్తమదూతలక్షణము.

శే భర్త చేత నియుక్తుఁడై । పతికి హితము
టంచు నెఱిఁగియుఁ జెప్పఁ డ । టంచు హెచ్చు
నాచరింపని యుక్తస । మర్థభటుఁడు
మధ్యముఁడు నాఁగఁబడు సాధు । మతుల చేత. ౯

అర్థములు. నియుక్తుఁడై = నియోగింపఁబడినవాఁడై - యుక్తసమర్థభటుఁడు = యుక్తుఁడు = ఉత్సాహముతోఁ గూడినవాఁడు- సమర్థుఁడు = చేయగలశక్తిగలవాఁడు.

తాత్పర్యము

భర్తచేత నాజ్ఞాపింపఁబడి యా కార్యము నెరవేర్చి దానికి సంబంధించినది చేయఁదగిన దగుదానిని నది చేసిన భర్తకు మేలని యెఱిఁగియు నతఁడు చెప్పలేదు, చెప్పనిపని మన మేల చేయవలయునని చెప్పినదానికంటె హెచ్చు చేయనివాఁ డుత్సాహము సామర్థ్యము గలవాఁడైనను వానిని బుద్ధిమంతులు మధ్యముండని యందురు.

క. పతిచే నియుక్తుఁడై త, త్కృతిని సమర్థుండునయ్యు । భృత్యుఁడు శ్రద్ధా
యుతుఁడయి చలుపక చెఱిచిన, నతనిని బురుషాధముం డ । టందురు పెద్దల్. ౧౦

అర్థములు. నియుక్తుఁడై=ఆజ్ఞాపింపఁబడినవాఁడై తత్కృతిని=ఆకార్యము చేయుటయందు - శ్రద్ధాయుతుఁడయి=శ్రద్ధతోఁగూడినవాఁడై-పురుషాధముఁడు= నీచమనుష్యుఁడు.

తాత్పర్యము

నీ వీ కార్యము చేయవలసిన దని భర్తచే నియోగింపఁబడి యా కార్యము చేయుటయందు సామర్థ్యము గలవాఁడయ్యుఁ గార్యమునందు శ్రద్ధలేక చెఱిచెనేని పెద్దలతనిని నీచమనుష్యుఁ డందురు.

ఉ. కాన నియుక్తకార్యమును ♦ గాడ్పుతనూభవుఁ డాత్మగౌరవం
బూనత నొంద కుండఁ, బతి ♦ యుష్ణకరాత్మభవుండు సంతసం
బూన ఘటించె, వెండియు ర ♦ ఘూత్తమవంశము నన్ను లక్ష్మణున్
జానకిఁ గాంచి మన్చె, సడి ♦ చావుఁ దొలంచెను, నిల్పె ధర్మమున్. ౧౧

అర్థములు. నియుక్తకార్యమును=నియమింపఁబడిన పనిని - సడి చావు = నిందతోఁగూడిన మరణము.

తాత్పర్యము

ఇట్లుండుటచేత హనుమంతుఁడు పురుషోత్తముఁడు కావున రాక్షసులకుఁ జిక్కినాఁడని తన గౌరవమునకు హాని లేకుండునట్లు - తన్ను నియమించిన సుగ్రీవుఁడు సంతోషించునట్లు నియమితకార్యమును సాధించెను ఇది తన స్వామికిఁ జేసిన యుపకారము. ఇఁక మాకో జానకిని జూచుటచే నాకు లక్ష్మణునకు మా యుత్తమ రఘువంశమునకుఁ బ్రాణములిచ్చి రక్షించెను. ఈయన యీపని చేయకుండిన లోకములోని యందఱు చచ్చినట్లుగాక యపకీర్తితోడి చావు చచ్చి యుందుము. అట్టి దుర్మరణమునుండి తప్పించెను. ఆత్మహత్య యనెడి యధర్మమునకుఁ బాలుపడనీక ధర్మమును రక్షించెను.

క. ఇంతటి పరమప్రియము నుదంతము వచియించు పవన ♦ తనయునికిఁ బ్రతి క
త్యంతము సమమగు ప్రియ మొక్కింతయుఁ గావింపలేమి ♦ కే దుఃఖింతున్. ౧౨

అర్థములు. ఉదంతము = వృత్తాంతము.

తాత్పర్యము

మాకు మా వంశమునకు దుర్మరణము రాకుండఁ గాపాడినంతటి గొప్ప యుపకార మగు సంతోషవార్తను జెప్పిన హనుమంతుని సాహాయ్యమునకుఁ గేవలము సమానమగు సంతోష మాయనకుఁ గలుగఁ జేయుటకు శక్తి లేదాయెఁ గదా యని మిక్కిలి దుఃఖించుచున్నాను.

ఉ. నాకుఁ గలట్టి సర్వము ధ ♦ నంబు నొసంగినఁ గాని పోదు హృ
ద్వ్యాకులతావిధంబు, ధన ♦ వంతుఁడఁగా, నిఁక మాఱుమేలు నే
నే కరణిన్ ఘటింపఁ గల ♦ నియ్యెడఁ? గావున నాదు కౌఁగిలిన్
గైకొనవయ్య దానిప్రతి ♦ గా మహితాత్మక! మారుతాత్మజా! ౧౩

అర్థములు. హృత్ + వ్యాకులతా + విధంబు = మనస్సునందలి కలఁత — ప్రతిగా=బదులుగా-మహితాత్మక=గొప్ప మనస్సు గలవాఁడా — ఇది భావగర్భితము - మిక్కిలి యుదారమైన మనస్సు గలవాఁడా - నేనిచ్చుదాని విలువ నాలోచింపకుమని భావము - గైకొనవయ్య = ప్రార్థనార్థకము.

తాత్పర్యము

నాకు లోకమునందు నాదియని నేను దలంచిన ధన మెంతగలదో యంతయు నిచ్చితినేని నీవు చేసిన ప్రియమునకు సమానమైన ప్రియము నేను జేసితినని సంతోషింపఁ గలను - అట్టు లన్నను నా యొద్ద ధన మనునది లేదు. ఇఁక నేను నీకేమి మఱుమే లిచ్చుటఁ జేయఁగలను - శుష్కాలాపములతోను, శూన్యహస్తములతోను నేమి లాభము? నేను రాజునై యుంటినేని సర్వరాజ్యము నీకిచ్చి యుందును. అదియు లేదాయె. కావున నీవు చేసిన దానికి బదులుగా నా కౌఁగిలి గ్రహింపుమని యాంజనేయా! ప్రార్థించుచున్నాను. బదులని నేను జెప్పితినిగాని సమానముగ నని చెప్పలేదు. ఇది నీవు చేసినదానికి సమానముగాదు. అయినను ఈయల్పదక్షిణను శాస్త్రోక్తదక్షిణగా గ్రహింపుమన్నట్లు నాకుగల యల్పము నా యీ దేహము నీకు సమర్పించుచున్నాను. నీ వుదారచిత్తుఁడవు, ఎదుటివారి లోపము లెంచువాఁడవుకావు. కూలివాండ్రవలెఁ బ్రతిఫలాపేక్షచేఁ జేసినవాఁడవు కావు. కేవల ధర్మబుద్ధితో, నుపకారబుద్ధితో దయార్ద్రహృదయముతోఁ జేసిన మహాత్ముఁడవు. కావున నిరాకరింపక గ్రహింపుమని ప్రార్థించుచున్నాను. కృపతోఁ బరిగ్రహింపుము. నీవు నిరాకరించితివేని నాకంతకంటె వేఱుమరణము లేదు. ఏలయిది సమానముఁగాదనుచున్నా నందువా? అచ్చటఁ జచ్చుటకు సిద్ధముగానున్న సీత ప్రాణములు నిలిపితివి. ఆవార్తతెచ్చి యిచ్చుట నా ప్రాణములు నిలిపితివి. ఇట్టు లిరువుర దేహములు నీ వీయఁగా నీ కొక దేహ మిచ్చుట యెట్లు సమానమగును-కాదు-తెలియును. నేనేమి చేయుదును? ఏమియుఁ జేయలేనైతిఁగదాయని పరితాపపడుచున్నాను. నా యీ దుఃఖమును నేనిచ్చినదానిని బ్రీతితో గ్రహించి యణఁపుము-నీవుచేసిన యుపకారములకు నిది సమానము గాదనుటకు మఱియొక కారణము గలదు. నీవు సుగ్రీవునితో నాకు స్నేహము గుదిర్చి గొప్ప యుపకారము జేసితివి. ఆనాఁటినుండి యీయనకుఁ బ్రత్యుపకార మేమిచేయుదునా యని యాలోచించుచుంటిని- ఇప్పుడిది రెండవది. ఈ రెంటికి నేనిచ్చిన యల్ప మెట్లు సరిగాఁగలదు- కావున హెచ్చుతక్కువ లాలోచింపక నేనిచ్చిన యల్పమును బ్రీతిచేఁ బరిగ్రహింపుము. కౌఁగిలి యిచ్చుట యనఁగాఁ దన్నుఁ దాను సమర్పించుకొనుట-ఆత్మాత్మీయనిక్షేపమన్నట్లు తన్ను సమర్పించుట యనఁగా దనకుఁగల సర్వస్వము, నిత్యవిభూతి, లీలావిభూతి రెండు విభూతులు నర్పించినట్లే-వీనితో నాయనకేమి ప్రయోజనము? ఆయనకుఁ బ్రియమైన దిచ్చినఁగదా ప్రయోజనమందురేమో-హనుమంతునకుఁ బ్రియమైనది

'ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహ' యన్నట్లు శ్రీరామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహమే. పరస్వరూపముతో నాయనకుఁ బనిలేదు. కావుననే నిన్ను విష్ణుఁడంపెనా యని రావణుఁ డడిగించినపుడు విష్ణు వెవ్వరో-నన్నుఁ బంపినది రామచంద్రమూర్తి యనెను. ఎవరి కేది ప్రియమో దానిని భగవంతుఁడు వాని కిచ్చుచుండును. కావున ఆ దివ్యమంగళవిగ్రహమందు హనుమంతునకుఁ బ్రీతియని తెలిసి దానినేయిచ్చెను. దానితో హనుమంతుఁడు సంతుష్టుఁ డయ్యెను. ఈ సందర్భమున శ్రీ భాగవతమున గోపికలకు శ్రీకృష్ణమూర్తి చెప్పిన వాక్యములు స్మరించునది.

ఉ. పాయని గేహ శృంఖలలఁ బాసి నిరంతర మత్పరత్వమున్
జేయుచు నున్న మీకుఁ బ్రతి సేయ యుగంబులనైన నేర నన్
బాయక కొల్చు మానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా
పాయుట తప్పుగాఁ గొనక భామినులార కృపన్ క్షమింపరే. భాగ-౧౧-౧౦౨౯

రుక్మిణీదేవి బ్రాహ్మణునితో—

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం దెల్పసన్
నిలువం బెట్టితి నీ కృపన్ బ్రతికితిన్ నీ యంత పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలి గావించెద భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!

భాగ-౧౦-౧౨౩౬

ఈ కాండమున ౨౬౧౩ పద్యము హనుమంతునకు సీతోక్తి చూచునది. హనుమంతునకు నుభయవిభూతు లిచ్చుట సరి యని రామచంద్రమూర్తి తలఁచెఁ గాని, సీత యదియుఁ దక్కువగానే తలఁచెను. వీని నన్నిటిని గ్రోడీకరించి చూచిన భక్తికి సరియైన ప్రతిఫలము భగవంతుఁడుకూడ నీయఁజాలఁడనియు సాయుజ్యము కూడఁ దక్కువ ఫలమే యనియు భక్తికి సమానమైనది భక్తియే కాని కర్మము నందుఁ గాని, ఫలమందుఁ గాని వేరొకటి లేదనియు నేర్పడుచున్నది. కావున భగవత్సాయుజ్యము గోరువారికి భక్తితోడి సేవకంటె నుత్తమసాధనము లేదు, ఇట్టి కౌఁగిలింత గుహ హనుమదాది భక్తులకు లభించెఁ గాని కేవల కర్మఠులకు, మాయాజ్ఞానులకు, యోగులకు లభింపలేదు. ఈ కౌఁగిలింతయే వేదాంతముక్తి— అద్వైతవాదులయిన శంకరాచార్యుల వారును నిట్లు చెప్పిరి.

క. అని పులకితగాత్రుండై, యినవంశాభరణ మపుడు • కృతకార్యు మహా
త్మునిఁ బావనిఁ బిగిఁ గౌఁగిట, మన మారఁగఁ గ్రుచ్చి వెండి • మానసవీథిన్. ౧౮

అర్థములు. పులకితగాత్రుండై=పులకరించిన దేహముగలవాఁడై, ఇనవంశాభరణము=సూర్యవంశపు రాజులలో శ్రేష్ఠుఁడైనవాఁడు రామచంద్రమూర్తి, కృతకార్యున్=కార్యము సాధించినవానిని, మహాత్ముని=గొప్పమనస్సు గొప్పస్వభావము

గల వానిని, పావనిన్=(౧) పరిశుద్ధుని, (౨) ఆంజనేయుని, మనము+ఆరఁగన్= నిండు మనస్సుతో, ౘరుచ్చి=కౌఁగిలించి.

కౌఁగిలింతకు అనఁగా సాయుజ్యమునకు నధికారి యెట్టివాఁ డనునది కృత కార్యుఁడు, మహాత్ముఁడు, పావని యను విశేషణములు దెలుపుచున్నవి. కృత కార్యుఁడు = యావజ్జీవము స్వధర్మకర్మముల భగవదర్పణబుద్ధి నాచరించువాఁడు సాయుజ్యమున కర్హుఁడగునుగాని, కర్మమును స్వరూపముతోఁ ద్యజించినవాఁడు యోగ్యుఁడు కాఁడని తెలుపుచున్నది.

౧. మహాత్ముఁడు=గొప్పప్రయత్నము చేయువాఁడు. అనఁగా సోమరియై యంతయు దేవుఁడే చేయునని యుండక తనకు విధివిహితమైన కార్యములు చేయు వాఁడు. ముందు తాను జేయవలసినవి చేసిన వెనుక భగవతుఁడు చేయవలసినది చేయును. చరమశ్లోకత్రయ మీా యర్థమునే బోధించెడిని.

౨. మహాధైర్యము కలవాఁడు- ఎన్ని కష్టములు వచ్చినను బూనిన పని యందలి స్థైర్యము ధైర్యము గలవారయి భక్తులు 'శ్రేయాంసి బహు విఘ్నాని' యన్నట్టు లెన్నియో మనశ్శోధనమునకై విఘ్నములు కష్టములు కలుగును. వానికి భయపడి తన ప్రయత్నము మానరాదు.

3. మహాత్ముఁడు=గొప్ప మనస్సు గలవాఁడు - సత్త్వగుణభూయిష్ఠమైన మనస్సే గొప్ప మనస్సు=సాత్త్విక కార్యములు చేయుటయం దాసక్తమైన మనస్సు గలవాఁడు.

౪. గొప్ప స్వభావముగలవాఁడు=సత్త్వగుణము కొంతసేపుండి కొంతసేపు లేకుండునదిగా నుండరాదు. అది స్వభావమై యుండవలెను. రాజసతామస కార్యములందు మనస్సు పోనిదై యుండవలెను.

౫. గొప్పబుద్ధి గలవాఁడు=నిశ్చయాత్మికమైనది బుద్ధికావున "మ య్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ" యన్నట్లు బుద్ధి భగవంతునిమీాఁదనే యుంపఁబడినదై యుండవలయును.

౬. మహాశరీరముగలవాఁడు = అనఁగా బలసినవాఁ డని యర్థముకాదు. మనోబుద్ధిచిత్తములు శుద్ధముగా నున్నవికదా, బాహ్యమున నెట్లుండిన నేమి యనక శరీరముకూడ శుచిగా నుంచుకొనువాఁడు. 'శుచి ర్దక్ష' యని కదా చెప్పఁ బడెను. బాహ్యాభ్యంతరముల రెంటను నేకవిధముగ నుండవలెను. త్రికరణశుద్ధి యుండవలెను. దీనివలన నస్పృశ్యము స్పృశించుట, అభక్ష్యముల భక్షించుట, దురాలోచనములు చేయకుండుట, చూడరానివి చూడకుండుట లోనైనవి గ్రహింపవలెను.

ఆత్మశబ్దమున కీ యర్థము లన్నియుఁ గలవు.

పావని=పవిత్రుఁడు, 'యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణా'మ్మన్నట్టు, దేవతారాధనము-'దాన మేకం కలౌయుగే' యన్నట్లు దానము-తపస్సు-సత్యము-దమములలోనైనవిగాక యుత్తమ తపస్సు అగు న్యాసము కలవాఁడై యుండవలెను. న్యాస మనఁగా తన రక్షాభారము భగవంతునియందు నైచుట. దేహపోషణమందే యాసక్తుఁడుగాక యదృచ్ఛాలాభసంతుష్టుఁడయి నిర్భరుఁడు, నిర్భయుఁడు నగుట.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దేహము సంతోషముచేఁ బులకరింపఁగా రామచంద్ర మూర్తి కార్యసాధకుఁడు, మహాత్ముఁ డగు నాంజనేయుని నిండుమనస్సుతోఁ గౌఁగిలించుకొని తరువాత తన మనస్సునందు.

పులకితగాత్రుఁడు మనమారఁగఁ గ్రుచ్చె ననుటచే రాజనీతి ననుసరించి యుపచారార్థము గాదనియు పరమార్థబుద్ధిఁ గౌగిలించెననియు నేర్పడు చున్నది.

బోయ యగు గుహుని, గ్రద్దను, జటాయువును, శ్రోత్రియుగు హనుమంతుని కౌఁగిలించుటచే రామానుగ్రహమునకుఁ బూర్ణభక్తిగల సమస్త భూతములు యోగ్యములే యని సూచన.

వాల్మీకి సూర్యోదయము లంకలోఁ జెప్పెఁగాని యీవల సూర్యాస్తమానము చెప్పకుండుటచే నిది యంతయు ఫాల్గున శుద్ధ చతుర్దశి పగటిచర్యయనియే గ్రహింపవలసియున్నది.

క. తలపోసి రామచంద్రుఁడు, జలజహితతనూజుఁ గాంచి ♦ జానకి రోయం
గల పని చక్కఁబడియును, జలనిధి దలపోయ మనసు ♦ ఝల్లనె జుమ్మీ. ౧౫

అర్థములు. తలపోసి = ఆలోచించి.

తాత్పర్యము

ఆలోచించినవాఁడై రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి యిట్లనియె. జానకీ దేవిని వెదకు పని చక్కనయ్యెను. కాని సముద్రమును దలఁచిన దిగులగుచున్నది.

క. దుస్తర మగు జలనిధిని స,మస్తకపుల్ దాఁటి దక్షి♦ణాశాతటమున్
ప్రస్తుతగతిఁ జేరుట యెటు? నిస్తులితబలాఢ్య! చెపుమ ♦ నీ వొకయుపమన్. ౧౬

అర్థములు. దుస్తరము = దాఁటఁ గష్టమైనది - దక్షిణాశాతటమున్ = దక్షిణపుటొడ్డును - ఉపమన్ = ఉపాయమును - ప్రస్తుతగతిన్=స్తోత్రము చేయఁ బడు విధముగ.

తాత్పర్యము

దాఁటఁ సాధ్యముగాని సముద్రమును దాఁటి అందఱు వానరులు దక్షిణ దిక్కు తీరమును లోకము మెచ్చునట్లు చేరు టెట్లో నీ వుపాయముఁ దెలిసిన చెప్పుము.

క. జనకతనూభవ యుండెడు,నునికియుఁ దద్వార్త మీర ♦ లొప్పుగఁ జెప్పన్
విని తిని వనచరు లిందఱు, వననిధిఁ దరియింప నెట్లు♦వల నగుఁ జెపుఁడా ? ౧౨

అర్థములు. ఉనికి = ప్రదేశము - తద్వార్త = ఆమె విషయమైన వృత్తాంతము - వనచరులు = వానరులారా !

తాత్పర్యము

వానరులారా ! సీత యెం దున్నది, యెట్లున్నది మీరు చెప్పగా వింటిని. అచ్చటికి మనము పోవలయునుగదా మార్గమున సముద్రముదాఁటవలయునుగదా ! మీ రందఱు నెట్లు దాఁట సాధ్యపడునో యుపాయము చెప్పుఁడు.

క. అని పలికి హనుమతో నహి, త నిబర్హణుఁడైన రామ♦ధరణీశుఁడు యో
జన సల్పె మహాబాహుం, డనయము శోకంబు దన్ను ♦ నారట పెట్టన్. ౧౩

అర్థములు. అహితనిబర్హణుఁడు=శత్రువులఁ జంపువాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము వానరులకుఁ దెలిపి దీర్ఘబాహువులు, భుజబలముగలిగి శత్రువుల ధ్వంసము చేయఁగల రామచంద్రమూర్తి యాంజనేయునితో శోకముచే నారాటపడుచు నాలోచించెను.

దీర్ఘబాహుఁడు, శత్రునిబర్హణుఁ డను రెండు విశేషణములు భుజబలముచే సముద్రము నెండఁగట్టి దాఁట నాలోచించె నని సూచించుచున్నవి. శత్రువగు రావణునకు సహాయుఁ డగు సముద్రుఁడు శత్రువే కదా.

—♦ { ౨-వ సర్గము. సుగ్రీవుఁడు శ్రీరామున కుత్సాహంబుఁ గలుగ భాషించుట. } ♦—

సీ. తతశోకసంతప్తు ♦ దశరథాత్మజుఁ గాంచి, సుగ్రీవుఁ డిట్లను ♦ శోకనాశ
కరములౌ సూక్తుల ♦ ధరణీశనందన, యే లయ్య ప్రాకృతు♦లీల నీవు
సంతాప మందెదు♦సౌహృదంబుఁ గృతఘ్నుఁ,డవలఁ ద్రోచెడి భంగి♦నార్తి విడువు
మింతకు నీ విట్లు ♦ సంతాప మందఁగఁ, గారణం బేమియుఁ ♦ గానరాదు
ఆ. పగతు నునికి దెలిసి ♦ బలిమి నీరధి దాఁటి, లంక లగ్గ పట్టి ♦ బింకమునను
నీదు శాత్రవునిని♦నిహతునిఁ గావించి, వెలయఁగల మిటుల ♦ కలఁగ నీకు. ౧౪

అర్థములు. ప్రాకృతులీలన్ = పామరజనునివలె, సౌహృదంబు=స్నేహభావము, కలఁగన్ = కలఁతచెంద.

"ఆపద్యున్మార్గగమనే, కార్యకాలాత్యయేషు చ, అపృష్టోపి హితాన్వేషీ బ్రూయాత్కల్యాణభాషితమ్ ॥"

క. హితకార్యము నన్న డుగఁడు, పతి నా కేమిటి కపృచ్ఛపరిభాషణ మం
చతి మౌనముద్ర నుండుట,మత మనరు సునీతివిదులు మంత్రుల కెందున్. పంచ॥

కావునఁ దన్నడుగ కున్నను సుగ్రీవుఁడు చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

సముద్రము దాఁటు టెట్లులా యని విచారపడు రామచంద్రమూర్తిని జూచి సుగ్రీవుఁడు శోకము నాశముజేయునట్టివియు, మంచి ధైర్యము కలిగించునట్టివియు మాటల నిట్లనియె. రాజకుమారా! నీవు క్షత్రియుఁడవయ్యు నుత్సాహము వదలి సామాన్యజనుని వలె నేల పరితాప పడెదవు కృతఘ్నుఁడు స్నేహము విడిచినట్లు నీవు శోకమును వదలిపెట్టుము. ఇప్పు డేమి చెడిన దని నీవు పరితాపపడెదవు? నీపరితాపమునకుఁ గారణ మున్నఁ జెప్పుము. ఇంతవఱకుఁ బగవాఁ డెందుండునది తెలియక యూరకుంటిమి. వాఁ డుండు ప్రదేశము తెలిసెను. ఇఁక మనముపోయి మనబలము చూపించి సముద్రము దాఁటి లంక ముట్టడించి లగ్గలు పట్టి నీ విరోధిని జంపఁగలము. ఏల యూరక కలవరపడెదవు ?

మ. మతిమంతుండవు శాస్త్రవేత్తవు దలం ♦ పం బండితాద్యుండవున్
స్తుతధీప్రాజ్ఞవరుండ విట్లు దగునే ♦ శోకంబునం గుందఁగా ?
ధృతి యోగీంద్రుఁడు స్వార్థహానికర బు♦ద్ధిన్ వీడున ట్లీ వ్యథా
మతిఁ బోవీడుము, కార్యనాశ మగుఁ జు♦మ్మా శోకదైన్యంబులన్. ౨౦

అర్థములు. మతిమంతుండవు=రాఁబోవు విషయముల గురించిన యాలోచన చక్కఁగా జేయఁగలవాఁడవు- "మతి రాగామిగోచరా". శాస్త్రవేత్తవు. ఏయే సమయములందు నెట్లెట్లు వర్తింపవలయునని శాస్త్రము చెప్పుచున్నదో యావిధానము దెలిసిన వాఁడవు. పండితాద్యుండవు = సర్వము దెలిసిన విద్వాంసులందు మొదటివాఁడవు - స్తుత=స్తోత్రము చేయఁబడిన, ధీ=బుద్ధిగల, ప్రాజ్ఞవరుండవు = బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడవు, ధృతిన్=ధైర్యముచే, స్వార్థహానికరబుద్ధిన్ = తాను గోరిన ప్రయోజనమునకు హాని కలిగించు నాలోచనను, వ్యథామతిన్=వ్యసనముతోడి మనస్సును.

తాత్పర్యము

రామచంద్రా! కాఁగల విషయమై నీ వెంతో మంచి యాలోచన సేయు సామర్థ్యము గలవాఁడవు. ఆ యాలోచనయైనను శాస్త్రమునననుసరించి చేయుదువు గాని, శాస్త్రజ్ఞానము గలవాడ వగుటచే దానికి విరుద్ధముగ జేయవు. ఏలన, నీవు పండితులలో శ్రేష్ఠుడవు. ప్రాజ్ఞు లందరు నీబుద్ధిని స్తోత్రముచేయుదురు. ఇట్టివాడవు నీవు శోకముచే బాధపడవచ్చునా? తాను సాధింపఁబూనిన ప్రయోజనమును విఘ్న పఱచు బుద్ధిని యోగీంద్రుఁడు ధైర్యముచే నెట్లు విడచునో యట్లు నీవు సంకల్పించిన సీతాప్రాప్తి యను ఫలమునకు విరోధులగు శోకమును అధైర్యమును వదలుము. విడువవేని నీవుపూనిన కార్యము చెడిపోవును. కార్యసాధక మైన బుద్ధి సంపద గలదు గాని, సహాయసంపత్తి లేదని దుఃఖించెదవా ?

క. దిగ్గనఁ దరించి జలనిధి, నగ్గిస ముగ్గిసలుగా ని♦శాటుల్ లంకన్
లగ్గలుపట్టి భవద్రిపు, గగ్గోలొనరింత్రు చూడు ♦ కపివీరవరుల్. ౨౧

అర్థములు. దిగ్గన=తటాలున - శత్రువులు హెచ్చరిక పడుటకు ముందే-
నిశాటుల్=రాక్షసులు - నగ్గిసముగ్గిసలు=తికమకలు - గగ్గోలు=కలవరము.

తాత్పర్యము

అప్పుడే శత్రువులు రాఁబోయిరా యని రాక్షసులు హెచ్చరిక తప్పి యుండఁగనే వానరు లున్నట్టుండి సముద్రముదాఁటి- వానలేని వట్టి పిడుగు లట్టు వచ్చెనే యని రాక్షసులు దిక్కుఁదోఁపక తిక మక లాడుచుండఁగా లంక కోట గోడలెక్కి- నీ శత్రువును గలవరపడఁ జేయుదురు.

క. దీనుం డై యుత్సాహ వి,హీనుం డై శోకమునను ♦ గృశియించెడి య
మ్మానవు కార్యములుం జెడు,మానని వ్యసనముల నతఁడు♦మఱుఁగుచునుండున్.

తాత్పర్యము

ఒకవేళ శోకమునకుఁ గారణ మున్నను, దీనుఁడై యుత్సాహము లేనివాఁడై యేడుచుచు శుష్కించువాని కార్యములు చెడును. వాఁడు వదలని వ్యసనములచే దాపము నొందుచుండును. కావున శోక కారణ మున్నను ఉత్సాహము వదలరాదు.

ఉ. ఈ హరియూథపుల్ కుశలు ♦ లెల్లరు వీరులు విక్రమోద్ధతుల్
సాహసికాగ్రణుల్ నృపతి♦చంద్రమ ! నీవు నిమిత్తమై కృతో
త్సాహులు, చిచ్చునే నుఱుకఁ ♦ దప్పరు. వీరి ముదంబుఁ జూడఁగా
నాహవదోహలం బెఱుక ♦ యయ్యె, దృఢంబ సుమీ మదూహయున్. ౨౩

అర్థములు. కుశలులు = ఉపాయము నాలోచించుటయందు సమర్థులు - విక్రమ + ఉద్ధతుల్ = పరాక్రమముచే గర్వించినవారు - చిచ్చునేన్ = అగ్ని యందైనను - ఉఱుకన్=మూఁకుటకు - తప్పరు = వెనుక దీయరు-ఆహవదోహలంబు = యుద్ధమునం దభిలాష - మత్ + ఊహయున్ = నా యూహ.

తాత్పర్యము

ఈవానర సేనానాయకు లందరుఁ జక్కఁగా నాలోచించుటయందు సమర్థులు- ఉత్తయాలోచన చెప్పుటయేకాదు. దానినెఱవేర్పఁదగిన శక్తికలవారు. పరాక్రమ వంతుల మను గర్వముగలవారు - ఎంతకైనను దెంపుచేయఁగలవారు- నీకార్యము సాధింపవలయు నను నుత్సాహముతో నున్నారు. నిప్పులలో దూకవలసివచ్చినను వెనుకఁదీయరు. ఇఁక నీళ్ళమాట యేల? వీరి సంతోషము చూడఁగా యుద్ధాభిలాషగలవారై యున్నారు. అది శుభసూచకము, మనకు మేలుగలుగును. నా యూహ వ్యర్థము కాదు.

ఉ. రావణుఁ బాపకర్ము రణ♦రంగమునందు వధించి జానకిన్
దేవల నైన పద్ధతిని ♦ దేఁకువఁ బూనుము, సేతుబంధ మిం

కేవిధి సాగు, లంకఁ గను ♦ టె ట్లగు నట్లు సమాచరింపుమీ
యా విబుధారి పీడ గని ♦ యంత హతుండని వాని నెంచుమా. ౨౪

అర్థములు. వలనైనపద్ధతి=సాధ్యమగు మార్గము - తేకువ = ధైర్యము.

తాత్పర్యము

ఏ యుపాయము చేసిన పాపాత్ముఁడగు రావణుని యుద్ధమందుఁ జంపి సీతాదేవిని తీసికొని రావచ్చునో యా మార్గమును ధీరుఁడవై పూనుము. నీవు చేయవలసిన దంతయు సముద్రము దాఁటి లంక చూచుటకుఁ దగిన యాలోచన - లంక కనఁబడెనా, వెంటనే రావణుఁడు చచ్చినాఁడని నమ్ముము.

సీ. సేతునిర్మాణంబుఁ ♦ జేయక వారిధిఁ, దరియింపరాదయ్య ♦ సురలకైన
సేతు వేర్పడఁ గపి♦వ్రాతంబు దాఁటుట, శత్రుసంహారంబుఁ ♦ జలుపుటారెఁ
గా నిశ్చయింపుము ♦ కామరూపులు కపుల్, సమరశూరులు కలి♦ జంక రెపుడుఁ
గావున రాజేంద్ర! ♦ కార్యనాశిని యైన, వైక్లబ్యబుద్ధిని ♦ వదలవయ్య
ఆ. జగతి శోక మెపుడు ♦ శౌర్యవినాశన, క్షమము గాన నీకుఁ ♦ గలఁక దగదు
శౌర్యముఖ్యులైన ♦ జనులు కార్యంబుల, బలము ధృతియు దిటముఁ ♦ బాయ రెపుడు.

అర్థములు. కలి = యుద్ధము - వైక్లబ్యబుద్ధిని = దుఃఖవశమైన బుద్ధిని - శౌర్యవినాశన క్షమము = శౌర్యమును నాశనము చేయ శక్తిగలది, కలఁక = వ్యాకులత్వము.

తాత్పర్యము

రామచంద్రా! యొకటి నిశ్చయము. సేతువు కట్టక సముద్రము దాఁటవలయు ననిన దేవతలకైనను సాధ్యముగాదు. సేతు వేర్పడెనా వానరులు దాఁటుట శత్రుసంహారము జరిగెననియే నిశ్చయింపుము. ఆ విషయమున నీవు సందేహింపఁబనిలేదు. ఏల యందువా? ఈ వానరులు కామరూపులు. యుద్ధమునందు శూరులు. కావున గలహమునకు భయపడరు. కాఁబట్టి నీవు కార్యనాశకమైన దుఃఖమును వదలిపెట్టుము. అది నీకుఁ దగినది కాదు. శౌర్యము ప్రధానముగాఁ గలవారు కార్యములు చేయుటయందు బలము, ధైర్యము స్థైర్యము వదలరు.

లోకమునందు నిస్తులబ♦లులల్ నినుబోఁటి మహాత్ము లెవ్వడన్
వ్యాకులతన్ వహింపరు ప్ర♦ణష్టవినష్టములందు నెప్పుడేన్;
శోకము సర్వకార్యలయ♦సూచక మౌట యెఱింగి దైన్యముం
బోకడఁ బెట్టి ధైర్యగుణ♦ముం గొనియాడుదు నందు రెప్పుడున్. ౨౬

అర్థములు. నిస్తులబలులల్ = అసమానమైన బలము గలవారు, ప్రణష్ట = రూపము లేక నాశమైనవానియందు, వినష్టములందు = కానరాక పోయిన వానియందు.

తాత్పర్యము

సముద్రము దాఁటుట యసాధ్యకార్యమని నేను వ్యసనపడ లేదు. సీతను

జూచుటకు నిచ్చిపెట్టకపోయితినిగదా యని దుఃఖించెద వందువా యదియును నీకుఁ దగినదికాదు. ఏలన—బలమునం దసమానులైన నీవంటి మహాత్ములు, మొదలంట నాశనమైనవానికిఁ, గించిత్కాలము కానరానివానికి నే సందర్భమందును గలఁతఁజెందరు. ఏలన శోకము సమస్తకార్యముల నాశనముచేయునని తెలిసి దుఃఖము వదలి ధైర్యమునే ప్రశంసించి గ్రహింతురు.

ఉ. నీ వన బుద్ధిమద్వితతి • నిస్తులితుండవు శాస్త్రకోటులన్
గోవిద! పుష్కలుండవు స•కుంఠితవిక్రమశాలి విప్పుడో
త్మావర! మాదృశాప్తహిత • మండలసంగతి శత్రుకోటికిన్
గావర మాఱఁ జేయఁ దగుఁ • గాలము గా దిది గుందుచుండఁగన్. ౨౭

అర్థములు. బుద్ధిమత్ + వితతిన్ = బుద్ధిమంతుల సమూహమందు, నిస్తులితుండవు = అసమానుఁడవు, పుష్కలుండవు = పరిపూర్ణుఁడవు, అకుంఠిత = మొక్కవోని, విక్రమశాలివి = పరాక్రమముచేఁ బ్రకాశించువాఁడవు, మాదృశ = మావంటి, ఆప్త-హితమండలసంగతిన్ = ఆప్తులయు, మేలు కోరువారలయు సమూహములతోఁ గూడి, కావరము = గర్వము.

తాత్పర్యము

నీవో యన్నివిధముల శాస్త్రసమూహములందు, బుద్ధిమంతులలో నసమానుఁడవు- పరిపూర్ణుఁడవు- పండితుఁడవు. ఏలోపములేని పరాక్రమము గలవాఁడవు- ఇట్టి నీవు రాజేంద్రా! యిప్పుడు నావంటి మిత్రుల సహాయముతో శత్రువుల గర్వ మణఁప వలసిన సమయమే కాని యేడ్చుచుండవలసిన సమయము కాదు.

ఉ. నీకు శరాసపాణికిని • నిల్చి ముఖాముఖిఁ బోరువాని ము
ల్లోకములందుఁ గానఁ, గపు•లున్ బలయుక్తులు వారు చేయఁగాఁ
జేకొనినట్టి కార్యమునఁ • జేటొనగూడదు, భూరివార్ధి నీ
వేకరణిం దరించి హృద•యేశ్వరిఁ జూచెదు వైశమే నృప! ౨౮

అర్థములు. శరాసపాణి = చేత విల్లు ధరించినవాఁడు- ముఖాముఖి = కట్టెదురు - ఏకరణిన్ = ఏవిధముగనైనను.

తాత్పర్యము

చేత విల్లు ధరించి నిలఁబడిన నీకు నెదురుముఖమై నిల్చి యుద్ధము చేయఁగల వాఁడు మూఁడు లోకములందు లేఁడు ఇట్టి నాయకుఁడవైన నీకు సేనగా నుండు వానరులు బలవంతులు. వారు చేయఁబూనిన పనికిఁ గీడొక్కనాటికిని రాదు. కావున నే విధముగ నైనను సముద్రమును దరించెదవు. నీ ప్రియురాలిని శీఘ్రమునందే

క. కావున శోకము మానుము, నీ వెడఁ గ్రోధంబుఁ గొనుము • నిశ్చేష్టులు నా
భూవరులు మందభాగ్యులు, వారిరి వడఁకుదురు కోప • వంతున కెవరున్. ౨౯

అర్థములు. నిశ్చేష్టులు=కార్యము చేయనివారు - ఉత్సాహములేనివారు.

తాత్పర్యము

నీ విట్లు లేడ్చుచుండిన నీకు శత్రువులు భయపడరు. కావున నేడుపు మాని కోపము తెచ్చికొనుము. కోపముగలవానికి నుత్సాహము లేనివారు అదృష్ట హీనులునగు రాజులు భయపడుచుందురు.

శా. మాతో నీ విపు డెట్లు వారిధిఁ దరింపన్ వచ్చుఁ దత్పద్ధతిన్
జేతోవీథిని సూక్ష్మబుద్ధిఁ గనుమీ • సేనావళుల్ దక్షిణా
శాతీరంబును జేరినా రిపులు నాశం బైరి, వీరల్ శిలా
వ్రాతక్ష్మారుహవృష్టిఁ గూల్చెద రమిత్రవ్యూహముం బోరిలోన్. ౩౦

అర్థములు. దక్షిణాశాతీరంబును = దక్షిణపు దిక్కునఁ గల రొడ్డును - శిలావ్రాత = రాలసమూహము యొక్కయు-వృక్ష=చెట్లయొక్కయు - వృష్టిన్ = వానచే-అమిత్రవ్యూహమున్=శత్రుసమూహమును.

తాత్పర్యము

మా తోడ నీవు సముద్రము దాఁటు నుపాయ మేదో దాని నాలోచింపుము. సముద్రముయొక్క దక్షిణతీరమును వానరులు చేరిరా వెంటనే శత్రువులు నాశ మెనవారే. వీరలు రాలవానచే, చెట్లవానచే శత్రుసమూహమును ధ్వంసము చేయుదురు. కావున సహాయ సంపత్తికి, సాధన సంపత్తికిఁ గొఱఁత లేదు.

క. వరుణాలయ మెటు లైనను, దరియింపన్ వలయు నంత • దనుక నె కష్టం
బరి రావణాసురుఁడు సం,గరసీమను నిర్జితుండు • గా నెంతు నృపా! ౩౧

అర్థములు. వరుణాలయము=సముద్రము.

తాత్పర్యము

ఏ విధముగ నైన సముద్రము దాఁటవలయును. అంతవఱకే కష్టము. ఆ పని నెఱవేఱెనా రావణాసురుఁడు యుద్ధమందుఁ జచ్చినవాఁడే యనినా యభిప్రాయము.

క. ఏలా పలుమాటలు నీ, కే లీలలనైన విజయ • మెనఁగును శుభదం
బౌ లక్షణములఁ గంటిని, జాలఁగ నా మనము సంత • సంబునఁ దేలెన్. ౩౨

తాత్పర్యము

రామచంద్రా! పెక్కుమాట లేల కాని నీ కేవిధముగ నైనను జయము కాగలదు. శుభశకునములు నాకుఁ గానవచ్చుచున్నవి- నామనస్సు సంతోషమునఁ దేలాడుచున్నది. ఇది గొప్ప శుభచిహ్నము.

౩-వ సర్గము. శ్రీరాముఁడు హనుమంతుని లంకయందలి దుర్గాదులవిధం బడుగుట.

చ. అని యిటు యుక్తియుక్తముగ ♦ నాడిన నా పరమార్థవేది యా
జనకసుతామనోహరుఁడు ♦ చక్కఁ గ్రహించి మరుత్తనూజునిం
గని కనులార నీవె దశ ♦ కంఠుని వీటని గంటిగాదె? లం
కను జెపు మెన్ని దుర్గములు ♦ గ్రాలెడినో బల మెంతమాత్రమో. ౩౩

అర్థములు. పరమార్థవేది=వాస్తవవిషయము దెలిసినవాఁడు, వాస్తవార్థము తెలిసినవాఁడు మరల నొకని నడుగనేల యనిన వేషమునకుఁ దగిన భాషలు చేష్ట లుండవలయును గావున లోకసంగ్రహార్థ మడుగుచున్నాఁడు.

తాత్పర్యము

యుక్తియుక్తముగ సుగ్రీవుఁడు చెప్పినమాటలువిని వాస్తవార్థ మెఱింగిన రామచంద్రమూర్తి హనుమంతా! నీవు లంకానగరము కన్నారఁ జూచితివికదా దానియందుఁ గోట లెన్నియున్నవి, సేన యెంతమాత్రము చెప్పుము.

క. నా తపము బలముచేతనొ, సేతువు బంధించి యొండె ♦ శిఖసఖబాణ
వ్రాతమున నొండె జలనిధి, నే తీరుననైన దాఁట ♦ నే నిపుణుండన్. ౩౪

తాత్పర్యము

నా తపోబలముచేతనో, సేతువు కట్టియో, అగ్ని సమానములైన బాణములచే సముద్రమున నీరిగిరించియో యేవిధముగనైన సముద్రమును దాఁటు సామర్థ్యము నాకుఁ గలదు. ఆ విచారము నాకు లేదు.

తే. ద్వారదుర్గ క్రియామల ♦ దనుజసదన
ములను దద్గుప్తికర్మముల్ ♦ పలుక వయ్య
తీఱుపాటుగ సర్వంబుఁ ♦ దిరిగి కంటి
వన్నివిధములఁ గుశలుండ ♦ వాంజనేయ! ౩౫

తాత్పర్యము

లంకకు ద్వారములెన్ని? కోటలెన్ని? వాని నేవిధముగఁ గట్టినారు- రాక్షసుల యిండ్లెన్ని? వానిని రక్షింప నేమి యుపాయము చేసినారు? ఇవన్నియుఁ జెప్పుము. తీరికగా లంకయందుఁ దిరిగి చూచితివిగదా - అన్నిట సమర్థుఁడవు కావున నీకీ విద్యకూడఁ దెలియును చెప్పుము.

ఉ. రామవిభుండు తన్ననిటు ♦ ప్రశ్న మొనర్పఁగ విన్మ దేవ లం
కామహిమంబు దుర్గబల ♦ కాండ విధానము వాహనావళీ
ధామవిభాగమున్, మకర ♦ ధామము భీమత, గుప్తికర్మమున్
భీమసురారిభక్తియును ♦ వేద్యము సర్వము విన్నవించెదన్. ౩౬

అర్థములు. దుర్గబలకాండవిధానము=కోటలయు సేనా సమూహములయు నేర్పాటు విధము-వాహనావళీ ధామవిభాగము=వాహనముల సమూహములకై కట్టఁబడిన యిండ్ల యేర్పాటు - మకరధామము=సముద్రము - గుప్తికర్మమున్= ఏవిధముగ రక్షకై చేసిన కార్యమును, భీమసురారి = భయంకరులైన రాక్షసులకు రావణునందు గల - భక్తి=ప్రేమయు - వేద్యము=తెలియఁదగినది.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి తన్నిట్టు లడుగగా హనుమంతుఁడు దేవా! లంక యొక్క గొప్పతనము, దానియందలి కోటల- సేనల యేర్పాటు- రథగజాది వాహనములకుఁ గట్టఁబడిన యిండ్ల విధము, సముద్రముయొక్క భయంకరత్వము, శత్రువులను వధించుటకై చేయఁబడిన రహస్యమైన యేర్పాటులు, రావణాసురునియందు రాక్షసులకుఁగల భక్తి- తెలియవలసినది సర్వము విన్నవించెదను వినుము.

ఉ. త్క్ష్మారమణా! ప్రహృష్టమయి • మత్తగజాకులమై, మహాకృతుల్
తేరులు గల్గి పూర్ణముగ • దేవవిరోధిచయావృతంబు నై
సారతురంగమాఢ్య మయి • సార్గళసంపరిబద్ధతుంగ వ
ద్ద్వారచతుష్కయుక్త మయి • వాసవవైరిపురంబు గ్రాలెడిన్. ౩౭

అర్థములు. ప్రహృష్టమయి = సంతోషించినది - మత్తగజాకులము = మదించిన యేనుఁగులతో నిండినది - మహా+ఆకృతుల్ = గొప్ప యాకారములు గలవి - దేవవిరోధిచయ = రాక్షస సమూహముతో - ఆవృతంబు = ఆవరింపఁబడినది- సార=బలముగల- తురంగమాఢ్యము = అశ్వసంపత్తిగలది - సార్గళ = అడ్డముగావేయు గడియమ్రాఁకులతో-సంపరిబద్ధ=బాగుగ బిగింపఁబడిన - తుంగవత్ = ఎత్తైన - ద్వారచతుష్కయుక్తము=నాలుగు ద్వారములతోఁ గూడినది. వాసవవైరిపురంబు= రావణుని పట్టనము - లంక గ్రాలెడిన్ = ఒప్పుచున్నది.

తా త్ప ర్య ము

రాజేంద్రా ! లంకాపురము దండఱు సంతోషముతోఁ గూడినవారే-లంక యంతయు మదించిన యేనుఁగులచేతను, పెద్దతేరులచేతను - బలముగల గుఱ్ఱముల చేతను నిండి - రాక్షస సమూహముచే నావరింపఁ బడి యున్నది. లంకకు నాలుగు దిక్కుల నాలుగు ద్వారములు గలవు. వాని వాకిండ్లను అడ్డగడియ మ్రాఁకులచే బంధించి యున్నారు.

ఉ. అందలి యశ్మయంత్రములు • నాగతశాత్రవసైన్య మంద వే
ద్రుందు, శతఘ్నికల్ తఱచు • రాక్షససంఘవినిర్మితంబు లై
క్రందుగ ద్వారదేశములఁ • గ్రాలుచు నుండు, సువర్ణసన్మణీ
బృందవిహారజాంతరిత • భీమసువప్రము దుప్ప్రధర్షమౌ. ౩౮

అర్థములు. అశ్మయంత్రములన్ = తాలయంత్రములచే - ద్వారమునకుఁ బై భాగమునఁ బలకలపైఁ గానరాకుండ శిలలు పేర్చి శత్రువు లా మార్గమున వాని క్రిందికి వచ్చినపుడు వారిపై నవి పడునట్లు చేయు యంత్రములు - ఆగత= వచ్చిన- శాత్రవసైన్యము=విరోధుల సేన - అంద=ఆ ద్వారమందే - మ్రందున్= చచ్చును - సువర్ణ = బంగారు చేతను - స్మణీ = మంచి కెంపుల చేతను - విదూరజ=వైడూర్యముల చేతను - అంతరిత = పొదుగఁబడిన - భీమ = భయంకరమైన సువప్రము= పెద్ద కోటగోడ - దుష్ప్రధర్షము = పడఁగొట్టి లోపలికిఁ బోవలయు ననిన సాధ్యము కానిది.

తాత్పర్యము

ఆ ద్వారములయందలి తాలయంత్రములచే నా మార్గమున వచ్చిన విరోధి సేన యందే చచ్చును. రాక్షసులచే నిర్మింపఁబడి ప్రేటునకు నూర్గురిని జంపు శతఘ్నులు ద్వార ద్వారము నొద్ద విశేషముగ నిలుపఁబడి యున్నవి. (ఈ శతఘ్ను లిప్పటి ఫిరంగులవంటివి.) బంగారు కెంపులు, వైడూర్యములు వీనిచే నడుమ నడుమఁ బొదుగఁబడిన కోటగోడను బగులఁగొట్టి లోపలికిఁ బోవ సాధ్యపడదు.

సీ. ఆ పురిచుట్టు మ♦హాభీమములు గ్రాహ,వంతముల్ శీతల♦వారి మిగులఁ
గ్రమంబు లగుచు న♦గాధంబు లగుచు న,గడ్త లొప్పును మీఁద♦కాండయుక్తి
ద్వారంబులందు యం♦త్రారూఢములు చాల, విరువులౌ వంతెనల్♦వెలయునాలు
గచ్చోటఁ గలవు మ♦హాగృహపంక్తు లా, పలకలవంతెనల్♦ పరుల సేన
తే. వచ్చునప్పుడు రక్షింపఁ♦బత్తినంబు, వాని యంత్రాళిబలమునఁ♦ బరిఖలోన
విడుచు చుందురు; వానిలో♦ వేదికలును బైఁడికంబంబులును గల్గి♦పటిమనొప్పి.

అర్థములు. మహాభీమములు = మిగుల భయంకరములు - గ్రాహవంతముల్ = మొసళ్ళుగలవి - అగాధములు = మిగుల లోఁతైనవి.

తాత్పర్యము

ఆ పట్టణము చుట్టు మిగుల భయంకరములై మొసళ్ళుగలిగి మిగులలోతైన యగడ్తలు గలవు. చల్లనినీరు, చేఁపలుగలవై చూచుటకు మనోహరముగనుండును. ద్వారములందు నాయగడ్తల మీఁద జనుల రాకపోకల కనుకూల మగునట్లు యంత్రములతోఁ జేయఁబడిన వెడలుపాటి వంతెనలు గలవు. శత్రువులు వచ్చినపుడీ యంత్రములఁ ద్రిప్పిన నా వంతెనలు లేచి కోట ద్వారములకుఁ దలుపులవలె నడ్డపడును. అచ్చట నిండ్ల వరుసలుగలవు. అవియును ఆ పలకల వంతెనలు శత్రువులు ముట్టడించినపుడు పురమును రక్షించును, ఆ పలకల వంతెనలను యంత్రబలముచేఁ బని లేనపుడు నీళ్ళమీఁద దిగవిడతురు. శత్రువులు వచ్చినపుడు యంత్రములతోఁ జేదుకొందురు. ఆ నాలుగింటిలో నరుఁగులు, బంగారు స్తంభములు కలదై, బిగువుకలదై.

క. కదలింపరాక దృఢమై, పాదలెడు నంతెన యొకండు ♦ పొలుచును జుమ్మీ
యది సేనాదర్శనమున, యదనున దశకంధరునకు ♦ నగుఁ దానముగన్. ౨౦

అర్థములు. తానము=స్థానము - అదను=సమయము.

తాత్పర్యము

గట్టిగఁ బాఁదుగొని కదలింపరానిదై యొక వంతెన యుత్తరద్వారమునఁ గలదు. అది సేనల విమర్శింప రావణుఁడు వచ్చినపుడు వానికి విశ్రమస్థానమై యుండును.

క. మతిమత్ప్రకృతియుతుం డయి, సతతంబు యుయుత్సుఁ డగుచు ♦ స్వయముగ సేనా
తతి సావధానముగఁ గను, నతులితజాగరిత రావ ♦ ణాసురుఁ డొప్పున్. ౨౧

అర్థములు. మతిమత్ =ఆలోచనగలవాఁడు, ప్రకృతియుతుఁడు = స్వస్వభావమున జూదము మొదలగు దురభ్యాసములు లేకయున్నవాఁడు, విశేషణోభయపదకర్మధారయము - మతిమంతమైన స్వభావముతోఁ గూడినవాఁడనియైన జెప్పవచ్చును. యుయుత్సుఁడు = యుద్ధమం దుత్సాహము గలవాఁడు, సావధానముగన్ = హెచ్చరికతో, అతులితజాగరిత = అసమానమైన హెచ్చరికతో, అతులితజాగరిత రావణాసురుఁడు మతిమత్ప్రకృతియుతుండయి సతతము స్వయముగ యుయుత్సుఁడయి సేనాతతి సావధానముగఁ గనుచు నొప్పును అని యన్వయక్రమము.

తాత్పర్యము

రావణాసురుఁడు మిక్కిలి హెచ్చరికఁ గలవాఁడై యాలోచనపరుఁడు, స్వస్వభావయుక్తుఁడై సర్వదా యొకరిమాటలమీఁదనే యాధారపడి యుండక తానే యుద్ధాసక్తుఁడై సేనా సమూహములను విమర్శించి చూచుచుండును.

సీ. ఇఁక లంక నాదేయ ♦ కృత్రిమ పార్వత, వాన్యచతుర్విధా ♦ నన్యసాధ్య
భీకరదుర్గ ♦ మాకలితంబయి సురలకు నేనియుఁ ♦ జొరఁగరాక
యాలంబహీనమై ♦ యంబుధికూలంబు, నందు నావలు చన ♦ నైనఁ ద్రోవ
లేక వార్తకుఁ జొర ♦ వీక శైలాగ్రంబు, నం దమరావతీ ♦ చందమునను
తే. వాజివారణపూర్ణమై ♦ పరమయంత్ర, వివిధపరిఘాశతఘ్ని కా ♦ న్వితమునగుచుఁ
బరమదుర్గమ ♦ మయి దశవక్త్రపాలి, తంబు పొలుపొందు దశరథ ♦ తనయ యందు.

అర్థములు. నాదేయ = నదియందుఁ బుట్టినది, అనఁగా జలదుర్గము, కృత్రిమ=మనుష్యులచేఁ గల్పింపఁబడినది, ప్రాకారాది దుర్గము=కోటలు మొదలయినవి, పార్వత= పర్వతసంబంధమైన దుర్గము, వాన్య=వనసంబంధ దుర్గము, అనఁగా వనదుర్గము, చతుర్విధ=నాలుగు విధములైన, అనన్యసాధ్య = ఇతరులకు సాధింపరాని, భీకర = భయంకరములైన, దుర్గ = కోటలచే, సమాకలితంబు = చక్కఁగా గూర్పఁబడినది, ఆలంబహీనమై = ఆధారములేనిదై, త్రికూట పర్వత

ముల తాలను నులులతో గొట్టి నునుపుగాఁజేసి యీ పర్వతశిఖరమున లంకను గట్టి యున్నారు. కావున దానికి వేఱాధారము లేదు. వార్తకున్ జొరవీక = ఇతరదేశ సమాచారము లక్కడి వారికి, అక్కడ నేమి జరుగునో వెలుపలివారికిఁ దెలియు మార్గము లేక, వాజివారణపూర్ణమై = గుఱ్ఱములతో నేనుఁగులతో నిండి,పరిఖా= అగడ్తలచే, అన్వితము=కూడినది.

తా త్ప ర్య ము

ఇఁక లంకామహాత్త్వము చెప్పెద వినుము. లంకయందు జలదుర్గము, కృత్రిమ దుర్గము, పర్వతదుర్గము, వనదుర్గము లను నాలుగు విధములైన భయంకర దుర్గములు గలవు ఇవి యితరులకు సాధ్యములగునవి కావు. లంక నిరాధారముగ సముద్రతీరమున నున్నది. దానియందుఁ బ్రవేశింప దేవతలకైన సాధ్యముగాదు. నావలు కూడ దాని సమీపమునకుఁ బోవ మార్గము లేదు. పర్వత శిఖరంబున నమరావతివలె నున్నది. బయటి వార్త లోపలికిఁ బోవుటకుఁ గాని, లోపలివార్త బయటికి వచ్చుటకుఁ గాని వలనుపడదు. ఏనుఁగులు గుఱ్ఱములు నిండి యున్నవి గొప్ప యంత్రములు, నానావిధములైన యగడ్తలు, శతఘ్నులుకలవు. జయించుట కేమియు సాధ్యమగునది కాదు. దీనిని రావణుఁడు పాలించు చున్నాఁడు.

సీ. ప్రాగ్ద్వారరక్షకుల్ ♦ పదివేవు రుందురు, ఖడ్గాగ్రయోధులు ♦ కడిఁదిబలులు
శూలపాణులు రణ♦శూరులు దుర్జయుల్, దక్షిణద్వారంబు ♦ రక్షసేయ
నియుతరక్షోవరుల్ ♦ నిష్ఠురవిక్రముల్, చతురంగ బలయుక్తి ♦ సతత ముంద్రు
పడమటివాకిఁట ♦ బ్రయుతరక్షోగ్రిముల్, చర్మఖడ్గాన్వితుల్ ♦ చటులబలులు
తే. వినుతసర్వాస్త్రకోవిదుల్ ♦ వెలయు చుందు
రుత్తరద్వారమును గాచు ♦ చుంద్రు న్యర్బు
దాసురులు కులజాలు వార♦ణాశ్వవాహు
లిందఱును బూజితులు రాక్ష♦సేశ్వరునకు. ౮3

అర్థములు. ప్రాగ్ద్వారరక్షకుల్ = తూర్పు ద్వారమును గాచువారు. ఖడ్గాగ్రయోధులు=కత్తులు ధరించి తక్కిన సేనకు ముందు నిలిచి యుద్ధము సేయు వారు. కడింది బలులు=విస్తార బలముగలవారు. నియుతరక్షోవరుల్=లక్షరాక్షస శ్రేష్ఠులు. ప్రయుత = పదిలక్షల, రక్షః+అగ్రిముల్ = రాక్షసశ్రేష్ఠులు, చర్మఖడ్గ అన్వితులు=డాలులు కరవారులతోఁ గూడినవారు, న్యర్బుద=పదియర్బుదముల,

తా త్ప ర్య ము

ఇఁక సైన్య సన్నివేశము చెప్పెద వినుము. తూర్పునుండి శత్రువులు వచ్చు టకు వలను పడదు. కావున ఆ ద్వారమును పదివేల రాక్షసులు సేనలకు ముందు నిలిచి ఖడ్గములతో యుద్ధముచేయు రాక్షసులు కాచియున్నారు. దక్షిణ ద్వార మును శూలములు, ధరించిన శూరులు, జయింపరాని వారు,లక్షరాక్షసులు, మిగులఁ

బరాక్రమవంతులు, నాలుగు విధములైన (రథములు, ఏనుఁగులు గుఱ్ఱములు, కాలిబంట్లు) సేనలతోఁగూడి కాచియుందురు. పడమటి వాకిట పదిలక్షల రాక్షసులు డాలులు తరవారులు ధరించి కాచియుందురు. వీరికి శస్త్రవిద్యయుఁ దెలియును. ఉత్తరద్వారమును పదియర్బుదముల రాక్షసులు గొప్పవంశములఁ బుట్టినవారు ఏనుఁగులు గుఱ్ఱములు వాహనములుగాఁ గలవారు రక్షించుచుందురు. వీరందఱు రావణునకుఁ బూజ్యులు, విశ్వాసపాత్రులు.

క. మధ్యమభాగాశ్రితులు న,సాధ్యులు నూర్వేవు రుంద్రు ♦ సర్వంబు సదా
రాధ్యం బగు తత్పురమున, మధ్యాహ్నరాడ్భకోటి ♦ మానవభోజుల్. ౪౪

తాత్పర్యము

లంకాపుర మధ్యమున నసాధ్యులగు రాక్షసులు నూఱువేలమంది కలరు. సైన్యమంతయు సర్వదా శ్రేష్ఠమైనదియే. ఎందును లోపములేదు. మధ్యాహ్న సూర్యునితో సమానులగు రాక్షసు లందుఁ గోటిగలరు.

క. చెఱిచితి నంతెన శైల్లను, బఱదితిఁ బాతికబలంబుఁ ♦ బాడు లగడ్తల్
నుఱుమాడితి వప్రంబులు, తెఱపులుం నెటఁ గన్న నిపుడు ♦ దేవారిపురిన్. ౪౫

తాత్పర్యము

ఇది నేను లంకను దొలుతఁజూచినప్పుడున్న విధము. ఇప్పు డిట్టు లున్నదని తలఁపవలదు. ఏలన వంతెనల నన్నిటిని జెఱిచితిని. గట్టివంతెన యొకటియు లేదు. పాతికసేనను బాడుచేసితిని. అగడ్తలు పాడుపడఁ జేసితిని. కోటగోడలు దుమ్ముచేసితిని. ఇప్పుడు లంకలోనికి నన్ని మార్గములే. ఏ కంతలోనుండియైనఁ దూఱిపోవచ్చును.

సీ. శ్రీరామ! యెటులైన ♦ వారిధిఁ దరియింపఁ, గలిగినయేని లం ♦ కాపురంబు
వానరకోటిచేఁ ♦ బాడని నమ్ముము, బల మంతయును నేల ♦ పార్థివేంద్ర
యంగదద్వివిదబు ♦ త్రాధ్యక్షనీలురు, మైంద పనస నలుల్ ♦ మాత్రమైన
వారిధి దాఁటి దే ♦ వారిపురంబునఁ, బర్వత వనములు ♦ భగ్నపఱిచి

తే. తోరణంబులు చెఱిచి ప్రా ♦ కారములను
తుఱుము గావించి భవనముల్ ♦ దుమ్ము గలిపి
వత్తు రీ వారిఁ బంపుము ♦ వరముహూర్త
నిశ్చయముఁ జేయుమీ ప్రయ ♦ ణించుపొంటె. ౪౬

అర్థములు. తుఱుము = పొడి, పయనించు పొంటె = ప్రయాణము చేయుకొఱకు.

తాత్పర్యము

రామచంద్రా! లంక ఎంత దృఢముగనైన నుండునుగాక. ఎందఱు రక్షకులుండిన నుందురుగాక. ఏవిధముగనైన సరియె సముద్రము దాఁటితిమా వానరులచే

లంకపాడైన దని నమ్ముము. వానరసేన యంతయుఁ బోవలసిన పని లేదు. అంగదుఁడు, ద్వివిదుఁడు, జాంబవంతుఁడు, నీలుఁడు, మైందుఁడు, పనసుఁడు, నలుఁడు వీరు మాత్ర మైనను సముద్రమును దాఁటి లంక ప్రవేశించి పర్వత దుర్గములు వన దుర్గములు విఱిచి ద్వారములు పాడుచేసి ప్రాకారములు పొడిచేసి యిండ్లన్నియు దుమ్ములోఁ గలిపి రాఁ గలరు. వీరి నైనఁ బంపుము. ప్రయాణమునకు మంచి ముహూర్త మేర్పాటుచేయుము.

౪-వ సర్గము. శ్రీరాముఁడు కపిసేనతో లంకపై దండయాత్ర వెడలుట

క. అను హనుమంతుని వాక్యము, లను క్రమముగాఁగ రాముఁ ♦ డాలించి యనున్
దనుజేంద్రపురము విధ్వం, సనముం గావింతుఁ జుండు ♦ సత్యం బంటిన్. ౪౩

అర్థములు. అనుక్రమముగన్ = వరుసగ, ఆదినుండి యంతమువఱకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచున్న హనుమంతునిమాట లాదినుండి కడవరకు విని రామచంద్రమూర్తి యిట్లనెను. లంక జెఱచుట గొప్ప కార్యముగాదని తలఁచి రావణాసురుని పురము ధ్వంసము చేసెదను. సత్యము చెప్పుచున్నాను.

చ. అగు నిది మంచిమూర్తము ప్ర♦యాణము సేయఁగఁ బద్మమిత్రుఁడున్
గగనము మధ్యముం దఱిసెఁ ♦ గ్రాలు నిదే విజయంబు పేరిటన్
నెగడిన సన్ముహూర్తము వ♦నేచరనాయక ! యిప్డు పోయినన్
బగతుఁడు జానకిం గొనుచుఁ ♦ బ్రాణముతో నెట కేగఁ గల్గెడిన్ ! ౪౪

అర్థములు. మూర్తము = ముహూర్తశబ్దభవము, పద్మమిత్రుఁడు = సూర్యుఁడు.

తాత్పర్యము

"మనోజవంతు మాండవ్య" యను సూక్తినిఁబట్టి ప్రయాణమునకు నిదియే మంచి ముహూర్తము అంతియేకాదు, సూర్యుఁడు ఆకాశమధ్యమున నున్నాడు. ఈముహూర్తమునకు విజయమనిపేరు. ఇది మంచిముహూర్తము. సుగ్రీవా! యిపుడు మనము బయలుదేరి పోయితిమేని పగవాఁడు జానకిని దీసికొని ప్రాణముతో నెందుఁబోగలఁడు. ఎచటికిఁ బోయినను జచ్చినవాఁడే, ఈ ముహూర్తమునకు నభిజిత్తని పేరు. సూర్యుఁడు నడినెత్తికి సరిగానుండు సమయము. "ఆర్ద్రోరగ మిత్ర మఖా వసు జల విశ్వాభిజి ద్విరిం చేంద్రాః, ఐంద్రాగ్ని ఘూల వరుణార్యమ భగ తారా దివా ముహూర్తా స్స్యుః" అని పగట పదునాలు ముహూర్తములు గలవు. ముహూర్తమునకు ముక్కాలు గంటకాలము. ఇందు నెనిమిదవది అభిజిత్తు. అనఁగా పదునొకొండు గంటల పదునైదు నిమిషముల మొదలు పండ్రెండు వఱకు నభిజిత్తు. ఇది పగలు పండ్రెండు గంటలుగల దినము వృత్తాంతము.

"అన్వీయమానో రామోసౌ, ముహూర్తేఽభిజితి ద్విజాః
విలంఘ్య వివిధాన్ దేశాన్, మహేంద్రం పర్వతం యయౌ"

స్కాందము ౩-౨-౨౮.

గీ॥ గార్గ్యసిద్ధాంత మత ముమః కాలకలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము
సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు భీ. పు. ౩-౪౧
భుక్తౌ దక్షిణయాత్రాయాం, ప్రతిష్ఠాయాం, ద్విజన్మని
ఆధానేచ ధ్వజారోహే మృత్యుద స్స్యాత్సదాభిజిత్.

అని జ్యోతిషరత్నాకరమందుఁ గలదు కదా. అభిజిత్తు దక్షిణదేశయాత్ర కెట్లు రామచంద్రమూర్తి మంచిదనెను. కిష్కింధకు లంక యాగ్నేయ మూల నున్నదికాని దక్షిణమున లేదు. కావున దోషంబు లేదు.

ఉ. నా యభిమానమున్ వినుచు ♦ నా ప్రియురాలు మనంగ నాసయేన్
జేయునుగాక, పీడితుఁడు ♦ చేపడినట్టి విషంబు గ్రోలి సా
పాయదశన్ సుధాద్రవముఁ ♦ బానముఁ జేసినరీతి సూర్యజా!
యీయెడఁ గాలయాపన మిఁ ♦ కేల యొనర్పఁగ రిత్త చూడుమా. ౪౯

అర్థములు. అభిమానము = దండయాత్ర, వినుచున్ = త్రిజటాదులచే నని భావము. సాపాయదశన్ = ప్రాణమునకు నపాయము వచ్చిన స్థితియందు, సుధాద్రవము=అమృతరసము, కాలయాపనము=కాలము జరుపుట.

తాత్పర్యము

నేను దండయాత్ర బయలుదేఱుట త్రిజటాదులు చెప్పఁగా విని నా ప్రియురాలు బ్రదికియుండుటకు నాశ యైనఁ గలది యగునుగాక. ఎట్టులనిన, రోగి చేతికి దొరకిన విషము దిని ప్రాణముపోవు సమయమున నమృతరసము ద్రాగి జీవించినట్లు ఇచ్చట నాలోచనలతో వ్యర్థకాలక్షేపము చేసిన నేమి మేలు?

ఆ. ఉగ్రకిరణతనయ ♦ యుత్తరఫల్గుని, నేఁడు రేపు హస్త ♦ నిలుచు శశియుఁ
గాన నేఁడ సకల సేనాసమేతంబు, పయనమగుట లెస్స ♦ ప్లవగరాజ. ౫౦

తాత్పర్యము

ఒకనాఁటిలో మించినదేమి, రేపు పోదమందువేమో, సుగ్రీవా! నేఁ డుత్తర ఫల్గుని నక్షత్రము- నాజన్మనక్షత్రమున కాఱవది, సాధనతార-కావున శుభము - రేపు చంద్రుఁడు హస్తతోఁగూడిన నేడవతార నైధనతార యగును. అది యశుభము. రేపు ప్రయాణము చేయరాదు. కావున నేఁడే, యిప్పుడే సకల సేనలతో ప్రయాణము చేయవలయును.

ఈ దినమున నక్షత్ర ముత్తర యనియు, దానితోఁ జంద్రుఁడు కూడి

యున్నాఁడనియుఁ జెప్పుటచే నిది ఫాల్గునమాసము కావున నేఁడు పున్నమ యని తెలియఁదగియున్నది.

చతుర్దశినాఁటి సాయంకాలము రామాంజనేయ సమాగమము. కావునఁ బున్నమనాఁడు దండయాత్ర- 'అభిజి త్సర్వదోషఘ్న' మ్మని అభిజిత్తునఁ బ్రయాణము చేయుటకు తిథ్యాదులఁ జూడఁ బనిలేదు.

క. ఉత్తమశుభదము లైన నిమిత్తముఁ లెంతయును దోఁచెఁ మేలుగ మనకున్
నిర్ఋతికి వశపడ రాక్షసపత్తముఁ గావించి నిజము జానకిఁ దెత్తున్. ౧౧

అర్థములు. నిర్ఋతికి = మృత్యుదేవతకు.

తాత్పర్యము

మంచివి శుభశకునములు పెక్కులు కానవచ్చుచున్నవి. కావున రావణుని జంపి సీతను దెచ్చుట సత్యము.

క. మీఁగన్నదరెడి శత్రులఁ, జాఁగఁబఁగొని విజయి వగుచు జనకజఁ గొని నీ
పేఁగెను బన్నం బను క్రియఁ, జాఁగురె పయనింప నిదియ సమయం బనుచున్.

అర్థములు. అశుభశకునము లేవి యనిన:—మీఁగన్ను = మీఁదు + కన్ను=మీఁగన్ను=కంటి పైభాగము, చాఁగఁబఁగొని = నాశముచేసి, విజయివి = గెలిచినవాఁడవు, ఈఁగెదు=పోఁగొట్టుకొనెదవు, బన్నము = అవమానము, భగ్న శబ్దభవము, చాఁగురె = ప్రశంసార్థకము.

తాత్పర్యము

శత్రువుల నాశనముచేసి, జయమునొందినవాఁడవై, యవమానమునుఁ బోఁగొట్టుకొందు వని చెప్పెడు రీతి కంటి పైభాగ మదురుచున్నది. ప్రయాణము సేయుటకు నిదియే ప్రశస్తసమయము; మీఁగన్ను-వాల్మీకి కుడికంటి పైభాగమైనది, యెడమ కంటి పైభాగమైనది చెప్పలేదు. మహేశ్వరతీర్థులు కుడికన్నని వ్రాసిరి. ఇది చింత్య మని వ్రాయుచు గోవిందరాజులు "నేత్రస్యార్థ స్ఫురణ మనకృత్సంగరే భంగహేతు। ర్నేత్రోపాంతే హరతి నయనం, నేత్రమూలేచ మృత్యుః। నేత్రస్యోర్ధ్వం హరతి సకలం మానసం దుఃఖజాతం। వామే చైనం ఫల మవికలం దక్షిణే వైపరీత్యమ్॥" అను శ్లోకమును జ్యోతిశ్శాస్త్రమునుండి యనువదించిరి. దీనివలన నెడమ కన్ను పైభాగ మదరిన మానసదుఃఖము లన్నియుఁ దొలఁగునని యేర్పడుచున్నది.

"దక్షిణాక్షి పరిస్పందో దక్షిణస్య భుజస్యచ। హృదయస్య ప్రహర్షశ్చ, సద్యః సంసిద్ధి సూచకాః" శకున శాస్త్రమున మగవారికిఁ గుడికన్నదురుట శుభసూచక మని చెప్పఁబడెను.

రామాయణమందే రామసుగ్రీవులు సంభాషించునప్పుడు వాలి రావణులకు నెడమ కన్నదరెనని చెప్పఁబడెను. (కిష్కింధ ౧౭౩వ పద్యముఁ జూచునది.) దీని

వలనఁ గుడికన్నయినను క్రిందిభాగ మదరుట శుభసూచకము. పై భాగ మదరుట వలన మేలు లేదని యేర్పడుచున్నది.

చ. వరనయవేది వెండి యను • వానరరాజును లక్ష్మణుండుఁ ద
స్గురుతరభక్తిఁ గొల్వఁగను • గొబ్బునఁ బంపుము నూరువేల్ వనే
చరులను మార్గశోధనము • సల్పఁగ నీ వెలగోలుగాఁ జమూ
వరుఁ డగు నీలు వెంట హరి • వర్య! మహాబలవేగవంతులన్. ౬౩

అర్థములు. వరనయవేది = గొప్పనీతిశాస్త్ర పండితుఁడు. గొబ్బునన్= శీఘ్రముగ, ఎలగోలు=పెద్దసేనకు ముందుగాఁ బోవుచున్నసేన, పెద్దసేన రాఁదగిన మార్గము శోధించుట యీ సేన పని(Reconnoitering) చమూవరుఁడు=సేనాపతి.

తాత్పర్యము

సుగ్రీవ లక్ష్మణులు తన్నుఁ బ్రేమతోఁ గొల్చుచుండఁగా నీతి శాస్త్రము చక్కఁగా దెలిసిన రామచంద్రమూర్తి సుగ్రీవునితో నిట్లనియె. నీ వెలగోలు సేనగా నూఱువేల వానరులను త్రోవలు శోధించుటకుఁ గాను మహాబలము వేగము గలవారిని ముందుగా సేనానాయకుఁ డగు నీలుని వెంటఁ బంపుము. వీరు బలవంతులు గాకేని శత్రుభయము గలదు, వేగవంతులు గాకేని పెద్ద సేన వచ్చి కలసికొనును ఈ రెండును సరిగాదు.

చ. వరఫలమూలవంత మయి • వారిసుఖాస్పద మై సుశీత మై
పరమమధుప్రభూత మగు•బాటలఁ దోకొని పొమ్ము నీల! నీ
హరివరసేనలన్, వినుదు•రాత్ములు వైరులు నీళ్ళ మూలికో
త్కరఫలకోటులన్ విషముఁ • దార్తురు, పొంతురు త్రోవ రాక్షసుల్. ౬౪

అర్థములు. ఇట్లు సుగ్రీవునకుఁ జెప్పి ప్రయాణ మగుచున్న నీలునితో నిట్లు రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు వరఫలమూలవంతమయి = మంచి ఫలములు, మూలములు గలది, వారి=నీళ్ళు, సుశీతమై= మిగుల చల్లనిదై, పరమ మధుప్రభూతము = శ్రేష్ఠమైన తేనె విస్తారముగఁ గలది, మూలికోత్కర ఫల కోటులన్=వేళ్ళ సమూహములందు; పండ్ల సమూహములందు; విషముదార్తురు= విష ముంచుదురు, పొంతురు=పొంచియుందురు. "మంత్రౌషధ ప్రయోగేన పరం నిస్సంజ్ఞం కృత్వావా రాజ్యం గృహ్ణీయాత్"- బుధస్మృతి - ౪ ౩.

తాత్పర్యము

నీలా! వానరుల కాహారము లగు మంచిఫలములు మూలములు గలట్టియు, యారోగ్యకరములై చల్లని నీళ్ళుగలట్టియు, విస్తారముగఁ దేనె గలట్టియు, బాటల యందు నీ వానరసేనలను దోడుకొని పొమ్ము - నీవొక విషయమున జాగ్రత్తగల వాఁడవై యుండవలెను. ఏ దన రాక్షసులు త్రోవలందుఁ బొంచియుండి తేటాలునఁ బైపడుదురు దుష్టబుద్ధులు గావున వీరి కాహారమైన పండ్లయందు, మూలములందు,

నీళ్ళయందు విషము పెట్టుదురు. ఇట్టి భయములేని ప్రోవలందు సేనల నడిపింపుము. నీతిశాస్త్రము ననుసరించి రామచంద్రమూర్తి చెప్పెనే కాని భయకారణము లేదు. రావణుఁడు దుర్గ-సేనా - బంధు - స్వబలగర్వితుఁడై తనపై నెవడు రాఁగలఁడని వేగుల నంచినవాఁడు కాఁడు-ఈవిషయమున శూర్పణఖా మారీచులు రావణుని దూషించియున్నారు. రామచంద్రమూర్తి యీ పదినెలలుగా నెచ్చట నేమి చేయుచుండునది రావణునకుఁ దెలియదు. హనుమంతుఁడు లంకఁ గాల్చి వానర సేన సముద్రతీరమునకు వచ్చువఱకు వాఁడు నిద్రపోవుచునే యుండెను. ఆకారణముచే నీ కుచేష్టలు చేసినవాఁడు కాఁడు, అవకాశము లేదు.

క. జలదుర్గంబులఁ గానన. తలములఁ బల్లముల వైరి • తతి ఛన్నంబై
బిలముల డాఁగును గావున, వల నగు బై కెగిరి కనఁగ • వానరతతికిన్. ౧౭

అర్థములు. జలదుర్గంబులన్ = చొచ్చుటకుఁ గష్టమగు నీటిప్రదేశములందు, వైరితతి = విరోధుల సమూహము, ఛన్నంబై = మఱుఁగుపడినదై, బిలములన్ = బొరియలందు.

తాత్పర్యము

మీరు పోవునపుడు మఱియొకటి కనిపెట్టవలెను. మనము పోవునపుడు తటాలున మీఁదఁబడుటకై శత్రువులు జలదుర్గములందు, అడవులలోఁ జెట్లచాటున, గుంతలయందు, బొరియలయందు, దాఁగియుందురు. కావున నిట్టివారిని వానరులు పైనెగిరి పోవుచు కనిపెట్టవలెను.

క. బలవిక్రమవంతులకును, జలుపఁగ నర్హంబు ఘోర•సంగ్రామంబుల్
బలహీను లెవ్వరేనియుఁ గలిగినఁ గిష్కింధ కనుపఁ•గాఁ దగు నీకున్. ౧౮

తాత్పర్యము

నీలా! బలపరాక్రమములు గలవారే యుద్ధముచేయ నర్హులు. కావున నీ సేనలో బలహీను లున్నయెడల వారిని గిష్కింధకుఁ బంపుము. వారు రానేల? తెరకుఁ జావనేల?

సీ. వెల్లి వెల్లువ పాఱు•విధమున నెలగోలు, బలము నూఱులు వేలు•పనుప వయ్యె
గజుఁడు గవాక్షుండు • గవయుండు మును చను, వా రాలలో బలీ•వర్దము లన
ఋషభునితోఁ బంపు•మీ కపిసేనను, దక్షిణపార్శ్వంబు రక్ష సేయ
మదహస్తిబలి గంధ•మాదనుఁ డరుగుతఁ, గపులతో డాపటి•కాపుగాఁగ
తే. సకలబలములు జాతహ•ర్షమునఁ దేల, నేను నైరావతారూఢుఁ•డైన యింద్రు
కరణి హనుమంతు పై నెక్కి•యరుగువాఁడ, సైన్యమధ్యంబునందు నో • సైన్యనాథ

అర్థములు. వెల్లి=సముద్రము. 'అప్పాలవెల్లి లోపలి నప్పటి కప్పటికి' ॥భాగ॥ వెల్లువపాఱు విధముననన్=ప్రవాహముగాఁ బోయినట్లు, ఎలగోలు బలము= ముందు పోవు సేన, ఆలలో = ఆవులలో, బలీవర్దములు = వృషభములు, దక్షి

పార్శ్వంబు=అనఁగా దక్షిణ దిక్కని యర్థముగాదు ఇచ్చట పడమటి దిక్కనియే యర్థము. దక్షిణముఖముగా సేన పోవుచున్నది. కావున నదియే తూర్పనియు, దానికిఁ గుడిచేతివైపు దక్షిణ మనియు గ్రహింపవలయును. అప్పుడు పడమరయే యగుచున్నది. 'యతశ్చ భయ మాశంకేత్ తాం ప్రాచీం పరికల్పయేత్' త్తని కామందకోక్తి. ఏ ప్రక్కన శత్రువులవలన భయము గలదో యా దిక్కు తూర్పుగా నెంచవలయును, ఇచ్చట దక్షిణ దిక్కునుండికదా భయము.

తాత్పర్యము

సేనానీ ! సముద్ర మేఱుగఁ బ్రవహించినట్లు నూఱువేల వానరులను ముందుగాఁ బంపుము. ఆ సేనలో గజుఁడు, గవాక్షుఁడు, గవయుఁడు ఆవులలో కోడెలవలె ముందుగా పోవలెను. కుడి పార్శ్వమున రక్షసేయు ఋషభుఁడు సేనతోఁ బోవలెను. ఎడమవైపు రక్షింప మదించిన యేనుఁగు బలముగల గంధమాదనుఁడు వానరులతోఁ బోవలెను. అందఱకు నేను గానవచ్చునట్టులు వారు సంతోషింప నైరావతమెక్కిన యింద్రునివలె నేను హనుమంతునిపై నెక్కి సేనలనడుమ వచ్చెదను. ప్రభు వందఱకుఁ గానవచ్చుచుండిన సేనలో వారి కుత్సాహము కలుగును.

తే. సార్వభౌమంబు మీఁది వై◆శ్రవణుపోల్కి
నంగదుని నెక్కి సౌమిత్రి ◆ యరుగుదెంచుఁ
గుక్షిరక్ష సుషేణుండు ◆ ఋక్షనాథ
జాంబవద్వేగదర్శులు ◆ సలుపువారు. ౧౮

తాత్పర్యము

సార్వభౌమ మను తన యేనుఁగు మీఁదఁ గుబేరుఁ డెక్కి వచ్చునట్టు లంగదుపై నెక్కి లక్ష్మణుఁడు వచ్చును. సేనామధ్యభాగమును సుషేణుఁడు జాంబవంతుఁడు వేగదర్శి యనువారు రక్షింపవలయును.

క. భూవిభుఁ డట్లు వచింప రుమావిభు నాదేశమునను ◆ మర్కటులు గుహా
భూములు శృంగతలంబులు, భీమగతిన్ వెడలి రభ్ర◆పృథ్వులు నిండన్. ౧౯

అర్థములు. రుమావిభు = సుగ్రీవుని, ఆదేశమునను = ఆజ్ఞ చొప్పున, అభ్రపృథ్వులు = ఆకాశము; భూమి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి ఇట్లు చెప్పఁగా సుగ్రీవుఁ డాజ్ఞ సేయఁగా గుహలనుండి పర్వతశిఖరములనుండి భూమ్యాకాశములు నిండునట్లు భయంకరముగ వానరులు బయలుదేరిరి.

క. రాముఁడు వానరవల్లభ, సౌమిత్రిసమేతుఁ డగుచు ◆ సమ్మదమున ను
ద్దామగతి నడిచె రయమున కామనదిఙ్ముఖముగా స◆సైన్యుం డగుచున్. ౨౦

అర్థములు. శామనదిక్ + ముఖముగా = శమనుని సంబంధము శామనము=దక్షిణపు దిక్కు ముఖము చేసి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి లక్ష్మణ సుగ్రీవులతో సంతోషముతో నతివేగముగ దక్షిణాభిముఖుఁడై ప్రయాణము చేసెను.

సీ. వారల వెంబడి వారణవిభులైన, క్రోఁతులు వేలును • గోటు లయుత
ములు వెన్నడించిరి • ముదితులై దృప్తులై, గంతులు వేయుచు • గర్జ లిడుచు
నెగురుచు దుముకుచు • మొగిచుట్లు పెట్టుచు, ఫలముల మెక్కి తే•నెలనుగ్రోలి
చెట్టుల నెక్కుచుఁ • జిదుముచు గుత్తులు, కాయల రాల్చుచు • గండుమీఱి
ఆ. యొకఁ డొకనిఁ ద్రోయు • నొక్కనిఁ బై కెత్తు
నొకఁడు గేలి సేయు నొక్కఁ డతనిఁ
బట్టి పెనఁగు వాని•పై నెక్కు నొక్కండు
నొకని నొకఁడు ద్రోసి • యుర్వి గూలు. ౩౨

అర్థములు. ముదితులై = సంతోషించినవారై - దృప్తులై = గర్వించినవారై, గర్జలు=సింహనాదములు, చిదుముచున్=కోయుచు.

తాత్పర్యము

స్పష్టము,

క. నేనే త్రుంచెద రావణు, నేనే వధియింతు యామి•నీచరకోటిన్
నేనే నేనే యనుచును, వానరతతి రాముమ్రోల • వాదము లాడున్. ౩౩

అర్థములు. యామినీచరకోటిన్ = రాత్రి సంచారముచేయు రాక్షసుల సమూహమును.

తాత్పర్యము

స్పష్టము.

సీ. కుముదనీలర్షభుల్ • కొమ్మున మున్నుగాఁ, జనిరి మార్గముల శో•ధనము సేయ
రామలక్ష్మణులును • రాజు సుగ్రీవుండు, నడుమ నేగిరి గొల్వఁ•గడిఁదిబలులు
శతవలి పదికోట్లు •శాఖామృగాళితో, పర్వంబు రక్షించె • సైన్యసమితిఁ
బరిజనుల్ వేవేలు • బలసిరాఁ బనసార్క,గజకేసరులు ప్రక్క•గాపులైరి
ఆ, ఋక్షసేనతోడ • రక్షించె జఘనంబు, జాంబవంతుఁ డధిక•శక్తియుక్తి
బాస టయి సుషేణ•బలిముఖుఁ డుండఁగ, దరణిసుతుఁడు మున్ను•దవిలి నడువ.

అర్థములు. కొమ్మున = ఉత్సాహముతో.

తాత్పర్యము

సేనకు ముందుగా మార్గములను బరీక్షించుటకుఁ గాను కుముదుఁడు నీలుఁడు, ఋషభుఁడు ౫౭ పద్యంబునఁ జెప్పఁబడిన వారితోడఁ బోయిరి (వీరినిగూడ రామ

చంద్రమూర్తి యిచ్చటఁ జెప్పె ననియు కవి యచ్చట గొందఱ నిచ్చటఁ గొందఱ జెప్పెననియు నెఱుంగవలయు. లేదా యీ రెండును నియమింపఁబడకుండుటచే భక్త్యతిశయమున వారే పోయి రనియైన గ్రహింపనగు.) మహాబలవంతులు సేవించుచుండఁగా రామలక్ష్మణ సుగ్రీవులు నడుమఁ బోయిరి. శతవలి పదికోట్ల వానరులతో సేననంతయుఁ గాచి తిరుగుచుండెను. వేయివేల వానరులతోఁ బనసుఁడు, ఋషభుఁడు, గజుఁడు, కేసరి, పార్శ్వముల రక్షించుచుండిరి. జాంబవంతుఁ డెలుఁగులతో సేనామధ్యభాగమును రక్షించెను. ఆయనకు సహాయుఁడై సుషేణుఁ డుండెను. సుగ్రీవుఁడు ముందు పోవుచుండెను.

క. సేనాపతి యగు నీలుఁడు, వానరసైన్యముల నాల్గు॰వంకల సంర
  క్షానియమంబున నిపుణత, మానుగ నరయుచును జనెఁ బ్ర॰మాదరహితుఁడై. ౬౪

తాత్పర్యము

సేనానాయకుఁడగు నీలుఁడు నాలుగుప్రక్కల నుండు సేనలను నేర్పుతో హెచ్చరికతో రక్షించుచుఁ బోవుచుండెను.

తే. వానరులఁ దీవరించుచు ॰ వరుసఁ జనిరి
  రంభుఁడు దరీముఖుండును ॰ రభసకపియు
  మఱి ప్రజంఘుండు చను చిట్లు ॰ మార్గమునను
  గనిరి సహ్యాద్రి ఘనసరో॰వనయుతంబు. ౬౫

తాత్పర్యము

త్వరగా నడువుఁడు, త్వరగానడువుఁ డని వానరులను వేగిరపెట్టుచు రంభుఁడు, దరీముఖుఁడు రభసుఁడు, ప్రజంఘుఁడను వారు పోయిరి. ఇట్లు పోయి గొప్ప సరస్సులతో వనములతోఁ గూడిన సహ్యపర్వతముఁ జేరిరి.

క. భీమాగ్రహాయుతుఁ డగు శ్రీ, రాముని యాజ్ఞప్తి వాన॰రవ్యూహంబుల్
  గ్రామంబుల జనపదముల, భూముల డాయంగఁ జనవు ॰ పురుతరభీతిన్. ౬౬

తాత్పర్యము

రామచంద్రమూర్తి వానరు లెవ్వరును ఊళ్ళలోఁ గాని పల్లెలలోఁ గాని వానికిసంబంధించిన సాగు భూములలోఁ గాని పోరాదని కఠినమైన యాజ్ఞ చేసి యుండుటచే నాయనకుఁ దీవ్రమైన కోపము వచ్చు నను భయముచే వానరులు జనులు చరించు మార్గములఁ బోవక యడవుల వెంటనే పోయిరి.

తే. సాగరౌఘనిభంబయి ॰ జలధి ఘోష, సన్నిభారవ మయి కీశ॰సైన్య మపుడు
  రామపార్శ్వతలంబున॰రమణ నడచె, సంప్రరౌజితజవనాశ్వ॰చయముభంగి. ౬౭

అర్థములు. సాగరౌఘనిభంబు = సముద్రప్రవాహముతో సమానము - సముద్రము ప్రవాహముగాఁ బాఱిన నెట్టులుండునో యట్లు - జలధిఘోష సన్నిభారవ మయి = సముద్రధ్వనితో సమానమైన ధ్వనిగలదై - ఇట్లు చెప్పుటచే

సముద్రమును సమీపించిరని సూచన - సంప్రయోజిత=చక్కఁగాఁ దోలఁబడిన-జవనాశ్వచయము భంగిన్ = వేః వేగముగఁ బోవు గుఱ్ఱముల గుంపువలె- దీనివలన వానరులు మెల్లగా నడచిపోలేదనియు బాగుగాఁ బనువెత్తఁగల గుఱ్ఱపు వేగమునఁ బోయిరనియు తెలియ నయ్యెడిని.

తాత్పర్యము

సముద్రధ్వనితో సమానమైన ధ్వనితో సముద్రము పొంగి వెల్లువగాఁ బాఱినట్లు వానర సేన చక్కఁగాఁ దోలఁబడిన మంచి వేగముగల గుఱ్ఱపుదండు పోయినట్లు రామచంద్రమూర్తి ప్రక్కల నడచెను.

క. వానరసమూహ్యమానులు, మానవపతితనయు లపుడు • మహితగ్రహయు
క్తానంతరత్నమిహికా, భానులగతిఁ బొలిచి చనిరి • ప్రాభవమారన్. ౪౮

అర్థములు. వానరసమూహ్యమానులు=వానరులచే మోచికొని పోవఁబడుచున్న వారు-మానవపతితనయులు=రాజకుమారులు=రామలక్ష్మణులు-మహిత=గొప్పవగు-గ్రహయుక్త=గ్రహముతోఁ గూడిన-అనంతరత్న=సూర్యుని -మిహికాభాను = చంద్రుని - గతిన్ = విధముగ - ప్రాభవము = అతిశయము.

తాత్పర్యము

హనుమదంగదులచే మోచికొనిపోవఁబడుచున్న రామలక్ష్మణులు గురుశుక్రులతోఁ గూడిన సూర్యచంద్రులవలెఁ బోయిరి.

ఇందు నాలుగు గ్రహముల కూటమి యుపమాన విధముగఁ జెప్పఁబడెను. ఇది లంక కనిష్టము సూచించును. కావున నిట నలంకారముచేత నొక వస్తువునకు ధ్వని. గ్రహయుక్తయను నుపమాన సాదృశ్యము చేత రామలక్ష్మణులు వేంచేయుటయందు హనుమదంగదులకుఁ గల లాఘవాతిశయము సూచితము. కావున పదప్రతిపాద్యవస్తువుచేత వస్త్వంతరధ్వని.

—• లక్ష్మణుఁడు శుభశకునముల శ్రీరామునితోఁ జెప్పుట •—

శా. తారేయాంసగతుండు లక్ష్మణుఁడు సీ• తానాథుతోఁ బల్కె న
న్నా! రక్షోధిపుఁ జంపి తద్ధృతసతిన్ • వైదేహినిం గ్రమ్మఱన్
జేరం గల్గుదు నీవు నిక్క మిది కం • టే కార్యసిద్ధ్యర్థమై
యారం దోఁచెడి సన్నిమిత్తముల భూ • మ్యాకాశ దేశంబులన్. ౪౯

అర్థములు. తారేయాంసగతుండు=అంగదుని భుజములపై నున్నవాఁడు, తత్ + హృతసతిన్=ఆ రావణునిచే నపహరింపఁబడిన భార్యను, కార్యసిద్ధి+అర్థమై=కార్యమనుకూలముగ ఫలించుకొఱకు, సన్నిమిత్తములు = శుభశకునములు.

తాత్పర్యము

అంగదుని భుజములమీఁద గూర్చుండిన లక్ష్మణునకు రామచంద్రమూర్తి తో నిట్లనియె. అన్నా ! రావణునిచే నపహరింపఁబడిన సీతాదేవిని మరల నీవు తీసికొని రాఁగలవు. ఇది నిజము. భూమియందు నాకాశమందుఁ గానవచ్చు శుభశకునములు కార్యసిద్ధి తెలుపుచున్నవి చూచితివా.

నాలవ పాదంబున అనుస్వార సంబంధయతి.

"గీ. ఆది పూర్ణయుతములై టతవర్గాక్షరములు తుదను గలుగు వ్రాలు దక్కఁ బొసఁగు నొకటి కొకటి భువి ననుస్వారసం। బంధ యతులునాఁ బ్రబంధ ములను" అప్పకవి. ఉదా॥ "పెక్కు చం। దాలంబందు నొకప్పుడుం దఱుగ దింటం బాఁడియుం బంటయున్" మనుచరిత్రము. "మ. దవధూమంపు) తమంబులోఁ దమరస ద్రవ్యంబు పంకేజబాం।ధవ భానుప్రతతుల్ హరింపఁ గుయి వెంటన్ వెళ్ళ" అనునది సాధు పాఠము-కుయివెట్ట న్వెళ్ళునది యపపాఠము- రెండు చోటుల ననుస్వారసంబంధము లేదు. అనుస్వారసంబంధము రెండుచోటుల నుండి ననే యనుస్వారమునకు ననుస్వారమునకు యతి చెల్లును. నకార టకారములకుఁ గాని దకార టకారములకుఁగాని యతి మైత్రిలేదు. "బాన్ధవ భానుప్రతతుల్ హరింపఁ గుయివెట్టన్" అనుచోననుస్వారసంబంధము గలదుగాని 'బాన్ధవ భాను ప్రతతుల్ హరింపఁ గుయివెట్టన్'అనిన నట్టి సంబంధము లేదు కావున నిది దుష్టము.

సీ. అనుకూలవాయువుల్ ♦ మన సైన్యములమీఁద
            మృదుహితసుఖములై ♦ మెలఁగఁ దొడఁగెఁ
    బరుషేతరారావ♦భాసమానంబులై
            మృగపక్షితతు లెల్లు ♦ లిడఁగఁ గడఁగె
    నన్నిదిక్కులు సుప్ర♦సన్నంబులై యొప్పె
            విమలుఁడై భానుండు ♦ వెలుఁగువాఁడు
    బ్రహ్మరాశి విశుద్ధ♦భార్గవుం డనుగతుఁ
            డై యున్నవాఁడు ♦ మహర్షి వరులు
తే. ధ్రువుని వలగొనుచున్నారు ♦ తోయజాక్ష !
    మనకుఁ బ్రపితామహుఁడు ని♦ర్మలనృపర్షి
    సహపురోహితుఁ డగుచుఁ ద్రి♦శంకుఁ డదిగొ
    మింట వెలుఁగుచు నున్నాఁడు ♦ మేలిరుచుల. ౬౦

అర్థములు. అనుకూలవాయువుల్=మనకు వెనుకనుండి వీచుచు మనవెంట వచ్చు వాయువు, మృదు హితసుఖములు=మెల్లగాను,హితముగాను, సుఖముకలిగించునవిగాను, ప్రయాణమున నెదురుగాలి యోరుగాలి దుమ్ముతోడిగాలి యపశకున

ములు, పరుషేతర=కఠినముగ లేక, వినని౦పైన ఆరావ=ధ్వనులచే, భాసమానంబులై=ప్రకాశించునవియై, ఎలుఁగులు=ధ్వనులు, సుప్రసన్నంబులై = మిగులనిర్మలములై మబ్బులుగాని యెఱ్ఱని కాంతులుగాని లేనివై, స్వచ్ఛములై, బ్రహ్మరాశి= వేదములకుప్ప, సూర్యుఁడు. "కర్మసాక్షీ జగచ్చక్షు రంశుమాలీ త్రయీతనుః" అని నిఘంటువు, వేదములు శరీరముగాఁ గలవాఁడనఁగా వేదముల నన్నిటిని బూర్ణముగ నధ్యయనము చేసినవాఁడని భావము. విశుద్ధభార్గవుఁడు=దుష్టగ్రహసంబంధములేని శుక్రుఁడు, అనుగతుఁడు=కూడవచ్చువాఁడు. శుక్రున కెదురుగాఁబోవుట యపశకునము, చుక్క కెదురుపోరాదు. "ప్రతిశుక్రం ప్రతిబుధం, ప్రతిభౌమం గతో నృపః। అపి శక్రేణ సదృశో హతసైన్యో నివర్తతే" శుక్రున కెదురుగా బుధున కెదురుగా అంగారకున కెదురుగఁ బోయెనేని నింద్రునంతవాఁడైనను రాజు,చంపబడిన సేనలు గలవాఁడై వెనుకకు మరలును-దక్షిణముగఁబోవువారికి చుక్కెదురను ప్రసక్తి లేదు గావున శుక్రుఁ డనుగతుఁ డనఁగా శుక్రమాధ్యము లేదని భావ మని తీర్థీయము.

విశుద్ధభార్గవుం డనుగతుఁడై యున్నాఁ డనుటచేత - రాముని యవతార కాలమున జాతకఫలసూచనమువలె దండయాత్రాకాలమున గోచారఫలము రాక్షసుల విపరీతఫలమును సూచితములు-రాముఁడు కిష్కింధకు నాగ్నేయముగా నున్న లంకకుఁ బ్రయాణమైపోవుచున్నాడు. అప్పుడు శుక్రుఁ డనుకూలుఁ డనియు వెనుక నున్నాఁడనియుఁ జెప్పఁబడెను. శుక్రుఁడు తఱుచుగా సూర్యుఁడున్న రాశికి ముందు రాశిలో నుండును. రాముఁడు బయలుదేరినది ఫాల్గునపూర్ణిమ యని ముందే చెప్పఁబడెను. అప్పుడు సూర్యుఁడు మీనరాశియం దుండుటచేత శుక్రుఁడు మేషరాశియం దున్నాఁడని తెలియుచున్నది. రాముని జన్మరాశి కర్కాటకము - దానికిఁ బదవరాశియైన మేషమున శుక్రుఁ డుండుట రామున కనుకూలము-వెనుక శుక్రుఁ డుండుట చేతను ననుకూలుఁడే. ఇందుకు శుక్రానుకూల్యము చెప్పుటచేత బృహస్పత్యాద్యానుకూల్యమును సూచితము, బృహస్పతి శ్రీరాములవారి జన్మకాలమున కటకరాశియం దుండెను. ఇతని కొక్కొక్క రాశియం దొక్కొక్క సంవత్సరము వాసము కాన, బండ్రెండేండ్లకుఁ బండ్రెండు రాసులను జుట్టివచ్చును. అట్లు మూఁడు తడవలు చుట్టి రాఁగా ముప్పదియాఱేండ్లు గడచినవి. ముప్పది యెనిమిదవయేఁట రాముని దండయాత్ర. ఆయేఁట బృహస్పతి రామరాశి ద్వితీయరాశియైన సింహమున నున్నాఁడు. గురువు రెండవయింటనుండుట యనుకూలము. రామజన్మకాలమున శని తులావర్గోత్తమమున నుండెను. శనికి రెండున్నర యేండ్లొక రాశియందు వాసము. తులనుండి పండ్రెండు రాసులు చుట్టివచ్చుటకు ముప్పది సంవత్సరములు గడచినవి. ముప్పది రెండున్నరదాఁక తులలోను ఆపై రెండున్నర వృశ్చికములోను ఆపై రెండున్నది ధనుస్సులోను నుండి యాపై అనఁగా ముప్పది యేఁడున్నర యేండ్లయిన తరువాత మకరమునకుఁ బోవలసినది ప్రాప్తము శ్యున వక్రతాదులచేత ధనుస్సులోనే

యున్నాఁడని యెంచునది. రాహువు రామావతారకాలములో సింహరాశిలో నుండెను. రాహువునకుఁ బ్రతిరాశిలోను నొకటిన్నర సంవత్సరము వాసము. అప్రదక్షిణ సంచారము - అందుండి ముప్పదియెనిమిదవయేఁటఁ గటకరాశిలో నుండవలసినది ప్రాప్తమయ్యును అతిచారాదులచే మిథునరాశిలో నున్నాఁడని నిశ్చయించునది-రాహువునకు నేడవయింట కేతువాసము. కాననిపుడు ధనుస్సునఁ గేతువున్నాఁడు- నైరృత దైవత నక్షత్రమగు మూల దుమగతికేతుచే ధూపితం బని యీ ప్రకరణమునను జెప్పఁబడియున్నది. దుమగతికేతుచే - ధూమకేతువు = ధూమాకారమైన కేతువు-ధనుస్సున శనికేతువులున్నారు. ధనుస్సు కర్కాటకరాశి కాఱవది-అందున్న శనికేతువులు రామున కనుకూలురు-రామరావణ యుద్ధ ప్రస్తావమున "ఆక్రమ్యాంగారక స్తస్థౌ విశాఖే అపిచాంబరే" యని యున్నది. ఈ వాక్యప్రకార మపుడు అంగారకుఁడు విశాఖాచతుర్థపాదమైన వృశ్చికరాశియం దున్నాఁడు. అది కటకమునకు నైదవ రాశి- ఇల్లైదవ యింట నంగారకుఁ డున్నం దున రామునికిఁ జెడు ఫలము బ్రహ్మాస్త్రబంధాదులు- బుధుఁడు రామునికిఁ బదవ రాశియం దున్నాఁడు. కాన ననుకూలుఁడు, చంద్రుఁ డుత్తరఫల్గునితోఁ జేరి యున్నాఁడు కానఁ గన్యారాశియం దుండినట్లు. అప్పటికిఁ దృతీయచంద్రుఁడు కాన రాముని కనుకూలుఁడు. మీనమునం దున్న సూర్యుఁడు కటకమునకుఁ దొమ్మిదవ యింటివాఁ డగుచున్నాఁడు. కాన ననుకూలుఁడు. మిథునములోనున్న రాహువు కటకమునకుఁ బండ్రెండవ యింటివాఁ డగుచున్నాఁడు. కాన రామునికిఁ గొంచెము బాధాకరుఁడు. ఇట్లు రాముని కనుకూలమైన గోచారఫలము నూహించునది. ఈ గోచారము జన్మరాశిని బట్టి చూచియున్నది. చంద్రరాశిని బట్టి చూడలేదు. ఇట్లే యీ గోచారము రాక్షసులకు విపరీత ఫల మయినదిగా నున్నది. రాక్షసుల నక్షత్రము మూల, దానికి సంబంధించినది ధనూరాశి, ఇదే రాక్షసుల రాశి, దీని కైదవయింట నున్న శుక్రుఁడు ప్రతికూలుఁడు. జన్మరాశి యైన ధనుస్సులో నున్న శని కేతువులు ప్రతికూలురు. దాని కేడవ యింటనున్న రాహువు కొంచె మనుకూలుఁడు, పండ్రెండవ యింట నున్న యంగారకుఁడు ప్రతికూలుఁడు. తొమ్మిదవ యింట నున్న గురువు అనుకూలుఁడు. నాలవ యింట నున్న సూర్యుఁడు అయిదవయింట నున్న బుధుఁడును అనుకూలురు గారు. పదవ యింట చంద్రుఁడు కొంచె మనుకూలుఁడు, ఇందుఁ గొంచె మనుకూలముగా నున్నను విశేషభాగము ప్రతికూలముగా నున్నది. కాన రాక్షసులకీ గోచారము విపరీత ఫలమునే యిచ్చును.

అర్థములు. మహర్షివరులు = సప్తర్షులు, ధ్రువునిన్ = ధ్రువస్థానమును, వలగొనుచున్నారు=ప్రదక్షిణించుచున్నారు, మనకున్ = ఇక్ష్వాకులకు, ప్రపితామహుండు = కూటస్థుఁడు, నృప + ఋషి= రాజఋషి, త్రిశంకుఁడు=(౧) సహా

పురోహితుఁడు=విశ్వామిత్రునితోఁ గూడినవాఁడు (-౨)సృజన్ దక్షిణమార్గస్థాన్ సప్తర్షీ నపరా న్స్రప యని బాలకాండమునఁ జెప్పినట్లు విశ్వామిత్రసృష్టిలోని సప్తర్షి మండలములోఁ జేరిన వసిష్ఠునితోఁ గూడినవాఁడు.

తా త్ప ర్య ము

అన్నా! యనుకూల వాయువులు మన సేనలమీఁద మృదువుగాను హితముగాను సుఖకరముగా మెల్లగాను వీచుచున్నవి. విన నింపైన ధ్వనులతో మృగములు పక్షులు ధ్వనించుచున్నవి. దిక్కులన్నియుఁ బ్రసన్నములై యున్నవి. సూర్యుఁడు నిర్మలుఁడై ప్రకాశించుచున్నాఁడు. వేదమూర్తియగు సూర్యుఁడు దుష్టగ్రహ సంగతి లేని శుక్రునిగూడి మనకనుకూలుఁడై యున్నవాఁడు. సప్తర్షులు ధ్రువుని ప్రదక్షిణించుచున్నారు. మన వంశకూటస్థ పురుషుఁడు త్రిశంకుం డిచ్చటి సప్తర్షి మండలములోని వసిష్ఠునితో నాకాశమునఁ బ్రకాశించుచున్నాఁడు.

క. మనయిక్ష్వాకుల తారకఁ, గనుము విశాఖను వెలింగెఁ ♦ గడువిశదం బై
తనరి నిరుపద్రవంబుగ, మనశత్రుల కివి రహించు ♦ మార్గము వినుమా. ౭౧

తా త్ప ర్య ము

మన యిక్ష్వాకువంశతార విశాఖ. అది యెట్లు నిర్మలముగ నుపద్రవము లేక ప్రకాశించుచున్నది చూడుము. ఇఁక నీ గ్రహములు మనశత్రువుల కుండు విధముఁ జెప్పెదను.

విశాఖ యిక్ష్వాకుల నక్షత్ర మని జ్యోతిషదర్పణంబునఁగలదు. నిరుపద్రవ మనఁగా నంగారకాది క్రూర గ్రహసంబంధము లేక యుండుట.

సీ. నైరృతదైవత♦నక్షత్ర మగు మూల, దుమగతికేతుచే ♦ ధూపితంబు
గావుట రాక్షస♦కాండంబులకుఁ జేటు, దెల్పుచున్నది యెన్ని♦తెఱఁగు లరయ
వారికి నాశంబు ♦ చేరువ నున్నది, మృత్యుగృహీతుల♦రిక్క మరణ
కాలంబుఁ దెలుపుచు♦గ్రహపీడితం బగు, నం ద్రిప్పు డది నైరు♦లందుఁ గలిగె
ఆ. నీరు నిర్మలంబు♦నీరజాకరముల, వనము లెల్లఁ బుష్ప♦వంతములును
గమ్మఁదావి మొలసెఁ♦ఘుమ్మని యెల్లెడ, భూజతతి యథర్తు♦పుష్పయుతము. ౭౨

అర్థములు. నైరృత దైవత నక్షత్రము = రాక్షసులకు దేవత యగు నక్షత్రము, మూల = మూలానక్షత్రము, దుమగతికేతువుచే = ధూమకేతువుచే - ధూపితంబు = తపింపఁ జేయఁబడుచున్నది, 'ధూప సంతాపే' యని ధాతువు, కాండంబులకు=సమూహములకు, మృత్యుగృహీతుల రిక్క = మృత్యుదేవతచేఁ బట్టుపడినవారి నక్షత్రము, యథర్తు = యథాఋతు–ఋతుయోగ్యమైన, పుష్పయుతము = పూలతోఁ గూడియున్నది.

తా త్ప ర్య ము

రాక్షసుల నక్ష త్రము మూల, దానిని ధూమకేతువు పీడించుచున్నది. ఎన్ని విధముల నాలోచించినను ఆ నక్షత్రము వారికిఁ జేటు తెలుపుచున్నది వారు.

నాశమైపోవు కాలము సమీపించినది. మరణము సమీపించినవారి నక్షత్రము క్రూరగ్రహములచే బీడితమై మరణకాలము దెలుపునని శాస్త్రజ్ఞులు చెప్పుదురు. అట్టి చిహ్నములు వైరులందుఁ గానవచ్చుచున్నవి. మన మార్గమున సరస్సులందు నీళ్ళు నిర్మలములుగా నున్నవి. అడవులన్నియుఁ బూచియున్నవి. ఘుమ్మని కమ్మని వాసనలే కొట్టుచున్నవి. ఈ ఋతువునఁ బూచవలసిన చెట్లు పూచియున్నవి. దోహదాది క్రియలు లేక నిష్కారణముగ నొక ఋతువునందుఁ బూచవలసిన చెట్లు మఱియొక ఋతువునఁ బూచెనేని యుత్పాతము.

ఆ. తారకామయాఖ్య◆దారుణరణమున, దేవసేనపోలె ◆ దేవ వెలుఁగు
చున్నయదియు వాన◆రోగ్రవీరులసేన, జయము నిజము మనకు ◆ శంకవలదు.

అర్థములు. తారకామయాఖ్య = తారకామయ మను పేరుగల, దారుణ రణమునన్=భయంకర యుద్ధమందు, తారక+ఆమయ = (౧) తారకుని వధము గలదని, ఆఖ్య = పేరుగల (౨) తారకా+ఆమయ = బృహస్పతి భార్య యను తార మనోవ్యాధియే కారణముగాఁ గలది. బృహస్పతి భార్య యగు తారను చంద్రుఁడు హరించెను ఎవరు చెప్పినను మరల నిచ్చినవాఁడు కాఁడు. బృహస్పతి యింద్రునితోఁ జెప్పెను. ఆయన బృహస్పతి పక్షమునఁ జంద్రునిపై యుద్ధమునకు వెడలెను. బృహస్పతి తండ్రియగు అంగిరసుని వలన విద్య నేర్చినవాఁడగుటచే గురుపుత్రు పక్షమున రుద్రుఁడును యుద్ధమునకుఁ బూనుకొనెను. చంద్రుని పక్షమున శుక్రుఁడు జంభకుంభాది సకల దైత్యదానవ సమూహముతో సహాయపడెను. రెండు పక్షముల వారికి నఘోరయుద్ధము జరిగెను. ఈ యుద్ధము తారానిమిత్తమైనది కావున తారకామయ మను పేరు గలిగెను. “ఏవంచ తయో రతీవోగ్ర స్సంగ్రామ స్తారానిమిత్తం తారకామయో నామాభవత్” అని విష్ణుపురాణమున చతుర్థాంశమున ఆఱవ యధ్యాయ మందుఁగలదు. ఇది పౌరాణిక గాథ.

భూమియందు భూకంపన-మహావాయుప్రచారణములచే నెట్లుత్పాతములు పుట్టియున్న ద్వీపములు దేశములు పోవుట క్రొత్తవి వచ్చుట యెట్లుగలవో యట్లే యాకాశ మండలమున నెప్పుడైన మహోత్పాతములు గలుగుచుండును. అప్పు డంతరాళమునఁ దిరుగు నల్పగ్రహములు వాయుప్రేరితములై వానివాని స్థానములు విడిచి మఱియొకచోటికిఁ గొట్టుకొనిపోవుటకలదు. అట్లొకసారి యుత్పాతమున బృహస్పతిచుట్టు తిరుగు నుపనక్షత్రమొకటి (తార=నక్షత్రము) గాలికి కొట్టుకొని పోయి చంద్రుని జుట్టి తిరుగుచుండెను, ఆవల మఱియొక యుత్పాత సమయమున మరలవచ్చి బృహస్పతి చుట్టు తిరుగ నారంభించెను. ఈ జ్యోతిశ్శాస్త్ర విషయమును పౌరాణికు లీ విధముగ వర్ణించి వ్రాసిరి. ఆ మహోత్పాతములో జరగిన గందరగోళము తారకామయ మనఁబడెను. అనఁగా నక్షత్రములందు జరగిన యల్లకల్లోల మని యర్థము.

తా త్ప ర్య ము

తారకామయ మను భయంకర యుద్ధమునందు దేవసేనవలె మనసేన ప్రకాశించుచున్నది. కావున మనకు నిస్సందేహముగా జయము గలదు.

క. అని శకునంబులఁ దెలుపుచుఁ, దనయగ్రజు మనము ముదము • నగుల సుమిత్రా
తనయుఁడు పలికిన రాముఁడు, విని సంతస మంది సేన • వే నడిపించెన్. ౨౪

తా త్ప ర్య ము

ఈ ప్రకారము శకునములఁ దెలుపుచు నన్నకు లక్ష్మణుఁడు సంతోషము గలిగింపఁ జెప్పుచుండ రామచంద్రమూర్తియు సేనను త్వరగా నడిపించెను.

—• కపిసేనలు ప్రయాణమై పోవుట •—

చ. జలధరసంఘ మంబరము • ఛాదితముం బొనరించు మాడ్కి న
బ్బలిముఖచక్రముల్ సవన • పర్వతదక్షిణదిక్కు గప్పగాఁ
బలితపుఁ దత్కరాంఘ్రిహతిఁ • బాయక లేచి ధరాపరాగముల్
జలజహితద్యుతుల్ సమయ • సర్వజగంబును గ్రమ్మె నొక్కటన్. ౨౫

అర్థములు. జలధర సంఘము = మబ్బులగుంపు, అంబరమున్ = ఆకాశమును, ఛాదితమున్ = మఱుఁగుపడినదిగా, బలిముఖచక్రముల్ = వానర సేనలు, సవన పర్వత దక్షిణదిక్కు=అడవులతోఁ గొండలతోఁ గూడిన దక్షిణదిక్కును, తత్ = ఆ వానరులయొక్క, కరాంఘ్రిహతిన్ = చేతుల కాళ్ళదెబ్బలచే, ధరాపరాగముల్=నేలదుమ్ములు, జలజహితద్యుతుల్=సూర్యకాంతులు, సమయన్ = చెడిపోవునట్లు.

౨౦వ పద్యము రాత్రివర్ణనము- ఇది పగటి వర్ణనము. ఇది ఫాల్గున బహుళ ప్రతిపత్తు పగలని తెలియవలయును.

తా త్ప ర్య ము

మబ్బు లాకాశమును మఱుఁగు పఱుచునట్లు వానరసేనలు అడవులు కొండలతో నిండిన దక్షిణదిక్కును గప్పఁగా వారి కాలుసేతుల దెబ్బలకు రేఁగిన దుమ్ము సూర్య ప్రకాశము సమయునట్లు లోకము నంతయు లోఁగొనెను.

క. విడువక శాఖామృగముల దడమును తరియించుకతనఁ • దటినులు వంకల్
పెడమరలి పాఱెఁ బెక్కు,మడ లెప్పటి యట్ల పోవ • మార్గము లేమిన్. ౨౬

అర్థములు. దడములు=దళములు = సేనలు - తటినులు = ఏళ్ళు - పెడమరలి = వెనుకకుఁ దిరిగి.

తా త్ప ర్య ము

గుంపుగా వానరసేనలు విడువక యొకటి వెంట నొకటి దాఁటుచున్న కారణమున నేళ్ళు వంకలు యథాప్రకారము పాఱుటకు సాధ్యముగాని కారణమున పెక్కుమడ లెదురెక్కి పాఱెను.

చ. విమలసరోవరంబులను ♦ వృక్షచయావృతపర్వతంబులన్
సమతల భూప్రదేశములఁ ♦ జారుఫలాన్విత సద్వనంబులన్
క్రమమున నడ్మ నెల్ల యెడఁ ♦ గ్రచ్ఛఱ నడ్డముగాఁగఁ గ్రిందుగా
సమద వలీముఖప్రముఖ ♦ సైన్యసమూహము లావరించుచున్. ౨౨

అర్థములు. వృక్షచయ = చెట్లగుంపులచే, ఆవృత = క్రమ్మఁకోఁబడిన, చారు=మనోహరములైన, ఫల = పండ్లచే, అన్విత = కూడిన, సద్వనంబులన్ = మంచియడవులను, నడ్మ = నడుమ, సమద = గర్వముతోఁ గూడిన, వలీముఖ = వానరుల.

తాత్పర్యము

వానర ప్రముఖుల సేనాసమూహములు నిర్మలమైన సరోవరంబులందుఁ జల్లని నీరుండుటచే నడుమ నావరించెను. చెట్లతో నిండిన పర్వతంబులను చెట్లడ్డముగా నుండుటచే నడ్డముగా నావరించెను. సమముగా నుండు నేలలయందు సర్వత్ర యావరించెను. మనోహరములైన పండ్లతో గూడిన వనంబులందు పండ్ల నిమిత్తమై చెట్లక్రిందుగా నావరించెను.

చ. చనెఁ జనె వాయువేగమున ♦ సమ్మదవీర్య బలాతిరేకముల్
గనబడ యౌవనోద్ధతివి♦లాసపరాక్రమరీతి గర్జలన్
నినుచుచు నందుఁ గొందఱు వ♦నేచరనాథులు కిల్కిలార్భట
స్వనముల నొప్ప, గంతులను ♦ వైచిరి కొందఱు రంతు సేయుచున్. ౨౪

అర్థములు. చనెన్ చనెన్ = దీర్ఘప్రయాణము గావున ద్విరుక్తి, దీనికిఁ గర్తృపదము పూర్వపద్యము నందలి సైన్య సమూహములు, సమ్మద, వీర్య, బల, అతిరేకముల్ = వారి వారి సంతోషము, వీర్యము, బలము వీని యతిశయము, యౌవనోద్ధతి = వయస్సుయొక్క గర్వము, విలాసము=పరాక్రమము, రీతిన్ = తగినట్లు నినుచుచున్=నింపించుచు.

తాత్పర్యము

ఆ సేనలందు వానరులు వారి వారి సంతోషము పరాక్రమము బలము యొక్క యతిశయము గనఁబడునట్లు, యౌవనము వలనఁ గలిగిన గర్వము, విలాసము,పరాక్రమమునకుఁ దగినట్లు సింహనాదములచే దిక్కులు నింపించిరి, కొందఱు వానర శ్రేష్ఠులు కిల కిల మని కిలారించిరి. కొందఱు ధ్వనిచేయుచు గంతులు వైచిరి.

సీ. తన్మస్థలి తోఁకలు ♦ జాడించికొట్టుచు, ధరణి గ్రక్కదలఁ బా♦దముల నిడుచుఁ
గొండల నెక్కుచుఁ ♦ గుప్పించి దాఁటుచు,భూజముల్ విఱుచుచు♦బొబ్బలిడుచు
నూరువేగంబునఁ ♦ జాదుల తాపాళి, నలియఁ జేయుచును వా♦నరబలంబు
నూఱులు వేలును ♦ నూఱువేలును గోట్లు, కొలదిఁగా ధారణిఁ ♦ గలయఁ బర్వి

తే. కేయుఁబగలును నడిచె సు♦గ్రీవరక్ష, నిలువ కెడ నెడ హర్షంబు♦దలకొనంగ
నెప్పుడెప్పుడు రాముని♦యిగురుఁబోణిఁ,బంది దొలఁగింత మను తమి♦సందడింప.

అర్థములు. క్రక్కదలు=కదలు+కదలు = మిక్కిలికదలు, భూజముల్ = చెట్లు, ఎడనెడ నిలువక = నడుమ నడుమ నిలువక, బంది = నిర్బంధము, చెఱ; తమిన్ = కోరికతో.

తాత్పర్యము

స్పష్టము.

చ నిలువక పోయి పోయి యవ♦నీరుహసంకటముక్ మృగావళీ
కలితము లైన సహ్య మను♦క్ష్మాధరమున్ మలయావనీధ్రమున్
బలితపుఁగాననంబులఁ బ్ర♦వాహములం గనుఁగొంచు నేగుచో
వలిముఖభంజితంబు లయి ♦ వ్రాలెఁ గరంబు తమాలసంతతుల్. ౪౦

అర్థములు. అవనీరుహ సంకటమున్ = చెట్లతో నిండినది, మృగావళీకలితము=మృగముల గుంపులుగలది, వలిముఖ=వానరులచే, భంజితంబులు=విఱువఁబడినవి – తమాలసంతతుల్=కానుగుల గుంపులు.

తాత్పర్యము

ఇట్లు లోకరాత్రిరి, యొక పగలు విడువక ప్రయాణము చేసిచేసి చెట్లచే నిండి మృగముల గుంపులు గల సహ్యము మలయము నను పర్వతములను బలిష్ఠము లైన యడవులను, ప్రవాహములను జూచుచుఁ బోవునపుడు వానరులు కానుగు చెట్లు విఱిచివైచిరి.

క. త్రుంచుచు నూడుగులన్ భం,జించుచు మావులను జువ్వి♦చెట్లను దెగ ఖం
డించుచుఁ బొగడల నేరెడు, లించుక భయ మేది వనచ♦రేశ్వరు లరుగన్. ౪౧

తాత్పర్యము

త్రోవ కడ్డమువచ్చిన యూడుగు చెట్లను, మామిడిచెట్లను, జువ్వి, పొగడ, నేరేడుచెట్లను గూలఁద్రోయుచు విఱచుచు వానరులు భయములేక పయనించిరి.

క. కానన భూరుహవారము, వానరతతిమీఁద వాయు♦వశ చలితం బై
మానితసుగంధబంధుర, సూనవితానములు గురిసె ♦ సొబగారంగన్. ౪౨

అర్థములు. కానన భూరుహవారము=అడవులందలి చెట్లసమూహములు, వాయువశ చలితంబై = గాలి కారణముగఁ గదలినవై, మానిత సుగంధబంధుర సూనవితానములు=గౌరవింపఁ దగిన పరిమళముచే మనోహరములైన పూలగుంపులను – సొబగు=అందము.

తాత్పర్యము

వానరులు చెట్లక్రిందఁ బోవునపుడు అడవులలోని చెట్లు గాలికిఁ గదలి మంచి పరిమళము గల పూవులను వారిపైఁ గురిసెను.

క. చందనశీతలుఁ డగుచును, నిందిందిరబృందగాన • మెసఁగఁగ వీచెన్
మందత సుఖసంస్పర్శుఁడు, సుందరసామోదవనుల • శుభపవనుండున్. ౭౩

అర్థములు. చందనశీతలుఁడు = చందనమువలెఁ జల్లనివాఁడు, ఇందిందిర బృందగానము=తుమ్మెదలగుంపుల ఝుంకార మనెడి పాటలు, మందత= మెల్లగా, సుఖ సంస్పర్శుఁడు=సుఖము కలుగునట్లు తాఁకువాఁడు, సుందర=అందములయిన, సామోద = వాసనతోఁగూడిన, వనులన్=అడవులందు - శుభపవనుఁడు = శుభ సూచకముగ వాయువు.

తాత్పర్యము

చందనమువలెఁ జల్లనివాఁడై తుమ్మెదల ఝుంకార మనెడి పాటలు పాడుచు, మెల్లగా సుఖముగఁ దాఁకుచు శుభసూచకముగ వాయువు అందమై పరిమళముతోఁ గూడిన యడవులందు వీచెను.

క. వాతమహారయఘట్టిత, ధాతుప్రసృతము రజోవి • తానముచే న
త్యాతతగతి శైలము ప్రస్ఫీతవలీముఖవరేణ్య • సేనం గప్పెన్. ౭౪

అర్థములు. వాత = వాయువుయొక్క, మహారయ = మిగుల వేగము చేత, ఘట్టిత=ఎగురఁగొట్టఁబడిన, ధాతు=ధాతువులనుండి, ప్రసృతము = బయలు దేఱిన, రజోవితానముచే=పొడి సమూహముచే, అత్యాయతగతి = విస్తారముగ, ప్రస్ఫీత=మిగుల విస్తారమైన, వలీముఖవరేణ్య=వానరశ్రేష్ఠుల, సేనన్=దండును.

తాత్పర్యము

వాయువుయొక్క మహావేగముచేఁ గొట్టఁబడి ధాతువుల నుండి లేచిన పొడిచే పర్వతము విస్తారవానర సేనను నధికముగఁ గప్పెను. పూర్వపద్యమునందు గానము చెప్పఁబడెను. ఇందు గందపొడి చల్లుట చెప్పఁబడెను. ఇవి శుభసూచకములు.

క. వికసించి యుండె గిరిఁ గేతకపద్మక తినిశ వరణ • ధవ పాటలచూ
తకకోవిదార రథ కురువక చూర్ణక సిందువార • వకుళాదితరుల్. ౭౫

అర్థములు. గిరిన్ = సహ్యపర్వతమునందు - కేతక = మొగలి, పద్మక= మెట్టదామరులు - (౨) సువాసనగల పూవుల చెట్లు-వరణ=ఉలిమిరిచెట్టుఁ ధవ= చంద్రచెట్లు - పాటల=పాదిరిచెట్లు, చూతక - మామిడిచెట్లు-కోవిదార=కాంచన చెట్లు - రథ = ప్రబ్బలిచెట్లు, కురువక=ఎఱ్ఱగోరింటచెట్లు, చూర్ణక=ఉసిరికచెట్లు, సిందువార = వావిలిచెట్లు, వకుళ = పొగడలు, ఆది = ఇవి మొదలుగా, తరులు = చెట్లు.

తాత్పర్యము

ఆ సహ్యపర్వతమందు మొగలి మొదలగు చెట్లు వికసించి యుండెను.

క. గంతు లిడుచుఁ జను వానర, కాంతుల రాయిడిని వివిధ • కాననతరువుల్
కాంతులు చెడి వ్యాకులతా, వంతములై యుండె శైల • వర్గమువీఁదన్. ౭౬

తాత్పర్యము

గంతులు పెట్టుచు పోవుచున్న వానరశ్రేష్ఠుల రాపిడి వలనఁ గలిగిన బాధచే నానావిధములైన యడవిచెట్లు కాంతి మాసి చెదరినవై కొండలమీఁద నొప్పు చుండెను.

సీ. పర్వతమ్ములఁ నున్న • బావులు గుంటలు, శీతలజలసము • పేత మగుచుఁ
జక్రకారండవ•సంసేవితంబులై, చెలువార శార్దూల•సింహఋక్ష
చిత్రకాయలులాయ•పోత్రిచయంబులు, సర్వత్ర నయనగో•చరము లయ్యెఁ
బద్మసౌగంధికో•త్పలకైరవంబుల, కొలఁకు లచ్చోటను•గలుకు లయ్యె

తే. శైలసానుతలంబుల • శ్రావ్యముగను, విహగకూజితములు చాల•బహుళ మయ్యె
నట్టితలముల డాసి వ•నౌకసములు, తనివి తీరఁగ విహరించె•మనముకొలఁది. ౧౭

అర్థములు. శీతలజలసము పేతము = చల్లని నీటితోఁ గూడినది, చక్రకారండవ = చక్రవాక పక్షులచేతను నీటికోళ్ళ చేతను, సంసేవితంబులై=సేవింపఁబడినవై, శార్దూల=పులులయు, సింహ = సింగములయు, ఋక్ష=ఎలుఁగులయు, చిత్రకాయ = చిరుతలయు, లులాయ=అడవి దున్నలయు, పోత్రి = పందులయు, చయంబులన్ = సమూహములు - సర్వత్ర = అన్ని ప్రదేశములందు - నయన గోచరములయ్యెన్ ==కన్నులకుఁ గానవచ్చెను. పద్మ=తామరలు - సౌగంధిక= ఎఱ్ఱకలువలు - ఉత్పల = నల్లకలువలు - కైరవ=తెల్లకలువలు - కొలఁకులు = సరస్సులు-కలుకులు = ఒప్పిదము కలవి - శైలసానుతలంబులన్ = పర్వతముల చఱులయందు, శ్రావ్యముగను = వినుట కింపై - విహగకూజితములు = పక్షుల కూఁతలు - వనౌకసములు=క్రోఁతులు.

తాత్పర్యము

కొండలయందున్న బావులు గుంటలు చల్లనినీళ్ళ చక్రవాకములు నీటికోళ్ళు కలవై యుండెను. ఎక్కడఁ జూచినను పులులు సింహములు ఎలుఁగులు చిఱుతలు దున్నలు పందులు కానవచ్చుచుండెను. తామరలు - ఎఱ్ఱని - నల్లని - తెల్లని కలువలు గలిగి సరస్సు లందంబులై యుండెను. కొండచఱులయందు పక్షులు విననింపుగ విశేషముగఁ గూయుచుండెను. అట్టి ప్రదేశములందు వానరులు తృప్తి యగునటుల విహరించిరి.

ఉ. దోసిట నీరు గ్రోలుచును • దోఁగుచు నిచ్చగఁ ద్రోవ వచ్చు నా
యాసము దీర నీళ్ళఁబడి • యాడుచు నొండొరుమీఁద నీర ము
ల్లాసముగాఁగఁ జల్లుచుఁ ద•లన్ జలమధ్యమునందు ముంచుచున్
కీసరబీతు లేక పులి • నీతతు లెక్కుచుఁ బండ్ల మెక్కుచున్. ౧౮

అర్థములు. తోఁగుచున్=మునుఁగుచు, స్నానము చేయుచు, ఇచ్చగన్=

ఇష్టము కొలఁది, కీసరబీతు=కొంచమైన భయము, పులిసి తతులు=ఇసుక దిబ్బల గుంపులు, మెక్కుచున్=తినుచు.

తాత్పర్యము

దోసిళ్ళకొలఁది నీరు త్రాగుచు, మనసార స్నానము చేయుచు, దారి నడచిన బడలిక దీర నీళ్ళలోఁబడి యీదుచు, నొకరిమీఁద నొకరు చల్లుచు, తలలు నీటిలో ముంచుచు, భయము కొంచెమైనను లేక యిసుకదిబ్బ లెక్కుచుఁ బండ్లు తినుచు.

తే. తేనియల ద్రోణమాత్ర ప్రమాణములం గ్రోలుచున్ క్షమారుహతతులన్
మానితలతలం జెఱచుచు, వానరతతి దిరిగె నేర్చి వసుధాధరముల్. ౮౯

తాత్పర్యము – స్పష్టము.

ఆ. చెట్లుచేమ లేని మెట్టలఁ గొండలు, పోవఁ దేనె లెస్స త్రావి మత్తు
కతనఁ జెట్లనీడఁ గపులు గొందఁ అరుగఁబడుచు లేచు చరుసమునను. ౯౦

తాత్పర్యము – స్పష్టము.

క. ఎచ్చటఁ జూచిన కీశసముచ్చయముల్ పరఁగ ధరణి మొగిఁ బక్వంబై
హెచ్చిన వరిపైరున మడి,యచ్చున రాజిల్లె నిబిడ మై నొటు చూడన్. ౯౧

అర్థములు. కీశసముచ్చయముల్ = క్రోఁతుల గుంపులు.

తాత్పర్యము

ఎచ్చటఁ జూచినను పింగళవర్ణము గల క్రోఁతులు వ్యాపించుటచేఁ దట్టముగఁ బండిన వరిపైరుచే వరిమడివలె భూమి కానవచ్చెను.

క. ఇంద్రనిభుఁడు రాముండు మహేంద్రధరాధరమునన్ సమేధిత మా శృం
గేంద్రము నెక్కి కమఠఝషసాంద్రము రత్నాకరంబు సందర్శించెన్. ౯౨

అర్థములు. ఇంద్రనిభుఁడు=ఇంద్రునితో సమానుఁడు, మహేంద్ర ధరాధరమునన్ = మహేంద్రపర్వతమందు, సమేధితము = ఎత్తైనది, శృంగేంద్రము = శ్రేష్ఠమైన శిఖరము, కమఠఝష సాంద్రము = తాఁబేళ్ళచేతను, చేఁపలచేతను దట్టమైనది, రత్నాకరంబున్ = సముద్రమును, సందర్శించెన్ =చూచెను.

తాత్పర్యము

ఇంద్రునితోఁ సమానుఁడైన రామచంద్రమూర్తి మహేంద్ర పర్వతమున నెత్తైన శిఖర మెక్కి తాఁబేళ్లు, చేఁపలు దండిగఁ గల సముద్రమును జూచెను.

తే. మలయసహ్యమహాశైలములఁ దరించి,యానుపూర్విగ జలధి డాయంగఁబోయి
దిగ్గి వేలావనం బెల్ల దీవరముగ, దాఁటి ధాతోపలతలముఁ దడిసి వేల. ౯౩

తాత్పర్యము

మలయపర్వతమును, సహ్యపర్వతమును దాఁటి క్రమముగ సముద్రమును సమీపించియచట హనుమంతుని మూఁపులనుండి దిగి సముద్రతీరమందుండువనము త్వరగా దాఁటి చెలియలికట్టయందు నలలచేఁ గడుగఁ బడిన ప్రదేశము సమీపించి

చెట్లకొమ్మలు తగులు నని హనుమంతుని భుజములనుండి రామచంద్రమూర్తి దిగె నని యెఱుఁగవలెను.

—♦ శ్రీరాముఁడు కపిసేనతో సముద్రతీరముఁ జేరుట ♦—

ఉ. శ్రీరఘువంశమౌళి కపి♦శేఖరుఁ గన్గొని కీశనాథ! కూ
పారము తీరముం గదియ ♦ వచ్చితి మింక నతీరమున్ సుగం
భీరము నైన దీని నొక ♦ మేలి యుపాయముచేతఁ గాక యిం
కే రహిఁ దాఁటరాదు మన♦యీ కపి సేనకు నెల్లఁ జూడుమీ. ౯౪

అర్థములు. కూపారము తీరము = సముద్రముయొక్క యొడ్డు - అతీరమున్ = రేవు లేనిది - సుగంభీరము = మిగుల లోఁతైనది - మేలి = శ్రేష్ఠమైన.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి వానరరాజా! సముద్రతీరముఁ జేరితిమి - దీనికి రేవులు లేవు. లోఁతు విస్తరించియున్నది. దీని నేదైన గొప్ప యుపాయముచేత దాఁటవలయునేకాని మఱియొక విధముగ మన వానరసేన దాఁట సాధ్యపడదు; ఆలోచింపుము.

తే. మున్న మనకెల్లఁ మది సము♦త్పన్నమైన, చింత యే యిప్డు వెండియుఁ ♦ జివురులెత్తె
జేయఁగాదగు నొక సదు♦పాయ మిప్డు కాలయాపనసేఁత యో♦గ్యంబుగాదు.

అర్థములు. సముత్పన్నము = పుట్టినది - కాలయాపనసేఁత = వ్యర్థముగాఁ గాలము గడపుట.

తాత్పర్యము

కిష్కింధలో మన కే విచారము గలిగెనో యదియే యిపుడు మరలఁ గలిగెను. ఏదైన నొక యుపాయము చేసి దీనిని దాఁట వలయును గాని వ్యర్థముగ గాలము త్రోయరాదు.

రావణాసురుఁడు హెచ్చరిక పడుటకు ముందే లంకపైఁ బడవలయుననియు, అటులు చేసిన సంధికి వచ్చు ననియు రామచంద్రమూర్తి తలంపు.

ఉ. కావున మంత్రతత్పరత ♦ కావ్యము చుమ్మ, యనుజ్ఞ నిమ్మ సు
గ్రీవ! నివేశముం గొనఁగఁ ♦ గీశచమూనిచయంబు లింద, యిం
దే వనచారి యైవఁ బని ♦ యెయ్యది యైనను గల్గు గాక దాఁ
బోవఁగ రామ సేన విడి, ♦ పోవఁగ వచ్చును శూరసత్తముల్. ౯౬

అర్థములు. మంత్రతత్పరత = ఆలోచనమం దాసక్తి గలవార మగుట, నివేశమున్ = నిలుచుటకుఁ దగినచోటు.

తాత్పర్యము

మన మీ విషయ మాలోచింపవలసి యున్నది. వానరు లందఱు నిచ్చటనే వారి వారికిఁ దగిన స్థలములందు దిగున ట్లేర్పాటుచేయుము. శూరులగు నాయకులు

తప్ప మఱి యే క్రోఁతియైనను నెంత పనియున్నను దండునుండి చీలిపోరాదు. సేనలోనే యుండవలెను.

ఉ. ఛన్నవిరోధిసంఘముల • చందము రోయఁగ నౌను గాన, సం
చన్న సుమిత్రపట్టియు స • హాయుఁడుగాఁ గపిసేన నెల్ల వా
రాన్నిధితీరమందు వన • రాజిని బాళెము దిగ్గఁబంచె సం
పన్నగుణాండు కీశపతి • భ్రాజిత మా పరిధిస్థకోటితోన్. ౯౭

అర్థములు. ఛన్నవిరోధి సంఘముల = దాఁగియుండు పగవారి గుంపుల యొక్క, చందము=విధము, రోయఁగన్ = వెదుకఁగ, వారాన్నిధి తీరమందు = సముద్రము నొడ్డున, వారాన్నిధి = అలుక్సమాసము, పాళెముదిగ్గన్=విడియుటకు, పనిచెను=ఆజ్ఞాపించెను, పరిధిస్థకోటితోన్=రక్షకసమూహముతో.

తాత్పర్యము

శూరులగు వానర శ్రేష్ఠులుమాత్ర మేల సేన విడిచిపోవలయుననిన విరోధులు మనలఁ గొట్టుటకుఁ మరుగుస్థలములందు దాఁగియుందురు. వారిని వెదక కొందరు పోవలసియుండును. అట్టివారు మాత్రము పోవచ్చును. ఈ ప్రకారము రామచంద్ర మూర్తి చెప్పఁగా లక్ష్మణుని తోడుతీసికొని గుణసంపత్తిగల సుగ్రీవుఁడు సేనల నన్నిటిని సముద్రతీరమందు రక్షకులగువారితోడ దిగవలసినదని యాజ్ఞాపించెను.

క. పారం బెరుఁగని మర్కట,వారము మధుపాండుసలిల • వంతంబగు కూ
పారం బన లవణాకూ,పారము నికటమున నపుడు • భాసిలుచుండెన్. ౯౮

అర్థములు. పారంబు = అంతము - పరిమాణము - మధుపాండు సలిల వంతము=తేనెవలెఁ బింగళమైన జలముగలది; మధుశబ్దసాహచర్యముచే పాండు శబ్దమునకు పింగళవర్ణము గ్రాహ్యమని తిలకము. కూపారము = సముద్రము లవణాకూపారము=లవణసముద్రము. ఉప్పునీళ్ళసముద్రము యొక్క,నికటమునన్= సమీపమందు.

తాత్పర్యము

పరిమాణ మింత యని చెప్ప సాధ్యపడని వానర సమూహ ముప్పునీళ్ళ సముద్రము సమీపమున తేనెవంటి పింగళజలము గల సముద్రమో యన్నట్లు లొప్పుచుండెను. అలంకార ముత్ప్రేక్ష.

క. వారిధినాదము లోఁగొని, సారం బగు కీశసైన్య • సన్నాహరవం
బారూఢిఁ జెలఁగె; ముత్తెఱఁగై రహిమించెన్ బలంబు•లర్కజు నాజ్ఞన్. ౯౯

తాత్పర్యము

వానరుల సేనల సన్నాహమునఁ బుట్టిన ధ్వని సముద్ర ధ్వనిని గ్రమింగి వైచెను. అప్పుడా సేన సుగ్రీవు నాజ్ఞప్రకారము మూఁడు విధములయి యొప్పెను. అనఁగా వానరు లందఱు నొక గుంపుగను, ఎలుఁగు లొక గుంపుగను,కొండముచ్చు లొక గుంపుగను విభజింపఁబడెను.

—• సముద్రవర్ణనము •—

సీ. దూరపారంబు ర•క్షోరాజియు క్తంబు చండనక్రగ్రహా•సంయుతంబు
క్షణదాదిఘోరంబు • కలిత ఫేనకదంబ,హాసితంబు భంగనృ•త్యాంచితంబు
జైవాతృకోదయ•సంజృంభితంబును, ప్రతికువలయహిత•వ్యాకులితము
తిమితిమింగిలసము•దీర్ణంబు చండమా,రుతమహాగ్రాహభా•సితము నగుచు
తే. దీప్తభోగభుజంగాళి • తేజు మీఱఁ, శింశుమారాదితతిచేతఁ • జెలఁగుదానిఁ
బ్రకటశైలయుతంబు దు•ర్గమపథంబు, సాగరవరంబుఁ గాంచెఁ గీ•శవ్రజంబు.

అర్థములు. దూరపారము = దూరమైన పారము (గట్టు)గలది - విశాల మైనది, రక్షోరాజియుక్తంబు = రాక్షసులతోఁ గూడినది, కాలకేయనివాతకవచులవంటి వారు నీళ్ళలో దాఁగియుందురు. ఇప్పుడు (Submarine) సబ్ మారీన్ = సముద్రములోనుండునావలలోనుండు వారివంటివారు; చండనక్రగ్రహసంయుతము = క్రూరములైన మొసళ్ళతోను, లతాకారముగాఁ జుట్టుకొని ప్రాణిహింసచేయు మత్స్యములతోను గూడినది; గ్రహమే గ్రాహము "గ్రాహోవహారో నక్రస్తుకుంభీర" యని యమరుఁడు. క్షణదా = రాత్రియొక్క - ఆది = ప్రథమ భాగంబున - ననఁగా సాయంకాలంబున వృద్ధిపొందుటచే - ఘోరంబు = భయంకరమైనది; కలితఫేన = పొందఁబడిన నురుగుయొక్క, కదంబ = గుంపుచే - హాసితంబు = నవ్వునది - నురుగు తెలుపు - నవ్వు తెలుపని కవిసమయము కావున నురుగు నెపమున సముద్రము నవ్వుచున్నదని భావము - భంగ = అలలచలన మనెడి, నృత్య = ఆటచేత, అంచితంబు = ఒప్పునది - జైవాతృకోదయ = చంద్రోదయముచే - సంజృంభితంబును = విజృంభించునది. అభివృద్ధి నొందునది - ప్రతికువలయహిత వ్యాకులితము = ప్రతిబింబించిన చంద్రునిచే వ్యాకులపెట్టఁబడినది. తిమితిమింగిలసముదీర్ణంబు = తిమియను చేఁపల చేతను దానిని మ్రింగు తిమింగిలములచేతను అతిశయించినది. "అస్తిమత్స్య స్తిమిర్నామ శతయోజన మాయతః । తిమింగిలగిలోప్యస్తి తద్గిలోప్యస్తి సాగరే" - అనిపురాణ వచనము. తిమిని మ్రింగునది తిమింగిలము - దానిని మ్రింగునది తిమింగిలగిలము - చండమారుత మహాగ్రాహ భాసితము = ఝంఝామారుతమువంటి వేగముగల మొసళ్ళచేఁ బ్రకాశించునది, దీప్తభోగభుజంగాళిన్ = రత్నములచేఁ బ్రకాశించు పడగలు గల పాములగుంపుల; తేజు = కాంతి - శింశుమార = నీటిక్రోఁతి - ఆది = మొదలగువాని - తతిచేత = సమూహముచే, ప్రకటశైలయుతంబు = పెద్దపర్వతములతోఁ గూడినది దుర్గమపథంబు = పోవుటకు సాధ్యముకాని మార్గముకలది.

తాత్పర్యము

దూరమునందు తీరము గలదియు, రాక్షసులతోను, మొసళ్ళతోను, గ్రాహములతోను గూడినదియు సాయంకాలము వేళ మిగుల భయంకరమైనదియు, నురుగు నెపమున నవ్వునదియు, అలల నెపమున నృత్యము చేయునదియు, చంద్రోదయమున

వృద్ధిపొందునదియు, ప్రతిబింబించిన చంద్రునిచే నిండినదియు, విశేషముగ తిములుతిమింగిలములు గలదియు, తుపానుగాలివలెఁ దిరుగు మొసళ్ళుగలదియు, రత్నములు పడగలందుఁగల పాములచేఁ బ్రకాశించునదియు, నీటిస్రోఁతులు గలదియు పెద్ద పర్వతము లుండుటచేఁ బోవుటకు మార్గములేనిదియునైన సముద్రమును వానరులు చూచిరి.

సీ. మొసళులచే భోగ♦విసరంబుచేత వి,గాఢమై వాతప్ర♦కంప్ర మగుచుఁ
బడుచును లేచుచు ♦ బహుళతరంగము, లధికప్రవృద్ధమై యమరుదాని
నగ్నిచూర్ణాకీర్ణ ♦ మయినట్లు భాస్వరో,దకము మహోరగ♦తతులు గలిగి
యమరారివిషయమై ♦ యధికభీకరమునై, పాతాళవిషమమై ♦ వారిదాధ్వ

ఆ. సన్నికాశమగుచు ♦ సాగర మిది యని,యభ్ర మిది యటంచు ♦ ననఁగరాక
గగన మబ్ధిఁ గలసి ♦ గగనంబునఁ దబ్ధి, గలసి తారకామ♦ణులను వెలసి. ౧౦౧

అర్థములు. భోగవిసరంబుచేతన్=పాముల శరీరముల సమూహముచేతన్; విగాఢమై=ప్రవేశింపఁబడినదై, వాతప్రకంప్రము = గాలిచేఁ గదలింపఁ బడినది కనుకనే-బహుళతరంగములు = అనేకము లలలు,అధికప్రవృద్ధమై=మిగుల పెరిఁగినవై - అగ్నిచూర్ణ + ఆకీర్ణము=నిప్పుల పొడిచే నిండినట్లు - భాస్వరోదకము = భాస్వరమను ద్రవ్యముతోఁ గూడిన నీళ్ళు, ఈ భాస్వరమే ఆంగ్లభాషయందు ఫాస్ఫరస్(Phosphorous)అందురు. ఇది మెఱయుచుండును. రాత్రులందుఁచీఁకటి వేళ నలలయందుఁగాననగు. తీరమం దిసుకలోను సన్ననిపలుకులుపడియుఁడుటయుఁ గలదు. అల లొడ్డునఁ బడి మరల పోవుచోట నుండును. మహోరగతతులు=పెద్ద పాములగుంపులు, అమరారి విషయమై=రాక్షసులకు, స్థానమై, అధికభీకరమునై = మిగుల భయంకరమై, పాతాళవిషమము=పాతాళమువలె విషమము, వారిదాధ్వసన్నికాశము= ఆకాశముతో సమానము, అభ్రము = ఆకాశము, తారకామణులను=నక్షత్రము లను రత్నములచే, రాత్రులందు సముద్రజలము ప్రకాశించుటకుఁ గారణము విష్ణు పురాణమున నిట్లు చెప్పఁబడినది. "ఆతామ్రా హి భవంత్యాపో దివా నక్తం ప్రవేశనాత్। దినం విశతిచైవాంభో భాస్కరేఽస్తముపాగతే। తస్మాచ్ఛుక్లీభవంత్యాపో నక్త మహ్నః ప్రవేశనాత్". వి-పు-౨-౮-౨౮.

తాత్పర్యము

మొసళ్ళచేతఁ బాముల పడగలచేతఁ బ్రవేశింపఁబడినదై, గాలికిఁగదలునదియై లేచుచుఁ బడుచునుండు నలలచేత వృద్ధినొందినదై,నిప్పులపొడివలె భాస్వరముతోఁ గలిసిన నీళ్ళు - పెద్ద పాములుగలదై, రాక్షసులకు వాసస్థానమై, భయంకరమై, పాతాళమువలె విషమమై-యాకాశముతో సమానమై - యిది యాకాశము ఇది సముద్రమని వేఱుపఱుపరాక యాకాశమున సముద్రము సముద్రమునం దాకాశము కలసి తారకలను మణులు, మణులను తారకలు కలసినదై.

క. తనరుచు సముత్పతన్ముదిర, నికరముల భూరిభంగ • రాజులచేతన్
గనఁగొనఁగ రాక భేదం, బనయము నొక్కటిగఁ బెనసి • యరుదగు దానిన్. ౧౨౨

అర్థములు. సముత్పతత్ = క్రిందికి పైకిపోవుచున్న - ముదిర నికరముల = మేఘముల సమూహములచే-ఇది యాకాశమందలిది - భూరిభంగరాజులచేతన్ = గొప్ప యలలచేతను - అనయము = ఎల్లప్పుడు - బెరసి=కలసి-అరుదు=ఆశ్చర్యకరము.

తాత్పర్యము

ఆకాశమున మేఘములు క్రిందికి పైకి పోవుటచే పడుచు లేచుచున్న యలలతోఁ బోలిక గల దగుటచే నాకాశ సముద్రములకు భేదము చెప్పరాక కలసి యుండుదానిని, అలంకారము మీలితము, సాదృశ్యమువలన భేదమే కానరాక పోయిన మీలితాలంకార మగును.

తే. బెరసి యొండొంటితో వెండి • పెరిఁగి యొకటి
నొక్కటి గుభాలునను దాఁకి • యూర్మిపంక్తు
లబ్ధిరాజమహాభేరు • లట్లు మ్రోయ
నగచరావళి చూచె మ • హాద్భుతముగ. ౧౨౩

అర్థములు. బెరసి = కలిసి; ఊర్మిపంక్తులు = అలలవరుసలు - అబ్ధిరాజమహాభేరు లట్లు=సముద్రరాజుయొక్క పెద్దనగారాలవలె.

తాత్పర్యము

అల లొకదానితో నొకటి కలసి పెరిఁగి యొకదానితో నొకటి తాఁకి గుభాలున పడఁగా నివి సముద్రరాజు మహాభేరులా యని వానర సేన యాశ్చర్యకరముగ జూచెను.

చ. రయయుతవాత సంకుల త • రంగక గర్భిత దివ్యరత్న సం
చయ జలనాదితంబు జల • జంతుసమూహసమాకులంబు న
వ్యయమహితానిలోద్ధత సు • రాధ్వనటద్భృశ భంగమున్ సవి
స్మయమతిఁ జూచె నెల్లకపి • సంఘము భ్రాంతతరంగనాదమున్. ౧౨౪

అర్థములు. రయయుత = వేగముతోఁ గూడిన, వాత = గాలిచే, సంకులిత = కలఁత పడినది, గనుకనే, తరంగక = అలలచేత, గర్భిత = లోపలికిఁ దీసికొనఁబడిన, దివ్యరత్నసంచయ=శ్రేష్ఠరత్న సమూహముచేతను, జల=నీటిచేతను, నాదితంబు=ధ్వని గలదిగాఁ జేయఁబడినది, జలజంతు సమూహ = నీటియందుండు జంతువులచే సమాకులంబు=నిండినది, అవ్యయ=ఎడఁతెగక వీచు, మహిత=గొప్పదగు, అనిల=గాలిచే, ఉద్ధత = ఎగురఁ గొట్టఁబడిన, సురాధ్వనటత్ = ఆకాశమున నటించుచున్న, భృశభంగమున్ = అనేకములగు నలలు గలది, సవిస్మయ

మతిన్=ఆశ్చర్యముతోఁ గూడిన మనస్సుతోఁ- భ్రాంతతరంగ నాదమున్=కదలు చున్న అలల ధ్వని గలదానిని.

తాత్పర్యము

మిగుల వేగముచే వీచు గాలిచేత కలఁత చెందిన యలలయందలి గొప్ప రత్నములు నీళ్ళు నొకదానితో నొకటి కొట్టుకొనఁగా బుట్టిన ధ్వని గలదియు జలజంతువుల గుంపులచే నిండినదియు, విడువక వీచు గొప్పగాలిచే నెగురఁ గొట్టఁబడుటచే నాకాశమున నటించు నలలుగలదియు కదలుచున్న యలల ధ్వని గలదియు నగు సముద్రమును ఆశ్చర్యముతో వానరులు చూచిరి.

క. భర మగు నిర్హ్రాదంబును, బొరలి పొరలి వచ్చునలలు ♦ బురుగును గనఁగా
సురద్రావి పొర్లు వెంగలి, కరణి జలధితోఁ చెఁగీశ♦కాండంబునకున్. ౧౦౫

అర్థములు. భరమగు = అతిశయించిన, నిర్హ్రాదంబును = ధ్వనియును, బురుగు = నురుగు - జొల్లు, సుర = కల్లు, వెంగలి = అవివేకి.

తాత్పర్యము

విస్తార ధ్వనియు, పొరలి పొరలి వచ్చుటయు బురుగును గల సముద్రమును జూడఁగా కల్లుద్రావి కేకలు పెట్టుచు నేలఁబడి దేహము తెలియక పొర్లుచు నోట జొల్లు కార్చుచున్న మూఢునివలె వానర సమూహమునకుఁ గానవచ్చెను.

—♦ ౫-వ సర్గము. శ్రీరాముఁడు సీతం దలంచి దుఃఖించుట. ♦—

క. పాలకయుతహరివాహిని నీలుఁడు సింధూత్తరమున ♦ నెఱి విడిసెను శా
స్త్రాలపితరీతి నల్దెస, మాలక చరియించి కావ ♦ మైందద్వివిదుల్. ౧౦౬

అర్థములు. పాలకయుత = రక్షకులతోఁ గూడిన, హరివాహిని = వానర సేన, సింధు+ఉత్తరమునన్=సముద్రముయొక్క- యుత్తరతీరమున, నెఱిన్=క్రమముగా, విడిసెన్=విడియునట్లు చేసెను, అంతర్భావిత ణిజంతము, దించెను, శాస్త్రాలపితరీతిన్ = శాస్త్రమునందుఁ జెప్పఁబడిన విధముగ, నల్దెస = నాలుగు దిక్కులందు, మాలక = వదలక.

తాత్పర్యము

రక్షకులు గల వానరసేనను సముద్రముయొక్క- యుత్తరతీరమున నలుఁడు దించెను. శాస్త్రప్రకారము మైందద్వివిదులు ప్రాలుమాలక నాలుగు ప్రక్కలఁ దిరిగి కాచుచుండిరి.

క. కడలికరి యుక్తపద్ధతి, విడియఁగ సేనలును రామ♦విభుఁడు ధృశార్తిన్
మిడుకుచుఁ దన కెలన వసిం, చెడి లక్ష్మణుఁ జూచి యనియెఁ♦జిత్తం బెరియన్.

అర్థములు. శరణ్యునం దుండవలసిన కృతజ్ఞత, మిత్రుల ననుసరించుట, కార్యములను విమర్శించుట, మహోత్సాహము, మొదలగు గుణములు శ్రీరామచంద్రమూర్తియందుఁ గల వని యింతవఱకుఁ దెలుపఁబడెను. అన్ని గుణములతోఁ

ప్రధానమైన గుణము దయ, అది రామచంద్రునందు విశేషించి కలదని యీ వర్గము నందుఁ జెప్పబడుచున్నది. పరుల దుఃఖము తన దుఃఖముగా నెంచి తపించుట దయయనఁబడును. సీతాదేవి దుఃఖమును దలంచి రామచంద్రమూర్తి దుఃఖించుట యిందుఁ జెప్పఁబడును.

కడలి దరిన్ = సముద్ర తీరమున, యుక్త పద్ధతిన్ = యోగ్యమైన విధముగ, భృశార్తిన్ = అధిక వ్యథచే, తనకెలనన్ = తన ప్రక్కన, ఎరియన్ = మండుచుండఁగా.

తాత్పర్యము

సముద్రతీరమున సేన లన్నియు నే యే సేన యేయేచోట దిగవలయునో యా ప్రకారము దిగినపిమ్మట రామచంద్రమూర్తి యీ సముద్రమున కావలియొడ్డునందేకదా సీతాదేవి దుఃఖించుచున్నదని యా మెపడు దుఃఖములను హనుమంతుఁడు చెప్పినవి జ్ఞప్తికి రాఁగా మిగుల వ్యథచే దుఃఖపడుచుఁ దలఁచుకొలఁది హృదయము మండుచుండఁ దన ప్రక్కను నున్న లక్ష్మణుఁ జూచి యిట్లనెను.

క. లోకమున నాఁడునాఁటికి, శోకంబు క్షయించుచుండుఁ ♦ జుమ్మీ మ్మొందున్
నా కన్ననో నానాఁటికి, త్వామ్మకన్యక లేమి వనట ♦ మఱి మఱి పెరిఁగెన్. ౧౦౪

తాత్పర్యము

లక్ష్మణా! లోకములో సాధారణముగా నందఱియందు దుఃఖము కాలక్రమముగ క్షయించును. మొదటనున్న దుఃఖము తగువారికిఁ గొన్నిదినముల కుండదు. ఇది లోక సామాన్య విషయము. నాకో సీతను విడిచిన దుఃఖము నానాఁటికిఁ బెరుగుచున్నది కాని తగ్గుటలేదు.

లోకమున నెవరును బరులకై దుఃఖించువారు లేరు. తమ ప్రియపదార్థ వియోగమునఁ దమకుఁ గలిగిన సుఖనష్టికై కష్టమునకై దుఃఖింతురు. రామచంద్రమూర్తి యట్లు గాదు. దుఃఖమున కెడములేదు 'నానవాప్తమవాప్తవ్య' మ్మనునట్లు ఆయన సుఖసంతోషముల కన్యులపై నాధారపడియుండువాఁడు కాఁడు. కావున 'మిథిలాయాం ప్రదీప్తాయాం నమే కించి త్ప్రదహ్యతే' యన్నట్లు లేదిపోయినను దనదిపోయినట్లు దుఃఖింపఁడు. బిడ్డల దుఃఖమునకై తల్లిదండ్రులు తపించునట్లు తన యాశ్రితుల దుఃఖమునకై తాను దపించును.

తే. లేదు వగపు కాంత ♦ దూరమ్ము చనె నని, లేదు వగపు ముచ్చిలింపఁ బడుట
కంబుజాతనేత్ర ♦ కరుగుచున్నది గదా, వయసటంచు నాత్మ ♦ వగచువాఁడ.

తాత్పర్యము

నాకుఁ బ్రియురాలగు సీత మిగుల దూరమునం దున్నదికదా యని నేను దుఃఖింపను. రావణుఁ డామెను దొంగిలించికొని పోయెనే యని నేను వగవలేదు. కమలములవంటి కన్నులుగల సీతాదేవి నాయొద్ద నున్నప్పుడెంతో సంతోషించుచుండెను. అట్టి సంతోష మిప్పు డామెకు లేక కాలమంతయు వ్యర్థమైపోవుచున్నది.

గదా యని దుఃఖించెదను. నా తోడ నుండుటయే యామెకు మహానందము. నా వలన నామె సంతోషించుచున్నదికదా యని నేను సంతోషించు చుంటిని. అట్టి దానికి విఘ్నము కలిగించితిని గదా యని దుఃఖించెదను. ఇట్లు చెప్పుటచే రామచంద్రమూర్తి కాముకుఁడై దుఃఖింప లేదని యేర్పడు చున్నది. వయస్సు పోవుచున్న దనుటచే ముసలితనము వచ్చుచున్న దని యర్థము. నిత్య యౌవనవతికి వార్ధక మెక్కడిది.

శా. పోవమ్మా మారుత ! సీత యున్న యెడకుం ♦ బూఁబోణి స్పర్శింపుమీ
రమ్మా నన్ను స్పృశింపుమీ మఱల, నా ♦ రంగాంకుమార్గమ్మునన్
గొమ్మం జూచెద, నట్లు నీ వలన నా ♦ కున్ జానకీకోమలాం
గమ్ముం దాఁకిన యట్టులౌ ♦ గలదె భాగ్యం బంత నా కక్కటా ? ౧౧౦

అర్థములు. స్పర్శింపుమీ = తాఁకుమా.

తాత్పర్యము

వాయుదేవా ! నీవు సీతాదేవి యున్న చోటికిఁబోయి యామెను దాఁకుము. దానివలన నిది రామచంద్రుని స్పృశించిన గాలి కదా యని నాయొద్దనుండి వచ్చిన హనుమంతుని జూచి సంతోషించినట్లు ఆయన తండ్రి వగు నిన్నుఁ జూచియు సంతోషించును. అట్టులామెను దాఁకి సంతోషింపఁజేసి మరలవచ్చి నన్ను దాఁకితివేని నేను సంతోషించెదను. అప్పుడు నేను జానకిని దాఁకినవాఁడ నగుదును. ఇట్టులే జానకిని నేను జూచుచున్నాఁడను. జానకి చంద్రుని జూచుచున్నది. ఆమె దృష్టులు చంద్రుని యందుఁబడినవి. నాదృష్టులు చంద్రునియందుఁ బడినవి. ఇరువుర దృష్టులు చంద్రునందుఁ గలసికొనెను. కావున నేనామెను ఆమె నన్నుఁజూచినట్లయ్యెను. అట్టులే నీమూలమున మే మొకరి నొకరు స్పృశించినవార మగుదుము. అయ్యో నాకంత యదృష్టము కూడఁగలదా ?

ఉ. రావణుచేతఁ జిక్కి-వడి ♦ రాజముఖీమణి నన్నుఁ గూర్చి "హా
జీవితవల్లభా !" యని వ♦చించిన యార్తివిలాపయుక్త మా
నా వచనంబులన్ మనము ♦ నందుఁ దలంపఁ దలంపఁగా నశే
షావయవంబులున్ విషము ♦ నానిన యట్టులు క్రాఁగఁ జొచ్చెడిన్. ౧౧౧

అర్థములు. అశేషావయవంబులు=దేహమాద్యంతము-మనస్సుమాత్రమే కాదు - దేహముకూడ.

తాత్పర్యము

రావణుచేతఁ జిక్కుకొని చంద్రముఖి సీత ప్రాణేశ్వరా యని దుఃఖముతో నేడ్చుచు నఱచిన యా మాట నేను తలఁపఁగా దలఁపఁగా విషము ద్రాగినట్టులు బాహ్యేంద్రియములను నంతరింద్రియములను గూడ దహించుచు నున్నది.

దుశ్శాసనుఁడు చీర లొలుచు నపుడు ద్రౌపది "హా కృష్ణ ద్వారకావాసిన్ క్వాసి యాదవనందన, ఇమా మవస్థాం సంప్రాప్తాం కిమనాథా ముపేక్షసే? శంఖ చక్ర గదాపాణే ద్వారకానిలయాచ్యుత, గోవింద పుండరీకాక్ష రక్ష మాం శరణాగతామ్ ॥ అని గోవిందా యని పిలిచెను.

శరణాగతురా లయిన ద్రౌపది యాపత్కాలమం దఱచిన గోవిందాయను మాట కృష్ణుని బదుమూఁడు సంవత్సరములు బాధించెను. ఈవిషయము పదునాలుగవ సంవత్సరమున రాయబారము పోవుటకు ముందు కృష్ణమూర్తి పాండవులతో 'గోవిందేతి యదాక్రందత్। కృష్ణా మాం దూరవాసినమ్। ఋణం ప్రవృద్ధమివ మే। హృదయా న్నాపసర్పతి" యని చెప్పెను. ధర్మరాజా ! నీవు రాజ్యమునకై యుద్ధము చేయుదువుగాక, చేయకుందువుగాక! దూరముగా నుండు నన్ను ద్రౌపది గోవిందా యని పిలిచెను. అప్పుడు నేను దూరమున నున్నవాఁడ నగుటచే నా దుష్టుల నేమియుఁ జేయఁజాలనైతిని-ఆమాట నా హృదయమునుండి తొలఁగిపోక ఋణము దినదినము వడ్డితోఁ బెరిగినట్లు పెరుగుచున్నది. ఆ యప్పు నేను దీర్చుకొనవలసియున్నది సుమా యని చెప్పెను. కావున భక్తుల యాక్రందనధ్వని విని భగవంతుఁడు వారి కష్టము దీర్చువఱకు మిగులఁ బరితాప పడుచుండును.

సీతకు వయస్సుపోయి వార్ధకము వచ్చుచున్నది. నే నా వయస్సనుభవింపక పోతినే యని రాముఁ డేడ్చె ననుట సరిగాదు, అగ్నిని శీతోభవ యన్నట్లు రావణుని హతోభవ (చావుము) అని భస్మము చేయఁగలిగియు నా రక్షణ సామర్థ్యము విశ్వసించి తన పారతంత్ర్యమునకు హాని వచ్చునే, నాకపకీర్తి వచ్చునే యని నా నిమిత్తమై దుఃఖించుచున్నది కదా, నే నేమియుఁ జేయఁజాలకున్నానే యని దుఃఖించెదను, అని రామ హృదయము.

క. చింతాజ్వాలాయుతము ని,తాంతవియోగేంధనప్రతానైధిత మా
కంతుజ్వలనము రేవగ, లెంతయు నా దేహమున్ దహించెడి వత్సా! ౧౧౫

అర్థములు. చింతాజ్వాలాయుతము=చింత యనెడి శిఖలతోఁ గూడినది, నితాంత = తీవ్రమైన, వియోగ = వేఱుపాటనెడి, ఇంధన = కట్టెలయొక్క, ప్రతాన = సమూహములచే, ఏధితము = వృద్ధి పొందింపఁబడినది, కంతుజ్వలనము = మన్మథాగ్ని, రే వగలు = రాత్రి పగలు, ఇది సమాహారద్వంద్వము, ఏకవచనము, సర్వవేళల నని యర్థము, ద్వంద్వమున పకారము వకార మయ్యెను. వత్సా=నాయనా !

తా త్ప ర్య ము

నాయనా! చింత యనెడు జ్వాలలు గలదై వేఱుపాటనెడి కట్టెల ప్రోవుచేఁ బెరిగిన మన్మథాగ్ని సర్వవేళల నన్ను మిక్కిలి కాల్చుచున్నది.

చిత, చింత యను రెంటిలో చింతయే గొప్పది. చితి చచ్చినవానిఁ గాల్చును. చింత బ్రతికినవానిఁ గాల్చును.

తే. నిన్ను విడనాడి లక్ష్మణా! నీరనిధిని, నేను మునిఁగి సుఖంబుగా ♦ నిద్దురింతు
నారములలోన శయనించు♦నన్ను దెట్లు, నీరజేషుఁడు దహియింప♦నేర్చువాఁడు.

అర్థములు. నారములలోన=నీళ్ళలో, "నారము లనఁగా జలములు" భార. నీరజేషుఁడు—నీళ్ళలోఁబుట్టిన కమలము బాణముగాఁ గలవాఁడు, మన్మథుఁడు.

తాత్పర్యము

నిన్నుఁజూచిన నాకు సీతయుజ్ఞప్తికివచ్చును, మీరిద్దఱు నన్నువిడువకయుండు వారుగదా. కావున నిన్నుఁగూడ వదలి నేను సముద్రమున హాయిగా నిద్దురపోదును. నిద్దురపోవువానిని దుఃఖమేమి చేయఁగలదు. నీళ్ళలో నిద్దురపోవునన్ను నీళ్ళలోఁబుట్టిన కమలము బాణముగాఁ గలవాఁ డెట్లు బాధింపఁగలఁడు. నీళ్ళమీఁద గమలముతో దెబ్బగొట్టిన నీళ్ళలో నుండువానికినొప్పికలుగునా! సముద్రమునందు నేను సుఖముగ శయనింతు నని రామచంద్రమూర్తి మనుష్యభావమునఁ జెప్పినను ఆత్మహత్య చేసికొనెద నని చెప్పినట్లే. అది ధీరోదాత్తుని లక్షణముగాదు. కావున నాయర్థముపొసఁగదు. లక్ష్మీనారాయణు లిరువురు శేషునిపైఁ బవళించువారే. ఒకరు లేకపోయినపుడు రెండవవారి కా సుఖశయ్యయేల? కావున ఆదిశేషుఁడవగు నిన్నుఁగూడ వదలి ప్రలయావస్థయందు వలె నీటఁబండుకొని యోగనిద్ర పోయెదను. అప్పుడు మన్మథుని కుత్పత్తియే లేదు. కావున నన్నతఁ డేమియుఁ జేయఁజాలఁడు అని భావము. ఇట్లు లక్ష్మణుని యాదిశేషత్వము తన నారాయణత్వము సూచించెను.

క. అక్కమలాక్షియు నేనును, నొక్కవసుంధర నె నిలిచి ♦ యుండుటచే నే
నెక్కరణినొ మనఁ గల్గితి, గ్రక్కున నప్పొలతిఁ జూడఁ♦గల్గునె నాకున్. ౧౧౪

అర్థములు. వసుంధరనె = భూమిమీఁద - మనఁగలిగితిన్ = బ్రతుకఁగలిగితిని.

తాత్పర్యము

లక్ష్మణా! సీతను విడిచి నేను బ్రదుకుటకుఁ గారణములు రెండుగలవు. ఒక పానుపుమీఁద నిద్దఱ మున్నట్లు లోకభూమి యందే యిరువుర మున్నవారము - రెండవది సీత జీవించియున్నదని హనుమంతుఁడు చెప్పెను. కావున నేనును జీవింపఁ గలిగితిని. కాని యామెను నేను జూడఁగలనా?

ఒకవసుంధరనె యనుటచే నిరువుర మొక భూలోకమందే యున్నవార మగుటచే సాంగత్యముకలదు. కావున నెట్లెట్లో బ్రతికితిని. అటుగాక యొక రొకలోకమున మఱియొకరు వేఱొకలోకమున నుండఁగలిగెనేని మేము బ్రదుకఁ జాలము. నిన్ను విడిచి నేను సీతయు నిమిషమైన బ్రదుకఁ జాల మని నీవే చెప్పితివిగదా, వాస్తవార్థ

మున జీవ ప్రకృతిమయ మగు నీ లీలావిభూతి ప్రపంచము లేకుండిన భగవంతుఁ డుండియు లేనివాఁడే. ప్రాగవస్థయం దాయనను దలఁచువాఁ డెవ్వఁడు ?

క. ఆవారి జలము గల మడి, ప్రేవలఁ దడిలేనిపొలము ♦ క్రీయూటవలెన్
 బావని మని యున్నది యని, నే వినుటను బ్రదుకుఁ గంటి♦నిర్మలచరితా. ౧౧౫

అర్థములు. ఆవారి = దండిగ, ప్రేవలన్=ప్రక్క-లందు, తడి = చెమ్మ, క్రీయూటవలెన్ = భూమిలోని యూట తడివలె.

తాత్పర్యము

సీతాదేవి బ్రదికి యున్నదని హనుమంతుఁడు చెప్పుటచే నేను బ్రదికి యున్నాను. బ్రదికి యుండఁగా నేమేమి? ఆమె యెక్కడ, ని వెక్కడ. నీవు బ్రదుకుట కామె యెట్లు కారణము కాఁగలదు. మబ్బులో నీరుండిన భూమిమీఁదఁ బైరు పండునా యందువేమో, అట్లు గాదు, మే మిరువుర మొక భూమియందే యున్నారము. ఒక వరిమడి నిండ నీళ్లుండెనేని యా నీళ్లు ప్రక్క భూములపైఁ బాఱకుండినను భూమిలోని యూటచే నవియు దడిగల వగుచున్నవి గదా. అట్టులే యామె బ్రదికియున్న దను వార్త విని నేను బ్రదికి యున్నవాఁడను.

ఉ. ఎన్నఁడు గాంచువాఁడనో యహీ♦నవిరోధులఁ జంపి నిస్తులా
 భ్యున్నతి నొందు లక్ష్మివలె ♦ నుగ్మలి నీరజపత్రనేత్ర, నే
 నెన్నఁడొ గాసిఁబడ్డయతఁ ♦ డిష్టరసాయన మాను భంగి నా
 యన్ను ముఖాబ్జ మెత్తి యధ♦రామృత మానుదు నాశ దీరఁగన్. ౧౧౬

అర్థములు. అహీన విరోధులన్ = బలమున గొప్పవారగు శత్రువులను, నిస్తుల = అసమానమైన, అభ్యున్నతి = మేలు, అభివృద్ధి. ఇష్టరసాయనము = ఇంపైన శరీర పుష్టికరమైన యౌషధము, ఆనుభంగిన్ =త్రాగుటవలె, అన్ను=స్త్రీ, ఉగ్మలి = స్త్రీ-సీత.

తాత్పర్యము

బలవంతులైన పగవారిఁ జంపి మిగుల నభివృద్ధిచెందు లక్ష్మివలె నేనెన్నఁడు సీతాదేవిని జూతునో కదా. మిక్కిలి బడలినవాఁడు దేహపుష్టికరమై యింపైన రసాయనమును ద్రావినట్లు నే నెన్నఁడు సీతాదేవి యధరామృతమును నాశ దీరఁ బానము సేయుదునో—

యజ్జరా వ్యాధి విధ్వంసి భేషజం, తద్రసాయనమ్. బాహటుఁడు
 నీరసానాంహి ధాతూనాం, లాభోపాయో రసాయనమ్ - వైద్యకము

జ్వరాది సంబంధములై దేహమును నిస్సారముగఁ జేయు వ్యాధులను, ధ్వంసము చేయునది రసాయనము.

క. బలిసిన యిఱిసిన తాళీ, ఫలములతో నెనయుచున్న ♦ పద్మాక్షికుచం
 బులు న న్నెన్నఁడొ కౌఁగిట, నలరించెడి వేళఁ గంప♦మందెడి నయ్యా. ౧౧౭

అర్థములు. ఇతిసిన=ఒకదానితో నొకటి రాచుకొనుచున్న, తాళీఫలములతో = తాటిపండ్లతో; బలిసిన యిఱిసిన, ఎనయుచున్న యను విశేషణంబులు కుచంబు లను పదములతో నన్వయించును. ఇందు తాళీఫలములతో నను వ్యవధానము గలదు. కొన్ని యెడల విశేషణోభయపదంబులు ప్రతికక్రియాజన్య విశేషణ ఘటితంబులు సందర్భయోగ్య పదవ్యవహితంబు లగు ప్రౌ. వ్యా. సమా-౧౧౨-
"కం-చిక్కని చక్కని నున్నని, నిక్కని తోలూడ్వబడని ఘుల్లి సెగలచే నొక్కఁబడని దండంబులు తక్కక యుపనయనవేళఁ దాల్పఁగ వలయున్॥విజ్ఞా- ఆచార -కం"- మొగి విసిరికలకు గూడక, పగులక వెడలుపును నిడుపుఁ బసిమియుఁ గలలేఁజిగు రరఁటాకులు పెట్టిరి, దిగదిగ నద్దేవి యాజ్ఞ దివ్యపురంధ్రుల్॥భీమ- ౨-౧౨౫

తాత్పర్యము

బలుపుగలట్టియు - నొకదానితో నొకటి రాచు కొనుచున్నట్టియు - తాటి పంకులఁ బోలియున్నట్టియు సీతాదేవి స్తనములు నేను గాఁగిలించు నపుడు చలింపఁగలవు.

క. నన్నుం బ్రాణేశ్వరుఁగా, గొన్నసతీమణి యరాళ•కుంతల సోఁకుం
గన్నెలనడుమ ననాథవ, లె నన్నవసెడిఁ గాచు దిక్కు•లే కెదపడుచున్. ౧౧౩

అర్థములు. అరాళకుంతల = వంకరగా నుండు వెండ్రుకలు గలది, సోఁకుంగన్నెల = రాక్షసస్త్రీల, అనాథవలె = దిక్కులేని దానివలె, నవసెడిన్= శుష్కించుచున్నది, ఎదపడుచున్ = భయపడుచు.

తాత్పర్యము

నన్ను, మూఁడు లోకముల వారిని గావఁగల నన్ను తన ప్రాణేశ్వరుగాఁ గొనియుఁ బతివ్రతారత్నమయి వంకర వెండ్రుకల సీత రాక్షస స్త్రీల నడుమ దిక్కులేని దానివలె రక్షించువారు లేక భయపడి శుష్కించు చున్నది గదా.

క. జనకునిసుత యఁట దశరథ, జనపతికోడ లఁట నాదు స•తి యఁట రక్షో
వనితాజనతామధ్యము,నను నిద్దుర నెట్లు గొనెడి • నవలామిహియున్. ౧౧౪

అర్థములు. రక్షోవనితా జనతా మధ్యమునన్ = రాక్షస స్త్రీ సమూహముల నడుమ, నవలామిహి=స్త్రీల యందు శ్రేష్ఠురాలు.

తాత్పర్యము

తండ్రియా జనకమహారాజఁట. మామగారా దశరథమహారాజఁట. భర్తయా నేనఁట. ఇట్టి యుత్తమ స్త్రీ రాక్షస స్త్రీల నడుమ నెట్లు నిద్రింపఁ గలదు.

క. గౌరేతరనీరదతతి, దారితముగఁ దోఁచు శారద•విధుకల యనన్
ఘోరాసురులన్ సతి ధి,క్కారించియు వెలికి రాఁగఁ • గలుగుట యెపుడో.

అర్థములు. గౌరేతర = నల్లని; నీరదతతి = మేఘసమూహము, దారితముగన్=చీల్పఁబడినదిగ, శారదవిధుకల=శరత్కాల చంద్రరేఖ.

తాత్పర్యము

నల్లని మబ్బులఁ జీల్చుకొని వెలికిఁ గానవచ్చు చంద్రరేఖవలెఁ గ్రూర రాక్షసుల ధిక్కరించి యెప్పుడు బయట రాఁగలదో.

చ. తరళమృగాక్షి నైజముగఁ • దాను గృశాంగియు, యందు నిప్డు దు
ర్భర బహుళార్తిచేతను, వి•పర్యయ మూటను దేశకాలముల్,
కర ముపవాసముం బడుటఁ • గాంత మ తెంత కృశించెనో కదా
హరిహయవైరిఁ ద్రుంచి ముద • మార ధరాసుతఁ దెచ్చు టెన్నఁడో. ౧౨౧

అర్థములు. తరళమృగాక్షి=చలించు జింక కన్నులవంటి కన్నులు గలది, నైజముగన్ = స్వభావముచేతనే, కృశాంగియు = శుష్కించిన దేహము గలది. దుర్భర=భరింపరాని, బహుళార్తిచేతన్ = విస్తార దుఃఖముచేతను, విపర్యయము= తాఱుమాఱు, హరిహయవైరిన్=ఇంద్ర శత్రువు రావణుని.

తాత్పర్యము

చలించుచున్న జింక కన్నులవంటి కన్నులుగల సీతాదేవి స్వభావముచేతనే సన్నని దేహముగలది. ఇఁక నిపుడో సహింపరాని దుఃఖాతిశయముచేత, దేశము కాలము తాఱుమాఱగుటచేత, ఆహారము లేమిచేత నెంత శుష్కించినదో కదా. రావణాసురునిఁ జంపి నే నెన్నఁడు సీతను సంతోషముతోఁ దేఁ గలనో.

తే. దేవతాకన్యఁ బోలు నా • దేవి సీత
పరమసాధ్వీమచర్చిక • పరమరతిని
నెప్పుడో కదె యాకంఠ • మెలమిఁ గ్రుచ్చి
వితతమోదాశ్రువులఁ దాను • విడువఁగలదు. ౧౨౨

అర్థములు. ఆకంఠ మెలమిఁ గ్రుచ్చి=సంతోషముతోఁ గంఠము వఱకుఁ గౌఁగిలించి, ఇట్టి కౌఁగిలింతకు స్పృష్టక మని పేరు. "యద్యోషిత స్సమ్ముఖ మాగతాయా। అన్యాపదేశాత్ వ్రజతో నరస్య। గాత్రేణ గాత్రం ఘటతే తదేత దాలింగనం స్పృష్టక మాహు రార్యాః॥ యత్కుర్వతే వక్షసి వల్లభస్య, స్తనాభిఘాతా న్నిబిడోపగూఢాః। పరిశ్రమార్థం శనకై ర్విదగ్ధా స్తత్కంఠసూత్రం ప్రవదంతి సంతః॥ ఉరసి కమితు రుచ్చై రావిశంతీవరాంగీ స్తనయుగ ముపధత్తే చేత్స్తనాలింగనం తత్॥ కంఠసూత్ర స్తనాలింగనములు పర్యాయ నామములు.

తాత్పర్యము

దేవతాస్త్రీ వంటిదై పరమ పతివ్రతలలో శ్రేష్ఠురాలైన నా దేవి సీత గొప్ప మనస్సుతో నెప్పుడు నా మెడఁ గ్రుచ్చి కౌఁగిలించి యానందబాష్పములు విడువఁ గలదు.

పరమ సాధ్వీమచర్చిక = ఉత్తమ పతివ్రతలందు శ్రేష్ఠురాలు, "మతల్లికా మచర్చికా ప్రకాండ ముద్ఘ తల్లజౌ। ప్రశస్తవాచకా న్యమూని" అమరుఁడు.

క. నాసతిఁ దరుణీరత్నము, భూసుత నెడఁబాయఁ బెరుఁగు॥భూరివ్యథ నే
మాసినవస్త్రముమాడ్కిని, బాసి సుఖము పడఁగఁగలుగు॥ భాగ్యంబెపుడో. ౧౨౩

తా త్ప ర్య ము

నా భార్యను స్త్రీ రత్నమును భూపుత్రిని సీతను విడనాడుటచేఁ గలిగిన దుఃఖము నే నెన్నఁడు మాసిన గుడ్డను వదలినట్లు వదలి సుఖింపఁ గలనో.

తమ్మునితోనైనను నిటువంటి మాటలు చెప్పవచ్చునా? లక్ష్మణుఁడు సర్వ విధముల సేవకుఁడే యగుటచేఁ జెప్పఁబడెను. అటు కాని యెడల ననుచితమే. గోవింద. సుందరకాండమందు సీతాదేవి తన స్తనములను గుఱించి హనుమంతు నితోఁ బ్రస్తావించెను. పరపురుషులతో మాట్లాడునపుడు స్త్రీలు తమ స్తనముల ముచ్చట తేరాదు. అట్లుండియు హనుమంతుఁడు తమ మర్మమెఱింగి వచ్చిన బంటు కావున సర్వవిధ సేవకుఁ డను భావముతో బిడ్డతోఁ జెప్పుకొన్నట్లు చెప్పుకొనెను.

చ. అని విలపించుచుండఁగ ది॥నాంతమునం గడు మందరశ్మియై
దినకరుఁ డస్తమించుటయు ॥ దీనత పాయ వచించి లక్ష్మణుం
డనునయసూక్తిఁ దేర్చుటయు ॥ నంబుజలోచన సంస్మరించుచున్
వనట మునుంగుచున్ నృపతి॥వర్యుఁడు సంధ్య యజించె భక్తినై. ౧౨౪

అర్థములు. దినాంతమునన్=సాయంకాలమున, మందరశ్మియై=వేఁడిమిలేని కిరణములు గలవాఁడై, సంస్మరించుచున్=స్మరించుటచేత, హేత్వర్థక శత్రర్థకము.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము శోకించు చుండఁగా సాయంకాలమై సూర్యుఁ డస్తమింపఁగా నా వ్యసనము పోవునట్లు లక్ష్మణుఁడు సమాధాన వాక్యములు చెప్పి సరిచేయఁగా సీతను స్మరించుచు దుఃఖపడుచు రామచంద్రుఁడు సంధ్య వార్చెను.

ఈ దినము పాడ్యమి. సూర్యాస్తమయ మైనట్టులిచ్చటఁ జెప్పఁబడెను. చంద్రోదయము ౧౦౦ వ పద్యమందుఁ జెప్పఁబడెను. కావున నేఁడు శ్రీరామ చంద్రమూర్తి గౌణకాలమున సంధ్య వార్చె నని యేర్పడుచున్నది.

—॥ ౬-వ సర్గము. రావణుఁడు మంత్రులతో నాలోచించుట. ॥—

ఉ. అక్కడ రావణుండు, త్రిద॥శాధిపతుల్యుఁడు మారుతాత్మజుం
డెక్కటి లంకలోన ఘటి॥యించిన ఘోరము భీతిదంబు నా
నక్కృతి నెంచి రాక్షసస॥భాంతరసీమను సిగ్గు దోఁపఁగా
నుక్కటి నేలఁ జూచు చసు॥రోత్తమ వీరులతోడ నిట్లనున్. ౧౨౫

ఇచ్చట శ్రీరామాదులు సముద్రముదాఁటు నుపాయ మాలోచించు చున్నా రని చెప్పి విడిచి యీ మూఁడు దినములలో లంకలో జరిగిన వృత్తాంతము చెప్పఁ గవి యారంభించెను. హనుమంతుడు లంకవిడిచిన నాఁటి వృత్తాంతము చెప్ప బడుచున్నది.

అర్థములు. అక్కడ=లంకాపురమునందు, త్రిదశాధిపతుల్యుఁడు-ఇంద్రునితో సమానుఁడు, ఎక్కటి = అసహాయుఁడై, ఒంటరిగాఁడై, ఏకశబ్దభవము, అక్కృతి=ఆ కార్యము, సీతాదర్శన, రాక్షసవధ, లంకాదహనాది కార్యములు. ఉక్కు+అఱి = బలగర్వము దిగినవాఁడై. సిగ్గు = లజ్జ, మనస్సంకోచనం లజ్జా హ్యనౌచిత్య ప్రవర్తనాత్ "అనుచితకార్యము చేసినపుడు కలుగు మనస్సంకోచము లజ్జ యనఁబడును. త్రిదశాధిపతుల్యుఁ డనుటచే, ఇంద్రుఁడు చేయఁదగినంత కార్యము చేసినవాఁ డని యర్థము. ఇది మారుతాత్మజ పదమునకు విశేషణము.

తాత్పర్యము

లంకలో రావణుఁ డింద్రసమానుఁడైన హనుమంతుఁ డొక్కఁడే చేసిన చూడ నసాధ్యమై భయంకరమైన రాక్షసవధ లంకాదహనాది కార్యములు తలఁచి రాక్షసుల సభయందు బలగర్వము క్షయించినవాఁడై సిగ్గుపడుచు నేలఁ జూచుచు రాక్షస వీరులతోడ నిట్లనెను. హనుమంతుఁడు నిలువఁబడి యుద్ధము చేసినపుడు రాక్షస సేనలఁ బంపఁగలిగెను. లంకాదహనకాలమున హనుమంతుఁడు మిద్దెల మీఁదఁ బరువు లెత్తుచు నిండ్లలో దొడ్లలోఁ దూఱి కొంపలు తగులఁబెట్టి వాయు వేగమునఁ దిరుగువానిఁ దనకొంప దగులఁబెట్టినను నేమియుఁ జేయఁజాలక పోయెను. తన యిల్లు తాను గాపాడుకొన లేనివాఁడు లంకాపుర మంతయు నేమి కాపాడఁ గలఁడు! ఒక్కని నివారింప లేనివాఁడు పెక్కురు వానరులు వచ్చిన నేమి నివారింపఁగలఁడు? ఇది బలహీనతను దెలుపును గావున నవమానకరము.

ఉ. వానరమాత్రుఁ డొక్కరుఁడు ♦ వాలినశక్తిఁ జొరంగరాని లం
కానగరంబుఁ జొచ్చి నను ♦ గాసునకుం గొనక కా ధరాసుతన్
గానఁగఁ బోయి పెన్నవని ♦ గల్గిన గోపుర మువ్విఁ గూల్చి ర
క్షోనిచయంబుఁ జంపి పురి ♦ ఘోరవిధిన్ దహియించె నుగ్రుఁడై. ౧౩౬

అర్థములు. వాలిన = అతిశయించిన, కొనక = లక్ష్యము సేయక.

తాత్పర్యము

సామాన్యపుఁ గ్రోఁతి (క్రోఁతి రూపు ధరించిన దేవతలు గారు) యొక్కఁడు (పెక్కుమంది గారు) మనవలె నాయుధములు ధరించినవాఁడును గాఁడు. అతిశయించిన శక్తిచేత నెట్టి వారికిని బ్రవేశింప సాధ్యపడని లంకాపురముఁ బ్రవేశించి కాసునకుఁ గల విలువయైన నాయం దున్నదని తలంపక నన్నుఁ దృణముకంటె నీచముగా నెంచి నాయింటిలోఁ బ్రవేశించి సీతను జూడఁబోయి పెద్దగవనిగోపురము విఱుగఁదన్ని నేలఁ ద్రోచి, రాక్షసులఁ జంపి పట్టణమును బీభత్సముగఁ గాల్చెను.

ఉ. ఏమి యొనర్చువాఁడ? నిఁక ♦ నెయ్యది మార్గము? మీకు నాకు మే
లేమి విధంబునం గలుగు? ♦ నేమి యొనర్చిన నెల్లఁ జక్కనా?

రాము నెడాటమం దెటులు♦గ్రాలిన మే లొనగూడు? జెప్పుఁడా
మీ మతమున్, జయాస్పదము♦మేలి సుమంత్రమ యందు రార్యులున్. ౧౨౮

అర్థములు. రాము నెడాటమందు=రాముని విషయమున.

తాత్పర్యము

అయిన దేమో యైనది. దానికి వగచి ఫలము లేదుకదా. ఇఁక జరగవలసిన కార్యము చెప్పుఁడు. నేనేమి చేయవలయును? నే నేమి చేసిన నాకు మీకు మేలు గలుగును? ఏమి చేసితి మేని యంతయుఁ జక్కఁబడును. రాముని విషయమం దేమి చేసిన మనకు మేలుగలదు? మీ యభిప్రాయముఁ జెప్పుఁడు. మంచి యాలోచనయే జయకారణ మని పెద్దలందురు. కావున నాలోచింపక కార్యములు చేయరాదు.

తే. జగతిఁ బురుషులు గలరు ము♦త్తెగలవారు, దలఁప నుత్తమ మధ్యమా♦ధములనంగ
వారియందలి గుణదోష♦వర్గములను, వరుస వచియింతు రాక్షస♦ప్రవరులార!

తాత్పర్యము

లోకమునందు నుత్తములనియు, మధ్యము లనియు, నధము లనియు మూఁడు తెగల పురుషులు గలరు. రాక్షసశ్రేష్ఠులారా! వారే గుణములచే నుత్తములయిరో యే దోషములచే నధము లయిరో చెప్పెద వినుండు.

చ. సమసుఖదుఃఖ బాంధవుల♦సంహతితోఁ దనమేలు గోరు నె
య్యముగలవారితోడఁ దన♦యాత్మను నచ్చిన మిత్రకోటితో
విమలమనీష యోజనలు ♦ వే యొనరించి ఫలంబు దైవయ
త్నముగను గార్యముం గడఁగు ♦ తజ్జనుఁ డుత్తముఁ డండ్రు కోవిదుల్. ౧౨౯

తాత్పర్యము

తన సుఖమే తమ సుఖముగను, తన దుఃఖమే తమ దుఃఖముగను నెంచు బంధువుల సమూహముతోడను, తన మేలుగోరు స్నేహముగలవారితోను, దన మనస్సు నమ్మిన మిత్రులతోను నిర్మలమైన బుద్ధితో శీఘ్రముగ నాలోచించి ఫలము దైవాధీన మని కార్యముచేయ నెవ్వఁడు పూనుకొనునో వాఁ డుత్తమ పురుషుఁడు.

క. దైవమె శరణంబుగఁ గొని, భావించి యొకండె కార్య♦పద్ధతి నొకఁడే
కావింపఁ బూనె నేనియు, నా వాఁ డగు మధ్యముం డ♦టందురు ప్రాజ్ఞుల్. ౧౩౦

తాత్పర్యము

జయాపజయములకు లాభాలాభములకు దైవమే కారణము. ఆయనయే రక్షకుఁ డని దైవమునే నమ్మి యితరులతో నాలోచింపక తనకు మేలనితోఁచిన విధముగఁ గార్యము చేయఁబూనువాఁడు మధ్యమపురుషుఁడు.

క. అరయక గుణదోషంబులఁ, బొరి దైవాశ్రయము చింత♦పూనక పని దా
నెరయింపఁబూనియును నది, పరిపూర్తి నొనర్పకున్న♦వాఁ డధముఁ డగున్.

తాత్పర్యము

ఇటుచేసిన మేలు, అటుచేసిన కీడు అని యాలోచనలేక దైవమును విశ్వసింపక దైవసాహ్యము గోరక కార్యము చేయఁబూని దానిని జక్కఁగఁ దుదముట్టఁ జేయనివాఁడు పురుషాధముఁ డనఁబడును.

ఆ. పురుషులందుఁబోలె ♦ సురవైరివరులార! గొప్పమంత్రములను♦నుత్తమాధ
మములుమధ్యమంబు♦మతివీని లక్షణములను విశదపఱుతుఁ ♦ దెలియవినుఁడు.

తాత్పర్యము

పురుషు లం దుత్తమ మధ్యమాధము లున్నట్టులు మంత్రాలోచన యందును మూఁడువిధములు గలవు. వాని లక్షణములు తెలియఁజెప్పెద వినుఁడు.

తే. శాస్త్రదృష్టిని జూచుచు ♦ సచివులెల్లఁ
గార్యమునయందు నాసక్తి ♦ కడమ వడక
యైకమత్యంబు వహియింతు ♦ రట్టి యదియ
యుత్తమాలోచనం బందు ♦ రుర్వి బుధులు. ౧౩౩

తాత్పర్యము

శాస్త్రమునందు దృష్టి యుంచి యది చెప్పినప్రకారము మంత్రులందఱు కొఱఁతలేని యాసక్తితో నెట్టులైన నీ కార్యము సాధింపవలయు నని పట్టుదలగల వారై యేకాభిప్రాయము గలవారై రేని యట్టిది యుత్తమమైన యాలోచన మని పండితులందురు.

తే. కార్య మాలోచనము సేయఁ ♦ గడఁగు నపుడు
మొదల వేర్వే ఱభిప్రాయ ♦ ములను గొనియుఁ
దుదకు నేకమతంబునఁ ♦ బొదలిరేని
దాని మధ్యమ మందురు ♦ తత్త్వవిదులు. ౧౩౪

తాత్పర్యము

కార్యము నాలోచింపఁ బూనినపుడు మొదట వేఱువేఱభిప్రాయములు గల వారైనను గడపట నందఱు నేకాభిప్రాయము గల వారైరేని మంత్రతత్త్వము దెలిసినవారు దానిని మధ్యమాలోచన మందురు.

తే. ఒకరిమతమును మెచ్చక ♦ యొక్కరుండు, తాను బట్టిన పట్టును♦మానుకొనక
యైకమత్యంబునందు శ్రే♦యస్సు లేద,టన్న యాలోచనం బది♦యధమమంత్రము.

తాత్పర్యము

ఒకఁడు చెప్పిన దానిని మఱియొకఁ డంగీకరింపక తాను జెప్పినదే సరియని హఠవాదము చేయుచు నేకాభిప్రాయమునకు రాక యెవరి అభిప్రాయము వారి దను నాలోచన మధమాలోచనము.

ఉ. మీరలు బుద్ధిమంతులరు • మే లగు కార్యము నిశ్చయించి యీ
తీరునఁ జేయ నౌ ననుచుఁ • దీ రెఱిఁగించుఁడు నా యభీష్ట మా
వీరుల వానరేంద్రులను • వేలకొలందులఁ గూడి భీకరా
కారత ముట్టడించు రఘు • కాంతుఁడు లంక నిజంబు చూడఁగన్. ౧౩౬

తాత్పర్యము

మీ రందఱు బుద్ధిమంతులరు. మంచి యాలోచనచేయు శక్తి గలవారు. కావున నేమి చేసిన మనకు మేలు గలుగునో మీ రంద ఱాలోచించి యిదో యీ ప్రకారము చేయుట తగును అని చెప్పవలయునని నాకోరిక. అంత దీర్ఘముగ నాలోచింప వలసినంత యుపద్రవ మేమి వచ్చినది. ఎవఁడో తుంటరి క్రోఁతివాఁ డొకఁడువచ్చి గంతులుపెట్టి పోఁగానే యింతమూరమాలోచింప వలయునా యందురేమో. అది సరిగాదు. ఏలన రామచంద్రుఁడు భయంకరాకారము గలిగిన వేల సంఖ్యగల వానరులను దోడు చేసికొని లంక ముట్టడించును గాని విడువఁడు. ఇది సత్యము.

ఉ. సానుజుఁడుం జమూయుతుఁడు • నై రఘురాముఁడు దాఁటివచ్చు న
న్యూనసుఖంబుతో జలధి • యుక్తపరాక్రమరీతి మైఁ బయో
హీనముఁ జేసియో మఱి యె • దేని నిజాద్భుతశక్తిఁ జూపియో
కానఁ బురీబలంబులకుఁ • గల్గ శుభం బొక యుక్తిఁ జెప్పుఁడా. ౧౩౭

అర్థములు. అన్యూనసుఖంబుతోన్ =అనాయాసముగ, సుఖమునకు, లోపము లేక యుక్తపరాక్రమ రీతిమైన్=ఆయన పరాక్రమమునకు యోగ్యమైన రీతిగా, పయోహీనము = నీళ్ళులేనిది, పురీబలంబులకున్ = లంకానగరమునకు, సేనలకు, చమూయుతుండు = సేనతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

రాజేంద్రా! క్రోఁతి కావున గంతువేసి సముద్రము దాఁటఁ గలిగెను. రామలక్ష్మణు లెట్లు దాఁటి రాఁగలరు. ఒక వానరుఁడు దాఁటగానే యందఱు వానరులు దాఁటఁగలరని యెట్లు నిశ్చయము అని సందేహింపరాదు. రామచంద్రుఁడు తమ్మునితోడను సేనతోడను గష్టములేక యాయన పరాక్రమమునకుఁ దగినట్లు సముద్రము నెండించియో లేక తన దేదైన నద్భుతశక్తిఁ జూపియో సముద్రము దాఁటివచ్చును. కావున నప్పుడు పురము నే విధముగ రక్షింపవలెను. ఎట్లు చేసిన సేనలకు మేలుకలుగును. వానికి నొక యుక్తిఁ జెప్పుఁడు ఒకవేళ మీరు దలంచునట్లు రాముఁడు రాఁజాలఁ డన్యోనా మఱియు మేలే-మన మాలోచించి జాగ్రత్త పడుటవలన హాని యేమియు లేదుకదా.

— • ౭-వ సర్గము. రాక్షసులు రావణుపరాక్రమంబుఁ బొగడుట. • —

చ. పవిధరవైరిపల్కులకుఁ • బల్కిరి మోడుపుఁ గేల నెల్లదా
నవులు మహాబలాఢ్యులు మ • నంబున నాత్మవిరోధిపక్షముల్

లవము నెఱుంగ లేక మిగులన్ మతిహీనత నీతిబాహ్యులై
భువి నవినీతు లైన సచివుల్ గద రాజుల పాలిశాత్రవుల్. ౧౩౭

అర్థములు. పవిధరవైరి = వజ్రము ధరియించిన యింద్రుని పగవాఁడు, రావణుని యొక్క-ఆత్మవిరోధిపక్షముల్ = తమ బలము, విరోధిబలము, పక్షము= పక్షోమాసార్ధకే పార్శ్వే గృహే సూర్యవిరోధయోః । కేశాదేః పరితో బృందే బలేసఖి సహాయయోః. విశ్వ నిఘంటువు లవము= కొంచెమైనను; మతిహీనతన్= బుద్ధిలేనితనముచేత, నీతి బాహ్యులై =నీతిమార్గము వదలినవారై, అవినీతులు = నీతిమాలినవారు, సచివుల్=మంత్రులు, అర్థాంతరన్యాసాలంకారము.

తాత్పర్యము

రావణుఁ డీ ప్రకారము పలుకఁగా మహాబలవంతులు రాక్షసులు చేతులు జోడించి దేహబలము గలవారేకాని బుద్ధిబలము లేనివారగుటచే తమ బల మెంత-విరోధుల బలమెంత యని తెలిసికొనలేక యిట్టి సందర్భముల నెట్లు ప్రవర్తించుట నీతియో యదియు నెఱుఁగక కొంచెమైనను బుద్ధి లేనివారై యిట్లనిరి. నీతిమాలిన మంత్రులు గదా రాజులకు విరోధులు - చెఱుపు చేయువారు విరోధులు - దురాలోచనము చెప్పి చెఱుపుచేయుదురు గావున దుర్మంత్రులు విరోధులే.

ఇట్లు చెప్పుటయందుఁ గవి యభిప్రాయ మేమన:— రాముఁ డింతవఱకుఁ జేసిన కార్యము లిప్పుడొక క్రోతి చేసిన కార్యము-ఇట్టివా రింకను పెక్కురు గలరు గదా కావున బలవద్విరోధము మేలు లేదని యాలోచించి యంత తేకవాక్యముగా సీతను మరల నిమ్మని పట్టుపట్టి యుండినయెడల రావణుఁ డీయక తప్పించుకొనలేఁడు. అటుగాక వా రధమపురుషులై యధమమంత్ర ముపదేశించి వానిని జెఱిచి నాముసు జేసిరి.

సీ. దనుజేంద్ర! యిటు విషాదముపడ నేటికిఁ? బట్టిసశక్త్యృష్టిపరిఘశూల
సంకుల మగు మహాసైన్యంబు నీ కుండఁ, బరిమార్చితివి భోగవతిని ఫణుల
కైలాసవాసి యక్షవ్యూహసంయుతు, ధనదుని నోడిచితి దర్పగరిమ
నమ్మహేశ్వరునఖ్య మంది కీర్తితుఁడ వై, కినుక దిక్పాలుర గెలిచి తీవు
తే. యక్షులను బట్టి గళవళమందఁ జేసి, కొట్టి వధియించి కైలాసకూటమందుఁ
దేజరిల్లు విమానంబుఁ దెచ్చితిటకు,నీకు సరివారు గలరె ముల్లోకములను?

అర్థములు. శక్తి = పొడుగాటి కత్తులు, రిష్టి - ఋష్టి = ఖడ్గములు ఖడ్గేతు నిస్త్రింశ చంద్రహాసాసి రిష్టయః కౌక్షేయకో మండలాగ్రః కరవాలః కృపాణవత్ ॥ అమరుఁడు. చంద్రహాసర్ష్టి నిస్త్రింశా క్షేయా ఏకార్థవాచకాః ॥ త్రి. శేషము - రిష్టి, రూ. ఋష్టి రెండు రూపములు గలవు.

తాత్పర్యము

రాక్షసేశ్వరా! పట్టిసములు - శక్తులు - ఋష్టులు - పరిఘములు - శూల

ములు నిండిన గొప్ప సేన నీ కుండఁగా నీవేల యిట్లు వ్యసనపడెదవు. భోగవతీ పురమందు సర్పముల నెల్ల గెలిచితివి. కైలాసమున యక్షసమూహములతో నుండు కుబేరుని బల గర్వముచే జయించితివి. ఆ మహేశ్వరునితో స్నేహముచేసి కీర్తిని సంపాదించి కోపించి దిక్పాలకుల నెల్ల జయించితివి. యక్షులనుఁ బట్టి తికమక పడఁగొట్టి చంపి కైలాస శిఖరమందున్న విమానము నిచ్చటికిఁ దెచ్చితివి. నీకు సమానులు మూఁడులోకములందును గలరా.

చ. భయమున నీదు సఖ్యమును ♦ బ్రార్థన సేయుచు నాత్మసంభవన్
మయుఁ డను దానవేశ్వరుఁడు ♦ మానుగ నిచ్చెను నీకు భార్యగా
జయము గొనంగ లేదొకో ర♦సాతలసీమ రణంబునన్ బిలే
శయులను వాసుకిన్ జటిని ♦ శంఖునిఁ దక్షకు గెల్చి శూరతన్. ౧౪౦

అర్థములు. బిలేశయులను = సర్పములను – బిలే+శయులు= బిలమందు శయనించువారలు=అలుక్సమాసము.

తాత్పర్యము

భయమున నీయకుండినఁ జంపుదు వను భయముచే నీ స్నేహముఁ గోరిగదా దానవేశ్వరుఁడు మయుఁ డనువాఁడు తన తనయను నీకు భార్యగా నిచ్చెను. (ఉత్తర రామాయణమున ౫౯ వ పద్యము చూడుఁడది) పాతాళమునకుఁ బోయి యుద్ధమున సర్పములను వాసుకిని జటిని శంఖుని తక్షకుని శౌర్యముచే గెలువలేదా.

ఉ. దానవనాయకుండు బల♦దర్పితమానసుఁ డౌ మధుండు కుం
భీనసిసౌఖ్యధాత యతి♦వీరుఁడు నీకు వశంపడండె ? యు
ద్ధాన సమస్తదిక్పతుల♦దర్ప మడంచి సురేంద్రలోకమున్
మానక చేరి యందు బల♦మర్దను నిర్జితుఁ జేయవే ప్రభూ. ౧౪౧

అర్థములు. బలదర్పిత మానసుఁడు=బలముచే గర్వించిన మనస్సు గలవాఁడు – కుంభీనసి సౌఖ్యధాత=కుంభీనసి మగఁడు, బలమర్దనున్=ఇంద్రుని.

తాత్పర్యము

దానవుల కధిపతియు బలగర్వము గలవాఁడును – నీ చెలియలు కుంభీనసి మగఁడును నగు మధుఁడు నీకు వశపడలేదా – యుద్ధమున సమస్తదిక్పాలురను గర్వమడంచి యింద్రలోకమునకుఁ బోయి యందు నింద్రుని జయింపలేదా.

క. బలయుతుల లబ్ధవరులను, గలిశూరుల నక్షయులను ♦ గదనములోనన్
నిలిచి యొకయేఁడు దనుజుల, గెలువవె మాయలను నేర్చి♦కీర్తిం గనవే. ౧౪౨

అర్థములు. లబ్ధవరులను=బ్రహ్మచే వరముల నొందిన వారలను, కలిన్= యుద్ధమందు, అక్షయులన్ నాశము లేనివారలను, కదనములోనన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము

బలవంతులును బ్రహ్మచే వరము పొందినవారును రణశూరులును నాశము గాని వారు నగు దనుజులతో నొక సంవత్సరము యుద్ధముచేసి గెలువలేదా; వారి వలన మాయలను నేర్చి కీర్తి సంపాదింపవా.

క. విక్రమవంతుల మఱి ని,ర్వక్రభుజబలాఢ్యయుతుల ♦ వరుణాత్మజులన్
   జక్రాన్వితుల బాహుప,రాక్రమమున గెలువలేదె ♦ రణలంపటతన్. ౧౪౩

అర్థములు. నిర్వక్ర=వంకరలేని, లోపములేని, భుజబల+ఆఢ్యయుతుల = బహుబల సంపత్తితోఁ గూడినవారు, చక్రాన్వితులన్ = సేనలతోఁ గూడినవారిని రణలంపటతన్=యుద్ధమందలి యాశక్తిచే.

తా త్ప ర్య ము

పరాక్రమము గలవారిని, సంపూర్ణ భుజబల సంపన్నులను, సేనలతోఁగూడిన వారలను వరుణ పుత్రులను యుద్ధమందలి యాసక్తిచే భుజబలముచే గెలువలేదా.

చ. ప్రకటితశాల్మలీద్రుమవి♦భాసము భీకరమృత్యుదండన
   క్రకమును గాలపాశసుత♦రంగము దండధరోగ్రకింక రా
   హికము పరేతరాడ్బలమ♦హిష్ఠసముద్రముఁ జొచ్చి మృత్యువున్
   దికమకఁ గూర్పవే జగము ♦ దిగ్భ్రమ నొంద జయింబుఁ గాంచవే. ౧౪౪

అర్థములు. ప్రకటిత = ప్రసిద్ధపఱుపఁబడిన, శాల్మలీద్రుమ= బూరుగు చెట్లచేత, బూరుగుచెట్లవంటి యాయుధములచేత, విభాసము = విశేషముగఁ బ్రకాశించునది, భీకర=భయము కలిగించు, మృత్యుదండ నక్రకమును = యమ దండ మను మొసళ్ళు గలదియు, కాలపాశసుతరంగము=కాలపాశ మను నలలు గలది, దండధర=యమునియొక్క, ఉగ్రకింకర = భయంకరులైన కింకరు లనెడి, అహికము=పాములు గలది, పరేతరాట్ = యమునియొక్క, బల = సేనయనెడి, మహిష్ఠ సముద్రము=గొప్ప సముద్రమును, మృత్యువున్ = యముని, మృత్యు దేవతను, తికమిక=కలఁత, సముద్రమునందుఁ జెట్లెట్లుండునని సందేహింపరాదు. ద్వీపములందు మహావృక్షములు గలవు.

తా త్ప ర్య ము

ప్రసిద్ధమైన బూరుగు చెట్లచేఁ బ్రకాశించునదియు, భయంకరమైన మృత్యు దండ మను మొసళ్ళు గలదియు, కాలపాశ మను నలలు గలదియు, యమకింక రులను పాములు గలదియు, నగు యముని సేన యను గొప్ప సముద్రమునఁ బ్రవేశించి మృత్యుదేవతను గలవరము గొనఁజేయలేదా? లోకము ద్రిగ్భ్రమ నొంద జయింపలేదా ?

ఉ. వృత్రవిరోధిసన్నిభులు ♦ విశ్రుతవీర్యపరాక్రమాఢ్యు లా
   క్షత్రియు లీ ధరాస్థలిని ♦ గానవృక్షము లట్టు లుండఁగా

దాత్రముచేతఁ బోలె శర • దారితగాత్రులఁ జేయవా? క్షి; యా
గోత్రధృతీడ్యవిక్రములకున్ సరి వచ్చునె రాముఁ డాజిలోన్. ౧౮౫

అర్థములు. వృత్ర విరోధి సన్నిభులు=ఇంద్రునితో సమానులు, విశ్రుత=ప్రసిద్ధికెక్కిన, కాననవృక్షములు=అడవిలోని చెట్లు, అడవిలోని చెట్లు అడ్డము లేక తమ యిష్టము వచ్చినట్లు పెరిఁగి యభివృద్ధి చెందినట్లు క్షత్రియులు పెరిగినారని భావము. దాత్రము=కొడవలి, ఇచ్చట గొడ్డలి యనియే చెప్పవలెను. శర=బాణములచే, దారిత = చీల్పఁబడిన, గాత్రులన్ = దేహములు గలవారినిగ. గోత్రధృతి = పర్వతములవంటి ధైర్యముగల, ఈడ్య=స్తోత్రము చేయఁదగిన, విక్రములకున్ = పరాక్రమము గలవారికి

తాత్పర్యము

నేను దేవదానవాదులచే భయములేకుండ వరము గోరితిని, గావున నింద్రాదుల జయింపగల్గితిని. మనుష్యులవలన భయములేకుండ నేను గోరలేదు గదా! రాముఁడు మనుష్యుఁడుగదా యందువేమో. ఇంద్రునితో సమానులై మహాబల పరాక్రమవంతులైన యనరణ్యాది క్షత్రియులడవిచెట్లవలె బాగుగ యథేచ్ఛముగ బలిసియుండగా గొడ్డలితోఁ గొట్టినట్లు బాణములచే వారిని జీల్చలేదా? వారు మనుష్యులుగారా? పర్వతములవలె ధైర్యముగలవారును స్తోత్రముచేయఁబడిన విక్రమము గలవారు నగు ఆ రాజులకీ రాముఁడు యుద్ధములో సమానుఁడగునా?

ఉ. ఊరక యుండు గాసిఁ గొన • కో మనుజాశనవాథ! పాకజి
 ద్వైరి యొకండె చక్కఁడుచు • వానరకోటులనెల్ల, మృత్యునం
 హారు మహేశు యజ్ఞమున • హర్షితుఁ జేసి సుదుర్లభంబు మ
 ద్వారము నా వరంబుఁ గని • రంజిలఁ జేయఁడె మొల్లవారలన్. ౧౮౬

తాత్పర్యము

రాక్షసేశ్వరా! నీ వే యాలోచన చేయవలసిన పనిలేదు. ఏకార్యము చేయవలసిన పనిలేదు. నిశ్చింతముగ నూరకుండుము. వానరుల నందఱను నింద్రజిత్తొక్కఁడే చంపును. యముని జయించిన శివునిగూర్చి యజ్ఞముచేసి యాయనను సంతోషపెట్టి మిక్కిలి దుర్లభము అడ్డగింపరానిది యగు వరంబు సంపాదించి రాక్షసుల నందఱ సంతోషపెట్టఁడా?

సీ. శక్తితోమరచయ • శకులీకమును వినిఁ, కీర్ణాంత్రశైవాల • కీలితంబు
 వారణకచ్ఛప • వారసంబాధంబు, నశ్వమండూకచ • యాంచితంబు
 నాదిత్యరుద్రమ • హాగ్రాహమును మరు, ద్వసుమహాపన్నగ • దరకరంబు
 స్యందనతురగగ • జాంబుపూరంబును, బటువ త్రిసైకత • భ్రాజితంబు

తే. నైన నిర్జరసైన్యమ • హార్ణవంబుఁ, బఱచి శంబరవృత్రహుఁ • బట్టి లంక
 కిటకుఁ గొనివచ్చి శ్రీసుర • జ్యేష్ఠునాజ్ఞఁ, దలఁచి విడిచిన శూరుఁడీ • తండకాఁడె. ౧౮౭

అర్థములు. శక్తితోమరచయ=శక్తులయు, చిల్లకోలల సమూహ మనెడి, శకులీకమును = చేఁపలు గలదియు, వికీర్ణ=రాలియున్న, ఆంత్ర = ప్రేవులనెడి, శైవాల=పాఁచిచే, కీలితంబు = నిండినదియు, వారణ=ఏనుఁగు లనెడి, కచ్ఛప = తాఁబేళ్ళయొక్క, వార = సమూహముచే, సంబాధితంబు = నిండినది, అశ్వ = గుఱ్ఱము లనెడి, మండూక = కప్పల, చయ = గుంపుచే, అంచితంబు=ఒప్పినది, ఆదిత్యరుద్ర = సూర్యులు, రుద్రుఁడు ననెడి, మహాగ్రాహమును=గొప్ప మొసళ్ళు గలదియు, మరుత్, వసు=మరుత్తులు వసువులనెడి, పన్నగ = పాములచే, దర కరంబు = భయము కలిగించునది, స్యందన తురగ గజ = రథములు గుఱ్ఱములు ఏనుఁగులు నను, అంబు = నీళ్ళ, పూరంబును = ప్రవాహము గలదియు, పటు= దృఢమైన, పత్తి=పదాతు లనెడి, సైకత = ఇసుక దిబ్బలచే, భ్రాజితంబు=ప్రకాశించునదియు, నిర్జరసైన్య = దేవతల సేన యనెడి, మహార్ణవంబు = గొప్ప సముద్రము, పటుచి = పాఱఁదోలి, శంబర వృత్రహాన్=శంబరుని వృత్రుని జంపిన యింద్రుని, సురజ్యేష్ఠ=బ్రహ్మయొక్క.

తాత్పర్యము

శక్తులు తోమరములను చేఁపలు, ప్రేవులనెడి ప్రాఁచితీఁగలు, ఏనుఁగులనెడి తాఁబేళ్ళు, గుఱ్ఱము లనెడి కప్పలు, సూర్యుఁడు రుద్రుఁడు నను పెద్ద మొసళ్ళు - మరుత్తులు వసువులనెడి పాములు, తేరులు - గజములు-గుఱ్ఱములనెడి నీళ్ళు, కాలిబంట్లనెడి యిసుకదిబ్బలు గల దేవసేన యనెడి సముద్రమును పాఱి పోఁజేసి (ఎండించి) శంబర వృత్రుల జంపిన యింద్రుని జెఱఁబట్టి లంకకు దీసికొని వచ్చి బ్రహ్మ యాజ్ఞ ప్రకారము వదలిన శూరుఁ డితఁడే కదా.

ఈ రాక్షసులు చెప్పిన విషయము లన్నియు నుత్తరకాండంబున వివరింపఁ బడినవి.

ఉ. కావున నిట్టి యాత్మజు నఖండపరాక్రము నింద్రజిత్తుఁ గీ
 శావళి రామయుక్తముగ నంతకు నంతికసీమఁ జేరఁగాఁ
 బోవ ననుజ్ఞ యిమ్ము, పొరిపుచ్చును వారలఁ, బ్రాకృతుం డొకం
 డావిధిఁ జేటు గూర్చె నని యాత్మఁ గలంగకు, గెల్తు రాఘవున్. ౧౮౮

అర్థములు. అంతకు = యమునియొక్క, అంతికసీమన్ = సమీప ప్రదేశమును, పొరిపుచ్చును=చంపును, ప్రాకృతుఁ డొకండు = ఎవఁడో యొక నీచుఁడు, క్రోఁతిగాడు.

తాత్పర్యము

ఇటువంటి గొప్పకార్యము చేసిన నీ కొడుకును నింద్రజిత్తును, పూర్ణ పరాక్రము రామునితోడ వానరులఁ జంపఁబోవునట్లు ఆజ్ఞాపింపుము, వారలను

జంపును. ఎవఁడో యొక నీచపుఁ గ్రోఁతిగా డా ప్రకారము గీడు గలిగించెనని వ్యాకులపడకుము. రాముని నీవు గెలువఁగలవు.

—♦ ౮-వ సర్గము. ప్రహస్తాదులు తమతమ పరాక్రమంబు రావణునితోఁ జెప్పుట. ♦—

ఉ. అంతట సైన్యనాథుఁ డసి ♦ తాబ్దనిభుండు ప్రహస్తుఁ డుగ్రదు
ర్దాంతపరాక్రమోద్ధతుఁడు ♦ ప్రాంజలియై యసురేంద్ర! యేల యీ
చింత? సురాసురోరగవి ♦ శిష్టపిశాచగణంబు లేని నీ
చెంతలఁ జేర లేవనఁగ ♦ జెప్పెడి దేమి వనేచరావలిన్. ౧౪౯

అర్థములు. అసిత+అబ్ద + నిభుండు = నల్లని మేఘముతో సమానుఁడు, ఉగ్ర = భయంకరమైన, దుర్దాంత=అణపరాని, పరాక్రమ = పరాక్రమముచే, ఉద్ధతుఁడు = గర్వించినవాఁడు, ప్రాంజలియై = అంజలి జోడించినవాఁడై, సుర+అసుర+ఉరగ+విశిష్టపిశాచగణంబులు = దేవతలయు, అసురులయు, సర్పములయు, సమస్త పిశాచములయు సమూహములైనను, వనేచర+ఆవళి=వానరుల గుంపును, వనే+చర=సప్తమ్యలుక్సమాసము.

తాత్పర్యము

సభలోనుండు రాక్షసు లందఱునిట్లు చెప్పినపిమ్మట మంత్రులు ప్రముఖులు వారివారి యభిప్రాయము వేఱువేఱఁ జెప్పుచున్నారు. అందు మొదట ముఖ్య సేనానాయకుఁడు ప్రహస్తుఁడు తన యభిప్రాయము దెలుపుచున్నాఁడు.

ఇట్లందఱుఁ జెప్పిన పిమ్మట మేఘమువలె నల్లనివాఁడు భయంకరమై యణఁప రాని పరాక్రమముచే గర్వించినవాఁడును నగు ప్రహస్తుఁడు నమస్కరించి యిట్లనియె. రాక్షసేంద్రా! నీ కేల యీ విచారము. దేవాసురులైనను పన్నగ పిశాచములైనను నీ సమీపమునకు నైన రాలేవు. ఇఁకఁ గ్రోఁతులా నీ యెదుట నిలిచి యుద్ధముచేయఁ గలవు?

ఉ. ఎవ్వఁడు మ మ్మెదుర్పఁ ♦ గ మమ్ము నెవ్వఁడు గెల్వఁగఁ జాలు నంచు మే
మివ్విధ సప్రమాదగతి ♦ నేమఱి యుంటిమి గాన వానరుం
డవ్విధి మేనితోఁ జనఁగ ♦ నయ్యెను వంచన చేసి, కానిచో
నవ్వనగోచరున్ యమగృ ♦ హాతిథిగా నొనరించి యుండుమే? ౧౫౦

అర్థములు. ఇవ్విధన్=ఈ విధముగ - సప్రమాదగతి=హెచ్చరిక తప్పి-యమగృహాతిథిగా = యముని యింటికి నతిథిగా - చంపియని యర్థము - పర్యాయోక్త్యలంకారము.

తాత్పర్యము

మమ్మెదిరించు వాఁ డెవ్వఁడు? మమ్ము గెలువఁగల వాఁడెవ్వఁడు? అని యీ ప్రకారము మేము హెచ్చరిక దప్పి యేమఱియుంటిమి. కావున వానరుఁడు వంచన

చేసి ప్రాణముతోఁ బోనఁ గలిగెను. కాని కొంచెము హెచ్చరిక కలిగి యుండినచో వాని నప్పుడే చంపి యుండనా ?

చ. జలధిపరీతధారిణి స• శైలవనాంత మవానరంబుగాఁ
 జలిపెద, నాజ్ఞ యిమ్ము పున • చయ్యన నేగెదఁ, గ్రోఁతిచేత నే
 విలయము గూడకుండ నొక • వేయువిధంబులఁ గాపు పెట్టెదన్,
 గలుగదు స్వాపరాధభవ•కష్ట మొకింతయు నీకు నాపుకున్. ౧౫౧

అర్థములు. జలధిపరీతధారిణి = సముద్రముచేఁ జుట్టబడిన భూమి-అవానరంబుగాన్=వానరు లనువారు లేకుండ - స్వాపరాధ భవకష్టము = సీతాపహరణ మనెడి స్వయంకృతాపరాధము వలనఁ గలుగు కష్టము.

తాత్పర్యము

సముద్రముచేఁ జుట్టఁబడిన భూమి యంతయు కొండలతో నడవులతోఁగూడిన దానిని వానరులనువారు లేకుండఁ జేసెదను. ఆజ్ఞ యిచ్చెదవేని యిపుడేపోయెదను. నీ వొక క్రోఁతిచేఁబోయిన వారొక క్రోఁతివచ్చి యూరిపై బడుదురేమో యనకుము. అట్టి భయములేకుండ వెయ్యి విధముల రక్షణోపాయములఁ గావించెదను. చేతులారఁ జేసికొనిన దోషమువలని కష్టము నీకుఁ గలుగదు.

స్వాపరాధభవ కష్ట మనుటచే నీవు స్వయముగఁ జేసినదేమో దోషమే. దానివలన నవమానము రాకుండుటకై యుద్ధము చేయవలసి యున్నదని ప్రహస్తుని యభిప్రాయము.

ఆ దోషము సవరించుకొనుటకు రెండుపాయములు సీత నిచ్చుట మొదటిది. అది యవమానకర మని తోఁచినయెడల యుద్ధము సేయుట-మొదటి యభిప్రాయమునఁ జెప్ప రేకీభవింపమిచే నంతఃకలహ మాపుటకై వారిమార్గమును దా ననుసరించి యుద్ధవిషయము చెప్పెను. ప్రహస్తుని వాస్తవాభిప్రాయము ౧౧౬౮ వ పద్యంబునఁ జెప్పఁబడినది.

ఉ. క్రుద్ధుఁడు దుర్ముఖుం డనెడి•ఘోరపలాశి వచించెఁ గ్రోఁతి దు
 ర్బుద్ధి పురంబువారికిని • బౌల్తికకూటువకున్ సురేంద్రునిన్
 బద్ధ నొనర్చినట్టి బల•వంతున కీ యసురాధినేతకున్
 సిద్ధ మగౌరవం బొనరఁ • జేసెను, దీనిని సైఁపఁ జెల్లునే. ౧౫౨

అర్థములు. క్రుద్ధుఁడు = కోపించినవాఁడు - పలాశి = రాక్షసుఁడు - పల+అశి=మాంసముదినువాఁడు; దుర్బుద్ధి = చెడుబుద్ధిగలవాఁడు; పౌల్తికకూటువకున్=అంతఃపురస్త్రీలకు.

తాత్పర్యము

ప్రహస్తుఁడు తా నజాగ్రత్తగా నుండుటచే వానరుఁడు చెడుకార్యము చేయ గలిగెనని చెప్పఁగా గోపించిన దుర్ముఖుఁ డను రాక్షసుఁ డిట్లను చున్నాఁడు.దుర్బుద్ధి

గల క్రోఁతి నగరమున నుండువారికిని కొంపలు గాల్చి యంతఃపుర స్త్రీలు నడి వీథులలోకి వచ్చునట్లు చేయుటచే స్త్రీల గుంపునకును, ఇంద్రుని బట్టి కట్టిన రాక్షసేశ్వరునకు నవమానము గలిగించుట సత్యము. నే నజాగ్రత్తగా నుంటి ననిన పోయిన మానము మరలి వచ్చునా? ఈ యవమానము సైఁప సాధ్యమా ?

క. ఈనిమిషంబున నొకఁడన, వానరవర్గంబు మిన్ను ♦ ప్రాఁకిన జలధిం
దీనతఁ దూఱిన భుజంగ; స్థానంబున కేగఁ బట్టి ♦ చంపెదఁ గడిమిన్. ౧౫౩

తాత్పర్యము

అవమానము కలుగుట సత్యమే, దానిని సహింపరాదనుట సత్యమే, అయినను దానికి నీవేమి ప్రతీకారము చెప్పెద వందువా! నే నొకఁడనే యీనిమిషంబునఁ బోయి వానర సమూహము ఆకాశమున కెగిరిపోయినను ఏడ్చుచు సముద్రములో దాఁగినను పాతాళంబునకుఁ బోయినను బట్టి చంపెదను.

చ. అనవుడు వజ్రదంష్ట్రుఁడు మహాబలశాలి పలాస్రరూషితం
బును బరిఘంబుఁ గేలఁ గొని ♦ బొబ్బిడుచుం బలుకున్ దపస్వియా
వనచరుతోడ నేమి పని ♦ ప్రాలిన శక్తిని రాముఁ డుండఁగా
ననుజుఁడు లక్ష్మణుండుఁ బ్లవగాధిపుఁ డుండఁగ? నే నొకండనే. ౧౫౪

అర్థములు. పల+అస్ర+రూషితంబు = మాంసము నెత్తురుతోఁ బూయఁబడినది. (పూజా వేళ నని శేషము) తపస్వి = తపము చేయువారివలెఁ గూరగాయలు దిని శుష్కించినవాఁడు, కావుననే (౨) కనికరింపఁదగినవాఁడు; వనచరుతోడన్ = అడవులందుఁ దిరుగువానితోఁ.

తాత్పర్యము

దుర్ముఖుఁ డిట్లు చెప్పఁగా దానిని మెచ్చక వజ్రదంష్ట్రుఁ డనువాఁడు మాంసము నెత్తురు పూయఁబడిన యినుపకట్ల గుదియఁ జేతఁ దీసికొని సింహనాదము చేయుచు నిల్లనియె. క్రోఁతులు జంపెదనని కొంద అనుచున్నారు. క్రోఁతు లడవులలోఁ దిరుగునవి, మనయిండ్లతో వాకిండ్లతో మనతో వానికేమి పని ? అదియునుగాక తపస్సు చేసికొనువారివలెఁ గాయగసురులు దిని జీవించునవి, కావుననే కనికరింపఁ దగినవి. వానిని జంపిన రాఁగల లాభమేమి? అంతతో విరోధము పోవునా ? మనలను నవమాన పఱుపఁ బూనిన శత్రువులు రామలక్ష్మణ సుగ్రీవులు కదా ! వారిని విడిచి వానరులను జంపుట వలన మేలులేదు. కావున నే నొకఁడనే.

క. రాముని సుగ్రీవాన్వితు, సౌమిత్రియుతంబుగాఁగఁ ♦ జప్పున నిపుడే
నా మడఁతుఁ బరిఘంబున, భీమంబుగఁ గ్రోఁతు లదరి ♦ బెదరి తపింపన్.

తాత్పర్యము

మీ యెవ్వరి సాహాయ్యము మక్కఱలేకయే లక్ష్మణ సుగ్రీవులతోడ రాముని

నా పరిఘుంబున నిప్పుడే చంపెదను. అది చూచి వానరు లదరి బెదరి సంతాపపడి పరువెత్తుదురు.

శా. రాజేంద్రా! విను మే నుపాయ మనువారంబ లెక్కదన్, యుక్తులన్
భ్రాజద్ధీ వచియించువాఁడ యరిఁ దీర్పం జాలు నిస్తంద్రుఁడై
యోజస్స్వితులఁ గామరూపధరులన్ • యుద్ధక్రియాభీలర
క్షోజాలాగ్ర్యుల నేఁటి వేలకొలఁదిం • గూర్పం దగున్ వెంటనే. ౧౫౬

అర్థములు. భ్రాజద్ధీ = ప్రకాశించు బుద్ధిచే, అరిన్ = పగవానిని, తీర్పఁ జాలున్=చంపఁ గలుగును, నిస్తంద్రుఁడై = ప్రమాదము లేనివాఁడై, ఓజస్వితులన్=సంపూర్ణబలముగల వారిని, యుద్ధక్రియా=యుద్ధకార్యమందు, అభీల=భయంకరులైన, రక్షోజాలాగ్ర్యులన్=రాక్షస శ్రేష్ఠులను,

తాత్పర్యము

రాజా! నే నొక యుపాయము చెప్పెదను. బుద్ధి వికాసముచేఁ జక్కని యుపాయము చెప్పువాఁడే శత్రువుల హెచ్చరికతో సంహరింపఁగలవాఁడు కావున బలవంతులగు రాక్షసులు కామరూపులను యుద్ధక్రియయందు భయంకరులను నేరి వెంటనే జతగూర్పవలయును.

ఉ. వారలు మానవాకృతుల • వారిజమిత్రకులీను రామునిన్
జేరి భవత్సహోదరుఁడు • శ్రీభరతుం డనిపె న్మము న్నభా
కారుఁ డ దేమొ యాత్యయిక • కార్యము గల్గెఁ బురంబుఁ జేర నే
తేరు మటంచుఁ బల్కఁ జనఁ • దెప్పున నాతఁడు పోవు సేనతోన్. ౧౫౭

అర్థములు. వారిజమిత్ర కులీనున్ = గొప్పదగు సూర్యవంశమునఁ బుట్టిన వానిని, ఆత్యయిక కార్యము=ఆవశ్యము వెంటనే చేయవలసిన పని.

తాత్పర్యము

ఇట్లు చేరినవారలు మనుష్యుల వేషములు వేసికొని రామునియొద్దకుఁ బోయి నీ తమ్ముఁడు భరతుఁడు పంపఁగా వచ్చితిమి. - అయోధ్యయం దేదో నీవు చక్కఁజేయవలసిన యావశ్యకార్యము గలదఁట, నిన్నుఁ బిలుచుకొనిరమ్మని మమ్ముఁ బంపెను అని చెప్పఁగానే యతఁడు సేనతో నయోధ్యకు వెంటనే పోవును.

క. ఆ సమయంబునఁ జాపశ, రాసిగదాకరుల మగుచు • నభ్రతలమునన్
రాసుల పై ప్లవగులను బ, రాసులఁ జేయంగవచ్చు • నశ్మసువృష్టిన్. ౧౫౮

అర్థములు. చాప - శర - అసి - గదా కరులము = విల్లు బాణములు - కత్తులు-గదలు చేతగలవారమై-అభ్రతలమునన్=ఆకాశమునుండి, పరాసులను = చచ్చినవారిని, అశ్మసువృష్టిన్ = రాలవానచే.

తాత్పర్యము

అట్లు రాముఁ డయోధ్యకుఁ బోవు సమయంబున విల్లు బాణములు గదలు

కత్తులు ధరించి యాకాశమునుండి వానరులమీఁద వాలవాన గురియించి చంప వచ్చును.

క. ఈ యనువున మా పన్నిన, మాయలలోఁ జిక్కి రామ ♦ మహిపాలుఁడు ననుజుం
డా యమసదనముఁ జేరఁ, బోయెద రంతటను బీడ ♦ పోవును మనకున్. ౧౭

తాత్పర్యము

ఈ విధముగ మేము పన్నిన యుపాయములకుఁ జిక్కుపడి రాముఁడు తమ్మునితోఁ జచ్చును. అంతతో మనపీడ పోవును.

తే. కుంభకర్ణసుతుండు ని♦కుంభుఁ డనెడి, ఘోరదర్పుఁడు పరమసం♦క్రుద్ధుఁ డగుచు
భువనరావణు రావణుఁ ♦ బోలఁజూచి, యధికగంభీరవాక్యముల ♦ ననియె నిట్లు.

అర్థములు. ఘోరదర్పుఁడు=భయంకర బలగర్వము లు గలవాఁడు, భువనరావణున్=లోకముల నేడ్పించు.

తాత్పర్యము

ఆ మాటలు విని కోపించినవాఁడై కుంభకర్ణుని కొడుకు నికుంభుఁ డనువాఁడు బలగర్వముచే లోకము నేడిపించు రావణుఁజూచి మిగుల గంభీరములైన వాక్యముల నిట్లనెను.

ఉ. ఉండుఁడు మీర లింద యసు♦రోత్తముఁగొల్చుచు నే నొకండ దో
ర్దండపరాక్రమక్రమవి♦దారితగాత్రులఁ జేసి ద్రుచ్చెదన్
భండనసీమ రాఘవుని ♦ భ్రాతృయుతున్ హనుమం గపిప్రభున్;
జెండెదఁ దక్కు వానరవి♦శిష్టచమూనివహంబు ప్రేల్మిడిన్. ౧౯

అర్థములు. దోర్దండ=దండములవంటి భుజములయొక్క, పరాక్రమక్రమ=పరాక్రమ విధముచే, విదారిత గాత్రులన్ = చీల్పఁబడిన దేహములు గలవారిని భండనసీమన్=యుద్ధరంగమందు, ప్రేల్మిడిన్=చిటికెవేయు కాలములో.

తాత్పర్యము

మీ రందఱు రాక్షసశ్రేష్ఠుని సేవ సేయుచునిందే యుండుఁడు, నేనొక్కఁడనే భుజబల పరాక్రమముచే యుద్ధరంగమందు రాముని లక్ష్మణుని హనుమంతుని సుగ్రీవుని జీల్చి పాఱవేసెదను. తక్కిన వానరసేన నంతయు తునుకలుగా చిటికె వేయు కాలములో ఖండించెదను.

క. అప్పుడు వజ్రహనుం డను, నప్పలలాశనుఁడు పర్వ♦తాభుఁడు క్రోధం
బుప్పతిలఁ బెదవి నాకుచుఁ, దెప్పున వచియించె దనదు♦ధీరత వెలయన్. ౨౦

అర్థములు. పలలాశనుఁడు = రాక్షసుఁడు, పర్వతాభుఁడు = కొండతో నమానుఁడు, ఉప్పతిలన్=పుట్టఁగా.

తాత్పర్యము

అప్పుడు వజ్రహనుఁ డను రాక్షసుఁడు కొండంత దేహము గలవాఁడు

కోపము పుట్టుచుండఁగా పెదవి నాకుచు తన ధైర్యము ప్రకాశించు నట్లిట్లు చెప్పెను.

ఉ. ఒక్కఁడఁడిఁజాలి మీరుఁ జను•డీ పదఁడీ మదిలోనఁ జింతలం
దక్కి యథేచ్ఛమైఁ బను లొ•నర్చుకొనం, దనివార మాంసమున్
మెక్కఁడు ద్రాగుఁడీ మధువు • మెచ్చగు నాటల నాడుఁ, డొక్కఁడన్
గ్రక్కున రాఘవాంగదుల • గాడ్పుసుతుం గపిరాజుఁ ద్రుంచెదన్. ౧౬-౩

తా త్ప ర్య ము

రాక్షసులారా! యీ ప్రసంగము మీకేల? మనస్సులో విచారము మాని యిష్టము వచ్చినట్లు మీమీ గృహకృత్యములు చేసికొనఁ బొండు పొండు, మీరు తృప్తిగలుగ మాంసముఁదినుడు, సారాయము త్రాగుడు, ముచ్చటలాడుడు నేనొకఁడనే రామలక్ష్మణులను సుగ్రీవాంగద హనుమంతులను జంపెదను.

—♦ ౯-వ సర్గము. రభసాదులు విజృంభించి పలుకుట ♦—

సీ. అంతట రాక్షసుల్ • యజ్ఞహుండు నికుంభ, రభస మహాపార్శ్వ • రశ్మికేతు
సూర్యశత్రువులును •సుప్తఘ్నుఁడును మహో, దరుఁ డగ్నికేతుండు•దశశిరస్కు
సుతుఁ డింద్రజిత్తు ని•స్తులుఁడు ప్రహస్తుండు నతికాయుఁడును, విరూ•పాక్షుఁడుగ్ర
ధూమ్రాక్షుఁడును వెండి• దుర్ముఖవజ్రదంష్ట్రులు పట్టిసంబులు•శూలములును

తే. ప్రాసశక్తి పరశ్వధ•పరిఘములును, గాండీవిపితచాపముల్ • ఖడ్గములును
నొడిసి త్రిప్పుచుఁ జెలరేఁగి•మిడిసిపడుచు, మండుచును బల్కి రసురప్ర•కాండుతోడ.

తా త్ప ర్య ము

ఆవల యజ్ఞహుఁడు, నికుంభుఁడు, రభసుఁడు, మహాపార్శ్వుఁడు, రశ్మికేతువు, సూర్యశత్రువు, సుప్తఘ్నుఁడు, మహోదరుఁడు, అగ్నికేతుఁడు, రావణునికొడుకు ఇంద్రజిత్తు, అసమానుడగు ప్రహస్తుఁడు, అతికాయుఁడు, విరూపాక్షుఁడు ధూమ్రాక్షుఁడు, దుర్ముఖుఁడు, వజ్రదంష్ట్రుఁడు, వీరందరు నికుంభుని మార్గ మనుసరించి యట్లే చేయుకలఁచి యహమహమికతో నేను ముందనిన నేను ముందనుచు వారి వారి యాయుధములు పట్టసములు శూలములు ప్రాసములు శక్తులు గండ్రగొడ్డండ్లు ఇనుపగుదియలు బాణములతోడి విండ్లు కత్తులు వీనిని బట్టుకొని త్రిప్పుచు విజృంభించి యెగిరిపడుచు కోపముతో మండిపడుచు రాక్షసశ్రేష్ఠునితో నిట్లనిరి.

ఇందు అసురప్రకాండునితోడ నని ప్రకాండ శబ్దము పుంలింగముగాఁ బఠింపఁ బడినది. అమరకోశమునందు "మతల్లికా మచ్చరికా ప్రకాండ ముద్ధతల్లజౌ" యని, నియత నపుంసకలింగముగాఁ బఠింపఁబడినది. అయినను 'ప్రకాండో ఽస్త్రీ ప్రశస్తేచ' యని నానార్థరత్నమాల యందు పుం నపుంసకముల రెంటిని జెప్పుటచేతను 'క్షత్రియ ప్రకాండః' అని భవభూతి మహావీర చరిత్రమందు (4_35_5_48) పఠించి యుండుట చేతను "ప్రకాండో నస్త్రీ విటపే మూలశాఖాంతరే తరోః। శస్తే" యని మేదిని యందుండుటను 'ప్రకాండో విటపేశస్తే మూలస్కంధాంతరే తరోః' యని విశ్వనిఘంటువు

నందుండుటను "ప్రకాండః పుంస్యపి అస్త్రీ ప్రకాండో విటపే తరుస్కంధ ప్రశ
స్తయోః" అని సుధయందుండుటను నిచ్చటఁ బుంలింగమున ప్రయుక్తము.

క. ఈనగరంబును గాల్చిన, యా నీచుని హనుమ రాము ♦ ననుజసమేతున్
వానరనాయకు నిపుడే, నేనే వధియింతుఁ బ్రుంతు ♦ నేనే నేనే. ౧౬౫

తాత్పర్యము స్పష్టము.

క. అని కేల నాయుధంబులు, గొని బిరుదము లాడు నసుర ♦ కోటులఁ దమ యా
సనముల నుండ న్మరలిచి, యనియె విభీషణుఁడు భ్రాత ♦ కంజలితోడన్. ౧౬౬

అర్థములు. బిరుదములు=పౌరుష వాక్యములు.

తాత్పర్యము

ఈ ప్రకార మాయుధములు ధరించి పౌరుషపు మాటలు పలుకుచున్న యందఱను వారివారి స్థానంబులం దుండఁజేసి విభీషణుఁ డన్నకు నమస్కరించి యిట్లనియె.

ప్రహస్తాదులు ప్రభు వను నుద్దేశముతో మాటలాడిరి. విభీషణుఁ డన్నయను ప్రేమముతో మాటలాడుచున్నాఁడని భావము.

—♦ విభీషణుఁడు రావణునకు రాజనీతిఁ దెలుపుట ♦—

క. విను సామదానభేదము, లనెడు నుపాయముల మూఁట ♦ నర్థము సిద్ధిన్
గనకున్న విక్రమంబును, గొనియాడుదు రయ్య నీతి ♦ కోవిద వర్యుల్. ౧౬౭

అర్థములు. నీతికోవిద వర్యుల్=నీతిశాస్త్రమునందుఁ బండిత శ్రేష్ఠులు.

తాత్పర్యము

రాజనీతియందుఁ గార్యము సాధింప సామము దానము భేదము అను మూఁడుపాయములు చెప్పఁబడినవి. ఈ మూఁడుపాయములచేఁ గార్యము సాధింప సాధ్యపడదేని యప్పుడు దండ మను నాలుగవ యుపాయము నవలంబింపఁ దగునని నీతిశాస్త్రమందుఁ బండితశ్రేష్ఠులు చెప్పుచున్నారు. మొదటి మూఁడుపాయములు యత్నింపకయే యుద్ధమునకు దిగుట శాస్త్రవిరుద్ధము.

సామాదీనా ముపాయానాం । త్రయాణాం విఫలేన యే। వినయే న్నయ సంపన్నో దండం దండ్యేషు ధర్మభృత్ ॥ అని కామందకము.

చం. అమలినరాజ్యతంత్రములయందు విరక్తునిమీఁద, నింద్రియ
ప్రమదసురక్తిఁ హెచ్చరిక ♦ వాసిన యాతనిమీఁద, దైవసా
హ్యము గనిరానివానిపయి ♦ నర్భకభీరులమీఁద, మంత్రయు
క్తముగ విమర్శ సల్పి మఱి ♦ దండముఁ బూన జయంబు సిద్ధమా. ౧౬౮

అర్థములు. ఇంద్రియ ప్రమదసురక్తిన్=ఇంద్రియములను సంతోషపెట్టు ననురాగముచే, అర్భక, భీరులమీఁదన్=పిల్లవాండ్రమీఁద, పిఱికి వాండ్రమీఁద "బాలో వృద్ధో దీర్ఘరోగీ, తథా జ్ఞాతిబహిష్కృతః । భీరుకో భీరుకజనో, లుబ్ధో

లుబ్ధజనస్తథా। విరక్తప్రకృతిశ్చైవ, విషయే ష్వతిసక్తిమాన్। అనేకచిత్తమంత్రశ్చ, దేవబ్రాహ్మణనిందకః। దైవోపహతక శ్చైవ దైవచింతక ఏవచ। దుర్భిక్షవ్యసనోపేతో బలవ్యసనసంయుతః। అదేశస్థో బహురిపు ర్యుక్తో కాలేన యశ్చ సః। సత్య ధర్మవ్యపేతశ్చ, వింశతిః పురుషా అమీ। ఏతైస్సంధిం న కుర్వీత విగృహ్ణీయాత్తు కేవలమ్॥" కామందకము.

తాత్పర్యము

మనవారు యుద్ధమును బొగడుచున్నారు గదా! ఎవరితో యుద్ధము చేసిన గెలుపు గలుగునని శాస్త్రము చెప్పుచున్నదో వినుము. రాజ్యకార్యములయందుఁ బ్రీతిలేక యుండువానిమీఁద, ఇంద్రియములకు సంతోషము గలిగించుటయందు నాసక్తిగలవానిమీఁద, దైవసాహాయ్యము లేనివానిమీఁద, పిల్లవాండ్రమీఁద పిఱికివాండ్రమీఁద, కార్యాకార్యములు విమర్శించి యుద్ధము చేసినచో జయము తప్పక కలుగును.

ఉ. ఏమఱుపాటు లేదు మది నేనియు, గెల్వ గోనంగఁ గోరెడిన్,
భీమబలస్థితుండు, రణవీథిని దేఁటికనంగరాదు, దు
ర్ధామపరాక్రముండు, విజితప్రతిఘుం, డల రామభద్రుఁ డా
రాముని నెట్లొకో ఘనపరాక్రమవృత్తి జయింపఁ జూచుటల్. ౧౬౯

అర్థములు. భీమ బలస్థితుండు = భయంకరమైన సేన గలవాఁడు-విజితప్రతిఘుండు=కోపమును జయించినవాఁడు- ఇట్లు చెప్పుటచేఁ గోప మనునది సేవకునివలె రమ్మనిన వచ్చును, పొమ్మనినఁ బోవునుగాని స్వతంత్రించి తనంతటఁదాను రాఁజాలదు-ప్రతిఘా రుట్ క్రుధౌ స్త్రియామ్మని యమరుఁడు-పరాక్రమవృత్తిన్=పరాక్రమ కార్యముచేత. 'క్రోధాత్ భవతి సమ్మోహః' యన్నట్లు కోపములేని కారణముచే మోహము లేదనియుఁ జక్కఁగా నాలోచించి కార్యము చేయుననియు భావము. కామము చెందినఁగాని క్రోధము గలుగదు. కావునఁ గ్రోధము లేదన్నప్పుడు కామము లేదని భావము. కామము క్రోధము నను రెండు నీయందుండి నీవు భ్రమపడి చేయరానిపని చేయుచున్నావుగాని, యాయన స్వస్థచిత్తుఁడై కార్యములు చేయవలసిన విధానమునఁ జేయుచున్నాఁడని భావము.

తాత్పర్యము

మనస్సునందైనను రాముఁడు ప్రమాదపడి యుండువాఁడు కాఁడు. ఎట్లైన జయముఁగోరి యుండువాఁడు-భయంకరమైన బలముగలవాఁడు- యుద్ధము నందు నాయనను గన్నెత్తిచూడ సాధ్యపడదు. నివారింపరాని పరాక్రమము గలవాఁడు-కోపమును జయించినవాఁడు-కావున నిష్కారణముగఁ గోపగింపఁడు-రామభద్రుఁ డిటువంటివాఁడు- ఇట్టివానిని పరాక్రమముచే నెట్లు జయింప సాధ్యపడును.

క. ఘోరనదీనదపతిఁ గూ, పారము లంఘించి యొక్క ♦ ప్లవగుం డరరే
ధీరత నసహ్యకార్యముఁ దీరుచు నని యెవ్వఁడే మ ♦ దిం దలఁచె నొకో. ౧౭౦

అర్థములు. ఘోర=భయంకరమైన-నదీనదపతిన్=మగపేళ్ళకు నదులకు పతియైనవాఁడు, నదులు తూర్పుగాఁ బాఱునవి-నదములు పడమరగాఁ బాఱునవి కూపారము=సముద్రము.

తాత్పర్యము

భయంకరములైన నదములకు నదులకుఁ బతియైన సముద్రమును దాఁటి యొక్క క్రోఁతి ధైర్యముతో నసాధ్యకార్యముఁ జక్కఁజేసికొని పోవునని మనస్సు నందైన నెవ్వఁడైనఁ దలచెనా? ఏమి యీ యాశ్చర్యము.

దీనివలననే రామచంద్రమూర్తి తన కార్యము చక్కఁజేసికొనుటయందు హెచ్చరికఁ గలిగి కృషి చేయుచున్నాఁడనియు, గెల్వ నిశ్చయించినాఁడనియు, గొప్పసేన బలము గలవాఁడనియు నేర్పడుచున్నది. ఆయన యుద్ధము చేయు విధము గుఱించి శూర్పణఖాకంపనుల వలనను వాలివధమువలనను వినియున్నాము. ఇట్టివానిని జయించుటెట్లు?

క. బలమా లెక్కింపఁగ రా, దలవును నట్టిదియు పగఱ ♦ కట్టియెడం గే
వలము నలక్ష్యంబుగ నిటు, పలుకఁగ న్యాయంబె యసుర ♦ వల్లభులారా! ౧౭౧

అర్థములు. అలవు=పరాక్రమము, పగఱకు = విరోధులకు; పగవారు = పగఱు.

తాత్పర్యము

వానరాధిపతి యగు సుగ్రీవుఁడు రామునకుఁ దోడైనాఁడని వింటిమి, కంటిమి కదా! వానరసేన యెంతయైనది యెట్టిదైనది మనకుఁ దెలియునుగదా. కావున రామునకు సేనాసమూహము లెక్కింపరానిదై యున్నది. పగవారికిఁ బౌరుషము గట్టిదేయైయున్నది. ఇట్టి సందర్భములందు శత్రువుల విషయమై లక్ష్యము లేక మీరు రాక్షసవీరులారా! మనమే వీరులము, ఇతరవీరులు లోకమున లేరని మాటలాడ వచ్చునా? ఏ విషయమున మీకంటె వారు తక్కువవారో చెప్పుఁడు

ఉ. ఏ యపకారముం జలిపె ♦ నేర్పడఁ జెప్పుఁడు రాఘవుండు దై
తేయకులాగ్రగణ్యునకుఁ ♦ దేరకుఁ దా మును మున్న యీతఁడే
యీ యవనీంద్రు భార్యను వ ♦ నాంతరవీథి హరించి తెచ్చె, న
న్యాయచరిత్ర మెవ్వరిదొ ♦ యాడుఁడి యెవ్వరో వైరకారకుల్? ౧౭౨

తాత్పర్యము

రామునిమీఁదికి యుద్ధమునకుఁ బోయెద మని పలుకుచున్నారు గదా. ఏమి కారణము? ఆయన మీకుఁ జేసిన యపకార మేది? తన దూతచేత మన నగరము తగులఁ బెట్టించి మన వారిని జంపించెఁ గదా యందురేమో, ఏల యిట్లు

చేసెను? తొలుత నెవ్వరి కెవ్వ రపకారము చేసిరి? రాముఁ డేమైన మన రాక్షస రాజునకు నపకారము చేసెనా? ఈయనయే కదా ముందుగాఁ బోయి యెందో యడవిలో నున్న రాముని భార్యను హరించి తెచ్చెను. ఇం దన్యాయ మెవరిది? కలహమునకుఁ గాలు ద్రవ్వినవా రెవ్వరు? ఆయన భార్యను హరించి తెచ్చుటయే గాక యాయన తన భార్యను మఱల గ్రహించుటకుఁ జేయు ప్రయత్నము దోష యుక్తమందురా? సీతాదేవి యింత లేదేని వానరుఁ డిందు వచ్చి యుండునా? అంత పని చేసి యుండునా? ఇదియేల మీ రాలోచింపరు. మీ భార్యలను బలులు హరించిన మీ రూరకుందురా? కుంభీనసిని మధుఁడు హరించినప్పుడు వాని మీఁదికి మీరు యుద్ధమునకుఁ బోలేదా? మీరు చేసిన నొప్పు, పరులు చేసిన తప్పా?

ఉ. రాముఁడు గాఁడె మున్ను ఖర♦రాక్షసునిం దునుమాడె నందురా!
యా మనుజాశనుండె కద ♦ యాతని పైపడిపోయెఁ జివ్వకై?
భూమిని నెల్ల ప్రాణులును ♦ బూని యథాస్వబలంబుగాఁ దముం
దాము సురక్షసేఁత తగ♦దా? యది దోషమె మీరు చెప్పుఁడా? ౧౨౩

అర్థములు. చివ్వకై = యుద్ధమునకై, యథాస్వబలంబుగా = వారి వారి బలము కొలఁది.

తాత్పర్యము

విభీషణా! నీవు చెప్పునది సరిగాదు-ఖరాదులను ముందు రాముఁడు చంపుటచేఁగదా రాక్షసరాజు రాముని భార్యను హరించెను. కావునఁ గలహకారకుఁడు రాముఁడే యందురా? రాముఁడు ఖరాదులమీఁదికి దండెత్తివచ్చెనా? ఖరుఁడు రామునిమీఁదికి దండెత్తి పోయెనా? ఖరుఁడేకదా పోయినవాఁడు-తన ప్రాణమునకపాయము వచ్చినపుడు వారి శక్తికొలఁది దమ్ముఁ దాము రక్షించుకొనుట లోకమునఁ గలిగిన విషయమేకదా-అట్టులే తన్నుఁదాను రాముఁడు రక్షించుకొనినఁ దప్పేమి? మీ ప్రాణముమీఁదికి వచ్చినపుడు మిమ్ము మీరు రక్షించుకొనరా?

ఇచ్చట మఱియొక ప్రశ్న రావలసినదే - రాలేదు. శూర్పణఖ ముక్కు-చెవులు కోయుటచేఁగదా ఖరుఁడు యుద్ధమునకుఁబోయెనని రాముఁడే కలహకారకుఁడని వాదము రావలసినదే - అది వచ్చినయెడల శూర్పణఖ అంతు బైటపడును-ఇప్పటికే రాక్షసుల కందఱకు శూర్పణఖ అంకాడఁబోయి ముక్కు- చెవులు పోఁగొట్టుకొనెననియు నదియే కలహకారకురాలనియు లంకలోనివారికిఁ దెలియును. సీతాదేవివలన నిది వెలువడియుండును. రాక్షసుల కందఱకు నీ విషయము దెలియునని ౨౧౯౯-౨౨౦౦-౨౨౦౧ పద్యములవలన స్పష్టపడును.

క. పరదారహరణ మెప్పుడుఁ గర మపకీర్తిని ఘటించుఁ ♦ గలుషముఁ బెంచున్
హరియించు నాయు వర్థముఁ, బోరి నాశము సేయుఁ గానఁ ♦ బుణ్యజనేంద్రా.

అర్థములు. పరదారహరణము=ఇతరుల భార్యలను హరించుట.

తాత్పర్యము

రాక్షసరాజా! యితరుల భార్యలను హరించుటవలన మిగుల నపకీర్తి కలుగును. అది పాపమును వృద్ధిచేయును. ఆయుస్సు క్షీణింపఁజేయును. అర్థము నాశము చేయును.

మ. తలఁపన్ జానకికారణంబుగ నముఁ తాపాదిల్లెనీయెల్లవా
రలకున్ భూరిభయంబు; నిక్క మిది, కార్యం బామెఁ బో పీడుటల్;
కలహార్థం బొక కార్యముం జలుప బాఁగా? యా నటం చందువేన్
గలహంబే నిజమేని యేమి పని లంకన్ సీతతోఁ జూడుమా. ౧౭౫

తాత్పర్యము

ఈ లంకలోని వారి కందఱకు నపాయము గలుగుటకు సీతయే కారణము. ఆమె యిందుండువఱకు నా యుపద్రవము తప్పదు. కావున వదలిపెట్టుము. అదియే తగిన కార్యము. విభీషణా! నేను గాముకుఁడనై సీతను దీసికొని రాలేదు. రాముఁడు ఖరాదులను జంపెను. కావున యుద్ధమందు రాముని జంపవలెను. అతనిని యుద్ధమునకు లాగుటకై సీతను దెచ్చితి నందువా? అట్లు యుద్ధమే నీకు ముఖ్యోద్దేశ మగునేని సీతతో లంకలో నేమి పని? సీత లేకుండినను మనము వారి మీఁదికి యుద్ధమునకుఁ బోరాదా? నా తమ్ములను జంపిన కారణముచే నేను యుద్ధమునకుఁ బోయెద ననిన లోకము మెచ్చు కార్యమై యుండును. అప్పుడే నీ వీ పని చేసియుండిన రామునకు వానరసేనాసంపత్తి లభించి యుండదు. వారన్నదమ్ము లిరువురే కాన సులభముగా జయించి యుందువు. వారు వచ్చి మన యూరిపైఁ బడకుందురు గదా. అటుగాక నీవు వక్రమార్గము నవలంబించి సీతను దెచ్చుటచే వా రెంత బలసంపత్తి గలవారైరో చూడుము. నీ కెట్టి యపఖ్యాతి వచ్చెనో యాలోచింపుము.

క. సారబలిష్ఠుఁడు ధర్మాచారరతుం డట్టి రామచంద్రునితో ని
ష్కారణవైరము దగునే? శ్రీరాముని కప్పగింపు సీతాదేవిన్. ౧౭౬

అర్థములు. సారబలిష్ఠుఁడు = దృఢమైన మహాబలము గలవాఁడు, ధర్మాచారరతుఁడు=ధర్మముతోఁ గూడిన నడవడియందాసక్తి గలవాఁడు.

తాత్పర్యము

అన్నా! రామచంద్రమూర్తి సామాన్య బలముగలవాఁడు కాఁడు. సారవంతమైన మహాబలము గలవాఁడు. ఇట్లు దేహబలమునకుఁ దోడు ధర్మపునడవడియందాసక్తిగలవాఁడు ధర్మమున్న చోట జయముండును. కావున ధర్మబలము, దాని వెంట దైవబలము గలవాఁడు అటువంటి రామచంద్రునితో నీవు కారణము లేక కలహమునకు దిగుట సరిగాదు. కావున సీతాదేవిని శ్రీరామున కర్పింపుము.

క. చారుమణిసంకులము హాయ,వారణయుక్తంబు లంక వరబాణాలిన్
దారితము గాక మున్నే, శ్రీరాముని కప్పగింపు సీతాదేవిన్. ౧౭౭

అర్థములు. చారుమణి సంకులము=అందములైన రత్నములచే నిండినది, హయ వారణ యుక్తంబు=గుఱ్ఱములతోను; ఏనుఁగులతోను గూడినది, పరబాణౌఘిన్=శత్రువుల బాణసమూహములచే, దారితము=చీల్పఁబడినది.

తాత్పర్యము

మనోహరములగు రత్నములచే నిండినదియు, గుఱ్ఱములు, ఏనుఁగులు గలదియునగు లంక శత్రువుల బాణములచే భిన్నముగాక ముందే సీతాదేవిని శ్రీరామున కర్పింపుము.

క. ఘోరము దుర్ధర్షము కపి,వారము మనపురికి లగ్గ♦పట్టక మునుపే
పేరిమి యొసఁగఁగఁ దండ్రీ, శ్రీరామున కప్పగింపు ♦ సీతాదేవిన్. ౧౧౮

అర్థములు. దుర్ధర్షము=తిరస్కరింపరానిది, పేరిమి=గొప్పతనము.

తాత్పర్యము

తండ్రీ! ఘోరమై తిరస్కరింపరానిదై వానరసేన లంకకోటలకు లగ్గలు పట్టక ముందే సీతాదేవిని శ్రీరామున కర్పించుట గౌరవకరము.

క. మానవభోజులతో లం,కానగరము నాశమందు ♦ క్ష్మాసుత నీవే
మానితగతి నీ వేసియు, జానకిని మ్మరల రామ♦చంద్రున కిమ్మా. ౧౧౯

తాత్పర్యము

నీవు సీతాదేవిని రామునకు మరల నీయకపోయితివా రాక్షసులతో లంకానగరము నాశనమై పోవును, గావున సీతాదేవిని మఱల రామచంద్రున కిమ్ము.

ఉ. అన్నవు గాన నిన్నిదిగో ♦ హస్తములన్ముకుళించి వేఁడెదన్,
నన్ను ననుగ్రహింపు, దయ ♦ నా వచనంబుల చొప్పు చేయుమీ
యన్న! హితంబుఁ బథ్యమును ♦ నాడితిఁ గాని మఱొండుగాదు, క్ష్మా
కన్నను రామచంద్రునకుఁ ♦ గ్రమ్మఱఁ బుచ్చుము మేలు హెచ్చఁగన్. ౧౨౦

తాత్పర్యము

నీవు మాకు రాజవు మాత్రమే కావు, నా కన్నవు కావున నన్న యను గౌరవముతోఁ బ్రేమముతో నమస్కరించి చెప్పుచున్నాను, నన్ననుగ్రహింపుము, నాయందు దయయుంచి నేను జెప్పినట్లు చేయుము. అన్నా! నీకు మేలయినది, పథ్యమైనది చెప్పితిని గాని విరుద్ధముగ నేనేమియుఁ జెప్పినవాఁడఁగాను. సీతాదేవిని రామచంద్రునకు మరలఁబంపుము. మనకు మేలు గలదు.

కం. శరదర్కకరనిభంబును, బురుదృఢము నవాగ్రపుంఖ♦మును నగు ధరణీ
వరు శరనికరము నిన్నుం,బొరిగొన వెడలకయ మున్న♦పుచ్చుము సీతన్. ౧౨౧

అర్థములు. శరదర్కకరనిభంబు=శరత్కాల మందలి సూర్యకిరణములతో సమానమైనది, పురుదృఢము=మిగుల గట్టిది, నవాగ్రపుంఖము=క్రొత్తదైన కొనపిఁడిగలది, ధరణీవర=రామచంద్రునియొక్క, శరనికరము=బాణసమూహము.

తా త్ప ర్య ము

విభీషణుని మాటలు రావణునకు రుచించినవి కావు. అవి వానికి గోపము హెచ్చించెను. అయినను భయపడక చెప్పుచున్నాఁడు.

శరత్కాల సూర్యకిరణముల వంటివి, మిగుల గట్టివి, క్రొత్తకోనపిడులు గలవి యగు రామబాణంబులు నిన్నుఁ జంపుటకై వెలువడక ముందే సీతను రామునకిమ్ము.

పంచచామరము, త్యజింపవయ్య కోపమున్ సు॥ధర్మ సౌఖ్యనాశమున్
భజింపవయ్య సౌఖ్యకీర్తి॥వర్ధనంబు ధర్మమున్
భుజింపవచ్చు భోగముల్ స॥పుత్రమిత్ర రాక్షస
వ్రజంబులెల్ల, సీత నిమ్ము ॥ రామభూమిభర్తకున్. ౧౮౨

తా త్ప ర్య ము

అయ్యా! ధర్మమును సుఖమును నాశముచేయు కోపమును వదలి పెట్టుము. సౌఖ్యము కీర్తి వృద్ధి చేయు ధర్మమును సేవింపుము. కొడుకులతో మిత్రులతో రాక్షసు లందఱు భోగములు యథాప్రకారముగ ననుభవింప వచ్చును. కావున రామచంద్రునకు సీత నిమ్ము.

క. నావుడు విభీషణుని వా, క్యావళి నాలించి రాక్ష॥సాధిపుఁడు వెసన్
దా వారి నెల్ల వీడి ని,జావాసముఁ జొచ్చెఁ బరిజ॥నావళితోడన్. ౧౮౩

తా త్ప ర్య ము

విభీషణుఁ డిట్లు చెప్పఁగా నా మాటలు విని రావణుఁడు సభ చాలించి తరువాత నీ విషయము పరిష్కరింత మని యందఱను బోవఁబనిచి పరిచారకులతోఁ దనయింటిలోనికిఁ బోయెను.

ఇంతవఱకు హనుమంతుఁడు లంక విడిచిననాఁటి వృత్తాంతము.

—॥ ౧౦-వ సర్గము. విభీషణుఁడు రావణు గృహంబునకుఁ బోవుట ॥—

సీ. శైలాగ్రసంచయ॥సన్నికాశంబును, నుర్వీధరోరుశృం॥గోన్నతంబు
సువిభక్తకక్ష్యంబు ॥ సూరిసంయుతమును, మతిమత్సరక్తస॥న్మంత్రియుతము
నాప్తపర్యాప్తసు॥రారిరక్షితమును, శంఖనిస్వనమహా॥స్వానితంబు
ప్రమదావితానసం॥బాధితంబును దూర్య,నాదానునాదిత॥సవ్యతలము
తే. మత్తమాతంగనిశ్శ్వాస॥మారుతాఢ్య, కాకలీకృతవాతవి॥హారహృద్య
మతులకలకలకలితమ॥హాపథంబు, తప్తకాంచనమత్తదం॥తావళంబు. ౧౮౪

అర్థములు. శైలాగ్ర=పర్వతశిఖరముయొక్క,సంచయ=సమూహముతోఁ సన్నికాశంబును=సమానమైనదియు,రావణు నింటిమీఁద ననేకశిఖరములుండుటచే నీ యుపమానము, ఉర్వీధరోరుశృంగోన్నతము=పర్వతముగొక్క పెద్ద శిఖరము వలె నెత్తైనది, సువిభక్తకక్ష్యంబు = చక్కఁగా విభజింపఁబడిన తొట్టికట్లు గలది.

నారిసంయుతమును = పండితులతోఁ గూడినది, మతిమత్ = మతిమంతులై, సురక్త=మంచి యనురాగముగలవారైన, సన్మంత్రియుతము = మంచి మంత్రులతోఁ గూడినది, ఆప్తపర్యాప్త = కార్యము నెఱవేర్పుటయందు నేర్పరులైన, అసురారిరక్షితము=రాక్షసులచేత రక్షింపఁబడినది, శంఖనిస్వన = శంఖధ్వనులచే, మహాస్వానితంబు=మిగుల చప్పుడు గలుగఁజేయఁబడినది, ప్రమదావితాన సంబాధితంబు = వయస్సునపడుచుల సమూహముచే నిండినది, తూర్యనాద = వాద్యముల ధ్వనిచేత, అనునాదిత=ప్రతిధ్వని కలుగఁజేయఁబడిన, సవ్యతలము = మనోహరమైన ప్రదేశముగలది, మత్తమాతంగ=మదపుటేనుఁగుల, నిశ్శ్వాసమారుత = ఊర్పుగాలులచే, అధిక = మిక్కిలి, ఆకులీకృత = కలఁతపెట్టఁబడిన, వాత = వాయువుయొక్క, విహార=సంచారముచే, హృద్యము=మనోహరమైనది,అతుల= సమానములేని, కలకలకలిత = కలకల ధ్వనులచేఁ గూడిన, మహాపథంబు = పెద్ద బాటగలది, తప్తకాంచన మత్తకంతావళంబు = మంచిబంగారుసొమ్ములు గల మదపుటేనుఁగులు గలది.

తాత్పర్యము

పర్వతశిఖరములతో సమానమైనదియు, కొండశిఖరమువలె నెత్తైనదియు, చక్కగావిభజింపఁబడిన తొట్టికట్లు కలదియు, పండితులతోఁగూడినదియు, బుద్ధిమంతులై రావణునందు ప్రేమగల మంత్రులతోఁ గూడినదియు, కార్యసాధనమునందు నేర్పరులైన రాక్షసులచే రక్షింపఁబడినదియు, శంఖధ్వనిచే బోరుకొనునదియు, స్త్రీసమూహముచే నిండినదియు, ప్రతిధ్వనించుచున్న వాద్యధ్వనులు గలదియు, మదపుటేనుఁగుల యూర్పుగాలులచేఁ గలఁతచెందిన గాలివీచుటచే మనోహరమైనదియు, జనుల కలకల ధ్వనులు గల పెద్ద బాట గలదియు, బంగారు సొమ్ములు ధరించిన మదపుటేనుఁగులు గలదియు.

క. మరుతుల గంధర్వుల మం,దిరముల కెన యగుచు రత్న•నికరముచే సం
భరితం బై భోగుల సుం, దరగేహము నట్లు వెలయు•దానిన్ ద్యుతిమై. ౧౮౫
అర్థములు. ఎనయుచు=సమానమై.

తాత్పర్యము

మరుత్తులయు గంధర్వులయు నిండ్లతో సమానమై రత్నసమూహములచే నిండినదై కాంతిచే సర్పముల సుందరగృహముల వలె వెలయునదియు నగుదాని,

తే. ప్రాప్తధర్మార్థనిశ్చయుం డై విభీష,ణుండు భీమణకర్ముండు • చండభానుఁ
డభ్రపటలంబుఁజొచ్చునట్లన్నగృహముఁ,జొచ్చెమఱునాఁటివేకువ•శుద్ధమతిని.
అర్థములు. ప్రాప్తధర్మార్థ నిశ్చయుండు = పొందఁబడిన ధర్మమునందు నర్థమునందు నిశ్చయబుద్ధి కలవాఁడు అనఁగా సీతాదేవిని మఱల రామచంద్రున కిచ్చుటచేతనే ధర్మము, అర్థము ప్రాప్తించు నను నిశ్చయ జ్ఞానము గలవాఁడు.

6)

అర్థప్రాప్తి యనఁగా క్రొత్తగా ధనము లభించుటగాదు. ఉన్నది శత్రువులచేఁ జెడక దక్కుటయే. ధర్మము అర్థము చెప్పుటచేఁ గామము కూడ గ్రహింపవలెను. రావణుఁడు కామాసక్తుఁడు, జీవించినఁ గదా భార్యలతోఁడనైనఁ గామ మనుభవింపఁ గలడు. కావున దానిని పోగొట్టుకొనక దక్కించుకొనుటయే ప్రాప్తి. భీషణకర్మండు=భయంకరకార్యము చేయఁబూనినవాఁడు, వాస్తవమున నన్నకు మేలైన దయ్యును అతనికి నిష్టము లేనిది కావున నతనితో సాహసించి చెప్పుటకు నందఱు భయపడువారే. విభీషణుఁడు చెప్పిన మాటలు మఱియొకఁడు చెప్పియుండిన వాని తల యక్కడనే యెగిరిపడియుండును. కావున విభీషణుఁడు చేయఁదలఁచినది భయము కలిగించు కార్యమే. చండభానుఁడు=సూర్యుఁడు, అభ్రపటలంబు=మేఘసమూహము, శుద్ధమతిని=నిర్మలమైన మనస్సుతో, మఱునాఁటి వేకువ=పున్నమ నాఁటి ప్రొద్దున.

తాత్పర్యము

అన్న గృహమును ధర్మము అర్థము ప్రాప్తించుటకు సీతాదేవిని మఱల రామచంద్రమూర్తి కిచ్చుటయే యను నిశ్చయబుద్ధిగలవాఁడు, అపాయకరమైన యీ విషయమును రావణుతోఁ జెప్ప సాహసించినవాఁడును నగు విభీషణుఁడు సూర్యుడు మేఘములందుఁ జొచ్చిన విధముగా నిర్మలమనస్సుతో లంకాదహనమైన మఱునాఁడు (పున్నమ) ప్రవేశించెను.

సూర్యుఁడు మేఘమండలము చొచ్చె ననుటచే విభీషణునకే తేజోహాని యని సూచితము. ఇది తెలిసియు నన్న యందుఁగల ప్రేమచేఁ బోయెనని భావము. ఈ గృహవర్ణనమునకుఁ గారణ మింతయైశ్వర్యమును బుద్ధిమాలిన యధర్మకార్యము చేసి నాశము చేసికొనఁ బోవుచున్నాఁడని తెలుపుటకే.

ఇది హనుమంతుఁడు లంక గాల్చిపోయిన మఱునాఁటి వృత్తాంతము. ఉదయమున స్నానము సంధ్య దేవపూజ లోనగునవి చేయువాఁ డగుటచే నప్పుడు రావణుని మనస్సు సత్త్వగుణము కలదై యుండును. కావున నప్పుడు ధర్మవిషయము చెప్పిన నంగీకరించు నని తలఁచి వేకువనే పోయెను.

తే. భ్రాతృజయసంశ్రితంబులు♦పరమపుణ్య,ములును వేదవిదభిహిత♦ములును నైన
విమలపుణ్యాహరవములు♦వినుచు నచటి, దధిఘృతాక్షతపుష్పపా♦త్రములచేత,

అర్థములు. భ్రాతృజయసంశ్రితంబులు = అన్నజయమే ఫలముగాఁ గలవి, వేదవిత్ +అభిహితములు = వేదము తెలిసిన వారిచే నుచ్చరింపఁబడునవి, దధి=పెరుగు, ఘృత=నేయి, పుష్ప=పూలు, వీని పాత్రములచే, ఇది పై పద్యముతో అన్వయము

తాత్పర్యము

అన్నకు జయము గలుగవలయు నను ఫలము గలవియు మిగులఁ బుణ్యవంతము

లును వేదవిదులచే నుచ్చరింపఁబడునవియు నగు పుణ్యాహవాచన మంత్రములు వినుచు అందున్న పెరుగు-నేయి-అక్షతలు-పూలు గల పాత్రలచేత,

తే. అర్చితము మంత్ర వేదవి • దవనివిబుధ, పూగముం గని రాక్షస • పూజ్యమానుఁ
డగుచుఁ దనతేజున న్వెల్గు • నాసనస్థుఁ, శ్రీదసోదరుఁ గనుఁగొని • చేరి మ్రొక్కె.

అర్థములు. అర్చితము = పూజింపఁబడినది యగు, మంత్ర, వేదవిత్ + అవని విబుధ పూగమున్=మంత్రము బ్రాహ్మణము అను వేదభాగముల నెఱింగిన బ్రాహ్మణసమూహమును, వైదికకర్మములు చేయునపుడు చెప్పఁబడు వేదభాగము మంత్ర మనఁబడును. వైదికకర్మముల విధించు వేదభాగము బ్రాహ్మణమనఁబడును. పూజ్యమానుఁడు=గౌరవింపఁబడుచున్నవాఁడు, శ్రీదసోదరున్=కుబేరుని తమ్ముని ఇది రావణు నైశ్వర్య సమృద్ధిఁ దెలుపఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

పూజింపఁబడు మంత్రబ్రాహ్మణవేత్తలగు బ్రాహ్మణ సమూహముఁ గని (ఈ బ్రాహ్మణులు రాక్షసబ్రాహ్మణులని తెలియనగు) రాక్షసులచేఁ బొగడఁబడుచుఁ దన తేజస్సుచేఁ బ్రకాశించుచు నాసనమందున్న కుబేరుని తమ్ముఁడగు రావణుఁ జేరఁ జని నమస్కరించెను.

క. ఈ రీతి మ్రొక్కి విహితా, చారవిదుఁడు నడపి యర్హా • చర్యల రక్షో
వీరుని కనుస న్నెఱిఁగి మ, హారజతాసనమునందు • నాసీనుఁడై. ౧౮౯

అర్థములు. విహితాచారవిదుఁడు = ప్రభువునొద్దకుఁ బోయినపు డెట్లు ప్రవర్తింపవలయునో యా యాచారములను దెలిసినవాఁడు, అర్హాచర్యలన్=కాల దేశముల ననుసరించి చేయఁదగిన కార్యములు, జయ జయ యనుట లోనైనవి, కనుసన్న=కంటితోఁ జేయఁబడిన సంజ్ఞ మహారజతాసనము = బంగారుపీఁట.

తాత్పర్యము

ఈ రీతి నమస్కరించి ప్రభువులయొద్ద నే సమయమున నెట్లు నడువవలయునో యా యాచారముల నెఱిఁగినవాఁడు కావున సమయోచిత చర్యల నడపి రావణుఁడు కూర్చుండుమని కనుసైఁగ చేయఁగా నది తెలిసికొని బంగారుపీఁటపై విభీషణుఁడు కూర్చుండెను.

—• విభీషణుఁడు రావణునకుఁ బురంబున నపశకునంబులు పుట్టుటఁ జెప్పుట. •—

తే. దేశకాలార్థసంవాది • దృష్టలోక, మంగళామంగళుం డట • మంత్రు లెదుట
విజనముగ సాంత్వసూక్తుల • విభుఁ బ్రసన్నుఁ, జేసికొని యిట్టులనియె న • శ్లిష్టభణితి.

అర్థములు. దేశకాలార్థ సంవాది=ఆ యా దేశ కాలముల ప్రయోజనము ననుసరించువాఁడు, దృష్టలోక మంగళామంగళుఁడు = బాగుగఁ దెలియఁబడిన లోకము నందలి శుభాశుభములు గలవాఁడు. విజనముగన్ = మంత్రాలోచనము

నకుఁ దగని యితరజనులు లేనప్పుడు, సాంత్వసూక్తులన్ = మంచిమాటలచే ప్రసన్నుఁ జేసికొని=అనుగ్రహము గలవానిఁగాఁ జేసికొని, స్పష్టమై సందేహమున కెడమీని మాటలతో.

తాత్పర్యము

దేశకాల ప్రయోజనముల ననుసరించి పోవువాఁడును. లోకుల శుభాశుభములు దెలిసినవాఁడును, (ఏది చేసిన మేలో యేది చేసిన కీడో తెలిసినవాఁడు, ఇట్లనుటచే రావణుఁడు చేసినది కీడు కలిగించునది యని తెలిసినవాఁ డనుట) మంత్రులు వినుచుండఁగ నితరు లెవ్వరు లేని సమయమున మంచి మాటలచే ప్రభువునకుఁ దనయం దనుగ్రహబుద్ధి కలుగఁ జేసికొని స్పష్టములై సందేహము కలిగింపనీని మాటలచే నిట్లనియె.

శా. అన్నా! జానకి యెప్డు నీ పురికి సం♦ప్రాప్తించె నాఁ డాదిగా
నెన్నంజాలని పెక్కుదుశ్శకునము ♦ లీక్షింప నయ్యెం జువీగా
చెన్నారందు సుమంత్రయుక్తహవులం ♦ జేర్పంగనున్ ధూమజా
లౌన్నత్యుండు సవిస్ఫులింగుఁడు సధూ♦మార్చిర్యుతుం డగ్నియున్. ౧౯౧

అర్థములు. ఎన్నంజాలని = లెక్కలేని, సుమంత్రయుక్తహవులన్=మంచి వీర్యవంతములయిన మంత్రములతోఁ గూడిన హవిస్సులచే, చేర్పంగనున్=చేర్చినప్పటికిని, ధూమజాలా+ఔన్నత్యుండు=పొగగుంపుల యాధిక్యము గలవాఁడు, సవిస్ఫులింగుఁడు=మిణుఁగురులతోఁ గూడినవాఁడు, సధూమ+అర్చిః+యుతుఁడు= పొగతోఁ గూడిన జ్వాలలతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

అన్నా! యే నాఁ డీ యూరికి సీత దాపరించెనో యా దినము మొదలు లెక్కలేని యవశకునములు పురమందుఁ గానవచ్చుచున్నవి. మంచి మంత్రములచే హవిస్సు హోమము చేసినను పొగయు మిణుఁగురులు కలవాఁడై పొగతోడి జ్వాలలు గలవాఁడగుటచే నగ్నిహోత్రుఁడు ప్రకాశించుటలేదు.

ఆ. వంటయిండ్లలోన ♦ వైశ్వానరుని గృహం,బులను వేదపాఠ♦ములు పఠింపఁ
బడెడి మందిరములఁ ♦ బాములు ప్రాఁకెడి,హవ్యములను జీమ♦లంటఁ దొడఁగె

అర్థములు. వైశ్వానరుని గృహంబులందు=అగ్నిహోత్రుని యిండ్లయందు, హవ్యములను=దేవతలకై యుద్దేశించిన హోమపదార్థములు, నెయ్యిలోనైనవి.

తాత్పర్యము

వంటయిండ్లలో, అగ్నిహోత్రగృహములలో, వేదములు పఠించు మందిరములలోఁ బాములు ప్రాకులాడుచున్నవి. హవ్యములకుఁ జీమలు పట్టుచున్నవి.

క. ఆవులు వట్టి చనెన్ దం, తావళముల మదము చెడియె ♦ దైన్యముతో మేఁ
పావంత యొలమి ముట్టవు, మావులు మన వీట విమత ♦మదమానహరా! ౧౭

అర్థములు. వట్టిచనెన్ = ఎండిపోయెను, మావులు = గుఱ్ఱములు, విమతుల=శత్రువుల, మదమానహరా=గర్వము మానము హరించినవాఁడా!

తాత్పర్యము

మన నగరమందు నావుల పొదుగులందుఁ బాలెండిపోయినవి. ఏనుఁగుల మదము చెడినది. విచారపడుచుఁ గన్నుల నీళ్ళు కార్చుచు గుఱ్ఱములు కొంచెమైన మేఁపు సంతోషముతో ముట్టుటలేదు.

క. ఖరములకు నొంటెలకుఁ గం, చరగాడిదలకును రాలె ♦ చన వెంట్రుక లే
తెరువున జికిత్స చేసినఁ, బురిగొన వా భంగి బాష్ప ♦ ములు పొరిఁ గార్చున్.

అర్థములు. బాష్పములు = కన్నీళ్ళు.

తాత్పర్యము

స్పష్టము.

క. కాకులు గుంపులు, గుంపులు నై కటువరవాళి నినిచె ♦ నన్నితలములన్
బోకలు నై విహరించెడిఁ గాకారవముల విమాన ♦ గణములమీఁదన్. ౧౯

అర్థములు. కటువరవాళి = వినుటకుఁ బరుషములైన ధ్వనులు, నినిచెన్ = నింపెను, కాకారవములన్=కాకా యను ధ్వనులను.

తాత్పర్యము

స్పష్టము.

క. గ్రద్దలు చక్రాకృతిగాఁ, బద్దుగఁ దిరుగాడి వ్రాలె ♦ భవనంబులపైఁ
బొద్దుల సాయంవేళలఁ, దద్దయు వఱలులును నించె ♦ దారుణరవముల్. ౨౦

అర్థములు. చక్రాకృతిగా = గుండ్రముగ, పద్దుగన్ = పందెము వేసికొన్నట్లు, వఱలులు=పక్షులు, దారుణరవముల్ = భయంకర ధ్వనులు, వఱదు బహువచనమున వఱదులు కాఁగా, లువర్ణకంబునకు ముందున్న యసంయుక్తంబులై యుదంతంబులైన డలరలకు నలఘుల కారంబు బహుళంబుగ నగు. సు-వ్యా-అచ్ఛిక. సంధి. ౨౦ సూ.

తాత్పర్యము

గ్రద్దలు గుండ్రముగాఁ దిరిగి యిండ్లపై వ్రాలుచున్నవి. ఉదయాస్తమాన కాలములందు పక్షులు భయంకరధ్వనులు చేయుచున్నవి.

క. పిడుగుల వడువున రవములు, కడు బెడిదముగాఁగ నించెఁ ♦ గ్రవ్యాదంబుల్
విడివడి పురిగనఁకులకడ, విడువక తద్ధ్వనులు వీఁట ♦ వినఁగా నయ్యెన్. ౨౧

అర్థములు క్రవ్యాదంబుల్=మాంసము దిను పులులు తోడేళ్ళు సింహములు కుక్కలు పక్షులు లోనైనవి, విడివడి=విచ్చలవిడి.

తా త్ప ర్య ము

మాంసము దిను మృగములు ఘురిగవనివాకిట నిలచి విచ్చలవిడిగా పిడుగుల ధ్వనివంటిధ్వనితో మిగులభయంకరముగా నూరిలోకి వినవచ్చునట్టు లఱచుచున్నవి.

—॰ విభీషణుఁడు రావణునితో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట ॰—

క. ఈ యశుభంబుల కెల్లను, బ్రాయశ్చిత్తంబు లోకంబు ॰ వాకొను వాఁడన్
 జేయు మిది సీత రామున,కై యర్పింపుము క్షితీశ ॰ యభిమత మేనిన్. ౧౯౭

అర్థములు. వాకొను వాఁడన్ = చెప్పెదను, అభిమతమేనిన్ = నీకు సమ్మతమైన యెడల.

తా త్ప ర్య ము

స్పష్టము.

క. ఇది యజ్ఞానముచేతనో, బ్రదికెడియాసలనో యిట్లు ॰ పలికితి ననుచున్
 మదిఁ దలఁతు వేనియును సుర,హృదయద్రవణ! యపుడు దోష॰మెంచకు నాపై.

నే నిట్లు చెప్పుటకుఁ దెలివితక్కువతన మనుకొనినను, వీఁడు పిఱికి, చచ్చెదనని భయపడి చెప్పుచున్నాఁడని తలఁచినను, దేవవిరోధీ! నేను ద్రోహబుద్ధితోఁ జెప్పుచున్నానని దోష మెంచకుము.

క. పురమున నంతఃపురమునఁ, దరుణులకుం బురుషులకు నుఁ॰దాహృతదోషో
 త్కరములు విదితంబులు చు,మ్మరయుము వలఁ తేని రాక్ష ॰ సాన్వయచంద్రా!

అర్థములు. ఉదాహృత దోషోత్కరములు=నేను జెప్పిన యపశకునముల సమూహములు, విదితంబులు=తెలిసినవే, అరయుము=విచారింపుము.

తా త్ప ర్య ము

నేను జెప్పిన దుష్టశకునములు పురమునందు నీ యంతఃపురమునందు స్త్రీలకుఁ బురుషులకు నందఱకుఁ దెలిసినవే, రహస్యములు గావు, నేను గల్పించి చెప్పునవి కావు, నీ యిష్టమున్న యెడల వాస్తవము విచారింపుము.

క. విను నీమంత్రులు నీకున్, వినిపింపఁగ లేరు సుమ్ము ॰ వీని న్నేనో
 కనినది వినినది సర్వము, వినిపింపక యుండ నాకు॰విహితమె యన్నా! ౨౦౧

తా త్ప ర్య ము

నీవు చెప్పునది నిజమైన యెడల నా మంత్రులు నా కేల చెప్ప లేదందు వేమో, వారు భయముచే నీకు చెప్పలేదు. కాని వారికి నేను చెప్పినవి తెలియక కాదు. నేనో నీ తమ్ముఁడ నగుటచే నీ మేలు కోరి నేను చెప్పవలసి యున్నది. మంత్రుల కొక రాజు పోయిన మఱియొక రాజు వచ్చును. నా కన్నపోయిన మఱియొక అన్న రాఁడుగదా! కావున నన్నను బోఁగొట్టుకొనలేక చెప్పుచున్నాను, (చూ. ౨౩౬౭. ప.)

క. కావున న్యాయాన్యాయము, లో వీరా! ముందు వెనుక • యోజించి మతిన్
గావింప వయ్యె నీ యి, చ్ఛావిధి నని చెప్పె నెల్ల • సచివులు వినఁగన్. ౨౦౨

తా త్ప ర్య ము

అన్నా, సీత నిచ్చుట న్యాయమో యన్యాయమో యిచ్చినఁ గలుగు ఫలమేమో యియ్యకుండినఁ గలుగు కష్టమేమో జరిగినది రాఁబోవునది యాలోచించి తరువాత నీ యిష్టము వచ్చినట్లు చేయుము. విచారింపక తొందరపడి చేయకుము అని మంత్రులందఱు వినుచుండఁ జెప్పెను.

చ. హితము మహార్థమున్ మృదుల • హేతుయుతంబు వ్యతీతకాల సం
ప్రతిశుభదంబు, సౌఖ్యదము • భావిని, నా తన తమ్ము వాక్యముల్
శ్రుతిఁ జొరనిచ్చి రావణుఁడు • క్రోధముఁ దాలిచి యాత్మకృత్యమం
దతిశయమైన పట్టుదల • నాతనితోడ వచించె నివ్విధిన్. ౨౦౩

అర్థములు. మహార్థము=గొప్ప ప్రయోజనము గలది, మృదుల=మెత్తని మాటలచేఁ జెప్పఁబడినది, హేతుయుతము = యుక్తియుక్తమైనది, వ్యతీతకాల= కడచిన కాలమునకు, సంప్రతి=వర్తమాన కాలమునకు, శుభదంబు = మేలిచ్చునది, విభీషణుఁడు చెప్పిన మాట విన్న యెడల నిదివఱకుఁ గలిగిన సీతాపహరణ దోషము, దానివలనఁ బ్రాప్తించిన యపకీర్తి తొలఁగును కావున భూతకాల హితము. ఇప్పుడును విచారము లేక యుండవచ్చును. గావున వర్తమానకాల హితము. భావిని=రాగల కాలమందు, సౌఖ్యదము=అందఱు జీవించి యుండుటచే సౌఖ్యము నిచ్చునది, ధర్మవర్ధకము గావున భవిష్యత్కాలహితము.

తా త్ప ర్య ము

హితమైనవియు గొప్పప్రయోజనముగలవియు మృదుత్వముతోఁగూడినవియు యుక్తియుక్తమైనవియు, కడచిన కాలమునను, వర్తమానకాలమునను, భవిష్యత్కాలమునను శుభము సౌఖ్యము కలిగించునవియును నగు దన తమ్ముఁడు చెప్పిన వాక్యములు చెవిఁ జొరనిచ్చి రావణుఁడు కోపించి దానఁ జేయఁబూనిన పనియందే యెక్కువ పట్టుదల గలవాఁడై యీ విధముగ నతనితోఁ జెప్పెను.

ఉ. ఏమిర వచ్చె నంతభయ • మీ యెడ నా? కది యట్టు లుండనీ
రాముఁడు డాయునే జనక • రాజకుమారిక? నెట్లు చూచినన్
సామరసంఘశక్రుఁ డయి • యాలము చేయఁగఁ బూని నేనియున్
రాముఁడె నిల్చువాఁడు రణ • రంగమునందు మదగ్రధారిణిన్? ౨౦౪

అర్థములు. సామర సంఘ శక్రుఁ డయి = దేవతా సమూహములతోడ, నింద్రునితోడ, ఆలము=యుద్ధము, మదగ్రధారిణిన్ = నా యెదుట.

తా త్ప ర్య ము

ఇప్పు డేమిరా నా కంత ప్రాణభయము వచ్చెను. అదట్టు లుండనీ, కాని

రాముఁడు సీతాదేవి సమీపమునకైన రాఁగలఁడా? దేవతలతోడి యింద్రుని గూడి యుద్ధము చేయఁబూనినను రాముఁడు నా యెదుట నిలువఁ గలఁడా?

క. అని నిర్జరసైన్య విమర్దనుఁడు మహాచండబలుఁడు • దశవదనుండున్
దనయనుజుని హితవాదిని, ననఘు విభీషణుని విడిచి • యవలకుఁ జనియెన్. ౨౦॥

అర్థములు. నిర్జర సైన్య విమర్దనుఁడు = దేవతాసైన్యమును మర్దించినవాఁడు; మహాచండబలుఁడు=మిగుల తీక్ష్ణమైన బలము గలవాఁడు, హితవాదిని= మేలు చెప్పు వానిని, అనఘున్ = ద్వేషాసూయాది దోషరహితుని.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దేవతాసేనను దండించిన వాఁడును మిగుల జండ బలుండును (అను గర్వము గలిగి రాముని ధిక్కరించిన) పది తలలు గల వాఁడును నగు రావణుఁడు తన తోడఁబుట్టిన వాఁడును తన మేలుగోరి చెప్పు వాఁడును నిర్దోషియు నగు విభీషణుని విడిచి లేచి యావలఁ బోయెను. అందఱ యెదుట నతని నేమియు ననలేక తానే లేచిపోయెను.

—• ౧౧-వ సర్గము. రావణుఁడు కొలువు కూటంబునకుఁ బోవుట •—

క. హితుల యనాదృతిని స్వయంకృత సీతాహరణ పాప • కృతిచే సీతా
తతకామ మోహితుండగు, పతితుఁడు రావణుఁడు చిక్కి • బాఱుచు నుండెన్.

అర్థములు. హితుల యనాదృతిని = తన మేలు గోరు వారే తన్ననాదరించిరి గదా యనియు, తన యభిప్రాయమునకు విరోధముగ విభీషణుఁడు చెప్పినపుడు తక్కిన మంత్రు లందరు విని యూరకుండిరి గాని నీవు చెప్పినది సరికాదని యతనిని నాక్షేపింప కుండుటచే వారును వాని యభిప్రాయముతో నేకీభవించిన వారే యని రావణుఁడు గ్రహించి తన్నలక్ష్యము చేసిరని నొంచెను. స్వయంకృత= తానుఁగా జేసికొనిన, సీతాహరణ = సీతను హరించుట యనెడి, పాపకృతిచే = పాపపుఁ గార్యము చేతను, సీతాతత కామ మోహితుండు=సీతయందు విస్తారముగఁ గల కామముచే మతిచెడినవాఁడు, 'సుఖదుఃఖాదిజనితో మోహశ్చిత్తస్య మూఢదా'=సుఖదుఃఖాదులవలన మనస్సు మాఢ్యమును వహించుటయే మోహము, ఆకారణము చేతనే, పతితుఁడు=భ్రష్టుఁడైనవాఁడు, చిక్కిఁబాఱుచు నుండెన్ = శుష్కించుచు నుండెను. శుష్కించుట యనునది యీ గడియ యందగునది కాదు. కొంతకాలమునుండి జరుగుచుండవలెను. దీని వలన విభీషణుఁడు హనుమంతుఁడు రాకముందుకూడ నీ విషయము చెప్పుచుండి నట్లు మంత్రులు దాని నామోదించుచుండి నట్లు పాపము వృద్ధియగు కొలఁది తేజస్సు మాఱుచున్నట్లు తేర్పడు చున్నది. కామము వృద్ధియగు కొలఁది బుద్ధి చెడుచున్నట్లు తేర్పడుచున్నది. బుద్ధి నాశాత్ ప్రణశ్యతి యన్నట్లు పతితశబ్ద మీ నాశములను దెలుపుచున్నది

తాత్పర్యము

హితులగువారి యనాదరణము చేసిన కారణముచేతను, తానుగాఁ జేసిన సీతాహరణమను పాపకార్యముచేతను, సీతయందుఁ గల కామాతిశయముచే బుద్ధినాశ మగుటను, ఆ కారణములచేఁ బతితుఁడై యాకారణమునఁ దేజోహీనుఁడగుచు రావణుఁడు శుష్కించుచుండెను.

క. ఆలోచనకును సర్వము, గాలము కడచనఁగ యుద్ధ♦కాలము డాయన్
గాల మిది సచివహితులో, కాళులతో మంతనమున♦కద నని తలఁచెన్. ౨౦౭

తాత్పర్యము

ఆలోచనకుఁ దగిన కాలము కార్యము చేయుటకు ముందటి కాలము, ముందాలోచించి యావలఁ గార్యము చేయవలయును. అది దాఁటిపోయినది. కార్యము కానేయైనది. దానిఫల మిప్పుడు యుద్ధముచేయవలసిన కాలము వచ్చినది. ఇది యెల్లవారితోఁ గలసి చేయవలసిన కార్యము. ఇప్పుడేమి చేయవలయు నని మంత్రులతో, హితులతో నాలోచించుటకుఁ దగిన కాల మని తలఁచెను.

సీ. బంగారు కిటికీలఁ♦ బగడాల సొమ్ములఁ దీరిన గుఱ్ఱాల♦ తేరి నెక్కి
ముబ్బు లుర్మి కిరీటి♦ గొబ్బున సభకునై, దశకంఠుఁ డంతటఁ దరలి చనఁగ
వాలును బలుకయు♦నటులు సాధనములు, ధరియించి మున్ను గొం♦డలు చనంగ
నానావికృతవేష♦ నానాపరిష్కార, భూషితు లిరువంకఁ♦ బొల్చుచుండ
తే. రథములను వీరవారణ♦రాజిమీఁద, నటన మాడెడి వాజుల♦ పటలిమీఁద
నతిరథులు కొంద ఱెక్కఁ ద♦శాస్యు బలసి, కొలిచి వెనువెంట నేగిరి♦కొప్పరించి.

అర్థములు. వాలు=కత్తి, పలుక = డాలు, నానాపరిష్కారభూషితులు= అనేకవిధములైన సొమ్ములు ధరించువారు. బలసి = చుట్టుకొని, కొప్పరించి = అతిశయించి.

తాత్పర్యము

విభీషణుఁడు తనకు విరోధముగఁ జెప్పుట, తక్కిన మంత్రులు దాని నామోదించి యూరకుండుట, వీనివలనఁ దనవిషయమై భేదాభిప్రాయము గలవారు కొందఱు గలరని రావణుఁడు గ్రహించి తాను జేసినది సరి యని సభలో నందఱిచేత ననిపించి తప్పనఁగలవారిని దిరస్కరింపవలయు నని సభ చేరుటకై యాలోచనశాలకు రావణుఁడు పోవుచున్నాఁడు. విభీషణునివలెఁ జెప్పినవారు మఱికొందఱు గలరు. (౨౪౭౨౩ పద్యము చూచునది.) కాని విభీషణునివలెఁ దెగఁబడి చెప్పినవారు లేరు. వారు రావణు కోపమునకు భయపడి యూరకుండిరి.

బంగారు కిటికీలు, పగడాల సొమ్ములు గలిగి చక్కఁగా శిక్షితములైన గుఱ్ఱములను గట్టిన రథ మెక్కి రథచక్రములు మేఘము లుఱిమినట్లు ధ్వనించుచుండఁగా రావణుఁడు సభామందిరమునకై బయలు దేఱఁగా తరవారి, డాలు ధరించి కొందఱు

ముందుగా నడచిరి. నానావిధములైన వికారవేషములు గలవారు నానావిధము లయిన సొమ్ములు ధరించి యిరుప్రక్కల వచ్చుచుండిరి. తేర్లమీదఁ గొందఱు, మదపు టేనుఁగుల మీఁదఁ గొందఱు, నాట్యమాడునట్లు చిందులు ద్రొక్కు గుఱ్ఱముల మీఁదఁ గొంద ఱతిథులు నెక్కి రావణాసురుని విశేషముగఁ జుట్టుకొని వెంటఁబోయిరి.

క. పరిఘగదారిష్టులఁ దో, మరములఁ బరశువుల శక్తి • మండలి శూలో
త్కరములఁ గరములఁ దాలిచి, సురవైరులు చనిరి విబుధ • సూదను వెంటన్.

అర్థములు. పరిఘ = ఇనుపకట్ల గుదియలు - గదా = గదలు - కొనలు లావుగా నుండు బడితలు - రిష్టుల=కత్తులను, పరశువులన్ =గండ్రగొడ్డండ్లను.

తాత్పర్యము

ఇనుపకట్ల గుదియలను, గదలను, కత్తులను, చిల్లకోలలను, గండ్రగొడ్డండ్లను, శక్తులను, కట్టెలను, శూలములసమూహములను చేతులను ధరించి కొందఱు రాక్షసులు రావణు వెంటఁ బోయిరి.

ఉ. అంతటఁ దూర్యనిస్వనము • లంతట నిండె మహారవంబుగా,
దొంతర లయ్యె శంఖముల • ఘోరపు నాదములున్, ధరాంబరా
క్రాంతము లయ్యె నేముల వి•రావము, లిట్లు రహింపఁ దారకా
కాంతిని మించె ఛత్రములు • గ్రాల మహాపథమార్గగామియై. ౨౧౦

అర్థములు. అంతటన్=అట్లు రావణాసురుఁడు సభామందిరమునకై పయ నింపగా-తూర్యనిస్వనములు=వాద్యధ్వనులు, అంతటన్=అన్ని ప్రదేశములందు - దొంతరలయ్యెన్=ఒకటి వెంట నొకటి పరంపరగా వచ్చెను. దొంతులవలె నగుట దొంతర లగుట, ఘోరపు = అధికమైన స్థూలశబ్దభవము ఘోరము - ధరాం బరాక్రాంతములయి=ఆక్రాంతధరాంబరములు=ఆక్రమింపఁబడిన భూమి యాకాశ ములు గలవి, నేముల=రథచక్రముల యంచులయొక్క, విరావము = ధ్వని, మహా పథ మార్గగామియై=మహాపథ మనెడి మార్గమునఁ బోవువాఁడై.

తాత్పర్యము

రావణుఁడు సభామందిరమునకై బయలుదేఱి ఆపెద్దబాట వెంటఁబోఁగా వాద్యధ్వను లన్నిచోటుల పెద్దధ్వనితో నిండెను. శంఖముల పెద్దధ్వనులు పరం పరలుగా నయ్యెను. రథచక్రముల ధ్వనులు భూమి, యాకాశము నాక్రమించెను. ఛత్రములు నక్షత్రముల వలెఁ గాన నయ్యెను. పగట నక్షత్రములు గానవచ్చుట యుత్పాత సూచకము.

క. చనఁగా హాటకమంజరి వినిచయగర్భితము స్ఫటిక • విగ్రహములు నా
ఘనచామరవ్యజనములు, దనరారె దశాస్యునవ్య • దక్షిణదిశలన్. ౨౧౧

అర్థములు. హాటకమంజరి వినిచయ గర్భితము=బంగారు కమ్మల గుత్తులు

నడుమ నడుమఁ గలవి, చామర వ్యజనములు=వింజామరలు, విసనకఱ్ఱలు, సవ్య దక్షిణదిశలన్ = ఎడమ కుడి ప్రక్కలందు.

తాత్పర్యము

బంగారు పూసలగుత్తులు నడుమ నడుమ కుచ్చులవలె వ్రేలాడునవియు, స్ఫటికములవలెఁ దెల్లనైనవియు నగు వింజామరములు, వీవనలు రావణుని యెడమ కుడివైపులందు నొప్పుచుండెను.

క. దనుజులు నేల న్నిలఁబడి, వినయంబునఁ గేలు మోడ్చి ♦ వినమితశిరులై
ఘనరథసంస్థుని దశవ,క్త్రుని మ్రొక్కిరి పోవుచుండు ♦ త్రోవల నెదురై. ౨౧౨

తాత్పర్యము

పోవునపుడు మార్గమున నెదురైన రాక్షసులు వాహనములు దిగి నేలమీఁద నిలఁబడి వినయముతో రెండుచేతులు జోడించి తలవంచి రథముమీఁదనుండు రావణునకు మ్రొక్కి పోవుచుండిరి.

క. దేవారులు జయజయ యని, దీవింపఁగఁ గొంద ఱుండుఁ ♦ దెలచుచ నుండన్
భావితతేజుఁడు సువిహిత,మై వెండిపసిండికం ♦ బమై శోభితమై. ౨౧౩

అర్థములు. తెలచుచన్ = స్తోత్రము చేయుచు, భావితతేజుఁడు=పొంద బడిన తేజము గలవాఁడు, సువిహితమై = చక్కఁగ నిర్మింపఁబడినదై, పసిండి కంబమై=బంగారు స్తంభములు గలిగి.

'జయజయ' ఈ సంస్కృత శబ్దంబు లనుకరణ రహితంబులై ప్రయోగింపఁ బడినవి. ఆశ్చర్యసంతాపాద్యర్థంబుల ననుకరణంబు లేమి దోషంబుగాదు. "జయ జయ శంకర" "అంటితి నమశ్శివాయ పాపాత్మురాల" "మనుజాశనులఁట బలులఁట మునులఁట యాగంబులఁట నమో విశ్వసృజే విన మెన్నఁడు" ఉ. హరివంశము. "లింగనివాప మేమియును లేమికిఁ జొక్క నమశ్శివాయ చేయుంగల కార్యమెద్ది" కాళహస్తి. "ఆరగింపుఁడు లెండు మీకమృతమస్తు" శ్రీనాథుఁడు. భీమఖండము. ఇత్యాది.

తాత్పర్యము

కొందఱు రాక్షసులు జయజయ యని దీవింపఁగా కొందఱు స్తోత్రము చేయుచుండఁగా తేజముతోఁ గూడిన రావణుఁడు చక్కఁగా నిర్మింపఁబడి వెండి బంగారు స్తంభములు గలదై, ప్రకాశించునదియై.

తే. అమలిన స్ఫటికాంతర ♦ మగుచుఁ బైఁడి, పట్టునరిగల రత్నకం ♦ బళము గలిగి
యాఱునూర్ల పిసాసు ల ♦ హర్నిశంబుఁ, గాచు భవనోత్తమము విశ్వకర్మకృతము.

అర్థములు. అమలిన స్ఫటికాంతరము = నిర్మలములైన స్ఫటికములచే నడుమ నడుమఁ గూర్పఁబడినది, అహర్నిశంబు=రాత్రియుఁ బగలు, ఎల్లవేళల నని భావము - సమాహార ద్వంద్వము - ఏకవచనము.

తాత్పర్యము

నడుమనడుమ స్ఫటికములు గూర్పఁబడి పట్టు సరిగ గల రత్నకంబళము బఱచి ఆఱువందల పిశాచములు రాత్రి పగలు విడువక కాచియుండునదియు, విశ్వకర్మ నిర్మితము నగు మందిరము.

క. రయమునఁ జొచ్చి విహారణ, మయమును బ్రియకాజినాభి॰మండితము నుపా
 శ్రయరాజితమయిన సము, చ్ఛ్రియ వరమాసనముఁ గొను మ॰ రావణుఁడంతన్.

అర్థములు. ప్రియకాజినాభిమండితము = చిత్రవర్ణముగల జింకచర్మముచే నలంకరింపఁబడినది, ఉపాశ్రయ రాజితము = ఆనుకొనుటకు నొఱగు దిండ్లచేఁ బ్రకాశించునది, సముచ్ఛ్రియ=ఎత్తైన, వరమాసనము=గొప్ప పీఠము.

తాత్పర్యము

కార్యము తీవరపెట్టుటచేఁ దొందరగాఁ బ్రవేశించి వైడూర్యములతో నిండి చిత్రవర్ణపు జింకచర్మముచే నలంకరింపఁబడి యొఱగుదిండుగల యెత్తయిన యుత్తమాసనమునఁ గూర్చుండి రావణుఁడు; ఆ పిమ్మట.

—॰ రావణుఁ డెల్ల రాక్షసుల సభకు రప్పించుట ॰—

ఉ. దూతల వేగవంతులను ॰ దోడన పిల్చి జవంబున న్మహా
 జ్ఞాతముసై సమర్థ్యము వి॰చార్యమునై పని యొండు గల్గె మీ
 రాతత వేగయుక్తి సభ॰కై చనుదెం డని సర్వరాక్షస
 వ్రాతముఁ బిల్చిరం డనిన ॰ వారును నేగి పురంబులోనికిన్. ౨౧౬

అర్థములు. వేగవంతులను=వేగముగఁ బోఁగలవారిని, తోడన=వెంటనే కూర్చుండి కూర్చుండకముందే, మహాత్+జాతము = గొప్పవారివలనఁ గలిగినది. ఇట్లు చెప్పుటచే రామలక్ష్మణులు వానరసేనతో వచ్చి సముద్రతీరమున దిగి రని సూచితము. దూతలకుఁ జెప్పుటకావున నింత కెక్కుఁవ యిచ్చటఁ జెప్పలేదు గాని సభలో రామలక్ష్మణులు వేలావనిఁ జేరినా రనియే చెప్పెను. (ప-౨౩౯) కావుననే యీ తొందర. సమర్థ్యము=సమర్థులు సాధింపఁదగినది, విచార్యము=సాధనమార్గ మాలోచింపఁదగినది, ఆతతవేగయుక్తిన్=మిగుల వేగముగ.

తాత్పర్యము

రావణుఁ డాసనమునఁ గూర్చుండి కూర్చుండక ముందే వేగముగఁ బోవఁ గల దూతల బిలిచి మీరు త్వరగాఁ బోయి రాక్షసుల నందఱను గొప్పవారివలనఁ గలిగినదై, సమర్థులు నిర్వహింపఁదగినదై, కావుననే యాలోచింపఁదగిన పని యొకటి గలిగెను, మీరంద ఱతివేగమున రం డని పిలిచి రండని చెప్పఁగా వా రంద ఱూరిలోనికిఁ బోయి.

క. ఇల్లిల్లు తోఁటకొడ్డులు, సల్లలితవిహారదేశ॰సమితిఁ గనుచు వా
 రెల్లరఁ బిలిచిరి మఱి ని, ద్రిల్లెడివారలను గూడ ॰ దిగు లేది వెసన్. ౨౧౭

అర్థములు. సల్లలిత విహారదేశసమితి = మనోహరమై విహరింపఁ దగిన ప్రదేశ సమూహములను, దిగు లేది=భయములేక, ఇల్లిల్లు వీప్సయందుద్విరుక్తి. ఒకయిల్లు, ఆవల మరియొక యిల్లు.

తా త్ప ర్య ము

ఆ దూత లింటింటికిఁ బోయి యిండ్ల యందు నుండు వారిని, తోటలలో దొడ్లలో నుండు వారిని, క్రీడావిహారప్రదేశములందుండువారిని, నిద్రవోవుచుండు వారినిగూడ దిగులు లేక రాజాజ్ఞ కావున లేపి పిలచిరి

ఉ. కొందఱు స్యందనంబులను ♦ గొందఱు భూరిమదావళంబులన్
గొందఱు సైంధవంబులను ♦ గొందఱు కాల్నడ వచ్చుచుండఁగా
నందఱ తేర్ల వారణహ♦యంబులచే నగరంబు రాజిల్లెన్
గ్రందుగఁ బక్షిసంఘములు ♦ గ్రమ్మి రహించు నభంబుకైవడిన్. ౨౧౮

అర్థములు. స్యందనంబులను=రథములమీఁదను, భూరిమదావళంబులన్ = పెద్దయేనుఁగులమీఁదను, సైంధవంబులను=గుఱ్ఱములమీఁదను, పక్షిసంఘములు గ్రమ్మి రహించు నభంబుకైవడిన్-అనుటచేతను నుదయమే సూచితము, ఆహారము నకై గూండ్లు విడిచి యుదయముననే కదా పక్షులు పోవును.

తా త్ప ర్య ము

ఇట్లు దూతలు పిలువఁగానే రాక్షసులు కొందఱు రథములనెక్కియు, గొంద ఱేనుఁగులనెక్కియు, గొందఱు గుఱ్ఱముల నెక్కియు, కొందఱు నడచియు వచ్చు చుండఁగా వారల తేర్లచే, నేనుఁగులచే, గుఱ్ఱములచే నగరము పక్షులగుంపులు గ్రమ్మిన యాకాశము వలె నుండెను.

ఉ. యానము లెల్ల దూరతల♦మందున నిల్పి పదప్రచారులై
లోనికి సోఁకు లెల్ల గుహ♦లోనికిఁ బోవు మృగాధినాథులో
నా నయ మార నేగి సుర♦నాయకగర్వవిదారి పాదముల్
పూని కరంబులన్ మరలఁ ♦ బూజితులై యుచితత్వ మేర్పడన్. ౨౧౯

అర్థములు. దూరతలమందున=దూరప్రదేశమునందే, సురనాయక గర్వ విదారి=ఇంద్రుని ఫోగరణంచిన రావణుని, పూజితులై =సమ్మానింపఁబడినవారై, ఉచితత్వ మేర్పడన్=వారివారి యోగ్యతకుఁ దగినట్లు.

తా త్ప ర్య ము

వారివారి వాహనముల నన్నిటిని దూరమునందే నిలిపి దిగి కాలినడకతో గుహలోనికిఁ బోవు సింహములవలె సభలోనికిఁ బోయి రావణుని పాదములంటి నమస్కరించి మరల గౌరవింపఁబడినవారై వారి వారి యోగ్యతకుఁ దగినట్లు.

క. కొందఱు పీఁటల మఱియుం. గొందఱు దర్భాసనములఁ ♦ గొందఱు నేలన్
బృందారకరిపుశాసన, మొంది యతని ప్రోల నెల్ల ♦ నుపవిష్టులుగాన్. ౨౨౦

అర్థములు. బృందారకరిపు శాసనము = దేవవిరోధి యగు రావణునాజ్ఞ ఉపవిష్టులు=కూర్చుండినవారు.

తాత్పర్యము

పురోహితులు లోనగు వారు పీటలమీఁదను, శ్రోత్రియులు దర్భాసనముల మీఁదను, కొఁడుకులు లోనగువారు నేలఁ బఱచిన కంబళ్ళమీఁదను రావణు నాజ్ఞ ప్రకారము కూర్చుండిరి.

సీ. అర్థనిశ్చయ సమ•ర్థాత్ములా, పండితుల్, సర్వజ్ఞులును బుద్ధి•చక్షువులును
గుణయుక్తులగు మంత్రి•కుంజరుల్ నూఱుల, కొలఁదిగ నుండిరి•కూటమునను
యోధులు పెక్కురు • నొప్పి రా యాస్థాని,నందఱు,బఱిసేమ • మారయుటకు
నపుడు విశాలమై • హాటకచిత్రితం, బగు మేలిగుఱ్ఱాల•స్యందనమున
తే. వరయశశ్శాలియు మహాను•భావుఁ డైన, యవ్విభీషణుఁ డరుదెంచి•యన్నఁ గాంచి
తనదు పేరు వచించి పా•దముల ప్రొక్కి, నల్లశుకుఁడు ప్రహస్తుఁడు • నాచరింపఁ

అర్థములు. ఆ సభయం దెట్టివా రుండి రనిన:— అర్థ నిశ్చయ సమర్థాత్ములు=ఈకార్య మిటు చేసిన బాగు, ఇటు చేసిన నోగు అని నిర్ణయించి చెప్పఁగల మనస్సు గలవారు, పండితుల్=నీతిశాస్త్రవేత్తలు, సర్వజ్ఞులు=ఏవిషయ మడిగినను జెప్పఁగలవారు, బుద్ధిచక్షువులు=జ్ఞానమనెడి కన్నులుగలవారు, శాస్త్రము నాధారము చేసికొని యింద్రియ గోచరములుగాని వానిని బుద్ధిబలముచేఁ జెప్పఁగలవారు, గుణయుక్తులు = మంచిగుణముగలవారు, మంత్రి కుంజరుల్ = మంత్రి శ్రేష్ఠులు ఆస్థాన = సభయందు.

తాత్పర్యము

కార్యము నిశ్చయించు సామర్థ్యముగల మనస్సుగల పండితులు, సర్వము దెలిసినవారు, జ్ఞాననేత్రము గలవారు, గుణవంతులు నగు మంత్రి శ్రేష్ఠులును ఆ సభయందు వందలకొలందిగ నుండిరి. యుద్ధనిపుణులైన వారనేకు లా సభయుం దుండిరి. వీరంద ఱున్నట్టుండి తమ్ముల బిలిపించుటచే నేమి యుపాయము వచ్చెనో యని రావణుని క్షేమము విచారింప వచ్చిరి. అపుడు వెడలుపై బంగారు నగలు ధరించిన గుఱ్ఱాలు కట్టిన తేరెక్కి గొప్పకీర్తిగలవాఁడును, మహానుభావుఁడైన విభీషణుఁడు వచ్చి యన్న యొద్దకుఁ బోయి పాదములు స్పృశించి తనపేరు చెప్పి నమస్కరించెను ఆ ప్రకారమే శుకుఁడు, ప్రహస్తుఁడు చేసిరి.

క. వారల కుచితాసనముల, వేరుగఁ బఱి యొసఁగ వారు • వెలసిరి వానన్
సారపరార్థ్యాగురుక,ర్పూరప్రసక్సురభి గొనుచుఁ•బోలిచెఁ బవనుఁడున్. ౨౨౨

అర్థములు. ఉచితాసనములు = తగిన యాసనములు, వేరుగన్ = వేర్వేరుగ-వేరు వేఱు అని రెండురూపములు గలవు. 'కౌరవుల సేమ మెల్ల వేర్వేర నడిగె' నని భార, ఉద్యో ౨ ఆ - వానన్=వానియందు, అది యిది యెది యనువానికిఁ

ద్వితీయాసప్తమ్యేక వచనంబులందు దాన, దీన దేన ననియు, వానిబహువచనంబుల యందు వాన, వీన వేన ననియు రూపంబులు, ప్రౌ-వ్యా-సర్వ-౬౩సూ-సార= సత్త్వగల, పరార్థ్య = శ్రేష్ఠమైన, అగురు. కర్పూర, స్రక్ సురభి = అగురు యొక్కయు, పచ్చకర్పూరము యొక్కయు, పూలదండల యొక్కయు పరిమళమును.

తాత్పర్యము

వారికిఁ దగిన యాసనములు వేఱుగ నేర్పాటు చేయఁగా వానియందు వారు కూర్చుండిరి. శ్రేష్ఠమైన, అగరు; పచ్చకర్పూరము, పూలదండలు వీని వాసన గ్రహించి గాలి కమ్మగ వీచెను.

ఉ. గట్టిగఁ బల్కఁ డెవ్వఁడు నొకండును వక్రమవాది లేఁ డటన్
మట్టును మీఱి సద్దిడఁడు మానవభోజుల నొక్కఁ డేని దై
త్యేట్టుని యాసనంబుఁ గను చెల్లరు ధీరులు వీరు లుండ స్వా
రాట్టు వసుల్ భజింపఁగను రాజిలుభంగి సతండు రాజిలెన్. ౨౨౩

అర్థములు. సద్దిడఁడు=చప్పుడు చేయుఁడు, దైత్యేట్టుని= రాక్షసశ్రేష్ఠుని యొక్క, ఆసనంబు = ముఖము, ధీరులు = పండితులు, వీరులు = శూరులు, స్వారాట్టున్=ఇంద్రుని, వసుల్=వసువులు, స్వర్ + రాట్టు=స్వారాట్టు.

తాత్పర్యము

ఆ రాక్షసులలో నొకఁడైన గట్టిగ మాట లాడినవాఁడు లేఁడు. అక్రమముగా వాదించువాఁడు లేఁడు. మర్యాదఁదప్పి చప్పుడు చేసినవాఁడు లేఁడు. అందఱు ధీరులు వీరులు. రావణుని ముఖముఁ జూచుచు నింద్రుని వసువులు గొలుచునట్లు గొలువఁగా నతండు ప్రకాశించెను.

—౧౨-వ సర్గము రావణుఁడు రాక్షసుల నంబోధించుట—

సీ. కలయంగ సభ నెల్లఁ గనుఁగొని దళవాయి, యగు ప్రహస్తునితోఁ దశాస్యుఁ డనియె
సేనాపతీ! నీవు చెచ్చెరఁ జని చతు, ర్విధకళాధుర్యుల వీరవరుల
నెక్కుడు కాపుంచు మీఁ యన నతేఁడును, రాజశాసనమున రక్ష నిలిపె
వీటిలోపల మఱి వెలుపల నెల్లెడఁ బురరక్షణార్థంబు పూర్ణముగను
ఆ. వేఱ వేఱ యసురవీరుల నిటు నిల్పి, సర్వసైన్యములను సకలదిశల
రక్ష నిలిపినాఁడ రాక్షసవల్లభ, శంక లేక పనులు సలుప వచ్చు. ౨౨౪

అర్థములు. దళవాయి = సేనానాయకుఁడు, చతుర్విధ కళాధుర్యులన్ = నాలుగు విధములైన విద్యలయందు సమర్థులు-రథికులు, అశ్వారోహకులు(రౌతులు) గజారూఢులు-పదాతులు- (కాలిబంట్లు) అను నాలుగు విధముల యోధులు.

తాత్పర్యము

అప్పుడు రావణుఁడు సభయందుండు వారి నందఱను నలుప్రక్కలఁ గలయఁ జూచి సేనానాయకుఁ డగు ప్రహస్తునితో నిట్లనియె, సేనాపతీ! నీవు త్వరగాఁ బోయి,

నాలుగు విధములగు యోధులను వీరులగువారిని నిదివఱకుండు కాఘునకంటె నెక్కు-వగాఁ గాపుంచుము. అని చెప్పఁగా సతఁడును రాజాజ్ఞ ప్రకారము పట్టనము లోపల, వెలుపల, నన్ని ప్రదేశములందును, బట్టనము రక్షించుకొఱకు వేలువేలు రాక్షసుల వేలువేలు స్థలముల నుండ నియమించి, రాక్షసేశ్వరా! యన్ని సేనలను నన్ని ప్రదేశముల నిలిపినాఁడను, భయములేదు. సందేహము లేక మీ కార్యము మీరు చేయవచ్చును.

క. అనవుడు రాజ్యహితైషుఁడు, దనుజాధిపుఁ డతని వాక్య ♦ తతి విని సుఖమం
దనురక్తి కలిమి సుహృదులఁ గనుగొని యిట్లనియెఁ బ్రకృత♦కార్యము దెలియన్

అర్థములు. రాజ్యహితైషుఁడు = రాజ్యముయొక్క మేలు కోరువాఁడు, సుఖమందున్ = తన సౌఖ్యమందు, అనురక్తికలిమిన్=అనురాగము కలుగుటచే, సుహృదులన్ = మిత్రులను, సుహృత్తులు - మిత్రులు - వయస్యులు నను నీ శబ్దములు పర్యాయవాచకముగ నుపయోగింపఁబడినను వానియందుఁ గొంత భేదము గలదు.

దుఃఖే విపది సంమోహే, కార్యకాలాత్యయేపి చ
హితాన్వేషీ చ హితకృత్, య స్సుహృ త్సోభిధీయతే.
సత్యవా గార్జవరతి, రుపకుర్వన్ ప్రియం వదన్
భజతే య స్స్వయం ప్రీతిం, ప్రియ స్స పరికీర్తితః
సమాన శీలవ్యసనో, గహ్యాఖ్యా నైకభాజనమ్
విపత్ప్రతిక్రియాభిజ్ఞో వయస్యః పరికీర్తితః
ఉపకారము గోరి యుపకారము జేయువాఁడు మిత్రుఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము ప్రహస్తుఁడు చెప్పఁగా రాజ్యము మేలుగోరువాఁ డగు రావణుఁడు తన సౌఖ్యమునందలి ప్రేమచే స్నేహితుల నందఱఁ జూచి యప్పుడు సలుపఁబూనిన కార్యము దెలియ నిట్లనియె.

రాజ్యహితము గోరినవాఁడును, తన సుఖమునం దనురక్తి గలవాఁ డనుటచే-సీతవలనఁ దాను బొందఁగోరిన సౌఖ్యమునకు హాని రాఁగూడదు. ఇది వాని ముఖ్యోద్దేశము - ఆ నిమిత్తమున బ్రజలకుఁ గీడు రాఁగూడ దని భావము.

ఈ విషయము స్పష్టముగా ౨౨౯ వ పద్యమునఁ జెప్పఁబడును.

చ. అసురులు! ధర్మకామముల ♦ నర్థమునం దగు దేనిఁ బూనఁగా
వెస నని యోజనన్ జలుపు ♦ వేళల లెస్సగ దాన దాన నే
దొసఁగులు మేళ్ళు సౌఖ్యములు ♦ దుఃఖములుం బ్రియవిప్రియంబులుం
బొసఁగునొ లెస్సగా నరసి ♦ పూర్ణమనీషను నిశ్చయింపుఁడీ. ౨౨౬

అర్థములు. దానన్ దానన్=దానిచే దానిచే; (౨౨౨వ పద్య వ్యాఖ్య చూచునది) దోసఁగులు=కీడులు; పూర్ణమనీషను=నిండు మనస్సుతో,

తాత్పర్యము

రాక్షసులారా! ధర్మము అర్థము. కామము వీనిలో నేది చేయఁదగినది యని యాలోచించునపుడు ఏది, యేది చేసిన కీడులు, మేళ్ళు, సౌఖ్యముల, దుఃఖములు, ప్రియములు, అప్రియములు కలుగునో యవి లెస్సగా విచారించి యఱగొఱలేని మనస్సుతో నిశ్చయింపుఁడు.

ఉ. ఎప్పుడు నేమికార్యముల • నే నొనరించిన మీరలెల్లరుం
జెప్పిన పద్ధతి న్నడతుఁ • జే టొనఁగూడద యొంట నేని, నే
నప్పుడు హాతుఁ డిందు మహి • రామరసమ్మతిఁ బోవుమాడ్కి మీ
రొప్పుగఁ జెప్పినట్లు చని • యొందుదుఁ గాదె నితాంతసంపదన్. ౨౨౭

తాత్పర్యము

మాకేది మేలో, మీకేది మేలో నీకుఁ దెలియదా, మమ్ము నడుగవలయునా యందురేమో, నాకుఁ దెలిసినను దెలియకున్నను నింతవఱకు నెప్పుడు నే నే కార్యము చేసినను మీ రందఱు చెప్పినవిధముగానే నడచుచున్నాను. దానివలన నే కార్యము చెడినది లేదు- అన్నియు ననుకూలములుగానే వచ్చెను. కావుననే యిప్పుడు మీ యాలోచనప్రకారము పోవఁదలఁచి యడుగుచున్నాను. ఆ యింద్రుఁడు, సూర్యుఁడు చంద్రుఁడు దేవతలు సమ్మతించిన మార్గమునఁ బోవునట్లు మీరు చెప్పినట్లు చేసికదా నే నీ సంపద పొందినవాఁడ నైతిని. మీరు సంపాదించి యిచ్చినది, మీ రేకదా కాపాడవలయును.

ఉ. మీకిది సర్వముం దెలుపఁ • మేకొనియుండియుఁ గుంభకర్ణు ని
ద్రాకలితత్వముం గనుటఁ • గ్రన్నన యప్పుడ చెప్పనైతి, న
స్తోకపునిద్ర నార్నెలలు • సోలెను, నిప్పుడ మేలు కాంచె, నీ
ప్రాకటసర్వశస్త్రధర • వర్యుఁడు కావున నేఁడు చెప్పెదన్. ౨౨౮

అర్థములు. మేకొని యుండియున్ = సమ్మతించి యుండియు.

తాత్పర్యము

ఇప్పుడు నేను మీకుఁ జెప్పఁ బోవునది సమస్తము ముందే చెప్పవలయు నని మనస్సునం దుండెను. కాని కుంభకర్ణుఁడు నిద్ర పోవు చుండుటచేఁ దెలుప లేదు. ఆఱునెలలు నిద్రించి యిప్పుడే మేలుకొన్నాడు కావున నేఁడు చెప్పఁబూనితిని.

ఆఱునెలలు కుంభకర్ణుఁడు నిద్రపోయినచో సీతాదేవిని దెచ్చి పదినెలలయినదికదా! ఆఱునెలలకు ముందు వాఁ డొకసారి మేలుకొనెఁగదా! అప్పు డేల చెప్పియుండరాదు? వాస్తవ మేమన సీతను దాను దెచ్చిన విషయము రావణుఁ డెవ్వరికిఁ దెలియకుండ దాఁచెను. ఎవరికిఁ దెలియ రాదని యేతనయంతఃపుర స్త్రీలుమాత్రము

సంచరించు నుద్యాన వనములో నుంచెను. కావున నంతఃపురమునకు వచ్చుచుఁ బోవుచుండువారికి మాత్రమే తెలియును. ఆఁడువారిమూలమునఁ విభీషణాదులకుఁ దెలిసెను. హనుమంతుఁడు బహిరంగపఱచు వఱకు నగరములో ననేకులకుఁ దెలియదు. ఇంతయేల, యుద్ధమునకుఁ బోవు భటులకు నేల యుద్ధమో, యెవరితో యుద్ధమో యా గడియవఱకుఁ దెలియదు, (చూ-ప ౨౦౦) ఈ కుత్సితోపాయము నేఁటి దేశాధిపతులు యుద్ధవేళల ననుసరించు చున్నారుగదా! ఇది రాజనీతియే కాని దుర్నీతి. రాజనీతి రెండువిధములు. సునీతి, దుర్నీతి యని. సునీతి ధర్మము ననుసరించి యుండును, దుర్నీతి ధర్మవిరుద్ధముగ నుండును. రాజుల కుభయనీతులం దధికారము గలదు. తక్కినవారికి దుర్నీతియం దధికారము లేదు.

—♦ రావణుఁడు రాక్షసులతో సీతవృత్తాంతముఁ జెప్పుట. ♦—

ఉ. రాముని దేవి సీతఁ బ్రియురాలి విదేహతనూజ దండకా
 భూమిని నుండఁ దెచ్చితిని ♦ బుష్పసుగంధిని, మందయాన యా
 భామిని నాదు శయ్యపయిఁ ♦ బండఁగ నొల్లదు, మూఁడులోకముల్
 వేమఱు రోయ సీత సరి ♦ లేమ లభింప దటంచుఁ దోఁచెడిన్. ౨౯

తాత్పర్యము

పూలవాసనవంటి వాసనగలదియు, మెల్లగా నడచునదియు నగు రాముని భార్యను, విదేహరాజకూఁతు రగు సీతను దండకారణ్యము దుండఁగాఁ దెచ్చితిని. ఏల తెచ్చితి వందురా-మూఁడులోకములలో వెదకినను అటువంటి సుందరి వేఱొకతె లేదు. ఆమెను నా భార్యగాఁ జేసికొనఁ దలఁచి తెచ్చితినిగాని యామె నా పాను పెక్క సమ్మతింపలేదు.

చం. తనుతరమధ్య సత్పృథుల ♦ తాపరిశోభినితంబబింబఁ గం
 జనిభ విశాలలోచనను ♦ శారదపూర్ణసుధాకరాస్య నా
 కనకపుబొమ్మ సుందరిని ♦ గాంచినచో మయుఁడే సృజించెనా
 వనజనివాయతాక్షి నని ♦ భావమునం దలపోఁత గల్గెడిన్. ౩౦

అర్థములు. తనుతరమధ్య=మిగుల సన్నని నడుముగల దానిని, సత్పృథులతాపరిశోభి = బలిసియుండుటచేఁ బ్రకాశించు, నితంబబింబ = పిఱుఁదులు గల దానిని, కంజనిభ = తామరలతో సమానమైన, విశాలలోచనను = వెడలుపాటి కన్నులు గలదానిని - శారదపూర్ణ, సుధాకరాస్య = శరత్కాలమునాఁటి నిండు చంద్రునివంటి ముఖము గలదానిని - తలపోఁత = ఆలోచన.

తాత్పర్యము

మిగుల సన్నని నడుము, బలసిన పిఱుఁదులు, తామరలవంటి కన్నులు, శరత్కాలమునాఁటి నిండుచంద్రునివంటి ముఖముగల యాబంగారు బొమ్మను, అందగత్తెను,

చూచినపుడు మయుఁడే దీనిని సృజించెనా యని తోఁచును. మయుఁడు దానవుఁడు కావున వాఁడు సృజించినది తాను గ్రహించుట దోషము కాదని సూచన.

తే. అరుణతలములు కడు మనో•హరతమములు
సుప్రతిష్ఠితములు నైన • సుందరాంగి
చరణములు తామ్రనఖములు • చక్కఁ జూడఁ
జూడ ననుఁ బుష్పబాణుండు • వాఁడి మెఱసి. ౨౩౧

అర్థములు. అరుణ తలములు = ఎఱ్ఱని యడుగులు, సుప్రతిష్ఠితములు = చక్కఁగా నేల మోపునవి, హెచ్చుతగ్గులు లేనివి, తామ్రనఖములు=ఎఱ్ఱని గోళ్లు, వాఁడి = పరాక్రమము.

తాత్పర్యము

ఎఱ్ఱని యఱకాళ్లు గలవియు, మిగుల మనోహరములైనవియు, నేల చక్కఁగా మోపఁబడునవియునగు నా సుందరి పాదములు-ఎఱ్ఱని గోళ్లు చక్కఁగాఁ జూడఁగాఁ జూడఁగా నన్ను మన్మథుఁడు పరాక్రమించి కాల్చుచున్నాఁడు.

క. సారహుతాగ్నిజ్వాలల, తీరున నీరజహితద్యు•తి న్వెలిఁగెడి యా
సారసదళనయనం గని, మారుని వశమైతి నసుర•మండనులారా. ౨౩౨

అర్థములు. సారహుతాగ్నిజ్వాలలతీరున=అగ్నియొక్క సారవంతములైన జ్వాలలు - హోమము చేయఁబడిన యగ్నిహోత్రుని సారములైన జ్వాలలవలె - (౨) సారమైన హవిస్సుచేత హోమము చేయఁబడిన యగ్నిజ్వాలలవలె-ఈ యుపమానము సీతాదేవి పవిత్రతను, తపోమహిమను దెలుపుచున్నది- నేనై తాఁకినఁ గాల్చునని యామెయే సమ్మతించువఱకుఁ గాచియున్నానని భావము. నీరజహిత= సూర్యుని, కాంతివంటి, ద్యుతి=కాంతిచే, ఎండను జూడవచ్చునే కాని, సూర్యుని జూడరానట్లు లామె కాంతిని జూడవచ్చునే కాని, యామెను జూడ సాధ్యపడదని భావము-(౨) సూర్యకాంతియే మనలను దపింపఁ జేయునపుడు, సూర్యుఁ డెంత చేయలేఁడు - అగ్నిసెగకే కమరునవి యగ్నిలోఁబడిన నేమగును? సారసదళనయనన్ = కమలముల రేకులవంటి కన్నులుగలదానిని, మారుని వశమైతిన్= (౧) మన్మథుని వశమైతిని- (౨) మృత్యుదేవతకు వశమైతిని - మారయతీతి మారః - చంపువాఁడు గావున మారుఁడు - మృఞ్ ప్రాణత్యాగే-

యుద్ధమునందుఁ జత్తునో, చావనో సందేహముగాని, సీత నాకు లభింపదేని నేను మదనతాపమునఁ జచ్చుట నిజము. కావున నేను బ్రతికియుండఁగోరిన సీత నాకుఁ దక్కు నుపాయము చెప్పుఁడని భావము.

తాత్పర్యము

సారవంతములైన మంత్రములచే, హోమ ద్రవ్యములచే హోమము చేయ

బడిన యగ్నియొక్క శిఖలవలెను, సూర్యుని కిరణములవలెను వెలిఁగెడి యాసీతను జూచి రాక్షసశ్రేష్ఠులారా! నేను మన్మథుని వశమైతిని.

అగ్నిజ్వాలలు-సూర్యునికాంతి పట్టుకొనఁబోయిన చేతికిఁ జిక్కనవి కావు- అట్టిదే సీతయు-ఆమెను నేను గ్రహింపఁగోరుట నా చావునకే యని ధ్వన్యర్థము - 'సత్యావాణీ సరస్వతీ' యని కలదుకదా-ఇట్లులే ఖరుఁడు చెప్పెను-కుంభకర్ణుఁడు చెప్పఁబోవుచున్నాఁడు-రాఁగల యనిష్టములను ముందు వాక్కు సూచించును.

క. తీరైన యున్నసంబును, హారులు విపులంబులైన ♦ యక్షులుఁ గల యా
నారి ముఖముఁ గని వివశత, మారుని వశ మైతి నసుర ♦ మండనులారా! ౧౭

అర్థములు. ఉన్నసము=ఎత్తుగు ముక్కు, హారులు = మనస్సు హరించునవి, విపులంబులు=విశాలములైనవి, అక్షులు=కన్నులు, నారి=స్త్రీ, వివశతన్ = పరవశత్వముచేత, అల్లెత్రాడను నర్థమందు నారీశబ్దము దేశ్యవిశేష్య మని శబ్దరత్నాకరమందుఁ గలదు గాని "నారీయోషితి మౌర్వ్యాం చ" యని రభసుఁడు చెప్పుటచే రెండర్థము లందును నది సంస్కృత శబ్ద మనియే యెఱుఁగ నగు, 'నారిఁగూర్చి నిశాచర నారిగూర్చి' యనుచో రెంటను సంస్కృత శబ్దముగా గ్రహించిన రాఁగల బాధ లేదు.

తాత్పర్యము

చక్కగాఁ దీరిన యెత్తైన ముక్కు, మనోహరములు విశాలములు నైన కన్నులు గల యా స్త్రీముఖముఁ జూచి రాక్షసులారా! మారుని వశ మైతిని.

క. అలుకను ముదమునఁ దుల్యుఁడు, బలియించును శోకతాప ♦ భరముం గాంతిం
దొలఁగించు నట్టి స్మరుచేఁ, గలుషితచిత్తుఁడ నిశాట ♦ కాండములారా! ౧౮

అర్థములు. నిశాటకాండములారా=రాక్షససమూహములారా, అలుకన = కోపమునందు, ముదమునన్ = సంతోషమునందు, తుల్యుఁడు = సమానుఁడు, కలుషిత చిత్తుఁడను=కలఁతపెట్టఁబడిన మనస్సు గలవాఁడను (౨) పాపపు బుద్ధి గలవాఁడను, స్మరుచే - విభక్తి మార్చి యన్వయింపవలెను.

తాత్పర్యము

ఎట్టి మన్మథుఁడు కోపమునందును, సంతోషము నందును సమానుఁడో, ఎవఁడు శోకతాపాతిశయమును అధికముచేయునో, తొలఁగించునో యట్టి మన్మథునిచేఁ గలఁత నొందిన మనస్సుగలవాఁడ నైతిని.

మన్మథునకుఁ గోపము వచ్చినను, సంతోషము వచ్చినను పర్యవసానము విరహులఁ జంపుటే యని యైనఁ జెప్పవచ్చును. లేక మనుష్యులకుఁ గోపము వచ్చినను సంతోషము వచ్చినను మన్మథబాధ తప్పదని యైనఁ జెప్పవచ్చును. అహ్లాదులు వచ్చి దుఃఖించుచున్నను మదనతాపము పోలేదని భావము. "వచ్చుచు రైకముళ్ళు విప్పువాఁ"డని సామెత కలదుగదా.

క. తనమగఁడు రామచంద్రుఁడు, చనుదెంచెడి ననెడి యాస ♦ సంవత్సరమున్
నను గడుపు వేఁడెఁ దశాస్యా,మిని నే నా మేలిమాటఁ♦గైకొంటిఁ జుఁడీ. ౨౩౫

తాత్పర్యము స్పష్టము.

సీతాదేవి గడువుగోరె ననుట యసత్యము.

క. చక్కఁగ స్వారి యొనర్చుట, మిక్కిలి వడఁబడిన తేజ♦మిహినా నేనుం
జిక్కితిఁ గాముని దాడికి, స్రుక్కితి నిది నా విధం బ♦సురవరులారా! ౨౩౬

అర్థములు. వడఁబడిన=గాసిపడిన, తేజమిహి=శ్రేష్ఠమైన గుఱ్ఱము.

తాత్పర్యము

మిక్కిలి సవారీయుటచే గాసిపడిన యుత్తమాశ్వమువలె నేనును మన్మథుని ధాటికి స్రుక్కితిని.

ఉ. ఏ కరణిం దరింతురు మ♦హిష్ఠభయంకర సత్త్వయుక్త నీ
రాకరవర్య మా ఘనవ♦నౌకసు లేని నృపాలు రేని నా
నాకపి యొక్కఁడే కద మ♦హాహవము న్మనతో నొనర్చె, నె
ద్దే కరణిం గ్రియాసరణి ♦ యేగెడినో తెలియంగ శక్యమే. ౨౩౭

అర్థములు. మహిష్ఠభయంకర = మిగుల భయమును గలిగించు, సత్త్వ= జంతువులచే, యుక్త = కూడిన, నీరాకరవర్యమును=శ్రేష్ఠసముద్రమును, వనౌకసులు=క్రోఁతులు, మహాహవమున్=గొప్పయుద్ధమును.

తాత్పర్యము

క్రోఁతులైనను రాజకుమారులైనను మిగుల భయంకరమైన జంతువులుగల సముద్రము నెట్లు దాఁటి రాఁగలరని యూరకుండరాదు. ఏలన,నొక క్రోఁతిగాదా సముద్రము దాఁటివచ్చి మనతో నంత పెద్దయుద్ధము చేసెను. ఏ కార్య మే సమయమున నెట్లు జరుగునో యెట్లు తెలియ సాధ్యమగును.

ఉ. దాన భవిష్యదర్థము య♦థామతి యోజనచేసి చెప్పుఁడీ
మానవుచే భయం బొదవు ♦ మాటయు లే దది చక్కఁజూడుఁడీ
దానవదేవయుద్ధములఁ ♦ ద్వద్భుజశౌర్యము నేను నూఁతగాఁ
బూని కదా జయించితిని ♦ బోరుల గెల్పించినారు మీరెకా. ౨౩౮

అర్థములు. భవిష్యత్ + అర్థము = ముందుఁ జేయవలసిన కార్యము, యథామతి=మీ మనస్సు చొప్పున.

తాత్పర్యము

ఆ కారణముచే నిఁక ముందు నేను జేయవలసిన దేమియో యది మీ యిష్టప్రకార మాలోచించి చెప్పుఁడు. మనుష్యులవలన మనకు భయములే దనుమాట మనస్సులో నిలుపుఁడు. దేవదానవ యుద్ధములందు మీ భుజశౌర్య మాధార

ముగఁ జేసికొనికదా జయించితిని. యుద్ధములందు మీరేకదా నాకు జయము గలిగించినవారు. ఇవి యిచ్చకాలమాటలు.

ఉ. ఆ వసుధాధిపాత్మజులు ♦ క్ష్మాత్మజ పోబడి తా రెఱింగి సు
  గ్రీవపురస్సరం బగు హ♦రిధ్వజినీతతిఁ గూడి వార్ధి వే
  లావనిఁ జేరినారు, వసు♦ధాత్మజ నీయఁగ రాదు, వెండి నీ
  తావిభుఁ జంపఁగా వలయు ♦ దానికిఁ జెప్పుఁడు మంచియుక్తులన్. ౨౮

అర్థములు. వసుధాధిపాత్మజులు = రాజకుమారులు, క్ష్మాసుత పోబడి = సీతాదేవి యిందున్నజాడ, సుగ్రీవ పురస్సరంబగు=సుగ్రీవుఁడు ముందుగాఁ గల, హరిధ్వజినీతతి = వానర సేనాసమూహము, వార్ధి వేలావనిన్ = సముద్రతీర భూమిని.

తా త్ప ర్య ము

ఆ రాజకుమారులు సీతాదేవి యిందున్న జాడ దెలిసి సుగ్రీవుఁడు ముందుగాఁ గల వానరసేనతో సముద్రతీరమున వచ్చి దిగియున్నారు. మీరు నాకుఁ జెప్ప వలసిన యాలోచన యేమనఁగా సీతాదేవిని మరల నీయరాదు. రాముని జంప వలెను. దానికిఁ దగిన యుపాయముఁ జెప్పుఁడు.

దీనివలన రావణుఁడు సామ దాన భేదోపాయములఁ దలఁచినవాఁడేకాఁడు. దండము మాయ ఇంద్రజాలము వీనిలో నేది యనుష్ఠింపవలయు ననియే వానిప్రశ్న.

  సామ దానంచ భేదశ్చ దండశ్చేతి చతుష్టయమ్
  మాయోపేక్షేంద్రజాలం చ సప్తోపాయాః ప్రకీర్తితాః
  అదేశ కాలాపరోక్ష్యం పరోక్షస్యైవ వస్తునః
  మంత్రౌషధ క్రియాభేదై రింద్రజాలం ప్రచక్షతే। అని యింద్రజాలలక్షణము.

—♦ కుంభకర్ణుఁడు రావణునిఁ గోపించి పలుకుట ♦—

ఉ. రాముఁడు దక్క వేఱొకఁడు ♦ రాఁడు సముద్రము దాఁటి వానర
  స్తోమముతోడఁ గాన జయ♦శుద్ధి వినిశ్చిత మంచుఁ బల్క నా
  కామపరీతచిత్త దశ♦కంఠుని రోదన మాలకించి కో
  పామితదగ్ధచిత్తుఁ డయి ♦ యాతని బల్కెను గుంభకర్ణుఁడున్. ౨౯

అర్థములు. వానరస్తోమము = క్రోఁతిగుంపు, కామపరీతచిత్త = కామముచే విపరీతమైన బుద్ధి గల, దశకంఠునిరోదన= రావణుని యేడుపు, రావణుఁడు చెప్పినది యేడుపు వంటిదేకాని మంత్రాలోచనముకాదని భావము. నేను జేయఁ దలఁచినది చేసినాను, ఇప్పుడు నా ప్రాణము మీఁదికి వచ్చినది, మీరు రక్షింపుఁడనియే కదా వాని యేడుపు. కోపామిత దగ్ధచిత్తుఁడయి = కోపముచే మిగుల దహింపబడిన మనస్సు గలవాఁడై.

తా త్ప ర్య ము

వానర సేనతోడ సముద్రము దాఁటిరాఁగలవాఁడు రాముఁ డొక్కఁడే. రాముఁడు రానియెడల వానరులు రారు. కావున నా యొక్క రామునిఁ జంపితిమా మనకు జయము నిజము. దాని కుపాయము చెప్పుఁడని చెప్పఁగా కామముచేత వైపరీత్యము చెందిన మనస్సుగల రావణుని యేమ్పువిని కోపముచే మిగుల దహింపఁబడిన మనస్సుగలవాఁడై, కుంభకర్ణుఁడు వానితో నిట్లనెను.

సీ. రామసౌమిత్రిసం♦రక్షణీయను సీత, నపహరించితి వేరి ♦ నడిగి నీవు ?
అటుచేయకయ మున్న ♦ యడిగినఁ జెప్పమే, యామునరక్షిత ♦ యమునవోలె
నీ చిత్త మొంతయు♦నిల్కఁడ భజియింప, నో మహారాజ! మేల్ ♦ యుక్తి నొకటి
నటులైన నెంతో లెస్సైయుండు నీ పని, నిప్పుడు చింతింప ♦ నేమి ఫలము ?
తే. రాజకార్యంబు లెవ్వఁడు♦ప్రథమమందు, న్యాయపద్ధతి యోజించి♦యాచరించు
నట్టివాఁడెందుమఃఖింపఁ♦డవలఁగార్య,మయ్యొ చెడిపోయెనేయని♦యాత్మయందు.

అర్థములు. సంరక్షణీయను = కాపాడఁబడు దానిని, యామునరక్షిత యమున=యమునానది యొద్దుననుండు, యమునపొర్లిపోకుండఁ గాపాడు పర్వతము యమునను గాపాడినట్లు, కార్యములుచేయు పురుషు లుత్తమ మధ్యమాధములుగల రని నీవే చెప్పితివిగదా- (చూ.స.౧ ౨౫) సమసుఖ దుఃఖబాంధవు లగు మాతో నెవ్వరితోనైన నాలోచించి చేసినవాఁడవు కావు. కావున నీ వుత్తమ పురుషుఁడవు కావు. దైవమే శరణ మని నమ్మి కార్యము చేయఁబూనితివా ఇప్పుడు నీవే చేసికో మమ్మడుగనేల? మా సాహాయ్యము కోరుచున్నావు కావున నీవు మధ్యమ పురుషుఁడవు కావు - నీవు అధమపురుషుఁడ వని కుంభకర్ణుఁడు చెప్పుచున్నాఁడు.

తా త్ప ర్య ము

రామలక్ష్మణు లిరువురు రక్షించు సీతను నీ వెవరినడిగి తెచ్చితివి. ఆలోచించి యావలఁ గార్యము చేయవలయునా? కార్యము చేసి యాలోచింపవలయునా? కార్యము నీవు చేయకముందు మా యాలోచన మడిగియుండిన యాముున పర్వతము రక్షించు యమునవలె నీకే మనఃక్షోభము లేకుండు నుపాయము చెప్పియుందుము. అటు చేసియుండిన నెంతో మేలైయుండును. కార్యము చేసి యిప్పుడు ప్రాణము మీఁదికి వచ్చినప్పుడు విచారపడిన లాభ మేమి? రాజకార్యములను మొదటనే న్యాయ్యమార్గమున నాలోచించి కార్యము చేసినవాఁడు పిమ్మటఁ గార్యము చెడినను వాఁడు విచారపడఁడు. మనము న్యాయ్యముగఁ జేయవలసినది చేసితిమి. దైవము ప్రతికూలించిన మన మేమి చేయఁ గల మని వ్యసనపడకుండును.

క. విపరీతాలోచనఁ బని, నిపుణత లే కాచరింప ♦ నెఱి చెడు మఱియున్
విపరీతఫలము లొదవును, నపవిత్రపుఁ దవెల నున్న ♦ హవిఁ దిన్నట్లై. ౨౮ ౨

అర్థములు. నెఱి = అందము, తవిలె = పాత్రము, హవి = హోమము చేయబడిన యన్నము.

తాత్పర్యము

ఎంత మంచి కార్యమైనను విపరీతముగ నాలోచించి చేయుటయందును సామర్థ్యము లేదేని యాకార్యముయొక్క యందమే చెడును; చెడుటమాత్రమే కాదు-చెడుఫలమునుగూడఁ గలిగించును. ఎట్లనిన హవిస్సు పవిత్రమైన దైనను పాత్రము శుద్ధమయినది యగునా కాదా యని చూడక చిలుముపాత్రములో వంటితిమేని మంచిఫలము లేకుండుటేగాక యది తినిన విషమించును. మంచికార్యములే యిట్లు విపరీతఫల మిచ్చుచుండఁగా నీవుచేసిన యకార్యమువలనఁ జెడుఫలము గలుగుట యేమి వింత? కైముతిక న్యాయము.

క. మొదలం దగు కార్యంబును, బిదపం గావించువానిఁ ♦ బిదపటిపనులన్
మొదల నొనరించునాతని, విదితంబుగ నీత్యనీతి♦విదుఁ డనఁ దగునా ? ౨౪౩

అర్థములు. నీత్యనీతి విదుఁడు = ఇది నీతి, ఇది నీతి కాదు అను జ్ఞానము గలవాఁడు.

తాత్పర్యము

వెనుకఁ జేయవలసిన పని ముందు, ముందు చేయవలసిన పని వెనుకఁ జేయువాఁడు నీతి అనీతి తెలిసినవాఁడని చెప్పఁ గూడునా? కావున నీవు నీతి తెలిసినవాఁడవు కావు.

క. బలియుఁడు దుస్సాధుం డని, తలఁపంబడువాఁడు చపల♦తం బని సేయన్
సులువుగ భేదింతు రొరుల్, పులుఁగులు క్రౌంచాద్రిరంధ్ర♦మునఁ గాదె చనున్. ౨౪౪

అర్థములు. దుస్సాధుఁడు = సాధింపరానివాఁడు, చపలతన్ = బుద్ధిస్థిరత్వము లేక, పులుఁగులు = పక్షులు.

తాత్పర్యము

ఒకఁడు బలవంతుఁడు, ఆ కారణమున సాధింపరానివాఁడే అయినను వాఁడు బుద్ధి స్థైర్యము లేక నియమము దప్పి కార్యములు చేయునేని వానియందలి దోషము గనిపెట్టి సులువుగా విరోధులు భేదింతురు. క్రౌంచపర్వతము బలిష్ఠమై భేదింపరానిదైనను దానిలో నుండు రంధ్రమునఁ దూఱి గదా పక్షులును ఆవలి కీవలికి పోవుచు వచ్చుచుండును. కుమారస్వామి క్రౌంచపర్వతమును శక్తిచే భేదించెను. అప్పుడు దానిలో రంధ్ర మేర్పడెను. ఆ రంధ్రములోఁ దూఱి హంసలు మానస సరోవరమునకుఁ బోవుచుండును.

క. దుష్ట మనాలోచితమును, గష్టం బగు పనిని జలుపఁ ♦ గలిగితి విషసం
శ్లిష్టాన్నభుక్తిభంగి న,దృష్టము పోఁ చంపఁ డయ్యె ♦ శ్రీరాముఁ డటన్. ౨౪౫

అర్థములు. దుష్టము=దోషముతోఁగూడినది, అనాలోచితము = ఆలోచన

లేక చేయఁ బూనినది - కష్టము = అపాయకర మైనది, విషసంశ్లిష్టాన్నము = విషముతోఁగూడిన యన్నము.

తాత్పర్యము

నీవు దోషయుక్తము, అపాయముతోఁగూడిన పనిని ఆలోచనలేక విషము కలిసిన యన్నమును దినునట్లు చేసితివి. నిన్ను రాముఁడప్పటనే చంపక విడుచుట వలన నీవెంతో నిజముగ నదృష్టవంతుఁడవే.

సీ. పరులకుఁ జాల దుష్కర మైన కార్యంబు, నెత్తికొంటివి ఘటియించుటకును
(సీతోడఁ బుట్టుట సీతోడ నిల్వక, నాకుఁ దప్పునె దైత్యనాథ యిపుడు)
జరుగంగఁ దగు కార్యసరణి వచించెద, నీ పగతుర నేను నిగ్గఁజేసి
కార్యంబు సరిపడఁ గావింతు శక్రానలార్కమరుచ్ఛ్రీదు లడ్డపడినఁ

ఆ. గేలఁ బరిఘ మూనిలీలమైఁ ద్రిప్పుచు, గలకుఁగోల డాలు కడలఁ గప్పఁ
గొండఁబోలు మేనఁగంధున గర్జింపఁ, గొండపగతుఁడైన బెంకువడఁడె. ౨౮

అర్థములు. పగతురన్ = శత్రువులను, శక్ర-అనల - అర్క-మరుత్ - శ్రీదులు = శక్ర = ఇంద్రుఁడు, అనల = అగ్ని, అర్క=సూర్యుఁడు, మరుత్ = వాయుదేవతలు, శ్రీదుఁడు=కుబేరుఁడు, డాలు=కాంతి, కడలన్ = దిక్కులందు, కొండపగతుఁడు=ఇంద్రుఁడు, బెంకుపడఁడె=బెంకువలె నిస్సారమై పోఁడా.

తాత్పర్యము

ఇతరు లెవ్వరు చేయలేని మహాకార్యముల నీవు చేయఁ దలపెట్టితివి. సీతోడ బుట్టిన కారణమున నిప్పుడు సీతోడ నిల్వక నాకుఁ దప్పునా ? తప్పదు. అయిన దానికి వగచి లాభమేమి? ఇఁక జరగవలసినది చెప్పెద వినుము. ఇంద్రుడు- అగ్ని- సూర్యుఁడు వాయువులు- కుబేరుఁ డడ్డపడినను నీ శత్రువులఁ జంపి నేను నీ కార్యము చక్కఁజేసెదను. నేను జేత గుదియ ధరించి త్రిప్పుచు కలకైన కోలలకాంతి దిశల వ్యాపింపఁగా కొండంత దేహముతో బలముకొలఁది సింహనాదము చేసితినేని యింద్రుఁ డైనను డీలు పడిపోవును.

క. రెండవశరమున రాముఁడు, ఖండించెడు నంతలోఁ దగఁగ నా నెత్తు
ర్గండవత నేఁ ద్రావెదఁ జుమి, ఖండితసురజాల! సుఖముఁ గాంచుము మీఁదన్.

తాత్పర్యము

ఓయీ ! నీవు పరిఘముతో సమీపమునకుఁ బోయికాని కొట్టఁ జాలవు. రాముఁడో దూరము నుండియే నీమీఁద బాణముల ప్రయోగించి కొట్టును, నీ వేమి చేయఁగలవు అందువేమో - రాముని మొదటిబాణమునకే నేను జావను. (నేను వాలిని గాను) కావున రెండవ బాణము వైచి నన్ను ఖండించు లోపలనే పైబడి యా రాముని నెత్తు నేను బూర్ణముగఁ ద్రావెదను జుమా-ఆవల నీవు సుఖపడుము.

తగఁగన్ + ఆ నెత్తురని యొక్క పదచ్ఛేదము - తగఁగ+నానెత్తురని యొక్క

పదచ్ఛేదము. రెండవ యర్థమువ నా నెత్తురు నేనే త్రావెదను, ఆవల నీవు సుఖ పడుము.

ఉ. రాముని గీటణంచి మఱి ♦ క్రచ్చఱ లక్ష్మణుఁ బిల్కుమార్చి శా
ఖామృగయూథము న్మెసవి ♦ గట్టునఁ బ్రేచుచు నీకు గెల్పునుం
గామముఁ దీర సౌఖ్యమును ♦ గల్గఁగఁ జేసెదఁ, ద్రాగు వారుణిన్
నీ మది కెక్కు కార్యముల ♦ నిర్భయతం జరియింపు స్వేచ్ఛమై. ౩౯

అర్థములు. గీటణంచి=చంపి, పిల్కుమార్చి = వధించి, మెసవి = తిని, వారుణిన్ = సారాయమును.

తాత్పర్యము

రామలక్ష్మణులఁ జంపి వానరుల నందఱ భక్షించి గట్టునఁ బ్రేపులు పుచ్చుచు నీకు గెలుపు, యిష్టమైన సౌఖ్యమును గలిగించెదను. నీవు సారాయము నీ యిష్టము కొలఁదిఁ ద్రావుము. ఇంకను నీ కిష్టమైన కార్యములందు భయము లేక యిష్టానుసారము వర్తింపుము.

క. భీమాహవ రంగంబున, కామనపురి కేగ మృత్యు♦సంగతి నల శ్రీ
రాముఁడు పదపడి సీతా, భామారత్నంబుఁ బొందు♦బాఢముదమునన్. ౪౦

అర్థములు. భీమాహవరంగంబునన్=భయంకరమైన యుద్ధభూమియందు, కామనపురి = యముని పట్టనము, మృత్యుసంగతిన్ = మృత్యుదేవతతో, బాఢ ముదమునన్ = మిగుల సంతోషముతో.

తాత్పర్యము

ఆ శ్రీరాముఁడు భయంకరయుద్ధమందుఁ జచ్చి యమపురికిఁ బోఁగా నావల సీతాభామారత్నముతో నీవు సంతోషింపుము. రెండవ యర్థము - కర్తృపదము 'నేను' అనునది అధ్యాహారము. నేను భయంకర యుద్ధభూమియందుఁ జచ్చి యమ పురమునకుఁ బోఁగా ఆవల శ్రీరాముఁడు సంతోషముతో సీతాభామారత్నమును బొందును. నన్నుఁ జంపినవాఁడు నిన్నుఁ జంపక విడుచునా? కావున నీవు చచ్చిన వాఁడవే. లేదా నీవు యుద్ధమునఁ జచ్చిన పదపడి యని చెప్పినను జెప్పవచ్చును. లేక మన మను పదము కర్తగాను గ్రహింప వచ్చును.

—♦ ౧౩-వ సర్గము. మహాపార్శ్వుఁడు రావణుతో సీతాదేవిని విడువరాదని చెప్పుట ♦—

క. రావణుఁడు క్రుద్ధుఁడగుటను, భావించుచు కాంతుఁడగును♦పాయము త్రుటి సం
భావించి మహాపార్శ్వుఁడు, కావించుచు నంజలిన్ స♦కర్షోక్తి ననున్. ౧

తాత్పర్యము

నీవు చేసిన పని సరికాదని యాక్షేపించుటచే రావణునకుఁ గోపము వచ్చిన

దని గ్రహించి మహాపార్శ్వుఁ డనువాఁడు వతనికిఁ గోపము చల్లారు నుపాయము గొంచెముకాల మాలోచించి నమస్కరించి గర్వముతో నిట్లనెను.

క. నానామృగ సత్త్వాన్వితమైన వనం బెట్లొ చొచ్చి యటఁ జేపడఁగాఁ
దేనియను ద్రాగఁ డెవ్వం, డా నరునిం బాలిశుం డటందురు ప్రాజ్ఞుల్. -౨౯౧

అర్థములు. నానా = అనేకములైన - మృగ = జింకలు మొదలగువాని తోను, సత్త్వ=పులులు మొదలగు జంతువులతోను, అన్వితము=కూడినది, బాలిశుఁడు = మూర్ఖుఁడు.

తాత్పర్యము

అనేకవిధములైన క్రూరజంతువులు గల యడవికి నెంతో కష్టపడి పోయి యందుఁ దేనె లభింపఁగా దానిఁ ద్రావక యెవఁ డుపేక్షించునో వానిని బుద్ధిమంతులు మూర్ఖుఁ డందురు. అట్లులే నీవు ప్రాణగండమైన కార్యముచేసి, సీతను దెచ్చి యనుభవింపవేని మూర్ఖుఁడవే. తేనె సీతాదేవి యనియు రామలక్ష్మణులు తేనెటీగలనియు గ్రహింపనగు.

క. ఈశ్వరుఁడవు లోకంబుల, కీశ్వరుఁ డన్యుండు గలుగునే నీ కసురా
ధీశ్వర! శత్రునిబర్హణ! శాశ్వతసుఖ మనుభవింపు జన్మసుతతోడన్. -౨౯౨

తాత్పర్యము

శత్రువుల వధించువాఁడా? నీవే లోకములకుఁ బ్రభువవు. నీకుఁ బ్రభువు వేఱొకఁడున్నాఁడా? కావున రాక్షసేశ్వరా! నీవు సీతతో నిత్యసుఖ మనుభవింపుము.

రెండవ యర్థము. లోకంబులకు రాముఁ డీశ్వరుఁ డవును, ఆయన కీశ్వరుఁడు లేఁడు. కావున సీతను రామున కిచ్చుటచే నామెను గరణముగాఁ జేసికొని శాశ్వత సుఖ మనుభవింపుము.

జన్మసుతతోడన్=కరణార్థంబునఁ దృతీయఁగా గ్రహింపవలయును. లేక సహార్థంబున గ్రహించిన రాముఁడు కపులతో సేతువు దాఁటెను-అన్నట్టు సీతను నీ విచ్చితి వేని నీవు సుఖింతువు. ఆమెయు సుఖించును అని భావము. ఇవి మహాపార్శ్వుని యుద్దిష్టార్థములు గావు.

క. మక్కువతో జానకి నిసుఁ, దక్కఁ గొనఁగ నొల్లదేని తానుగ నీవే
కుక్కుటవృత్తిఁ జరింపుము, తక్కుమ సందేహ మెద సుధాభుగ్వైరీ! -౨౯౩

అర్థములు. దక్కఁగొనఁగన్=అనుభవయోగ్యముగాఁ జేసికొన, కుక్కుట వృత్తి=కోడిపుంజువలె, ఆఁడుకోడిని బలవంతముగాఁ బట్టుకొని మగకోడి రమించును. అట్లులే నీవుచేసి సుఖింపుము. ఆమె యంగీకారమునకై నీవేల కాచుకొనవలె? 'ఎద్దు నడిగియా గంతకట్టుట' యను సామెత నెఱుఁగవా? "క్రుద్ధా మాక్రమ్య భోగస్తు కౌక్కుటస్సోఽపి సౌఖ్యద" యని కామందకము. సుధాభుక్+వైరి=అమరవిరోధి.

తా త్ప ర్య ము

సీతాదేవి ప్రేమతోఁ దానుగ నీతో సుఖ మనుభవింప నొల్ల దేని కోడి పుంజు కోపించిన యాఁడు పుంజుతో బలవంతముగా రమించునట్లు నీవును రమించి సుఖింపుము అంనును సుఖము గలదు.

తే. వేగ నీ వాంఛితము నెఱ • వేఱెనేని, గలుగ నీ భయ ముత్తర • క్షణమునంద
కాక కాలాంతరంబునఁ • గలుగనిమ్ము, వాని నెల్ల సహింపఁగ • వచ్చు నీవు. ౧౪౫

తా త్ప ర్య ము

శీఘ్రముగా నీ కోరిక నెరవేఱెనేని యా యుత్తరక్షణమునందే చచ్చితివా చావుము. లేక కొంత కాలము వెనుక మరణము వచ్చిన రానీ. దానిని నీవు సహింప వచ్చును. ఇప్పుడు నీవు పడు బాధకంటె మరణము గొప్పది కాదనుట.

నీవు సీతను కెఱచితివేని రాముఁడు కోపించి యా నిమిషమందే చంపినా చంపనీ, సీత యేమో చేసినది, ఇఁక రావణునిఁ జంపి లాభ మేమని పోయినా పోనీ, కాలాంతరమున మరణము రానీ యని భావము.

క. దంభోళిఁ గేలఁ గైకొని, జంభారియు వచ్చెనేని • సమితిక్షితి సం
రంభమునఁ గుంభకర్ణుఁడు, జంభారిజితుండు మేముఁ • జంపుదు మతనిన్. ౧౪౬

అర్థములు. దంభోళి = వజ్రాయుధము, జంభారి = ఇంద్రుఁడు, సమితి క్షితిన్ = యుద్ధభూమియందు.

తా త్ప ర్య ము

రాముని జంపుట యెట్లని యది యొక గొప్పకార్యముగా నాలోచించు చున్నావే, ఏల? వజ్రమును ధరించి యింద్రుఁడు రామునికిఁ దోడుగా వచ్చినను - కుంభకర్ణుఁడు, ఇంద్రజిత్తు, మేము శీఘ్రముగాఁ జంపుదుము. నీదాఁక రానిత్తుమా?

ఉ. ముందుగ సామదానములు • మూఁడవ భేదము శక్తి లేని యా
పందలు మెచ్చుచుంద్రు నలు • పం దగు నంచును, శక్తిశాలి దా
నెంనును దండనీతిఁ జరి • యించును, గావున దండపద్ధతిన్
పొందుము నీదు వాంఛితముఁ • బూర్ణముగా మనుజాశనాధిపా! ౧౪౭

తా త్ప ర్య ము

రాక్షసరాజా! కొందఱు సీత నిచ్చుట మంచిదని నీకు బోధించుచున్నారు, ఆ విషయమై నాయభిప్రాయము వినుము. శక్తి లేని పిఱికివాండ్రు ముందు సామము, దానము అనియు, నవివ్యర్థము లగునేని భేదము నలుపుట దగు నని మెచ్చుదురు. కాని యది బలవంతుల మార్గము కాదు. శక్తిగలవాఁడు సర్వకాలము లందు దండనీతినే చరించు చుండును. కొట్టి తీసికొను శక్తియుండఁగా నడుగుకొనుట, లంచమిచ్చుట యేల? కావున నీ కోరికను యుద్ధము చేతనే నెఱవేర్చుకొనుము.

ఉ. వచ్చిన యేని యిచ్చటికి ♦ వైరిసమూహము శస్త్రసంహతిన్
ద్రచ్చి వధింప నోపుదుము ♦ వాస్తవ మియ్యది, సందియంబు లే
దిచ్చఁ జరింపు మన్న నసు♦రేశ్వరుఁ డాతని వాక్యజాలమున్
మెచ్చుచు వాని కిట్టులను ♦ మేటిలు చింతను నాత్మవృత్తమున్. ౨౪౭

తాత్పర్యము

పగవారిగుంపు లిచ్చటికి వచ్చెనా మేమే వారి నందఱను శస్త్రములఁ జీల్చి చంపుదుము. సందేహములేదు. నీ యంతట నీవు నీ కోరిక ప్రకారము వర్తింపు మని చెప్పఁగా వానిమాటలను రావణుఁడు మెచ్చుకొని తన పూర్వచరిత్రను విచారముతో నిట్లు చెప్పెను.

మహాపార్శ్వుఁడు చెప్పినట్లు కుక్కుటమువలె వర్తింప సాధ్యము గాదాయె గదా యనియే విచారము.

—♦ రావణుఁడు మహాపార్శ్వునితో బ్రహ్మ తన్ను శపించిన విధంబుఁ దెలుపుట ♦—

సీ. వినుము మహాపార్శ్వ! ♦ వినిపింతు మత్పురా,వృత్తంబు గోప్య మ♦విశ్రుతంబు
హాటకగర్భసే♦వార్థ మవ్వీటికై,పుంజికస్థల యను ♦ పువ్వుఁబోణి
యభ్రమార్గంబున ♦ నరుగుచు నన్నుఁజూచి, జంకుచు నొదుగుచు ♦ జనుచునుండ
నగ్నిశిఖయుఁబోలె♦యద్దానిఁ గనుఁగొని, బలవంతముగను బై♦పడుచుఁ జెఱిచి
తే. కోలవిగఁ జేసి విడిచినఁ ♦ గోమలాంగి, నలువసభ కేగ నలిపిన♦నలిన మనఁగ
నబ్జభవుఁడును దాని వృ♦త్తాంత మెఱిఁగి,కోపమున నాకు నీ గతి♦శాప మిచ్చె.

అర్థములు. మత్పురావృత్తంబు=నా విషయమైన పూర్వచర్య, గోప్యము= రహస్యము, అవిశ్రుతంబు = మఱి యెవ్వరు విననిది, హాటకగర్భ సేవార్థము = బ్రహ్మను గొలుచు నిమిత్తము, అవ్వీటికై =ఆయన సత్యలోకమునకు, కోలవి=దిస మొలది, నలువసభకు = బ్రహ్మసభకు, పైపడి కోలవిగఁ జేసి చెఱిచిన నని యన్వయము.

తాత్పర్యము

మహాపార్శ్వ! నా విషయమైన పూర్వచర్య యొకటి వినిపించెద వినుము. అది రహస్యము ఎవరికిని దెలియదు. మును పౌకనాఁడు పుంజికస్థల యను యప్సరస బ్రహ్మసేవకై యాకాశమార్గంబునఁ బోవుచు నన్నుఁజూచి భయపడుచు నొదిగి యొదిగి పోవుచుండెను. అగ్నిశిఖవంటి కాంతిగల దానిని నేను బలవంతముగఁ బట్టి చెఱిచి చీరలేకుండ దిసమొలదానిని జేసి విడిచితిని. అది నలిపిన తామరవలె బ్రహ్మసభకుఁ బోయెను. బ్రహ్మ దానివృత్తాంత మెఱిఁగి యీ విధముగ నన్ను శపించెను.

ఎంత సిగ్గుమాలిన భోగము దైనను వస్త్రహీనరయై సభలోనికిఁ బోవునా యని సందేహింపఁ బనిలేదు. ఆ దినము మేళము దాని వంతు. దానివా అందఱు వచ్చి

యదిమాత్రము రాకుండుటచే బ్రహ్మ యాలోచించి తెలిసికొనె నని గ్రహింపనగు. మఱి యెవరిదో యేదో వస్త్రముదీసి కట్టుకొని యాలస్యముగా నది సభకుఁబోయెను.

అగ్నిశిఖ యను నుపమానము కాంత్యతిశయముచేఁ జెప్పినను జెప్పవచ్చును. లేదా పురుషులఁ గరఁగించుటయందని చెప్పినను జెప్పవచ్చును. "పొలఁతి దావవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు కరఁగకుండ రాదు కదిసెనేని" యను వాక్యము స్మరింపనది.

క. ఇది మొదలుగ దశకంఠా! మదిలో ని న్నొల్లనట్టి • మానిని బలిమిన్
గదిసితివా నీతల యా,పదనున ధర వ్రాలు నూఱు • వ్రక్కలు గాఁగన్. ౨౭౯

అర్థములు. ఆ పదనున = ఆ సమయమందే, వెంటనే.

తాత్పర్యము

ఇది మొదలు రావణా! నీవు ని న్నొల్లని స్త్రీని బలవంతముగా జెఱుప సమీపించితివా యా వెంటనే నీ తల నూఱుతునుకలై నేలఁ బడును. ఈ కారణముచేతనే రావణుఁడు సీతను దాఁకినపుడు చావకుండినది. రావణుఁడు సీతను నంగీకరింపఁజేసి యావలఁ గూడవలయు నని యభిప్రాయము గలవాఁ డగుటచేఁ జావలేదు.

నలకూబర శాప మొకటి కలదుగదా, యది యేల చెప్పలేదు? ఆ శాపమును రావణుఁడు లక్ష్యము చేసినవాఁడు కాఁడు. శాప మనునది తనకంటె దక్కువ శక్తిగల వానిని బాధించునుగాని తనకంటె గొప్ప తపస్విని బాధింపదు. రావణుఁడు నలకూబరుకంటె గొప్ప తపస్సుచేసిన వాఁడు కావున వాని శాపము పాఱదు. ఆ శాపభయ ముండిన యెడలఁ బుంజికస్థల నిట్లు చెఱచియుండడు. అది దీనికి వెనుకటి వృత్తాంత మందమా యనిన రంభను దాఁకినపుడే రావణుఁడు చచ్చియుండును. నలకూబరశాప ప్రసక్తికిఁగారణ ముండదు. నలకూబరశాపము వ్యర్థమని తెలిసియే బ్రహ్మ మరల శపించెను.

కం. ఈ శాపభీతిఁ గాదే, యాశింపక యున్నవాఁడ • నవనిజఁ; గాదే
నా శయనంబున నెపుడో, యా శంపాదేహఁ గూడ • నా, జంకుదునా? ౨౮౦

అర్థములు. శాపభీతి=శాపము వలన భయము, శంపాదేహన్=మెఱుపు వంటి దేహము గలదానిని, జంకుదునా=సంకోచింతునా?

ఈ శాపమునకు భయపడి సీతను నాశింపక యున్నానుగాని, యీ భయమే లేనియెడల నెప్పుడో నా పానుపుమీఁద నామెతోఁ గూడుటకు సందేహింతునా?

ఇవి భక్తుని మాటలో - కాముకుని మాటలో చదువరులు గ్రహింపనగు.

శా. నా వేగం బది సాగరం బెనసెడి • న్వాతూలమున్ బోలెడిన్
నా వర్ధిష్ణుగతిప్రకార మనిఁ, గాన • న్లేక యిద్దాని నీ
తావామాక్షి నిమిత్త మిచ్చటికిఁ బ్రో • ద్దామోగ్రసైన్యంబుతో
వే వచ్చెం గపినేత బాసటగఁ బృ • థ్వీకన్యకాకాంతుఁడున్. ౨౮౧

అర్థములు. అనిన్ = యుద్ధమందు, ఎనసెడిన్ = సరిపోలు చుండును, వాతూలము = సుడిగాలి, వర్ధిష్ణుగతి ప్రకారము = వృద్ధిపొందఁ గలిగిన విధము, కపినేత=సుగ్రీవుఁడు, బాసటగ = సహాయుఁడుగ, పృథ్వీకన్యకా కాంతుఁడున్ = సీతాదేవి మగఁడు.

తాత్పర్యము

యుద్ధమందు సముద్రవేగ మెట్టిదో నా వేగ మట్టిది. సుడిగాలి యెట్లు వృద్ధి చెందునో యట్లు నేను వృద్ధిచెందుదును. ఇది తెలిసికొనలేక సీత నిమిత్తమై యిచ్చటికి సుగ్రీవుఁడు సహాయుఁడుగ పెద్దదండుతో రాముఁడు వచ్చుచున్నాఁడు.

ఇది మహాపార్శ్వుఁడు ౨౬౧వ పద్యములో కుంభకర్ణుఁడు, మేము, రామునిఁ జంపెద మన్నమాటకుఁ బ్రత్యుత్తరము. నేను రామునిఁ జంపలేక మీసాహాయ్యముఁ గోరుచున్నానని తలఁచితి వేమో అది సరిగాదు. మహాకార్యము రాక్షసుల కందఱకు సంబంధించినది గావున రాజనీతి ననుసరించి మిమ్ము నడుగుచున్నా నని భావము.

ఉ. శైలగుహాప్రసుప్తహరి◆సత్తమము న్వడి నిద్రలేపు నా
పోలికిఁ; గ్రుద్ధమృత్యువుఁ బ్ర◆బోధ మొనర్చెడి భంగి, మామకా
భీలభుజంగ సన్నిభసు◆విశ్రుతశాతశరాళి రాముఁ డే
వేళను గుర్తెఱుంగమిని ◆ వేగమ వచ్చెడి నన్నెదుర్కొనన్. ౨౬౨

అర్థములు. శైలగుహా = పర్వతగుహయందు, ప్రసుప్త = నిద్రబోవుచున్న, హరిసత్తమమున్=శ్రేష్ఠమైన సింహమును, మామక=నాయొక్క, ఆభీల= భయంకరమైన, భుజంగసన్నిభ = పాముతో సమానమైన, సువిశ్రుత = ప్రసిద్ధికెక్కిన, శాతశరాళిన్ = వాఁడి బాణముల సమూహమును, ఎదుర్కొనన్=ఎదిరించుటకు.

తాత్పర్యము

కొండగుహలో నిద్రించు పెద్దసింహమును నిద్దుర లేపినట్లు, కోపించిన మృత్యువును మేల్కొలిపిన విధముగ, నా భయంకరములై పాములవంటి బాణములను రాముఁ డెప్పుడు చూచినవాఁడు కాఁడు. కావున నన్నెదిరించి యుద్ధము సేయ నిచ్చటికి వచ్చుచున్నాఁడు.

శా. దంభోళిప్రతిమానమామకధను◆ర్దండచ్యుతాభీలబా
ణాంభోవృష్టి సహస్రధాగతిఁ బయి ◆ న్వ్యాపింపఁగా జేయుచుం
గుంభీంద్రంబు నలాతకోటిబలె నా◆క్రోశింపఁగాఁ దోలుదున్
జంభద్వేషిసహాయుఁడే న్రఘుపతిన్ ◆ సంగ్రామ రంగంబునన్. ౨౬౩

అర్థములు. దంభోళిప్రతిమాన = వజ్రాయుధముతో సమానము లగు, మామక=నాయొక్క, ధనుర్దండచ్యుత=వింటినుండి విడువఁబడిన, ఆభీల = భయంకరమైనబాణము లనెడి, అంభోవృష్టి = నీటివర్షము, సహస్రధాగతి=వేయి విధ

ముల, కుంభీంద్రంబు = శ్రేష్ఠమైన యేనుఁగు, అలాతకోటిబలె = కొఱవికట్టెల సమూహముచేతఁ బోలె, జంభద్వేషి=ఇంద్రుఁడు, సహాయుఁడేన్ = తోడై వచ్చినను,

తాత్పర్యము

నా వింటినుండి వెలువడిన వజ్రాయుధముతో సమానములగు బాణముల వర్షము తనపయి వ్యాపింపఁగాఁ జేసి యేనుఁగును కొఱవికట్టెల గుంపులు చూపి కురువెత్తునట్లు చేయు రీతిగా నింద్రుఁడు సహాయుఁడై వచ్చినను యుద్ధరంగము నందు మొఱ్ఱో యనఁ జేసి రాముని బాఱఁదోలెదను.

ఉ. అల్ల సహస్రనేత్రుఁ డమ • రాధిపుఁ డేనియుఁ బాశహస్తుఁ డ
బ్వల్లభుఁ డేని నాజి నిలు • వం గలఁడా ననుఁ దాఁకి? శ్రీదు పెం
పెల్ల నణంచి లంక హరి • యింపనె! తద్బల మెంత? చుక్కలన్
బోల్లువడంగఁ జేయు నవ • పూషుని భంగిని దేజ మాపెదన్. ౨౬౪

అర్థములు. సహస్రనేత్రుఁడు = వేయికన్నులు గలవాఁడు, అమరాధిపుఁడు=ఇంద్రుఁడు, పాశహస్తుఁడు = పాశములను జేత ధరించిన, అప్ + వల్లభుఁడు=జలాధిపతి, వరుణుఁడు, ఆజిన్ = యుద్ధమందు, శ్రీదు = కుబేరునియొక్క, తద్బలము=రామునిబలము, నవపూషుని భంగిన్=క్రొత్తసూర్యునివలె.

తాత్పర్యము

వేయి కన్నులు గల యా యింద్రుఁడైనను, పాశములఁ జేతధరించిన వరుణుఁడైనను నన్నెదిరించి యుద్ధమునందు నిలువఁగలఁడా? కుబేరుని గర్వ మణఁగఁ గొట్టి లంకను హరించితిని గదా! ఇఁక రాముని బల మెంత? ఉదయించు సూర్యుఁడు నక్షత్రముల కాంతి హరించినట్లు రాముని సేనను రూపు మాపనా?

—• ౧౪-వ సర్గము. విభీషణుఁడు సీతాదేవిని శ్రీరాముని కిమ్మని రావణునకు బోధించుట •—

క. దనుజకుల సార్వభౌముం, డనుమాటలుఁ గుంభకర్ణుఁ • డతి గర్జితముల్
విని విని విభీషణుం డి, ట్లను దశకంఠునకు హితము • నర్థయుతముగన్. ౨౬౫

అర్థములు. అతిగర్జితముల్ = వ్యర్థములైన యఱపులు, మొదట సీతి బోధించినట్లు బోధించి కడపట రావణు నభిప్రాయములోనే కలిసికొనెను. ఏమేమో పదరెను. అర్థయుతముగన్ = ప్రయోజనముతోఁ గూడినట్లు, ఇట్లనుటచే రావణ కుంభకర్ణుల మాటలు ప్రయోజనము లేని వని భావము.

తాత్పర్యము

రావణుఁడు చెప్పిన మాటలు, కుంభకర్ణుని వదరుటలు వినివిని హితముగ సప్రయోజనముగ విభీషణుఁ డిట్లనెను.

మ. తత బాహ్వాంతరభోగ రాశి భృశచిం • తాకాలకూటంబు ను
గ్రతరస్మేరనిశాతదంష్ట్రికరశా • ఖాపంచకస్ఫారవి

స్తృతపంచోగ్రశిరోతికాయము పతీ ♦ సీతామహాశీవిషం
బతిమేధావివి కట్టి తేరఁ దగ వౌనా దాని భావింపుమా. ౨౮౮

అర్థములు. పతీ=రాక్షసరాజా, తత=విస్తారమైన, బాహు + అంతర = ఱొమ్మనెడి, భోగరాశి=గొప్పపడగ గలది. (౨) తత=అధికమైన, బాహ్వంతర= ఱొమ్మునందలి, కౌఁగిలింత యందలి, భోగరాశి=సౌఖ్యాతిశయ మనెడి, (౩) తత= విశాలమైన, బాహ్వంతర = బారెఁడు కొలఁతగల, భోగరాశి=శరీరము నిడుపు గలది. ఆవృత్తిచే రూపకము, భృశచింతాకాలకూటంబు=గొప్పవ్యసన మనెడి విషముగలది. సీతాచింత ప్రాణము హరించునది కాన విష మనఁబడెను. ఉగ్రతర= మిగుల భయంకరమైన, స్మేర=చిఱునవ్వనెడి, నిశాత దంష్ట్రి=వాఁడియగు కోఱ, కరశాఖా పంచక = చింతాకాలమునఁ దలపైఁ బెట్టుకొనఁబడిన చేతియైదు వ్రేళ్ళనెడి, స్ఫుర=ప్రకాశమానమును, విస్తృత = విచ్చినదియు నగు, పంచ = అయిదును, ఉగ్ర = భయంకరము నగు, శిరోతికాయము=తల లనెడి యతిశయ మైన శరీరభాగము గలది, సీతామహాశీవిషంబు=సీత యనెడి గొప్పపాము, తాఁకి నంతమాత్రముననే చంపునది. అతిమేధావివి = మిగుల బుద్ధిబలము గలవాఁడవు. మేధావి-పతి శబ్దములు నిందాగర్భితములుగాఁ జెప్పినను జెప్పవచ్చును. సీతను మరల నీయఁగూడ దని రావణుఁడు చెప్పిన దానికిది ప్రత్యుత్తరము. ఎందోయున్న సీతను నీ వేమని తెచ్చితివి? సొత్తుగానికి సొత్తు నీయఁ గూడ దనుట నేమి యాలోచించి చెప్పితివి. బుద్ధిబలము గలవాఁడ వైనచోఁ జెప్పు మని భావము.

తాత్పర్యము

విశాలమైన ఱొమ్మనెడి దేహము, చింత యను విషము, చిఱునవ్వనెడి కోఱ తలపై నుంచుకొనిన వ్రేళ్ళనెడి పడగలు గల సీత యనెడి మహావిషసర్పమును బుద్ధిమంతుఁడా తీసికొని వచ్చుట తగునా యాలోచింపుము.

క. భూమిధర కూటనిభు లు,ద్దామనఖాయుధులు భూరి♦దంష్ట్రిలు క్రోఁతుల్
భీమగతి రాక మున్నే, రాముననున్ సీత నిమ్ము ♦ రాక్షసరాజా! ౨౮౯

అర్థములు. భూమిధరకూటనిభులు = పర్వతశిఖరములతో సమానులు, ఉద్దామనఖాయుధులు=గొప్ప గోళ్ళాయుధములుగఁ గలవారు, భూరిదంష్ట్రిలు = పెద్దకోఱలు గలవారు, భీమగతి=భయంకర విధముగ.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవు రాక్షసులను రంజింపఁజేయుట నీపనిఁ గార్యము కాని వారికిఁ జేటు దెచ్చుట నీకార్యముకాదు. నీవు చేసిన పనివలన కీడు నీ యొకనితోఁ బోదు. పర్వతశిఖరములవలె నెత్తైనవారును, గోళ్ళుకోఱలు నాయుధములుగాఁగల వారును, భయంకరమైన గమనము గలవారు నగు క్రోఁతులువచ్చి ముందు లంకను

ముట్టడించి పౌరులను బాధింతురు. ముందు బాధపడువారు రాక్షసులే. అందఱకు వెనుక నీవు, కావున వానరులు రాకముందే రామునకు సీత నిమ్ము.

క. సామీరజవము లశని, గ్రామనిభము లైన రాము కాండము లసుర
స్తోమముల తలలు ధరఁ బడఁ, బ్రామకమును సీత నిమ్ము రఘురామునకున్.

అర్థములు. సామీర = సామీరశబ్దము సంబంధార్థకమున అణ్ప్రత్యయాంతము, సమీర సంబంధముగలది, పురుష-పూరుష, నరక - నారకాదులవలె సమీరమే సామీర మని చెప్పినను జెప్పవచ్చును. సామీరజవములు = వాయువేగముగలవి, అశనిగ్రామ నిభములు = పిడుగుల సమూహముతో సమానములైనవి. కాండములు = బాణములు, అసురస్తోమముల = రాక్షస సమూహముల, ప్రామకమును=తఱుగుటకు ముందే.

తాత్పర్యము

ఒక్క వానరుఁడే యింత చేసినపుడు అందఱు వానరు లెంత చేయలేరు. ఆలోచింపుము. వానరు లట్లుండనీ, వారికంటె ముందు వాయువేగము గలవై, పిడుగుల గుంపుతో సమానములై రామబాణములువచ్చి రాక్షసులతలలు నేలఁబడ నఱకును. అవి రాకముందే సీతను రామున కిమ్ము. నీ వలన రాక్షసుల కందఱ కింతచేటు గలుగఁగలదు.

ఆ. కుంభకర్ణుఁడైనఁ గుంభనికుంభులు, నైన నింద్రజితుఁడె యైనఁగాని
యీ మహోదరుఁడు మహాపార్శ్వుఁ డీయతి, కాయుఁడైన రాముఁ గలరె చెనక.

తాత్పర్యము

వానరులు, రాముఁడు వచ్చిన నిందుండు వారందఱు నిద్రపోవుచున్నారను కొంటివా యందు వేమో? కుంభకర్ణుఁ డైనను, కుంభ నికుంభు లైనను, నింద్రజిత్తే యైనను, మహోదర మహాపార్శ్వులైనను రాముని జెనకఁ గలరా?

ఉ. భానుఁడు నిన్నుఁ గాచిన సుపర్వచయంబులు ప్రోచినన్ దయా
న్యూనముగా బలారియు నిజోరుతలంబున నిన్నుఁ జేర్చినన్
మానక మృత్యు వడ్డపడిన న్బలిసీమ మఱంగిన న్బ్రహ
స్తా! నిను రామచంద్రుఁ డనిఁ బ్రబాణముతో విసువం డెఱుంగుమీ. ౨౦

అర్థములు. భానుఁడు=సూర్యుఁడు, సుపర్వచయంబులు = దేవతాసమూహములు, దయ+అన్యూనముగాన్ = కొఱఁతలేనిదయతో, బలారి = ఇంద్రుఁడు నిజోరుతలంబునన్ = తన తొడయందు, బలిసీమన్ = పాతాళమందు 'అధోభువన పాతాళ బలిసద్మ రసాతలమ్' అని యమరుఁడు. మఱంగినన్ = దాగికొనినను, అనిన్ = యుద్ధమందు.

తాత్పర్యము

ప్రహస్తా! నీవు అవానరంబుగాఁ జంపెద నంటివి. (చూ-స. ౧౧-౧)యుద్ధము

నందు నీవు రాము నెదిర్చితివా సూర్యుఁడు తనలో నిన్నుఁ బెట్టుకొని రక్షించినను, దేవతాసమూహములు ముప్పదిమూఁడుకోట్లు కాపాడినను, నీ యందు నిండారు దయతో నింద్రుఁడు తన తొడలో నిను దాఁచినను, ఇప్పుడు వీనిని జంపవల దని మృత్యుదేవత యడ్డుపడినను, పాతాళలోకమునకుఁ బోయి దాగికొన్నను రాముడు నిన్ను ప్రాణములతో వదలఁడని తెలిసికో.

చ. అనుడు విభీషణోక్తికిఁ బ్ర ♦ హస్తుఁడు మా ర్వచియించె మాకు నా
యనిమిషసిద్ధ కింపురుష ♦ యక్షనగాహులచేత నేనియుం
బొనరదు నో భయంబు, రఘు ♦ పుంగవుఁడౌ నరనాథపుత్రుచే
నొనయునె? యేల యిట్టులు మ ♦ ము న్బెదరించెదు రిత్తమాటలన్. ౨౭౧

అర్థములు. విభీషణోక్తికిన్=విభీషణుమాటకు, మాఱు=బదులు.

తాత్పర్యము

అని చెప్పిన విభీషణుని మాటకుఁ బ్రహస్తుఁడు బదు లిట్లు చెప్పెను. దేవతలు, సిద్ధులు, కింపురుషులు, యక్షులు, వాసుకి మొదలగు నాగులను సర్పములు వీని చేతనైనను మాకు భయము లేదు. నిశ్చయము. ఇఁక రాజకుమారునిచేతనా మాకు భయము కలుగును. ఏల మమ్ము వ్యర్థవాక్యాల బెదరించెదు.

—♦ విభీషణుఁడు ప్రహస్తుని గర్హించుట ♦—

సీ. అనుఁడుఁ బ్రహస్తు వా ♦ క్యంబుల నాలించి, ధర్మార్థకామ త ♦ త్పరమనస్వి
ప్రభుహితైషణుఁ డయి ♦ క్రాలు విభీషణుం, డనియెఁ బ్రహస్త యిట్లాడెదేల?
యీవు మహోదరుం ♦ డీ కుంభకర్ణుండుఁ, జలుపు యోజన రామ ♦ చంద్రుపట్ల
ధర్మవిరుద్ధవ ♦ ర్తనులకు స్వర్గంబు, ఫలియింపనట్లు స ♦ ఫలతఁ గనదు

క. కలము లేనివాఁడు ♦ జలనిధిఁ దరియింపఁ, దలఁచినట్లు కార్య ♦ దక్షుఁ డైన
జానకీహృదీశు ♦ నే నైన నీ వైన, సకలదనుజు లైనఁ ♦ జంపలేము. ౨౭౨

అర్థములు. ధర్మార్థకామతత్పర మనస్వి = ధర్మార్థకామములం దాసక్తి గలవాఁడు, గొప్ప మనస్సు గలవాఁడు, ప్రభుహితైషుఁడు = ప్రభువు మేలుగోరు వాఁడు, ధర్మవిరుద్ధవర్తనులకు = ధర్మమునకు విరోధముగ నడచుకొనువారికి, కలము=ఓడ.

తాత్పర్యము

ప్రహస్తుఁ డిట్లు చెప్పఁగా విని ప్రభువుమేలు గోరువాఁడగుటచే నతని ధర్మార్థకామములందు విశేషాసక్తిగల విభీషణుఁ డిట్లనియె. ప్రహస్తా! యేల యిట్లు మాటలాడెదవు? నీవు, మహోదరుఁడు, ఈ కుంభకర్ణుఁడు రామచంద్రమూర్తి విషయమునఁ జేయు నాలోచన నధర్మవర్తునకు స్వర్గము ఫలింపనట్లు ఫలింపదు. ఓడలేనివాఁడు మహాసముద్రమును దాటలేని యట్లు శక్తిలేనిమనము కార్యనిర్వాహణమందు సమర్థుఁ

డగు రాముని, నేను నీవు సకలరాక్షసులు కలసినను జంపలేము. అట్లు చంపసాధ్యమైన యెడల నే నేల యిట్లు చెప్పుచున్నానని యైన నీ వాలోచింపవలదా?

తే. పరమధర్మైకనిరతు నిక్ష్వాకువంశ, భవు మహారథు రాజేంద్ర • వర్యు, గార్య
దక్షు రణభూమి నెదుర సాక్షులగుచు, రూఢిగా వేల్పు లెల్లరు • మూఢులైరి.

అర్థములు. పరమధర్మైకనిరతున్ = కేవల ధర్మమే పర మని దానియందాసక్తిగలవాఁడు, అయన గెలుపునకు కిది యొకటియే చాలును. 'ధర్మోజయతి' 'ధర్మో రక్షితి రక్షిత' యన్నట్లు తన్ను రక్షించునది ధర్మము. కావున ధర్మబలమాయనకుఁగలదు, మనకు లేదు. ఇక్ష్వాకువంశభవున్ = గొప్ప వంశంబున-ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవానిని, పరాక్రమము జన్మసిద్ధమని సూచన. మహారథున్ = తన్ను సారథిని గుఱ్ఱములను గాపాడుకొనుచు శత్రువుల సంహరించువానిని, తనవారినిఁ గాపనీయక యొకటివారిని జంపువాఁడు మహారథుఁడు. "ఆత్మానం సారథిం చాశ్వాన్ రక్షన్ యుధ్యతి యో నరః। స మహారథసంజ్ఞస్స్యా దిత్యాహుర్నీతికోవిదా" యను వచనము స్మరింపనగు. రాజేంద్రవర్యున్ = రాజశ్రేష్ఠులలో శ్రేష్ఠుఁడగువానిని, కార్యదక్షున్ = కార్యము సాధించు సామర్థ్యము గలవానిని' రామమూర్తిని.

తా త్ప ర్య ము

ధర్మమే పరమమని దానియందుఁ బ్రీతిగలవాఁడును, ప్రసిద్ధికెక్కిన యిక్ష్వాకువంశమందుఁ బుట్టినవాఁడును, మహారథుఁడును, రాజులలో నుత్తమోత్తముఁడును, కార్యసాధన సామర్థ్యము కలవాఁడును నగు రామచంద్రుని నెదిరింపలేక దేవతలు గూడ నాయనశక్తి యింత యని తెలిసికొనలేకపోయిరి. ఇఁక మన మెంతమాత్రము.

ఉ. సాటి వచింపరాక హరి • శంబసమానజవాన్వితం బసూ
ద్ఘాటన కర్మశీల మగు • దాశరథిప్రవిముక్తము న్నిరా
ఘాటము నైన తచ్ఛరని • కాయము పోరఁ బ్రహస్త నీ మెయిన్
నాటవు పూర్వ, మా కతము • న న్గద పగ్గెలు కొట్టెది వ్యోడన్. ౨౮౪

అర్థములు. హరిశంబ సమాన = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన, జవ = వేగముతో, అన్వితము = కూడినది. అసు + ఉద్ఘాటన కర్మశీలము = ప్రాణముల లేవఁదీయు పని స్వభావముగ గలది. బాణముతగిలినా ప్రాణముపోవుట నిజమని భావము, దాశరథి ప్రవిముక్తమున్ = రామునిచే విడువఁబడినది. నిరాఘాటము = అడ్డములేనిది, తత్ = ఆ రామచంద్రునియొక్క, శరనికాయము = బాణసమూహము, పోరన్ = యుద్ధమందు, నీ మెయిన్ = నీ దేహమునందు, నాటవు = నాటినవి కావు, ఆ కతమునన్ = ఆ కారణముచే, పగ్గెలు కొట్టెదవు = ప్రజ్ఞలు పలుకుచున్నావు, గర్వించి పలుకుచున్నావు.

తా త్ప ర్య ము

సమానమైన దని చెప్పుటకు సాధ్యపడక యొక వేళఁ జెప్పవలసివచ్చిన నింద్రుని

వజ్రాయుధము వేగమువంటి వేగముతోఁ గూడినవై, ప్రాణములు లేవఁదీయుట స్వభావకర్మమై, రామునిచే విడువఁ బడినవై యెమరు లేనివగు రాముని బాణములు నీ దేహమందు యుద్ధరంగమున నింతకుఁ బూర్వము నాటినవి కావు. కావుననే యిట్లు జ్ఞానముచే గర్వించి పలుకుచున్నావు.

ఓయి విభీషణా! రామబాణములు నాకుఁ దగులలేదు. కావున వాని జవసత్త్వములు నాకుఁ దెలియవు. నీకును నవి తగులలేదుగదా. నీ వనుభవము గలవాని వలె మాటలాడుచున్నాఁడవే. అది యెట్లు లనెదవా? అకంపనుఁ డేమి చెప్పెనో మఱచితివా? (అరణ్య-౫-౪౦౩-౪౪౪-౪౪౬-౪౪౭-౪౪౪-౪౪౯) "ఈ వాఁకఁడంచుఁ బల్కు నది యేటికి లోకమునందుఁ గల్గు రక్షోవరలోక మంతయును గూడియు నాతని డాయలేవు" అని వాఁడు చెప్పలేదా. శూర్పణఖ యేమి చెప్పెను? వినలేదా? (అరణ్య ౫౩౪ వ ప.) ఇవి నీవు నేను నిచ్చటనుండు ప్రముఖులు విన్నవారేకదా! మారీచుఁడీ రాక్షసరాజున కేమి చెప్పెనో యది యచ్చటివారు పదపడి చెప్పఁగా వినలేదా? (చూ. ౫౫౭౩ పద్యము) యుద్ధప్రియుఁడైన మనరాజు పూర్వము స్త్రీలను వారి మగవారిని జయించి తెచ్చినట్లు తేక సీతను, మోసగించి దొంగతనముగాఁ దేవలసిన పని యేమివచ్చెను? ఆ బాణములకు భయపడియే కదా! అప్పుడు యుద్ధము వలదని చాలించుకొన్నవాఁడు ఇప్పుడు యుద్ధమునకు డిగఁ గారణమేమి? పూర్వము లేని వానరబలమిప్పుడు రామచంద్రున కెక్కువగాఁ గలిగెఁగాని మనకుఁ బూర్వమున్న బలమేకదా! మన రాజులతో సమానబలుఁడు కాఁడా విరాధుఁడు? మనరాజుకంటె బలిష్ఠుఁడు కాఁడా వాలి? ఇవి యన్నియు నీ వాలోచింపవైతివి గదా! మొట్టమొదట నీ యింటికే కదా హనుమంతుఁడు చిచ్చుపెట్టెను. నీ యాఁడువారు నడివీథిలోఁబడి యేడ్చినపుడు నీవు నిద్రపోవుచుంటివా? ఇవి యన్నియు నాలోచించిన యుద్ధము ప్రశస్తమని నీ కెట్లు తోఁచెను. నీ యాలోచనప్రకారము పోయినఁ గీడెవ్వరికో యాలోచించితివా? హనుమంతుఁడు నగరమంతయుఁ దగులఁబెట్టినపుడు మే మేమఱి యుంటి మను మాట యేమి మాట? మీ రంద ఱేకమైనను మీ మీ యిండ్లను గాపాడుకొనఁగలిగిరా? స్వపరబలాబలములు విచారింపవలదా?

ఉ. ఎందనుకన్ దురాసద మహీనని శాతము తీవ్ర వేగితా
స్పందముఁ గంకపత్రమును ♦ జ్యానతనయాధవహ స్తముక్త ని
ర్మందశిలీముఖోచ్చయ మ♦మంథరరీతిని నిన్ను వ్రచ్చునో
యందనుకం బ్రహస్త! యిటు ♦ లాడుచు నుండు వికత్థనంబులన్. ౫౭౫౫

అర్థములు. దురాసదము=సహింపరానిది, అహీననిశాతము = మిక్కిలి వాఁడిగలది, తీవ్రవేగితాస్పందము=మిక్కిలి వేగమునుండిజాఱనిది, అతివేగముతోఁ గూడినది, కంకపత్రమును = గ్రద్దయీకెలు కట్టఁబడినది, జ్యానతనయాధవ = రామునియొక్క, హస్త=చేతినుండి, ముక్త=విడువఁబడిన, నిర్మంద = మందము

గాని, శిలీముఖోచ్చయము = బాణసమూహము, అమంథర రీతిని = అడ్డములేని విధముగ, ప్రచ్చునో=చీల్చునో, వికత్థనంబులన్=ఆత్మస్తుతి వాక్యములు.

ఉ. రావణుఁడైనఁ గాని సుర♦రాజజితుండును గుంభకర్ణుఁ డే
నీ వయినం ద్రిశీర్షకుఁడ ♦ యేని నికుంభనరాంతకాదు లేన్
గ్రావసమానసారగుఁ డ♦కంపనుఁ డే నతికాయుఁ డేని నీ
శావిభుదృష్టి మార్గమునఁ ♦ దాళరు నిల్వఁగఁ సంగరంబునన్. ౧౨౧

తా త్ప ర్య ము

ప్రహస్తా! నీ వొకఁడవే కావు. రావణుఁడైనను, ఇంద్రజిత్తయినను, గుంభకర్ణుఁ డయినను, త్రిశిరుఁడైనను, నికుంభనరాంతకాదులైనను, పర్వతమంత బలము గల యకంపనుఁడైనను, అతికాయుఁడైనను వీరు వేఱు వేఱుగాఁగాని యందఱు కలసికాని యుద్ధమందు రాముని కనుచూపుమేరలో నిలిచి సహింపలేరు. అందఱను గలిపి చెప్పుటకే తాళరని బహువచన ప్రయోగము.

ఉ. మీర లమిత్రతుల్యు లయి ♦ మిత్రులు నా వ్యసనాభిభూతుఁ డై
క్రూరతరస్వభావుఁ డయి ♦ కొంచక తా ననమీక్ష్యకారి యై
కారియము ల్ఘటించు సుర♦కంటకనాథునకున్ నిశాట సం
హార వినాశనార్థముగఁ ♦ బంచన చేరితి రేమి చెప్పుదున్. ౧౨౨

అర్థములు. అమిత్ర తుల్యులు = పగవారితో సమానులు, "అపకారో రి లక్షణ"మ్మన్నట్లు కీడుచేయువాఁడే పగవాఁడు, మిత్రులునా=స్నేహితులనఁ బేర, వ్యసనాభిభూతుఁడై=సప్తవ్యసనములలోఁ జేరిన స్త్రీ వ్యసనముచే ఆవరింపఁబడినవాఁడై, అనమీక్ష్యకారియై=ఆలోచనలేక కార్యము చేయువాఁడై, సురకంటకనాథునకున్ = రాక్షసరాజునకు, నిశాట సంహార వినాశనార్థముగన్ = రాక్షసు లందఱు నాశమై పోవుటకు.

తా త్ప ర్య ము

ప్రహస్తా! శత్రువులు చేయవలసిన పనులు మీరు చేయుచున్నారు. పేరునకు మిత్రులవలె నటించుచున్నారు. ఇట్టి హితశత్రువులు మీరు వ్యసనములచే మతిచెడి, మిగులఁ గ్రూరమైన స్వభావము గలవాఁడయి, యాలోచనలేక సందేహింపక, యే పనినైనఁ జేయు రావణునొద్ద సకలరాక్షసులు నాశమైపోవుటకొఱకుఁ జేరియున్నారు. ఇట్లు సర్వవైనాశికు లగు మీకు నేనేమి చెప్పఁగలను ?

క. శిరములు వేయియు నంతయుఁ, బరికింపఁగ రాని మేను ♦ భయదాకృతియున్
గురుబలమగు నహిచుట్టైను బరిరక్షితుఁ జేయరయ్య♦ప్రసభమునఁ బలిన్. ౧౨౩

అర్థములు. గురుబలము = గొప్పబలము, అగు = కల, అహి=రామఁ ద్వేషమను పాము, ప్రసభంబునన్ = బలాత్కారమున, పరిరక్షితున్=బాగుగా గాపాడఁబడిన వానిని,

తాత్పర్యము

వేయితలలు కలిగి తుదకానరాని దేహము, భయంకరమైన యాకారము, గొప్పబలముగల రామద్వేషమను పాము రాక్షసేశ్వరుని జుట్టుకొనినది. ఆయన దానినుండి తప్పించుకొనలేక మతిచెడియున్నాఁడు. మీరైనను బలవంతముగ నాయనను బైకిలాగి రక్షింపుఁడు.

క. పరిపూర్ణకాము లగు హిత, వరులెల్లరుఁ జేరి కావ♦వలయును రాజుం
గురు లోడిసిపట్ట శత్రూ, త్కర మరుదేరకయ మున్న♦గ్రహావిద్ధు బలెన్. ౨౨౯

అర్థములు. పరిపూర్ణకాములు=రావణునివలన వారి వారి కోరికలన్నియు సంపూర్ణముగా నెఱవేర్చుకొన్నవారు. ఇంతవఱకు నాయనసొమ్ము కావలసినంత దినినవారు, హితవరులు = ఆయన మేలుగోరువారిలో నుత్తములు, హితకాంక్ష యున్నను శక్తిలేని వారేమి చేయగలరు? శత్రూత్కరము విరోధుల సమూహము గ్రహావిద్ధుబలెన్ = దయ్యము పట్టినవానివలె.

తాత్పర్యము

ఇంతవఱకు రావణుని ద్రవ్యము కోరికదీరఁ బూర్ణముగాఁ దిని యతని మేలు కోరువారిలో నుత్తములగు వారు ఆయనను గ్రహపీడ గలవానిని మంత్రముచే రక్షించునట్లు శత్రువులువచ్చి తలవెంట్రుకలు పట్టుకొనకముందే రక్షింపవలయును. అట్లు చేయరేని కృతఘ్నులు, ద్రోహులు నగుదురు. ఆయన బాగుండినఁగదా యింకను మీరు దినవచ్చును. కావున మీ మేలుకోరియైన నాయనను రక్షింపుఁడు.

దీనిని మఱియొక విధముగ నన్వయింపవచ్చును. పరిపూర్ణకాములగు హితవరు లెల్లరుఁ గురు లోడిసిపట్ట రాజు జేరి శత్రూత్కర మరుదేరకయ మున్న కావ వలయును.

మైత్రిగలవాఁడు తన మిత్రుఁ డకృత్యములు చేయుచుండెనేని వాని తల వెంట్రుకలు పట్టి యీడ్చియైన వానినుండి తప్పింపవలయు ననియే నీతిశాస్త్రము చెప్పుచున్నది.

"ఆకేశగ్రహణాన్మిత మకృతేభ్యో నివర్తయేత్" నీళ్ళలోబడి మునుఁగుచు దేలుచుఁ జచ్చుటకు సిద్ధముగా నుండువానిని దలవెంట్రుకలు పట్టిలాగికదా బయట వేయవలయును.

తే. ప్రళయకరమైన సౌమిత్రి♦జలధిలోన, మునిఁగి శ్రీరామపాతాళ♦ముఖముఁజొచ్చు
పంక్తికంఠునిఁ గావరే♦ప్రాజ్ఞులార, పట్టి బలవంతముగ నైన♦బయట వేసి. ౨౩౦

తాత్పర్యము

సర్వవినాశకరమైన లక్ష్మణుఁడను సముద్రములో మునిఁగి శ్రీరాముఁడనెడి బడబాగ్నియందుఁ బడబోవు రావణుని, బుద్ధిమంతులారా! బలవంతముగనైన బయట వేసి రక్షింపుడు. "పాతాళం బడబాగ్నౌచ" యని నిఘంటువు. ఇక్కడ నీశబ్దమున

కీ యర్థమే తగినది. పాతాళలోక మనినచో నది రావణునకు మేనమామలు, తాతలుండు స్థలము గనుక సుఖమే.

క. ఈయది లంకకు నసురని, కాయమునకు రాజునకును ♦ గడుమేలిచ్చున్
జేయ నిటు తగును సీతా, నాయకునకు సీత నీయ ♦ నా మతము సుఁడీ. ౨౧

తాత్పర్యము

ఈ ప్రకారము మీరు చేసితి రేని రాక్షససమూహమునకు, రావణునకు మిగుల మేలు గలుగును. ఇది చేయఁదగిన కార్యము. రామచంద్రునకు సీత నిచ్చుట మేలని నా యభిప్రాయము.

క. తనబలము నెదిరిబలమును, దన స్థానము ♦ క్షయము వృద్ధి దాయలవిధమున్
దనమదిఁ దలంచి లెస్సగఁ, దన ఱేనికి హితముఁ గూర్పఁ♦దగు మంత్రులకున్. ౨౨

అర్థములు. ఎదిరిబలము = విరోధిబలము.

తాత్పర్యము

మంత్రులారా! మీరు చేయరాని పని చేయుఁడని మీకు నేను చెప్పరాలేదు. మంత్రులగు మీరు చేయవలసిన కార్యము మీకు నేను జేయుఁడని చెప్పుచున్నాను. ఏమి మాకార్య మంటిరా? మనరాజు బల మెంత? శత్రుబల మెంత? స్థానము=స్థితి, తనస్థితి యెట్టిది? శత్రుస్థితి యెట్టిది? శత్రువులు తగ్గియున్నారా? మనము తగ్గియున్నామా? వృద్ధి శత్రువుల కున్నదా? మన కున్నదా? యని యాలోచించి తన రాజునకు మేలగు దానిని జెప్పుట మంత్రికృత్యము. దానినే మీరు చేయుఁడని చెప్పుచున్నాను. స్థాన మనఁగా నిచ్చట దండెత్తిపోక నిలచుట. ఇది సంధి విగ్రహము యానము ఆసనము ద్వైధము ఆశ్రయమను వానిలోనిది. ఈ యాసన మైదు విధములు. సంధాయాసనము, ప్రసంగాసనము, విగృహ్యాసనము, సంభూయాసనము, ఉపేక్ష్యాసనము. శత్రువులు క్షీణదశయం దుండిన దండెత్తిపోవలయును. శత్రువులు వృద్ధియం దుండిన సంధి సేయవలయును. సమానులుగ నుండిన నాసనము తగును. ఇప్పుడు శత్రుపక్షము వృద్ధిలో నున్నదా, మనపక్షము వృద్ధిలో నున్నదా? ఆలోచించితిరా? సీతాహరణకాలమున రామలక్ష్మణు లిరువురు మాత్రమే. అప్పుడు వారిఁ బలము తక్కువ. మనమూఁదండెత్తఁ దగిన యప్పు డుపేక్షించి యూరకుంటిమి. ఇప్పుడో వారికి వృద్ధికాలము. వానరసేన యంతయు వారి పక్షమందే యున్నది. మనకు క్షయకాలము. మనపక్షమువారగు ఖరాదులు, వాలి చచ్చిరి. ఇచ్చట నక్షకుమారాదులు పలువురు చచ్చిరి. పాతికసేన నాశ మయ్యెను. కోటలు విఱిగిపడెను. కావున నిది సంధికిఁ గాలముగాని కలహమునకుఁ గాలము గాదు. ఇది యాలోచించి మీ కృత్యము మీరు చేయుఁడు.

విభీషణుఁడు మంత్రికృత్యములు న్యాయ్యముగనే చెప్పెను. కాని మంత్రులందఱుఁ గలసి సీత నిమ్మని చెప్పినను రావణుఁడు వినియుండునా? యనఁ దిన

సందేహము. "ద్వావిమౌ పురుషౌ మూర్ఖౌ దుర్యోధన దశాననౌ। గోగ్రహం వన భంగంచ, దృష్ట్వా యుద్ధం పునః పునః" లోకములో మూర్ఖు లిరువురు. దుర్యోధనుఁడు, రావణుఁడు. ఉత్తరగోగ్రహణమందు దెబ్బఁదినియు దుర్యోధనుఁడును, వన భంగముఁజూచియు రావణుఁడును మరల యుద్ధము సేయఁబూనిరి.

అన్నట్లు మంత్రు లందఱుఁ గలసి సీత నిమ్మని చెప్పినను రావణుఁడు విని యుండఁడు. అప్పుడు జరుగవలసిన దేమి? అందఱు రావణునితో విరోధింపవలయును గదా. అందఱు విరోధించియు నేమి చేయఁగలరు? వాఁడు పైఁబడి చంప మొదలు పెట్టిన నప్పు డేమిగతి? రాక్షసులచేత వాఁడు చావఁడు. అప్పుడైనను లంక పాడుకావలసినదే కదా. అందఱు లంకవిడిచి యెందుఁ బోఁగలరు? కావునఁ బ్రహస్తాదులు రావణునకుఁ దెగఁజెప్పక యతనినే యనుసరించిరి. పెట్టినన్నినాళ్ళు దినిసమయము వచ్చినప్పుడు తాను తప్పించుకొని వాఁడొకఁడే చచ్చుచుండఁ జూచుటయు సరిగాదు కదా. ఈ యాలోచన విభీషణున కేల కలుగలేదు? అధర్మమున వర్తింపలేక, సర్వబంధు వినాశము చూడలేక, అందుఁ దాను భాగము గొనలేక. మంత్రు లందఱు రావణుతో విరోధించి రనుకొందము. అప్పుడు రావణుఁడు వారి నుపేక్షించి నేను సీతనీయను మీరు తోఁడురాకుండిన నేనొక్కఁడనే యుద్ధము చేసెదను. గెలిచిన గెలుతును, చచ్చిన జత్తును-అని యూరకుండె ననుకొందము. అప్పుడు జరగవలసిన దేమి? వానరులు లంకను ముట్టడి వేసినప్పుడు రావణుఁ డొక్కఁడే యుద్ధమునకుఁ బోయిన వాని కొడుకులు, తమ్ము లూరక చూచుచుందురా? వారుపోయిన వారి పోష్యవర్గ మూరకుందురా? అప్పు డీ మంత్రు లేమి చేయఁగలరు? వారు మాత్ర మెట్టు లింట నూరకుండఁ గలరు. ఉండి రనియే తలంతము. వానరులు లంకలోఁ బ్రవేశించి తమ కొంపలమీఁదఁ బడినపుడు తమ నిమిత్తమైన యుద్ధము చేయవలయును గదా! ఇట్లు నానాముఖముగ యుద్ధము చేయుట మేలా? ఏక ముఖముగా యుద్ధము చేయుట మేలా? ఇవన్నియు నాలోచించియే విభీషణుఁడు రావణున కెక్కువగ బుద్ధి చెప్పెను.

ఉత్తరకాండమునందలి ౨౧౧- ౨౧౮ పద్యములు చూడుడు. ఎట్టికష్టదశయందైనను ధర్మబుద్ధి గలవాఁడై యుండునట్లు చావు లేకుండునట్లు విభీషణునకు బ్రహ్మ వరమిచ్చెను. కావునఁ బరునిభార్య నపహరించుట, దాని మగనిఁ జంపుట, దానిని విధవనుజేసి దానితో సంభోగింపనో, దానినిజంపనో యాలోచించుట-యిట్టి యధర్మ కార్యమును ధర్మబుద్ధి గలవాఁ డెవ్వ డంగీకరించును. ఇందరుచచ్చినను విభీషణుఁడు చచ్చువాఁడుకాఁడు. అప్పుడైన సీతను దాను రామున కప్పగింపవలసిన వాఁడే కదా. సీతాదేవిని లంకకుఁ దెచ్చిన దినమందే విభీషణుఁడు మండోదరితో నీ మగఁడు సర్వానర్థకరముహూర్తమునందు సీతను దొంగిలించి తెచ్చెను. దీనివలన మేలు లేదని చెప్పెను. దాని ననుసరించి యపశకునములు కనబడుచుండెను. త్రిజటాస్వప్నము,

లంకాదహనము మొదలైనవి దానినే బలపఱచెను. కావున యుద్ధమే జరిగనేని రావణునకు జయము లేదని విభీషణునకు నమ్మకముగాఁ దెలియును. ఈ కారణముచే నొక్కి చెప్పవలసి వచ్చెను. ప్రత్యక్షముగాఁ గీడు కానవచ్చుచుండ నట్లు చెప్పక యుండఁగలఁడు.

—• ౧౫-వ సర్గము ఇంద్రజిత్తు విభీషణుఁ దిరస్కరించి పలుకుట •—

తే. బుద్ధి సురగురుతోఁ సరిపోల్పఁజాలు, న వ్విభీషణు వాక్యంబు•లాలకించి
తండ్రిఁగని రాక్షసాళియోధ•ప్రబర్హుఁ,డైన వాసవజిత్తుఁ డిట్టు•లనుచుఁ బల్కె.

అర్థములు. యోధప్రబర్హుఁడు=యుద్ధము చేయువారియందు శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

బృహస్పతితో బుద్ధియందు సమానుఁడైన విభీషణుఁడు చెప్పిన మాట విని తండ్రిని జూచి యోధులందు శ్రేష్ఠుఁడైన యింద్రజిత్తు తండ్రితో నిట్టులనెను. విభీషణుని బుద్ధియందు బృహస్పతి యని, యింద్రజిత్తు యోధాగ్రేసరుఁడని చెప్పుటచే నింద్రజిత్తు యుద్ధమునందు సమర్థుఁడే కాని కార్యాలోచనయందుఁ గాఁడని భావము.

ఉ. ఏ మిటు నీదు సోదరుఁడె•హీన మనర్థకమున్ విభీతిదం
బై మనజాతి కర్హము క•వంతయుఁ గాని విధంబు పల్కె విం
టే, మన యన్వయంబున జ•నింపనివాఁ డయిన న్వచించునే
యీ మెయిఁ? జెప్పెఁ బో వినునె•యెవ్వఁ డ దెంతటి శక్తిహీనుఁడేన్. ౨౦౮

అర్థములు. హీనము = నీచము, అవమానకరము కావున, అనర్థకము = నిష్ప్రయోజనము, ఈ మాటలువిని యాప్రకారము వాఁడు నడచుకొనకుండుట చేత, విభీతిదంబు = భయముకలిగించునది, అన్వయంబునన్ = వంశమునందు, ఈ మెయిన్=ఈ విధముగ.

తాత్పర్యము

ఇది యేమి తండ్రీ! నీ తోడఁబుట్టిన వాఁడే యిటువంటి నీచము, నిష్ప్రయోజనము, భయము పుట్టించునదియై మనజాతికే కొంచెమైన యోగ్యముగాని విధముగాఁ బలికెను. విన్నావా? మన వంశమందుఁ బుట్టనివాఁడే యగునుగాక-ఈ విధముగ నెవ్వఁడైనఁ జెప్పునా? ఒకవేళ నితనివంటివాఁడుఁ చెప్పిన నెంతటి శక్తిహీనుఁడైనను వినునా?

ఉ. శౌర్యము భూరిసత్త్వమును•సాహసము న్పటువిక్రమంబునున్
స్థైర్యముఁ దేజము న్బ్రబల•ధైర్యము నేమియు లేనియట్టి ని
ర్వీర్యుఁడు నీదు తమ్ముఁడు వి•భీషణుఁ డొక్కఁడె సుమ్ము తండ్రి! యీ
యార్యకులంబునం బ్రభవ•మందెను దుర్యశముం గడింపగన్. ౨౦౯

అర్థములు. భూరిసత్త్వము= విస్తారబలము, నిర్వీర్యుఁడు = వీర్యము లేనివాఁడు, సవీర్య మతిశక్తిభాక్ = దృఢమైన యుత్సాహము లేనివాఁడు, 'శుక్రం తేజో రేతసీచ బీజవీర్యేంద్రియాణిచ'-అమరము-నపుంసకుఁడు, దుర్యశమున్=అపకీర్తిని, గడింపఁగన్ = సంపాదించుటకు, శౌర్యము = శత్రువులపై పడిపోవుట, తేజము="అధిక్షేపావమానాదేః ప్రయుక్తస్య పరేణ యత్, ప్రాణాత్యయే వ్యవస్థానం తత్తేజ స్సముదాహృతమ్"పరు లాక్షేపించినను అవమానించినను ప్రాణము పోవున ట్లుండినను సహింపకుండుట తేజ మనఁబడును-పరులను శుష్కింపఁజేయునది తేజము-ధైర్యము-మనసో నిర్వికారత్వం ధైర్యం సత్స్వపి హేతుషు చాపలేనానుపహతా సర్వార్థే ష్వవికత్థనా, స్వాభావికీ చిత్తవృత్తి ర్ధైర్య మిత్యభిధీయతే। మనస్సు చలించుటకు హేతువు లుండినను చలింపకుండు స్వభావమైన చిత్తవృత్తి ధైర్య మనఁబడును.

తాత్పర్యము

శౌర్యముగాని, దానికిఁ గావలసిన బలముగాని, సాహసముగాని, దృఢమైన విక్రమముగాని, నిలుకడగాని, తిరస్కారమందు నసహనముగాని, బలిష్ఠమైన ధైర్యముగాని వీనిలో నొక్కటియైన లేని నపుంసకుఁడు నీ తమ్ముఁడు, విభీషణుఁ డొక్కఁడే యీ గొప్పకులమందు నపకీర్తి సంపాదింపఁ బుట్టినవాఁడు అని తండ్రికిఁ జెప్పి విభీషణుఁ జూచి చెప్పుచున్నాఁడు.

మ. పితృకే! మాకభీతి నేర్పెదవు? పృథ్వీ నాయక ద్వంద్వముం
 బఱపన్లేఁడొకో దేబెసోఁకుఁ డయిన న్మాలోన, నీ కేల ప
 ల్లఱపు ల్లోకము లేలు జిష్ణు నమృతాంధోధీశుని న్గర్వమున్
 బఱిపోనం జెఱ నంపనే! తెలియనే భ్రాంతాత్మ లా వేల్పులన్. ౨౦౬

అర్థములు. పృథ్వీనాయక ద్వంద్వమున్=రాజుల నిద్దఱను, రామలక్ష్మణులను, పఱపన్ లేఁడొకో=పాఱఁదోలఁజాలఁడా యేమి, దేబెసోఁకుఁడు = బలహీనుఁడైన రాక్షసుఁడైనను, ఏకవచన ప్రయోగముచే నొక్క రాక్షసుఁడే చాలునని భావము, పల్లఱపుల్ = వ్యర్థభాషణములు, జిష్ణున్ = ఇంద్రుని జయించు స్వభావము గలవానిని, అమృతాంధోధీశునిన్=అమృత మాహారముగాఁగల చావులేని దేవతల కందఱకుఁ బ్రభువుగా నుండువానిని, పఱిపోనన్ = కొల్లపోఁగా.

తాత్పర్యము

ఇంద్రజిత్తుకూడ రామలక్ష్మణులను జయింపలేఁడని విభీషణుఁడు చెప్పిన కారణముచే నింద్రజిత్తు తన పరాక్రమ పౌరుషములఁ జెప్పుచున్నాఁడు.

పితృకే! నీవు మాకాభయము నేర్పెదవు? మాలో నధముఁడైన రాక్షసుఁ డొక్కఁడు రామలక్ష్మణుల నిరువురఁ దఱుమఁగొట్టలేఁడా యేమి? ఏల వ్యర్థముగా నిన్నిమాటలు మాటలాడుచున్నావు. లోకముల నన్నిటిని పాలించువాఁడై జయించు స్వభావము గలవాఁ డగుటచే జిష్ణుఁడని పేరుపొంది చావులేని దేవతల కందఱకుఁ

ప్రభువైన వాని గర్వము కొల్లగొట్టి నేను జెలసాలయం దుంపలేదా ? దిక్కు తెలియక తికమకలాడు దేవతలఁ దఱిమి తఱిమికొట్టనా ?

చ. కెరలిన నాదుశక్తిఁ గని • గీయని కూయుచు నేలఁ బొర్లని
ర్జరపతి వారణంబు రద•సంహతి నూడఁగఁ బీకి దానిచే
నరులను దోలనే ? సురచ•యంబుల దర్పమణంప లేదె ? యా
శరులకు శోకదాత నయి • సన్నుతిఁ గాంచనె ? నీ వెఱుంగవే ! ౩౭

అర్థములు. కెరలిన=విజృంభించిన, రదసంహతిన్=దంతముల సమూహమును, నాలుగు దంతములను, అరులను = శత్రువులను, ఆశరులకు = విరోధి రాక్షసులకు.

తాత్పర్యము

నేను విజృంభింపఁగా నాశక్తిఁ జూచి నేను గొట్టకముందే నేలఁబడి గీయని కూయుచున్న యైరావతము కొమ్ముల నూడఁబెఱికి వానితో శత్రువులను దఱుమ లేదా ? దేవతా సమూహముల గర్వ మణఁపలేదా ? విరోధిరాక్షసులకు శోకదాతనై పొగడఁబడలేదా ? ఇ వన్నియు నీ వెఱుంగవా ?

ఉ. అంతటివాఁడఁ బ్రాకృత నృ•పాత్మజుల న్బలహీనమర్త్యులన్
వింత యొకో జయించుట వి•భీషణ యంచు వచింప నంతి దు
ర్దాంతబలుం డజయ్యు సుర•రాజనిభున్ గురుతేజుఁ జూచి యా
వంతయుఁ గొంక కిట్లను మ•హార్థసుభాషిత మెల్లరు న్వినన్ ౩౮

తాత్పర్యము

అర్థములు. ప్రాకృత నృపాత్మజులన్ = సామాన్య రాజకుమారులను, దుర్దాంతబలుండు = అణఁపరాని బలముగలవాఁడు, ఈ విశేషణము బలహీనుఁడై యింద్రజిత్తాక్షేపించినట్లు పిఱికివాఁడై విభీషణుఁడు చెప్పలేదని సూచించుచున్నది. అజయ్యున్=జయింప సాధ్యముగాని వానిని, యిది యింద్రజిత్తు రామలక్ష్మణుల జయింప లేఁ డనుట వాని బలశౌర్యములు తెలియక కాదని సూచించెడిని, ఆవంతయును = కొంచెమైనను, ఆవగింజంత యైనను, కొంకక=సందేహింపక, మహార్థ సుభాషితము=గొప్ప ప్రయోజనముతోఁ గూడిన మంచిమాట.

తాత్పర్యము

అంతటి కార్యములు చేసినవాఁడను సామాన్య రాజకుమారులను బలములేని మనుష్యులను విభీషణా, జయించుట యాశ్చర్యమా ? యనఁగా విశేషబలశాలి యగు విభీషణుఁడు, జయింపరాని వాఁడును ఇంద్రునితో సమానుఁడును గొప్ప తేజస్సు గలవాఁడు నగు నింద్రజిత్తుఁ జూచి యందఱు వినుచుండ జంకక యిట్లు గొప్ప మేలుకూర్చు మంచిమాట చెప్పెను.

ప్రాకృతు లనుటచే నింద్రునివలె గొప్పవారు గారనియు, నృపాత్మజు లనుటచే బాలురనియు, బలహీను లనుటచే నైరావతమువలె బలముగలవారు గారనియు

మర్త్యులనుటచే ఆమర్త్యులను గొట్టిన వానికి నొక దెబ్బ గొట్టినఁ జచ్చువా రెంత మాత్ర మనియు గ్రాహ్యము.

—• విభీషణుఁ డింద్రజిత్తును నిందించుట •—

ఉ. బాలుఁడ వీవు నాయన! యపక్వమనీషుఁడ వౌట మంత్ర కా
ర్యాళి యథార్థదృష్టిఁ గను • వంతటివాఁడవు గావు, కావునన్
నీ లయ మేఁ నెఱుంగకయె • నేర్చినయట్టులు లేనిపోని వా
గ్జాల ముపన్యసించితివి • కార్యము తీరెనె యంతమాత్రనే. ౨౮౯

అర్థములు. నాయనా = కుమారా! గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్లు నీవే నన్నాక్షేపింపఁ జూచితివా! యని భావము. అపక్వ మనీషుఁడవు = పక్వము గాని బుద్ధిగలవాఁడవు, మంత్రకార్యాళిన్ = ఆలోచనచేయు కార్యములందు, యథార్థదృష్టి=ఉన్నదున్నట్టు లాలోచించు.

తాత్పర్యము

కుమారా- నీవు పిల్లవాఁడవు- 'బాలా దపి సుభాషిత' మ్మని లేదా యందు వేమో, బుద్ధిమంతులగు పిల్లవాండ్రు చెప్పిన గ్రాహ్యమే కానినీబుద్ధియింకనుపక్వము కాలేదు. కావుననే మంత్రాలోచనమందు యథార్థము తెలిసికొను శక్తి నీకు లేదు. కావున నీవు చెపుటకూడ నీ వెఱుంగక తెలిసినవానివలెనే లేనిపోనిమాటల నుప న్యాస మిచ్చితివి. అంతమాత్రముతోనే కార్యము చక్కఁబడెనా? నీవు చెప్పునది యుద్ధవిషయములు. ఇక్కడ జరుగు ప్రస్తావన సీతంద్రి చేసినది తప్పా యొప్పా- తప్పైన సవరించుకొను టెట్టులనునది-కార్యము నిరపాయముగ నెఱవేఱుటకు నే యుపాయము మంచిదని యాలోచించునపుడు యుద్ధము తీర్మానమైన పిమ్మటఁ జెప్పవలసిన ముచ్చట లిప్పుడేల? సామము దానము దండము-వీనిలో నేది మంచి దని విచారింపఁ బడుచున్నది. గోటఁ బోవుదానికి గొడ్డలి ప్రయోగించువాఁడు బుద్ధిమంతుఁడా! ఇది యాలోచించు బుద్ధి నీకు లేదు. నీకు యుద్ధమునందే దృష్టి యుండుటచేఁ దక్కినవి నీకుఁ గానరాలేదు. కావున నీ యాలోచన ప్రకారము పోయిన నీవు నాశె మగుట యెఱుంగక యేవేవియో ముచ్చట లుపన్యసించితివి! ఈ ముచ్చటలతోనే కార్యము చక్కఁబడెనా?

క. పుత్రుఁడ వను నెపమునఁ బ్రియ మిత్రునివలె రావణున కమిత్రుఁడవై త్వ
త్పుత్రిపతి భయముఁ దన నీ,మాత్రము గనలేక చెనఁటిమాటలు వినుదే. ౨౯౦

అర్థములు. అమిత్రుఁడవు=పగవాఁడవు.

తాత్పర్యము

కొడుకను పేర ప్రియమిత్రునివలెనుండి వాస్తవమున నీతండ్రికి నీవు పుత్రుఁడ వయియున్నావు. సీతాపతియగు రామునివలన భయముగలదు. యుద్ధము వలదని నేను చెప్పఁగా నేను నీకుఁ గీడుచెప్పినట్లు తలఁచి దుర్మార్గులమాటలు విని యా

పక్షమున మాటలాడెదవా? నీకు నీతండ్రికి నేను గీడు కోరువాఁడను, పరాయివారు మేలుకోరు వారైరికదా. నీ వివేక మింతలో నున్నది.

చ. అరయఁగ నీవు దండ్యుఁడవ ♦ యంతియ కా దిటువంటి మంత్రముం
జరపెడివేళ నిచ్చటికిఁ ♦ సాహసముఖ్యుని బాలు ధీరతం
దిరుని, సభాస్థలిం బొరఁగఁ ♦ దెచ్చిన దుర్మతికూడ వధ్యుఁడౌ;
సరిపడునొక్కొ మంత్రి మది ♦ జాల్ములు మూఁగిన కొల్వులోపలన్. ౫౯ ౧

అర్థములు. దండ్యుఁడవు = దండింపఁదగినవాఁడవు, తిరునిన్ = స్థిరుని, దుర్మతి = చెడుమనస్సు గలవాఁడు, జాల్ములు = మూఢులు, మూఁగిన=గుంపు చేరిన.

తాత్పర్యము

నీ వహితము బోధించుచున్నావు. కావున నీవు పగవానివలె దండింపఁబడఁ దగిన వాఁడవు. గొప్ప విషయ మాలోచన జరుగు సమయమున సాహసము ప్రధానముగా నెంచువానిని, పిల్లవానిని, పట్టిన పట్టు సాధింపఁ జూచువానిని నిన్ను సభకు రానిచ్చిన దుర్బుద్ధి కూడ దండ్యుఁడే. వెల యన మూఢులు గూడిన సభలోఁ గార్యాలోచనము కుదురునా? గొప్ప కార్యము లాలోచించునపు డేడవ చెవి వినఁగూడ దని శాస్త్ర ముండఁగా నీ వంటి పిల్లవాండ్రను ఆలోచింప శక్తి లేని వారిని రానిచ్చుట తప్పుగదా.

చ. తెలివియొ సర్వమంగళము ♦ తీక్ష్ణత నీకు స్వభావసిద్ధమున్
దెలియ వణంకు వెట్టిదియొ ♦ తీర్పులు దిద్దె దెఱింగినట్టులే
యలుచవు స్వల్పబుద్ధివి దు ♦ రాత్ముఁడవు న్మొఱకండవుం గడు
ల్బిలుకవు మేటిదుర్మతివి ♦ పిల్లతనంబునఁ బ్రేలె దీ గతిన్. ౫౯-౨

అర్థములు. సర్వమంగళము = సున్న, 'కైదువు సున్న పూజ్యములు కంకటఖేట శిరస్త్రలత్రముల్, లేదరదంబుతత్తడి హుళిక్కి సహాయము సర్వమంగళంబు, మను. ౪-౧౦౫. అణంకువ = వినయము, అలుచవు = మందుఁడవు, స్వల్పబుద్ధివి=కొంచెపు బుద్ధిగలవాఁడవు, మొఱకండవు=మూర్ఖుఁడవు బాలుఁడవు, నీవు మేటిదుర్మతివి=ప్రహస్త మహాపార్శ్వ కుంభకర్ణాదులు దుర్మతులు. వారికంటె నీవు హెచ్చు దుర్మతి వని భావము.

తాత్పర్యము

ఇంద్రజితా ! నీకుఁ దెలివి సున్న, క్రౌర్యము నీకు స్వభావగుణము. పెద్దల సేవించినవాఁడవు కావు. కావున వినయ మెట్టిదో యెఱుఁగవు, తెలిసిన వానివలె దీర్పులు దిద్దెదవు. మందుఁడవు. బుద్ధి విశేషము లేనివాఁడవు. చెడుబుద్ధి గలవాఁడవు నీకుఁ దెలియదు, ఒకరు చెప్పినను వినవు. మిక్కిలి బాలుఁడవు, దురాలోచన పరులందు మేటివి, కావునఁ బిల్లతనముచే నిట్లు వదరెదవు.

తే. ఎవఁడు సైరించు నోర్వఁగనీ తేరఁ జేయు, బ్రహ్మదండనిభంబులు రవితనూజ
దండకల్పంబు లర్చిర్యుతంబు లుగ్ర, కాలతుల్యాకృతులు నైనకాండములను.

అర్థములు. బ్రహ్మదండనిభంబులు=బ్రాహ్మణశాపముతో సమానమైనవి, (౨) ప్రలయకాలమున బయలుదేఱు నగ్నివర్ణధూమకేతువు, రవితనూజ దండకల్పంబులు=యమదండముతో సమానములు, అర్చిర్యుతంబులు=జ్వాలలు గలవి, 'అగ్నేర్భ్రాజంతే అర్చయః' అని వేదమందు అర్చిశ్శబ్ద మికారాంతము గలదు, ఉగ్ర=భయంకరములైన, కాల=యమునితో; తుల్య=సమానములైన ఆకృతులు=ఆకారములు గలవి, కాండములను=బాణములను.

తాత్పర్యము

బ్రహ్మదండముతో సమానములై యమదండములను బోలి జ్వాలలు గలిగి భయంకరమైన యముని యాకారముతో సమానములైన యాకారములఁ గలిగిన రాముఁ డేయు బాణములను నెవఁడు సైరింపఁగలఁడు.

మ. దనుజాధీశ్వర ! నాదు విన్నపము డెందంబందుఁ బొందింపుమీ
ధనము ల్రత్నములుం బరిష్కరణసంతానంబు దీవ్యన్మహా
ధనము ల్చిత్రమణు ల్ధరాపుత్రియుఁ దాత్పర్యంబున న్రామచం
ద్రున కర్పింపుము, సౌఖ్య మంద నగు నెంతో యెల్లవారుం బురిన్. ౨౯౪

అర్థములు. ఇట్లు లింద్రజిత్తునకు బదులుచెప్పి రావణుని జూచి చెప్పుచున్నాఁడు. పరిష్కరణ సంతానంబు=సొమ్ముల సమూహము.

తాత్పర్యము

రాక్షసేశ్వరా! నావిన్నపము హృదయమున నాటనిమ్ము-ధనములు ఆయా జాతియందు శ్రేష్ఠములైన పదార్థములు - సొమ్ములు ప్రకాశించునవియు మిగుల వెలగలవియు, చిత్రములైన మణులు - సీతను బుద్ధిపూర్వకంబుగ రామచంద్రున కర్పింపుము. ఊరిలో వారందఱు మిగుల సుఖపడుదురు. అటు చేయని యెడల వారికి నీకుఁ గీడు తప్పదని భావము.

విభీషణుఁడు చెప్పినది దాని నర్థానుసంధానముచేసి యాప్రకార మాచరించక పోయినను వినుటచేతనే మనస్సునకుఁ బ్రీతి జనింపఁజేయునది. ఆచరణమునం దిష్టము లేకపోయినను వినరానిదికాదు, అవశ్యము వినదగినది.

—{ ౧౬-వ సర్గము. రావణుఁడు విభీషణునకు జ్ఞాతిలక్షణంబుఁ దెలిపి నిష్ఠురంబు లాడుట. }—

తే. అనుచు సునివిష్టమును హితమైనవాక్యమును వచించు విభీషణు మోముఁజూచి
రావణుఁడు కాలచోదితభావుఁ డగుటఁ, బరుష వాక్యంబు లిట్లని పలికె నతని.

అర్థములు. సునివిష్టము = చక్కఁగాఁ గూర్పఁబడినది, పదముల చేరిక మంచిదైనది - రావణాముల కిందలి యర్థము రుచింపకున్నను వాక్యము చెవుల.

కింపుగా నుండుటచే వదలుటకు సాధ్యపడలేదనియు విభీషణుఁడు చెప్పఁ దలచిన దంతయు నీ వాక్యమునం దున్నదని సూచితము. దీనివలన భగవద్విషయ ముప దేశించువారు భయముగాని దాక్షిణ్యముగాని లేక వారి మేలు గోరి ఖండితముగఁ దెగజెప్పవలయు ననియుఁ జెప్పుటయందు లోప ముండరాదనియుఁ దెలియవలయు డిని- భయదాక్షిణ్యాదులచే నిచ్చకము లాడువాఁ డాత్మద్రోహి- పరద్రోహియు నగును, హితము = చెవుల కింపుమాత్రమే కాక కీడు పోఁగొట్టి మేలు గూర్చు నది. వచించు=చెప్పు, 'నాసంవత్సరవాసినే బ్రూయాత్' తనునట్లు సంవత్సరము గురుశుశ్రూష చేసినవానికిఁగాని చెప్పరాని గొప్పవిషయము రావణుఁడు చెవి సోవుట మెల్లక నాలుగుమాటలతోఁ జెప్పినాఁడని భావము. విభీషణు మోముఁ జూచి మఱి యెవ్వరైనఁ జెప్పినఁ ద్రోచివేయవచ్చును గాని సొంత తమ్ముఁడే చెప్పుటచే నేమాత్రము ద్రోచివేయరా దని భావము.

విభీషణుఁడు చెప్పినది సునిష్టము హిత మనుటచే నీ వాక్యము లిట నన సంధించునది.

> ఆత్మా రాజ్యం ధనంచైవ కళత్రం వాహనానిచ
> ఏత ద్భగవతే సర్వ మితి తత్ప్రేక్షితం సదా. నను.

'పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్, రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ, సర్వధర్మాంశ్చ సంత్యజ్య, సర్వకామాంశ్చ సాక్షరాన్, లోకవిక్రాంత చరణౌశరణం తే వ్రజం విభో' దీనివలన విభీషణుఁడు శరణాగతి బోధించె నని యేర్పడుచున్నది. అది రావణువంటి రాక్షసున కెట్లు రుచించును. ఇట్టి యభిప్రాయము లేదేని సీతను మాత్ర మిమ్మనినఁ జాలును. ఈపదార్థము లన్నియుఁ దాత్పర్యముతో నిమ్మని చెప్పనేల? తత్పరత్వమే తాత్ప ర్యము. ఇది భక్తిని ననుకూలభావనును సూచించును. దుర్బుద్ధులకు భగవద్విషయ ముపదేశించినఁ గలుగు ఫలముఁ జెప్పుచున్నాఁడు.

రావణుఁడు 'రావయతీతి రావణ'యను వ్యుత్పత్తి ప్రకారము జనుల నేడ్పిం చుట యందు లోకప్రఖ్యాతుఁ డని భావము (౨) రౌతీతి రావణ యను వ్యుత్పత్తి ప్రకారముఇంద్రియసౌఖ్యములకై యేడ్చువాఁడని భావము,కాలచోదితభావుఁడు= యమునిచేఁ బ్రేరింపఁబడిన మనస్సుగలవాఁడు-రామునకు శరణాగతి చేయు మని విభీషణుఁడు చెప్పినమాటవినవలదని యముఁడు ప్రేరించుచున్నాఁడని భావము,ఇన్ని పాపములు చేసి తన లోకమునకు రావలసినవాఁడుశరణాగతి చేసినఁ దప్పించుకొనునే యని యముఁడు విభీషణుమాట వినవల దనుచున్నాఁడని భావము.లోక విరుద్ధచర్య నడచి నరకమునకుఁ బోవ నున్న వారికి శరణాగతిరుచింప కుండుటయేగాక వికటించు నని సూచితము-కావుననే, మోముఁజూచి=చాటుగఁగాదు - రహస్యముగఁగాదు- ఎదురుగనే- పరుష వాక్యములు- అటువంటి మంచిమాటలు విన్నవాఁడు నీసద్వా

క్యములచే నా సందేహము దీఱెనని యైనఁ జెప్పియుండవలెను. నీవు నాకు మహోప కారము చేసితి వని స్తోత్ర మైనఁ జేసియుండవలెను. ఇట్టి మహోపదేశము చేసిన వారికిఁ జాలినంత ప్రత్యుపకారము చేయనైతినిగదా యని యనుతాప మైనఁబడి యుండవలెను. ఈ సన్మార్గము వదలి పామునకుఁ గాలుపోయఁ బోవ నది పైఁబడి పీకినట్లు రావణుఁడు పరుషవాక్యము లనుచున్నాఁడని భావము.

తాత్పర్యము

ఈ ప్రకారము చక్కనికూర్పు గల మాటలచే హిత ముపదేశించు విభీషణు ముఖముఁ జూచి రావణుఁడు మృత్యుప్రేరితుఁ డగుటచేఁ గఠినవాక్యము లిట్లు పలికెను.

దీనివలన భాగవతుని పరుషముగా మాటలాడుట తన వినాశసూచక మని సూచన.

క. కినిసినఫణితో నేనియుఁ, దన శత్రువుతోడ నేనిఁ దగు వసియింపం
దన మిత్రునివలె మెలఁగెడి, తనరిపు సేవకునితోడఁ దగదు వసింపన్. ౨౬

అర్థములు. కినిసినఫణితోన్ = కోపించిన పాముతో, తనరిపు సేవకుని తోడన్=తన విరోధిని గొలుచువానితోడ.

తాత్పర్యము

తనపైఁ గోపించిన పాముతోనైనను, తన్నుఁ జంపఁజూచు ప్రత్యక్షశత్రువుతోనైనను గూడియుండవచ్చును. కాని తన మేలుగోరు మిత్రునివలె నటించుచు లోలోపలఁ దన శత్రువునకు సేవకుఁడై యుండువానితో వసింపరాదు. ఇక్కడ సేవకుఁ డనఁగా బక్షపాతము గలవాఁ డనియే గ్రహింపనగు.

మన కొకఁడు ప్రత్యక్షశత్రు వని స్పష్టముగాఁ దెలిసినప్పుడు మన జాగ్రత్తలో మన ముందుము. కావున నపాయము తక్కువ. అటుగాక "రాజులలోఁ గొలువు, నవాబులలో నౌకరు" అన్నట్టు శత్రువునకు లోకువై యుండి మిత్రునివలె నటించు వానివలనఁ బ్రమాదముచేఁ జెడుదుము. ఇట్లు చెప్పుటచే విభీషణుఁడు రామునకు నౌకరై తన కీడు వెదకుచున్నాఁడని సందేహపడినట్లు భావము. ఇది దూషింపవలసి దూషించిన మాటయేకాని సీతాదేవిని దెచ్చిన దినము మొద లప్పుడప్పు డీ విషయమే విభీషణుఁడు చెప్పుచుండిన కారణముచే నిండు మనస్సుతోఁ జెప్పిన మాటగాదు, తనకు విరోధముగాఁ జెప్పెనే యని యాక్రోశ ముతోఁ జెప్పిన మాట కోపించిన సర్పముతోను, ప్రత్యక్ష శత్రువుతోడను నొక చోట నుండుట యెట్లు సరిపడదో యట్లు నీతోఁ గూడియుండుట నాకు సరిపడదు. కావున నా నగరము విడిచి పొమ్మని సూచన.

క. జ్ఞాతుల స్వభావ మంతయు, నా తెలియని యదియె త్రిభువనంబులలోనన్
జ్ఞాతులకు వ్యసన మబ్బిన, జ్ఞాతులకును సంతసంబు నమకూడుఁ గదా. ౨౭

అర్థములు. జ్ఞాతుల = దాయాదులయొక్క, నా తెలియని యదియొ = నాకుఁ దెలియని విషయమా, ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితా వ్యవహితకర్తృపద ప్రథమకుఁ దఱుచుగ యొక్కషష్ఠి యగు. ప్రౌ. వ్యా. కారక. ౧౫ సూ. "అపారపారావారపర్యంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరును లేరు." భార. అరణ్య. ౨. ఆ.

తాత్పర్యము

మూఁడు లోకములందును దాయాదు లగువారి సహజగుణము నాకుఁ దెలియదా యేమి? దాయాదులకుఁ గష్టము కలిగినచో వాని దాయాదులు సంతోషించుచుందురుగదా! "జ్ఞాతిశ్చే దనలేన కి"మ్మని భర్తృహరి. దాయాదుఁ డుండెనేని యగ్నితో నేమి పని.

మూఁడు లోకములం దనుటచే మనుష్యులందు, దేవతలందు, రాక్షసులందు, నన్ని జాతులందు, భూతములందుఁ గలదని భావము.

క. ఆతతమతియుతు ధర్మో,పేతు ననుత్తముని శూరు ♦ హితసాధకునిన్
జ్ఞాతులు మెచ్చరు మఱి పరి,భూతియు నొనరింత్రు సమయ♦ముం గనుఁగొనుచున్.

అర్థములు. ఆతతమతియుతున్=విస్తారమైన బుద్ధిగలవానిని, ధర్మోపేతు= ధర్మముతోఁ గూడినవానిని, అనుత్తముని = మిగులశ్రేష్ఠుని, హితసాధకునిన్ = తనకు హితమైనదానిని సాధించు వానిని, పరిభూతి=అవమానము, తిరస్కారము.

తాత్పర్యము

జ్ఞాతులలో మిగుల బుద్ధిమంతుఁడు, ధర్మమునం దుండువాఁడు, మిగుల నుత్తమ గుణములు గలవాఁడు, శూరుఁడునై హిత మగుదానిని సాధించువానిని, దక్షిన వాని జ్ఞాతులు మెచ్చను మెచ్చరు. పై పెచ్చు ఏదైనఁ గొంచెము సమయము దొరకెనా యవమానింతురు. నీవు నట్టివాఁడవే.

క. కలసి మెలసినట్ల ♦ కనఁబడు చుందురు, క్రూరకర్మములకు ♦ రోయకుంద్రు
మనసు నీయ రెడరు ♦ నను జంపఁ జూతురు, భీతికరులుగారె ♦ జ్ఞాతు లెందు.

అర్థములు. మనసునీయరు = మర్మము విడిచి మాటలాడరు, ఎడరునను= ఆపత్కాలమందు, భీతికరులు=భయము గలిగించువారు.

తాత్పర్యము

మిగుల నొద్దిక, నైకమత్యము గలవారివలెఁ దమతోఁ గలసి మెలసి తమలో నొకఁడుగాఁ దిరుగుచుందురు. సమయము వచ్చెనా యెంతఘోరకార్యమైనఁ జేయుటకు జుగుప్సపడరు. తమ మనస్సు బయటబెట్టరు. ఆపదలందుఁ జంపఁ జూతురు. కావున జ్ఞాతు లెప్పటికైన నపాయము గలిగించువారే. ఇట్లు సామాన్యముగ జ్ఞాతి లక్షణము చెప్పినను ఇవియన్నియు నీయందున్నవని నీవు నిట్టివాఁడవేయనిభావము.

క. మును పాశహస్తనరులను, గని పద్మవనంబునందుఁ ♦ గల వారణముల్
వినిచె నొక కొన్ని పద్యము, లను వానిని వినుము జ్ఞాతి♦లక్షణ మెఱుఁగన్.

అర్థములు. పాశహస్తనరులను = తమ్ముఁబట్టుటకుఁ బగ్గములు చేతఁబట్టుకొని వచ్చిన మనుష్యులను.

తాత్పర్యము

తమ్ముఁబట్టుటకుఁ గొందఱు మనుష్యులు పగ్గములను, వారికి మచ్చికపడిన యేనుఁగులనుదీసికొనిరాఁగా వారినిఁజూచి పద్మవనంబునందలి యేనుఁగులు వారితో నిట్లు చెప్పెను. ఆ మాటలు వినినచో నీకు జ్ఞాతు లెట్టివారైనది తెలియఁగలదు.

ఆ. భయము లేదు మాకుఁ ♦ బాశచయంబుల, నిప్పువలన శస్త్ర ♦ నిచయములను
స్వార్థపరులుఁ గ్రూరు♦లైనదాయాదుల,వలననే భయంబు♦గలుగుమాకు. ౩౧

అర్థములు. స్వార్థపరులు=తమ మేలు చూచుకొనువారు.

తాత్పర్యము

మనుష్యులారా! మీ పగ్గములకు మేము భయపడము. మీరు వేయు మంటలకు, మీరు చూపు కొఱవులకు మేము భయపడము. మీరు ధరించిన ఆయుధములకు మేము భయపడము. కాని తమ మేలుగోరి కఠినచిత్తులైన మా దాయాదులకు మేము భయపడుదుము.

ఆ. మీరు దెచ్చినట్టి♦వారణంబులు మమ్ముఁ బట్టుకొనఁగ నుపమఁ ♦ బలుకు నిజము
సకలభయములందు ♦ జ్ఞాతిభయం బది, దుస్సహంబు మాకు ♦ లెస్స తెలియు.

అర్థములు. ఉపమ=ఉపాయము, దుస్సహంబు=సహింపరానిది.

తాత్పర్యము

అవి మిమ్మేమి చేసెనందురా-మీ పోషణ మందుండి మీరు తోడి తెచ్చిన యేనుగులు మమ్ముఁ బట్టుకొను నుపాయము మీకుఁ జెప్పును. అన్ని భయములందు జ్ఞాతులవలని భయము సహింపరానిది. ఇది మాకు బాగుగఁ దెలియును.

కట్టెలు కొట్టువాఁ డొకఁడు గొడ్డలి తీసికొని యడవికిఁ బోయెను. వానిని జూచి యొక చెట్టు మఱియొక చెట్టుతో నీఁడు మనలఁ గొట్టుటకై వచ్చెను. మనలో నెవరిని గొట్టునో యేమో యనెను. ఆ రెండవ చెట్టు మన వారెవరైన వానితోఁ గలిసినారా చూడుము. మనవారు కలసిననే మనకు భయము. మనవారు కలియకుండువఱకు మనకు భయము లేదని చెప్పెను. కట్టెలేని గొడ్డలి యేమి చేయఁగలదు? ఇది దాయాదుల లక్షణము.

ఆ. గోవులందు భాగ్య ♦ గుణ మది నైజంబు, విప్రులందు దమము ♦ విశ్రుతంబు
స్త్రీస్వభావగుణము ♦ చిత్తచాంచల్యంబు, జ్ఞాతి కెడరు సేఁత ♦ సహజగుణము.

అర్థములు. భాగ్య గుణము = తమ్ము మేపువారికి నైశ్వర్యము గలిగించు గుణము-పాలు పెరుఁగు నెయ్యి మొదలైనవి యిచ్చి యని భావము, దమము =

ఇంద్రియ నిగ్రహంబు - చిత్తచాంచల్యంబు = చపలచిత్తము-ఎడరు సేఁత = కీడు సేయుట.

తాత్పర్యము

గోవుల స్వభావ మైశ్వర్యము నిచ్చుట-బ్రాహ్మణుల స్వభావము ఇంద్రియ నిగ్రహము, చపలచిత్తము స్త్రీల స్వభావము, కీడు సేయుట జ్ఞాతుల స్వభావము.

క. కావున లోకము నను సం,భావించుట నిరుపమాన•భాగ్యము గనుటన్
నే వైరులతలఁ ద్రొక్కుట, నీ వెదఁ జూపోప వైతి•వే సౌమ్యుండా! ౩౦౪

అర్థములు. చూపోపవైతివే=చూడ లేకపోయితివా.

తాత్పర్యము

ఈ కారణములచే నీవు నాకు జ్ఞాతివగుట-లోకులు నన్ను గౌరవించుట, అసమానసంపద నాకు లభించుట. నేను వైరుల తలలపై నెక్కి వారి నవమానించుట చూచి పెద్దమనుష్యుఁడా! సహింపఁజాలకపోయితివిగదా! కావున నా శత్రువులకు నన్ను లోపడచేసి యవమానింపఁ జూచుచున్నావు, ఇది ౩౦౪ పద్యమునఁ జెప్పిన దానికి నన్వయము.

క. అంటియును దామరాకున, నంజని జలబిందు సమితి•యట్టు లనార్యం
బొంటుకొని చేయు స్నేహం, బంటీయంటకయ యుండు•నో రాక్షసుఁడా. ౩౦౫

అర్థములు. ఒంటుకొని=కూడనుండి, అంటీయంటక=తాఁకియుఁ దాఁకక, క్త్వార్థకద్వంద్వంబున నర్థవిశేషంబునఁ బూర్వపదంబునకు దీర్ఘము విభాష నగు, దీర్ఘము రానిచో సముచ్చయ మర్థ్యాహార్యం బొండేనగు సూ.వ్యా.వాక్యా౧౯౦ సూ.

క. "నమ్మమి మృత్యువు పెద్దయు, నమ్ముట యపమృత్యు వగుట నరపతి నమ్మీ
నమ్మక పనిగొనునది ని,త్యమ్మును సూక్ష్మమతిఁ దాన యరయఁగవలయున్,
భార - శాంతి ౪-౩౯౦ ప.

తాత్పర్యము

తామరాకునందలి జలబిందువులు దానిని దాఁకియుండునుగాని, దానిఁ దడుప లేవు, కావున దాఁకకుండిన నెట్లో తాఁకియు నట్లే, తాఁకుటవలనఁ గలుగు గుణము కానరాదు. అట్లులే నీచుఁ డగువాఁడు కలిసిమెలసి చేయుస్నేహము స్నేహఫలము చూపదు. రాక్షసుఁడా! యిది నీచసంబోధనము. నీవు నిజముగ రాక్షసుఁడవే.

క. విను విరులఁ దేనెఁ ద్రోలిన, వెనుక న్మధుపములు వాని • విడిచెడి గతి దు
ర్జనులు తొలిమైత్రిఁ దలఁపరు, పనితీరిన వెనుక నిజము•పలికెద ననుగా! ౩౦౬

అర్థములు. విరులన్ = పుష్పములందు, మధుపములు=తుమ్మెదలు.

తాత్పర్యము

పుష్పములయందుఁ గల తేనె ద్రావి తమ యాకలి దీర్చుకొనిన వెనుక నాతుమ్మెదలా పువ్వునందలి తేనె వలనఁ గదా తమ యాఁకలి దీరె నని తలఁపక

విడిచిపోవునట్లు దుష్టులు తా మెవరివలన బాగుపడిరో వారిని వారితోఁ దమ పని తీరిన వెనుకఁ దలఁపరు. రాక్షసుఁడా! నేను నిజము చెప్పుచున్నాను. నీవునట్టివాఁడవే.

క. మును జలకేళిం దేలియుఁ, దనశిరమునఁ దనకుఁ దాన • తన తొండమునన్
మను వైచుకొనెడు నేనుఁగు, ననువున ఖలమైత్రియును ని•రర్థక మసురా! ౩౦౨

తాత్పర్యము

కొలంకు స్నానము చేసి యొడ్డునకు వచ్చి యేనుఁగు తన నెత్తిమీఁదఁ దానే మన్ను కొట్టుకొనునట్లు దుష్టులతోడి స్నేహము వ్యర్థము – పూర్వస్నేహమును దుష్టులు తామే నాశము చేసికొందురు. నీవు నట్టులు చేయుచున్నావు.

క. శారద వేళల గర్జ ల, పారంబుగ నించి చినుకు • పడ రాలిచియున్
ధారిణి తడియనిగతి ని,స్సారము నిష్ఫల మనార్య•సంగతి యసురా! ౩౦౩

తాత్పర్యము

శరత్కాలమునందు మేఘములు మిగుల గర్జించియు, చినుకులు రాల్చియు నేల తడియక యుండునట్లు నీచుల సంగతి సారహీనము వ్యర్థము.

క. ఈపాటి నన్నుఁ డాడిన, వే పౌర్లదె వాని శిరము • పృథివిని బ్రుదటిలోఁ
బాపాత్మా! కులపాంసన, ఛీ పో నాయెదుట నిలువఁ•జెల్లదు నీకున్. ౩౦౪

తాత్పర్యము

నీవు పలికిన విధముగ మఱియొకఁడు పలికియుండిన వాని తల నిమిషములో నేలమీఁదఁ బొరలియుండదా? నీవు తమ్ముఁడ వని చంపక విడువవలసి వచ్చినది. పాపాత్ముఁడా! కులద్రోహీ! ఛీ. పో. నా యెదుట నీవు నిలువఁదగదు.

ఇది చంపుటకు మాఱుగాఁ జేసిన శిక్ష యని యెఱుఁగవలెను. లక్ష్మణుని రామచంద్రమూర్తి చంపవలసిన వచ్చినపుడు నా యొద్ద నుండవలదు, నిన్ను విడిచితిఁ బొమ్మనెను. (చూ. ఉత్తర ౧౬౦౪ వ పద్యము)

రావణుఁ డిట్టివాఁడని యెఱిఁగియే చావునకు వెఱచి మంత్రులెవ్వరు హితముఁ జెప్ప భయపడిరి.

—• విభీషణుఁడు సభ విడిచి మింటి కెగసి రావణునకు హితముఁదెల్పుట •—

తే. అనుచుఁ బరుషంబులాడుడు•న్యాయవాది, యగు విభీషణుఁడును గదా•
హస్తుఁడగుచు
నలువు రసురులతో వియ•న్మార్గ మెగసి.యలుక శ్రీమంతుఁడన్నతో•ననియెనిట్లు.

అర్థములు. పరుషంబులు = కటుకుమాటలు, వియత్ + మార్గము = ఆకాశమార్గము, శ్రీమంతుఁడు = లక్ష్మీసంపన్నుఁడు.

ఈ విషయమున ఛాందోగ్యోపనిషత్తు ౭ వ యధ్యాయము ౧౫ వ ఖండము రెండవ మంత్రమున నిట్లున్నది. "స యది పితరం వా మాతరం వా భ్రాతరం వా స్వసారం వాచార్యం వా బ్రాహ్మణం వా కించిత్ భృశమివ ప్రత్యాహ ధిక్త్వాస్త్విత్యేవైన మాహుః పితృహా వై త్వమసి మాతృహా వై త్వమసి, భ్రాతృహా వై త్వమసి స్వసృహా

వైత్వమ స్యాచార్యహా వైత్వమసి, బ్రాహ్మణహా వైత్వమసీతి." ఎవఁడైనను తండ్రినిగాని, తల్లినిగాని, తోడఁబుట్టినవానిఁగాని, తోడఁబుట్టినదానిని గాని ఆచార్యునిఁగాని, బ్రాహ్మణునిఁ గాని, ఛీ, పో, యని కఠినముగా మాటలాడెనేని నీవు తండ్రిని జంపినవాఁడవు, తల్లిని జంపినవాఁడవు, సోదరునిఁ జంపినవాఁడవు, తోడఁబుట్టినదానిని జంపినవాఁడవు, ఆచార్యుని జంపినవాఁడవు, బ్రాహ్మణుని జంపినవాఁడవు అందురు. ఈ కారణము చేతనే శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుఁ బ్రత్యక్షముగాఁ జంపఁజాలక నాయొద్ద నుండ వలదు, పొమ్మనెను.

తాత్పర్యము

ఈ ప్రకారముగఁ గఠినముగ రావణుఁడు పలుకఁగా ధర్మమార్గమును జెప్పు విభీషణుఁడు కాలెడి యినుపమీఁద నిలువలేనట్లు చేత గద తీసికొని తన మంత్రులగు నలుగురు రాక్షసులతో నిఁక నీ పాపాత్ముఁ డగు రావణుని నేలమీఁద నడుగు పెట్టరాదని రావణుని పంచప్రాణము లెగిరిపోవుచున్నవా యన్నట్లు లాకాశమున కెగసి కోపముతో లక్ష్మీసంపన్నుఁ డన్నతో నిట్లనెను. అన్నతో ననుటచే రావణుఁడు తన్ను దూషించినను వానియందు భ్రాతృభావము వదల లేదని భావము. కావుననే తాను సర్వము విడిచి తొలఁగి పోవుచు మరల నొకసారి హితముపదేశించుచున్నాఁడు.

శ్రీమంతుఁడు="నెయ్యుర, లంక, సిరిం, ద్యజించితిన్" అని సర్వము వదలి యింటికైనఁ బోక యెట్లున్నవాఁ డట్లు రామునియొద్దకుఁ బ్రయాణమైన వాఁడు శ్రీమంతుఁడని వాల్మీకి చెప్పెను. ఇప్పుడు విభీషణుఁడు శ్రీమంతుఁ డనుటచే నింత వఱ కాయన దరిద్రుఁడే యని వాల్మీకి యభిప్రాయము. ఇంతవఱకు నిల్లు, వాకిలి, ధనము, ధాన్య మున్నను నవి నశ్వరములు గావున విభీషణుఁడు దరిద్రుఁడే. ఇప్పుడు శ్రీరామచంద్ర పాదారవిందసేవాలక్ష్మి లభించెను. కనుక శ్రీమంతుఁ డయ్యెను. ప్రతికూల సాంగత్యము వదలుటయేగాక రామచంద్రమూర్తియందుఁ బ్రేమజనించుటకంటె లక్ష్మీప్రాప్తిమఱియేదిగలదు.నిజమైననిత్యమైనశ్రీభగవత్ప్రాప్తియే సోపాధిక బంధుల విడుచుట - నిరుపాధికబంధు వగు భగవంతు నాశ్రయించుట భాగ్యహీనులకు లభించునా? ఇట్టులే యరణ్యమునకు రాముని వెంట బయలుదేఱిన లక్ష్మణుని వాల్మీకియు, శ్రీ భాగవతమున కృష్ణపాదారవిందతాడితుఁడైన కాళీయుని వ్యాసులును శ్రీమంతు లని చెప్పిరి.

ఈ విభీషణుని చర్యవలన భగవద్విషయ మైన హితవాక్యములు వినక కేవలము ప్రతికూలభావము గలవార లెట్టి విడువరాని బంధువులైనను కాలుచున్న యింటివలె విడువనలయు ననియు, భగవద్భాగవతద్రోహు లున్న చోటఁ బ్రసన్నుండక తొలఁగి పోవుట యావశ్యక మనియు నేర్పడుచున్నది. ఇదియొక విధమైన ప్రతికూల్య వర్జనము.

ఉ. అన్నవు నీవు రాజ వటు • శాటను నిచ్చకొలంది పల్కు మే
చెన్నన నైన మాన్యుఁడవు • జ్యేష్ఠుఁడవు న్పితృసన్నిభుండవ
ట్లున్నను ధర్మమార్గమున • నుండమి నీ యనృతంబులుం గడుం
బన్నము దెచ్చు నిష్ఠురపుఁ•బల్కులు సైపఁగ లే నొకింతయున్. ౩౧౧

అర్థములు. పితృసన్నిభుండవు=తండ్రితో సమానుఁడవు, అనృతంబులన్=అసత్యవాక్యములను, నేను శత్రుపక్షము వహించి వారికి వశుఁడనై నీ కీడు కోరి నీకవమానము గలిగింప నాలోచించితినని నీవు చెప్పినవి యనృతంబులు,బన్నము=అవమానము.

తాత్పర్యము

నీవు నా కన్నవు గావునఁ బెద్దవాఁడవు. తండ్రితో సమానుఁడవు. కావుననే నేను నీకు నెదురు చెప్పరాదు. అందు రాజవు. బంధువు కాకపోయినను కేవల రాజవని చూచినను నీ కెదురాడరాదు. కావున నీ యిష్టము వచ్చినట్లు నీవు మాటలాడ వచ్చును. అయినను నీవు సీతను దొంగిలించి తెచ్చి యధర్మకార్యము చేసితివి. నేను శత్రువులకు లోపడి నీకుఁ గీడు గలిగింప నీ కీ మాటలు చెప్పితినని యంటివి. ఇవి యసత్యములు. అధర్మమందు, నసత్యమునం దుండు నీవు ధర్మము, సత్యము నాధార పరుచుకొనియుండు నన్ను సభలో నవమానించి పలికితివి. ఆ యవమానమును నేను సహింపఁజాలను. ఈ మాటలు పడియు నం దుండెనేని వానిని సత్యపఱిచినట్లే కదా యగును.

క. హితకాముఁడ నై నీకును, వితతముగ సునీతివిధము • వినిపించితి నీ
మతి కెక్కదు కాలవశా, గతుఁ డకృతాత్మకుఁడు హితముఁ గ్రహియించునొకో.

అర్థములు. హితకాముఁడనై = మేలుఁగోరినవాఁడనై,వితతముగన్=విపులముగ, సునీతి పథము = మంచినీతి మార్గము, నేను జెప్పినది యుక్త రాజనీతి మార్గమే కాదు. ధర్మముతోఁ గూడి యిహపరసాధకమైన నీతిమార్గము. ఎక్కదు=నీ మనస్సునకు సరిపడినది కాదయ్యె. కాలవశాగతుఁడు=మృత్యువునకు వశపడినవాఁడు.అకృతాత్మకుఁడు=మనస్సు కామమునకు వశపడి తన వశమున లేనివాఁడు.

తాత్పర్యము

నీ మేలుగోరువాఁడనై విపులముగఁ జెప్పవలసిన యన్నివిధముల నిహపర సాధన మైన మంచి నీతిమార్గముఁ జెప్పితిని. అది నీకు మనస్సున కెక్కలేదు. ఏలయందువా? నీ మనస్సునఁ గామ మెక్కియున్నది. కావున నందు నీతియొక్కట కెడము లేదు. అదియునుగాక నీవు మృత్యుదేవతకు వశపడియున్నాఁడవు. అది దాని కనుకూలముగ నిన్నుఁ బ్రవర్తింపఁ జేయునే కాని, మఱియొక విధముగ నడవనిచ్చునా? హితము విననిచ్చునా?

క. అనయము ప్రియవాక్యంబుల, ననియెడి జను లెందు సులభు♦ల ప్రియ మయ్యున్
గనఁ బథ్య మైన సూక్తిని, ననువాఁడును వినెడివాఁడు♦నగు దసురేంద్రా! ౩౧౩

అర్థములు. ఈ పద్యము మారీచుఁడు చెప్పినదే. (అరణ్య. ౫౭౬ వ.చూచునది) అందు ౫౯౦ వ పద్యము నందు విభీషణాదుల నడిగి చూడు మనియు మారీచుఁడు చెప్పెను. మారీచుఁడు చెప్పినప్రకారము జరిగినది. తక్కినది జరుగఁ గలదని రావణునకుఁ దోఁపఁ జేయుటకై విభీషణుఁడు మారీచుని వాక్యములనే యనువదించెను. మారీచుఁడు నీకు హితము చెప్పినను దుదకు నీ యిష్టప్రకారము వర్తించి చచ్చెను. నీ యభిప్రాయప్రకారము పోవు నీ యందఱ గతియు నంతే కాఁగలదు. నీవు చెప్పినట్లు విని యధర్మపక్షము వహించి చావ నొల్లను గావున నీవు చెప్పినట్లు వెడలిపోయెదను.

లోకములో నీ మంత్రులు నీకుఁ జెప్పునట్టు లిచ్చకములు చెప్పెడివారు పెక్కురుగలరు. అప్రియ మయ్యును పథ్యముగ చెప్పెడువాఁడు మారీచునివంటి వాఁడు, నా వంటివాఁడు అరుదు. ఒకవేళ మావంటివారు కొందఱు చెప్పెడి వారున్నను వినెడివాఁ డుండఁడు. దానికి నీవే నిదర్శనము.

ఉ. కాలెడుగేహము న్విడువఁ♦గా మన సొప్పనిభంగి సర్వభూ
తాళి వినాశహేతు వగు ♦ నంతకుపాశము చేతఁ జిక్కు ని
న్నాలము సేయ నొల్ల, నవ♦హాటకపుంఖము దీప్తపావకా
భీలము రాఘవాశుగము ♦ పృథ్వి నినుం గన నొల్లఁ గూల్పఁగన్ ౩౧౪

అర్థములు. ఆలము = ఉపేక్ష, నవహాటకపుంఖము=క్రొత్త బంగారు పింజ గలది. దీప్తపావకాభీలము=మండుచున్న యగ్నివలె భయంకరము, రాఘవాశుగము=రామబాణము.

తాత్పర్యము

లోకమునందుఁ దన యిల్లు కాలుచుండుట చూచి యిఁక దీనితో మనకేమి పని వదలి పోదమని యెంచక ఆ మంట చల్లార్చి మరల దానినే చక్కఁజేసికొనుట చూచుచున్నాము. దీనికి మన లంకలోఁ గొంపలు కాలినవారే దృష్టాంతము అట్లులే నేను కొంప కాలకముందే హెచ్చరికపడుట బాగని తలఁచి లంకయందలి సమస్తజనులు నీవు యమపాశములకుఁ బాలుపడుట సహింపలేక ముందుగనే హెచ్చరించితిని. ఇదియే నా దోషము. ఏల ముందుగా జెప్పెద వనిన బంగారు పింజలు గలిగి మండెడు మంటవంటి రామ బాణములు నిన్ను నేలబడఁగొట్టఁగాఁ జూచి సహింపలేక చెప్పితిని.

క. వాలుమగ లేని కడు బల, శాలులునే నస్త్రశస్త్ర♦చతురులు నైనం
గాలుని చేఁ జిక్కిన తఱి, వాలుక సేతువులు పోలెఁ ♦ బస చెడుదు రిలన్. ౩౧౫

అర్థములు. వాలుమగలు = శూరులు, వాలుకసేతువులు = ఇసుకతోఁ గట్టిన యానకట్టలు, పన చెడుదురు=నిస్సారమై పోవుదురు.

తాత్పర్యము

ఎంతటి శూరులైనను, మిగుల బలవంతు లైనను, అస్త్రశస్త్రములందు నిపుణు లైనను మృత్యువుచే చిక్కిన సమయంబున నేటికిఁ గట్టిన యిసుక యాన కట్టవలె నిస్సారమైపోదురు.

నీవు శూరుఁడవే, నీ మంత్రులు కుంభకర్ణాదులు బలవంతులే, ఇంద్రజిదాదులు అస్త్రశస్త్రసంపన్నులే గాని మృత్యువుచేతఁ జిక్కిరి. కావున మీ గట్టితనము వ్యర్థము.

ఉ. అన్నవు నీ వటంచు హిత ♦ మార వచించిన యట్టి నా నుడుల్
మన్నన సేయవైతి, విఁక ♦ లంకను రాక్షససంఘ యుక్తమున్
నిన్నును లెస్స కాచుకొని ♦ నెమ్మది నుండుము, స్వస్తి నీ కగున్,
నన్నెడఁబాసి సౌఖ్యము ఘ ♦ నంబుగ నందుము, పోయి వచ్చెదన్. ౩౧౬

తాత్పర్యము

నీవు నా కన్నవని నీ మేలుకోరి చెప్పుట నాకు విధి యని నేను జెప్పిన మాటలు నీవు గౌరవింపకపోయితివి. నా మాట లాదరింపకపోవుట యటుండ నేను పామని, శత్రువని, నా సహవాసము నీకపాయకర మని నన్ను వెడలిపొమ్మని చెప్పితివి. అట్లే పోయెదను. ఇఁక నన్ను విడిచి రాక్షసులతోడ లంకను, నిన్నుఁ జక్కఁగాఁ గాచుకొని నిర్విచారముగ నుండుము. నీకు మే లగును గాక. నీ వెట్లైన బాగుపడుటే కదా నేను గోరునది. కావున నే వేళ కీ పాము నిన్నుఁ బీకి చంపునో యను భయము వదలి సుఖముగా నుండుము.

క. హిత మెంచి యెంత చెప్పిన, మతి కెక్కఁగ నీవు నాదు ♦ మాటలు నీవున్
హితసూక్తులు రుచియించునె, గతజీవితు లగు పరీత ♦ కాలుర కెందున్. ౩౧౭

అర్థములు. గతజీవితు లగు = అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు సు. వ్యా. వాక్య. ౪౧ సూ. ప్రాణము పోనున్న వారగు - పరీత కాలురకు=మృత్యువు సమీపించిన వారికి.

తాత్పర్యము

నేను నీ మేలు కోరి యెంత చెప్పినను నా మాటలు నీవు మనస్సునకుఁ బట్ట నీయవు. మృత్యువు సమీపించి ప్రాణము పోవ సిద్ధముగానుండు వారికి హిత వాక్యములు రుచించునా?

రావణాసురుఁడు చేసిన తెలివితక్కువ కార్యములలో నెల్ల విభీషణుని విడుచుట పెద్ద దనవచ్చును. కేవల కామ క్రోధములకు వశుఁడై నా యభిప్రాయమున కొకఁ డెదురు చెప్పువాఁడా యను దురహంకారముచే విభీషణుఁ దిరస్కరించెను.

ఆటుచేయక విభీషణా, యిది యందఱకు సంబంధించిన కార్యము గనుక నందఱి యభిప్రాయముఁ దెలియఁగోరి సభ చేసితిని. అందఱు నొక మాటగా నన్నారు. నీ వొకఁడవే మఱియొక విధముగ నన్నావు. పదుగురు చెప్పినట్లు పోదునా నీ వొకఁడవు చెప్పినట్లు పోదునా? నీవు నా మేలు కోరినట్లు వీరందఱు నా కీర్తి సౌఖ్యములు గోరువారే కదా. నిన్నొక్కనిఁ బురస్కరించుకొని యందఱి యభిప్రాయము నెట్లుపేక్షింతును. కావున మేలో, కీడో నీవు నేను బదుగురు పోవు త్రోవఁ బోదమని శాంతితోనే చెప్పియుండవచ్చును. గర్వాంధకారము కన్నులఁ గప్పియుండఁగా, మృత్యుదేవత తలవెంట్రుకలు పట్టి యీడ్చుచుండఁగా సౌమ్య మార్గమెట్లు స్ఫురించును? రావణుఁ డిట్లు చెప్పియుండెనేని విభీషణుఁడు శత్రు పక్షమునఁ జేర సాధ్యపడియుండదు. ఒక వేళ పోయినను నన్నవమానించి పొమ్మనుటచే వచ్చితి నని చెప్ప నోరు వచ్చియుండదు, విరోధమునకుఁ గారణముండదు. పదుగురిలో నవమానించుటచేఁ గదా శత్రువయ్యెను.

ఫాల్గున బహుళమునఁ బాడ్యమి సాయంకాలము రామచంద్రమూర్తి సముద్రతీరమునఁ జేరెను. ఇది విదియ యుదయమున జరిగిన వృత్తాంతము.

౧౭-వ సర్గము విభీషణుఁడు నలువురుమంత్రులతో శ్రీరాముఁ డున్న చోటికిఁ బోవుట.

క. అని పరుషం బగు వాక్యము, వని ఖలు రావణుని రావ • ణానుజుఁ డా వెం
టనె వచ్చె సలక్ష్మణుఁడౌ, జనకసుతానాథుఁ డున్న • స్థలమున కంతన్. ౩౧౮

తాత్పర్యము

ఈ ప్రకారము కఠినవాక్యములు చెప్పి దుష్టుఁడైన రావణుని విడిచి రావణానుజుఁడైన విభీషణుఁడు లక్ష్మణుతోడ నుండు సీతాపతియు రామచంద్ర మూర్తి యున్నచోటికి వచ్చెను.

ఈ క్రింది విషయము గోవిందరాజీయము నుండి సంగ్రహింపఁ బడెను. "అనుకూలస్య సంకల్పః ప్రాతికూలస్య వర్జనం । రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వ వరణం తథా । ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతి" యన్నట్లు శరణాగతి యనెడి యుపాయమునకు నంగము లాఱు. అందు భరసమర్పణము ప్రధానము – తక్కినవి తద్గుణంబులు–అందు ఆనుకూల్య సంకల్పమును, ప్రాతికూల్య వర్జనమును శరణాగతిననుష్ఠింపఁబోయెడి విభీషణునియెడఁ గల వని ఈతొమ్మిది సర్గములందును జెప్పుచువచ్చెను. రామ పరాక్రమమును బలుమాఱుపన్యసించుటచేత నీయుపాయమునందు విభీషణునకు మహావిశ్వాసము కలదనియు నీసర్గములందే సూచితము. ఇక రక్షకునికి వేగిరము కృప కలిగించెడి యాకించన్యనివేదనమును(తాను గత్యంతరము లేనివాఁడని తెల్పుకొనుట)ప్రధానమైన శరణాగతి స్వరూపమును నీసర్గమందు జెప్ప

చున్నాఁడు. అందు మొదటిపద్యమందు రావణుఁడు తమ్ముఁ దిరస్కరింపనిట్టి దుర్మార్గుని దేశము తనకు వాసార్హము కాదు, సర్వథా పరిత్యాజ్య మనియుఁ బరమధార్మిక శ్రీరామాశ్రయమే కర్తవ్యమనియు నిట్టిధర్మబుద్ధి ధార్మికుఁడై నవిభీషణునికి జనించెఁ గదా యని కవి యాతనిని స్తోత్రము చేయుచున్నాఁడు. అని యిట్లు 'రామునకున్ సీత నిమ్మ' అని కర్తవ్యకార్యము మిక్కిలి సులభమైనదనియు అట్లు చేయనిచో 'రామకాండము లసురస్తోమములతలలు ధరఁబడ ద్రొబ్బునదము'అని ప్రత్యవాయము కలుగుననియు, అను నీప్రకారముగా ఈ 'అనికిఁ' బై 'యని' తో నన్వయము. పరుషంబు=భార్యలతోఁ గూడియున్నవారికి సుఖకరమైన మందమారుతము భార్య నెడఁబాసిన వారికి దుఃఖకరమైనట్లు విభీషణుని హితోపదేశము రావణునికిఁ దన యజ్ఞానదోషముచేతకఠినమైనది. వాక్యమును, వక్తవ్యములైన సర్వహితములును నిందుఁ బరిపూర్ణములైయున్నవి-అని విభీషణుఁడు ఎవరికెప్పు డేది హితమో యది తెలిసియుండియు సోదరుఁడై యుండియుఁ గష్టదశలో నన్న తన యన్నను వదలి పెట్టి పోయెనుగదా యనెడి యపకీర్తి తనకు రాకుండునట్లు వలసినంత మట్టుకు చెప్పి విభీషణుని హితోపదేశము రావణునికిఁ బరుష మగుటకుఁ గారణములను జెప్పుచున్నాఁడు. ఖలుని రావణుని=తాను దుర్మార్గుఁడు కాన నితరులుబలవంతులు దుర్బలులను విచారములేక యందఱ నేడ్పించువాఁడు కాఁబట్టి యట్టివానికి శత్రు బలవర్ణనము పరుషముగాక మఱెట్లుండుననిభావము. రావణానుజుఁడు=ఇట్టి దుర్మార్గుని తమ్ముఁడయ్యును విభీషణుఁడు సత్వగుణాధికుండు కాన సర్వవిధములహితోపదేశము చేసె నని కవి విభీషణుని స్తోత్రము చేయుచున్నాఁడు. హితోపదేశమందుఁ బెద్ద చిన్న లక్కఱలేదు. పెద్దవారు చిన్నవారికివలె జిన్నవారును బెద్దవారికి హితముపదేశింపవచ్చును. ఇందు జ్ఞానాజ్ఞానంబులే ముఖ్యము. 'పితౄనధ్యాపయామాస శిశు రాంగిరసః కవిః। పుత్రకా ఇతి హోవాచ, జ్ఞానేన పరిగృహ్య తాన్ ।అజ్ఞంహి బాలమిత్యాహుః। పితే త్యేవ చ మంత్రద' మ్మను మనువాక్యమిా యర్థమందుఁ బ్రమాణము. ఆ వెంటనె వచ్చె = 'వరం హుతవహజ్వాలాపంజరాంతర్వ్యవస్థితిః । న శౌరి చింతావిముఖ జనసంవాద వైశస'మ్మన్నట్లు విభీషణునికి రావణ గృహవాసము మండెడి నిప్పులోనడుగుపెట్టినట్లుండెననియు, మొదపలుపు విచ్చిన దూడ తన తల్లి యొమ్ము చేపుటకై యొక్కడను జాగుచేయక పరుగెత్తుకొని వచ్చినట్లంత వేగముగా విభీషణుఁడు రామునిసన్నిధికివచ్చె ననియు దీనిచేత సూచితము. విభీషణుఁడు తనకు రావణసభయందుఁ జోరవ లేనప్పుడు రామసన్నిధానమే స్వగృహమని తలంచినాఁడు. కాన కవి — విభీషణుఁడు రామ సన్నిధానమునకుఁ బోయె నని చెప్పక, వచ్చెనని చెప్పెను. స్వగృహమునకు వచ్చెను, పరుల గృహమునకుఁ బోయె ననిగదా లోకరూఢి. సలక్ష్మణుఁడు (1) రామునికి లక్ష్మణుఁడు వ్యావర్తక విశేషణము. (2) పురుషకారసాన్నిధ్య మిా పదము చెప్పు

ననియు నగును. జనకసుతానాథుఁ డున్న స్థలమునకున్ = రామునికంటెను రామ నివాసదేశ మత్యంత ప్రాప్యమని సూచితము. ఈ పద్యము నందు భగవంతుని విరోధించుకొను వారిదేశమును వదలివేయవలె ననియు భగవత్సంబంధము గల దేశమే వాసార్హ మనియు సూచితము. అందును అట్టి భగవత్సంబంధమును భాగవతాభిమానపాత్రము కాదేని 'సా కాశీతి న చాకశీతి' యన్నట్లు పరిత్యాజ్యమే యనియు, భాగవతాభిమానపాత్రమై భగవత్సంబంధముగల దేశమే జనులకుఁ బ్రాప్యమనియు సలక్ష్మణుఁడను శబ్దముచేత సూచితము.

విభీషణుఁడు బ్రహ్మవిశ్రవస్సు మొదలగు మహర్షియుల యపారకరుణచేత సకల ధర్మముల నెఱిఁగినవాఁడు. అంతియకాక 'విభీషణస్తుధర్మాత్మా' యని యచ్చటచ్చట విశేషించి పొగడఁబడిన వాఁడు. రావణుఁ డన్ననో 'జ్యేష్ఠభ్రాతా పితృసమ' యన్నట్లు విభీషణునికిఁ దండ్రివలె సేవింపఁ దగినవాఁడు. మఱియు విభీషణునికి బాల్యమునుండియు బోషకుఁడు. అంతేకాక శత్రువు లిపుడు రావణుని పై పడ దండెత్తి వచ్చియున్నారు. ఇట్లుండఁగా నింతటి ధర్మాత్ముఁ డైన విభీషణుఁడు తన కింతటి మహోపకారియైన రావణుని నింతటి మహా విపద్దశలో క్షుద్రబుద్ధివలె వదలిపెట్టి పోవుట యుక్తమా? వదలెనుబో నేరుగా వానితల తఱుగవలె నని యున్న రామునొద్దకా పోవలెను. పోయెనుబో, రావణుని రాజ్యము తనకు వచ్చునట్లు చేయవలె నని రాముని వేఁడుట యుక్తమా? వేఁడెనుబో, రావణుఁడు చచ్చుటకుఁ దగిన యుపాయములను రామునికి జెప్పుట యెంతయుఁ దగదు. అను నీయాక్షేపణములు విభీషణునిపై గలుగవచ్చును. కాని "గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే" "కార్యం భవతి శాసనమ్" అన్నట్లు తప్పులకుఁ బుట్టినిల్లైయున్న రావణుని వదలిపెట్టుట విభీషణునికి దోషము కాదని సంక్షేపముగఁ గొందఱు సమాధానము చెప్పుదురు.

శ్రీ వేదాంతాచార్యులవారు ఈ యాక్షేపణములకు విస్తరించి సమాధానము చెప్పియున్నారు. అదెట్లనగా:— విభీషణుఁడు బ్రహ్మయిచ్చిన వరము ప్రకారము గొప్ప జ్ఞానసంపన్నుఁ డగుటచేత సర్వవేదాంత వేద్యుఁడై, సర్వలోకేశ్వరుఁడై, సర్వలోక శరణ్యుడై, ముక్తప్రాప్యుఁడై, బ్రహ్మమైన, శ్రీమన్నారాయణుఁడే లోకోజ్జీవనార్థమై శ్రీరాముఁగా భూమిపైనవతరించియున్నాఁడని నిస్సందేహముగఁ దెలిసికొని యున్నాఁడు. ఇట్టి విశేషజ్ఞానము గల విభీషణునికిఁ దా ననుష్ఠించు ధర్మములలో సామాన్య విశేషములను బరీక్షించి విశేషధర్మముతో విరోధించు నపుడు సామాన్యధర్మము వదలి విశేషధర్మము మాత్ర మనుష్ఠించుటయు, అట్లు విరోధము లేనపుడు రెంటి ననుష్ఠించుటయు నిట్టివి కర్తవ్యములు – అట్లుగాన సీతనికి నన్న ననుసరించియుండుట సామాన్య ధర్మము – పరమాత్మ యగుఁ శ్రీరాము ననుసరించి యుండుట విశేషధర్మము – యజ్ఞాదులు తాము సాక్షాత్తుగా

ప్రధాన పరమాత్మారాధనములు గాక ప్రధాన పరమాత్మారాధనమున కంగములైనట్లు ఫలాభిలాష లేని జ్యేష్ఠానువర్తనమును బరమాత్మారాధనాంగమై, యప్రధానమైన సామాన్య ధర్మము. రామానువర్తన మట్లుగాక తానేపరమాత్మారాధన మగుటచేతఁ బ్రధానమైన విశేష ధర్మము. ఈ సామాన్య విశేష ధర్మములకు విరోధముండిననే తప్పనితర సమయములందు నీ రెండును ననుష్ఠేయములే కాబట్టియే విభీషణుఁడు ఈ రెంటికిని విరోధము కల్పించి రెంటిని ననుష్ఠింపఁ దలఁచి రావణునికి వలసినంతమట్టుకు హితోపదేశము చేసెను. రావణుఁడు రామునికి లోఁబడినచోఁ దనకు రామరావణోభయానువర్తనమును దటస్థించు నని విభీషణుని తలంపు గాని యసురస్వభావుఁడైన రావణుఁడు రామునిపై వైరమును దృఢముగా మనస్సున నుంచుకొని విభీషణుని హితోపదేశము నేమాత్రమును వినఁడయ్యెను. విభీషణుఁడు దీనిని జూచి రామవిరోధియైన రావణుని దానను సరించి యున్నచో రావణునివలెఁ దనకును రామవిరోధము తప్పదు. ఇది మహానర్థకరము అని యెంచి "వరం హుతవహ జ్వాలా" యను న్యాయప్రకారము దుర్మార్గుఁడైన యీ రావణుని సాంగత్యము వదలి విశేషధర్మమైన రామసేవనే యనుష్ఠింపఁబోయెను. కాఁబట్టి యిందేమి తప్పు నిరూపింపఁడను.

ఇంతవఱకు నుపకరించిన రావణుని వదలి రాజ్యాపేక్షచేత రాము నాశ్రయించుట విభీషణునికి కృతఘ్నత కాదా యనియు నాక్షేపించ రాదు. విభీషణుఁడు రాజ్యాపేక్షచేత రాముని నాశ్రయించినట్టు లెచ్చటను జెప్పియుండలేదు. విభీషణుఁడు తన్ను రామునికిఁ దెలిపి కాపాడవలె నని వానరులను వేఁడుకొను నపుడు "ఆలుబిడ్డలను ద్రోపిడి యియ్యెడ రామచంద్రునిన్ శరణము చొచ్చినాఁడ" నని తన కున్న వైరాగ్యము స్పష్టపడునట్లునొక్కి చెప్పియున్నాఁడు. ఇట్లే విభీషణుఁడు శ్రీరాముని చరణంబుల పైఁబడి తన్ను నివేదించుకొనునపుడు 'నిను శరణంబుఁజొచ్చితిని, నెయ్యుర లంకసిరిం ద్యజించితిన్। మనుజవరా! భవద్గతము మత్సుఖ జీవిత రాజ్యభోగముల్' అని తనకు రాజ్యాదులపై నభిలాష లేదనియు రాముని పాదసేవయే తనకు సకలవిధ పురుషార్థము లనియుఁ జెప్పియున్నాఁడు. దీనిని బట్టి చూడఁగా విభీషణుఁడు రాజ్యమునకై రాము నాశ్రయింపలేదనుట స్పష్టము. 'వినుమా రావణుఁ బుత్ర మిత్ర సచివాన్వితున్ ... ప్రాణాన న్వీడం జుమ్మీ నిన్ననఘా. కట్టెద పట్టమయ్యసురరాజ్యశ్రీకి సత్యంబుగన్" అని రాముఁడు విభీషణునికి రాజ్య మిచ్చినట్లు చెప్పుటయు విభీషణునిపై రామునికిఁ గల్గిన నిరతిశయప్రీతి కొక్క యానుషంగిక ఫలమని యెఱుఁగునది. 'ఆయురారోగ్య మర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్। దదాతి ధ్యాయతాం నిత్య మపవర్గప్రదో హరి' యని యనన్య ప్రయోజనులై తన్నాశ్రయించిన వారికి భగవంతుఁడు సకల పురుషార్థంబుల నిచ్చునని చెప్పఁబడెను గదా, ఇంత మాత్రమే తప్ప విభీషణుని కేమాత్రమును రాజ్యాభిలాష లేదు. "తానును రాజ్యము

వేడుపొంటె నీ, తామహితేశనీయెడకుఁ దారసిలెన్మతిపూర్వకంబుగన్" అనిహను మంతుఁడును 'స్థిరమతి రాజ్యకాంక్షఁ జనుదెంచిన వాఁడగు' నని శ్రీరాముఁడునుసుగ్రీవునితోఁ జెప్పుట, విభీషణుని జేర్చికొంటిమేని రామునికేమికీడుకలుగునో యని భయపడియున్న పరమ భక్తుఁడైన సుగ్రీవుని యజ్ఞానముతీరుటకై లోకసిద్ధమైన రాజనీతి ప్రదర్శనమే కాని వాస్తవ విభీషణాభిప్రాయముగాదు. 'అంతరంగబహిరంగయో రంతరంగం బలీయ'యని యొక న్యాయము కలదు. హనుమద్రామవాక్యములకును విభీషణవాక్యమునకు విరోధము కల్గినపుడు విభీషణవాక్యానుసారముగనే తక్కిన వారి వాక్యముల కర్థముచెప్పవలెను. కాని విభీషణాభిప్రాయ మెఱుఁగని యితరుల వాక్యము ప్రకారము విభీషణవాక్యమున కర్థము చెప్పరాదు. విభీషణవాక్య మంతరంగము. తక్కిన వారి వాక్యము బహిరంగము. అంతరంగ బహిరంగములలో నంతరంగము ప్రధానము. మఱియు, 'నిన్న నఘా కట్టెద పట్టము య్యసుర రాజ్యశ్రీకి సత్యంబుగ' నని రాముఁడు చెప్పినమాటకు సరియే యని యొప్పుకొనక 'అనఘశీలమదీయ దేహమునందుఁ బ్రాణములుండు నందనుకఁ జొచ్చెద శత్రుసేన నితాంత సాహ్యమొనర్తులం, కను వినాశ మొనర్చ రాక్షసకాండముం బరిమార్పఁగన్' అని తాను రామునికిఁ జేయు పరిచరణమునే చెప్పుకొనియున్నాడు. దీనిని జూచినను విభీషణునికి రాజ్యాభిలాష లేదనుట స్పష్టము. విభీషణుని కిష్టములేకున్నను రాముఁడు బలాత్కరించి రాజ్యము నిచ్చిన ట్లుత్తరకాండమునందుఁ జెప్పియున్నది. "యావత్ప్రజా ధరిష్యంతి తావత్త్వం వై విభీషణ! రాక్షసేంద్ర మహావీర్య లంకాస్థ స్త్వం ధరిష్యసి॥ శాసితస్త్వం సఖిత్వేన కార్యం తే శాసనం మమ। ప్రజాస్సంరక్షధర్మేణ నోత్తరం వక్తుమర్హసి" యని యచ్చటి వాక్యము. ఇట్లు విభీషణుఁడనన్య ప్రయోజనుఁడై శ్రీరాములవారి నాశ్రయించినవాడు గనుకనే శ్రీరాముఁడును దన కులధనమైన శ్రీరంగనాథుని నితనిచేతనే వేంచేపు చేసియిచ్చెనుగాని మఱెవ్వరిచేతను నియ్యలేదు. విభీషణునికి స్వయముగా రాజ్య మిష్టముకాకున్నను ధర్మసంస్థాపనార్థమై యవతరించిన శ్రీరాములవారి యాజ్ఞను మీఱఁగూడదు కాన వారి యాజ్ఞానుసారమై శేషించిన రాక్షసులను ధర్మమార్గమునఁద్రిప్పి రక్షించుటకుఁగా రాజ్యము తా నంగీకరించెను. ఇదియు శ్రీరాములవారియాజ్ఞానువర్తనమై కైంకర్యములలో నంతర్భవించుటచేఁదన స్వరూపానురూపమని విభీషణుని తాత్పర్యము సకలధర్మముల జిక్కఁగా నెఱిఁగినట్టి లక్ష్మణుఁడును, 'అహం తావన్మహారాజ పితృత్వం నోపలక్షయే' భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవ' యన్నట్లు కర్మకృతపితృత్వసంబంధముగలదశరథుని వదలిపెట్టి నిరుపాధికసకలవిధబంధువైన శ్రీరాము నాశ్రయించి 'అగ్రతస్తే గమిష్యామి పంథాన మకుతోభయం। అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చ తే' యని శ్రీరామపరిచరణమే ఫలముగాఁ బ్రార్థించియున్నాడు. 'సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందన' యన్నట్లు శ్రీరాములవారిని శరణుఁ జొచ్చియు

నున్నాఁడు. అట్లుగనే శ్రీవిభీషణుఁడును కర్మకృతభ్రాతృత్వసంబంధముగలరావణా సురుని వదలిపెట్టి స్వాభావిక సకలవిధబంధువైన శ్రీరామునిఁ గైంకర్యాపేక్షచేతనే యాశ్రయించినాఁ డనుట దృఢము. కాఁబట్టియే "సతు నాగవర శ్శ్రీమా"ననియు 'లక్ష్మణో లక్ష్మి సంపన్న' యనియుఁ బొగడినట్లు విభీషణుఁడు రావణునిఁ బరిత్య జించి రాము నాశ్రయింప బయలు దేఱు వపుడును 'నలుపు రసురులతో వియన్మార్గ మెగసె|యలుక శ్రీమంతుఁడన్నతో ననియె నిట్లు' శ్రీమత్పదము చేత స్తోత్రముచేసెను. కాఁబట్టి విభీషణుని యెడ నధర్మాక్షేపణ మే మాత్రమును జేయరాదు. శ్రీరామ లక్ష్మణులు నాగపాశబద్ధులై యున్నప్పుడు వారికష్టమునుజూచి విభీషణుఁ డేడ్చుచు 'ధీరుల నేరిఁ జేరితిఁ బ్రతిష్ఠను గోరి నరేంద్రు లిద్ద ఱీ తీరున మిత్తిగూరెడి గతిం బడినారిఁక నేను మన్గడన్, గూరియుఁ జచ్చినట్లయితిఁ గుంఠితరాజ్యమనో రథుండనై కోరికయుం బ్రతిజ్ఞ సమకూఱె దశాస్యున కేమి పాపమో" యని తనకు రాజ్యము లభింపక పోయెఁగదా యని దుఃఖించి యున్నాఁడు. విభీషణునికి రాజ్యాభిలాషయే లేనిచో నీ మాట యెట్లు సమంజసమగు ననియు నాక్షేపింపరాదు. ఈ పద్యమునందు ప్రతిష్ఠ యనఁగా రామకైంకర్య ప్రతిష్ఠ యని యర్థము - అకుంఠితరాజ్యమనో రథుండనై యనఁగా "మనుజవరా, భవద్గతముమత్సుఖ జీవితరాజ్యభోగము" లన్నట్లు నే నపేక్షించిన కైంకర్యసామ్రాజ్యము లభింపక పోయెఁగదా యని భావము - ఆ సమయమునన సుగ్రీవుఁడు "అల్లన లంక నీవ యేలెదు। తనయులతోఁ గనఁడు కాంక్షితము రావణుఁడు' న్నని విభీషణుని నూఱార్చుటయు నాతని యభిప్రాయ మెఱుఁగక చెప్పినమాట యని తెలియునది- కేవల రామసేవార్థమే విభీషణుఁడు శ్రీరాములవారి నాశ్రయించి నాఁడన్న సంగతి 'నీ యానతిఁ గొని చని, యూరూరా యెడలన్ నిలిపి సేనలన్నియును యథా,న్యాయంబుగ విభజించితి, చేయంగల యంత వట్టు చేసితి నధిపా'యని ఈ కాండమున నెనుబది నాల్గవ సర్గంబు నందలి పద్యము చేతఁగూడ స్పష్టమగుచున్నది. కావున విభీషణుని యందెట్టి దోషశంకయు లేదు.

క. మేరుగిరిశిఖరతుల్యా, కారు జ్వలచ్చంచలానిఁకాశు నభస్సం
చారుని ధరణీగతవన,చారిప్రాగ్రసరచయము । సంవీక్షించెన్. ౩౧౯

అర్థములు. విభీషణుడు రావణునివదలి యాకాశమున కెగురునపుడే సుగ్రీ వాది వానరులాతనిని గనిపెట్టిరనుచున్నాఁడు. మేరుగిరి శిఖరతుల్యాకారునిన్=ఎత్తు, లావు,సకలరత్నపరిపూర్ణత,వీనిచేత మేరుశిఖరసామ్యము ఇంతియకాక,విభీషణుఁడు తాను శత్రుపక్షము వదలి మనస్సు కుదుటఁబడి నిశ్చలుఁడై యున్నాఁడనియు, మిక్కిలి ప్రకాశించుచున్నాఁడనియుఁ దాను శ్రీరామునికిఁ బరతంత్రుఁడని తెలుపు నట్లున్నాఁ డనియు మేరుశిఖరసామ్యముచేత వివక్షితములు. ఇట్టి గుణములచేత శృంగతుల్యుఁడైన విభీషణుఁడు రావణుని వదలుటచేత నతనికి శృంగభంగమైన దనియు రాముని సన్నిధికి వచ్చుటచేత నతనికి శృంగలాభమైన దనియు

సూచితము. జ్వలత్ + చంచలా + నికాశున్ = మెఱయుచున్న మెఱుఁగువంటి వానిని = కాంత్యతిశయమునందును, నాకాశ సంచారమునందును మెఱుఁగు దృష్టాంతము. రామభక్తులైన వానరులు తన్నుఁ దమలోఁ జేర్చుకొనరేమో యని భయకంపమును, తాను వారలలోఁ జేరనిచో బ్రతుకుటయే యసాధ్యమని గమన త్వరయు నీ దృష్టాంతమున సూచితములు. అతని నని విశేష్య మధ్యాహార్యము. కాఱుచిచ్చున విశేషతాపముఁ జెంది శీతల హ్రదము వెదకి పోవువానివలె మిక్కిలి యాత్రముతో వచ్చెడి విభీషణుని నభస్సంచారుని నంపీక్షించెను. రావణసభనుండి యాకాశమున కెగురునపుడే యంతదూరముననే చూచెను. ధరణీ......చయము= ధరణీగత=(౧) భూమిపై నెట్టికీడుగాని రాకుండ రక్షింపవలెననిమాత్ర మాజ్ఞప్తులై యున్నను ఆకాశమార్గముగా వచ్చిన విభీషణునిఁగూడఁ గనిపెట్టిరిగదా యని వానర జాగరూకత దీనిచేత సూచితము.

(౨) అచ్చటచ్చటఁ జెట్లపైనున్న వానరులు ఆకాశమున విభీషణునిఁ జూచు నప్పటికి రామునికేమి కీడుకలుగునో యని యెంచి భూమిపైఁదూకి యందఱును రాముని జుట్టుకొనిరని భావము. ప్రాగ్రసరులు=శ్రేష్ఠులు, వీర లింత జాగ్రత్తతో రామునిఁ గాచుచున్నారుగదా యని కవిస్తోత్రము చేయుచున్నాఁడు వనచారిప్రాగ్ర సర శబ్దముచేత. వనచారి ప్రాగ్రసరచయము సంవీక్షించెన్ = ఒక వానరుఁడు చూచి మఱియొకనికిఁ జెప్పఁగ నిట్లందఱకును దెలిసినదనిగాదు, అందఱునేకకాల మందేచూచిరని భావము. ప్రతికూల సాంగత్యత్యాగము మాత్రమేకాక యనుకూల కటాక్ష పాత్రతయు విభీషణునకు లభించెనని యీ పదమునందుఁ జెప్పినట్లాయెను.

తా త్ప ర్య ము

మేరుపర్వతముయొక్క శృంగముతో సమానమైన పొడవైన యాకారము గలట్టియు, ధరించిన యాభరణములచే మెఱయుచున్న మెఱుపుతో సమాన మైనట్టియు, ఆకాశమునందుఁ బయనించి వచ్చునట్టియు వానిని భూమియందుండు వానరశ్రేష్ఠ సమూహములు చక్కఁగా జూచెను.

రాక్షసులే ప్రక్కనుండియైన వత్తురు, వానర నాయకులు కనిపెట్టి యుండ వలయునని రామచంద్రమూర్తి యాజ్ఞాపించి యుండుటచేఁ బదిదిక్కులను బరిశీ లించి హెచ్చరికతోఁ బదిదిక్కులందు జూచుచుండిన వానరశ్రేష్ఠులు విభీషణుఁడు దూరమునందుండఁగనే యతనిఁ జూచిరి.

వనచారి చయము సంవీక్షించెన్=అనుటచే నొకఁడు చూచి మరియొకనికిఁ జెప్పలేదనియు వానరసమూహమంతయు నేకకాలమందే చూచెననియు గ్రాహ్యము. అందఱు నంత హెచ్చరికతో నున్నారని సూచన.

క. తనలో నైదవవాఁడయి, చనుదెంచెడు నతనిఁజూచి ♦ చతురుఁ డసాధ్యుం
డినసుతుఁ డాలోచించుచు, వనచరతతితోడ నిమిషపర్యంతంబున్. ౩_౧౦

అర్థములు. తనతో నైదవవాఁడయి=తాను గాక మఱి నలుగురితోఁ గూడిన వాఁడై, ఆ యయిదుగురిలో నితఁడే ప్రధానుఁడని భావము. తనతో నైదవవాఁడను టచే, తనకు రామచంద్రమూర్తియం దెంతభక్తి, యెట్టి యభిప్రాయము గలదో తక్కిన నలుగురికి నంతటిభక్తియు, నట్టి యభిప్రాయము గలదని భావము. చతురుఁడు=మిగుల సమర్థుఁడు, ఆలోచనమందు, కార్యనిర్వాహణమందు, యుద్ధమందు నేర్పుగలవాఁడు. కనుకనే విభీషణుని జూడఁగనే శత్రువని భ్రమింపక వీఁడెవఁడు? ఏల వచ్చుచున్నాఁడని యాలోచింపఁ గలిగెను. అసాధ్యుఁడు=తిన్నఁ జూచినంత మాత్రముననే వీనిని మనము జయింపలేమని భయపడి వెనుకంజ పెట్టవలసిన రీతిగ నుండువాఁడు, ఆలోచించుచున్ = వీఁ డెవ్వఁడు? వేగులవాఁడా, వేగువాఁడైన పక్షమున మాఱువేషముతో, సౌమ్యవేషముతో రహస్యముగ వచ్చునుగాని యిట్లు బయలు మెఱసి యథాస్వరూపముతో నాయుధధారియై వచ్చునా? రాఁడే - ఇక యుద్ధమునకు వచ్చెనందునా? ఇంత సేనను ఐదుగురు గెలువఁగలరను ధైర్యముతో వచ్చెనా? ఒకవేళ బయలుదేఱునపుడు తోఁపకపోయినను ఇంత సేనను జూచిన పిమ్మటనైన జంకవలయునుగదా! జంకులేక ఱివ్వన పరిచితువలె వచ్చుచున్నాఁడే? కావున వీఁడు యుద్ధమునకును వచ్చువాఁడు కాఁడు. ఈ యిరువురు కాకపోయిన వేఱుకార్య మితని కిం దేమి గలదు అని యాలోచనవిధము. నిమిషపర్యంతము = అల్పకాలము-దీర్ఘకాల మాలోచించు చుండిన శత్రువైనచో వచ్చి మీఁదఁ బడనే పడును. వనచర తతితోడన్ = 'కం. విను మధురాహారంబులు, గొనుటయుఁ బెక్కండ్రు నిదుర గూడిన యెడ మేల్కని యుండుట కార్యాలోచనము దెరువు నడచుటయును జన దొక్కనికిన్' భార - అని యుండుటచే నేను జతురుఁడను, ఒకరితో నే నాలోచింపవలెనా, నాకంటె వీరు బుద్ధిబలము గలవారా - యని రావణునివలెఁ దలఁపక కార్యము చేయుటకు ముందే పలువురతో నాలోచించెను.

తాత్పర్యము

తాను గాక మఱి నలుగురిని దీసికొని వచ్చుచున్న యతనిఁ జూచి కార్య నిర్వాహణమందు నేర్పుగల వాఁడును, అసాధ్యుఁడును నగు సుగ్రీవుఁడు అల్పకాలము వానరులతో నాలోచించెను. ఇట్లాలోచించి,

క. హనుమత్ప్రముఖుల కిట్లను, గనుఁడీ రక్కసులు గొల్వఁగా నల్వురు తన్
మనుజాశనుం డఖిల సాధనములతో మనలఁ జంపఁగ దథ్యము వచ్చెన్. ౩-౨౧

అర్థములు. హనుమత్ప్రముఖులకు = హనుమంతుఁడు మొదలగువారికి - హనుమంతుని పేరు చెప్పుటచే లంకయం దితని హనుమంతుఁడు చూచి యుండ వచ్చును. ఎట్టివాఁడైనది యాయనకుఁ దెలిసియుండవచ్చునని యాయనతో నిట్లనె నని భావము. గౌరవకాలమందు వృద్ధుఁడగు జాంబవంతుఁడు పూజ్యుఁడు. ఆలోచన కాలమందు బుద్ధిసంపన్నుఁడైన హనుమంతుఁడు పూజ్యుఁడు. కావున హనుమంతుఁడు

చెప్పఁబడెను. మనుజాశనుండు = మనుష్యుల భక్షించువాఁడు. ఇట్లనుటచే రామ లక్ష్మణులఁ జంపి తినుటకై వచ్చుచున్నాఁడని భావము. అఖిల సాధనములతో = సర్వాయుధములతో - విభీషణుఁ డొక్క గదతో బయలు దేఱి వచ్చెనని ముందు చెప్పఁబడెను. యుద్ధకాలమందుఁగూడ గదతోనే యుద్ధము చేసినట్లు చెప్పఁబడెను గాని మఱియొక యాయుధ మాయన పట్టినట్లు చెప్పఁబడలేదు. ఇట్లుండ సర్వాయుధము లని యెట్లు చెప్పెను ?

(౧) ఎంతటి శూరులైనను యుద్ధమునకు వచ్చునపు డొంటి యాయుధముతో రారు. రామలక్ష్మణు లంతటివారు విల్లు బాణములేగాక, కత్తులు ధరించి యున్నట్లు చెప్పఁబడెను. కావున వెలుపలికిఁ గానవచ్చునది యొక యాయుధమే యైనను దక్కిన యాయుధములు ధరించి యుండవలయునని యూహించి చెప్పెను.

(౨) తక్కిన నలువురు ధరించిన యాయుధములను గలుపుకొని చెప్పె నని చెప్పవచ్చును. ౩౧౦ వ పద్యమున గదాహస్తుఁ డను చోట గద యనునది తక్కిన యాయుధముల కుపలక్షణము.

విభీషణుఁడు విల్లుపట్టి యుద్ధము చేసినట్లు ౧౯౮౦-౨౧౦౩-౨౧౦౪ పద్యములయందుఁ గలదు. కావున విల్లు పొదులు కలవాఁడై వచ్చెననుట తప్పుగాదు. ఆయనకు ముఖ్యసాధనము గద - దానిని చేతధరించి వచ్చెను. విల్లు మూఁపున వ్రేలాడు చుండెను.

మనుజాశనుఁ డనుటచే జాతిచేతనే క్రూరకర్ముఁడనియు, రక్కసులు నల్వురనుటచేఁ గ్రూరసహాయులు కలవాఁడనియు, నఖిలసాధనములతో అనుటచేఁ గ్రూరకార్యము చేయఁ గావలసిన సాధనసంపత్తి గలదనియు, నా కారణముచే వీఁడు చంపవచ్చెనే కాని సాధుభావముతో సంధికై రాలే దనియుఁ దలఁచె నని భావము. తథ్యము = సత్యము.

తా త్ప ర్య ము

హనుమంతుఁడు మొదలగువారితో నిట్లనెను. ఈమనుష్యభక్షకుఁడు నలుగురు రాక్షసులతో,సమస్తాయుధములతో నిజముగా మనలఁ జంపుటకై వచ్చుచున్నాఁడు.

ఉ. నాపుకు వానరేంద్రు వచ ♦ నంబులు వీనుల సోఁకినంతనే
గ్రావములన్ ధరారుహని ♦ కాయములం గొని యిట్లు పల్కి రో
దేవ! దురాత్ములన్ వడి వ ♦ ధింపఁగ నానతి యిమ్ము, యిప్పుడే
జీవముఁ బాసి నేలఁ బడి ♦ చెల్లిరి చూడుము స్వల్పతేజులన్. ౩౨౨

అర్థములు. వీనులన్ = చెవులను, గ్రావములన్ = ఱాలను, 'గ్రావాణో పర్వతోపలౌ' యని నానా.ర. ధరారుహనికాయములన్=చెట్ల సమూహములను; కర్తృపదము వానరయూథముఖ్యులు.

తా త్ప ర్య ము

అని సుగ్రీవుఁడు చెప్పిన మాటలు చెవులఁ బడఁగానే వానరయూథముఖ్యులు

త్రాలు, చెట్లు తీసికొని యిట్లనిరి. రాజా! వీరిని త్వరగాఁ జంపుఁడని యుత్తరువిమ్ము. బలహీనులగు వీరు త్వరలోనే ప్రాణములుపోయి నేలఁబడి పొర్లఁగాఁ జూచెదవు.

వీనుల సోఁకినంతనే యనునది కార్యమునందలి త్వర సూచించును. చెవిలో మాటలు చొచ్చెను. చేతికి త్రాలు చెట్లువచ్చెను; రెండు నేకకాలమందే జరిగెనని భావము. త్రాలను జెట్లను ననుటచే చేతికి దొరికినదాని ననికాని యొకచేత త్రాయి, యొకచేతఁ జెట్టనికాని గ్రహింప నగును. ఇది రామసేవయందలి యాదరాతిశయమును సూచించును. రామసేవయందుఁ బట్టాభిషేకసమయమున నందఱు నొక్కొక్క వస్తువును దీసికొనఁగా లక్ష్మణుఁడు రెండుచేతులందు భద్రచామరముల నేకకాలమునఁ దీసికొనెనుగదా – రాక్షసుల నశింపఁజేయుటయు భగవత్సేవయేకదా– ఇట్లు చెప్పుటచే భగవత్సేవయందుఁ గైంకర్యపరులు సదా దాస్యసిద్ధికొఱకు వారివారి కృత్యములందు వారువారు హెచ్చరిక పడియుండవలయు ననియు, నొకరు చెప్పినఁ జేయుద మని కాచియుండరా దనియు నేర్పడుచున్నది. దేవకార్యమందుఁ దమకెంత యుత్సాహమున్నను ప్రభువు నాజ్ఞలేక యేకార్యము చేయరాదు. పారతంత్ర్యహాని మాకు రారాదు. కావున ప్రభువైన నీయాజ్ఞ వేచియున్నారమని సూచితము–దురాత్మలన్=వాఁడేల వచ్చెనో తెలియకముందె యెట్లు వానిని జంపుమందు ననెదవా! వారు స్వభావముచేతనే దుష్టులు–అట్టివారు మంచియుద్దేశముతో వత్తురా–కావునఁ జంపవలసినదే–వధిన్ = ఆలస్యముచేసిన ముందు మించి నిన్ను వాఁడు తటాలునఁ జంపిన నేమి చేయవచ్చును. కావున వాఁడు పైపడకముందే యాజ్ఞయిమ్ము– వధింపఁగన్=బంధింపరాదు–కొట్టి తఱుమనురాదు, అట్లుచేసిన వారు మరలఁ గీడు చేయకమానరు–కావునఁ జంపుటయే కర్తవ్యము–ఆనతియిమ్ము=చంపిన బాగేమోయని సందిగ్ధముగఁ జెప్పకుము. ఆజ్ఞ చేయుము–ఇప్పుడే, మఱి యెప్పుడోకాదు – నీనోటిమాట నీనోట నుండఁగనే, నేలఁబడి చెల్లిరి = ముందు నేలఁ బడగొట్టెదము – మరల నాకాశమున కెగురకుండఁ జంపెదము–యుద్ధమున వారే గెల్తురో మీరే గెల్తురో యనెదవా–వారల్ప తేజులు= ఇట్టి తేజోహీనులు మమ్మెట్లు గెల్వఁగలరు. పల్కిరి=బహువచన ప్రయోగముచేఁ బ్రతి వానరుఁడు చెప్పెనని గ్రాహ్యము, రామకార్యాసక్తియందలి యతిశయముచేఁ బ్రభువు నెదుటనంద ఱొక్కసారిగ ననువచ్చునా యను నౌచిత్యజ్ఞానము కూడ లేక యందఱుఁ బలికిరని భావము.

—• విభీషణుఁడు తనరాక శ్రీరామునకుం దెలుప వానరులవేఁడుట •—

మ. అనుచు న్వానరయూథముఖ్యు లిటు లన్యోన్యంబు భాషింపఁ గ
 క్కునఁ దా వచ్చి విభీషణుండును నుదక్కూలంబునం జేరి మిం
టన నిల్చుండి మహాత్ముఁడు న్సుమతి యందద్గోత్రితులన్ భానుమ
త్తనయుం జూచి వచించె స్వీయ మగు వృత్తాంతం బుదారధ్వనిన్. ౩_౨౩

అర్థములు. అన్యోన్యంబు = ఒకరితో నొకరు, సంభాషించుచుండన్ = ముచ్చటలాడుచుండఁగ, వాఁడు వచ్చి యేమిచేయఁగలఁడులే-ఏమిచేయునో చూతములే-మనమేల ముందుగనే కలహమునకుఁ గాలు ద్రవ్వవలెనులే యని యుపేక్ష వహించియుండఁగనే; గ్రక్కునన్ = వేగముగ-ఆవునోట్టకుఁ బాలు త్రాగుటకై పరువెత్తు లేదూడవలె-విభీషణుండును = అనుటచేఁ దక్కిన నలువురుకూడ, ఉదక్కూలంబునన్=ఉత్తరతీరమున, మింటన=ఆకాశమందే, మహాత్ముఁడు = గొప్ప మనస్సుగలవాఁడు, సుమతి = మంచి మనస్సుగలవాఁడు, ద్రోహబుద్ధి లేనివాఁడనుట; అందఱు+క్రోతులన్=అందఱ్గోతులన్=శకటరేఫము సంయుక్తమైనపుడు లఘురేఫముగా మాఱును, భానుమత్తనయున్ = సూర్యపుత్రుఁడైన సుగ్రీవుని, ఉదాత్తధ్వనిన్=పెద్ద కంఠధ్వనితో.

ఉదక్కూలంబునం జేరి = తన్నుఁ జూచి వానరులు కలవరపడుట, తన్నుఁ జంప ఱాలు చెట్లు తీసికొనుట పరికించియు వీరు తన్నేమి చేయుదురో యని భయపడక వారేమైనఁ జెప్పుకొననీ సర్వజ్ఞుఁడు పరమకారుణికుఁడు సర్వశరణ్యుఁడు శ్రీరామచంద్రమూర్తి తప్పక నన్ను రక్షించునని మహావిశ్వాస ముంచి వారల మాటలు పెడచెవినిబెట్టి తన్నుఁజంప యత్నించుచున్న వానరుల యెదుటనే వారి సమీపమందే యాకాశమున నిర్భయముగనందఱకుఁ దెలియునట్లు నిలిచియుండెనని భావము.

మహాత్ముఁడు='బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః' అనేక పుణ్యజన్మముల కడపట జ్ఞానముగలవాఁడై దాని ఫలముగ నన్నుఁ బ్రపత్తిచేయును. అనగా నా శరణు చొచ్చును. ఏమని? నాకు సర్వము అనఁగా 'రక్షక శ్శేషీ నివాస శ్శరణం మహత్' నాకు రక్షకుఁడు స్వామి, నిలువనీడ, గొప్పశరణము. అన్నట్లును, 'స్వామిత్వేన సుహృత్త్వేన, గురుత్వేన చ సర్వదా పితృత్వేన సదా భావ్యో మాతృత్వేన చ మాధవః' స్వామి యని స్నేహితుఁడని గురువని తండ్రియని తల్లియని విష్ణువును దలఁపవలయును అన్నట్లును, 'రాముఁడె భ్రాతయు భర్తయు రాముఁడె ప్రియబంధువరుఁడు రాముడెచుమీ్మా, రాముడేఁ నా జనకుండును' (అయోధ్య ౧౫౧౧౦) అని లక్ష్మణుఁడు చెప్పినట్లును నాకు సర్వము భగవంతుఁడే యను భావముకలవాఁడే శరణుచొచ్చును. ఇట్టి మహాత్ముఁడు సుదుర్లభుఁడు అని భగవంతుఁడు కృష్ణమూర్తి మహాత్ముఁడని యెవనిని జెప్పెనో యట్టి మహాత్ముఁడు.

సుమతి=మంచి మనస్సుగలవాఁడు, వానరులు తన్నుఁ జంప యత్నించుచుండినను వారియందు భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తియంతేవాసులు గావున భగవంతులను గౌరవము గలవాఁడు. వానరులు నన్నిపుడు చంప నాలోచించట నాపై ద్వేషముచేఁగాదు. రామచంద్రమూర్తి యందలి ప్రేమాతిశయము చేతనే

(లక్ష్మణుఁడు భరతునిఁ జంపెద నన్నట్లని యెఱుంగునది.) వారి స్థానమందు నే నుండిన నేను నిట్లు చేయవలసినవాఁడనే, చేసియుందువాఁడనే. రాముననునే నేమి కీడు చేయుదునో యని వీరి సందేహము కావున నిది గుణమే యను మంచి మనస్సుగలవాఁడు. అందఱు క్రోఁతులను రామచంద్రమూర్తి పరిచారకులైన వీరిని నే నాశ్రయించి వీరి యనుగ్రహము సంపాదించుకొననేని రామచంద్రమూర్తి యనుగ్రహము వచ్చియు నేమి లాభము. భాగవతులు మెచ్చిన వానిఁగాని భగవంతుఁడు మెచ్చఁడుగదా. కావున వీరినే నేనును దొలుత నాశ్రయింపవలెను, అను మనస్సుగలవాఁడు, అర్బుదముల కొలఁదినుండు వానరుల నందఱ నాశ్రయించుట దుష్కరము కావున వారి ప్రభువు నాశ్రయించిన నందఱ నాశ్రయించినట్టు లగు నని సుగ్రీవునిఁ జూచి యని చెప్పఁబడెను.

మింటనేనిల్చి=ఆకాశమున తిన్నగ వచ్చినవాఁడు అట్టులేవచ్చి తటాలున రామచంద్రమూర్తి పాదములఁబడి యుండవచ్చునే, యాకాశమున నిల్వనేల? యనిన, నట్లు చేసినచో నది సాహసమును స్వాతంత్ర్యమును దెలుపును. రామచంద్రమూర్తినే సాక్షాత్తుగ సేవించిన రక్షించునను మహావిశ్వాసమున్నను పురుషకారము నపేక్షింపని కారణముచే వానరుల నందఱ నలక్ష్యపఱిచినట్లగును. అది భాగవతాపచారమగును. మహాత్ముఁడు కావున పురుషకార మూలముగనే రామచంద్రుని సమీపింప నెంచెను. కావున దూరమునందే నిలిచెను. ఆకాశమునందుండనేల, నేల దిగియుండవచ్చునే, భూమిమీఁదికి దిగిన తనమాటలు కొందఱకే వినఁబడును. కొందఱనే యాశ్రయించినట్లగును. అదియునుగాక వారితో సమానుఁడుగ నిలుచునట్టి యోగ్యత యింకను గలుగలేదు, గనుక దూరమునందే యుండెను. వారిలోఁ గలియుటకు వారి యనుమతి కావలయును. రాముఁడు రక్షింపనీ రక్షింపకపోనీ, వానరులు రక్షించినఁజాలునని యభిప్రాయముతో వానరులతో వచించెను. ఆ గుంపులో నల్పవానరులు గలరుగదా వారేమి చేయఁగలరు, రామచంద్రమూర్తికిఁ జెప్పఁగలరా, వారి నాశ్రయింపనేల? యనరాదు. వారిలో వారికిఁ దారతమ్య మున్నను భాగవతుఁడగు శరణాగతునకు నేకాంతవాసులందఱు సమానులే కావున నందఱకుఁ గనఁబడునట్లు నిలచి యందఱకు వినఁబడునట్లు చెప్పెను. భగవంతుని దృష్టికి మనుష్యులందఱు సమానులయినను వారిలో వారికి భేదములు గలవుగదా! వేరునకుఁ జెట్టంతయు సమానమైనను కొమ్మలు, రెమ్మలు, ఆకులు పిందెలు, పండ్లు, కాయలు, పూలు నని రూపముల గుణముల భేదము గలదుగదా! భగవంతుఁ డుపేక్షించినను భాగవతు లనుగ్రహించినచో భయము లేదు, "సిద్ధిర్భవతి వా నేతి సంశయోఽచ్యుతసేవినామ్, నసంశయోఽత్ర తద్భక్తపరిచర్యారతాత్మనామ్." రామచంద్రమూర్తిని విడనాడినను లక్ష్మణుని విడనాడకుండిన సీతాదేవికి లంకాప్రాప్తి లేదుకదా.

ఉదారధ్వనిన్=పెద్ద గొంతుతో, అందఱకు వినవచ్చునట్లు రామలక్ష్మ

ములకును స్పష్టముగా వినవచ్చునట్లు 'అకించనై్యక శరణాః కేచి ద్భాగ్యాదికాః పునః మామేవ శరణం ప్రాప్య మామేవాంతే సమశ్నుతే' లక్ష్మీతంత్రము. కొంత అధిక భాగ్యము గలవా రకించనులై నన్నే శరణుపొంది కడపట నన్నే యనుభవింతురు అని యుండుటచే రామచంద్రమూర్తికి వినవచ్చునట్లు దీనులై గట్టిగా పలుకు వారు నేన్చువారుగదా భాగ్యవంతులు ఇట్లు చెప్పుటచే రామనామోచ్చారణము నిండుమనస్సుతో బిగ్గఱగాఁ జేయుటయే గుణమని తెలియనయ్యెడి. నేను మానసిక ధ్యానము చేసెదను, బాహ్యముతో నాకుఁ బనిలేదని విభీషణుఁడు స్తంభమువలె నిలువబడలేదు. విభీషణుఁ డిట్టివాఁడు గనుకనే ౫౧౧ వ పద్యమున వాల్మీకి విభీషణుఁడు శ్రీమంతుఁ డనెను. భగవదనుగ్రహ మున్నచో లౌకికైశ్వర్యము తనంతటఁ దానే వచ్చును. ఈ యైశ్వర్య ముం కిసంతిమాత్రమున నది రాదు.

ఇందు షడంగపూర్తిగల శరణాగతి ప్రదర్శింపఁబడెనని మహేశ్వరతీర్థులు.

క. రాక్షసుఁడును దుర్వృత్తుఁడు, రాక్షసకులనాథుఁ డైన రావణునకు నే
సాక్షాదనుజుఁడ జుండీ, యీ క్షితిని విభీషణాఖ్య నెఱుఁగం బడుమన్. ౩౨౮

అర్థములు. రాక్షసుఁడును=పరులను హింసించి తన్ను రక్షించుకొనువాఁడు రాక్షసుఁడు, కావునఁ గ్రూరపుజాతికిఁ జేరినవాఁడు, రాక్షసజాతి కాఁగానే యేమి, వారిలో మంచివారు లేరా, నీవు రాక్షసుఁడవుకావా, బలి ప్రహ్లాదులు రాక్షసులు కారా యందువేమో, దుర్వృత్తుఁడు=చెడ్డవృత్తి-వృత్తముగలవాఁడు, రాక్షసకుల నాథుఁడు = వీని చుట్టుపట్లనుండువారందఱు నిట్టివారే, వారి యందఱిలో వీఁడు క్రౌర్యమునందు శ్రేష్ఠుఁడు, ఇట్లు చెప్పుటచే నటువంటి దుష్టునకు భృత్యుఁడనై యుండిన దోషము నాయందును గలదని భావము. ఒకనియొద్దఁ గొలువులోనుండుట యుండకుండుట సేవకుని యిష్టము. నీ కొలువు నాకక్కఱలేదనిన, గొట్టువారు లేరు, దుష్టుఁడని తెలిసియు నతనితోడ నుండుట నా దోషమేకదా.

రావణునకు = అటువంటి రావణునకు, మాంసముదినువారు మెడలోఁ బ్రేగులు వేసికొనరు. ఎంతచెడ్డవాఁడును బేరైన మంచి దుంచుకొనును. వీఁడు పేరుకూడఁదన క్రౌర్యమును దెలుపునదే యుంచుకొనినవాఁడు.

సాక్షాదనుజుఁడను = ఉత్తియనుజుఁడనుగాను, కుబేరుఁడనుజుఁడే, తల్లులు భేదించువారు. నేనో రావణునకు నేకోదరుఁడను. నాజన్మమునుండి యిటువంటి దుష్టసాంగత్యము గలవాఁడను. ఇట్లు జన్మప్రయుక్త దోషము చెప్పఁబడెను. ఇది నాదోషముగాదు. 'దైవాయత్తం కులే జన్మ, మదాయత్తంచ పౌరుష' మ్మన్నట్లు నాజన్మమునకు దైవము కారణము. నేనుజేయు కార్యములు నా స్వాధీనములు. వానికి నేను త్తరవాదిని. విభీషణుఁడు తనదోషములఁ జెప్పుచున్నాడు. "ఉపాయా నైవ సిధ్యంతి హ్యపాయా వివిధా స్తథా ఇతి యాగర్వహాని స్తద్దైన్యం కార్పణ్యా ముచ్యతే" అన్నట్లు గర్వహాని లక్షణకార్పణ్యము చెప్పఁబడెను.

తాత్పర్యము

రాక్షసుఁడును చెడునడవడి గలవాఁడును రాక్షసరాజునునగు రావణునకు నే నేకోదరుఁడ నగు తమ్ముఁడను, నా పేరు విభీషణుఁడు.

మ. ధరణీకన్యక దండకాటవి జనస్థానంబునం దుండఁగా
హరియించెన్ మఱి యజ్జటాయువును సంహారించె రోధించె నా
కరణీయానను స్వావరోధమున రక్షస్త్రీలఁ గా పుంచెఁ దీ
పురముల్ పల్కఁగఁ జేసె రావణుఁడు పూర్వుంబోని దుఃఖింపఁగన్. ౩౨

అర్థములు. రోధించెన్=చెఱయం దుంచెను, కరణీయానను=ఆఁడేనుఁగు నడకవంటి నడక గలదానిని, స్వావరోధమునన్ = తన యంతఃపురమందు, ధరణీకన్యక = భూపుత్రిక, ఇట్లు చెప్పుటచే లోకములోని కర్మబద్ధులు పుట్టునట్లు గర్భవాసాది దుఃఖము లనుభవించి పుట్టినది గాదనియు, నయోనిజ యనియుఁ బరత్వద్దశయందుఁ గల సౌకుమార్యాది గుణము లన్నియు నిపుడును గల వనియు భావము. ఇట్లు చెప్పుటచే సీతాదేవియందుఁ దనకుఁ గల పరత్వబుద్ధి, భక్తి తెలిపెను. దండకాటవి జనస్థానంబునందు = తక్కిన వారికి ఘోరారణ్యముగ రాక్షసావాసముగఁ దోఁచినను, ఆమెకుఁ బూలుగోయుటకు, స్వేచ్ఛగా విహరించుటకు నుపయోగించు నుద్యానమువలె నుండెనని భావము. జనస్థానమందలి వారు తనబంధువు లని బిడ్డలని తలంపుగలదై వారికే కీడు కోరినది గాకుండెను. రామునితో నిష్కారముగ రాక్షసులఁ జంపవలదని యేకదా యామె చెప్పెను. ఏకాంత క్రీడకు ననుపుపడుటచే నయోధ్యకంటె దండకయే యామెకుఁ బ్రియమై యుండెనని భావము. హరించెన్ = అపహరించెను 'భాస్కరేణ ప్రభా యథా' సూర్యునినుండి యెండను వేఱుదీయుట వలె వ్యర్థప్రయత్నమని తలఁపక హరించెను, నిన్నుఁ బాసితిమేని మేము నీటిలోనుండి బయట వేయఁబడిన చేఁపలవలె నగుదుమని చెప్పినట్లు ఆమె మరణించు నంతటి ఘోరకార్యము చేసెను. "సింహము పాలి సొమ్ము గో, మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీపదాంబుజ, ధ్యాయినినైన నన్ను వడిఁ దాఁగొని పోయెదనంచు నున్నవాఁ, డా యధమాధముం డెఱుఁగఁడద్భుతమైనభవత్ప్రతాపమున్" అన్నట్లు వాఁడు ప్రయత్నించిన పని వీఁడు చేయనే చేసెను. ఇట్టి "నక్షమామి క్షిపామ్యజస్రంనరకే" యన్నట్టు లీభాగవతాపచారమే యెంతటిదండమునకైనఁ జాలును. ఇంతతోఁ బోక, ఆ జటాయువును సంహరించెన్ = మీ కత్యంత ప్రియుఁడైన యా జటాయువును, మీకై ప్రాణములైన నిచ్చి సేవచేయువానిని, సీతనువలె నిర్బంధమం దైన నుంచక సంహరింపనే సంహరించెను. సీతాహరణమును క్షమించినను నిట్టి ఘోరకార్యము క్షమింపఁదగినది కాదని భావము. ఇట్లు పరమభాగవతాపరాధము హింసాత్మకమగు దానిఁ జేయుటచే వీఁడును సపుత్ర మిత్ర భృత్యుఁడై హింసింపఁదగినవాఁడని భావము. సంహార శబ్దముపైఁ గలిగిన నామధాతువు సంహారించెన్.

సీతాదేవిని హరించినవాఁడు భక్తితో గౌరవించెనా యనినఁ దన యంతః పురమున నెట్టివారికిని, నస్ఖలితబ్రహ్మచారియై, నవవ్యాకరణ పండితుఁడై జితేంద్రియుఁడైన హనుమంతునికిఁ గూడఁ జొరరానిచోట నిర్బంధమం దుంచెను. అడవియందు మహాభయంకరమృగము లుండు స్థలమునందుఁ దిరిగినంత మాత్రము గూడఁ దిరుగుటకు లేక యుండునట్లు నిర్బంధించుటయే గాక చూచుటకు నాకారములు, వినుటకు మాటలు, తలఁచుటకుఁ జేష్టలు భయంకరమైనవిగల రాక్షసస్త్రీలను నిటు నటు గదలకుండఁ గావలి యుంచెను. అంతతోఁ బోక - తీఁపురములు = ఆగడపుమాటలు పలుకఁ జేసెను. పూవుంబోణి = ౧ పుష్పములవలె శిరస్సున ధరింప వలసిన దానిని (౨) దిరిసెనపూవువలె నతికోమలమైన దేహముగల దానిని - అత్యంత సుకుమారియైన యెంతో సుఖ మనుభవింపఁ దగిన దానిని, దుఃఖింపఁగన్=ఊరక యుండనియ లేదు. ఏడిపించుచున్నాఁడు. మా యన్నయు మహాపాపములను జేయుచున్నాఁడు.

క. రామునకు సీత నిమ్మని, వేమాఱును హేతుయుక్తవివిధోక్తులచే
సామమున నెంతో చెప్పితి, మానవభోజి కది నిరర్థక మయ్యెన్. ౩౨

అర్థములు. అన్నమీఁద దోషములు చెప్పెదవే, తమ్ముఁడవు నీవేమి చేయుచుంటివి? నీవు మంచివాఁడవైన నన్నకు బుద్ధిచెప్పి యుండరాదా? యందు రేమో! "చరాచరాణి భూతాని, సర్వాణి భగవద్వపుః । అత స్తదానుకూల్యం మే కర్తవ్య మితి నిశ్చయః" చరాచరభూతము లన్నియు భగవంతుని శరీరము. కావున వాని కనుకూలుఁడనై ప్రవర్తించుట నాకుఁ దగిన కార్యమను నిశ్చయము అనుకూల్య సంకల్పము-అట్టి శరణాగతి యంగము తా ననుష్ఠించితినని విభీషణుఁడు చెప్పుచున్నాఁడని తీర్థీయులు, వేమాఱును=ఒకసారిగాదు, రెండుసార్లుగాదు-సీతను దెచ్చినది మొదలు వెయ్యిమార్లు చెప్పితిని - నీవు సకారణముగఁ జెప్పిన నతఁడు విని యుండఁడా? యందురేమో- హేతుయుక్త = కారణములతోఁ గూడిన, వివిధోక్తులచే=సామదానాద్యుపాయములతోడి మాటలచే-ఖరవధ-విరాధవధ - వాలివధ యుదాహరించి చెప్పితిని - ఆయనసొత్తు నపహరించిన దోషమని నీతి వాక్యములు చెప్పితిని - ఎంతో = విశేషముగ నేను జెప్పవలసిన మర్యాద నతిక్రమించికూడఁ జెప్పితిని, ఆ మానవభోజికి=ఆ రాక్షసునకు, నిరర్థకము=వ్యర్థమయ్యెను.

దీనివలన నాకుఁ గాల విళంబ మయ్యెను. లేనియెడలఁ గిష్కింధకే రావలసిన వాఁడను-ఇంకను బాగుపడు నేమో యను నాశచేఁ బలుమాఱు చెప్పుచుంటిని - అన్నిమార్లు చెప్పుట యేలయందురా? వాఁడు నామాట వినియుండిన సామాన్య ధర్మమైన జ్యేష్ఠ భ్రాతృసేవయు, విశేషధర్మమైన సీతారామచంద్రసేవయు లభించునుగదా యని యాశపడితిని-వాఁడు వినని కారణముచే సామాన్యధర్మము వదలి విశేషధర్మమే గ్రాహ్యమని వచ్చితిని.

తాత్పర్యము

రామునకు సీత నిమ్ము, అట్లు చేసితివేని ఆయన సాత్త్వాయన కిచ్చునటులే గాక నీ సాత్త్వాయన కిచ్చునట్లు రామచంద్రమూర్తి సంతోషించునని వెయ్యిమార్లు నిదర్శనములతో, శాస్త్రవాక్యములతో, మంచిమాటలచే నెంతదూరము నేను జెప్ప వచ్చునో యంతకుమించియే చెప్పితిని. నేను చెప్పినదంతయు వ్యర్థమై పోయెను.

క. అంతకవశుఁ డగువానికి, నెంతటిమే లౌషధంబు నిందనిగతి నే
నెంత హితమాడినను నొక, సుంతియు మతిఁగొనఁడు కాల చోదితుఁడగుటన్.

అర్థములు. అంతకువశుఁ డగువానికిన్ = మృత్యుదేవతకు స్వాధీనపడి యుండువానికి, చావసిద్ధముగా నుండువానికి, ఇందనిగతి = దేహమునకు సరిపడని విధమున, సుంతయు = కొంచెమైనను, కాలచోదితుఁడు = యమునిచేఁ బ్రేరేపింపఁ బడినవాఁడు.

తాత్పర్యము

చావనున్నవానికి నెంత మంచి మం దిచ్చినను దేహమునకు సరిపడక పోవు నట్లు నే నెంత హితము చెప్పినను మృత్యుప్రేరితుఁడై నా మాటలు వినినవాఁడు కాఁడు. విభీషణుఁ డిట్టి కార్యము చేసి సీతాదేవి యనుగ్రహంబునకుఁ బాత్రుఁడయ్యె నని యెఱిఁగియే రామచంద్రమూర్తియు విభీషణు ననుగ్రహించెను. విభీషణు విషయము సీతాదేవి హనుమంతునకుఁ దెలిపెను. ఆయన రామునకుఁ దెలిపెను. కావున విభీషణు విషయమై సీత యనుకూలాభిప్రాయము గల దని రాముఁడు గ్రహించెను. కావున రామచంద్రమూర్తి నిర్వ్యాజముగ విభీషణు ననుగ్రహించె ననుట సరిగాదు. జీవుఁడు తన కృత్యము తాను నెఱవేర్చినఁగాని భగవదనుగ్రహము రాదని చివర శ్లోకము లన్నియు జెప్పుచున్నవి.

రావణుఁడు నన్ను నిగ్రహించుటకును రామానుగ్రహమే కారణమని నా యభిప్రాయము. జన్మప్రభృతి నేను ధర్మనిష్ఠగలవాఁడ నగుటను సీతాసేవచేసియు తన భక్తుఁడ నగుటను, రామచంద్రమూర్తి తెలిసికొని "సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి" నా ప్రాప్తికిఁ బ్రతికూలములైన వాని నెల్ల నేనే తొలఁగించెద నన్నట్టి దీక్షగలవాఁడు కావున నా పరితాప మణఁప నా దుష్టసహవాసముఁ దొలగించి తనయొద్దఁ జేర్చుకొనుటకై రావణున కా బుద్ధి పుట్టించె నని విభీషణు నభిప్రాయ మని గ్రాహ్యము - ఈ కారణముచేఁ బరమపురుషార్థరూప రామప్రాప్త్యర్థము రామచంద్రమూర్తినే శరణు జొచ్చితి నని చెప్పెను.

చ. పరుషము లాడి నన్ను నొకబంటువిధాన నవజ్ఞ చేసినన్
దురుసున, నాలుబిడ్డలను ద్రోసిడి యిచ్చోట రామచంద్రునిన్
శరణముఁ జొచ్చినాఁడ, రఘుసత్తముతోడ జగచ్ఛరణ్యుతోఁ
బరమమహాత్ముతోఁ బ్లవగవర్యులు! నా స్థితి వేగఁ దెల్పరే. ౩

అర్థములు. నీవు చెప్పిన మాటలకు నతఁడేమి ప్రత్యుత్తర మిచ్చెనందురా- పరుషములాడి=నేను దనకు ద్రోహినని, శత్రు పక్షపాతి, నని అసూయాపరుఁడ నని తన కీడు కోరుచున్నానని దూషించి, బంటువిధానన్ = తని యెంగిలి దిను దాసునివలె, అవజ్ఞచేసినన్ =ఛీ పో నా యెదుట నుండవలదని యుండినఁ జంపెద నని యవమానింపఁగా, దురుసువన్ = కఠినమైన మనస్సుతోను, వాక్కుతోను; ఆలుబిడ్డల ననుటచేఁ దనకుఁ గల సర్వస్వమని భావము.

“త్యజే దేకం కులస్యార్థే, గ్రామస్యార్థే, కులం త్యజేత్ । గ్రామం జనపద స్యార్థే, ఆత్మార్థే పృథివీం త్యజేత్” వంశమును రక్షించునిమిత్త మొకనివంశమునఁ బుట్టినవానిని వదల వలయును. గ్రామము రక్షించు నిమిత్తము వంశము వదల వచ్చును. ఊరిని రక్షింప గ్రామమును విడువవచ్చును. తన్ను రక్షించుకొను నిమిత్తము దేశమునే విడువవచ్చును.“ఆత్మానం సతతం రక్షేత్ దారైరపి ధనైరపి” భార్యలను, ధనమును వదలియైనఁ దన్ను రక్షించుకొనవలెను - అని యుండుటచే, సోపాధిక బాంధవు లెవ్వరు రక్షకులు కాఁజాలరు. నిరుపాధిక బంధువు శ్రీరామచంద్ర మూర్తియే రక్షకుఁ డను తలఁపుతో సహధర్మచారిణులై సగము దేహము పంచుకొనిన భార్యలను, నరకమునుండి రక్షించు బిడ్డలను, తల్లిదండ్రులను సర్వము వదలి వచ్చితినని భావము. దీనిచేఁ బ్రపన్నుఁడు ప్రాప్యాభాసములను ప్రాపకా భాసములను వదలవలయునని యేర్పడుచున్నది. ఆలుబిడ్డలను త్రోపిడియనుటచేఁ ప్రాతికూల్యమును విడువవలయునను నంగమును, రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడ ననుటచే ఆత్మనిక్షేప మనెడి యంగము చెప్పఁబడెను. త్రోపిడి = త్రోపు+ఇడి = వదలి, ఇది బుద్ధిపూర్వక త్యాగము దెలిపెడిని, ఇయ్యెడన్ = ఈ స్థలమునందు, ఈ సమయమందు-రఘుసత్తముతోడన్ = శరణాగత రక్షణమే వ్రతముగాఁగలరఘువంశ రాజులలో శ్రేష్ఠునితోడ, రాఘవేంద్రునిన్=“క్వాంత్వర్థినా మర్థితదాన దీక్షాకృతవ్రత శ్లాఘ్య మిదం కులంతే” యన్నట్లు కోరినవారికోరికల నెరవేర్చుట వ్రతముగాఁగల వంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని, జగత్+శరణ్యు తోన్=ప్రపంచమున కంతయు సురవర వానర పశుపక్షి మృగ వృక్షాది సకల చరాచర సమేతమైన ప్రపంచమున కంతయు కులవిద్యాధనవృత్తివివక్షలేక యంద ఱకు రక్షకుఁడైన వానితో, వీనిలో నేను జేరినవాఁడనే గనుక నాకు నాయనయే రక్షకుఁడుశరణ్యుఁడు=“శరణేరక్షణే సాధుశ్శరణ్యః తత్రసాధురితి ‘యత్’ ప్రత్యయః” శరణ మనఁగా రక్షణము. దానియందు సాధువు శరణ్యుఁడు, శరణం భవితు మర్హ శ్శరణ్య ఇతి నిరుక్తిః, రక్షకుఁడగుటకు యోగ్యుఁడు శరణ్యుఁడు. అయ్యైన రావణా సురునికిమాత్రము రక్షకుఁడుగాఁడా యందురేమో,అనుకూలించివచ్చిన నాయనకు రక్షకుఁడే. అగ్నిహోత్రము తన్ను సమీపించిన వాని చలినేకదా పోఁగొట్టును. వాఁడు రాలేదు. కావున లాభము పొందినవాఁడు కాఁడు. నేను వచ్చితిని.

కావున నా కా లాభము కలుగవలయును అని భావము. ఓయీ! యీయన రక్షకుడని నీ వెట్లు విశ్వసించి యాశ్రయింప వచ్చితి వందువా, లోకమునం గేవలము హీనమై సులభమైన మట్టిపెళ్ళకై యెవఁడు నాశపడఁడు. కేవల పరత్వము నెవఁడునాశింపఁడు.దుర్లభమైన మేరుపర్వతము నెవఁడాశించుచున్నాఁడు. కావున సౌలభ్యము పరత్వము రెండుగలవానినే జను లాశ్రయింతురు. రామచంద్ర మూర్తి రఘుసత్తముఁడగుటచే సులభుఁడై యున్నాఁడు. పరమ మహాత్ముఁడగుటచే పరత్వముగలవాఁడై యున్నాఁడు. కావున నాశ్రయింప వచ్చితిని.రఘుసత్తముఁడనుటచే,మనుష్యస్వరూపమున వచ్చినవాఁడనుటచే సమస్తజీవకోటికిలోచనగోచరుఁడై సులభముగా సేవింపఁదగియున్నాఁడు. "చిన్మయ స్యా ద్వితీయస్య నిష్కళస్యా శరీరిణః । ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" అన్నట్లు భక్తుల సౌకర్యార్థమైకదా భగవంతుఁడు రూపము ధరించుచున్నాఁడు. ఇట్లు మనుష్యస్వరూపము ధరించుటచేఁ బరత్వహాని కలదా యనిన పరమమహాత్మా యనుటచే నట్టి హాని లేదనుచున్నాడు. పరముఁడు మహాత్ముఁడు నైనవాఁడు పరమమహాత్ముఁడు. "అభ్యాసయోగ యుక్తేన చేతసా నాన్యగామినా। పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్, భ.గీ. ౮౮ అక్షరం బ్రహ్మ పరమం. ౮-3. పరం బ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ । పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ భ.గీ. ౧౦-౧౨త మక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ భ.గీ. ౧౧-౧౮" ఇట్టివాఁడు పరముఁడు, మహాత్ముడు, ఆత్ముఁడు, జీవుఁడు, మహాత్ముఁడు=పరత్వ పరమస్వరూప స్వభావములు వదలక మనుష్యుఁడుగాఁ గానవచ్చు భగవంతుఁడుగదా సేవ్యుఁడు. "భవతో యత్పరం రూపం తన్నజానాతి కశ్చనఅవతారేషు యాద్రూపం త దర్చంతి దివౌకసః" "యస్యావతారరూపాణి సమర్చంతి దివౌకసః । అపశ్యంతః పరం రూపం నమస్తస్మై పరాత్మనే॥" వి. పు. ౧-౧౯-౬౦ దేవతలు భగవంతుని పరస్వరూపమేదో తెలియక యవతారరూపములనే పూజించుచున్నారు.శ్రీరామచంద్రమూర్తి యిట్టివాఁడు గనుక నాయన శరణుఁజొచ్చితిని. కాఁబట్టి నాస్థితి మీరు రామచంద్ర మూర్తికి, వేగస్=శీఘ్రముగ, ఆలస్యములేక ఆయన నన్ననుగ్రహింపని నిమిషమొక కల్పము నరకమున నున్నట్లున్నది. నాబాధ తప్పింపుఁ డని భావము.

శరణాగతుఁడ ననిన నామాట శరణాగతరక్షణవ్రత మవలంబించిన రామచంద్రమూర్తి విన్నమాత్రముననే కరిరాజును రక్షింపవచ్చినట్లు బయలుదేఱి వచ్చును. అప్పుడు మీకుఁ బురుషకారఫలము లేకపోవును. కావున నాయన యీవనము విడిచి లేవకముందే పోయి చెప్పుఁడు. శరణన్న వారిని దప్పక రక్షించు వ్రతము రామచంద్రమూర్తికిఁ గలదని సీతాదేవి రావణునకుఁ బోధించెను.

"రావణా, కొంకక రాముతోఁ జెలిమిఁ గోరుము యప్పురుషో త్తముండు ధ
ర్మాంబుధి నిన్ను నేలు శరణాగతవత్సలుఁడౌట నిర్మలిన్. సుందర ౬౨. ౭
ఈ విషయము విభీషణుఁ డెఱుఁగును. కావుననే జంకు కొంకు లేక రక్షించుననుమహావిశ్వాసముతో వచ్చెను. ప్రపత్తియం దీ మహావిశ్వాసమే ప్రధానాంగము.

తెలుపరే = ఇది ప్రార్థనము.

తాత్పర్యము

పామునకుఁ బాలు పోయఁబోయినఁ బైపడి పీఁకినట్లు తనకు హితముపదేశించు నన్ను ననరాని కఠోరవాక్యము లని తిన యెంగిలితిని బ్రదుకు దాసులవలెఁ గఠినహృదయుఁడై యవమానించెను. కావున వానినే కాక నా భార్యను, బిడ్డలను దలిదండ్రులను ధనధాన్యాదులను లంకను సర్వము వదలి శ్రీరామచంద్రమూర్తియే మనకు రక్షకుఁ డనుకొనివచ్చి యాయన శరణుచొచ్చితిని – రఘువంశమునఁ బుట్టినవారిలో నుత్తముఁడును పరమ మహాత్ముఁడు నగు రామచంద్రునితో శరణాగతుఁడై విభీషణుఁడు వచ్చినాఁడని నా స్థితిఁ దెలుప మిమ్ముం బ్రార్థించెదను.

విభీషణుఁడు రామచంద్రమూర్తికిఁ గానవచ్చుచున్నాఁడు – విభీషణునకు రామచంద్రమూర్తి గానవచ్చుచున్నాఁడుగదా – విభీషణుమాటలు రామచంద్రమూర్తియు వినుచున్నాఁడు–ఇఁక నేమి చెప్పవలెననిన — ఇన్ని దినములు పరమపాపి యగు రావణుతోడ నుండుటచే నపరాధ పరిపూర్తి గలవాఁడును, దానికై పశ్చాత్తాపపడుచు, ఈలోక పరలోక సుఖములందలి రాగమును వదలినవాఁడును, అపరాధముల క్షమించి తనవారిలోఁ జేర్చుకొనుటకై శరణాగతిని నుపాయముగా గ్రహించినవాఁడును, రామ కైంకర్యమును రామ పరిచారికులతోడి, సాంగత్యమును గోరినవాఁడు నగు విభీషణుఁడు వచ్చినాఁడని నా స్థితిగతులఁ దెలుపుఁడు– నీవు దుష్టుఁడవే మెట్లు చెప్పెదుమందురేమో ? నేను దుష్టుఁడనుగాను – నా విషయము నా చెల్లెలు శూర్పణఖ 'దనుజ చేష్టితమూగుండు ధర్మచిత్తుఁడగు విభీషణుఁడని (అరణ్య ౧౭-౨౪) ముందే రామచంద్రునకుఁ జెప్పినది – నాపే రామునకుఁ దెలియును. కావున నా స్థితి శరణాగతుఁడనిమాత్ర మాయునకు మీరు దెలిపినఁ జాలును–శరణముఁజొచ్చినాఁడను=నేను జేయవలసిన పని చేసితిని. ఇఁక రామచంద్రమూర్తి చేయవలసిన పనియే నిలువయున్నది. ఆ ఋణము తీర్చుకొమ్మని వేగఁ దెలుపుఁడు. "ఋణం ప్రవృద్ధమితి మే" యన్నట్టు లాలస్యము చేయుకొలఁది వడ్డి చెల్లింపవలసి వచ్చుననియుఁ దెలుపుఁడు. నా స్థితిఁ దెల్పుఁడు = నే నిచ్చటికి వచ్చియున్నానని తెలుపుఁడు.

అతిహీనుఁడైనను తన రక్షణముగోరి తన్ను సమీపించి వచ్చినాఁడనునదియే రామచంద్రుఁడు రక్షించుటకుఁ జాలినంత కారణము.

తెలుపరే = వాచాధర్మంబు గట్టుకొమ్మన్నట్లు, ఈ మాట మాత్రము

దెలుపు సాహాయ్యము చేసినఁ జాలును. అంతకెక్కువ మీరు చేయవలసినది లేదు 'అప్రార్థితో న గోపాయే దితి తత్ప్రార్థనామతిః గోపాయితా భవ త్యేవం గోప్తృత్వ వరణం స్మృతమ్' అన్నట్లు గోప్తృత్వ వరణ మనెడి యంగము చెప్పబడెను.

శరణు జొచ్చెదను అనక చొచ్చినాఁడ ననుటచేఁ 'రక్షిష్య త్యనుకూలా న్న ఇత్యేవం సుదృఢా మతిః। న విశ్వాసో భవే చ్చాత్ర సర్వదుష్కృతి నాశనః' అని మహావిశ్వాసము చెప్పఁబడెను. అట్టి విశ్వాసము లేకుండినచో శరణు చొచ్చినాఁడ ననఁడు గదా.

ఓయీ! నీవు చెప్పినమాట వినలేదని నిన్నవమానించినాఁడని యన్నపైఁ గోపించి వచ్చితివి గాని రామచంద్రమూర్తి యందలి భక్తితో రాలేదు కదా యందురేమో, రావణుఁడు చేసినది తత్కాలమునఁ గీడుగాఁదోఁచి నాకుఁ గోపము గలిగించుట సత్యమే కాని వాఁడట్లు చేయుటచేఁగదా నాకు వైరాగ్యము శ్రీరామచంద్ర శరణాగతిప్రాప్తి కలిగెను. కావున వాఁడు నా కుపకారము చేసినాఁడనియే నా భావము.

ఓయీ! సీతాదేవిని దెచ్చినది మొదలు వేయిమారులు చెప్పితినంటివే; అట్టివాఁడ వింతకాల మూరకుండి యిప్పుడు రానేల యందువా? రావణుని కింకను బుద్ధివచ్చునేమో యని కాచి కొన్నిదినము లుంటిని. మీ యుద్యమము దెలియరాయుచే నామాటలు వానికి నమ్మరానివయ్యెను. వాఁడు దుర్మహాగ్రమందు సీతాదేవిని దెచ్చిన కారణముచే వానికి మీవలనఁ దప్పక కీడు కలుగు నని నే నెఱుఁగుదును, కావున మీరెవరైనఁ దప్పక వత్తురనియు నప్పుడు చెప్పిన నా మాటలు వాఁడు విశ్వసించు ననియుఁదలఁచి మీ రాక కెదురుచూచుచుంటిని. హనుమంతుఁడు వచ్చి లంకగాల్చిన తరువాతఁ జెప్పితిని. అప్పుడు విన్నవాఁడు కాడు. గొంతుమీఁది కత్తివలె మీరు వచ్చి యిచ్చట విడిసినారని విని నేఁడు సభ చేసెను. అందు నొక్క చెప్పితిని. నామాట వినక నన్నవమానించెను. ఇఁక నీ దుష్టసహవాసమువలన మేలు లేదని బయలుదేఱి వచ్చితిని.

పారమార్థిక బుద్ధితో విభీషణుఁడు వచ్చినట్లు ముందే వ్రాయఁబడెను. వ్యావహారిక బుద్ధి నతఁడు చేసినది తప్పొ యొప్పొ యని యాలోచింతము. రావణుఁడు ఛీ పో నాయొద్ద నుండవలదని చెప్పెను గద. ఎందుఁబోవలె, లంకయందే యుదాసీనుఁడై యుండవచ్చునా? అది సాధ్యపడదు. తక్కినవారు కొందఱు హితముప దేశించినను దుడకు రావణుని యిష్టప్రకారము వర్తించిరి. విభీషణుఁ డట్లు గాదు. వ్యతిరేకించెను. పామ్మన్నను నూరిలో నుండెనా? యింకను నేదో కుట్ర చేయుటకై యున్నాఁడని రావణుఁ డెక్కువ సందేహము గలవాఁ డగును. అది యపాయకరము. లంకయం దుండెనేని యుద్ధకాలమందు నీవు యుద్ధమునకుఁ బోవలసిన దని రావణుఁ డాజ్ఞాపించును. రాజాజ్ఞ మీఱెనా దండింప సిద్ధపడును.

మీకుఁ జిక్కపోయెనా ప్రహస్తాదులలోఁ గలిసినవాఁడగును. అంతఃకరణమునకు విరోధముగ బ్రవర్తించినవాఁ డగును. కావున లంక విడుచుటే యుత్తమకార్యము, లంకలో నుండుటచే రామరావణుల కిరువురకు మంచివాఁడు కానేరఁడు. అటుగాక లంకయం దుండక రామచంద్రమూర్తితోను గలియక రెండవదైన దేశమునకుఁ బోయెనా రావణవధానంతరము లంకను రామచంద్రమూర్తి యంగదునకో మఱియెవ్వరికో యిచ్చి యుండునుగాని, తనయం దనుకూల బుద్ధిలేని విభీషణునిఁ బిలిపించి యుండఁడు. అప్పుడు విభీషణుఁడు రెంటను జెడిన రేవణుఁడగును. వీఁడు రాక్షసుఁడు రావణ పక్షపాతి యని వానరులు వీనితోఁ బోరాడుచుందురు. లంకావానము సాధ్యపడదు. కావున నే విధముగఁ జూచినను ధర్మపక్షపాతము వహించి రాముని పక్షముచేరుటే విభీషణునకు యుక్తకార్యము. తనకుఁ దగిన యాశ్రయమని రామచంద్రమూర్తి నాశ్రయించెను గాని లంకారాజ్యము దానాక్రమింపవలె నను కోరికతో లంకారాజ్యము నాకిచ్చెదరేని నేను మీకు సాహాయ్యము చేసెద నని బేరమాడ లేదని స్పష్టముగాఁ దెలియ నయ్యెడిని.

—• సుగ్రీవుఁడు రామునకు విభీషణురాక దెలిపి రాక్షసుల నమ్మరా దనుట •—

క. అను నా వచనంబుల విని, యినతనయుఁడు శీఘ్రగామి • యేగి సుమిత్రా
తనయు సమక్షమునంది, ట్లనియె రఘురాముతోడ • నత్తరపడుచున్. ౩౯

శీఘ్రగామి=త్వరగాఁ బోఁగలవాఁడు, అత్తరపడుచున్=తొందరపడుచు, అత్తరము వి. ఆత్రము.

తాత్పర్యము

తా ననుకొన్న ప్రకారము వేగులవాఁడుగాక, దూతయుఁగాక ప్రత్యక్షవిరోధియుఁగాక శరణాగతుఁడను అనుమాటలు సుగ్రీవుఁడు విని శరణు అని విభీషణుని నోరరాఁగానే అభయమ్మని రామచంద్రమూర్తి నోరవచ్చునేమో, కార్యముచెడునే యని, 'అతిస్నేహః పాపశంకీ' అతిస్నేహము పాపపు సందేహములు గలిగించు నను సూక్తి ననుసరించి రామచంద్రుని యం దత్యంతస్నేహము గల సుగ్రీవుఁడు అభయమ్మనుమాట రాకముందేపోయి నివారింపవలె నని మిగుల వేగముతో తత్తరపాటుతోఁ బోయిన లక్ష్మణుఁడు వినుచుండఁగా నిట్లనెను. పరాయివాఁడు తాను జెప్పిన వినునో వినఁడో తమ్ముఁడవైన నీవు చెప్పిన వినును. కావున నీవును జెప్పుమని లక్ష్మణునిఁ దనతోఁ గలుపుకొనఁగోరి లక్ష్మణుముఖము చూచుచు రామచంద్రమూర్తితో జెప్పెను.

విభీషణుఁడు పగవానితమ్ముఁడు కావున నన్నపక్షమందభిమానముగలవాఁడై యుండుట సహజగుణము. అందు నూతన సహాయ సంపత్తిఁ గోరవలసిన కాలము

కాని యున్నవారిని వదలుకొనవలసిన కాలముగాదు. కావున రావణుఁడు భేదోపాయము ననుసరించి పంపఁగా భక్తునివలె నటించుచున్నాఁడనియు, దగ్గఱఁ జేర నిచ్చిన సమయము వేచి రామునకో లక్ష్మణునకో కీడు చేయఁదలఁచిన ద్రోహియనియు గావున దగ్గఱఁ జేరనీయరాదనియు సుగ్రీవుని యభిప్రాయము. దీని ననుసరించియే మాటలాడుచున్నాఁడు.

క. తనపేరు విభీషణుఁ డఁట, యనుజుం డఁట దేవ! రావ • ణాసురునకుఁ దా
మనుజాద చతుష్కముతోఁ; జనుదెంచి నరేంద్ర! నిన్ను • శరణముఁ జొచ్చెన్.

అర్థములు. దేవ=సంబోధనము, మనుజాద చతుష్కముతోన్=నలువురు రాక్షసులతో.

తాత్పర్యము స్పష్టము.

తే. యోజనలు సేయు తెఱఁగుల • వ్యూహములను, నుపమలం దేని, చారని • యుక్తియందు
వానరులపట్ల వైరుల • వలన మిగుల, నప్రమత్తుండ వై యుండ • నగు జయంబు.

అర్థములు. ఇట్లు విభీషణుని వృత్తాంతము దెలిపి తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు. యోజనలు=ఆలోచనలు, వ్యూహములను = సేనలను వ్యూహాకారములుగాఁ బన్నునప్పుడు, ఉపమలం దేని = ఉపాయములు చేయుట యం దేని, చారనియుక్తియందు=వేగువాండ్ర నియోగించుటయందు.

తాత్పర్యము

దేవా! జయము కావలయు నని నీకుఁ గోరిక యుండెనా నీ వాలోచనలు చేయుటయందును వ్యూహములు దీర్చుటయందును ఉపాయములు పన్నుటయందును వేఁగుల నేర్పాటు చేయుటయందును వానరులకు వైరులవలనఁ గీడు రాకుండ మిక్కిలి హెచ్చరిక గలవాఁడవై వర్తింపవలయును.

తే. కామరూపులు మఱియు ని • కారవిదులు శూరవర్యులు రాక్షసు • ల్సూరివర్య
తెలియరాకుండఁ గనులకుఁ • దిరుగుచుంద్రు, వారి నెన్నండు నమ్మంగ • వలను పడదు

అర్థములు. వానరులకుఁ గీడు కలుగు పనిచేసితినా చేయఁదలచితినా, ఏల యిట్లు చెప్పెద వందువేమో, సూరివర్య=పండిత శ్రేష్ఠుఁడా! రాక్షసులు కామరూపులు=కోరినరూపము ధరింపఁ గలవారు. ఇది నీకు మారీచుని చర్యవలనఁ దెలిసిన విషయమే, నికారవిదులు=వంచన చేయఁ దెలిసినవారు, రావణుని చర్య వలన దెలిసిన విషయమే, శూరవర్యులు = శూరులందు శ్రేష్ఠులు, ఇది నీకు ఖరాదుల చర్యవలనఁ దెలిసినదే.

తాత్పర్యము

పండితశ్రేష్ఠుఁడా! రాక్షసులు కోరినరూపము ధరింపఁగలవారు, మోసపువిద్య నేర్చినవారు, శూరులందు శ్రేష్ఠులు, ఎప్పటి కే వేషభాషలచే శత్రువుల గెలువ వచ్చునో యవి యన్నియుఁ దెలిసి యాప్రకారము వర్తించువారు, ఇంతేకాదు. మన

కన్నులకుఁ గానకుండ మనలోఁ దిరుగఁగలరు. కావున వారిని నెప్పటికినమ్మరాదు.

క. ప్రణిధి యయి రావణునకున్, జనుదెంచెనొ నీతిశాలి•స్వయముగఁ దానే
మనలోన నుండి సమయము, గని మనలం బిలుకుమార్పఁ•గా వచ్చెనొకో. ౩౩౩

ప్రణిధి = వేగులవాఁడు, యథార్హవర్ణః ప్రణిధి రపసర్ప శ్చర స్స్పశః చారశ్చ గూఢపురుష' యని యమరుఁడు, నీతిశాలి= నీతివిద్యచేఁ బ్రకాశించువాఁడు, పిలుకుమార్పఁగాన్ = చంపఁగా.

తాత్పర్యము

రావణుఁడు పంపఁగా వేగులవాఁడై వచ్చెనో లేక నీతి విద్య సామదాన భేదోపాయములు చక్కఁగా దెలిసినవాఁడగుటచేఁ దనంతటఁ దానే మనలోఁగలసి మెలసియుండి నమ్మికపుట్టించి సమయము కాచివేచి మనము హెచ్చరికతప్పియున్నప్పుడు మనలఁ జంపనేవచ్చెనో, కాని వీఁడు నిజముగ భక్తిచే వచ్చినవాఁడుకాఁడు.

క. తనహితు లనిచిన బలమున్, వనచారులబలము మూల•బలముం దనవే
తనమునఁ గుదిరిన బలమును, జను నమ్మఁగ, నమ్మరాదు•శాత్రవబలమున్. ౩౩౪

అర్థములు. అనిచిన = పంపిన, వనచారులు=అడవియందుండు వారల, వేతనమున=జీతము తీసికొనుటచే.

తాత్పర్యము

మనకు సహాయ సంపత్తి యెక్కువ, శత్రువులకుఁ దక్కువయగుట మేలే కదా. ఏల విభీషణుఁ జేర్చుకొనవల దందువేమో.

తనమిత్రులుపంపిన సేనను నమ్మవచ్చును, తన రాష్ట్రములోని యడవులందుండు వారి బలమును నమ్మవచ్చును, పరంపరగా వచ్చిన మూలబలమును నమ్మవచ్చును. జీతమునకుఁ గుదిరిన భటులబలమును నమ్మవచ్చును. వీరివలన సహాయము లేదుగాని శత్రువులు పంపినసేనను నమ్మరాదు, కీడు కలుగును.

'మౌలం, భృతం, సుహృ, చ్ఛ్రేణీ, ద్విషదాటవికం బలమ్,' అని బలము లాఱువిధములు. ఇందు పరంపరగా వచ్చిన గర్భదాసాదుల నిలుకడ యగు బలము మూలబలము, జీతమిచ్చి చేర్చినది భృతబలము, మిత్రులు పంపినది సుహృద్బలము, పల్లెలనుండి గ్రామములనుండి తెచ్చినది శ్రేణిబలము, మనవిరోధులకు విరోధులుగా నుండువారు మనపక్షమునకుఁ బంపిన బలము ద్విషద్బలము, కిరాతాదుల బలము ఆటవిక బలము.

పూర్వము మన స్వదేశరాజులు అడవులను చెంచులు, బోయలు, ఎఱుకలు, ఏనాదులు లోనగువారి స్వాధీన మందుంచి వారడవి ఫలములవలనఁ గలుగు లాభమనుభవించుచు రాజునకుఁ గావలసిన విచ్చుచు యుద్ధసమయంబుల సేనలు పంపునట్లొడంబడిక గలవారు, ఈ విధముగ వచ్చు సేనకు నాటవికబల మని పేరు, ఈ సేనల నమ్మవచ్చును.

క. రాక్షసుఁ డఁట సహజంబుగ, రాక్షసనాథునకు ననుఁగు•భ్రాతయు నఁట ద్వి
ట్పక్షమున వచ్చినాఁ డఁట, యీక్షింపుము నమ్మవచ్చు•నే వీని మదిన్. ౩౩౫

అర్థములు. ద్విట్ + పక్షమునన్=విరోధి పక్షమునందుండి. "రిపౌ వైరి సపత్నారి ద్విషద్ద్వేషణ దుర్హృదః, ద్విడ్విపక్షాహితామిత్ర దస్యు శాత్రవ శత్రవః అభియాతి పరారాతి ప్రత్యర్థి పరిపంథినః" అమరుఁడు.

తాత్పర్యము

పుట్టువుచేతనే క్రూరకర్ముఁ డగు రాక్షసుఁడఁట. అట్టి రాక్షసులకుఁ బ్రభువగు వానికిఁ గూరిమి గల తోడఁబుట్టినవాడఁట. ప్రత్యక్షముగ శత్రువుల యొద్దనుండి వచ్చినాఁడఁట. ఇవన్నియు వాఁడే చెప్పుచున్నాఁడు. ఇట్టివానిని నమ్మవచ్చునా? నీవే యాలోచింపుము.

చ. వినుము విభీషణుండు రఘువీర! దశాస్యునిచారుఁ, డాతఁడే
పనుపఁగ వక్రబుద్ధిమెయి • వచ్చినవాఁ డిట, కీవు నమ్మినన్
జనవర! మాయచే మనలఁ • జంపుట సత్యము, వీని నిప్పుడే
పొనుఁగువడంగఁ జేఁత దగుఁ•బో క్షమవద్వర! నాకుఁ జూడఁగన్. ౩౩౬

అర్థములు. చారుఁడు=వేగులవాఁడు, వక్రబుద్ధి=మోసపుబుద్ధి, పొనుఁగువడంగ జేఁత=చంపుట, క్షమవత్+వర=సామర్థ్యము గలవారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

సుగ్రీవా! శరణని వచ్చినవారిని నెట్లు చేరఁదీయక నిరాకరింపవచ్చు నందు వేమో! నిజమైన భక్తిశ్రద్ధలు గలిగి శరణుగోరినవారిని రక్షింపవలసినది విధియే. అది నేను గాదనను. ఈ విభీషణుఁడో రావణుని వేగులవాఁడు - వాఁడే పంపఁగా మోసపుబుద్ధితో నిచ్చటికి వచ్చినాఁడు. నీవు శరణాగతుఁడుగదా యని నమ్మి చేరఁ దీసితివా యేదియో వంచనచేసి మనలఁ దప్పక చంపును. కావున వీని నిపుడే చంపుట దగిన కార్యమని నా యభిప్రాయము. నీవు సమర్థుఁడవే - నేను కాదనను గాని నిద్రపోవు సింహమును నక్కలు పరిభవించును. మన మేమఱియున్న సమయమున మనలఁ జంపును. కావున శరణాగత రక్షాన్యాయ మిం దన్వయింపదు.

చ. వెరవరియైన దాయ యరి•వీరుల సేనలలోనఁ జొచ్చి యే
యరమర లేక త్రిమ్మరుచు • నంతట సం దొకయింత గల్గినన్
బొరిగొను శత్రుసంతతులఁ బూర్ణముగాఁగ నులూకసంహతిన్
గరటముపోలెఁ గాన నెటు•కార్యము గాదు విరోధి నమ్మఁగన్. ౩౩౭

అర్థములు. వెరవరి=ఉపాయశాలి, దాయ=పగవాఁడు; అరి = శత్రువుల యొక్క, అరమర=భేదము, త్రిమ్మరుచున్=తిరుగుచు; పొరిగొనున్ = చంపును; ఉలూకసంహతిన్=గుడ్లగూబల సమూహమును, కరటముపోలెన్=కాకివలె.

తాత్పర్యము

ఉపాయశాలి యగు శత్రువు తన శత్రువుల సేనలలోఁజొచ్చి వారిలోఁ దానొకఁడుగఁ గలిసి మెలసి భేదబుద్ధిగలవాఁడని కానరాకుండఁ దిరుగుచు సమయము దొరికి నపుడు శత్రువులఁ జంపును. పూర్వ మొక కాకి గూబల నిట్లేగదా చంపెను. కావున విరోధిని నమ్మనేరాదు.

కాకి గూబల కథ పంచతంత్రమునఁ గలదు. కాకులకు గూబలకు నెప్పటికి విరోధమే. పగలు గూబలు బయటవచ్చినా కాకులు కొట్టును. రాత్రులందుగూబలు పోయి కాకులఁజంపును. ఇట్లుండ నొక కాకుల గుంపునకు గూబలగుంపునకుఁ గలహము జరుగుచుండెను. అప్పుడొక కాకి యుపాయముచేసి గూబలలోఁ జేరుకొని కాకుల నన్నిటినిఁ జంపు నుపాయము మీకుఁజెప్పెద నని నమ్మించి యవియేమఱి యుండఁగా నొకనాఁటి పగలు కాకులకన్నిటికిఁజెప్పి యవి కొఱవులు తీసికొనిరాఁగా గూబలుండు తొఱ్ఱల నన్నిటిని జూపఁగా వానిలో గడ్డికూరి నిప్పుపెట్టెను. గూబలన్నియు చచ్చెను. కావున విభీషణుఁడు నట్లే చేయును గావున నమ్మరాదు.

క. క్రూరుఁ డగు రావణాసురు, కూరిమితమ్ముండు సేవ♦కులతో వీనిన్
గ్రూరంబుగఁ జంపుటయే, సారమతీ! కృత్య మిపుడు ♦ చర్చింపంగన్. ౩౩౮

తాత్పర్యము

రావణాసురుఁడు క్రూరుఁడు. వాని కూరిమి తమ్ముఁడు వీఁడు కావున వీనిని వీని సేవకులతోడఁ గ్రూరముగఁ జంపుటయే తగిన కార్యము.

వీనిని ద్రోహబుద్ధిని జిత్రవధ చేసి చంపవలెఁగాని వాలివలె నొక్క బాణముతోఁ దటాలునఁ జంపరాదు. వీనిని విడువనురాదు. విశ్వామిత్ర యాగమున మారీచుని విడుచుటచేఁగదా వెనుక వాఁ డంత పాపకార్యము చేయఁ గలిగెను.

క. అను నినజుని సంరబ్ధం, బున నాడిన వాక్యములను ♦ బురుషోత్తముఁడున్
విని నికటపార్శ్వవర్తుల, హనుమత్ప్రముఖాగచరుల ♦ కను సంప్రీతిన్. ౩౩౯

అర్థములు. సంరబ్ధంబునన్ = తొందరగా, రామచంద్రమూర్తి యభయమనునేమో,ఆడినమాట తప్పఁడే యనియే తొందర,నికటపార్శ్వవర్తులన్=సమీపమునఁ బ్రక్కల నుండువారిని, హనుమత్ప్రముఖాగచరులన్=హనుమంతుఁడు మొదలగు వానరులను, సంప్రీతిన్=సంతోషముతో, విభీషణు మాటలకు రావణుఁడు కోపించినట్లు కోపింపక తనమనస్సును దాఁపక వచించెఁగదా యని సంతోషించెను.

—♦ శ్రీరాముఁడు విభీషణువిషయమై కపుల యభిప్రాయ మడుగుట. ♦—

చ. వలిముఖనేత యాయసుర♦వల్లభుతమ్ము నెడాటమందుఁ దాఁ
బలికిన యుక్తియుక్త మగు♦పల్కులు మీరును వింటిరే కదా
బలితపుఁగార్యసంకటము♦పట్ల హితుం డొకఁ డాడ నంతతోఁ
బలుకమి యొప్పదన్య మగు ♦ ప్రాజ్ఞ సమర్థ శుభేప్సుపాళికిన్. ౩౪౦

అర్థములు. వలిముఖనేత = వానరనాయకుఁడు = సుగ్రీవుఁడు; ఎడాటమందున్ = విషయమందు, పలుకమి = మాటలాడకుండుట; ప్రాజ్ఞ = బుద్ధిమంతులు=సమర్థులు; శుభేప్సు=మేలుకోరినవారునగు, పాళికిన్=సమూహమునకు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు విభీషణునుగుఱించి యుక్తియుక్తముగఁ జెప్పినమాటలు మీరందఱు విన్నారుగదా-గొప్పకార్యము చేయవలసి యందు సందేహముగలిగినపుడు హితుఁడొకఁడు చెప్పినదానితో నందఱు సంతుష్టిపడి మౌనము వహింపరాదు-ప్రాజ్ఞులు - సమర్థులు మేలుకోరువారితరులును వారివారి యభిప్రాయము దెలుపవలయును.

క. కావున నియ్యెడ మీ మీ, భావంబులు దెలుపుఁ డన్నఁ • బ్లవగవరుల్ త
ద్భావుక చికీర్షులై సం,భావించుచు దమమతంబుఁ బలికి రతనికిన్. ౩౮౧

అర్థములు. భావుక చికీర్షులై=శ్రీరామమూర్తికి మేలుచేయు నాలోచన గలవారై; 'భావుకం భవుకం భవ్యం కుశలం క్షేమ మస్త్రియామ్' అమరుఁడు.

తాత్పర్యము

ఇది నీతివిధముగావున మీమీ యభిప్రాయ మేమో వానరులారా చెప్పుఁడని యడుగఁగా నెట్లుచేసిన రామచంద్రమూర్తికి మేలో దానిని జేయఁగోరి తమ యభిప్రాయ మిట్లు పలికిరి.

సుగ్రీవుని యభిప్రాయమునకు విరోధముగఁ జెప్పిన నతఁ డేమనుకొనునో యని తలంపక నా స్థానమున మీరుండిన మీరేమిచేయుట బాగని తలంచి యుందురో దానిని దెలుపుఁడు.

చ. తెలియని దింత లేదు జగ•త్త్రితయమందు మహాత్మ ? నీకు మా
వలని నిగారపుంజెలిమి•బల్మిని ప్రశ్న యొనర్చి తింతయే,
యెలసెఁ బరీక్ష్యకారిత సు•హృత్పరతంత్రత ధార్మికత్వముం
బలదృఢశౌర్యసత్త్వము ల•పారపరాక్రమ ! జ్ఞప్తి, నీయెడన్. ౩౮౨

అర్థములు. నిగారపున్ జెలిమిన్=నిర్మలమైన ప్రేమయొక్క; బలిమిన్ = అతిశయముచే, పరీక్ష్యకారిత = ఏదియైనను జక్కఁ బరీక్షించి కార్యముచేయుట, సుహృత్పరతంత్రత=మిత్రుల యిష్టప్రకారము నడచుకొనుట,మీఁదఁ జెలిమియన్నప్పుడు సౌహృదయము భావము మాత్రము చెప్పఁబడెను. ఇచ్చటఁ బారతంత్ర్యము చెప్పఁబడెను. సద్వ్రతిత్వమున్ = శ్రేష్ఠమైన శరణాగతరక్షణవ్రతము ననుసరించి వర్తించుట, బల=దేహబలము, దృఢశౌర్యము=అధికశౌర్యము, సత్త్వము=సాధుస్వభావము, జ్ఞప్తి=స్మరణము,ధర్మము; ఎలసెన్=చేరియున్నవి. తెలియనిదింత లేదు సర్వజ్ఞుఁడవనినచో బహుత్వమును దెలుపునుగాని నిశ్శేషత్వము దెలుపదు,గావున దెలియని దింతలేదు అని చెప్పఁబడెను. అపారపరాక్రమ యనుటచే నిన్ను నెవరేమి చేయఁగలరని భావము. చెలిమి బల్మిని ప్రశ్న చేసితివి (౧) మాయందు. నీకుఁగల

స్నేహము ప్రకటించుటకుఁగాను అడిగితివి. (౨) రామచంద్రమూర్తి వానరులకు మిత్రుఁడు అనుకీర్తి మాకుఁ గలిగింపఁ బ్రశ్నించితివి.

తా త్ప ర్య ము

మహాత్మా! నీకుఁ దెలియనిది మావలనఁ దెలిసికోవలసినది లవమైన లేదు. అయినను మాయందు నీకుఁగల నిర్మలమైన స్నేహము నతిశయముచే రాముని మిత్రులు వానరులనుకీర్తి మాకు సంపాదించి యీయ నడిగితివి కాని మతియొందు గాదు. ఏపనియైనను నీవు ముందు పరీక్షింపక చేయవు. మిత్రుల యిష్టప్రకారము వర్తించువాఁడవు. నీవు చేయఁదలఁచిన కార్యముమిత్రులచే సరి యనిపించియావలఁ జేయుదువు, సత్యమైన వ్రతము గలవాఁడవు. నీవు పట్టిన వ్రతమును వదలవు. మేమేమి చెప్పినను నీ శరణాగతరక్షణ వ్రతమును నీవు విడువవు. సత్యమే నీకు వ్రతము ఏది చేసినను ధర్మము ననుసరించి చేయుదువు. బలము దృఢశౌర్యము దృఢసత్త్వము జ్ఞప్తి యివి నీయందు దృఢముగ నిలచియున్నవి. ఇట్టి నీ వేమి చేసిన నిన్నుఁ గాదనువారెవరు? పరాక్రమము చేతనే సర్వకార్యములు నీవు సాధింపఁ గలవు, ఇట్టి నీకు మే మేమి చెప్పఁగలము?

క. మతిసంపన్నులు క్రియలం, దతినిపుణులు నీదు సచివు • లందఱు నగుటన్
హిత మొక్కొక్కఁడు తనతన, మత మనుటయ మేలు హేతు•మానితఫణితిన్.

అర్థములు. మతిసంపన్నులు = ఆలోచించు శక్తి గలవారు. క్రియలందున్ = కార్యములు చేయుటయందు, సచివులు=మంత్రులు, మతము = అభిప్రాయము. హేతుమానితఫణితిన్=కారణముచే గౌరవింపఁబడిన మాటలచే.

తా త్ప ర్య ము

నీ మంత్రు లందఱు చక్కఁగా నాలోచించి చెప్పఁగల బుద్ధిమంతులు. మాటలు చెప్పుటయందే కాదు. కార్యములు చేయుటయందు సమర్థులు కావున అందఱుఁ గలసి యొకటిగఁ జెప్పుటకంటె నొక్కొక్కఁడు ఈ యీ కారణములచే వీనిని జేర్చుకొనవచ్చును, ఈ యీ కారణములచే వీనిని జేర్చుకొనరాదని వాని వాని యభిప్రాయము వాఁడు వాఁడు చెప్పుట బాగు.

—• అంగదాదులు వారి వారి యభిప్రాయంబులఁ దెలుపుట •—

చ. అన విని వాలిపుత్త్రుఁడు ధ•రాధిపుతోడ విభీషణుం డరా
తినికటమందు నుండి చను • దెంచుటచే ననుమానపాత్రుఁడే,
చనదు తటాన నమ్మఁ, దమ•చందము మార్పడఁ జేసి రంధ్రముం
గని ప్రహరింత్రు ద్రోహు, లటు•గాన ననర్థము గల్గు నెంతయున్. ౩౭౭

అర్థములు. అరాతినికటమందున్=పగవాని యొద్దనుండి.

తాత్పర్యము

ఆ మాటలు విని రామచంద్రమూర్తితో నంగదుఁ డిట్లనియె. దేవా! విభీషణుఁడు మనశత్రువులయొద్దనుండి వచ్చినవాఁడు కావున సందేహింపఁదగిన వాఁడే. కావునఁ బూర్వోత్తరములు విచారింపక తటాలున నమ్మరాదు. ఏలన ద్రోహులు తమ యథార్థస్థితి దాఁచి మాఱువేషమువేసి సమయము వచ్చినపుడు కొట్టుదురు. కావునఁ గీడు కలుగును.

ఉ. కావున నట్టివారలను ♦ గార్యములం దిడి తత్ప్రవర్తనన్
వావిరి నిశ్చయించి గుణ♦వంతుఁడయేన్ గ్రహియింపవచ్చు, దు
ర్భావుఁడ యేని పీడు టది ♦ భావ్యము, దోషబహుత్వమున్నచోఁ
జే విడువం దగుం గుణవి♦శిష్టుఁడ యేనియుఁ గైకొనం దగున్. ౩౪౫

అర్థములు. తత్ప్రవర్తనన్=వారి నడవడిని, వావిరి=చక్కఁగా; దుర్భావుఁడు = చెడుతలంపుగలవాఁడు; భావ్యము=మేలు; దోషబహుత్వము = పెక్కుదోషములు; గుణవిశిష్టుఁడు = ఎక్కువ మంచిగుణములు గలవాఁడు, కైకొనం దగున్ = గ్రహింపవచ్చును.

తాత్పర్యము

కావునఁ గ్రొత్తవారినిఁ జేర్చుకొనునప్పుడు వానిచేతఁ గొన్నిపనులు చేయించి యవి వాఁడెట్లుచేయునో వాని నడవడి యెట్టిదో చక్కఁగా నిర్ధారించి గుణవంతుఁ డాయెనా గ్రహింపవచ్చును. మఱభిప్రాయము గలవాఁడని తోఁచెనా విడువవచ్చును.

ఓయీ! యోగ్యః పురుషో నాస్తి' "అయోగ్యః పురుషో నాస్తి" అన్ని సద్గుణములు గలవాఁడు లేఁడు. అన్ని దుర్గుణములు గలవాఁడు లేఁడుగదా, యందు వేమో! దోషములు పెక్కు లున్న విడువవలయును. గుణములు పెక్కులున్న గ్రహింపవచ్చును, అని యువరాజగుటచే నంగదుఁడు తొలుతఁ జెప్పెను. సుగ్రీవుఁడు విభీషణుని సమీపమునకే రానీయరాదని చెప్పెను. అంగదుఁడు పరీక్షించి దుష్టుఁడైనచో విడువ వలయును అని చెప్పెను. ఇది భేదము.

ఉ. ఆ నుడు లాలకించి శర♦భాహ్వయుఁ డిట్లను సాధ్యసూక్తులన్
దానవు చిత్తశోధన మొ♦నర్పఁగ వేగుల సూక్ష్మబుద్ధులన్
లో నియమించి వా రితని♦పోకల నెల్ల నెఱింగి వచ్చినన్
మానవలోకపాల యను♦మానము వాయ గ్రహింపు పిమ్మటన్. ౩౪౬

అర్థములు. క్రొత్తవానిని మనలోఁ జేర్చుకొని వానిచే మన పనులు చేయించుకొని గుణదోషములు నిశ్చయింపవలె నన్నమాట శరభునకు రుచించినది కాదు. ఏలనః—ఎప్పుడు మనలోనొకనిఁ జేర్చుకొంటిమో మనలో గుట్టులన్నియు

వాఁ డప్పుడే తెలిసికొనఁ గలఁడు. ఆవల వానిని నుంచుకొనినను గీడే. పొమ్మనినను గీడే, యని తలఁచి శరభుఁడు తన యభిప్రాయమును చెప్పుచున్నాఁడు.

సాధ్యసూక్తులన్ = చేయుటకు సాధ్యమైన మంచిమాటలచే ఇట్లు చెప్పుటచే నంగదు నభిప్రాయ మసాధ్య మని సూచన.

తాత్పర్యము

ఆ మాటలు విని శరభుఁడు చేయ సాధ్యమైన మంచి మాటలచే నిట్లనెను. రామచంద్రా! వీనిని మనలో నిప్పుడే కలుపుకొనక దూరమందే యుంచి సూక్ష్మబుద్ధిగల వేగుల నియమించి పరీక్షించి వీని నడవడుల నన్నిటిని వారు పరీక్షించి తెలిసికొని వచ్చిన పిమ్మట వీనియం దనుమానింపఁ గారణము లేదని తోఁచిన గ్రహింపుము.

చ. అనవుడు జాంబవంతుఁడు గుణాఢ్యము దోషవివర్జితంబుగా
మనవి యొనర్చె రావణుఁడు ♦ మత్సరచిత్తుఁడు బద్ధవైరుఁ డా
తని నెడఁ బాసి మిమ్మతఁడు ♦ దాయఁగ వచ్చె న హేతుకంబుగాఁ
గనఁగ నదేశకాలములఁ ♦ గావున నమ్మకుఁ డీ విభీషణున్. ౩౪౭

అర్థములు. ఈ యభిప్రాయము జాంబవంతునకు సరిపడినదికాదు. గుణాఢ్యము = గుణాధిక్యముగలది, దోషవివర్జితము=దోషము లేనిది; ఇట్లు చెప్పుటచే శరభుని యభిప్రాయమందు గుణము లేదు, దోషముగలదని జాంబవంతుని యభిప్రాయము. వేగుల నెప్పు డేర్పాటు జేసితిమో యప్పుడే వాఁడు హెచ్చరికపడి వాస్తవమునుదాఁచి మంచివానివలెనే నటించును. అదియునుగాక వీరు నన్ను నమ్మరైరికదా యను నభిప్రాయము వారికిని గలిగించి నట్లగును.

తాత్పర్యము

శరభుఁడిట్లు చెప్పఁగా గుణవంతము దోషరహితమునగు మాటను జాంబవంతుఁ డిట్లు చెప్పెను. రావణుఁడు మనయందు మాత్సర్యముగలవాఁడు. విరోధమునే సాధింపవలయు నని కంకణము గట్టుకొన్నవాఁడు. అటువంటివానినివిడిచి వీఁడు వచ్చుటకుఁ దగినకారణము వీఁడు చెప్పలేదు. వీఁడు చెప్పినది నమ్మదగిన కారణము గాదు. అదియునుగాక వీఁడు వచ్చినది దేశకాలవిరుద్ధమైనది. మనమా లంకకు నూఱామడ దూరమున నున్నాము. మనముఖములు వారుచూడలేదు. వారి ముఖములు మనముచూడలేదు. మనవలన వారికివచ్చిన యుపద్రవములేదు. కావున నింత దూరము వెదకికొనుచు రాఁ గారణములేదు. అన్న తిట్టెను వచ్చితి ననెను. తన యెదుటికి రావలదనెనుగాని లంకలోనే యుండవలదనెనా? కావునవీఁ డింతదూరము రావలసిన పనిలేదు. వీఁడు వచ్చుటకిది తగిన కాలముగాదు. అన్నమాట తమ్ముఁడు వినవలయునా? తమ్ముని మాట యన్న వినవలయునా? తనమాట యన్న వినలేదని యతనియాపత్కాలములో విడిచివచ్చుట కాలవిరుద్ధము కావున మీ రీతని నమ్మరాదు

ఉ. మైందుఁడు నీత్యనీతుల స•మంబుగ బుద్ధిఁ దలంచి పల్కె ము
న్నిందు విభీషణుం దఱిసి ♦ ముచ్చట కీడ్చి తేనెమాటలన్
సందున రావణాసురుని•చందము మాటలపొం దెఱింగి మీఁ
దం దగు యుక్తముం జలుప ♦ దాశరథీ! ఖలుఁడే నదుష్టుఁడేన్. ౩౮౨

అర్థములు. జాంబవంతుఁడు చెప్పినమాట మైందుఁడు మెచ్చక యిట్లను చున్నాఁడు. నీత్యనీతులన్=నీతిని, నీతికాని దానిని, నమంబుగ బుద్ధిదలంచి యనుటచే జాంబవంతుఁడు చెప్పిన దానియందు నీత్యనీతులు సమముగా లేవని సూచన, తేనెమాటలన్ = తేనెవంటి తియ్యని మాటలచే, ఇది యుపమానపూర్వపదకర్మధారయము, ఖలుఁడేన్=దుష్టుఁడైనను, అదుష్టుఁడేని=దుష్టుఁడు కాకున్నను.

తా త్ప ర్య ము

జాంబవంతుఁడు చెప్పిన మాటలు విని మైందుఁడు నీతి యనీతులను సమముగా నాలోచించి యిట్లనియె. ముందుగా విభీషణుఁ జేరఁదీసి ముచ్చటలు పెట్టుకొని యా మాట ధోరణివలన రావణువిధము, వానివిషయమున వీని యభిప్రాయము నిజము దెలిసికొని దుష్టుఁడని తోఁచిన దండింప వచ్చును. శిష్టుఁడని తోఁచిన గ్రహింపవచ్చును.

తే. అంత సంస్కార సంపన్నుఁ ♦ డఖల మంత్రి
సత్తముఁడు నగు హనుమ ప్ర•శస్త ఫణితి,
నర్థవంతంబు మధురంబు ♦ నగుచుఁ బ్రియము
మితము నగు వాక్యములు పల్కె ♦ హితము దోఁప. ౩౮౩

అర్థములు. సంస్కారసంపన్నుఁడు = శాస్త్రమునందు చక్కని శిక్షయభ్యాసము గలవాఁడు, ప్రశస్తఫణితిన్=మెచ్చుకోనఁదగిన వాక్యములచే, అర్థవంతము=ప్రయోజనము గలది, మధురము = విననింపైనది, మితము = ఎక్కువ మాటలు లేనిది.

తా త్ప ర్య ము

ఇట్లందఱు చెప్పినపిమ్మట శాస్త్రజ్ఞానము శిక్షాపూర్వముగఁ దెలిసిన వాఁడును- మంత్రులందరిలో శ్రేష్ఠుఁడును, (ఇది సుగ్రీవుని నిషేధించు చున్నది) నగు హనుమంతుఁడు మెచ్చఁదగిన ప్రయోజనము గల తియ్యఁదనము ప్రియము హితము మితమునగు మాటల నిట్లనియె.

ప్రభువుగావున సుగ్రీవుండు చెప్పిన దానిని బూర్వపక్షము చేయక తక్కిన వారు చెప్పిన యాలోచనములు సరిగా దనుచున్నాఁడు. ఆలోచన సరిగా దనుచున్నాఁడే కాని యది చెప్పినవారిపేరు చెప్పలేదు. ఆలోచన దుష్టముగాని యాలోచన చెప్పినవాఁడు దుష్టుఁడు గాఁడని భావము.

—♦ విభీషణుని గ్రహింపవచ్చునని హనుమంతుఁ డభిప్రాయము దెలుపుట ♦—

క. మతిమంతులలో శ్రేష్ఠుఁడ, వతికుశలుఁడ వర్థముల మ♦హావాగ్మివి ని
న్నతిరేకించి వచింపఁగ, శతమఖు నాచార్యుఁడైన ♦ జాలఁడు రామా. ౩౫౦

అర్థములు. అర్థములన్ = ధర్మార్థకామమోక్షముల విచారణయందు; మహావాగ్మివి = మిగులఁ జక్కఁగ యుక్తియుక్తముగఁ జెప్పఁగలవాఁడవు; అతిరేకించి=అతిక్రమించి; సరిగాదని; శతమఖు నాచార్యుఁడు=బృహస్పతి.

తాత్పర్యము

రామచంద్రా! బుద్ధిమంతు లనిపించుకొనిన వారిలో నీవే శ్రేష్ఠుఁడవు. నీకు సమానులు లేరు, అధికులు లేరు, పురుషార్థముల నాలోచించి చేయుటయందు మిగుల నేర్పరివి. నీవుచేయు కార్యము పరులు మెచ్చునట్లు మాటలు యుక్తి యుక్తముగ శాస్త్రసమ్మతముగఁ జెప్పఁగల సామర్థ్యము గలవాఁడవు. నీవు చెప్పునది సరిగాదను టకు బృహస్పతి యైనను సమర్థుఁడు గాఁడు.

సీ. వాగ్వాదముల నేను♦వావదూకుఁడ నంచుఁ, దర్కనైపుణిఁ జూపఁ♦దలఁప లేదు
అన్యమతంబుల ♦ నణఁచి నా వాదంబె, గెలిపింప వలయు న♦ త్తలఁపు లేదు
ఎల్లవారలకన్న ♦ నేన మిన్నయటన్న, గౌరవంబును గాంచు ♦ కాంక్ష లేదు
నా వచోజృంభణ♦ మావిష్కృతము సేయ, నిది సమయంబంచు ♦ నెంచ లేదు
తే. దనుజునందలి పక్షపా♦తమునఁగాదు, త్వద్గురుత్వాప్తి నభిలాష ♦ వలనఁగాదు
రాజవల్లభ! దశరథ♦రాజతనయ, కలది వచియింతు శ్రీరామ! ♦గౌరవమున. స. ౩౫౧

అర్థములు. వాగ్వాదములను = పూర్వపక్ష సిద్ధాంతరూపముగా మాటలాడుటయందు, నేన = నేనే, వావదూకుఁడను=యుక్తిగా మాటలాడుటయందు సమర్థుఁడను, 'వాచోయుక్తిపటు ర్వాగ్మీ వావదూకోఽతివక్తరి' అమరము. తర్కనైపుణి = యుక్తి చమత్కారము, మిన్న = గొప్పవాఁడు, వచోజృంభణము = మాటల యుద్దండత, ఆవిష్కృతము=వెల్లడి, త్వద్గురుత్వాప్తి = నీ వలన గొప్ప వాఁడ ననిపించుకొనవలయు నను, గౌరవమున = (1) కార్యముయొక్క గొప్ప తనము వలన, (2) ఇన్ని దినములుగ నాయందు నీకుఁ గల గౌరవమున, కలది= వాస్తవము.

తాత్పర్యము

ఇతరుల యభిప్రాయముల ఖండించి నా యభిప్రాయము స్థాపించుటయందు యుక్తి యుక్తముగ మాటలాడఁ గల నని నా తర్కచాతుర్యము చూప నే నాలోచించినవాఁడఁ గాను. ఇతరుల యభిప్రాయములు తప్పనిపింపవలె, నాయభిప్రాయంబె స్థాపింపవలె నని యభిప్రాయము లేదు. తక్కిన యందఱికంటె హనుమంతుఁడు

బుద్ధిమంతుఁడు మంచి యాలోచన చెప్పును అని గౌరవమును సంపాదించుఁ గోరికయు లేదు. నేనుద్దండముగా మాటలాడఁగల నని నా గట్టితనము ప్రకటింప వలయు నని నే నెంచలేదు. వీఁడు లంకలో నాకనుకూలుఁడై పలికెను కావున వాని యందలి పక్షపాతముచే నేను జెప్పరాలేదు. నీ వలన నొక గౌరవము బిరుదు సంపాదింపవలె ననికాదు. రామచంద్రా! కార్యగౌరవమునుబట్టి నన్ను నీవు చూచు గౌరవమును బట్టియున్న వాస్తవము జెప్పెదను. సీతాదేవి వృత్తాంతము నేను నీకుఁ జెప్పినపుడు 'భృత్యకార్యము పవమానసుతుండు దీర్చెఁ బ్రశస్తవ్యగతిన్' అనియు, నే నుత్తమభృత్యుఁడ ననియు నీవే చెప్పితివి. నన్నుఁ గౌఁగిలించి గౌరవించితివి. అట్టి యుత్తమభృత్యుఁడను గౌరవము నేను బోఁగొట్టు కొనరాదు. కావునఁ జెప్పెదను.

తక్కిన వానరు లీ పీఠికయే లేక వారి యభిప్రాయము దెలిపిరి కదా. ఈయన కీ పీఠిక యేల? ఈయన చెప్పఁబోవునది తక్కిన యందర యభిప్రాయముతో విరోధించునది. అందఱు నొక్క విధముగఁ జెప్పిన దా నొకఁ డొక విధముగఁ జెప్పెనని తక్కినవారు లేనిపోని దురూహాలు పన్నఁ గారణము కలుగును విభీషణుఁడు తనకు లంకలోఁ జేసిన మే లిదివఱకే చెప్పియున్నాఁడు. ఆ పక్షపాతముచే నిప్పుడాయన కనుకూలుఁడై చెప్పెనే కాని కార్య మాలోచించి చెప్పలేదను దూఱు రాఁగలదు. అట్టి యభిప్రాయము లేవియు నాయందు లేవని ముందుగా జెప్పుకొనవలసి వచ్చెను.

తే. అర్థము ననర్థమును నారయంగ నీదు
సచివవర్యులు పలికిన చందములను
దోష మొక్కండు నా మదిఁ దోఁచుచున్న
దది గ్రహించుట కిపుడు సాధ్యంబు గాదు. ౩౫౨

అర్థములు. అర్థము = గుణము, అనర్థము = దోషము, అరయంగన్ = విచారింపఁగా.

మతఖండన కాలమందు వారి వారి పేర్లు చెప్పిన వారి వారికిఁ గోపము వచ్చును. అందు నంగదుఁడు యువరాజు. ఆయనకుఁ గోపము రాకుండుటకై యాయన పేరు చెప్పక సామాన్యముగ నందఱఁ గలిపి నీ మంత్రు లని చెప్పెను. అంగదుఁడు చెప్పిన దానిని ఖండించు చున్నాఁడు. విభీషణుని గ్రహించుటయందు గుణమును దోషమును నీ మంత్రివర్యులు చెప్పిన విధములందు నొక్కొక్క దోషము కానవచ్చుచున్నది. అంగదుఁడు చెప్పినది గ్రహింప నిపుడు సాధ్యపడదు.

క. పనులందు నియోగింపక, పనివానితనంబు తెలియఁబడదు తటాలన్
బనులందు నియోగించుట, యును దోషమ యనుచుఁ దోఁచె నుర్వీశవరా.

తాత్పర్యము

ఒకనిని బరీక్షించి చేర్చుకొనవలయు ననిన వానిని బనులందు నేర్పాటుచేయు చుండిన వాని గుణదోషములు తెలియవు. ఒకని గుణదోషములు తెలియక వానిని గొప్ప రాజకార్యములందు నెట్లేర్పాటుచేయ సాధ్యమగును? పనులందు నేర్పాటు చేసితిమా మనగుట్టు రట్టగును. కావున నిట్టిపరీక్ష సరిగాదు. (ఇది ౩౪౫ వ పద్యమునఁ జెప్పఁబడిన దాని ఖండనము) ఇందనోన్యాన్యాశ్రయత్వదోషముగలదు. పిచ్చి కుదిరినఁగాని పెండ్లికాదు. పెండ్లియైనఁగాని పిచ్చి కుదురదు. ఇట్టిది యన్యోన్యాశ్రయత్వము.

క. చారప్రణిహితమిపు డను,వారు ననుచు ననిరి యది నిరర్థక మగుఁ జా
దూరపుఁబనికిన్ వేగులు, చేరువల న్వార లేమి సేయఁగ వచ్చున్. ౩౫౪

అర్థములు. చారప్రణిహితము = వేగులవారి నేర్పాటు చేయుట; అనువారున్ = బాగుగనుండును. (ఇది ౩౪౬ వ పద్యము నందలి శరభుని మతము) అనునది వ్యర్థము=దానివలనఁ బ్రయోజనము లేదు. ఏలన దూరమున నుండువారి విషయమై విచారించి తెలుసుకొనవలయు ననిన వేగులు కావలయును. దానికి గాలము పట్టును. ఎదురుగానుండి యవునో కాదో యీ క్షణమందే ప్రత్యుత్తర మీయవలసిన సందర్భములందు వేగు లేమి చేయఁగలరు.

ఉ. ఈతఁ డదేశకాలముల నిం దరుదెంచె నటన్న మాటకున్
నా తలఁ పేమినా నసురనాయకు దౌష్ట్యము నీదు శౌర్యముం
జేతమునం దెఱింగి యిటు చేరె గుణోత్తరు నర్హవేళ నే,
యీతని బుద్ధికిం దగిన దియ్యదిగాదె? యదేశ మెట్లగున్ ? ౩౫౫

తాత్పర్యము

ఈతఁడు దేశముగాని దేశమునందుఁ గాలము గాని కాలమందు వచ్చె నన్న విషయములో (ఇది ౩౪౭ వ పద్యములోని జాంబవంతుని యభిప్రాయము.) నా యభిప్రాయమే మంటివా, రావణుఁడు సర్వరాక్షస నాశనకరమైన సీతాపహరణమువలన మరలనామె నీయమిని దుష్టుఁడనియు, ఖర వాలి వధచే నీవు శూరుఁడవనియు, విభీషణుఁడు చక్కఁగా నెఱిఁగినవాఁడే. కావున గుణములచే గొప్పవాఁడగు నిన్ను ఏ సమయమందుఁ జేరవలెనో యా సమయమందే, యే ప్రదేశమునఁ జేరవలెనో యా ప్రదేశమందే చేరెను. ఈతని సౌమ్యబుద్ధికిఁ దగిన దియ్యదియే. సముద్రము దాఁటిన తరువాత వచ్చియుండరాదా యందురేమో మనము నిన్న రాత్రి యిచ్చటఁ జేరితిమి. ఆ వార్త తెలిసి యీదిన ముదయమున రావణుఁడు సభ చేసెను. అందితనికి రావణునకు వాదప్రతివాదములు జరిగియుండును. వాఁడు దుష్టుఁడు గావున నీతని నవమానించి యుండును. మనము సముద్రము దాఁటు టెప్పుడో, అంతవఱకు లంక విడిచి యెందుండవలె. ఏమి చేయుచుండవలెను. ఉండిన

వచ్చుటనో లేక యిచ్చటనో యుండవలెను. అది విడిచెను గావున నిచ్చటికి వచ్చెను. సముద్రము దాఁటిన తరువాత వచ్చియుండిన నేనాఁడో యవమానించిన నీనాఁడేల వచ్చితివని మనమే యడుగమా? అప్పు డేమి చెప్పఁ గలఁడు ?

జాంబవంతుఁడు చెప్పిన యాలోచనమందు స్వరూపాసిద్ధి యను దోషము గలదు. చెప్పిన హేతువు సరి గానిచో స్వరూపాసిద్ధి యను దోష మగును.

ప్రతికూలునిపై దోషము దృఢపడినపుడే వానిని విడువఁ దగిన కాలము. అనుకూలునిపై గుణము నిశ్చయమైన యపుడే యాశ్రయింపఁదగిన కాలము. ఈ రెండు నిపుడే నిశ్చయము లైనవి.

శరణాగతికి దేశకాలనియమము లేదు.

"ప్రపత్తికి దేశనియమమును కాలనియమమును, ప్రకారనియమమును, అధికారినియమమును, ఫలనియమమును లేవు. విషయనియమమే గావలసినది" శ్రీవచన భూషణము.

ప్రతిపత్తియనఁగా:— భగవంతుని శరణుజొచ్చుట. దేశనియమ మనఁగా, పుణ్యదేశములయందుఁ జేయవలయును. తదితర దేశములందుఁ గూడదు అనునది, కాలనియమ మనఁగా వసంతాది కాలములందుఁ జేయవలయును, తదితర కాలముల యందుఁ జేయఁగూడదుఅను నియమము. ప్రకారనియమమనఁగా, స్నానపాదప్రక్షాళనాది పూర్వకముగఁ జేయవలయును. వేఱొకవిధముగఁ జేయఁగూడదు అను నియమము. అధికారినియమ మనగా త్రైవర్ణికులుగానే యుండవలయును, తక్కినవారు పనికిరారు అనునది. ఫలనియమ మనఁగా, దృష్టాదృష్ట ఫలములలో నీ ఫలమున కిదిసాధనము, వేఱొక్కఫలమున కిదిసాధనముగాదు అను నియమము. దేశకాలముల మంచిచెడ్డల మూలమున నొక యతిశయమునుగాని, నొకసంకోచమునుగానిపొందునట్టిది కానందునను, నదిలోదిగి స్నానముఁ జేయఁదలంచినపుడు అది యపరిశుద్ధమైనదా కాదా అనెడి వివక్ష లేకుండ దిగి స్నానముఁ జేయునట్లు స్వయముగఁ బవిత్రమై ఇది పరిశుద్ధము, అది పరిశుద్ధముకాదు అనెడి వివక్ష నెంతమాత్రము చేయనక్కఱ లేకుండ తనతో సంబంధించి యుండదగియున్నందునను, వర్ణాదులకనుగుణమైనదై యుండునట్టిదికాకుండ స్వరూపమునకనుగుణముగానుండునదియైనందునను, చేతనుల రుచికనుగుణముగా నానావిధ ఫలములకు సాధనభూతమైనందునను, ఈ నియమము లేవియు దీనికి లేవు. అది యెట్లనిన "న జాతిభేదం న కులం న లింగం న గుణక్రియాః న దేశకాలౌ నావస్థాం యోగో హ్యాయమపేక్షతే, బ్రహ్మక్షత్రవిశశ్శూద్రాః స్త్రియశ్చాంతరజాతయః సర్వఏవ ప్రపద్యేరన్ సర్వధాతారమచ్యుతమ్" సర్వమును ధరించి యుండువాఁడగు శ్రీమన్నారాయణునిశరణుజొచ్చువిషయమునజాతిభేదముగానికుల భేదముగాని,లింగభేదముగాని,గుణముకాని, క్రియలుగాని దేశకాలావస్థలుగాని యావశ్యకములుగావు. బ్రహ్మ,క్షత్రియ,వైశ్య,శూద్ర జాతులవాఅందఱును స్త్రీలును,

వీరిలో నంతర్గతములగు నితరజాతులవారును వీరు వారనక నందఱును శరణు జొఱవచ్చును. అని యిట్లు ప్రపత్తికి దేశకాలాధికారి నియమములు లేకుండుటను గుఱించి భారద్వాజ సంహితయందుఁ జెప్పఁబడినది మఱియు "ప్రపత్తేః క్వచిదప్యేవం పరాపేక్షా నవిద్యతే, సాహి సర్వత్ర సర్వేషాం సర్వకామఫలప్రదా" ప్రపత్తికి వేఱొక్కఁడాని యపేక్షలేదు. అది సర్వకాల సర్వావస్థలయందును అందఱకును అన్ని కోరికలను నెరవేర్చునది. అన్ని ఫలముల నిచ్చునది. అని ప్రపత్తికి ఫలనియమము లేకుండుటను గుఱించి సనత్కుమార సంహితయందును జెప్పఁబడినది.

(నదేశ ఇత్యాది) "బద్ధవైరాచ్చ పాపాచ్చ రాక్షసేంద్రా ద్విభీషణః, అదేశకాలే సంప్రాప్తః సర్వదా శంక్యతా మయం" (రా. యు. ౧౭-౨౬) బద్ధవైరుండును పాపియును నగు రావణాసురుని యొద్దనుండి విభీషణుండు కాలముగానికాలమునను తావుకాని తావునను మీయొద్దకు వచ్చియున్నాఁడు. కావున నీతని రాకను గుఱించి యనుమానింపవలసి యున్నది-అని యిట్లు జాంబవంతుఁడు శ్రీరామచంద్రునితో విన్నవింపఁగా దానిని దూషించుచు శ్రీ యాంజనేయుఁడు "అదేశకాలే సంప్రాప్త ఇత్యయం స విభీషణః। వివక్షాచాత్ర మేఽస్తీయం తాం నిబోధ యథామతి॥ నదేశ దేశకాలశ్చ భవతీహ యథాతథా, పురుషాత్పురుషం ప్రాప్య తథాదోషగుణావపి॥ దౌరాత్మ్యం రావణే దృష్ట్వా విక్రమంచ తథా త్వయి, యుక్త మాగమనం తస్య నదృశం తస్యబుద్ధితః" రావణునిచే నవమానింపఁబడి నైచ్యమును దలంచుచు శరణుజొచ్చిన శ్రీ విభీషణాళ్వారులు కాలముగాని కాలమున, తావుగాని తావున వచ్చినారని దేవరవారి మంత్రులు ఏదో చెప్పియుండిరి. ఈ విషయమును గుఱించి నేనొక్కటి విన్నవింపవలసియున్నది. వారు ఏకాలమున, ఏదేశమున దేవరవారిని శరణు జొచ్చిరో అందులకదియే దేశము, అందులకదియే కాలమని యేదో యొకవిధమున నాకు తెలిసినంతవఱకు నేను విన్నవించు దానిని కృపతో నాలకించుదురు గాక. అది యెట్లనిన తమోగుణస్వభావుండగుటచే పరహింసయే వృత్తినిగాఁ గలిగియుండు రావణుని కంటెను సత్త్వగుణ ప్రధానులగుటచే పరరక్షణమే వృత్తిగా గలిగియుండునట్టి దేవరవారిని ప్రాప్యులనఁగాఁ దలంచియు, రావణుని విడిచిపోక పోయినట్లయిన వాని యకృత్యములకుఁ దోడ్పడి వానికిఁగల ప్రాతికూల్యముతోఁగూడ నశించిపోవుట యనెడి దోషమును, ధార్మికులగు దేవరవారితోఁగూడ నుండినట్లయిన, అందులకు ఫలముగా దేవరవారి శ్రీపాదముల సన్నిధిని కైంకర్యము లభించి సుఖించుట యను సుగుణమును యోజించి దేవరవారి హృదయమునకు ఎక్కువ కష్టమును గలుగఁజేయునట్టి పాపంబులను లెస్సగాఁ జేసియున్నట్టి రావణుని దుష్టస్వభావమును, దుష్టులను అనాయాసముగ దండింపగల దేవరవారి పౌరుషమును యోజించినట్లయిన విశేషజ్ఞుఁడగువాని కిట్లు చేయుటయే యుక్తము, న్యాయమార్గమును సంచరించునట్టి వాని బుద్ధికిని యిది సరియైనది యనికదా చెప్పియున్నాఁడు కావున నిట్టిభావశుద్ధి గల

శ్రీవిభీషణులవారు శరణుజొచ్చినట్టి దేశకాలముల మంచిచెడ్డలను గుఱించి విచారింప నక్కఱలేదు. ఆయన వచ్చినకాలమే యందులకుఁ దగినకాల మనియు, ఆయన వచ్చిన తావే యందులకుఁ దగిన తావనియు శరణాగతి ధర్మమును గుర్తెఱింగినట్టి శ్రీ యాంజనేయులవారు నిర్ణయించుట జేసి ప్రపత్తికి, దేశకాలనియమములు లేవని యొఱుంగునది.

తే. పనిచి యజ్ఞాతరూపులౌ • వారి దేవ! ప్రశ్న యొనరింపఁదగు నని • పలుకఁబడియె
నీ విచారంబునందు నా • భావమునను, దోఁచుచున్నది యొక్కండు • దోషమధిప.

అర్థములు. పనిచి = పంపి, అజ్ఞాతరూపులు = తెలియఁబడని రూపము గలవారు, మాఱువేషములు ధరించినవారు. (ఇది మైందునిమతము. ౩౪౫ పద్యము)

తాత్పర్యము

కొందఱు చారముగఁ బంపి వారు మాఱువేషములతో వచ్చి విభీషణుని ప్రశ్నింపవలయు నను విషయమునందు నా కొక్క దోషము కానవచ్చుచున్నది.

చ. పరిచితి లేనివాఁ డొకఁడు • ప్రశ్నలు వేయఁ గడంగినంతనే
వరమతి యైన వానికి న • వశ్యము సందియ ముద్భవించి యే
వరుసనఁ జెప్ప నేమొ యని • పల్కు సదుత్తర మీక, దానిచే
దురితము లేని మిత్రుఁడును • దూషితుఁ డౌ సరిగాని ప్రశ్నలన్. ౩౫౭

అర్థములు. పరిచితి = పరిచయము, మైత్రి, వరమతి = బుద్ధిమంతుఁడు, ఏ వరుసన=ఏ విధముగ, సదుత్తరము=మంచి ప్రత్యుత్తరము, దురితము=దోషము, దూషితుఁడు దోషిగా నెన్నబడు వాఁడు.

తాత్పర్యము

పూర్వ పరిచయము లేని క్రొత్తవాఁడు తన్నుగుఱించి ప్రశ్నలు వేయఁబూనినచో బుద్ధిమంతుఁడు వానికి సదుత్తర మీయక యేమి చెప్పిన నేమో యని సందేహించి యెదుటివానికి వాస్తవము దెలియరాక, యర్థముగాక యుండునట్లు ప్రత్యుత్తర మిచ్చును. దానివలన వీఁడు సరియైన ప్రత్యుత్తర మీయలేదు. కనుక దోషి యని ప్రశ్న లడిగెడివాఁడు తలఁచును. ఈ విధముగ సంబంధములేని వక్రప్రశ్నలడుగుటచే నిర్దోషికూడ దోషిగానే యెన్నఁబడును. అడిగినవారి కందఱకుఁ దన విషయము తేటతెల్లముగ విప్పిచెప్పవలయు నని నియమములేదు. ఆప్తులకుఁ జెప్పఁ దగినవి యనాప్తులకుఁ జెప్పవచ్చునా? శత్రువులందు వారిలో వారికి భేదము పుట్టించి కొందఱఁ జీలఁదీసి మనలోఁ గలుపుకొనుటకు మనమే యత్నింపవలసి యుండఁగా వారిలో వారు కలహించి యొకపక్షమువాఁడు తానై వచ్చినను కొంటె ప్రశ్నలచే వానిని నిరాకరించుటవలన మిత్రలాభము చెడిపోవును. కావున నది నీతిశాస్త్రసమ్మతముగాదు. హనుమంతుఁడు లంకలో దండనీతి నవలంబించునప్పుడు చేసిన యాలోచన యిదియేకదా-అది కొంతకుఁ గొంత ఫలించెను. అట్లు చెప్ప

కుండినంత మాత్రమున వాఁడు దొంగ యగునా? మైందుఁడు చెప్పినదానియందు వ్యభిచరితదోషము గలదు. ఏ కారణమువలన సరియైన కార్యము కలుగదో విపరీత ఫలము గలుగునో యద్ది వ్యభిచరితకారణము.

ఉ. మాటలఁ దాన యెంతయు స♦మర్థుఁడనంచుఁదలంచువాఁడు ధీ
పాటవ మేర్పడం దనదు♦భావ మెఱుంగఁగనీక పల్కునా
మేటరి మాటకాని మది♦ మేర నెఱుంగఁగ లేఁడు నిక్క, మ
ప్పాటఁ దదీయయుక్తియు ని♦రర్థక మంచుఁ దలంతు రాఘవా. ౩౯౪

తాత్పర్యము

మాటలాడుటయందుఁ దానే నేర్పరియని తలంచువాఁడు బుద్ధిబలముచేఁ దన భావముఁ దెలియనీక పలుకువాని వాస్తవాభిప్రాయ మెఱుంగలేఁడు. కుట్రప్రశ్నలకు బుద్ధిమంతుఁడు కుట్ర ప్రత్యుత్తరములే యిచ్చును. అప్పుడు వాస్తవాభిప్రాయ మేమో తెలియరాదు. కాబట్టియా యుక్తియు వ్యర్థమనియే నాయభిప్రాయము.

ఉ. ఆతఁడు మాటలాడు నెడ♦ నారసి చూచిన దుష్టభావతా
రీతియునేని దోఁపదు గ♦రిష్ఠగుణాఢ్య! ప్రసన్నమా ముఖం
బీ తతి వంచకుం డితుల♦ నెంతయు నిబ్బర మూని రాఁడు శం
కాతురవృత్తి లేక, నుడిఁ♦ గానఁగరా దొక దోష మేనియున్. ౩౯౫

అర్థములు. దుష్టభావ రీతి=దురభిప్రాయము గలవాని విధము, తోఁపదు= కానరాదు, గరిష్ఠగుణాఢ్య = మిగుల గొప్పదగు గుణసంపత్తి గలవాఁడా! శంకాతుర వృత్తి లేక=సందేహము భయము లేక, నుడిన్=మాటలయందు, ఎదుటి వాని చిత్తవృత్తి తెలిసికొనుటకు శాస్త్రములందు- ఇంగితము- ఆకారము-చేష్ట- భావ యను నాలుగుపాయములు చెప్పఁబడెను. మాటలాడుట యందు దుష్ట భావము గానరాలే దనుటచే నింగితము, ముఖము ప్రసన్న మనుటచే నాకారము నిబ్బరముగ=నిస్సందేహముగ, నిర్భయముగా వచ్చినాఁడనుటచేఁ జేష్టయును, నుడి దోషము కానరా దనుటచే భావయు శుద్ధ మని చెప్పఁబడెను.

ఇతరులు చెప్పిన వానియందు దోషములు చెప్పితివే నీ యభిప్రాయ మే మందువా? చెప్పెద నని హనుమంతుఁడు తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఎదుటివాని మనశ్శుద్ధి తెలిసికొనుటకు శాస్త్రములందు నాలుగుపాయములు చెప్పఁబడెను. అవి ఇంగితము-ఆకారము-చేష్ట - భావ యనునవి. వీఁడు మాటలాడు నపుడు వీఁడు దుష్టభావము గలవాఁడు కాఁడని యింగితము తెల్పుచున్నది. ముఖము ప్రసన్నమై వికారములు లేకుండుటచే ఆకారము శుద్ధమనియేర్పడుచున్నది. మోసగాఁడు నిబ్బరముగ జంకు గొంకు భయము లేక రాఁడు, వీఁడు వచ్చినాఁడు, కావున చేష్టశుద్ధమని యేర్పడుచున్నది. మాటలయందుఁ దడఁబాటు పూర్వోత్తర

విరుద్ధములు సందిగ్ధములు గలవా యనిన నవిలేవు. కావున భాషాశుద్ధి గలదు, కావున వీఁడు నిర్దోషి యనియే నాయభిప్రాయము.

క. ఏ విధి గోరిన రూపం, బా విధి మార్పంగవచ్చు • నంతర్గత మా
భావంబు దాఁప శక్యమె? భావంబును బయలు పుచ్చు • వదనం బెటులేన్.

తా త్ప ర్య ము

నీ వింగితము, ఆకారము ప్రబల ప్రమాణములుగాఁ జెప్పుచున్నావే, భావ మొక విధముగా నుండిన ముఖనయనాదులు మఱియొక విధముగ నుండ రాదా యందురేమో, వాఁడు వాఁడు కోరినట్లు వేషమును మార్పవచ్చును గాని లోపలనుండు భావము బయట పడకుండ దాఁప సాధ్యపడదు. లోపలి భావమును ముఖ మేవిధముగనైన బయలు పఱుచుచుండును. (Face is the index of mind) అనఁగా ముఖము మనస్సుయొక్క విషయసూచిక యని సామెత గలదు.

ఉ. కావున సంశయింపఁ దగు • కారణ మేదియు లేదు, వీని స
ద్భావమునన్ గ్రహింపఁ దగుఁ బార్థివసత్తమ! దేశకాలముల్
భావనచేసి కార్యమును • బాగుగఁ జేసిన దత్ఫలంబు పెం
పొ వహిం వైశమబ్బు, మహా•త్మక! నీకు వచించువాఁడనే. ౩౬౧

అర్థములు. సద్భావమునన్ = మంచి యభిప్రాయముతో, దగ్గఱఁ జేర్చినఁ గీడు చేయునేమో యను సందేహము లేక, భావన చేసి = ఆలోచించి, పెంపు+ఒ+వహిన్ = వృద్ధిపొందు విధముగ, వైశము = శీఘ్రముగ.

తా త్ప ర్య ము

ఈ కారణములచే వీఁడు దుష్టుఁడని సందేహింప హేతువు కానరాలేదు. మంచి యభిప్రాయముతోనే చేరదీయవచ్చును. దేశము కాలము నాలోచించి కార్యమును జక్కఁగఁ జేసినచో ఫలముకూడ త్వరగానే వృద్ధిచెందును. వీనిని నిరసింపక చేర్చుకొనిన మేలుఫలము కనఁబడునుగాని కనఁపడకపోదు. మహాత్మా! నీకుఁ జెప్పగలవాఁడనా నేను?

ఉ. నీ మహితోద్యమంబు రజ•నీచర నాయకు దుర్నయంబు సు
త్రామసుతు వధించి కపి•రాజ్యము భాస్కరసూతి కిచ్చుటల్
తా మును విన్నవాఁ డగుటఁ • దానును రాజ్యము వేఁడుపొంటె నీ
తామహిశేశ! నీ యెడకుఁ • దారసిలె న్మతిపూర్వకంబుగన్. ౩౬౨

అర్థములు. నీ మహితోద్యమంబు=నీ గొప్ప ప్రయత్నము, వాలినిఁజంపుట, యింతసేన గూర్చుట, దండెత్తి వచ్చుట, సముద్రము దాఁట యత్నించుట యను ప్రయత్నము. దుర్నయంబు=దుర్నీతి, సుత్రామసుతున్=వాలిని, భాస్కరసూతికి సుగ్రీవునకు, వేఁడుపొంటె=ప్రార్థించుకొఱకు, తారసిలెన్=వచ్చెను, మతిపూర్వ

కంబుగ నీ=నిండు మనస్సుతో, ఇది రావణుఁడు పంపఁగా వచ్చినవాఁడు కాఁడని తెలుపుచున్నది.

తాత్పర్యము

హనుమంతా! ప్రయోజన మనుద్దిశ్య న మందోఽపి ప్రవర్తతే' ప్రయోజనము నుద్దేశింపక మందుఁడుకూడ నొక కార్యముఁ జేయఁడుకదా! వీఁడు బుద్ధిమంతుఁడని నీవు చెప్పుచున్నావే-వీఁడు ప్రయోజన ముద్దేశింపక వచ్చియుండఁడుకదా - ఆయుద్దేశ్య మేది యని నీ యభిప్రాయము. రావణాసురుఁడు చంపు నను భయముచే ప్రాణము కాపాడుకొనుటకై వచ్చెనా? ఎక్కడ నిలువ నీడలేక కొన్నాళ్ళిచ్చట నుంద మని వచ్చెనా? నీ యభిప్రాయ మేమందువా? నీవు చేయుచుండు గొప్ప ప్రయత్నము రావణుడు సీతాహరణాది నీతిమాలిన కృత్యంబులు చేయుట చూచి నీచే రావణుఁడు చచ్చు నని నిశ్చయించి నీవు పూర్వము దుర్నీతిపరుఁడగు వాలిని జంపి సుగ్రీవునకు రాజ్యమిచ్చినట్లు విన్నవాఁ డగుటచే నీవు రావణు జంపి రాజ్యమును దన కిమ్మని ప్రార్థించుటకై బుద్ధిపూర్వకముగ నీ యొద్దకు వచ్చె నని నా యభిప్రాయము.

ఇది హనుమంతుని యూహ. వాస్తవము హనుమంతునికిఁ దెలియదు. సీతాదేవి ప్రశ్నలకు సమయోచితముగ నమ్మఁదగిన విధముగఁ బ్రత్యుత్తరము లిచ్చినట్లు రామచంద్రమూర్తికిని నుండిన నుండవచ్చు నని నమ్మఁదగిన కారణము చెప్పెను. విభీషణు నభిప్రాయ మదియేని నీకు సాహాయ్యము చేసెదను, నాకు రాజ్య మిమ్మని విభీషణుఁడు బేరము పెట్టనులేదు, వెనుకనైన వేఁడను లేదు.

తే. దీని నంతయు యోజించి•వీని సాధు, గుణముఁ బలికితినాశక్తి•కొలఁది రామ
బుద్ధిమంతులలో నుత్త•ముఁడవు, నీవు శేష కార్యంబు నీవ యో•జింపవయ్య. ౬౬

తాత్పర్యము

ఈ విషయము లన్నియు నా బుద్ధిబలము కొలఁది నాలోచించి వీఁడు సాధువర్తనము గలవాఁడని చెప్పితిని- నీవు బుద్ధిమంతులలో నుత్తముఁడవు. ఇఁక జేయవలసిన కార్యము వీనిని జేర్చుకొనుటో విడుచుటో నీవే యాలోచింపుము.

అంగదాదుల వాక్యములవలన నూతనాశ్రితునియందుఁ బ్రాంతవారి (భాగవతుల) యభిప్రాయ మిట్టిదై యుండునని చెప్పఁబడెను.

హనుమంతుని వాక్యమువలన నాచార్య పరతంత్రుఁడై యుండువాఁడైనను నూతనముగ వచ్చిన యాశ్రితునియందుఁ దన తోడివారికి సందేహము కలిగ నేని భగవత్ప్రేమాతిశయమువలన నయ్యాశ్రితుని పక్షము వహించి మాటలాడుటయే యాచార్యునకుఁ బ్రీతిజనకం బగు నని యేర్పడుచున్నది.

౧౮-వ సర్గము శ్రీరాముఁడు కపులతో విభీషణుఁడు గ్రాహ్యుఁడని చెప్పుట.

ఉ. మారుతపుత్త్రుఁ డాడిన సమంజససూక్తుల నాలకించి దు
ర్వారమతిన్ సువిశ్రుతుఁడు రామవిభుండు ప్రసన్నచిత్తుఁడై
వారలతో నిజాశయముఁ బల్కె వినుండు హితేచ్ఛ లౌటచేఁ
గోరెద నీ విభీషణునిఁ గూర్చి వచింపఁగఁ గొంత నేనునున్. ౩౬౮

అర్థములు. సమంజస సూక్తులన్=న్యాయములోఁగూడిన మంచిమాటలు, హనుమంతుఁడు చెప్పినవి సమంజస సూక్తులనుటచేఁ దక్కినవారు చెప్పినవి సమంజసములుగావు. సూక్తులుగావని భావము. శరణాగతుని ద్రోచిపుచ్చుమనుట సమంజసముగాదు. నిర్దోషిని దోషియని దూషించుట సూక్తియుఁగాదు. దుర్వారమతిన్= అడ్డగింపరాని మనస్సుతో, వసిష్ఠాదులైన పెద్దలవలనఁ గపోతోపాఖ్యానము = కండూపాఖ్యానము, శిబి చరిత్రమును ఈ మొదలైనవి విన్నవాఁ డగుటచే శరణాగతుని విషయమున నడవడియందు దృఢపడిన మనస్సుగలవాఁడై సుగ్రీవాదుల మాటలకుఁ గలఁతచెందిన మనస్సుగలవాఁడు కాఁడయ్యెనని భావము, సువిశ్రుతుఁడు=చక్కని వినికిడిగలవాఁడు, ప్రసన్నచిత్తుఁడై = నిర్మలమైన మనస్సుగలవాఁడై, సుగ్రీవుఁడు మొదలు మైందునివఱకు నంద ఱేకవాక్యముగ విభీషణునికిఁ బ్రతికూలముగఁ జెప్పినవారే. వారిమాటలు విన్నప్పుడు ఏమిరా? వీరందరు నా యభిప్రాయమునకు విరోధముగఁ జెప్పుచున్నారే; ఇది కాదనిన వీరికందఱకుఁ గోపము వచ్చునో, అంతఃకలహము లే పుట్టునో యని వ్యాకులపాటు గలవాఁడగుటచే ముఖము ప్రసన్నముగా లేదు. హనుమంతుఁడు చెప్పినపిమ్మట నొకఁడైన ననుకూలముగఁ జెప్పెఁగదా యని ప్రసన్నుఁడయ్యెనని భావము. నిజాశయము=తనయభిప్రాయము, హితేచ్ఛలౌటచేన్=నామేలు గోరినవారలగుటచే, ఇది తాను జెప్పఁబోవువానివలన వానరులకుఁగోపము రాకుండుటకై చెప్పిన శాంతివాక్యము, నేనునున్=నేనుగూడ, మీరంద ఱెట్లు చెప్పితిరో యట్లనే నేనుగూడ నా యభిప్రాయముఁ జెప్పెదను.

తాత్పర్యము

ఆంజనేయుఁడు చెప్పిన న్యాయములోఁ గూడిన మంచిమాటలు విని యిట్టి సందర్భములందు శాస్త్రము లేమి చెప్పుచున్నవో, పూర్వు లెట్టు లాచరించిరో యది వసిష్ఠాది వృద్ధులవలన విన్నవాఁడై చేయవలసినపని నిశ్చయించుకొన్న రామచంద్రమూర్తి ప్రసన్నమైన మనస్సుగలవాఁడై వానరులతో నిట్లనియె. మిత్రులారా, మీ రందఱు నా మేలు గోరువారు. మీ మీ యభిప్రాయములఁ దెలిపితిరి. విభీషణుని గుఱించి నా యభిప్రాయమును నేను దెలిపెదను. అది మీరు విని యేది బాగని మనము నిర్ణయించెదమో యా ప్రకారమే చేసెదను.

తే. మైత్రి భావించి తాన సంప్రాప్తుఁడైన, వాని నెపుడేని చేపట్టువాఁడఁ గాను
వానియెడ నుండె నేని నేఁడేని దోష, మద్ది గర్హ్యంబు గాదు సద్వాళులకును.

తాత్పర్యము

ఇట్లు మంత్రులతో మంచిమాటలాడి తన కొక్క స్వభావసిద్ధమైన గుణమున్నదని చెప్పుచుఁ దనూఁలమున విభీషణుని గుఱించి స్వాభిప్రాయమును సహేతుకముగా వెల్లఁబుచ్చుచున్నాఁడు.

విభీషణుఁడు దుష్టుఁడు కాఁబట్టి యంగీకరింప రాదని సుగ్రీవాదులు చెప్పిరి. వారు చెప్పిన వానిలో హేతువును సాధ్యమును రెండును సరిగావు. విభీషణుఁడు నిర్దోషి కాన నంగీకార్యుఁడే యని హనుమంతుని యభిప్రాయము. దీని యందు సాధ్యముమాత్రము సరిగాని హేతువు సరిగాదు. కాఁబట్టి శరణన్నవానిని రక్షింపవలెననుటయే సహేతుకమై యుక్తమైన మాట. ఈ కడపటి యభిప్రాయమునందు విభీషణాంగీకారము సాధ్యాంశము. ఇది యబాధితమైనది. శరణుఁజొచ్చుట హేతువు. దీనికి స్వరూపాసిద్ధ్యాది దోషములు లేవు. అట్టి యీ హేతువునే మైత్రిభావించి యను వాక్యమునందుఁ జెప్పుచున్నాఁడు. మైత్రిభావించి=వాస్తవ మిత్రత్వము లేకున్నను మిత్రనటనమాత్ర మున్నను జాలుననియర్థము. "శరణవరణవాగియం హి యోదితా సభవతి బత సాపి ధీపూర్వికా యను పెద్దలమాట యిందుఁ బ్రమాణము. భావశబ్దమునకు లీల యనియు నర్థముగలదు. భావో విద్వల్లీలా స్వభావేషు భూత్యభిప్రాయజంతుషు" నానా॥ర॥ కావున భావించి యనఁగా నటించి యని యర్థము. ఈ ప్రకరణమునందు మొదట రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడనని యుండుట చేతను నిను శరణంబుజొచ్చితి నని పైని జెప్పఁబోవుటచేతను. నీవడుమనున్న యీ మైత్రిశబ్దము శరణాగతినే తెలుపునని యెఱుఁగునది. ఇట్లే సుందరకాండమునందును రాముతోఁ జెలిమికోరుమయని చెలిమి శబ్దముతో నుపక్రమించి శరణాగతవత్సలుఁడౌట నని శరణాగతి శబ్దముచే నుపసంహారము చేసియున్నది. ఇచ్చటను నుపసంహారానుగుణముగను నితర హేతువును బట్టియు నుపక్రమములో నున్న మైత్రి శబ్దము శరణాగతి పరమే యనియుఁ దెలియునది, లేదా యీ చేయునట్టికార్యము ఆశ్రయించువానికి శరణాగతిగాఁ దోఁచినను నట్లు లాశ్రయించిన వానిని దనతో పాటు చూచుకొనెడి భగవంతుని యభిప్రాయమున కిది మైత్రిగనే తోఁచును. కాఁబట్టి మైత్రి యని చెప్పెనని యైనను జెప్పవచ్చును. (2) మైత్రిన్ = స్నేహమును అద్వేషాభిముఖ్యములను భావించి మమ్ము నాశ్రయించువానికి అద్వేషాభిముఖ్యములే చాలును ఇంతమాత్రమునకే మే మతని నంగీకరింతుము. ఇందుకై పరిపూర్ణభక్తియు ననవసరము. అది లేకున్నను దప్పులేదని భావము. త్వామామనంతి కవయః కరుణామృతాబ్ధే, జ్ఞానక్రియాభజన లభ్య మలభ్య మన్యైః। ఏతేషు కేన వరదోత్తరకోసలస్థాః పూర్వం సమార్వమభజంత హి జంతవస్త్వా" మ్మను పెద్దలవాక్య మీ యర్థమునందుఁ బ్రమాణము. (3) మైత్రిన్ సుహృదం సర్వ

భూతానా మ్మని శాస్త్రములందు చెప్పియున్నట్లు నాకు జనులపైనున్న స్నేహ మును భావించి యిట్టి భగవంతుని స్నేహము మనకును గార్యకారి యగునని గదా యని యెంచి (4) మైత్రి భావించి = అనుకూల్య సంకల్పాదులఁ గలిగియుండి (5) మైత్రిన్=మితాత్+త్రాయతే మిత్ర మ్మని వ్యుత్పత్తి. ఒకఁడు తనకుఁ జేసిన యుపకారమును దన మనస్సున నిది యింతగదా యని నిర్ణయించి చూచి దానికిఁదగినట్లు వానికిఁ బ్రత్యుపకారము చేయువాఁడే మిత్రము. అట్టి వానిగుణము మైత్రి. అనఁగా నీశ్వరుఁడు తనకుఁ జేయు నుపకారమునకుఁ దగ్గట్లు ఈశ్వరు నికిఁ బ్రత్యుపకారము చేయుటయే యిచ్చట మైత్రి. భావించి=కల్గి (6) మైత్రిన్= నమ్మకమును. 'తన్మిత్రం యత్రవిశ్వాస' యను వాక్య మిందుఁ బ్రమాణము. భావించి=చెంది "తానిత్యాది." (1) తాన్+అసంప్రాప్తుఁడైన వానిన్ అనిపదచ్ఛే దము భగవంతు నాశ్రయించువాఁడు తా నున్న చోటనుండి శరణాగతి చేసినను జాలును. భగవంతుఁడున్న చోటికిఁ బోనక్కఱ లేదని భావము. (2) తాన+ సంప్రాప్తుఁడైనవానిన్, అనియుఁబదచ్ఛేదము, తానున్న చోటనుండియే భగవంతు నెడ నద్వేషాభి ముఖ్యములు చూపినవానిని "ప్రీహి రేపాహి మమాతులా"యన్నట్లు నేనే వెదకుకొని వానియింటికిఁబోయి రక్షించుచుండఁగా వాఁడే నా స్థలమునకు వచ్చి శరణన్న పిదప నేనెట్లు వదలవచ్చునని భావము. (3) సంప్రాప్తుఁడు= చెప్పులను గుడి వెలుపల విడిచిపెట్టి లోనఁబోయి దేవుని గన్నులతోఁ జూచుచు జెప్పులను ధ్యానించువానివాలెఁగాక యితర వస్తువులం దపేక్షయే పెట్టక "నియ్యర లంక సిరిం ద్యజితచిత్" నని యితర విషయ వైరాగ్యపూర్వకముగ వచ్చినవాఁడు. (4) "మాతా పితా భ్రాతా నివాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణ"యన్నట్లు నన్నే సకలవిధబంధువులుగ నెంచి వచ్చినవాఁడు. (5) నాకంతరంగులైన మిమ్ముఁ బుపకారముగా జేసికొనివచ్చినవాఁడు (6) తానసంప్రాప్తుఁడు=లంకలోనుండి శ్రీరాముని నేను శరణు జొచ్చినాఁడనని చెప్పెనేని వీనిని రక్షించుటకై నేను "అతంద్రిత చమూపతి ప్రహిత హస్త" మన్నట్లు యిచ్చటనుండి పరిగెత్తి పోవలసి యుండును. అట్లుగాక తానై మనయొద్దకువచ్చి శరణు చొచ్చుట గంగా నది తానై వచ్చి పడినట్లున్నది. ఇంత మనకు లాభము చేసినవాని నెట్లు వదలవచ్చు నని భావము. (7) వీఁడు నా యొద్దకు వచ్చినంతమాత్రానే వీనిని నేను తప్పక రక్షింతును. వీఁ డంతమాత్రముతో నిలువక మానసిక, వాచిక కాయిక, రూప మైన పరిపూర్ణ ప్రపత్తినే చేసినాఁడు. ఇట్లుండ నెట్లు వదలవచ్చునని భావము. ఈయర్థములు సంప్రాప్తశబ్దముతో సం అను దానివల్ల నేర్పడినవి. ఎట్లైనఁ జేపీడు వాఁడఁగాను. (1) నాకు వీనిని వదలుటకు శక్తి లేదు. నేను సర్వశక్తుఁడనై యుండియు శరణని చెప్పినవాని మాత్రము వదలుటకు శక్తిలేని వాఁడనై యున్నానని భావము. (2) సంప్రాప్తుఁడైన వానినిఁ జేపీడువాఁడఁగాను. "శరణాగత సస్యమాలినీయం

వృషశైలేశ కృషీవలం ధినోతి' యని పెద్దలన్నట్లు ఎవఁడైనను నన్ను రక్షింప గా వయ్యా యని పిలుచునా యని నేనెదురుచూచుచుండఁగా తానై నన్ను వెదకికొనివచ్చి నన్ను రక్షింపవయ్యా యని వేఁడుచున్న ఈవిభీషణుని నేనెట్లువదలుదునని భావము. (3) చేవీఁడువాఁడఁగాను వీనిసంబంధమునుబట్టి రావణాదులనుగూడ నేనురక్షింపవలె నని యుండఁగా వీనినేవదలుట యెట్లుసంభవించును. ఇందువలననే కదా ఘంటాకర్ణునికి మోక్ష మిచ్చునపుడు వాని తమ్మునికిఁగూడ మోక్షమిచ్చునదియు, మాలకారునిఁ గటాక్షించునపుడు వాని సంతతివారలకందఱకును దీర్ఘాయుస్సు కలుగునట్టు లాశీర్వదించుటయు నచ్చటచ్చటఁ జెప్పియున్నవి. (4) చేవీఁడువాఁడఁగాను= వీనిని త్యజింపవలెనని యాలోచనయు నాకు లేదని భావము. వీనినిఁ త్యజింపవలెనని యాలోచన నాకుఁ గల్గెనేని యా యుత్తరక్షణముననే నాసత్తకే హాని తటస్థించును. కాఁబట్టి వీనిని త్యజింపవలెననెడి యాలోచనమాత్రము నాకు లేదు. అట్టి యాలోచనయే లేనప్పుడు ఏకారణమునుబట్టి వీనిని వదలుదుమా యని కారణాకాంక్షయే నాకు సంభవింప నేరదని భావము. శరణాగతుఁడైన వీనిని త్యజింపవలె నని యాలోచించినపుడు మీకు సత్తాహాని కలుగునని వీని నంగీకరించుటయే యుత్తమమని మీకుఁ దోఁచినయెడల వీని నంగీకరించి తన్మూలమున వీని దౌష్ట్యముచే మీకే ప్రాణహాని సంభవించిన యెడల త్వదేకాధారకులైన మాకు సత్తాహాని కలుగునని పాటించి మాకై వీనిని వదిలిపెట్టవలసినదే యను వానరుల యాక్షేపమునకు సమాధానము. ఎటులైనను (1) ఈనినయావు అప్పటి దూడపై వాత్సల్యముచేత దానికి పెద్దదూడను గసరునట్లు వీనికై మిమ్మునుగూడ వదలవలసి వచ్చెనేని యదియుఁ జేయుదు నని భావము. ‘అప్యహం జీవితం జహ్యా’ మ్మని గదా నా స్వభావము. (2) సర్వదేశ సర్వకాల సర్వావస్థలందునైనను (3) శరణాగతునియందు గుణములు లేకున్నను, అంతియకాక వానియందు దోషములు మెండుగనున్నను, అట్టివానిని నంగీకరించుట యందఱ కసమ్మతమైయున్నను, తన్మూలమున దృష్టాదృష్టములందు నాకుఁ బెక్కు కీడులు సంభవింపనున్నను నాకే ప్రాణహాని సంభవింపనున్ననుగూడ నేను వీనిని వదల నని భావము.

ఇంతేకాక వానియెడ నేదేని దోష ముండెనేని (1) నాయభిప్రాయప్రకారము వీనియందుఁ దప్పులే లేవు. అస్థానభయశంకులైన మీకు వీనియందుఁ దప్పున్నట్లు తోఁచినను అట్టితప్పును నేనంగీకరించెదను, వాత్సల్యగుణ పరిపూర్ణుఁడైన నాకు నాశ్రితుని తప్పులుక్షమించివానిని మనస్సునకేరాకుండ జేసికొనుటయేగదా నాయందున్న వాత్సల్యము. (2) రాజకుమారుఁడు సుకుమారుఁ డయ్యును సువాసనయైన కురువేరు మున్నగు వేళ్ళ ననుభవించునపుడు వాని యందలి మట్టి ననుభవించునట్టులే కొంచెము మట్టి యున్నను ఆ కారణమున దానిని వదలనట్లు తలంచెనని భావము. (3) దోష ముండెనేని — శరణాగతునియందు దోషమే

యుండదు. "యథైకతూల మగ్నౌ ప్రోతం ప్రదూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే"యని శ్రుతి చెప్పినట్లు శరణాగతి చేసినవాని కేదోషము నుంటదని భావము. (4) ఏదేని దోష ముండెనేని యది వానియెడన్=వానిదిగదా! శరణాగతి యను గొప్ప గుణముగల వానియొద్ద నున్న దోష మెంతమాత్రమును గర్హ్యము కానేరదు. భగవంతుఁడు ప్రపన్నుని దోషమును భోగ్య వస్తువుగా గ్రహించునని యొక మతమువారు చెప్పుదురు. దీనికి వారు చెప్పెడి దృష్టాంతములు (౧) ఆవు దూడ నీనఁగానే దాని దేహమునందలి మురికి నాకుట (౨) రాజ కుమారుఁడు కురువేరులోనైన వేళ్ళు శిరస్సున ధరించునపుడు దానిలోనుండు మట్టినిగూడ ధరించుట. మఱియొక మతమువా రీ నిదర్శనములు భగవంతుఁడు దోషమును భోగ్యవస్తువుగా గ్రహించునని చెప్పుటయందు సమర్థములుగా వందురు. ఎట్లన:— ఆవు లేదూడ దేహమును నాకునపుడు ఆ మురికి భోగ్యవస్తు వని యాశచే నాకుట లేదు. తన బిడ్డయందలి మురికి పోఁగొట్టుటే దాని యుద్దేశము. ఆ మురికియున్న కారణముచే బిడ్డను విడనాడదు. అట్లే రాజకుమారుఁడు కురువేరు ధరించునపుడు అందలిమట్టి భోగ్యవస్తువనియా నెత్తిపైన బెట్టుకొనును. ఆమట్టిని అలక్ష్యముచేసి ఆ కారణమున వదలక కురువేరు ధరించును నసగూడి నార తల కెక్కిన దన్నట్లు పూలతోడ దారమును శిరసున ధరించువారు అది భోగ్యవస్తువనియా ధరించు చున్నారు? కావున భగవంతుఁడు ప్రపన్నుల దోషము లక్ష్యము చేయనివాఁడై ఆ దోషకారణమున వానిని రక్షింపక విడువఁ డని మఱికొందఱ యభిప్రాయము. రామచంద్ర వాక్యము రెండవ యభిప్రాయమును బలపఱచుచున్నది. శరణాగతుని దోషము గర్హ్యము కాదని చెప్పెనేకాని గ్రాహ్య మని చెప్పలేదు. దోషము లెప్పటికి దోషములే. అవి సుకృతములుగావు. సీతారాము లసత్య మాడిరి. అవి యసత్యములైనను "పంచానృతా న్యాహు రపాతకాని"యని వానివలన పాపము లేదని చెప్పఁబడెను, గాని సుకృతములు గావున గ్రాహ్యములని చెప్పఁబడ లేదు. చంద్రునియందలి కలంకము కలంకము గాకపోదు. ఆ కారణమునఁ జంద్రుఁడు నింద్యుఁడుకాఁడు. (5) వానియెడ నిత్యాది-ఉండ నిమ్మని శేషము. గుణవంతుని రక్షించినపుడు నాకంతగా గీర్తిలేదు. పరమదోషిని రక్షించినపుడేగదా నాకుఁ గీర్తి కలుగును. కాఁబట్టి శరణాగతునియందు దోషము నాకుఁ బ్రార్థనీయమే యని భావము. (6) వానియెడ నిత్యాది-ఏదేని దోష ముండెనేని, నాకును ప్రాణాపాయ కరమైన కార్యమేదైన నుండినను అనఁగా వీఁడు నా యొద్దనుండి నన్ను మోసముగాఁ జంపనెంచి శరణాగతుఁడు కానిచో నాయొద్దఁ జేరుట సంభవింప దని తలఁచి యందులకైన నన్ను శరణుఁ జొచ్చినను, వానియెడ నుండనిమ్ము. తన్మూలమున వానికైనను సుఖము కలుగునుగదా. అదియే నా కపేక్షితము అని భావము. ఈ యోజనను రాఁగల కపోతో పాఖ్యానమును జూచియతదనుసారిగాఁ బెద్దలు చెప్పిరి. (7) ఇ దింత ఘనకార్యమై యుండఁగా గొప్ప గొప్ప వీరా మంత్రులే

దీనిని దూషించుటకుఁ గారణ మేమియనఁగా నుత్తరము చెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది-అద్ది = ఆశ్రితునిదోషము, సత్ + అఖిలకు = గొప్పవారి సమూహమునకు, గర్హ్యంబు = నింద్యము; కాదు. మీ యందలి ప్రేమాతిశయము చేత నిష్కారణ భీతులై యున్న యీ మంత్రులవంటి వారి కదితప్పుగాఁ దోఁచినను గపోతము వంటివారి కదినింద్యమే కాదని భావము. (2) ఈదుష్టు నంగీకరించుటచే మీ కేమైన నొకపురుషార్థము రాఁగలదా? లేక యేదైనఁ గొంత పాపక్షయము కలుగఁ గలదా, లేక వీని నంగీకరింపని యెడల నేదైన ప్రత్యవాయము వచ్చునా? ఏదియు లేదు. అట్లుండ వీనిని నేలాభమునుబట్టి యంగీకరింపఁదలంచి యున్నారనుట కుత్తరము చెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది, అద్ది = దుష్టుని రక్షించుట. సదాఖిలకున్ = తమ ప్రాణములను దీయ వచ్చిన వానిని గూడ రక్షించినకపోతాదులకున్, గర్హ్యంబుగాదు=నింద్యముగాదు. కపోతాదుల వంటివారి సద్గోష్ఠియందు నాకు నింద లేకుండుటకై నేను వీనిని రక్షించెదనే గాని వేఱు ఫలము లేదని భావము. (3) దుష్టులను రక్షించిన వారిని శిష్టు లెప్పుడు గర్హింతురు. అంతియుకాక యీ కార్యము శాస్త్రవిరుద్ధము. ఇట్లుండ నీ కార్యమును నీవు చేయుట తప్పని వానరు లాక్షేపింపఁగా నుత్తరము చెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది-అద్ది=దుష్టుఁడు శరణన్న మాత్రాన వాని నంగీకరించుట. సదాఖిలకును = ఇది సామాన్యశాస్త్రము, ఇది విశేషశాస్త్ర మను జ్ఞానము కలవారికి, గర్హ్యంబు కాదు = నిందింపఁ దగినది కాదు. సామాన్యశాస్త్రములందు దుష్టుని రక్షింప రాదని యున్నను "తస్మా దపి వధ్యం ప్రపన్నం నప్రతిప్రయచ్ఛంతి" యని విశేష శాస్త్రముండుటం బట్టి సామాన్య విశేష శాస్త్రజ్ఞానముగల పెద్దలు, శరణాగతుఁడు కాని దుష్టుని రక్షింప రాదని సామాన్యశాస్త్రములకును, ఎంత దుష్టుఁడైనను శరణాగతుఁడైనచోఁ దప్పక రక్షింప వలసినదే యని విశేష శాస్త్రములకును నర్థము వర్ణించియున్నారు. కాఁబట్టి నే నీ శరణాగతుని రక్షించిన యెడల నాకు సామాన్య విశేషశాస్త్ర తాత్పర్య ముపదేశించిన వశిష్ఠ విశ్వామిత్రాదులైన పెద్దలు వారి యుపదేశాను సారము అనుష్ఠించి నందులకు నన్ను శ్లాఘింతురే గాని యేమాత్రమును దూషింపరు. ఇందు శాస్త్రవిరోధమును లేదని భావము. సర్వశక్తుఁడై యున్న భగవంతునికి శరణాగతులఁ ద్రోసివేయఁ జాలనట్టి యొక్క యశక్తి యున్నదనియు సర్వజ్ఞుఁడై యున్నను భగవంతునికి శరణాగతుని త్రోచివేయు నుపాయజ్ఞానము శ్రీరామునందుఁ లేకుండుటచేఁ గొంచె మజ్ఞానము గలదని గోవిందయతి యభిప్రాయము. నీవు శత్రువు తమ్ముఁడవు గావున నిన్ను నేను రక్షింపనని చెప్పుట కేయుపాయము తెలియవలెను? నిరాకరించియుండిన నీతిహీనుఁ డని లోకము నిందించి యుండదు. కాని శరణాగత రక్షణపరతంత్రు లగు మహాత్ములు తప్పక నిందించి యుందురు. శ్రీరామచంద్రమూర్తి విభీషణు నిరాక

రింపకుండుటకు భయార్తుఁడై వచ్చిన వానియందలి దయయు శరణాగత రక్షా వ్రతము కారణములు.

అహ మస్మ్యపరాధానా మాలయోఽ కించనోఽగతిః
త్వమేవోపాయభూతో మే, భవేతి ప్రార్థనామతిః। శరణాగతిః।

౧. నేను సమస్తాపరాధములను జేసినవాఁడను అని తా నంతవఱకుఁ జేసిన దోషముల నెఱిఁగి వానికై నిర్వేదపడుట.

౨. అకించనుఁడు = భగవత్ప్రాప్తిసాధనధనము కొంచెమైనను లేని దరిద్రుఁడు.

౩. అగతి = భగవంతుఁడుతప్ప మఱియొక రక్షకుఁడును, భగవత్ప్రాప్తి దప్ప వేఱొక ప్రాప్తియు, భగవంతుఁడు తప్ప భగవత్ప్రాప్తికి వేఱొక యుపాయమును లేనివాఁడు.

౪. నీవే నా కుపాయము గమ్ము అని ప్రార్థించు మనస్సు.

౫. దీనిని దేవుని సన్నిధానమందుఁ జేయవలయును.

ఇట్లు చేయువాఁడుగదా శరణాగతి కర్హుఁడు. విభీషణునకుం దీ గుణములు కలవా? కలవు.

రాక్షసుఁడును దుర్వృత్తుఁడు రాక్షసకులనాథుఁడైన రావణునకు నే సాక్షాదనుజుఁడ నని చెప్పుటచేత రాక్షసుఁడు కావున జన్మమువలన వచ్చిన దోషము, దుర్వృత్తుఁడైన రాక్షసనాథునకు భృత్యుఁడుగా నుండుటచే సాంగత్యదోషము, రావణునకు ననుజుఁడ ననుటచే సంబంధదోషము తనయందుఁ గలఁదని చెప్పినవాఁడయ్యెను. భార్యను బిడ్డలను లంకను సిరిని సర్వము త్యజించితి ననుటచే, తన్ను రక్షింపఁ గలవా రెవ్వరు లే రనుటచే ఆకించన్యము చెప్పఁబడెను.

అన్నకూడ నన్నుఁ జేయివిడిచెను. ఇక్కడకుఁ దప్ప మఱియొకచోటికిఁ బోవ స్థలమే లేదు. ఎవ్వరు నన్నుఁ జేరఁదీయువారు లేరు. కావున నగతికుఁడను. తండ్రితో సమానుఁడగు జ్యేష్ఠభ్రాత నన్ను రక్షింపవలసినవాఁడు వాఁడే నన్నవమానపఱిచి తిట్టి పంపెను. ఈ రాక్షసుని మఱియెవ్వరు దగ్గఱఁ జేర్తురు.

రామచంద్రుని శరణము చొచ్చితి ననుటచే నీవే నన్ను రక్షించు నుపాయమని చెప్పినట్టు లయ్యెను.

పాదంబులన్ శరణార్థియై పడెన్ = అనుటచే శరణాగతి దేవుని సన్నిధానమందు జేయవలసిన దన్న యర్థము చెప్పఁబడెను.

కాన శరణాగతున కుండవలసిన లక్షణములు విభీషణుని యందున్న వని యేర్పడెను.

సుగ్రీవాదుల యభిప్రాయమునకు ఖండన మీ పద్యమునం గలదు. విభీషణుఁడు రాక్షసుఁడు, రావణుని తమ్ముఁడుగాన వానిని గ్రహింపరాదని సుగ్రీవుఁడు వానియందు దోషము చెప్పెను. మీ యభిప్రాయమున నది దోషము, నా యభిప్రా

యమున నది దోషముగాదు. అది దోషమే యైనను శరణాగతునియందలి దోషము నింద్యముకాదు. ఆ దోష ముండిన నుండునుగాక. ఆ నెపముపెట్టి నేను రక్షింపక యుండరాదు అని ఖండనము అంగదుఁడు పరీక్షించి గుణవంతుఁ డైనయెడల గ్రహింపవచ్చును, దోషియైన వదలవచ్చుననెను. రామచంద్రమూర్తి శరణాగతుని యందు దోషమున్నదా యని పరీక్షయే చేయరాదనెను. గంగానదిలో స్నానము చేయఁదలచినవాఁడు దానిలో నడుగున బురదయున్నదని స్నానముమానవచ్చునా? హనుమంతుఁడు విభీషణుఁడు దుష్టుఁడు కాఁడు కావునఁ బరిగ్రహింపవచ్చు ననెను. పరిగ్రహింపవచ్చు ననుట గ్రాహ్యమే కాని దానికిఁ జెప్పినకారణము గ్రాహ్యము కాదు. శరణాగతుఁడు దుష్టుఁడైనను బరిగ్రహింపవలసినదే యని ఖండనము.

వానరు లందఱు చెప్పినది సామాన్యవిధి. రామచంద్రమూర్తి చెప్పినది విశేషవిధి యని యెఱుఁగనగు. కావున విశేషవిధి సామాన్యవిధిని బాధించును.

తాత్పర్యము

నిజమైన మైత్రికలవాఁడుకాని, మిత్రునివలె నటించువాఁడుకాని, సమీపించి రానీ, దూరమందేయుండనీ, శరణాగతుని విడువను. దానివలన నాకు మేలుగలుగనీ కీడుగలుగనీ వానియందేదేని దోషముండెనా యది సత్పురుషులు నిందింపవలసిన విషయముగాదు. ఆ నెపము పెట్టి శరణాగతుని ద్రోహిపుచ్చరాదు. అట్లు ద్రోహి పుచ్చితినేని నేను దుష్టులలో జేరుదును.

క. అను రాము భాషణంబులు, విని సుగ్రీవుండు దాని ♦ వెండి తలఁచి యి
ట్లను నిశ్శ్రేయసకరముగ, వినియోక్తుల రామచంద్ర ♦ విభునకు మైత్రిన్. ౩౬౬

అర్థములు. వెండి = మఱియును, తలఁచి = విమర్శించి, నిశ్శ్రేయస కరముగ = శుభము కల్గునట్లుగ, మైత్రిన్ = స్నేహభావముచే - నేను చెప్పినది కాదనెను జూచితివా యని విపరీతభావము లేనివాఁడై యని యర్థము.

తాత్పర్యము

ఇది నా స్వభావ మని రామచంద్రమూర్తి చెప్పఁగా నిట్టి స్వభావ మపాయ కరమైన సాహస మని యెంచి సుగ్రీవుఁడు భయపడి నీతిశాస్త్రప్రకారము దానిని విమర్శించి తప్పని తోఁచుటచే స్నేహభావముతో వినయముతో నిట్లు చెప్పెను.

ఉ. ఈతఁడు దుష్టబుద్ధి యగు ♦ నేనియు దుష్టుఁడె కాక యుండెనే
నీతనిచేతఁ గాఁగలుగు ♦ నెయ్యది యెవ్వని కౌను వీఁడు ? స్వ
భ్రాతను నిట్టి కష్టదశఁ ♦ బాసినవాఁ డెడఁబాయకుండునే
యే తఱి నెవ్వనిం ? బరుల ♦ కీతఁడు నాడుకొనంగ నేర్చునే ? ౩౬౭

తాత్పర్యము

రామచంద్రా ! విభీషణుఁడు దుష్టుఁ డని నే నంటిని. నా యభిప్రాయముచొప్పున దుష్టుఁడు గాఁ డని నీ వంటివి. ఆ విచార మట్లుండనీ. వీఁడు దుష్టుఁడే కాని

శిష్టుఁడే కాని వీని వలన మనకు రాఁగల లాభమేమి? నా యభిప్రాయ ప్రకారము దుష్టుఁడాయెనా యపాయము తప్పదు. నీ యభిప్రాయము సరియాయెనా భయము లేదు. అది యనుభవమువలనఁ దెలియవలసిన విషయము. వీఁ డెట్టి వాఁడైనను నెవరి కేమి సాహాయ్యము చేయఁ గలఁడు? తనకు మన వలన మే లున్నదని తోఁచినంత వఱకు మనతో నుండును. మేలు లే దని తోఁచెనా వెడలిపోవును. తన మేలుగోరి వచ్చినాఁడు గాని నిన్ను, నన్ను నుద్ధరింప వచ్చినవాఁడు కాఁడు. వీఁ డిట్టి వాఁడని నీకెట్లు తెలియు నందువా? ప్రాణాపాయమైన కష్టదశ ప్రాప్తించిన యిట్టి సమయమందు తండ్రితో సమానుఁడగు నన్నను వదలిపెట్టి వచ్చిన వాఁడు నిన్నువిడిచి పోకయుండునా? నిన్నే కాదు, నన్నే గాదు, ఎవరినైన వీఁడు వదలువాఁడే. ఎవరికిని వీఁడు సాహాయ్యపడువాఁడు కాఁడు. కావున నిష్ప్రయోజనమై, యపాయకరమైన కార్యము నీవు చేయవచ్చునా?

చ. అనవుడు రామభద్రుఁడు వ • నౌకసులం గని మందహాస మా
   ననము నలంకరింపఁ దగు • నర్మిలిఁ దమ్మునివంకఁ జూచి యి
   ట్లను ననధీతశాస్త్రుఁ డయి • యార్యుల వృద్ధులఁ గొల్వకుండినం
   బనుపడు నొక్కొ యిట్టి ప్రతి • భాయుతవాక్కుశలత్వ మేరికిన్. ౩౬౮

అర్థములు. వనౌకసులన్ = వానరులను, మందహాసము = చిఱునవ్వు, ఆననము = ముఖము, అర్మిలిన్ = ప్రేమచే, అనధీతశాస్త్రుఁడు = శాస్త్రము నధ్యయనము చేయనివాఁడు, పనుపడునొక్కొ=దృఢపడునా? ప్రతిభా=అప్పటి కప్పటికి వికసించు బుద్ధితో, యుత = కూడిన, వాక్కుశలత్వము=మాటల నేర్పు, ఏరికిన్ = ఎట్టివారికి.

తాత్పర్యము

ఈ ప్రకారము సుగ్రీవుఁడు చెప్పఁగా ధర్మసూక్ష్మముగాని, నాపరమశక్తిగాని నా శరణాగత రక్షణ వ్రతనిష్ఠగాని తెలియక యుక్తివాదము చేయుచున్నాఁడుగదా యని తనలోఁ దాను నవ్వుకొనుచు వానరులను లక్ష్మణునిఁ జూచి యిట్లనెను. లక్ష్మణా! యీ సుగ్రీవుఁడు శాస్త్ర మధ్యయనము చేయక యోగ్యులగు పెద్దల సేవింపక యుండెనేని యిట్లు సమయోచితముగ మాటలాడు నేర్పు దృఢపడి యుండునా? ఈ పొగడ్త బోరగిల ద్రోయుటకే వగచినట్లే యుండవలె, వాఁత పెట్టినట్లే యుండవలెను. పరుషముగా నీవుచెప్పినది తప్పు, ఆలోచన లేక మాట లాడుచున్నావనుట మర్యాదగాదు. కావున నిట్లు చెప్పుచున్నాఁడు.

ఇచ్చట లక్ష్మణునితో నీమాటలు చెప్పుటచేతను, ౩౬౭ వ పద్యమందుసుమిత్రాతనయు సమక్షమం దిట్లనియె నని చెప్పుటచేతను లక్ష్మణ సుగ్రీవు లేకాభిప్రాయము గలవారనియు నిరువురు విభీషణుని చేర్చుకొనవలదని శరణాగతి చేసి రనియు పూర్వ వ్యాఖ్యాతలు వ్రాసిరి. వారే ౩౧౮ వ పద్యంబున సలక్ష్మణుఁడౌ జనకసుతానాథుఁ

దున్న స్థలమునకు విభీషణుఁడు వచ్చెనన్న చోటఁ బురుషకార భూతుఁడైన లక్ష్మణుఁడని వ్రాసిరి. ఇది పరస్పర విరుద్ధముగాఁ గానవచ్చుచున్నది. శరణాగత లక్షణము రఘువంశసంభూతుల కులమర్యాదయనియు, రాముఁడు దానిని విశేషముగఁ బాటించుచున్నాఁడనియు లక్ష్మణుఁ డెఱుఁగఁడా? ఆ వంశమునఁ దాను బుట్టినవాఁడుకాఁడా? రామచంద్రమూర్తి కట్టివ్రతము లేదని యెఱిఁగియుండెనేని తా నెట్లు శరణాగతుఁడయ్యెను. వశిష్ఠాదులవలన రామచంద్రమూర్తి వినినంత తాను వినలేదా? అట్టి వాఁడు శరణాగతుని రక్షింపవలదని చెప్పునా? యని సందేహము. అపైన నేల సుగ్రీవునితోపాటు గుంజిళ్ళు పెట్టుచుండెననిన, సుగ్రీవుని కన్నీళ్ళు తుడుచుటకే. రాముఁడేమో యెవరెన్ని చెప్పినను తన వ్రతము మానఁడని లక్ష్మణుఁ డెఱుఁగును. సుగ్రీవునకుఁ దన విషయమున మరభిప్రాయము కలుగకుండుటకై యాయనకుఁ బ్రక్కగ నిలుచుండెను.

పూర్వవ్యాఖ్యాతల యభిప్రాయము ననుసరించితిమేని సుగ్రీవ లక్ష్మణుల శరణాగతి వ్యర్థమయినది. దానివలన నితర భాగవతులకు విరోధముగాఁ జేయు శరణాగతిని భగవంతుఁ డంగీకరింపఁ డని యేర్పడుచున్నది.

చ. కల దొక సూక్ష్మధర్మము ప్రకాశముగా నిఖిలావనీశులం
బలికెద వి న్మనంతరపు ♦ క్ష్మాపతు లేకకులోద్భవు ల్విరో
ధులు, వ్యసనంబు లొత్తుతఱి ♦ ద్రోహ మొనర్చుచునుంద్రు, గావునన్
లలితగుణా! విభీషణుఁడు ♦ న న్నిటఁ జేరఁగ వచ్చెఁ గానిచోన్. ౩౬౯

అర్థములు. సూక్ష్మధర్మము= ధర్మమునందు సూక్ష్మబుద్ధిచేఁ గ్రహింపవలసిన విషయము, ప్రకాశముగా=స్పష్టముగా, ఇది రహస్య విషయము గాదు. నిఖిలావనీశులన్=అందఱు రాజులందు సప్తమ్యర్థమున ద్వితీయ. కొన్ని యెడల నజడంబు తృతీయాసప్తములకును, బహుళంబున ద్వితీయ యగు. ప్రౌ. వ్యా. కా. ౧౮ సూ. "అనిన నలుగాలివానగోవును నశేష, శబ్దముల మంత్రమును లోహ జాతిఁగాంచనమును మనుజుల విప్రుండు సమధికత్వ, భాజనములంద్రు వేదప్రపంచ విదులు" భార శాంతి. ౧ ఆ. కలదు = ఉన్నది. ఊహ గాదనుట - అనంతరపు క్ష్మాపతులు = తమదేశమున కానుకొని పొరమేరలు కలియునట్లుండు దేశముల రాజులు, ఏకకులోద్భవుల్ = జ్ఞాతులు.

తాత్పర్యము

సుగ్రీవా! విభీషణుఁడు మనయొద్దకు వచ్చిన కారణము చెప్పెద వినుము. రాజులగు వారందఱియందు నొక సూక్ష్మధర్మము సుప్రసిద్ధముగాఁ గలదు. అది రహస్యవిషయముగాదు. ఏరాజుల రాజ్యముల పొలిమేరలు కలసియుండునో యెవ రొక వంశమునఁ బుట్టినారో వారు పగవారు. వీ రితరులకుఁ గష్టము వచ్చినపుడు పరస్పరము ద్రోహము చేయుచుందురు. కావున విభీషణుఁడు రావణుఁడు జ్ఞాతులు

కావున విరోధులే. ఆ కారణముచే వీఁడు మనయొద్దకు వచ్చెనుగాని, నీవు తలఁచి నట్లు రావణుఁడు పంపగా వానిమీఁది ప్రేమచే వచ్చినవాఁడు కాఁడు.

క. కలుషవిహీనాత్ములు తత్కులజులు స్వీయు లగు హితులకున్ గౌరవముం
గలిగింతు రైన నృపతులు, కలుషింతురు ప్రాయికముగఁ దగు నిర్మలులన్. ౩౨౦

అర్థములు. కలుషవిహీనాత్ములు = పాపములేని మనస్సుగలవారు, ఇట్లు చెప్పుటచే మీఁది పద్యంబునఁ జెప్పబడినవారు కలుషాత్మకులని గ్రాహ్యము తత్కులజులు=అవంశమునందుఁ బుట్టినవారు.

తాత్పర్యము

పాపవిచారములేని మనస్సుగల జ్ఞాతులు తమ వంశమందుఁ బుట్టి తమమేలు గోరువారికి గౌరవము గలిగింతురు. ఇది ప్రభువులుగాని వారు ప్రభువుల విషయమై నడచు విధము, మన యన్న ప్రభువైననేమి? నేనైన నేమి? యని యన్నకే యెక్కువ గౌరవము కలిగించుచుందురు. అట్లున్నను ప్రభువులు మాత్రము ప్రజ్ఞా శౌర్యసామర్థ్యములచే నిర్మల మనస్సుగల జ్ఞాతులందును దలఁచుగ ద్రోహబుద్ధి గలవారై వీఁడే వేళకు మనకేమి కీడు చేయునో యని యణఁగఁ ద్రొక్కఁజూచు చుందురు. అట్లు వారుండుటచే నిర్మలులైనవారును మనమెంత శుద్ధముగానున్నను మనలను నమ్మక వృద్ధికి రానీయకున్నాఁడు గదా యని వాఁడును కలుషితచిత్తుఁ డగును. అట్టులే విభీషణుఁడు నిర్మల మనస్కుఁడైనను రావణుఁడు దుష్టుఁడు కావున నీయనను సందేహించి యుండవచ్చును. ఇప్పుడు తన కేమి కీడుచేయునో యను సందేహభయములచే నీయనను వెడలఁగొట్టి యుండవచ్చును. విభీషణుఁడు వచ్చుటకుఁ గారణ మిది, కాని నీవు చెప్పినది కాదు.

చ. అరిఁ దను జేరనిచ్చు టనయం బని యూసితి వీవు, శాస్త్రస
త్సరణి వచించెద న్వినుము జ్ఞాతుల మెవ్వరుఁ గాము వానికిన్
స్థిరమతి రాజ్యకాంక్షఁ జనుదెంచినవాఁ డగు, వారిలోన నుం
డరె మతిమంతు? లట్టు లగుటన్ గ్రహియింపఁ దగు న్విభీషణున్. ౩౨౧

అర్థములు. అరిన్=శత్రువును, అనయము = నీతివిరుద్ధము, శాస్త్రసత్సరణిన్=నీతిశాస్త్రము నందుఁ జెప్పబడిన మంచిమార్గము.

వీఁడు మనకు శత్రువనియు, వీనినిఁ జేరనిచ్చిన మన కపాయము గలదనియు నది నీతిశాస్త్రవిరుద్ధమనియుఁ జెప్పితివి. నీతిశాస్త్రప్రకార మెవ్వరి కెవ్వరు విరోధులో చెప్పితివిగదా. వీనికి మన మెవ్వరము జ్ఞాతులముగాము. ఆకారణమున వానికి మనకు విరోధములేదు. రాజ్యవిషయమైన విరోధమును లేదు. హనుమంతుఁడు చెప్పి నట్లు వాఁడు రాజ్యము సంపాదించుకొనఁగోరి వచ్చియుండవచ్చును. అట్లు వచ్చిన వాఁడు మనకుఁ గీడుచేసెనేని తనపని తీరునే దానేకదా మన్ను వేసికొని రెంటను జెడిన

వాఁడగును. రాక్షసుల కీ మాత్రము తెలివి తేటలు గలవా యందువేమో, వారిలో మాత్రము బుద్ధిమంతులు లేరా యేమి? ఈ కారణమున విభీషణుని గ్రహింపవచ్చును.

ఉ. శూరులలోన హృష్టులును • శుద్ధమనస్కులు నైన వారిలో
వేరిమి యొక్క వేళఁ బ్రభ•వించును, గానని యిట్టి రచ్చ, త
త్కారణజాత మా వెఱపు • గల్గుట నీతఁడు చీలి వచ్చె న
న్జేరఁగ నిప్పు డట్లగుట•చే గ్రహియింపఁ దగు న్విభీషణున్. ౩౭ ౧

అర్థములు. వేరిమి=వైరము, ప్రభవించును=పుట్టున్, రచ్చ=కలహము, తత్కారణజాతము=ఆ కారణమువలనఁ గలిగినది, చీలి=వేఱుపడి.

తాత్పర్యము

ఇదివఱకు జ్ఞాతులలో నొకఁ డెక్కువ యొకఁడు తక్కువ. ఒకఁడు దుష్టుఁడు వేఱొకఁడు శిష్టుఁడు నగువారి విషయము చెప్పితిని. శూరులం దిరువురు సమానముగ సంతుష్టచిత్తులు నిర్మలులుగా నుండినను ఒక్కొకవేళ వారిలో వారికి విరోధము సంభవించును- అప్పుడే యిప్పుడు రావణ విభీషణులకుఁ గలిగిన కలహమువంటి కలహము కలుగును. ఆ కారణముగఁ గలిగిన భయముచే నీతఁడు వానితోఁ గలిసి యుండక వేఱుపడి నన్నుఁ జేరవచ్చెను. ఆ కారణముచే వీనిని గ్రహింపవచ్చును.

తే. భ్రాత లెల్లను భరతుని•పాటి గారు, జనకునకు నన్నుఁ బోలిన•తనయుఁ డున్నె
హితులయందును నీయట్టి•హితుఁడు, లేఁడు, తండ్రి! లోకంబునం దిది•తథ్యమయ్య.

తాత్పర్యము

రామచంద్రా! నీవు చెప్పినది భిన్నోదరుల విషయము. ఏకోదరుల విషయమున నట్టి కలహములు గలుగునా యందువేమో? గుణములు ప్రధానములుగాని యేకోదరత్వ భిన్నోదరత్వములు ప్రధానములుగావు. నీవు వాలి యేకోదరులే కదా, ఏల కలహించితిరి? భరతుఁడు నాకు సవతితల్లి కొడుకే కదా. తనకుఁ దండ్రి యిచ్చిన రాజ్యము నాకిచ్చుటకై యడవులకు వచ్చి యెంతో ప్రార్థించియు నేను గైకొనకుండఁగ నావలెనే వానప్రస్థునివలెఁ గాలము ద్రోయుచున్నాఁడే! న్యాయముగ నాకు రావలసిన రాజ్యము నాకీయకుండుటయే గాక నన్ను మా తండ్రి యడవులకుఁ బొమ్మనినఁ దథాస్తని వచ్చితినే! తండ్రి కిటువంటి కొడు కేఁడీ? నీ మాట ప్రకారము నీవు వర్షాకాలము దాఁటగానే రాకుండుటచే లక్ష్మణునిఁ బంపి తిట్టించినను నాయందు మైత్రి వదలవయితివి కదా! ఇప్పుడు నా యందలి ప్రీతిచేఁ గదా విభీషణుని జేర్చుకోవల దనుచున్నావు. నీ వంటి మిత్రుఁ డేఁడీ? కావున గుణములు ప్రధానములు, బంధుత్వము గాదు.

ప్రశంస రాజ్యవిషయ మగుటచేతను, లక్ష్మణునకు రాజ్యము లేకుంటచేతను, తమ్ముఁడు కుమారుఁడు సమానులు గావున ప్రత్యక్షమున బ్రశంసింప రాకుండుట

చేతను భరతుని పేరు చెప్పఁబడెను, నావంటికొడుకు లేఁడనుట యాత్మశ్లాఘకాదు. ఒక ప్రయోజనము నుద్దేశించి చెప్పవలసి వచ్చినపుడు జరిగిన విషయము నలువురకుఁ దెలిసిన విషయము చెప్పుట దోషముగాదు. వ్యర్థప్రగల్భములు దోషావహములు, యుద్ధములందు శత్రువుల భయపెట్టుటకై వీరులు తమ్ముఁ దాము పొగడుకొందురు. అది దోషముకాదు. దుష్యంతుఁడు శకుంతలను జూచినపుఁడు 'సతాంహి సందేహ పదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయ' యని తన్ను సత్పురుషుఁ డని యంతఃకరణశుద్ధి గలవాఁడనని చెప్పుకొనెను. అట్టులే యాంజనేయుఁడు సముద్రము దాఁటుటకు ముందు వానరుల యుత్సాహము నిమిత్తమై తన ప్రతాపము చెప్పుకొనెను. వీనియం దాత్మప్రశంసాదోషములేదు. కావ్యాదర్శమందు దండియు 'స్వగుణా విష్క్రియా దోషోనాత్ర భూతార్థశంసినః అపి త్వనియమో దృష్ట స్తథాత్వన్యైరుదీరణా' త్తని చెప్పెను.

జనకునకు నన్నుఁబోలిన తనయుఁ డనుటను మఱియొకవిధముగ విభక్తి మార్చి చెప్పవచ్చును. కొడుకును విడిచినంత మాత్రముననే ప్రాణము విడుచు తండ్రిగల వాఁడను నేనొక్కఁడుగాక మఱి యెవ్వఁడున్నాఁడు? నాయనా! లోకమునం దిది సత్యము.

క. అను రాముని వాక్యంబులు, విని లక్ష్మణుతోడ లేచి ♦ వినయంబు మెయిన్
దినకరతనయుఁడు ప్రజ్ఞా,ధనుఁ డిట్లను రామచంద్ర ♦ ధరణిపుతోడన్. ౩౭౮

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా విని బుద్ధిమంతుఁ డగు సుగ్రీవుఁడు లక్ష్మణుతోడ లేచి యుఁణఁకువతో నిట్లనియె.

క. రావణుని వేగువాఁ డని, భావింపు విభీషణున్ క్ష ♦ పాచరవర్యున్
గావున క్షమవద్వర! నీ, వే విధి నితనిన్ వధింప ♦ నెంచుట తగ వౌ. ౩౭౯

అర్థములు. క్షపాచరవర్యున్ = రాక్షసశ్రేష్ఠుని, క్షమవత్ వర=సమర్థులలో శ్రేష్ఠుఁడా? ఈ విశేషణము రామచంద్రమూర్తి చెప్పఁదలచినదానిని సమర్థించు నేర్పుగలవాఁడని తెలుపుచున్నది.

తాత్పర్యము

రామచంద్రమూర్తి తొలుత వీఁడు నిజముగ శరణాగతుఁడే కావున రక్షించుట యవశ్యకర్తవ్య మనెను. అది సుగ్రీవునకు నచ్చినదికాదు. ఆవల నీతిశాస్త్రప్రకార మిది యన్నదమ్ముల కలహము, అన్నతో వాస్తవముగ విరోధించి వచ్చెనని చెప్పెను. అదియు నాయనకు నరిపడినదికాదు, కావున నీ రాక్షసుఁడు వేగులవాఁడు. వీఁడు మోసగాఁడు. వీఁడు చెప్పునది సత్యముగాదు, కావున వీనిని సంహరింప నాలోచించుటయే తగిన కార్య మనెను.

ఉ. వచ్చినవాఁడు వీఁడు దశ•వక్త్రుఁడు వక్రపుబుద్ధిఁ బంపఁగా
నచ్చితి మేని మాయల నొ•నర్చి ప్రమాదపుబుద్ధి నుండగాఁ
గ్రచ్చఱ నన్నొ, నిన్నొ, మఱి • గాదిలితమ్మునినో వధించు నో
సచ్చరితా! యపాటఁ దగుఁ • జక్కడఁపన్ సచివాన్వితంబుగన్. ౩౨౭

అర్థములు. వక్రఁపుబుద్ధి = మోసబుద్ధి, నచ్చితిమేని = నమ్మితిమా చక్కడపన్=చంపఁగా, సచివాన్వితంబుగన్=మంత్రులతో.

తాత్పర్యము

వీఁడు మోసబుద్ధిచే రావణుఁడు పంపఁగా వేగులవాఁడై వచ్చినాఁడు నమ్మితిమా మన మేమఱి యున్నవేళ నేదో టక్కుచేసి నిన్నో, నన్నో, లక్ష్మణునినో చంపును. కావున వీనిని మంత్రులతోఁ జంపుటయే తగిన కార్యము.

క. అని మిన్నకున్న సుగ్రీవుని వాక్యము లాలకించి • పౌరిఁ జక్క విమ
ర్శన మొనరిచి శుభతరసూక్తిని సీతానాథుఁ డనియెఁ•గీశాగ్రణితోన్. ౩౨౮

అర్థములు. మిన్నక+ఉన్నన్=ఊరకుండఁగా, శుభతరసూక్తిని=మిగుల మేలైన మంచిమాటలను-నీతి బోధించుట యందు విభీషణ సుగ్రీవు లిరువురు సమాన స్కంధమునందే యున్నారు. విభీషణుఁడు నీవు సీతను మఱల నీయకుండిన నీవు చచ్చెదవు. బంధువులు చచ్చెదరు. లంకయుఁ బాడగునని రావణునితోఁ జెప్పెను. సుగ్రీవుఁడు నట్టులే విభీషణుని నీవు చేర్చికొంటివా, నిన్నే చంపునో, నన్నే చంపునో, లక్ష్మణునే చంపునో, కాకి గూబలను జంపినట్లు వానరుల నందఱఁ జంపునో? ఇట్లు తేరకుఁ జచ్చుటకా నీ వెంట వచ్చినది యని నిర్దాక్షిణ్యముగఁ జెప్పెను. ఇరువురు ప్రేమచేఁ జెప్పినవారే. సుగ్రీవుఁ డిట్లు చెప్పుటనే నిరవధిక స్నేహముఁగల వా రిట్టులే చెప్పవలయునని యేర్పడుచున్నది. మిత్రుఁ డిట్లు ఖండితముగాఁ జెప్పుటవలన నా యం దితనికి నెంత ప్రేమ లేనిదే యిట్లు నామాటకు విరుద్ధముగాఁ జెప్పునా యని రామచంద్రమూర్తి సంతోషించెను. దీనివలన నాయన యతిశయము బయలు పడెను. 'ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్' నా యంతరంగభక్తునకు నా యం దెంత ప్రేమగలదో యది నేనుగూడఁ జెప్పలే నని కదా కృష్ణభగవానులు చెప్పిరి.

ఇఁక రామచంద్రమూర్తి వాక్యములవలనఁ బ్రభువు తా నెంత నిర్వాహకుఁ డైనను తన మేలు కోరి చెప్పువారు తనకు విరుద్ధముగాఁ జెప్పినను వారిని ధిక్కరింపక తనయభిప్రాయమున వారు కలిసివచ్చునట్లు తగినకారణములు చెప్పి యంగీకరింపజేవలయు ననియు, విరోధాభిప్రాయ మిచ్చినంత మాత్రము చేతనే శత్రు వనియు రావణునవలెఁ దలంపరాదనియు నేర్పడుచున్నది. ఇట్టి నిరవధిక స్నేహము గలవారే నాకుఁ బ్రియులు. "సచ మమ ప్రియ" యని కదా కృష్ణ భగవానుఁడు చెప్పెను. "ప్రియతమ ఏవహి వరణీయో భవతి" ఇట్టి ప్రియతములే యభిమానపాత్రులగుదురు-అని చెప్పఁబడెను. భగవంతునకు వరణీయుఁ డగుటచే

భగవంతుఁడే స్వప్రాప్తిని దానే కలుగఁజేయుచున్నాఁడని భావము. కావుననే కదా తాను పరమపదమునకుఁ బోవునపుడు పిలిపించి కూడఁబిలుచుకొనిపోయెను.

తాత్పర్యము

అని చెప్పి యూరకుండఁగా సుగ్రీవుని మాటలు విని రామచంద్రమూర్తి యిదివఱకుఁ జెప్పిన నీతిశాస్త్ర వాక్యముల కంటె మేలైన దానిని జెప్పుచున్నాఁడు. మైత్రి భావించి యెవఁడు వచ్చినను నేను జేర్చుకొనెద నని రామచంద్రమూర్తి చెప్పెను.

ఇది కేవలము రాముని సాహస కార్యమే కాని దానికిఁ బ్రమాణవాక్యములు గాని, శిష్టానుష్ఠానముగాని లేదని సుగ్రీవుఁడు దాని నిరాకరించెను. ఇప్పుడు శరణాగతి ధర్మశాస్త్ర వాక్యముల పూర్వుల యనుష్ఠానముఁ జెప్పి సుగ్రీవు నంగీకరింపఁ జేయుచున్నాఁడు.

—శ్రీరాముఁడు సుగ్రీవునకు శరణాగతరక్షణం బవశ్యకర్తవ్యంబని చెప్పుట—

ఉ. ఈతఁడు దుష్టబుద్ధి యగు • నేనియు దుష్టుఁడె కాక యుండె నే
నీతని చేతఁ గాఁగలుగు • నెయ్యది? యొక్క రవంతయేని వాఁ
డే తఱినేని కీడు ఘటి•యింపఁగ శక్తుఁడు గాఁడు మామక
వ్రాతము లందు నా యొకఁ, డి•వాకరనందన! నన్ను నమ్ముమీ. ౩౭౮

అర్థములు. మామకవ్రాతములందు=నా వారియందు, అనఁగా సీతకుఁగాని లక్ష్మణునకుఁగాని వానరులం దెవ్వరికిఁగాని యని యర్థము.

తాత్పర్యము

సుగ్రీవా! వాఁడు దుష్టుఁడు, మనలో నెవ్వరికైన నేదైనఁ గీడు చేయునని యేల భయపడెదవు. వాఁడు దుష్టుఁడుకానీ, కాకపోనీ, వాఁడేమి చేయఁగలఁడు? మనము హెచ్చరికగా నుండినను, హెచ్చరిక తప్పియుండినను నిద్రపోవుచున్నను, నాకుఁగాని నావారికిఁగాని, వారివారికిఁగాని, యెట్టి కీడు చేయుటకు వాఁడు సమర్థుఁడు గాఁడు. నా మాట నమ్ముము. నేను బ్రగల్భములు చెప్పువాఁడను గాను. ఎంత చెప్పెదనో యంతయు జరగవలసినదే.

క. ఈ నిఖిలావని యక్షుల, దానవరక్ష•పిశాచ•తతులను వలతేన్
భానుజ! యంగుళికొనచే, నే నిమిషములోనఁ జిమ్మ•నే మిత్తిఁ గనన్. ౩౭౯

అర్థములు. నిఖిలావనిన్ = సమస్త భూమియందు, వలతేన్ వలయునేని (౧) చేయవలసిన పని పడెనేని (౨) నాకు సంకల్పము కలిగినయెడల అంగుళి కొనగూడ నక్కరలేదు. సంకల్పముచేతనే చంపనా? అంగుళి = వ్రేలి; మిత్తిఁ గనన్=చచ్చునట్లు.

తాత్పర్యము

మనము నిద్రపోవునపుడు వాఁడు రాక్షసుల నందఱను బిలుచుకొనివచ్చి కాకులు గూబలను జంపునట్లు జంపునని కదా నీ భయము. ఒక రాక్షసులనే కాదు. లంకలోనుండువారిని మాత్రమే కాదు, ఈ భూమిమీఁద నెందఱు యక్షులదానవుల రాక్షసుల పిశాచుల గుంపులుగలవో యందరు కలసివచ్చినను దేహమంతతోఁ గాదు- రెండుచేతులతోఁగాదు- ఒక చేతియంతతోనుగాదు- అన్ని వ్రేళ్ళతోను గాదు- ఒక వ్రేలితోనుగాదు- ఒక వ్రేలి కొనచేఁ నొకసారిగఁ జచ్చునట్లు లంద ఱను మీఁటి పాఱవేయనా? వీరిని జంపుటకు నా కాయుధము సేనలు కావల యునా? వ్రేలికొనయు నక్కఱలేదు. నా సంకల్పముచేతనే చంపఁగలను. వీని యన్న కుబేరునితోఁ జెప్పుకొని యక్షుల నందఱను, వీనిమామ మయునితోఁ జెప్పి దానవుల నందఱును, వీని స్వాధీనమం దుండు వీని తల్లివంక రాక్షసులను, వీనికి వరమిచ్చిన శివుని పరిచారకులగు పిశాచముల నందఱను బిలుచుకొనివచ్చినను వ్రేలితో మీఁటి పారవైచెదను. అటులైన నిందఱు వానరులకు నీకు నాకీ కష్టమేల? లంకలోని రాక్షసుల మీఁటరాదా యందువా? విభీషణునివలె మనయొద్దకు రాకు న్నను, లంకయందు మనయందుఁ బ్రతికూల భావము లేని వారెందఱున్నారో? వారుగాక ముదుసళ్ళు బాలురు స్త్రీలు లేరా? వారి నందఱ నొకటిగాఁ గలిపి యెట్లు చంపుదును? కావున మనమీఁదికిఁ బ్రత్యక్షముగా వచ్చినవారిని మాత్రమే చంపఁదలఁచితిని. కావున వీఁడు మనతోఁ బ్రతిఘటించి పిలుచుకొని వచ్చినా అప్పుడు వారందఱు ప్రత్యక్షవిరోధి సమూహము గావునఁ జంపెదను.

ఈ సందర్భమున నీ వాక్యంబులు స్మరణీయములు. "విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితో జగత్" కార్యకారణ రూపమైన యీ ప్రపంచము నంతయు నాయొక్క యంశముతో నిలుపఁబెట్టి యున్నాను. భ. గీ. ౧౦-౪౨.

'యస్యాయుతాయుతాంశాంశే విశ్వశక్తి రియం స్థితా' వి.పు. ఎవనియొక్క పదివేల పదివేలవ భాగములో నీ ప్రపంచశక్తి నిలిచియున్నదో,

'కిం స్విద్వనం, క ఉ సవృక్ష, ఆసీద్యతో ద్యావాపృథివీ నిష్టతక్షుః మనీ షిణో మనసా పృచ్ఛతేదు తద్యదధ్యతిష్ఠ ద్భువనాని ధారయన్' శ్రుతి. ఇల్లు కట్టుటకు స్తంభాదులు కావలెఁగదా! ఆసామాను యేవనములోని యే వృక్షము నుండివచ్చెను? అట్లులే యీ భూమ్యాకాశములను బ్రపంచసృష్టికిఁ గావలసినది యే వనమునుండి యే వృక్షమునుండి వచ్చెనో మేధావులారా! చక్కఁగాఁ బ్రశ్నింపుఁడు. మఱియు నీ ప్రపంచమును నేది యెందుండి ధరించుచున్నది అదియు నడుగుఁడు. వనము సమిష్టి ప్రపంచము. వృక్షము వ్యష్టిరూపము. ఈ ప్రశ్నము నకుఁ బ్రత్యుత్తరము బ్రహ్మవనము బ్రహ్మవృక్ష మని ప్రత్యుత్తరము. పెద్దవన ములో నొక వృక్ష మెట్టులో యీ ప్రపంచము భగవంతున కట్టి దని భావము.

మ. వినవా మిత్రమ బోయవాఁ డొకఁడు పృ ♦ థ్వింగూల్చి స్వప్రేయసిన్
దన ప్రాణంబులు పెన్బుభుక్ష నడలన్ ♦ రక్షార్థియై చేరినం
దన మాంసంబు లొసంగి వానికిఁ గపో ♦ తం బాతనిం గాచెఁ గా
ననచారీ! శరణాగతు న్విడుచుటల్ ♦ న్యాయంబె నాబోఁటికిన్? ౩౮౦

అర్థములు. స్వప్రేయసిన్=తన భార్యను, పెన్‌బుభుక్ష = గొప్పయాఁకలిచే, రక్షార్థియై=రక్షణము కోరినవాఁడై, కపోతంబు=పావురము, కాననచారీ = అడవులందుఁ దిరుగువాఁడా! (౧) పావురము అడవియం దుండునదే, నీవు నడవియం దుండువాఁడవే, ఆ పక్షికున్న తెలివి నీకుండఁ బనిలేదా? (౨) కనఁబడిన మృగమును జంపి తినుటే స్వభావముగా గల యడవి మృగములలో దిరుగువాఁడవు. జీవి రక్షావిషయము నీకేమి తెలియును. వీని వలన నాకేలాటి కీడు రాదని యింతవఱకుఁ జెప్పెను. ఒకవ్వుడు వీఁడు మోసగాఁడై యుండి నా ప్రాణహాని సంభవించునట్లు దుర్మార్గము చేయనున్నను నేనేమో వీని నుపద్రవ పెట్టను, ఏమాత్రము వదలను, తప్పక యంగీకరించి రక్షింపవలె ననియే యున్నాను అని కపోతోపాఖ్యానముచే విశదపఱచుచున్నాఁడు. (౧) వినవా – యనుటచేత నీకథ మిక్కిలి ప్రసిద్ధమని భావము. (౨) వినవా యనుటచేత నిది యందఱు వినవలసినదేగాని యెవ్వరును ననుష్ఠింప లే రనుట సూచితము. (3) ఈ శరణాగత రక్షణ చరిత్రము శ్రుతివంటిది యనియు భావము. బోయవాఁడొకఁడు వీఁడు పక్షికి సహజశత్రువు. ఇట్టి వానినిగూడఁ గపోతము రక్షించినది. విభీషణుఁడు మనకు సహజశత్రువుగాఁడు. అట్టుండ నతనిని రక్షింపకుండుట యెట్లనిభావము. బోయవాఁడు పక్షికి సహజశత్రు వగుటయేకాక,పృథ్వింగూల్చి స్వప్రేయసిన్-ఇట్టి భార్యానాశకునే కపోతము రక్షించినది.విభీషణుఁడు తానై మనకెటువంటి తప్పును జేయకున్నను భార్యాపహారి యూరినుండి వచ్చినాఁడన్నమాత్రమున మనము వానిని వదలిపెట్టుట యుక్తమా యని భావము. భార్యాపహారి యైన రావణుఁడు వచ్చినను, మనము తప్పక రక్షింపవలెననుట యీ పదముచేత సూచితము బుభుక్ష = ఆఁకలి, రక్షార్థియై – 1. "సాంజలిం శిరసా బద్ధ్వా వాక్య మాహ వనస్పతిం, శరణం హి గతోఽస్మ్యద్య దేవతా మిహ వాసినీ మ్మని యాకపోతమున్న వృక్షములోని దేవతను దన్ను రక్షింపవలెనని ప్రార్థించువాఁడై – ఇంతియుగాని కపోతము తన్ను రక్షింపవలెనని యపేక్షతో వచ్చినవాఁడు కాఁడు. విభీషణుఁ డన్ననో యట్లుగాక రఘురాక్షస సంవాదము నందలి శరణాగతి రక్షణమును జ్ఞప్తి పెట్టుకొని యా వంశము లోని నేను నాకూటస్థుఁడైన రఘువువలె శరణాగతుని రక్షింతు నని యెంచి నను శరణుఁ జొచ్చినట్లు 'రఘుస త్తముతో'నని మీతోఁ జెప్పిపంపినాఁడుగదా.

2. రక్షార్థియై=తనతల దాఁచుకొనవలెనని యొక చెట్టునీడ నపేక్షించినవాఁడై; చేరినన్ = కపోతము వసించెడి చెట్టునొద్దకు రాఁగా, కపోతము బోయవానిని

రక్షించినందులకు హేతువు బోయవాడు కపోతవాస వృక్షమును సమీపించుటయే. వాడు చెట్టులోని దేవతతోఁ జెప్పుకొన్న శరణాగతివాక్యమును గపోతమే మాత్రమును వినలేదు. కాన నది హేతువు కానేరదని యీ పదము చేత సూచితము. తన మాంసంబు లొసంగి వానికిన్-సహజశత్రువై భార్యాపహర్తయై యున్న యీ బోయవాని కాపద వచ్చినపు డాకపోతము చావనీ యీ ముండ వాడని యుపేక్ష యైనను జేయవలెను. లేదా వానిని జంపుటకు యత్న మైనను బడవలెను. ఈ రెండు విధములునుగాక యింటికి వచ్చిన యతిథిని దేవతగా భావింపవలెనను శాస్త్రము ననుసరించి వాని నొక దేవునిగా భావించి యది శీతకాలము కాన శీత నివారణార్థము వానికి గుంపటి తెచ్చి యిచ్చి మఱియు షోడశోపచారంబులును జేసి తన కొరకై సంపాదించి తెచ్చిన వస్తువులను బెట్టి యంతటితోఁ గాని లేదా. తన యంగములలోని కొంతమాంసము పెట్టి యంతటితోఁగాని వానిని బంపివేయవలె నని యెంచక నిష్కల్మషమైనబుద్ధితో వాని యాఁకలి తీఱునంతవఱకును దన దేహము నిచ్చివేసినది. ఈ కపోతోపాఖ్యాన కథ భారతమున శాంతిపర్వంబున ౧౪౩వ యధ్యాయమునఁ గలదు. అజ్ఞు లందఱును శరీరమునే యాత్మగా భావించి దానియందు విశేషాభిమాన ముంతురుగదా! ప్రాజ్ఞులు గూడ "శరీర మాద్యం ఖలు ధర్మసాధన" మ్మని యం దభిమాన ముంతురు గదా. అట్టి తన శరీరమును గూడ నీకపోతము దీనిని వీనికిఁ బచ్చిగ నిచ్చినచో వండుకొనవలసిన శ్రమము వీనికిఁ దటస్థించు నని యెంచి యాశ్రమమును లేకుండునట్లు శరభంగ మహర్షివలె 'ఇదమేకం మహత్తప' యన్నటు తానై నిప్పులోఁబడి పచనమై వానికిఁ దృప్తికరమైన మాంస మాయెను. మన మన్ననో "సచ్చరితా యబాటఁ దగుఁ జిక్కుడుపన్ సచివాన్వితంబుగ" న్ననికదా వీనిఁ దృప్తిపఱచుచున్నామని భావము.

కపోతంబు=నావలె ధర్మానుష్ఠానయోగ్యమైన వంశము నందును బుట్టినది గాదు. శరణాగతరక్షణమే బిరుదుగాఁగల వంశమునందును బుట్టినదికాదు. ధర్మానుష్ఠానానధికారియైన యొక తిర్యగ్జాతిలోనిదని భావము. ఇంతటిహీనజాతియే శరణాగత రక్షణము చేసినప్పుడు మనకేమి చెప్పవలసియున్నది. సహాయములేని యీ కపోతమే శరణాగత శత్రురక్షణము చేసినపుడు సహాయ సంపన్నుఁడైన నేను శత్రుభిన్నమై శరణాగతుఁడైన వీనిని రక్షింపవలెననుట కేమి చెప్పవలసియున్నదని యేకవచన తాత్పర్యము.

అతనిన్=ఈ బోయవానికి జాతియుహీనము, నడతయు నట్టిదే. మఱియు "పక్షిణాం కాలసమ్మిత" మన్నట్లు పక్షిజాతికి సహజవిరోధి. వీనియందు రక్షణార్హమైన గుణ మేదియులేదు. అంతియేగాక విపరీతగుణంబులును గలవు. అనుతాపము కొంచెమైనను లేదు. ఆంతరముగా ననుతాపము లేకున్నను నట్టి నటనయు లేదు. అంతియకాక యాఁకలిచే నల్లాడుచువచ్చి యాచెట్టుక్రిందఁబడెనేకాని యా పక్షికి

శరణాగతుఁడై యచ్చటికి రాలేదు. ఇట్టి వానినిగూడఁ గాఁచెను. తన శరీరమిచ్చి యాఁకలితీర్చి రక్షించెను. ఈ కపోతము శ్యేనకపోతోపాఖ్యానమందలి కపోతము వలె గపోతరూపముఁదాల్చిన యొక దేవతగాని,ఋషిగానికాదు. వాస్తవకపోత జాతిలోనిదే. అట్లయ్యుఁ బురాతన సుకృత విశేషమునుబట్టి గజేంద్రాదులకువలె నింతజ్ఞానసంపత్తియు, నింత ధర్మానుష్ఠానయోగ్యతయుఁ గల్గినవని యెఱుఁగునది.

కాననచారీ=వానరమా, కపోత జాతిలోని తిర్యక్కువలె వానర జాతిలోని మఱొక తిర్యక్కును నొక వ్యాధుని రక్షించెను. నీవు నాజాతివాఁడవుగా నుండియు, మఱి యాజాతికి రాజుగా నుండియు నీ వ్యాధ వానరకథను వినలేదా, వినియు ననుష్ఠింపకుండెదవే యిదియేల యని భావము. ఒక యడవిలో నొక వానర మొక వృక్షముపై నుండఁగా నొకపులి యొక బోయవానిని దఱుముకొని వచ్చెను. వాఁడు దన ప్రాణరక్షణార్థమై యా చెట్టునే యెక్కెను. అప్పు డా చెట్టుపై కెక్కిన యా బోయ నా వానరము బాధింపక రక్షించెను. ఆపైనా పులి వానిని భక్షింపవలె నని యా చెట్టుక్రిందఁ గాచుకొని యుండెను. అంత నావానరము నిద్రపోయెను. పులి యా వానరముచేత వానిని సులభోపాయమున భక్షింపనెంచి నీ వానరమును బడఁ ద్రోయుము. నేను దానిని భక్షించిపోయెదను. ఆపై నీ ప్రాణములు సురక్షితము లగునని యా బోయవానితోఁ జెప్పెను. పాపియైన యా బోయ తన్నిది రక్షించి నదిగదా యని యెంచక యా వానరమును బడఁద్రోసెను. అంత నాపులి మనుష్య మాంసమును గోరి వచ్చినది కాన వానరమును జంపక దానితో నిట్లనియె. నిన్నుఁ జంపక వదలెదను. అందులకై నాకొక యుపకారము చేయుము. నీ వొనర్చిన యుపకారమును భావింపని బోయవానిని బడఁద్రోయుము. వానిని భక్షించి నేఁ బోయెదను.నీవు సురక్షితముగ నుండుము.ఆపదయందబద్ధము తప్పుకాదని భావించిన యా వానర మట్లేయని యంగీకరించి వ్యాఘ్రము వదలిపెట్టఁగాఁ జెట్టునెక్కి యీ బోయవాఁడు ఇపుడు నన్నుఁజూచి భీతిల్లి యిందుండిపాఱిపోవీలులేక యగతికముగ నిందే మిణకరించుచు నున్నాఁడు. ఇట్టి యనాథను నేనెట్లు ద్రోయుదు నని యెంచి రక్షించెను. శరణాగతు న్విడుచుటల్ న్యాయంబె నాబోఁటికిన్ (౧)ఇట్టి కపోతాది చరిత్రములను వినియున్న నాబోంట్లకును శరణాగతత్యాగము యుక్తమా యని భావము.(౨) నాబోఁటికిన్-శరణాగత రక్షణ బిరుదాంకిత వంశమున జనించిన నావంటివానికి(3)"షష్టిర్వర్షసహస్రాణి లోకస్య చరతాహితం। పాండరస్యాతపత్రస్య ఛాయాయాం జరితం మయా" యన్నట్లు అఱువది వేలేండ్లు లోకరక్షణ దీక్షితుఁడై యున్న దశరథుని పుత్రుఁడై వసిష్ఠ విశ్వామిత్రాదుల శిష్యుఁడై యోగిజనాగ్రేసరుఁడైన జనకమహారాజున కల్లుఁడై 'రామో విగ్రహవాన్ ధర్మ'యని ప్రసిద్ధుఁడై "మర్యాదానాం చ లోకానాం కర్తా కారయితా చ స"యన్నట్లు లోకసంగ్రహార్థమై ధర్మానుష్ఠానపరాయణుఁడై యున్న నేనిట్లు శరణాగతుని రక్షింపకుంటినేని

తక్కిన వారా ధర్మమేమని యాచరింతురు. (ర) నామాట యటుండనిమ్ము 'ధర్మ సేతు ర్నృపాణా'మ్మని మావంటి వారందఱును నొప్పుకొన్నట్టిదిగదా యీశరణాగత రక్షణధర్మము (౫) నా వంటివాఁడు శరణాగతుని రక్షింపకుండునా? దుర్మార్గులైన రావణాదులకుఁగదా యట్టి కార్య మిష్టపడును అని భావము.

తా త్ప ర్య ము

మిత్రుఁడా! నీ వీ చరిత్రము వినలేదా యేమి? ఇది ప్రసిద్ధమైనదే. ఒక పావురము తన భార్యను బోయవాఁడొకఁడు చంపి తన ప్రాణంబు లాఁకలిచేఁ దపించుచు రక్షణము గోరి తానున్న చోటికి రాఁగా నా మగపక్షి తన మాంసమును వాని కాహారముగా నిచ్చి రక్షించెను. అడవి ద్రిమ్మరీ! పక్షియే యట్లు రక్షింపఁగా శరణు అని వచ్చిన వానిని వదలిపెట్టుట నా యట్టి వానికి ధర్మమా?

క. మును కణ్వసుతుఁడు కండుం, డను పరమతపోధనాఢ్యుఁ • డాడిన గాథల్
 విను మతిధర్మిష్ఠంబులు, వినతనయా! సత్యవాక్సు•హితమును వినుతున్. ౩౮౧

అర్థములు. పక్షిజాతి శాస్త్రోక్తమైన ధర్మానుష్ఠానమునకు అధికారి గాదు. అట్లుండనట్టి పక్షి యనుష్ఠానము మనకెట్లుపాదేయమగును. మఱియు విధి శాస్త్రమునందుఁ జెప్పబడినదే ధర్మమని మీమాంసకులు చెప్పుదురు. పైఁ జెప్పిన కార్యము ఏవిధిశాస్త్రమందుఁ జెప్పియుండుటంబట్టి మనము ధర్మమని తెలిసికొనవలయును? ఆ విధిశాస్త్రమేది? యని యాక్షేపించుకొని కండు మహర్షి గాథలందు విధి యుండుటచేత మనకిది ధర్మమైయనుష్ఠేయమైనది యనుచున్నాఁడు. కణ్వసుతుం డనుటచేత మహావంశోత్పత్తియు, పరమ తపోధనాఢ్యుఁ డనుటచేత సమస్తాంశములను గూర్చియు యథార్థదర్శనమును, ఇతని గాథకుఁ జెప్పిన సత్యవిశేషణము చేత సత్యవాదితయు నీ కండుమహర్షికిఁజెప్పినట్లాయెను. ఈ గుణములచేత నితఁడు పరమాప్తుఁ డని యిందు స్పష్టమైనది. కాఁబట్టి యితని గాథ వేదవాక్కు వంటి దనిసూచితము. మును ఆడిన గాథల్-ముందున్న వేదవాక్యమునే యితఁడుగాథగాఁ జెప్పెనని భావము. గాథల్=అనేకార్థములుగల్గి అభ్యసించుటకుసులభముగాఁగొలఁది పదంబులఁగూర్చి యేర్పఱిచిన పద్యములు-అతి ధర్మిష్ఠంబులు=వేదమునఁ జెప్పఁబడిన ధర్మములవంటి ధర్మమును జెప్పునవి. అనఁగా స్మృతిరూపంబులు - సత్యవాక్కులును+సుహితములును=నిజమైనసంగతిని దెలుపునవియు, మేలైనవియునగు గాథల్ వినుతును విను మని యన్వయము. ఇంతకు ముందుండి యన్నిమాటలను వినుచున్న సుగ్రీవుని గూర్చి యీ మాటల నట్టనడుమ వినుమని మరలఁ జెప్పినందుల కేమి కారణ మనఁగా-ఇంతకు ముందు రాముఁడు చెప్పిన మాటలను వినియు సుగ్రీవుఁడు వానియభిప్రాయమును జక్కఁగఁ దెలిసికొనక పోవుటచేత నా ప్రకారము నడచుకొనక, తప్పుటాక్షేపణలు చేయుచున్నాఁడు. ఇఁకనైనను నట్లుచేయక వాఁడు

జాగ్రత్తగా విని మనస్సునందలి సందేహముల నన్నిటిని దీర్చుకొనవలెనని రాముఁడిచ్చట శ్రద్ధతో వినుమని చెప్పెను.

తాత్పర్యము

పూర్వము కణ్వమహర్షి కుమారుఁడైన కండుమహర్షి గొప్ప తపస్సంపద గలవాఁడు చెప్పిన పద్యములుగలవు. అవి మిగుల ధర్మస్థాపనము చేయునవి, యథార్థములైనవి - మేలిచ్చునవి - వానిని జెప్పెదను. చెవి మనస్సు నిచ్చి వినుము. (౩౮౨-౩౮౩-౩౮౪-౩౮౫ పద్యము లీ విషయమును దెలుపును.)

తే. కరములను మోడ్చి దైన్యంబు ♦ కడలుకొనఁగఁ
    జేరితిని నీదు మఱువు ర♦క్షింపు మనుచుఁ
    బ్రార్థనము సేయువాఁ డరి ♦ యైనఁ జంప
    రాదు కరుణాగుణావనా♦ర్థంబు గాఁగ.

కండుమహర్షి చెప్పిన గాథలు నాలుగు- వానిలో మొదటిగాథయందు-పరిపూర్ణమైన శరణాగతి చేయుటకు నొకనికి వీలులేకపోయినది. వాఁడు తన రక్షకుని గూర్చి శరణాగతి యంగములలోఁ జేరిన యంజలి బంధమో, మఱేదైన నొక యంగమున మాత్రమో చేసెను. ఆ చేసినకార్యములయందే వాఁడు తన రక్షణ భార మంతయుఁ దన రక్షకునియందే యుంచినట్లు సూచన యున్నదిగదా, కాఁబట్టి వాఁడు పరిపూర్ణశరణాగతి చేయలేదని వానిని వదలిపెట్టరాదు. వాస్తవముఁగ దయను బాటించు రక్షకుఁడైనచో నట్టి వానిని దప్పక రక్షించు ననుచున్నాఁడు. కరములను మోడ్చి = అయ్యా నిన్ను నేను శరణుఁ జొచ్చినానని చెప్పఁకొనుటకు వాగింద్రియము స్వాధీనత తప్పియున్నను అంజలిమాత్రము చేసినను జాలును. "అంజలిః పరమా ముద్రా క్షిప్రం దేవప్రసాదినీ"యన్నట్లు స్వతంత్రుఁడై యున్న భగవంతునికి వేగిరము దయ పుట్టించునదిగదా యీ యంజలిముద్ర. దైన్యంబు కడలుకొనఁగన్ = అంజలి చేయుటకు హస్తములు స్వాధీనత తప్పియున్నను దన దీనస్థితి చూపునట్లు వాఁడు వెలవెలఁ బోవుచుండినను జాలును. చేరితి నిత్యాది - నీదు మఱువు=నీ యాశ్రమమునందు; అంజలి చేయుటకు వీలులేకపోయినను దైన్యము చూపలేకపోయినను మనస్సునం దాతనిని దనకురక్షకునిఁగాఁ బ్రార్థించినను జాలును. అరియైనను=తనకు సాక్షాచ్ఛత్రువైనను, ఇట్లు అంజల్యాదులు చేయుచున్నను ముందున్న శత్రుత్వము ప్రకృతి సంబంధమునుబట్టి మరలననువర్తించినను జంపరాదు ఇట్టివానిని జంపరాదని యీ శాస్త్రము చెప్పుట యిహలోక సౌఖ్యార్థమా, లేక పరలోకసౌఖ్యార్థమా, కానిచో బాపాపనోదనార్థ మా యని యాశంకించుకొని యివి యేవియుఁగావు; తనకున్న దయాగుణసంరక్షణార్థమని ప్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు కరుణా గుణావనార్థంబుగాఁగ="ఆనృశంస్యం పరోధర్మ"యనిగదా సీతావాక్యము.

తాత్పర్యము

రెండుచేతులు జోడించుకొని, దీనత్వ మతిశయింపఁగా నీ మఱుఁగు చేరితిని, నన్ను రక్షింపుమని కోరువాఁడు తనకు శత్రువైనను మఱి యే కారణముచేతఁ గాదు, శరణాగుణమును రక్షించు నిమిత్తమై వానిని జంపరాదు. కాపాడవలయును.

తే. పరులకును శరణాగతుఁ డరియయైన, నార్తుఁడైనను మఱి దృప్తుఁ డైనఁ గాని
యాత్మనాశంబునకు నోర్చియైనఁ గావ, వలయు శాస్త్రసువిశ్వాసభావులకును

అర్థములు. ఒకఁడు తానై సాక్షాత్తుగా శరణాగతుని హింసింపఁ బోఁగా వాఁడట్టి కార్యమును జేయ రాదని పూర్వపద్యమునందు నిషేధించినాఁడు. పరుఁడు హింసించుచున్నను శరణాగతునిఁ దన ప్రాణముల నాశింపక రక్షింపవలెను. అపుడా శరణాగతుఁ డార్తుఁడా, దృప్తుఁడా యని విచారము పెట్టుకో రాదని యీ పద్యమునందుఁ జెప్పుచున్నాఁడు. శరణాగతుఁ డరియైనను=ద్వేషము మనస్సునఁ బెట్టుకొని పైకిమాత్రము శరణాగతి శబ్దము చెప్పుచున్న వాఁడైనను, అట్లు కాక ఆర్తుఁడైనను=(1) తానే ఫలము నుద్దేశించి శరణాగతి చేసెనో యా ఫలమునకై త్వరపడు వాఁడైనను (2) తాఁ జేసిన తప్పులను దలఁచుకొని తలఁచుకొని భయపడు వాఁడైనను, దృప్తుఁడైనను=(1) మన శరణాగతి ఫలము నేఁడుగానీ, చిరకాలమునకుఁగానీ యెప్పుడైనను రానీ యని త్వరలేనివాఁడైనను, (2) తన తప్పులకై భీతిల్లక తనకు వినయము లేదనియు జంకక యున్నవాఁడైనను మోక్షార్థమై శరణాగతుని విషయమున నీ పదములకు సమన్వయ మెట్లనఁగా, ఆర్తుఁడు = (1) సంసార మసహ్యముగాఁ దోఁచి దేహ మెపుడు వదలునా యని త్వరపడుచుండువాఁడు (2) తనకొక గుణమును లేదనియు మోక్షార్థమై దానొక యుపాయమును ననుష్ఠింప లేదనియుఁ దలఁచి తన యాకించన్యానన్యగతికత్వములను దెల్పుచు భయభక్తులతో శరణాగతుఁడు-దృప్తుఁడైనను=శరీర మున్నవఱకుండనీ, ఆపై మోక్షము రానీ యని యుండు వాఁడైనను (2) ఎగతాళి పరిహాసమునకై శరణాగతుఁ డైనట్లు తలంచుచుండువాఁడైనను, శాస్త్రసువిశ్వాసభావులకున్=ధర్మశాస్త్రములును నమ్మిన మనస్సుకలవారికి, ఆత్మనాశనం బోర్చియైనఁ గావలయును. అందఱకును దన ప్రాణము తియ్యనిది. అట్టి ప్రాణమునకు లోపము వచ్చినను రానీ యని యుండవలెను శరణాగత రక్షణ సమయమందు. అదేల యనఁగా ప్రాణములు నశ్వరములు, శరణాగత రక్షణధర్మము స్థిరముగదా యని భావము. శాస్త్రసువిశ్వాసభావుల కని చెప్పుటచేతఁ బండితులు తప్పుచేసిరేని శిక్ష యధికమని భావము. "సర్వ దైవాత్మానం గోపాయేత్తని శాస్త్రమునం దాత్మరక్షణము ప్రధానముగాఁ జెప్పియున్నను నిది సామాన్యశాస్త్రము కాఁబట్టి యిది విశేషమైన శరణాగతి శాస్త్రమును బాధింపక శరణాగతి రక్షణమునందుఁ దప్పఁ దక్కిన కాలములందు నాత్మరక్షణము ప్రధానమని నిర్వహించుకొనునది.

తాత్పర్యము

శాస్త్రమునందు నమ్మకముగల మనస్సుగలవారు తమకు శరణాగతుఁడైన వాఁడు శత్రువైనను; ఆర్తుఁడైనను, దృప్తుఁడైనను, దన ప్రాణము పోవుట సహించి యైన వానిని రక్షింపవలయును.

తే. భయముచే నొండె మోహంబు♦వలన నొండెఁ
ప్రతిఫలాసక్తి నొండె స్వ♦బలముకొలఁది
ప్రాపుకోరినవారిఁ గా♦పాడఁ డేని
వాఁడు పాలియు నిహంబునఁ ♦ బరమునందు. ౩౦౪

అర్థములు. శరణాగత రక్షణమునుగూర్చి శాస్త్రమున విధి యున్నదని యింతకుముందు పద్యములందుఁ జెప్పెను. అట్లు శరణాగతరక్షణము చేయని యెడలఁ బాపము తప్పక కలుగునని యీ పద్యమునఁ జెప్పుచున్నాఁడు. భయముచే నొండెన్=(1) వ్యాఘ్ర కిరాత న్యాయప్రకారము ఈ శరణాగతుని రక్షించితిమేని వీని శత్రువు మనల నేమిచేయునో యని భయముచేతఁగాని, (2) మనము వీనిని శరణాగతుఁడని రక్షించినచోఁ బిదప వీఁడే మనలను దిరుగఁబడి కొట్టునేమో యని భయమువలనఁగాని, మోహంబువలన నొండెన్=చక్కని శాస్త్రార్థజ్ఞానము లేక పోవుటచేతగాని, ప్రతిఫలాసక్తి నొండెన్ = శరణాగతుని శత్రువునొద్దనుండి లంచము పుచ్చుకొని శరణాగతుని వదలెనేని – స్వబలముకొలఁది=తన శక్తికొలఁది, తానై తోడ్పడుటయో, ద్రవ్యమూలమునఁ దోడ్పడుటయో, ప్రాణమునే యిచ్చి తోడ్పడుటయో, యేదైన నొకరీతిగా– ప్రాపుఁ గోరినవానిన్ = శరణాగతుని – కాపాడఁడేని అట్లు కాపాడనివాఁడు – వాఁ డిత్యాది=ఈ లోకమున నపకీర్తిపాలై పరలోకమున నరక మనుభవించునని భావము.

తాత్పర్యము

శరణాగతుని రక్షించితినేని వీని శత్రువు మనలఁ జంపునో, లేక వీఁడే యక్కఱ తీఱిన వెనుక తిరుగఁబడి చంపునో యను భయముచేతఁగాని, శాస్త్రజ్ఞానము లేక పోవుటచేఁగాని నీవు నాకు లంచమిచ్చిననో మఱియేదైన మేలుచేసిననో కాపాడెదను, లేకున్నఁ గాపాడనని చెప్పిగాని, తన సహాయము గోరినవానిఁ దనశక్తి కొలఁది రక్షింపనివాఁడు ఈ లోకమందుఁ బరలోకమందుఁగూడ నాశమగును. దీని వలన శరణాగతుని రక్షింపనిచోఁ బ్రత్యవాయము గలదనియుఁ గావున నిది నిత్యవిధి యనియు నేర్పడెను.

తే. తాను జూచుచుండఁగఁ♦దన్ను శరణుఁ, జొచ్చినాతఁడు పరునిచేఁ♦జచ్చెనేని
యా యనాథుఁడు రక్షసే♦యనినృశంసు,నెల్లసుకృతంబుఁ గైకొని♦యేగువాఁడు.

తాత్పర్యము

తనకు శరణాగతుడైనవాఁడు తాను రక్షింపమిచే వాని శత్రువుచేఁ జంపఁబడెనేని రక్షింపఁబడనివాఁడు వానిని గాపాడని నిర్దయుని సుకృతమంతయుఁ గొనిపోవును

ఈ నాలుగు పద్యముల సారాంశ మేమన :—

అంజలి మాత్రమే జోడించుట, దీనుఁడై యెదుట నిలఁబడుట, తన యభిప్రాయమును ప్రార్థనారూపముగ విన్నవించుట, రక్షకుఁ డున్నచోటికి వచ్చుట, ఈ నాల్గింటిలో దేనినైన నొకదానినైనను నవలంబించినవాఁడు తనకుఁ బ్రత్యక్ష శత్రువుగా నుండినను వానిని బరుల దుఃఖమును జూచి సహింపలేని దయాగుణము గలవాఁడు రక్షించుట యుత్తమధర్మము. తాను రక్షించుట మాత్రమే కాదు. వానిని గాపాడుటయందుఁ దన ప్రాణము పోవున ట్లుండినను వెఱవక వాని కితరుల వలనఁ గీడు రాకుండఁ గాపాడవలెను. అట్లు రక్షింపక యేదేని నెపము పెట్టి వానిని వదలెనా వాఁ డీ లోకమున నిందల పాలగుటయే కాక పరలోకమున నరకముల పాలగును. మఱి విశేష మేమనిన ఆశ్రయింపఁ బడినవాని యెదుట నాశ్రయించిన వానిని మఱియొకఁడు చంపెనా చంపఁబడినవాఁడు రక్షింపని వాని పుణ్యమునంతయుఁ గొనిపోవును. ఇది కందుగీతల సారాంశము. శరణాగతునియందు మీఁదఁ జెప్పబడిన నాలుగుగుణములలో నొకటియుండిన రక్షింపవలసియుండఁగా నాలుగును గల విభీషణుని నెట్లు వదలఁ గలఁడు ?

ఉ. కావఁ బ్రపన్నుఁ డౌ పురుషుఁ•గావక యున్న దురంత పాపముల్
  మావక కల్గు, నారక ఫ•లం బపకీర్తియుఁ దప్ప దేమియున్
  మేని బలంబు వీర్యమును • మేకొను నాశము, గాన సద్యశ
  స్థానము ధర్మనాకఫల•దంబు నొనర్చెదఁ గందువాక్యమున్. ౩౭

అర్థములు. ప్రపన్నుఁడు=ప్రపత్తి చేసినవాఁడు, శరణాగతుఁడు, దురంత పాపముల్ = అంతములేని పాపములు, నారకఫలంబు=నరకమే నారకము, నరకమున ననుభవింప వలసిన దండము, మేని=దేహముయొక్క, సద్యశస్+స్థానము= మంచికీర్తికి స్థానమైనది, ధర్మనాకఫలదంబు, ధర్మఫలదము=పాపముల హరించునది. నాకఫలదము=స్వర్గలోక సౌఖ్యములను గలిగించునది.

తాత్పర్యము

ఈ కారణములచేత శరణాగతుఁ డగు పురుషునిఁ గావకయుండినఁ గలుగు పాపముల కంతములేదు. దానివలన బరలోకమున నరకబాధ ననుభవింప వలయును. ఈలోకమున నపకీర్తికిఁ బాలుపడ వలయును. ఇవి రెండు కొంచెమైనఁ దప్పవు పాపముచే దేహబలము వీర్యము నాశమగును. కావున సత్కీర్తికి నిలువ స్థానమై పాపహరమై స్వర్గసుఖదాయకమైన కందువాక్యమును సార్థకము చేసెదను.

సుగ్రీవా ! మైత్రిచే వచ్చినవానిని గాపాడెద నని నేను జెప్పినపుడు అది నాకల్పిత నియమము గావునఁ ద్యజింపు మంటివి. అట్లు త్యజింపరా దనుటకు శ్రుతి స్మృతివాక్యములు శిష్టాచారము చెప్పితిని. ఆ ప్రకారము చేయకుండినఁ బ్రత్యవాయము గలదనియుఁ జేసిన స్వర్గసుఖము గలదనియుఁ బ్రమాణవాక్యములు చెప్పితిని.

ఇప్పుడు శాస్త్రబద్ధుఁడనై విభీషణుని రక్షించు పుణ్యము, కీర్తి సంపాదింపు మనె దవా? వానిని వదలి నరకముపాలై, యపకీర్తిపాలై పొమ్మనెదవా? నీవే చెప్పుము. అపకీర్తిపాలై నరకదుఃఖములనుభవింప నొల్లనుగావున విభీషణు రక్షించెదను. స్వాతంత్ర్యములేదు. శాస్త్రబద్ధుఁడ నగుటన్ - ఇట్లు చెప్పుటచేత శ్రీరామ చంద్రమూర్తికి నరకభయము, స్వర్గసుఖ కాంక్ష దలదని తలఁపరాదు. సుగ్రీవుని సమాధానపఱుప లౌకికాభిప్రాయము ననుసరించి చెప్పఁబడినది.

ఇట్లు శరణాగతరక్షణము సర్వసామాన్యవిషయమని చెప్పి యిక నావిషయ మునఁ దన యనుష్ఠాన విధము చెప్పుచున్నాఁడు.

—• శ్రీరాముఁడు విభీషణున కభయ మిచ్చుట •—

క. నీవాఁ డని యొకపరియే, యే వాఁడేన్ శరణు వేఁడె • నేని సకల భూ
తావళి కభయంబును నే, వావిరి ఘటియింతు నిదియ • వ్రతమగు నాకున్. ౩౦౭

అర్థములు. నీ వాఁడని=నీ వాఁడను అని, ఒకపరియే=ఒకసారిమాత్రమే, రెండుమార్లు, పలుమార్లుగాదు. ఏ వాఁడేన్=ఎట్టివాఁడైనను, వేఁడునేని=కోరినపక్ష మునసే, సకల భూతావళికి=(౧) సమస్తజీవకోటికి. (౨) సమస్త జీవకోటుల వలన, వావిరి=ఉత్కృష్టమైన, అభయంబును=భయము లేకుండుటను, ఘటియిం తున్=చేయుదును, ఇదియ=ఇదియే, వ్రతము=పరిహరింపరాని ధర్మనిష్ఠ.

ధర్మానుష్ఠానమందు "శ్రుతి స్మృతి స్సదాచారః స్వస్యచ ప్రియ మాత్మనః, సమ్యక్సంకల్పజః కామో ధర్మమూల మిదం స్మృతమ్" ధర్మనిర్ణయమందు శ్రుతి- స్మృతి- సదాచారము- స్వప్రియ మని, సమ్యక్సంకల్పజ కామ మని యైదు ప్రమా ణములని యాజ్ఞవల్క్యులు చెప్పిరి- ఈ యైదువిధములైన ప్రమాణములు శరణాగతి రక్షణమందుఁగలవు. ఎట్లనః వినవా- యనుటచే సుప్రసిద్ధ శ్రుతిప్రమాణము చెప్పఁ బడెను. "వధ్యం ప్రపన్నం ప్రతిప్రయచ్ఛంతి" యని వేదవాక్యము ప్రమాణము. కండుమహర్షి వాక్యముచే స్మృతి ప్రమాణము చెప్పఁబడెను. కపోతవృత్తాంతముచే శిష్టాచారము చెప్పఁబడెను. రామచంద్రమూర్తి యితరమతముల ఖండించి తన యభిప్రాయము స్థిరపఱుచుటచేత స్వప్రియము దెలుపఁబడెను. ఇట్లు శరణాగత రక్ష ణము సర్వప్రమాణసిద్ధమయ్యెను. ఈ విషయమున నీకనైదనప్రమాణము సమ్య క్సంకల్పజకామము. యాజ్ఞవల్క్యులు సమ్యక్సంకల్పజకామ మని చెప్పిన దానినే మనువు "వేద ఏవ ధర్మమూలం స్మృతిశీలేచ తద్విదామ్, ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవచ" మను ౨-౬ అనుచోట శీల మని చెప్పెను. శీల మనిన: బ్రహ్మజ్ఞానము, వేద పితృభక్తి, సమత్వము, అపరోపతాపిత, అనసూయత, మృదు త్వము, అపారుష్యము, మైత్రి, ప్రియవాదిత్వము, కృతజ్ఞత, శరణ్యత, కారుణ్యము, ప్రశాంతి అని, 'త్రయోదశవిధం శీల' మ్మని హారీతుఁడు చెప్పెను. శీలమనఁగా రాగద్వేషాది పరిత్యాగ మని గోవిందరాజాభిప్రాయము. ఇది శ్రుతిస్మృతి

విరుద్ధము కాక యుండవలెను. పూర్వాపరములు చక్కఁగా విచారించి చేయఁ బడు సిద్ధాంతము సమ్యక్సంకల్పజకామ మని యాజ్ఞవల్క్యులు. సమ్యక్సంకల్ప జకామ మను చోట కామ మనఁగా శాస్త్రవిరుద్ధముకాని వ్రత మని యర్థము. దీనినే శీల మని మనువు చెప్పెను. ఇట్టి వ్రతము తనకుఁ గల దని రామచంద్ర మూర్తి చెప్పుచున్నాఁడు.

మైత్రి భావించి యను పద్యమునఁ దన ప్రకృతిని రాముఁడు చెప్పెను. ఈ పద్యమునందు - ఆ ప్రకృతి ననుసరించియుండు తన వ్రతమును (ప్రతిజ్ఞను) జెప్పుచున్నాఁడు.

నీ వాఁడు-"కొన్ని యెడల మధ్యమోత్తమ పురుషంబులకుఁ బ్రథమ పురుష మగు" సు. వ్యా. కారక. ౪౦ సూ. ప్రకారము ఉత్తమపురుషమునకుఁ బ్రథమ వచ్చెను. "పాండు భూవరునకుఁ గోడలైతి" నన్నట్లు నీ వాఁడను అని యర్థము. ఇది శేషషష్ఠి కావున సంబంధమును దెలుపును. నాకు, నీకు. సంబంధము గల దని భావము. ఏమి సంబంధ మనిన రక్ష్య రక్షక సంబంధము రక్షింపఁబడవలసిన వాఁడను నేను. రక్షింపవలసిన వాఁడవు నీవు. స్వామివి నీవు. భృత్యుఁడను నేను-అను నట్టి సంబంధము. (౨)నీవాఁడు=వీఁడు నీ వాఁడు అని వినీతిని ప్రథమగా గ్రహింప వచ్చును. అప్పు డిది కార్పణ్యమును సూచించును. 'ఒకపరియే' యందలి ఏవకార మిచ్చట ననుసంధింపవలయును. నీ వాఁడె యని యేర్పడును. అప్పుడు నేను నీ వాఁడనే కాని నా వాఁడనుగాను, రావణుని వాఁడనుగాను మఱియెవ్వరివాఁడను గాను- అని యర్థ మిచ్చుచున్నది. దీనివలన మమత్వము, అన్యపారతంత్ర్యము, స్వాతంత్ర్యము దొలఁగుచున్నవి. శరణాగతుఁ డెవరెన్ని చెప్పినను, కసరినను, బెదరించినను, జంపెద మనినను, స్థిరచిత్తుఁడై తొలఁగక యనన్యగతికుఁడై యుండవలె నని 'ఏ' కారము తెలుపుచున్నది.

మీరారు "దురాత్ములన్ వధింపఁగ నావతి యిమ్ము" "నేలఁబడి చెల్లిరి చూడుము." "వీని నిప్పుడే పొనఁగుపడంగఁ జేఁతదగు" అని యిట్లు మీరారు దూషించినను, చంపెద మని బెదరించినను లక్ష్యము సేయక యిటునటు కదలక, బెదరక యింతసేపు నిలువవేసినను విసిఁగి మరలిపోక యున్నాఁడు గదా. ఇది గదా యనన్యగతికుని లక్షణము. ఇదియే పారతంత్ర్యము.

ఒక్క పరియే=ఒక్కసారి మాత్రమే. పలుమాఱు నాకుఁ జెప్పవలసిన పని లేదు. స్మృతిబలములేని మఱపుగొట్టునకు నప్పు డప్పుడు జ్ఞప్తిపఱుపవలెను. (౨) అనేక కోట్లజన్మలలో నొక జన్మమందు మాత్రమే. అదియును, ప్రపత్తి ననుష్ఠించినది మొదలు నీ వాఁడను అన్నది. మొదలు ఆయుష్యముండువఱకుఁ దానుజెప్పినది తాను మఱచిపోక యుండినచో నది యొకసారియేయగును. ఇట్లు చెప్పుటచే "బహూనాం జన్మనా మంతే।జ్ఞానవాన్ మాం ప్రపద్యతే"అనేక పుణ్య జన్మముల కావల జ్ఞానము గలవాఁడు ప్రపత్తిచేయును అనియు,"ప్రయత్నా ద్యత

మానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః। అనేక జన్మ సంసిద్ధ స్తతో యాతిపరాంగతిమ్" దృఢప్రయత్నము గల యోగి యనేక జన్మముల కావల శుద్ధుఁడై పరమగతికిఁ బోవును. ఇట్టులే భక్తికిని జన్మాంతరములు చెప్పఁబడెను. ప్రపత్తి యేజన్మమందు గలుగునో యా జన్మమందే ముక్తి కలదు. కావున దక్కిన వానికంటె నిది విలక్షణ మైనది. కడసారి జన్మమందుఁ గాని, ప్రపత్తిచేయ బుద్ధి పుట్టదు.

ఒకసారి యథావిధి చెప్పిన పిమ్మట మరల దాని స్మరించుట దానియందలి రుచిని బట్టియే కర్మజ్ఞాన, భక్తిజ్ఞానములు మొదలైన యుపాయములలో రెండు మూఁడుసారు లావృత్తి గలదు గాని, ప్రపత్తి విషయమున మరల నావృత్తి లేదనియే శాస్త్రార్థము. "సకృదేవ హి శాస్త్రార్థః కృతో యది తారయే న్నరమ్" అని ప్రపత్తి శాస్త్ర ప్రమాణము.

ఏవాఁడేన్ = ఏ జాతివాఁడైనను, ఏ నీతివాఁడైనను, ఏ వయస్సువాఁడైనను, ఎంతటిపాపియైనను, పశువులు, పక్షులు నైనను, స్త్రీయైనను, పురుషుఁడైనను దక్కిన యోగములకు జన్మము, వృత్తి, వృత్తములోనగు నియమములు గలవు. శరణాగతికి నధికారి నియమములేదు. ప్రపత్తి కెవ్వఁడైన నధికారియే. రుచి యుండినఁ జాలును. శరణు = రక్షణము, ఏ విషయమందైనను సరియే, ఐహికము నకైకాని, ఆముష్మికమునకైగాని, మోక్షమునకైకాని, వేఁడెనేని = కోరినంతమాత్ర మున, నీ వాఁడు అని యనుటచే వాగ్రూపకమైన శరణాగతి చెప్పఁబడెను. కోరె నేని యనుటచే మానసికము చెప్పఁబడెను, రెంటిలో నేదైనఁ జేయవచ్చును. నీవాఁడని వేఁడు నేని, ఒక పరియే శరణు వేఁడునేని యని రెండు వాక్యములుగా నన్వయింపవచ్చును. అందు మొదటి వాక్యము రెండవ వాక్యమునఁ జెప్పఁగల శరణాగతికి శేషత్వానుకూలమైన ఫలప్రార్థనము చెప్పును. ఆ ఫలసాధనమైన శరణాగతిని రెండవ వాక్యము చెప్పును. వేఁడునేని - ఇది తద్ధర్మాద్యర్థకము కావున మూఁడు కాలములందు నన్వయించును. వేఁడుచుండునేని, వేఁడగలఁడేని వేఁడెనేని యనుటచే తైలధారవలె నవిచ్ఛిన్నమైన భావనాసంతతి రూపముగల భక్తి చెప్పఁబడెనని కొందఱందురు గాని యిం దట్టిది లేదు. వేఁడినన్ - అనినఁ జాలదా? ఏనిశబ్ద మేల? వేఁడినపక్షమునందే యని - వేఁడుట యందుఁ బ్రాధాన్యము తెలుపు టకే. వేఁడనివారిని రక్షింప నని భావము కోరని వారిని రక్షింపఁబూనితినేని లంకలోని యందఱను రక్షింపవలసి వచ్చును. అప్పుడు దుష్టులకు, శిష్టులకు, మిత్రులకు శత్రులకు భేదము లేకపోవును. శిష్టత్వము నశించును. దుష్టత్వము ప్రబలును. కావునఁ గోరినవారిని మాత్రమే రక్షింతును. అట్లైన పశువులను, పక్షులను రక్షింతునంటివే? అవి వచ్చి మేము నీవారమని నీతోఁ జెప్పుకొనఁ గలవా? చెప్పుటకు శక్తిగలవారిని జెప్పుమంటినిగాని, శక్తిలేనివారిని జెప్పుమంటినా? అవి నన్నుఁజూచి నేనున్న చోటనుండి నా యం దనురాగముగల వగునేని జాలును. కావుననే యయోధ్యయందుండు పశువులకుఁ బక్షులకు, బురుగులకుఁ గూడ

మోక్షమిచ్చెదను నీవే చూడఁగలవు. "పురిని నగోచరంబులగు భూతములున్ రఘువంశవర్ధనున్, సరసఁగన్న ప్రాణులును స్థావరముల్ రఘురాము వెన్కొనెన్, బురమున నెద్ది శ్వాసమును బుచ్చెడి దొక్కటియైన లేక" ఉత్తర ౧౬౪౯, సకల భూతావళికిన్=సమస్త జంతుకోటికిన్, మనుష్యులకు మాత్రమే కాదు, పశువులకుఁ బక్షులకు క్రిమికీటాదులకుఁగూడ (౨) పంచమ్యర్థమున షష్ఠి - సకల భూతావళివలన నని యర్థము. నాకు శరణాగతుఁడైనవాని కెవరు భయము గలిగింతురో వారి యందఱవలనను, అభయము = భయము లేకుండుట, భయము = మృత్యువు, "కం. జీవికి మరణభయముగా, కావల భయమేదిగలుగ దనవరతంబున్, జీవికి మృత్యువుతోసరి, యూ వైరియు లేఁడు" ఉత్తర ౨౦౪ ప. కావున నభయమనఁగా మోక్షము. "అథ సోఽభయంగతో భవతి" బ్రహ్మజ్ఞాని యభయమును బొందును. "ఆనందం బ్రహ్మణో విద్వాన్ నబిభేతి కుతశ్చన" బ్రహ్మవిద్యవలని ఫలము అభయమని శ్రుతి చెప్పుటచే అభయమునకు మోక్షమనియే యర్థము వావిరి=అధికము-ఉత్కృష్టము. వావిరి యభయ మనుటచే పరిపూర్ణ బ్రహ్మానుభవాత్మకమైన సాయుజ్యము. ఇది నీవాఁడను అని రక్షణము కోరినవాని విషయము. ఇది ధర్మార్థకామములకు నుపలక్షణముగా నెఱుంగనగు. శరీరారోగ్యమర్థాంశ్చ, భోగాంశ్చై వానుషంగికాన్ । దదాతి ధ్యాయినాం నిత్య మపవర్గప్రదో హరిః" "అయాచితోఽపి తత్సర్వం ప్రపన్నేనిదధా మ్యహ" మ్మన్నట్లు మోక్షమునే యియ్యఁగల భగవంతుఁడు ధర్మార్థకామముల నిచ్చుట యేమి వింత ?

అభయము - నఞ్ తత్పురుషము. ఇచ్చట నకారము తదన్యార్థము-తదభావార్థము-తద్విరోధార్థము-అను మూఁడర్థములను దెలుపుచున్నది. అభయము = అనఁగా భయమునకంటె నన్యమైనదని యర్థము. భయమునకంటె వేఱైనది క్షేమము. కావున నభయమనఁగా క్షేమమని యర్థము. 'ప్రాప్తస్యరక్షణం క్షేమ' మని యుండుటచే ప్రపన్నునకు లభించియుండు భోగ్య భోగోపకరణాదులు సురక్షితములుగాఁ జేయుదునని యర్థము.

తదభావ మను నర్థమున యభయమనఁగా భయములేమి-దానిని గలిగించెదనని యర్థము. భయము కలుగు కారణమే లేకుండఁ జేయుదును.

తద్విరోధము=అభయమనఁగా భయమునకు విరుద్ధమైనది. శత్రువులు కీడు చేయుదురేమో యను మనోవ్యాపారము. దీనికి విరుద్ధమైనది శత్రువులవలన గీడు లేదని నిబ్బరముగా నుండుట. ఇతఁడు ప్రపన్నుఁడు, పుణ్యాత్ముఁడు, వీనికి మనము కీడుచేయరాదని పగవారుకూడ చేతనైన మేలు చేయుదురు.

అతీతము శోకము-వర్తమానము వ్యథ - రాఁబోవునది భయమనఁబడును. కావున భయము భవిష్యత్కాలమున రాకుండఁ జేయుదునని భావము.

ఇది నాకు వ్రతము = వ్రతము పూనినవాఁడు దానిని నడుమ విడిచెనేని

యపకీర్తియగును. కావున నే వ్రతమైనను బూని విడువరాదు. శరణాగత రక్షణము నాకట్టివ్రతము నేను విడువ సాధ్యపడదు. శ్రుతిస్మృతిశిష్టాచారసమ్మతమై, యాత్మప్రియమైన వ్రతమును నేను విడిచితినేని నాకంటె దుశ్శీలుఁ డెవఁడు? నా నడవడిచే లోకమునకు ధర్మ ముపదేశింపవలయు నని నా యుద్దేశము, నానడవడి వక్రమైనచో లోకమంతయు వక్రపు నడవడికలది యగును. అది సహ్యమా? సర్వ భూతముల కనుటచేత నన్నాశ్రయించినవారికే గాక నన్నాశ్రయించినవారి నాశ్రయించిన వారినిగూడ రక్షించెదను– అని భావము. కావున నేకదా శరణాగతి విభీష ణుఁడు మాత్రమే చేసినను అయనవెంట వచ్చిన నలువురకు రామచంద్రమూర్తి యభయ మిచ్చెను. 'పశు ర్మనుష్యః పక్షీవా, యేచ వైష్ణవసంశ్రయాః। తేనైవతే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదమ్' అని ప్రమాణము. పశువులుగాని, మను ష్యులుగాని, పక్షులుగాని వైష్ణవుని నాశ్రయించున వన్నియు నాయనవెంట విష్ణుమూర్తియొక్క– పరమపదమునకుఁ బోవును – అని యర్థము.

—• శ్రీరామ సుగ్రీవ సంవాదము •—

సుగ్రీ— రామచంద్రా! శరణాగతుఁ డగు ప్రపన్నుని రక్షింపవలసినది విధి యని శ్రుతిస్మృతి శిష్టాచార ప్రమాణములను, స్వప్రియమును, దాని కారణము లను జెప్పితివి. అంగీకరించితిని. శాస్త్రవిరుద్ధముగ, శిష్టాచారవిరుద్ధముగఁ బొమ్మని నేను జెప్పను గాని,

"నీవాఁ డని యొకపరియే, యేవాఁడేన్ శరణువేఁడు నేని సకల భూ
తావళి కభయంబును నే, వావిరి ఘటియింతు నిదియ వ్రత మగు నాకున్"

అని చెప్పితివే. ఆ విషయమున నాకుఁ గొన్ని సందేహములు గలవు. అడుగుదునా?

రామ —నీవు వినయవిధేయలతో జిజ్ఞాసువై యడిగినపుడు నేనేల చెప్పకుందును? అవశ్య మడుగుము.

సుగ్రీ—నీవాఁడని విభీషణునంటివే. ఆయన నీకుఁ దండ్రిగాఁడు, తోఁడఁబుట్టిన వాఁడుగాఁడు, తుదకు సజాతీయుఁడు కూడ గాఁడే! వాఁడా మాట యన టెట్లు? నీవు దాని నంగీకరించు టెట్లు?

రామ —నావస్త్రమని నీ వనెద వే,అది నీకుఁ దల్లియా? తండ్రియా? తోఁడఁబుట్టువా? నీ సజాతీయమా?

సుగ్రీ—నేను ధరించువాఁడను, అది ధరింపఁబడునది. ఆ సంబంధముచే నా వస్త్ర మందును.

రామ — మఱియొకరి వస్త్రమును నీ వొకసారి ధరించి విడుతువేని దానిని నా వస్త్ర మందువా?

సుగ్రీ—అవును. అది నియతముగ నాసొత్తుగాదు. దానియందు నాకు నిత్యస్వామిత్వము లేదు.

రామ—అట్టులే నీవాఁ డన్నప్పుడును, నీవు స్వామి వని- నీ సొమ్ము నే నని నీవు రక్షించువాఁడ వని- నేను రక్షింపఁబడవలసినవాఁడ నని- ఈ సంబంధము మనయందు నిత్య మని యర్థము. ఇట్టి సంబంధముగల చోటనే నీ వాఁడు, నా వాఁడు అను శబ్దములు ప్రయోగింపఁబడును. విభీషణుఁ డట్టి భావము గలవాఁడు కావున నీవాఁడ ననెను.

సుగ్రీ—రామచంద్రా! నీవు చెప్పినది తృప్తికరముగాలేదు. విభీషణుఁడు ఇక్కడ నీవాఁడను అనినది నిజమే. వీఁడే నేను రావణుని తమ్ముఁడ ననలేదా? నా భార్యను బిడ్డలను అనలేదా ? అవి యావజ్జీవ ముండు సంబంధములేకదా. దీనికి దాని కేమి భేద మున్నది ?

రామ—నీవు చెప్పినది సత్యమే. విభీషణుఁడు లంక విడుచువఱకు రావణుఁడు రక్షకుఁడు, తాను రక్ష్యుఁడు – అను భావ ముండినది. ఆ భావమే యిప్పుడున్న నిచ్చటి కేల వచ్చును? వానిని విడిచికదా నాయొద్దకు వచ్చినాఁడు. తన్నుఁ దాను రక్షించుకొనఁ గలనని కాని, భార్యలు బిడ్డలు రక్షింతు రని కాని ధైర్య ముండినచో వారినందఱ విడిచి నాయొద్దకు వచ్చునా? రావణు నందు స్వామిభృత్యన్యాయము, స్వస్వామిన్యాయము, రక్ష్య రక్షక భావము, పూర్వ ముండినది, యిప్పుడు లేదు. తన్నుఁ దాను రక్షించుకొనఁగల నని స్వాతంత్ర్యముగాని, ఇతరులు తన్ను రక్షింతు రని పరపారతంత్ర్యము గాని యున్నయెడల వారిని నేనుఁ జేరఁదీయను.

సుగ్రీ—ఒకపరియే యంటివే. పలుమాఱు చెప్పుకొన్న దోషమా ?

రామ—'దొఱసితి నీదు చెల్మి మన దుఃఖసుఖంబులు పొందె నైక్యమున్' అని నీవు నాతోఁ దొలుత నొకసారి చెప్పితివికదా. దినదిన మా మాట నీవు చెప్పుచున్నావా ? ఏల చెప్పవు ?

సుగ్రీ— నేను నీ స్నేహితుఁడ నని నీవు దృఢముగ విశ్వసించితివి. నీవు నా మిత్రుఁడ వని నేను నమ్మితిని. తెలిసిన విషయము మరల మరలఁ బ్రస్తావింప నేల? నీవు మఱచినఁగదా నేను బ్రస్తావింపవలె.

రామ—ఆ కారణముచేతనే ప్రపత్తి పలుమాఱు చేయరాదు. ప్రపత్తి యనఁగాఁ బ్రకృష్టజ్ఞానము. నేను సుహృత్తు, శేషి, రక్షకుఁడు,స్వామి యనియుఁ దాను భృత్యుఁడు, రక్ష్యుఁడు సొమ్ము- అను జ్ఞానము. విభీషణుఁడు తాను నావాఁడ నని నమ్మెను. విభీషణుఁడు నా వాఁ డని నేను గ్రహించితిని. నేను మఱచి పోయినఁగదా ఆయన పలుమాఱు హెచ్చరింపవలె.నాయందు జ్ఞప్తిబలము గల దని మీరే చెప్పితిరిగదా. (చూ. ౩౪ ౨) సీతాదేవియు.

గీ. కంటి కెదురనున్నఁ ♦ గడుఁ బ్రేమ గలుగును
మఱుఁగు పడిన మైత్రి ♦ మఱపు గలుగు
దత్య మిద్ది యగు గృ ♦ తఘ్నుల యం దెదఁ
బ్రేమ మఱవఁ డెపుడు ♦ రామవిభుఁడు. సుం॥ ౬౭౮

అని చెప్పినట్లు హనుమంతుఁడు మీకుఁ జెప్పెగదా- నీ భార్య వచ్చి ప్రతిదినము నేను నీ భార్యను అని, నీకొడుకు వచ్చి నేను నీ కొడుక నని, నీ మంత్రులువచ్చి మేము నీమంత్రులమని ప్రతిదినము చెప్పుచుండవలయునా? అట్లు చెప్పరేని నీవే మనుకొందువు? ఉపచారము స్నేహము కుదురువఱకే- స్నేహము దిటపడిన తరువాతఁ జేయు నుపచారము కైతవము. కావున నీ వాఁడను అని యొకసారి చెప్పి యీ విషయము మనస్సునం దుంచుకొని యా భావముతో స్వధర్మమునఁ బ్రవర్తించుచుండినఁ జాలును.

సుగ్రీ—రామచంద్రా! ఒకపరియే యుంటివిగదా! అవధారణార్థకమైన ఏకారము నీ వాఁడనే అను ప్రపత్తి వాక్యముతో చేరునా? రెండు మూఁడు మార్లు చేయరాదని యొకపరి యనుదానితో జేరును. ప్రపత్తిచేసిన వానినే రక్షించెదను. ఇతరుల రక్షింప నంటివా 'అభయంగతో భవతి' అని ప్రపన్నుఁడు కాని భక్తినిష్ఠునకు నభయప్రదానమును బ్రతిపాదించు శ్రుతివాక్యమునకు విరోధించుచున్నది. అదియుఁను గాక వీని యందు ప్రపన్నత్వ మున్నదా లేదా యని తర్కించి సందేహము నివారించి వీనియందు గల దని నీవు నిర్ధారింప లేదు గదా—అటు గాక ఒక పరియే యభయంబు ఘటింతును, పలుమారు ఘటింపను, అనితివా యిదివఱకే వచ్చి పోయిన భయముల విషయమై నీవు చేయగల దేదియు కాదు. ఇక రాబోవునవి యేవేవి వచ్చునో యెన్ని వచ్చునో వానికిగా నీ విపుడు చేయదగినది లేదు. అవి వచ్చినపుడు చేయవలసిన కార్యముగా నుండును. కావున దేనితో ఏ కార్య మన్వయింప వలయు నని నీ యభిప్రాయము.

రామ—ప్రపత్తి యొకసారి చేయవలయు ననియే నా యభిప్రాయము.
ఒకపరియే యనునది మఱియొకవిధముగా నన్వయింపవచ్చును. ఒకపరియే నిశ్చయించుకొని శరణు వేఁడె నని మధ్యమపదలోపిగా నన్వయింప వచ్చును. అనఁగా రక్షణమందు మనవలె నూహాపోహములకుఁ బాలుపడక, చేయుదమా వలదా యని యాలోచింపక తటాలున నిశ్చయించుకొని వచ్చినాఁ డనవచ్చును. ఇది మహావిశ్వాసమును సూచించును.

సుగ్రీ—ఏవాఁడే నంటివే. ఒకఁడు పరమ పాపి- పుట్టినది మొదలు క్రూరకార్యములు చేయువాడు, దయాదాక్షిణ్యము లెఱుఁగఁడు. పరద్రోహి. ఘాతుకుఁడు. అట్టివాఁడు నీవాఁడ ననఁగానే రక్షింతువా ?

రామ— అవశ్యము రక్షింతును. వాఁడు పరమపాపి యని నీ వంటివే కాని వాఁడు పూర్వజన్మమందు నా విషయమై యేదియో పుణ్యకార్యము చేసియుండి యది ఫలించుకాలము వచ్చుటచేతనే వానికి నేను జ్ఞప్తికి వచ్చుటేగాక నీ వాఁడను అన నోరు వచ్చినది. వాని పాపములు హరించిపోయి బాగుపడు కాలము రాకుండిన వానినోట నామాట రానేరాదు. పాపములన్ని హరించి బాగుపడు కాలము వచ్చుటచేతనే వాఁడు ప్రపన్నుఁడై నేను నీ వాఁడ ననఁ గలిగెను. వాని కాబుద్ధి తేరకు నిష్కారణముగా వచ్చెనా ? పూర్వ సుకృత ఫలముగా వచ్చెను. లంకలో నందఱు రాక్షసు లున్న వారుకదా ! విభీషణుఁడు తప్ప మఱి యెవ్వఁడైన వచ్చెనా? విభీషణున కైనను తల్లిదండ్రుల యొద్దకో కుబేరుని యొద్దకో పోదమని బుద్ధిపుట్టక యిక్కడికి రావలయునని యేల బుద్ధిపుట్టెను? కావునఁ బాపము లన్నియు హరించుకాలము వచ్చినఁ వాడే ప్రపత్తి చేయును. తక్కినవారికి నీవు చెవులలో శంఖములుపెట్టి ప్రపత్తి ప్రపత్తియని యూఁదినను వినరాదు. విభీషణుమాట లేల రావణుని చెవి కెక్కలేదు? అవి విషప్రాయములుగా వానికి దోఁపలేదా? కావున శరణాగతుఁడైనవానిని బాపాత్ముఁడ వందువేని నీవే పాపాత్ముఁడ వగుదువు. ఏలన:- 'తస్యానుబంధాః పాప్మానః సర్వే నశ్యంతి తత్క్షణాత్' భగవంతునకుఁ బ్రపన్నుఁడైన క్షణమందే వానినంటి యుండిన ఆగామి సంచిత పాపములు, వాఁడంగీకరింపని ప్రారబ్ధములు నశించును. కావున వాఁడు పాపాత్ముఁ డెట్లగును? పాపుఁడు కానివానిని బాపుఁడనుటయే మహాపాపము.

సుగ్రీ— అటైన దీనికి జాతి, నీతి యక్కఱలేదా ?

రామ— ఏ జాతివాఁడైనను, ఏ నీతివాఁడైనను, పురుషులైనను, స్త్రీలైనను, బాలురైనను, వృద్ధులైనను, శరణాగతులు కావచ్చును. ఆ యూరు మాది, యీ యూరు మీది యని యా యా యూళ్ళవారు చెప్పుదురు. చక్రవర్తికో ? ఇది శనివారము, అది మంగళవార మందుము. సూర్యునకో? వారిలో వారికి భేదబుద్ధి యుండినను తల్లిదండ్రులకు బిడ్డలందఱు సమానులేకదా.

సుగ్రీ— వేఁడు నేని యంటివే. ఒకఁడు నీ యొద్దకు రాలేక తానున్నచోటనేయుండి శరణుచేయును. మఱియొకఁడు మనస్సులోనే తలఁచును. వారినిఁ గూడ రక్షించెదవా ?

రామ— నీ వాఁడను అని వాక్కుతో ననవచ్చును, దానికి శక్తి లేకపోయిన మనస్సులో ననుకొనవచ్చును. అట్టివానిని నేనుబోయి రక్షింపవలసినకార్యమైన నేనే పోదును. సంకల్పముచేఁ జేయఁదగినదైన నట్టులేచేయుదును. విభీషణుఁ డిక్కడికి రాక లంక యందుండి శరణు అని యుండిన నేనే యక్కడికిఁబోయి

రక్షించియుందును. వాఁడే యిక్కడికి వచ్చి నాకెంతో సాహాయ్యము చేసెను. అట్టి వానిని నే నెట్లు విడుతును ?

సుగ్రీ—రామచంద్రా! నీకు నల్లని వన్ని నీళ్ళు, తెల్లని వన్ని పాలు నీవలెనే యితరులను కొనుచున్నావు. చేతులు జోడించినదే చూచి ప్రపన్నుఁ డనుకొంటివి గాని చంకదుడ్డు శరణార్థి యనుమాట నిజముగా—వానిచంకలో నేమున్నదో చూడుము. ప్రపన్నునకు గద యేల ?

రామ—కామిలారోగికి పాలు, శంఖముకూడ పసుపుగానే కానవచ్చును. నీవుదోష బుద్ధిఁ తోఁచుచుండుటచే నీకు గుణము దోషముగాఁ గానవచ్చుచున్నది. నీ యొద్దఁ గొలువుచేయ నొక వడ్రంగి వచ్చె ననుకో—వాఁడు బాడిస, ఉలి, గూటము దెచ్చిన నవి నిన్నుఁ జంపుటకా? అట్టులే యితఁడు క్షత్రియుఁడు, క్షత్రియవృత్తి నుండువాఁడు, యుద్ధకాలమున మనసేవ చేయవచ్చినాఁడు. ఇట్టివాఁ డుత్తచేతుల వచ్చెనేని యెట్లు సేవ సేయఁగలఁడు? కావున దానికిఁ గావలసిన కొలిముట్లు తెచ్చుకొన్నాఁడు. అది దోషమా? నాకుఁ బాలు తెల్లఁగా గానవచ్చుచున్నవి. నీకు నల్లగాఁ గానవచ్చుచున్నవి.

సుగ్రీ—సకలభూతావళికంటెనే—ఒకఁడు ప్రపత్తిచేసిన లోకములోనందఱ రక్షింతువా?

రామ—ప్రపత్తిచేసిన వానినేకాక వానికి సంబంధించి, వాని ననుసరించి, వాని యందుఁ బ్రేమకలిగి వాని ప్రేమకుఁ బాత్రులైన యందఱను వాని పశువులను, పక్షులను, మృగములను, మనుష్యులను నందఱను రక్షింతును. విభీషణుఁడు మాత్రమే కదా శరణనెను. వానితోడవచ్చినవారినిగూడ రక్షింతును. వారు ప్రత్యేకించి చెప్పుకొనవలసిన పనిలేదు. వానితోడనుండినఁజాలును. సుగ్రీవా! నీ మంత్రులు నీ యొద్దఁ గొలువుచేయు చున్నారు. కాని వారి భార్యలు బిడ్డలు సేవకులు నీ యొద్దకు వచ్చి సేవచేయుట లేదు. నీ ముఖమైన వారెఱుఁగుదురో, యెఱుఁగరో— అట్లుండియు నీవు మంత్రుల రక్షణమునకై యిచ్చిన వన్నియు వారనుభవించుచున్నారుగదా. వారిని నీవు రక్షించిన వాఁడ వగుచున్నావు గదా. కాఁపులయింట దున్ని, విత్తి, పైరుపెట్టి, కాచి, కోసి ధాన్యము తెచ్చువాఁ డొకఁడే. ఆ ఫలము నందఱనుభవింతురుగదా. అట్టులే నావిషయమునఁ బ్రపత్తిచేసినవాఁ డొకఁడే యైనను వాఁడు భరింపవలసినవారి నందఱ నేనేభరింపవలయును. భరింతును. భరన్యాస మనఁగా నేమి? వారి భారములన్నియు నామీఁద వేయుటే కదా. [శ్రీమద్రామాయణము - "వేదోపబృంహణార్థాయ తా వగ్రాహయత ప్రభుః" అని వేదోపబృంహణార్థము వాల్మీకి బాలురఁ గ్రహించె నని రామాయణమందే చెప్పఁబడెను. "వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" యనియుఁ గలదు. వేదోపబృంహణ మనఁగా వేదార్థమును

విశదీకరించుట యని యర్థము. అటయినచో రామాయణమే వేదవాక్యముల యర్థమును విశదీకరించుచున్నది- అను ప్రశ్నరాఁగా "తగ్ంహ దేవమాత్మబుద్ధి ప్రసాదమ్, ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే" ముముక్షువగు నేను బుద్ధిప్రసాదములు గలిగించు భగవంతుని శరణు చొచ్చెదను. "ప్రయతపాణిః శరణ మహం ప్రపద్యే" పరిశుద్ధహస్తుఁడనై నేను శరణు చొచ్చెదను. "స్వస్తి సంబాధే ష్వభయన్నో అస్తు" సంకటము లందు మనకు అభయము కలుగును గాక అను ప్రపత్తిని విధించు వేదవాక్యములను రామాయణము విస్తరించి చెప్పుచున్నది. పరిశుద్ధ హస్తములతో శరణుచేసెద నన్నప్పుడు అభివాదనరూపక (నమస్కార) ప్రపత్తి చెప్పఁబడెను. 'చరణౌ శరణ మహం ప్రపద్యే'యని ద్వయమందుఁ గలదుగదా. లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి పాదములు పట్టుకొనికదా శరణాగతుఁడయ్యెను. పరిశుద్ధహస్తుఁ డనఁగా నీళ్ళతోఁ జేతులు కడుగుకొని యని మాత్రమే యర్థముకాదు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' మోక్షసాధనముల నన్నిటిని వదలి నన్నొకనినే శరణుఁజొరుము - అనియు "పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్, రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ, సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్, లోకవిక్రాంత చరణౌ శరణం తేవ్రజం విభో" యితరయుపాయములను వానికి సహకారులైన తండ్రి, తల్లి, భార్య, బిడ్డలు, బంధువులు, మిత్రులు, వేరుపాయములనుపదేశించు గురువులు, రత్నములు, ధనధాన్యములు, గృహక్షేత్రములు, సాంగములైన, కర్మయోగ జ్ఞానయోగ అష్టాంగయోగా ద్యుపాయములు, ఐహికసుఖములు, స్వర్గ భోగములు ఆత్మానుభవరూపమైన కైవల్యము వీని నన్నిటిని వదలి (వీరియందు రక్షకభావము, భోగ్యభావము, మమకారము, వదలి రుని భావము.) నీ పాదములు శరణు చొచ్చితి నన్నట్లు కర్మ జ్ఞాన భక్త్యాదులందు నుపాయ బుద్ధిని ఐహిక సుఖములయు, స్వర్గకైవల్యసుఖములయుఁ గాంక్షను పూర్ణముగ వదలి నిర్మల మనస్సుగలవాఁడై యనియు నర్థము. 'శరణం ప్రపద్యే' శరణు చొచ్చుచున్నా ననునది. శరణంబుఁ జొచ్చితిన్, నన్ను శరణంబుఁ జొరుము. ప్రార్థించు మనస్సే శరణాగతి- యను పదములచేఁ దెలుపఁబడెను. ఈ శ్రుతి వాక్యమునకు నుపబృంహణ మెట్లన:— ఒక పరియే యను పదము 'ఆవృత్తి రసకృదుపదేశాత్.' బ్ర. సూ. న చెప్పినట్లు పలుమాఱు ఆవర్తి నపేక్షించు భక్తి విషయమై యన్వయింపక సర్వధర్మత్యాగ పూర్వకమైన ప్రయతపాణి యనుపదము నర్థమును వివరించుచున్నది. ప్రయత మనఁగాఁ బరిశుద్ధము "పవిత్రః ప్రయతః పూతః" అమరము. ప్రకర్షేణ యచ్ఛతి=స్వవిష యేభ్యః ఉపరమతి

ఇతి ప్రయతః" అని ప్రయతశబ్దమునకు వ్యుత్పత్త్యర్థము. స్వరూపవిరుద్ధ విషయములనుండి యింద్రియములను బూర్ణముగ మరలించుట ప్రయతి యనఁబడును. ఉపాయాంతరములు కర్మజ్ఞానాదులు భగవదేక పారతంత్ర్యమునకు విరోధులు, స్వరూపనాశకములు గావున భగవదుపాసనవలెనుఁ గల యుపాయము లన్నియు స్వరూపవిరుద్ధములే. కావున వానిని వాసనతోడ విడిచినవాఁడే ప్రయతపాణి యనఁబడును. పాణి యను శబ్దము భగవన్నామ సంకీర్తనమున కుపదేశింపఁబడి యుపయోగపడు వాగింద్రియమును, భగవద్దివ్యమందిర ప్రదక్షిణమున కుపయోగపడు పాదములకు నుపలక్షణము. ఒకపరియే శరణాగతి చేయవలయు ననుటచే తైలధారవలె నిరంతరధ్యానరూపమైన జ్ఞానము-భక్తి దీనినుండి దూరముగ ద్రోయఁబడినది. అల్లే శరణు వేడెనేని యను పదముచే 'శరణం ప్రపద్యే' యను పదమును, నీవాఁ డని వేఁడునను పదముచే స్వాస్త్యస్తు' యను పదమును, అభయంబు ఘటింతు ననుటచే 'అభయ మస్తు' అనుపదముల యర్థమును విశదీకరించుచున్నది. ఈ విధముగ నీ పద్యము శరణాగతి విషయమైన వేదసూక్తుల యర్థమును వివరించెను.

మఱియు నీ వేదసూక్తులందు 'శరణం ప్రపద్యే' శరణు చొచ్చుచున్నాను-అని యేకవచనముతోఁ బ్రారంభించి 'అభయం నః అస్తు' మాకభయము కలుగును గాక యను బహువచనముతో ముగిసెను. ఇట్టివే 'వైష్ణవో నః కులే జాతః' మా వంశమందుఁ బుట్టిన వైష్ణవుఁడు మమ్మందఱ నుద్ధరించును. 'తే సర్వే ముక్తి మాయాంతి' ఆ వంశమునఁ బుట్టిన వైష్ణవునివలన వారందఱు ముక్తి పొందుదురు. అని చెప్పఁబడెను. అట్టులే 'యేచ వైష్ణవ సంశ్రయాః। తేనైవ తే ప్రయాస్యంతి। తద్విష్ణోః పరమం పదమ్' వైష్ణవుని నాశ్రయించినవా రందఱు విష్ణువు పరమపదమునకుఁ బోదురు- అని చెప్పబడెను.

సుగ్రీ—ప్రపన్నులకు మాత్రమే నీ వభయహస్త మిచ్చెదవా? భక్తాదులకు నిచ్చెదవా?

రామ—రామచంద్రమూర్తి నన్ను రక్షించు నను విశ్వాసము గలవారి నందఱను రక్షించెదను. ఎట్లనిన దండకారణ్యమునులు మే మెల్లరమును నీ విషయమునందు నీచే నెప్పుడుం గావంబడ నర్హుల మనిరి. (అరణ్య ౧౮) వారిని రక్షించితిని. (ఈ కాలమున విష్ణ్వాలయ మే గ్రామమం దున్నదో యా గ్రామమందుండి భగవంతుఁడు రక్షకుఁ డను నిశ్చయజ్ఞానము కలిగినను జాలును) అనుకూలుఁడై వచ్చిన విభీషణు రక్షించితిని. కేవల ప్రతికూలుఁడైన రావణుఁడు వచ్చినను రక్షించెద నంటిని. (యుద్ధ ౩౮౮.) నాదు గురువులఁ గనుటకుఁ జన నానతిమ్మని యుదాసీనయైన శబరిని రక్షించితిని. 'పరమగతి

కారణం బద్యేఁ ప్రభవమున' నని చెప్పఁబడిన మృగ మగు వాలిని, (కిష్కింధ ౪-౨౨). అనుత్తమగతి కరుగుము మదాజ్ఞనని పక్షియగు జటాయువునకు, (అరణ్య ౧౧౮౬) ఘోరపాపము చేసి శాపదష్టయై పడి యుండిన యహల్యను, (బాల-౯౯౬) పలుగాకి కాకి యగు కాకాసురుని, వీరినెల్లఁ గాచితినిగదా. ఇది యేమి? అయోధ్యలో నుండు కంటికిఁ గాన రాని భూతములు, నన్నుఁజూచిన ప్రాణులు, చెట్లు, చేమలు, స్థావరములు నన్నియు నేనీ లోకమును విడిచిపోవు నపుడు నావెంట రాఁగలవు. నీవే చూడగలవు (ఉత్తర. ౧౬-౪౯). ఈలోకమునందుండు వారేగాదు; దేవ లోకములోనుండు బ్రహ్మేంద్రాదులు, దిక్పాలురు, నారూప మర్చించుచు, నానామము జపించుచు, నామూర్తిని దమలోకముల నుంచుకొని పూజించు చున్నారు. వారి నందఱ రక్షించెదను. 'ద్విపరార్థావసానేమాం ప్రాప్తు మర్హసి పద్మజ' యని బ్రహ్మకును నే నభయహస్త మిచ్చి యున్నాను. వీరు వారననేల? నాయెడ నాభిముఖ్యము గలవారి నందఱ రక్షించెదను. పరాఙ్ముఖులు వారిగతి కోలఁది వా రధోలోకములకుఁ బోదురు.

సుగ్రీ—ఆభిముఖ్యము గలిగినంత మాత్రమున నీ వందఱ రక్షించెదవేని వారికిఁ బ్రపన్నులకు నేమి భేదము ?

రామ—భక్తాదు లందఱకు నీ జన్మమందే ముక్తి నిచ్చెద నని నేను జెప్పలేను. వారికిఁ గాలాంతర జన్మాంతరములందు ముక్తినిచ్చెదను. 'వాసుదేవ స్సర్వ' మ్మను భావము గల పరమభక్తునకుఁ బ్రపన్ననకు మాత్ర మీ జన్మాంత మందే తప్పక ముక్తి నిచ్చెద నని నేను బ్రమాణము చేసి యున్నాను. మార్గములు భేదములుగాని, యిరువుర భావ మొకటియే. పరమభక్తుఁడు పెక్కుజన్మముల భక్తిని సాధించినాఁడు. ప్రపన్నుఁ డీ జన్మమందే సాధించి నాఁడు. ప్రపన్నుఁడు తన భారమును నా మీఁదవైచి తల్లిదండ్రులయొద్ద చంటిబిడ్డవలె నుండువాఁడు పరమభక్తుఁడు తల్లిదండ్రులు దైవతములను జ్ఞానము గలవాఁడై పితృసేవ భక్తితోఁ జేయునట్టివాఁడు. తల్లిదండ్రు లిరువుర నాదరింతురు గదా.

సుగ్రీ—అయిన భక్తికి, బ్రపత్తికి నేమి భేదము ?

రామ—ఫలము సమానమే-మార్గములు వేఱు వేఱు. మీ యూరికిఁ బోవలయు ననిన నెన్ని త్రోవ లున్నవి? అట్టులే. రెంటికి భేదము చెప్పెద వినుము.

(౧) భక్తి-స్వధర్మజ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైక గోచరుఁడు నారాయణుఁడని చెప్పఁబడుటచేస్వధర్మనిష్ఠచేఁ గలిగినజ్ఞానమువలన లభించినవైరాగ్యముచే జనించిన భక్తి యనుటచే భక్తియుపాయ మనియు, నది చేతనుని వ్యాపార ముపై నాధారపడి యున్న దనియు నేర్పడెను. కావున నది సాధ్యో పాయము. ప్రపత్తి యుపాయ మనుట యుపచారమాత్రము. ఉపాయము

ఉపేయము రెండును భగవంతుఁడే. భగవంతుఁడు సిద్ధోపాయము. 'సిద్ధరూపం పరబ్రహ్మ' యనికదా శ్రుతి చెప్పుచున్నది. కావున ప్రపత్తి సిద్ధోపాయము.

(౨) 'ధ్రువాస్మృతి' యన్నట్లు భక్తి తైలధారవలె నవిచ్ఛిన్నమైన స్మృతి సంతానరూపము. కావున నచేతనము.

ప్రపత్తి- 'యస్సర్వజ్ఞ స్స సర్వవిత్' 'సత్యం జ్ఞానం' అను శ్రుతి సూక్తుల వలన సర్వజ్ఞము, జ్ఞానస్వరూపమునై యున్నది.

(౩) భక్తి-'ఆవృత్తి రసకృ దుపదేశా' త్తనునట్లు అనేక జన్మపుణ్యఫల మగుచు చిరకాల సాధ్యము.

ప్రపత్తి-'తద్ద్వయం సకృదుచ్చారో భవతి' అనునట్లు లొకసారి యనుష్ఠించిన జాలును.

(౪) 'తస్య తావ దేవ చిర' మ్మనునట్లు (ఛాందో) ప్రారబ్ధదేహావసానపర్యంతము కాలవిలంబనము గలది. ఈలోపల దాని ఫలము జూపఁజాలదు.

ప్రపత్తి-'ఉపాయో యంచతుర్థస్తే' యన్నట్లు ప్రపన్నుఁడు కోరినచో నెంటనే ఫలము చూపఁగలదు. ఇది యార్తప్రపన్నుని విషయము. తానై దేహము నిలుపఁ గోరిన దృప్తునకు నా దేహావసానమున ఫల మిచ్చును. ఆర్తి భేదముచే గాలభేదము.

(౫) భక్తినిష్ఠునకుఁ బ్రారబ్ధకర్మ శేషమువలన దేహాంతర పరిగ్రహము కలిగెనేని ఫలప్రాప్తికిఁ గాలవిలంబ మధిక మగును. ఈ విషయము బ్ర॥ సూ॥ ౪౧-౧౮ 'భోగేన త్వితరే క్షపయిత్వాథ సంపత్స్యతే' యను సూత్రమున భాష్యమునఁ జర్చింపఁబడినది. "బ్రహ్మవేత్తయొక్క పుణ్యపాపము లనేక శరీరభోగ్యఫలము లైనచో అనేక జన్మముల నెత్తి యా కర్మఫలముల నన్నింటి ననుభవించి యనంతరము బ్రహ్మమును బొందుచున్నాఁడు." ప్రపన్నునకు దేహాంతరప్రాప్తిలేదు. ప్రపత్తి చేసిన దేహముండు వఱకే కాలవిలంబము.

(౬) భక్తి రూపాపన్న జ్ఞానము పుట్టుటకు విరోధులుగా నుండు పాపములు నశించుటకు యజ్ఞ దాన తపస్సు లావశ్యకములై యుండును.

ప్రపత్తియందు అంగము, అంగి-ఉపాయము, ఉపేయము-నేనే యగుటచే నితర సాధన సాహాయ్యముతోఁ బనిలేదు.

(౭) భక్తివిరోధు లగు పాపముల జయించుటకై చేయు యజ్ఞదాన తపస్సులు కష్ట సాధ్యములు.

ప్రపత్తి యనుష్ఠానదశనుండి సుఖరూపమే.

(౮) ఆ యజ్ఞాది సాధనములు అపాయకరములు. 'మిథ్యాప్రయుక్తో యజమానం

హీనస్తి' యజ్ఞాదు లనుష్ఠించు నపుడు అలక్ష్యముతోఁగాని, వ్యర్థమైన వేడుకతోఁగాని శాస్త్రోక్త క్రమము వదలిగాని యనుష్ఠించిన యెడల నవియే యజమానుని జంపు నని యర్థము జ్ఞానదోష పరిభ్రష్ట శ్చాండాలీం యోనిమాస్థితః' దేశకాల పాత్రముల నెఱుఁగకయు, జ్ఞానము లేకయు ననుష్ఠించిన పక్షమందు చండాలత్వమును బొందును– అని యర్థము. కర్మ జ్ఞాన భక్తులం దీ యపాయము గలదు.

ప్రపత్తి చేయుటయందుఁ గర్మము రెండు చేతులు జోడించుట, నీవాఁడను కాపాడు మనుట. కావున నిరపాయము.

(౯) యజ్ఞాదులకు గావలసిన పదార్థములు నశించు స్వభావముగలవి. ప్రయాసపడి సాధింపఁ దగినవి. పరసాహాయ్య మపేక్షించునవి.

ప్రపత్తికిఁ గావలసినది యంజలి కావున నశించునది కాదు. ఇతరుల సాహాయ్య మపేక్షింపదు. సుకరము.

అవి పుణ్యఫలముల నిచ్చినవిమ్మటఁ దత్పూర్వము మంత్రలోప, క్రియాలోప, భక్తిలోపములచే నశించునవి.

అంజలిఫలము కలకాల ముండునది.

సకాములకు స్వర్గఫలము, నిష్కాములకు మోక్షము నిచ్చును. అట్లైన నానుకూల్య సంకల్పము, ప్రాతికూల్య వర్జనముకూడ ననావశ్యకము లేగదా! యనిన నవి సర్వముక్తి ప్రసంగము రాకుండుటకై విధింపఁబడినవి. ఉపాయ స్వీకారమం దిదియే యుద్దేశము. సర్వముక్తి ప్రసంగము రాకుండుట యనఁగా శాస్త్రవిహితమర్యాదలు, స్వధర్మము, సదాచారములు తప్పి వర్తించు వారికిని–దురాచారులకు సైతము మోక్షము రాకుండుటకై శమదమాదులగు నాత్మగుణములు గల యానుకూల్యసంకల్పము విధింపబడెను దీనివలన నా యందుఁ బక్షపాతము, దయాహీనత యను దోషములు దొలఁగినవి.

(౧౦) భక్తికి నంతిమస్మరణము (మరణకాలమున నన్ను స్మరించుట, నియతము.

ప్రపత్తికి నంతిమస్మరణ మనావశ్యకము. అంత్యకాలమునఁ బ్రపన్నుఁ డేదశయం దున్నను నేనే స్మరించి వానికి ముక్తి నిచ్చెదను.

(౧౧) ఉపాయాంతరములు స్వయత్నసాధ్యములు గావున నిరపాయముగ ననుష్ఠించుటయందు సమస్తభారము చేతనునందుఁ గలదు.

ప్రపత్తియందు సకలభారము నాయందుఁగలదు. కావునఁ బ్రపన్నులకు భారము తోఁపదు. వారు ప్రమాదమునఁ గార్యములు తాఱుమాఱుగఁ జేసినను నేను దానిని లెక్కకుఁ దీసికొనను. వారికిఁ బ్రమాదబుద్ధి యిచ్చినవాఁడను నేనేకదా. నా ప్రపన్నుఁడు తెలిసి యకార్యములు చేయఁడు. ప్రపన్నుఁడు తన స్వరూపమగు పారతంత్ర్యమునకు హాని రాకుండఁ గనిపెట్ట

వలసిన భార మొక్కటియే యతనియందుఁ గలదు. తక్కిన విషయములం దతని కే భారము లేదు.

సుగ్రీ—ప్రపన్నుని దేనినుండి రక్షింతువు ?

రామ—వానికి భయము కలిగించిన దేదో దానివలని బాధ లేకుండ, మఱియెప్పటికి లేకుండఁ జేయుదును.

సుగ్రీ—అట్లైన నీవు మోక్షము మాత్ర మిచ్చెదవా? ధర్మార్థకామము లిచ్చెదవా ?

రామ—ఎవ రేదికోరిన నది యిచ్చెదను, ఎక్కువది కోరినఁ దక్కువదికూడ నిచ్చెదను. అనఁగా ధర్మము కోరెనా అర్థము. కామముకూడ నిచ్చెదను. మోక్షముగోరెనా ధర్మార్థకామములనుగూడ నిచ్చెదను. అర్థము కోరిన నర్థము, కామము నిచ్చెదను, కామముకోరిన నంతకెక్కువ యేదియు రాదు. కామము మాత్రము గోరువాఁడు పశువుతో సమానుఁడు. వాని సుఖము మాత్రము వాఁడు చూచుకొనును. అర్థముకోరిన వాఁడు తాను సుఖపడ వచ్చును. తన యాశ్రితులను, లోకులను సుఖపెట్టవచ్చును. ధర్మమునం దుండువాఁడు లోకము నంతయు సంతోషింపఁజేయును. కావున నేయుద్దేశ ముతోఁ బ్రపత్తిచేసినను జేయవచ్చును. నిన్నుఁగిష్కింధాప్రభువుఁ జేసి నపుడు దానికి లోపడిన పల్లెలు, గ్రామములు, అడవులు, కొండలు అన్నియు నీ వనుభవింపఁ దగినవేకదా. వానియం దుండు వారికి నీపై నధికారము లేదు. కాని నీ కందఱిపై నధికారము కలదుకదా.

సుగ్రీ—సకలభూతములవలననంటివే. పుట్టినవానివలననా? పుట్టబోవువానివలననా?

రామ—మోక్షము గోరువాఁడన్నిభూతములను దాఁటిపోవువాఁడు. కావున వానికే భూతములవలనను, నే కాలమునందును, నే దేశమందును భయము లేదు. తక్కినవారా ? వారివారి కోరికలవలనఁ గలుగు ఫల మనుభవింప వలసి యుండును. నీవు వానరరాజ్యము గోరితివి. ఇచ్చితిని. దానివలనఁ గలుగు సుఖదుఃఖములు నీ వనుభవించుచున్నావు, అనుభవింపగలవుగదా ! యట్టులే యన్నియును.

సుగ్రీ—అభయము ఘటియింతునంటివి. విభీషణుఁడు రావణునకు భయపడి వచ్చెను. రావణు భయము లేకుండఁ జేయుదు వంతియేకదా ?

రామ—విభీషణుఁడు కోరిన దామాత్రమే యైన నంతియే చేయుదును. రాజ్యము గోరిన రాజ్య మిచ్చెదను. ఏమి కోరఁడాయెనా రాజ్యమేకాదు. మోక్షము కూడ నిచ్చెదను. ప్రపన్నులు తమకోరికలను త్రాళ్ళచే నన్నుఁగట్టి నిర్బంధించి నీవింతే యియ్యవలయు నన్నప్పుడు వారినిర్బంధములకు లోఁపడియంతే యిత్తును. అట్టి నిర్బంధము లేనప్పుడు నే నెంత యియ్యఁగలనో యంతయు

నిచ్చెదను. నాతో సమానునిగనే చేసెదను. భయకారణములు పెక్కులు గలవు. పతివ్రతలకు వైధవ్యభయము, రాజులకు శత్రుభయము, ధనికులకు దారిద్ర్యభయము. ఆరోగ్యవంతులకు రోగభయము, ముముక్షువులకు సంసారభయము, సర్వభూతములకు మరణభయము. ఎవరే భయమునుండి రక్షింపఁగోరుదురో వారి నా భయమునుండి రక్షింతును. వీనిలో వానిని యభయము=ఉత్కృష్టమైన యభయము – నా సాయుజ్యమే.

సుగ్రీ—నీవు వీనికి నిచ్చు నభయము త్యాగమా? ఔదార్యమా? ఉపకారమా? దానమా?

రామ—కీర్తి రావలయునని కోరి యిచ్చునది త్యాగ మనఁబడును. నాకట్టికోరిక లేదు. ఔదార్యమనఁగా జనుఁబాలు చేఁపునట్లు విషయ వైషమ్యమును జూడక తనపేరుగా నిచ్చుట. అట్టి ప్రతిష్ఠయందు నాకుఁ గాంక్ష లేదు. ఉపకార మనఁగా బదులుమేలు కోరి యొకరికిచ్చుట, ఇతనివలన నే నేమేలు గోరలేదు. దానమనఁగా దీనివలన నాకీ ఫలము కాలాంతరమందో, జన్మాంతరమందో కలుగఁగోరి మంత్రవంతముగ నిచ్చుట. వీనిలో నేను జేయునది యేదియుఁ గాదు. ఘటియింతు ననఁగా గలిగింతు ననియే యర్థము. ఇది త్యాగముగాదు. ఔదార్యాదులుగావు. చలిచే వణకువాఁడు వేఁడిమి చలికి విరోధియని తెలిసికొని యెండలోనికిఁబోయెను. వానికిఁ జలి దొలఁగెను. ఆరోగ్యము కలిగెను. ఇందు సూర్యుఁడు చేసినది త్యాగమా, ఉపకారమా, దానమా? యేది? నేను జేయునది యంతే యనుకొమ్ము. వాఁడు చేసిన శరణాగతియే వానిని రక్షించును. నేను నిమిత్తమాత్రమే. “నిమిత్తమాత్రమే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి, ప్రధానకారణీ భూతా యతో వై సృజ్యశక్తయః। నిమిత్తమాత్రం ముక్త్వైవ నాన్య త్కించి దపేక్షతే, నీయతే తపతాంశ్రేష్ఠ స్వశక్త్యా వస్తువస్తుతాం। కర్మభి ర్భావితాః పూర్వైః కుశలాః కుశలైః ప్రజాః” సృజింపఁబడునట్టి వస్తువులు తమ సృష్టి విషయమున నిమిత్తమాత్రము నపేక్షించునవి. వానియందుఁ గల శక్తులే వాని సృష్టికి ముఖ్యకారణములు. అవి నిమిత్తమాత్రమును దప్ప వేఱొకదాని నపేక్షింపవు. స్వశక్తిచేతనే వస్తువు లా యా శరీరంబులఁ బొందుచున్నవి. అట్టి శక్తులు వారు వా రొనర్చునట్టి పుణ్య పాపములే. చింతగింజయందుఁ జింతచెట్టగుశక్తియున్నది. కాని తనంతటఁ దానే చెట్టు కాఁజాలదు. మనుష్యుఁ డొకఁడు దానిని భూమిలోనుంచి నీళ్ళు పోయ వలయును. చింత విత్తనమునుండి మామిడిచెట్టు వచ్చునట్లు వాఁడు చేయలేఁడు. అట్లులే శరణాగతియందు ఆ జన్మమందే ఫలమిచ్చు శక్తిగలదు. ఆ ఫలము వానికిఁ గలుగునట్లు చేయుటే నా కార్యము.

సుగ్రీ—అట్టి మైత్రి నటించినను నేను శేతిని విడువ నంటివే. నీవు వానిమోస ఫలమేకదా వాని కీయవలెను.

రామ—మనోవాక్కాయము లను మూఁటిలో రెంట వాఁడు చేసిన దానికి ఫల మీయవలయునుగదా. అది నేనెట్లు తప్పింపఁగలను? ఆ రెండే వాని మన స్సును తమ త్రోవకుఁ గ్రమముగఁ దీసికొనివచ్చును. ఆ విషయమున నేను దోడుపడుదునుగాని వాఁడు నన్ను మోసముచేసినాఁడని కోపింపను. వానిని వాఁడు మోసము చేసికొనెనుగాని నాకు వాఁడు చేసిన కీడేమి గలదు?

సుగ్రీ—నీ సాయుజ్య మనఁగా నేమి?

రామ— నీవు నాయొద్దఁ జేరకముం దెట్టి సంబంధముండినది? మనకు నిప్పుడెట్టి సంబంధమున్నది? లక్ష్మణు నంతటివాఁడవు నీవైతివిగదా. 'మానలుపురిలో నీవైదవ సోదరుఁడవు నిర్మల చరితా' యని భరతుఁడు ననఁగలఁడు. నీవు విభీషణునిఁ జంపవలె, నఱకవలె, నిప్పులలో వేసి కాల్పవలె నంటివే. నే నభయమిచ్చిన పిమ్మట నీవే "మానసమానుఁడయి క్రాలుత మమ్ములగూడి యిప్డు మేధావి విభీషణుండు సఖితం గని" యని నీవే యంటివా, లేదా? ఇప్పుడు మనమందరము సోదరులమేకదా. కావున సమానులమేకదా. మీరు నన్నుఁ బెద్దగా గౌరవించి పెత్తనము నాయందుంచితిరే కాని తక్కిన విషయంబుల మీకునాకు భేదము కలదా? సీతతప్ప నా స్వరస్వము మీదికాదా? నా ప్రాణములు కూడ మీ చేతియందున్నవికదా? ఇట్టి సామ్యమునకే సాయుజ్య మనిపేరు. హనుమంతున కిచ్చినట్లు నన్నే మీ స్వాధీనపరచితిని. అంత కెక్కువ నేనేమి యియ్యఁగలను. దీనినే వావిరి యభయ మంటిని, తక్కిన వన్నియు దీనికి లోకువే.

సుగ్రీ—ఇదియ వ్రత మగునంటివే. యేల?

రామ—తక్కిన యన్ని కార్యములు నేను నా సంకల్పానుసారము చేయుచుందును గాని యొకని నిర్బంధమువలన విధిగాఁ జేయువాఁడనుగాను. శరణన్నవానిని రక్షించుట యనునది నాకు వ్రతము. నాకిష్ట ముండినను, లేకుండినను, నేను జేయక తప్పదు. ఆ విషయమందు నాకు స్వాతంత్ర్యము లేదు. అన్ని విష యముల నేను సర్వశక్తుఁడనేకాని, యీ విషయమందు నే నశక్తుఁడనే. ఎట్టి సంకటములనైనఁ దప్పించుకొను నుపాయము నే నెఱుఁగుదును గావున నేను సర్వజ్ఞుఁడనేకాని శరణు అన్నమాట చెవినిఁబడఁగానే అభయమిమ్మనక తప్పించుకొను టెట్లో నే నెఱుఁగను గావున ఏ విషయమున నే నజ్ఞుఁడనే. వ్రతముగా ననుష్ఠించునది యిది యొకటియే కావున నిదియ యంటిని.

సుగ్రీ—వ్రత మనఁగా నేమి?

రామ—యావజ్జీవము జర పెదనని పట్టిన నియమము. కాలక్లృప్తము పెట్టుకొన్నను బెట్టుకొనవచ్చును. హనుమంతునకు బ్రహ్మచర్యము వ్రతము. దానియందు స్ఖలనము వచ్చెనా యతఁడు భ్రష్టుఁడు. అపకీర్తి యనఁబడును. అట్లే నాకు శరణాగతరక్షణమునుండి స్ఖలనమువచ్చెనా నేనుభ్రష్టుఁడనే. అపకీర్తినే.

సుగ్రీ—ఇది నా వ్రత మనినఁ జాలునే. వ్రత మగు నంటివే. ఏల?

రామ—విధి యనియుఁ దప్పించుకొన సాధ్యపడ దనియుఁ దెలుపుటకే.

సుగ్రీ—నాకున్ అంటివే. ఈ వ్రతము గల వా రితరులు లేరా ?

రామ—తక్కిన బ్రహ్మరుద్రాదులు ఇష్టము వచ్చినవారిని రక్షింతురు. రానివారిని విడుతురు. మొదటఁ జేరఁదీసినను తరువాత చేయి విడుతురు. ఇతరులు సందర్భానుసారముగ వర్తింతురు. తొలుతవరములిచ్చిన బ్రహ్మ రావణుని తరువాత శపించెగదా. తొలుత రావణునకు వరము లిచ్చిన రుద్రుఁ డిప్పుడు రక్షింప రాఁడాయెఁ గదా. రక్షణ కార్యభారము వారియందు లేదు. అది వారికిఁ బదిలోఁ బదునొకండవది. నాకట్లుగాదు. సృష్టించు బ్రహ్మయు, సంహరించు రుద్రుఁడు రక్షణ మం దుత్తరవాదులు కారు. నాకట్లు గాదు. నిత్యవిధి కావున నా కది వ్రతము. 'నహి పాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరా ద్ధరే' యనియు "రక్షార్థం సర్వలోకానాం విష్ణుత్వ ముపజగ్మివాన్" అనియు ప్రమాణములు. మోక్షమిచ్చు నధికారము నాయందు మాత్రమే కలదు. తక్కిన యెవ్వరియందు లేదు. తక్కినవారు మోక్షము తప్పఁ దమ యధికారానుసారముగ నేదైన నీయఁగలరు.

సుగ్రీ—నాకున్=నాకు అనినఁ జాలునుగదా! నాకును అంటివే ఏల ?

రామ—ఈ వ్రతము నాకెట్టులో నా భార్య సీతాదేవికి నట్టులే. తన్ను విశేషముగ బాధించు రాక్షసస్త్రీలకు వారొక్కనమస్కారము చేసినంత మాత్రముననే యభయమిచ్చెనని హనుమంతుఁడు చెప్పలేదా? రాక్షసస్త్రీలు సీతను బాధించునట్లు విభీషణుఁడు మనల బాధించెనా? ఆమె చేసినంత మాత్రమైన నేను జేయవలదా? ఆమె సహధర్మచారిణి కావున మే మిరువురము ఒక్క ధర్మము నందుండు వారమే. ఆమె సొమ్ములు నీయొద్ద నుండుటచే నామె ని న్ననుగ్రహించె ననికదా నేను నిన్నుఁ జేరదీసితిని. ఆమె విభీషణు ననుగ్రహించెనని కదా హనుమంతుఁ డాయన గృహము దహింపక తక్కినదంతయుఁ గాల్చివైచెను. ఆమె యనుగ్రహించిన విభీషణు నే నెట్లు విడువఁగలను? ఆమె యనుగ్రహించుటచేతనే కాకాసురుని నే ననుగ్రహించితిని ఆమెయనుగ్రహించుటచేతనే జటాయువునకు మోక్షమిచ్చితిని. మాలో మా కా భేదములేదు. సముద్రస్నానము చేసితి ననిన నలల నంటక చేసితి నని యర్థమా? అలలలో మునిఁగినాఁ డనిన సముద్రస్నానఫలము లేదా?

సముద్రమును అలలను, సూర్యుని నెండను వేఱువేఱు పదార్థములని యెంచు వాఁడే మా యిరువురియందు భేద మెంచువాఁడు. తండ్రికిఁ గుమారుఁడగు వాఁడు తల్లికిఁ గుమారుఁడు కాఁడా? ఆశ్రితరక్షణమందు నా కున్నంత యధికార మామెకును గలదు. భేద మేమనిన నేను దుష్టుల దండింతును. ఆమె దండింపదు.

"యా మాలంబ్య సుఖేనేదం దుస్తరం త్రిగుణోదధిమ్ ।
నిస్తరం త్యచిరేణైవ, వ్యక్తం ధ్యానపరాయణాః ॥"

ఏమెను ధ్యానించి మహాయోగులు సత్త్వరజస్తమోమయమై వ్యక్తంబును, దుస్తరంబు నగు సంసారమును శీఘ్రముగ దాఁటుచున్నారో- "సర్వేషా మేవ లోకానా, మీశ్వరీ మమవల్లభా । అస్యా మమచ శేషం హి విభూతి రుభయాత్మికా" అన్ని లోకములకు అన్ని జీవకోట్లకు నా ప్రియురాలు ఈశ్వరి. ఉభయవిభూతులు ఆమెకు నాకు శేషభూతములు. "యజ్ఞావిద్యా మహావిద్యా గుహ్యవిద్యా చ శోభనే । ఆత్మవిద్యాచ దేవి త్వం విముక్తి ప్రదాయినీ॥" దేవీ! యజ్ఞావిద్యాదులు, మోక్షమీయఁ గల బ్రహ్మవిద్య, యివన్నియు నీవే యను శ్లోకముల ననుసంధించునది. "సర్వ కామ ప్రదాం రమ్యాం, సంసారార్ణవతారిణీమ్। క్షిప్రప్రసాదినీం లక్ష్మీం శరణ్యా మనుచింతయేత్" అన్ని విధములగు కోరికల నిచ్చునదియు, మనస్సునకు నాహ్లాదము గలిగించునదియు, సంసారముఁ దరింపఁజేయునదియు, శీఘ్రముగ ఫలమిచ్చునదియు, శరణ్యయు నగు నామెను జింతింపవలెను. కావున నీ వాఁడ నన్నప్పుడు మీ వాఁడ ననుభావమే యుండవలెను. నాకును అనఁగా నాకే కాదు మీకును నిది వ్రతముగా నుండవలెను. ప్రపన్నులను జూచినపుడు మీరు వారిని సగౌరవముగ నాదరించి వారి కార్యములు దీర్చుచుండవలయును గాని యిప్పుడు మీరు చెప్పినట్లు చంపుదుము, కాలుతుము అని మాటలాడరాదు. సాధువులగు నా భక్తులందు టిల్లు వర్తింపవలయును. నా నడనడికి, నా యభిప్రాయమునకు విరోధముగ వర్తించు వారు నాభక్తు లెట్లగుదురు? ఈ పద్యమున మొదటి యక్షరము కడపటి యక్షరము కలిపి చదివిన నీకున్ అని యేర్పడును.

సుగ్రీ—రామచంద్రా! నీవు విభీషణుఁడు ప్రపన్నుఁడని చెడ్డ పొరపాటు పడుచున్నావు. వాఁడు ప్రపన్నుడు కాఁడు. "సకృదుచ్చారో భవతి సకృదేవ హి శాస్త్రార్థః" అని ప్రపన్నుఁ డొకసారియె కదా శరణాగతి చేయవలె నంటివి. విభీషణుఁడో "రామచంద్రునిన్ శరణముఁ జొచ్చినాఁడ" (యుద్ధ 3-౨౫) ననియు, సత్వరుఁడై శరణార్థియై పడెన్ (యుద్ధ ౩౯-౨) అనియు నిను శరణంబు జొచ్చితిని (యుద్ధ ౩౯-౫) అనియు మూఁడుమార్లు శరణా

గతుఁ డయ్యెను. ఇట్లు చేయుటచే ప్రపత్తి లక్షణమునకు హాని కలిగించు టయేగాక ప్రపత్తృఁడైన తనకు, ప్రపత్తవ్యుఁడవైన నీకు స్వరూపహాని గలిగించెను. కావున వీఁడు భక్తి ప్రపత్తుల రెంటను జెడినాఁడు. ఇట్టి వానినా నీవు రక్షించుట? ప్రపత్తి యధికారి యగు విభీషణునకు స్వరూప హాని యెట్లు కలిగె నందువా? అత్యంత పరతంత్రుఁడు కదా ప్రపత్తి కధికారి. వాఁడొక్కసారి చేసిన ప్రపత్తినిగూడ నుపాయ మని తలఁప రాదుగదా. వీఁడు అచేతనము కాదుగదా. ప్రపత్తి చేసితి నను జ్ఞానము గల చేతనుఁడుకదా. నేను రక్ష్యుఁడ నగుటకు భగవత్సంకల్పమే కారణము. ఆయన రక్షకుఁ డగుటకు నదియే కారణ మని తలఁపవలసినవాఁడు ముమ్మాఱు ప్రపత్తి సేయుటవలన స్వరూపహాని కలిగెను.

నీవు ప్రపత్తవ్యుఁడవు. శరణాగతునిచే నాశ్రయింపఁ బడు వాఁడవు. నీధర్మ మొక్కసారి శరణు అనఁగానే రక్షింపవలసినది; నీకు వ్రతము. అట్లుండ వీఁడు ముమ్మా ఱనువఱ కుపేక్షించితివి. కావున నీకు స్వరూప హానియే కలిగెను.

ఇట్లు ప్రపత్తి లక్షణమునకు అధికారికిఁగూడ స్వరూపహాని వచ్చుటచే ప్రపన్నుని రక్షింపకుండిన మహాదోషము వచ్చునన్న నీవాక్య మిచట నన్వయింపదు.

రామ—సుగ్రీవా! విభీషణుఁ డొకసారియే ప్రపత్తిచేసెను గాని నీవు తలఁచినట్లు ముమ్మాఱు చేయలేదు. ఎట్లందువా? అతఁడు రాఁగానే మి మ్మతఁడు చంప వచ్చె నని తలఁచి యతనినిఁ జంప నాలోచించితిరి. అప్పుడు మిమ్ముఁ జూచి "పరుషములాడి నన్ను నొక బంటు విధాన నవజ్ఞ చేసినన్, దురుసున నాలుబిడ్డలను ద్రోపిసి యిప్పుడ రామచంద్రునిన్ శరణముఁ జొచ్చి నాఁడ"నని మీరు తలఁచునట్లు నేను విరోధిగా రాలేదు. సోదర భ్రాత నగుటచే హిత ముపదేశించిన నన్ను రావణుఁ డతినీచముగా నవమానించి పొమ్మనుటవలన నేనతని సంబంధమును విడువవలసిన తక్కినవానిని సవా సనముగ వదలి, ఆశ్రయింపఁ దగినవాఁ డగుటచే నిచ్చటికి వచ్చి రామ చంద్రు శరణము చొచ్చితి నని చెప్పెను. ప్రపత్తిలక్షణ మైన శరణాగతి యిది యొక్కటియే. ఇందు కండుఁడు చెప్పిన నాలుగు వృత్తివిశేషములు కలవు. వీనిని జేరఁదీయుటకు నివి నాకుఁ జాలును.

నే నభయ మిచ్చిన పిమ్మట మీరు పిలుచుకొని రాఁగా శరణార్థియై పడెన్ అనుటయందు జరిగిన వృత్తాంతము చెప్పఁబడెనేకాని, యివి యతని మాటలు గావు.

నిన్ను శరణంబుఁ జొచ్చితినని మూఁడవసారి చెప్పఁ గారణ మేమందువా? మీరందఱు తన విషయమై విరోధముగాఁ జెప్పఁగా నాకు ముఖ్యులైన మీ మాటలచే నా మనస్సు కలవరపడి యుండునని సందేహించి యా సందేహము దీఱ మీరు చెప్పినదోషము నాయందు లేదు, నీ రక్షణము కోరియే వచ్చితినని చెప్పెను. కావున ప్రపత్తికి హానిలేదు. ప్రపన్నునకు హానిలేదు. నాకు హానిలేదు.

రామచంద్రునిన్ శరణము చొచ్చితి నను వాక్యమునందు విడువ వలసినవి విడుచుట చెప్పఁబడెను. ఇందు పరుషము లను పదమునందలి యుపసర్గము 'పరిత్యజ్య' యను చరమశ్లోకమునందలి పరి యను నుపసర్గార్థమును బోధించుచున్నది. వానరులతోఁ జెప్పుకొనుటచే పురుషకారపూర్వకముగఁ బ్రపత్తిచేసెననియు జెప్పఁబడెను. కావున నిదియే ప్రధానప్రపత్తి. సకృత్ప్రపత్తివలనఁ బ్రపన్నుఁడైన వానికిఁ దరువాతఁ జేయు వాచిక కాయిక ప్రపత్తులు పునః ప్రపత్తిలోఁ జేరవు. కాఁబట్టి యొకపరి యనియే రామచంద్రమూర్తి చెప్పెను. మూఁడవసారి సమక్షమునఁ జెప్పఁబడినదే ప్రపత్తి వాక్యమందుమేని ప్రపన్నుఁడు కాకముందే రక్షించె నను నాక్షేపము వచ్చుటేకాక పురుషకారము లేదను నాక్షేపము వచ్చును. తల్లిని బిడ్డ యమ్మా! యన్న మనును. ఆమె తెచ్చులోపల మీఁదమీఁద పదిమార్లు అమ్మాయన్న మనును. అన్నము తెచ్చుటకు మొదటిసారి పిలిచినదే చాలునుగదా. తక్కినవి రుచివిశేషమును దెలుపును.

కావున నొకసారి ప్రపత్తిచేసెనుగాని పలుమాఱు చేయలేదు. అంతే కాదు. మన మతని యింతసేపు నిరాధారముగ నాకాశమున నిలువఁబెట్టి రక్షింతమా, వలదా? దుష్టుఁడా, శిష్టుఁడా యని యీ విధముగ నింతకాలముగ నాలోచించుచున్నాము గాని యతఁడో రావణుఁడు ఛీ పొమ్మనఁగానే యక్కడ లేచినవాఁడిచ్చట వచ్చి ముహూర్తములో నిలచెనే కాని వీఁడు పొమ్మనెనే, ఇంటికి భార్యయొద్దకుఁబోయి చెప్పిపోదునా, తల్లిదండ్రులయొద్దకుఁ బోదునా, అన్న కుబేరుని యొద్దకుఁబోదునా, దేశాంతరము బోదునా, రాముని యొద్దకుఁబోదునా, నేనుమాత్రము పోయిన నా పెండ్లాము బిడ్డలగతియేమి? వారిని రక్షించువా రెవ్వరు? రావణుని కాళ్ళమీఁదనే పడుదునా, రాముని యొద్దకుఁబోయిన నాయన నన్ను నమ్మునో నమ్మఁడో- అనుగ్రహించునో- నిగ్రహించునో- చెఱయందుంచునో తలఁగొట్టునో, రాముఁ డనుగ్రహించిన వానరు లేమందురో, వారును నిగ్రహించిరేని తరువాత నెక్కడికిఁబోదును అని యిట్టు లాలోచించెనా? మనయం దెంతో నమ్మకము లేకుండిన నిట్లు సాహసించి రాఁ గలఁడా? సుగ్రీవా! నీవు

నాతో స్నేహము చేయునపుడే నా యన్నను జంపుమని నా చేతఁ బ్రమాణము చేయించుకొంటివే ఇతని నోట నట్టిమాట వచ్చెనా? నీవు కోరినట్లు రాజ్యము నా కిమ్మని కోరు నేమో పరీక్షింపుము.

సుగ్రీ—రామచంద్రా! విభీషణుఁడు భక్తుఁడే కాని ప్రపన్నుఁడు కాఁడు. ఏల యందువా? 'శ్రీరాముని కప్పగింపు సీతాదేవిన్' అని మంచిమాట చెప్పుట నీ యందలి ప్రేమచేఁ గదా. అట్టులే దూతను జంపవల దనుట భార్యచేత బిడ్డలచేత నీ భార్యకు ధైర్యోక్తులు చెప్పి పంపుట ఇట్టివి పురశ్చరణ వంటివి కావా? కావున వీఁడు ప్రపన్నుఁడు కాఁడు.

రామ—దూతను జంపవలదని చెప్పుట యన్నకుఁ బాపము, అపకీర్తి వచ్చునే యని యతని గౌరవముగోరి చెప్పెనుగాని నాయందు, హనుమంతునియందుఁ బ్రేమ గలిగిగాదు. సీత నిమ్మని చెప్పుటకును వాఁడు వంశనాశమై పోవునే యను తలంపుతోఁగాని నాయందుఁ బ్రేమచేఁగాదు. ఆలకుయిలు, ఆఁడుకుయిలు నెవరైన నాలకించి యాదరింపవలసినదే ధర్మము అతఁడు జన్మ ప్రభృతి ధర్మనిష్ఠుఁడు. "కం. పరమాపత్కాలమునను, దొరసినయేనియు మనంబు దోఁగక యెపుడున్, బరఁగుతధర్మమునందే" యనియు "కం. ఏ యేఁయాశ్రమమందును, నేయే మతి సంభవించు నీశ్వర నిరతం, బాయాయదిధర్మమునం, దే యనువర్తించుగాక" యనియు (ఉత్తర-౨౧౧-౨౧౨) బ్రహ్మనుగోరి వరము పొందినవాఁడు. రాక్షసచేష్టలు లేవని శూర్పణఖయే చెప్పెను. దుష్టునకు దుష్టకార్యములు చేయుట యెట్లు స్వభావమో, ధర్మాత్మునకు ధర్మము స్వభావసిద్ధము. తన్ను రావణుఁడు వెడలఁగొట్టును, ఇచ్చటికి రావలసియుండును అని ముందుగాఁ దెలిసియా యీ కార్యములు చేసెను. ప్రపన్నుఁడు ధర్మకార్యములు చేయరాదా? మంచిమాట లాడరాదా? సీత నెవరికైన బోధింపరాదా? కావున విభీషణుఁడు ప్రపన్నుఁడే. నేను ప్రపన్నుఁడ నని సోమరియై మొద్దువలెఁ గూర్చుండువాఁడు వాస్తవ ప్రపన్నుఁడు గాఁడు. లోకహితార్థము ఫలకాంక్షలేక యథాశక్తి ధర్మకార్యము చేయువాఁడే వాస్తవ ప్రపన్నుఁడు. వీఁడే నా కనుకూల సంకల్పుఁడు.

వీఁడు భక్తుఁడై యుండెనేని వీఁడిట్లు వచ్చిన సహించియుండను. స్నానము చేసి నిత్యకర్మానుష్ఠానములు దీర్చుకొని శుచియై వచ్చియుండవలెను. వీఁ డెచ్చట స్నానముచేసి యే పట్టువస్త్రము గట్టుకొని వచ్చెను. భక్తి యోగమునందు నధికారనియతి, ఆచారనియతి, కలదుగదా. "యదహరేవ విరజేత్, తదహరేవ ప్రవ్రజేత్" ఏనాఁడు విరక్తి గలిగెనో, యానాఁడే యిల్లు విడిచిపోవలెను-అన్నట్లు రావణువిషయమున నేనిమిషమున మనస్సు రోసెనో, యా నిమిషముననే కదా బయలుదేరి వచ్చెను. సంసారకాంక్ష

యున్నయెడఁ బెండ్లాలకు, బిడ్డలకుఁ జెప్పియైన వచ్చియుండఁడా? దిన వార నక్షత్రయోగకరణములు మంచివగునా, కావా యని పంచాంగము చూచి వచ్చెనా? నాస్తి నాక్షత్ర సంబంధో ననిమిత్తపరీక్షణమ్, శ్రద్ధైవ నిత్యమష్టాక్షర పరిగ్రహే" అష్టాక్షర స్వీకారమందు నక్షత్రము మంచిదగునా కాదా, శకునము మంచిదగునా కాదా యని పరీక్షింపవలసిన పనిలేదు. శ్రద్ధయే, రుచియే దానికిఁ గావలసిన యధికార మని ప్రపత్తివిషయమునఁ గదా చెప్పఁబడెను. కావున వీఁడు ప్రపన్నుఁడేకాని భక్తుఁడుగాఁడు.

ఇచ్చట నొక్క విషయము చెప్పవలసియున్నది. శరణాగతికి దేశకాలాది నియమములు లేవనియుఁ, బారిశుద్ధ్యము లేదనియుఁ జెప్పుటచే నెవ్వఁడైన నేస్థితియందైనఁ బ్రపత్తి చేయవచ్చు ననియు, దానికి నియతి లేదనియు నీ మొదలయిన దురభిప్రాయములు గలవారు కారాదు. న్యాసము, సన్న్యాసము ఈ రెంటికి జ్ఞానము ప్రధానము. ఆ మాత్రమున స్వవర్ణాశ్రమాచార ధర్మములు త్యాజ్యములు కావు. ఆతుర సన్న్యాస మెట్టిదో యీ శరణాగతియు నట్టిదే. "యద్యాతురస్స్యాన్మనసా వాచా సన్న్యసేత్" అని శ్రుతి. అనఁగా ఆతురుఁడైనయెడల మనస్సుతోఁగాని వాక్కుతోఁగాని సన్న్యసింప వచ్చును. ప్రపత్తికి నిదియే లక్షణము. ఇదిగో విధి.

ఆతురుఁ డనగా— "ఉత్పన్నే సంకటే ఘోరే చోరవ్యాఘ్రాది గోచరే, భయభీతస్య సన్న్యాసమంగిరా మునిరబ్రవీత్' ఘోర కష్టదశ ప్రాప్తించినను దొంగలచే, పులులు మొదలగు వానిచే భయము గలిగినపుడు, ఇఁక బ్రతుకనని తోఁచెనేని మీఁదఁ జెప్పినట్లు వాక్కుతోనో, మనస్సుతోనో సన్న్యసింప వచ్చును.

ఆపత్కాలేతు సన్న్యాసః కర్తవ్య ఇతి శిష్యతే
జరయాభిపరీతేన శత్రుభి ర్వ్యాధినేనచ
ఆతురాణాం చ సన్న్యాసే నవిధి ర్నైవ చ క్రియా
ప్రేషమాత్రం సముచ్చార్య సన్న్యాసం తత్రపూరయేత్
సన్న్యస్తోహమితి బ్రూయాత్ సవనేషు పరిక్రమాత్
ఆతురాణాం విశేషోస్తి న విధి ర్నైవచ క్రియా
ప్రేషమాత్రస్తు సన్న్యాస మాతురాణాం విధీయతే.

ఆపత్కాలమందు సన్న్యాసము కర్తవ్యము. ముసలితనముచేతనో, శత్రుబాధచేతనో బాధపడువాఁడు ఆతురసన్న్యాసి కావచ్చును. ఆర్తికలవాఁడై సన్న్యసించితి నని చెప్పుట చాలును. దీనికి విధిలేదు. హోమాది కర్మములు లేవు. ఆర్తిమాత్ర ముండవలెను. ఆర్తుఁడై సన్న్యాసి నైతి నని చెప్పిన

వెంటనే చచ్చెనా వానికి దహనాది క్రియలు లేవు. సన్న్యాసులను బూడునట్లు పూడ్చవలయును. బ్రదికెనా మరల యథావిధిగా హోమాదులతోడ సన్న్యాస కల్పప్రకారము కర్మకాండము జరుపవలయును.

"ఆతురస్య ప్రైషమాత్రేణ సన్న్యాసస్య పూర్తి శ్రవణాత్ తదుత్తర కాలమేవ మృతస్య ఉపదేశవికలస్యాపి ఖననసంస్కారమేవ కుర్యాత్. జీవితశ్చే చ్ఛిఖాయజ్ఞోపవీతంచ నికృత్య దండకాషాయవస్త్రాదీని చాదాయ సద్గురు మన్విష్య తదుపదేశం గృహీత్వా యతిధర్మా ననుతిష్ఠేత్" ఆతురునకు నార్తితో సన్న్యాసినైతి ననుటచేతనే సన్న్యాసపూర్తి కలదు, కావున వాఁ డుత్తరక్షణమందుఁ జచ్చెనేని ఉపదేశము లేకపోయినను ఖననసంస్కారమే చేయవలయును. ఆ వల జీవించెనా శిఖాయజ్ఞోపవీతములు వదలి దండము కాషాయవస్త్రాదులు తీసికొని సద్గురు నొద్దకుఁబోయి యాయనచే మంత్రోపదేశము గొని యతిధర్మమం దుండవలెను.

ఇట్టులే యార్తప్రపన్నునకే విధియు నక్కఱలేదు. కాని యావల వాఁడు జీవించెనా యథావిధిగా దేవతాసన్నిధానమందు సదాచార్యునిచే మంత్రోపదేశము గొని స్వవర్ణాశ్రమధర్మములను దప్పక జరుపవలెను. విభీషణుఁడు, ద్రౌపది, అర్జునుఁ డిట్టి కష్టదశయందు విధిరహితముగఁ బ్రపత్తి చేసి యావల నియమములు జరపినవారే. కావునఁ బ్రపన్నుఁడు వర్ణాశ్రమాచార రహితుఁడై యావజ్జీవము నాస్తికుఁడై చరింపవచ్చునని ప్రపత్తి శాస్త్రములు చెప్పవు. ఆర్తి కలిగి ప్రపత్తిచేయువానికి విశ్వాసము, పారతంత్ర్యము ముఖ్యములు. దృప్తుఁడైన ప్రపన్నునకు నన్ని యనుష్ఠేయములే. నాకు దాసుల మనువారు నా యాజ్ఞ నుల్లంఘింప వచ్చునా? శ్రుతులు, స్మృతులు నా యాజ్ఞా వచనములు. వాని నతిక్రమించి స్వేచ్ఛగా వర్తించువాఁడు నా భక్తు డెట్లగును? ప్రపన్నుఁ డెట్లగును? నీ యందు నాకుఁ బ్రేమ గలదు, గాని నీవు చెప్పినమాట వినను అనిన నేమి యర్థము - అని రామచంద్రమూర్తి యభిప్రాయము.

'రోజనలు సేయు తెలుఁగుల వ్యూహములను నుపమలందేని నప్రమత్తుండవై యుండవలయు'నని కర్మమం దెక్కువ నిష్ఠగల నీ కంటెను, "జాంబవాం స్త్వథ సంప్రేక్ష్య శాస్త్రబుద్ధ్యా విచక్షణః" అని జ్ఞానయోగ నిష్ఠగల జాంబవంతుని కంటెను, 'భక్తిశ్చ నియతా వీర' నియమములతోఁ గూడిన భక్తి యని చెప్పి భక్తిమార్గనిష్ఠుఁడైన హనుమంతుని కంటెను, 'రామచంద్రునిన్ శరణము చొచ్చితి' ననిన విభీషణుఁడే నాకు విశేషముగఁ బరిగ్రహింపఁదగినవాఁడు. హనుమంతుఁ డంత శ్రమము పడినఁగదా యతనికి నన్ను సమర్పించుకొంటిని. విభీషణుని 'శరణం గతః' శరణు చొచ్చితి నన్న

రెండు మాటలలోనే గ్రహింపఁదలచితిని. కావున కర్మయోగులు, ఆత్మజ్ఞానయోగులు, భక్తులు నాకుఁ బ్రియులే యైనను ప్రపన్నులు వారికంటె నాకిష్టులు. కావున నెవ్వఁడు శరణను మాట నా చెవిని బడెనో యభయమని యప్పుడే యంటిని. వీరు చంటిబిడ్డలవంటి వారు.

సుగ్రీ—నేను రాజ్యకాంక్ష నిన్నాశ్రయించితి నంటివి సత్యమే. నేను గాదనను గాని విభీషణుఁడు "తానును రాజ్యము వేఁడుపొంటె నీయెడకుఁ దారసిలెన్ మతి పూర్వకంబుగన్" (౩౮-౨౫) అని మీ హనుమంతుఁడే కదా చెప్పెను.

రామ—అది చెప్పినవాఁడు హనుమంతుఁడే కాని, విభీషణుఁడు గాఁడు. విభీషణుఁడు నాయభిప్రాయ మిది యని హనుమంతునకుఁ జెప్పలేదు. విభీషణు రాకకుఁ బ్రయోజనముఁ గల్పింపఁగోరి తన యూహచేఁ దనకు విభీషణుఁ డుపకారము చేసియుండుటచేఁ బ్రత్యుపకారబుద్ధిఁ జెప్పెను. సుగ్రీవా! నేను నిన్నాక్షేపించుచున్నా నని తలఁపకుము. ప్రపత్తిలక్షణము విభీషణుఁడు ప్రపన్నుఁడను విషయము నీకుఁ దెలిపి నీ సందేహమును బోఁగొట్టఁ జెప్పుచున్నాను. ఇప్పుడు నీవు నాకింతటి మిత్రుఁడవుగదా. ఎన్నివిధముల నన్ను నీవు పరీక్షించి నాయందు నీవు విశ్వాసముగలవాఁడవైతివి. రెండవనాటి యుద్ధమునందు వాలిని నేను జంపువఱకు నీ సందేహము తీరలేదుకదా! విభీషణుఁడో నాయం దెంతటి దృఢవిశ్వాసము లేకుండిన జంకు గొంకు లేక నేను దండింతునో, నిరాకరింతునో యను భయము లేక చివాలున లేచి తన పూర్వపరిచితు లగు నాప్తుల యొద్దకువచ్చినట్లు వచ్చెనే! అది నీవాలోచింపవలదా? నీది గుణకృతదాస్యము. నా గుణముల బరీక్షించి దాసుఁడవైతివి. అతనిదో స్వరూప ప్రయుక్త దాస్యము. గుణకృతదాస్యమునకంటె స్వరూపప్రయుక్తదాస్యమే కదా శ్రేష్ఠము. ఈ కారణముచే నూతనముగఁ బుట్టిన దూఁడయందలి ప్రీతిచే దానికి ముందుపుట్టిన దూడను ఆవు పొడిచి తన్నినట్లు నేను నీ పక్షము నిరాకరించి యగని పక్షమునే మాటలాడుచున్నాను. సుగ్రీవా! నాకు శరణాగతుఁడైనవాఁడు వెంటనే నాయొద్దకు రాకుండ నీ వడ్డుపడుటచే నింతకాలముగ నయ్యో! నిరాధారముగ నాకాశమున నిలఁబడియున్నాఁడు గదా యని నామనస్సెంత పరితపించుచున్నదో నీ వెఱుఁగవు కదా.

సుగ్రీ—నాకుఁ జేసిన శరణాగతి వ్యర్థము పోరాదంటివి గదా. నేను నీ యొద్దకు విభీషణుకంటె సమీపముగ వచ్చితిని, చేతులు జోడించితిని, నాయభిప్రాయము చెప్పితిని. విభీషణువలన నాకుఁ జావులేకుండఁ గాపాడు మంటిని. ఇంత దూరము నేను వినయముతో మనవిచేసినను నా శరణాగతి వ్యర్థము చేయుచున్నావేల ?

రామ—విభీషణు శరణాగతికంటె నీది వెనుకటిది, దానికి విరుద్ధమైనది. అతనికి నా ప్రాప్తి లేకుండఁ జేయవలయు నని నీ సంకల్పము. ఆయనవలన నీకుభయము లేదు. నే నెఱుఁగుదును. నీది యస్థానభయము. దానికి నీ యూహాతిప్ప దగిన కారణము లేదు. ఒక భాగవతుఁడు చేసిన శరణాగతికి విరుద్ధముగ మఱి యొకఁడు చేయు శరణాగతి ఫలింపదు, నీ మేలు నీవు కోరవచ్చును. ఇతరులకుఁ గీడు గోరరాదు. ఒకఁడు చెడవలె, నేను బాగుపడవలె ననుతలంపు సరిగాదు.

సుగ్రీ—రామచంద్రా! ప్రపత్తి యుపాయమా? యుపేయమా? ఉపాయమంటివా కర్మజ్ఞాన భక్తులకు దానికి నేమి భేదము? దాని వైశిష్ట్య మెట్లు?

రామ—ఒకసాధనముచే మఱియొక వస్తువును సాధించునెడల నా సాధనము పాయ మనఁబడును. ఒకఁడు పండును కత్తితో ముక్కలుగాఁగోసి తినును. కత్తి సాధనము, పండు సాధ్యము. కత్తి యుపాయము, పండు ఉపేయము. కర్మ జ్ఞాన భక్తులు భగవత్ప్రాప్తి యను ఫలమునందు నీ కత్తివంటివి. మఱి యొకఁడు పండునే యెత్తి నోటఁగఱచుకొని భుజించెను. వానికిఁ గలిగిన ఫలమే వీనికి గలిగెఁగదా. వీనికి సాధన మేది? సాధ్యమేది? సాధనమే లేదంటివా, పండు పండుగా నుండవలసినదే, వీఁడు వీఁడుగా నుండవలసినదే. కావున సాధనమునకు సాధ్యమునకు భేదములేదు. అట్లులే ప్రపత్తికి, నాకు భేదములేదు. కావునఁ బ్రపత్తియే నేను, నేనే ప్రపత్తి. నన్నాశ్రయించుటే ప్రపత్తి నాశ్రయించుట. నిన్ను సాధించుటకు నాకు వేఱుపాయము-సాధనము లేదు. నీవే యుపాయము-సాధనము గమ్మని ప్రార్థించు జ్ఞానమే రూపముగాఁగలది ప్రపత్తి. గత్యర్థకము లన్నియు జ్ఞానార్థకములు గదా.

సుగ్రీ—అట్లైన నచేతనమగు జ్ఞానము చేతనుఁడ వగు నీ వెట్లగుదువు?

రామ—వానికిఁ దీపను జ్ఞానము లేదు, తెలుపను జ్ఞానము లేకుండునుగదా. తీపు తెలుపు జ్ఞాన మెట్లగు నని నీవనెదవు? జ్ఞానమునకు వన్నె రుచి కలవా? అట్లులే నాకును, బ్రపత్తికి నభేదము చెప్పఁబడును, ప్రపత్తికి నేను విషయము. నేనే యుపాయము. కావున నన్ను సాధించుటకు నేనే యుపాయ మగుదునుగావున నభేదము

సుగ్రీ—రామచంద్రా! నీవు ప్రపన్నున కభయము ఘటియించెద నంటివి. అంతకు ముందు లేనిదానినిఁగదా నీవు క్రొత్తగాఁ గలిగించితివి. "ఉత్పన్నస్య వినాశయోగాత్" ఏది యుత్పన్న మగునో యది నాశ మగును. అను న్యాయముఁ బట్టి నీ విచ్చు ముక్తికి నాశము కలదుగదా.

రామ—సుగ్రీవా! జీవులు నిత్యులు. "అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాస" యన్నట్లు జరామరణాదులు లేనివారు చేతనులు, ఇవి జీవుల స్వరూప స్వభావములు. ఇట్టి జీవులు ప్రకృతికి వశపడి దాని బలముచేఁ

దమ గుణములను మఱచి తమ్ముఁ జచ్చువారిగాఁ, బుట్టువారిగాఁ దలఁచుచున్నారు. ఈ ప్రకృతి బాధ తొలఁగిపోయెనేని మఱల యథాపూర్వము స్వప్రకాశముతోఁ బ్రకాశింతురు. అద్దము ప్రకాశించునదే, అది మురికి వలనఁ బ్రకాశము మఱుఁగుపడి యున్నది. ఈ మురికి దాని ప్రకాశము వెలికి గానరాకుండఁ జేసినదే కాని, దాని ప్రకాశమును రూపుమాపఁ జేయలేదు. కుండలో దీప ముంచితిమేని దీపకాంతి వెలికి రాకుండఁ గుండ చేయగలదుగాని దీపమునకు గాంతిలేకుండఁ జేయఁజాలదు. అట్లే ప్రకృతియు జీవునికి స్వరూప స్వభావనాశము గలిగింపఁ జాలదు. మఱుఁగు పఱుపఁగలదు. మఱుఁగు తొలఁగి పోయిన మునుపటివలె నుండును. క్రొత్తగా వచ్చినదిలేదు. ప్రపత్తి ఈ ప్రకృతిని దొలఁగించును. అది చేయు కార్య మంతియే. ప్రకృతి తొలఁగిపోవుటచేఁ బ్రపన్నుఁడైన జీవుఁడు తన స్వస్వరూపముతోఁ బ్రకాశించును. కావున నే నభయము ఘటియింతు ననఁగా భయకారణము తొలఁగింతుననియే యర్థముగాని, యభయ మను క్రొత్తదాని నెక్కడనుండియో తెచ్చి యిచ్చెదనని యర్థము కాదు. నీవు యువరాజవై యుంటివి. వాలి యను ప్రతిబంధము నీకా సుఖము లేకుండఁజేసెను. నే నా ప్రతిబంధము దొలఁగించితిని. నీ పూర్వస్థితికి నీవు వచ్చితివి. నీకు నేను క్రొత్తగా వానరరాజ్యమును, రుమను దెచ్చి యిచ్చితినా ?

ఈ విషయమున "స్వేనరూపేణాభినిష్పద్యతే- ఆవిర్భూతి స్వరూపస్తు- అవబోధాదయో గుణాః" అనియు "ప్రకాశ్యంతే న జన్యంతే నిత్యా ఏవాత్మనో హి తే" యనునవి ప్రమాణములు. ఆత్మలు నిత్యములు కావున వాని కాస్థితియు నిత్యమే, కావున ముక్తియు నిత్యమే.

సుగ్రీ— ఈ ముక్తుఁడు మఱల సంసారములోఁబడిన నీ వేమి చేయఁగలవు? ముక్తికి హాని రాలేదా ?

రామ— ఏటిప్రవాహమునం దొకఁడు కొట్టుకొని పోవుచుండ లాగి యొడ్డున వేసితిని. మరల వానిని నీళ్ళలోఁ ద్రోయుదునా ?

సుగ్రీ— వాఁడై పడిన నీ వేమి చేయఁగలవు ?

రామ— నా సంకల్పము లేక గడ్డిపోచయుఁ గదలదు. ప్రపన్నుఁడు ముక్తుఁడు కావలయునని సంకల్పించి ముక్తునిఁ జేసితిని. నా సంకల్పమునకు విరోధముగ మరల సంకల్పించుటకు నేను వెఱ్ఱినా ? చపలచిత్తుఁడనా ? అట్లెప్పటికి జరగదు.

న పునరావృత్తి శబ్దాత్ న పునరావృత్తి శబ్దాత్ - బ్ర. సూ.

యద్ గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ. భ. గీ. ౮-౨౧.

సుగ్రీ—తక్కిన యుపాయములకంటెం బ్రపత్తి శీఘ్రఫలద మంటివే. అది యెట్లు?

రామ—నీవు మామిడిపండు తినవలయునని కోరిక గలిగి పండొత్తుకొని నోరం బెట్టుకొంటివి. మఱి యొకండు అట్టిపండే తినవలయునని కత్తిని సంపాదించుకొని దానిని జిక్కంబట్టుకొని చేతిని గోసికొందునో యని మెల్లగా పండును ముక్కలుగాం జేసి ముందుంచుకొని యొక్కొక్క ముక్కయే తిన నారంభించెను. ఫలము రుచి శీఘ్రముగ ననుభవించిన వారెవరు? నీవే కదా. అట్లులే ప్రపత్తి యనంగా నా ప్రాప్తియే, నన్ననుభవించుటయే. కావునం బ్రపత్తిచేసిన నిమిషము మొదలు వానిని నేను రక్షించువాండనే. తక్కిన వట్లుగాదు గదా!

సుగ్రీ—రామచంద్రా! ధనధాన్యాదులం గోరువారు నిన్ను నిర్బంధించు చున్నారంటివి. వారు చేయునదియాచనయే. విభీషణుండు శరణు వేండెను, ఇదియాచనయే. అది నిర్బంధ మైనపుడు, ఇదియేల నిర్బంధము కాదు?

రామ—అతిథి యెవండైన వచ్చునా యని యన్నదాత వగు నీ వెదురు చూచుచుంటివనుకో. నీ భోజన సమయమునకు సత్పురుషుండు వచ్చెననుకో, వానికన్నము పెట్టుట నీకు నిర్బంధముగాం దోంచునా? మఱియొకండు త్రాగుంబోతు నాకుం బదిరూపాయ లిమ్మని వాకిట ధారణ పండుకొనె ననుకో! ఇచ్చుటకు నీ కిష్టము లేదు. ఇది నిర్బంధ పఱుచుట కాదా? ఈయిరువురను నీవు సమానముగాం జూతువా? అట్లులే నేనును రక్షించుట యనునది నాకు స్వభావధర్మము. కావున నెవండైన రక్షింపుమని కోరునా యని నే నెదురు చూచుచుందును. ఇట్టిచోట నొకండు నన్ను రక్షింపుమని తన యభిప్రాయముం దాను దెలిపిన నాకుం గష్టముగాం దోంచునా? ధనము, ధాన్యము కోరువారి విషయము నట్టిదికాదు. ధనధాన్యాదులం గోరువారు వానివలనం గలుగు కీడు వారెఱుంగరు, నే నెఱుంగుదును. వానివలన వారు ముక్తికి దవ్వైపోదురు. కావున వారి కది యిచ్చుట నా కభిమతము గాదు. కావున నది నిర్బంధ మంటిని. వేండుట యనంగాం దన యభిప్రాయము తెలియంజేయుట. ప్రపన్నుండు తెలియంజేయవలసిన దింతయే; ఒకండు నీయొద్దకు వచ్చి 'యయ్యా నీవు నాకు జీతము బత్తెమియ్యవలసిన పనిలేదు. నీకొలువు చేయుచుండెద' ననును, ఇది నిర్బంధించుట యగునా?

విభీషణునియందు బ్రపత్తి లక్షణపూర్తి గలదా?

ఆనుకూల్య సంకల్పము, ప్రాతికూల్యవర్జనము, రక్షించు నను విశ్వాసము, గోప్తృత్వవరణము, ఆత్మనిక్షేపము, కార్పణ్యము— ఈ యాఱును ప్రపత్తి కంగములు. ఇవి విభీషణునియందుం గలవు. సర్వభూతహితము ఆనుకూల్య సంకల్పము. సర్వము భగవంతునకు శరీరము కావున నెవరిని హింసింపకుండుట

ఆనుకూల్య సంకల్ప మగును. ఇది విభీషణునియందుఁ గలదనుటకు, "ఉ. అన్నవు నీ వటంచు హితమార వచించిన యట్టి నానుడుల్, మన్నన సేయవైతి విఁక లంకను రాక్షససంఘ యుక్తమున్, నిన్నును లెస్స కాచుకొని నెమ్మదినుండుము స్వస్తి నీకగున్, వన్నెడఁబాసి సౌఖ్యము ఘనంబుగ నందుము పోయివచ్చెదన్ (౩౧౬ ప.)అను దానిని లక్ష్యముగాఁ బూర్వాచార్యు లుదాహరించి యిట్లు సమర్థించిరి.

వన్నెడఁబాసి సౌఖ్యమందు మనునది యెత్తిపొడుపు మాటయే కాని నిండుమనస్సుతోఁ జెప్పినమాటగాదు. నీవు చచ్చుట సిద్ధ మనియే వాస్తవార్థము. ఇట్టిది యానుకూల్య సంకల్ప మగునా యని శంక.

శత్రుఁడైనను, మిత్రుఁడైనను, నుదాసీనుఁడైనను సర్వము భగవచ్ఛరీరమను తత్త్వజ్ఞానము గలిగి హింసింప మానెనేని యానుకూల్య సంకల్పమగునుగాని, అన్నవుగాన నీకు హితము చెప్పితిని అని చెప్పుటచేఁ దన కర్తవ్యము తాను నిర్వహించినవాఁ డయ్యెగాని, తత్త్వజ్ఞానమునకు నెడము లేదు. అయినను రావణుఁడు దుష్టుఁ డగుటచే నతనియందు నన్న యను గౌరవము విభీషణునకు లేదు. తండ్రియైనను జారుఁ డయ్యెనేని వానియందుఁ దండ్రియను గౌరవ ముంపరాదనికదా భారతము చెప్పుచున్నది. అట్లుండఁ బరమ దుర్మార్గుఁడయి బుధుఁడు తన తల్లియగు రోహిణిని బట్టినట్లు జగన్మాతయగు సీతనుగూడఁ జెఱుపఁదలఁచిన వానియందు సోదరప్రీతి యెట్లుండఁగలదు. ఆ కారణముచే కండి గర్వముననో, యజ్ఞానముననో యకార్యములు చేయు గురువునైనను శాసింపవలసిన దనియే శాస్త్రము చెప్పుచున్నది. కావున రావణుఁడు దండ్యుఁడే కాని, వంద్యుఁడు కాఁడు. కావున శత్రుకోటిలోఁ జేరినవాఁడే (౧౭౩వ పద్యంబున నీవు చేసినది ఆయువు, సంపద, కీర్తి సర్వము నాశముచేయునది యని రోసి పలికెను. అదియునుగాక యింద్రజిత్తుతో విభీషణుఁడు(౨౦౧౩- ౨౦౧౫-౨౦౧౬-౨౦౧౭-౨౦౧౩ పద్యములందు) రావణు దుశ్చేష్టలును, రావణుని దాను విడిచిన కారణము స్పష్టముగఁ జెప్పెను. అదియునుగాక రావణ వధానంతరము (౨౫౦౫) పద్యమునందు) భ్రాతృరూపముగొన్న పరమవైరి యని యిట్టిమాటలు చెప్పెను. ఈ కారణముచే సీతాహరణము మొదలు రావణునందు విభీషణునకు భ్రాతృభక్తి లేదని స్పష్టపడుచున్నది. ఇట్టులుండియు వానికి హిత ముపదేశించుట యానుకూల్య సంకల్పముచేతనే యనియు, భ్రాతృభక్తిచేఁ గాదనియు నిర్ణయించిరి.

ప్రాతికూల్య వర్జన మనఁగా హింసింపశక్తియుండియు హింసింపకుండుట 'శీతో భవ' అగ్నిహోత్రుఁడా చల్లగాఁ గమ్మని చెప్ప శక్తిగల సీతాదేవి రావణుని 'హతో భవ' చావుము అని చెప్పశక్తిగలిగియు స్వరూపహాని యను

భావముతో వానిని హింసింపక సహించి యూరకుండెను. అట్లులే విభీషణుఁడును బ్రహ్మచేఁ జావులేకుండ వరమును, బ్రహ్మాస్త్రమును బొందినవాఁడు కావున రావణుని దల పగులగొట్టి యుండవచ్చును. రాక్షసులచే వానికిఁ జావులేదుగదా యనిన చావులేని కబంధుని నింద్రుఁడు చేసినట్లు చేసియుండ వచ్చును. అయినను నట్లు చేసినవాఁడు కాఁడు. కావున నాయన యందుఁ బ్రాతికూల్య వర్జనము కలదు. ఇది సరిగాదు. విశేష సహాయ సంపత్తిగల రావణునకు భయపడినాఁడని యేల తలంపరాదని యాక్షేపమురాఁగా హింసాద్యపాయ విరతి యను లక్షణమందు అపాయ శబ్దమునకుఁ బ్రాప కాంతర మని యర్థము కావున తన్నవమానించిన రావణు నిగ్రహింప యత్నించుటయుఁ బ్రాపకాంతర మగును. కావున నట్టిది చేయు తలంపు లేకుండుటే ప్రాతికూల్య వర్జన మని గ్రహింపనగు. పరతంత్ర స్వరూప నాశక మగు స్వయత్నమును మానుటకంటెఁ బ్రాతికూల్య వర్జనము వేఱొకటిలేదు. కావున నిచ్చటఁ జెప్పఁబడిన ప్రాతికూల్య వర్జన మిదియే.

మఱియు హింసమానుట, అపాయము మానుట, ప్రాతికూల్య వర్జన మన్నప్పుడు ఆత్మకు బంధకారణము లగుటచే కామ్యకర్మములే హింసా శబ్దమున కర్థమనియు ప్రపత్తిని దప్ప నితరోపాయములందు సంబంధము కలిగించుకొనుట అపాయమనియు జెప్పఁబడెను. కావున కామ్యకర్మములు మాని ప్రపత్తి నిష్ఠుఁడగు వాఁడు ప్రాతికూల్యమును వర్జించినవాఁడగును. ఇట్లు చూచినను స్వయత్న త్యాగము ఫలితార్థ మగును. కావున ముందు చెప్పినది దీనితోఁ బొసఁగుచున్నది.

శరణాగతుని రామచంద్రమూర్తి వాత్సల్యంబున రక్షించు నని సీతాదేవి చెప్పి యుండుటను, వాలినిజంపి సుగ్రీవునకు రాజ్య మిచ్చె నని విని యుండుటను శరణాగతుఁడైనచోఁ దన్నుమాత్ర మేల రక్షింపఁడను నమ్మకముతో ముందు వెనుకఁ జూడక యితరాలోచనలు లేకవచ్చుట మహావిశ్వాసమును దెలుపును.

ఇట్టి విశ్వాసము కలుగుటకు నాలుగు కారణములు చెప్పఁబడెను.

"శక్తే స్సూపసదత్వాచ్చ, కృపాయోగాచ్చ శాశ్వతాత్,
ఈశేశితవ్యసంబంధా దనిదం ప్రథమా దపి॥"

శక్తి, సూపసదనము, కృపాయోగము, రక్షకరక్ష్య సంబంధము – ఇవి భగవంతునియందు గల వనుజ్ఞానము విశ్వాసకారణ మగును.

శక్తియనఁగా దన యాశ్రితుల కార్యములను జక్కఁజేయుటయందు అఘటిత ఘటనాసామర్థ్య రూపశక్తి. తన యాశ్రితుల కోఱికితురుల కసాధ్యమైన వానిని గూడఁ జేయుట. లోకముల నన్నిటినిజయించిన రావణుని జయించిన వాలిని నొక్కబాణముతోఁ జంపుట యెవ్వరికిని సాధ్య మగు కార్యము గాదు. అట్టి దానిని రామచంద్రమూర్తి చేసెను.

సూపసదనము, అనగా సౌశీల్యము. ఎట్టివారైనను దగ్గఱఁ జేరుటకు సులభుఁడై యుండుట. తాను గొప్పవంశమునఁ బుట్టిన మహారాజయ్యును క్రోఁతులను గ్రద్దలను, బోయలను దగ్గఱఁదీసి వారితో మైత్రిచేయుట సౌలభ్యమును దెలుపును. యక్షరక్షః పిశాచ దానవుల నందఱను కొనవ్రేలితో మీటఁ గలవాఁడు సహాయార్థియై వాలివధముచేసి సుగ్రీవునిఁ బట్టాభిషిక్తునిఁ జేసినాఁడనుట యసంగతము కావున నివి కృపచేఁ జేసినాఁడని పూర్వులు నిర్వహించిరి.

రక్ష్యులైన యాశ్రితులకు రామచంద్రమూర్తి రక్షకుఁ డనునది సుగ్రీవరక్షణమే తెలుపుచున్నది.

ఇవన్నియు విభీషణుఁ డెఱుఁగును గావున రామచంద్రమూర్తియందు విశ్వాసము కుదిరె నని యెఱుంగనగు.

గోప్తృత్వ వరణ మనఁగా నీవు నాకు రక్షకుఁడవని తన యభిప్రాయము దెలుపుట. 'జగచ్ఛరణ్యుతో నాస్థితిఁ దెల్పరే' యనుటచేఁ దన యభిప్రాయము దెలిపిన వాఁడయ్యెను.

'మనుజవరా భవద్గతము మత్సుఖజీవిత రాజ్యభోగముల్' ప. ౩౯౨. అనుటచే ఆత్మనిక్షేపము చెప్పఁబడెను.

కార్పణ్య మనఁగా దైన్యము. 'దైన్యం కార్పణ్య ముచ్యతే' ఇల్లు వాకిలి సర్వము వీడి వచ్చినను నన్ను నిచ్చట వానరులు చంపెద మనుచున్నారే యని భయపడి దీనుఁడై యుంకుట కార్పణ్యమును దెలుపును. భయముచే దిక్కు దెలియక పోవుటయే దైన్యము.

శ్రీమద్రామాయణమందలి యీ శ్లోకమునకుఁ జరమశ్లోక మని పేరు. భగవద్గీతయందు శ్రీకృష్ణభగవానులు మోక్షమార్గములు పెక్కులుపదేశించి కడపట "సర్వధర్మాన్ పరిత్యజ్య" యను శ్లోక ముపదేశించిరి. వారి యుపదేశమం దిది కడపటిది. దీనికిఁ దరువాత నేమియుఁ జెప్పినవారు కారు. కావున నిది చరమశ్లోక మనఁబడెను. అట్టులే రామచంద్రమూర్తియు 'సకృదేవ ప్రపన్నాయ' నీవాఁడని యొకపరియే'యని చెప్పి తరువాత నెట్టి యుపదేశ మెవరికిని జేసినది లేదు. అదియునుగాక యీ రెండు చరమశ్లోకములందు సమాన విషయములు గలవు. ఎట్లన :— కృష్ణమూర్తి ముందు కర్మ, జ్ఞాన, భక్తి మోక్షసాధనము లుపదేశించి పిమ్మటఁ బ్రపత్తి నుపదేశించెను. ఇందు శ్రీరామచంద్రమూర్తి సుగ్రీవుని కర్మవాదము, జాంబవంతుని జ్ఞానమార్గము, తక్కిన వానరుల రాజనీతి ఖండించెను. హనుమంతుని భక్తిమార్గము కొంత యామోదించి యంతకు మేలయిన దని తన ప్రపత్తి మార్గము బోధించెను.

అచ్చట దాయాదులవలన రాజ్యము సంపాదింపఁ గోరిన వాని కుపదేశింపఁబడెను. ఇందు నంతియే. అచ్చట యుద్ధము నుపక్రమించు సందర్భమునఁ జెప్పఁబడెను ఇచ్చట నంతియే.

అచ్చట శోకనివృత్తికై చెప్పఁబడెను. ఇచ్చటను శోకనివృత్తికై చెప్పఁబడెను. అచ్చట చెప్పినవాఁడు రాజవంశమందుఁ జేరినవాఁడు, ఇచ్చటను రాజవంశజుఁడు.

అచ్చట నాకేది శ్రేయస్కరమో దానిని జెప్పుమని యర్జునుఁ డడిగెను. ఇందును నా శ్రేయస్సునుగోరు మీరు తెలిసికొనవలసినదానిని జెప్పెదను. "శ్రుత మిచ్ఛామి తత్సర్వం భవద్భిః శ్రేయసిస్థితైః" అని చెప్పెను.

అచ్చట స్వధర్మము మేలా, పరధర్మము మేలా యను ధర్మవిచారము చేయఁబడెను. ఇచ్చటను జేతనునకు స్వధర్మమైన ప్రపత్తి మేలా? పరధర్మమైన రాజనీతి మేలా – యని చర్చింపఁబడెను. ఇది సామ్యము.

ఇఁక రెంటికిని భేద మేమనిన:—

భగవద్గీత చరమశ్లోకము తేరిమీఁద నుండువానికిఁ దేరిమీఁద నుండువాఁ డుపదేశించెను. ఇది రాజసమును సూచించును. ఇందు నేలమీఁద నుండువాఁడు నేలమీఁద నుండువానికి నుపదేశించెను. ఇది సత్త్వమును సూచించును.

అందు 'మాం శరణం వ్రజ' నన్ను శరణు పొందు' మనునది యాజ్ఞగాఁగాన వచ్చుచున్నది. ఇందు 'తాన సంప్రాప్తుఁడైన' ననుటచే చేతనుఁడు తానై సమ్మతించి చేయునట్లుగాఁ జెప్పఁబడినది. అందు సర్వధర్మాన్ పరిత్యజ్య'యని ప్రపత్తికి విరోధులగు సర్వమును వదలిపెట్టమని బోధింపఁబడెను. ఇందును భార్యను బిడ్డలను, లంకను, సిరిని సర్వము వదలి వచ్చినవాని గుఱించి చెప్పఁబడెను. కావుననే యచ్చట నుపదేశముగొన్న యర్జునుఁ డుపదిష్టార్థము మఱచెను. ఇచ్చట విభీషణుఁడు చక్కఁగాఁ గాపాడుకొనెను. అది పదునాఱువేల భార్యలుఁగలవానిమాట. 'షోడశ స్త్రీ సహస్రాణి ఇచ్చట నేకపత్నీవ్రతిస్థునిమాట. తాను నియమమందు నిలచి యితరులకు నియమమును బోధించెను. ఇచ్చట బోధము, ఆచరణము, రెండును గలవు.

అందు ముందుమాట చెప్పి పిదప నేదైన యుపాయముచేఁ దప్పించుకొను నమ్మరానివానిమాట. కృష్ణవాక్యము అను పేరు తెచ్చుకొన్న వానిమాట. ఇచ్చట రాముం డిరుమాట లాడరాఁ డని పేరు తెచ్చుకొన్నవాని మాట. ఒక్కమాట ఒక బాణము వాఁడుగదా రామచంద్రమూర్తి. అది ములుకోలఁబట్టుకొని గుఱ్ఱములఁ దోలినట్లు భీమార్జునాదులచేఁ దన కార్యము చేయించుకొన్నవాని మాట.

ఇచ్చట చేత విల్లుధరించి స్వయముగాఁ గార్యము నిర్వహించినవానిమాట.

అందు శరణాగతుని యధ్యవసాయము చెప్పఁబడెను. ఇందు శరణ్యుని యధ్యవసాయము చెప్పఁబడెను.

అందు శరణాగతునిఁ 'మోక్షయిష్యామి' 'వదలిపెట్టెద' ననెను. అట్టులే కృష్ణుఁడు తన నిర్యాణానంతర మర్జునుని గవ్వకుఁ గొఱగానివానిని జేసెను. రామచంద్రమూర్తి చిరకాలము ప్రభువై యుండ ననుగ్రహించెను.

అది భీష్మ ద్రోణ భగవదత్తసైంధవ వధాదులందు రాజనీతి ననుసరించిన వానిమాట. ఇది తన ప్రాణాపదయందును - శత్రువు చేచిక్కినపుడు ధర్మమందే నిలచిన వానిమాట.

అది నరకాసురునింటఁ జెఱఁబడిన కన్యకలఁ బరీక్షింపకయే గ్రహించిన వానిమాట. ఇది పరీక్షించి సర్వదేవతల సమ్మతి గ్రహించిన వానిమాట.

ఇందు శరణాగతుని చేపెడువాఁడగాను అని, వదలను అని చెప్పెను. అట్టులే స్థిరముగ నిలిపెను.

అందుఁ పాపములన్ని పోవునట్లు చేసెద ననెనేకాని, ప్రసన్నుని స్వీకరించెద ననలేదు. ఇందు దోషము లున్నను స్వీకరించెద ననెను.

అందుఁ గాలాంతరమున నదృష్టఫలము చెప్పఁబడెను. ఇందు సద్యఃఫలమైన దృష్టఫలము ప్రత్యక్షముగఁ జూపెను.

అచ్చట నర్జును విషయమును ప్రతిబంధకులు లేకుండఁ జూచి రక్షించెద నని చెప్పఁబడెను. ఇచ్చటఁ బ్రతిబంధకు లుండినను వారి నిరాకరించి రక్షింపఁ బడినవిధము చెప్పఁబడెను.

అది ప్రజాక్షయము చేయఁబూనిన వానిచేఁ జెప్పఁబడినది. ఇది ప్రజాభి వృద్ధి చేయఁబూనిన వానిచేఁ జెప్పఁబడినది.

ఈ కారణములచేఁ గరుణాకాకుత్స్థుఁ డని పేరొందిన శ్రీరామచంద్రమూర్తి వాక్యమునందే యెక్కువ మెఱుఁగు కానవచ్చు చున్నది.

ఈ విధముగ శరణాగతిని గుఱించి విశేషముగా బోధించుటచే శ్రీమద్రా మాయణమునకు దీర్ఘశరణాగతి యని పేరు వచ్చెను. అనఁగా నాది నుండి యంత్యము వఱకు శరణాగతియే పలుతావులఁ జెప్పఁబడెను. ఈ విషయము బాల కాండమందు వ్రాయఁబడెను.

ఉ. పామ్మికి లెమ్ము కంజహిత • పుత్రక ! వాఁడు విభీషణుఁడ యేన్
సమ్మతి రావణుండ యయి • నన్వను మే నభయం బొసంగితిం
దెమ్మట వాని నన్న రఘు • ధీరదయాగుణచోదితాత్ముఁ డై
సమ్మద మార దాశరథి • సత్తముతోఁ గపినేత యిట్లనున్. ౩౦౮

అర్థములు. కంజహితపుత్రక = సూర్యనందనా! ఒసంగితిన్ = ఇదివఱకే యిచ్చితిని, చోదితాత్ముఁడు = ప్రేరింపఁబడినవాఁడు, కపినేత = వానరరాజు.

రామచంద్రమూర్తి తన వ్రత మిది యని చెప్పఁగా సుగ్రీవుఁడు మరల నేమియుఁ జెప్పకుండుటయే గాక కలఁక దేఱిన ప్రసన్నముఖము గల వాఁడగుట చూచి యితనిసందేహము దొలఁగినదని రామచంద్రమూర్తి తలఁచెను. విభీషణుం డయేన్ సమ్మతి = వాఁడు వాస్తవ విభీషణుఁడే యూయెనా సంతోషమే, అటు గాక రావణుఁడే యూయెనా యెక్కువ సంతోషము. వలన:—విభీషణుని రక్షించి

తినా విభీషణుఁడు ధర్మాత్ముఁడు గావున రాముఁడు రక్షించెను. అందేమి విశేషము గలదని లోకులందురు. రావణునే రక్షించితినా, అంతటి పరమ ద్రోహిని గూడ శరణనఁగానే రాముఁడు రక్షించెఁగదా యని లోకులు మెత్తురు. విభీషణుని రక్షించితినా, ఏవురను మాత్రమే రక్షించినవాఁడ నగుదును. రావణుని రక్షించితినా లంకనంతయు నాబాలగోపాలము రక్షించిన వాఁడ నగుదును. అప్పుడు కరుణాత్ముఁడు రాముఁడను పేరు సార్థక మగును.

రావణుండయినన్ = ఏ రావణుని దుర్వర్తనము తలఁచి వాని తమ్ముఁడను కారణముతో విభీషణుని గూడ నీవు సందేహించు చున్నావో యట్టి రావణుఁడే వచ్చి యుండినను మిగుల సమ్మతము.

అర్థములు. అభయం భోసంగితిన్ = నీ వీయవల దని చెప్పుచున్నావు. నీరు పోయిన తరువాత సేతువు కట్టుచున్నావు. ఆ కార్య మప్పుడే ముగిసినది. దానిని నిర్వహింపవలసిన భారము మీయందున్నది. ఏన్=నేను, రక్షించుట నాకు విధి. విధికృత్యము చేయక యూరక సోమరినై యెవఁడైన శరణు అనునా రక్షింతునా యనియే కోరుచున్న నేను.

తెమ్ము=నాస్థితి రామచంద్రునితోఁ దెలుపుఁడీ యని మిమ్ముఁ బ్రార్థించెను. ఆ ప్రార్థన చక్కఁగాఁ జెల్లింపవలసిన భారము మీయందున్నది. నేనభయ మిచ్చితినంటిని. అది నెరవేర్పవలసిన భారము మీయందున్నది. నీవు పిలుచుకొని రాకపోయిన నేనే పోవలసి వచ్చును. మీ పురుషకారము వ్యర్థమై మీ రా ఫలమును బోఁగొట్టుకొన్న వారగుదురు. ధీరదయా గుణచోదితాత్ముఁడు=శత్రువును దగ్గఱ చేర్చుకొనెద ననుచున్నాఁడే ఏమి యీయన దయ, ధైర్యము? మే మెక్కడ! తా మెక్కడ? మమ్ము సమాధాన పఱుప నింతదూరము శ్రమించు టెక్కడ? ఏమి యీయన దయ యని యాశ్చర్యపడి యింతటి దయాశాలి సమీపమున నా యట్టి కఠినుఁడు నిలుచుటకుఁ గూడఁ దగుదునా యని తలఁచినవాఁడై; కపినేత=వానర ప్రభువు, ఇట్లనుటచే వానరు లందఱు రాముపక్షమునే యంగీకరించి రని సూచన.

సుగ్రీవాదులు భగవత్ప్రాప్తికిఁ బ్రారబ్ధమువలె నడ్డపడుటచే విభీషణుఁడు దూరమున నిలిచెను. వారిని సమాధానపఱిచి తోలఁగఁ దీయుటకై సుగ్రీవునే పొమ్మనెను.

విభీషణుఁడు వానరుల పురుషకారభూతులఁ జేసెను. పురుషకారము ఫలించె ననుటకై సుగ్రీవునే పొమ్మనెను.

సుగ్రీవ విభీషణులు సమానదశయం దుండువారు. కావున విభీషణుని సుగ్రీవుఁడు పిలుచుకొని వచ్చుటే మర్యాద కావున నాయననే పొమ్మనెను.

సుగ్రీవునకు విభీషణుపట్ల నింకను సందేహమున్నదా పూర్ణముగఁ దొలఁగినదా పరీక్షించుటకై సుగ్రీవునే పొమ్మనెను.

సుగ్రీవునిఁదప్ప మఱియొకరిని బంపిన నే నాక్షేపించితివని నాయందు సందేహము గలవాఁడైకదా మఱియొకరిని బంపెనని సుగ్రీవుఁడు తలఁచునేమోయని యీ సందేహము దీర సుగ్రీవునే పంపెను.

తాత్పర్యము

సుగ్రీవా! నీవే విభీషణునొద్దకుఁబొమ్ము. నీవు రమ్మని సైఁగ చేయవలదు. పోయి పిలుచుకొనిరమ్ము. ఇఁక లెమ్ము. హాయిగాఁగూర్చుండి ముచ్చటలచేఁ గాలము గడపవలదు. ఇప్పటికే చాల నాలస్యమైనది. అతని మనస్సెంత తపించుచున్నదో నిష్కారణముగ నేల యాతనికి నట్టి సంకటము గలిగింపవలెను. చేయఁదగిన పనియైన యెడల వెంటనే చేయవలయును. రావణుని తమ్ముఁడే యని నీవు సందేహించితివి. వీఁడు రావణుని తమ్ముఁడైనను సంతోషమే. రావణుఁడే యీ వేషముతో వచ్చియుండినను సంతోషమే. నేనిదివఱకే వాఁడు శరణమన్నప్పుడే నే నభయమిచ్చితిని. మీ చిత్తవృత్తులు దెలిసికొని మీ సందేహము దీర్ప నింత సేపు ముచ్చటలాడుచుంటిని. ఇఁక నీవు వానిని దోడితెచ్చుటే చేయవలసిన కార్యము. అని చెప్పఁగా విని సుగ్రీవుఁ డాయన దయాగుణముచేఁ బ్రేరింపఁబడినవాఁడై సంతోషించి రామచంద్రునితో సుగ్రీవుఁ డిట్లనియె.

ఉ. ఏమి విచిత్ర మిద్ది జగ ♦ దీశ్వర ! ధర్మవిధిజ్ఞ ! లోకసౌ
ఖ్యామితసక్తచిత్త ! యిటు ♦ లార్యనుతోక్తులఁ బల్కుటల్, సదా
ధీమతసత్యమార్గనిర ♦ తిం దృఢసత్త్వయుత ప్రభావముం
భూమహితత్వముం గలుగు ♦ ప్రాజ్ఞ వరిష్ఠునకు న్రఘూద్వహా. ౩౮

అర్థములు. ఇది శరణాగతరక్షణకార్యము, ఏమి విచిత్రము=ఆశ్చర్యకరమైనదికాదు. జగదీశ్వర = ప్రపంచమునంతయుఁ దాఱుమాఱు గాకుండ సక్రమముగానుంచు ప్రభువు. ధర్మవిధిజ్ఞ = ధర్మశాస్త్రము నెఱిఁగినవాఁడా, ఏ ధర్మమున వర్తించినచో లోకము సరియగు స్థితియందుండునో దానిని దెలిసినవాఁడవు శరణాగతుల భృత్యులను సంరక్షింప నెట్లు నడచుకొనవలయునో యీ విధానము. చక్కఁగా దెలిసినవాఁడవు, లోకసౌఖ్యామిత సక్తచిత్త = జనుల సౌఖ్యమందు మిగుల నాసక్తిగల మనస్సుగలవాఁడా! జనుల సౌఖ్యపఱచుటయందుండు నాసక్తి నీసౌఖ్యము నాలోచించుటయందును లేదని భావము. ఇటులు=విభీషణునకైనసరే. రావణునకైన సరే-అభయ మిచ్చితినని చెప్పుటలు, ఆర్యనుతోక్తులు=పెద్దలచేత స్తోత్రము చేయఁబడు మాటలు, పామరుల స్తోత్రము గొప్పగాదు. ఒప్పు తప్పు దెలిసినవారు మెచ్చుకొనుట గొప్ప, సర్వదా = సర్వకాల సర్వావస్థలందు, ధీమత= నీ మనస్సునకు సమ్మతమైన, సత్యమార్గనిరతిన్ = యథార్థమైన మార్గమందు నడచు నాసక్తియును, దృఢసత్త్వయుత ప్రభావమున్=దృఢమైన యధ్యవసాయము గలిగియున్నాఁడన్న కీర్తిని "ద్రవ్యాసు వ్యవసాయేషు సత్త్వమస్త్రీతు జంతుషు" అను

రము. భూమహితత్వమున్ = పరాక్రమముచేఁగలిగిన పూజ్యతను, ప్రాజ్ఞ వరిష్ఠ నకున్ = బుద్ధిమంతులలో శ్రేష్ఠునకు, రఘూద్వహా = రఘువంశము నుద్ధరించు వాఁడా, రఘురాక్షస సంవాదమందుఁ జెప్పఁబడిన ప్రకారము శరణాగతుఁడైన రాక్షసుని రక్షించి ప్రసిద్ధిగన్న రఘువంశమునఁ బుట్టిన వారిలో శ్రేష్ఠుఁడా! కీర్తికరమైన వంశమునకు నెక్కువ కీర్తి కలిగించువాఁడవు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి యొక్క స్వాభావిక కల్యాణగుణములఁ జూచి యాశ్చర్యపడి తానాశ్చర్యపడిన విషయముఁ జెప్పఁబోయి మరల నాలోచించి యీ కార్యము రామచంద్రమూర్తికి సహజమైనది కావున నిందేమి యాశ్చర్య మున్నదను చున్నాఁడు. చరాచర ప్రపంచము నంతయుఁ గ్రమముదప్పి నడవ కుండ శాసించువాఁడవు. ఎట్లు ప్రవర్తించిన నది యట్లు చక్కనిస్థితిలో నుండునో దాని నెఱింగినవాఁడవు. లోకమునకు సమితసుఖ మెట్లు కలుగునా యని యాలో చించుచు నీ సౌఖ్యము గూడ నీవు లక్ష్యముచేయని వాఁడవు. నీ వాప్తసమస్త కాముఁడవై యొకరివలన నీకుఁ గావలసినది యేదియు లేకుండినను వారికి మేలు చేయుటయే ప్రధానకార్యముగ నుంచుకొని యుండువాఁడవు. రాక్షసుఁడు శరణా గతుఁడు కాఁగా రక్షించిన రఘువు వంశమునకు నెక్కువ కీర్తి గలిగించి, దాని నుద్ధరింపఁ బుట్టినవాఁడవు. ఈ లోకమున సన్మార్గమును స్థాపింపఁగోరి యవతరించిన వాఁడవు. దృఢమైన యధ్యవసాయము కలవాఁడని కీర్తిగలవాఁడవు. పరాక్రమ వంతుఁడని పూజ్యత సంపాదించిన వాఁడవు. బుద్ధిమంతు లనిపించుకొన్నవారిలో శ్రేష్ఠుఁడవు. ఇట్టి నీకు గొప్ప గుణములచేఁ బెద్దలనిపించుకొన్నవారలు మెచ్చునట్టి మాటలు, శరణాగతుఁ డెట్టివాఁడైనను వానిని రక్షింతునని చెప్పినమాటలు నీవు జెప్పుటయం దాశ్చర్య మేమకలదు? అల్పులిటు చెప్పిన మెచ్చఁదగినదే కాని, యింతకు మించినవి ఎన్నైన చేయఁగల నీకు నిది తృణప్రాయము, జగదీశ్వరత్వము లోనగు నొక్కొక్కగుణమే యింతటి కార్యముచేయ సమర్థమగును ఇన్నియుఁగల నీవు చేయుట చిత్రముకాదు.

విభీషణుఁడు శత్రుసోదరుఁడు. ఆయనను స్వీకరించుటచేఁ గీడుకలిగినా తానే కాక తనకు సహాయులై వచ్చిన వారందఱు నాశమగుదురా! ఇట్టి ధర్మసందేహ మందు భారము తన యందే లయుంచుకొన వలయు నని రామచంద్రమూర్తి వానరప్రముఖులతో నాలోచించెను. ఇది ధర్మమే కాని, వారందఱు నొకరు తప్ప నేకవాక్యముగా విభీషణుని స్వీకరింపరాదని చెప్పినపుడు తన కిష్టముండనీ, లేకుండనీ భూయిష్ఠాభిప్రాయప్రకారము (Opinion of the majority) నడువ వలయునా, తన యిష్టప్రకారము నడువవలయునా? ఇది రాజనీతియా? ధర్మ రీతియా? దురభిమానమా? యని సందేహము

స మా ధా న ము

రాజధర్మమంతయు నామూలాగ్రము వివరించినఁగాని తగిన సమాధానము కుదురదు. ఇప్పటి ప్రజాప్రభుత్వమునకు పూర్వ రాజప్రభుత్వమునకు భేదము గలదు. కావున నుత్తరపీఠికయం దిది విశదీకరింపఁబడును.

ఉ. నాకును నంతరాత్మ రఘు ♦ నాయక ! యీతఁడు శుద్ధుఁడంచు నే
ప్రాకటరీతిఁ దెల్పెడిని ♦ భావము చందము నారయం, ద్వద
స్తోకసయుక్తిసూక్తులను ♦ దోరముగాఁ బరికించినాఁడ, లే
దే కలుషంబు వీనియెడ ♦ నెంతయుఁ బూతుఁడు లోన వెల్పలన్. ౩౯౦

అర్థములు. నన్నుఁ బొగడిన మాత్రమున నేమి లాభము? అది క్రియారూపముగఁ బరిణమించి నీ సమ్మతిని విభీషణుని తోడి తెచ్చుటచేఁ జూపినఁగదా యందు వేమో యని యూశంకించుకొని సమాధానము చెప్పుచున్నాఁడు. నాకును= వీఁడు మోసగాఁడు, చారుఁడు, వీనిని క్రూరముగఁ జంపవలసిన దని చెప్పిన నాకుఁగూడ, అంతరాత్మ=అంతఃకరణము, అంతరాత్మయును నని సముచ్చయము మావర్తించుకొనవలయును, నాకును, నంతరాత్మయును అని యన్వయము. భావము చందము=వీని స్వభావ లక్షణము, అనఁగా ముఖనయనాదులందలి చిహ్నములు, ఆరయన్=పరీక్షింపఁగా, (౨) ఈతని దీనధ్వనిచే స్పష్టమైన యీతని మృదు స్వభావము, త్వత్=నీయొక్క; అస్తోక = గొప్పదగు, సయుక్తి సూక్తులను= యుక్తితోఁ గూడిన మంచిమాటలను, దోరముగాన్ = విశేషముగ, పరికించి నాఁడన్=పరీక్షించితిని, ఏ కలుషంబు=ఏవిధమైన దోషము, ఎంతయున్=మిక్కిలి, పూతుఁడు=పవిత్రుఁడు, నిర్మలుఁడు, లోన=మనస్సునందు, వెల్పలన్ = బాహ్య చేష్టలందు.

తా త్ప ర్య ము

రామచంద్రా, వీఁడు ద్రోహి గాఁడు, నిర్మలచిత్తము గలవాఁడని నాయంతరాత్మ చెప్పుటయేగాక, వీని దీనస్వరము నాటకములందలి పాత్రములకువలె సమయోచిత కల్పితమా, స్వతస్సిద్ధమాయని పరీక్షించితిని. ఆ స్వరమునకుఁ దగిన వికారములు ముఖనయనములందుఁ గానవచ్చెను. నీవు యుక్తియుక్తముగాఁ బలికిన మాటలను బరికించినాఁడను. వాస్తవ శరణాగతుని లక్షణము లేవి యని నీవు చెప్పితివో యవి యన్నియు వీనియం దున్నవి. నీవు పరిశుద్ధుఁడని చెప్పిన కారణములు సరిగానున్నవి. వీని నన్నిటిని నాలోచించిచూడఁగా వీఁడు మనస్సునందు, బాహ్యమునందుఁ గూడ శుద్ధుఁడే. వీనియందు వంచన లేదని నిశ్చయించుకొంటిని కావున నా సందేహము తీఱినది.

ఉ. కావున మా సమానుఁడయి ♦ క్రాలుత మమ్ములఁగూడి యిష్ట మే
ధావి విభీషణుండు సఖ ♦ తం గని యం చన హర్షయుక్తి సు

గ్రీవునివాక్యము ల్విని సుఃకీర్తి గ్రహించె దశాస్యభ్రాత వే
యా వినతాతనూజసఖః తా స్తి నెసంగిన యింద్రుకైవడిన్. ౩౯౧

అర్థములు. మేధావి = బుద్ధి బలము గలవాఁడు, చక్కని యాలోచన గలవాఁడు, కనుక నేకదా తన సోపాధిక బంధువులనెల్ల విడిచి నిరుపాధికబంధు వగు శ్రీరామచంద్రమూర్తి నాశ్రయించెను. బుద్ధిలేనివాఁ డిట్లు చేయునా? మమ్ములఁ గూడి యనుటచే నతఁడు మాతో సముఁడై వర్తించుట నాకేకాదు, వానరుల కందఱకు సమ్మతమే యని భావము. ఇష్ట=ఈ క్షణమందే, ఇదివఱకు దృఢమైన యధ్యవసాయము లేమిచే సత్యాసత్యములు తటాలునఁ దెలిసికొనుశక్తి లేమిచే నాలసించితిని. ఇఁక నట్లు చేయను. సఖితన్=సఖ యనగా స్నేహితుఁడు. సహాయుఁడు, సమానగుణములు గలవాఁడని చెప్పఁబడువాఁడు సఖుఁడని వ్యుత్పత్త్యర్థము. అట్టివాని భావము సఖిత. అనఁగా వీనిని మేము చేయు కార్యములందు మర్మము విడిచి స్నేహభావమునఁ గలిపికొందు మని భావము. హర్షయుక్తిన్=శరణాగతుని రక్షించుటయందు హీఁ డిట్టు లడ్డపడెనే, కాలవిలంబన మగుచున్నదే, నన్ను నమ్మి వచ్చినవాఁడు రెంటికిఁజెడిన రేవణునివలె నడుమ నాకాశమునఁ బక్షివలె నుండవలసి వచ్చెనే యని విచారగ్రస్తుఁడై యుండె నని సూచితము. ఇప్పుడు సంతోషించెను. సుగ్రీవుని వాక్యముల్ విని హర్షింపవలయును. హర్షమునకు సుగ్రీవుని వాక్యములు కారణములుగా నుండవలెను. అటుగాక యతని ముఖవికాసము చేతనే హర్షించి తదనుగుణము లైన యతని మాటలు వినె నని భావము. సుకీర్తి=(౧)శరణాగతుని పగవాని తమ్ము నైనను సంశయింపక చేర్చుకొనె నని రామచంద్రమూర్తి కన్వయింపవచ్చును. (౨) ద్వితీయగా గ్రహించి సుకీర్తియగు దశాస్యభ్రాతనని యన్వయించినను నన్వయింపవచ్చును. విభీషణుఁడు రామచంద్రమూర్తి కాశ్రితుఁ డయ్యెను. ఎంతటి బుద్ధిమంతుఁడు ఎంతటి దూరాలోచనముగలవాఁడను కీర్తిసంపాదించెనని యర్థము. సుకీర్తియగు రామచంద్రమూర్తి దశాస్యభ్రాతను వేగ్రహించె నని యన్వయము. దీనివలన సుగ్రీవుఁడు పోయి విభీషణుని బిలిచికొని వచ్చెనని సూచితము. అట్లు వచ్చుచుండువానిని రామచంద్రమూర్తి గ్రహించెను. గ్రహించుట యనఁగా మనస్సుచే సంగీకరించుట యను నర్థముగలదు. అది యతఁడు శరణన్నప్పుడే జరిగెను. కావున నిచ్చటఁ జేతులచేఁ బట్టుకొనుట యనియే యర్థము చెప్పవలసి యున్నది. పట్టుకొనుట యనునది పట్టుకొనువాఁడు చేయు కార్యమే కాని పట్టుకొనఁబడువాఁడు చేయు కార్యముగాదు, కావున రామచంద్రమూర్తియే తన హస్తములతో విభీషణుని బట్టుకొనె నని గ్రహింపవలెను. చేతులతోఁ బట్టుకొనెనని చెప్పక రామచంద్రమూర్తి గ్రహించె ననుటచే రామచంద్రుఁడే నిండారు మనస్సుతో నెదురుగాఁ బోయి, చేయిపట్టుకొని పిలుచుకొని వచ్చెనని భావము. ఇంతవఱకు జరిగిన కాలవిలంబనమునే సహింపకుండినవాఁడు

కావున నాయన తనయొద్దకువచ్చు నాలస్యమును సహింపలేక తానే యెదురుగాఁ బోయెనని గ్రహింపనగు. ఇట్టియభిప్రాయము వాల్మీకికి లేదేని విభీషణుఁడు రాముని యొద్దకు వచ్చెనని చెప్పియుండవలెను. వేః=త్వరగా, ఇది కాలవిలంబమును సహింప లేమిని దెలుపుచున్నది. (౨) సుగ్రీవుఁడు కపి, చంచలచిత్తుఁడు. హనుమంతుఁడు కూడ నీకపిత్వము పోలేదని చెప్పినవాఁడు. అట్టివానికి మరల నేదుర్బుద్ధిపుట్టునో యని యట్టిదాని కెడ మీయకుండుటకై వేగముగఁ దానే పోయి గ్రహించెను. ఎట్టులన:— వినతాతనూజసఖతాం ప్రాప్తిన్ = గరుత్మంతునితో స్నేహము లభించు టచే, ఇంద్రుఁడు కైవడిన్=ఇంద్రునివలె, గరుత్మంతునకు విభీషణునకు, ఇంద్రునకు రామునకునుపమానోపమేయములు. ఇంద్రుఁడెట్లు గరుత్మంతుని సఖ్యము గోరెనో యట్లు రామచంద్రమూర్తి విభీషణు సఖ్యము గోరెనని భావము. గరుత్మంతుని సఖ్యము గోరినవాఁడు ఇంద్రుఁడే – ఇది భారతములోని "సఖ్యం చానంత మిచ్ఛామిత్వయాసహ ఖగోత్తమ" అంతములేని నీ స్నేహము పక్షిరాజా! గోరుచున్నా నని యింద్రుఁడు చెప్పెనను వాక్యము దృఢపఱచుచున్నది. భార. ఆది. ౩౩అధ్యా ౨౬ వ శ్లోకము. ఈసాంగత్యమువలన మేలు పడినవాఁడు రామచంద్రమూర్తియే యని వ్యావహారిక కార్యమువలనను పారమార్థికకార్యమువలనను నేర్పడుచున్నది. వ్యవహారమున బలవంతుఁడు. రావణు మర్మ మెఱింగినవాఁడు, తేపు లంకకు రాజుగాఁ దగినవాఁడు, తన పక్షమునఁజేరిన లాభకరమని యెంచనగు. యక్షరక్షః పిశాచ దానవులనెల్ల కోనప్రేల నెగఁజిమ్ము వానికిది గొప్పగాదు. కావునఁ బర మార్థ మేమన దాసేను సత్పాత్రిమువలె రక్ష్యప్రాప్తి రక్షకునకే విశేషశ్రేయ స్కరము. రక్షాభారము దనయందుంచుకొనినవానికి రక్షింపఁదగినవాఁడు దొరకఁ డేని రక్షకుఁడను నామము నేతిబీరకాయవంటి దేకదా యగును. ఆ కారణముచే భగవంతుఁడు రక్ష్యుఁడు దొరకునా యని యెదురుచూచుచుండునని "సర్వజ్ఞోపి హి సర్వేశస్సదా కారుణికోపిసన్। సంసారతంత్ర వాహిత్వాత్ రక్ష్యాపేక్షాం ప్రతీక్షతే" భగవంతుఁడు సర్వజ్ఞుఁడు, సర్వేశ్వరుఁడు, నిత్యకారుణ్య పూర్ణుఁడు అయినను సంసార మందుఁగల భోగమోక్షములను రెంటిని సాధనములగు నుపాయములకు నిర్వాహకుఁ డగుటచేత రక్షింపఁబడఁదగినవారి యపేక్షను దెలిసికొన నెదురుచూచుచుండును. అనఁగా భోగవిరోధులఁ బోఁగొట్టి భోగములనే పూర్ణముగ నియ్య మనెదరా, మోక్షవిరోధుల నణఁచి పునరావృత్తిరహితమైన తన ప్రాప్తినిచ్చి రక్షింపు మనెదరా? యని యెదురుచూచుచుండును. ఇట్టియిరుదెగలవారిలో నిష్కాములైన తన యాశ్రితులను రక్షించుటకై తానే వారియొద్దకుఁ బోవుచుండును. దీనికిఁ బ్రమాణ వాక్యములు—సకాములఁ దనయొద్దకు రమ్మనును. "స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః, ధాతు సామ్యేస్థితే స్మర్తా విశ్వరూపంచ మామజమ్। తతస్తం మ్రియమాణస్తు కాష్ఠ పాషాణ సన్నిభమ్। అహం స్మరామి మద్భక్తం నయామి

పరమాంగతిం॥” శరీరము, మనస్సు, స్వస్థముగా నుండఁగా వాతపైత్య శ్లేష్మ నాడులు సమముగా నుండఁగా నెవఁడు విశ్వరూపుఁడను, పుట్టువు లేనివాఁడను నగు నన్ను స్మరించునో వాఁడు మరణకాలమందు కఫాదులచే మైమఱచి కట్టె వలె, ఱాతివలెఁ బడియుండినను అట్టి భక్తుని నేను స్మరించి పరమగతికిఁ దీసికొని పోదును. ఇది శ్రీ వరాహ చరమశ్లోకము.

“సత్యం బ్రవీమి మనుజాః స్వయమూర్ధ్వ బాహుః, యోమాం ముకుంద నరసింహ జనార్దనేతి జీవన్, జపంత్యనుదినం మరణే ఋణీవ, పాషాణకాష్ఠసదృశాయ దదామి ముక్తిమ్” మనుష్యులారా! చేతులెత్తి ప్రమాణముచేసి సత్యము చెప్పుచున్నాను. ఎవఁడు తాను జీవించియుండిన కాలమందే ముకుంద! నరసింహ! జనార్దన! ఇత్యాది నామములచే నన్ను స్మరించునో వాఁడు మరణకాలమున దేహము తెలియక ఱాతివలెఁ గట్టెవలెఁ బడియుండినను నేను స్మరించి వానికి ముక్తి నిచ్చెదను. ఇది నృసింహ చరమ శ్లోకము.

భగవంతుఁడే తానే గరుడవాహనారూఢుఁడై సీతాదేవిని శ్రీరామచంద్రమూర్తి విమానమున నుంచి తీసికొని పోయినట్లు ప్రపన్నుని దీసికొని పోవును. ఇది ౨౮౦వ పద్య వ్యాఖ్యయందు వివరింపఁబడును. ఈ ప్రమాణములచే అగతికుఁడై, అకించనుఁడై మరణదశయందు ప్రాణము వచ్చునో, పోవునో యను దశయందున్న వానివలె రామచంద్రమూర్తి యనుగ్రహించునో నిగ్రహించునో యని సందిగ్ధ దశయందు కదలక మెదలక నోటిమాటలేక నిరాధారముగ నాకాశముననుండు విభీషణునుద్దేశించి రామచంద్రమూర్తియే పోయెనని గ్రహింపవలెను. ఆర్తరక్షణమందు రామచంద్రమూర్తికిఁగల త్వరాతిశయమును నిది సూచించును.

తాత్పర్యము

ఈకారణములచే విభీషణుఁ డీక్షణమందే మాతో స్నేహితుఁడై మాలోఁ గలసి మెలసి, మాతో సమానుఁడై యుండునుగాక. ఇది నాకేకాక వానరులందఱకు సమ్మతమైన కార్యము అని చెప్పిపోయి విభీషణా! నీకు శ్రీరామచంద్రమూర్తి యభయ మిచ్చెను, రారమ్ము. అని పిలువఁగా సుకీర్తియగు రామచంద్రమూర్తి సంతోషించి యతఁడు చెప్పిన మాటలు విని సుకీర్తియగు విభీషణున కెదురుగాఁబోయి యింద్రుఁడు గరుత్మంతునితో స్నేహము చేసినట్లు లతనికై చేతులు చాఁచి స్నేహము చేసెను. ఒక రాకాశమున నొకరు నేల నుండుటచే కరస్పర్శ చెప్పసాధ్యపడదు గాన, జేతులు చాఁచె నని చెప్పఁబడెను.

—• ౧౯వ సర్గము. విభీషణుఁడు శ్రీరాముపదంబులమీఁదఁ బడి తన్ను నివేదించుకొనుట. •—

ఉ. అంతట రామభద్రుఁ డభ • యం బొసఁగం గని రావణానుజుం
డెంతయుఁ బ్రాజ్ఞుఁ డౌటను మ • హీస్థలిఁ జూచుచు సన్నతుండు నై

స్వాంతము పొంగ నల్వురు ని । జాప్తులతోడుత మింటనుండి స
త్స్వాంతుఁడు రాముపాదముల । సత్వరుఁడై శరణార్థియై పడెన్. ౧౯-౨

అర్థములు. ఇంతవఱకు రక్షకునకు శరణాగతిలాభము చెప్పఁబడెను. ఇఁక శరణాగతునకు స్వామి సేవాలాభము చెప్పఁబడును. శరణాగతుని పురుషార్థ మిదియే కదా. అంతటన్=రామచంద్రమూర్తి సుగ్రీవుని సమ్మతింపఁ జేసిన పిమ్మట, అభయంబు=సర్వభూతముల వలన భయములేమి, రావణానుజుండు=రావణునికిఁ దమ్ముఁడైనను వానివలె మతిహీనుఁడు గాక, ఎంతయుఁ బ్రాజ్ఞుఁ డౌటన్=మిగుల బుద్ధిమంతుఁడు గావున, రావణుఁడు ప్రాజ్ఞుఁడు-ప్ర+అజ్ఞుఁడు=బొత్తిగ బుద్ధిలేని వాఁడు. ఇదిమంచి,యిదిచెడ్డయని తెలిసికొనుబుద్ధికూడ లేనివాఁడు,కుంభకర్ణుఁడు= పెద్దచెవులవాఁడు కావునఁ దాఁకుతప్పులు తెలిసికొను నంతమాత్రము వినికిడి, తెలివి గలవాఁడేకాని కార్యశూరుఁడు కాఁడు. విభీషణుఁడు ఎంతయుఁ బ్రాజ్ఞుఁడు=మంచి చెడ్డలు, మేలుగీళ్ళు తెలిసికొను శక్తిగలవాఁ డగుటయే కాక తెలిసిన దాని నను ష్ఠానమునం దుంచు శక్తిగలవాఁడు. మహాస్థలిన్ జూచుచు=రామచంద్రుని నాయన యత్యంతాప్తులు చుట్టుకొనియున్నారు. వారిలోఁ దన కుచితస్థానమేది, ఏచోటికిఁ బోయిన మనము రామచంద్రమూర్తి పాదములపైఁ బడఁగలము అని యాస్థల మును వెదకుచు, స్వాంతము పొంగన్=రామచంద్రుని యత్యంతాప్తులలో నేనును గలిసియుండు నంత భాగ్యము గలిగెఁగదా యని సంతోషముచే నుప్పొంగుచు, సన్నతుండునై=మిగుల వినయము గలవాఁడై, ఆకాశము చూచుచు నడచుట గర్విష్ఠుల లక్షణము. నేలచూచి నడచుట వినయ విధేయతలు గలవారి లక్షణము. "దృష్టిపూతం న్యసేత్పాద" మనికదా ధర్మశాస్త్రము చెప్పుచున్నది. కావున వినయ ముతో నేలఁజూచి నచ్చెను. నిజాప్తులు=తనకు నాప్తులగు మంత్రులు, శరణంబు జొచ్చితిన్ - నా స్థితి వేగఁ దెల్పరే యని విభీషణుఁ డొక్కఁడే శరణు చొచ్చినను శరణాగతుఁడగు వానికి లభించు భగవత్ప్రాప్తి శరణాగతి చేయకుండినను వాని కాపులగువారి కందఱకు లభించును గావున దక్కిన నల్వురును రామచంద్ర మూర్తిచే ననుగ్రహింపఁబడిరి. ఈ విషయము ముందే వివరింపఁబడెను. ఆప్తులని చెప్పుటచే మెఱమెచ్చులకుముఖప్రీతికి దాక్షిణ్యమునకు కడుపుకూటికి స్వప్రయోజ నార్థము వెంటనుండువారికి లభింపదని భావము. సత్స్వాంతుఁడు=మంచి మనస్సు గలవాఁడు, ఇట్లనుటచేఁ గామాది పీడితుఁడు గాఁడనియు రామచంద్రసేవయేకోరి వచ్చినాఁడనియు గ్రాహ్యము. సత్వరుఁడై=త్వరతోఁ గూడినవాఁడై, సుగ్రీవుని మాట వినినంత మాత్రముననే, శరణార్థియై = శరణము ప్రయోజనముగాఁ గల వాఁడై, "అర్థఃప్రకారే విషయే వ్యవహారే ప్రయోజనే"॥నానా॥౨॥ అతఁడు కోరిన ప్రయోజనము శరణమే కాని రాజ్యాది కాంక్ష గాదని సూచన. పడెన్=ముందు కూర్చుండి తరువాత మోకాళ్ళు వంచి తరువాత నడుము వంచి తరువాతఁ జేతు

లూని యావల తలవంచి వ్రాలలేదనియుఁ గట్టె పడినట్లు సాష్టాంగముగఁ బడెననియు భావము. రాముపాదములను=రామచంద్రమూర్తి పాదముల నుద్దేశించి, ఇది యుద్దేశార్థంబున ద్వితీయ. అనఁగా భగవంతుని ఆచార్యుని నెచ్చటఁ జూచునో యచ్చట నుండియే నమస్కరింపవలెనుగాని సమీపమునకుఁబోయి నమస్కరింతమని యుండ రాదు. ఇది స్వామిని దర్శించునపుడు దూరమునుండిచేయు ప్రథమ నమస్కారము.

తాత్పర్యము

సుగ్రీవుఁడు సమాధానపడిన పిమ్మట రామచంద్రమూర్తి సర్వభూతాభయము ననుగ్రహింపఁగా రావణాసురుని తమ్ముఁడైనను మిగుల బుద్ధిమంతుఁడగు విభీషణుఁడు రామచంద్రమూర్తి సన్నిధానమందు నాయన యేకాంతులతోడ నిలుచు భాగ్యము కలిగెఁగదా యని మనస్సు సంతోషముచే నుప్పొంగుచుండ సవినయముగ నేలఁ జూచుచు తన యాప్తులగు నలువురు మంత్రులతో మంచి మనస్సు గలవాఁడు శీఘ్రముగ నాకాశమునుండి దిగి రామచంద్రమూర్తి పాదముల నుద్దేశించి శరణమే ప్రయోజనముగాఁ గలవాఁడై సాష్టాంగనమస్కారము చేసెను.

క. సరగ నిటు ధర్మబుద్ధియు, శరణాన్వేషియు సరాక్ష ♦ సచతుష్కుఁడు నై
చరణముల వ్రాలి ధర్మా, కర ముచితైతర్హిహర్ష ♦ కరసూక్తి ననన్. ౩౯౩

అర్థములు. సరగన్ = శీఘ్రముగ - శీఘ్ర శబ్దభవము సరగు - ధర్మబుద్ధియు=శరణాగతి ధర్మమునందు నిశ్చయమైన. మనస్సుగలవాఁడు, వీనిని "గ్రూరంబుగఁ జంపుటయే కృత్య" మన్నప్పుడును, "కావున నమ్మకుఁ డీ విభీషణున్" అన్నప్పుడును, "ఎటులైనఁ జేపీడు వాఁడఁగా" నన్నప్పుడును, "మా సమానుఁడై క్రాలు" నన్నప్పుడును, నిట్టి సర్వావస్థల యందు బుద్ధిని చెదరనీక స్థిరమైన మనస్సుతో నుండువాఁడు-ఇది మహా విశ్వాసమును సూచించుచున్నది. శరణాన్వేషి=రక్షకుని వెదకుకొనిపోవువాఁడును - సరాక్షసచతుష్కుఁడు=నలుఁవురు రాక్షసులతోఁ గూడినవాఁడు. తన రెండు కాళ్ళు రెండు చేతులవలెఁ దనకుఁ బరతంత్రులై యుండువారు. ఈ విధముగ వీరి నలువురయందు భాగవత పారతంత్ర్యము చెప్పఁబడెను గావుననే వీరు రక్షింపఁబడిరి. విభీషణు రక్షించె ననిన నాయన కాలు సేతులను రక్షించినట్లే కదా.

చరణములన్ = పాదములందు - చంటిబిడ్డ తల్లియొద్దకుఁ బోవునపుడు-మాతృ స్తనములందు మనస్సుదృష్టి యుండునుగాని తక్కిన దేహముతో దానికేఁ బనిలేదు. భక్తునికి స్వామి పాదము లట్టివే. కావున విభీషణుఁడు తనకు భోగ్యములైనవి స్వామివారి శ్రీ పాదములే కదా యని వానిపై మనస్సు, దృష్టి యుంచి వాని నాశ్రయించె నని భావము. వ్రాలి=వంగి - పూర్వము పడినట్లు దబాలున పాదములు నలుగునట్లు పడలేదు. మెల్లగాఁ బడె నని భావము.

అయ్యో! విభీషణుఁ డిట్లు పడిపోయెనే యని పరువున వచ్చి యతని యవయవములను జక్కఁగఁ బట్టుకొని గూర్చుండఁ బెట్టునట్లు పడి-ఇది స్వామిసన్నిధానమునఁ జేయఁబడు కాయిక శరణాగతి-శరణార్థి యని పూర్వము మానసికము చెప్పఁబడెను. దీనిచే నాత్మనిక్షేపము సూచితము. ఇట్లు మానసిక, కాయిక, శరణాగతులు చెప్పి యిఁక వాచిక శరణాగతి చెప్పుచున్నాఁడు.

ధర్మాత్మకరము= ధర్మమునకు స్థానమైనది, ధర్మముతోఁ గూడినది. ఇచ్చట శరణాగతి ధర్మమైన యానుకూల్య సంకల్పాదులు గలది. ఉచిత=సమయమునకుఁ దగినది. సమర్థుఁడై కరుణాలువగు రక్షకుని యొనుట నెట్లు చెప్పఁబడవలయునో యట్లు ఏతర్హి=ఇప్పుడు'ఏతర్హి సంప్రతీదానీ' మని యమరము, హర్షకర=సంతోషము గలిగించు 'రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడ'నని తొలుత నన్నప్పుడు సుగ్రీవాదులకుఁ గర్ణకఠోరముగ నుండినవి. ఆ మాటలే యిప్పుడు రామచంద్రమూర్తి యనుగ్రహించిన కారణమున సంతోషకరములుగా నున్నవని భావము. సూక్తిన్= రామచంద్రునిన్ శరణము చొచ్చినాఁడ నని వానరులతోఁ జెప్పిన యీ మంచి మాటయే యిప్పుడు రామచంద్రమూర్తితోఁ బ్రత్యక్షముగ ననును. రామానుగ్రహము రానప్పుడు వానరులకు దురుక్తిగాఁ దోచిన యీమంచిమాటలే యిప్పుడు సూక్తులుగాఁ దోఁచెను. దీనికిఁ గారణము వానరుల భావ వికాసము. దీనివలన భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడు గానివాఁడు ఎంత శిష్టుఁడైనను అసూయాపరులకు దుష్టుఁడుగానే కానవచ్చును, "క్రూరుం డెన్ని సుధీగుణంబు దురితారూఢంబు నేయుంగదా" 'భర్తృ శరణాన్వేషి. పాదముల వ్రాలె'ననుటచే భక్తులకుఁ బ్రపన్నులకు సేవ్యములు తారకములు స్వామివారి పాదములే యని యేర్పడుచున్నది.

ఇది ప్రధానశరణాగతి కాదని పూర్వమే చెప్పఁబడెను. ఇది ప్రధాన ప్రపత్తి యనినయెడలఁ బ్రపత్తిచేయుటకుఁ బూర్వమే స్వీకరించిన ట్లేర్పడును. అది సరిగాదు.

తాత్పర్యము

ఈప్రకారము జాగులేక శరణాగత ధర్మమునందు నిశ్చయ బుద్ధిగలవాఁడును, రక్షకుని వెదకువాఁడును నగు విభీషణుఁడు తనకుఁ గాలుసేతులవంటి నలుగురు రాక్షసులతోడ శ్రీరామచంద్రమూర్తి పాదములపై వ్రాలి శరణాగత ధర్మలక్షణయుక్తము, యోగ్యము, పూర్వము వానరులకుఁ గటువుగా నుండినను ఇప్పుడు సంతోషకరమునైన మంచిమాట లిట్లు చెప్పెను.

చ. అనుజుఁడ రావణాసురున ♦ కాతఁడు నన్నవమాన పెట్టఁ దెం
 పునఁ జనుదెంచి నే సకల ♦ భూతశరణ్యుని నిన్నుఁ జేరితిన్
 నిను శరణంబుఁ జొచ్చితిని ♦ నెయ్యుర లంక సిరిం ద్యజించితిన్
 మనుజవరా! భవద్గతము ♦ మత్సుఖజీవితరాజ్యభోగముల్. ౩౯౪

పూర్వము సుగ్రీవాదులతోఁ జెప్పినమాటలే యిప్పుడు రామచంద్రమూర్తితో జెప్పుచున్నాఁడు.

అర్థములు. అనుజుఁడన్ = తమ్ముఁడను, దీనిని ౩౨౨ వ పద్యముతోఁ బోల్చునది. రావణునకుఁ దమ్ముఁడ ననుటచేఁ దన దోషము చెప్పినవాఁ డయ్యెను. తెంపునన్=సాహసముచే; రామచంద్రుని పాదములపైఁ బడుదము. ఆయన రక్షించెనా రక్షింపనీ, శిక్షించెనా శిక్షింపనీ, ఆయన దయ యని సాహసించి, సకలభూత శరణ్యునిన్=సమస్త భూతములకు రక్షకుఁడవు, అనుకూలుఁడయివచ్చిన రావణునే రక్షించువాఁడవు, నన్ను రక్షింపకుందువా యను విశ్వాసముచే, చేరితిన్=సమీపించితిని, నీకు నెవ్వరు లేరా నాయొద్దకు రానేల యందువా? నాకు నీవు తప్ప వేఱుప్రాపు లేదనుచున్నాఁడు, నెయ్యురన్=మిత్రులను, సిరిన్=వారిమూలమున లభించిన సంపదను, త్యజించితిన్=నేనే వదలిపెట్టితిని, భవద్గతము=నీ స్వాధీనము, నీ యుధేచ్ఛ వినియోగమునకు లోపడినది, మత్=నాయొక్క, సుఖజీవిత=సుఖమైన బ్రదుకు, ఇది ధారక పోషక భోగ్యముల కన్నింటికి నుపలక్షణము, రాజ్య = ఇది సమస్తోపకరణములకు నుపలక్షణము, లంకారాజ్యము రావణుని స్వార్జితము. ఆ విషయమున విభీషణుఁడు లోఁబడినవాఁడును గాఁడు. కావున రాజుగాఁడు. యువరాజునుగాఁడు, ఇట్టివానికిఁ బాలింప దేశమెందుండివచ్చెను. కావున రాజ్యమనఁగాఁ బాలింపఁబడు దేశమని యర్థముసేయరాదు. కావున రాజునకు రాజ్యమెట్లు పాలనార్హమో యట్లు పాలనార్హములైన పదార్థములనియే చెప్పవలెను. నష్టరాజ్య మనోరథుఁడ నన్నచోట నీ యర్థమే గ్రాహ్యము. భోగముల్ = ఐహికాముష్మికరూపములైన సర్వసుఖములు, ప్రపన్నులు = ప్రతిదినము చెప్పెడు "మమత్వేన అభిమతంచ వస్తు సర్వస్వామినే నారాయణాయ తుభ్యమేవ న మమ" అను వాక్యార్థముగలది. 'ఆత్మాత్మీయ నిక్షేపమాత్మనిక్షేప ముచ్యతే' తన్నుఁ దనది యను నేదిగలదో చేతనా చేతనాత్మకమైన సర్వము భగవంతునకై సమర్పించుట యాత్మనిక్షేప మనఁబడును. నీ సేవమాత్రము నా కనుగ్రహించి యివి యన్నియు నీ యిష్టమువచ్చినట్లు వినియోగించుకొమ్ము. వీనియందు నాకేక స్వామిత్వము లేదని భావము. ఇది భవద్గతము. ఇది భరన్యాసమును తెలుపును.

తాత్పర్యము

రామచంద్రా! నేను రావణాసురుని తమ్ముఁడను, అతఁడు నన్నవమానించిన కారణముచే సాహసించి సర్వప్రాణి రక్షకుఁడవైన నీ యొద్దకు వచ్చితిని. నీశరణము చొచ్చితిని. నీ కెవ్వరు రక్షకులు, సహాయులు లేరా, యిచ్చటికేల వచ్చితివందువా? స్నేహితులను, చిరకాలముగ నసించు లంకను, దానియందు నాకుఁగల సంపత్తును, సర్వము వదలిపెట్టితిని. కావున నా కెవ్వరు రక్షకులులేరు. నేను, నా సుఖజీవనము

నా పాలనకు లోపడిన సమస్తోపకరణములు భోగములు నన్నియు నీ స్వాధీనము చేసితిని. ఇఁక నా యోగక్షేమములకు నీవే దిక్కు.

క. అను తద్వచనంబుల విని, చనవునఁ దా నాదరించి ♦ సాంత్వఫణితులన్
జనకసుతాపతి రాక్షస, వినిచయము బలాబలములు ♦ వినిపింపు మనన్. ౩౫౯

అర్థములు. తత్ + వచనంబులు=దారపుత్రాదులను, ఇల్లు వాకిండ్లను, గొడ్డుగోదలను తోఁపులు దొడ్లను సర్వమును నేనై వదలి శ్రీరామునందే భరన్యాసము గావించిన విభీషణుని యొక్క, తత్ + వచనంబులన్ = రామసేవయే తనకు భోగ్యమని శరణార్థియై చెప్పిన యా మాటలను, సాంత్వఫణితులన్ = ఊరార్పు మాటలచే, నీవు నన్ను శరణన్నప్పుడే రక్షింపవలసిన వాఁడనే, అలస్యముచేసి నీకు మనస్సునకు సంకటము గలిగించితిని; క్షమింపుము. అను మంచిమాటలచే ఆదరించి= నీకు భయములేదు. లెమ్మను మాటలచే మనస్సు తాపముచల్లార్చి, విభీషణుఁడు రామచంద్రుని నీ కైంకర్యము నాకనుగ్రహింపుమని కోరెనుగదా; దానిని రామచంద్రమూర్తి యంగీకరించి త్రివిధ కైంకర్యములలో వాచిక కైంకర్యము తొలుఁత గావింపు మనుచున్నాఁడు. వినిచయము = సమూహము, మీావారి బలాబలములు చెప్పుమని యడుగక రాక్షసుల బలాబలములని యడుగుటచేత విభీషణుఁడు శరణాగతుఁడైన వెంటనే భ్రమరకీటకముగా రాక్షసజాతి పోయి యిక్ష్వాకు వంశములోని వాఁడయ్యెనని రాముని యభిప్రాయ మని సూచితము. సన్న్యాస మెట్లు జన్మాంతరమని చెప్పఁబడునో యట్లులే శరణాగతునకు జన్మాంతరప్రాప్తి యీజన్మమందే లభించు ననియు నది భగవదాశ్రయణము కావున నాశ్రయణ మహాత్మ్యము చేత ముక్తియోగ్యత గలదై, ముక్తసామ్యత నొందు ననియు గ్రాహ్యము.

తాత్పర్యము

విభీషణుఁడు చెప్పినమాటలువిని మచ్చికచేనూరార్పుమాటల సమాధాన పఱచి రామచంద్రమూర్తి విభీషణా! రాక్షసుల బలాబలములు చెప్పు మని యడిగెను.

అడవిచుట్టు నిప్పంటుకొనినందున తప్పించుకొని బయటకుఁ బోవుటకు వీలు లేక నడుమఁ జిక్కుపడిన మృగాదులవలెనే తాపత్రయాత్మక మగు సంసారాను భవభీతు లైనట్టి ముముక్షువులకు ఆచార్యుండు ముందుగఁ బ్రపత్త్యనుష్ఠానము నుపదేశించును.

శ్రీ విభీషణులవారు రావణునితో "సీతాదేవిని శ్రీరామచంద్రున కొప్పగింపు" మని హితోపదేశముఁ జేసినట్లు లాచార్యుండును ముముక్షు వగు నీతనికి నీ యాత్మను సర్వేశ్వరునకు సమర్పింపు మని యుపదేశించును.

పెరుమాళ్ళ శ్రీపాదముల నాశ్రయింపు మని శ్రీ విభీషణులవారి యుపదేశములు "మనుష్యమాత్రుఁడు రక్షకుఁ డెట్లు కాఁగలఁడు" అను నిత్యాది ప్రమా

స్త్రాది వాక్యదోష దూషిత మగు రావణుని మనస్సున కెక్కనట్లు, ఆచార్యం డుపదేశించునట్టి యుపదేశములును ప్రకృతి వాసనాదూషిత మగు ఈ ముముక్షువు యొక్క మనస్సున కెక్కవు.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు లంకను, మిత్రులను ధనములను విడిచితిని అన్నట్లు ముముక్షువగు నీ చేతనుండును భగవద్విషయము యొక్క ప్రచారము లేని ప్రదేశమును విడనాడునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుచొచ్చునప్పుడు ఆకాశమునం దుండె నన్నట్లు నిరాధారుఁడై నిలబడినట్లు, ముముక్షువు సర్వేశ్వరుని శ్రీ పాదములఁ బొందు విషయమున నుపాయాంతర శూన్యుఁడై యుండునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు, ఉపాదేయములు కాని, పుత్రులను భార్యను వదలి రామచంద్రుని శరణు పొందె నన్నట్లు ముముక్షువును సర్వేశ్వరుని శ్రీ పాదములను బొందుటకు నిర్బంధము లగు విరోధులను విడనాడునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుజొచ్చునప్పుడు లక్ష్మణస్వామి వారితో నుండిన శ్రీరామచంద్రమూర్తి సన్నిధికి వచ్చినట్లు ఈ ముముక్షువును పెరుమాళ్ళు ప్రేమించి వేంచేసి యున్నట్టి దివ్యదేశమునే తనకు రక్షక మైనట్టి దానిగా నాశ్రయించునది.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణుచొచ్చుటకై వచ్చినప్పుడు "నేను శరణు జొచ్చుటకై వచ్చియున్నానని శ్రీరామచంద్రుని సన్నిధి విన్నవింపుఁడు," అనియు "ఓ సుగ్రీవుఁడా ! ఈతని గొనిరమ్ము" అనియు చెప్పఁబడెను. ఈ తావుల శ్రీ విభీషణుల వాకొక్కరే విన్నవించినను ఫలమన్ననో వీరితో పాటు కూడ వచ్చిన వారికిని లభించినట్లు ముముక్షువులకుఁగాను సర్వేశ్వరుని సన్నిధిని నాచార్యుం డొనర్చినట్టి ప్రపత్తియే చాలును.

శ్రీ విభీషణులవారు పెరుమాళ్ళను శరణు చొచ్చునప్పుడు శ్రీరామ చంద్రుఁడు సుగ్రీవుని మూలముగ విభీషణులవారు శరణు చొచ్చుటకై వచ్చిన సంగతిని విని యింద్రుండు గరుత్మంతుని వలెనే వారిని గలిసికొనెను, అన్నటు పెరుమాళ్ళు సుగ్రీవుని పురుషకారముద్వారమున విభీషణులవారి నంగీకరించినట్లు ఈ ముముక్షువును ఆచార్యుని పురుషకారముద్వారా అంగీకరించును.

ఇట్లు లంగీకరింపఁబడిన ప్రపన్నుండు సంసారములో నుండునట్టి స్థితిని పిరాట్టి రావణుని గృహమునం దుండు నశోకమున నుండి చూపించినది. అదెట్లనిన:—పిరాట్టికి రావణసంబంధ మెట్లో ఈతనికి దేహ సంబంధము నట్టిదే. పిరాట్టికి యేకాక్షి, యేకకర్ణి మొదలగు రాక్షసస్త్రీలు యెట్లో, ఈతని అహంకార మమకారములు నట్లే. పిరాట్టికి తనను పెరుమాళ్ళయొద్దనుండి కొనిపోఁదలచిన మారీచుఁడు ఎట్లో, ఈత

నికి విషయ ప్రావణ్యము నట్టిది. తర్జన భర్త్సనాదుల నొనర్చిన రాక్షస స్త్రీసంబంధము పిరాట్టి కెట్టిదో, ఈతనికి కళత్రపుత్ర సంబంధము నట్టిదే. పిరాట్టికి ఆంజనేయులవారి దర్శన మెట్టిదో ఈతనికి నాచార్యుని దర్శనము నట్టిదే. పిరాట్టికి శ్రీయాంజనేయులవా రొనర్చిన రామగుణకీర్తన మెట్టిదో ఈతని కాచార్యుఁడు సాయించిన గురుపరంపరయును అట్టిదే. పిరాట్టికి ఆంజనేయులవా రిచ్చిన యుంగర మెట్టిదో, ఈతని కాచార్యుఁ డుపదేశించిన తిరుమంత్ర మట్టిది. పిరాట్టి రామచంద్రుని యుంగరమునుజూచి దానిమూలముగ సుందరమగు వ్రేలిని, దానిమూలముగ బాహువులను, దాని మూలముగ దివ్యమంగళ విగ్రహమును అనుసంధించుకొని ప్రాణములను ధరించి యున్నట్లు శ్రీవైష్ణవుఁడును, ఆచార్యుఁడు కృపచేసిన తిరుమంత్రము యొక్క యర్థమును అనుసంధించుకొని ధరించియుండును. పిరాట్టి లక్ష్మణస్వామితో పరుషముగ మాట్లాడిన మాట ఈమెను పెరుమాళ్ళను విడిచి దూరముగా నుండునట్లు చేసినచందమున, ఈతం డొనర్చినట్టి భాగవతాపచారము, ఈతనిని "క్షిపామి, న క్షమామి" అను భగవన్నిగ్రహమునకు విషయముగాఁజేసి పెరుమాళ్ళనుండి దూరముగా నుండునట్లు చేసినది. పిరాట్టికి విరోధులగు రావణాదులను వధించి పెరుమాళ్లు ఆమెను గొనిపోవుట యెట్లో, అట్లే యీతనికి విరోధియగు ప్రకృతి సంబంధమును బోఁగొట్టి సర్వేశ్వరుఁడు ఈతనిని పరమపదమునకుఁ గొనిపోయి నిత్యముక్తులతో పాటు నిత్య కైంకర్యమున నుపయోగ పఱుచుకొనును. ఈ పది వార్తలను అనుష్ఠాన పర్యంతము గలిగి యున్నట్టి శ్రీ వైష్ణవుఁ డుండునట్టి తావే పరమపదము.

—♦ విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసబలంబుఁ దెల్పుట ♦—

చ. ప్రవిమలసచ్చరిత్రునకు ♦ రాముని కిట్లను దేవ! యాస్వయం
భువువలన న్వరంబులను ♦ బొందుటచే నశకంఁడు నాజిలో
దివిజపలాశిసంతతికిఁ ♦ ద్రిక్కన భూతసమూహకోటికిం
దవిలి వధింపరాదు వసు ♦ ధాధవనందన భక్తనందనా. ౩౯౬

అర్థములు. ప్రవిమల=మిగుల నిర్మలమైన - సచ్చరిత్రునకున్ = మంచి నడవడి గలవానికి - స్వయంభువువలనన్ = బ్రహ్మవలన - ఆజిలో = యుద్ధమునందు - దివిజపలాశి సంతతిన్=దేవతల రాక్షసుల సమూహమునకు - త్రిక్కన= తక్కన-భూతసమూహకోటికిన్ = నరులు వానరులు తప్పఁ దక్కిన యొక్కొక్క జాతిసమూహముల గుంపులకు-వసుధాధవనందనా=రాజకుమారా-నీవు మనుష్యుఁడవు కావున రావణుఁడు నీచేఁ జచ్చునని భావము. భక్తనందనా=భక్తులసంతోషపెట్టువాఁడా- అనుటచే అట్లు నీవు రావణుని జంపిన భక్తులందఱు సంతోషింతురు. దానివలన సాధు పరిత్రాణము చేసినవాఁడ వగుదువు. అదియేకదా నీ యవతారముఖోద్దేశము.

మిగుల నిర్మలమైన నడవడిగల రామచంద్రునకు విభీషణుఁ డిట్లనియె. దేవా! బ్రహ్మచే రావణుఁడు యుద్ధమందు దేవరాక్షసులచే నరవానరులు తప్పఁ దక్కిన భూతకోటిచేఁ జావులేకుండ వరము పొందినాఁడు. నీవు రాజకుమారుఁడవు కావున నీచే వాఁడు చచ్చును. అట్లు నీవు చేసితివేని భక్తు లందఱు సంతోషింతురు.

సీ. రావణుతమ్ముండు ♦ రణవీర్యవంతుండు, కుంభకర్ణుండు ని ♦ ష్కుంఠ తేజుఁ
డన్న నాకతఁడు బ ♦ లారికి నెదురుద్ది, యని దళవాయి ప్ర♦హస్తుఁ డతని
వినియుందు వేమొ యా♦వీరుండు కైలాస,మున మాణిభద్రుని♦ మొక్కపతిచెఁ
గలన ననిర్భేద్య ♦ కవచుండు బద్ధగో, ధాంగుళిత్రుండు శ ♦ రాన మూని
తే. యింద్రజి యదృశ్యుఁడగుచును ♦ నేపుమీఱు, విగ్రహంబున హుతవహు ♦
వేల్చి తత్ప్రసాదమున మాయమగుచును ♦ జంపునరుల, రావణుని యీడు
వాఁడు ప ♦ రాక్రమమున.

అర్థములు. రణవీర్యవంతుండు=రణమునందు వీర్యముగలవాఁడు, సప్తమీ తత్పురుషము. నిష్కుంఠ తేజుఁడు = మొక్కవోని పరాక్రమము గలవాఁడు, బలారికిన్ = ఇంద్రునికి, ఎదురుద్ది = సమానశత్రుఁవు, దళవాయి = సేనానాయకుఁడు, మాణిభద్రుఁడు = కుబేరుని సేనాపతి, కలనన్=యుద్ధమందు, అనిర్భేద్య కవచుఁడు = భేదింపరాని కవచముగలవాఁడు, బద్ధగోధాంగుళిత్రుండు=ఉడుము చర్మముతోఁ జేయఁబడిన వ్రేళ్ళకవచము తొడుగుకొనువాఁడు, శరాసము=విల్లు, ఇంద్రజి=ఇంద్రజిత్తు, అదృశ్యుఁడు = కానరానివాఁడు, విగ్రహంబునన్ = యుద్ధమందు, హుతవహున్ = అగ్నిహోత్రుని, వేల్చి = హోమముచేసి, తత్+ప్రసాదమునన్ = ఆయన యనుగ్రహముచేత, అరులన్ =శత్రువులను, ఈడువాఁడు= సమానుఁడు.

తాత్పర్యము

కుంభకర్ణుఁడు రావణునకుఁ దమ్ముఁడు. యుద్ధమునందు మిగుల శౌర్యము గలవాఁడు, మొక్కవోని పరాక్రమము గలవాఁడు, ఇంద్రునికి సమాన శత్రువు. వాఁడు నాకన్న కావలయును. ప్రహస్తుఁ డనువాఁడు సేనానాయకుఁడు. వీని విషయము నీవు హనుమంతునివలన వినియుందువు. అతఁడు కైలాసమున యక్షులకు రాక్షసులకు జరిగిన యుద్ధమందుఁ గుబేరు సేనాపతి యగు మాణిభద్రుని బరాభవించెను. ఇంద్రజిత్తు రావణుకొడుకు, భేదింపరాని కవచము గలవాఁడు. ఉడుము తోలుతోఁ జేయఁబడిన వ్రేళ్ళ కవచము (Glove) గలవాఁడు. యుద్ధమందు విల్లు ధరించి శత్రువులకుఁ గానరాకుండ వారిని జంపును. అగ్నిహోత్రుని హోమము చేసి యాయన యనుగ్రహమున విల్లు, తేరు గలవాఁడై వానితో నితరులకుఁ గానరాక శత్రువులఁ జంపును. బలపరాక్రమములందు రావణుతో సమానుఁడు.

తే. లోకపాలసమాను ల♦నీకపతులు, మఱి మహాపార్శ్వుఁడును నకం♦పనుఁడునాఁగ
నధికబలుఁడు మహోదరుం♦డనఁగఁ గలరు, వీర్యవిక్రమనిర్జిత♦విబుధవరులు. ౩౯౮

అర్థములు. లోకపాల సమానులు=దిక్పాలురతో సములు, అనీకపతులు=సేనానాయకులు, వీర్యవిక్రమ నిర్జిత విబుధవరులు=శౌర్యము చేతను, పరాక్రమము చేతను జయింపఁబడిన దేవశ్రేష్ఠులు.

తాత్పర్యము

మఱియు సేనానాయకులు దిక్పాలురతో సమ లగువారు మహోదర మహాపార్శ్వులు, అకంపనుఁడుననువారు గలరు. వీరు దేవశ్రేష్ఠులను శౌర్యపరాక్రమములచే జయించినవారు.

ఆ. కామరూపధరులు ♦ కల రొక పదివేల, కోట్లు లంకయందుఁ ♦ క్రూరబలులు
పలలభోజు లల్ల ♦ వారల బాసట, భంగపఱిచె సురలఁ♦బంక్తిముఖుఁడు. ౩౯౯

అర్థములు. పలలభోజులు=మాంసభక్షకులు - రాక్షసులు - బాసటన్=సాహాయ్యముచే.

తాత్పర్యము

కోరినరూపము ధరింపఁగల రాక్షసులు పదివేల కోట్లున్నారు. వారి సాహాయ్యముచే రావణుఁడు దేవతల నోడించెను.

చ. విపులపరాక్రముండు రఘు♦వీరుఁడు రాక్షసవంశదీప్యు నా
లపితము నాలకించి సక♦లంబు మదిం దలపోసి పల్కె నీ
విపుడు దురాత్ము రావణుని♦వృత్తము సర్వము నో విభీషణా
నిపుణముగాఁగఁ జెల్పుటను నిశ్చలచిత్తమునన్ గ్రహించితిన్. ౪౦౦

అర్థములు. ఆలపితము = మాట - విపులముగ=సవిస్తరముగ - రాక్షసవంశదీపు = రాక్షస కుల మను నెమళ్ళకు దీపమువంటి వాఁడు - రాక్షసకుల నాశకుఁడు.

తాత్పర్యము

విస్తార పరాక్రమముగల రామచంద్రమూర్తి విభీషణుఁడు చెప్పినమాటలు విని కార్యము లెట్లెట్లు చేయవలయునో యాలోచించి యిట్లనియె. విభీషణా! నీవిపుడు సవిస్తరముగఁ జెప్పిన దుష్టుఁ డగు రావణుని నడవడి సర్వము నేకాగ్ర చిత్తముతో గ్రహించితిని.

మ. వినుమా రావణుఁ బుత్రమిత్రసచివా♦న్వీతు న్మహాస్కందవం
బున ద్రుంచెదంతు, రసాతలంబున నధో♦భూమిం జొరం బాఱినన్
వనజాతాసను దాపు చేరినను బ్రా♦ణాన న్విడం జుమ్మి, ని
న్ననఘా కట్టెదఁ బట్ట మయ్యసురరా♦జ్యశ్రీకి సత్యంబుగన్. ౪౦౧

అర్థములు. సచివ + అన్వీతున్ = మంత్రులతోఁ గూడినవానిని, మహా

సంక్రందమునన్ = గొప్ప యుద్ధమందు, ప్రమందింతున్ = చంపుదును, రసాతలమున్=గొప్ప పల్లములందు, అధోభూమిన్=పాతాళమందు, వనజాతాసను = బ్రహ్మయొక్క, అసురరాజశ్రీకి=రాక్షస రాజ్యలక్ష్మికి.

తాత్పర్యము

విభీషణా! నేను జెప్పెడుమాట వినుము. రావణుని కొడుకులతో మిత్రులతో మంత్రులతో యుద్ధమందు వధింతును. వాఁడు క్రిందిలోకములందు, పాతాళలోకములో నడుగుభాగమున గుంతలలో దాఁగినను పైలోకములందు సత్యలోకమునకుఁబోయి బ్రహ్మయొద్ద నుండినను ప్రాణముతో వదలిపెట్టను. అంతమాత్రమే కాదు రాక్షస రాజ్యలక్ష్మికి నిన్నుఁ బట్టము గట్టెదను.

ఇచ్చట నీ శ్లోకము లనుసంధింపఁదగును.

అన్నం పానం ధనం వస్త్ర మాయు రారోగ్య మాస్పదమ్
ఆపద్యపి న యాచేత పూజకః పురుషోత్తమమ్
నాప్రపన్నే దదామ్యేత ద్యాచితోపి దినేదినే
అయాచితోపి తత్సర్వం ప్రపన్నే విదధా మ్యహమ్.

అన్నము, పానము, ధనము, వస్త్రము, ఆయువు, ఆరోగ్యము, ఇల్లు, భూములు, జీవనోపాయము ప్రపన్నుఁడు భగవంతుని యాచింపరాదు. దినదినము వీనిని యాచించినను భగవంతుఁడు వీనిని వానికీయఁడు. వాఁడు పూర్వజన్మకృతానుసారముగ నవి లభింపవలసినవే. యాచింపని ప్రపన్నునకు నేను సర్వము నిచ్చెదను. వాని పూర్వకర్మ విచారముతో నాకుఁ బనిలేదు.

కర్మముపై నాధారపడినవానికిఁ గర్మ మెంత యియ్యవలయునో యంతయే యిచ్చును. నామీఁద నాధారపడినవానికి నేనీయఁగలదంతయు నిచ్చెదను. నేను యాచింపకుండిన నన్ని యిచ్చునననే యని మనస్సులో నింకను నీయలేదే యనుకొనుచుండరాదు. ప్రపన్నున కా విచారమే నిషిద్ధము.

ఈ కారణముచే విభీషణుఁ డడుగకుండినను రాజ్యమును శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహించెను. విభీషణునకీ యనుభవ మిప్పుడే కాదు. బాల్యమున బ్రహ్మనుగూర్చి తపస్సు చేసినపుడు బ్రహ్మదేవుఁడు అమరత్వమును అడిగిన రావణునకీయక యడుగని విభీషణున కిచ్చెను. దీనివలన మనము నిష్కామప్రవర్తనము భక్తి కలిగి సర్వభారము భగవంతునిపై వైచితిమేని మన యోగక్షేమము లాయనయే విచారించుకొనునని యేర్పడుచున్నది.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ భ. గీ.

రాజ్యకాంక్షచే విభీషణుఁడు వచ్చినాఁడనుట యితరుల యభిప్రాయమే కాని యతని యభిప్రాయము గాదు.

క. ఒట్టిడుకొందును నాతోఁ, బుట్టులపై రావణుని స♦పుత్రహితబలున్
మట్టిడక నే నయోధ్యా, పట్టనముం జొరఁగఁ బోను ♦ బరమచరిత్రా! ౪౦౨

అర్థములు. ఒట్టిడుకొందును=ప్రమాణముచేసి చెప్పెదను, మట్టిడక=చంపక.

తాత్పర్యము

గొప్పనడవడికగల విభీషణా! రావణుని కొడుకులతో, మిత్రులతో, సేనలతోఁ జంపక యయోధ్యను బ్రవేశింప నని ప్రమాణము చేసి చెప్పెదను.

తరలము. అనుడు భక్తి విభీషణుండును ♦ నంజలిన్ ఘటియించి యో
యనఘశీల! మదీయ దేహము♦నందుఁ బ్రాణము లుండునం
దనుకఁ జొచ్చెద శత్రుసేన ని♦తాంతసాహ్య మొనర్తు లం
కను వినాశ మొనర్ప రాక్షస♦కాండముం బరిమార్పఁగన్. ౪౦౩

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా విభీషణుఁడు రెండు చేతులు జోడించి పుణ్యచరిత్రా! నా దేహమునందుఁ బ్రాణములుండు వఱకు శత్రుసేనయందుఁ దూఱి లంకను రాక్షసులను చంపుటయందు మిగుల సాహాయ్యము చేసెదను.

ఇది కాయిక కైంకర్యము. ఇంతవఱకు విభీషణుఁడు రాజ్యమును దాను వేఁడను లేదు. రాక్షసవధయందు సాహాయ్యము చేసెదనని చెప్పను లేదు. రామచంద్రమూర్తి రాక్షసుల వధించెదనని చెప్పిన కారణముచే నేది స్వామికార్యమో యది భృత్యునికార్యమే. తన కది యిష్టమైనను అనిష్టమైనను కైంకర్యబుద్ధి నెఱవేర్పవలసినదే కావున నీ విషయమున నాకుఁ గృత్యమైన కైంకర్యము నేను జేసెదననెను. దీనివలన స్వామి యొక్క కార్యము చేయఁబూనినపుడు భృత్యుఁడు తటస్థుఁడై యూరక చూచుచుండరాదు. అది తనకార్యముగ నెంచి దానిని జక్కఁ జేయవలయునని సూచన. కామ్యకాంక్ష యీ మాట చెప్పినవరాదు. అనుకూల సంకల్పము.

—♦ శ్రీరాముఁడు విభీషణునకుఁ బట్టాభిషేక మొనరించుట ♦—

సీ. అను విభీషణుని దా♦నంకపాలిని గ్రుచ్చి, సౌమిత్రితో రఘుచంద్రుఁ డనియెఁ
దెమ్ము మానద! సాగ♦రమ్మునజలమ్ము నల, నా ప్రసాదమ్మున♦క్షిప్రముగను
నభిషిక్తుఁ జేయుమా♦యసుర రాజ్యశ్రీకి, నివ్విభీషణు♦నన నింపుమీఱ
మర్కటవాహినీ♦మధ్యంబునను నతఁ డట్లు గావించె రా♦జాజ్ఞ కలిమి

తే. శ్రీరఘూత్తము కరుణావి♦శేషమునకు, మేలు మేలని కపులెల్ల♦మెచ్చుకొనుచుఁ
గేక లెసఁగించి రంత సుగ్రీవపవన,సంభవులు పల్కి రిటు విభీ♦షణునితోడ. ౪౦౪

అర్థములు. అంకపాలిని = కౌఁగిట, "ఆలింగన ముపగూహన మాహుః పరిరంభణం పరిష్వంగం ఆశ్లేష మంకపాలిం క్రోడీకరణంచ తుల్యార్థమ్-రత్నమాల. గ్రుచ్చి = ఒత్తి, మానద = ఆశ్రితుల గౌరవము రక్షించువాఁడా, నే నను గ్ర

హించినను ఫలమీయవలసిన వాఁడవు నీవేయని భావము. (ననుఁబ్రసాదించిన యనఘచరితున్=అనుషంగికఫలముగా నే నిచ్చెద ననిన రాజ్యమును నిరాకరింపక యంగీకరించి నా మనస్సు సంతోషింపఁ జేసిన వానిని.) దీనివలన విభీషణుఁడు రాజ్యము గోరలేదనియు, రాజాజ్ఞ కావున నంగీకరించె ననియు గ్రాహ్యము, మర్కట వాహినీ మధ్యంబునం దనుటచేఁ బదుగురిలోఁ జెప్పినది యనుల్లంఘనీయ మని భావము, క్షిప్రముగను=త్వరగా.

తాత్పర్యము

రామచంద్రా! నేను నీ సేవఁగోరి వచ్చితినిగాని రాజ్య మాశించి వచ్చిన వాఁడగాను. నేను బరతంత్రుఁడను, కావున నీ వనుగ్రహించు రాజ్యము నాకక్కఱ లేదనుటయుఁ బారతంత్ర్యమునకు హాని కలిగించును గావున నీ యాజ్ఞాబద్ధుడనై యంగీకరించెదను. (భరతుఁడు పరతంత్రుఁడై కదా లక్ష్మణుఁడు నిరాకరించిన యౌవరాజ్య మంగీకరించెను.) అని చెప్పఁగా నతని మాటలకు మెచ్చి రామచంద్ర మూర్తి యతనిని గాఁగిట నొత్తి వశపఱచుకొని లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! వేగముగ సముద్రజలముదెచ్చి)నాయం దనుగ్రహించిన) యీయనను రాక్షస రాజ్యమునకు రాజుగాఁ బట్టాభిషేకము చేయుము అని చెప్పఁగా లక్ష్మణుఁడు వానరసేనామధ్యమందు రాజాజ్ఞ ప్రకారము గావించెను. వానరు లందఱు ఔరా రామచంద్రమూర్తి యెంతటి దయాశాలి యని మెచ్చి కేకలు వేసిరి. ఆవల నవ్విభీషణునితో సుగ్రీవ హనుమంతు లిట్లనిరి.

ఉ. ఈ వరుణాలయంబుఁ దరి•యింపఁగ నెట్టు లగున్ వనాట సే
నావళితోడఁ, జెప్పుమ యు•పాయ మొకం, డన నవ్విభీషణుం
డో వనజాప్తనందన! మ•హోదధి సాగరఖానితంబు ము
న్గావున రాఘవుండు శర•ణం బనఁ బ్రాజ్ఞుఁ డొనర్చుఁ గార్యమున్. ౨౦౧

అర్థములు. వరుణాలయంబు = సముద్రము - వనాటసేనావళితోడన్ = వానరసేనతో-సాగరఖానితంబు=సగర కుమారులచేఁ ద్రవ్వఁబడినది, ప్రాజ్ఞుఁడు= కృతజ్ఞతాబుద్ధి గలవాఁడు.

తాత్పర్యము

వానరసేనతోడ నీసముద్రము దాఁటు నుపాయము చెప్పుమనిన విభీషణుఁ డిట్లనియె. ఈ సముద్రమును రామచంద్రమూర్తి పూర్వ వంశజులైన సగర కుమారులు త్రవ్విరి. వారి వలన నితనికి రూపము నామ మేర్పడెను. ఇతఁడు కృతజ్ఞుఁడు కావున రామచంద్రమూర్తి ప్రార్థించెనేని తగిన కార్య మితఁడు చేయును. ఇది ఫాల్గున శుద్ధ ద్వితీయనాఁటి చరిత్రము.

సీ. అనవుడు సుగ్రీవుఁ•డరిగి సీతేశున కవ్వార్త దెలుపఁగ • నాతఁ డలరి
కార్యదక్షుం డయ్యుఁ•గడఁక సమ్మాననా,ర్థంబు తమ్మునిఁ గపి•రాజుఁ బలుకు

మత్సమ్మతం బది • మర్కటపతికి నీ, కవిభీషణువాక్య • మాదరింపఁ
దగు నని తోఁచిన•దలపోసి చెప్పఁడు, మర్కటేంద్రుఁడు సూరి•మంత్రవిదుఁడ
తే. నీవు యోజింపుఁ డన రాఘ • వేంద్రు నకును
వార లనిరయ్య ! కాలార్హ • వాక్య మతఁడు
చెప్ప మా కేల యది యరు • చించు ? లంక
సేతువును గట్ట కే భంగిఁ • జేరఁ గలము ? ౪౦

అర్థములు. అలరి = సంతోషించి - కార్యదక్షుఁడు = పని నెరవేర్చుట యందు సమర్థుఁడు-దీనిచే సముద్రుని యాచింపకయే దాని దాఁట సామర్థ్యము గలవాఁడని సూచితము. సమ్మాననార్థంబు = వారిని గౌరవించుకొఱకు, అరిగి యనుటచే విభీషణుఁడు వానరులతో స్థలాంతరమున నుండె నని యేర్పడుచున్నది.

తాత్పర్యము

ఈ ప్రకారము విభీషణుఁడు చెప్పఁగా సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి యుండుచోటికిఁబోయి విభీషణుఁ డిట్లు చెప్పుచున్నాఁడని యతని యభిప్రాయము దెలిపెను. దానికి రామచంద్రమూర్తి సంతోషించి వారి యాలోచన లేకయే కార్యము నెఱవేర్ప సమర్థుఁడయ్యు పరత్వ ప్రకటనము లేకయే కార్యమగు నెడల పరత్వ ప్రకటన మేల చేయవలయు నని తలఁచి వారిని గౌరవింపఁగోరి విభీషణు విషయమై లక్ష్మణ సుగ్రీవు లేకాభిప్రాయము గలవారు కావున లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. సుగ్రీవుఁడు పండితుఁడు, నీ వాలోచనపరుఁడవు. (ఇది నొత్తి పొడుపు మాట యని తోఁచుచున్నది) కావున మీ రిరువురు నాలోచించి విభీషణు మాట గౌరవింపఁదగునని మీకుఁ దోఁచెనేని చెప్పఁడు. మీరు చెప్పినదియే నాకు సమ్మతము, అట్లులే చేసెదను. కావున మీరాలోచించి చెప్పవలసినదని చెప్పఁగా వారు సమయోచితముగ విభీషణుఁడు చెప్పెను కావున నది మాకేల సమ్మతము గాకపోవును. సేతువు కట్టక లంకఁ జేరలేముగదా.

క. ఆల మిఁకేలా సేనా, జాలముతో దాఁట నుపమ • సల్పు డనన్ సీ
తాలోలుఁడు వేదిపయిన్, జ్వాలవలెన్ వేగ దర్భ•శయమునఁ బండెన్. ౪౧

అర్థములు. ఆలము = ఉపేక్ష, ఉపమ = ఉపాయము, దర్భశయము = దర్భలపడుక. పడుకవలెఁ బఱచిన దర్భలమీఁద, జ్వాలవలె రామచంద్రమూర్తి యుండెనని చెప్పుటచే; మీరు చెప్పుచున్నా రని మీమాట ద్రోచివేయలేక చేయవలసిన కార్యమే, ఈ సముద్ర తరణము పరాక్రమముచే గాని సాధ్యపడదని యాలోచించి దైన్యము మాని తేజోవంతుఁడై యుండెనని సూచించుచున్నది. పండెననఁగా పండుకొనుటకు యత్నించె నని భావము.

తాత్పర్యము

ఇంక నేల నిష్కారణముగ నాలస్యము చేయవలె. సేనలతో సముద్రము

దాఁటు నాలోచన సేయుఁ డనఁగా రామచంద్రమూర్తి వేదియందలి యగ్నిహోత్రునివలె దర్భశయనంబునఁ బండుటకు యత్నించెను. పండుకొనుట రహిఁడవ పద్యంబునఁ జెప్పఁబడెను.

—• ౨౦-వ సర్గము. శార్దూలుఁడు రావణునితో శ్రీరాముఁడు కపులతో సముద్రము నొడ్డున దిగియుండువార్తఁ జెప్పుట. •—

సీ. అక్కడ శార్దూలుఁ • డను రావణాసురు, చారుండు సుగ్రీవ•సైన్యవిధము
సంతయుఁ బరికించి • యతిరయంబున నేగి, రావణుఁ గనుఁగొని•రాక్షసేంద్ర!
యిదిగో శాఖామృగ•ఋక్షవాహిని మన, పురముపై బడ వేగ•పొర్లి వచ్చె
నప్రమేయం బయి•యధికగంభీర మై, మాఱట జలధి యై • మహిమ నెసఁగెఁ
తే. బం క్తిరథపుత్రులిరువురు•భ్రాతలుత్త, మాయుధులు రామలక్ష్మణా•హ్వయులు
జేరఁ జనుదెంచి నిలిచిరి • సింధుతటిని, ప్రబలదశయోజనావృత • [సీతఁ
బలముతోఁడ.

అర్థములు. చారుఁడు = వేగులవాఁడు, అప్రమేయము = ప్రమాణము చెప్పరానిది, గంభీరము=దురవగాహము (సేన) లోతుఁ (సముద్రము) మాఱట జలధి=రెండవ సముద్రము, ప్రబల = బలిష్ఠమైన, దశయోజనావృత = పదియోజనముల నేల యావరించినంత. బలముతో=సేనతో, ఇది వేంకటగిరిరాజ కుమారుల లెక్కవంటిది, రూపాయకు డబ్బు లెన్నియనిన రెండుచేతులు జోడించి యిన్ని యని చూపుదురు.

తాత్పర్యము

రావణుఁడు నియమించిన శార్దూలుఁడను వేగులవాఁడు సుగ్రీవుని సేన యున్నవిధము నంతయుఁజూచి మిగుల వేగముగఁబోయి రావణుని జూచి రాక్షసరాజా! వానరులయు, ఎలుఁగులయు సేన మన పట్టణముమీఁదఁ బడుటకు నిదిగోఁ బొర్లివచ్చెను. ఆసేన పరిమాణ మింత యని చెప్పలేను. మిగుల గంభీరమై రెండవ సముద్రమువలె నున్నది. పదియోజనముల నేల యాక్రమించి యున్నది. దశరథకుమారు లిరువురు నన్నదమ్ములు రామలక్ష్మణు లనువారు శ్రేష్ఠములైన యాయుధములు ధరించి సీతాదేవియొద్దకు వచ్చుటకై సమీపమందే సముద్రతీరమున నున్నవారు.

ఉ. వైశస దేవరా! తగిన•వారిని దూతల నంపు సర్వముం
బోలఁగ మూలముట్టెఱుఁగఁ • బుచ్చుము వేగమ, నాకుఁ జూడ నీ
వేళను సామదానములో•భేదమొ యర్హవిధం బటన్న శా
ర్దూలునివాక్యముల్ విని ని•రూపిత కార్యవిదుండు వ్యగ్రుఁడై. ౪౦౯

అర్థములు. వైశస=వేగమే, దేవరా=ప్రభూ, దేవశబ్దభవము, నిరూపిత కార్యవిదుండు=చేయవలసిన కార్యమును చక్కఁగ నిరూపింపఁ దెలిసినవాఁడు, వ్యగ్రుఁడు=హెచ్చరిక గలవాఁడు.

తాత్పర్యము

ప్రభూ! వారి సమాచారము సర్వము తెలిసికొనుటకై త్వరగా వారు వచ్చి యూరిపై పడకముందే దూతలను బంపుము. నా యభిప్రాయ మీ సమయమున సామమో దానమో భేదమో తగియున్నది. (దండోపాయము వ్యర్థమని భావము) అని చెప్పఁగా శార్దూలుని మాటలు విని యా తరువాత నెట్లు కార్యము చేయవలసినది తెలిసిన రావణుఁడు హెచ్చరిక గలవాఁడై.

వానరులు సముద్రతీరము చేరిన వెంటనే యా శార్దూలుఁడుపోయి రావణునకుఁ దెలిపెను. ఈ కారణముచేతనే మఱునటినాఁటి యుదయమున రావణుఁడు సభ చేసి విభీషణు వెడలఁ గొట్టెను.

—♦ రావణుఁడు శుకుని సుగ్రీవునొద్దకు రాయబార మంపుట ♦—

క. శుకనామకు నర్థవిధు, న్నికటమునకుఁ బిలిచి యసురు ♦ నీ వరిగి వెసన్
 వికలుఁడవుగాక మద్వా,చికముగ సుగ్రీవుతో వ♦చింపుము సూక్తిన్. ౮౧౦

అర్థములు. శుకనామకున్ = శుకుఁడను పేరుగలవానిని - అర్థవిదున్ = చేయవలసిన పని తెలిసినవానిని - నికటమునకు = సమీపమునకు - రహస్యముగఁ జెప్పుటకై - వికలుఁడవు = భయముచే గుండె చెదరినవాఁడవు - మద్వాచికముగన్ నేను జెప్పినట్లు నామాటగ - మారీచుఁడు జింకవలె నగునట్లు వీఁడు చిలుక వలె రూపము ధరింప నేర్చినవాఁడు.

తాత్పర్యము

చేయవలసిన కార్యము విధానము తెలిసినవాఁడునగు శుకుఁడను పేరు గలవానిని రహస్యముగఁ జెప్పుటకై దగ్గఱకుఁ బిలిచి నీవు త్వరగాఁ బోయి సుగ్రీవాదులజూచి భయపడక నేను జెప్పినా నని సుగ్రీవుతో నీ మాట చెప్పుము.

ఉ. ఈవు మహాబలాఢ్యుఁడవు ♦ ఋక్షరజస్తనయుండవున్ మహా
 త్మ్మావరవంశజాతుఁడవు ♦ కాఁగల లాభ మదెద్ది నీకు నీ
 తావిభుతోడి చెల్మిఁ? గల♦దా యొకనష్టము వీడిపోవ? సు
 గ్రీవ! మదీయభ్రాతవు స్మ ♦ రింపుము పూర్వపునెయ్య మియ్యెడన్. ౮౧౧

అర్థములు. ఈవు = నీవు అనుటకు మొదటి రూపము, మహాత్మ్మావర = గొప్పరాజుల, వంశజాతుఁడవు = వంశమునఁ బుట్టినవాఁడవు. నీవు సూర్యపుత్రుఁడ వగుట గొప్ప వంశము వాఁడవు.

తాత్పర్యము

సుగ్రీవా! నీవు మహాబల సంపత్తి గలవాఁడవు కావున నల్పబలుఁడగు రాముని వలన నీకుఁ గావలసిన కార్యము లేదు. ఋక్షరజస్సుకుమారుఁడవు. కావున గొప్ప రాజవంశమునఁ బుట్టినవాఁడవు. కావున నిష్కారణ కలహము నీకు ధర్మము

కాదు. అదియునుగాక నీవు బ్రహ్మ మనుమఁడవు, నేను బ్రహ్మ మనుమఁడను కావున మనకు బంధుత్వమును గలదని భావము. కావున నల్పుఁడైన రామునితో నీకేమిపని? రామునితో స్నేహము చేయుటచే నీకు రాఁగల లాభము లేదు. వదలి పోయిన నీకుఁగలుగు నష్టియు లేదు. ఇఁక మన విషయ మాలోచించిన నీవు నాకు సోదరుఁడవు. పూర్వపు మనస్నేహము తలఁపుము(వాలినిబట్టి యీ సంబంధము.)

క. రాముఁ డను రాజపుత్రుని, భామిని నే నపహరింపఁ ♦ బ్రాజ్ఞవరా! నీ
కేమగు నష్టము? సుగ్రీవా! మరలుము నీదు పురికిఁ ♦ బగ మన కేలా? ౪౧౨

అర్థములు. ప్రాజ్ఞవరా=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

రాముఁడను రాచవాని భార్యను నే నపహరించిన నీకుఁ గలిగిన నష్టమేమి. రాముఁడు నీ జాతివాఁడును గాఁడుగదా, వానికి నీకు నెట్టి సంబంధము లేదుగదా? బుద్ధిమంతుఁడవు, దీని నాలోచించి నీ యూరికి నీవు పొమ్ము. మిత్రులుగను భ్రాతల వలె నింతవఱకున్న మనకు నిష్కారణ విరోధమేల ?

క. వానరవరు లెవ్వైయినే, నీ నగరముఁ జేరలేరు ♦ దృఢ మిది గంధ
ర్వానీకము నేరద నర, వానరులా వచ్చువారు ♦ వనచరనాథా ? ౪౧౩

తాత్పర్యము

నీవు పోకపోయితివిపో, ఏ విధముగ యత్నించినను వానరులు సముద్రము దాటి యచ్చటికిరాఁజాలరు ఇది నిశ్చయము. ఆకాశమున నెగిరివచ్చు గంధర్వులే రాఁజాలనప్పుడు క్రోఁతు లెట్లు రాఁగలవు. ఇదియు నీ వాలోచింపుము.

చ. అను విభు నానతిం గొని వి♦హంగమ మై శుకుఁ డంబరంబునన్
జని చని ఖస్థితుం డగుచు ♦ సారసబాంధవసూనుతోడ న
ద్దనుజకులేంద్రువాక్యము యథా♦క్రమ మంతయుఁ జెప్పఁ, గిన్కఁ జి
వ్వన వినువీధికి న్నెగసి♦పోయి కపుల్ శుకు నేలఁ దాఁచుచున్. ౪౧౪

అర్థములు. ఆనతి=ఆజ్ఞ, విహంగమమై=పక్షివలెనై, అంబరంబునన్ = ఆకాశమార్గమున, ఖస్థితుండు = ఆకాశమందున్నవాఁడు, సారసబాంధవసూను తోడన్ = సూర్యపుత్రుఁడగు సుగ్రీవునితో, యథాక్రమము=క్రమముదప్పక, రావణుఁడు చెప్పిన వరుసన, కిన్కన్=కోపముతో, వినువీధికిన్ = ఆకాశమార్గమునకు, తాఁచుచున్=కొట్టుచు.

తాత్పర్యము

ఈ ప్రకారముచెప్పు రాజు నాజ్ఞ గ్రహించి యీ రాక్షసుఁడు చిలుకవలెనై యాకాశ మార్గమునబోయి నేల దిగక యందే యుండి సుగ్రీవునితో రావణుఁడు చెప్పినమాటలు క్రమము దప్పక చెప్పఁగా నామాటలు విని వానరులు కోపించి చివాలున నాకాశమున కెగసిపోయి వానిని బట్టుకొని విసరి నేలపైఁ గొట్టి.

—♦ వానరులు శుకుని మర్దించుట ♦—

క. పిడికిళ్ళ నొకరి నొక్కరు, కడవఁగ మర్దించుటయును ♦ గలవరపడుచున్
మడియింప రాదు దూతలఁ, గడుపడి వారింపు కపులఁ♦గాకుత్స్థవరా! ౮౧౫

అర్థములు. కడవఁగన్ = అతిక్రమించి, ఒకరిని మించి మఱియొకరు, కడువడిన్ = మిగుల వేగముగ.

తాత్పర్యము

నేలఁ బడవైచి యొక క్రోఁతిని మించి మఱియొక క్రోఁతి పిడికిళ్ళతోఁ బొక్కఁగ మర్దింపఁగా వాఁడు కలవరపడి దిక్కు తెలియక యేమి చేయుటకుఁ దోఁపక రామచంద్రా నేను దూతను, దూతలఁ జంపరాదు, వీరు నన్నుఁ జంపుటకు ముందే వీరిని నివారింపుము.

చం. పతి విధియించు మార్గమునఁ ♦ బల్కక యాత్మమతంబుఁ జాటుచుం
బతినుడులన్ వచింపని కు ♦ మార్గపుదూతలు వధ్యు లంద్రు, నేఁ
బతి వధియించినట్టి విధిఁ ♦ బల్కితి, దోసమె రామ! యన్న నా
దృతి నలదూత చేయు పరి♦దేవనమున్ విని రామభద్రుఁడున్. ౮౧౬

అర్థములు. ఆత్మమతంబు = తన యభిప్రాయము, చాటుచున్ = ప్రకటించుచు, పతినుడులన్ = ప్రభువుచెప్పిన మాటలను, కుమార్గపుదూతలు = వక్రమార్గమునఁబోవు దూతలు, వధ్యులు = చంపఁబడఁదగినవారు, ఆదృతిన్ = ఆదరముతో, పరిదేవనము = ఏడ్పు మొఱ.

తాత్పర్యము

ప్రభువు చెప్పినట్లు చెప్పక తన యిష్టప్రకారము చెప్పుచు నతనిమాటలు చెప్పని దుష్టదూతలు కదా చంపఁబడ నర్హులు, నేను నా ప్రభువుచెప్పిన మాటలఁ జెప్పితిని. ఇది దోషమా యనఁగా రామచంద్రమూర్తి యా దూత మొఱ విని యాదరముతో.

కం. వానిని జంపఁగవల దన, వానరు లవ్వాని గఱులు ♦ పాచి విడిచినన్
దీనత మింటికిఁ జని యా, వానరవిభుతోడ ననియె ♦ వదలని భీతిన్. ౮౧౭

గఱులు పాచి = ఱెక్కలు పెఱికి.

తాత్పర్యము

వానిని జంపవల దని చెప్పఁగా వాని ఱెక్కలూడఁ బెఱికి వదలిపెట్టఁగా వాఁడాకాశమునకుఁ బోయి భయపడుచు సుగ్రీవుతోడ నిట్లనియె.

కం. శ్రీమతి బలసంపన్నా! భీమపరాక్రమ! కపీంద్ర! ♦ వీటికిఁ జని నే
నేమని వచింతు నయ్యా, నీమాటగ స్వామి! యామి♦నీచరపతితోన్. ౮౧౮

అర్థములు. శ్రీమతి బలసంపన్నా = ఐశ్వర్యము బుద్ధి బలముగలవాఁడా!

భీమపరాక్రమ = భయంకరమైన శౌర్యముగలవాఁడా! వీటికిన్ = లంకాపురము నకు, యామినీచరపతితోన్ = రాక్షసరాజుతో.

తా త్ప ర్య ము

ఐశ్వర్యము బుద్ధిబలము విశేషముగఁ గలవాఁడా-భయంకరమైన పరాక్ర మముగలవాఁడా! వానరరాజా! నేను లంకకుఁబోఁగానే రాక్షసరాజు సుగ్రీవుఁ డేమి చెప్పెనని యడుగునే? నీ మాటగ నే నేమి చెప్పుదును?

—♦ సుగ్రీవుఁడు రావణునకుఁ బ్రత్యుత్తర మంపుట ♦—

ఉ. నావుడు దూతఁ జూచి కపి ♦ నాయకుఁ డి ట్లను నోరి చారుఁడా
యీ విధిఁ బల్కు- రావణున ♦ కీ వెటుచూచిన నాకు మిత్రుఁడున్
గావు, ప్రియుండ వేనియును ♦ గా, వుపకర్తవు గావు, గావునన్
నీవు పలాశినాథ! దయ ♦ నీయుఁడ వైనను గావు నమ్ముమీ. ౩౧౯

అర్థములు. దూతన్ = దూత నని చెప్పుకొనుచున్నవానిని, చారుఁడా= వేగులవాఁడా, ఇట్లు చెప్పుటచే వీఁడు దూతనని చెప్పుకొన్నను వీఁడు దూతగా వచ్చినవాఁడు కాఁడు, దూత ననుపేరితో మర్మము లెఱిఁగిపోవుటకై వచ్చిన వేఁగు వాఁడని భావము. వాస్తవదూత యగునేని దూరమునుండి నేన నంతేయు దొంగ చూపులఁ జూడఁబనిలేదు. చక్కఁగా సుగ్రీవు నొద్దకువచ్చి నేను దూతనువచ్చితి నని చెప్పి ప్రత్యుత్తరము తీసికొనిపోయి యుండవలెను. వీఁ డట్లు చేయకపోవు టచే వేగులవాఁడని తలఁపఁబడెను. ఈ విధిన్ = ఈ ప్రకారము, ఎటుచూచినన్ = ఏ విధముగ నాలోచించినను, ఉపకర్తవు = ఉపకారము చేసినవాఁడవు, పలాశి నాథ=రాక్షసరాజా, దయనీయుఁడవు=దయదలఁపవలసిన వాఁడవు.

తా త్ప ర్య ము

అని వాఁడు చెప్పఁగా సుగ్రీవుఁ డా దూతను జూచి యిట్లనియె. ఓరీ! నీవు చారుఁడవేకాని దూతవుగావు. అయినను నీవు దూతనని ప్రత్యుత్తర మిమ్మని కోరుచున్నావు. కావున రావణునితో నిట్లు చెప్పుము. నే నెన్నివిధముల నాలోచించి నను నీవు నాకు మిత్రుఁడవుగావు. ఏలన నిదివఱకు నాయందు నీకుఁగాని నీయందు నాకుఁగాని స్నేహభావములేదు. ఉపకారముచేసిన వాఁడుకదా మిత్రుఁడు. నీవు నాకుఁజేసిన యుపకారమేదియులేదు. ప్రియుండవుకావు, ఉపకారముచేసినవాఁడవు కావు, ఈ కారణములచే రాక్షసనాథా! నీవు దయతలఁపబడవలసిన వాఁడవుకావు.

రామచంద్రమూర్తి నా యందు స్నేహభావము గలవాఁడు, అగ్నిసాక్షిక ముగా మైత్రి చేసినవాఁడు, నా మేలుకోరువాఁడు, వాలినిఁజంపి నాకుపకారముచేసిన వాఁడు, కావున ఆయనయందు నేను దయ తలఁపవలయునుగాని యెట్టి సంబంధము లేని నీ విషయమున నెట్లు దయ తలఁపఁగలను.

కం. రామునకు నీవు వైరివి, రామునకును నేను హితుఁడ ◆ రాక్షసరాజా !
రామునిచే నీవును సం,గ్రామంబున వాలిఁ బోలఁ◆గలవో వధ్యా ౩.౨౦

అర్థములు. వధ్యా = వధకర్హుఁడైనవాఁడా.

తాత్పర్యము

రామచంద్రమూర్తికి నీవు పగవాఁడవు, రామచంద్రమూర్తికి నేను మేలు గోరువాఁడను కావున నీవు నాకును బగవాఁడవే. వాలివరుసనుబట్టి నీవు నాకు భ్రాతవంటివి. వాలి నాకుఁ బగవాఁడు కావునఁ జంపించితిని. నిన్ను నట్లే చంపించెదను.

చం. వదలక నిన్ను జ్ఞాతిహిత ◆ బాంధవపుత్రసమూహయుక్తుగాఁ
గదనములో వధించెద, ని ◆ కారము గా దిది లంక సర్వముం
బద డోనరించెదన్ నిమిష ◆ మాత్రమునన్ హరిసేనఁ బంచి, నీ
యుదుటిలఁ జెల్ల దింకఁ, జెడు ◆ గొప్పనె యెందు నిశాచరేశ్వరా ! ౮.౨౧

అర్థములు. కదనములో=యుద్ధమందు, నికారము=మోసము, పదదు= శ్మశానము, ఉదుటు=గర్వము.

తాత్పర్యము

నిన్ను నీ జ్ఞాతులతోఁ హితులతోఁ జుట్టములతోఁ గొడుకులతో నొకనినైన వదలక యందఱితో యుద్ధమునఁ జంపెదను. ఇది మోసపుమాటగాదు సత్యము. వానరసేనను బంపి నిమిషములో నీ లంక శ్మశానము చేసెదను. నీ గర్వ మింకఁ బనికిరాదు. మదత్త్వము కలకాలము చెల్లునా? నీవు రాక్షసులకు రాజగుటచే నీ దోషమున నీవే కాక వారందఱు చావఁగలరు. వానరులు లంకకు రాలేరనుట కిది సమాధానము.

శా. పాతాళంబున దాఁగినన్ సురపతిం ◆ బ్రార్థించి తోడ్తెచ్చినన్
ద్యోతస్ఫీతు పథంబులో మఱఁగినన్ ◆ దుర్మార్గశీలా ! యథా
జాతా! రావణ! నిన్నుఁ బ్రాణములతో ◆ సంగ్రామరంగంబునన్
సీతానేత విడఁడు, నేలకు బలిన్ ◆ నీ కంఠముల్ గూర్చికిన్. ౮.౨౨

అర్థములు. ద్యోతస్ఫీతు=సూర్యునియొక్క, 'ప్రకాశోద్యోత ఆతప' యని యమరము-ఎండచే నతిశయించినవాఁడు, సూర్యుఁడు-ఆయనపథము ఆకాశము, మఱఁగినన్ = దాఁగుకొన్నను, యథాజాతా = మూఢుఁడా, సీతానేత=రామచంద్రమూర్తి, రాముని భార్యను నేఁదెచ్చిన నీ కేమి నష్టియంటివి. ఆ రాముఁడే నా సాహాయ్యమున్నను లేకున్నను నిన్నుఁ జంపఁగలఁడని భావము.

తాత్పర్యము

నేను లంకలోనుండినఁగదా మీరు లంకపై వచ్చెదరు. నేను దేశాంతరము పోయిన నన్నేమి చేయఁగలరందువేమో? దుష్టుఁడా! నీవు పాతాళములో దాఁగుకొన్నను ఆకాశములో దాఁగుకొన్నను ఇంద్రుని బ్రార్థించి తోడి తెచ్చినను నీవేమి

చేసినను మూఢుఁడా! రావణా! సీతాపతి యుద్ధమందు నీ తలలను నేలకు బలి పెట్టక మానఁడు.

కం. సీతాపతి కినిసిన యా, పాతకి రక్షించువాని ♦ బ్రహ్మాండములో
దైతేయపిశాచామర, జాతంబుల నే నెఱుంగ ♦ క్షణదాటవరా. ర ౨౩

అర్థములు. క్షణదాటవరా=రాక్షసశ్రేష్ఠుఁడా – కినిసినన్ = కోపించిన, పాతకి=పాపి; జాతంబులన్=సమూహములందు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యెవనిపైఁ గోపించునో యట్టి పాపాత్ముని రక్షింపఁ గలవాఁడు బ్రహ్మాండములోపల రాక్షస పిశాచ దేవతల సమూహములందు రాక్షసుఁడా! నే నెఱిఁగినవాఁడు లేఁడు, కావున నీ చావు సిద్ధము.

కం. బడుగును ముదుకని దుర్బలుఁ, బొడిచితివి జటాయు నంతఁ ♦ బోటు మిగిలెనే
చెడుతనమె కాక నీయెడఁ, బొడగానఁగఁ గలదె బీర♦ము నుబలలాశీ. ర ౨౪

అర్థములు. బడుగున్=అశక్తుని, ముదుకని=ముసలివానిని, దుర్బలున్ = ఆ కారణమున బలములేనివానిని, పొడిచితివి=చంపితివి, పోటుమిగిలెనే=శూరుఁడవైతివా, బీరము=వీర్యము, పలలాశీ=మాంసభక్షకుఁడా.

తాత్పర్యము

రామచంద్రమూర్తికి సహాయుఁడుగా వచ్చిన జటాయువుగతియే నీకు వచ్చునందువా? అశక్తుఁడు ముసలివాఁడు బలహీనుఁడు నొంటరివాఁడు నగు జటాయువును జంపినంతమాత్రముననే నీవు శూరుఁడవైతివా? నీయందు దుర్మార్గము కానవచ్చుచున్నదిగాని వీర్యమేదీ లేదుగదా.

చం. అవనివిభుండు చూచునెడ ♦ నా మఱి లక్ష్మణు ప్రోలనైన నా
యవనిజ నీ హరించుట? క♦టా తలపోయఁగ లేవ యట్టి నీ
యవగడపుం బనిం గలుగు♦హాని, మహాత్ము మహాబలున్ శచీ
ధవముఖదుర్జయున్ రఘువ♦తంసము నేమిగ నెంచినాఁడవో. ర ౨౫

అర్థములు. అవగడపుంబనిన్ = చెడుకార్యము–శచీధవముఖదుర్జయున్= ఇంద్రాదులకును జయింపరాని వానిని– రఘువతంసము = రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని.

తాత్పర్యము

తనభార్యను హరించినపుడు నన్నేమి చేయలేని రాముఁడు నేఁ డేమి చేయఁ గలఁడందువా? నీవు బల పౌరుషములు గలుగువాఁడవైతివేని నీవు సీతను దెచ్చిన దెపుడు? రామచంద్రమూర్తి చూచుచుండఁగా దెచ్చితివా? ఆయన గాకున్న నాయన తమ్ముఁడు లక్ష్మణుఁడైన నెదుట నుండఁగా దెచ్చితివా? వారు చూచినఁ జంపుదురనిభయపడిదొంగతనముగాఁగదా తెచ్చితివి. ఇట్టియకార్యము చేతఁగలుగు

హాని యెట్టిదో యాలోచించితివా? గొప్ప ధైర్యము గొప్పబలము గలవాఁడును నింద్రాదులకు జయింపరాని వాఁడును, రఘువంశపు రాజులలో శ్రేష్ఠుఁడును నగు రామచంద్రమూర్తి సామాన్యుఁడని తలఁచితివా? రెండవపాదంబునఁ బ్లుతయతి.

కం. నీ పాలిటి కాలునిఁగా, క్ష్మాపాలకుఁ దలఁపు మనిన ♦ సత్వరుఁడై తా
రాపుత్రుఁడు కపిపతిపైఁ, జూపుంచి వచించె శుకునిఁ ♦ జూపుచు మింటన్.

అర్థములు. కాలునిఁగా = యమునిఁగా - క్ష్మాపాలుకున్ = రామచంద్ర భూపాలుని - సత్వరుఁడై = త్వరతోఁ గూడినవాఁడై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నీ పాలిటి మృత్యువుగాఁదలంపు మని చెప్పుచుండ నా మాటలు విని వాఁడు మరలిపోవునేమో యని యంగదుఁడు త్వరపడి సుగ్రీవునిఁ జూచి యాకాశంబున నున్న శుకుని జూపించి యిట్లనెను.

కం. చారుండు గాని ప్లవగమ,హారాజా! రాయబారి ♦ యనరా దితనిన్
జోరవిలోకనములఁ బల, మారయు చున్నాఁడు తూఁచి♦నటు లుండి యటన్.

తాత్పర్యము

వానరరాజేంద్రా! వీఁడు రాజకార్యముమీఁద దూతయై వచ్చినవాఁడు కాఁడు. నీతోఁబనియుంకి వచ్చినవాఁడు నిన్నుఁజూచి మాటలాడవలెను. అట్లు చేయక వీఁడు సేనయంతయు గానవచ్చుచోట నాకాశమున సరిగానుండి దొంగ చూపులచే సేనసంతయు లెక్కించుచున్నాఁడు. కావున వీఁడు వేగులవాఁడే కాని దూతగాఁడు. దూతను జంపరాదు గాని వేగుల వానిని జంపవచ్చునుగదా.

కం. పోనీయరాదు లంకకు, వీని ననన్ రాజునాజ్ఞ ♦ భృత్యాటులు న
వ్వానిని గట్టియుఁ గొట్ట ము,హానిష్ఠురవృత్తిఁ బఱప♦ననదయుఁ బోలెన్. ౩౨

తాత్పర్యము

వీనిని మరల లంకకుఁ బోనీయరాదని యంగదుఁడు చెప్పఁగానే సుగ్రీవు నాజ్ఞ ప్రకారము వానరులు వానిని బట్టుకొని కట్టి దయలేక కొట్టి బాధపెట్టఁగా దిక్కులేని వానివలె.

కం దేవుళ్ళఁ బడుచు వికటా,రావంబున మొఱలు వెట్టి ♦ రామా! రామా!
నీవేగతి, చంపిరయా, యీ వానరవరులు కావ♦వే ననుఁ గరుణన్. ౩౩

అర్థములు. దేవుళ్ళఁబడుచు=దీనత్వము పడుచు, ఇది దేవురు శబ్దబహు వచనము' 'ఈవఱకను గనుఁగొఁతల దేవుళ్ళంబడితి. పం. తం. వేం. వికటారావంబు నన్=పెద్దధ్వనితో, రామునకు వినవచ్చునట్లు, నాలుగవపాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

దీనుఁడై పెద్దగొంతుతో రామా! రామా! నీవేగతి. రామా! వీరు నన్నుఁ దేరకుఁ జంపుచున్నారయా! దయయుంచి కావుము అని మొఱపెట్టెను.

చ. పెఱికిరి కంటిగ్రుడ్లు పృథి•వీవరసత్తమ! నాదు రెక్కలన్
నఱికిరి, యీ మహార్తి నిధ•నంబును గంటినయేని చెప్పెదన్
దలచుగ నాదుపుట్టువు మొ•దలుకొని రేపగ లింతదాక నేఁ
గఱకునఁ జేసినట్టి కొఱ•గాములపాపము నిన్నుముట్టెడిన్. ౪౩౦

అర్థములు. వానరులు చేసినపనులు చెప్పుచున్నాఁడు. నిధనంబును = మరణమును, రేపగలు = రే+పగలు సమాహార ద్వంద్వము కావున, ఏకవచనము కఱకున=కఠిన బుద్ధిచే, కొఱఁగాముల=పాపకార్యముల.

తాత్పర్యము

అయ్యో! రామచంద్రా! నా కంటిగ్రుడ్లు పెఱికిరయ్యా! నా రెక్కలు నఱకిరి. ఈ బాధచే నేను జచ్చితినా, ఫలము చెప్పెదను విను నేను బుట్టినది మొదలు కఠినచిత్తుఁడనై యెన్నియో చేయరాని పనులు రాత్రి యని లేక పగలని లేక యెల్ల వేళల చేసినవాఁడను. ఆ పాప మంతయు నిన్నంటును.

ఉత్సాహము. ఆ విలాప మాలకించి • యంబుజాక్షుఁ డాతనిన్
గావుఁ డతఁడు దూతగాన • ఘాత మర్హ మౌనె? నా
నా వనాటు లతనిఁ జంప • రైరి; యంత భూమిక
న్యావిభుండు జలధివేల•యందు దర్భశయనుఁ డై. ౪౩౧

అర్థములు. విలాపము=ఏడుపు, ఘాతము=చంపుట, వనాటులు = వానరులు, దర్భదయనుఁడై = దర్భలయందుఁ బండుకొనఁదలఁచి కూర్చుండినవాఁడై, ఇంతవఱకుఁ బండుకొనలేదు. పండుకొని యుండిన మౌనవ్రతమునకు హాని, కావున మాటలాడి యుండఁడు. చూ. ప. ౪౩౬.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యీ యేడుపు విని వాఁడు దూతగావున వానిని జంపరాదు రక్షింపుఁ డని చెప్పఁగా వానరు లతనిఁ జంపరైరిగాని పట్టికట్టి చెఱయం దుంచిరి గాని విడిచినవారుగారు. సేతువు కట్టి వానరులు దాఁటి యావలియొడ్డు చేరిన పిమ్మట వదలిరి. (చూ. ప. ౯౦౬) అంత రామచంద్రమూర్తి సముద్రపుటొడ్డున దర్భశయనమందున్నవాఁడై.

ఈ శుకుని చరిత్రము విభీషణుఁడు రామునొద్దఁ జేరిన పిమ్మట జరిగినదనియే తోఁచుచున్నది.

—• ౨౧-వ సర్గము. శ్రీరాముఁడు దర్భశయనంబునఁ బరుండుట. •—

సీ. మునుహారంగు లెసంగ•నురరంగుజాళువా, బంగారుతొడగుల•వఱలుదానిఁ
గాంచనకేయూర•కమ్రముక్తావర, భూషణాంచిత మయి • పొలుచుదానిఁ
బరమనారీజన•కరములచేఁ బెక్కు, బకులను వల్గిడఁ•బడినదానిఁ
జందనాగరుపూత•సౌరభోపేతమై, రక్తచందనమునఁ • గ్రాలుదాని

తే. శయనతలమున జానకీ • చంద్రవదన, యుత్తమాంగంబుచే శోభ • నొందుదాని
గాంగజలములఁ దక్షకు • కాయమునకుఁ, దుల్యమగుదానిదీనార్తిఁ • దొలఁచుదాని.

అర్థములు. మును=(౧)అయోధ్యలోనున్నప్పుడు,(౨)రామావతారపూర్వమున వైకుంఠమునను న్నప్పుడు, హారంగులు=సింగారములు, నునురంగు=నునుపైన రంగుకల, జాళువా=అపరంజి, తొడగులు=సొమ్ములు, ఇది మొదలు మూఁడు పద్యములు రామభుజవర్ణనము, కాన నిందలి ద్వితీయాంతము లన్నియు రామభుజవిశేషణములు, కేయూరము=బాహుపురి, పరమనారీజనకరములచేన్=గొప్పవంశమున జనించిన స్త్రీల చేతులచేత, పెక్కుబడులు = పెక్కుతడవలు, ఇచ్చట నలుగుపెట్టి యలంకరించినట్లు చెప్పియున్న వీరలు రాముని సైరంధ్రీపరిచారికలు, సైరంధ్రులు= వీరుత్తమజాతిస్త్రీలు, కం. ఆరయ నెంతయు గౌరవ, భారం బెడలంగనీక పాతివ్రత్యా, చారము పై వర్తింతురు, సైరంధ్రీజాతివారు, సౌజన్యమునన్. కం. కావున నుచితము లగు నా, కావెంటన్ గొలిచి తిరుగునప్పుడు మితభా, షావిరచనమును వ్రతసం, భావనము గౌరవంబు పాపభయంబున్, భార. విరా. ౧. ౧౧౧-౧౧౨. ఇవి ద్రౌపదీ వాక్యములు. ఈ జాతివారు ఎంగిళ్ళు దివరు కుచ్చితపుఁబనులు సేయరు. ఇట్టివారు పరమనారు లని చెప్పఁబడిరి. పరమనారీశబ్దము భార్యార్థమున యోగముగాను, రూఢిగాదు, యోగరూఢికాదు. పతివియోగకాలంబున దమయంతియు నిట్టి వ్రతమవలంబించి యుండెను. పూర్వము రాజులకు స్త్రీలే యలంకారాదులను జేయువాడుక, కాఁబట్టియే యయోధ్యాకాండమునందును "హాయి నలంది గంధము మహోర్ముల చేడెలు వీచుచుండ" నని స్త్రీ పరిచారిక లున్నట్లు చెప్పఁబడెను. కాదంబరియందును జంద్రాపీడునికి నొక యంతరంగ పరిచారిక యున్నట్లు చెప్పఁబడినది. కొందఱు-ఇట్టి సందర్భములనుబట్టి రామునికనేక భార్యలుండి రని చెప్పుదురు. వీరికి సాధకము లైనవి యీ రామాయణముననే కలవనియుఁ జెప్పుదురు. ఈ పద్యములు వీరి యభిప్రాయము నెంతమాత్రము సాధింపనేరవు. కాన వీరి యభిప్రాయ మెంతయుఁ దప్పు. అదెట్లనఁగా సంక్షేప రామాయణమందు 'రామస్య దయితా భార్యా-రాముని యిల్లాలు.—నాథునకు సతము ప్రాణతుల్య" యని చెప్పఁబడెను. ఇందు రాముని భార్యకు ప్రాణతుల్య యని విశేషముండుటచేతఁ బ్రాణతుల్యలు కాని కొందఱు భార్యలును రామునికుందు రనియు వారందఱికంటెను సీమెయే ప్రియురాలనియుఁ దెలియవచ్చుచున్నది. ఇంతియకాక యీ ప్రకరణముననే పై పద్యమునందు 'శశి రోహిణిరీతి న్వెన్నంటి చనె' నని చెప్పఁబడెను, చంద్రునకుఁగల నక్షత్రరూపలైన యనేక భార్యలలో నొక్కతయై చంద్రున కత్యంత ప్రియురాలైన రోహిణిని సీతకు దృష్టాంతముగాఁ జెప్పియుండుట చేతను, చంద్రునికి వలె రామునికిఁ బెక్కండ్రు భార్యలు కలరనియు వారిలో సీత ప్రియయుఁ దక్కినవా రప్రియు లనియుఁ దోఁచుచున్న

దని పూర్వపక్షుల యభిప్రాయము. ఇది సరికాదు. ఈ పద్యమునందే "అన్నకుఁ బ్రీతిపాత్రుండు...లక్ష్మణుఁడు" అని యున్నది. దీనినిబట్టి రాముని కొక్క లక్ష్మణునియందే ప్రీతి, తక్కినవారియందు నంతప్రీతి లేదు. కాన రామునికిఁ బ్రీతిపాత్రులైన తమ్ములు కొందఱును ప్రీతిపాత్రులుకాని తమ్ములు కొందఱును గలరని చెప్ప వచ్చునా? ఇట్లు చెప్పుట సాహసముకదా. "రాఘవ వంశనాథు తత్తనయు చరిత్ర చెప్పుము ముదంబగు (అయోధ్య ౨౭౫ప) అనియు 'భ్రాతలందఱు భరతునిపాటి గారు. అను రామాయణవాక్యములు యిపుడు విరోధింపవా? కాఁబట్టి యాపదము లకుఁ దాత్పర్యము మీరు చెప్పినట్లుకాదు. మిక్కిలి గారాబముగా పెరుఁగుటచేతను సౌకుమార్యమునుబట్టి రాజమందిరములలోనే యుండఁదగిన యీ సీతా లక్ష్మణు లునుగూడ రాముని వెంబడి యరణ్యమునకుఁ బోయిరికదా యని కవి తాత్పర్యము. సీతకు దృష్టాంతముగాఁ జెప్పిన రోహిణి చంద్రునికిఁ బ్రియభార్యగాఁ బ్రసిద్ధురాలై నక్షత్రరూపమైయున్న రోహిణికాదు, ఈమె విడువక సదా చంద్రు ననుసరించుట లేదు. భర్తను విడనాడక సదా వెంబడించు సీతకు నిట్టి రోహిణీ దృష్టాంతము సరిపడదు, కాన సదా భర్త ననుసరించెడి మఱొక రోహిణియే యిట వివక్షిత. ఈమె దక్షుని కూఁతురుగాదు. రుద్రసర్గములోఁ జేరినది. (చూడు.వి.పు.౧౮-౭) కాఁబట్టి యీ దృష్టాంతమునుబట్టి రామునికి కొందఱు భార్యలు ప్రియలుగా నున్నా రనుట యెట్లు యుక్తము? "హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే" "సంతసమున రామ స్త్రీసంతతి త్రుళ్ళంగ భరతుక్షయమున మదిలోసంతాపింతురు. నీస్నుషలెంతో చింతింపు దీని కెయ్యది తెరువో" అని అయోధ్యాకాండమునందు మంథర కైకేయితోఁ జెప్పినట్లున్నది. ఇందు నీ స్నుష లనుటచేత భరతున కనేక భార్యలు కలరనియు దీని సాహచర్యమునుబట్టి రామ స్త్రీసంతతి యనఁగా రామ భార్యలని యర్థము కాన రామునికి ననేక భార్యలు కలరనియు స్పష్టముగా నేర్పడుచున్నదని మఱొక పూర్వ పక్షముచేయుదురు. ఇదియుసరికాదు.కులగురువసిష్ఠులనిన నెందరువసిష్ఠులుగలరు? రఘూణామన్వయం వక్ష్యే యన్నప్పు డెందఱు రఘువులుగలరు? యదూనాంపతియే నమ"యన్నప్పు డెందఱు యదువులుగలరు? రావణులు వచ్చుచున్నారనిన నొంటరిగా వచ్చుచున్నారని యర్థమా? బాలకాండమున సీతాకల్యాణఘట్టమునందుఁ దప్ప వేఱొకచోట రామాదులకు వివాహమయినట్లు రామాయణమందుఁ జెప్పలేదు కాన వీరికిఁ బెక్కురు భార్యలెట్లు సంభవింతురు. మఱొక గ్రంథమునఁ జెప్పి యున్నను నది నిరివిషయమని చెప్పరాదు.రామాదుల చరిత్రమును వాస్తవముగాఁ జెప్పునది యొక వాల్మీకి రామాయణమే తప్ప మఱొక గ్రంథముకాదు. ప్రధానమైన రామాయణమున విరుద్ధములుగా నున్న గ్రంథముల కర్థాంతరమే చెప్పవలెను. ఇంతియకాక, భరతునికి మిథిలలో వివాహమైన వెంటనే వాని మేన

మామ తన పట్టణమునకు వానిని బిలుచుకొని పోయెనుగదా ! ఇఁక వివాహము కావలసియున్నను మేనమామయింట నేకదా కావలెను. అది తండ్రికిఁ దెలియ వలదా! రామాదులు తమతండ్రికిఁ దెలుపక సీతావివాహమునే చేసికొనలేదుగదా! అట్లుండ భరతుఁడుమాత్రము తండ్రికి దెలుపక యెట్లు పెండ్లి చేసికొని యుండును. అట్లయియున్నను దశరథునికిఁ దెలియక మంథరకుమాత్ర మెట్లు తెలిసినది? ఇంతేకాక రాముఁడు సీతయొక్కతె యందు దప్పనింకెవ్వరియందును మనస్సుంచ లేదనుట రామాయణమున స్పష్టపడుచున్నది. 'శ్రీరఘురామచంద్రుఁడును సీతను గూడి యనేకముల్ ఋతుల్, హారివిహారలీలలఁ బ్రియంబుగఁ బుచ్చెను నిచ్చలు న్మనం,బా రమణీలలామపయి నాఁటిని కూరిమి నిల్పి యామెయుం, గూరిమి పేరిమిం జెలఁగఁ గూర్చె మనంబు సదా హృదీశుపై" నను బాలకాండాంత పద్యమునుబట్టి రాముఁడు సీతయొక్కతెతోనే సదా సుఖించుచుండెనని స్పష్టమగుచున్నది. 'సర్వ కామ సమృద్ధ జనసుఖముల పదియు రెండేడు లిక్ష్వాకులయింటను గడపితి నేదియుఁ గడమ లేక' యని యారణ్యకాండ పద్యమునందు అత్యంత సంయోగార్థకమైన పదియు రెండేఁడులను బట్టిచూడ నన్ని సంవత్సరములును సీతకు రామునితో నిరంతర సౌఖ్యము స్పష్టమగుచున్నది. ఇతర భార్యలున్నచో నిదియెట్లుసాధ్యము. కాఁబట్టి రామునికి సీత యొక్కతే భార్యయనుటయే సరి. అట్లయినచో పూర్వపక్షు లుదహరించిన పద్యమున కర్థ మేమనఁగా రామ స్త్రీసంతతి = రామునికిఁ జేరిన యాఁడువారు. తల్లి భార్య మున్నగువారు. (2) రాముని పరిచారికలు అని రెండు విధములుగా నర్థము చెప్పవచ్చును. రాజుల కుత్తమజాతి స్త్రీలే పరిచారికలుగా నుండుట కాదంబర్యాదులందు స్పష్టము. నీస్నుషలు=నీకోడండ్రు, భరత శత్రుఘ్న లొక్క యుద్దిగాన భరతుఁడు కష్టపడునప్పుడు వాని తమ్ముఁడును గష్టపడును. అప్పుడు వారిద్దఱి భార్యలును గష్టపడుదురు. వారిద్దరు నీ కోడండ్రనియేగదా మన మనుకొనుటయని భావము. లేదా యిచ్చటి బహువచనము పూజార్థకమని యైనను జెప్పవచ్చును. ఇట్లీ పద్యమును సమన్వయించుట సాధ్యమగుచుండఁగా పూర్వపక్షాభిప్రాయ మెంతయు యుక్తముకాదు.

"పితుర్నిదేశం నియమేన కృత్వా వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ, స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభి స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః" జనకునియాజ్ఞచేఁ బ్రశస్త గతి న్వనవాసదీక్ష దీర్చి, నగరమేగి ధాత్రి కభిషేకము గైకొనుచుం గృతార్థతం, జనవున వారిజాత దళచారు విశాల విలోచనాళితో, నెనయక భీతిలేక రమియించెద వంచుఁ దలంతు సువ్రతా'యని సుందరకాండమునందు సీత రాముఁడు తన్నుపేక్షించు నని దుఃఖించుచుఁ దానిట్లే చావవలసినదే యనియు, రాముఁడు వనవాసమైన పిదపఁ బెక్కండ్రు స్త్రీలతో రమించుననియు దుఃఖించియున్నది. దీనిని జూడఁగా రామునికి ననేకభార్యలు కలరని స్పష్టమగుచున్నదని పూర్వపక్షము. ఇది యుక్తము కాదు తనయనంతరము రాముఁడు వివాహము చేసికొనును అనెడి యభిప్రాయము చేత

జెప్పినదియేకాని యతని కింతకుముందే యనేక భార్యలున్నారనియు వారితోడ రమించు ననియు నభిప్రాయముతోఁ జెప్పినదికాదు. అట్లయినచో నంతకుముం దెచ్చటను నామె ప్రస్తావనయే చేయలేదేల? మహోపద్దశలో నున్న స్త్రీలు తమ యనంతరము తమభర్తలు యితరస్త్రీలను బెండ్లియాడుదురనియుఁ దమ భూషణాదులను వారికిత్తురనియు ననుకొనుట లోకసహజము. అట్టి స్త్రీ స్వభావమునుబట్టి సీత యన్నదేకాని వేఱుకాదు. ఇట్లుకాక యింతకుముందే రామునికనేకభార్యలున్నారని సీత యభిప్రాయమైయున్నచోఁ బట్టాభిషేకానంతరముతన్నులక్ష్మణుఁడు రామాజ్ఞ ప్రకారము అరణ్యమునకు బిలుచుకొనిపోయి గంగాతీరమున విడుచునపుడు "నా భర్త యిట్లు నన్నుఁ జేసినదానికి నే నిపుడే నా ప్రాణము విడువవలసినదే. అయినను బ్రకృతము నా కడుపులో నున్న గర్భము నేను జచ్చినచోఁ జెడును. నా భర్త వంశము నాశన మగును. కావనే నిపుడు ప్రాణము వదల" నని చెప్పి యుండుట యెట్లు యుక్తమగును? సీతాగర్భము నాశన మయ్యెనేని నితరభార్యలకుఁ బుత్రు లుండరాదా? దానిచే సంతతి చెడకుండరాదా? కాఁబట్టి యిప్పుడు భార్యలనేకులు శ్రీరామునికున్నారనికాదు. ఏకపత్నీవ్రతస్థుఁడు రాముఁడు తన్ను విడిచి వేఱొక స్త్రీతోఁ గలియఁడని సీత యెఱుఁగును ముందు పద్యములోని సీతాభిప్రాయము తన యనంతరము రాముఁడు పెండ్లియాడుననియేయామెయభిప్రాయము. "నామగని రాజవంశము, భూమిపయిన్ ఛిన్నమగుచుఁ బోదదయేనిన్, సౌమిత్రీ జాహ్నవిలో, నా మేను ద్యజింపకుందునా యీ త్రుటిలో" నని యుత్తరకాండ పద్యము.

'పరమ నారీజనకరములచే'నను నీ పద్యమును బూర్వపక్షులు తమ పక్షమునకు సాధకముగాఁ జెప్పుకొందురు. ఇందుఁ జెప్పఁబడిన పరమనారీజనులు పరిచారికలైన యుత్తమస్త్రీ లని పూర్వమే వివరింపఁబడెను. లేదా పరమనారీజనకరములచే నల్గిడఁబడిన దానిని-ఇంతకుముందు నల్గిడఁబడినదాని నని యర్థము కాదు. నల్గిడఁబడుటకు దగిన దానిని-ఆశంసార్థక క్త ప్రత్యయాంతము. రాముని భుజసౌందర్యమును జూడఁగా సీతనికనేకభార్యలుండి వారలు ఈభుజమునకు నలుగుపెట్టినచో బాగుగా నుండు నని తోఁచుచున్నదని భావము. లేదా, పరమనారులు శ్రీ భూనీళాదేవులు 'ఆత్మానం మానుషం మన్యే'యన్నట్లు శ్రీరాముఁడు తన్ను మనుష్యునిగాఁదలఁచుకొని యున్నను వారి స్వరూపమును వర్ణించెడి యీకవిమాత్రము వారిని శ్రీమన్నారాయణునిగానే యచ్చటచ్చట స్పష్టపఱుచుచున్నాఁడు. "విష్ణువుపుట్టె ధర నన్నరాకృతిన్" అని యయోధ్యాకాండాది భాగమందలి పద్యము. ఇట్లే యనేక స్థలములందున్నది. అట్లుగనే యిచ్చటను శ్రీభూనీళలను స్పష్టపఱిచెను. ఈకవి యనుట తప్పుగాదు. కాఁబట్టి పూర్వపక్షుల యుక్తు లేమాత్రమును సమంజసములు గావు.

రాముఁడు రాజ్యమేలునపుడు సీతను వదలిన పిమ్మట ననేక రాజసూయాశ్వమేధాదియాగంబులను జేసినట్లుత్తర కాండమునఁ జెప్పఁబడెనుగదా. భార్యలేనపుడు

యజ్ఞములు చేయరాదు. కాన నపుడితర భార్యలను బెండ్లియాడియే రాముఁడా యజ్ఞములను జేసియుండవలెను. కాన నన్యథానుపపత్తిచేత రామునికనేక భార్యలుండిన ట్లేర్పడుచున్నదని పూర్వపక్షులు మఱొక యుక్తి చెప్పుదురు. ఇదియు సరికాదు. యజ్ఞార్థమై వరింపఁబడినట్లు నీవు చెప్పెడి భార్యలు రామునకేమాత్రము భోగార్థముపయోగపడరాదు. ఇట్లుండ వీరినిబట్టి పూర్వపద్యములను సమరసపఱుచుట 'అసిద్ధమసిద్ధేన'యన్నట్లున్నది. ఇంతియకాక శ్రీరాముఁడు సీతాపరిత్యాగానంతరము సీతకుఁ బ్రతినిధిగా సీతాప్రతిమను బెట్టుకొని యజ్ఞములు చేసినట్లుత్తరకాండమునఁ జెప్పఁబడెను. దీనిని బట్టి చూడఁగా యజ్ఞార్థము శ్రీరాముఁడు వేఱే స్త్రీలను బెండ్లియాడియే యుండఁడని తోఁచుచున్నది. కుమారిలభట్టుఁడు కొదువఁబడినవానికెల్లఁ బ్రతినిధులఁ జెప్పుచు భార్యకుమాత్రము ప్రతినిధిని చెప్పమని భార్యకు ప్రతినిధి లేదని పూర్వమీమాంసాన్యాయమునుబట్టి యేర్పడుచుండఁగానుత్తర రామాయణమున భార్యాప్రతినిధి నెట్లు చెప్పవచ్చునని కొందఱాక్షేపింతురు. అది సరిగాదు. "యది దుష్టభార్యోఽసారభార్యో వా స్యాత్తదా దర్భపుంజీలం తత్స్థానే నిధాయాగ్నిమాధాయ కుర్యా'త్తని హేమాద్రి నిబంధన గ్రంథమునఁ బ్రత్యక్షవచనముదహరింపఁబడి యుండఁగా దీనికి విరుద్ధముగ నున్న పూర్వమీమాంసాన్యాయమంతగా గ్రాహ్యముకాదు. ఇంతియకాక ధర్మసంస్థాపనార్థమైయవతరించిన శ్రీరాముని యాచారముకన్నను నీ విషయంబున వేఱు ప్రమాణము కావలయునా? వీరియాచారమునకు విరుద్ధమై యెన్నియున్నను నవి యెల్ల నప్రమాణంబులే యని నెఱుఁగనగు. వేదంబులుకూడఁ బూర్వుల యాచారంబులననుసరించియే నిత్యనైమిత్తికకర్మములను విధించినవి గాని వేఱుగాను. కాఁబట్టి వేదములకన్నను బ్రథమ ప్రమాణంబు లాచారములనియే చెప్పవలెను. ఈ యభిప్రాయమును బట్టియే కదా యాపస్తంబులును బ్రమాణములను జెప్పెడిసందర్భమున "ధర్మజ్ఞసమయః ప్రమాణం వేదాశ్చ"యని వేదముకన్నను నుత్కృష్టప్రమాణమాచారమని సూచించుటకై యాచారమునే ప్రప్రథమునఁ జెప్పియున్నారు. ఇందుచేతనే కదా స్మృతికారులును దమస్మృతులందు "శ్రుతిర్విభిన్నా స్మృతయో విభిన్నాః నచాన్యృషే ర్ధర్మనమస్తికించిత్, ధర్మస్యతత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతస్సపంథా"యని యాచారమునే సకలప్రమాణోత్కృష్టప్రమాణముగాఁ జెప్పియున్నారు. కాఁబట్టి 'చాతుర్వర్ణ్యంచ లోకేఽస్మిన్ స్వేస్వే ధర్మే నియోక్ష్యతి'' యన్నట్లు ధర్మసంస్థాపనార్థమై యవతరించిన శ్రీరాముని యాచారమే ప్రబలప్రమాణము. దీనికి విరుద్ధముగా నెన్ని యపన్యాయము లున్నను నవి మనకుఁ బ్రమాణములే కావు.

రాజు లశ్వమేధాదులు చేయునపుడు మహిషీవావాతాపరివృక్తి పాలాకలు లని నలుగురుభార్య లుండవలెను. దీని ప్రకారము శ్రీరామునికిసీతమహిషీస్థానమున నున్నను వావాతాదులకై యితర భార్యలుకూడ నుండిరని మఱికొందఱాక్షేపిం

తురు. ఇదియు ననాలోచితము. ఏ యంగము లేకున్నను యజ్ఞము పూర్తియగునో యట్టి యంగములు లేనప్పుడు వానికై యేర్పడిన మంత్రములను మాత్ర మాయజ్ఞ కాలమునఁ బఠించినను జాలును. ఇందులకై యీ వస్తువులను దప్పక సంపాదించియే తేవలె నని నిర్బంధ మక్కఱలేదు. కాన వావాతాదులు లేకున్నను ప్రధాన మహిషి మాత్రముననే యజ్ఞపూర్తి కానచ్చునుగాన వారికై యేర్పడిన మంత్ర మపుడు పఠించియుందురు.

కాఁబట్టియేగదా కుంటివారు యజ్ఞము చేయునపుడు విష్ణుపద క్రమణము సాధ్యపడమిని దానికై యేర్పడిన మంత్రమును మాత్రము పఠించుచున్నారు. ఇట్లే గ్రుడ్డివాఁడు యజ్ఞము చేయునపుడు ఆజ్యావేక్షణము క్రియారూపముగ లేక మంత్రపఠనముచేతనే యగుచున్నది. కాఁబట్టి యే శాస్త్రము విరోధించినను శ్రీరాముని యాచారమే ప్రబలప్రమాణము. దీనికవిరోధముగనే సమస్త శాస్త్రములను సమంజస పఱుచుకొనునది.

పూతసౌరభము = వస్త్వంతర వాసనామిశ్రము కాక కేవల చందనాగురు సువాసన, రక్తచందనమునఁ గ్రాలుదానిన్=రక్తచందనము మేదించిన కుంకుమ పూవు, మొదట చందనాగురు గంధముఁబూసి ఆపై మేదించిన కుంకుమపూవును బూసియున్న దని భావము. శయనతలమునన్ = హంసతూలికాతల్పమునందు, ఉత్తమాంగము = శిరము, గాంగజలములన్=గంగానదిజలములందు, ఉన్నయని శేషము.

స్వతఃప్రమాణమైన వాల్మీకి రామాయణమందలి విషయములకు నితర ప్రమాణము లాశించువాఁడు సూర్యునిజూచుటకు దీపములు దెమ్మనువాఁడే. ఈ విషయము పీఠికయందుఁ జర్చింపఁబడెను. ఉత్తరకాండమును జూచునది.

తాత్పర్యము

వనములకు రాకముందు తళుకు బంగారు సొమ్ములచేఁ బ్రకాశించుదానిని బంగారు భుజపురులచేతను, మనోహరములైన ముత్యముల సొమ్ములచేతను, నలంకరింపఁబడినదానిని ఉత్తమస్త్రీలగు పరిచారికలచేత ననేకవిధముల నలుగు పెట్టబడిన దానిని, చందనము అగురు, వీనియొక్క పవిత్రమైన సువాసనలు గలదై యెఱ్ఱని చందనమున శోభించుదానిని, పానుపునందు చంద్రునివంటి ముఖముగల సీతాదేవియొక్క శిరస్సుచేఁ బ్రకాశించు దానిని, గంగానదియందలి తక్షకుని శరీరమునకు సమాన మగు దానిని, దీనులబాధ తొలఁగించుదానిని.

తరలము. కలన శాత్రవశోకదంబు యు ♦ గ్రప్రతీపము దీర్ఘమున్
నలలితాప్తముదాకరంబును ♦ సాగరాంత సమాశ్రయం
బలఘుసవ్యశరప్రయోగస ♦ మర్ధమున్ దృఢశింజినీ
కలిత మాటను జర్మ మూడుటఁ ♦ గాయ కాచినదానినిన్. ౪౩౩

అర్థములు. కలనన్ = యుద్ధమందు. శాత్రవశోకదంబు = శత్రువులకు శోకము గలిగించునది. యుగ ప్రతీపము = గడియారమాడకునకు నెదురుద్ది యగు దానిని, ఇచ్చటఁ బ్రతీపమనునది యుపమావాచకముగా గ్రహింపవలెను. "స్పర్ధతే జయతి ద్వేష్టి ద్రుహ్యతి ప్రతిగర్జతి ఆక్రోశ త్యవనాజాతి కదర్థయతి నిందతి తస్యచానుకరోతీతి శబ్దాః సాదృశ్యవాచకాః ఉపమాయామిమే ప్రోక్తాః కవీనాం బుద్ధిసంపదామ్" దండి. దీర్ఘమున్ = మోఁకాళ్లనంటునట్లు నిడివియైనదానిని, సలిలత=మంచి మనస్సుగల, ఆప్త=స్నేహితులకు, ముత్+ఆకరంబును=సంతోష స్థానమైనదియు, సాగరాంత=సాగరము కడపటగాఁ గలది భూమి, ఆ భూమండలమునకు ఆశ్రయమైనది సాగరాంత సమాశ్రయము, భూరక్షాభారము వహించునది. అలఘు=గొప్పదై, సవ్య=ఎడమప్రక్కనుండియు, శరప్రయోగసమర్థము = బాణముల ప్రయోగించు సామర్థ్యముగలది. దృఢశింజినీ కలితము = గట్టి యల్లెత్రాటి రాపు గలది.

తాత్పర్యము

కాఁడిమ్రాఁకుతో సమానమై యుద్ధమునందు పగవారికి శోకము కలిగించుదానిని, నిడివియైనదానిని, మంచిమనస్సుగల మిత్రుల సంతోషమునకు స్థానమైనదానిని, భూమండలమునకు నాశ్రయమైనదానిని. సవ్యాపసవ్యముగ బాణములు ప్రయోగింప సామర్థ్యము గలదానిని, గట్టియల్లెత్రాటిరాపిడిచేఁ జర్మము కాయ కాచినదానిని.

మత్తకోకిలము. వేలువేలుగ నాలమందల ♦ విశ్రుతంబుగ దానముం
బోలఁ జేసినదానిఁ, బన్నగ ♦ భోగసన్నిభమై మహా
భీల మా పరిఘాతనం బనఁ ♦ బేర్మిమించినదాని, నా
వేల దక్షిణబాహువుం బర ♦ వీరకాలుఁడు దిండుగన్. ౭౬౭

అర్థములు. ఆలమందలన్=ఆవుల గుంపులను, పన్నగభోగ సన్నిభమై= పాముయొక్క పడగతో సమానమై, మహాభీలమా = మిగుల భయంకరమైన, పరిఘాతనంబు=గడియమ్రాఁకు, వేలన్=సముద్రతీరమునందు, దక్షిణబాహువు= కుడిభుజమును, పరవీరకాలుఁడు=వీరులగు శత్రువులకు యముఁడైనవాఁడు.

తాత్పర్యము

వేలువేలావుల మందలను సుప్రసిద్ధముగ దానము చేసినదానిని, పాఁపపడగ వంటిదై మిగుల భయంకరమైన గడియమ్రాఁకువలె గొప్పదగు దానిని కుడి భుజమును దిండుగాఁ జేసికొని సముద్రతీరమున.

భుజమునొక్క వర్ణన నిప్పుడు సేయుట యప్రస్తుతముగాదా? కాదు.

ఎంతో సుకుమారమై యెన్నివిధములనో యుపచారము చేయించుకొనునదియై యధికాభరణములచే నలంకరింపఁ బడినదై శత్రువులకు భయంకరమై మిత్రులకు

నానందకరమై యనేక దానములు చేసిన హస్తము నేడిట్టు లోరుగాలిలో నిసుక దిబ్బమీఁదఁ గఱకు దర్భలమీఁద బడియుండవలసి వచ్చెఁగదా యని తన విషాదము తెలుపఁ గవి దీని వర్ణించెను.

క. తూరుపు మొగమై కైకొని, పారావారంబు తరణ॰భంగియొ మరణం
బో రెంట నొకటి నిజ మని, వీరుఁడు మది నిశ్చయించి ॰ విధిహితనియతిన్.

అర్థములు. పారావారంబు = సముద్రము యొక్క, తరణ భంగియొ = దాఁటుటయో, పారావారము యొక్క మరణభంగియొ, విధిహితనియతిన్ = శాస్త్రమందుఁ జెప్పబడిన నియమప్రకారము. ఇది కాయిక వాచక నియతి చెప్పను.

తాత్పర్యము

తూరుపుముఖ మగునట్లు కుండుకొని సముద్రమును నేను దాఁటనైన దాఁటవలెను. లేదా సముద్రుఁడు చావనైనఁజావవలె, రెంటిలో నొకటి కాఁగలదని నిశ్చయించుకొని శాస్త్రమందుఁ జెప్పఁబడిన ప్రకారము, పారావారముయొక్క మరణభంగి యని యన్వయించిన సముద్రము నెండించి దాఁటెద నని యర్థము.

క. మునియై శయనించెను నవ్వననిధిఁ బ్రార్థించికొనుచుఁ ॰ బన్నుండ నిటుల్
చనె మూఁడుయామినులుదర్శన మొసఁగఁడు మందుఁడగుట॰సరిదధిపతియున్.

అర్థములు. మునియై = మౌనవ్రతముఁ బూనినవాఁడై, ఇది మానసిక నియతి, పన్నుండన్ = పరుండఁగా, యామినులు = రాత్రులు, మందుఁడు = బుద్ధిమాంద్యముగలవాఁడు, సరిదధిపతియున్ = సముద్రుఁడును, 'సీతాయాః పతయేనమః' యన్నట్లు లక్ష్మీపురుషకారము పూర్వకముగఁ గదా శరణాగతి. అట్టులే సరిత్పూర్వకముగా రాముఁడు చేసెను.

తాత్పర్యము

మౌనవ్రతముఁబూని సముద్రమును బ్రార్థించుచు మూఁడురాత్రులు (పాడ్యమి విదియ తదియ) పండుకొనెనుగాని బుద్ధిమాలిన సముద్రుఁడు కానవచ్చినవాఁడు గాఁడు. సముద్రుఁ డనగా సముద్రాధిష్ఠానదేవత యని యర్థము. రామచంద్రమూర్తి యడుగకున్నను దానై యాయనకార్యము చేయవలసినవాఁడు ఆయన ప్రార్థించినను దనకు నాయనకుఁగల వాసిగాని కృతజ్ఞతగాని యాలోచింపక పోవుటచే వానిని గవి మందుఁడనెను.

రామునంతటివాఁడు చేసిన శరణాగతి వ్యర్థము కానేల? శరణాగతి దీనులకు నకించనులకే కాని శక్తిమంతుల కుపయోగపడదు. రాముఁడు దీనుఁడు కాఁడు. అకించనుఁడు కాఁడు. కావున ఫలింపలేదు. కావున నధికు లల్పుల నుద్దేశించి శరణాగతి చేయరాదు. బ్రాహ్మణుఁ డశ్వమేధమున కధికారి కానట్టు రాముఁడు శరణాగతి కర్హుఁడు కాఁడు.

రామచంద్రమూర్తి తూర్పుముఖమై పండుకొనుట మౌనము వహించుట దర్భలపైఁ బరుండుట లోనగు నియమములఁ బాటించెఁగదా! ప్రపత్తి కివి నియత ములా? ఆర్తప్రపన్నునకు నియమములు లేవుకాని దృప్తుఁడు నియమములఁ బాటింప వలయునని రామచర్య సూచించుచున్నది. రామచంద్రమూర్తి దృప్తుఁడే కాని యార్తుఁడుకాఁడు. ఆర్తుఁడై యుండినచో సముద్రము దాఁటుటో మరణమో యని పండుకొనినవాఁడు మరల లేచునా? రాముని బంటైన హనుమంతునకు సాహాయ్యము చేసిన సముద్రుఁడు ప్రత్యక్ష రామున కేల చేయలేదు?

రామనామ మందున్న బలము రామునందు లేదు. హనుమంతుఁడు రామ ముద్రిక ధరించి జయము జయంబు రామునకని కేక వేయఁగానే యందఱు గౌర వింతురు. రామదాసుఁడుగాక యూరక సముద్రము దాఁట నెంచియుండిన నా గౌరవ మాయనకుఁ గలిగియుండదు. గోవిందా యను కేకగదా ద్రౌపదిని గాచినది. రావే వరదా యను కేకకదా గజేంద్రుని గాచినది. హానాథా యను సీతమాట గదా రామచంద్రుని విశేష పరితాపపడఁ జేసినది. సంసారమునుండి తరింపఁజేయునది రామ నామమేకదా. రామనామ మహాత్మ్యము దెలియక యీ పార్వతీ పరమేశ్వరులు శ్రీరామనామము సర్వదా జపించుచున్నారు? అధికారుల భటుల మొగలోస బిళ్ళలకు బను లయినట్టు లధికారులు స్వయముగఁ బోయిన కావు. అనుభవవిదితము. కావుననే శ్రీరామ నామము స్వాధీనపడెనా తరువాత రామమూర్తి దర్శనమిచ్చినను ఈయకున్నను భక్తులు పరితాపపడరు.

—• శ్రీరాముఁడు సముద్రుపై నాగ్రహపడుట •—

ఉ. అంతట రాఘవుం డుకన • లార మహోదధివర్యుమీఁద ర
క్తాంతవిలోచనుం డయి ని • జాంతికసీమన యున్నలక్ష్మణున్
గాంతసులక్ష్మణుం బలుకుఁ • గంటివె దర్శన మీఁడు సాగరుం
డెంతటి గర్వియో? బరువు • హీనత పో మలినాత్ముఁ డేఁడుటల్.

అర్థములు. కనలారన్=కోప మతిశయింపఁగా, రక్తాంత విలోచనుండయి= ఎఱ్ఱని కొనలుగల కన్నులుగలవాఁడై, నిజాంతికసీమన=తన సమీప ప్రదేశమందే, దీనిచే లక్ష్మణుఁడు రామచంద్రుని ప్రక్కనే నిలచియుండె నని భావము. కాంత సులక్ష్మణున్ = మనోహరమైన శుభచిహ్నములు గలవానిని, రామునికోపము పరిశీలించి యిఁక భయములేదు. కార్యమైనదే యని వికాసము నొందిన ముఖము గలవానిని మలినాత్మున్=నిర్మలచిత్తుఁడు కానివానిని, నిర్మలదేహము లేనివానిని- సముద్రము నిర్మలము కాదుగదా!

తాత్పర్యము

మూఁడు రాత్రులు దర్భశయనమం దుండి సముద్రుఁడు ప్రసన్నుఁడై దర్శన మీయకుండుట చూచి సముద్రముమీఁదఁ గన్నెఱ్ఱజేసి తన సమీపమందే యుండు

ముఖవికాసాది శుభచిహ్నములు గల లక్ష్మణుఁజూచి యిట్లనియె. లక్ష్మణా ! చూచితివా సముద్రుఁ డెంత పొగరుబోతో కాన వచ్చినవాఁడు కాఁడుగదా - మలినచిత్తులఁ బ్రార్థించుటవలన గౌరవహానియేకాని లాభములేదు.

క. ఓరుపు శమ మార్దవమును, జారుప్రియవాదితయు న•సాధులయందున్
గారియముసేయ దా స,చ్చారిత్రు నశక్తుఁ డనుచు•జడుఁ డెంచు మదిన్. ౧౪౫

అర్థములు. శమము = కోపము లేకుండుట, ఆర్జవము=చక్కని నడవడి, చారుప్రియవాదితయు-మనోహరముగ నింపుగ మాటలాడుట, అసాధులయందున్=సాధువులు కానివారియందు, కారియముసేయదు=ప్రయోజనపడదు, ఆ సచ్చారిత్రున్=అటువంటి శమదమాదులు గలవానిని, అశక్తుఁడు = సామర్థ్యము లేనివాఁడు, జడుఁడు=యోగ్యత తెలిసికొనలేని మందబుద్ధి.

తాత్పర్యము

పరులు చేసినదాని సహించుట కోపములేమి. చక్కని నడవడి మంచిమాట లాడుట యివి దుర్జనులందుఁ బనిసేయవు. అటువంటి నడవడిగలవానిని బుద్ధిలేని వాఁడు సామర్థ్యములేక యిట్లు చేయుచున్నాఁడని తలఁచును.

క. తనుఁ దాన పొగడుకొనువా,నిని సర్వోత్సృష్టదండు • నిర్దయుఁ గుటిలా
త్మునిఁ విపరిధావకుం గని, జనములు తనియించు చుండు•సత్కారములన్. ౧౪౬

అర్థములు. సర్వోత్సృష్టదండున్ = వీనిని దండింపవచ్చునా కూడదా యను విచారములేక యెవరినైనను దండించువానిని, నిర్దయున్=దయలేనివానిని, కుటిలాత్మునిన్=కుత్సిత బుద్ధిగలవానిని, విపరిధావకున్ = అందఱఁ దఱుమఁగొట్టు వానిని, తనియించుచుండు=వాఁడు కోరిన విచ్చి తృప్తిపఱుచుచుండును, సత్కారములన్ = బహుమానములచే,

తాత్పర్యము

తన్నుఁ దాను బొగడుకొనువానిని విమర్శలేక దండించువానిని దయలేని క్రూరుని వక్రబుద్ధిని ఎవరిని దగ్గఱరానీయక తఱుముచుండువానిని జూచి లోకులు గౌరవించి వానికిఁ గావలసిన విచ్చి సంతోషపఱుచుచుందురు.

సాధువులను సాధువులు మాత్రమే పూజింతురు. దుష్టుల నందఱు పూజింతురు. 'దుష్టస్సర్వత్రపూజ్యతే' యని కలదుగదా.

క. సామమునఁగీర్తి గలుగదు, సామంబున యశము లేదు • సౌమిత్రీ ! సం
గ్రామముఖంబున జయమేన్, సామమున లభింప దయ్య • జగముల నెందున్.

అర్థములు. సామమునన్ = మంచితనముచేత, కీర్తి = బలమువలని ప్రఖ్యాతి, యశము=దానాదులవలన ఖ్యాతి.

తాత్పర్యము

సామముచే యశము లేదు-కీర్తి లేదు-యుద్ధమందు జయము లేదు.

ఉ. ఏను క్షమాగుణంబు వహి•యించుట నీ జలరాశి నన్ను శా
లీనునిఁబోలెఁ జూచెడి•బలే క్షమ చూడఁగఁ గూడ దిట్టిదౌ
వానియెడన్, మదీయశర•వారవిదారితనక్రకూర్మ సం
తాను నిరుద్ధతోయు గత • దర్పు విలోలుని జూడు లక్ష్మణా! ౮౮౧

అర్థములు. క్షమాగుణంబు = ఓర్పు, ఆక్రుష్టోపి హతోవాపి, నాక్రోశే న్నైవ తాడయేత్, అదుష్టో వాఙ్మనఃకాయైః సా క్షమా పరికీర్తితా। ఈడ్వఁబడినను గొట్టఁబడినను దూషింపఁడు-కొట్టఁడు-మనోవాక్కాయముల దోషములేని వాఁడో యట్టి సహనము క్షమ యనఁబడును. శాలీనునిఁబోలె = అసమర్థునివలె, నన్ను=ఇతరులఁ బ్రార్థింపక యేకార్యమైనఁ జేయఁగల నన్ను, మదీయశరవార= నా బాణసమూహములచే, విదారిత = చీల్పఁబడిన, నక్రకూర్మ సంతానున్= మొసళ్ళు తాఁబేళ్ళు గలవానిని, నిరుద్ధతోయున్=అడ్డగింపఁబడిన నీళ్ళుగలవానిని, గతదర్పున్=గర్వముడిగినవానిని, విలోలుని=అల్లకల్లోలమైనవానిని.

తాత్పర్యము

నేను దొలుతనే సముద్రము నెండించి కాలహరణములేక వానరసేన దాఁటింపఁ దలఁచితిని. అయినను మీరు సౌమ్యమార్గము నుపదేశించుటచేత మీమాట నేల త్రోసివేయవలయు నని కాలహరణమైనను సహించుటచేఁ దాను నీటికుప్పగదా యని తన్నొక్కగొప్పగా నెంచుకొని నన్ను దేనికిఁ జేతగాని వానివలె వీఁడు తలఁచెను. ఔరా! యేమి వీని దుర్నయము!! ఇట్టివానియం దోర్పు పనికిరాదు. అటయిన నిప్పుడేమి చేయఁదలఁచి నందువా నా బాణ పరంపరలచే దీనిలోని మొసళ్ళను దాఁబేళ్ళను జీల్చి తేలునట్లు చేసి నీరు కదలకుండ స్తంభించి వీని గర్వ మణఁచి యల్లకల్లోల మగునట్లు చేయుదును.

క. కరులకరంబులు దర్వీ,కరముల భోగములు మీల•కాయంబులు సా
గరమున మచ్ఛిన్నంబులు, కరముం దేలాడఁ జూడ•గల వనుజాతా! ౮౮౨

అర్థములు. అనుజాతా=తమ్ముఁడా! కరులకరంబులు = నీటియేనుఁగుల వంటి చేఁపల తొండంబులు, దర్వీకరముల భోగములు = పాముల శరీరములు, మీల=చేపలయొక్క, కాయంబులు=దేహములు, మత్+ఛిన్నంబులు = నాచేఁ జీల్పఁబడినవి, కరమున్=మిక్కిలి.

తాత్పర్యము

ఏనుఁగుల యాకారములుగల చేఁపల తొండములు-పాముల దేహములు-చేఁపల శరీరములు-ఇవి నా బాణములచేఁ జీల్పఁబడినవై నీటిపైఁ దేలుచుండఁగా నీవు చూచెదవు.

క. కరవాఁడిశరంబుల సాఁగరమును సవిసారశుక్తికాశంఖసము
త్కరముగ నింకించెద సంగరమున; మెత్తండనానఁ గనఁబడఁ డితఁడున్. ౨౨౩

అర్థములు. కరవాఁడి = కరము+వాఁడి=మిగుల పదునైన, సవిసార= చేపలయు, శుక్తికా=ముత్తెపుఁ జిప్పలయు, శంఖ = శంఖములయు, ఉత్కర = సమూహములతోఁ గూడిన దానిఁగ, ఇంకించెదను=ఎండించెదను.

తాత్పర్యము

మిగులఁ బదునైన బాణములచే సాగరమును చేపలతో, ముత్తెపుఁ జిప్పలతో శంఖములతో నెండించెదను. మంచితనమున వీఁడు కానరాఁడు-చెఱుకా బెల్లము పెట్టవే యనినఁ బెట్టునా ?

శా. సౌమిత్రీ ! యిటు దెమ్ము చాపము మహాసర్పోపమానాశుగ
స్తోమంబున్ వెస సాగరంబు నిదె సంశోషిల్లఁ గావించెదన్
భూమీధ్రాటచయంబు కాలినడకం బోఁజేసెదం గిన్క వే
లామర్యాద యణంగి పొంగి ధరఁ బొర్లన్ క్షుబ్ధముం జేసెదన్. ౨౨౪

ఈ సముద్రమును మాటలచేత బెదరించితిమేని భయపడి మనకుఁ గనఁబడ వచ్చునని యెంచి దయాళువైన శ్రీరాముఁడు ఇంతవఱకు మాటలచే బెదరించి చూచెను. అదియు వ్యర్థమగుటచే నిఁకఁ గార్యము మూలమున బెదరించి చూతమని దానికై ప్రయత్నించుచున్నాఁడు. సౌమిత్రీ=లక్ష్మణుఁ డాదిశేషావతారము గదా ! శేషునికి సముద్రము పడుకగదా ! ఆ ప్రత్యాసత్తిని బట్టి వీఁడు నేను సముద్రముపైఁ గోపగించి ధనుర్బాణములను దెమ్మన్నప్పుడు కొంత యాలస్యము చేయునేమో యట్లు చేయరాదనుటకై తగినట్లు లక్ష్మణుని రాముఁడు సంబోధించుచున్నాఁడు. సౌమిత్రీ, (1) నీవు తల్లిమాటయే వినవలసినది, అన్నమాటను వినరాదని నియమము పెట్టుకొని యున్నావా? (2) రామే ప్రమాదం మా కార్షీః" యని నీ తల్లి యాజ్ఞను మఱచితివా ? ఆ సంబోధనము విని లక్ష్మణుఁడు ఏమి పని యాజ్ఞాపించెదరో యని రాము నొద్దకు రాఁగా రాముఁ డనుచున్నాఁడు. చాపము నిటు తెమ్ము. (1) నిర్గుణుఁడైన యీ సముద్రుని సగుణమైన వింటిచేతనే వశపఱుచుకొనవలెను. గాన సగుణమైనధనస్సును దెమ్ము. (2) సముద్రము పుల్లు నోటఁ గఱచుకొనునట్లు చేయవలెను. అందులకై విల్లు తెమ్ము. ఈ మాట విని లక్ష్మణుఁడు భయపడి వింటిని మాత్రము తెచ్చియిచ్చెను. రాముఁడది చూచి 'ఇదేమి వింటిని మాత్రము తెచ్చితివి. బాణములు లేక దీనితో నేమిచేయవచ్చును? కాన బాణములను గూడఁ దెమ్మని చెప్పనెంచి మరలఁ గొంచె మాలోచించి ఈతఁడు చెప్పినంతే చేయుచున్నాడు, బాణములు తెమ్మన్న గఱుకైన వానిని తేక యుపయోగము లేనివానిని దెచ్చునేమో యని యెంచి కఱుకు బాణములను దెచ్చునట్లాజ్ఞాపించుచున్నాఁడు. మహాసర్పోపమాశుగస్తోమంబుల్ = సర్పమునకు మహత్త్వము విషముచేతనే గదా ! అనఁగా కఱువవలసినది లేకయే చూపు

మాత్రముననే విషముగ్రక్కి మనుష్యులను జంపునట్టివే యిచ్చట నుపమానములుగాఁ జెప్పఁబడినవి. అట్లే యీ బాణములును దేహమున గ్రుచ్చుకొన నక్కఱలేకయే దృష్టిగోచరములు కాఁగానే శత్రులు చత్తురు. అట్టి బాణములను దెమ్మని భావము. సముద్రమును శోషిల్ల జేయుటకు నొక్కబాణమే చాలదా? అట్లుండ రాముఁడు అనేక బాణములను దెచ్చున ట్లాజ్ఞాపించుట యీ యొక్క సముద్రుని దోషమును బట్టి వీని సంబంధము గల సప్త సముద్రములను నెండఁ గొట్టవలె నని యుద్దేశముతో నని గాని, కోపాతిశయముచేఁ దన సామర్థ్యము తెలియకయే గాని చెప్పినాఁడనిగాని యెఱుఁగునది. సముద్రము శోషిల్లఁ జేయుటకు బాణము లేల యని సందేహింపరాదు. ఛిన్నం భిన్నం శరైర్దగ్ధ మ్మని గదా రావణబాణ ప్రభావము, అపై లక్ష్మణుఁడు కొంచెము తామసించి యిట్టి బాణములను మీరు తెమ్మనుటకుఁ గారణమేమని యడుగఁగా రాముఁడు చెప్పుచున్నాఁడు. సాగరంబు నిదె సంశోషిల్లఁ గావించెదన్ (1) త్రవ్వనవ్వుడున్నంత శ్రమ మివ్వుడక్కఱలేదు. సులభముగా దీనిని శోషింపవచ్చును. (2) "ఏకస్త్వమసి లోకస్య స్రష్టా సంహారకస్తథా" అన్నట్లు సృష్టిసంహారములు రెండును నాయొక్కని పనియే కదా. (3) "అప ఏవ ససర్జాదౌ" యన్నట్లు సృష్టి కాలమున ఈ జలము సమస్త సృష్టికిని మొదటిదైనట్లు ఇప్పుడు రావణాది సంహారకాలము కాన నందఱకును ముందుగ దీనినే సంహరింపవలెనని భావము. (4) మా వలన వృద్ధికి వచ్చిన యీ సముద్రము మాకే సహాయపడుటలేదు. ఇట్టి కృతఘ్నమైన దీని నడుగంటునట్లు చేసెద నని భావము. (5) ఈ సముద్రము మాయెడ జ్ఞాతి కార్యమును జూపుచున్నది. అట్లైనచో మేముమాత్ర మూరక యుందుమా? (6) అఱువది నాలుగు వేలమంది చేరి త్రవ్విన దీనిని నే నొక్కఁడనే శోషిల్లఁ జేసెదను. "విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతి" మ్మన్నట్లు మేమై వృద్ధికిఁ దెచ్చిన యీ సముద్రమును మేమై మొదలంట చెడఁగొట్టుట యుక్తముకాదు. కాన నీరు మాత్రము వట్టిపోవునట్లు చేసెదను. ఇట్లు చేయుటవలనఁ బ్రయోజన మేమనఁగా జెప్పుచున్నాఁడు. భూమీధ్రాటచయంబులు = వానర సమూహములు, భూమీధ్రములు=పర్వతములు - వీనియందుఁ దిరుగునవి భూమీధ్రాటములు, భూమీధ్రేత్యాది (1) సముద్రము దాఁటుటకై వానరులకు నీఁదవలసిన శ్రమముగాని, యోడల సంపాదింపవలసిన శ్రమముగాని లేకుండ సుఖముగాఁ గాలితోనే నడచి పోవుటకై యుదధి నీటి నింకించెదనని భావము. (2) నాయెడ నీ సముద్రము చేసిన యపరాధమునకు వీనిని స్రోతుల కాలిక్రిందఁ ద్రొక్కించి కసి తీర్చుకొనెద నని భావము. పక్షాంతరమును జెప్పుచున్నాఁడు. వేలేత్యాది. వేలామర్యాద=గట్టును దాఁటరాదను వ్యవస్థ - అణఁగి = చెడి, పొంగి సముద్రముకర్త, క్షుబ్ధము జేసెదన్ = కలఁతపెట్టెదను.

తాత్పర్యము

సౌమిత్రీ! వింటిని గొప్ప పాములను బోలు బాణముల సమూహమును దెచ్చి

యిమ్ము. ఏలందువా, ఈ సముద్రమును నెండించి దుమ్ము రేఁగ జేసెదను. అంతపని యేల చేసెదవందువా వానరులు కాల్నడ సముద్రమునఁ బోవఁజేసెదను. ఇన్ని నీళ్ళున్న వే యందువా చెలియలికట్ట దాఁటి రారాదను మర్యాదను బోఁగొట్టి పొంగి పొరలి క్షోభపడఁజేసెదను.

—♦ శ్రీరాముఁడు సముద్రునిపై బాణంబులు వైచి క్షోభిల్లఁ జేయుట ♦—

ఉ. ఏగతిఁ బట్టునో కనుమ ♦ యీ వరుణాలయ మిప్పు డంచుఁ దా
జేగురుఁగన్నులన్ ధనువుఁ ♦ జేకొని కల్పకృశానుతుల్యు నా
లాగున మండుచుం గరత ♦ లంబునఁ జాపము బిగ్గఁబట్టి వే
లాగి శరోచ్చయంబుఁ బవు ♦ లన్ బలవైరియపోలె వైచినన్. ౨౨౫

అర్థములు. వరుణాలయము=సముద్రము, జేగురుఁగన్నులన్=ఎఱ్ఱని కన్నులతో, కల్ప=ప్రలయకాలమందలి, కృశానుతుల్యు నా లాగున=అగ్నిహోత్రునివలె, శరోచ్చయంబు=బాణసమూహము, పవులన్=పిడుగులను, బలవైరియు=ఇంద్రుఁడే.

తాత్పర్యము

ఇప్పు డీ సముద్ర మేగతిఁ బట్టునో చూడుమని కన్ను లెఱ్ఱచేసి విల్లందికొని ప్రలయకాలాగ్నివలె మండుచు విల్లు గట్టిగఁబట్టుకొని నారి లాగి యింద్రుఁడు పిడుగులను వలె బాణసమూహము విడిచెను.

స్రగ్ధర. జ్వాలాభీలాశుగంబుల్ ♦ చర చర చనుచున్ ♦ సాగరం బుత్తలింపన్
వేలోనం జొచ్చినంతన్ ♦ విషధరచయముల్ ♦ బెగ్గిలెన్ దిగ్గనన్ గ్రా
హాళీకుంభీరయుక్తం ♦ బగు సలిలము వాతాతి ♦ నిర్హ్రాదయుక్తిన్
జాలన్ ఘోరత్వమందెన్ ♦ సరఁగఁ బొగలతో ♦ సంభ్రమద్భంగపాళిన్.

అర్థములు. జ్వాలాభీలాశుగంబుల్=అగ్నిశిఖలచే భయంకరములైన బాణములు, ఉత్తలింపన్=కలవరపడఁగా, విషధరచయముల్=సర్పములు, బెగ్గిలెన్=భయపడెను, దిగ్గనన్ = తటాలున, ఉన్నట్లుండి వచ్చిన యుపద్రవంబుచేత, గ్రాహాళీ = గ్రాహము లను చేపల వరుసలతోను, కుంభీర = మొసళ్ళతోను, యుక్తంబు = కూడినది, సలిలము = నీరు, వాత = గాలివీచుటవలనఁ గలిగిన, అతినిర్హ్రాద = పెద్దధ్వనితో, యుక్తిన్ = కూడికతో, సంభ్రమత్=తిరుగుడుపడుచున్న, భంగపాళిన్ = అలల సమూహములచే.

స్రగ్ధర. దీనిలక్షణ మప్పకవి చెప్పలేదు. మ-ర-భ-న-య-య-య గణంబులు ఎనిమిదింట నెనిమిదింట యతులు.

తాత్పర్యము

అగ్నిశిఖలవంటి బాణములు చరచరపోయి సముద్రమును నల్లకల్లోల మగునట్లు లోలోపలఁ బ్రవేశింపఁగానే యున్నట్లుండి వచ్చిన యా యుత్పాతమునకుఁ బాములు భయపడెను. గ్రాహములతోను మొసళ్ళతోఁ గూడిన నీరు పెనుగాలి

విసరుటచేఁ గలిగిన ధ్వనితో మిగుల భయప్రదమై పొగలతోను సుడిపడుచున్న యలలతోను గానవచ్చెను.

క. సుడి తిరుగుచుఁ దిరుగుడువడి, బుడబుడ శుక్తులను శంఖ•ములఁ గ్రక్కుచు లోఁ
దోడిఁబడుచును వెడరూపునఁ, గడలి కడుం గోడువడ సుడిచి•కళవళ పడియెన్.

అర్థములు. సుడి తిరుగుచున్=గుండ్రముగాఁ దిరుగుచు, తిరుగుడువడిన్= తిరిగెడు వేగముచే, శుక్తులను=ముత్తెపుఁ జిప్పలను, తోడిబడుచున్ = చెదరుచు, వెడరూపునన్ = వికారస్వరూపమున, కడలి = సముద్రము, కడున్=మిక్కిలి, గోడువ=కీడు, ఇందు డకారము వృత్త్యనుప్రాసము, ఒక్క యక్షరమే పలుమాఱు వచ్చిన వృత్త్యనుప్రాస మగును.

తాత్పర్యము

నీళ్ళు గుండ్రముగాఁ దిరుగుచు నా తిరుగువడిచే బుడబుడ మని ముత్తెపుఁ జిప్పలను గ్రక్కుచు లోపల చెదరుచు వికారరూపమున సముద్రము మిగుల బాధపడి కళవళ మందెను.

క. అడలిరి పాతాళంబును, విడియ ట్టగు పన్నగులును • విడివడి తోడిపై
నడరెడి శరముర వడి మం,డెడుకన్నులు మోము లొప్ప•డీలుం గొనుచున్.

అర్థములు. విడిమట్టు = విడియుమట్టు = ఉండుస్థలము, అడలిరి=శోకించిరి, విడివడి=నిర్బంధమునుండి తొలఁగి, తోడి=వేగముతో, అడరెడి = వ్యాపించెడి, డీలుంగొనుచున్ = డిల్లపడుచు.

తాత్పర్యము

పాతాళ మునికిపట్టుగాఁగల పన్నగులు విచ్చలవిడి మీఁద వ్యాపించి వచ్చు బాణముల వేగమునకు ముఖములు కన్నులు మండుచుండ డిల్లపడి శోకించిరి.

ఆ. నక్రమకరకమఠ•చక్రవాళాన్వితే, వింధ్యమందరాభ•వీచితతులు
వేలకొలఁదు లెగసె•విన్నంట నల్ల,కల్లోల మయ్యె జలధి•మూలముట్టు. ౨౭౯

అర్థములు. నక్రమకరకమఠచక్రవాళాన్వితె = మొసళ్ళయొక్కయు, పెద్ద చేఁపలయొక్కయు తాఁబేళ్ళయొక్కయు సమూహముతోఁ గూడిన (చక్రవాళము = మండలము) వింధ్య మందరాభవీచితతులు = వింధ్యపర్వతముతోను మందరపర్వతముతోను సమానమైన యలలగుంపులు, విన్ను+అంట =ఆకాశము తగులునట్లు, మూలముట్టు=పాఁదు మొదలుకొని.

తాత్పర్యము

మొసళ్ళయు పెద్దచేఁపలయు తాఁబేళ్ళయు సమూహములతోఁ గూడిన వింధ్యమందరపర్వతములతో సమానమైన యెత్తుగల యలల సమూహములు వేలకొలఁదు లాకాశముఁ దాఁకున ట్లెగసెను. సముద్ర మడుగునుండి కలఁతపడెను.

శా. ఎన్నం డూనని యుగ్రవేగమున సీ॥తేశుండు కోదండమున్
సన్నాహంబునఁ బట్టి దీర్ఘతరని॥శ్శ్వాసంబులం బుచ్చఁగా
నన్నా! మానుము మాను మంచు వెస డా॥యుం బోయి సౌమిత్రి యా
పన్నార్తావనదక్షుచాపమును సం॥భ్రాంతాత్ముఁ డై పట్టెనన్. ౨౯౦

అర్థములు. ఎన్నండూనని=ఏకాలమందైనను పొందని, సన్నాహంబునన్=పూనికతో, దీర్ఘతర నిశ్శ్వాసంబులన్ = మిగుల నిడివి యగు నూర్పులను, రోషముచే నని భావము. ఆపన్న=ఆపదనొందిన కారణముచే, ఆర్త=దుఃఖించు వారిని, అవన=రక్షించుటయందు, దక్షు = సమర్థుఁడైన వానియొక్క, చాపము = విల్లు, సంభ్రాంతాత్ముఁడై=వేగముతోఁ గూడినవాఁడై, భయముతోఁగూడిన మనస్సు గలవాఁడై.

తాత్పర్యము

ఏదశయందును - ఏకాలమందును లేని వేగాతిశయముచే శ్రీరామచంద్రమూర్తి వింటిని బూనికతోఁబట్టి రోషముచేత మిగుల నిట్టూర్పులు పుచ్చఁగా నెన్నఁడు నీయన యిట్లు కోపించినవాఁడు కాఁడు - ఇట్టి బాణము లింత వేగముగఁ బ్రయోగించినవాఁడును గాఁడు-నేఁ డిదేమి యని భయపడినవాఁడై లక్ష్మణుఁడు అన్నా! అన్నా! బాణములు ప్రయోగింపవలదు వలదని చెప్పుచుఁబోయి బాధచే దుఃఖించువారిని రక్షించు సామర్థ్యముగలవాఁడై యా నిమిత్తముగా బాణములు విడుచువాఁడే కాని నిష్కారణముగ నొకరిని బాధింప బాణములు విడువని యా రామచంద్రుు వింటిని బట్టుకొనెను.

ఇంత కోపమున కేమికారణము? కిష్కింధ విడిచినవాఁ డాలస్యము లేక యొక నెట్టునపోయి రావణుఁడు హెచ్చరిక పడకముందే లంక నెత్తిన పడవలయు నని యెంతో యాత్రముగలవాఁడై వచ్చెను. సముద్ర మడ్డము వచ్చెను. దాని నొక యస్త్రముతో నెండకట్టి దాటిపోవ నాలోచించెను. అట్టిదానికి మూఁడు దినములు సముద్రునివలన జాగయ్యెను. అది సహింపరానిదయ్యెను. మూఁడుదినములు శత్రువులకు సన్నద్ధపడ విరామ మిచ్చినట్లయ్యెను. సీతను జూచుటయందుఁ దడవాయెను. కావున కోపగించెను. సైంధవునివలె ధాటి నడ్డగించువారు శత్రు లేకదా.-శత్రువు పురమునకు నగడ్తయైవానికి సాహాయ్యపడువాఁడై తనకాలము వ్యర్థపుచ్చెనుగదా.

—॥ ౨౨-వ సర్గము. శ్రీరాముఁడు సముద్రుపై బ్రహ్మాస్త్రంబు వేయఁ బూనుట ॥—

చ. జనకసుతామనోహరుఁడు ॥ సాగరు నిట్లను దారుణోక్తి మ
ద్ఘనతర శాతతీవ్రశర॥కాండసుదగ్ధుఁ బ్రశుష్కుఁ జేసి నిన్
గనుము రసాతలంబు దను॥కం బ్రమటిలోపల దుమ్ము రేఁపెదన్
మనియెదె! నీదు రూపమును ॥ మాపెదఁ జూడుము రోరి సాగరా! ౨౯౧

అర్థములు. శ్రీరాముఁడు తనసేన సముద్రమును దాఁటుట యెట్లని యాలోచించి సాధుమార్గమున సముద్రు నుద్దేశించి శరణాగతి చేసెను. దాని కతఁడు వశుఁడు కాలేదు. ఆపై నోటిమాటల బెదరించెను. దానికిని లోబడిన వాఁడు గాఁడు. ఆపైఁ గొన్ని బాణములచేఁ గలఁతపడఁజేసెను. దానికిని గానవచ్చిన వాఁడుకాఁడు. కావున బ్రహ్మాస్త్రముచే సముద్ర మెండఁగట్టఁ దలఁచి బ్రహ్మాస్త్రము సంధించి సముద్రునితో నిట్లు చెప్పుచున్నాఁడు.

జనకసుతా మనోహరుఁడు=సీతాదేవి మనస్సును హరించువాఁడు, సీతచే హరింపఁబడిన మనస్సుగలవాఁడు, మనస్సు పోయినంత వేగమున సీతయొద్దకుఁ బోవఁదలఁచినవాఁడు, మత్=నాయొక్క, ఘనతర=మిగుల గొప్పదగు, శాత=పదునైన, తీవ్ర=వేగముగల, శరకాండ = బాణసమూహములచే, సుదగ్ధుఁజేసి = నీరువట్టి పోవునట్లుచేసి, ప్ర + శుష్కున్ = ఊటలుకూడ మరలఁబుట్టకుండునట్టు లెండించెదను, మనియెదె=బ్రదికెదవా,

తా త్ప ర్య ము

సీతాదేవిచే హరింపఁబడిన మనస్సుగల రామచంద్రమూర్తి భయంకరమైన మాటలతో సముద్రునితో నిట్లనియె. ఓసీ సముద్రుఁడా! నిన్ను పదునైన వేగము గల నా గొప్ప బాణముల సమూహముచే నీరిగిరించి యంతతో విడువక మరల నూటయైనఁ బుట్టకుండునట్టులు పాతాళ లోకమువఱకు నెండించి యల్పకాలములో దుమ్ము రేఁపెదను. నీ స్వరూపమే లేకుండఁ జేసెదను. చూడుము. నాకుఁ గోపము వచ్చునట్లు చేసి నీవు బ్రదికెదవా?

ఉ. మామకచాపముక్తశిత ♦ మార్గణవర్షముచేత సర్వశా
ఖామృగపాళి యీ క్షణమ ♦ కాల్నడ నావలిగొడ్డు చేరఁగా
నో మనుజాశనాలయుఁడ! ♦ యుద్ధతిఁ జూపెద నిప్డు చూడరా,
నీ మది నెట్లెఱింగెదవు ♦ నిస్తులమద్బలవిక్రమంబులన్. ౪౭౨

అర్థములు. నాలోని నీరంతయు శోషిల్లఁజేసితి వేని యపుడు పాతాళము మాత్రమే మిగులును. అప్పుడు నీ సేన నడచిపోవలయు ననిన బాతాళమునకుఁ బోవునేకాని లంకకుఁ బోఁజాలదు. కావున నాకాశమార్గముననే నీ సేన పోవలసి యుండును. కావున నీవు నన్ను బాధపెట్టి యావల నాకాశమార్గమునఁ బోవుటకు మాఱుగ నిప్పుడే నన్ను బాధింపకయే యాకాశమునఁ బోవచ్చునుగదా యని సముద్రుఁడు చెప్పిన ట్లెంచుకొని తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు.

మామక =నాయొక్క, చాపముక్త = వింటినుండి విడువఁబడిన, శిత = పదునైన బాణ = బాణముల, వర్షముచేత = వానచే, సర్వశాఖామృగపాళి = వానర సమూహమంతయు,ఓమనుజాశనాలయుఁడ=రాక్షసులకు స్థానమైనవాఁడా? నీవునన్ను ధిక్కరించుటకు నాకు విరోధులగు రాక్షసుల కునికిపట్టగుటచే వారిగుణమే కలవాఁడవై వారిపక్షమే వహించితివి కావున వారి నెట్లు చేయఁదలఁచితినో నిన్ను

నట్లే చేసెదను అని భావము. ఉద్ధతి = పరాక్రమము, నిస్తుల = అసమానమైన, మత్ = నాయొక్క, బలవిక్రమంబులన్ = బలపరాక్రమములను.

తాత్పర్యము

ఓరీ రాక్షసుల కునికిపట్టయినవాఁడా? నా పదునైన బాణముల వర్షముచేత సేతువుకట్టి వానరసేనను గాలినడకతో నీ క్షణమందె యావలియొడ్డు చేరఁజేసెదను జూడుము. అట్లు నా పరాక్రమముఁ జూపనైతినేని నీ వసమానమైన నా బల పరాక్రమముల నెట్లెఱుఁగఁగలవు?

లోకమునఁ గొందఱు సహజముగ బుద్ధిమంతులు, కొందఱు బోధముచే బుద్ధిమంతు లగుదురు. కొందఱు బాగుగఁ గొట్టినఁగాని బుద్ధిమంతులు కాఁజాలరు. నీ వీ మూఁడవతరగతిలోఁ జేరినవాఁడవు.

శా. కానీరా యని బ్రహ్మదండనిభ మా ♦ కాండంబు కోదండమం
దా నీరేజవిలోచనుండు దొడి బ్ర ♦ హ్మాస్త్రంబు మంత్రించి, వే
గానన్ జ్యాలత రోషతీవ్రుఁ డయి యా ♦ కర్ణాంతమున్ లాగ, గ్రా
వానీకంబులు సంచలించె దిశ ల ♦ ల్లాడెఁ బెంజీఁకటిన్. ౪౫౩

అర్థములు. బ్రహ్మదండనిభము = బ్రహ్మదండముతో సమానమైనది, బ్రహ్మదండము = బ్రాహ్మణశాపము అప్రతిహతమైనదని భావము, కేతువిశేష మని మఱికొందఱు. 'పితామహాత్మజః క్రూరః త్రివర్ణ శ్శిఖరాన్వితః, బ్రహ్మదండాహ్వయః వేదః సర్వభూతవినాశనః' యను నారద సంహితావచనము ప్రమాణము. కాండంబు = బాణము, తొడి = సంధించి, జ్యాలత = తీఁగవంటి యల్లెత్రాడు, ఆకర్ణాంతమున్ = చెవికొనవఱకు, గ్రావానీకంబులు = పర్వతముల సమూహములు, పెంజీఁకటిన్ = గాఢాంధకారంబునందు.

తాత్పర్యము

కానీరా యని బ్రహ్మదండముతో సమానమైన బాణమునొకదానిని వింట సంధించి రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రంబుచే దాని నభిమంత్రించి మిక్కిలి వేగముతో నల్లెత్రాటిని తన చెవికొనవఱకు లాఁగగా కొండలు గడగడ లాడెను. దిక్కులు గాఢాంధకారమున మునిఁగి పడఁకెను.

శా. వ్రక్కల్ వాఱెను రోదసీబిలము, మా ♦ ర్తాండక్షపానాయకుల్
చక్కల్ త్రోవలు తప్పె, నేళ్ళుఁ గొలఁకుల్ ♦ క్షోభించె, నుల్కాతతుల్
లెక్కల్ మీఱి మహారవంబునను వ్రా ♦ లెన్ మేదినిన్, మింట వా
ర్ధ్మకుల్ మారుతపంక్తులున్ బలిసెఁ బె ♦ న్మూర్ఛం గొనెన్ జంతువుల్.

అర్థములు. రోదసీబిలము = బిలమువలె భూమికి నాకాశమునకు నడుమనుండు ప్రదేశము, అనఁగా దాని యందలి పదార్థములు, వ్రక్కల్ = బ్రద్దలు, మార్తాండ క్షపానాయకుల్ = సూర్యచంద్ర బింబములు, త్రోవల్ దప్పెను = తమ

మార్గము విడిచి వేఱొకమార్గమునఁ బోయెను. కర్తలనేకంబు లున్నచోఁ గ్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబు లగు సు. వ్యా. వాక్య. 32వ సూ. తప్పినను క్రియకు చుక్కల్ అనుపదము సమీపమున నుండుటచే దాని కనుగుణముగఁ గ్రియయుఁ బ్రయోగింపబడెను. ఉల్కాతతుల్=కొఱవులవంటి నక్షత్రసమూహములు, "ఉల్కాశిరసి విశాలా నిపతంతీ వర్ధతేచ తనుపుచ్ఛా"యని వరాహమిహిరుఁడు. మహారవంబునను=పెద్ద ధ్వనితో, మేదినిన్=భూమిమీఁద, వార్ముక్కుల్, వాః + ముక్కుల్ = మేఘములు.

భూమికి నాకాశమునకు నడిమిప్రదేశమునం గల గృహములు లోనైనవి బ్రద్దలయ్యెను. సూర్యచంద్ర నక్షత్రములు పెడత్రోవఁబోయెను. నదులు సరస్సు లందలి నీళ్ళుకిగెను. లెక్కలేని కొఱవులవంటి నక్షత్రములు పెద్ద ధ్వనితో నేలపైఁబడెను. ఆ కారణమున మేఘములు మహావాయువులు నధికము లయ్యెను. జంతువులు మూర్ఛపోయెను.

క. సంతమసనమావృతదిన, కాంతమయూఖములతోడ ♦ గగనతలం బు
 ద్భ్రాంతిం గూర్చుచుఁ గొఱవుల, సంతతి వెలుఁగొందునట్లు ♦ జ్వలితం బయ్యెన్.

అర్థములు. సంతమస=సర్వత్రవ్యాపించు చీఁకటి సంతమస మనఁబడును "విష్వక్సంతమస" మ్మని యమరము. సమావృత = బాగుగ నావరింపఁ బడిన - దినకాంత = సూర్యుని - మయూఖముల తోడ = కిరణములతో - ఉద్భ్రాంతిన్= మిగుల భ్రాంతిని - ఎక్కువ కలఁతను - జ్వలితంబు=మండినది.

తా త్ప ర్య ము

అన్నిచోటులఁ గ్రమ్ముకొను చీఁకటిచే నావరింపఁబడిన సూర్యకిరణములతో నాకాశము చూచువారికిఁ గలఁత గలిగించుచు కొఱవులవలె మండుచుండెను.

క. అంజలి గుంజలిగా నెగ,యం జిమ్ముచు మేఘవితతి ♦ వనసీజములన్
 భంజించె సశైలశిఖర, పుంజముగఁ బ్రభంజనుండు ♦ పురుభీతిదుఁడై. ౭౧౬

అర్థములు. అంజలిగుంజలిగాన్=గాసిపడునట్లు-చిందఱవందఱగా-సశైలశిఖరపుంజముగన్ = కొండలశిఖరముల సమూహములోడ - ప్రభంజనుండు = సుడిగాలి - పురుభీతిదుఁడై = మిగుల భయము గలిగించువాఁడై.

తా త్ప ర్య ము

సుడిగాలి మిగుల భయంకరముగ మేఘముల చిందఱవందఱగా నెగురఁ జిమ్ముచుఁ గొండల శిఖరముల సమూహములతోడ వృక్షములను విఱిచెను.

క. భైరవరవపూరితములు, ఘోరంబులు నైన మేఘ♦కోటులు గురిసెన్
 ధారిణిఁ జిచ్చులపిడుగుల, ధారలు బెక్కొట్టై భూత♦తతి దీనదశన్. ౭౧౭

అర్థములు. భైరవరవపూరితములు=భయంకరధ్వనిచే నిండినవి, చిచ్చుల

పిడుగులధారలు=నిప్పులవంటి పిడుగుల సమూహములను, చిచ్చుఱ రూ. చిచ్చఱ. "చిచ్చుఱ పిడుగట్టు లట్టడరి శూరుల మొత్తము నుగ్గుసేసెదన్" అనియు చిచ్చఱ పిడుగుల్ వడిం దొఱఁగు చాడ్పున" ననియు తిక్కన ప్రయోగములు, చిచ్చు+ ఉఱ = అగ్నిని లక్ష్యముసేయని - చిచ్చు + అఱ = చిచ్చఱ, బెకొట్టెన్ = బెంగకొట్టు, బెకొట్టు=ఏడ్చెను.

తాత్పర్యము

భయంకరధ్వనులు భయంకరాకారములుగల మేఘసమూహములు భూమి మీఁద నిప్పులుగ్రక్కు పిడుగులను వర్షించెను. భూతముల సమూహములు దుఃఖముచే నేడ్చెను.

క. ఎదపడి జంతులు ధరఁబడి, కదలక మెదలకయు యుండె • గడు నెసఁగించెన్
రొదల నదృశ్యపుభూతన, ముదయము కడలియు ససత్త్వముగ వెతఁజెందెన్.

అర్థములు. ఎదపడి=గుండెలు పగులునట్లు భయపడి, రొదలన్ = ధ్వనులను, అదృశ్యపు=కానరాని, కడలియు=సముద్రము, ససత్త్వముగ=తనలోనుండు జంతువులతో.

తాత్పర్యము

జంతువులు భయపడి కదలక మెదలక యెక్కడనున్నవి యెట్లున్నవి యట్టులే యుండెను. కానరాని భూతముల గుంపులు ధ్వనులు సేసెను. సముద్రము తనలో నున్న జంతువులతో బాధపడెను.

—• శ్రీరామునకు సముద్రుఁడు ప్రత్యక్ష మగుట •—

చ. చెలియలికట్ట వాసి యల • సింధువు యోజన మేగె లోనికిన్,
లలితదయాబ్ధి రాముఁడు క • లంబకమున్ విడఁ డయ్యె, నయ్యెడన్
జలముల నుండి మేరుగిరి • నప్తతురంగుఁడువోలెఁ దోఁచె ను
జ్జ్వలితముఖాహిసంవృతుఁడు • జాంబవభూషణభూషితాంగుఁడున్. ౮౯

అర్థములు. లలితదయాబ్ధి=జనమనోహరమైన దయారసమునకు సముద్రమైనవాఁడు, ఆ సముద్రుఁడు నీళ్ళచే నిండినవాఁడు. రామసముద్రుఁడు దయారసముచే నిండినవాఁడు. ఇంత కోపముగలవాఁడైనను దయవదలినవాఁడు కాఁడని భావము. కావుననే, కలంబకమున్=బాణమును, విడువఁడయ్యెను=వదలినవాఁడు కాఁడు. సముద్రమును కానవచ్చి దోవయిచ్చెదవా చంపుదునా యని బెదరించుటకై బాణము సంధించినవాఁ డగుటచే విడఁడయ్యె. సప్తతురంగుఁడు = ఏడు గుఱ్ఱాలవాఁడు, సూర్యుఁడు, ఉజ్జ్వలిత=విషముచే మండుచున్న (౨) పడగల యందలి మణులచేఁ బ్రకాశించుచున్న, ముఖ= మొగములుగల, అహి=పాములచే, సంవృతుఁడు=చుట్టుకొనఁబడినవాఁడు, జాంబవభూషణ = బంగారు సొమ్ములచే, భూషిత=అలంకరింపఁబడిన, అంగుఁడు=దేహముగలవాఁడు.

తాత్పర్యము

సముద్రమున నొక యోజనము దూరము నీళ్ళు చెలియలికట్ట విడిచి లోపలి కీడ్చుకొనిపోయెను. దయాసముద్రుఁ డగు రామచంద్రమూర్తి భూత సంహారమం దిష్టము లేనివాఁడగుటచే బాణము వదలఁడయ్యెను. అప్పుడు మేరుగిరి విడిచి లోకమునకుఁ గానవచ్చు సూర్యునివలె మండుచున్న ముఖములు గల సర్పములతోఁ జుట్టఁబడినవాఁడును బంగారు సొమ్ములు ధరించినవాఁడును నగు సముద్రుఁడు నీళ్ళలో నుండి వెలుపలవచ్చెను.

ఆ. సాటిమీఱు నొంటి • పేటహారంబును, ధ్యమునఁ బాటలప్ర • భాంచిత మయి
కౌస్తుభానుజ మయి • సిస్తగు మణిపత, కం బురంబునందుఁ • గ్రాలువాఁడు. ౮౬౦

అర్థములు. పాటల ప్రభా + అంచితము = ఎఱ్ఱని కాంతిచే నొప్పినది, కౌస్తుభానుజము = సముద్రమున కౌస్తుభము పుట్టిన తరువాతఁ బుట్టినది. అనఁగా దానితో సమానమైనది, సిస్తు=అందము.

తాత్పర్యము

అసమానమైన యొంటిపేట ముత్యాలసరము నడుమ నెఱ్ఱని కాంతిగలదై కౌస్తుభమువలెఁ బ్రకాశించు మణిపతకమును వక్షమున ధరించినవాఁడు.

సీ. స్నిగ్ధవైడూర్యస • న్నిభుఁడు లోహితమాల్య, వస్త్రధరుండును • వారిజాత
పత్రనేత్రుఁడు దివ్య • పౌష్పమాలాంచిత, మస్తుఁ డాత్మజరత్న • మండితుండు
ప్రాలేయశైలంబు • లీల నానాధాతు, యుక్తుఁ డాఘూర్ణభం • గౌఘుఁ డతుల
కాలికానికర వా • తూలసంకులుఁడు ను, ద్వర్తితనక్రుఁడు • భ్రాంతరాక్ష

తే. సావళీలేలిహానుండు • నైన వీర
వరుఁడు సాగరుఁ డా యస్త్ర • పాణిఁ జేరి
యంజలి ఘటించి రామచం • ద్రా! యటంచు
సాదరంబుగఁ బిలిచి యి • ట్లనియె నపుడు. ౮౬౧

అర్థములు. స్నిగ్ధ=నునుపైన వైడూర్య సన్నిభుఁడు = వైడూర్యకాంతి గలవాఁడు, లోహితమాల్య వస్త్రధరుండును=ఎఱ్ఱని పూలహారములు వస్త్రములు ధరించినవాఁడు, వారిజాతపత్రనేత్రుఁడు=తామర రేకులవంటి కన్నులుగలవాఁడు, దివ్య=దేవతాసంబంధమైన, పౌష్పమాలా = పూలదండలచే, అంచిత = ప్రకాశించు, మస్తుఁడు = శిరస్సుగలవాఁడు, ఆత్మజ = తనయందుఁ బుట్టిన, రత్న= మణులచే మండితుఁడు = అలంకరింపఁబడినవాఁడు, ప్రాలేయశైలంబులీల = మంచుఁ గొండవలె, నానాధాతు యుక్తుఁడు=అనేకములైన ధాతువులతోఁ గూడినవాఁడు, ఆఘూర్ణుఁడు=తిరుగుడుపడుచున్న, భంగౌఘుఁడు=అలలసమూహములు గలవాఁడు, అతుల=అసమానమైన, కాలికానికర = మేఘపంక్తిచేత, వాతూల= గొప్పవాయువుచేత, సంకులుఁడు = కలఁతపడినవాఁడు, ఉద్వర్తిత నక్రుఁడు=తల

క్రిందు లగుచున్న మొసళ్ళుగలవాఁడు, భ్రాంత=దిగ్భ్రమఁగొనిన, రాక్షసావళీ= రాక్షససమూహములను, లేలిహానుఁడు = పాములను గలవాఁడు, అస్త్రపాణిన్= అస్త్రములు చేత ధరించిన వానిని.

తాత్పర్యము

నునుపైన వైడూర్యమువంటి కాంతిగలవాఁడును, ఎఱ్ఱని పూలదండలు, ఎఱ్ఱని వస్త్రములు ధరించినవాఁడును, తామరరేకులవంటి కన్నులు గలవాఁడును, దేవతా పుష్పముల మాలికలచేఁ బ్రకాశించు శిరస్సుగలవాఁడును, తనయందుఁ బుట్టిన మణులచే నలంకరింపఁబడినవాఁడును, మంచుగొండవలె నానాధాతువులు గలవాఁడును, తిరుగుడుపడుచున్న యలల సమూహములు గలవాఁడును, మేఘములతోను, గాలితోను కలఁతపడినవాఁడును, తలక్రిందు లగుచున్న మొసళ్ళు లోనగు జంతువులు గలవాఁడును, దిగ్భ్రమగొన్న తనయందలి రాక్షసులు పాములు గలవాఁడును నైన వీరవర్యుఁడు సముద్రుఁ డా యస్త్రపాణిని జేరి నమస్కరించి రామచంద్రా యని యాదరముతోఁ బిలిచి యిట్లనియె.

ప్రశ్న—ఇంత యాదరము భక్తిగలవాఁ డేల యంతకాల మాలసించెను !

సమాధానము-ప్రార్థించినంత మాత్రముననే ప్రసన్నుఁడై దర్శన మిచ్చి మార్గమిచ్చిన యెడల నందఱు నీ మార్గము నే యనుసరింతురు. నీవు త్రోవయిచ్చెదవా చత్తువా యని ప్రాయోపవేశము చేయ నారంభింతురు. అట్టిదానికి దోవ చూపరాదు. ఇప్పుడో యంతటి రామచంద్రమూర్తికి సాధ్యముగానిది మన కగునా యని విరమింతురు. - ఈయనచేఁ దనకు శత్రువులగు నాభీరులఁ జంపింప వలయును. అది రామచంద్రునకుఁ దప్పఁ దక్కినవారికి సాధ్యమగునదికాదు. ఊరక చంపుమనినఁ జంపఁడు. కావున స్వామికార్యము స్వకార్యము రెండు జక్కఁబడుటకై యింతవఱకాలసించెను, గాని రామచంద్రమూర్తి మహిమ యెఱుఁగకకాదు. రామచంద్రమూర్తి యెంత కోపించినను నమస్కరించె నేని క్షమించునని సముద్రుఁ డెఱుఁగును.

చ. అవనినభోనిలానలప•యస్సులు శాశ్వత మైన మార్గమున్
దవిలి స్వభావ మేమియును • దప్పవ, యట్టుల నే నగాధ మ
ప్లవమును నౌట నా సహజ•భావము, దీనిని దప్పరాదు, రా
ఘవవర! సౌమ్య! యియ్యది య•కార్యము, నీకు నెఱుంగఁ జెల్పితిన్. ౮౬-౨

అర్థములు. అవని - నభస్ - అనిల - అనల - పయస్సులు = భూమి - ఆకాశము - వాయువు - అగ్ని - జలము - అను పంచభూతములు, పయః ప్రభృతుల సకారాంతంబులకు సగాగమద్విత్వంబులు నిత్యంబులు. సు-వ్యా-తత్స-సూ. ౯౨. కావున పయస్సు అనియే రూపము; పయసు-పయము అపశబ్దంబులు. అట్టుల=అట్లులే-ఇది కళయే కాని ద్రుతాంతముకాదు. అట్టులు+అ=అట్టుల, అగాధము=లోఁతైనది, అప్లవము=దాఁటరానిది.

తా త్ప ర్య ము

పంచమహాభూతము లగు భూమి ఆకాశము అగ్ని జలము వాయువులు శాశ్వతమైన తమమార్గమును వదలి వానిస్వభావము విడువవు. ఆ విధముగానే జలరూప మగు నేను లోఁతు తెలియనీయను. కాలినడక దాఁటనీయను. ఇది నా స్వభావము. దీనిని నేను దప్పరాదు. రామచంద్రా! సౌమ్యుఁడా! నేను నా స్వభావమునకు విరుద్ధముగ వర్తించుట సరియైన కార్యముగాదు.

తే. కామముననైన లోభాది♦కారణముల, నైన భయముననైనను ♦ రాధినాథ!
గ్రాహనక్రాకులం బుద♦కంబు నేను, స్తంభనముఁ జేయరాద యే♦సమయమునను.

తా త్ప ర్య ము

కామముచేనైనను లోభములోనగు కారణములచేనైనను భయముచేనైనను మొసళ్లులోనగు జలజంతువులు గల నానీటిని నేను గట్టిపడఁజేయరాదు. అట్లు చేసితినేని యీ జీవజంతువులు బాధపడును, చచ్చును, కావున నే నెప్పు డట్టి పని చేయరాదు. నన్నాశ్రయించిన వాని నేనెట్లు బాధపఱుతును.

ఉ. ఏనను నీదు కీశబల♦ మంతయు దాఁటునిదాఁక గ్రాహసం
తానము సేన కెట్టిబెడ♦దల్ సమకూర్పక యుండఁ గాచెదన్
జే నయినంత, నీ ప్లవగ♦ సేన ధరింప స్థలం బొసంగెదన్
మానుము కోప మన్న రఘు♦ మండనుఁ డిట్లను సమ్మహోద్ధికిన్. ౪౬౪

అర్థములు. కీశబలము=వానరసేన, బెడదల్=అపాయములు.

తా త్ప ర్య ము

అయినప్పటికిని నీ వానరసేన యంతయు దాఁటు వఱకు వారి కేయపాయము నాలోని మొసళ్ళు లోనైనవి కలిగింపకుండ నాచేనైనంత వఱకు రక్షించెదను. నీ సేన దాఁటుటకు మిట్టప్రదేశము నిచ్చెదను. కోపము విడువుమని చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనెను.

—♦ శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రమును ద్రుమకుల్యముపైఁ బ్రయోగించుట ♦—

ఉ. ఇయ్యదమోఘమైన శర♦ మెచ్చట వైతు నటన్న సాగరుం
డయ్యతులాస్త్రముం గని ధ♦రాధిపుతో ద్రుమకుల్యమంచు నో
యయ్య! భవద్విధంబున మ♦హాఖ్యను గన్నతలంబు గల్గు నొం
డయ్యెడ నుగ్రదర్శులు మ♦హాకలుషాత్ములు దస్యు లుద్ధతిన్, ౪౬౫

అర్థములు. అమోఘము = వ్యర్థముగానిది, మహాఖ్యను = పెద్దకీర్తిని, ఉగ్రదర్శులు=భయంకరములైన చూపులు గలవారు, దస్యులు=దస్యుజాతివారు, దొంగలు.

తా త్ప ర్య ము

ఈ బాణము వ్యర్థము పోరాదు - దీని నెచ్చట వేయుదు నని ప్రభు

గఁగా సముద్రుఁ డిట్లనియె. ఈ మహాస్త్రమును నీవలెఁ బవిత్రమై ప్రసిద్ధిగన్న ద్రుమకుల్య మను ప్రదేశంబుగలదు. అందు దస్యుజాతులవారు భయంకరములైన చూపులు గలవారు మహాపాపాత్ములుగలరు. ద్రుమకుల్య = చెట్లయొద్ద నీటికాలువలు గలది.

క. వాలాయము నా జలములఁ, గ్రోలుదు రాభీరు లట్టి ♦ కుటిలుల స్పర్శన్.
దాళఁగఁ జాలను దన్ని, ర్మూలముఁ గావింపు నీ య ♦ మోఘశరమునన్. ౮౬౬

అర్థములు. ఆభీరులు = శూద్రజాతియం దొక తెగవారు, ఈ యాభీర శబ్దమే వర్ణవ్యత్యయముచే అరాబియా యయ్యెను.

తాత్పర్యము

ఆ పుణ్యప్రదేశమునందు ఆభీరులు చేరినారు. వారు కుటిలవృత్తి గలవారు. వారిస్పర్శ నేను సయింపఁజాలకున్నాను. వారు నిర్బంధముగ నా జలము పానము చేయుదురు. నీ యమోఘబాణముచే వారిని నాశముచేయుము.

సీ. అనవుడు రాముం ♦ డబ్ధి చూపినచాయ, జ్వలదగ్నిశరమును ♦ వైచుటయును
శరపతనం బైన ♦ స్థలము గాంచెను మరు, కాంతార మనఁ బేరు ♦ కాండకలిత
రంధ్రంబునుండి నీ ♦ రంబు పైకెగసె ర, సాతలంబున నుండి ♦ సరభసముగఁ
గూపంబునకు వ్రణ ♦ కూప మన్ బే రబ్బె, నందుండి యెగసెడి ♦ యంబురాశి
తే. కడలికుద్దిగఁ దోఁచుఁ ద ♦ త్కాండవరము, భయదనినదస మేతంబు ♦ వసుధ వ్రచ్చు
కతన నచ్చటిగుంటలఁ ♦ గలజలంబు, శోషగిలె నంత రఘువంశ ♦ భూషణుండు.

అర్థములు. జ్వలత్+అగ్ని+శరమును=మండుచున్న యగ్నివంటి బాణమును, శరపతనంబు = బాణము పడిన, మరుకాంతారము = చెట్లుచేమలులేని యెడారి, కాండకలితరంధ్రంబు=బాణముచేఁ జేయఁబడిన రంధ్రము, కూపంబునకు=బావికి, కడలికి=సముద్రమునకు, తత్కాండవరము = ఆ శ్రేష్ఠమైన బాణము, భయద నినదసమేతంబు = భయంకరమైన ధ్వనితోఁగూడినది, వ్రచ్చుకతన = ఛేదించిన కారణమున, శోషగిలెన్ = ఎండెను.

తాత్పర్యము

సముద్రుఁ డిట్లు చెప్పఁగా నాయన చూపించిన దిక్కుగా నిప్పువలె మండుచున్న యా బాణమును వేయఁగా నా బాణము పడినచోట ఎడారి యను పేరు గాంచెను. ఆ బాణము భూమిలోఁ బ్రవేశించుటచేఁ గలిగిన రంధ్రమునుండి పాతాళ జలము పైకెగసెను. ఆ కూపమునకు వ్రణకూప మనిపేరు. అందుండి వచ్చు నీరు సముద్రమువలెఁ దోఁచెను. ఆ బాణము భూమిని భేదించుటచే నా వేఁడిమికి నచ్చట వారు త్రాగుచుండిన గుంటలలోఁగల జలముకూడ నెండిపోయెను.

కం. ఆ మరుకాంతారమునకుఁ, బ్రేమంబున వర మొసంగెఁ ♦ బ్రియయవసము వీ
తామయమున్ ఫలమూలర, సామలమున్ సురభితౌష ♦ ధాన్వితమునుగాన్. ౮౬౭

అర్థములు. ప్రియయవసము=ఇంపైన పచ్చిక, వీతామయము=రోగము లేనిది, ఫలమూల రసామలమున్=ఫలములచేతను, గడ్డలచేతను, జలములచేతను నిర్మలమైనది. సురభిత=పరిమళించు, ఔషధ = మూలికలసమూహముచే, అన్వితము=కూడినది, కాన్=అగునట్లుగా.

తా త్ప ర్య ము

ఆ జలము లేని యడవికి నింపైన పచ్చిక గలదిగాను ఆరోగ్యకరముగ నుండునదిగను కందమూల ఫలాదులు గలదై యుండునట్లును సువాసన గల మూలికలు గలదిగా నగునట్లు ప్రేమముతో వరమిచ్చెను.

క. ఆ వరముబలము పెంపున, నా వసుధ శుభప్రదేశ ♦ మయ్యెను; నిటు పా
రావారము దనకుక్షి ధ, రావల్లభు తీవ్రతరశ ♦ రంబునఁ గ్రాఁగన్. ౨౮

అర్థములు. వసుధ=భూమి, క్రాఁగన్=తపింపఁగా.

తా త్ప ర్య ము

ఆ వరము బలముచే నాభూమి శుభస్థలమయ్యెను. ఈ ప్రకారము సముద్రము తనలోని భాగము రామచంద్రమూర్తి తీక్ష్ణమైన బాణముచేఁ గాలిపోఁగా, సేతువు కట్టుటకుఁ దనలో స్థలము చూపించెద నని మాత్రము తొలుత సముద్రుఁడు చెప్పెను. ఇప్పుడు చేసిన సాహాయ్యమువలన మఱియొక వాక్యరూప సాహాయ్యము చేయుచున్నాఁడు. అది యేమన.

చ. సకలకళావిశారదుని ♦ త్వాష్ట్రునిఁ బెంచియుఁ బల్కు విశ్వక
ర్మకుఁ దనయుండు, తండ్రికి స ♦ మానుఁడు, తద్వరశక్తి విద్యలన్
బ్రకటితదర్పుఁ డీ నలుఁడు ♦ రాఘవ! సేతువుఁ గట్టఁగా సము
త్సుకుఁ డగుఁగాక, తద్భరముఁ ♦ దోయజలోచన! యేన తాల్చెదన్. ౨౯

అర్థములు. సకలకళావిశారదుని=సమస్తవిద్యలయందుఁ బండితుని - దీని వలన రామచంద్రమూర్తికి శిల్పవిద్యయుఁ దెలియునని భావము. త్వాష్ట్రునిన్=రాజై యుండియు నివి యన్నియు నేర్చిన వానిని, సముత్సుకుఁడగుఁగాక=నిండుమనస్సుతోఁ=బ్రయత్నించువాఁడగును గాక, తద్భరము=ఆ భారము.

తా త్ప ర్య ము

భూమికంతయుఁ బ్రభువవ్యు సకలవిద్యలయందుఁ బాండిత్యముగల రామచంద్ర మూర్తిని జూచి సముద్రుఁడు మఱియు నిట్లనియె. మీయొద్దనుండు నీ నలుఁడు విశ్వకర్మకుమారుఁడు, శిల్ప విద్యయందుఁ దండ్రితో సమానుఁడు, తండ్రివరముచే నావిద్యలందుఁ బ్రసిద్ధిశక్తిగలవాఁడు. వీఁడు సేతువునిర్మించుటయందుఁ బ్రయత్నించువాఁ డగునుగాక - ఆ సేతువు భారమును నేను సహించెదను. కొండలు చెట్లు మన్ను నీళ్ళలో వేసినపుడు మునిఁగియైనఁబోవును. అలల దెబ్బకునీవలావలఁ దొలఁగియైనఁబోవును. అట్లుగాకుండ నేను రక్షించెదను. ఇది నీళ్ళమీఁద తాలు తేలునట్లు

చేసెద నని సూచన-ఇట్టి వరశక్తి నలునకుఁ గలదని యున్యత్ర చెప్పఁబడెను. అట్లు నలుఁడు వేసిన రాలు నీళ్ళమీఁదఁ దేలునపుడు అలల వేగమునకు నవి నిలకడలేక చెదరిపోవుట సిద్ధము. కావున నట్లు పోకుండ రక్షించెదనని భావము.

—♦ నలుఁడు సేతువు నిర్మించుట ♦—

సీ. అని తిరోహితుఁడైన ♦ నను నలుం డవనీశ ! వారిధి సత్యంబుఁ ♦ బలికె దేవ!
 యీ మహోదధియందు ♦ నేను సేతువుఁ గట్టు, వాఁడ మజ్జనకుని ♦ వరము పేర్మి
 దండ మొక్కటియె యు ♦ త్తమము లోకంబున, బురుషున కెంచు నే ♦ బుద్ధిఁదలఁతు
 నకృతజ్ఞు లగువారి ♦ యందు శమం బేని, దాన మేనియు సాంత్వ ♦ మైనఁ గాని
ఆ. నిష్ఫలప్రయోజనంబు ♦ నీరజలోచన!, దండభీతిఁ గాదె ♦ తనదు లోఁతు
 చూపఁ గలిగె జలధి ♦ చూడఁగఁ గోరి నా, సేతుబంధనంబు ♦ భీతిదంబు. ౪౭౧

అర్థములు. తిరోహితుఁడు=కానరాకపోయినవాఁడు, దండము = శిక్ష, అకృతజ్ఞులు=చేసినమేలు మఱచువారు, భీతిదంబు=భయంకరమైనది.

తాత్పర్యము

ఇట్లు చెప్పి సముద్రుఁడు కానరాకపోఁగా నప్పుడు నలుఁ డిట్లనియె. రామచంద్ర దేవా! సముద్రుఁడు నిజము చెప్పెను. నా తండ్రి వరము బలమున నేను సముద్రమునందు సేతువు కట్టెదను. లోకమున చేసినమేలు తలఁపనివారియందు శాంతి మంచిమాట దానము పనికిరాదు. మర్దించుట యొక్కటియే పనికివచ్చును. సాగరుఁడు నీయెడఁ గృతజ్ఞుఁడు కాని కారణమునఁ గదా నీవు మంచితనమునఁ బ్రార్థించినపుడు బిఱ్ఱబిగుసుకొని పలుకక యుండెను. తన్నిన కారణముచే వచ్చి నా సేతుబంధనంబు చూడఁగోరి తనలోఁతు మనకు సాధ్యమగునట్లు చేసెద ననెను.

చం. మును వల విశ్వకర్మ వర ♦ మ్ముం దయచేసెను మందరాద్రి మ
 జ్జననికి, విశ్వకర్మకును ♦ సంభవ మందితి నౌరసాత్మజుం
 డను నయి, శిల్పవుంబనుల ♦ నైపుణిఁ దండ్రికి నీడు వత్తు, నీ
 వననిధిమాటనన్ స్మృతికి ♦ వచ్చెను మద్వరశక్తి రాఘవా! ౪౭౨

అర్థములు. ఔరసాత్మజుఁడను=సొంతకొడుకను, నైపుణిన్=నేర్పునందు.

తాత్పర్యము

నేను విశ్వకర్మకు నౌరసపుత్రుఁడను, పూర్వము నా తల్లికి విశ్వకర్మ నీ కుమారునకు సమస్త శిల్ప విద్యలు వచ్చునని వరమిచ్చెను. ఆ వరము బలమున నేను శిల్పవిద్యయందుఁ దండ్రితో సమానుఁడను. ఈ సముద్రుఁడు చెప్పుటచే నా వరశక్తి జ్ఞప్తికి వచ్చెను.

క. ఈ సాగరుండు దీనిన్, మీా సన్నిధిఁ జెప్ప కున్న ♦ మిన్నక యుందున్
 నా సామర్థ్యము నేనే, వాసి చెలఁగఁ జెప్పుకొనఁగ ♦ భావ్యము గామిన్. ౪౭౩

తాత్పర్యము

నీయందిట్టి శక్తిగలవాఁడవు సేతు వెట్లు కట్టవలెను? సముద్రమెట్లు దాఁటవలెను? అని మే మాలోచించుచుండ వినియు నీవేల యూరకుంటివి అనెద రేమో నా సామర్థ్యము నేను జెప్పుకోరాదు. ఇంత గొప్పకార్యము నేనే పూనితి నేని యెట్లుండి యెట్లు వచ్చునో నామాట నమ్ము వారెవ్వరు? ఇప్పుడు సముద్రుఁడు చెప్పుటచే నా మాట నందఱు నమ్మెదరు.

దీనివలనఁ దన పాండిత్యము సామర్థ్యము తాను జెప్పుకోరాదని సూచన- రంభ మైనను దన స్తనమును దాను పిసికికొనినను సుఖము లేదని చాటూక్తిగలదు.

ఉ. కట్టుదు నేను సేతువును ♦ గంధిజలంబుల వానరావళుల్
పట్టుగఁ దోడ్పడన్ వలయుఁ ♦ బార్థివవర్య! యటన్న భూమిపా
లేట్టుని యాజ్ఞ మైనగచ ♦ రేశ్వరు లెల్లరు నేగి కానలన్
జెట్టులు పెళ్ళగించికొని ♦ చెచ్చరఁ దెచ్చిరి వార్ధివేలకున్. ౮౭౮

అర్థములు. గంధిజలంబులన్ = సముద్రము నీళ్ళయందు, భూమిపాలేట్టు= రాజశ్రేష్ఠుఁడు, వార్ధివేలకున్ = సముద్రతీరమునకు.

తాత్పర్యము

రామచంద్రదేవా! నేను సేతువు కట్టెదను. దానికిఁ గావలసిన పదార్థములు తెచ్చుటయందు వానరులు నాకు సహాయపడవలయును. నేనే వస్తువులు తెచ్చుకొని కట్టవలయు ననిన ఆపని కానేరదు. అని చెప్పఁగా రామచంద్రమూర్తి వానరుల కందఱకు చెట్లుగుట్టలు తెచ్చి నలునొద్ద నిండని యాజ్ఞాపింపఁగాఁ వారట్టులే యడవులకుఁబోయి చెట్లు పెళ్ళగించుకొని సముద్రతీరమునకు వచ్చిరి.

సీ. సాలాశ్వకర్ణముల్ ♦ సప్తపర్ణంబులు, ధవవంశకుటజముల్ ♦ తాలములును
దిలకార్జునంబులు ♦ తినిశబిల్వంబులు, సుమయుతకర్ణికా ♦ రము లశోక
వారముల్ మామిళ్ళు ♦ వకుళముల్ చంద్రలు, తాలదాసినుగుల్మ ♦ జాలములును
వేములు టెంకాయ ♦ వృక్షముల్ హరులున, మూలముల్ గాను వి ♦ మూలములుగఁ

ఆ. దెచ్చి రింద్రమధ్వజముఁ ♦ దెచ్చెడి భంగిని, నంతఁ గపులు కొంద ♦ ఱలవుమీఱి
కొండగములఁ బెఱికి ♦ దండియంత్రంబుల, నునిచి తెచ్చి రప్పు ♦ డుదధికడకు.

అర్థములు. సాలముల్ = మద్దులు, అశ్వకర్ణముల్ = ఇనుమద్దులు, సప్తపర్ణంబులు = ఏడాకుల యరఁటులు, ధవ = చండ్రలు, వంశ = వెదుళ్ళు, కుటజ = కొండమల్లె, తాలముల్ = తాటిచెట్లు, తిలక = బొట్టుగు చెట్లు, అర్జునములు = ఏఱుమద్దులు; తినిశ = నెమ్మిచెట్లు, బిల్వములు = మారేడులు, కర్ణికారము = కొండగోఁగు, వకుళముల్ = పొగడలు, టెంకాయలు = టెంకాయచెట్లు, దీని కర వమున తేంగాయ యందురు. దానికి దక్షిణదేశమున లంకనుండి వచ్చినదందురు. పై పెమ్ప భరతఖండమున లేదందురు. ఆర్యావర్తమందు అంతకు ఉత్తరమున

నున్నట్లు రామాయణమునఁ గలదు. టెంకాయ తెంకాయ యని రూపాంతరము గలదు. టెంక, తెంక శబ్దములకుఁ గొబ్బెరమీఁది చిప్పయని యర్థము. అది కల కాయ టెంకాయ తెంకాయ, తెంకాయయే ద్రావిడభాషయందు తేంగాయ యయ్యెను. కావున వారు చెప్పెడి యుత్పత్తి సరికాదు. సమూలముల్ = వేళ్ళ తోడను, విమూలముల్=వేళ్ళులేకయు, అలవు=బలము, ఇందు కొండలను యంత్రములపైఁదెచ్చిరని చెప్పఁబడెను. కావున సుగ్రీవుఁడు వచ్చునపుడే సేతువు కట్టుటకుఁ గావలసిన పరికరములు తెచ్చెనని భావము. ఇట్టి యంత్రములు వానరుల యొద్దనే యున్నప్పుడు ఆ నాఁటి నాగరకత యెట్టిదో యూహింపనగు. సముద్రములోఁ బాఱవైచుట కే చెట్లనేమి? అడవిచెట్లు లన్నియుఁ బీఁకి తెచ్చిరని చెప్పినఁ జాలునే యీ వివరణమేల? ఉద్భిజ్జ జాతులలోఁ బుట్టినను ఈ యాజాతి వృక్షములు రాము కార్యమునకుఁ దోడుపడి తమ జన్మములు సార్థకము చేసికొనె ననియు దక్కినవి వ్యర్థజన్మము లయ్యెననియుఁ దెలుపుటకే.

దీనివలన రామసేవకై వినియోగపడని జీవి వ్యర్థజీవి యని వాల్మీకి మహర్షి యభిప్రాయము.

పంచచామరము. గుభీల్ గుభీ ల్మనంగఁ ♦ గొండ లెల్ల దండిగా
దభాలునం బడంగ నైవఁ ♦ దల్లడిల్లి సత్త్వముల్
గభీ ల్మనంగ గుండియల్ ది ♦ గా ల్పడంగ, బిందువుల్.
నభంబునం జివాలునన్ ఘ ♦ నంబుగన్ నటింపఁగన్. ౬౦

అర్థములు. సత్త్వముల్ = సముద్రమునం దుండు జంతువులు, దిగాల్పడంగన్ = దిగులుపడఁగా.

తాత్పర్యము

స్పష్టము.

సీ. ఆమడల్ నూఱు వ్యా ♦ యత మైనసూత్రముల్, పట్టిరి కొందఱు ♦ ప్లవగవరులు
దండంబులను గేల ♦ ధరియింత్రు కొందఱు, సమముగ నెఱపిరి ♦ శైలములను
దృణకాష్ఠపర్వత ♦ గణముల బిగియింత్రు, సందులు శ్రీరామ ♦ చంద్రునాజ్ఞఁ
బరుగిడువారును ♦ బర్వతంబులఁ బట్టి, పెకలించువారును ♦ భీమముగను

ఆ. మోసి తెచ్చువారు ♦ మున్ను నే నే మున్న, టంచు వచ్చువారు ♦ నబ్ధిలోన
వైచువారు నైరి ♦ వానరు లమ్మహా, రవము తుముల మయ్యెఁ ♦ బ్రకటభంగి.

అర్థములు. వ్యాయతములు = దీర్ఘములు, సూత్రముల్ = పగ్గములు, తృణకాష్ఠ పర్వతగణముల=గడ్డి, కట్టెలు, కొండలు వీని సమూహములు, తుములము=సంకులము.

తాత్పర్యము

సేతువు వంకరలు పోకుండుటకై నూఱామడ పగ్గముల నీ కొననుండి యా

కొనవఱకు నీ ప్రక్క నాప్రక్క కొందఱు స్తంభములు నాటివచ్చిన వైరులు వీఁకి వైతు రని పట్టుకొనిరి. కొందరు చేతులందు మట్టపు పలకలను దీవరపఱచుటకును దండములఁ బట్టుకొనిరి. కొందఱు కపు లక్షము దిడ్డముగా వైచిన పర్వతములను చదరముగా నెఱపిరి. కొందఱు సందులందు గడ్డి, కట్టెలు, కొండలు వేసి బిగించిరి. కొందఱు పర్వతాదులఁ దెచ్చుటకై పరువెత్తిరి. పోయినవారు కొందఱు పెల్లగించు చుండిరి. పెకలించినవానిని గొందఱు మోచి తెచ్చిరి. ఆ తెచ్చువారిలో నేను ముందు పోదు ననిన నేను ముందని వచ్చిరి. తెచ్చిన వానిని గొంద అందుకొని సముద్రములో వైచిరి. ఈ శబ్దము విస్తారమై సంకుల మయ్యెను.

క. రామాజ్ఞఁ దోడుపడ శా, ఖామృగముల్ సేతు వొనరఁ • గట్టె న్నలుఁడున్
ధీమంతుఁడు తొలిదినమున, నామడ లొకపదియునాలు • గంబుధిలోనన్. ౪౭౧

తాత్పర్యము

ఎట్లెట్లు చేయవలసినది రామచంద్రమూర్తి చెప్పుచుండఁగా వానరులు సహాయపడుచుండ నలుఁడు మొదటిదినమున సముద్రములోఁ బదునాలు గామడ పొడవున సేతువు కట్టెను.

ఉ. పుట్టిన సంతసంబునను • భూరిజవంబునఁ జేసి క్రోఁతి పెన్
దెట్టువ లిర్వదామడ ద్వి • తీయ దినంబునఁ గట్టె వీఁకమై
నట్టె తృతీయఘస్రమున • నామడ లిర్వది యొండు నబ్రమా
నట్టులు నా చతుర్థదిన • మం దొక యిర్వది రెండు పిమ్మటన్. ౪౭౨

అర్థములు. తెట్టువలు=సమూహములు, ఘస్రము=దినము.

తాత్పర్యము

ఉత్సాహ మతిశయించుటచే వానరులు రెండవ దినమందు నిరువది యామడ, మూఁడవ దినంబున నిరువది రెండు, నాలుగవ దినంబున నిరువది రెండామడలు మిగుల వేగముగఁ గట్టిరి.

క. పంచమదివసంబున బంధించెను నిరువదియు మూఁడు • నెఱియామడలన్
బ్రాంచితగతి సామర్థ్యర, మాంచితుఁ డగు నలుఁడు జనకు•నటు లనకట్టన్. ౪౭౩

అర్థములు. సామర్థ్యరమాంచితుఁడు = సామర్థ్య సంపత్తిచేఁ బ్రకాశించువాఁడు, అనకట్ట=సేతువు.

తాత్పర్యము

సామర్థ్య సంపత్తిగల నలుఁ డైదవ దినమందు నిరువదిమూఁడామడ దూరము సేతువుకట్టెను, ౧౪+౨౦+౨౨+౨౨+౨౩=౧౦౧ నూటయొక్క యామడ యగుచున్నది. నీటి వెడలుపు నూరును ఈ ప్రక్క సగమామడ ఆ ప్రక్క సగమామడ నేలమీఁదను గట్టిరి.

క. అంబరమున స్వాతీపథ, ముం బోలుచు వార్ధి మధ్య•మున సేతువు గ్రా
లం బరికించుచు నభమున, నంబరచరతతులు నిలిచె • నబ్బుర పడుచున్. ౪౭౪

అర్థములు. స్వాతీపథము=స్వాతీనక్షత్ర మార్గము. ఇది యాకాశంబున దెల్లఁగా నుత్తర దక్షిణముగా నక్షత్రకాంతి గానవచ్చును. స్వాతీపథము=ఛాయా మార్గము (౨) స్వాతీవీథి=ఆకాశమున సూర్యాదులచారమునకు మూఁడు మార్గములు గలవు. వానిలో రెండవదానికి మధ్యమార్గ మని పేరు. అందు మూఁడు మార్గములుకలవు. అందు స్వాతిమార్గము రెండవమార్గము. ఇది వాయుపురాణ మందుఁ జెప్పఁబడినది. సూర్యాదీనాం త్రయోమార్గా దక్షిణోత్తర మధ్యమాః తథాద్వేచాపి ఫల్గున్యౌ మఖా చైవార్షభీ మతా, హస్త శ్చిత్రా స్తథా స్వాతీ మధ్యవీథ్యభివిశ్రుతా, జ్యేష్టా విశాఖానూరాధా వీథి రాజగవీమతా,ఏతాస్తువీథయ స్తిస్రో మధ్యమో మార్గ ఉచ్యతే। వాయు పురాణము.

తాత్పర్యము

ఆకాశమున స్వాతిమార్గమువలె సముద్రమధ్యమున సేతువుండఁగాఁ జూచి యాకాశసంచారు లాకాశమునందుండి యాశ్చర్యపడుచుఁ జూచిరి.

సీ. పదియోజనంబుల•పఱపును యోజన, శతకంబు నిడివియై•జాను మీఱి
రాణించు కడు దుష్క•రంబైన సేతువు, ముక్కున వ్రేలిడి • యక్కజపడి
యద్భుతం బిది రోమ•హర్షణ మిది యస, హ్యంబు నచింత్యం బ•టంచు సకల
భూతముల్ వెఱఁ గంద•భూరుహచారులు,గంతులు వేయుచు • గర్జ లిడిరి
ఆ. కోటివేలుకపులు•నూటి సేతువుఁ దీర్చి, కొనుచు నవలితీర•మునకుఁ జనిరి
గద ధరించి నిలిచెఁ•గాని వారి వధింపఁ, బ్రెగ్గడలును దా వి•భీషణుండు. ౭౫ ౨

అర్థములు. పఱపు=వెడలుపు, అక్కజపడి = ఆశ్చర్యపడి, రోమహర్షణము=గగ్గురుపాటు గలిగించునది, అసహ్యంబు=సహింపరానిది, అనఁగా భగవంతుని తోడ్పాటు లేక యెవ్వఁడును చేయలేనిది, అచింత్యము=భగవత్సహాయము లేనివాఁ డిట్లు నేను జేయఁగల నని యాలోచించుటకును సాధ్యపడనిది, వెఱగు+అందన్=ఆశ్చర్యము కలుగుచుండఁగా, కానివారిన్=విరోధులను, ప్రెగ్గడలు = మంత్రులు.

తాత్పర్యము

పదియామడ వెడలుపు నూఱామడ నిడివి గలిగి యుందమై చేయుటకుఁ గష్టమైన సేతువును జూచి యాశ్చర్యపడి ముక్కుకొనమీఁద వ్రేలుంచుకొని యిది యాశ్చర్యకరము, ఇది గగురుపాడును చేయుచున్నది, ఇది దైవసహాయము లేనివారి కసాధ్యము, అట్టివారు మనస్సు నందైనఁ జేయఁ దలంపరానిది యని భూతము లాశ్చర్యపడుచుండఁ గోటివేల క్రోఁతులు ముందుగా సేతువు చక్కఁ జేసికొనుచు నావలితీరమునకుఁ బోయిరి. శత్రువు లేమ్రక్కనుండియైన మాఱువేషములతో వత్తురేమో యని వారిని దండించుటకై విభీషణుఁడు మంత్రులతో గద చేతియందు గలవాఁడై నిలచియుండెను. వచ్చిన శుకుఁ డిచ్చటనే బంధింపఁబడి యుండుటచే రావణున కీ వార్త తెలియదు.

ఫాల్గున బహుళము పాడ్యమినాఁడు సముద్రతీరము చేరుట. ఆనాఁడే విభీషణున కభయప్రదానము, పాడ్యమి, విదియ, తదియ, దర్భశయనము. చవితి, పంచమి షష్ఠి, సప్తమి, అష్టమి, సేతుబంధనము, అష్టమినాఁడే సువేలారోహణము.

క. ఏపారి విశాలంబై, తోపుడు గొన్నట్టు నునుపు•దోఁపఁగ సమమై
దీపించుచు సేతువు దగెఁ; బాపట దీర్చిన విధాన•వారిధి నడుమన్. ౭౩౮

అర్థములు. ఏపారి = దృఢమై, తోపుడుగొన్నట్టు=నునుపు వచ్చుటకై తోపుడుపట్టినట్లు, నునుపై = గుంతలు మిట్టలు లేనిదై, పాపటదీర్చినవిధానన్= స్త్రీలు తలలందు పాపటదీర్చినట్లు చక్కఁగా, ఇది యీ కాలపు స్వైరిణుల చెవుల మీఁదికిఁబోవు బస్తాకొమ్ముల పాపటలు గావని యెఱుంగవలయును. పాపటలు చక్కఁగాఁ నుండిన మేలేమో, యాజ్ఞానమే యిప్పటి స్త్రీలకుఁ బోయినది.

తాత్పర్యము

సముద్రమధ్యమునందు దృఢమై వెడలుపై తోపుడుపెట్టినట్లు నునుపై మిట్ట పల్లములు లేనిదై చక్కఁగా పాపట దీర్చినట్లు సేతువు ప్రకాశించుచుండెను.

—• శ్రీరామ లక్ష్మణులు కపిసేనతోడ సేతువు దాఁటుట •—

సీ. అప్పుడు సుగ్రీవుఁ•డా రామునితో ననుఁ, హనుమంతు మీరు వా•తాత్మజాతు
సౌమిత్రి యెక్కఁగఁ • జయ్యన నీ యబ్ధి, వైహాయసాధ్వంబుఁ • బట్టి వారు
దాఁటింతు రనవుడు • దశరథతనయుఁడు, సహలక్ష్మణుం డయి•చాప మూని
తోయజాప్తభవుండు•తోడరా సైన్యంబు, ముంగల గాఁగఁ జ•నంగఁ గడఁగె

ఆ. నంతఁ గపులు కొంద•ఱతని పార్శ్వంబులం, గొలిచి రాఁగఁగొంద•ఱలవు మెఱయ
నీఁదుకొనుచుఁ జనిరి•యేగిరి కొందఱు, గరుడుభంగి వేగ•గగన మొరసి. ౭౭౭

అర్థములు. వైహాయసాధ్వంబునన్ = ఆకాశమార్గమున, తోయజాప్తభవుండు=సుగ్రీవుఁడు, ముంగల=ముందుభాగమున, అలవు=బలము.

తాత్పర్యము

అప్పుడు సుగ్రీవుఁడు రామచంద్రమూర్తితో నీవు హనుమంతుని లక్ష్మణు డంగదుని నెక్కితిరేని వా రాకాశమార్గమున నావలియొడ్డు చేయుదురని చెప్పఁగా రామచంద్రమూర్తి వానరుల విడిచిపో నొల్లక సేనకు ముందుగా చాపముఁ గేలఁ బూని సుగ్రీవునితోడఁ బోవ నారంభించెను. అప్పుడు కొందఱు వానరులు ప్రక్కల నడచి వచ్చిరి. కొందరు బలవంతులు నీళ్ళలో నీఁదుచు వచ్చిరి. కొందరాకాశమున గరుడునివలె నెగిరిపోయిరి.

క. కొందఱకు లేదు మార్గమ, యందఱు నిట్లరుగుచుండ • నా సేనరవం
బెంతయును బర్వుచు జలనిధి, క్రిందెల్లను గ్రమ్మెఁ గ్రిమిష•కాలములోనన్. ౭౦౫

తాత్పర్యము

కొంద రెట్లుపోవుటకు నెడము దొరికినదికాదు. అందఱీ ప్రకారము పోవునపుడు వారలు చేయు ధ్వని సముద్రధ్వనిని నిమిషములో మ్రింగివైచెను.

ఉ. సేతువు నిట్లు దాఁటి కపి♦సేన సమూలఫలోదకక్షితిన్
నేతృనిదేశమార్గమున ♦ నెమ్మది డిగ్గెను, గోసలాత్మజా
జాతు సుదుష్కరంపుఁ గృతి ♦ సంభ్రమ తత్పర దృష్టిఁ జూచుచున్
జేతము పొంగ దేవఋషి ♦ సిద్ధులు చారణులున్ రఘూత్తమున్. ౪౦౬

అర్థములు. సమూలఫలోదకక్షితిన్ = గడ్డలు, వేళ్లు, పండ్లు, మంచినీరుగల భూమియందు, నేతృనిదేశమార్గమున=సుగ్రీవుఁ డాజ్ఞాపించినట్లు.

తాత్పర్యము

కపిసేన సేతువుదాఁటి పండ్లు నీళ్లు మొదలయిన యాహార వస్తువులు దొరుకు చోట సుగ్రీవుని యాజ్ఞచొప్పున విడిసెను. అప్పుడు రామచంద్రమూర్తి చేసిన యసాధ్యకార్యమును దొట్రుపాటుతోఁ జూచుచు దేవఋషి సిద్ధచారణులు రావణు మరణ మిఁకఁ దప్పదని తమ మనస్సులో నుప్పొంగుచు.

వనమయూరము. చేరి యభిషేకమును ♦ జేసి శుభవారిన్
ధీరవర! శత్రుల వ♦ధింపుము సపారా
వారమహి నేలుమ య♦పారసమ లంచున్
సారెకు సమర్చల నొ♦నర్చిరి సభక్తిన్. ౪౦౭

అర్థములు. స+పారావారమహి=సముద్రముతోఁజేరిన భూమి, అపారసమలు=అనేక సంవత్సరములు, సమర్చలన్=పూజలను.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని పవిత్రజలముచే నభిషేకించి శత్రువుల జయింపుము. అనేక సంవత్సరముల భూమండల మంతయు నేలుము అని భక్తితోఁ బూజించిరి. ఈమాత్రమునఁ బరత్వము బయటపడెనని చెప్ప వలనుపడదు. అట్టి వాక్యము లందు లేవు.

వనమయూరము. భజసనగగలు గణములు. తొమ్మిదింట యతి.

౨౩-వ సర్గము. శ్రీరాముఁడు లక్ష్మణున కప్పుడు దోఁచు శకునంబుల తెఱం గెఱింగించుట.

చ. సకల నిమిత్తవేది రఘు♦చంద్రముఁ డప్పుడు వర్తమానముల్
శకునము లోలిఁ జూచి యను♦జాతునిఁ గౌఁగిటఁ జేర్చి యిట్లనున్
బ్రకటజలాశయంబు ఫల♦భాసివనంబుల నాశ్రయించి సా
వికలతఁ గీశవాహినులఁ ♦ బెంపగు వ్యూహము దీర్పు లక్ష్మణా! ౪౦౮

అర్థములు. సకలనిమిత్తవేది = అన్ని శకునములఁ లక్షణములు దెలిసిన వాఁడు, వర్తమానముల్ =జరుగుచున్నట్టివి, ప్రకటజలాశయంబు=విస్తారముగ నీటి సౌకర్యముగల స్థలమును, ఫలభాసివనంబులన్ =ఫలములచేఁ బ్రకాశించు వనంబులను, స+అవికలత=వికలత్వము లేకుండునట్లు.

తాత్పర్యము

సమస్త శుభాశుభ శకునముల లక్షణ మెఱింగిన రామచంద్రమూర్తి యిప్పుడు శుభశకునంబు లగుట చూచి సంతోషించి మనకు భయము లేదని సంతోషించి లక్ష్మణుఁ గౌఁగిలించి, మంచినీళ్లు విస్తారముగఁగల ప్రదేశమందును, ఫలముల దండిగ దొరకు వనము లుండు చోటను వానరసేన చెదరకుండ వ్యూహముగాఁ దీర్చుట తగునని చెప్పెను.

రాజు లీ ప్రకారము శకునములు చూచియే కార్యములు చేయవలయు నని నీతిశాస్త్రము చెప్పుచుండుటచే రామచంద్రమూర్తి వానిని గమనించె నని తెలియునది.

నిమిత్తాన్యేవ శంసంతి శుభాశుభ ఫలోదయం। తస్మాదేతాని శాస్త్రజ్ఞో రాజా సముపలక్షయేత్॥ కామందకము.

చ. బలిముఖ ఋక్షరాక్షస ని • బర్హణమున్ భృశభీతిదంబు నౌ
ప్రళయము లోకనాశన క • రంబుగఁ దారిసిలెం, బరాగముల్
బలియఁగ వాయువుల్ విసరెఁ • బర్వతశృంగములున్ వణంకె, నీ
యిల చలియించె, నేలపయి • వృక్షచయంబులు వ్రాలెఁ గంటివే. ౪౪

అర్థములు. అప్పుడు కానవచ్చిన శకునములను లక్ష్మణునకుఁ జెప్పుచున్నాఁడు. బలిముఖ=వానరులయు, ఋక్ష=ఎలుఁగులయు, రాక్షస=రాక్షసులయు, నిబర్హణమున్ =మరణముగలది-ఇట్లు చెప్పుటచే మనుష్యులమైన మనకు భయము లేదని భావము, భృశభీతిదంబు=మిగుల భయంకరమైనది, ప్రళయము = ప్రలయకారణమైన యుద్ధము, తారసిలెన్ = తటస్థించెను. పరాగముల్ = దుమ్ములు, బలియఁగన్ =అతిశయింపఁగా, ఇల చలియించెన్ =భూకంపము కలిగెను.

అత్యంతానిష్ట భూకంపము సంధ్యాకాలమందుఁ గలుగును కావున నిట సంధ్యాకాల భూకంపమే గ్రాహ్యము. ఇట్లు చెప్పుటచే నిది సముద్రము దాఁటిన నాఁటి సాయంకాల మని గ్రహింపనగు. "యామత్రయాచ్చ భూకంపో ద్విజాతీనామరిష్టదః। అనిష్టదః క్షితీశానాం సంధ్యయో రుభయో రపి" అని వసిష్ఠ వాక్యము ప్రమాణము.

తాత్పర్యము

వానరులకు భల్లూకములకు రాక్షసులకు వినాశకరమైనదియు మిగుల భయంకరమైనదియు నగు యుద్ధము లోకనాశనము కొఱకు తటస్థించెను. దుమ్ములు రేఁపుచు

గాలి విసరెను. కొండల శిఖరములు వణంకెను. భూకంపము కలిగెను. ఆ కారణమునఁ జెట్లు నేలఁ బడెను.

తే. భయదమాంసాదనిభములఁ • బరుషములును
 బరుషరవములుఁ గ్రూరముల్ • వారివాహ
 నిచయములు ఘోరభంగిని • నెత్తుటోడి
 వృష్టిఁ గురియించె నుత్పాత• హేతుకముగ. ౪౯౦

అర్థములు. భయద=భయంకర మగు, మాంసాద = మాంసమును దిను పక్షిమృగములవంటి యాకారములు గలవి, పరుషములు = మనస్సునకు వెగటు గలిగించునవి, పరుషరవములు=కఠోరధ్వనులుగలవి, క్రూరములు=భయంకరములు వారివాహనిచయములు = మేఘముల సమూహములు, వృష్టి = వాన, ఉత్పాత హేతుకముగ = ఉత్పాతమునకుఁ గారణమై.

తాత్పర్యము

భయంకరములైన మాంసములు దిను డేగలు మొదలగు పక్షుల మృగముల యాకారములు గలవియు, చూడ నింపు గానివియు, కర్ణకఠోర ధ్వనులు గలవియు, భయంకరములునగు మేఘసమూహములు భయంకరముగ నెత్తురు వర్షము కురియించుచున్నవి. ఇవి యుత్పాత సూచకములు.

'దివ్యుల్కాపతనం చైవ దివానక్షత్రదర్శనం దివాశని స్తదా కాష్ఠస్య రక్త ప్రవర్షణ' మ్మని వరాహమిహిరుఁడు.

సీ. కుంకుమడాలునఁ• ఘోర మయ్యెను సంధ్య, సూర్యునం దొక నల్ల• చుక్క దోఁచె
 మార్తండునం దుండి • మండుచు నొకయగ్ని, మండలంబిల వ్రాలె• దండిఁ గ్రూర
 మృగములుఁ బక్షులు• నెల్లెడ దీనస్వ,రముల ఘోషించెను • రవిని జూచి
 నిజతేజ మెడయంగ• నిశలందుఁ జంద్రుఁడు, నలుపును నెఱుపునఁ• గలయఁ గొనల

తే. విలయకాలంబునను బోలె• వికటముగను,
 దాపమును గూర్చుచున్నాఁడు • ధరణికెల్ల
 గుడుసు హ్రస్వంబు రూక్షంబు • ఘోర మగుచు
 వెలయు చున్నది యద్దాని • విధముఁ గంటె. ౪౯౧

అర్థములు. కుంకుమడాలున = కుంకుమము వన్నెచేత నెఱ్ఱగా, సంధ్య- ఇట్లు చెప్పుటచేతను నిది సంధ్యాకాల మనియే యేర్పడుచున్నది. ఎడయంగన్ = తొలఁగిపోఁగా, నిశలందున్=అనుటచే ప్రతిదినము రాత్రులందు అని భావము. ఇది వర్తమానవిషయముకాదు. గడుసు = పరివేషము, హ్రస్వంబు = కుఱుచ యైనది, రూక్షము = క్రూరము.

తాత్పర్యము

లక్ష్మణా! సంధ్యాకాల మేఘములు కుంకుమవర్ణము కలవై యున్నవి.

సూర్యునం దొక నల్లని చుక్క గానవచ్చుచున్నది. సూర్యునినుండి యొక నిప్పు సమూహము మండుచు నేలఁబడెను. సూర్యుని జూచి యన్ని ప్రదేశము లందును మృగములు, పక్షులు దుఃఖస్వరముల ధ్వనించుచున్నవి. రాత్రులందు చంద్రుఁడు తనకాంతి క్షయింపఁగా కొనలందు నలుపు, ఎఱుపు కలసిన కాంతి గలవాఁడై ప్రలయకాలమందువలె వేఁడిమి కలిగించుచున్నాఁడు. పరివేషము పొట్టిదై, పరుషమై, ఘోరముగ నున్నది, చూచితివా? "అపర్వణి తథా రాహు గ్రహణం చంద్రసూర్యయోః। చంద్రార్కమండలచ్ఛిద్రం దృష్ట్వా జనపదక్షయః" వరాహమిహిరుఁడు. ఇది యష్టమినాఁటి సాయంకాలవార్త.

చ. మలినము లొందెఁ దారకలు ♦ మానని లోకవినాశ మియ్యెడన్
దెలిపెడి, గాకగృధ్రములు ♦ దేఁకువ గల్గిన డేగ లెంతయే
నలుపపుఁ బక్షులం దఱుము ♦ నారట మందెడి, నక్క లెయ్యెడన్
గలయఁగఁ బర్వి భీకరము♦గా గొంద నేసెడిఁ గీడు దెల్పుచున్. ౪౬-౨

అర్థములు. తేఁకువ=ధైర్యము, అలుపపుఁ బక్షులు=చిన్నిపిట్టలు.

తాత్పర్యము

నక్షత్రములు మలినములై లోకము నాశమగుట తెలుపుచున్నవి. మిక్కిలి చిన్నపిట్టలు తఱుముకొనిరాఁగా కాకులు, గ్రద్దలు, ధైర్యముగల డేగలు సంకటపడుచున్నవి. ఎక్కడఁ జూచినను నక్కలు వ్యాపించి భయంకరముగాఁ గూయుచుఁ గీడు గలుగుట దెలుపుచున్నవి. లంకయందీ యుత్పాతములు కానవచ్చుటచే లంకకే కీడు గలుగు నని భావము.

ఉ. వీనిఫలంబుఁ జూడఁ బృథి♦వీస్థలి శోణితమాంసకర్దమం
బౌ నిజ మట్లు గాన విబు♦ధాహితపాలితపట్టనంబు ని
ప్డే నిఖిలాటవీచరస♦మేతముగాఁ జని ముట్టడింత మం
చా నెఱబంటు లంక కెదు♦రై చనె సంభృతచాపహస్తుఁడై. ౪౬-౩

అర్థములు. శోణితమాంసకర్దమంబౌన్=నెత్తుటితోను, మాంసముతోను బురద యగును. విబుధాహిత=దేవవిరోధి యగు రావణునిచే, పాలిత=పాలింపఁబడు, నెఱబంటు=శూరుఁడు; సంభృతచాపహస్తుఁడై = భరింపఁబడిన విల్లుగల చేయిగలవాఁడై.

తాత్పర్యము

ఈ శకునముల ఫల మేమంటిరా? యీ నేల నెత్తుటితోను, మాంసముతోను బురదగానగును. కావున రావణపాలిత లంకానగరమును నిప్డే సేనతోడఁ బోయి ముట్టడింతము అని యీ మహాశూరుఁడు చేత విల్లుధరించి లంక కెదురుముఖుఁడై పోయెను.

తే. సంప్రహారరసావేశ ♦ సంప్రహృష్టు, రాము వెన్కొని సుగ్రీవ ♦ రాక్షసాధి
పతులు లోనగు కపులెల్ల♦వరుసఁ జనిరి, శత్రుమర్దన నిశ్చిత♦స్వాంతు లగుచు.

అర్థములు. సంప్రహారరసావేశ=యుద్ధాభిలాషావేశముచే, సంప్రహృష్టున్ మిగుల సంతోషించినవానిని, సుగ్రీవరాక్షసాధిపతులు=సుగ్రీవవిభీషణులు, శత్రుమర్దన = పగవారిని జంపుటయందు; నిశ్చిత = నిశ్చయింపఁబడిన, స్వాంతులు = మనస్సుగలవారు.

తాత్పర్యము

యుద్ధాభిలాషయావేశించుటచే మిగుల సంతోషించి పోవుచున్న రామచంద్రమూర్తి వెంట సుగ్రీవ విభీషణులు, తక్కిన వానరులు రాక్షసులఁ జంపవలెనని నిశ్చయించుకొనినవారై పోయిరి.

క. వారలభక్తియు శక్తియు, వారల యాలాపములును ♦ వారల చేష్టల్
వారలధైర్యము గని సీ,తారమణుఁడు సంతసించెఁ ♦ దన హృదయమునన్.

అర్థములు. ఆలాపములు=మాటలు.

తాత్పర్యము

ఆ వానరుల భక్తి, శక్తి, వీరాలాపములు, వీరలు చేయఁదగు చేష్టలు, ధైర్యము చూచి వీరుత్సాహపూరితులై యున్నారు. గావున మనకు జయము తప్పదని తన మనస్సునందు సంతోషించెను.

ఇప్పుడు వానరులు సంతోషించి రనుటచే నింతకుఁ బూర్వము వారు మనమీఁ దుర్గములు దాఁటఁగలమా యని నిరుత్సాహులై యుండిరని సూచన. సేనాభటు లుత్సాహవంతులై యుండుట జయచిహ్నము.

-♦ ౨౪-వ సర్గము. శ్రీరాముఁడు లంకలోనిధ్వనివిని సీతను దలఁచి దుఃఖించుట ♦-

క. పారావారముఁ బోలు న, పారవనేచరబలౌఘ♦వర్గముధాటిన్
భూరిజవంబును సైఁపక, ధారిణి వడఁకాడె భీతిఁ♦దతపీడితయై. ౪౯-౧.

అర్థములు. పారావారము=సముద్రము, అపార=అంతములేని, వనేచరబల=వానరసేనల, ఓఘ = సమూహముయొక్క, ధాటిన్ = దండయాత్రను, భూరిజవంబును=మిగులవేగమును, తతపీడితయై=మిగులఁ బీడింపఁబడినదై.

తాత్పర్యము

సముద్రమువంటి పారములేని వానరసేనయొక్క దాడిని, మిగుల వేగమును సహింపలేక మిగుల బాధింపఁబడినదై భూమి భయముచే గడగడ వడఁకెను.

ఉ. భ్రాజితతారకానికర ♦ రాజితశారద పౌర్ణమాసి నీ
రేజవిపక్షుచే వలె హ ♦ రిప్రవరౌఘము సంవ్యవస్థితం
బై జిగి మీఱె భూమితన ♦ యాధవుచే, విన వచ్చె లంకఁ బే
రోజ మృదంగ కాహళర ♦ వోల్బణముల్ ప్లవగేంద్రపాళికిన్. ౪౯-౨

అర్థములు. భ్రాజిత = ప్రకాశించు, తారకానికర = నక్షత్రసమూహముచే, రాజిత=ఒప్పుచున్న, శారద=శరత్కాలమందలి, పౌర్ణమాసి = పున్నమ

నీరేజవిపక్షుచేవలెన్ = చంద్రునిచేతవలె, హరిప్రవరౌఘము = వానర ముఖ్యుల సమూహము, సంవ్యవస్థితంబై = విడిదిపట్టులఁ జక్కఁగా నిలుపఁ బడినదై, మృదంగ = మర్దలల యొక్కయు, కాహళ = తుత్తూరాల యొక్కయు, రవోల్బణముల్=ధ్వని విశేషములు, ప్లవగేంద్రపాళికిన్=వానరశ్రేష్ఠుల గుంపునకు.

తాత్పర్యము

చంద్రునిచే, నక్షత్ర సమూహములచేఁ బ్రకాశించు తత్కాలము నాఁటి పున్నమవలె (కార్తిక పూర్ణిమ) వారివారి విడిదిపట్టుల నిలుపఁబడి సద్దులేని వానర సమూహములు రామచంద్రమూర్తిచేఁ బ్రకాశించెను. (ఎన్ని నక్షత్రముల కాంతి యైనను నొక చంద్రకాంతికి సరిగానట్టు వానరు లందఱ తేజస్సుకంటె రామచంద్ర మూర్తి తేజస్సే యతిశయించి యుండెనని భావము.) ఇట్లు వానరులు వారి వారి తావుల వారు వారు నిశ్శబ్దముగాఁ గుదురుకొనుటచే లంకలోని మర్దెలలయు, తుత్తూరాలయు ధ్వనులు విశేషముగ వానరులకు వినవచ్చెను.

ఉ. ఆ మహితారవంబులు వ♦నాటుల వీనులఁబడ్డ వారు ను
ద్దామముదంబునం గెరలి ♦ తద్దయు నీసున వాని మించఁగా
భీమరవంబు నింపఁగ గ ♦ భీరఘనాఘన గర్జలట్లు లం
కామనుజాశనావళికిఁ ♦ గర్ణసుగోచర మయ్యె భీమమై. ౪౯౮

అర్థములు. మహిత+ఆరవము = గొప్పధ్వని, ఉద్దామముదంబునన్ = అధిక సంతోషముతో, కెరలి=విజృంభించి, ఈసున = రోషముచే, గభీర = దీర్ఘమైన, ఘనాఘన = వర్షాకాల మేఘముల యొక్క, గర్జలు = ఉరుములవలె, కర్ణసుగోచర మయ్యెన్=చక్కఁగా వినవచ్చెను, భీమమై=భయంకరమై.

చ. తతబహుచిత్రకేతన ప ♦ తాకిని లంకనుజూచి జానకీ
పతి తరుణీమణిం దలఁచి ♦ పాపి దశాస్యునిచే నిరుద్ధయై
సతి మృగశాబలోచన కు♦జగ్రహబాధిత రోహిణీగతిన్
వితతమనోవ్యథం దవిలి♦విన్నఁబడెంగద యీ పురంబునన్. ౪౯౯

అర్థములు. తత=విస్తారమైన, బహు=అనేకములై, చిత్ర = చిత్రములైన, కేతనపతాకిని = కేతనములు, పతాకములు గలది, చిహ్నములుగల టెక్కెములు కేతనములు - చిహ్నములు లేని ధ్వజములు పతాకములు; నిరుద్ధయై = నిర్బంధమున నుంపఁబడినదై, మృగశాబలోచన=జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత, సీతాదేవి రామచంద్రమూర్తితో వనవిహారముచేయునప్పు డామె యొక జింకపిల్లను పట్టుకొనఁబోవ నపుడది బెదరి చూచెను. అప్పు డా జింకపిల్ల కన్నులు సీతాదేవి కన్నులవలె నుండెను. రామచంద్రమూర్తి కిపు డది స్మరణమునకు వచ్చెను. లేదా యిక్కడ సీత నిరుద్ధయై యుండుటకు మృగము(జింక)కదా కారణ మని జింక జ్ఞప్తికి రాఁగా నప్పుడు మాయ జింకను జూచిన చూపులు జ్ఞప్తికి వచ్చె

నని యైనఁ జెప్పనగును. వాల్మీకి వ్యర్థవిశేషణము వేయఁడు, కుజగ్రహబాధిత = అంగారకునిచే బాధింపఁ బడిన, రోహిణీగతిన్ = రోహిణివలె, వితత = విస్తార మైన, మనోవ్యథన్=మానసిక బాధచే, విన్నఁబడెన్=దీనురా లయ్యెను.

ముందు ధ్వనులు వినఁబడె ననియు, నిపు డెత్తిన ధ్వజములు గానవచ్చె ననియుఁ జెప్పుటచే నూరు, వీథులు, నిండ్లు గాన రాలే దని భావము.

తాత్పర్యము

మిగుల విచిత్రములైన చిన్న, పెద్ద ధ్వజములుగల లంకను జూచి రామచంద్ర మూర్తి సీతాదేవిని దలంచి పాపాత్ముఁ డగు రావణుచే చెఱయం దుంచఁబడి యంగారకగ్రహముచేఁ బీడింపఁబడిన రోహిణివలె సీత మిగుల మనోవేదనచే నీ పురంబున దీనురాలై దుఃఖించుచున్నదిగదా.

తే. అనుచుఁ దా వేఁడి నిట్టూర్పు ♦ నినిచి యనుజుఁ
గాంచి యి ట్లనుఁ దనకుఁ ద ♦ త్కాలమునకు
హితముఁ గూర్చెడి వాక్యముల్ ♦ నుత బలాఢ్య
లంకఁ గనుఁగొంటె యీ పురి ♦ పొంక మార ! ౯౦౦

తాత్పర్యము

అని తనలో ననుకొనుచు వేఁడి నిశ్శ్వాసము విడిచి తమ్మునిఁజూచి యీ కాలమునఁ దనకు మేలు గలిగించు యుద్ధవిషయము, సేనావిభాగ విషయము, లంకావిషయము లోనగు వాక్యముల నిట్లనియె. పొగ డ్తగన్న బలవంతుఁడా! యీ లంకా నగరము పొంకము చూచితివా !

వేఁడి నిట్టూర్పు నినిచి, యిప్పుడు భార్యఁ దలఁచి విచారపడవలసిన కాలము గా దనుకొని,ముందుకలిగిన వ్యసనము నిలుపుకొనుటకై నిట్టూర్పు విడిచెనని భావము.

ఉ. భానుపథంబుఁ బైకొనఁగఁ ♦ బాఱెడినో యన విశ్వకర్మచే
మానసకల్పితంబు గతి ♦ క్ష్మాధరశృంగతలంబునందుఁ దా
మానిత మయ్యెఁ గంటివె వి ♦ మానకదంబముతో ధరాస్థలిన్
మా నగు పాండురాంబుద స ♦ మంచిత విష్ణుపదంబు చాడ్పునన్. ౯౦౧

అర్థములు. భానుపథంబు = సూర్యుఁడు పోవుమార్గము, పైకొనఁగన్ = మించిపోవునట్లు, మానసకల్పితంబు=మనస్సుచే నిర్మింపఁబడినది, విమాన కదంబ ముతో=(౧) ఏడంతస్థుల మేడలతో (౨) ఆకాశయానముల సమూహముతో- పాండురాంబుద = తెల్లనిమేఘములచే, సమంచిత = ఒప్పుచున్న, విష్ణుపదంబు చాడ్పునన్=ఆకాశమువలె (౧) సూర్యస్థానము, (౨)విష్ణుమూర్తికిఁ బాదమైనది (౩) సర్వలోక వ్యాపకుఁడైన వాయువునకు స్థానమైనది. ఆకాశమున విమానము వలె లంకయందు విమానములు గలవని భావము.

తాత్పర్యము

సూర్యుఁడుపోవు మార్గమునకంటె నింకను పైకిఁ బోవలయునని పరుగెత్తు చున్నదో యన్నట్లు విశ్వకర్మచే మనస్సుచేత నిర్మింపఁబడినదానివలె పర్వతశిఖరమునందు నొప్పుచున్న లంకను జూడుము. విమాన సమూహములతో భూమి యందుఁ దెల్లని మేఘములతో నొప్పు నాకాశమువలె నున్నది.

ఉ. మంజుల సూనకుంజచయ ♦ మండిత చైత్రరథోపమానమై
కుంజదళిద్విజ ప్రకర ♦ ఘుష్టవనంబులచే మనోజ్ఞమై
రంజిలెఁ బుష్పలీన భ్ర ♦ మరంబును మత్తశకుంతముం బికీ
శింజితమూ వనావళిని♦శీతసమీరణుఁ డోలి నూఁచెడిన్. ౫౦౨

అర్థములు. మంజుల = మనోహరమైన, సూన = పుష్పముల యొక్క - కుంజ = పొదలయొక్క - చయ = సమూహములచే - మండిత = అలంకరింపఁ బడిన-చైత్రరథోపమానమై=కుబేరు నుద్యానవనమైన చైత్రరథముతో సమానమై- కుంజత్ =ధ్వనించుచున్న - "రణతి క్వణతి కుంజత్యపి స్తనతి గర్జతి" అని క్రియా నిఘంటువు-అళి = తుమ్మెదలయొక్కయు - ద్విజ = పక్షులయొక్కయు,ప్రకర = సమూహములచే- ఘుష్ట=ధ్వనించుచున్న - వనంబులచే = తోఁపులచే - పుష్పలీనభ్రమరంబును = పూలయందలి తేనెఁ ద్రావి మత్తెక్కి కదలక, మెదలక వాని యందే యణఁగియుండు తుమ్మెదలుగలది. మత్తశకుంతమున్ =మదించిన పక్షులు గలది, పికీ=ఆఁడుతుమ్మెదల చే-శింజితము=ధ్వనింపఁబడినది, శీతసమీరణుఁడు = చల్లనిగాలి-శింజితశబ్ద మాభరణముల ధ్వని యను నర్థము గలదైనను పెద్దధ్వని యనియు దాని కర్థము గలదు. లేదా యిచ్చట సామాన్య వాచకముగ పూలహారాదులవలె గ్రహింపనగు.

తాత్పర్యము

మనోహరము లయిన పూఁ బొదలచే నలంకరింపఁబడిన చైత్ర రథముతో సమానమై, ఝుంకారముజేయు తుమ్మెదలయు, పక్షులయు ధ్వనులచే నిండిన తోఁపులచే నందమై, పూలయందు దాఁగిన తుమ్మెదలు గలదై, మదించిన పక్షులు గలదై యాఁడుకోవెలల ధ్వనులు గలదైన వనముల సమూహమును చల్లనిగాలి యూచుచున్నది.

—♦ శ్రీరాముఁడు సేనల వ్యూహంబు దీర్చుట ♦—

సీ. అని యిట్లు వచియించి ♦ యవనిజాపతి సేన, శాస్త్రపద్ధతి విభ♦జనము సల్పి
నీలునితోఁ దడ♦నీకినితో నంగ, దుం డురోదేశస్థి♦తుండు గాఁగ
ఋషభుండు చక్రస ♦ మేతుఁడై దక్షిణ, పార్శ్వంబునం దోలిఁ♦బ్రబలి నిలువ
గంధహస్తినిబోలు♦గంధమాదనుఁడు దా, డాపట వెలయుఁగ ♦ నేపు మెఱసి
తే. వేగదర్శి సుషేణులు♦వినిపుతుండు, జాంబవంతుండు ముప్వురు♦సైన్యయుక్తి
గుక్షిఁగావంగమునలిసి♦కువలయాక్షుఁ,డనుజుఁడును దాను శిరమున♦యందునిలిచి

అర్థములు. శాస్త్రపద్ధతి = నీతి శాస్త్రమునఁ జెప్పిన ప్రకారము, తద నీకినితో = అతని (నీలుని) సేనతో, ఉరోదేశస్థితుండు = అొమ్ము ప్రదేశమం దుండు వాఁడు, చక్రసమేతుఁడై = అతని సేనతోఁ గూడినవాఁడై, గంధహస్తిని = మదించిన యేనుఁగును, దాపటన్ = ఎడమవైపు, కుక్షి = కడుపు, నడిమిభాగము, ముదల + ఇడి = ఆజ్ఞచేసి.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పి రామచంద్రమూర్తి రాజనీతిశాస్త్రప్రకారము సేనల విభజించి, నీలుఁ డతనిసేనతోడను, నంగదుఁడును హృదయస్థానమం దుండు నట్లును, ఋషభుఁడు తన సేనతో కుడిప్రక్క నిలుచునట్లును, మదపుటేనుఁగువంటి గంధమాదనుఁడు ఎడమవైపు నిలుచునట్లును, వేగదర్శి సుషేణుఁడు, జాంబ వంతుఁడు ఈ ముగ్గురు వారివారి సేనలతో గర్భము గాచునట్లును ఆజ్ఞచేసి తాను లక్ష్మణుతో శిరోదేశంబున నిలిచి,

క. లోకము వెనుకటి యర్థము, జోకన్ వరుణుండు గాచు ♦ చొప్పునఁ గీశా
  నీకిని జఘనముఁ గావఁగఁ, బ్రాకటబలు సూర్యపుత్రు♦బనిచెన్ సరగన్. ౧౦౪

తాత్పర్యము

లోకము పడమటిభాగము వరుణుఁడు కాచునట్లు సేనయొక్క పుచ్ఛ భాగ మును రక్షించునట్లు సుగ్రీవుని పంపెను.

ఈ పద్యమందు ముఖ మని, ఱెక్కలని యీ ప్రకారము చెప్పుటచే శార్దూ లుఁడు చెప్పినట్లు సేన గరుడవ్యూహముగాఁ దీర్పఁబడె నని తెలియనగు.

ఉ. అంబుదసంప్లవం బయిన ♦ యభ్రముఁ బోలెడి కీశసేన వృ
  క్షంబులు శైలశృంగములు ♦ గైకొని రేఁగి దశాస్యుపట్టనం
  బుం బోరి నుగ్గునూచముగ ♦ భూధరకూట వితానముష్టులన్
  డంబుచెడంగ దంపఁగ నె♦డందఁ దలంచె సరోషచిత్తమై. ౧౦౫

అర్థములు. అంబుద సంప్లవము = మేఘములచే నిండినది, అభ్రము = ఆకాశము, కీశసేన = వానరసేన, భూధర కూటవితాన ముష్టులన్ = కొండల శిఖరముల సమూహములతోను, పిడికిళ్ళతోను, డంబు = కాంతి, ఎడందన్ = హృదయమందు.

తాత్పర్యము

మేఘములచే నిండిన యాకాశమువలె నున్న వానరసేన చెట్లు, శిఖరములు తీసికొని విజృంభించి లంకను కొండలచేతను, శిఖరములచేతను, పిడికిళ్ళచేతను పొడి పొడిగా దంచి రూపుమాపుటకు రోషముతో హృదయమునఁ దలఁచియుండెను.

—♦ శుకుఁడు రావణుతోఁ దాను బోయివచ్చిన వృత్తాంతముఁ జెప్పుట ♦—

సీ. అయ్యెడ శ్రీరాముఁ♦డర్కజుతో శుకు, విడిచి పుచ్చు మటన్న♦వెడల నడిచె
  నతఁడును భయకంపి ♦ తాంగుఁడై రావణు, డాసిన నగుచు రా♦కాసిఱేఁడు

ఏ మిది శుక! తెక్కలేమాయెఁ గత్తిరించిన జాడ దోఁచెడిఁ జెనఁటులైన
చలచిత్తులైన కీశులచేతఁ జిక్కితా? యే మన నతఁడు లో నెసఁగు భీతి
తే. రాక్షసోత్తముతో నను రాక్షసేంద్ర!, నీదుపనుపునఁ జని నేను నీరనిధికి
నుత్తరపుఁ దీరముం జేరి మెత్తఁదనముఁ దోఁప మధురోక్తి సుగ్రీవుతోడ నేర్మి.

అర్థములు. వెడలనడిచెన్ = వెళ్ళఁగొట్టెను-దీనివలన శుకుఁ డిన్ని దినములు వానరసేన యందే చెఱలో నుండెను. విడిచినయెడల వాఁడు రావణునితో వానరసేన సేయు ప్రయత్నము దెలిసి సేతువునకు విఘ్నము గావించు నని తలఁచి విడువఁబడినవాఁడు కాఁడు. ఇపుడు వానివలన భయములేదు గావున వదలి పెట్టఁబడెను. భయ కంపితాంగుఁడై = భయముచే వణకుచున్న దేహము గలవాఁడై - డాసినన్ = సమీపింపఁగా-నగుచున్ = వానిస్థితిని జూచి నవ్వుచు - చెనఁటులు = దుష్టులు- చిక్కితా = చిక్కితివా? పనుపునన్ = ఆజ్ఞచేత - నేర్మిన్ = నేర్పుతో - చలచిత్తులు, కీశులనుటచే - స్థిరబుద్ధిలేనివారు కావున పొమ్మని కాసేపు, వలదని కాసేపు ఇట్లు పలుమాఱు విడిచి కట్టిరా యేమి యని భావము.

తాత్పర్యము

శత్రువులవలన విఘ్నభయము లేక సేతునిర్మాణసేనా స్థాపనాది కార్యములు దీరుటవలన నిఁక శుకుని వదలిపెట్టుఁడని రామచంద్రమూర్తి సుగ్రీవునితోఁ జెప్పఁగా నతఁడు వానిని నిఁక బొమ్మని వెడలఁగొట్టెను. వాఁడును మరల వానరులు వచ్చి యెక్కడ పట్టుకొందురో యని భయముచే వడఁకుచు రావణుని సమీపింపఁగా వాఁడున్న దీనస్థితికి నవ్వుచు రావణుఁడు యేమిరా శుకా! యిట్లున్నావు? చపలచిత్తులు, దుష్టులగు వానరులచేతిలోఁ జిక్కితివా యేమి? నీ ఱెక్కలను గత్తిరించి నట్లున్నదే యని యడుగఁగా నతఁ డోరి నిష్కృత్రియోజకుఁడా! శత్రువుల చేతిలోఁ, జిక్కితివా యింత జాగేల చేసితివి? అని తన్ను నేమో యని భయపడుచు రావణునితో నిట్లనియె. రాక్షసరాజా! నీయాజ్ఞ చొప్పున నేను సముద్రపుటుత్తర తీరమునకుఁ బోయి మంచి తియ్యని మాటలతో నేర్పుగా సుగ్రీవునితో, (నన్ను వారిట్లు చేయుటకు నేను జేసిన యకార్యము లేదు. నేను దురుసుగా మాటలాడ లేదని తెలుపుటకై యిట్లు చెప్పెను.

క. నీ చెప్పినట్ల పలికిన, నేచిన కినుకను గపీంద్రు లెల్లరు నన్నున్
ద్రోచిరి తాఁచిరి కూలన్, నైచిరి పీఁచిరి రిల నేను వాచారంగన్. ౫౦౭

అర్థములు. నీ చెప్పినట్ల = నీవు చెప్పిన ప్రకారమే, ఎక్కువ తక్కువలు లేక, ఏచిన = అతిశయించిన, తాఁచిరి = కొట్టిరి, పీఁచిరి = గిరగిరఁ ద్రిప్పిరి, వాచారంగన్ = ఏడువఁగ.

తాత్పర్యము

నీవు చెప్పినట్టులే తూచాతప్పక, యెక్కువతక్కువలు చెప్పక చెప్పితిని. ఆ మాటలువిని వానరులుకోపాతిశయముచే నన్నునాకాశమునుండి నేలఁబడఁ ద్రోచిరి.

కొట్టిరి. తోఁకపట్టుకొని గిరగిర త్రిప్పినేలఁ బడవైచిరి. నే నేడ్చుచున్నను విడిచిన వారు గారు.

క. గ్రద్దన పై కెగిరి ననున్, గ్రుద్దిరి పిడికిళ్ళ గోడు ♦ గుడిపిరి కాలన్
మద్దించిరి బిద్దింపఁగ, గద్దఱితనమునను గపులు ♦ కడఁగిరి ఱేఁడా! ౨౯

అర్థములు. గద్దఱితనమునన్ = దిట్టతనమున - గోడుగుడిపిరి = దుఃఖమనుభవింపఁజేసిరి, మద్దించిరి=త్రొక్కిరి - తన్నిరి - బిద్దింపఁగన్=చంపఁగా - కడఁగిరి = యత్నించిరి - ఱేఁడా = ప్రభువా-రాజార్థక పదములు పలుమాఱు చెప్పుట రావణునికిఁ దనపై కోపము రాకుండుటకు గాక యని కాని, నీ వేమి రాజవయ్యా, నీ వనిన వానరులకు (రామునిమాట యటుండనీ) లక్ష్యమే లేదు. వారితో యుద్ధముచేసి నీవు మానము దక్కించుకొనఁగలవా - నా గతియే నీకుఁ బట్టు నని సూచించుటకుఁ గాని చెప్పెనని యెఱుఁగనగు.

తాత్పర్యము

నేను నీవు చెప్పినమాట చెప్పితినో లేదో, తటాలున పై కెగిరి దిట్టతనమున వానరులు నన్నుఁ బట్టుకొని పిడికిళ్ళ గ్రుద్దిరి - దుఃఖపెట్టిరి - నేలవైచి కాళ్ళతో నలియ దంచిరి. నన్నుఁ జంపుటకు యత్నించిరి.

ఆ. ముక్కుమీఁద నుండు ♦ ముంగోప మెప్పుడు, సహజముగను గ్రక్క ♦ సకపులకును
నన్నుఁబలుక నీరు ♦ నామాటకును బదు, లిడరు మీఁద మీఁద ♦ నడచువారు.

తాత్పర్యము

కఠినచిత్తులైన వానరులకు స్వభావమున ముంగోపము ముక్కుమీఁదనే యుండును. నన్నేదియుఁ జెప్పనీయరు - నామాట వినరు - ఇఁక బదులు చెప్పుట యెక్కడిది? అయిన నేమిచేసి రనెదవా, మీఁదమీఁద, దెబ్బమీద దెబ్బ విరామము లేక యొకనివెంట నొకఁడుగఁ గొట్టిరి.

క. ఖరవైరి విరాధాంతకుఁ, డరిభయద కబంధకాలుఁ ♦ డదె రాముఁడు భా
స్కరసుతసహితుం డగుచును, ధరణిసుతన్ సేనతోడ ♦ దాయఁగ వచ్చెన్. ౩౧

అర్థములు. ఖరవైరి = ఖరుని జంపినవాఁడు, విరాధాంతకుఁడు = విరాధునికి మృత్యువైనవాఁడు, అరిభయద=శత్రువులకు భయము కలిగించు, కబంధ=కబంధునకు, కాలుఁడు=యముఁ డగువాఁడు, అదె = అదిగో నీ విక్కడనుండియే చూడవచ్చును. సమీపమందే యున్నాఁడు - మీఁద యుద్ధము సేయుటో, సీత నిచ్చుటో రెంట నొకటి చేయుమని చెప్పఁబోవును. ఆ రెంటిలో యుద్ధమున మేలు లేదని తెలుపుటకై రాముని బలమును వర్ణించుచున్నాఁడు.

తాత్పర్యము

ఖరుని, విరాధుని, కబంధునిఁ జంపిన రామచంద్రమూర్తి సుగ్రీవునితో సీతాదేవి సమీపమునకు రానే వచ్చెను- అదిగో నున్నాఁడు- నీవే చూడుము.

ఉ. కట్టెను సేతువున్ జలధి ♦ కొండములన్, లవణాబ్ధి దాఁటి తా
మెట్టె నవాచితీరమును ♦ మెండుదళంబులతోడ లంకనున్
ముట్టెను, రాక్షసాళి మును ♦ ముట్టుగఁ గొట్టఁగఁ గార్ముకంబుఁ జే
పట్టెను దిట్టయైన రఘు♦వల్లభుఁ డల్లదె రాక్షసోత్తమా! ౧౧

ఈముచ్చట యుండనీ రాముఁ డేమిచేసెను. ఇపుడేమి చేయుచున్నాఁడందురా.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సముద్రము నీళ్ళయందు సేతువుకట్టెను. సముద్రము దాఁటి దాని దక్షిణతీరమున సేనలతో వచ్చి లంకను ముట్టడించెను. రాక్షసులను మొదలంట దంచుటకు విల్లు చేపట్టి సిద్ధముగా నున్నాఁడు. అదిగో జూడుము.

తే. పర్వతాభ్రనికాశు లౌ ♦ ప్లవగఋక్ష, వరులసేనలు వేనవేల్ ♦ ధరణినెల్ల
నావరించెను శాఖామృ♦గాసురులకు, సంధి పొసఁగదు దైత్యని♦ర్జరుల కట్లు.

తాత్పర్యము

పర్వతాభ్రనికాశులు-ఎత్తున పర్వతములతోను, వ్యాపకమందు మబ్బులతోను సమానమగు వానరభల్లూక సేనలు వేలువేలుగ భూమియంతయు గ్రమ్ముకొనెను. దేవతలకు దైత్యులకు సంధి కుదురనట్లు వానరులకు రాక్షసులకు సంధి కుదురదు.

తే. గండుఁగ్రోఁతులు లగ్గలె♦క్కకయమున్న, సీతనిచ్చుటో యుద్ధంబు♦సేయుటో యొండె
నొండు వేనిశ్చయింపు ము♦ద్దండ తేజ, తడవు సేసినఁ గార్యంబు♦తప్పి వచ్చు.

తాత్పర్యము

పౌరుషముగల క్రోఁతులు లంకకోటలమీఁదికి లగ్గలు పట్టి యెక్కకముందే సీత నిచ్చుటో యుద్ధము సేయుటో నిశ్చయింపుము. ఆలస్యము చేసితివా కార్యము చెడును. అపాయము కలుగును. సీత నిచ్చుటో యుద్ధము సేయుటో యని చెప్పుటచే సీత నిచ్చుటయే క్షేమకరము. అది నీకు నిష్టము లేదేని యుద్ధము చేయవలెను. ఏ ప్రయత్నములేక వారి నలక్ష్యముచేసి యూరకుండ రాదని భావము. రావణునకు స్వబలగర్వముచేనైన ప్రమత్తత యెక్కువ. శుకునిఁబంపి యా పెక్కుదినములాయెనే వాఁడు రాలేదే, ఏమైనాఁడని మఱియొకని బంపినవాఁడు కాఁడు అట్లు పంపియుండిన వానరులు సేతువు కట్టుచున్న విషయము తెలిసియుండవచ్చును. దానిని గట్టకుండ రాక్షసులు పోయి నివారించి యుండవచ్చును. రాక్షససేన యంతయు నొక్కసారిగ పైఁబడినయెడల రావణుఁడు జయించి యుండునేమో! రామునితోఁ దానుయుద్ధము పెట్టుకొని యింద్రజిత్తులోనగు రాక్షసులను వానరసేనపై విడిచి యుండెనేని రాము నికి జయ మిప్పటివలె సులభసాధ్యమై యుండదు. ఇప్పుడొక్కఁడొక్కఁడే పోవుట వలన వానరులందఱుఁ గలసి యా యొక్కనిని జంపుటకు సాధ్యపడెను. అయినను దీనియందొక యపాయముకలదు. రాక్షసులందఱు నూరువిడిచివచ్చినవార్త తెలియఁ గానే కొందఱు వానరులు లంకపైఁబడి దానిని రక్షించువారు లేమిని పాడు పట్టింప

వచ్చియుందురు. అప్పు డాఁడువారిని గాపాడు దిక్కుకూడ లేకపోయి యుండును. అప్పుడు వెనుక ముందు వానరులు నడుమ రాక్షససేన చిక్కుకొనును. కావున నిది సరిగాదని యాలోచించి కోటలో నుండుటయే క్షేమము, బల మెక్కువయని యాలోచించి యా ప్రయత్నము రావణుఁడు మానెను. అట్లు రాక్షసులందఱొక్క సారిగవచ్చి యుండిన రామచంద్రమూర్తి సమ్మోహనాస్త్రముచే నందఱి నొక్క సారిగ సముద్రములోఁ ద్రోచి యుండును.

ప్రథమదిన యుద్ధమందు కోటబలముగలవాఁడై రాక్షసుల నందఱి నేక కాలమున యుద్ధమునకు విడిచెను గాని దానివలన మే లేర్పడినది కాదు. కావునఁ దరువాత ముట్టడులందలి యుద్ధపద్ధతి ననుసరించి యొక్కొక్కనినే సేనతో నొక్కొక్క ప్రక్క కంపుచుండెను.

—♦ రావణుడు శుకునితో సీత నీయ నని తనపరాక్రమముఁ దెలుపుట ♦—

మ. అనుడున్ రోషకషాయనేత్రుఁ డయి ర ♦ క్షోధీశుఁ డోరీ శుకా !
విన రా దానవదేవతావళి రణో ♦ ర్విం గూడి నన్నాకినన్
జనతాసంఘముతోడ లోకములు సం ♦ తాపించినన్ జానకిన్
జననాథాత్మజు నొద్దకున్ మఱల శుం ♦ ఠా ! పంపఁగాఁ బోనురా. ౫౦౮

అర్థములు. అనుడున్ = సీతను మఱల శ్రీరామచంద్రమూర్తి కిచ్చుటయే మంచిదని యభిప్రాయము సూచించుచు చెప్పగా విని, రోషకషాయ నేత్రుఁడయి = కోపముచే నెఱ్ఱనైన కన్నులుగలవాఁడై, జనతాసంఘము = జను లందఱు గుంపులు గుంపులుగాఁ జేరి, సంతాపించినన్=సంతాపపడినను, నాలుగవ పాదమున అనునాసికాక్షరయతి న=ంఠ.

గీ. అల ద్రుతంబునకును మధ్యమానునాసి,కమునకును జెల్లు ననునాసికయతులనఁగ
డాపలను బూర్ణములుగల్గు టఠడఢలును, తథదధలును గ్రమంబున దానవారి.
అప్ప. క. ౩ ఆ. ౬౨

తాత్పర్యము

సీతను మఱల రామచంద్రమూర్తి కర్పించుటయే శ్రేయస్కరమని శుకుఁడు చెప్పినమాట విని కోపించి కన్ను లెఱ్ఱచేసి రావణుఁ డిట్లనియె. ఓరీ, శుంఠా ! శుకా ! వినుము. దేవతలు దానవులు గుంపులై యొక్కటిగఁ జేరి యుద్ధమందు నన్నెదిరించినను జనులందఱు గుంపులు గుంపులుగఁ జేరి సంతాపపడినను రామ లక్ష్మణులకు సీతను మఱల నీయను.

ఉ. ఎన్నఁ డొకో మదీయనిశి ♦ తేషుతతుల్ సురభిం బ్రసూనసం
పన్నకుజాళి కై యళుల ♦ మాడ్కిని రామునిమీఁదఁ బాఱు, నిం
కెన్నఁడొ తూణిఁ దూఁగు శర ♦ బృందము కార్ముకముక్తమై కడున్.
ఖిన్నునిఁ జేయు రామునిఁ బ్ర ♦ కృష్టపుటుల్కలు కుంజరంబునాన్. ౫౦౯

అర్థములు. మదీయ=నాయొక్క, నిశిత=పదునైన, ఇషుతతుల్ = బాణ సమూహములు, సురభిన్=వసంతకాలమున, ప్రసూనసంపన్నకుజాళికై=పూలచే నిండిన చెట్లకై, అళులమాడ్కి=తుమ్మెదలవలె, ఈ యుపమానము గుంపుగాఁ బోవుటమాత్రమే తెలుపుచున్నది. కాని తుమ్మెదవలన పుష్పములకు బాధలేనట్లు రావణు బాణములవలన రామచంద్రమూర్తికి బాధలేదని సూచించుచున్నది. తూణిన్=అమ్ములపొదియందు, తూఁగు = నిద్రపోవు, కార్ముకముక్తమై = వింటిచేత విడువఁబడినవై - నేను జేయవలసినదిలేదు - నావిల్లే యాకార్యము చేయునని భావము, ఉల్క=కొఱవులు, కుంజరంబునాన్ = ఏనుఁగునువలె, ఇదియును బెదరించుట సూచించునే కాని హానిని కలిగించుట సూచింపదు.

తాత్పర్యము

ఎన్నడు నా బాణములు వసంతకాలమున నిండారఁ బూచిన వృక్షములకై తుమ్మెదలు గుంపులుగాఁ బోవునట్లు రామునిమీఁదికిఁ బోవునో, ఎన్నడు నా యమ్ముల పొదియందుఁ బనిలేక నిద్రబోవు బాణసమూహము వింటిచే విడువఁబడి కొఱవు లేనుఁగును వలె రాముని ఖేదపడఁజేయునో యని నేను గాచియుండఁగా నన్ను సీతనిమ్మని చెప్పెదవా ?

క. ఉదయించు నినుఁడు జగమునఁ బొదలు పదార్థముల తేజమును లోఁగొను న
చ్చదురున రామునిబలముం, గదనంబున నే హరింతుఁ గలఁగెద వేలా. ౪౧

అర్థములు. అచ్చదురునన్ = ఆ విధముగ, కదనంబునన్=యుద్ధమందు, కలఁగెదవు = కలఁతపడెదవు.

తాత్పర్యము

పుట్టుచున్న సూర్యుఁడు లోకములోని యన్ని పదార్థముల దీపముల నక్షత్రముల తేజస్సును తన తేజస్సునకు లోపఱుచుకొనునట్లు రాముని బలమును యుద్ధమున నేను హరింతును. ఈ మాత్రమునకు నీవేల వ్యాకులపడెదవు.

సూర్యుఁడు దీపనక్షత్రములకుఁ గాంతి రూపుమాయ జేయలేఁడు. కొంచెము కాలము దాని తేజు తగ్గించి మఱలఁ దానే యస్తమించుచున్నాఁడు. అట్లే రావణుఁడు రామాదులఁ గొంచెము కాలము బాధించి తానే హతుఁడగుచున్నాఁడని సూచన.

క. జలనిధిజవము ప్రభంజను, నలఘుగతియు నాకు నుంట నమ్మనుజుండున్.
దెలియుండు గాక తెలిసినఁ, గలనన్ న న్నెదురుకొనఁగఁ గాంక్షించు నొకో.

అర్థములు. జలనిధి జవము=సముద్రవేగము, ప్రభంజను=వాయువుయొక్క, అలఘుగతియు = బలగమనము.

తాత్పర్యము

ఆ మనుష్యుఁడు సముద్రవేగము వాయుగమనము నా యందుండుట యెఱుఁ

గఁడు. కావున యుద్ధమున న న్నెదిరింపఁ జూచుచున్నాఁడు. కాని తెలిసియుండిన నిట్టి యాలోచన సేయునా ?

క. కఱకులు తూణీశయములు, నెఱకలు గల సవిషఫణుల ♦ బృందము లని తా
నెఱుఁగండు నాదు ములుకుల, నెఱిఁగిన నన్నొడఁగ రాముఁ ♦ డేలా వచ్చున్. ౫౧౮

అర్థములు. కఱకులు = పదునైనవి, తూణీశయములు = పొదియందు నిద్రించునవి, ఎఱకలు=ఱెక్కలు, సవిష=విషముతోఁగూడిన, ఫణుల = పాముల యొక్క, బృందములు=సమూహములు, ములుకులన్=బాణములను.

తాత్పర్యము

పుట్టలో నిద్రించు విషసర్పములవలె నంబులపొదిలోనుండు పదునైన బాణములు తన్ను నిద్ర లేపిన వాని హింసించునని రాముఁ డెఱుఁగఁడు. తెలిసి యుండిన యుద్ధమున నన్ను సమీపింపఁ దలచునా ?

రెండవ పాదంబున ఋత్వసంబంధవళి.

గీ. సారివిఁ గాదులఁగల వ్రుసుడుల కెల్ల, ఋత్వమిత్రంబులగు వచ్చు లెసయు నైదు చెల్లు హాయలును స్వరమైత్రి చెందునపుడు, వెలయు నివి ఋత్వసంబంధవళులనంగ.

అప్ప. ౩. ఆ.

ఉ. జ్యారవసంకులంబును భృ ♦ శార్తవిభీతమహాస్వనంబు దు
ర్వారఖగప్రకాండతల ♦ వాదితమున్ శరకోణఘోషితో
ద్ఘోరధనుర్విపంచిఁ గొని ♦ దుర్హృదనీకిని యాలకింపఁగా
నే రణరంగరంగమున ♦ నేర్మి జరించెదఁ జూడరా శుకా ! ౫౧౯

అర్థములు. జ్యారవసంకులంబును = అల్లెత్రాటిమ్రోఁత యనెడి కోలాహలముకలది, భృశార్తవిభీత=మిక్కిలి బాధపడు వారలయు వెఱచినవారలయు, మహాస్వనంబు = గొప్ప ధ్వనిగలది, దుర్వార = వారింపరాని, ఖగప్రకాండ = శ్రేష్ఠములైన బాణములచే, ఆకాశమునఁ బక్షులవలె గుఱితేలకపాఱు బాణములని సూచన, తల = అఱచేతులచే, వాదితము = ధ్వనిగలదిగాఁ జేయఁబడినది, బాణములుపోవు చప్పుడు, అఱచేత నల్లెత్రాడీడ్చి విడుచు చప్పుడు, శర=బాణములనెడి, కోణ=కోడుపుచే, ఘోషిత=వాయింపఁబడిన, ఉద్ఘోర = మిగుల భయంకరమైన, ధనుః=విల్లనెడి, విపంచిన్=వీణను, దుర్హృత్ + అనీకిని = వైరులసేన, నేర్మిన్ = నేర్పుతో, రణరంగరంగమునన్=యుద్ధభూమియను నాట్యమాడు స్థలమున, సంకుల మహాస్వన-వాదిశబ్దములు-వీణయందలి మంద్రమధ్యతారములను మూఁడు ధ్వనులను దెలిపెడిని-భృశార్తవిభీత - దుర్వార ఖగప్రకాండ, తలశబ్దములు వాని శబ్దమును లాక్షణికములు.

తాత్పర్యము

అల్లెత్రాటి చప్పుడనెడి కలకల ధ్వనికలదియు బాణములు దగిలి బాధపడు

వారలయు పరువెత్తుచు నఱచు పిఱికులయు గొప్పధ్వనికలది, ఎదురులేని బాణముల చేతను అఱచేతుల చేతను ధ్వనికలుగఁ జేయఁబడినది, బాణములను కొనుపులతో ధ్వని కలుగఁ జేయఁబడినధనుస్సనెడి వీణనుగొని శత్రుసేన వినుచుండఁగా రణభూమియందు నేను నేర్పుతోఁ దిరిగెదను చూచుచుండుము–అలంకారము–రూపకము – రణరంగమును నాట్యరంగముగఁ జెప్పుటచేతను దాను వైణికుఁడనగుదు ననుటచేతను యుద్ధరంగమందుఁ దన నేర్పు చూపునట్లు లేర్పడెనుగాని జయించినట్లు లేర్పడదు.

క. రాముఁడు పూర్వంబున సం, గ్రామంబున నన్నుఁ దాఁకఁడి • కానఁడు మద్వీ ర్యామితశక్తులు నీయెడఁ, దా మదినెఱిఁగెడిని గాక • దలరఁగ నేలా? ౫.౨౧

అర్థములు. తలరఁగన్ = భయముచే మనస్సు చలింపఁగా.

తాత్పర్యము

ఇంతకుముందు రాముఁడు యుద్ధమందు నన్నుఁ దాఁకి నావీర్యము శక్తి యేమాత్రమో యెఱుఁగడు కావున వచ్చుచున్నాఁడు. ఈమాత్రమునకే నీవు భయపడి చలించెదవేల?

మత్తకోకిలము. వేయిగన్నులు గల్గి వెల్గెడు • వేల్పుఱేఁ డరుదెంచినన్
తోయధీశుఁడు పాశహస్తుఁడు • త్రోచివచ్చిన, దండియై
యా యముం డిట వచ్చినన్, ద్రవి • ణాధినేత యెదిర్చినన్
జేయలే రొకయింతయేనియుఁ • జెట్ట నా కెటు భీరుకా. ౫.౨౧

అర్థములు. తోయధీశుఁడు = వరుణుఁడు, దండియై = దండము ధరించినవాఁడై, ద్రవిణాధినేత = కుబేరుఁడు, భీరుకా = పిఱికీ.

తాత్పర్యము

వేయిగన్నుల యింద్రుఁడు వచ్చి యెదిరించినను పాశమును జేతఁబూని వరుణుఁడు వచ్చినను యమదండము చేఁబూని యముఁడు వచ్చినను ధనాధిపతి కుబేరుఁడు వచ్చినను పిఱికివాఁడా! నా కే కీడును జేయలేరు.

౨౫-వ సర్గము. రావణుఁడు శుకసారణులను వానరసేనఁ బరికింపి రాఁ బనుచుట.

తే. పొమ్మటంచును వానిని • బుచ్చి యవల, సారణుండును శుకుఁడను • సచివవరుల వంకఁ గనుఁగొని పల్కె రా • వణుఁడు దుర్భ, రస్మయావిష్టచిత్తుఁడై • రభసయుక్తి.

అర్థములు. సచివవరుల వంక = మంత్రిశ్రేష్ఠుల వైపు, దుర్భరస్మయ = అతిశయించిన గర్వముచే, ఆవిష్ట = ఆవేశింపఁబడిన, చిత్తుఁడై = మనస్సు గలవాఁడై, రభసయుక్తిన్ = తొందరగా.

తాత్పర్యము

నీవు పొమ్మని వానిని బంపి శుక సారణులను మంత్రులను జూచి గర్వాతిశయమున తొందరగా నిట్లనెను.

ఇందుఁ జెప్పఁబడిన శుకుఁడు మంత్రి శుకుఁడు. ముందు పోయినవాఁడు కాఁడు.

ఉ. ఎన్నఁడు మున్ను విన్నయది • యేనియుఁ గాదు మహాబ్ధిలో మహా
భ్యున్నతసేతు వాజిప్రియ • పుత్రుఁడు నిర్మితి సేయఁ గ్రోఁతులున్
బన్నుగ నబ్ధిదాఁటి మన • పైపడి నచ్చిన వంట, నిక్క మం
చెన్నఁగనేర నంబునిధి • యెక్కడ! సేతువుకట్టు లెక్కడన్. ౫౩

అర్థములు. మహాభ్యున్నత సేతువు=పెద్ద యనకట్ట, ఆజిప్రియపుత్రుఁడు= దశరథుని కుమారుఁడు, రామచంద్రమూర్తి, నిర్మితి=నిర్మాణము.

తాత్పర్యము

ఇప్పుడు నేను జెప్పఁబోవునది యెన్నఁడు విన్నదికాదు. ఏమంటిరా? రాముఁడట. మహాసముద్రమునకు పెద్ద సేతువు కట్టెనఁట. దానిపైఁ గ్రోఁతులు మన నగరముపై పడవచ్చెనఁట. ఇట్లని వింటిని. నిజమని నేను నమ్మఁజాలను. ఏలన సముద్ర మెక్కడ? దానిలో సేతువుకట్టు లెక్కడ ? అదియేమి వాఁగా వంకా ?

సీ. అదియునుగాక వనాటసైన్యంబును, గణియించుట యవశ్య•కార్య మగుటఁ
జనుఁ డీరు మాఱు వే•షంబులఁ గపిసేనఁ, జొరుఁడు మి మ్మెవ్వరుఁ•జూడకుండఁ
బ్లవగుల వీర్యంబు•పరిమాణ మెఱుఁగుఁడు, రామమంత్రులఁ గపి•రాజుహితులఁ
బూర్వాభివర్తులు • పురువీర్యవంతులు, వృక్షాటు లెవ్వరో • యెఱిఁగి రండు
తే. వానరాళినివేశంబు • వార్ధిసేతు, నిర్మితియుఁ జూచి చనుదెండు • నిక్కమే మొ
ప్లవగవీరులకును దళ•వాయి యెవఁడో? చక్కఁగ గ్రహించిరండునా•సచివులార!

అర్థములు. వనాటసైన్యంబును = వానరసేనను, గణియించుట = లెక్క పెట్టుట, ఈరు = మీరు, పూర్వాభివర్తులు=ముందుగా యుద్ధసన్నద్ధులై యున్న వారు, పురువీర్యవంతులు = గొప్ప శౌర్యము గలవారు, వృక్షాటులు=క్రోఁతులు, నివేశంబు=దిగిన స్థలము, దళవాయి=సేనానాయకుఁడు.

తాత్పర్యము

సేతు నిర్మాణము సత్యమా యసత్యమా యని చూచుటయే గాక వానర సేన సంఖ్య యెంతయో తెలియవలయును. కావున మీరు మాఱువేషములు వేసికొని మి మ్మెవ్వరుఁ జూడకుండ వానరసేనలోనికిఁ బొండు. పోయి వానరుల శక్తి యేమాత్రము? రాముని సుగ్రీవుని మంత్రు లెవ్వరు? యుద్ధమునకు ముందుగఁ గాలు ద్రవ్వుచున్న వా రెవ్వరు? ఎక్కువ శౌర్యముగల వానరు లెవరు? వానరసేన యెక్కడ దిగియున్నది? సేతు వెట్లు కట్టిరి? అది నిజమా? వానరసేనానాయకుఁ డెవఁడు? మంత్రులారా! యివియన్నియుఁ జక్కఁగ తెలిసికొని రండు.

క. రాముఁడు సేయు ప్రయత్నం, బా మానవు బలిమి యాయు•ధాళివిధంబున్.
సౌమిత్రిపరాక్రమము మ,హామాత్రులు? చక్కఁ దెలియుఁ•డా మూలముగన్.

తాత్పర్యము

యుద్ధవిషయమున రాముఁడు చేయు ప్రయత్నము ఆ మనుష్యుని బలమెంత?

అతఁడే యాయుధములతో యుద్ధము సేయును? లక్ష్మణు పరాక్రమ మేమాత్రము? మంత్రులారా! మూల ముట్టుగ సర్వము తెలిసికొనిరండు.

సీ. అని సమాదిష్టులై ♦ యా శుకసారణుల్, తరుచరవేషముల్ ♦ దాల్చి యేగి
కపిసేనఁ గని మేన ♦ గగ్గురు పొడువ ది, గ్భ్రమ చెంది లెక్కింప ♦ వశముగాక
శైలకందరగుహా ♦ వేలావనీదేశ, ముల నుపవనముల ♦ నెలయువారి
దాఁటిన దాఁటెడు ♦ దాఁటనుండెడివారిఁ, దీరంబునకు వచ్చి ♦ దిగెడువారిఁ

తే. గాంచి యవిచింత్యమైన యా ♦ కపిబలాబ్ధి; పార మెఱుఁగక తిరుగ న ♦ వ్వారి నెఱిఁగి
వెంటనే పట్టి కట్టి వి ♦ భీషణుండు, రాముముంగల నిలుప నా ♦ రక్కసులను. ౫౭

అర్థములు. సమాదిష్టులై=చక్కఁగ నాజ్ఞాపింపఁబడినవారై, శైలకందరగుహా వేలావనీ దేశములన్ = కొండ శిఖరములందు, గుహలందు, లోయలందు, సముద్రతీరమందు గల ప్రదేశము లందును, ఉపవనములన్ = ఉద్యానవనము లందును, అవిచింత్యము=మనసు చేనైన నింత యని యూహింపరానిది, కపిబలాబ్ధి పారము=వానర సేనకు నంతెము.

తాత్పర్యము

ఇట్లు రావణుచే నాజ్ఞాపింపఁబడినవారై శుకసారణులు వానరులు వేషములు ధరించిపోయి వానరసేనచూచి భయముచే దేహము పులకరింపఁగ దిక్కు తెలియక లెక్కపెట్టుటకు వశముగాక కొండ గుహలందు లోయలందు సముద్రతీరమందు నుద్యానవనములందు దిగినవారిని సేతువుదాఁటి వచ్చినవారిని, దాఁటుచు సేతువు మీఁదఁ నుండువారిని, వచ్చుటకు నెడము లేక కాచి యావలియొడ్డున నేయుండువారిని, వచ్చి దిగుచున్నవారిని చూచి మనస్సుచేనైన నింతయని యూహింప సాధ్యపడని యా వానరసేనాసముద్రము యొక్క యంత మెఱుఁగ లేక తిరుగుచుండఁగా రావణుఁ డెవ్వరినైన వేగులను బంపునుగాని పంపక యుండఁడు, వారిని గనిపట్టవలయునని తిరుగుచున్న విభీషణుఁడు వారిఁబట్టి పెడజెక్కలు విఱుగఁగట్టి రాముని యెదుట రామచంద్రా! వీరు రావణుని వేగులవారని యా రాక్షసులను నిలుపఁగా?

—♦ విభీషణుఁడు శుకసారణులను బట్టి శ్రీరామున కప్పగించుట ♦—

తే. ఆర్తిగొని ప్రాణములమీఁది ♦ యాశవిడిచి, హస్తయుగళంబు మోడిచి ♦ యనిరి యిట్లు
పంక్తికంఠునియాజ్ఞ నీ ♦ బలము నలవు, తెలియంగఁగ వచ్చిన ♦ వారమయ్య.

అర్థములు. ఆర్తిగొని = దుఃఖపడి, నీ బలము నలవు = నీ సేన యొక్క బలము.

తాత్పర్యము

వారు దుఃఖపడి వేగుల వారిని జంపవచ్చునని రాజనీతి కావునఁ బ్రదుకు నాశవదలి రెండు చేతులు మోడ్చి యిట్లనిరి. రావణుని యాజ్ఞ చొప్పున నీ సేనా పరిమాణ విధము తెలిసికొని పోవ వచ్చితిమి.

క. త్రుంచినఁ ద్రుంపుము మము ర,క్షించిన రక్షింపు జాన•కీపతి ! యన నా
లించి హసించుచు నిటు వచి, యించెను నిశ్శేషభూత•హితరతుఁ డెలమిన్.

అర్థములు. జానకీపతి = ఈ నామోచ్చారణము వీరిని రక్షించును. జానకీపతి యనుటచే సీతాదేవి పురుషకారము సూచితము సీతాదేవి తన్నుఁ బదినెలలుగా రాత్రియుఁ బగలు బాధ పెట్టుటచేఁ జంపఁదగిన రాక్షస స్త్రీల నమస్కారమాత్రముననే రక్షించెను. నీవు దస్యులమైన మమ్ము రక్షింపుము, అని సూచితము. ఆలించి=విని, హసించుచు=నవ్వుచు. ఈ కుచేష్టలచేతనా రావణుఁడు బ్రదుకఁ దలఁచి యున్నాఁడు, ఎంతటి మందబుద్ధి యని నవ్వు. నమస్కరించుట, జానకీదేవి పేరు చెప్పుట యీ రెండు వీరిని రక్షించెను. నిశ్శేష భూతహిత రతుఁడు=అనుకూలురైన సమస్త భూతములకు మేలుకోరుటయందు నాసక్తిగలవాఁడు. ఎలమిన్=సంతోషముతో - చంపఁదగినవారిని రక్షింప సమయము దొరకెఁగదా యని సంతోషము. శత్రువులైనను నమస్కరించిన రక్షించుట నా వ్రతమని ముందే చెప్పెగదా !

తాత్పర్యము

ఇది మేము చేసిన దోషము. దీనికిఁగాను నీవు మమ్ముఁ జంపఁ దలఁచితివా చంపుము. రక్షింపఁదలఁచితివా రక్షింపుము. జానకీపతీ ! మా ప్రాణములు నీ యధీనములు అనిన విని నవ్వి శత్రుమిత్రభేదములేక యందఱ మేలు గోరు రామచంద్రమూర్తి సంతోషముతో నిట్లనెను. తమ దోషము చెప్పుకొనుట, నమస్కరించుట, తమ ప్రాణములు రామచంద్రమూర్తి స్వాధీనము లనుట, దీనులై నిలువఁబడుట, యివన్నియు శరణాగతి కంగములు. అయినను వీరు ప్రాణరక్షణార్థమై చేసిరి కావున వారి ప్రాణములను రక్షించెను. జానకీపతి యనుటచే పురుషకారమాత సీతాదేవి సమక్షమున నుండఁ బనిలేదు. అనుకూల భావముతో నామె పేరు స్మరించి సంబంధము తెలిపినను చాలును - ఆమెయందుఁ బ్రేమలేనివాఁడు అనుకూలబుద్ధితో నామె పేరు చెప్పఁడుకదా !

ఉ. మీరలు సర్వసైన్యము స•మీక్షణ చేసితి రేని, మా విధం
బారఁ బరీక్షచేసిన, ద•శాస్యుఁడు మీకు వచించి నట్టి యా
కారియ మెల్లఁ దీరినను • గ్రమ్మఱి పొండు; యథేచ్ఛ మేదియేన్
మీరలు చూడ రేని చని • మీ మతిచొప్పున వెండి చూడుఁడీ.   ౫. ౨౯

అర్థములు. సమీక్షణ చేసితిరేని=చక్కఁగా చూచియుండినను, ఆరన్=పూర్ణముగ, యథేచ్ఛము=ఇష్టప్రకారము.

తాత్పర్యము

మీరు సమస్త సైన్యమును జక్కఁగాఁజూచి యుండినను మే ముండు విధము మీరు చక్కఁగాఁబరీక్ష చేసియుండినను రావణాసురుఁడు మీకుఁ జెప్పినపనులన్నియుఁ

జిక్కఁగా మీరు నెఱవేర్చియుండినను మీరు వెడలిపొండు. మీ యిష్టప్రకార మింకను మీరు చూడక నిలువ యేదైన నుండినచో మీ యిష్టప్రకారము పోయి చూడుఁడు.

ఉ. ఏకత మేగ మీకు భయ ♦ మేని విభీషణుఁ డెల్ల జూపెడిన్
   మా కిటు కైవసంపడుట ♦ మానుఁడు ప్రాణముపట్ల భీతి న్యా
   యాకలితంబు గాదు విగ♦తాయుధు లై వశపడ్డ మాతలన్
   జేకు మడంచి చంపుటలు ♦ జిచ్చపడం బని యేమి మీ కిటన్. ౫౩౦

అర్థములు. ఏకతము=ఒంటరిగ, కైవసంపడుట=స్వాధీనపడుట, న్యాయాకలితంబు = ధర్మముతోఁ గూడినది, విగతాయుధులై = ఆయుధములు ధరింపనివారై, జేకు మడంచి=అణఁగఁద్రొక్కి, జిచ్చపడన్=నెలనెలఁబోవ, మాతలన్= ఇచ్చట వేగుల వారని యర్థము, రాయబారులు గారు.

తాత్పర్యము

ఒంటరిగ వానరసేనలోఁ బోవ మీకు భయమాయెనా మీకుఁ బరిచితిగల విభీషణునే మీకుఁ దోడిచ్చెదను. ఆయనయే సర్వము మీకుఁ జూపఁగలఁడు. మా చేతిలో మీరు చిక్కిన దానికై చచ్చిన వారమే యని మీరు భయపడ నక్కఱ లేదు. ఏలన ఆయుధహీనులై చేచిక్కిన వేగులను నణఁగఁ ద్రొక్కి చంపుట న్యాయముగాదు. కావున మీరు విలవిలఁబోవఁ గారణములేదు. ప్రత్యక్షశత్రువై యుద్ధమున నెదిరించిన వానినైనను నిరాయుధుని జంపరాదు. అటుండ నిరాయుధుఁడైన వేగులవానిఁ జంపుట ధర్మము గాదని తాత్పర్యము.

ఇంతటి సర్వ భూతదయ శత్రువులందును వాత్సల్యము రామచంద్రమూర్తి యందుఁ గానవచ్చుచున్నది గాని మఱి యెందుఁగాననగు? ఇట్టివాఁడు భగవంతుఁడు గాక మఱియెవఁడు? శరణాగతుఁడైన విభీషణు రక్షించుట యందు రామచంద్రమూర్తికి స్వార్థపరత్వము గలదని సందేహించినను ఇచ్చట నట్టి దోషము చెప్పనవకాశమే లేదు. వీరిని విడుచుట వీరియందలి దయచేత మాత్రమే కాదు. వీరు సర్వముఁ జూచి యున్నదున్నట్టు చెప్పిన రావణుఁడును యుద్ధప్రయత్నము మాని క్షేమపడును గాక యను భావముతోడనే. ఇట్టులే చేచిక్కిన రావణుఁగూడ విడువఁగలఁడు. ఇట్టి వానిని కరుణాకాకుత్స్థుఁడనుట యెంత సార్థకమో వివేకులే యాలోచింప నర్హులు. విభీషణునిఁ జేర్చుకొనుటయందు శ్రీరామచంద్రమూర్తి యభిప్రాయము రావణుఁడు తనలో "నా తమ్ముఁడు నా విషయము సర్వము నెఱిఁగినవాఁడు శత్రువులలోఁ గలిసెనే. నా మర్మములన్నియు నతఁడు రామచంద్రునకుఁ జెప్పునే. మర్మమెఱిఁగిన శత్రువులతో మనమెట్లు పోర గల" మని యుద్ధము చాలించి సంధికి వచ్చునేమో యనియు గలదని చెప్పనచ్చును.

చ. కరము విభీషణా! పరవి ♦ కర్షణశీలురఁ బృచ్ఛమానులన్
సురరిపుచారులన్ విడుము ♦ నొంపకు మంచు వచించి వారితో
ధరణివిభుండు పల్కెఁ క్షణ ♦ దాచరులార! పురంబుఁ జేరి కి
న్నరపతితమ్మునితో ననుఁడు ♦ నా వచనంబులు గాఁగ నీ విధిన్. ౫౩౧

అర్థములు. కరము=మిక్కిలి, పరవికర్షణశీలురన్=ఇతరులకుఁ గీడుచేయుటయే స్వభావముగా గలవారిని, పృచ్ఛమానులన్=ఆ యుద్దేశముతోనే ప్రశ్నించువారిని, సురరిపుచారులన్=దేవవిరోధి రావణాసురుని వేగులవారిని, నొంపకుము=బాధింపకుము. క్షణదాచరులార = రేద్రిమ్మరులారా! రాక్షసులారా! కిన్నరపతి తమ్మునితోన్ = కుబేరుని తమ్మునితో, ఇది కుబేరునివలె నీవును గుణవంతుఁడవై యుండుమని బోధించుటను సూచించును.

తాత్పర్యము

విభీషణా! వీరు మిక్కిలి పరులకుఁ గీడుచేయుటే స్వభావముగాఁ గలవారు. ఆ యుద్దేశ్యముతోనే వీరు ప్రశ్నింతురు. ఏలన వీరు రావణుని వేగువాండ్రు. పరుల నెట్లు చంపవచ్చునా యని వారి లోపములను వెదకుటయేకదా వీరికి నిత్యకృత్యము. ఇట్టివారు వధ్యులే. అయినను వీరిని బాధింపకుము. వదలిపెట్టుము అని చెప్పి యా శుకసారణులను జూచి యిట్లనియె. రాక్షసులారా! మీరు మరల మీ పురంబునకుఁబోయి కుబేరుని తమ్మునితో నేను జెప్పితినని నా మాటలుగా నిట్లని చెప్పుఁడు.

ఉ. ఏమిబలంబు నమ్మి యసు ♦ రేశ్వర! నా సతి సీతఁ గానలో
నా మెయి ముచ్చిలించితివొ ♦ యా బలమున్ సహసైన్యబాంధవ
స్తోమముఁ గాఁగ నీ వలచు ♦ చొప్పునఁ జూపుము, తేప లంక నా
నామహితాస్త్రజాలముల ♦ నాశముఁ జేసెద నీవ చూడఁగన్. ౫౩౨

అర్థములు. ముచ్చిలించితివో=దొంగిలించితివో, నీ వలచు చొప్పునన్=నీ యిష్టము ప్రకారము, తేప=ఉదయముకాఁగానే.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవేమి బలమునమ్మి నా భార్యను నడవిలో మోసగించి దొంగిలించితివో యా బలమంతయు సేనలయు, చుట్టములయు సమూహముతో నీ యిష్టప్రకారము కొఱఁతలేకుండఁ జూపుము. సూర్యోదయముకాఁగానే నానా విధములైన గొప్ప యస్త్రములచేత నీ కన్నుల యెదుటనే నీవు చూచుచుండఁగనే నాశము చేసెదను.

ఉ. దారుణమైనవజ్రమును ♦ దానవకోటులమీఁదఁ బంచు పా
కారిగతిన్ మదీయభయ ♦ దాగ్రహమున్ భవదీయసేనపై

వారక వేఁగుబోక వెసఁ • బంచి సతోరణ మైనలంకఁ బ్రా
కారయుతంబు ధ్వంసితము • గా నొనరించెదఁ జూడు రావణా ? ౫౩౩

అర్థములు. పాకారిగతిన్ = ఇంద్రునివలె, మదీయ = నాయొక్క, భయద = భయంకరమైన, ఆగ్రహమున్ = కోపమును, భవదీయ = నీయొక్క, సేనపై = దండుమీఁద, వేగుఁబోకన్ = ఉదయమున, వెసన్ = శీఘ్రముగ, సతోరణమైన = గోపురములతో గూడిన, ప్రాకారయుతంబు=ప్రాకారములతోఁ గూడినదానిని, ధ్వంసితము=నాశము చేయఁబడినది.

తాత్పర్యము

తీవ్రమైన వజ్రమును నింద్రుఁడు దానవులమీఁద వేయునట్లు నా కోపమును నీ సేనపై తెల్లవారుచుండఁగానే పంపి గోపురములతోడి ప్రాకారముతోఁ గూడ నీ లంకను నాశముచేసెదను జూడుము.

క. అని పలుకుఁడు మీ పతికిం, జనుఁడని విడిపింప వారు • జయరవములతో
ఘను ధర్మవత్సలునిఁ గీ, ర్తనసేసిరి; యంతఁ బోయి•రావణుఁ గనుచున్. ౫౩౪

తాత్పర్యము

అని మీ రాజునకు మీరు చెప్పుఁడు పొండని కట్లు విడిపింపఁగా వారు గొప్ప గుణములు గలవాఁడును ధర్మమునందు బ్రీతిగలవాఁడును నగు రామచంద్రుని జయ జయ రామచంద్రా యని పొగడిరి. అంతటఁ జారులు రావణుఁ జూచి,

—• శుకసారణులు రావణుతో సీతాదేవిని శ్రీరాముని కిమ్మని చెప్పుట •—

చ. పలికిరి రాక్షసేశ్వర ! భ • వద్వినిదేశముమేర కేగి త
ద్బలములలోఁ జరింప మముఁ • బట్టి విభీషణుఁ డా కృపాళు రా
ములకడ నిల్ప వధ్యుల మ•మున్ విడిపించె మహోగ్రతేజుఁ డా
యలఘుపరాక్రమాఢ్యు విధ • మంతయు నేమని చెప్పువారమో. ౫౩౫

అర్థములు. భవద్వినిదేశము మేరకు = నీ యాజ్ఞప్రకారము, కృపాళు = దయాశాలియగు, వధ్యులన్ = చంపఁబడఁ దగినవారిని, మహోగ్రతేజుఁడు = మిగుల భయంకరమైన తేజముగలవాఁడగు, ఆయలఘుపరాక్రమాఢ్యు = గొప్ప పరాక్రమసంపద గలవానియొక్క, విధము = తీరు.

తాత్పర్యము

రాక్షసరాజా ! నీ యాజ్ఞాప్రకారము పోయి వానర సేనలలోఁ దిరుగుచుండఁగా విభీషణుఁడు మమ్ము బట్టుకొనిపోయి దయాశాలియగు రాముని యొద్ద నిల్పఁగా వేగుల మగుటచే చంపఁబడఁ దగిన వారమైనను మమ్ము వదలిపెట్టెను. మిగుల భయంకర తేజముగల యా గొప్ప పరాక్రమవంతుని విధము మే మేమని చెప్పఁగలము. ఇట్లని చెప్ప సాధ్యముగాదు.

ఉ. వీరలు సస్త్రవేదు లతి • విక్రమవంతులు దిగ్ధవోపముల్
చేరిరి నల్వు రొక్కయెడ • శ్రీరఘురాముఁడు లక్ష్మణుండు వృ
త్రారిసమానవిక్రముఁ డ • హార్పతిజుండు విభీషణుండునన్
వీర లె పెల్లగింప మన • వీడు సమూలము పాఱఁజిమ్మఁగన్. ॥౩౬

అర్థములు. దిగ్ధవోపముల్ = దిక్పాలురతో సమానులు, వృత్రారి = ఇంద్రునితో, సమాస=సరియగు, విక్రముఁడు=పరాక్రమము గలవాఁడు, అహార్పతిజుఁడు = సూర్యపుత్రుఁడు, సుగ్రీవుఁడు, సుగ్రీవునకు నస్త్రజ్ఞానము లేకున్నను ఛత్రిన్యాయమున నన్వయించుకొనునది.

తా త్ప ర్య ము

శూరులు, అస్త్రముల నెఱిఁగినవారు, మిగుల పరాక్రమము గలవారు, దిక్పాలురతో సమానులునగునల్వురు రామలక్ష్మణ సుగ్రీవవిభీషణు లొక్కచోటఁ జేరిరి. ఈ నలువురే మన పట్టనమును పాఁదుతోడఁ బీకి నాశముచేయ సమర్థులు.

చ. వలతులు, తక్కువృక్షచర • వర్యులమాట యటుండనిమ్ము; రా
ముల వివిధాస్త్రసంపదయు • మూర్తివిశేషముఁ జూడఁజూడఁగా
నలవున నాతఁ డొక్కఁడె న • మర్థుఁడు పో మన లంక యంతయున్
గులగులలై చెడన్ ధరణిఁ • గూల్పఁగఁ దక్కిన ముగ్గు రేటికిన్. ॥౩౭

అర్థములు. వలతులు=సమర్థులు, రాముల = రామచంద్రమూర్తియొక్క, పూజ్యార్థమందు బహువచనము, మూర్తివిశేషము = ఆకారముయొక్క గొప్పదనము, అలవునన్=పరాక్రమముచే, గులగులలై=పొడిపొడియై.

తా త్ప ర్య ము

తక్కిన వానరులమాట యటుండనిమ్ము. రామచంద్రమూర్తి నానావిధములైన యస్త్రముల సంపత్తియు, ఆకారముయొక్క గొప్పతనము నాలోచించుకొలఁది పరాక్రమముచే మన లంకను పొడిపొడి చేసి నేలఁబడఁజేయ నాయనయొక్కఁడే చాలును; తక్కిన ముప్వురుకూడఁ బనిలేదు.

ఉ. రాముఁడు లక్ష్మణుండు హరిరాజును బాలసేయు సేన సు
త్రామపురోగమామరుల • రాజికి నేని జయింపరాదు, నూ
ఱామడ యాయతంబుఁ బది • యామడ విస్తియు నైన సేతువుం
దీమస మార దాఁటె మన • తీరమునం గపిసేన యంతయున్. ॥౩౮

అర్థములు. సుత్రామపురోగమామరుల = ఇంద్రుఁడు మొదలుగాఁ గల దేవతలయొక్క, రాజికి=సమూహమునకు, ఆయతము=దీర్ఘము, విరివి=వెడల్పు, దీమసము=ధైర్యము, మనతీరమునన్=మన లంకవైపునుండు నొడ్డున.

తా త్ప ర్య ము

రామలక్ష్మణ సుగ్రీవులు రక్షించు వానరసేనను మనుష్యులు రాక్షసులేకాదు,

ఒకరిద్దఱు దేవతలుగారు దేవతల గుంపంతయుఁగాదు ఇంద్రునితోడ దేవతల గుంపంతయునైన జయింపసాధ్యపడదు. నూఱామడ పొడుగు పదియామడ వెడలుపు గల సేతువును సమీపమందే శత్రువు లగు రాక్షసులున్నవారే వారు చూచిన పైబడి వత్తురేమో యను భయమైన లేక ధైర్యముతో మన లంకకు సమీపమున నుండు తీరమునందే వానరసేన యంతయు.

ఉ. పాళెము డిగ్గి యున్న యది ♦ వారధి దాఁటిన దాఁటు చున్న సై
న్యాళికి నంతముం గనము ♦ హర్ష వివృద్ధకపీంద్రపాళితో
నాలము సేయ డీకొనుట ♦ యర్షము గాదు, శమించు టొప్పు, భూ
పాలున కప్పగింపుము నృ♦పాలతనూజ, శుభంబు నీ కగున్. ౫౮౯

అర్థములు. పాళెముడిగ్గి = విడిసి, హర్షవివృద్ధ = సంతోషముచేఁ బెరిఁగిన, ఆలము=యుద్ధము, శమించుట=కోపము తగ్గించుట.

తాత్పర్యము

విడిసియున్నది. సముద్రము దాఁటిన వారి, దాఁటుచున్నవారి సేనకుఁ దుద కానరాలేదు. సంతోషాతిశయముచే దేహము పెరిగిన వానరసమూహముతో యుద్ధము సేయఁబూనుట తగదు. కోపము తగ్గించి సీతను రామున కిచ్చుటే తగిన కార్యము. దాని వలన నీకు మేలగును.

౨౬-వ సర్గము. రావణుఁడు శుకసారణులతోఁ బ్రాసాద మెక్కి కపిసేనలఁజూచుట.

చ. అని యిటు పథ్యసూక్తుల భ♦యంపడ కాడినమంత్రి సారణున్
గని వచియించు రావణుఁడు ♦ కాఱులు పల్కెదవేల? దేవతల్
దనుజులు గూడి మొక్కలటయి ♦ తాకొని రేని జగంబులెల్ల నా
కనుపమభీతిఁ జూపిన ధ♦రాత్మజ నిచ్చుట లేదు నమ్ముమీ. ౫౯౦

అర్థములు. పథ్య సూక్తులను = మేలు కలిగించు మంచి మాటలను, కాఱులు = వ్యర్థ వాక్యములు, తాకొని రేని = ఎదిరించినను.

తాత్పర్యము

ఈ ప్రకారము సారణుఁ డనువాఁడు భయములేక మేలైన మంచి మాటలు చెప్పఁగా రావణుఁ డిట్లనియె. ఓరీ ! నీవేల వ్యర్థముగ వదరెదవు? దేవతలు దానవులు కలిసికొని మొక్కలలైవచ్చి నన్నెదిరించినను లోకములన్ని కలసి నన్నుఁ జంపెద మనినను సీతను మరల నీయను; నమ్ముము.

క. అక్కపివరులకు వశపడి, చక్కఁగ మర్దింప వారు ♦ సంత్రస్తుఁడ వై
యిక్కరణి సీత నిమ్మని, పెక్కులు కొఱగాము లెల్లఁ♦బ్రేలెదు పిఱికీ! ౫౯౧

అర్థములు. సంత్రస్తుఁడవై=భయపడినవాఁడవై, కొఱగాములు = పనికి రాని మాటలు - ప్రేలెదు = వదరెదవు.

తాత్పర్యము

ఓరి పిఱికివాఁడా! వానరులకుఁ జిక్కి వారు బాగుగఁ దన్నఁగా భయపడి యీ విధముగ సీత నిమ్మని పనికిమాలిన మాట లనేకములు వదరెదవా?

ఉ. ఎవ్వఁడు రోరి నన్నని జ • యించెడి శత్రువు? రమ్ము చూత మం
చవ్విబుధాహితుండు మిహి • కార్జునమున్ బహుతాళకోన్నతం
బవ్వినుపీది నంటు నొక • యభ్రపుమేడను రోష మాత్మలో
నివ్వటిలంగ నెక్కి యవ • నీధరకానన సాగరంబులన్. ౬౮౨

అర్థములు. విబుధాహితుండు = దేవవిరోధి - రావణుఁడు - మిహికార్జునమున్ = మంచువలెఁ దెల్లనైనది. బహుతాళకోన్నతంబు = పెక్కు తాటిచెట్ల యెత్తు నుండునది. బొటనవ్రేలిని నడిమి వ్రేలినిజూచినచో వాని నడుమ నుండు కొలఁత ప్రదేశము తాలము, తాలమే తాలకము. అట్టి కొలఁతలు పెక్కు లుండునట్టిైనది. "ప్రాదేశ తాల గోకర్ణ వితస్త్యశ్చయథాక్రమం భవంతి వితతాంగుష్ఠ ప్రదేశిన్యాదిభిస్సహ"॥ అవనీధర కానన సాగరంబులన్ = కొండలు, అడవులు సముద్రము (సేతువు)

తాత్పర్యము

ఎవఁడురా నన్ను జయించుశత్రువు, చూతము రమ్మని రావణుఁడు రోషము ప్రబలుచుండ మంచువలెఁ దెల్లనై పెక్కులు తాటిచెట్ల యెత్తుగలదై యాకాశ మంటుచున్న మేడ యెక్కి కొండలందు, అడవులందు, సముద్రమునందు.

చ. వనచరపూర్ణ దేశము న • పార మసంఖ్యము భూరికీశవా
హినిఁ గని పల్కె సారణుని • నెవ్వరు కీశచమూసమూహమం
దొనరిన వీరవారమున • నుగ్రబలాఢ్యులు శూరసత్తముల్
పెనుపరు లగ్రతస్సరులు • విశ్రుతులున్ వ్యవసాయవంతులున్. ౬౮౩

అర్థములు. వనచర పూర్ణదేశము = వానరులతో నిండిన ప్రదేశమును, అపారము = అంతములేనిది, అసంఖ్యము = లెక్కలేనిది, భూరికీశ వాహినిన్ = గొప్పవానరసేనను, కీశచమూ సమూహమందు = కోఁతిదండుల గుంపునందు, ఒనరిన=కల, వీరవారమునన్=వీరుల సమూహమందు, పెనుపరులు=గొప్పవారు, అగ్రతస్సరులు = ముందు నడచువారు, విశ్రుతులు = ప్రసిద్ధి కెక్కినవారు, వ్యవసాయవంతులున్=కార్యనిశ్చయము గలవారు.

తాత్పర్యము

వానరులతో నిండిన ప్రదేశము అంతము లేనిది లెక్కలేనిది యగు వానర సేనను జూచి సారణుతో నిట్లనెను. ఈ క్రోతిదండునందుఁ గల వీరుల గుంపులలో విశేష బలముగల వా రెవ్వరు? పరాక్రమము గల వా రెవ్వరు? రామకీర్తి వృద్ధి

చేయఁగలవా రెవ్వరు? ఎవరు ముందుగా నడచువారు? ప్రసిద్ధులెవ్వరు? ఏకార్య మెట్లు చేయవలయునో కార్యక్రమము నిశ్చయించుకొన్న వా రెవ్వరు ?

క. ఎవరికిఁ జెవి నిచ్చు కపి, ప్రవరుండు ? ప్రధాను లెవరు ♦ ప్లవగబలమునం
దెవ రొకో యూథపయూథపు? లివియెల్ల యథార్థముగను ♦ నెఱిఁగింపుము రా. ౫౨౫

తాత్పర్యము

సుగ్రీవుఁ డెవరిమాట ముఖ్యముగా విని యా ప్రకారము చేయుచుండును ? వానరులందు సేనానాయకు లెవరు ? సేనానాయకులకు నాయకులెవ్వరు ? ఇవి యన్నియు నున్న దున్నట్లు చెప్పుము.

క. అని తన్నడుగు దశగ్రీ, వునకున్ శాఖామృగాళి ♦ వ్యూహములోనన్
ఘనులను ముఖ్యజ్ఞుఁ డిట్లని చెప్పెన్ సారణుఁడు య ♦ థార్థపుఘనితన్. ౫౨౬

తాత్పర్యము

అని తన్నడుగుచున్న రావణునకు వానరుల గుంపులో గొప్పవారిని ముఖ్యులుగా నుండువారిని దెలిసినసారణుఁడు సత్యవాక్యములతో వేలఁజూపుచునిట్లనెను.

—♦ సారణుఁడు రావణునకు నంగదాదుల నెఱిఁగించుట ♦—

ఉ. అల్లదె లంకకట్టెదుట ♦ నార్భటులన్ మనలంక పాఁతుతోఁ
బెల్లదరంగఁ జేయుచును ♦ భీషణకీశులు నూఱువేలు దన్
మొల్లమిఁ గొల్వ సేనలకు ♦ ముంగలి యై నిలుచున్న వాఁడె చూ
నల్లభ ! వాహినీపతి ప్ల ♦ వంగమ ముఖ్యుఁడు నీలుఁ డాఖ్యచేన్. ౫౨౭

అర్థములు. కట్టెదుటన్ = కడు + ఎదుట = కట్టెదుట - ఎట్టెదుట, పాఁతుతో=పునాదితో, మొల్లమి = దట్టముగా, ముంగలియై = ముందుగానున్నవాఁడై, వాహినీపతి=సేనానాయకుఁడు, ఆఖ్యచే=పేరిచే.

తాత్పర్యము

అదిగో లంకకు నెట్టయెదుట మనలంక పునాదితోఁగూడ వదరునట్లు బొబ్బలు వేయుచు భయంకరులైన లక్ష వానరులు గుంపుగాఁజేరి తన్ను సేవింపఁగా సేనల కన్నిటికి ముందునై పున నిలుచున్న వాఁడే నీలుఁ డను వానరసేనా నాయకుఁడు.

ఉ. సారబలుండు ధారిణిఁ బ ♦ చారము సేయుచు బాహు లెత్తి దు
ష్పూర్తిరవిలోకనావళులఁ ♦ గ్రోధవశుం డయి లంకఁ జూచుచున్
సారెకుఁ గేరి వాలమున ♦ క్ష్మాస్థలి బ్రద్దలువాఱఁ గొట్టు నా
సారసకేసరాభుఁడు ర ♦ సాధర శృంగనిభుండు చూచితే ? ౫౨౮

అర్థములు. పచారముచేయుచున్ = ఇటునటు దిరుగుచు - ప్రచార శబ్ద భవము పచారము, దుష్పూర్తిరవిలోకనావళులన్ =మిగులఁ గ్రూరములైనచూపుల సమూహములచే, క్రోధవశుండయి = కోపమునకుఁ బాలుపడినవాఁడై, సాగస

కేసరాభుఁడు=తామరలయందలి యకరువుల వన్నెగలవాఁడు, ధరాధర=పర్వతము యొక్క, శృంగ=శిఖరముతో, నిభుండు=సమానుఁడైనవాఁడు.

తాత్పర్యము

దృఢమైన బలముగలవాఁడు, చేతులెత్తుకొని యిటునటు నడచుచున్నవాఁడు, కోపముగలవాఁడై క్రూరములైన చూపులచే లంకఁజూచుచు విజృంభించి పలుమాఱు తోఁకతో భూమి పగుళ్ళువారునట్లు కొట్టుచున్నవాఁడు, తామరల యకరులవన్నె గలవాఁడు. కొండశిఖరమువలె నున్నవాఁడు చూచితివా ?

ఉ. అతఁడె యంగదుండు ప్లవ ♦ గాధిపుఁ డాతని యౌవరాజ్యమం
దాతతకీర్తి నిల్పెఁ గని ♦ తా ? నినుఁ బోరికిఁ బిల్చు చున్నవాఁ
డాతఁడు వాలికిం దగిన ♦ యాత్మజుఁడున్ రవిపుత్రుసత్ప్రియుం
డాతఁడు వజ్రికై వరుణు ♦ నట్టులు రామునకై పెనంగెడిన్. ౫౮౮

అర్థములు. పెనంగెడి = యుద్ధము చేయును.

తాత్పర్యము

వాఁడే యంగదుఁడు. సుగ్రీవుఁడు వానికి వానరయౌవరాజ్య మిచ్చెను. చూచితివా ? వాఁడు నిన్ను యుద్ధమునకుఁ బిలుచు చున్నవాఁడు. వాలికిఁ దగిన కొడుకు. సుగ్రీవునకు మిగుల ప్రియుఁడు. వాఁడు ఇంద్రుపక్షమున వరుణునివలె రామునకై యుద్ధము చేయును.

క. ఈతనిబుద్ధిఁ గదా యా, వాతాత్మభవుండు రాఘ ♦ వప్రియఘటనా
చేతస్కుం డురుజవన, స్ఫీతుఁడు హనుమంతుఁ డరసి ♦ సీతం గాంచెన్. ౫౮౯

అర్థములు. రాఘవప్రియ ఘటనాచేతస్కుండు=రామునకు మేలు చేయు మనస్సు గలవాఁడు, ఉరుజవనస్ఫీతుఁడు=మిగుల వేగముచేఁ బ్రకాశించువాఁడు, అరసి = వెదకి.

తాత్పర్యము

ఇతఁడు చెప్పిన యాలోచన మీఁదనేకదా రామచంద్రునకు మేలు చేయు తలంపు గలవాఁడును, మిగుల వేగము గలవాఁడును, వాయుకుమారుఁడు నగు హనుమంతుఁడు సీతను వెదకి చూచెను.

క. ఆయోధనకర్కశుఁ, డితఁ, డాయతయూథములఁ గూడి ♦ యవిజయ్యుండై
యో యామినీచరేశ్వర!, జే యని చనుదెంచె రణము ♦ సేయఁగ నీతోన్. ౫౯౦

అర్థములు. ఆయోధన కర్కశుఁడు=యుద్ధమందుఁ గఠినుఁడు, దృఢముగ నిలిచి యుద్ధము చేయువాఁడు, ఆయతయూథముల = విస్తారసేనలను, అవిజయ్యుండై = జయింపరానివాఁడై, యామినీచర + ఈశ్వర = రేద్రిమ్మరులకుఁ ప్రభువా, జే = జయ.

తాత్పర్యము

యుద్ధమునందు దయాదాక్షిణ్యములు లేక దృఢముగ నిలుచువాఁడు, గెలువ రానివాఁడు, అనేక సేనలతోఁడ రాక్షసేశ్వరా! నీతో యుద్ధము చేయుటకై జేయని వచ్చెను.

ఉ వాలిజు వెన్కఁ గీశబల ♦ వారముతో రహించువాఁడై శా
ర్దూలసదృక్షుఁ డౌ నలుఁడు ♦ దోర్బలవంతులు చందనాలయుల్
పోలఁగ వేయికోట్లు కపి ♦ పుంగవు లెన్మిదినూర్ల వేలు నే
వేళ భజించు చుండ్రు సుర ♦ భీషణ! సేతువుఁ గట్టె నీతఁడే. ౨౬౧

అర్థములు. శార్దూల సదృక్షుఁడు=పులికి సమానుఁడు, చందనాలయుల్= చందన పర్వతము, చందన వృక్షములు విశేషముగనుండు పర్వతము=మలయాద్రి.

తాత్పర్యము

అంగదుని వెనుక ప్రక్క వానర సేనలతో పులితో సమానుఁడై ప్రకాశించు వాఁడే సేతువుకట్టిన నలుఁడు చందన పర్వతమందుండు వేయికోటు లెనిమిది నూర్ల వేలు వానరులు సర్వదా యితని గొల్చుచుందురు.

ఉ. ఆతనిసైనికుల్ గనుమ ♦ యార్భటులన్ దెసలెల్ల నించుచున్
జేతముఁ గ్రోధపూర్ణముగఁ ♦ జేసి చివాలున లేచి గాత్రమున్
భీతి ఘటింప నుద్దవిడిఁ ♦ బెంచి విదుర్చుచు నిన్నుఁ జూచి ప్ర
స్ఫీతగతిం బయిం దుముకు ♦ చెన్ను వహించిరి, వారు తెంపరుల్. ౨౬౨

అర్థములు. ఆర్భటులన్ = సింహనాదములచే, చేతము =మనస్సు, క్రోధ పూర్ణముగన్ = కోపముతో నిండినదిగా, చివాలున = దిగ్గన, గాత్రమున్ = దేహమును, ఉద్దవిడిన్ = వేగముగా, చెన్ను = విధము, తెంపరుల్ = సాహ సము గలవారు.

తాత్పర్యము

ఆ నలుని సేనలఁ జూడుము. దిక్కులునిండ సింహనాదము చేయుచు మనస్సు నిండ క్రోధముగలవారై తటాలున లేచి దేహమును బెంచి విదలించి నిన్నుఁజూచి మీఁద దుముకునట్లున్నారు. వీరు మిగుల సాహసముగలవారు.

ఉ. శ్వేతుఁడు వెండికొండ కెన ♦ చెప్పఁగఁ జాలినవాఁడు, లోక వి
ఖ్యాతుఁడు, భీమవిక్రముఁడు ♦ నస్థిరచిత్తుఁడు, బుద్ధిమంతుఁడున్
వేతపనాత్మజుం గదిసి ♦ వెన్కకుఁ బోయి దళంబు సర్వమున్
రీతిగఁ దీర్చెడిం గడుఁ బ్ర ♦ హృష్టముఁ జేయుచు రాక్షసేశ్వరా! ౨౬౩

అర్థములు: వెండికొండ = కైలాసము, వెండివలెఁ దెల్లగానుండు కొండ. ఎన=సమానముగ, అస్థిరచిత్తుఁడు=నిలుకడయగుమనస్సు లేనివాఁడు, తపనాత్మజున్= సుగ్రీవుని, కదిసి = సమీపించి, దళంబు = సేవ, ప్రహృష్ట = సంతోషించినది.

తా త్ప ర్య ము

వెండికొండతో సమానుఁడని చెప్పఁదగిన శ్వేతుఁడు లోకమున బ్రసిద్ధి గన్నవాఁడు, భయంకరమైన పరాక్రమము గలవాఁడు, స్థిరచిత్తము లేనివాఁడు, అయినను మంచిబుద్ధి గలవాఁడు వేగముగ సుగ్రీవు నొద్దకుఁ బోయి యేవియో మాటలాడి వెనుకకు వచ్చి సేననంతయు నుత్సాహముచే సంతోషపెట్టుచు చక్కఁ నవరించు చున్నాఁడు.

మ. కుముదుం డాతఁడు గోమతీతటగ సం ♦ కోచాఖ్య శైలంబు ము
న్నమరన్ స్థానము గాఁగ వృక్షచర రా♦జ్యం బేలు వేవేల్ కపుల్
విమలస్వాంతులు గొల్వ రాజిలు మహా♦వీరుండు తద్దీర్ఘవా
లమునన్ లోహితపీతనీలసితముల్ ♦ గ్రాలెన్ మహారోమముల్, ౫౯౭

అర్థములు. గోమతీతటగ = గోమతీ నదీతీరమందుండు, సంకోచాఖ్య శైలంబు=సంకోచ మను పేరుగల పర్వతము, విమల స్వాంతులు=నిర్మలచిత్తులు, లోహిత పీత నీల సితముల్ = ఎఱ్ఱని, పచ్చని, నల్లని, తెల్లని. మహారోమముల్= పెద్ద వెండ్రుకలు, గ్రాలెన్=ప్రకాశించెను.

తా త్ప ర్య ము

అదిగో వాఁడే కుముదుఁడు. వీఁడు గోమతీనదీ తీరమందుఁగల సంకోచమను పర్వతమందలి వేనవేలు వానరులను బాలించును. నిర్మలమైన మనస్సుగలవారు వేనవే లితనిఁ గొల్చుచుందురు. వీఁడు మహావీరుఁడు. వీనితోఁకయందు ఎఱుపు నలుపు పసుపు తెలుపుగల పెద్ద వెండ్రుక లున్నవి.

క. రోషణుఁడు సాంపరాయిక, భీషణుఁడు భవత్సమిద్గ ♦ వేషణుఁడు యశో
భూషణుఁడు చండుఁ డరిపుర, శోషణసక్తుండు విమత ♦ సూదన కంటే. ౫౯౮

అర్థములు. రోషణుఁడు = రోషముగలవాఁడు, సాంపరాయిక = యుద్ధమందు, భీషణుఁడు = భయంకరుఁడు. భవత్+సమిత్ + గవేషణుఁడు = నీతో యుద్ధముచేయ సమయమును వెదకుచున్నవాఁడు, యశోభూషణుఁడు = కీర్తియే యలంకారముగాఁ గలవాఁడు, అరిపురిన్ = శత్రువుల పట్టణమును, శోషణ = ఎండించుటయందు, సక్తుండు = ఆసక్తిగలవాఁడు, విమతసూదన =శత్రుసంహారకుఁడా!

తా త్ప ర్య ము

మిగులఁ గోపముగలవాఁడు, చండుఁడు, యుద్ధమందు భయంకరుఁడు నీతో యుద్ధముచేయఁ గోరుచున్నవాఁడు, కీర్తియే యలంకారముగఁ గలవాఁడు. పగవారి నగరమును పాడుచేయ నాసక్తిగలవాఁడు-చూడుము.

చ. తిరుఁ డతిదీర్ఘలోచనుఁడు ♦ ధీరుఁడు సింహనిభుండు చూడ్కి నీ
పురము దహించుపోల్కి నిటు ♦ పొంగుచుఁ జూచెడిఁ, గృష్ణవింధ్యభూ

ధరముల సహ్యపర్వతసు • దర్శనసీమల సంచరించు నీ
హరివృషభుండు రంభుఁడు సు • రాంతక! నిస్తులశౌర్యుఁ డీతనిన్. ౫౫౮

అర్థములు. తిరుఁడు = స్థిరుఁడు, అతిదీర్ఘలోచనుఁడు = మిగుల నిడివిగల కన్నులు గలవాఁడు, ధీరుఁడు = ధైర్యము గలవాఁడు, సింహనిభుండు = సింహముతో సమానుఁడు, కృష్ణ వింధ్యభూధరములన్ = కృష్ణపర్వతమందును వింధ్యపర్వతమందును, సహ్యపర్వత సుదర్శన సీమలన్=సహ్యపర్వతమందును సుదర్శన పర్వత మందును, హరివృషభుండు=వానరశ్రేష్ఠుఁడు, నిస్తులశౌర్యుఁడు=అసమాన పరాక్రముఁడు.

తాత్పర్యము

అదిగో వాఁడే రంభుఁడనువాఁడు, స్థిరుఁడు, మిగుల నిడివియైన కన్నులు గలవాఁడు, ధైర్యముగలవాఁడు, పరాక్రమమున సింహముతో సమానుఁడు, చూపు చేతనే నీ నగరము దహించువానివలె నుప్పొంగుచు చూచుచున్నవాఁడు. వీఁడు కృష్ణపర్వతము, వింధ్యపర్వతము, సహ్యపర్వతము, సుదర్శనపర్వతము వీనియందు సంచరించుచుండును. వానరులందు శ్రేష్ఠుఁడు, అసమాన శౌర్యముగలవాఁడు.

క. వీరులు శూరులు రణదుర్వారులు చండులు ప్రచండ•పటువిక్రములుం
గ్రూరులు ముప్పదికోట్లుగ, చారులు తమ్మిఁ గొలుచువారు సమ•రోత్సుకులై.

తాత్పర్యము

ఈ రంభుని, వీరులు, శూరులు, యుద్ధమున నెదురులేనివారు, కోపులు, తీవ్రమైన విక్రమము గలవారు. శత్రువులందు దయ యెఱుంగనివారు నగు ముప్పది కోట్ల వానరులు సేవింతురు.

ఉ. వీనులు నిక్కఁబెట్టి మెయిఁ • బెంచుచు మాటికి మాటికిం గ్రుధ
న్మేను వణంకఁ దోఁకపయి • నిల్పుచు దృష్టుల నడ్డచూపులన్
దా నదె చూచుచున్ మరల • దారుణగర్జల నించుచున్నవాఁ
డా నగచారి గంటె శర•భాఖ్యుఁడు వాఁడె సురేంద్రమర్దనా! ౫౫౯

అర్థములు. వీనులు=చెవులు, క్రుధన్=కోపముతో.

తాత్పర్యము

ఇంద్రుని జయించినవాఁడా! చెవులు నిక్కఁబెట్టి దేహము పెంచుచు కోపముచే దేహము వణఁకఁగా తోఁకమీఁద జూపులుంచి యడ్డచూపులఁ జూచుచు మఱల భయంకరముగ సింహనాదములు సేయుచున్న యీ వానరుని జూచితివా! వాఁడే శరభుఁడను పేరు గలవాఁడు.

క. పాఱఁడు దురమున జవమున, మీఱెడు గీఱెడిని గిరుల • మృత్యువునకు నే
మాఱొడ్డెడు వెఱపున నోఁటాఱఁడు సాల్వేయ శైల•మందు వసించున్. ౫౬౦

అర్థములు. మాఱొడ్డెడున్ = ఎదిరించును, ఓటాఱఁడు = వెనుదీయఁడు,

తాత్పర్యము

యుద్ధమునందుఁ బరువెత్తువాఁడు కాఁడు. వేగాతిశయము గలవాఁడు, కొండలనైనఁ జీల్పఁగలవాఁడు, మృత్యువు నెదిరించువాఁడు, భయముచే వెను దీయఁడు వీఁడు సాల్వేయ పర్వతమందు వసించును.

క. వీరాగ్రణి యీ శరభు వి, హారులనన్ సైన్యపులు స॰హస్రశతంబుల్
చేరి భజియింత్రు వారలు, కోరుచున్నారు లంకఁ॰గూల్పఁగ గడిమిన్. ౫౬౦

తాత్పర్యము

వీరులందు శ్రేష్ఠుఁడైన యీ శరభుని విహారులను సేనానాయకులు నూఱు వేలు సేవించుచుందురు. వీరందఱు లంక నాశముచేయఁ గోరుచున్నారు.

వీరాగ్రణి యీశరభున్ — కొన్ని యెడల విశేషణంబుల ద్వితీయాదులకున్ బ్రథమ చూపట్టెడి - ప్రౌఢ - వ్యా కా. ౨. ౨. సూ.

చ. పఱమొగు లాకసం బలము ॰ భంగిగనై తెఱగంటిగుంపుల
న్మెఱసెడి గుంటిసూఁడన వ॰ నేచరకోటులలో వెలింగి పె
న్నుఱములఁబోలు గర్జల ర॰ ణోత్సుకుఁడై విలసించువాఁడె యే
యఱగొఱ లేని ధీరుఁడు మహా॰ బలుఁడౌ పనసుండు దేవరా! ౫౬౧

అర్థములు. పఱమొగులు=వెడలుపాటి మేఘములు, అలము=వ్యాపించు, తెఱగంటి = దేవతల, గుంటిసూఁడు = పర్వతవిరోధి, ఇంద్రుఁడు — అఱగొఱ = లోపము.

పెను+ఉఱుము=పెన్నుఱుము, అచ్చులు పరంబులగుచో విశేషణంబులయిన పెన్వాదులకడ హల్లునకు ద్విత్వంబగు. సు-వ్యా-సంధి-౫౫.

తాత్పర్యము

వెడలుపాటి మేఘము లాకాశము నాక్రమించునట్టులును దేవతల గుంపులందు మెఱసెడి యింద్రుఁడోయనునట్లు వానరులలోఁ బ్రకాశించి పెన్నుఱుములన్ = పెద్దయుఱుములను జేయుచు యుద్ధమునం దభిలాష కలవాఁడై యే లోపము లేని ధీరుఁడు మహాబలవంతుఁడు దేవరా! వాఁడె పనసుఁ డనువాఁడు.

క. వీనిని నేబదిలక్షలు, వానరపరివృఢులు యూథ॰ పశ్రేష్ఠులు శౌ
ర్యానుత్తములు భజింతురు, మానక యల పారియాత్ర॰మందు వసించున్. ౫౬౨

అర్థములు. పరివృఢులు=శ్రేష్ఠులు, యూథపశ్రేష్ఠులు = యూథపతుల యందు శ్రేష్ఠులు, శౌర్యానుత్తములు=శౌర్యమునందు మిగులశ్రేష్ఠులు, నాలుగవ పాదమున నఖండయతి.

తాత్పర్యము

వీనిని నేఁబది లక్షలు వానరశ్రేష్ఠులు యూథపతులందు శ్రేష్ఠులు శౌర్యమునందు నసమానులు గొలుతురు. ఇతఁడు పారియాత్ర పర్వతమందు వసించును.

సీ. అంబుధివేల రెం♦డవమహోదధి యన, భీమమౌ సేనకు♦వెలుఁగు గొలిపి
దర్దరధారణీ♦ధరమున కుద్ది యౌ, వాఁడె పో వినతుఁ డన్♦వానరుండు
అఱువదిలక్షల♦యగచరుల్ గొల్వంగఁ, బర్ణాస యను నది♦వారిఁ గ్రోలుఁ
గలహంబునకు నిన్నుఁ♦బిలుచుచు నున్న యౌ, తండె క్రోధనుఁ డను♦తరుచరుండు

ఆ. వేనవేలు గలరు ♦ వీరు లీతనియొద్దఁ, దోఁపురంగువాఁడు♦తోడివారి
గేలి సేయువాఁడు♦ హేళిఁబోలినతేజు, వాఁడు గవయుఁ డనెడి♦వనచరుండు. ౫౬౩

అర్థములు. అంబుధి వేలన్ = సముద్రతీరమునందు, తోఁపురంగు=ఎఱ్ఱని కాంతి, గేలి = పరిహాసము, హేళిన్=సూర్యుని.

తాత్పర్యము

సముద్ర తీరమునందు రెండవ సముద్రమువలె నుండు భయంకర సేనకు ప్రకాశము గలిగించుచు దర్దర పర్వతముతో సమానుఁడై యుండువాఁడే వినతుఁ డను వానరుఁడు. వీఁడు పర్ణాసనదీ తీరమున నఱువది లక్షల క్రోఁతులు కొల్వఁగ నుండును. నిన్ను యుద్ధమునకు బిలుచు చున్నాఁడే, వాఁడే క్రోధనుఁ డను వానరుఁడు. ఇతనియొద్ద వేనవేలు వానరులు గలరు. ఎఱ్ఱని వన్నెగలవాఁడు. ప్రక్క వారలఁ బరిహాసము చేయువాఁడు, సూర్యకాంతి గలవాఁడు, గవయుఁ డను వానరుఁడు.

క. డెబ్బదిలక్షలక్రోఁతులు, గబ్బితనమువారు గొలువఁ ♦ గనలున నీపై
దబ్బునఁ బడి యొకదెబ్బన్, నిబ్బరమునఁ దీయ వాఁడు♦నిగిడెడిఁ గంటే. ౫౬౪

అర్థములు. గబ్బితనమువారు = గర్వము గలవారు, కనలునన్ = కోపముతో, దబ్బున = తటాలున, నిబ్బరమున = ధైర్యమున, నిగిడెడిన్ = ఎగిరిపడుచున్నవాఁడు.

తాత్పర్యము

గర్వించిన డెబ్బది లక్షల క్రోతులు సేవింపఁగా నీపై దబాలునఁ బడి యొక దెబ్బ కొట్టవలె నని ధైర్యముతో నెగిరిపడు చున్నవాఁడు చూచితివా.

క. వీరలు దుష్ప్రసహులు బల, హారులునుం గామరూపు♦లతిశయ వేగో
దారులు యూథపనాయకు, లారఁగ యూథములు వీరి♦ ననిశముఁ గొలుచున్.

అర్థములు. దుష్ప్రసహులు = సహింపరానివారు. బలహారులు=బలముచే మనోహరులు, కామరూపులు=కోరిన రూపమును ధరింపఁగలవారు, యూథపనాయకులు=యూథనాయకులకునాయకులు, వీరినియూథములు సర్వదాగొలుచుచుండును.

తాత్పర్యము

వీరు యుద్ధమునందు సహింపరానివారు, బలముచే మనోహరులు, శత్రుబలముల హరించువారు, కామరూపులు, మిగుల వేగముగలవారు, యూథపతులకు పతులు. వీరి వశమున యూథములు సర్వదా యుండును.

—♦ ౨౭.వ సర్గము. సారణుఁడు రావణునకు హరాదియూథ నాథుల నెఱింగించుట. ♦—

సీ. రామునిమిత్తమై ♦ ప్రాణముల్ గోల్పోవ, నున్నవారల వినుమున్నవారి
నిద్దంబులైకడు ♦ నిమపులై కావియు, దెలుపును బసుపును♦నలుపు మఱియుఁ
బెక్కులౌ రంగుల ♦ వెంట్రుకల్ తోఁకపై,నిట్టగమ్మగఁ గొన్ని♦ నేలవ్రాలి
రవిమరీచులవోలె ♦ రాణించు చున్నవి, వాఁడు హరుం డను♦వానరుండు

ఆ. యూథనాథుఁ డాతఁ♦డుర్వీరుహంబులు, గేలఁ గ్రాల లంక ♦ సాలములను
లీల నెక్కజతన♦మోలి సేయుచు నున్న,వారు సూర్యసుతుని♦వారె వీరు. ౨౬౬

అర్థములు. ఇట్లు యూథప యూథపులఁ జెప్పి యిఁక యూథపతులఁ జెప్పు చున్నాఁడు. కోల్పోవన్ = పోఁగొట్టు కొనుటకు, ఉన్నవారిన్ = తక్కిన వారిని, నిద్దంబులై=నునుపులై, నిట్ట=నిలువుగ, రవి మరీచులవోలెన్ = సూర్యకాంతుల వలె,ఉర్వీరుహంబులు=చెట్లు, సాలములను = ప్రాకారములను, జతనము = ప్రయత్నము, సూర్యసుతునివారె=సుగ్రీవునకు నాప్తులు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నిమిత్తమై ప్రాణములు పోఁగొట్టుకొన సిద్ధపడి యున్న వారిని దక్కినవారిని జెప్పెద వినుము.నునుపులై మిగుల నిమపులై ఎఱుపు తెలుపు నలుపు తెలుపు మఱియు నానావర్ణములుగల వెంట్రుకలు తోఁకపై నిలఁబడి యుండఁగా నేలఁమీదఁ గొన్నిరాలి సూర్యకాంతులవలె నుండఁగా రాణించు చున్నవి. వాఁడె హరుఁడనువాఁడు, వీఁడు యూథపతి. చెట్లను జేతఁదీసికొని లంక ప్రాకారముల నెక్క యత్నముచేయుచున్నవారు సుగ్రీవున కాప్తులు.

ఉ. అంజనపర్వతంబో యసి♦తాంబుద సంఘ మొ యన్నయట్టులై
యంజిక లేనివారు రణ♦మందు యథార్థ పరాక్రముల్ గుహా
పుంజములన్ నదీతటులఁ ♦ బొల్చెడినారయి నీపయిం బడన్
గొంజక దూఁకుచున్న యొలుఁ♦గుంగపి జోదులఁ జూడు రావణా! ౨౬౭

అర్థములు. అంజనపర్వతంబో = కాటుకకొండయో, అసితాంబుద సంఘమొ = నల్లమబ్బుల సమూహమొ, అంజిక = భయము, యథార్థపరాక్రములు = సత్యమైన పరాక్రమముగలవారు, గుహాపుంజములన్ = గుహల సమూహములందును, నదీతటులన్=ఏటి యొడ్డులను, కొంజిక=సందేహించక, జోదులన్= యోధులను-వీరులను.

తాత్పర్యము

కాటుక కొండయో, నల్లమబ్బుల గుంపోయన్నట్లు నల్లని దేహకాంతి గల వారై,భయమెఱుంగనివారై యుద్ధమందుసత్యపరాక్రములై,గుహలపొదలయందు

నేటి తీరములం దుండువారునై నీపై పడ జంకక చూచుచున్నవారగు భల్లూక వీరులం జూడుము.

క. గర్జద్ఘనములు చుట్టిన, పర్జన్యుఁడు వోలె నెలుఁగు • బంటులు గొలువన్
దుర్జయుఁడై క్రాలెడు భయ,వర్జితు భీమాక్షు భయద•వపువుం గంటే ౨౬-౧

అర్థములు. గర్జత్+ఘనములు=ఉఱుముచున్న మేఘములు, పర్జన్యుఁడు=వర్షాధిదేవత, భయవర్జితున్ = భయముచే విడువఁబడినవానిని, భీమాక్షున్ = భయంకరములైన కన్నులు గలవానిని, భయద = భయంకరమైన, వపువున్ = దేహముగలవానిని, కంటే=చూచితివా?

తాత్పర్యము

ఉఱుముచున్న మేఘములు చుట్టుకొన్న వర్ష దేవతవలె నెలుఁగులు సేవింపఁగా జయింపరానివాఁడై భయముచే విడువఁబడినవాఁడై భయంకరములైన కన్నులు దేహము గలవానిని జూచితివా?

క. ఆతండు ఋక్షవద్వి, ఖ్యాతాద్రి వసించి నర్మ • దాంబులు గ్రోలున్
నేత సుమీ భల్లూక, వ్రాతములకు ధూమ్రుఁ డనఁగఁ • బరఁగుం బేరన్. ౨౬-౯

అర్థములు. ఋక్షవత్+విఖ్యాతాద్రిన్ = ఋక్షవంత మను ప్రసిద్ధిగల కొండయందు, నేత=ప్రభువు.

తాత్పర్యము

వాఁడు ఋక్షవంత మను పర్వతమందు వసించి నర్మద జలములఁ ద్రాగుచుండును. ఎలుఁగుల సమూహములకు వాఁడు ప్రభువు. వాని పేరు ధూమ్రుఁడు.

సీ. వానితమ్ముఁడు చూడు వసుమతీధ్రం బన, గ్రాలెడి నన్న కా•కారమునను
సముఁడయ్యు శ్రేష్ఠుఁడు •చటులవిక్రమమున, యూథపయూథపుఁ•డుద్ది లేఁడు
గురుసేవ సల్పె సం • గరమునఁ జండుండు, విబుధాసురాహవ • కేళియందు
శంబసాధనునకు • సాహ్యంబుఁగావించి, పెక్కులు వరములు • పేర్మిఁ గాంచె
ఆ. గుదియదాల్పు నేని • యెదురొడ్డి చెంగించు, వీనిసేన గిరుల • పైన నిలిచి
యురలఁ ద్రోయుచున్న•యురుతరాశ్మంబుల, రాజిఁ జూడవయ్య•రాక్షసేంద్ర!

అర్థములు. వసుమతీధ్రంబు = పర్వతము, విబుధాసురాహవకేళిన్=దేవాసుర యుద్ధక్రీడయందు, శంబసాధనునకున్=ఇంద్రునకు, వజ్రమాయుధముగా గల వానికి, గుదియ దాల్పునేనిన్ = దండము ధరించు యమునినైన నెదరించి యోడించును, ఉరుతర=మిగుల గొప్పవగు, అశ్మంబుల=ఱాల, రాజిన్ = సమూహంబును.

తాత్పర్యము

వానితమ్ముఁడు జాంబవంతుఁడు కొండవలె నున్నవాఁడు. అన్నకు సమమైన యాకారముగలవాఁడు. అయినను విక్రమమం దంతకంటె శ్రేష్ఠుఁడు యూథప

యూథపుఁడు. ఇతనికి సముఁడు లేఁడు. గురుసేవ చేసెను. యుద్ధమందు భయంకరుండు. దేవాసుర యుద్ధమందు నింద్రునకు పెక్కుమార్లు సహాయపడి యనేక వరములను బొందెను. దండధరుని నైన నెదిరించి యోడించును. వీని సేన కొండ మీఁదనుండి క్రిందికి గుండులను బండలను దొర్లించుచున్నవి చూడు.

క. రోమముల దండి రక్ష, స్తోమపిశాచావళులకుఁ • దుల్యము లగుచున్
ధూమధ్వజదీప్తులునై, యీ మహితధ్వజిని దిరుగు • లాడెడిఁ గంటె. ॥౮౭

అర్థములు. దండిన్ = అతిశయముచే, ధూమధ్వజదీప్తులు = అగ్నికాంతులు గలవి, మహిత ధ్వజిని = గొప్ప సేన.

తాత్పర్యము

రోమములు పెక్కులగుటచేత రాక్షస పిశాచ సమూహములకు సమానములై యగ్ని కాంతివంటి కాంతిగలదై యీగొప్పసేన తిరుగు లాడుచున్నది చూచితివా?

క. జంభారి నుపాసించు న, దంభ బలపరాక్రముండు • దారుణతరసం
రంభవిజృంభితుఁ డల్లదె దంభుఁడు ప్లవమానుమాడ్కి • దర్శితుఁ డాజిన్ ॥౮౮

అర్థములు. జంభారిన్ = ఇంద్రుని, ఉపాసించు నదంభ పరాక్రముఁడు = సంతోషపెట్టుచు వంచనలేని పరాక్రమము గలవాఁడు, దారుణతర = మిగుల భయంకరమైన, సంరంభ = వేగిరపాటుతో, విజృంభితుఁడు = అతిశయించినవాఁడు, ప్లవమానుమాడ్కిన్ = ఎగురుచున్న వానివలె, దర్శితుఁడు = కానవచ్చువాఁడు.

తాత్పర్యము

ఇంద్రుని సంతోషపెట్టి వంచనలేని బలపరాక్రమములు గలవాఁడు, మిగుల భయంకరమైన వేగిరపాటు నతిశయము గలవాఁడు, యుద్ధమునందు నెగురుచున్న వానివలె నగపడువాఁడు, వాఁడె యదిగో దంభుఁ డనువాఁడు.

సీ. ఆమడ దవ్వున్న • యగ్రము లవ్వలను పార్శ్వ, గతము లెవ్వానికి వే • గంపు నడక
యోజనోన్నతుఁ డయి • రాజిల్లు నెవ్వఁడు, హాళ్మమై నిలుచున్న • యట్టివేళ
నిలఁ జతుష్పాజ్జంతు • వులలోన నెనసి యా, కారంబునను మిన్న • గాన రాదు
తొలి పురుహూతుని • దురమున మాఱ్కొని, యెవ్వఁ డోటమి మాట • యెఱుఁగ కెసఁగె
తే. దరుచరాళికి నెవఁడు పి • తామహుండు, నుగ్రదర్పుండు యూథపయూథనాథుఁ
డతనిఁ గనుఁగొంటె సన్నాదు • నతుల నాదు, బరమ బలదర్పసదన యో • పంక్తివదన.

అర్థములు. చతుష్పాత్ జంతువులలోనన్ = నాలుగుకాళ్ళుగల జంతువులందు, పాదస్యలోపోఽహస్త్యాదిభ్యః-సంఖ్యాం పూర్వస్య-పాణిని-ప్రకారసంఖ్యా పూర్వకమగుట పాదశబ్దమున కడపటి అకారము లోపించెను. దురమునన్ = యుద్ధమందు, ఓటమి = అపజయము, బలదర్పసదన = బలగర్వములకు స్థానమైనవాఁడా!

తాత్పర్యము

ఎవఁడు వేగముగ నడచునపుడు ఆమడనున్న చెట్లప్పుడే ప్రక్కకు వచ్చునో ఎవఁడు నిలుచున్నప్పుడు యోజన మెత్తయి కానవచ్చునో, నాలుగు కాళ్ల జంతువులలో నెవని యాకారమునకు మించిన యాకారముగలది లేదో, యెవఁడు పూర్వ మింద్రుని నెదిరించి యపజయము పొందలేదో, వానరులకుఁ దాత యెవఁడో, యట్టి భయంకరమైన దర్పముగలవాఁడు యూథపులకు యూథపుఁడు నయిన సన్నాదుఁడను వానిని జూచితివా? సత్+నాదుఁడు=సన్నాదుఁడు, పీడు చక్కఁగాఁ బాడఁగల వాఁడగుట యీ పేరు కలిగెను.

మ. దనుజాధీశ్వర! చూడుమా యితని గం ♦ ధర్వాంగనాపుత్రుఁడై
జనియించెం బవమానమిత్రునకు, న ♦ స్వప్నాసురాయోధనం
బున లేఖాళికి బాసలై యరిగి పెం ♦ పుం జూపెఁ, బాకారితో
నెనయున్ విక్రమసంపదం గ్రథనుఁ డం ♦ శ్రీ యూథపాగ్రేసరున్. ॥౨౩॥

పవమానమిత్రునకు = అగ్నిహోత్రునకు, అస్వప్న+అసుర+ఆయోధనంబున = దేవాసుర యుద్ధమున, లేఖాళికి = దేవతల సమూహమునకు, బాసలై = తోడై, ఎనయున్=సరిపోలును.

తాత్పర్యము

రాక్షసరాజా! యీ క్రథనుఁ డను వానిఁ జూడుము. వీఁ డొక గంధర్వ స్త్రీ యందు నగ్నిహోత్రునకు సుతుఁడై పుట్టెను. దేవాసుర యుద్ధమందు దేవతలకు సహాయపడెను. విక్రమమందు నింద్రునకు సమానుఁడు.

ఉ. ఎచ్చట నుండు నేరెడు మ ♦ హీజము సేవ యొనర్చు యక్షరా
జెచ్చట హాయిగాఁ గ్రుఁ జరి ♦ యించును నిచ్చలు నీ విమాతృజుం
డెచ్చటఁ గిన్నరావళు ల ♦ హీనగతిన్ విహరించు నట్టిభూ
భృచ్చయవర్యమందు వసి ♦ యించు నితం డవికత్థనుం డగున్. ॥౨౪॥

అర్థములు. నేరెడు — రూ — నేరేడు — మహీజము= చెట్టు, యక్షరాజు= కుబేరుఁడు, విమాతృజుండు=సవతితల్లి కొడుకు, భూభృచ్చయవర్యము = పర్వత సమూహమందు శ్రేష్ఠమైనది.

తాత్పర్యము

కుబేరుఁ డెచ్చటనుండు నేరేడుచెట్టు సేవచేయునో, యెచ్చట నీ సవతితల్లి కొడుకు హాయిగాఁ దిరుగు చుండునో, యెచ్చట సతతిని గిన్నరులు సేవింతురో యట్టి పర్వతమందు నీ యాత్మ శ్లాఘ నెఱుఁగని క్రథనుఁ డుండును.

క. కోటిసహస్రంబులు శై ♦ లాటులు దనుఁ గొల్వ నిజబ ♦ లావళితో ను
ద్ఘాటించి లంక నేల,స,పాటముగాఁ జేయఁ దలఁచుఁ ♦ బాటవ మమరన్. ॥౨౫॥

అర్థములు. శైలాటులు = కొండ్రదిమ్మరులు, క్రోఁతులు, ఉద్ఘాటించి =

పీఁకివైచి, సపాటంబుగన్=సమముగ, పాటవము=సామర్థ్యము.

తాత్పర్యము

వేయికోట్ల వానరులు దన్ను సేవింపఁగా దన సేనలతో లంకను బీఁకివైచి నేలతో సమానముగాఁ జేయ వీఁడు తలఁచు చుండును.

ఉ. వారణవానరావళుల • బ్రాఁబగ లోన స్మరించి జాహ్నవీ
తీరమునన్ మతంగజత • తిం బెదరించుచుఁ జెట్ల గౌరులన్
గౌరులఁ జెట్లచే గిరుల • క్ష్మాజతతిన్ హరియించుచున్ మహా
వీరుఁ డుశీరబీజగిరి • వేడ్కఁ జరించును గంగయొద్దనన్. ॥౨౮

అర్థములు. ఇది ప్రమాథి వర్ణనము, వారణ వానరావళుల=ఏనుఁగుల క్రోఁతుల గుంపుల, ప్రాఁబగ = ప్రాఁతపగ, మతంగజతతిన్=ఏనుఁగుల సమూహమును, గౌరులన్=ఏనుఁగులను, క్ష్మాజతతిన్=చెట్ల సమూహమును, ఉశీరబీజగిరి= ఉశీరబీజ మను కొండ, మునుపు శంబసాదనుఁ డను నొక రాక్షసుఁడు, ఏనుఁగురూపమొత్తి ఋషుల బాధించుచుండెను. అప్పుడు ఋషు లందఱు కేసరి యను వానరోత్తముని బ్రేరించి వానిచే నీ రాక్షసుని జంపించిరి. ఆ కార్యమునకు సంతోషించి ఋషులు కేసరికి హనుమంతుఁ డుదయించున ట్లనుగ్రహించిరి. అది మొదలు వానరులకు నేనుఁగులకు వైరము కల్గెనని పురాణకథ.

తాత్పర్యము

దీర్ఘకాలముగ నేనుఁగులకు వానరులకుఁ గల పగఁ బట్టి గంగాతీరమున వసించుచు నందలి యేనుఁగులను బెదరించుచుఁ జెట్లచే నేనుఁగులను, నేనుఁగులచే జెట్లను గొండలచేఁ జెట్లనుఁ బడఁగొట్టుచు నుశీరబీజ మను పర్వతమందుండును.

చ. కపు లొకకోటి గొల్వ హరి • కాంతుఁడు వీఁడు ప్రమాథినామ యూ
థపుఁడు సురాలయంబు బల • దానవఘస్మరుఁబోలి తద్గిరిన్
విపులబలాఢ్యుఁ డేలు సుర • వీరమదాపహా ! వీర్యవిక్రమా
కృపణులు వీనిసైనికు ల • హీనమదస్ఫురితాత్ము లెంతయున్. ॥౨౯

అర్థములు. సురాలయంబున్ = స్వర్గమును, బలదానవ ఘస్మరున్ = ఇంద్రుని, సురవీరమదాపహా= దేవవీరుల గర్వము నడచినవాఁడా! వీర్యవిక్రమాకృపణులు=వీర్యవిక్రమములందు నుదారులు, అహీన=గొప్పదగు, మద = గర్వముచే, స్ఫురితాత్ములు=తోఁచు దేహముగలవారు.

తాత్పర్యము

కోటి వానరులు సేవింపఁగా నీ ప్రమాథి యను పేరుగల యూథనాథుఁడు ఇంద్రుఁడు స్వర్గమును బాలించునటు లాకొండను బలాఢ్యుఁడై పాలించును. వీని సేనలవారు ఉత్సాహపరాక్రమములందు గొప్పవారు. పూర్ణమదముచేఁ గానవచ్చు దేహములు గలవారు.

క. వానిద సుమ యదిగో(బవ,మానసమాధూతర క్త • మహితరజస్సం
దానిత మతిసంరబ్ధం, బౌ నిష్ఠురకీశసేన • యసురాధీశా ! ౨౭౯

అర్థములు. వానిద = ఆ ప్రమాథిదే, పవమాన=గాలిచే, సమాధూత= ఎగుర(గొట్టబడుచున్న, ర క్త=ఎఱ్ఱని, మహితరజస్సందానిత = ఎక్కువ దుమ్ముచే గూడినది, అతిసంరబ్ధము = మిగుల(గోపముగలది, నిష్ఠుర = పరుష మైన, కీశ సేన=వానర సేన.

తా త్ప ర్య ము

గాలిచే నెగుర(గొట్ట(బడుచున్న యెఱ్ఱని దుమ్ముచే(గూడినదియు(మిగుల(గోపము గలదియు పరుష మైనదియు నగు వానరసేన యాప్రమాథిదే సుమా.

తే. గండుగొండంగులం దెల్ల • గండు(డతఁడు
చూడుము గవాక్షు(డనియెడి • శూరవరుఁడు
వాని(గాటుక మొగముల • వలు కొండ
ముచ్చు లోకకోటి కొలిచెడి • హెచ్చుబలిమి. ౨౮౦

అర్థములు. గండు గొండంగులందు = బలశాలులైన కొండ ముచ్చుల యందు, గండుఁడు=శూరుఁడు.

తా త్ప ర్య ము

బలముగల కొండముచ్చులలో వీఁడు బలశాలి. వానిపేరు గవాక్షుఁడు. శూరుఁడు. వానిని నల్లని ముఖములుగల కొండముచ్చు లోక కోటి సేవించు చున్నవి.

సీ. ఎందు మిళిందముల్ • క్రందుగా రొదసేయు, సర్వర్తుతరుఫల • సంతతులను
దేనిని దనరంగు • లీను నగంబును సూర్యు(డెల్లప్పుడు • చుట్టుపెట్టు
నే గిరి తన్నాశ్ర • యించిన మృగపక్షి, తతులను దనకాంతి(• దనర(జేయు
దేనిని దేవతల్ దివ్యమహర్షులు, పాయక యుందురు • భవ్యకీర్తి
తే. వలచినట్టివి ఫలము ల • వారిగా(గ, నెప్పు డెయ్యది యొసఁగు నే • యొడను దేని
సోన గురియును నారమ్య • మైన మేరు,నగమునందుండు(గేసరి • నామకుండు. ౨౮౧

అర్థములు. మిళిందముల్ = తుమ్మెదలు, క్రందుగా=గుంపుగా. సర్వర్తు= సర్వఋతు=అన్ని ఋతువులందు ఫలించు, తరుఫలసంతతులను = చెట్లయందును పండ్లసమూహములయందును, చుట్టుపెట్టు ప్రదక్షిణించును, వలచినట్టివి = కోరి నట్టివి, అవారిగా(గ=దండిగా, సోన=సన్న వాన.

తా త్ప ర్య ము

సర్వఋతువులందు ఫలించు చెట్లయందును పండ్లయందును తుమ్మెదల గుంపు లెచ్చోట ధ్వనించుచుండును, తన కాంతిగల యే పర్వతమును సూర్యుఁడు సర్వదా ప్రదక్షిణము చేయుచుండును. ఏపర్వతము తనయందుండు మృగములకు(బక్షులకు(

దన కాంతిని గలిగించును. ఏ పర్వతమును దేవతలు మహర్షులు పాయకయుందురు, కోరిన ఫలములు దండిగా పర్వతమున దొరుకును, ఎందు తేనె తుంపరగాఁ బడు చుండును. అటువంటి రమ్యమైన మేరుపర్వతమందుఁ గేసరియను వానరుఁ డుండును.

సీ. గండరగండఁ డీ ♦ తండు రాక్షసతతి, మధ్యంబునందు నీ ♦ మాడ్కిఁ దేన
యఱువదివేల స్వ ♦ ర్ణాద్రుల నడుమను, మేరువు రాణించు ♦ మేటి యగుచు
శాఖామృగంబు ల ♦ చ్చట శ్వేతకపిలలో, హితమధుపింగళా ♦ కృతుల నొప్పఁ
గరవాఁడి గోళ్ళను ♦ గఱకుఁగోఱలు నయి, బెబ్బులు లట్టులు ♦ గబ్బ లగుచు
తే. బొబ్బ మెకములవడుపునఁ ♦ బొడవులైన, నాల్గుకోఱలు గలిగి యం ♦ టంగరాని
వేల్పుతోడను సోమించి ♦ విషధరాళిఁ, బోలి మదవారణములకుఁ ♦ బురుడుసూపి.

అర్థములు. గండరగండఁడు = శూరులలో శూరుఁడు, స్వర్ణాద్రుల = బంగారుకొండల, శ్వేత = తెల్లని, కపిల = గోరోచన వర్ణము, లోహితము = ఎఱుపు, మధుపింగళ = తేనెవలెఁ బసుపు, ఆకృతులన్ = ఆకారములను, కరవాఁడి = మిగులఁ బదునైన, గబ్బులు = మదించినవి, ఏక — గబ్బి, బొబ్బమెకముల = సింహముల, వడువున = విధముగా, అంటంగరాని వేల్పు = అగ్ని. సోమించి = (ఉగ్రత యందు) సరిపోలి, విషధరాళిన్ = పాములగుంపును, పురుడు = సమానము.

తాత్పర్యము

రాక్షస సమూహమందు నీ వెట్టులో యట్టులే వీఁడు శూరులలో శూరుఁడు. ఆఱువదివేల బంగారుకొండల నడుమ మేరుసావర్ణి గొప్పదై ప్రకాశించును. అచ్చటి కోఁతులు తెలుపు, గోరోజన వర్ణము, ఎఱుపు, తేనెవర్ణములును మిగులఁ బదునైన గోళ్ళు కఱకుఁ గోఱలు గలవై పెద్దపులులవలె మదించి సింహములవలె పొడవైన నాలుగు కోఱలు గలిగి యగ్నిహోత్రమువలె నంటరాక, పాములవలె రోషము గలవై యేనుఁగులతో సమములై యుండును.

తే. దీర్ఘవాలంబు లమర మ ♦ దించినట్టి, గారులను గొండలను బోలి ♦ ఘనపయోద
రావులై వృత్తపింగళ ♦ రక్తనయన, ములురహింపఁగ నీ లంక ♦ మూలముట్టుగిర ౪౩

అర్థములు. దీర్ఘవాలంబులు = నిడివితోఁకలు, గారులను = ఏనుఁగులను, ఘనపయోదరావులై = గొప్పమేఘముల ధ్వనివంటి ధ్వనిగలవై, వృత్త = గుండ్రములై పింగళ = తేనెపచ్చ, రక్త = ఎఱుపుగల, నయనములు = కన్నులు, మూలముట్టు = పునాదితో.

తాత్పర్యము

నిడివిగల తోఁకలుగలిగి మదించిన యేనుఁగులను, కొండలనుబోలి, మేఘధ్వని గలవై, వట్రువలు పింగళములు నగు కన్నులు గలిగి నీ లంకను పాఁతుతోడ.

తే. నాశమును జేయ నున్నట్టి ♦ కీశవరుల, నడుమ విజయార్థియై యున్న ♦ నగచరుండు
దేవ శతవలి యనియెడి ♦ ధీరతుండు, దినముదినము నుపాసించు ♦ దివసనాథు. ౪౪

అర్థములు. నగచరుఁడు=వానరుఁడు.

తా త్ప ర్య ము

నాశముచేయనున్న వానరశ్రేష్ఠుల నడుమ జయము గోరియున్న వానరుఁడు శతవలి యనియెడివాఁడు. వీఁడు తూర్పుకొండయందుండి దినదినము సూర్యు నుపాసించును.

క. బలియుఁడు శూరుఁడు పౌరుష, కలితుఁడు రామునకుఁ బ్రియముఁ ♦ గావించుటకై
తలపఁడు 'ప్రాణముదీప'ను పలు కువ్విళ్లూరు లంకఁ ♦ బాడొనరింపన్. ౫౪౫

అర్థములు. ప్రాణము తీపు=ఇది లోకోక్తి. ఏది తీపనిన ప్రాణము తీపని సామెత గలదు? ఉవ్విళ్ళూరు=మిక్కిలి యాశపడు.

తా త్ప ర్య ము

బలవంతుఁడు శూరుఁడు పౌరుషము గలవాఁడు నగు వీఁడు రామునకుఁ బ్రియము చేయవలయు నను తలంపుతోఁ బ్రాణమునందలి యభిమానము వదలి లంక పాడుచేయుట యెప్పుడా యని కోరుచున్నాఁడు.

తే. గజగవాక్షులు నీలుండు ♦ గవయనలులు
నొక్కఁ దొక్కఁడు దశకోటి ♦ యూథసమితి
పతులు వింధ్యంబునందలి ♦ ప్లవగవరుల
రాక్షసేశ్వర యెన్నఁ దరంబు గాదు. ౫౪౬

తా త్ప ర్య ము

గజుఁడు, గవాక్షుఁడు, నీలుఁడు, గవయుఁడు, నలుఁడు వీరొక్కొక్కరు పది కోట్ల యోధుల గుంపునకు నాయకులు. ఇఁక వింధ్యపర్వతము నందలి క్రోఁతులు లెక్కించ సాధ్యముకాదు.

క. అంద ఱమితప్రభావులు, నంద ఱు నచలాభ కాయు ♦ లంద ఱు భూభృ
ద్బృందంబులు పొడిపొడిచే, యం దిట్టలు క్షణములోన ♦ నసురాధీశా! ౫౪౭

అర్థములు. అచలాభకాయులు=పర్వత సమానములగు దేహములు గలవారు, భూభృత్ = కొండల, బృందంబులు = సమూహములను, పొడిపొడి = సన్నని పొడి—దుమ్ము, దిట్టలు=సమర్థులు.

తా త్ప ర్య ము

అందఱు నపరిమిత ప్రభావముగలవారు అందఱు కొండలంత దేహముగలవారు అందఱు కొండలు పిండి పిండిగా నిమిషములోఁ గొట్ట సమర్థులు.

—♦ ౨౮ సర్గము. శుకుఁడు రావణునకు మైందాదుల నెఱింగించుట. ♦—

క. సారణుభాషణముల విని, తీర వచింపం దలంచి ♦ దివిజారికి నా
పారావార మెరయు కపి, వారంబుం బాఱఁజూపి ♦ పలుకు శుకుండున్. ౫౪౮

అర్థములు. తీరన్ = పూర్ణముగ.

తాత్పర్యము

సారణుఁడు చెప్పినమాటలువిని వానరుల విషయము పూర్తిగాఁ జెప్పదలఁచి సముద్రముతో సమానముగ నున్న వానరసేనను బాఱఁజూపి రావణునకు శుకుఁ డిట్లనియె.

సీ. ప్రాలేయగిరి నున్న • సాలవృక్షంబులో, మందాకినీతటి మర్రిచెట్లో
మత్తెక్కితిరిగెడి • మాతంగనాథులో,యనఁగ దుస్సాధులు • నధికబలులు
కామరూపులు దితి•జామరసం కాశు, లని దేవసన్నిభు • లైన ప్లవగు
లిరువదియొకకోటి • తరుచరు లట్టులే, వేయిశంఖంబులు • బృందశతము

తే. వీరు కిష్కింధయందుండు • వారు సూర్య, తనయుసచివులు దేవగం•ధర్వతతికి
సంభవించిన వారలు సమరమునను, శత్రుభీకరు లెల్లరు • శక్రవైరి. ౫౮౯

అర్థములు. ప్రాలేయ గిరిన్=హిమవంతమునందు, సాలవృక్షంబులో=మద్దిచెట్లులో, మందాకినీ తటి = గంగయొడ్డున నున్న, దితిజ+అమర+సంకాశులు = దైత్యులతో దేవతలతో సమానులు, అనిన్=యుద్ధమందు,తరుచరులు=క్రోఁతులు, సచివులు=మంత్రులు.

తాత్పర్యము

మంచుఁగొండయందలి మద్దిచెట్లో, గంగాతీరంబున నున్న మర్రిచెట్లో, మదించి తిరుగు నేనుఁగులో యనునట్లు సాధింపరాని యధికబలులు కోరినరూపము ధరింపఁగలవారు దేవదైత్యసమానులు,యుద్ధమందు దేవసములు,ఇరువదియొకకోటి వానరులు, అట్టులే వేయి శంఖంబులు నూఱుబృందములు-వీరు కిష్కింధయందుండు వారు.సుగ్రీవుమంత్రులు, దేవగంధర్వులకు జనించినవారు యుద్ధమందుభయంకరులు.

మత్తకోకిలము. వారిఁ జూడు మవార్యవీర్య విభా•ప్రభావులు బాలకా
కారు లబ్జజుకంపునన్ మురి•గందుమీఱి సుధారసం
బారఁ గ్రోలిరి మైందుఁడున్ ద్వివి•దాఖ్యుఁడున్ నిను నీ పురిం
భూరివిక్రమసంపదన్ మును•ముట్టఁ గూల్పఁగఁ జూచెదన్. ౫౯౦

అర్థములు. విశేషకాంతి, అవార్య=నివారింపరాని, ప్రభావులు = మహత్త్వము గలవారు, బాలక+ఆకారులు=వయస్సువచ్చిన పిల్లవాండ్ర యాకారములు గలవారు, అబ్జజుకంపునన్ = బ్రహ్మయాజ్ఞచే, మురిగందు = బలము గర్వము, సుధారసంబు=అమృతము,

తాత్పర్యము

వారింపరాని వీర్యము కాంతియొక్క మహత్త్వముగలవారు,వయస్సువచ్చిన బాలురవలె నుండువారు, దానికిఁగారణమేమన బ్రహ్మయాజ్ఞప్రకారము బలగర్వము లతిశయింపఁగా నమృతముఁ ద్రావిరి. వారిపేరు మైందుఁడు. ద్వివిదుఁడు. నిన్ను నీ పట్టనమునుగూడ భుజబలాతిశయముచే పాఁతుతోడఁ బడఁగొట్టఁ జూచుచున్నారు

క. వారల ప్రేవల శైలా, కారులు సుముఖాసుముఖులు ♦ కాలునితనయుల్
వీరులు జనకసమానుల, పారబలులు పాఱఁజూచు ♦ వారలు లంకన్. ౫౯౧

అర్థములు. ప్రేవలన్ = ప్రక్కల, శైలాకారులు = పర్వతముల యాకారము గలవారు. కాలుని తనయుల్=యముని కొడుకులు.

తాత్పర్యము

వారి ప్రక్కల పర్వతములవలె నుండువారును, వీరులును, తండ్రితో సమానులు, యముని కుమారులు అపరిమిత బలముగలవారు, సుముఖుఁడు అసుముఖుఁడు అను వారున్నారు, వారినిఁ బాలించి చూడుము.

సీ. మత్తమాతంగంబు ♦ మాడ్కినుండెడివాఁడు, కనలునఁ గడలినేన్ ♦ గలఁచువాఁడు
పవమానసుతుఁ డని ♦ ప్రథఁ జెలంగెడివాఁడు, కేసరితనయుఁడై ♦ కెరలువాఁడు
దలఁచినరూపంబు ♦ ధరియింపఁ గలవాఁడు, బలరూపములఠీవిఁ ♦ బ్రబలువాఁడు
వాయువు నట్లని ♦ వార్యవేగమువాఁడు, హరిచయంబుల మిన్న ♦ యైనవాఁడు
తే. దర్పమున సాగరంబును ♦ దాఁటినాఁడు, క్ష్మాత్మజను నిన్నుఁ జూచిమా ♦ టాడినాఁడు
తిరిగి యిచ్చటికిపుడరు ♦ దెంచినాఁడు, కనితి వేనాఁడె హనుమంతుఁ ♦ డనెడివాఁడు.

అర్థములు. మత్తమాతంగంబు=మదపు టేనుఁగు, కనలునన్=కోపమున, కడలి నేన్=సముద్రమునైనను, ప్రథ=కీర్తి, మిన్న=శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

మదపు టేనుఁగు వలె నుండు వాఁడును, కోపించెనేని సముద్రమునైనఁ గలఁత పెట్టువాఁడును, వాయుపుత్రుఁ డని కీర్తి గన్నవాఁడును, కేసరి పుత్రుఁ డగు వాఁడును, కోరిన రూపము ధరింపఁ గలవాఁడును, బలరూపముల వైభవము గల వాఁడును, వాయువువలె నడ్డగింపరాని వేగము గలవాఁడును, వానర సమూహములలో శ్రేష్ఠుఁ డగు వాఁడును, బలగర్వముచే సముద్రమును దాఁటినవాఁడును, సీతను, నిన్నుఁ జూచి మాటాడినవాఁడును, మరలి పోయి యందఱఁ బిలుచుకొని యిచ్చటికి వచ్చిన వాఁడును నగు హనుమంతుఁ డదిగో నున్నాఁడు చూచితివా ?

ఉ. వాఁడు కిశోరవృత్తి చెలు ♦ వం బగువేళ క్షుధార్తి నప్పుడే
వేఁడివెలుంగు ప్రాచిఁ బ్రభ ♦ వింపఁగ నాఁకలి దీఱ వీనినిన్
బోఁడిమి మ్రింగువాఁడ నని ♦ పూని చివుక్కున మింట నామడల్
మూఁడు సహస్రము ల్నెగసి ♦ లోకవిలోచను డాయఁ బోకయే. ౫౯౩

అర్థములు. కిశోరవృత్తి = శైశవమున, క్షుధార్తిన్=ఆఁకలి బాధచే, వేఁడి వెలుంగు=సూర్యుఁడు, ప్రాచిన్= తూర్పునందు, ప్రభవింపఁగన్=పుట్టఁగా, లోకవిలోచనున్=సూర్యుని, లోకమునకు కన్నయిన వానిని.

తాత్పర్యము

వాఁడు శిశువుగానుండుసమయమందు నాఁకలిగొన్నసమయంబునసూర్యుఁడు

తూర్పున నుదయించుచుండఁగా జూచి పండని తలఁచి యాఁకలిదీఱ దీనిఁ దిందు నని ప్రయత్నించి చివాలున నాకాశమున కెగసి మూఁడువేలామడ పోయి సూర్యుని సమీపింపలేక.

(౧) సూర్యునికి భూమికి లక్ష యామడల దూరమని యొక లెక్కగలదు. కావున మూఁడనునది బహుత్వమును సూచించును, పెక్కువేలని గ్రహింపనగు, (౨) హనుమంతుఁ డపుడు మేరుపర్వతముపై నుండినవాఁడు కావున అచ్చటికి నపుడు సూర్యుఁడున్నచోటికి మూఁడువేలామడ దూరమని గ్రహింపనగు.

కిష్కింధాకాండమందు (ప. ౧౮౧౩)

'ఫలకాంక్షదివంబున కుద్గమించి యోజనములు మూఁడుసార్లు చని చండ కరాతప తప్తదేహివై' యని యున్నది. అచ్చట మూఁడునూర్లని చెప్పఁబడినదే యిచ్చట మూఁడువేలని చెప్పఁబడెను. 'శతం సహస్రమయుతం సర్వ మానంత్య వాచకమ్' విశేషసంఖ్య చెప్పవలసివచ్చినపుడు నూఱు, వేలు, లక్షలని చెప్పుట గలదు. కావున నిచ్చట నట్టిసంఖ్యగా గ్రహింపనగు. ఈ యభిప్రాయమును ఉత్తర—౭౯౮వ పద్యమునందలి 'వేనవేల్' అను పద్యము దృఢపఱుచుచున్నది. సంస్కృతంబున మూఁ డనునది బహుత్వమును బోధించును.

క. శైలవరకూటతలమున, వ్రాలుటయున్ హనువు గాయపడెఁ జీలికయై
వాలుమగఁడు దానం గద, వాలెన్ హనుమంతుఁ డనెడి వరవిఖ్యాతిన్. ౫౬౪

అర్థములు. శైలవరకూటతలమునన్ = ఒక పర్వత శిఖర ప్రదేశమున, హనువు = చెంప, వాలుమగఁడు = శూరుఁడు.

తాత్పర్యము

పర్వతశిఖర ప్రదేశమున పడెను. చెంప గాయపడుటచే నీ శూరుఁడు హనుమంతుఁడను పేరఁ బ్రసిద్ధుఁడయ్యెను.

క. హనుమంతుఁడు హనుమంతుఁడు, హనుమంతుం డనుచు నితని యార్తులు పిలువన్
విని యెఱిఁగితి నీతనిబల, ఘనమహిమ సురూపములను గాను వచింపన్. ౫౬౫

తాత్పర్యము

హనుమంతుఁడు హనుమంతుఁడు హనుమంతుఁడు అని యితని మిత్రులు పిలుచుటచేఁ వీఁడేకనా హనుమంతుఁడని తెలిసికొంటిని. వీని బలముయొక్కగొప్ప మహిమను సురూపమును వర్ణింప సాధ్యపడదు.

హనుమంతుఁడని ముమ్మాఱు చెప్పనేల యనిన — వానరులందఱు నితని స్మరించువారే యని సూచించుటకు, నితనియం దందఱకుఁ గల ప్రీతి సూచించుట కును. రాముఁడు రాముఁడు రాముఁ డని జగము రామమయమైనట్లని యెంచనగు. రాముని వెనుక హనుమంతుఁడే బహుజనపూజ్యుఁడు. రామునివలె హనుమంతుఁ డందఱకుఁ బూజ్యుఁడు గదా !

క. చివ్వనఁ బైపడి యిపుడే, యువ్వెత్తుగ లంక నెల్ల • నుహ్వాని మీటన్
గ్రొవ్వనఁ దలఁచెడి నీకం, డవ్విధికిని జాలువాఁడ • యని నేఁ దలఁతున్. ౪౮

అర్థములు. ఉవ్వెత్తుగన్=అడుగునుండి - నిశ్శేషముగ, ఉహ్వాని=ఊహ్వా అని, ఊదునప్పటి శబ్దమున కనుకరణము. "ఉహ్వాని హోమాగ్ని నూఁద నొల్లఁ" డని పాండురంగమాహాత్మ్యము. మీటన్=ఎగఁజిమ్మటకు, అవ్విధికిని = అంత పనిని చేయుటకు, చాలువాఁడ=శక్తి గలవాఁడే.

తాత్పర్యము

అవ్వనవచ్చి పైబడి యిపుడే నిశ్శేషముగ లంక నెల్ల నుహ్వాని మింటికి నెఁగ జిమ్మటకు బలగర్వముచేఁ దలఁచుచున్నాఁడు. అంతపని చేయుటకు సమర్థుఁ డనియె నా యభిప్రాయము.

—• శుకుఁడు రావణునకు శ్రీరామ లక్ష్మణులఁ జూపుట •—

సీ. సారసనేత్రుండు • శ్యామల గాత్రుండు, ఘనగుణహారి వి • క్రమవిహారి
శూరవరేణ్యుండు! • సుజనశరణ్యుఁడు, నరకుల వంశజులయం • దతిరథుండు
పౌరుష ప్రథితుండు, • ధీరసంకథితుండు, వేదవేదాంగ సం • విద్ఘనుండు
ధరైకశరణుండు • ధర్మానుసరణుండు, బ్రహ్మాస్త్రమంత్రాళిఁ • బండితుండు
తే. బాణములవిన్న బ్రద్దలు • పాపఁజాలు, నచలములఁ బిండి సేయంగ • నైనఁ గాలుఁ
బరమరుషఁగొన్న మృత్యుదే • వతనుబోలుఁ, బటుపరాక్రమమునదివ • స్పతికిమేలు.

అర్థములు. సారస నేత్రుండు = కమలములవంటి కన్నులు గలవాఁడు, రామసౌందర్యమందుఁ గన్నులు ప్రధానములుగఁ బలుతావులఁ జెప్పఁ బడెను. శూర్పణఖను మోహింపఁజేసినవి, సీతను దుఃఖింపఁజేసినవి, యీకన్నులే. అట్లులే శుకుఁడును శ్రీరాముల దివ్యమంగళవిగ్రహము వర్ణించుటయందు నేత్ర వర్ణన ముతోఁ బ్రారంభించెను. ప్రథమమందు వాని మనస్సు నాకర్షించినవి యీకన్నులే. వాఁడేమి చేయఁగలఁడు ?

శ్యామలగాత్రుండు=నీలమేఘమువలె, దూర్వాంకురమువలె, నల్లకలువవలెఁ గాంతికలవాఁడు. ఇది చూచువారిని నాకర్షించు బాహ్య సౌందర్యము. ఘనగుణ హారి=గొప్ప సద్గుణములచే మనోహరుఁడైనవాఁడు. బాహ్యసౌందర్యము బచ్చెన బొమ్మకునుగలదు. అట్లుగాక యాయన గుణములుగూడ జనులనాకర్షించునవి యని చెప్పఁబడెను. దయావాత్సల్యాది గుణములుండిన నుండునుగాక, దానివలన నాకేమి భయము, అందువేమో ! విక్రమవిహారి=పరాక్రమము గలిగి సంచరించువాఁడు, పరాక్రమముచే విశేషముగ నాకర్షింపఁ బడువాఁడు, సాధువులు మంచి గుణ ములచే నాకర్షింపఁబడిన, విరోధులు పరాక్రమముచే నాకర్షింపఁ బడుదురు. ఏలన-శూరవరేణ్యుండు = శూరులందు శ్రేష్ఠుఁడు, సుజనశరణ్యుండు = సజ్జనుల

రక్షించువాఁడు, ఇట్లు చెప్పుటచే నీవంటి దుర్జనుల దండించువాఁ డని భావము. అర్క-వంశజులందున్ = సూర్యవంశ రాజులందు, అతిరథుండు=వెనుకకుఁ దిరుగని తేరుగలవాఁడు, పరాజయ మెట్టిదో యెఱుఁగనివాఁడు, పౌరుషప్రథితుండు=పౌరుషముగలవాఁడని కీర్తిగన్నవాఁడు. కావున నిది నా యొక్కని మాటయే కాదు. పదుగురనుకొను మాట నేను చెప్పుచున్నానని భావము. ధీరసంకథితుఁడు=ధీరుఁడు అని విశేషముగఁ జెప్పఁబడుచున్నవాఁడు, ధైర్యము, బలము వీని కేమిలే, పులులు సింహములు ఏనుఁగులకు నివి లేవా! జ్ఞానములేని కారణమున మనుష్యులచేఁ జచ్చుటలేదా యందువేమో! వేద వేదాంగ సంవిత్+ఘనుండు = వేదములయు వేదాంగములయు జ్ఞానముచే గొప్పవాఁడు. అయిన నవి నేను చదివిన విద్యలే లే యనెదవేమో! ధర్మైక శరణుఁడు=తాను రక్షించు ధర్మము తన్ను రక్షించునని యున్నాఁడుకాని బలపౌరుషముల చేతనే నీవలె గెలువఁదలఁచినవాఁడు కాఁడు. 'ధర్మోజయతి' - 'ధర్మో రక్షతి రక్షితః'అని యుండువాఁడు, జయమునకుఁ గావల సిన ముఖ్యపదార్థము నీయందు లేదు అని భావము. ధర్మమునకు నొకఁడే రక్షకుఁ డగువాఁడు. 'ధర్మస్య ప్రభు రచ్యుత' యన్నట్లు ధర్మమాయన నాశ్రయించి యున్నది. ఆయన లేకున్న ధర్మమునకు నిలువ నాధారములేదు. ధర్మము తన్ను రక్షించినవానిని రక్షించును. అట్టి ధర్మమును, అనుసరణుండు=అనుసరించువాఁడు, ధర్మము నతిక్రమించి యేపని చేయఁడని భావము. ఇదివఱకు నాచే దెబ్బలు దినిన రాజులందఱు ధర్మాత్ములుగారా! నా బాణములముందఱ నీతనిధర్మమేమి నిలువఁ గల దందువా? నీకుఁ దెలియని యస్త్రము లెఱింగిన వాఁడని చెప్పుచున్నాఁడు. బ్రహ్మాస్త్రమంత్రాలిన్=బ్రహ్మాస్త్ర నారాయణాస్త్రాది మంత్రములందు పండితుఁడు. అస్త్రముల దాఁకఁ బోనేల? ఉత్తబాణముల చేతనే, విన్ను = ఆకాశము, బ్రద్దలుపాపఁజాలు=పగులఁ గొట్టఁగలఁడు. అచలమును=కొండలను, పరమరుష= మిగులఁ గోపము, దివస్పతికి=ఇంద్రునికంటె, మేలు=గొప్పవాఁడు.

తాత్పర్యము

తామరలవంటి కన్నులుగలవాఁడు. నీలవర్ణమైన శరీరము గలవాఁడు. గొప్ప గుణములు గలవాఁడు. పరాక్రమము గలవాఁడు. శూరులందు శ్రేష్ఠుఁడు. మునిజనులకు దిక్కైనవాఁడు. సూర్యవంశపు రాజులందు నతిరథుండు. పౌరుషము గలవాఁడని లోకమునఁ గీర్తిగన్నవాఁడు. ధైర్యశాలి యని చెప్పఁబడు వాఁడు. వేద వేదాంగముల జ్ఞానమునందు గొప్పవాఁడు. ధర్మమే రక్షకముగాఁగల వాఁడు. ధర్మమునకుఁ దా నొక్కఁడే రక్షకుఁ డగువాఁడు. ధర్మము ననుసరించి తిరుగువాఁడు. బ్రహ్మాస్త్రము మొదలగు మంత్రముల నెఱిఁగినవాఁడు. బాణములచే నాకాశమును జీల్పఁగలఁడు. కొండలఁబిండి కొట్టఁగలఁడు,కోపము వచ్చెనామృత్యు దేవతతో సమానుఁడు. గొప్ప పరాక్రమమందు నింద్రునికంటె గొప్పవాఁడు.

క. వేనిసతిన్ సీత జన, స్థానంబునఁ దెచ్చి తట్టి • దశరథమహీభృ
త్సూనుఁడు రాముఁడు వాఁడే, పూనెను నీతోడ యుద్ధ • మున కసురేంద్రా ?

అర్థములు. మహీభృత్+సూనుఁడు=రాజకుమారుఁడు.

తాత్పర్యము

ఎవనిభార్యను నీవు జనస్థానంబుననుండి తెచ్చితివో యట్టి దశరథరాజ కుమారుని కొడుకగు రాముఁడనువాఁడే, ఆయన నీతోడ యుద్ధము చేయఁబూనెను.

సీ. ఆయన సయిదోడు • నన్నకు సరిజోడు, వలపటికయివంక • వఱలువాఁడు
మిసిమిమేలి కడాని • మెఱుఁగులీనెడువాఁడు, కఱియుంగరంబుల • నెఱులవాఁడు
కెందామరల నవ్వు • కందోయిగలవాఁడు, నిక్కు పేర్వెడలుపు • టక్కువాఁడు
అసమున నన్నకై • యుసుఱునిల్పెడివాఁడు, నోటమి యెఱుఁగని • యేటుకాఁడు
తే. రామునకుఁ గుడికేలయి • గ్రాలువాఁడు, నతనికిని నిచ్చ వెలి యుసు • రైనవాఁడు
పూని యని నేరికిని గెల్వ • రానివాఁడు, కనలునిండారు డెందానఁ • దనరువాఁడు.

అర్థములు. సయిదోడు=సహాయుఁడు, సరిజోడు=సమానుఁడు, వలపటికయివంకన్ = కుడిచేతివైపు, మిసిమి = మెఱుఁగుగల, మేలికడాని = మంచి బంగారుముక్క, మెఱుఁగులు=కాంతులు, కఱి = నల్లని, ఉంగరంబుల = ఉంగరములవలె వంకరైన, నెఱులు=వెంట్రుకలు, కందోయి=రెండుకన్నులు, అక్కు= ఱొమ్ము, అసమున = దర్పముచే, ఉసుఱు = ప్రాణము, ఓటమి=అపజయము, నిచ్చ=ఎల్లవేళ, రూ - నిచ్చలు - వెలియుసుఱు=వెలుపలి ప్రాణము, అనిన్ = యుద్ధమందు, కనలు = కోపము.

తాత్పర్యము

ఆ రామచంద్రమూర్తికి సహాయుఁడు, అన్నకు సమానుఁడు కుడిప్రక్క నున్నవాఁడు, మెఱయుచున్న మంచిబంగారు కాంతిగలవాఁడు, ఉంగరమువలె నున్న నల్లని వెంట్రుకలు గలవాఁడు. ఎఱ్ఱదామరలవంటి రెండు కన్నులు గలవాఁడు, మిగుల వెడలుపగు ఱొమ్ముగలవాఁడు, తాను జీవించుట యన్నసేవకే యని తలఁచువాఁడు, పరాజయ మెఱుఁగనివాఁడు, రామునకుఁ గుడిచేతివంటివాఁడు, ఆయనకు వెలుపలి ప్రాణమైనవాఁడు, యుద్ధమం దెట్టివారికిని గెల్వరానివాఁడు, నీ మీఁది కోపముచే నిండిన హృదయము గలవాఁడు.

క. ఈతని లక్ష్మణుఁ డందురు, భ్రాతకుఁ బ్రియతముఁడు మఱియు • బ్రాణసముండున్
సీతని సంగరరీతిని, ఖ్యాతుఁడు సర్వాస్త్రశస్త్ర • గణకోవిదుఁడున్. ౬౦౦

తాత్పర్యము

ఈయనపేరు లక్ష్మణుఁడు అన్నకు మిగులఁ బ్రియమైనవాఁడు. అంతియ కాదు, ప్రాణములతో సముఁడు. నీతియందు యుద్ధక్రమమునందుఁ బ్రసిద్ధుఁడు. అన్నివిధములైన యస్త్రశస్త్రసమూహములందుఁ బండితుఁడు.

క. బలియుఁడు మేధావంతుం, డలఘుపరాక్రముఁడు రాక్ష♦సావళి నెల్లన్
గలనం దానొక్కఁడే, పొలియింపఁగఁ దమకపడెడుఁ♦బురురోషమునన్. ౬౦౧

తాత్పర్యము

బలవంతుఁడు, బుద్ధిబలముగలవాఁడు, గొప్ప పరాక్రమము గలవాఁడు, యుద్ధమునందు రాక్షసుల నందఱను దానొక్కఁడే చంపుటకు మిగుల రోషముతో నుత్సాహము చేయుచున్నాఁడు.

క. హితుఁడై రామునకును నా, శ్రితుఁడై డాపటను నిల్చి ♦ శ్రితరక్షస్సం
వృతుఁడైనవాఁడు రాక్షస, పతియైన విభీషణుండు ♦ భవదనుజుండున్. ౬౦౨

అర్థములు. ఆశ్రితుఁడై=ఆశ్రయించినవాఁడై, డాపటను = ఎడమవైపు, శ్రిత=తన్నాశ్రయించిన రాక్షసు లగు మంత్రులచే, సంవృతుఁడు=చుట్టుకొనఁబడి యుండువాఁడు, భవదనుజుండున్=నీ తమ్ముఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి మేలుకోరువాఁడై. రామునకు నాశ్రితుఁడై యెడమ ప్రక్క తనమంత్రులగు రాక్షసులతోఁడఁ గూడియుండువాఁడు,నీ తమ్ముఁడు రాక్షస రాజగు విభీషణుఁడు. ఈ పద్యమందు గాయత్రి పదునాఱవ యక్షరముగలదు.

తే. మానవాశన! యితఁడు శ్రీ♦మద్వరుండు, రాజరాజైన శ్రీరఘు♦రాముచేత
లంక కభిషిక్తుఁ డగుచు ను♦ల్లాసగరిమఁ, దాఁక నున్నాఁడు నిన్నని♦దర్పయుక్తి.

అర్థములు. మానవాశన=మనుష్యులను భక్షించువాఁడా! ఇతఁడు విభీషణుఁడు. శ్రీమద్వరుండు=శ్రీమంతులలో శ్రేష్ఠుఁడు. ౧ ఇది శ్రీరఘురామ శబ్ద విశేషణము. శ్రీరామచంద్రమూర్తి అవాప్తసమస్త కాముఁడు ఏమె కటాక్షలేశముచేఁ గలిగిన యల్పైశ్వర్యము చేతనే తాము శ్రీమంతుల మనుకొనుచున్నారో, అట్టి వారలలో నా శ్రీకే పతి యగుటచే శ్రేష్ఠుఁడు. తక్కిన యందఱ శ్రీ, వారిని కొన్ని దినములకు వదలిపోవును. ఈయనకు శ్రీమంతుఁడు=శ్రీతో నిత్యసంయోగము గలవాఁడు. కావున నీ రాజ్య మాశించినవాఁడు కాఁడు. (౨) ఇది విభీషణ పర్యాయముగ నన్వయింప వచ్చును. దేవప్రసాదే వరణే, జామాతరి వరః పుమాన్ క్లీబేతు కుంకుమే శ్రేష్ఠే, త్రిష్విష్టే త్వవ్యయం వరమ్ నానా॥ర. వర మనఁగా దేవ ప్రసాదము. కావున శ్రీమంతుఁ డగు రాముని యనుగ్రహమునకుఁ బాత్రుఁడైన వాఁడు. (౩) వరము=ఇష్టము, శ్రీరామచంద్రమూర్తి కిష్టుఁడైన వాఁడు కావుననే (౪) రామచంద్రమూర్తిచే నీవు లంకకు రాజవు కమ్మని కోరఁబడినవాఁడు. ఇట్లు చెప్పుటచే లంకారాజ్యమును విభీషణుఁడు కోర లేదనియు రామచంద్రమూర్తియే యనుగ్రహించి యిచ్చుటచే పరతంత్రుఁడు కావున నిరాకరింపఁ జాలక గ్రహించె ననియు భావము. (౫) ఈ కారణముచే శ్రీమంతులలో శ్రేష్ఠుఁడైన వాఁడు. రాజరాజగు=రాజుల కందఱకు రాజయిన, ఇతఁడు రాజయినఁగదా రామ

చంద్రమూర్తి రాజరాజగును. తన రాజరాజత్వము రక్షించుకొనుటకై అభిషిక్తుఁడు=అభిషేకింపఁబడినవాఁడు, ఉల్లాసగరిమన్=సంతోషాతిశయముచే, తాఁక నున్నాఁడు=నీతో యుద్ధము సేయఁదలఁచి యున్నాఁడు.

తాత్పర్యము

ఓరీ! నేను రాక్షసపతినై యుండ విభీషణుని రాక్షసపతియనెదవేల యందువా, నీవు మా+నవాశనుఁడవు. నీయొద్ద లక్ష్మి యెట్లు నిలువఁగలదు. నీవు మానవ+అశనుఁడవు, నిన్ను మనుష్య రూపముతో నుండు రామచంద్రమూర్తి యెట్లు రక్షింపఁగలఁడు. కావున రామచంద్రమూర్తి నిన్ను రక్షింపఁడు. లక్ష్మి నీయందు నిలువదు. ఏలన నీ విభీషణుఁడు శ్రీమంతుఁడగు రామునిచే ననుగ్రహింపఁబడినవాఁడై యా కారణమున శ్రీమంతులలో శ్రేష్ఠుఁడై రాజరాజగు రామచంద్రునిచే రాక్షసరాజుగ లంకాపురికి నభిషేకము చేయఁబడి సంతోషముతో యుద్ధమందు నీతోఁ బోరఁదలఁచి యున్నాఁడు. కావున నీ రాజత్వము కొలఁది దినములలోనే ముగియఁ గలదు అని భావము.

సీ. క్రోఁతుల నడుమను • గొండనా నున్నవాఁ, డగచరాళికి భర్త•యైనవాఁడు
ధీజ్ఞానయశముల•తేజఃకులంబుల, ధరములఁ బ్రాలేయ•గిరివరంబు
వెలిఁగించు పగిదిఁ గీ•శుల నేలువాఁడును, గలన వెన్నీయని•కడిమికాఁడు
సగహనద్రుమ మయి • శైలదుర్గస్థ మా, కిష్కింధగుహలోనఁ • గీశయూథ
తే. పతులును బ్రధానులును గొల్వఁ • బ్రబలువాఁడు
లలితపుష్కరశోత మయి • లక్ష్మి సుప్ర
తిష్ఠితం బయి కాంత మై•దేవమనుజ
తతికిఁ దగు హేమమాలికఁ • దాల్చువాఁడు. ౬౦౪

అర్థములు. ధీ-జ్ఞాన-యశములన్=బుద్ధిజ్ఞానకీర్తులచే, తేజః కులంబులన్=తేజస్సుచే కులముచే, ధరములన్=పర్వతములను, ప్రాలేయగిరి, వరంబు = కొండలలో శ్రేష్ఠమైన మంచుఁగొండవలె, వెన్ను+ఈయని = వీఁపుచూపని, కడిమికాఁడు=బలశాలి, సగహనద్రుమ మయి = గుహలతోఁ జెట్లతోఁ గూడిన, శైలదుర్గస్థమా=పర్వతదుర్గమగు, కిష్కింధగుహలోన=కిష్కింధ యను గుహయందు, లలిత = మనోహరమైన, పుష్కరశోతమయి = తామరపూవులు గలదై, లక్ష్మి సుప్రతిష్ఠితంబయి=సుప్రతిష్ఠిత లక్ష్మియై, శాశ్వతమైన కాంతిగలదై, కాంతమై=మనోహరమై, హేమమాలిక=బంగారుసరము, ఈ మాలికా ప్రభానము కిష్కింధాకాండయందు వివరింపఁబడెను. ఇది వాలిదత్తము. శత్రువుల బలము తన లోనికి లాగుకొను శక్తి గలది.

తాత్పర్యము

క్రోఁతుల నడుమ గొండవలె నుండువాఁడు కావున క్రోఁతులకు కొండవలె

నాశ్రయమైనవాఁడు, వానరులకు భర్తయగువాఁడు. ఊహాపోహముల చేతను, శాస్త్ర జన్యమైన తెలివిచేతను కీర్తిచేతను ప్రతాపముచేతను సద్వంశమునఁ బుట్టుటచేతను కొండలయందు హిమవంతమువలె వానరుల నేలువాఁడు. యుద్ధమందు వీఁపు చూపని బలశాలి. గుహలతోఁ జెట్లతో నిండి పర్వతదుర్గమైన గుహవంటి కిష్కింధ యందు వానర యూథపతులు మంత్రులు గొలువఁగా బ్రబలుచున్నవాఁడు. మనోహరమైన నూఱు కమలములచేత స్థిరమైన కాంతి గలిగి దేవతలకు మనుష్యులకు మనోహరమైన బంగారుసరమును ధరించినాఁడు.

క. దురమున వాలిని గూలిచి, ధరణీతనయాధవుండు ♦ తారాసతినిన్
దిరమగు కపిరాజ్యం బీ, సరియును సుగ్రీవునకు నొ♦సంగెం బ్రీతిన్. ౬౦౫

అర్థములు. దురమునన్ = యుద్ధమునందు, సరి = హారము.

తాత్పర్యము

యుద్ధమునందు వాలినిజంపి రామచంద్రమూర్తి తారను హారమును కపిరాజ్యమును సుగ్రీవునకు లభింపఁజేసెను. తారయు హారము రామచంద్రమూర్తి యియ్యకున్నను వాలిని చంపుటచే నవి లభించుటచే రామచంద్రమూర్తి యిచ్చినట్టులే.

—♦ శుకుఁడు వానర సేనాసంఖ్యను రావణునకుఁ దెలుపుట ♦—

సీ. కోటియా లక్షను♦నూటిచే గుణియింపఁ, గ్రాలుఁ దల్లక్ష శం♦ఖంబు పేర
నది లక్షయైన మ♦హాశంఖ మనఁబడు, నది లక్షయైన బృం♦దాఖ్యఁబరఁగు
నది లక్షయైన మ♦హాబృంద మందురు, తల్లక్ష యగును బ♦ద్మంబు దేవ!
యది లక్షయైన మ♦హాపద్మమై చెల్లు, నది లక్షయైన ఖ♦ర్వాభిధాన
ఆ. మదియు లక్షయేన్ మ♦హాఖర్వమగుఁ దత్స, హస్ర మగు సముద్ర♦మదియు లక్ష
యైన నోఘనుందు♦రది లక్షయు మహౌఘ, మంచు గణితవేత్త♦లందు రధిప!

అర్థములు. రాక్షసరాజా! యిఁక సంఖ్యాలక్షణము. వానరసేనా సంఖ్య చెప్పెద వినుము. నూఱులక్ష లొక కోటి, లక్షకోటు లొక శంఖము, లక్షశంఖములు మహాశంఖము, లక్ష మహాశంఖములు బృందము, లక్షబృందములు మహాబృందము, లక్ష మహాబృందములు పద్మము, లక్షపద్మములు మహాపద్మము, లక్ష మహాపద్మములు ఖర్వము, లక్ష ఖర్వములు మహాఖర్వము, వేయి మహాఖర్వములు సముద్రము, లక్ష సముద్రములు ఓఘము, లక్ష ఓఘములు మహౌఘము అని గణితశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

సీ. ఈ యున్న వానర♦బృందంబు గణియించి, వివరింతు వినవయ్య♦ వేయికోట్లు
శంఖశతము మహా♦శంఖసహస్రంబు, బృందశతము మహా♦బృంద మొకట
వేపద్మశతమును ♦ వేమహాపద్మము, ఖర్వసముద్రము♦ల్శతము శతము
శతమహౌఘంబులు♦శతసహస్రశతము, సౌఘముల్ గలిగి మ♦హాబ్ధియట్లు

తే. పెంపుగను వాహినియును వి•భీషణుండు, సచివయుక్తంబుగాఁ దన్ను•నుచితరీ
బలసియుండంగనీతోడ•భండనమున, కెమరుమాఁచుచునున్న వాఁ•డినసుతుండు.

తాత్పర్యము

ఈ గణితము ప్రకారము వానరసేన సంఖ్య చెప్పెద వినుము. వేయికోట్లు, నూఱుశంఖములు, వేయిమహాశంఖములు, నూఱుబృందములు, ఒక మహాబృందము, వేయినూర్ల పద్మములు, వేయి మహాపద్మములు, నూఱు ఖర్వములు, నూఱు సముద్రములు, నూఱు మహౌఘములు, పదివేల మహౌఘములు గలిగి పెద్ద సముద్రమువలె గొప్పదగు సేన విభీషణుఁడు మంత్రులతోఁ దన్నుఁ దగిన విధముగ చుట్టుకొనియుండ సుగ్రీవుఁడు నీతో యుద్ధము చేయనున్నాడు.

ఇందు వానరసేన సంఖ్య యొక్క మొత్తముగాఁ జెప్పఁ బడలేదు. సేనాపతుల విభాగమును బట్టి యాయా సేనానాయకుల క్రిందఁ బనిసేయు వారి సంఖ్య యని తెలియవలయును.

చ. అలఁతులఁ బోఁడు దేవ ! మ•హాబలవంతుఁడు వీర్యవిక్రమా
స్ఖలితుఁడు ప్రజ్వలద్గ్రహస•కాశచమూసమేతుఁ, డాతనిన్
బలమును జాఁగ జూచి యటు • పై నెటు లోటమి రాక యుండునో
గెలుతునొ శత్రువర్గమును • గేరి ప్రయత్నము సేయు మవ్విధిన్. ౬౦౮

అర్థములు. అలఁతులఁబోఁడు=అల్ప ప్రయత్నముతో సుగ్రీవుఁ డూరక పోవువాఁడు గాఁడు. ప్రజ్వలత్=జ్వలించుచున్న, గ్రహనికాశ=గ్రహములతో సమానమైన చమూసమేతుఁడు = సేనతోఁ గూడినవాఁడు, ఓటమి = పరాజయము.

తాత్పర్యము

దేవరా! సుగ్రీవుఁడు నీవల్ప ప్రయత్నము చేసితివేని యూరక పోవువాఁడుకాఁడు. మిగుల బలశాలి. వీర్యము విక్రమము సమృద్ధిగాఁ గలవాఁడు. ప్రకాశించు గ్రహములతో సమానమైన సేనతోఁ గూడినవాఁడు. అతనిని, సేనను చక్కఁగాఁ జూచి యెటు చేసిన నోడిపోకుందువో శత్రుసమూహమును గెలుతువో అట్టి ప్రయత్నమును జేయుము.

—• ౨౯-వ సర్గము. రావణుఁడు శుకసారణుల నిందించుట •—

చ. శుకుఁ డిటు లాడఁగాఁ బ్లవగ • శూరసమూహము రామభూమిభృ
న్నికటగతున్ నిజానుజని • నిస్తులవీర్యుని రామదక్షిణ
ప్రకటభుజున్ సుమిత్రసుతు • బంధురవిక్రము సర్వకీశనా
యకుఁ గని గుండె ఝల్లన నొ•కింత దశాస్యుఁడు క్రోధచిత్తుఁడై. ౬౦౯

తాత్పర్యము

శుకుఁ డీ ప్రకారము చెప్పఁగా వానర శూరుల సమూహమును రామచంద్ర

మూర్తి సమీపమున నున్న తన తమ్ముని విభీషణుని ననమానవీర్యము గలిగి రామునకుఁ గుడిభుజమైన లక్ష్మణుని, విశేష విక్రమము గల సర్వవానర ప్రభు వగు సుగ్రీవునిఁ జూచి భయముచే గొంచెము గుండె ఝల్లుమనఁగా, నది తెలియ కుండునట్లు వెంటనే కోపము దెచ్చుకొనినవాఁడై.

క. వెలవెల నై నమ్రతరా, స్యులు నై నిలుచున్నవారి ♦ శుకసారణులన్
దిలకించి రోషగద్గద, కలితకఠోరోక్తి ననియెఁ ♦ గడిమి దలిర్పన్. ౬౧౦

అర్థములు. నమ్రతరాస్యులు=మిగుల వంచుకొనఁబడిన ముఖములు గల వారు, రోష = కోపముచే, గద్గదకలిత = డగ్గుత్తికతోఁ గూడిన, కఠోరోక్తి= పరుష వాక్యము, కడిమి=బలము, తలిర్పన్=చిగిరింపఁగా.

తాత్పర్యము

వీనికిఁ గోపమువచ్చెనే యేమిచేయునో యని భయముచేఁ దెల్లపోయి తలలు వంచుకొని నిలుచున్న శుకసారణులఁజూచి రోషముచే మాట తడఁబడుచుండఁ బరుషముగాఁ దన బల మభివృద్ధి తెలియ నిట్లనెను.

ఉ. నేరిమి ప్రగ్రహంబును వి♦నిగ్రహముం గలరాజు తోడనే
వారక వానిసొమ్ముఁ దిను♦వారలు విప్రియము ల్వచింపఁగాఁ
దీ రగు నొక్కొ? మీ తెలివి♦తేటలు నీ అయి యేల పోయెనో?
మీ రటె నాకు ధీ గఱపు♦మేటులు? చెల్లునె యిట్లు లాడఁగన్? ౬౧౧

అర్థములు. నేరిమి=నేర్పు, ప్రగ్రహము = అనుగ్రహము, వినిగ్రహము= తిరస్కారము, విప్రియములు=అప్రియములు, తీరగునొక్కొ = తగునా? నీఱు = భస్మము, ధీ=బుద్ధి, కఱపు=నేర్పు, మేటులు=గొప్పవారు.

తాత్పర్యము

నేర్పుగలట్టియు మేలుచేయుటకుఁ గీడుచేయుటకు శక్తిగలట్టియు రాజుముఖము నెదుటనే వాని సొమ్ముదిని జీవించువారే ప్రియముగాని మాటలు చెప్పవచ్చునా? ఏల మీ తెలివితేటలు బూడిదయైపోయెను, మీరా నాకు బుద్ధిచెప్పు పెద్దలు? మీరు మీ యోగ్యత నాలోచింపక యిట్లు చెప్పఁదగునా?

క. ప్రతికూలురు యుద్ధార్థా, గతు లగు శాత్రవులు దఱిసి ♦ కడిమిఁ బయిపడన్
హితులవలె వారిఁ బొగడెద, రితవే మీ కిదియు? సమయ♦మెఱుఁగఁగ వలదే!

అర్థములు. యుద్ధార్థాగతులు=యుద్ధము సేయఁగోరి వచ్చినవారు, శాత్రవులు = విరోధులు, దఱిసి = సమీపించి, కడిమిన్ = బలముచే, హితులవలెన్= వారి స్నేహితులవలె, ఇతవే=హితమా?

తాత్పర్యము

ఎదుటి పక్షమువారు యుద్ధమునకై వచ్చినవారునగు విరోధులు, బలవంతులై పైబడి రాఁగా, యుద్ధము చేయవలసిన సమయమందు వారి స్నేహితులవలె మీరు

వారిని బోగడెదరు. ఇది మీకుఁ దగిన కార్యమా? ఇది హితము చెప్పుసమయమా? ఎప్పుడు హితము చెప్పవలయునో యప్పుడేల చెప్పలేదు? మిమ్ము నందఱ నడిగితిని గదా! అప్పుడు మీరందఱు యోధులవలెఁ బౌరుషములు పలికి నన్ను యుద్ధము నకు దించి యిప్పు డీ నీతులు వచించెదరా?

ఉ. ఆర్యగుణైకభూషణుల ♦ నాదటమై గురువృద్ధులన్ మహా
చార్యుల సేవఁ దన్పితిరి ♦ శ్రద్ధను భక్తిని, దానఁ గల్గ దే
కార్యము, నిష్ప్రయోజనము ♦ గాఁ జనియెం జదువెల్ల, భూమిభృ
ద్వర్యులఁ గొల్చు పద్ధతుల ♦ తత్త్వము మీర లెఱుంగఁజాలమిన్. ౭౧౩

అర్థములు. ఆర్య గుణైక భూషణులన్=గొప్పగుణమే యలంకారముగాఁ గలవారిని, ఆదటమైన్=ప్రేమతో, గురువృద్ధులన్=జ్ఞానవృద్ధులను, వయోవృద్ధులను, మహాచార్యుల=గొప్ప యాచార్యుల. తన్పితిరి=తృప్తిబొందించితిరి. భూమిభృద్వరులన్=రాజశ్రేష్ఠులను, తత్త్వము=రహస్యము.

తాత్పర్యము

మీరు గొప్పగుణము భూషణముగాఁగల జ్ఞానవృద్ధులను వయోవృద్ధులను మహాచార్యులను ప్రేమతో శ్రద్ధాభక్తులతో సేవచేతఁ దృప్తి పొందించితిరి. ఫలము లేదయ్యెను. మీరు చదివిన చదువులెల్ల వ్యర్థమైపోయెను. ఏలన గొప్ప రాజుల నేవిధముగాఁ గొలువవలయునో యారహస్యము మీర లెఱిఁగినవారుకారు.

క. తెలిసికొని యుంటి రేనియు, ఫల మేమియుఁ గలుగ దనుభ♦వమునకు రామిన్
బలితపు శాస్త్రజ్ఞానము, బఱువొక్కటె మోసి తిరుగు♦వారలు మీరల్. ౭౧౪

తాత్పర్యము

ఒకవేళ మీకు మనస్సునఁ దెలిసియున్నను నది యనుభవమునకు రామిచే నిష్ఫలము. అనుభవమున నుపయోగపడని బలిష్ఠమైన శాస్త్రజ్ఞాన మను బరువు మోసికొని మీరు తిరుగుచున్నారు.

క. మీయట్టి మంత్రులను వైధేయులఁ గట్టుకొని నేను ♦ దేవుని కృపచేఁ
జేయుచు రాజ్యము దేహం, బే యనువుననో ధరించి♦యిటులున్నాఁడన్. ౭౧౫

అర్థములు. వైధేయులను=మూఢులను.

తాత్పర్యము

మమ్ము మూఢుల మంటివే యిట్టి మంత్రులఁ గట్టుకొని యిన్ని దినా లెట్లు రాజ్యము చేసితి వందురా? మీయట్టి బుద్ధిమాలిన మంత్రులను గట్టుకొని దేవుని కృపచే రాజ్యము చేయుచున్నాను. దేహమును గాపాడుకొనుచున్నాను గాని మీ యాలోచనబలము మీ దేహబలముచేత గాదు.

తే. ఎఱుఁగరా మీరు నా నాల్క♦యే శుభంబు
నశుభమును మీకుఁ గూర్ప స♦మర్థ మనుచు?

నిట్లు పరుషంబు నన్నాడ ♦ నెత్తికొనుట
కేమిరా మృత్యుభయము లే ♦ దేర మదుల? ౬౧౬

తాత్పర్యము

ఓరీ! మీకు మేలు కీడు కలిగించునది నానాలుకయని యెఱుఁగరా? నాలుక నుండి మాట వెలువడిన మీ రేమైపోదురో ఆ భయములేక నన్ను మీరు కఠినముగా మాటలాడుటకు మీకు చావు భయములేదా యేమి?

ఆ. కారుచిచ్చు దవిలి ♦ కాననంబున నుండు, వృక్షచయము నిలిచి♦వెలయుఁగాక
ప్రభువుకోపమునకుఁ ♦ బాత్రుఁడౌ నపరాధి, తనువు నిలుప లేఁడు ♦ ధరణిమీఁద.

తాత్పర్యము

అడవిలో కారుచిచ్చునకుఁ దప్పి కాలక చెట్టు నిలిచిన నిలిచునేమో కాని రాజునకుఁ గోపమువచ్చునట్లు చేసిన యపరాధి బ్రదుకఁ జాలఁడు.

ఉ. పాపుల శత్రుపక్షమున ♦ వారిఁ బ్రశంస యొనర్చు మిమ్ము నా
కోపమహాశుశుక్షణికిఁ ♦ గూర్పనె యాహుతిఁగాఁగ, జిత్తమున్
మీ పొనరించి యున్న తొలి♦మేళ్లు నెఱింగి మృదుత్వ మందదేన్;
గాపథవర్తు లీరలు పొ♦కాలుఁడు ఛీ నిలకుండు దాపునన్. ౬౧౮

అర్థములు. ఆశుశుక్షణికిన్=అగ్నికి, పొనరించి = చేసి, కాపథవర్తులు = కుత్సితమార్గమందు వర్తించువారు, పొకాలుఁడు=ఛీ పొండు.

తాత్పర్యము

పగవారిపక్షమువారిని బొగడు పాపులను మిమ్ము నా కోప మను మహాగ్నికి నాహుతిగా నీయకుందునా? మీ రిదివఱకుఁ జేసిన మేళ్ళ నాలోచించి కృతజ్ఞుఁడనై మనస్సు మెత్తనిదగుటచే సహించితిని. మీరు కుత్సితమార్గమునఁ దిరుగువారు. ఛీ పొండావల! నా యెదుట నిలువకుఁడు.

క. మీమేలు దలఁచి మిమ్మున్, నే మృతిఁ గూర్పంగ నేర ♦ నెఱి చెడి మీరున్
నామేలు మఱచి యున్న, ప్రేమకు దూరస్థు లగుటఁ ♦ బ్రదెళ్ళినవారల్. ౬౧౯

తాత్పర్యము

ఇదివఱకు మీరు చేసిన మేలు దలఁచి మిమ్ము నేను జంపఁజాలకున్నాను. నీతిమాలి నేను జేసిన మేలు మఱచి నా ప్రేమకు దూరమైతిరి గావున మీరు చచ్చినవారే. ఆ శిక్ష మీకుఁ జాలును.

క. అని యిట్లు పంక్తికంధరుఁ, డన లజ్జానతశిరస్కు♦లయి యా మంత్రుల్
వినయంబున జయజయ ని, స్వనముల నుతియించి చనిరి♦సభ నుండి వెసన్.

అర్థములు. లజ్జానత శిరస్కులు = సిగ్గుచే వంచుకొనఁబడిన తలలు గలవారు.

తాత్పర్యము

ఈ ప్రకారము రావణుఁడు చెప్పగా సిగ్గుచేఁ దలలు వంచుకొని యా మంత్రులు వినయంబున జయ జయ ధ్వనులు చేయుచు సభనుండి వెడలిపోయిరి.

—♦ రావణుఁడు శార్దూలాదులను శ్రీరామునిచర్య కనుగొని రాఁ బంచుట ♦—

ఉ. అంతట రావణుండు నిక♦టావనివర్తి మహోదరాఖ్యుతో
నెంతటి నీతివేదుల న♦హీనచరిత్రుల వేగువాండ్ర న
త్యంతజవంబునం బిలువ ♦ నంపు మటన్నను నాఁడు శేముషీ
మంతుల వేగువాండ్ర సుర ♦ మర్దను ముంగల నిల్ప వారలున్. ఉ ౨౧

అర్థములు. నికటావనివర్తి=సమీప ప్రదేశమం దుండువాఁడు. ఎంతటి నీతివేదులన్=చక్కఁగా నీతిశాస్త్రము మెఱింగిన వారిని, అహీనచరిత్రులన్=గొప్ప గుణములు గలవారిని, ఇట్లు చెప్పుటచేత శుకసారణుల నంటివారు గాక దనకు విరోధముగఁ జెప్పెడివారు గానివారుగా నుండవలెనని సూచన, శేముషీమంతులన్=బుద్ధిమంతులను.

తాత్పర్యము

వారు వెడలిపోయినపిమ్మట సమీపమందున్న మహోదరుఁ బిలిచి రాజుల యెద్ద నేది యెట్లు చెప్పవలయునో తెలిసినవారిని గొప్ప గుణము గలవారిని మిగుల శీఘ్రముగ వేగులవాండ్రను బిలిపింపుమనిన, వాఁడును బుద్ధిమంతులగు వేగులవాండ్రను రావణు నెదుట నిల్పఁగా వారును.

క. జయశబ్దము పూర్వముగ నవి, నయముగఁ గేల్మోడ్చి నిలిచి♦నన్ వారల ని
ర్భయులన్ భక్తుల శూరుల, నయవేదులఁ గాంచి రావ♦ణప్రభు వనియెన్.

అర్థములు. నిర్భయులన్=శత్రువులకు భయపడనివారిని, నయవేదులన్= నీతి నెఱిఁగినవారిని.

తాత్పర్యము

జయ జయ యనుచు నణకువతోఁ జేతులు జోడించి నిలువఁగా శత్రువులకు భయపడనివారిని తనయందు భక్తిగలవారిని శూరులను నీతిశాస్త్రము మెఱింగిన వారిని జూచి రావణుఁ డిట్లనెను.

ఉ. పొం డిట నుండి చక్క రఘు♦పుంగవు పాళెము డిగ్గుచోటి కా
తం డొనరించుయత్నము వి♦ధంబును శోధన చేసి యంత నా
తం డెద నచ్చువారి చరి♦తంబును నాతనిమీఁదఁ బ్రీతిమై
నుండెడి మంత్రివర్యుల స♦ముద్యమమును గని రండు లెస్సగన్. ఉ ౨౩

అర్థములు. పాళెము డిగ్గుచోటికి=రాముని దండు విడిసిన చోటికి, నచ్చువారి=నమ్మినవారి, సముద్యమమున్=ప్రయత్నము.

తాత్పర్యము

మీరిచ్చటనుండి చక్కఁగా రాముని సేన దిగినచోటికిఁ బోవలసినది. రాముఁడేమి యుద్ధప్రయత్నము చేయుచున్నాఁడో శోధించి తెలిసికొని యా పిమ్మట నాతనికి నమ్మకమైనవా రెవ్వరు? వారి నడవడి యెట్టిది? అతనియందుఁ బ్రీతిగల మంత్రు లెవ్వరు? వా రే ప్రయత్నము నందున్నారు. ఇవి చక్కఁగాఁ జూచి తెలిసికొని రండు.

తే. ఎవరుతోడుగ నేవేళ ♦ నెట్లు నిద్ర
గొనును రాఘవుఁ డొంటిమైఁ ♦ గూరుకఁ గొనునొ
యెపుడు మేల్కొను మఱి యెపు ♦ డేమి సేయుఁ
దెలిసి సర్వంబుఁ జక్క రా♦వలయు మీరు. ౬-౨౪

తాత్పర్యము

రాముఁ డెప్పుడు నిద్రించును? అప్పుడెవరు తోడుందురు? లేక యతఁ డొంటిగనే నిద్రించునా? ఎపుడు మేలుకొనును? మఱియు నెప్పు డేయే కార్యములు సేయును. ఇవన్నియుఁ జక్కఁగాఁ దెలిసికొని రావలయును. (సమయము కనిపెట్టి చంపుటకై యీ విచారము.)

క. వైరుల తెఱంగు మతిమ,చ్చారులచే నెఱిఁగి ఱేఁడు♦శాత్రవగణమున్
బోర లఘుయత్నమున ధి,క్కారించి జయించు ననిరఁ♦గడుకొని వారల్. ౬-౨౫

అర్థములు. మతిమత్+చారులచే = బుద్ధిమంతు లగు వేగులచే, లఘుయత్నమున = విశేష శ్రమములేక.

తాత్పర్యము

బుద్ధిమంతులగు వేగులవారిచే విరోధుల ప్రవర్తనము దెలిసికొని రాజగువాఁడు శత్రువుల సమూహమును యుద్ధమందు విశేషప్రయాసములేక తిరస్కరించి జయించును అని చెప్పఁగా వారు పనిబూని.

సీ. వల్లెయటంచును ♦ వలగొని మ్రొక్కి శా,ర్దూలుండు మున్నుగాఁ ♦ దూర్ణమరిగి
ప్రచ్ఛన్న వేషులై ♦ రామసౌమిత్రులు, విహరించు చున్న సు♦వేల మరిగి
వానరరాక్షస♦వల్లభ సహితులౌ, దాశరథుల వారి♦ధ్వజినిఁ జూచి
వెల్లబోవుదును వి♦భీషణుం డెఱిఁగి య,థార్థవర్ణు లటంచు ♦ నగచరాళి
తే. కొయ్య నెఱిఁగించి శార్దూలుఁ డొక్కరుండె
పాపి యని పట్టి యన్యులఁ ♦ బాఱఁదోలెఁ
జెట్టు ద్రిమ్మరులును వానిఁ ♦ బట్టి కొట్టి
పిండి యిడి రెంతయును వాని♦గం డడంగ. ౬-౨౬

అర్థములు. వల్లె=అట్టులే తెలిసికొని వచ్చెదమని, వలగొని = ప్రదక్షిణించి, తూర్ణము = త్వరగా, ధ్వజిని = సేన, తెల్లఁబోవుదును = తెల్లఁబోవఁగా,

యథార్థ్మవర్ణులు=వేగువాండ్రు, చెట్టు ద్రిమ్మరులును=క్రోఁతులు, పింజియిడిరి= పిండిగొట్టినట్లు కొట్టిరి. గండు=గర్వము.

తాత్పర్యము

ఆ వేగువాండ్రును అట్టులే తెలిసికొని వచ్చెదమని చెప్పి ప్రదక్షిణము చేసి నమస్కరించి శార్దూలుని ముందుగా నుంచుకొని శీఘ్రముగాఁబోయి మాఱువేషములు వేసికొని రామలక్ష్మణులు సంచరించు సముద్రతీరముఁజేరి సుగ్రీవ విభీషణులతోఁ గూడిన రామలక్ష్మణులను వారి సేనను జూచి భయపడి వెళ్లఁబోఁగా విభీషణుఁడు తెలిసికొని వీరు వేగులు, వీరిలో శార్దూలుఁడే దోషి, తక్కిన వారాతనివెంట నూరక వచ్చినవారే యని చెప్పి శార్దూలుని దప్పఁదక్కిన వారిని గొట్టి పాఱఁద్రోలిరి. శార్దూలుని బట్టుకొని పిండి దంచినట్లు దంచిరి.

క. వాని విలాపము సీతా, జాని విని కృపాళుఁ డగుచుఁ జరవర్గముతో
వాని విడిపింప వాఁడును, వానరఘాతముల గుండె ♦ వకవక లగుడున్. ౬ ౧౭

అర్థములు. సీతాజాని = సీత యెవనికి జాయయో యతఁడు. సీతాజాని = రామచంద్రమూర్తి, కృపాళుఁడు = దయ గలవాఁడు, చరవర్గముతో = వేగువాండ్ర సమూహముతో, వానరఘాతములన్=క్రోఁతులు కొట్టిన దెబ్బలచే, వకవకలు=బ్రద్దలు.

తాత్పర్యము

వాని యేడుపుధ్వని రామచంద్రమూర్తి విని దయగలవాఁడై వేగులుగా వచ్చినవారితో శార్దూలుని విడువవలసిన దని చెప్పఁగా వాఁడును వానరులు కొట్టిన దెబ్బలచే గుండె బ్రద్దలుకాఁగా.

-♦ 30-వ సర్గము. రావణునకు శార్దూలుఁడు కపులచేఁ దానుబడినపాటు దెలుపుట. ♦-

క. ఎగయూరుపుతో వేలుపుఁ, బగ నాయఁగఁ జని సువేల ♦ పర్వతమున నా
జగదీశుఁడు విడిసినవాఁ, డగచర సైన్యంబుతోడ ♦ నని పచియింపన్. ౬ ౧౦

అర్థములు. వేలుపుఁబగ = దేవవిరోధి.

తాత్పర్యము

ప్రాణము పోవువానివలె నెగయూపిరి విడుచుచు రావణు నొద్దకుఁబోయి జగదీశ్వరుఁడు రాముఁడు సువేలయందు వానరసేనా సమేతుఁడై విడిసియున్నాఁడని చెప్పఁగా.

సీ. రావణుండును మది ♦ రాముండు కడుదాపు, దఱిసె నంచు నొకింత ♦ తత్తఱిల్లి
యపసర్పవరునితో ♦ ననియె శార్దూల! నీ, తనుకాంతి పూర్వవి ♦ ధంబు గాదు
కందువాఱితి వేల? ♦ కడుస్రుక్కినాఁడవు, కనలుదాయులకు లోఁ ♦ గావు గాదె?
యనుచుఁ బ్రశ్నింప భ ♦ యాకుల చిత్తుఁడై, యల్లనల్లన నిట్టు ♦ లనియె వాఁడు

ఆ. దేవ! వేగు దీయ • దెప్పరపుం బని, క్రోతులందు వా ర • కుంతబలులు
నమితవిక్రమాఢ్యు•లది గాక రామర, క్షితులు సుమ్ము వారిఁ • జేర రాదు.

అర్థములు. తటిసెన్=సమీపించెను. తత్తఱిల్లి = సంభ్రమించి, చలించి అపసర్పవరునితోన్ = చారశ్రేష్ఠునితో, కనలుదాయలకున్ = కోపముగల పగ వారికి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి కేవలము సమీపమునకు వచ్చినాఁడన్న వార్తవిని రావణుఁడు మనస్సునఁ గొంచెము తత్తఱపడి వేగులవాండ్రలో శ్రేష్ఠుఁడగు వానితో నిట్లనియె. శార్దూలా ? నీ దేహకాంతి యిచ్చటినుండి పోవునపు డెట్లుండెనో యిప్పుడట్లు లేదు. వాడిపోయియున్నది. చాల బడలితివేల ? కోపులగు పగవారికిఁ జిక్కలేదుగదా! యని యడుగఁగా చెప్పిననేమో చెప్పకున్ననేమో యని భయపడుచు మెల్ల మెల్లగా వాఁడిట్లనెను. దేవా! వానరులలో వేగుదీయుట చాల నపాయకరమైన కార్యము. వారు మిక్కిలి బలపరాక్రమ సంపన్నులు. అదిగాక రామరక్షితులు. వారిని సమీపింపనైన సాధ్యపడదు.

ఉ. కిమ్మని యాడరా దచటఁ • గీశుల నేమని ప్రశ్నసేయ ? మా
ర్గమ్ముల నెల్లఁ బర్వతని • కాశులు క్రోఁతులు కాచు చున్నవా
రిమ్ముగ నేను జొచ్చితినొ • యించుక లేదొ తటాన నన్ను రే
ద్రిమ్మరు లుక్కడంపు బిగిఁ • దెప్పునఁ బట్టిరి కొట్టి రుగ్రులై. ఉ౩౦

అర్థములు. కిమ్ = ఏమి, అని-కిమ్మని - అనుకరణంబునం దుదిహల్లునకు ద్విర్వచనం బగు-సు-వ్యా - సూ - ౮౫ సంధి. పర్వతనికాశులు = కొండలవంటి వారు, రేద్రిమ్మరులు = రాక్షసులు = విభీషణుని మంత్రులు, ఉక్కడంపు బిగి= అధికమైన బిగువుతో-గట్టిపట్టు - ఉత్కట శబ్దభవము ఉక్కడము- తెప్పునన్ = శీఘ్రముగ.

తాత్పర్యము

వానరులయొద్ద నితరులు శబ్దమే చేయరాదు. ఏమి యనరాదు, ఇఁక యేమని ప్రశ్నింప సాధ్యపడును ? అన్ని మార్గములందుఁ గొండంత క్రోఁతులు కావలియున్నారు. లోపలికి పోపుటకే మార్గము లేదు. అట్టులే యేదో యుపాయము చేసి లోపల గొంచెము దూరము పోయితినో లేదో వెంటనే విభీషణు మంత్రులు వచ్చి నన్నుఁ గట్టిగఁ బట్టుకొనిరి. ఆ కారణముచే విడిపించుకొని రాఁజాలనైతిని. మిగులఁ గోపించి కొట్టిరి.

ఉ. దంచిరి, నన్నుఁ బాదములఁ • దద్దయుఁ జేతుల వ్రేళ్లగోళ్ళ నొ
ప్పించిరి, ముష్టిఘాతములఁ • బిండిగఁ గొట్టిరి, దంతపంక్తిచే

నుంచిరి మేనఁగాళ్లుదిల♦నుక్కిఱి బిక్కిఱి నై తపింప మ
ర్దించిరి, నాల్గువంకలను ♦ ద్రిప్పిరి దెప్పిరి ఱొప్పి రాకపుల్. ౬౩౧

అర్థములు. ఉక్కిఱిబిక్కిఱి=ఊపిరితిరుగక, ఉదిలన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

ఊరక చెంపలు వాయించుటకాదు. కాళ్ళక్రింద వైచికొనిరి. రోఁకండ్లతో ధాన్యము దంచినట్లు పాదములతో నలియదంచిరి. చేతులచే వ్రేళ్ళ గోళ్ళ నొప్పి కలుగఁజేసిరి. పిడికిలి గ్రుద్దులఁ బిండిగఁ గొట్టిరి. నోటి పండ్లచేఁ గొఱికిఁ గాట్లు పడఁజేసిరి. దుఃఖముచే నూపిరాడక తపించునట్లు దబాగుబా మర్దించిరి. అంతతో విడువక యిట్లు కొట్టుచు సేనయందు నాల్గు ప్రక్కల వానరులారా! వీఁడు దొంగ చారుఁడు, చూడుఁ డని చెప్పుచుఁ ద్రిప్పిరి. నీ వంటరా వేగుదీయు వాఁడ వని కొందఱు నిందించిరి. కొందఱు హుంకరించిరి.

ఆ. త్రిప్పిత్రిప్పి నన్నుఁ♦దెచ్చిరి శ్రీరాము, కడకు నేను నెత్రు♦కాల్వవాఱు
మేనితోడ నడలు♦మానసంబున రాము, నంఘ్రియుగళిఁ గావు♦మనుచుఁ బడితి.

తాత్పర్యము

ఇట్లు త్రిప్పి త్రిప్పి కడపట నన్ను శ్రీరామునొద్దకుఁ దెచ్చిరి. పట్టుకొనఁగానే యాయనయొద్దకుఁ దీసికొనిపోయిన యెడల రామచంద్రుఁడు దయాళువు గావున నన్ను విడిపించునని వానరు లెఱుఁగుదురు. ఆ కారణమున వారు కడపట నాయనయొద్దకుఁ దెచ్చిరి. నేను నెత్తురు వఱదలై పాఱు దేహముతో దుఃఖపడు మనస్సుతో రక్షింపుమని రామచంద్రమూర్తి పాదములపైఁ బడితిని.

క. సీతాపతిచేతఁ బరి, త్రాతుఁడనై యెట్లొ బ్రతుకు♦దలఁ గంటిఁ; గపి
వ్రాతముచే శైలశిలా, జాతము నిండించి కడలి♦జననాయకుఁడున్. ౬౩౩

అర్థములు. సీతాపతిచేతన్=నీ వేమెను జెఱనుంచి బాధపఱుచుచున్నావో యా సీతాదేవి భర్తచేత; పరిత్రాతుఁడనై=బాగుగఁ గాపాడఁబడినవాఁడనై యతి కష్టముమీఁదఁ బ్రాణముతో నుండఁగలిగితిని. నా గతి యట్లుండ నీ రామచంద్రుఁడు చేయుచున్న కార్యము చెప్పెద వినుము. వానరులచేఁ దెప్పించి సముద్రమంతయు ఱాలచే వృక్షములచే నిండించియున్నాఁడు. (ఇందఱకుఁ గావలసిన ఱాలు మొదలైన వెచ్చటనుండియో యీ సమయమునకు వచ్చె నను సందేహముల నిది పరిష్కరించుచున్నది.)

క. గరుడవ్యూహంబున నగ, చరవర్గము తన్నుఁ గొలువఁ♦జాపాయుధుఁడై
ధరణీపతి మన లంకా, పురిగవని న్నిలిచెఁ జుమ్ముఁ♦పురుహూతారీ! ౬౩౪

తాత్పర్యము

గరుడాకారముగఁ దీర్పఁబడిన వానరసేనలు తన్నుఁ గొలువఁగా వింటిని

నాయుధముగాఁ గలవాఁడై రామచంద్రుఁడు మన లంకాపురి గవనివాకిటనే నిలిచి యున్నాఁడు.

‘దండవ్యూహేన తన్మార్గం యాయాత్తు శకటేన వా వరాహమకరాభ్యాం వా సూచ్యా వా గరుడేన వా.’ శత్రువులమీఁదికి దండయాత్ర పోవువాఁడు దండవ్యూహముగాఁగాని, శకట వ్యూహముగాఁగాని, వరాహ వ్యూహముగాఁగాని, మకర వ్యూహముగాఁగాని, సూచీ వ్యూహముగాఁగాని, గరుడ వ్యూహముగాఁగాని తనసేనలఁ బన్నవలయును.

(౧) దండవ్యూహము:— అనఁగా మొదట బలాధ్యక్షుఁడు, మధ్యను రాజు, వెనుక సేనాపతి, పార్శ్వములందు ఏనుగులు, వానిప్రక్కన గుఱ్ఱములు, వాని వెంబడి కాల్బలము—ఇవ్విధంబునఁ దీర్చిన నిడుపయి యంతట సమముగా నిలిపి యున్న వ్యూహము. తాముపోవు మార్గమందంతట భీతిగలిగినప్పుడీ దండవ్యూహముతో శత్రుపురముపైకిఁ బోవలయును.

(౨) శకటవ్యూహము:— అనఁగా ముందు సూదివలెనుండి వెనుక వెడల్పుగా సేనను నిలుపుట. వెనుకతట్టు భయముగలిగి నప్పుడు ఈ శకట వ్యూహముతోఁ బోవలయును.

(౩) వెనుక ముందు సన్ననై, నడుమ వెడల్పయి యుండు సేనానివేశము వరాహవ్యూహము.

(౪) మిక్కిలి విశాలమయిన నడిమిభాగము గలది గరుడ వ్యూహము. ఈ రెండు వ్యూహములతోను ప్రబలభయము గలిగినపుడు పోవలయును.

(౫) ముందును వెనుకను వెడల్పయి, నడుమ సన్నని సేనానివేశము గలది మకర వ్యూహము, ముందును వెనుకను భయము గలిగినపుడు మకర వ్యూహముతో ముట్టడింపవలయును.

(౬) చీమల బారువలె వరుసగా నుండవలసినచోట నెక్కువ శూరుల మొత్తము గలిగినది సూచీ వ్యూహము. ముందు భయముగలిగినపుడు దానితోఁ బోవలయును.

క. నను విడిచి లంకమీఁదం, దనదృష్టిని నిలిపెఁ గ్రోఁతి • తతి లగ్గలకున్
జను దేకమున్న యుద్ధమొ, జనకజ నిచ్చుటయొ యొకటి•సలుపు మటన్నన్.

తాత్పర్యము

నన్ను వదలిపెట్టి యీ వీటిని సాధించు టెట్లని యాలోచింపఁ దన దృష్టి లంకమీఁదఁ బఱపెను. క్రోఁతులు లగ్గ లెక్కననుటయందు సందేహము లేదు. వారట్లు చేయుటకు ముందే యుద్ధము చేసిన బాగా? సీత నిచ్చుట బాగా యను నది యాలోచించి తీర్మానించు కొనుము.

—♦ శార్దూలుఁడు రావణునకుఁ గపుల బలపరాక్రమములు దెలుపుట ♦—

సీ. ఆమాట లాలించి♦యసురాధిపతి యిట్లు, పలికె వానికి గొప్ప♦వాక్య మొండు
దేవగంధర్వులు ♦ దితిజదానవులును, నుకుఁనఁ దా రెల్ల♦నొక్కటగుచు
నెదిరించి వచ్చిన ♦ నెల్ల లోకములచే ముమ్మరంబుగఁ గీడు ♦ మూఁడె నేని
సీత నిచ్చుట లేదు ♦ సిద్ధాంత మియ్యది, యిది యుండనిమ్ము త♦ద్వృక్షచరుల

ఉ. బలములందుఁ దిరిగి ♦ వచ్చినాఁడవు గదా, శూరు లెచట నున్న♦వారు? వార
లెట్టివారు? కొలఁదు♦ లెంత మాత్రము? ప్రభావంబు లెట్టి వందు♦బలియు రెవరు?

అర్థములు. ఆలించి = విని, ఉకుఁనన్ = బలముచే, ముమ్మరంబుగన్ = అధికముగ.

తాత్పర్యము

శార్దూలుఁడు చెప్పిన యీమాటలు విని రావణుఁడు వానితో నిట్లనియె. ఓరీ! యుద్ధము చేయవలయునా? సంధి చేయవలయునా యను విచారము నాకు లేదు. ఆ విషయమై నీ వాలోచింప వలసినది లేదు. దేవ గంధర్వులు, దైత్యులు, దానవులు నందఱు నొక్కటిగాఁ జేరి యెదిరించి వచ్చినను, లోకము లన్నిటిచేఁ గీడు కలుగున ట్లున్నను సీతను మరల నీయను. ఇది సిద్ధాంతము. యుద్ధము చేయుటే నిశ్చయము. ఇది యటుండ నిమ్ము. నీవు దెబ్బలు తినినఁ దింటివి. ఆ విధముగ నైన వానరసేన నంతయుఁ జూచివచ్చితివిగదా! ఏ పార్శ్వమునందు శూరు లున్నారు. (ఏదిక్కుల బలవంతులు తక్కువగ నున్నారో యాప్రక్క తానుబోయి మైపడవచ్చునని రావణు నభిప్రాయము) ఆ శూరు లెట్టివారు? వారిశక్తి యెంత మాత్రము? వారి మహాత్త్వము లెట్టివి? వారిలో బలిష్ఠు లెవ్వరు?

క. ఎవ్వరిపుత్రులు తత్కపు, లెవ్వరిమనుమండ్రు? తెలుపు ♦ మెదిరిబలంబే
నివ్విధి లెక్కించి సకలం, బవ్వల మోహింతుఁ జేయ ♦ నర్హక్రియలన్. ౬౩౭

తాత్పర్యము

ఆ శూరు లెవ్వరి పుత్రులు? ఎవ్వరి మనుమలు? (ఈ పెద్దవారిలోఁ దనకుఁ బరిచితు లుండిరేని వారితోఁ జెప్పించి వీరిని వెనుకకుఁ బోవజేయుటకై యీ ప్రశ్న) విరోధుల సేన విధమంతయుఁ దెలిసికొని యేమేమి చేయవలయునో యదియంతయు నావలనఁ జేసెదను.

క. దురమును గోరెడివారికిఁ, బరుల బలాబలము తెలియఁగ ♦ వలయు న టన్నన్
సురవైరిఁ గాంచి యుత్తమ, చరుఁ డిట్లని చెప్పె శైల♦చరవిషయంబున్. ౬౩౮

అర్థములు. దురమును = యుద్ధమును, పరుల = శత్రువులయొక్క, బలాబలములు = బలమును-దుర్బలత్వము.

తాత్పర్యము

యుద్ధము చేయఁగోరినవారికి శత్రువు లే విషయమున నే ప్రదేశంబున బల

వంతులు? ఏ విషయమున నేవైపున బలహీనులు? ఇది తెలియవలయును. అని చెప్పఁగా వానరులవిషయము వేగువారలలో గొప్పవాఁడగు శార్దూలుడిట్లు చెప్పెను.

సీ. ఋక్షరజసుపట్టి • వృత్తాటరాజు సు,గ్రీవుం డాతని నని • గెలువరాదు
గద్గదుకొడుకు ఋ • క్షప్రభుఁ డాతఁడే, జాంబవదాఖ్య ప్ర • శస్తి గాంచె
ధర్మునిపుత్రుండు • ధర్మచిత్తుఁడు వీర్య,ధని సుషేణుండు దో • ర్దర్పయుతుఁడు
సౌమ్యుండు సోమసం • జాతుండు దధిముఖుం, డపరమృత్యువులుగ • నబ్జభవుఁడె
తే. వృక్షచరరూపమున ధర • సృష్టి చేసె, సుముఖదుర్ముఖు లనియెడి • శూరవరుల
వేగదర్శిని రాజేంద్ర! వీతిహోత్రు,సుతుఁడు నీలుఁడు సేనాని • శూరతముఁడు.

సుగ్రీవుఁడు ఋక్షరజసుని కొమరుఁడు, వానరరాజు, అతనిని యుద్ధమునందు గెలువ సాధ్యపడదు. జాంబవంతుడు గద్గదు కొడుకు. భల్లూకరాజు, (జాంబవంతుఁడు బ్రహ్మ యావులించినపుడు జనించెనని బాలకాండమున ౪౭౭ పద్యంబునఁ జెప్పఁబడెను. ఇచ్చట గద్గదు కొడుకని చెప్పబడెను. (౧) గద్గదుఁడు పెంచిన తండ్రియై యుండవచ్చును. యశోదానందనుఁ డన్నట్లు. (౨) బ్రహ్మ యావులించినపుడు వెడలిన శక్తి గద్గదు భార్యయందు నావేశించి జాంబవంతుఁడుగానైనఁ బుట్టి యుండవచ్చును.

సుషేణుఁడు వరుణుని కుమారుఁడు. (అప్పటికి సుషేణుఁడని బాలకాండమున ౪౭౧౪ పద్యంబునఁగలదు. కావున నిచట ధర్మశబ్దము వరుణపర్యాయము, లేదా యీ యిరువురు వేఱువేఱు వానరు లనికాని, శార్దూలుఁడు భయభ్రాంతుఁ డగుటచే దాఱుమాఱుగఁ జెప్పెననికాని గ్రహింపనగు.) ధర్మముతోఁగూడిన మనస్సుగలవాఁడు కావున ధర్మపక్షమందే యతఁడుండును గాని, మన పక్షమునకు రాఁడు. వీర్యమే ధనముగాఁగలవాఁడు, భుజబల గర్వముగలవాఁడు, దధిముఖుఁ డనువాఁడు చంద్రుని కొడుకు. సౌమ్యమైన స్వభావముగలవాఁడు, దుష్కార్యములకు రాఁడు. అపరమృత్యువులుగ=రెండవ మృత్యువులుగ-అని కాని మృత్యువు పుత్రులని కాని గ్రహింపనగు. అందఱకుఁ దండ్రుల పేరు చెప్పుటచే నిచ్చట నట్లుతే గ్రహింపనగు. వీతిహోత్రుని= అగ్నియొక్క, సేనాని=వానర సేనానాయకుఁడు. శూరతముఁడు=మిక్కిలి శూరుఁడు.

తాత్పర్యము

వానరులందు శూరులగు వారికిఁ దండ్రు లెవ్వరని యడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాఁడు. సుగ్రీవుఁడు ఋక్షరజసుని కొడుకు. వానర రాజు. యుద్ధమునందు వీనిని గెలువ సాధ్యపడదు. జాంబవంతుఁ డనువాఁడు గద్గదుని కొడుకు భల్లూకరాజు. వరుణుని కొడుకు, ధర్మచిత్తుఁడు, వీర్యమే ధనముగాఁ గలవాఁడు సుషేణుఁడు. దధిముఖుఁడు చంద్రుని కొడుకు. సాధువర్తనము కలవాఁడు. సుముఖుఁడు దుర్ముఖుఁడు వేగదర్శి యనువారు మృత్యుదేవత కొడుకులు. బ్రహ్మ

దేవుఁడే వీరిని వానరరూపమున సృష్టించెను. అగ్నిహోత్రుని కొడుకు వానరసేనా నాయకుఁడు, మిక్కిలి శూరుఁడు నీలుఁడు.

క. నీకొడుకు లోనుగాఁగల, నాకారులఁ బిల్కుమార్చె • ససహాయుండై
యేకపి యాతనిజనకుఁడు, పాకారిగురూద్భవుండు • ప్రబలుఁడు పోరన్. ౭౮౦

తాత్పర్యము

నీ కొడుకు కక్షుఁడు మొదలుగాఁగల రాక్షసుల ససహాయుఁడై యెవఁడు చంపెనో యా హనుమంతుని తండ్రి కేసరి. కేసరి పేరు చెప్పఁబడకున్నను గమ కత్వముచే గ్రహింపవలెను. అతఁడు ఇంద్రుని గురువగు బృహస్పతి కుమారుఁడు. యుద్ధమునందుఁ బ్రబలుఁడు.

క. అనిలునితనయుఁడు హనుమఁడు, ఘనవిక్రముఁ; డుక్కలుండు • గట్టులపగకున్
మనుమఁడు యౌవనవంతుఁడు, చను నంగదుఁ డనెడిపేర • శక్రారాతీ! ౭౮౧

అర్థములు. ఉక్కలుఁడు = ధురంధరుఁడు, గట్టులపగకున్ = ఇంద్రునకు, యౌవనవంతుఁడు = ప్రాయము వాఁడు.

తాత్పర్యము

నీకుఁ దెలిసిన హనుమంతుఁడు వాయువు కుమారుఁడు. మిగులఁ బరాక్రమము గలవాఁడు. ఎంతకార్యమైన సాధింపఁగలవాఁడు. ప్రాయమునం దుండు నంగదుఁడు ఇంద్రుని మనుమఁడు.

తే. మైందుఁడును ద్వివిదుండును • మహితశౌర్యు, లశ్వితనయులు
వైవస్వ • తాత్మభవులు
గజగవాక్షగవయులును • గంధమాద, నుఁడు శరభుండునా యము • నుద్దివారు.

తాత్పర్యము

మైందుఁడు - ద్వివిదుఁడు అనువారు అశ్వినీతనయులు. గజుఁడు గవయుఁడు గవాక్షుఁడు గంధమాదనుఁడు శరభుఁడనువారు యముని కొడుకులు (వీరు బాల కాండమునఁ జెప్పఁబడిన వారు గారు) యమునితో సమానులు.

క. శూరులు శ్రీమద్దేవకుమారులు రణనోహలులు స • మానవిరహితుల్
ధీరులు పదికోట్లు వనే, చారులు గల రున్న వారిఁ • జాలం జెప్పన్. ౭౮౩

తాత్పర్యము

శూరులును, శ్రీమంతులు, దేవతల కుమారులు, యుద్ధమునందు మిగుల నాశక్తి గలవారు, ఈడులేనివారు, ధైర్యవంతులు నగు వానరులు నేను లెక్కించిన వారు పదికోట్లు గలరు. ఇంకను గలరు గాని యందఱను నేను జెప్పఁజాలను.

సీ. సింహసంహనను ల • క్షీణబలాఢ్యులు, దశరథపుత్రులు • నిశిచరేంద్ర
వారిలో నెక్కటి • పోరిలోనఁ ద్రిశీర్ష • ఖరహంతి గండర • గంపఁ దయ్య
యలవిరాధుఁ గబంధు • నంతకాతిథులుగా, నసిచిన రాముఁడు • యమవిభుండు
విక్రమంబున రామ • విభునితో సరిపోల్పఁ గానరాఁ డొకఁడు జ • గంబులందు

తే. నల జనస్థాన మంతయు • హత మొనర్చి, నట్టి పౌరుష శాలి గు•ణాళి నెన్న
నెవ్వఁ డేనియు నేరఁ డీ•యెల్లలోక,ములను సత్యంబు రాక్షస•కులవతంస !

అర్థములు. సింహసంహననులు = అవయవ సౌష్ఠవ పరిపూర్తి గలవారు. వరాంగరూపో పేతో యస్సింహ సంహననో౽హిసః'అని యమరము. ఎక్కటిపోరిలోనన్=ద్వంద్వ యుద్ధమునందు; ఒక్కఁడొక్కనితో యుద్ధముచేయుట ద్వంద్వ యుద్ధము. ఎక్కటిపోరు, గండర గండఁడు=శూరులందు శూరుఁడు, అంతకాతిథులుగన్=యమునకు నతిథులుగ — చచ్చినవారిగ.

తాత్పర్యము

సింహసంహననులును, క్షయింపని బలముగలవారును నగు రామలక్ష్మణులు దశరథుని పుత్రులు, వీరిలో ద్వంద్వయుద్ధమందు ఖరుని త్రిశీర్షుని జంపిన రాముఁడు శూరులలో శూరుఁడు. నీతో సమానుఁ డని ప్రసిద్ధిగన్న విరాధుని కబంధుని జంపిన రాముఁడు యమునితో సముండు. పరాక్రమంబున రామునితో సమానుఁ డని చెప్పఁదగినవాఁడు ముల్లోకంబుల లేఁడు. ఆ జనస్థానమంతయు నాశము చేసిన పౌరుషశాలి. ఇఁక నాయన సద్గుణములను లెక్కించుటకుఁ జాలినవాఁడు లోకములం దన్నిట లేఁడు. నేను సత్యము చెప్పుచున్నాను.

క. వారణసన్నిభుఁ డని నని, వారణవిక్రముఁడు భూమి•వరు సోదరుఁ డా
వీరు నిశితనారాచము, బారిం బడి బ్రతుక లేఁడు • బలశాత్రవుఁడున్. ౭౩౫

తాత్పర్యము

ఆయన తమ్ముఁడు లక్ష్మణుఁడు బలమున నేనుఁగు వంటివాఁడు. వారింపరాని విక్రమము గలవాఁడు ఆ వీరుని బాణముల బారినిబడి యింద్రుఁడైన బ్రదుక లేఁడు.

క. శ్వేతుఁడు జ్యోతిర్ముఖుఁడును, ఖ్యాతబలుల్ సూర్యతనయు•లప్పతికిఁ దనూ
జాతుండు హేమకూటా, ఖ్యాతుం డల నలుఁడు విశ్వ•కర్మాత్మజుఁడున్. ౭౩౬

తాత్పర్యము

శ్వేతుఁడు జ్యోతిర్ముఖుఁడనువారు సూర్యుని కొడుకులు. ప్రసిద్ధబలులు. జలాధిపతి యగు వరుణునికిఁ గొడుకు, హేమకూటుఁ డనువాఁడు. సేతువుకట్టిన నలుఁడు విశ్వకర్మకొడుకు.

క. హరివీరుల మేటి సుమ,ర్ధరుఁడు వసువుసుతుఁడు సుమ్ము • రాక్షసులందున్
గరము వరిష్ఠుఁడు నీ సో,దరుఁడు విభీషణుఁడు• హితుఁడు•దాశరథులకున్.

తాత్పర్యము

దుర్ధరుఁ డనువాఁడు వానరులలో గొప్పవాఁడు. వసువు కుమారుఁడు. రాక్షస శ్రేష్ఠుఁ డగు విభీషణుఁడు నీ తమ్ముఁడు రామలక్ష్మణులకు మిగుల హితుఁడు.

క. ఈరీతిగఁ గపిసేనల, తీ రంతయుఁ దెలియ నాడి•తి సువేలాద్రిన్
వా రున్నవారు తక్కిన కారియముం దీర్ప నీవ • గతి యంతటికిన్. ౭౩౭

తాత్పర్యము

ఈ విధముగఁ గపిసేన యున్న విధమంతయు నీకుఁ గావలసినది తెలిపితిని. వారందఱు సువేలాద్రిమీఁద నున్నారు. తరువాతఁ జేయవలసిన పనులేవియో యవి నీవే నిర్ణయించుకొనుము.

—• ౩౧-వ సర్గము. రావణుఁడు విద్యుజ్జిహ్వుని రాముని శిరస్సుఁ జాపముఁ గల్పింప నాజ్ఞాపించుట. •—

సీ. అపసర్పరీతి • నక్షోభ్యబలముతో, నంబుజాక్షుఁడు సువేలాద్రిమీఁద
విడియుట వినిచిన • విని వింశతిభుజుండు, నెద ఝల్లుకొన నొక • యింత సొలసి
నిబ్బరంబున మంత్రి • నివహంబుతో ననుఁ, సచివులారా! నీతి • శాస్త్రవేది
లార! మీరెల్లరు • నాలంబు లేకిందు, రండు వేవే మంత్ర • ముండుకాల
తే. మిపుడు ప్రాప్తించెనని వారి • నెల్లవారు, రాఁగ మంతన ముండి యా • రావణుండు
వారిఁ బనివినుఁడని చెప్పి • చేరి స్వాలయంబుఁ బిలిపించి యటకు మ • హాబలాఢ్యు.

అర్థములు. అపసర్పులు = వేగులు, అక్షోభ్య బలముతో = కలఁత పెట్ట సాధ్యపడని సేనతో, విడియుట వినిచిన విని వింశతి భుజుండు = ఇందు వృత్త్యనుప్రాసము, ఆలంబు = ఆలస్యంబు, వేవే=త్వరత్వరగా, మంతనముండి = ఆలోచించి, పని వినుఁడని=పొండని, ఈ పదము గొప్పవారు కొలఁదివారికిఁ బొండని చెప్పునపుడు మాత్రమే ప్రయోగింపవలయును. స్వ+ఆలయంబు=తన గృహము.

తాత్పర్యము

వేగులవారు మీఁదఁజెప్పిన ప్రకారము క్షోభ కలిగింప సాధ్యపడని సేనతో రామచంద్రమూర్తి సువేలపర్వతముమీఁద దండు దిగియున్నాఁడని విని రావణుఁడు గుండె ఝల్లుకొనఁగా కొంచెము భయపడి మరల ధైర్యము తెచ్చుకొని మంత్రి సమూహమును జూచి మంత్రులారా! నీతిశాస్త్ర మెఱిఁగినవారలారా! మంత్రాలోచనము చేయవలసియున్నది. మీరందఱు నాలస్యము సేయక మిగుల వేగముగ రండని చెప్పి వారందఱు రాఁగా వారితో నాలోచించి వారిని బొండని చెప్పి తన యింటికిఁబోయి మహా బలాఢ్యుని,

సీ. మాయావిదుని మహా • మాయు విద్యుజ్జిహ్వుఁ, గనియిటులనియెను • క్ష్మాతనూజ
మోసగింపఁగ వలె • నీవసమంతయు భేద; మేమి లేకుండ శ్రీ • రాము శిరము
సశరమౌ నాతని • చాపంబు మాయచేఁ, గల్పించి నేనుండు • కడకు రమ్మ
టన్న నాతఁడు నల్లె • యనఁ గొన్ని సొమ్ములు, పసదనంబుగ నిచ్చి • పంచియతనిఁ
తే. దాను విశ్వంభరాసుతా • దర్శనాభి, లాషియై యశోకవనీత • లంబుఁ జొచ్చి
దీనురాలి నధోముఖిఁ • దీవ్రశోక, బాధ్యమాన రదైన్యార్తఁ • బరమశీల. ౬-౧౦

అర్థములు. మాయావిదుఁడు=మాయలు నేర్చినవాఁడు, మహామాయు= గొప్ప మాయావి, పసదనంబుగన్ = బహుమతిగ, ప్రసాదన శబ్దభవము,

విశ్వంభరాసుతా=భూపుత్రియగు సీతయొక్క, దర్శనాభిలాషియై=దర్శనమందుఁ గోరిక గలవాఁడై, అధోముఖిన్=తలవంచుకొని యుండుదానిని, తీవ్రశోకబాధ్యమానన్=తీక్ష్ణమైన శోకముచే బాధింపఁబడుచున్నదానిని, అదైన్యార్హా=వ్యసనమునకు నర్హురాలుగానిదానిని, పరమశీల=ఉత్తమ పతివ్రతను.

తాత్పర్యము

మాయలు చేయనేర్చిన రావణుఁడు తనకంటె నెక్కువ మాయలు నేర్చిన విద్యుజ్జిహ్వుఁ డనువానిని జూచి నేను సీతాదేవిని మోసగింపవలెను. కొంచెమైనను భేదములేకుండునట్లు శ్రీరాముని శిరస్సును, బాణముతోడి యతని వింటిని నీశక్తిచేఁ గల్పించి నేనుండుచోటికిఁ దీసికొనిరమ్మని చెప్పఁగా వాఁ డట్లులేచేసెద ననిచెప్ప నతనికిఁ గొన్ని సొమ్ములు బహుమానముగ నిచ్చి పంపి తాను సీతాదేవినిజూడఁగోరి యశోకవనముఁ బ్రవేశించి దుఃఖయోగ్య కాకున్నను దుఃఖించుదానిని, బరమ పతివ్రతను, తల వంచుకొని విచారపడుదానిని, తీవ్రశోకముచేఁ బీడింపఁబడుదానిని.

చ. ధరణితలోపవిష్ట యయి ♦ దారుణ విగ్రహరాక్షసాంగనా
పరివృతయైనదానిఁ, దన ♦ ప్రాణవిభున్ స్మరియించుదాని, సుం
దరిఁ గని డాయఁబోయి యమి ♦ తప్రమదాకరవార్త యేదియో
సరసిజనేత్రకుం బలుకు ♦ చందమునన్ వచియించు ధీరుఁడై. ౬౫౧

అర్థములు. ధరణితలోపవిష్ట = భూమిమీఁదఁ గూర్చుండినది, దారుణ విగ్రహ = భయంకరాకారముగల, రాక్షసాంగనా = రాక్షసస్త్రీలచే, పరివృతయైనదానిన్ = చుట్టఁబడినదానిని, అమిత ప్రమదాకరవార్త = మిగుల సంతోషము గలిగించు వృత్తాంతము, ధీరుఁడై=దిటము గలవాఁడై.

తాత్పర్యము

నేలమీఁదఁ గూర్చుండి భయంకరమైన యాకారములుగల రాక్షస స్త్రీలు చుట్టుకొని యుండఁగాఁ దన భర్తను స్మరించుచున్నదానిని సుందరిని జేరఁబోయి యామె కేదియో గొప్ప సంతోషవార్త చెప్పువానివలె, తన మోసము తెలియరాని విధముగ దిటము గలవాఁడై యిట్లనెను.

—♦ రావణుఁడు సీతకు శ్రీరామాదులు హతులైరని చెప్పుట ♦—

శా. ఎంతో నిన్ బతిమాలుకొంటిఁ గదె తన్వీ నన్నుఁ జేపట్టఁగాఁ
జింతాకంతయు నా నుడిన్ వినక ఛీఛీ యంటి వెవ్వానిపై
స్వాంతం బంతయు నుంచి యట్టి భవదీయప్రాణనాథుండు నీ
కాంతుం డా ఖరహంత రాముఁడు సతీ కయ్యానఁ జంపంబడెన్. ౬౫౨

తాత్పర్యము

ఓసీ సీతా! నన్ను గ్రహింపుమని నిన్ను నే నెంతదూరమో ప్రార్థించితిని గదా! నామాట నీవు చింతాకంతయు లక్ష్యముచేయక ఛీఛీ పొమ్మంటివి. నీ వెవ్వ

నిపై మనస్సంతయు నుంచి నన్ను ధిక్కరించితివో యట్టి నీ మగఁడు నీ ప్రియుఁడు ఖరుని జంపినవాఁడు యుద్ధమందుఁ జంపఁ బడెను.

ఉ. మోడిగ నీదు నేడుపె స•మూలము నాశముఁ జేసె నీ పతిన్,
పీడఁగఁగొట్టినాఁడఁ గద • నీ తలక్రొవ్వును మూలముట్టుగా,
నేడువు మెంత యేడ్చెదవొ • యిష్టము దీరఁగ, దిక్కులేక నీ
వేడుచుచైన నాదు హృద•యేశ్వరి వయ్యెదు నీవ చూడుమీ. ౧౪

అర్థములు. మోడిగ = బింకముగ, ఒక న్యాయమున నిది సబిందుకముగ నుండవలయును. అయినను బూర్వులు దీని నిర్బిందుకముగ గ్రహించినారు. కావున నిచ్చట నట్లే గ్రహింపఁబడెను. మోఁడి= మొండి.

తాత్పర్యము

బింకము విడువలేక నీ వేడ్చిన యేడుపే నీ మగని నిర్మూలముగ నాశము చేసెను. నీ తలలో నుండు క్రొవ్వును నిశ్శేషముగ వదలించితినిగదా! ఇంక నెంత యేడువ వలయు నని నీకు కోరిక యో యంతయు నేడువుము. వేఱు దిక్కులేక యేడ్చుచునైన నా భార్యవు నీవే యయ్యెదవు. నీవే చూచుచుండుము.

ఉ. చచ్చినవానిఁ గట్టుకొని • చారువిలోచన యేల యేడ్చె, దీ
పిచ్చితనంబు మాను మిఁక • బేరిమినీ యాఱఁగ మత్సతీతతిన్
బచ్చగ రాణివై మనుము • పండితమానిని యల్పపుణ్య యో
మచ్చరికత్తె స్వార్థహిత • మారిణి బాలిశురాల దుర్మతీ! ౧౫

అర్థములు. పండితమానిని = జ్ఞానము లేకున్నను గలదాన నని తలఁచుదానా! అల్పపుణ్యా=కొంచెము పుణ్యము గలదానా! కొంచెము పుణ్య ముండుట చేతనే రాముఁడు పోయినను నేనైన నీకు దిక్కయితిని, మచ్చరికత్తె=మాత్సర్యము కలదానా! స్వార్థహితమారిణి = నీ మేలును నీవే నాశము చేసికొనుదానా! బాలిశురాల=మూఢురాల. దుర్మతీ=చెడుబుద్ధి గలదానా!

తాత్పర్యము

మనోహరములైన కన్నులుగలదానా! వటికే కన్నులు వాచునట్లు చచ్చిన వానికై యేడ్చెదవు? చచ్చినవాఁడు నీ వేడువగానే వచ్చునా యేమి? ఇక నీ పిచ్చి చేష్టలు వదలిపెట్టుము. గొప్పతనము వహించి నా భార్యలలో నీ వొకతెవై పచ్చగ రాణివై బ్రదుకుము. నీకు జ్ఞానములేదు. కలదాన నని దురభిమానము మాత్రము గలదు. కావుననే మంచిమార్గము చెప్పినను దెలిసికొన లేకున్న దానవు. నీవు పాపము విశేషముగఁ జేసినను కొంచెము పుణ్యము చేసిన దాన వగుటచే రాముఁడు చచ్చినను నేను నీకు దిక్కయితిని. కావున నింతవఱకున్న మాత్సర్యము, పట్టుదల వదలిపెట్టుము. ఏల నీమేలు నీవే నాశము చేసికొనెదవు? ఇట్లు చేయుటకు

నీ వెంత బుద్ధిలేనిదానవో కదా! బుద్ధిలేకపోయిన మేలే బుద్ధిలేనివా రొకరు చెప్పిన
నైనను వినరు. నీవు దుష్టబుద్ధిగలదానవు.

క. విను వృత్రాసురవధవలె, విన ఘోరంబైన నీమ • విభువధ మెల్లన్
వననిధిదరికిని నీ పతి, చనుదెంచెను నన్నుఁ జంప • నకపిబలుండై. ౮౭౭

తాత్పర్యము

వృత్రాసురవధ యెంత ఘోరమైనదో నీ మగనివధవిధ మంత ఘోరమైనదే. దానిని వివరించి చెప్పెద వినుము. నీమగఁడు వానరసేనతోడ నన్నుఁజంప సముద్రతీరమునకు వచ్చెను.

చ. దినకరుఁ డస్తమించు నెడఁ • దీవ్రకరాత్మజు తెచ్చి యున్న య
వ్వనచరసేనతో లవణ • వారిధి యుత్తర తీరమందుఁ జే
రెను, బయనపుగాసి నిదు • రించెను రాముఁడు, రాత్రివేళ నా
పనిచిన వేగు లవ్విధము • బాగుగ శోధన చేసి క్రమ్మఱన్. ౮౭౮

తాత్పర్యము

సూర్యాస్తమాన మగు కాలమున సుగ్రీవుఁడు తెచ్చిన వానర సేనతో లవణ సముద్రము నుత్తర తీరమును నీ మగఁడుచేరి దారి నడచిన బడలికచే నిదురించెను. ఆ రాత్రివేళ నేనుబంపిన వేగులావిధమును శోధనచేసివచ్చి నాకుఁజెప్పిరి.

ఉ. ఆవల సేనతోఁ జని ప్రహ • స్తుడు వైరులు డిగ్గియున్న యా
తావును మెల్లఁ జేరి శర • దండ మహాయసఖడ్గయష్టి శూ
లావళి శక్తి చక్రపరి • ఘాయుధముద్గర తోమరాళులన్
వే విదళించె రెల్ల కపి • వీరుల భీతులఁ దూఁగుఁబోతులన్. ౮౭౯

అర్థములు. శర = బాణముల చేతను, దండ = కఱ్ఱల చేతను, మహాయస ఖడ్గ = ఉక్కుకత్తుల చేతను, యష్టి = ఉక్కుకఱ్ఱల చేతను, శూలావళి = శూలముల సమూహము చేతను - చక్రముల చేతను, పరిఘాయుధ = ఇనుపకట్ల గుదియల చేతను - ముద్గరముల చేతను, తోమరముల చేతను = చిల్లకోలల చేతను, వే = శీఘ్రముగ = త్వరగ.

తాత్పర్యము

ఈవార్త రాఁగానే ప్రహస్తుఁడు సేనతో విరోధులు దిగియున్న స్థలమునకుఁ జప్పుడు చేయక మెల్లగఁ బోయి తటాలునఁ బైపడి బాణాది సాధనముల చే నాభయపడిన వారిని, తూఁగుచున్న వారిని విదళించెను.

క. గుఱక యిడుచు నిద్రింపఁగ, మెఱుఁగు మెఱచినట్టు లతిమి • మెలఁతుక రామున్
నఱకెన్ శిరముఁ బ్రహస్తుఁడు, కఱకఱ మనియుఱక పెద్ద • కరవాలమునన్.

తాత్పర్యము

ప్రహస్తుఁడు పోవు సమయమునకు రాముఁడు గుఱకపెట్టి నిద్రించుచుండఁగాఁ జూచి పైపడి పెద్ద కత్తితో నతని గొంతు కఱకఱ మని నఱకెను.

సీ. వింటికై యెగురు వి ♦ భీషణు మావారు, పట్టి కట్టిరి చక్క ♦ బాతలించి
క్రోఁతులలో నొక్క ♦ క్రోఁతియై సౌమిత్రి, యూడనిఁ బాడె ది ♦ గ్వ్యూహములకుఁ
గీశాధినేత సు ♦ గ్రీవుండు కృత్తసు,గ్రీవుఁడై పన్నుండె ♦ క్షితితలమున
హనుమంతుఁడు నిరస్త ♦ హనుకుఁడై తండ్రికిఁ, బ్రాణంబు లర్పించెఁ ♦ బట్టువదలి
తే. జాంబవంతుఁడు రాక్షసుల్ ♦ చటుల పట్టి
సాదులను మోదఁ మోఁకాళు ♦ లవనిఁ గూల
నంగలార్చుచు జానకీ! ♦ యంతరించె
నెలుఁగు గావున నోలుచు ♦ నెలుఁగు లిడుచు. ౬౯

అర్థములు. వింటికై = ఆకాశమునకు, బాతలించి=తత్తఱపడి, ఊడని, బాడెన్ = పరువెత్తెను, దిక్ వ్యూహములకు = నానాదిక్కులకు, కృత్త=నఱకఁబడిన, సుగ్రీవుఁడై=మంచి మెడగలవాఁడై, పన్నుండెన్=పండుకొనెను, నిరస్త హనుకుడై=బుగ్గలు చీలిన వాఁడై, ఓలుచున్ = ఏడ్చుచు, ఎలుఁగు లిడుచు= ధ్వనిచేయుచు.

తాత్పర్యము

తక్కిన వారిగతి యేమైనది చెప్పెద వినుము. విభీషణుఁడు ఆకాశమునకై యెగిరిపోవఁ జూచెఁగాని మా వారు తత్తఱపడి వానిని బట్టి కట్టిరి. లక్ష్మణుఁడు క్రోఁతులలోఁ దా నొక్క క్రోఁతియై దిక్కుల వెంటఁ బరువెత్తెను. వానరనాయకుఁడు సుగ్రీవుఁడు నఱకఁబడిన మెడ గలవాఁడై నేలమీఁదనే పండుకొనెను. హనుమంతుఁడు చెంపలు చీలి తన ప్రాణవాయువులను దండ్రియగు వాయుదేవున కప్పగించెను. రాక్షసులు పట్టిసము లోనగు నాయుధములచేత కొట్టఁగా నేల మోఁకాళ్ళూఁది పడి యేడ్చుచు నఱచుచు జాంబవంతుఁడు చచ్చెను.

క. మైందద్వివిదులు రక్షో, బృందము దమ్మంగవింప ♦ బీఱువడి వెసన్
మ్రందిరి రోఁజుచు నేడ్చుచుఁ, గుందుచు డిందుచును మిగులఁ ♦ గొందలపడుచున్.

అర్థములు. అంగవింపన్ = అతిక్రమింపఁగా, బఱువడి=వ్యర్థులై, భయపడి, మ్రందిరి=చచ్చిరి, కొందలపడుచున్=కలఁతపడుచు.

తాత్పర్యము

మైందుఁడు ద్వివిదుఁడను వారలు రాక్షస సమూహము తమ్మతిక్రమింపఁగా భయపడి వ్యర్థులై వెంటనే రోఁజుచు కలఁతపడి చచ్చిరి.

తే. పనసకాయను గుందివ ♦ పగిది గాఁగ, ఛిన్నమును భిన్నమును జేయఁ ♦ జేవదఱిగి
పొర్లు చున్నాఁడు నెత్తుటఁ ♦ బువ్వుఁబోఁణి, పనసుఁడిం కేల నసగొట్ట ♦ భర్తకొఱకు.

అర్థములు, చేవ=బలము, తఱిగి=క్షయించి, నసగొట్టన్=ఉపద్రవపడ, మూలుగఁగా.

తాత్పర్యము

పనసుఁ డను వానరుని మా రాక్షసులు తునుకలు తునుకలుగాఁ బనసకాయను కుందినట్లు కుందఁగా బలముచెడి తన నెత్తుటిలోఁ దానే పొర్లుచున్నాఁడు. ఇంకను మగఁడో మగఁడో యని యేల మూలిగెదవు? వనసశబ్దము కుశాదులలో జేరుటచే మువర్ణకము రాదు.

సీ. సారసంబుల మేను ♦ నీరసంబుగ దరీ, ముఖుఁడు దరీముఖ ♦ మునను జచ్చెఁ
గూఁతయొక్కఁటి లేక ♦ కుముదుండు కుముదుఁడై, యంబకములకు మేఁ ♦ నప్పగించెఁ
దుండు తుండుగ నొడల్ ♦ తుండింపఁగా నంగ, దుండు నిపతితాంగ ♦ దుండునయ్యె
నుక్కీలు రక్కసు ♦ లొక్కట పెట్టునఁ గ్రుమ్మ, రథము లేనికలు తు ♦ రంగమములు
ఆ. పఱప నిచ్చకోలఁది ♦ ప్లవగులు కొందఱు, నాగవితతి ద్రొక్క ♦ నలఁగి చచ్చి
రతివ! కొన్ని క్రోఁతు ♦ లరదముల్ పైఁ బాఱ, నజ్జుగుజ్జ నెత్రు ♦ బజ్జులయ్యె. ౬౬౨

అర్థములు. సారసంబులన్ = బాణములచే, నారాచ శబ్దభవము. నీరసంబుగన్ = రసహీన మగునట్లు, దుర్బలమగునట్లు, దరీముఖమునన్ = గుహాముందట, కుముదుఁడై = సంతోషహీనుఁడై, అంబకములకు = బాణములకు, నిపతిత + అంగదుండు = పడిపోయిన భుజకీర్తులు గలవాఁడు, ఉక్కీలు = బలవంతులు, నాగవితతి = ఏనుఁగుల సమూహము, నజ్జుగుజ్జు నెత్రుబజ్జులు = మిక్కిలి నలిగి నెత్తురు కలసి బజ్జులవలె నైరి.

తాత్పర్యము

బాణముల దెబ్బలచేఁ దన దేహము బలహీనముకాఁగా దరీముఖుఁడు గుహాముఖంబునఁ జచ్చెను. కుముదుఁడు సంతోషహీనుఁడై గట్టిగా నఱచుటకు సాధ్యపడక బాణములకుఁ దన దేహము ధారవోసెను. రాక్షసులు తన దేహమును తుండు తుండుగా నఱకఁగా నంగదుఁడు తన భుజకీర్తులను నేల పడవేసికొనిన వాఁడయ్యెను. బలవంతులగు రాక్షసు లొకసారిగ బాణములచేఁ గ్రుమ్మ, తేరులు, ఏనుఁగులు, గుఱ్ఱములు మీఁదఁ దోలఁగా వానరులు కొందఱు ఏనుఁగులు ద్రొక్కఁగా నలఁగి చచ్చిరి. కొన్ని క్రోఁతులు తేరులు తమపైఁ బోవుటచే నలిగి నెత్తుటిలోఁ గలసి బజ్జులవలె నైరి.

క. నిలిగిరి నలఁగిరి, తొలఁగిరి మలిగిరి దెరలిరి భయాన ♦ మడిసిరి క్రోఁతుల్
దలరిరి గెడసిరి ముగిసిరి, యిలిగిరి మఱి డింక వేసి ♦ రిం కేమందున్. ౬౬౩

అర్థములు. నిలిగిరి = నీల్గిరి = ఒళ్ళు విఱుచుకొనిరి, మలిగిరి = నశించిరి, తెరలిరి = కలఁతపడిరి, తలరిరి = కదలిపోయిరి, కెడసిరి = పడిరి, ఇలిగిరి = చచ్చిరి. డింకవేసిరి = చచ్చిరి, ఇందుఁ గొన్ని పర్యాయపదములుగాఁ దోఁచినను వానిలోఁ గొంచెము భేదముండుట చేతను సేనయందుఁ గొందఱకుఁ గొన్ని, కొందఱకుఁ గొన్ని యన్వయించుట చేతను బునరుక్తి దోషములేదు.

అలంకారము - సముచ్చయము - ఏకకాలమందు కొన్ని కార్యములు జరిగినట్లు చెప్పిన సముచ్చయాలంకార మగును.

తాత్పర్యము స్పష్టము.

క. పారీంద్రంబులచేతను, వారణవారములువోలె ♦ బ్రావిరి నగసం
చారులు కొందఱు దూఱిరి, వారాన్నిధి నుప్పరంబుఁ ♦ బ్రాఁకిరి వెఱచేన్.

అర్థములు. పారీంద్రము = సింహము, "సింహః కంఠీరవో భీమవిక్రాంతః కరిమాచలః పంచశిఖశ్చ శైలాదిః పారీంద్రః శ్వేతపింగళః" త్రికాండ శేషము. రూ — పారింద్రము — వారణ వారములు=ఏనుఁగుల గుంపులు, నగసంచారులు= వానరులు, వారాన్నిధిన్=సముద్రమును, ఉప్పరంబున్=ఆకాశమును, వెఱచేన్= భయముచే.

తాత్పర్యము

సింహములచేత నేనుఁగులవలె వానరులు నేలఁబడిరి. కొందఱు సముద్రములో దూఁకిరి. కొందఱు భయముచే నాకాశమున కెగిరిపోయిరి.

క. వానరులవృత్తి తమకు న, నూనంబుగ సాయపడఁగ ♦ నుర్వీరుహసం
తానంబు నెక్కె నెలుఁగులు, కానలఁ గోనలను నిండెఁ ♦ గపులశవంబుల్.

అర్థములు. అనూనంబుగన్=కొఱఁతలేక - పూర్ణముగ, సాయపడఁగన్= తోడుపడఁగా, ఉర్వీరుహసంతానంబున్=చెట్లగుంపులను, శవములు=పీనుఁగులు.

తాత్పర్యము

వానరుల నడవడి తమకుఁ బూర్ణముగఁ దోడుపడఁగా ఎలుఁగులు చెట్లు నెక్కెను. అడవులందుఁ గోనలందుఁ గ్రోఁతుల పీనుఁగులు నిండినవి.

క. నా దళము లిట్లు పొడువఁగ, నీ దయితుఁడు దత్తబడలు ♦ నీల్గిరి యిట్లిం
కేది గతి నీ కటంచును, నా దశముఖుఁ డామె వినఁగ ♦ నను రక్కసికిన్. ౯౯

అర్థములు. దళములు=సేనలు, పొడువఁగన్=చంపఁగా, నీదయితుఁడు= నీప్రియుఁడు, తత్తబడలు=పరివారము, నీల్గిరి=చచ్చిరి, రక్కసికిన్=రాక్షసస్త్రీకి.

తాత్పర్యము

నా సేన లీప్రకారము చంపఁగా నీ మగఁడు పరివారముతోఁ జచ్చెను. నీ కిఁకేదిగతి? అని చెప్పి యా రావణుఁ డామె వినునట్లు రాకాసి కిట్లనెను.

ఇప్పు డీ యుపాయము చెప్పిన వాఁడిట్లేల చేసి యుండరాదు. వానరసేన యుత్తరతీరమున విడియఁగానే వేగులవాఁడు చెప్పెను. ఆరాత్రి వారిపైపడ నాలోచించెను. కాని వానరు లందఱు హెచ్చరికతో మేలుకని యుండుటచే వాఁ డేమి చేయుటకు లేకపోయినది. దాని నిప్పు డిట్లు త్రిప్పి చెప్పుచున్నాఁడు.

—• రావణుఁడు సీతాదేవికి రాముని కల్పితశిరశ్చాపంబులఁ జూపుట •—

క. రామునిశిరంబు సంగర, భూమిస్థలినుండి తెచ్చె • భూరిక్రౌర్యో
ద్దాముఁడు విద్యుజ్జిహ్వుం, డా మానవభోజిఁ బిలువు•మా యిచ్చటికిన్. ౬౬౭

తా త్ప ర్య ము

యుద్ధభూమినుండి రాముని శిరస్సును మిగులఁ గ్రూరుఁడగు విద్యుజ్జిహ్వుఁడు తెచ్చెను. ఆ రాక్షసుని నిచటికిఁ బిలుచుకొనిరమ్ము.

క. అనునంతలోన మూర్ధం, బును ధనువు గ్రహించి వచ్చి • మ్రొక్కిఁడి దశకం
ఠునియెదుట నిలువ నాతం, డను విద్యుజ్జిహ్వునకు మ•హాజిహ్వునకున్. ౬౬౮

అర్థములు. మూర్ధంబును = శిరమును, ధనువు=విల్లు.

తా త్ప ర్య ము

అని చెప్పిన యంతలోనే తల విల్లు దీసికొనివచ్చి నమస్కరించి రావణుని యెదుట నిలఁబడఁగా నతఁడు పెద్ద నాలుకగల విద్యుజ్జిహ్వునకు నిట్లనియె.

క. ఓరీ! రామునిశీర్షం, బా రమణికి నెదుట నుంపు•మా చయ్యనఁ గ
న్నారఁగ నీ నిర్భాగ్య మ,నోరమణునిచరమదశఁ గ•నున్ లెస్స యనన్.

అర్థములు. నిర్భాగ్య=భాగ్యము పోయినది, దరిద్రురాలు, చరమదశను= కడపటి స్థితిని.

తా త్ప ర్య ము

ఓరీ! రాముని తల దీనికి యెదుట వేగముగ నుంపుము. ఈ దరిద్రురాలు కన్నులు కఱవుదీఱ తన మగని కడపటి దశను జూచునుగాక!

క. మనుజాశనుండు ప్రియదర్శన మగు తచ్ఛిరము నుంచి • జానకి కెదుటన్,
జనియెను దిరోహితుండై, దనుజేంద్రుఁడు రామశిరముఁ•దత్కార్ముకమున్.

అర్థములు. మనుజాశనుండు = రాక్షసుఁడు, ప్రియదర్శనము = చూచుటకుఁ బ్రియమైనది, తిరోహితుండై =మఱుగుపడి, తత్ కార్ముకమున్=రాముని యా వింటిని.

తా త్ప ర్య ము

ఆ రాక్షసుఁడు చూచుటకుఁ బ్రియమై ప్రియమైన చూపులు గల యా తలను జానకి కెదుట నుంచి తొలఁగి పోయెను. రావణుఁడు రాముని శిరస్సు విల్లు

చ. ధరణిజ మోలఁ ద్రోచి యిడె • తామరసాక్షి రో లెస్స చూడు సం
గరమున మా ప్రహస్తుఁడు ప్ర•కాశముగా నిశ రాము నీ మనో
హరు వధియించి తెచ్చెఁ జుమ • యాతని సజ్యశరాసనంబు, నో
సరసిజనేత్ర! యేమిటికి • జాగు? వశంపడు మింక నా కనన్. ౬౭౧

అర్థములు. సజ్యశరాసనంబు=అల్లెత్రాటితోఁ గూడిన విల్లు, ఎక్కుపెట్టఁ బడిన విల్లు.

తాత్పర్యము

సీతాదేవి కెదుటవైచి యో కమలాక్షీ! ఇదిగో మా ప్రహస్తుఁడు బహిరంగముగ నందఱు చూచుచుండఁగా యుద్ధభూమినుండి తెచ్చిన రాముని యెక్కుపెట్టిన విల్లు. ఇఁక నేల జాగుసేసెదవు? నాకు స్వాధీనపడుము! అని చెప్పఁగా,

• 32-వ సర్గము శ్రీరాముని మాయాశిరశ్చాపంబులఁజూచి సీత దుఃఖించుట •

ఉ. అచ్చెలి యా శిరంబును శ•రాసనముం గని వాయుపుత్రు వా
క్రుచ్చిన భాస్కరాత్మభవు•కూటమియుం దలపోసి యేమియుం
బొచ్చెము లేని మోముసరి•మోమును గన్నులవంటి కన్నులున్
దచ్చికురాభకుంతల వి•తానము తద్వదనాబ్జ వర్ణమున్. 882

అర్థములు. భాస్కరాత్మభవు కూటమి = సుగ్రీవునితోడి స్నేహము, తలపోసి = ఆలోచించి, పొచ్చెము = కొఱఁత, చికురాభ = వెండ్రుకలవంటి, కుంతల వితానము = వెండ్రుకల సమూహము, వదనాబ్జవర్ణము = ముఖకమలము వన్నె.

తాత్పర్యము

ఆ సీత యా శిరస్సును, వింటినిజూచి హనుమంతుఁడు చెప్పియుండిన సుగ్రీవు స్నేహము నాలోచించి కొంచెమైనను భేదములేక రాముని ముఖముతో సమానముగా నున్న మొగము, కన్నులవంటి కన్నులు, తల వెండ్రుకలవంటి వెండ్రుకలు ఆ ముఖమువన్నె. హనుమంతుఁడు చెప్పిన సుగ్రీవు స్నేహమనుటచే దాని కావలి వార్త యేదియు సీతాదేవికిఁ దెలియదనియే యేర్పడుచున్నది. రావణుఁ డెవ్వరిని జెప్పనిచ్చినవాఁడు కాఁడు. లోపలికిఁ బోనిచ్చినవాఁడు కాఁడు.

క. శుభకర చూడారత్నము, నిభ రాజసమానయాన•యిాక్షించి తమిన్
విభుశిరమని నమ్మి మహో, ర్తిభరంబున నేడ్చెఁ గురరి• తెఱఁగున మిగులన్.

అర్థములు. శుభకర=మేలుకలిగించు, చూడారత్నము=జడబిళ్ళ, ఇది సీతాదేవి హనుమంతునిచేఁ బంపినది-ఇది రామచంద్రమూర్తి శిరస్సునందుఁ గాన వచ్చిన దనుటచే దాని నాయప తన తలవెండ్రుకలందుఁ గూర్చి కట్టుకొని రక్షించె నని తెలియనయ్యెడిని. రెండవ కారణము, అది పోఁగొట్టవలసిన పదార్థముగాదు గదా! ఒకటి - మిగుల వెలగల యపూర్వవస్తువు. రెండవది ప్రియురాలుపంపినది. రెంటిలో నిది బలిష్ఠకారణము.

ఇభరాజసమాన యాన = గొప్ప యేనుఁగు నడకవంటి నడక గలది, తమిన్ = కోరికతో, మహోర్తిభరంబునన్=దుఃఖాతిశయముచే, కురరి = ఆఁడు లకుముకి.

తాత్పర్యము

తాను పంపిన జడబిళ్ళను సీతాదేవి మిగులఁ గాంక్షతోఁ జూచి యది మగని

తల యని నమ్మి శోకాతిశయమున నాడు లకుముకిపక్షివలె నేడ్చెను.

ఉ. హా జగడాలమారి కయికా! నెఱవేఱెనుగా త్వదీప్సితం
 బో జగజంత ! వంశకలశోదధిచంద్రుఁడు గ్రుంకె, వంశస
 ద్బీజముఁ బాడుచేసితివి తెంపరివై, యిఁకమీఁదఁ హాయిగా
 నే జడ నింత లేక సుఖయింపుము గుండియనిబ్బరంబుతోన్. ౬౭౪

అర్థములు. జగడాలమారి = కలహించు స్వభావము గలదానా! త్వదీప్సితంబు = రాముఁడు చావవలయునన్న నీ కోరిక, జగజంత = జగము తద్భవము జగము, జగమంత జంత జగజంత=విశేష ధూర్తస్త్రీయని యర్థము. వంశ=సూర్య వంశమనెడి, కలశోదధి = పాలసముద్రమునకు, చంద్రునివంటివాఁడు, గ్రుంకెన్= అస్తమించెను, వంశ సద్బీజము=వంశముయొక్క మంచి విత్తనము, తెంపరివై= సాహసము గలదానవై, భరతాదులు లేరా, వారివలన వంశాభివృద్ధిగాదా యందు వేని, కాదు. నీవు అరణ్యమందు రాముఁడు చచ్చును, భరతుఁడు సుఖపడును అని చేసిన యాలోచనలు చెడినవి, రామచంద్రమూర్తి మరణించిన వార్త వినఁగానే లక్ష్మణ భరత శత్రుఘ్నులు బ్రదుకరు. అంతతో వంశము నిలిచిపోవును. హాయిగా=సుఖముగా, జడను=ఆలస్యము, గుండియ నిబ్బరంబుతోన్=రాముఁడు మరల వచ్చునో యేమో యను భయములేక - రెండవపాదంబునఁ బ్లుతయతి - శ్లోక ప్లుతము.

తాత్పర్యము

అయ్యో! కలహశీలవైన కైకా! రాముఁడు చావవలయు నను నీ కోరిక నెఱవేఱెనుగదా! ఓసీ మహాధూర్తురాలా! సూర్యవంశమను పాలసముద్రమునకు చంద్రుఁ డస్తమించెను. మంచి వంశము సాహసురాలవై విత్తు పాడుచేసితివి, సూర్యవంశమే నిలిచిపోయెను. ఇఁక నే యాలస్యము నభ్యంతరము లేక హాయిగా దిగులు లేక సుఖింపుము.

క. ఏ విప్రియంబు నీకుం, గావించె మహాత్ముఁ డైన • కాకుత్స్థుఁడు నీ
 కా విధి యడవులఁ ద్రోయుం, గా పల్కుముఁ గట్టఁజేసి • కసి నాతోడన్. ౬౭౫

అర్థములు. విప్రియము=నీకుఁ బ్రియమైనదానికి విరోధమైనది, కసిన్ = పగచేత.

తాత్పర్యము

గొప్ప మనస్సుగల రామచంద్రమూర్తి నీ కనిష్టమైనదానిని దేనిని జేసెనని నీ వావిధముగ నారలుగట్టి నాతోడ నడవులద్రోచి పగ సాధించితివి.

చ. అనుమ విదేహరాజసుత • యంచితభూరితపోవ్రతాఢ్య హా
 యని విలపించి బాలిక వ్య • థాతిశయంబున వేపమానయై

వనరుచు ఛిన్నమై ధరణిఁ ◆ ద్రాలు ననంటిని బోలి ద్రెళ్ళి చే
తన చెడి వెండియుం దెలిసి ◆ తచ్ఛిరముం గొని మూరుకొంచునున్. ౬౬

అర్థములు. వేపమానయై=వణఁకుచున్నదై, వనరుచున్ = శోకించుచు, ఛిన్నమై=నఱకఁబడినదై, చేతనచెడి=మూర్ఛపోయి, మూరుకొంచును = వాసన చూచుచు, బాలిక=సత్యాసత్యములు పరిశీలించి తెలిసికొనునంతటి లోకజ్ఞానము లేనిది, కట్టుకొన్నభార్య – చేతికిఁదీసికొని చూచి పరిశీలించి భేదము కనుఁగొన లేకుండునంత పోలిక కలదిగా శిరస్సుచేయుటయందుఁజూపిన యద్భుతము ఆశ్చర్యకరమునైన శక్తికి మాయ యనిపేరు. ఇట్టి దానిఫలము శాశ్వతమైనచో దానిని సత్యమందుము. కాని దానిని మాయయందుము. ఆ భేదమునుబట్టి శక్తి, శక్తివలననైన పదార్థము మాయయనియే చెప్పఁబడును.

తాత్పర్యము

అని చెప్పి గొప్ప తపస్సు, పాతివ్రత్యము అను సంపదగలది యగు సీతాదేవి హాయని యేడిచి శోకాతిశయముచే వణకుచు నేస్చుచు నఱకఁబడి నేలఁబడిన యరటి చెట్టువలెఁ దెలివి తప్పిపడి మరలఁ దెలివిరాఁగా నా తలను వాసన చూచుచు.

తే. హా! మహాబాహ! రణధీర! హాసువీర!, యయ్యయో! నాశమైతివో◆ప్రాణనాథ!
యిట్టి నీచరమావస్థ◆నేను గాంచి, విక్రమైకధనాఢ్య హా ◆ విధవనైతి. ౬౭

అర్థములు. చరమావస్థ=చావు, సంస్కృతమున బాహాశబ్దమాకారాంతము.

తాత్పర్యము స్పష్టము.

క. సతి గుణహీనత చేతం, బతి తొలుతం జచ్చునంచుఁ ◆ బలుక్రుమరు బుధుల్
నుతశీల! నీవు నా దుష్కృతిఁ దెగితివి నేను లెస్స ◆ జీవింపఁగన్. ౬౮

అర్థములు. సతి=భార్యయొక్క, సిద్ధసమాసముకాదు, గుణహీనతచేతన్=దుర్గుణముచే, భర్తయొక్క యాయుస్సు, అభ్యుదయము వాని భార్య సుగుణదుర్గుణములకొలఁది నుండును. భార్య పోయిన జన్మమునందుఁ బాపకార్యములు చేసియుండెనేని యా పాపఫలము ననుభవింపవలసి యున్నది. కావున వైధవ్యము కలుగును. ఆమె పుణ్యాత్మురాలై యుండినయెడల నాయునయు దీర్ఘాయురారోగ్య ధనధాన్య సంపత్తిగలవాఁడగును. తినెడివారి యదృష్టముకొలఁది పెట్టెడివారి సంపద. నాకీ వైధవ్యము వచ్చుటకు నా పాపములే కారణము. నీవు నుతశీలుఁడవు=పొగడఁబడిన సదాచారసంపత్తి గలవాఁడవు. కావున దోషము నీయందు లేదు. దుష్కృతిన్=పాపముచే, 'వ్యభిచార రతా నారీ బాలరండా తు జాయతే' యని పోయిన జన్మమున జారిణియగు స్త్రీ యీ జన్మమున బాల్యమునందే విధవ యగును. తన దేహములో సగము దేహము, తన పుణ్యములో సగము పుణ్యము పంచియిచ్చి భారణ పోషణముల కాధారమై యెంతో ప్రేమ గలవాఁడై వర్తించు

భర్తను మోసము చేసినదాని కిహమందుఁ గాని, పరమందుఁ గాని సుఖమెందుండి వచ్చును ?

తాత్పర్యము

భార్యయొక్క గుణహీనతచేతనే దాని భర్త ముందుగాఁ జచ్చునని జ్ఞానులు చెప్పుదురు. నీవు సదాచారసంపత్తియందుఁ బొగడ్త గన్నవాఁడవు. కావున నీ వల్పాయు వగుటకు దోషము నీయందు లేదు. నేను జేసిన పాపము చేతనే నేను జీవించి యుండగనే నీవు మరణించితివి.

ఉ. పాపిని నే నటంటకును ♦ వారిజలోచన! సందియంబొకో
యాపదమీఁద నాపదలు ♦ ప్రాప్తములై వ్యసనాబ్ధి మున్గుచో
బ్రోపు ఘొనరింపఁ దెప్పగతిఁ ♦ బూని ప్రయత్నముఁ జేయు నిన్న యో
పాపపుమిత్తి ద్రెక్కొనియెఁ ♦ బాపము గల్గునె యింత కెక్కుడున్. ౭౭౯

అర్థములు. పాపినిన్=పాపాత్మురాలను, పుం. పాపి స్త్రీ, పాపిని, అటు+అంటకును = అప్రకారము చెప్పుటకు, ప్రోపు = రక్షణము, మిత్తి = మృత్యువు, ద్రెక్కొనియెన్=మ్రింగెను.

తాత్పర్యము

నేను పాపాత్మురాల ననుటయందు సందేహముకూడఁ గలదా? ఏలన:— సముద్రము నందలి యలలవలె నాపద వెంట నాపద మీఁదమీఁద రాగా నాపత్సముద్రమునందు మునుఁగు నపుడు నన్ను రక్షించుటకై తెప్పవలె ప్రయత్నము చేయు నిన్ను పాపపుమృత్యుదేవత మ్రింగెను. ఇంత కెక్కువ పాపముకూడఁగలదా?

సుగంధి. కుల్య! రామభద్ర! యిట్టి ♦ క్రూరమైన వార్త హృ
చ్ఛల్య వినంగఁ గల్గ ♦ సాధుశీల యత్త కౌ
సల్య పుత్ర పుత్ర రామ ♦ చంద్ర యంచు దుఃఖధీ
లౌల్య లేఁగఁ బాయు గోవు ♦ లాగ దెంత కుందునో. ౭౮౦

అర్థములు. కుల్య=మంచి వంశమునఁ బుట్టినవాఁడా! 'కృత్రిమాల్పనదీ కుల్యా ప్రణాళ్యాంచ కులోద్భవే॥ నానార॥ హృత్+శల్యము=హృదయమునందు మేకై, దుఃఖ, ధీలౌల్య=దుఃఖముచేఁ జలించిన బుద్ధిగలది.

గొప్పవంశమునఁ బుట్టినవాఁడా! నీకా యిట్టి నికృష్టపుఁ జావు. రామభద్రా! నేను జేసికొనిన పాపము నే ననుభవింపవలసినదే. తప్పదు. ఇది నాతోఁ బోదే. ఈ క్రూరమైన వార్తవినఁగానే హృదయమందు మేకుగొట్టినటులయి సాధు స్వభావముగల నా యత్తగారు కౌసల్య కొడుకా! కొడుకా? రామచంద్రా! యని యేడ్చుచే బుద్ధి చలించినదై లేదూడను బోఁగొట్టుకొన్న యావలె నెంత దుఃఖించునో కదా! నేనొక్కతెను జేసినపాపము నిరపరాధుల నెందఱ బాధించుచున్నదో చూడుము. సుగంధి – రజరజర గణములు – తొమ్మిదింటయతి.

ఉ. మాయురె! శాస్త్రవేత్త లస • మానపరాక్రమ! పల్కి రార దీ
ర్ఘాయువు నీకు, వారినుడు • లయ్యె నసత్యము ప్రాణనాథ! య
ల్పాయువు నీ విపైతి, వన • ఘాత్మక, నీకు నకాలమృత్యు వె
ట్లాయెనొ వారి కల్గె మతి • హానియు, దైవము హేతు వింతకున్. ౬౮౧

అర్థములు. మాయురె = ఔరా, శాస్త్రవేత్తలు=జ్యోతిషము తెలిసిన వారు, నుడులు=మాటలు.

తాత్పర్యము

ఏమి యాశ్చర్యము? జ్యోతిషము తెలిసినవారు అసమాన పరాక్రముఁడ వౌట నీకు యుద్ధమందు మరణము లేదనియు, దీర్ఘకాలము జీవించెదవనియుఁ జెప్పిరి. వారిమాట లసత్య మయ్యెను. ప్రాణేశ్వరా! నీ వల్పాయువైతివి. పాపరహితుఁడ వగుట నీకిట్లు మృత్యు విప్పుడు రావలసిన కారణములేదు. నీకు నిష్కారణముగ నకాలమృత్యు వెట్లు వచ్చినదో వారికి మతిహానియు నట్లేవచ్చెను. ఈ రెంటికి దైవమే కారణము.

చ. తెలియనివాఁడ వౌదువె పతీ! నయశాస్త్రము లెల్ల? వీనినిన్
జలుపఁగ వచ్చు నియ్యవి • విసర్జనయోగ్యము లం, చెఱుంగు ని
న్నలమె నదృష్టరూపమున • న య్యపమృత్యువు నిద్ర య న్మిషన్,
దలఁపఁగ నడ్డమాట గల • దా విధికిన్ మతి యెంత గల్గినన్. ౬౮౨

అర్థములు. నయశాస్త్రములు=నీతిశాస్త్రములు, విసర్జనయోగ్యములు= విడువదగినవి, అదృష్టరూపమున=కన్నులకుఁ గానరాని విధముగ, అపమృత్యువు= అకాలమృత్యువు=గండము, మిషన్=నెపమున.

తాత్పర్యము

నీతిశాస్త్రములెల్ల నీ వెఱుఁగనివాఁడవా? ఎప్పుడేది చేయవచ్చును, ఎప్పుడేది చేయరాదని నీ వెఱుఁగవా? ఇట్లన్నియుఁ దెలిసిన నీకు నిద్ర యను నెపమున నపమృత్యువు కన్నులకుఁ గానరాకుండ వచ్చి పైపడినది. ఎవఁ డెంతబుద్ధిమంతుఁ డైనను దైవసంకల్పమున కడ్డము లేదుగదా!

ఇంద్రవంశము. నీ రేజపత్రేక్షణ! నిర్దయాత్మికన్
క్రూరన్ మహారౌద్రను • ఘోరదుష్కృతా
కారన్ ననున్ వల్లభ! • కాళరాత్రినిన్
జేరంగ నీ త్రోయుటఁ • జేటుఁ దెచ్చితిన్. ౬౮౩

అర్థములు. నిర్దయాత్మికన్=దయలేని హృదయముగలదానను, క్రూరను= కఠినస్వభావముగలదానను, మహారౌద్రన్ =మిగుల భయంకరురాలను, ఘోరదుష్కృతాకారను=ఘోరపాపమే మూర్తీభవించినట్లున్నదానను, కాళరాత్రిని= కాళరాత్రి యను పేరుగల యొకానొక సర్వనాశంకరమైన దయ్యమును. నేనెకాఁడఁ

జేరుదునో యక్కడ నాశము చేయుదును. చంపితి నని యశ్లీలవాక్యము చెప్పలేక చేటు తెచ్చితి ననెను. నీరేజపత్రేక్షణ = కమలలోచన యనునవి హేతుగర్భ విశేష్యములు. దయ్యి మందముగా నున్నవారినే బాధించును. కావునఁ గాళరాత్రి యగు నేను నీకుఁ జేటు తెచ్చితి నని భావము. భరతుఁడు కైకను గాళరాత్రి యనెను. హనుమంతుఁడు సీతాదేవి నీ పాలిటిఁ గాళరాత్రి యనెను. సీతాదేవి రాముని పాలిటికిఁ దాను గాళరాత్రి యనెను. కాళరాత్రియను నది చేరిన చోట నాశనముచేయు శక్తి. ఇక్కడ కైకయు సీతయు నట్టి చెఱుపనచేటు లని తలఁప వలయును గాని వీరు కాళరాత్రి యవతారము లని తలఁపరాదు.

'పొలిచెఁ గాళరాత్రి పోలిక నా రాత్రి' ౯౧౧౮ ప. కాలరాత్రి నిగుడ్చు కాలుమాడ్కి-౧౬౬౭ ప. 'ఇన్ని ప్రయోగంబులందును భయంకరత్వము నాశకత్వము ద్యోతితము కాని సాక్షాత్కాళరాత్రి వచ్చిన' దని యర్థము కాదు.

కాళరాత్రి తనమగనిఁ దాను జంపదుగదా!- పరికరానుప్రాణిత రూపకాలంకారము. ఇంద్రవంశము=తతజర-గణములు, ఎనిమిదింట యతి.

తాత్పర్యము

తామరఱేకులవంటి కన్నులు గలవాఁడా! దయలేని మనస్సు గలదానను. కావుననే కఠినచిత్తను-కావుననే మహాభయంకరను-ఏలన, మహాభయంకరములగు పాపములు నా యాకారమును ధరించినవి. వల్లభ! నేను నీపాలికి కాళరాత్రిని. ఇట్టి దానిని నీవు చేరఁదీయుటచే నిన్నే చంపితిని. తేలును దగ్గఱదీసిన గుట్టక విడుచునా?

స్రగ్విణి. ఓ మహాబాహూ! నీ•యొద్దికం గానఁగా
నే మహానిష్ఠలన్ • నిచ్చ వర్తింపఁగా
రామ! భూమిం బరీ•రంభసందాతవై
ప్రేముడిం గూరితే • వీడితే నన్నిటన్. ౬౨౪

అర్థములు. నిచ్చ=ఎల్లవేళ, పరీరంభసందాతవై=కౌఁగిలించినవాఁడవై, ప్రేముడిన్=ప్రేమను.

తాత్పర్యము

దీర్ఘములైన బాహువులు కలవాఁడా! నీతోడ నుండఁగోరి నేను నిత్యము గొప్ప నిష్ఠల నాచరించుచుండఁగా నన్నువదలి భూదేవిని ప్రేమచేఁ గౌఁగిలించితివి గదా! నీ వేకపత్నీనియమము గల యనుకూల నాయకుఁడవే. నీకీ దక్షిణనాయకత్వము దగునా? స్రగ్విణి నాలుగు రగణములు-ఏడింటయతి.

క. సతమేను గంధసుమనో, వితతుల నర్చింప నాకుఁ • బ్రియ మగు కనకాం
చిత మగు నీ కార్ముక మీ, గతిఁ బట్టెనె నేఁడు దిక్కు•కానక వీరా! ౬౨౫

అర్థములు. సతము = ఎల్లప్పుడు, గంధసుమనో వితతులన్ = గంధము చేతను, పూలసమూహముల చేతను, కనకాంచితము=బంగారుచేఁ బ్రకాశించు, కార్ముకము = విల్లు.

తాత్పర్యము

ప్రతిదినము నేను గంధముచేతను, బూలచేతను బూజించునట్టియు నాకుఁ బ్రియమగు నట్టియు నీవిల్లు నేఁడిట్లు విచారించువారు లేక యీ గతిఁ బట్టెనా?

క. నా మామగారు నీపైఁ, బ్రేమము గల తండ్రితోఁడ • బితరులతో సు
త్రామజగంబున సౌఖ్యం, బామనిగా నున్నవాఁడ • ప్రాణేశా! ౬౮౬

అర్థములు. నామామగారు - కొన్నియెడల విశేషణంబు ద్వితీయాదులకుం బ్రథమ యగు. ప్రౌ.వ్యా.కార ౨. పితరులతోన్ = ఆయన తండ్రి తాతలతో, సుత్రామ జగంబున్=స్వర్గమందు, ఆమనిగా = సమృద్ధిగా, నాలుగవ పాదంబున ప్లుతయతి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నాకు మామగారును నీపైఁ బ్రేమగల తండ్రియు నగు నాయనతో, నాయన పితరులతో స్వర్గలోకమున సమృద్ధిగా సుఖము లనుభవించుచున్నావా?

క. అయపుణ్యశీలురకును సు, ప్రియముం బుణ్యంబు నగుచుఁ • బేర్గన్నత్వద
న్వయముం గను చున్నాఁడవె? నయశీలా! మింటనిలిచి • నక్షత్రమవై. ౬౮౭

అర్థములు, అయపుణ్య శీలురకున్ = శుభకార్యములుచేయు పుణ్యాత్ములకు, త్వదన్వయమున్=మీ వంశమును.

తాత్పర్యము

పుణ్యకార్యములు చేయువారికిఁ బ్రియమును న్యాయముగాఁ బుణ్యములు చేయునదియు నని ప్రసిద్ధిగన్న నీ వంశమును నాకాశమందు నక్షత్రమవై నిలిచి చూచుచున్నావా?

మత్తకోకిలము. బాలికం గద బాల్యమందున • ప్రాప్తనైతిని వల్లభా!
శీలినిన్ సహచారిణిన్ శుభ • శీల! భార్యను బత్నినిన్
బాలి నన్గన వేల? మాటయుఁ • బల్క వేటికి? నేమి కాం
తాళిమా హృదయేశ!మత్కృత • దారుణాఘమ చెప్పుమా. ౬౮౮

అర్థములు. బాల్యమందున=చిన్న వయస్సునందే, ప్రాప్తనైతిని=వివాహమాడుటచే నీకు లభించితిని. వివాహమప్పటికి నీవు చిన్న వాఁడవే, నేను జిన్నదాననే యని యర్థము, శీలినిన్ = శీలముగలదానిని, సహచారిణి=నీతోడ ధర్మములఁ జేయుదానను, భార్యను=భరింప యోగ్యరాలను, పత్నిని=పత్యుర్నో యజ్ఞసంయోగే ఇతిపత్నీ; పతికి నీమెతోఁగూడ యజ్ఞయోగము గలదు. నీవుచేయు యజ్ఞమందు నేను గూడ నుండవలసిన దానను, బాలిన్ = కాంక్షచే, కాంతాళిమా=కోపమా, మత్కృత = నాచేఁ జేయఁబడిన, దారుణ= ఘోరమైన, అఘము=పాపము.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నీవు నన్నగ్నిసాక్షికముగా వివాహము చేసికొన్న సమయమున మన మిరువురము బాల్యమందున్న వారమె కదా! అప్పటినుండి నీవు చేయు ధర్మకార్యములం దన్నిట సుఖదుఃఖములందును నీతోడనే తిరుగుచున్నానుగదా! వల్లభా! సదాచార సంపత్తి గలదాననే కదా! నీవే కదా నన్ను భరింపవలసినవాఁడవు. నన్నుఁగూడ నుంచుకొనియె కదా నీవు యజ్ఞములు చేయవలెను? ఇట్టి నన్ను ప్రేమచేఁ జూడవేల? ఒక్క మాటయిన మాటలాడవేల? నామీఁద నీకేమి కోపమా? హృదయేశ్వరా? లేక నేను జేసిన మహాఘోరపాపమా? చెప్పుము.

సీ. పాణిగ్రహణవేళ • బాయ నిన్ననినట్టి, బాసను మఱచితే•ప్రాణనాథ!
నీ తుల్య సుఖదుఃఖ • రీతుల నేఁ గాన, నీతోడఁ గొనిపొమ్ము•నీరజాక్ష!
నీ ప్రాణకాంతను•నేనిట దుఃఖింప, వీడి పో న్యాయమా•విదితచరిత!
నా దిక్కు నీవె కా • నాయకా! పరలోక, మర్హమా యొంటిఁబో•న్యాయశీల!
తే. సారఘనసారసమ్మిశ్ర•చందనముల, నవ్యభూషణముల నొప్పి • నాయొకర్త
యంకపాళి సుఖించు మే•నయ్యొ! కంక, గృధ్రముల పాలుపడియెనా•నృపవతంస.

అర్థములు. పాణిగ్రహణవేళన్=వివాహకాలమందు, నీ తుల్యన్=నీతో సమానురాలను, ఘనసార = పచ్చకర్పూరముతో, సమ్మిశ్ర = కలిపిన, చందనములన్=గంధములచే, నా యొకకర్త యంకపాళి = నన్నొకతెనే కౌఁగిలించుటచే, మేను=దేహము, కంక=రాపులుగులు, గృధ్ర = గ్రద్దలు, నృపవతంస = రాజశ్రేష్ఠా.

తాత్పర్యము

వివాహకాలమున నా పాణిని నీ పాణిచేఁ బట్టుకొన్నపుడు ధర్మార్థకామములందు నన్నతిక్రమించి పోనని ప్రమాణము చేసితివే ప్రాణేశ్వరా! దానిని నీవు మఱవవచ్చునా? నీ సుఖదుఃఖములను నీతో సమముగ ననుభవించు దానను గదా! కావున నీవు పోయిన చోటికి నన్నుఁ దోడుకొనిపొమ్ము. నీ ప్రాణములకుఁ బ్రియురాలనుగదా! ఇచ్చట నేను దుఃఖించుచుండ నీవు మాత్రము పోవుట న్యాయమా– నాకు దిక్కు నీవు తప్ప మఱియెవ్వరు లేరుగదా! నాయకా! నన్నిట దిక్కుమాలినదానను జేసి నీ వొంటరిగ పరలోకమరుగుట న్యాయశీలుఁడవగు నీకు ధర్మమా? రాజేంద్రా! ప్రతిదినము నాచేఁ బచ్చకర్పూరముతోఁ గలసిన చందనాదులు చేతను మనోహరములైన భూషణములచే నలంకరింపఁబడి నన్నొకతెనే కౌఁగిలించు నీదేహము నేఁడిట్లు రాపులుగులయు, గ్రద్దలయు పాలాయెనా?

ఈ కడపటివాక్యము శ్రీరామచంద్రమూర్తి యేకపత్నీవ్రతమును స్థాపించుచున్నది.

క. అగ్నిష్టోమాదుల హుత, భుగ్నికురుంబంబుఁ దన్పి ♦ పూర్ణంబుగఁ ద్వ
త్ప్రాఙ్నరపాలురగతిని త, దగ్నుల సంస్కార మందు♦టబ్బదె నీకున్. ౬౯౦

అర్థములు. అగ్నిష్టోమాదులన్ = అగ్నిష్టోమము మొదలగు యాగములచే, హుతభుక్+నికురుంబంబు = అగ్నిహోత్ర సమూహమును అనఁగా గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని ఇత్యాదులను, హుతభుక్+నికరుంబంబు= హుతభుఙ్నికురుంబం బని యైనఁ జెప్పవచ్చును. 'యరోఽనునాసికేఽనునాసికోవా' పాణిని ౮-౪-౪౫. ప్రాక్+నరపాలు రన్నచోట నిట్లులే గ్రహించునది, తన్పి = తృప్తిపఱిచి, త్వత్=నీయొక్క, ప్రాక్ నరపాలుర గతిని = పూర్వరాజులవలె, తదగ్నులన్ = ఆ శ్రౌతాగ్నులచే, సంస్కారమందుట = సంస్కరింపఁ బడుట, దహింపఁబడుట, అబ్బదె=లభింపదె.

తాత్పర్యము

నీ వగ్నిష్టోమాది యాగములఁ జేసి యగ్నులను పూర్ణముగఁ దృప్తిపఱిచి నీ పూర్వపు రాజులవలెనా యగ్నులచే సంస్కారమునొందుట లభింపఁదయ్యెఁగదా?

శ్రీరామచంద్రమూర్తి వనవాసమునకు ముందు అగ్న్యాధానము చేయలేదు. ఈవనవాసము దీర్చి యయోధ్య చేరిన పిమ్మటనే యాధానాగ్నిష్టోమాదుల నొనర్చి శ్రౌతాగ్ని సంపాదించుకొన్న మొదల ఆపై, వయఃక్రమముగాఁ గాలగతి తటస్థించెనేని యా యగ్ని చేతఁ బ్రేత సంస్కారము జరుగఁబడి యుండును గాని యవి యేవి చేయకమునుపే యిట్లపమృత్యువు పాలబడుటచే నగ్ని సంస్కారార్హ్యన కది లేకపోయెకదా యని సీత దుఃఖించె నని భావము. శ్రీరాముఁడు వనవాసపూర్వము యజ్ఞాదులఁ జేయలేదనుట యీ పద్యము సూచించుచున్నది. ఇదియే యయోధ్యా కాండమున విస్తరింపబడినది.

సీ. ఒంటి సౌమిత్రి య♦యోధ్యకుఁ బోవంగఁ, గౌసల్య యాతనిఁ♦గాంచి వనికి
నాయనా! మువ్వురు♦పోయితిరే మీరు, కలిసి యబ్బంగి నొ♦క్కండ విట్లు
వచ్చితి తక్కిన♦వార లే రన నీవు, రాక్షసతతులచే♦రాత్రి నిద్ర
బలఁగంబుతోడుతఁ♦బరిమార్పఁ బడుటయు, నేను రావణునింట♦నిట్టు లుంట
ఆ. జీవితేశ యతఁడు ♦ చెప్పిన బెగ్గిల్లి, కళవళించి కుంది ♦ కలవరించి
జలదరించి తరలి ♦ జలిమై దూపిల్లి, పల్లటిల్లి గుండె ♦ పగిలిచచ్చు. ౬౯౧

అర్థములు. ఒంటి = ఒక్కఁడే, వనికిన్ = అడవికి, బలగంబుతోడుత= సేనతో, బెగ్గిల్లి=భయపడి, కళవళించి=కలఁతచెంది, జలదరించి=కంపమంది, తరలి = చలించి, ఇటునటు దిక్కు తెలియకపోయి, దూపిల్లి = తపించి, పల్లటిల్లి=నెల్లఁబోయి, సముచ్చయాలంకారము, అన్నికార్యము లేక కాలమందు జరగక పోయినను సముచ్చయాలంకారమే యగును,

తాత్పర్యము

ఈ గండమునుండి తప్పించుకొని యొంటరిగా లక్ష్మణుఁ డయోధ్యకుఁబోఁగా గౌసల్య యాయనను జూచి నాయనా! యడవికి మీరు మువ్వురు పోయితిరే నీవొక్కఁడవే యిట్లు వచ్చితివే, తక్కినవా రేరీ యనిన నీవు రాత్రి నిద్రించునపుడు రాక్షసులచే నేనలతోఁడఁ జంపఁబడుటయు నేను రావణు నింటఁ జెఱఁబడి యీవిధముగా నుండుటయు నతఁడు చెప్పఁగా ప్రాణేశ్వరా! యీ పుణ్యవతి భయపడి కలఁతచెంది దుఃఖించి కలవరించి కంపించి చలించి దుఃఖముచేఁ దపించి తెల్లఁబోయి గుండెపగిలి చచ్చును. ఈ క్రియలు దుఃఖాతిశయమును నవస్థాభేదములను దెలుపును.

ఉ. ఉక్కున నొక్కఁటీఁడు మహి♦మోదధి పార్థివనందనుండు నా
మక్కువకాఁడు రాముఁడు కు♦మానిని నాకొఱకై యనర్హపుం
ఫక్కిని గూలె దాఁటియును♦వారిధి గోష్పదమంతమాత్రలోఁ
దక్కనె యట్టి దివ్యగుణ♦ధన్యుఁడు నీ దురదృష్టురాలికిన్ ? ౯-౨

అర్థములు. ఉక్కున = బలమునందు, ఒక్కఁటీఁడు = అద్వితీయుఁడు, సమానుఁడుగాని యధికుఁడుగాని రెండవవాఁడు లేనివాఁడు. మహిమ+ఉదధి= మాహాత్మ్యమునకు సముద్రుఁడు నామక్కువకాఁడు = నాయందు ప్రేమగలవాఁడు, కుమానిని = కుచ్ఛితపు స్త్రీయగు, అనర్హపుంఫక్కిని = యోగ్యముగాని విధముగా=వారిధి దాఁటియును, ఖరదూషణాదులను, సముద్రమును దరించియు, ముందు రావణుఁడే సముద్రమున కుత్తరతీరమం దీ యుద్ధము జరిగినదని చెప్పుటచే నిపుడు సముద్రము దాఁటివచ్చిరని చెప్పరాదు. గోష్పదమంతమాత్రలోన్ = అల్పుఁడగు ప్రహస్తు చేతిలోఁ, గోష్పదమంత - 'కొన్నిచోట్ల షష్ఠీసమాసంబునందు కారంబున కచ్చు పరంబగునపుడు నుగాగమంబునకు లోపంబును నగు—ప్రౌ—వ్యా—సంధి—౧౦—'గోపుల మిల్లిల్లును' ఉ.హరి,పూ౫ ఆ-బచ్చింట-పాండు ౩, ఆ. శిరసందంబు-పాండు -౨ ఆ ఇసుమంత—తిక్కన.

తాత్పర్యము

బలమునం దసమానుఁడు-మహిమయందు సముద్రుఁడు-రాజకుమారుఁడు-నాయందుఁ బ్రేమగలవాఁడు-రామచంద్రుఁడు-అల్పస్త్రీనగు నా నిమిత్తమై సముద్రమువంటి ఖరదూషణాదులను వారిసేనను జయించి గోపుపాదమువలె నల్పుఁడైన ప్రహస్తునిచేఁ జచ్చెనఁట. అటువంటి దివ్యగుణములే ధనముగాఁ గలవాఁడు నావంటి నిర్భాగ్యురాలికి దక్కునా ?

ఉ. పాపిని నన్ను నాత్మకుల♦పాంసనినంచు నెఱుంగలేక ని
ష్పాపుఁడు రామభద్రుఁడు వి♦వాహమునన్ గ్రహియించెఁ గూర్మి, నా
పాపపుఁజేఁత రామునకు♦భార్యయె మృత్యువు నయ్యె, భార్యదా
పాపము పుణ్య మెగ్గునను♦శుభం బొనగూర్చుఁ దదీయభర్తకున్. ౯-౩

అర్థములు. పాపిని = పాపాత్మురాలను, ఆత్మకులపాంసని=తన వంశము పాడుచేయుదానను, నిష్పాపుఁడు=పాపము వాసన యెఱుఁగనివాఁడు, నా పాపపు జేఁత=నేను జేసిన పాపముచేతనే, పాపము పుణ్య మెగ్గును. శుభంబు=క్రమాలంకారము, పాప మెగ్గును పుణ్యము శుభంబును అని యన్వయము.

తాత్పర్యము

పాపాత్మురాల నగు నన్నుఁ దన వంశమునాశముచేయుదాన నని తెలియలేక పాపమెట్టిదో యెఱుఁగనివాఁ డగుటచే నా వలనఁ దన వంశము వృద్ధియగు నని వివాహమునందు నన్నుఁ బ్రేమతో గ్రహించెను. నేను బాపాత్మురాల నగుట రామచంద్రునకు భార్యయే మృత్యువయ్యెను. సర్పమును బూలదండయని మెడలో వేసిననది కఱవక మానునా? భార్యవలన భర్తయెట్లు చచ్చు నందువా? భార్య చేసిన పాపము దాని భర్తకుఁ గీడును, పుణ్యము మేలును గలిగించుచుండును.

ఉ. నే నెదో పూర్వజన్మమున ♦ నిశ్చిత ముత్తమ మైన కన్యకా
దానము విఘ్నపా టొదవ ♦ దారుణవృత్తి ఘటింపఁ గంటి, న
ద్దానన సర్వలోకజన ♦ తాపరిపూజ్యుని భార్య నయ్యునున్
మానగు భోగకాలమున ♦ మాఁడెద నిట్లతిదుఃఖవహ్నులన్. ౬౯౨

అర్థములు. సర్వలోక=అన్నిలోకములందుండు, జనతా = జనసమూహముచే, పరిపూజ్యుని=చక్కఁగాఁ బూజింపఁబడువాని, అతిదుఃఖ = విస్తార దుఃఖమనెడు, వహ్నులన్=అగ్నులందు.

తాత్పర్యము

నేను బూర్వజన్మమందు నిశ్చయము కాఁబడిన యుత్తమకన్యాదానమును క్రూరురాలనై విఘ్నపఱిచితిని. ఆ కారణముచే నిప్పుడు సర్వజన సంపూజ్యుఁడైన వాని భార్యనయ్యును, సుఖ మనుభవింపవలసిన కాలమున శోకాగ్నులచేఁ గాల్పఁబడుచున్నాను. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మశుభాశుభ'మ్మని కలదు గాదా? ఇది వ్యావహారిక ధర్మ మనుసరించి లోకసంగ్రహార్థము చెప్పఁబడినది.

క. రావణ! మేలగు నన్నున్, జా వింతయు లేక రామ ♦ చంద్రునిమీఁదన్
ద్రోపుము సతిఁ బతిఁ గూరిచి, కావింపఁగదయ్య! పరమకల్యాణంబున్. ౬౯౩

అర్థములు. జావు = జాగు, ఆలస్యము-గకారమునకు వకారము-పగలు, పవలులోనగు వానివలె - కావింపఁగదయ్య = ప్రార్థనంబున నన్న్వత్యయాంత క్రియలమీఁదఁ గదకదవు నాన్నాదు లనుప్రయుక్తంబు లగు. ప్రౌ-వ్యా క్రి-సూ ౯. కావింపుమని ప్రార్థించెద నని యన్వయము.

తాత్పర్యము

రావణా! ఆలస్యము లేక రామచంద్రునిమీఁద నన్నుఁబడ వేయుము. భార్యను భర్తతోఁ గూర్చి పరమ శుభకరమైన కార్యము చేయుము. ఇట్లు చేసితివేని నీకు

మేలగును. రామచంద్రుని శిరస్సు, దేహము రావణుని స్వాధీనమందుండుటచే వానిని ప్రార్థింపవలసివచ్చెను. అవి నేను సహగమనము సేయుటకై నీవు నా స్వాధీనమందిమ్మని భావము.

క. రామునికాయముతోడన్, నా మేనిన్ నాదుశిరము ♦ నాథుశిరము ర
క్షోమండలవర! కూర్పుమ, యా మహితాత్మకునిగతికి♦నరిగెద నేనున్. ౬౮౬

తాత్పర్యము

రాక్షసరాజా! రాముని దేహముతో నా దేహము, నాథుని శిరముతో నా శిరము కూర్పుము. సహగమనము చేసి నా భర్త పోయిన లోకమునకు నేను బోయెదను.

సహగమన విషయమై శాస్త్రములం దీ వాక్యములు కానవచ్చుచున్నవి. "భర్తరి ప్రేతే బ్రహ్మచర్యం తదన్వారోహణంవా" విష్ణుస్మృతి. భర్త మరణించె నేని బ్రహ్మచర్యమైన నవలంబింపవలయును. లేదా సహగమనమైనఁ జేయవలయును. ఈ రెంటిలో నొకటి తప్ప మఱియేదియు (పునర్వివాహము) చేయ రాదని యర్థము.

"తిస్రః కోట్యర్థకోటీచ యానిలోమాని మానుషే. తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి" మనుష్యుల దేహముమీఁద మూఁడున్నరకోట్లు వెంట్రుకలుగలవు. సహగమనముచేసిన స్త్రీ యంతకాలము భర్తతో స్వర్గమునసుఖించును.

'మాతృకం పైతృకం చైవ, యత్ర కన్యా ప్రదీయతే కులత్రయం పునాత్యేషా భర్తారం యాఽనుగచ్ఛతి' భర్తతోడ సహగమనముచేయు స్త్రీ తల్లి వంశమును, దండ్రి వంశమును, భర్తవంశమును మూఁడు వంశములను పావనము చేయును.

'బ్రహ్మఘ్నోవా కృతఘ్నోవా మిత్రఘ్నోవా భవేత్పతిః। పునాత్యవిధవా నారీ తమాదాయ మృతాతు యా, మృతే భర్తరి యానారీ సమారోహేద్ధుతాశనమ్' మగఁడు బ్రహ్మహత్య చేసినవాఁడైనను, కృతఘ్నుఁడైనను, మిత్రద్రోహము చేసినవాఁడైనను వానితోడ మరణించి విధవగాని స్త్రీ వానితోడ నగ్నిహోత్రమందుఁ బ్రవేశించెనేని వానిని పవిత్రుని జేయును. గర్భిణిస్త్రీలు, చిన్న వయస్సు పిల్లలుగల స్త్రీలు సహగమనము చేయరాదు. భర్త దేశాంతరమందు మరణించెనేని ఆయన పాదుకలను ఱొమ్ముపై నుంచుకొని యగ్నియందుఁ బ్రవేశింపవలెను.

'సమారోహతి దీప్తేఽగ్నౌ తస్యాశ్శక్తిం నిబోధత, యది ప్రవిష్టో నరకం- బద్ధః పాశైస్సుదారుణైః సంప్రాప్తో యాతనాస్థానం గృహీతో యమకింకరైః విష్ఠితో వివశో దీనో వేష్ట్యమాన స్స్వకర్మభిః వ్యాళగ్రాహీ యథా వ్యాళం - బిలాద్గృహ్ణాత్యశంకితః సాతం భర్తారమాదాయ-దివంయాంతి సతీ చయాసా భర్త్రా పరమా స్వర్గే స్తూయమానాఽప్సరోగణైః క్రీడతే పతినా సార్ధం యావ దింద్రా శ్చతుర్దశ॥ భర్తతోడ నగ్నులయందుఁబ్రవేశించు స్త్రీశక్తి చెప్పెదవినుము.మగఁడు

మహాపాపియై పాశములచేఁ గట్టఁబడి, నరకమునకు దీసికొని పోఁబడి యాతనా స్థాన మందుంచఁబడినను వాఁడు చేసిన పాపములచే చుట్టుకొనఁబడినవాఁడై, వివశుఁడై, దీనుఁడై, నీచదశయందున్నను పతివ్రత పాములవాఁడు పుట్టలో నున్న పామును వెలుపలికి లాగునట్లు వానిని స్వర్గమునకు లాగుకొని పదునాలు గింద్రు లున్నంత కాలము స్వర్గమునసుఖించును. ఇది బ్రాహ్మణస్త్రీ వ్యతిరిక్త విషయము. బ్రాహ్మణ స్త్రీ భర్త చితియందే ప్రవేశింపవలయును. తక్కినవారికి వేఱు చితులని కొందఱ యభిప్రాయము. ఓయీ! "తస్మాదుహ న పురాయుష స్స్వర్గకామీ ప్రేయా దితి" శ్రుతిః. ఆయుష్య పూర్తికాకముందే మరణించరాదని సహగమనము నిషే ధించుచున్నది గదా! యందురేమో? ఆ వాక్యమున కర్థమేమన మోక్షార్థులగు స్త్రీలు అల్పకాలమందుండునది, అల్పసుఖ మిచ్చునది యగు స్వర్గమును గోరి యాయువును వ్యర్థము చేయరాదు. జీవితశేషము నిత్యనైమిత్తికకర్మములచే, శ్రవణ మనన నిదిధ్యాసన భక్తిజ్ఞానములచే నంతఃకరణ కళంకనాశము చేసెనేని నిత్య నిరతి శయానంద శాశ్వత బ్రహ్మపదప్రాప్తి లక్షణమైన మోక్షము లభించును. కావున ననిత్యాల్ప స్వర్గార్థము ఆయువును వ్యయపఱుపరాదు. కావున మోక్షముఁగోరక స్వర్గమునుగోరు స్త్రీ తక్కిన యితర కామ్యానుష్ఠానములవలె నిదియుఁ జేయఁ దగిన దని విజ్ఞానేశ్వరీయము.

దీనివలన మోక్షమందిచ్ఛ గలిగిన పతివ్రత విధవ యగునేని బ్రహ్మచర్య మవలంబించి భక్తి స్వధర్మ నిరతయై భక్తిమార్గమునఁ గాలక్షేపము చేయుటే యుత్తమ పక్షము. అట్లు చేసెనేని భర్తను దరింపఁజేయును.

ఈ సహగమనము పతివ్రత చేసిననే దంపతులు కిరువురకు శ్రేయస్సుగలదు. పాపాత్మురాలు చేసెనేని దాని పాపమును క్షయింపఁ జేసికొనునేకాని భర్తను రక్షింప లేదు. భర్తృసాలోక్యము పొందను లేదు. ఈ విషయము పురాణసారమందలి నారదవాక్యమువలన స్పష్టమగును. "పాపం యది కృతం భద్రే – పరపూరుష సేవయా। తథాన్యస్యాపి పాపస్య నాశో వహ్నిప్రవేశనాత్। పతివ్రతా ధర్మపత్నీ భర్తృశుశ్రూషణేరతా। యాఽనుగచ్ఛతి భర్తారాగ్నౌ స్వర్గం యాతి ఉభౌ ధ్రువమ్॥

కం. అని కమలాయతలోచన, తన హృదయేశ్వరుని శిరముఁ ధనువు మఱిమఱిన్
గనుఁగొను విలపించును నేడ్చును నారట మందుఁ గుందుఁ సొమ్మలు వోవున్.

తాత్పర్యము

ఈ ప్రకారము కమలములవలె దీర్ఘములైన కన్నులుగల సీతాదేవి తన భర్త శిరము, ధనుస్సు పలుమారు చూచిచూచి యేడ్చును, ఆరటమందును, దుఃఖించును, మూర్ఛపోవును.

"పతి నెడఁబాసిన సాధ్వియు క్షితి బ్రతుకంజాలదు." అయోధ్య ౮౯-౫ప. అని చెప్పిన సీతాదేవి యిప్పు డెట్లు బ్రతుకఁగలిగెను. ఈదివ్యదంపతులకు పరస్పర

సత్త్వమే జీవితధారణమందు నిమిత్తముగాని, జ్ఞానాజ్ఞానములుగావు. భర్తకు జీవిత వైకల్యము లేదు. కావున సీతాదేవి జీవింపఁగలిగెను.

—♦ మంత్రులు పిలువ రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట ♦—

సీ. అంతలో ద్వారపా♦లాధ్యక్షుఁ డరుదెంచి, హస్తముల్ జోడించి♦యార్యపుత్ర!
జయ మగు నంచు నా♦శాస్యముల్ వచియించి, దేవ! ప్రహస్తుండు♦తావకీన
దర్శనకాంక్షియై♦తక్కినసచివ వర్గంబుతో వాకిటఁ ♦ గాచినాఁడు
తనరాక యెఱిఁగింపు♦మనిన వచ్చితి రాజ, వైన నీవే చేయ ♦ నర్హమైన
ఆ. యది యవశ్యకార్య ♦ మైనది గలదు వి, జయము చేయు మన్న♦సత్వరముగఁ
బంక్తిముఖుఁ డశోక♦వని వీడి రాము ను,ద్యమము నెఱిఁగి సభకు♦నరిగియుండు.

అర్థములు. ద్వారపాలాధ్యక్షుఁడు = ద్వారపాలకుల కధిపతి ఆశాస్యముల్=దీవనలు, తావకీన=నీయొక్క, దర్శనకాంక్షియై=దర్శనము కోరినవాఁడై, ఆర్యపుత్ర శబ్దము భర్తను భార్య సంబోధించు పదము అయినను పూజ్యార్థంబున నిటఁ బ్రయుక్తము.

తాత్పర్యము

ఇట్లు సీత యేడుచుచుండఁగా నింతలో ద్వారపాలకుల కధిపతి యగు వాఁడు వచ్చి జయ జయ యని మంగళ వాక్యములు వచించి రాజా! మిమ్ముఁ జూడఁగోరి ప్రహస్తుఁడు తక్కిన మంత్రులతోడను వచ్చినాఁడు. వాకిట నిలబడియున్నాఁడు. తాను వచ్చినవార్త నీకుఁ దెలుపు మనుటచే వచ్చితిని, నీవే చేయవలసిన యవశ్య కార్యము గలదఁట. త్వరగా రమ్మను చున్నాఁడు. అని చెప్పఁగా నశోకవనము వదలిపోయి రాముఁడు చేయు ప్రయత్నము దెలిసికొని సభకుఁ బోయెను.

కం. వలసినకార్యముఁ గూరిచి, తలపోయుచు నుండెఁ; నిందు ♦ దశకంఠుఁడు త
త్తలమున్ వీడిన యంతన, తిలకింపఁగ శిరము ధను వ♦దృశ్యము లయ్యెన్.

తాత్పర్యము

అచ్చట రావణుఁడు యుద్ధవిషయమై చేయవలసిన యాలోచనచేయు చుండెను. ఇచ్చట రావణుఁ డశోకవనము విడువఁగానే రాముని తల, విల్లు అదృశ్యము లయ్యెను. దీనివలన నిది కేవల మనస్సంయమముచేఁ గల్పితమనియు,మనోబలముచే నిర్వహింపఁ బడెననియు, నా బలము తొలఁగఁగానే యదియుఁ బోయెననియు గ్రహింపనగును.

మ. అట రక్షోధిపుఁ డెల్ల కార్యములఁ బ♦ర్యాలోచనం జల్పి యు
త్కటసేనానుల నంతికస్థుల కనుం ♦ గాలార్హమా వాక్యలనే
స్ఫుటకోణాహతి భేరినాదముల ర ♦ క్షోవాహినీపాళి ను
ద్భటయుద్ధోద్యమ మొప్పఁ గూర్పఁదగుఁ, జె♦ప్పం బోకుఁడీ హేతువున్. ౨౦౦

అర్థములు. అంతికస్థులకు=సమీపమున నున్న వారలకు, కాలార్హము=

సమయోచితము, స్ఫుటకోణాహతి = స్పష్టమైన కోదవుల దెబ్బలచే, భేరినాదములతో=నగారాధ్వనులచే.

తా త్ప ర్య ము

ఆ సభయందు రావణుఁడు చేయవలసిన పని చక్కఁగా నాలోచించి దగ్గఱనున్న మంత్రులకు, సేనానాయకులకు నిట్లనియె. అందఱకు వినవచ్చునట్లు భేరులు గట్టిగా వాయించుచు రాక్షససేన నంతయు యుద్ధప్రయత్నముతో జతగూర్పుఁడు. వారికిఁ గారణము చెప్పవలదు. కారణము చెప్పిన నొకయాఁడుదాని నిమిత్తమయియా మనము చావవలయు నని కొందరు తిరుగబడవచ్చును. కొంద రుపేక్షించవచ్చును అని భయము.

కం. వాగును వల్లె యటంచును, వారల సైన్యంబు లెల్ల ♦ వలనుగ నొకచోఁ
గూరిచి తెలిపిరి వెస నా,తీరు రణోత్సాహియైన♦దివిజరిపునకున్. ౭౦౧

తా త్ప ర్య ము

ఆ మంత్రులు సేనానాయకు లట్లే చేసెదమని చెప్పి పోయి వారి వారి సేనల నెల్ల నొక్కొక్కచోఁ జేర్చి యా వృత్తాంతము రణమునం దుత్సాహము గల రావణునకుఁ దెలిపిరి.

—♦ 33-వ సర్గము. సరమ సీతాదేవిని సమాధానపఱచుట. ♦—

సీ. రావణాదిష్టయై♦రక్షించు సరమ యన్, చాన దృఢవ్రత ♦ సదయశీల
తనకు నెచ్చెలి యయి ♦ తన కాచు చున్నట్టి,సీత నుచిత యయి♦జాతదుఃఖ
మునఁజాలఁ దపియించి♦ముఁగుద విసంజ్ఞయై,పుడమిఘూళిని బ్రుంగి♦బడబయవఁగ
నుండుటఁ గనుఁగొని♦యొద్దకుఁ జని మృదు, వాక్యసంతతుల నా♦శ్వాసపఱిచి
తే. చెలిమిబలమున సువ్రత♦పలుకు నిట్లు, లూఁఅడిలుము జానకీ! ♦ యూఁఅడిల్లు
మాయలాఁ డగు రావణు♦మాటఁ బట్టి,వగచె దేటికిఁ దపియింప♦వలదువలదు.

అర్థములు. రావణాదిష్టయై=రావణునిచే నాజ్ఞాపింపఁబడినదై, రక్షించు= కాపాడు, తక్కినవారివలె బెదరించి బాధించునది కాదని భావము. చాన = స్త్రీ, ఈమె విభీషణుని భార్య తన భార్యలలో నెవ్వతెనైన నేర్పాటుచేసిన సవతి మచ్చరముచే నది సీత కేదైనఁ గీడు చేయునేమో యనియు, క్రొత్తవారి నేర్పాటు చేసిన వారు నగరమంతయు నీ రహస్య విషయము వెల్లడింతు రనియు రాక్షసస్త్రీలు కేవల భయమునే చూపుచుండిన సీతాదేవి విసిఁగి ప్రాణత్యాగము చేయునేమో యనియుఁ దలఁచి సాత్త్వికురాలైన యీమెను సీతాయోగక్షేమములు విచారింప రావణుఁడు నియమించెను. ఈ యింటివారు తప్పఁ దక్కినవా రంతఃపుర స్త్రీలైనను రావణునాజ్ఞ లేక అశోకవనము లోనికిఁ బోరాదని రావణుఁ డాజ్ఞచేసెను. అరణ్య ౫-౨౮ పద్యముఁ జూచునది.

దృఢవ్రత = స్థిరమైన పాతివ్రత్యము గలది. అనఁగా భర్త సీతయందు దనుకూల భావము గలవాఁడై యుండుటచేత నాయన మార్గమునందే పోవలయు నను దృఢనిశ్చయము గలది. భర్తల ననుసరించుటేకదా సాధ్వుల వ్రతము. ఈమె సాధ్వి గావున సాధ్వియగు సీతాదేవియందుఁ బక్షపాతము గలదయ్యెనని గ్రహింపనగు, (౨) తన ప్రాణమిచ్చియైన సీతాదేవిని రక్షింపవలెనను స్థిరమైన వ్రతము కలది. సదయశీల=స్వభావము చేతనే దయాగుణముగలది. ఆకారణముచే రావణుఁడు సీతను నిష్కారణముగఁ బెట్టు బాధ లామె మనస్సునకు సరిపడలేదని భావము. భర్తయాజ్ఞచేతనే కాక స్వభావగుణముచేతను సీతయందు సరమ పక్షపాతము వహింపఁగారణము చెప్పఁబడెను. నెచ్చెలి = స్నేహితురాలు. తక్కిన రాక్షసస్త్రీలవలె నీమె బెదిరింపక దయగలదై ధైర్యముఁ జెప్పుచు ననుకూలయై యుండుటచే సీతా సరమలకు స్నేహము కుదిరె నని భావము. వంచిత=మోసగింపఁబడినది. జాత దుఃఖమునన్=కలిగిన దుఃఖముచే, విసంజ్ఞయై = తెలివితప్పినదై, (౩) యథార్థజ్ఞానము పోయినది. అతి స్నేహము పాపశంకి గావున నీ మగఁడు చచ్చినాఁడనఁగానే యేడువ మొదలు పెట్టెను గాని, వీఁడు మాయలమారి గదా. వీని మాట నమ్మవచ్చునా యని కాని, విశ్వామిత్రుఁడిచ్చిన బలాతిబలలు, కౌసల్య కట్టిన రక్ష నిద్రపోయినను ఏమఱి యుండినను రక్షించునను విషయము తెలిసి యుండియు నవి రక్షింపక యేల పోవు నని కాని, రాముఁడు నిద్రించువేళ లక్ష్మణుఁడు నిద్రింపఁడుకదా యని కాని, కోట్లకొలఁది వానరులందఱు నేక కాలమున రక్షకులఁగూడ నియమింపక నిద్రపోదురా యని గాని, ఒకఁడు మేలుకొని యుండి నను రాక్షసుల గుంపును దూరమునఁ జూడఁగానే యందఱ లేపి యుండఁడాయని కాని సీతాదేవి యాలోచించినదికాదు. బ్రుంగి=మునిఁగి, బడబ = ఆఁడుగుఱ్ఱము, ఆశ్వాస పఱిచి=సమాధానపఱిచి, ముగుద=ముగ్ధ=మోసమెట్టిదో యెఱుఁగనిది కావున, నిది మోసమని తెలిసికొనలేకపోయినది, సువ్రత=పరోపకారవ్రతముగలది.

తాత్పర్యము

రావణుచే నాజ్ఞాపింపఁబడి సీతను రక్షించు సరమ యను రాక్షసి దృఢమైన పాతివ్రత్యముగలది. సీతారక్షణమందు భర్త యనుసరించిన మార్గ మనుసరించునది. ప్రాణమిచ్చియైన సీతాదేవిని రక్షింపవలయు నను వ్రతము గలది. స్వభావముచే దయాగుణముగలది. తనకు స్నేహితురాలయి తాను రక్షించుచున్న సీత రావణుచే మోసగింపబడి యా కారణమున గలిగిన దుఃఖముచే తపించుచు స్మృతితప్పి యాఁడు గుఱ్ఱమువలె నేల దుమ్ములో బడి మునిగియుండుట చూచి సమీపమునకు బోయి మెత్తని వాక్యముల నూరార్చి స్నేహబలముచే నాసువ్రత యిట్లులనెను. జానకీ! ఊరడిల్లు మూరడిల్లుము. మాయలమారి యగు రావణు మాట నమ్మి నీవేల దుఃఖించెదవు? సంతాపపడ వలదు వలదు. ఆదరమున ద్విరుక్తి.

ఉ. రావణుఁ డిప్డు నీవు బెద•రన్ వచియించినరీతి నాపయిన్
నీవును నుత్తరంబిడుట • నే గగనాంగణలీనగాత్రనై
రావణభీతి డీల్పడక • రాజముఖీ సకలంబు వింటి, నా
జీవితమందు నేన్ ప్రియము•సేయను నీ కొఱ కబ్జలోచనా. 203

అర్థములు. బెదరన్ = భయపడునట్లు, గగనాంగణలీనగాత్రనై=ఆకాశమున దాగిన దేహము కలదాననై (౨) చెట్లకొమ్మలలో దాగినదాననై, బావ యెదుట రాగూడదని దాఁగెనని భావము. తిరస్కరిణివిద్యచే నెవ్వరికిగానరానిదై, రావణభీతి=రావణుఁడు తెలిసికొనిన నేమిచేయునో యను భయముచే, డీల్పడక= దార్ఢ్యము చెడిన దానఁగాక. ఇట్లు చెప్పుటచే రావణుఁడు సీతకు రాముని శిరము చూపునపుడా ప్రాంతముల నెవ్వరుండఁ గూడదని యాజ్ఞాపించినట్లేర్పడుచున్నది. అట్లుండియు వానిని మోసగించి యామె యుండినది. ఇది ప్రాణాపాయకరమైన విషయముగదా! రాజముఖీ=చంద్రునివంటి ముఖము గలదానా! ఇట్లు చెప్పుటచే సరమవాక్యముల సీత ప్రసన్నవదన యయ్యెనని సూచన.

తాత్పర్యము

ఇప్పుడు నీవు భయపడునట్లు రావణుఁడు చెప్పినవిధము దానికి నీవు ప్రత్యుత్తరమిచ్చిన విధము నేనాకాశమున యోగవిద్యచే నెవరికిఁ గానరాక, రావణునకు భయపడక సర్వము వినుచుంటిని. ఏలయింత సాహసము జేసితివి? రావణుఁడు తెలిసికొని యుండిన నీకుఁ బ్రాణాపాయము కలిగించి యుండునే యనెదవేమో! నీకు మేలు కలిగించుటయందు నాకుఁ బ్రాణము మీఁదను నాశలేదు. ప్రాణము విడిచియైన నిన్ను రక్షించెదను. కావున నాకొఱకై నీవు విచారపడకుము.

ఆ. అసురనాథుఁ డిప్డు • డదరున బెదరున, నాదబాద చనిన•యట్టివిధము
నేను వెలికి నరిగి • సర్వంబు జెతెఁగితి, వినఁగదమ్మ! సీత•విశదముగను. ౨౦౪

అర్థములు. అదరున = గుండెలు చలింపఁగా, బెదరున = భయముచే, ఆదబాద=తొందరతొందరగా, రూ. ఆదరబాదర.

తాత్పర్యము

రావణుఁ డిప్పుడు భయమున గుండె లదరఁ దొందర తొందరగాఁ బోయిన విధముఁ జూచి దీనికేమి కారణమని నేను వెలుపలఁబోయి వాస్తవ మెఱింగి వచ్చితిని. దాని విధము చెప్పెద వినుము.

ఉ. అమ్మరో! నిద్రవోవ విది • తాత్మని రాముని హింస సేయ శ
క్యమ్మునను గాదు, నీదు విభుఁ • డంతము నొందఁడు, పాద పాయుధుల్
నెమ్మది నున్నవారలు వ • నేచరు లందఱు, వారి నొంప సా
ధ్యమ్మును గాదు వేల్పులు బ • లారివలెన్ రఘురాముఁ డోమఁగన్. ౨౫౦

అర్థములు. విదితాత్మని=(౧) తెలియఁబడిన యాత్మగలవాఁడు. ఆత్మజ్ఞాని కపమృత్యువు రాదని భావము. (౨) ప్రసిద్ధికెక్కిన విష్ణువును (౩) ప్రసిద్ధికెక్కిన ధైర్యముగలవానిని- (౪) ప్రసిద్ధికెక్కిన బుద్ధిమంతుని-శక్యమ్మనుగాదు= సాధ్యము పడనేపడదు. అట్లుచేయ నాలోచింపనుగూడ సాధ్యపడదు. కనుకనే రావణుఁ డట్టి యాలోచన చేయలేదు. కౌసల్య గట్టిన రక్షచేతను విశ్వామిత్రుఁ డిచ్చిన బలాతిబలల విద్యచేతను ప్రమాదదశయందైనను రామలక్ష్మణులకుఁ గీడెవ్వరుచేయ సాధ్యపడదు. బాల-ప. ౬౧౬. "నిదురను బూనియున్న యెడనేనిఁ బ్రమాదము నందునేని నాఁపద నొదవింపలే రసురసంతతులు"- పాదపాయుధుల్= చెట్లాయుధములుగాఁ గలవారు-వనేచరులు=వానరులు-ఓమఁగన్=రక్షింపఁగా.

తాత్పర్యము

అమ్మా, సీతా! విదితాత్ముఁడగు రామచంద్రమూర్తిని నిద్రపోవు సమయంబున హింసింప సాధ్యమునుగాదు. అట్లు చంపఁబడనులేదు. చెట్లనాయుధములుగాఁ గొని వానరు లందఱు క్షేమముగా నున్నారు. ఒక్కఁడైన జావలేదు. దేవతలను నింద్రుఁడు రక్షించునట్లు వానరులను రామచంద్రమూర్తి రక్షించుచుండుటచేత వారిని బాధింప నెవ్వరికి సాధ్యపడదు.

సీ. వెడఁదవక్షమువాఁడు•నిడుద వట్రువయునై, కవణిల్లు పీనబా•హువులవాఁడు
శౌర్యంబుగలవాఁడు•సతతంబుఁ దన్నును,దన యాశ్రితులఁ బ్రోవఁ•దనరువాఁడు
ధర్మచింతగలాఁడు•ధరణివిఖ్యాతుండు,డంబుమీఱిన కార్ము•కంబువాఁడు
సంహననమువాఁడు•చారుసౌందర్యల,క్ష్మీవిధానం బయి•చెలఁగువాఁడు.

తే. బంధురంబైన దోఃప్రతా•పంబువాఁడు, నీతిశాస్త్రవిదుం డన•నెగడువాఁడు,
సోదరునిలక్ష్మణునిఁగూడి•యొప్పినాఁడు,యువతిసీభర్తకుశలి•యైయున్నవాఁడు.

అర్థములు. వెడఁద=విశాలమైన, నిడుద=నిడివి, వట్రువ = గుండ్రము, కవణిల్లు=ఒప్పునట్టి, పీన = బలిసిన, బాహువులవాఁడు = చేతులు గలవాఁడు, సంహననము = అవయవసౌష్ఠవము, బంధుర = అధికము, దోఃప్రతాపము_భుజప్రతాపము.

తాత్పర్యము

నా మగఁడు క్షేమముగా నున్నాఁడంటివే నీవు చూచివచ్చినావా యందువేమో! చెప్పెదవినుము. వెడలుపగు ఱొమ్ముగలవాఁడు, నిడవి గుండ్రమునై బలసిన చేతులవాఁడు, శౌర్యముగలవాఁడు,తన్నుఁదనయాశ్రితులను గాచువాఁడు,పది చేసినను ధర్మమును విచారించి చేయువాఁడు, భూమియందుఁ బ్రసిద్ధుఁడు, మిగులఁ గాంతిగల విల్లుగలవాఁడు, అవయవసౌష్ఠవము గలవాఁడు, మనోహరమైన సౌందర్యలక్ష్మికి స్థానమైనవాఁడు,విశేష భుజప్రతాపము గలవాఁడు,నీతిశాస్త్రము తెలిసినవాఁడని పేరుపడ్డవాఁడు, తమ్ముఁడగు లక్ష్మణునితోడనున్నాఁడు. నీ భర్త

కుశలముగా నున్నాఁడు. ఇట్టి చిహ్నములు, గుణములు గలవానికి నపమృత్యు వెట్టులు వచ్చునమ్మా !

కం. సీతా! శాత్రవసేనా, వ్రాతనికారణుఁ డచింత్య ♦ బలపౌరుష వి
ఖ్యాతుఁ డజయ్యుఁడు శ్రీసము, పేతుఁడు రాముండు కాఁడు♦హింసితుఁ డబలా!

అర్థములు. శాత్రవ సేనావ్రాత నికారణుఁడు = శత్రుసేనల సమూహములఁ జంపువాఁడు - అచింత్య = ఇంతేయని యాలోచింప సాధ్యముకాని - బల పౌరుష విఖ్యాతుఁడు = బలమునందు, పౌరుషమునందు ప్రసిద్ధికెక్కినవాఁడు, అజయ్యుఁడు=జయింప శక్యముగానివాఁడు - 'క్షయ్యజయ్యౌశక్యార్థే' అని పాణిని. శ్రీసముపేతుఁడు=శోభతోఁగూడినవాఁడు-హింసితుఁడు=చంపఁబడినవాఁడు.

తాత్పర్యము

శత్రుసేనల వధించువాఁడును, ఇంతయని యాలోచించి తెలియరాని బల పౌరుషములు గలవాఁడును, జయింప సాధ్యపడని వాఁడును, లక్ష్మీయుక్తుఁడు నగు శ్రీరామచంద్రమూర్తి చంపఁబడినవాఁడు కాఁడమ్మా, సీతా !

తే. తెలివిమాలిన పనులను♦జలుపువాఁడు, నఖిలభూతంబులకుఁ బగ♦యైనవాఁడు
మాయలను జక్కనెఱిగిన♦మాయలాఁడు, క్రూరకర్ముండు నిన్నంత♦కుతిలపఱిచె.

అర్థములు. పగ=విరోధి - కుతిలపఱిచెన్ = బాధపెట్టెను - రావణుఁడు కర్త - అధ్యాహార్యము - బుద్ధిమాలిన పనులను = బుద్ధిమాలినవి పనులుగాపు వానిని జేసినవాఁడు బుద్ధిమాలినవాఁడు- బుద్ధిమాలిన వాని పనులు బుద్ధిమాలిన పనులు - మధ్యమపదలోపి.

తాత్పర్యము

బుద్ధిలేక పనులను చేయువాఁడును, అన్ని జీవులకు విరోధియైన వాఁడును, మాయలను బాగుగఁ దెలిసినవాఁడును, క్రూరమైన పనులను చేయువాఁడు నగు రావణుఁడు నిన్నిట్లు బాధపెట్టెను.

కం. పోయెను దుఃఖము లన్నియు, దాయఁగ నున్నయది శుభము♦తరుణీ నిన్నున్
జేయని భజింప సిరి వి చ్చేయును ముత్కరముఁ బ్రియముఁ♦జెప్పెద వినుమా.

తాత్పర్యము

దుఃఖము లన్నియుఁ బోయెను. మేలు రానున్నది. నిన్ను సేవింపలక్ష్మి జేయని వచ్చును. నీకు సంతోషకరమైనది యొకటి చెప్పెద వినుము. పోయెను దుఃఖములు= అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు. సు. వ్యా-వాక్య. ౪౧ సూ.

—♦ సీతాదేవికి సరమ యుద్ధసన్నాహముఁ దెలుపుట ♦—

సీ. వారిధి దాఁటి సీతాపతి కీశసేనతోఁ, దక్షిణతీరంబు ♦ దఱిసినాఁడు
జలధితీరస్థ మా♦శైలాటసేనచేఁ బరిరక్షితుం డయి ♦ ప్రబలినాఁడు

పూర్ణార్థుఁడగు రఘుపుంగవుఁ గన్నారఁ, గంటిఁ దమ్మునితోడఁ, గ్రాలినాఁడు
రావణప్రేరితరాక్షసుల్ లఘుపరా, క్రము లకూపారంబు రాఘవుండు
ఆ. దాఁటినాఁడటంచుఁ దద్వార్తఁ దెలిపిరి, దానఁ జూమ్మ పేఁడు దశముఖుండు
మంత్రిజనముతోడ మంతనం బున్నాఁ డ, టంచుఁ జెప్పుచుండు నంతలోన.

అర్థములు. తతిసినాఁడు=చేరినాఁడు, జలధితీరస్థము=సముద్రము నొద్దున నుండునది, శైలాటసేనచే=వానరసేనచే, పూర్ణార్థుఁడు = నిండిన యుద్ధవస్తువులు గలవాఁడు, యుద్ధమున కుపయోగకుడు వస్తువులన్నియు కొఱతలేక నిండించికొని యున్నాఁడు. 'అర్థః-అభిధేయే ధనేశాస్త్రే వస్తుహేతు నివృత్తిషు' నానా॥ర॥ కన్నారఁ గంటిన్=నేను జెప్పునది వినికిడిమాటలుగావు. నా కన్నులతో నేను జూచి చెప్పుచున్నాను. ఈ సరమకు సదృశ్యవిద్యయే గాక యాకాశయాన శక్తియుఁ గలదు. (చూ ౭౨౪ ప) కావునఁ బోయి చూచియుండవచ్చును. లేదా, ఎత్తైన మేడయెక్కి రావణుఁడు చూచినట్లు చూచియుండవచ్చును. లఘుపరాక్రములు=వేగముగఁబోవ ననుకూలమైన బలముగలవారు, అకూపారంబు=సముద్రము, మంతనము=ఆలోచనము.

తాత్పర్యము

సముద్రమును దాఁటి నీ మగఁడు వానరసేనతో దక్షిణతీరమునకు వచ్చి యున్నాఁడు. వానరసేనయంతయు సముద్రమునొద్దున రాముని రక్షించుచున్నది. యుద్ధమునఁ వానరులకుఁ గావలసిన వస్తువులన్నియు పూర్ణముగ సంపాదించి యుంచుకొన్నాఁడు. తమ్మునితోడ నున్నాఁడు, ఇవన్నియు నేను జూచి చెప్పుచున్నాను. వినికిడి మాటలుగావు. రావణుఁడు పంపిన వేగము పరాక్రమముగల రాక్షసులు రామచంద్రమూర్తి సముద్రము దాఁటివచ్చి దక్షిణతీరముఁ జేరినాఁడని చెప్పిరి. ఆ కారణముచే రావణుఁడు మంత్రులతో నాలోచించుచున్నాఁడు అని చెప్పుచుండఁగనే.

క. వినఁబడియె రణోద్యోగం, బునఁ దనరిన సైన్యసంఘముల భైరవని
స్స్వానముల్ దండాహతసం, జనిత మహాభేరికానిచయరావంబుల్. ౨౧౧

అర్థములు. రణోద్యోగంబునన్ = యుద్ధప్రయత్నమునందు, భైరవ = భయంకరములైన, నిస్స్వనముల్ = సింహానాదధ్వనులు, దండాహత=కొయ్యచేఁ గొట్టఁబడుటచే, జనిత = పుట్టిన - మహాభేరికా = పెద్దనగారాల, నిచయ = సమూహముల, రావంబుల్=ధ్వనులు.

తాత్పర్యము

యుద్ధప్రయత్నమునందున్న సేనాభటుల భయంకరధ్వనులు, కట్టెలచేఁ గొట్టఁబడుచున్న నగారాలధ్వనులు విననచ్చెను.

క. గురునిర్ఘోషము వినుచు మ, ధురభాషిణి సరమ సీతతోనను బిటికీ
పరఁగెడి నల్లదె వింటివె, సరభసముగ నెసఁగు సమరసన్నాహంబుల్. ౨౧౨

అర్థములు. గురునిర్ఘోషము = పెద్దధ్వని - మధురభాషిణి = తియ్యని మాటలుగలది, సరభసముగన్ = త్వరగా. సమరసన్నాహంబుల్ = యుద్ధ ప్రయత్నములు.

తాత్పర్యము

ఆ గొప్పధ్వని విని యింపుగా మాటలాడు సరమ సీతాదేవితో నిట్లనియె. పిఱికిదానా! నీవు తెరకు భయపడితివే. వింటివా? తొందర తొందరగా రాక్షసులు చేయు యుద్ధప్రయత్నములు.

ఉ. తోయదగర్జతోడఁ దుల•మాఁగు గభీరపుభేరికారవం
బాయత మయ్యె గర్జితగ•జాళుల సజ్జనసేయువారు తే
ర్లాయితముల్ తురంగనిచ•యంబులఁ బూన్చుచు నున్నవారు జా
తీయహయాళి నెక్కి చను•దెంచిరి కౌతులు ప్రాసహస్తులై. ౨౧౫

అర్థములు. తోయదగర్జతోడన్ = మేఘముల యుఱుములతో-తులఁదూఁగు= సమానమగు-గభీరపు భేరికారవంబు = దీర్ఘమైన నగారాలధ్వని-ఆయతము = విస్తారముగ వ్యాపించినది-గర్జిత గజాళులన్=ఘీంకారములుచేయుచున్న యేనుఁగుల గుంపులను-సజ్జనసేయువారు = సిద్ధము చేయుచున్నవారు-అలంకారములు లోనైనవి-ఆయితముల్ = సిద్ధపఱుపఁబడినవి- తురంగనిచయంబులన్ = గుఱ్ఱముల సమూహములను - జాతీయ = ఉత్తమజాతియందుఁ బుట్టిన-హయాళిన్ = గుఱ్ఱముల గుంపులను - కౌతులు = గుఱ్ఱపుదండువారు-ప్రాసహస్తులై = ఈఁటెలను జేతుల ధరించినవారై - పూన్చుచు = పూనునట్లు చేయుచు-ఇది పూనునకు ప్రేరణార్థక రూపము-రూ-పూంచుచు.

తాత్పర్యము

యుద్ధప్రయత్నము లేవి జరుగుచున్న వందువా? మేఘముల యుఱుములతో సమానమైన భేరీధ్వనులు నాలుగు ప్రక్కల వ్యాపించుచున్నవి. నీకు వినవచ్చుచున్నవి కదా! ఘీంకరించుచున్న యేనుఁగులను నలంకారము చేసి తొండములకు రోఁకం డ్లిచ్చిముఖముల కడ్డముగ నినుపరేకులు కట్టుట మొదలగు పనులు చేయుచున్నారు. రథములకు గుఱ్ఱములను గట్టుచున్నారు. రౌతు లీఁటెలు చేత ధరించి యుత్తమజాతియందు బుట్టిన గుఱ్ఱముల నెక్కుచున్నారు.

కం. అట నటఁ బాదాతికు లగు భటు లుద్భటవృత్తి మూఁగు•వారలుచుమ యు
త్కటదర్శనసేనలతోఁ, బటునదములతోడ రాచ•బాటలు పురిలోన్. ౨౧౬

అర్థములు. అటనటన్ = అచ్చటచ్చట - పాదాతికులు = కాలిబంట్లు-ఉద్భటవృత్తిన్=అధికసన్నాహముతో-మూఁగువారు= గుంపులుచేరుచున్నారు-ఉత్కటదర్శన సేనలతోన్=మంచి యలంకారములు చేసికొని మంచి దర్శనముగల సేనలతో-పటునదములతోడ=గొప్ప ధ్వనులతోడ.

తాత్పర్యము

అచ్చట నచ్చట కాలిబంట్లు అధికసన్నాహముతో నలంకారాదులచే నింపైన వేషముతో, గొప్ప ధ్వనులతో గుంపులు చేరుచున్నారు. పురమునందలి రాచబాటలు.

ఉ. నీరధి వారిపూరముల • నిండినభంగిని నిండి యున్న; వో
చారుదతీ! ధగద్ధగిత • శస్త్రములున్ దృఢచర్మవర్మముల్
వారణఘోటకాళి రథ • వర్గము రాక్షసవీరపాళు లెం
తే రహిఁ బూను భూషలు న • వే దివి నించె ననేకకాంతులన్. ౨౧౫

అర్థములు. నీరధి = సముద్రము - వారిపూరములన్ = జలప్రవాహము లచే - చారుదతీ=మనోహరమైన దంతములు గలదానా-ఈ వార్తవినిసీత సంతోషించె ననియు, ముఖము వికాసమై పెదవులు సందు విడిచె ననియు గ్రాహ్యము-ధగద్ధగిత=ధగధగ లాడుచున్న - దృఢచర్మవర్మముల్ = గట్టి చర్మముతో చేయబడిన కవచములు-దృఢచర్మములు వర్మములు - చర్మములు = డాలులు, వారణఘోటకాళి = ఏనుగుల గుఱ్ఱముల గుంపులు - రథవర్గము = తేర్లసమూహము- భూషలు = సొమ్ములు-ఎంతే రహిన్ = విశేషాసక్తితో-దివిన్ = ఆకాశమును అనేకకాంతులన్=నానావిధములైన కాంతులచే.

తాత్పర్యము

వీళ్ళచే సముద్రము నిండినట్లు నిండియున్నవి. సుదతీ! ధగధగ మను కత్తులు లోనగు శస్త్రములయు, గట్టిడాలులయు, కవచములయు, ఏనుఁగులయు, గుఱ్ఱములయు, రథములయు, రాక్షస వీరులయు నెంతో యాసక్తితో ధరింపఁబడిన భూషణముల నానావిధములైన కాంతులు ఆకాశమున నిండియున్నవి.

కం. నడువేసంగిని నెండిన, యడవుల దహియించు కారు • టగ్గి యనంగా
దడముల దట్టపుఁదేజు ని, బిడమై యొప్పారె నిపుడు•బిసరుహనేత్రా! ౨౧౬

అర్థములు. నడువేసంగిని = నడిమి యెండకాలమందు = కారు+అగ్గి = కారుటగ్గి=కారుచిచ్చు, దడముల=సేనల, నిబిడమై=దట్టమై.

తాత్పర్యము

నడిమి యెండకాలమందు నెండిన యడవులను గాల్చు కారుచిచ్చువలె సేనల యధికమైన కాంతి దట్టముగ వ్యాపించి యున్నది.

సీ. విన వమ్మ! ఘంటల•వివిధఘణంఘణల్, రథముల దబదబల్•రమణి వినుము
ఆలకింపఁగదమ్మ•హయముల హేషల, నాలింప వమ్మ తూ • ర్యారవంబు
లది యుద్యతాయుధ • హస్త రాక్షసేంద్రానుయాయుల రోమ•హర్షమైన
సంభ్రమం బగుఁ జుమ్మ • సంతాప పడకమ్మ, వ్యసననాశిని యైన•హర్షలక్ష్మి

తే. చేరు నిను రాక్షసాళికిఁ • జేటు గలుగు, విజితరోషుండు నవిచింత్య•విక్రముండు
సారసాక్షుండు నిర్జర•స్వామిసముఁడు, రావణు వధించి నిన్నేలు•నీ విభుండు.

అర్థములు. హేషలన్ = గుఱ్ఱపుధ్వనులను గుఱ్ఱపు ధ్వనికే హేష యని పేరు. కావున హయముల హేష లన్నప్పుడు హేషకు ధ్వని యను సామాన్యార్థమునే గ్రహింపవలయును. కరి, కలభము, జనహయము ముక్తాఫలహారము, కడాని బంగరు లోనైన వానివలె గ్రహించునది. తూర్యారవంబు = వాద్యధ్వని, ఉద్యతాయుధ హస్తుల = ఎత్తఁబడిన యాయుధములు గల చేతులు గలవారలయు, రాక్షసేంద్ర అనుయాయులు = రావణుని వెంబడించు వారలయు - రోమహర్షము = గగ్గురుపాటు గలిగించు, సంభ్రమము= ప్రయత్నము-విజితరోషుండు= క్రోధముజయించినవాఁడు-అవిచింత్య విక్రముఁడు=చింతింప సాధ్యపడని విక్రమము గలవాఁడు-సారసాక్షుండు = కమలములవంటి కన్నులు గలవాఁడు, 'శ్రీర్న త్యజతి రక్తాక్ష'మ్మను సాముద్రికశాస్త్రప్రకారము రామునిఁ దప్పక లక్ష్మి భజింపఁగలదు. 'శ్రేష్ఠేత్ర తాపి చక్షుషీ' సర్వేంద్రియాణాం నయనంప్రధాన' మ్మన్నట్లు సర్వావయవ లక్షణములకన్న నయనసౌందర్య లక్షణము తప్పదని భావము, నిర్జరస్వామి సముఁడు=ఇంద్రునితో సమానుఁడు.

తాత్పర్యము

సీతమ్మా! వినుము. ఘంటల ఘణఘణలు, రథముల దబదబలు వినుము. గుఱ్ఱముల సకిలింపులు, వాద్యముల మ్రోతలు వినుము. ఇదంతయు నాయుధములు ధరించిన రావణు భటుల యుద్ధప్రయత్నములు. కావున రామచంద్రమూర్తికి గీడు కలిగెనని విచారపడకుము. అది నిజమైనయెడల నిపు డీ ప్రయత్నమేల? వ్యసనమును నాశముచేయు సంతోషలక్ష్మి నిన్నుఁ జేరఁగలదు. రాక్షసులకుఁ గీడు గలుగును. క్రోధమును జయించినవాఁడు, చింతింపరాని పరాక్రముఁడు. కమలములవంటి నేత్రములు గలవాఁడు, ఇంద్రునితో సమానుఁడు నగు నీ మగఁడు రావణుఁ జంపి ని న్నేలుకొనును.

కం. బాసట గాఁగ నుపేంద్రుఁడు, వాసవుఁ డరివధము సేయు•వడువునను సుమి
త్రాసుతయుతుఁడై నీ పతి, యాసురసైన్యముల నెల్ల•హతముం జేయున్. ౨౯

అర్థములు. బాసట=సహాయుఁడు-ఉపేంద్రుఁడు = విష్ణువు, వాసవుఁడు = ఇంద్రుఁడు - అరివధము=శత్రువధము-వడువున=విధముగ.

తాత్పర్యము

విష్ణువు తోడుగా నింద్రుఁడు శత్రువులఁ జంపినట్లు లక్ష్మణునితోడ నీ మగఁడు రాక్షససేనల నాశము చేయును.

సీ. చూడక పోదునా • సుందరీ! జితవైరి, నీ పతికుశలువున • నీవు గాంచు
విడువక పోదువా•వెలఁది! కాంతునిఁ గ్రుచ్చి, కౌఁగిట ముదాబ్ధిప్ల•కణము లెదను

బతి చిక్కఁదీయునే•పదము లంటెడునిన్ని, నెలలుగఁ బెనఁగొన్న•నీదుజడను
బాయక యుందువా•పాముకుబుసము నాఁ, బతిఁ జంద్రముఖుఁజూచి•వ్యసనమెల్ల
తే. రావణాసురుఁదూర్ణంబ•రామచంద్రుఁ, డనినివధియించి ప్రియురాల•వైననిన్నుఁ
గదిసి సౌఖ్యార్హుఁడెల్లభోగములఁ దేలు, సంతసింపఁగదమ్మ యో•జానకమ్మ.

అర్థములు. జితవైరి జయింపఁబడిన శత్రువులుగలవాఁడు- కులుకునన్ = తొడమీఁద - ముత్ + బాష్పకణములు = ఆనందబాష్ప బిందువులు-ఎదను = హృదయమందు - తూర్ణంబ = వేగము-అనిని = యుద్ధమందు.

తాత్పర్యము

సుందరీ! శత్రువుల జయించిన నీ మగని తొడమీఁద నీవు కులుకుచుండఁగా నేను జూడకపోదునా? నీ మగని నీవు కౌఁగిలించి యతని హృదయమందు నీవానంద బాష్పములు విడువకుందువా? పది నెలలుగాఁ బెనసిన, పాదముల నంటుచున్న నీ జడను నీ మగఁడు చిక్కఁదీయును లే. ఇట్లు జరుగఁగా బాము కుబుసము విడిచినట్లు నీవు వ్యసనమును విడువకుందువా? రావణాసురుని నీమగఁడు వేగముగనే యుద్ధమున జంపి ప్రియురాల వగు నిన్నుఁజేరి సౌఖ్యముల ననుభవింప యోగ్యుఁ డగువాఁడు సకల భోగముల ననుభవించును. సంతోష పడవమ్మా జానకమ్మా!

కం. కారునను వాన గురిసిన, నారబములఁగూడి పుడమి•యలరెడిమాడ్కిన్
వీరుండు మహాత్ముం డగు, నీ రమణునిఁ గూడి కనెదు•నిండుముదంబున్. ౭౨౦

అర్థములు. కారునను = తగిన కాలమందు- ఆరబములన్ = పైరులను

తాత్పర్యము

తగిన సమయమున వర్షము గురియుటచే భూమి పైరులతో నిండినట్లు వీరుఁడు, మహాత్ముఁడు నగు నీ మగనితోఁ గూడి నీవు పూర్ణసంతోష మనుభవింపఁ గలవు.

కం. కావా తిరుగు హయం బనఁ, గా విబుధాలయముఁ జుట్టు • కరుణ జగత్సౌ
ఖ్యావహుఁడగు నీ వేలుపు, వేవెలుఁగున్ శరణుఁజొరుదు•విశ్వాత్మకునిన్. ౭౨౧

అర్థములు. కావా = చక్రాకారముగా - విబుధాలయము = మేరుపర్వతము-వేవెలుఁగున్ = సూర్యుని, సౌఖ్యావహున్ = ''అగ్నౌప్రస్తాఽఽహుతిస్సమ్యగాదిత్య ముపజాయతే'' ''వృష్టి ర్వృష్టే. రన్నం తతః ప్రజా'' యను వాక్యమిటనను సంధించునది. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అని కలదుకదా!

తాత్పర్యము

గుఱ్ఱము గుండ్రముగాఁ దిరుగునట్లు మేరుపర్వతమును ప్రదక్షిణముసేయు, దయగలిగి లోకసౌఖ్యము గలిగించు సూర్యుని, విశ్వాత్మకుని శరణుజొరుదము.

-•3౪-వ సర్గము•సీతాదేవి సరమను రావణుమనోనిశ్చయం బెఱింగి రమ్మనుట•-

కం. సూరకర తప్తమహి నా, సారంబున శాంతి పఱచు•చద లనఁగను ర
క్షోరాణ్మోహిత దుఃఖవి, చారను సంతోషపఱిచి•సఖ్యము పేర్మిన్. ౭౨౨

అర్థములు. సూగకర=సూర్యుని కిరణములచే, తప్త=కాలిన, మహీన్ = భూమిని ఆసారంబునన్=జడివానచే, శాంతిపరము=చల్లబడజేయు, చదలు = ఆకాశము-రక్షోరాట్ + మోహితన్ = రాక్షసరాజుచే వంచింపబడినదానిని - దుఃఖ విచారను = దుఃఖముతో గూడిన యాలోచన గలదానిని-మగఁడు మరణించెనను దుఃఖము, ఇఁక నా గతియేమి యను విచారము-సఖ్యము పేర్మిన్=స్నేహమువలని యతిశయము వలన.

తాత్పర్యము

సూర్యకిరణములచేఁ దపించిన భూమిని జడివానచేఁ జల్లపఱిచిన యాకాశమువలె రాక్షసరాజుచేత విపరీతభావము గలదిగాఁ జేయఁబడి, పతి మరణించెనను దుఃఖముచేతను ఇఁకఁ దనగతి యేమను విచారముచేతను దపించు సీతాదేవిని స్నేహాతిశయమున సంతోషపఱిచి.

కం. కాలజ్ఞ సరమ స్మితపూ, ర్వాలాప వచించె నేరి • కగపడకుండన్
బాలా! నీ సేమము నా, క్యాలియు రామునకుఁ దెల్పి • యరుదే నేర్తున్. ౭౨౩

అర్థములు. కాలజ్ఞ=ఏకాలమున నేపని చేయవలయునో యది తెలిసినది. స్మితపూర్వ = చిఱునవ్వు ముందుగాఁ గల-ఆలాప = మాటలు గలది - నవ్వుచు మాటలాడునది.

తాత్పర్యము

సమయ మెఱిఁగి పని చేయఁగలదియు,చిఱునవ్వుతో మాటలాడునదియు నగు సరమ యిట్లు చెప్పెను. ముగ్ధా! నే నెవ్వరికిఁ గానరాకుండఁ బోయి నీక్షేమము, నీవు చెప్పుమాటలు నేను రామునకుఁ దెలిపి రాఁగలను.ఏమి చెప్పిరమ్మనెదవో చెప్పుము.

కం. అంబరమున నేను నిరా, లంబగతిం జనెడి వేళ • లలన! యెయిఁద శ
క్యం బెట్టుగాదు పత్త్రర, థంబుల యేలికకు నే సదాగతి కైనన్. ౭౨౪

అర్థములు. అంబరమునన్ = ఆకాశమున - నిరాలంబగతిన్ = నిరాధారముగ - వాయువువలె - ఎయిదన్ = నన్నుఁ గలిసికొనుటకు - పత్త్రరథంబుల యేలికకున్ = గరుత్మంతునకు-సదాగతికి=వాయువునకు.

తాత్పర్యము

లంకలో వీథులవెంట రాక్షసుల గుంపంటివి, ఆవల వానరుల గుంపంటివి. ఆమీఁదాన వీ గుంపులో నెట్లుపోయి రాఁగలవందువేమో? ఆకాశమున నిరాధారముగ విమానాదులతోఁ బనిలేక నేను బోవునపుడు నన్నుఁ గలిసికొన నావెంట వచ్చుటకుగరుత్మంతుఁడుగానివాయువుగానియెంతప్రయత్నించినను శక్తుఁడుగాఁడు.

ఉ. తియ్యఁదనంబు దోఁప సుదతీమణి శోకముఁ బాచి నెయ్యపుం
దొయ్యలిఁ బల్కె, నేనెఱుగు • మన్ గగనంబు రసాతలంబు నేన్
డయ్యక పోయి రాఁగలవు • నాదు నిమిత్త మసాధ్యకార్యమేన్
జయ్యనఁ జేయఁగాఁ గలవు • సాధుమతీ! విను మొక్క కోరికన్. ౭౨౫

అర్థములు. నెయ్యపుఁదొయ్యలిన్ = స్నేహితురాలిని, తియ్యదనంబు దోఁపన్ = శబ్దము. అర్థము ఇంపుగా నుండునట్లు, పాచి = పోఁగొట్టుకొని, డయ్యక = గాసిలేక, చయ్యనన్ = త్వరగా.

తాత్పర్యము

సీతాదేవి శోకమువదలి మాట, యర్థము ఇంపుగానుండునట్టు లిట్లు స్నేహితురాలితోఁ జెప్పెను నీ వాకాశమందుఁగాని, పాతాళమునకుఁ గాని గాసిలేక పోయి రాఁగల వని నే నెఱుఁగుదును. మఱియును నీవు నానిమిత్తమై యెంత యసాధ్య కార్యమైనను జేయఁగలవు. అయినను నా కోరిక చెప్పెద వినుము.

ఉ. నీవును మత్ప్రియార్థమున ♦ నిశ్చలచిత్తవ యేని నెచ్చెలీ
రావణుఁ డేమి చేసెడినొ ♦ క్రచ్చఱఁ బోయి యెఱింగి రమ్ము మా
యావి దయావిహీనుఁడు దు♦రాత్ముఁడు శాత్రవరావణుం డహో
త్రావినమాత్ర వారుణివి♦ధంబుగ నన్నటు మోహ పెట్టెఁగా. ౭. ౧౬

అర్థములు. మత్ప్రియ + అర్థమునన్ = నాకుఁ బ్రియమైన కార్యము చేయుటయందు-నిశ్చలచిత్తవయేని = చలింపని మనస్సుగలదానవైతివేని - క్రచ్చఱన్ = శీఘ్రముగా -మాయావి = మాయలాఁడు - దయావిహీనుఁడు = దయ లేనివాఁడు—దురాత్ముఁడు = దుష్టబుద్ధిగలవాఁడు--శాత్రవ రావణుఁడు = శత్రువుల నేడిపించువాఁడు, వారుణి=కల్లు.

తాత్పర్యము

స్నేహితులారా? నాకుఁ బ్రియమైన కార్యము చేయవలయునను స్థిరచిత్తము గలదాన వైతివేని నీవు త్వరగాఁబోయి మాయలమారియు, దయలేనివాఁడును, దుష్టబుద్ధి గలవాఁడును, పగవారి నేడిపించువాఁడును నగు రావణుఁ డిప్పు డేమి చేయుచున్నాఁడో, నన్ను నింకేదైన మాయోపాయములు చేసి దుఃఖపెట్టఁ జూచుచున్నాఁడా! నా వలనఁ గదా లంక కింత యపాయము వచ్చెనని నన్నుఁజంపఁ జూచుచున్నాఁడా? ఏమి యాలోచించుచున్నాఁడో తెలిసికొని వేగరమ్ము. త్రావిన వెంటనే కైపుచే దేహము తెలియకుండఁజేయు కల్లువలె నన్ను నిమిషములో విపరీతజ్ఞానము కలదానినిఁగా జేసెఁగదా. ఇప్పుడు రామచంద్రమూర్తి యొద్దకు సరమపోయి సాధింపఁదగిన కార్యము లేదు. అట్లు పంపుట భావ్యముకాదు. వలద నిన సరమ యేమి మనస్సు నొచ్చుకొనునో యని యిట్లుపాయముచేసి సీత చెప్పెను.

సీ. కావలి యున్న రా♦క్షసిమూఁకలు నన్ను, నదరింప బెదరింప ♦ నడలుదాన
నేవేళ కేమేమి ♦ గావించునో యను,సందేహపాటున ♦ గ్రందుదాన
మనమున స్వాస్థ్య మన్ ♦ మాట లేద యశోక, వని నుంటఁ దద్భీతి♦వసరుదాన
వానిచరిత్రంబు ♦ వానినిశ్చయమును, నెఱుఁగరా దొకయింతి♦యేని చాన

తే. కాన వాని విధంబును • గరుణ నెఱిఁగి, వచ్చి చెప్పుము నా కదే • సచ్చరిత్ర
    పరమ మగు నుపకృతియన•సరమ జవర,నుడులనూరార్చి కన్నీళ్లు•తుడిచిపలుకు.

అర్థములు. అదరింపన్ = గ్రుడ్లు గిరగిరద్రిప్పి — పండ్లు పటపటగొరికి యిత్యాది చేష్టలచేతభయపెట్టఁగా; బెదరింపఁగా=చంపు,నరకు,కోయుతిను ఇత్యాది మాటలచే భయపెట్టగా—అడలుదానన్=దుఃఖించుచున్న దానను,మ్రందుదానన్= చచ్చుచున్నదానను— స్వాస్థ్యము = నెమ్మది — వనరుదానన్ = శోకించుదానను. ఉపకృతి=ఉపకారము, జవరనుడులన్=మృదువాక్యములచేత.

తాత్పర్యము

నా మగనియొద్దకు నీ విప్పుడుపోయి చెప్పగల దేదియు లేదు. నే నిచ్చట దుఃఖించుచుంటుట యాయనయే యెఱుఁగును.ఆయనకు నేనుజెప్పునదియేమున్నది? రావణాసురుని నా మగఁడు చంపులోపల నన్ను రావణుఁడు చంపక విడచునా యని నా సందేహము. నన్నే వేళకు వీఁడు చంపునో యని భయపడుచున్నాను. ఏలనఁ గావలియున్న యీ రాక్షస స్త్రీలు నన్నదరించి బెదరింప బాధింపఁబడు చున్నాను. ఏ నిమిషమున వాని కే దుర్బుద్ధి పుట్టునో, యేమిచేయునో యని సందే హముచేఁ జచ్చుచున్నాను. మనస్సునకు నెమ్మది యనునది యెట్టిదో తెలియక వాని స్వాధీనమందుండు నీ యశోకవనమునం దుండి వానికి భయపడి శోకించుచున్న దానను; వాఁడు చేయుకార్యమేదో, వాఁడేమి చేయ నిశ్చయించుకొన్నాఁడో, నాకుఁ గొంచెమైనను దెలియలేదు. మఱల నన్నీయఁదలఁచెనో, యుద్ధమే చేయఁ దలఁచెనో, నన్నుఁ జంపఁదలచెనో, యేదియు నాకుఁ దెలిసినది కాదు. కావున నీవు వాని విధము తెలిసికొని వచ్చితివేని నిబ్బరముగ నుండెదను. మంచి నడవడి గలదానా! అదియే నీవు నాకుఁ జేయవలసిన మహోపకారము అని చెప్పఁగా మృదు వాక్యముల నూరార్చి సరమ యామె కన్నీళ్ళు తుడిచి యిట్లనెను.

కం. ఇది యేని నీదుకోరిక, యిదెపోయి విరోధిచిత్త • మెఱిఁగి జవమునన్
    సుదతీ! క్రమ్మఱుదానను, ముదితమనంబునను జెలఁగు•ముగుదా! నీవున్. ౭౨౦

అర్థములు. విరోధిచిత్తము=నా ప్రాణస్నేహితురాలవైన నీకు, నాప్రాణ భర్తకును విరోధి యగువాఁడు నాకును విరోధియే యని భావము. కావున నీ విరోధి యనక మన విరోధి యను నర్థము వచ్చునట్లు చెప్పెను. లేదా లోకవిరోధి యనియైన గ్రహింపనగు, జవమునన్ = వేగమున—ముదితమనంబునన్ = సంతో షించిన మనస్సుతో.

తాత్పర్యము

నీ కోరిక యిదియైన పక్షమున నే నిదిగో నిప్పుడే పోయి పగవారి మనస్సు దెలిసికొని శీఘ్రముగా మరలి వత్తును. నీవు శోకింపక సంతోషముగ నుండుము.

—• సరమ సీతాదేవికి రావణునిశ్చయం బెఱింగించుట •—

కం. అని రావణు డాయం జని, విని యా కావరుఁ డమాత్య•బృందముతో వా
కొనువిధము వాని నిశ్చయ,మును దెలిసియశోకవనికి•మూ ర్తములోనన్. ౨౨౯

అర్థములు. కావరుఁడు=మదము గలవాఁడు-అమాత్యబృందముతో = మంత్రిసమూహముతో -వాకొనువిధము = చెప్పెడితీరు - మూర్తములోనన్ = అల్పకాలములో.

తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవికిఁ జెప్పి సరమ పోగురుఁబోతగు రావణుఁడున్న చోటికిఁ బోయి వాఁడు మంత్రులకుఁ జెప్పువిధము విని వాని నిశ్చయము దెలిసికొని ముహూర్తకాలములో మరల నశోకవనమునకు వచ్చి,

ఉ. క్రమ్మఱి భ్రష్టపద్మ రమ•కైవడి నై తనరాక వేచు నా
కొమ్మను డాయ సీతయును•గూరిమిఁ గౌఁగిటఁ గ్రుచ్చి తాన పీ
ఠమ్ము నొసంగి పలుక•నిచ•టన్ సరమ మాఱు సుఖోపవిష్టవై
యమ్మొఱకైన క్రూరహృద•యంబు విధంబు వచింపు సర్వమున్. ౨౩౦

అర్థములు. భ్రష్టపద్మ = పద్మాసనమును విడిచినది - రమకైవడిన్ = లక్ష్మీదేవివలె-వేచు = కాచుకొను-డాయన్ = సమీపింపఁగా-సుఖోపవిష్టవు = సుఖముగాఁ గూర్చున్నదానవు-మొఱకు=మూర్ఖుఁడు, క్రూర = క్రూరునియొక్క.

తాత్పర్యము

పద్మమును విడిచిన లక్ష్మీదేవివలెనై తానెప్పుడు వత్తునోయని తాను వచ్చు మార్గమునందే దృష్టియుంచి చూచుచున్న యాసీతాదేవిని జేరఁబోఁగా ప్రేమతో నామె సరమను గౌఁగిలించి తానే పీట యిచ్చి దీనిపై నీవు పోయి వచ్చిన గాసిదీఱ సుఖముగఁ గూర్చుండి మూర్ఖుఁడైన యాక్రూరుని హృదయ మెట్టిదో వచింపుము.

కం. అని వణఁకుచు నడిగిన యా, జనకాత్మజతోడ సరమ•సచివాన్వితుఁ డై
దనుజేంద్రుఁడు చేసిన యో, జనను యథార్థముగ నిట్లు•సకలముఁ జెప్పెన్. ౨౩౧

అర్థములు. సచివాన్వితుఁడై=మంత్రులతోను సహాయులతోడను గూడినవాఁడై-'మంత్రీ సహాయ సచివౌ' అని యమరము. మంత్రి = ఆలోచన చెప్పువాఁడు - సహాయుఁడు=కూడఁ బనిచేయువాఁడు.

తాత్పర్యము

ఇట్లు ఏమిచెప్పునో, యేమోయని భయముచే వణఁకుచు నడిగిన సీతాదేవితో సరమ మంత్రులను సహాయులను గూడినవాఁడై రావణుఁడు చేసిన యాలోచనను నున్నదున్నట్లు సర్వముఁ జెప్పెను.

సీ. రాజాస్య! వినవమ్మ ♦ రావణుతల్లియు,మఱియు నవిద్ధుఁ డ♦న్మంత్రివృద్ధు
శ్రీరామవిభునకు ♦ సీత నిమ్మంచును, బలువిధముల బోధ♦పఱిచి రమ్మ
యల జనస్థానమం ♦ దైన యద్భుతము దృష్టాంతంబుగాఁ గొని♦యాడి రమ్మ
యంబుధి లంఘించి ♦ హనుమ వచ్చుట నిట, నినుఁ గంట నసురుల♦నిహతి సేఁత

తే. మదిని దలపోయ మానవ♦మాత్రుఁ డైన
వాఁడు గావించు పను లౌనె ♦ వలదె దలఁప?
ననుచు బోధింప ధనకామి ♦ ధనముఁబోలె
నిన్ను విడువంగ నొల్లఁడు ♦ నిర్జరారి. ౨౩౨

అర్థములు. రాజాస్య=చంద్రునివంటి ముఖముగలదానా, రావణుతల్లి=కైకసి, మంత్రివృద్ధు=వృద్ధమంత్రి-మంత్రులందు పెద్దవాఁడు-వృద్ధాదులకు డుక్ లోపంబు విభాష నగు - నిహతిసేఁత=చంపుట, ధనకామి = ధనమునందుఁ గాంక్ష గలవాఁడు, నిర్జరారి=దేవవిరోధి=రావణుఁడు.

తాత్పర్యము

సీతమ్మా! రావణునితల్లి కైకసి,వృద్ధమంత్రి యవిద్ధుఁ డనువాఁడును శ్రీరామచంద్రమూర్తికి సీతమ్మనిమ్మని నానావిధముల బోధించిరి. జనస్థానమునందు ఖరాదులఁ బదునాలుగువేల రాక్షసులను నల్పకాలములో లక్ష్మణుఁడు కూడఁ దోడు లేక యొంటివాఁడు పాదచారి వధించుట యత్యాశ్చర్యమైనది. ఇప్పుడో లక్ష్మణుఁడును, సేనలతోడ సుగ్రీవుఁడును దోడుపడి యున్నారు కావున నెంత పని యైనఁ జేయఁగలుగును. నాకిక్కడ కోటలు లేవా? సేనలు లేవా? ఖరాదుల మించిన బలవంతులు లేరా యందువేమో? ఒక్క క్రోఁతి సముద్రము దాఁటి యిచ్చటికి వచ్చి నీకుఁ దెలియకుండ సీతను జూచి మాటలాడి కోటలన్ని చెఱిచి పాతిక సేనఁ జంపినపుడు నీ వీరులందఱెందుండిరి. ఒక్కఁడైన వానిని నిగ్రహింపఁ గలిగెనా? తమ కొంపలైనఁ దాము గాచుకొనఁ గలిగిరా? ఇప్పుడట్టి క్రోఁతు లెందఱో యున్నారే, వారందఱు మీఁదఁబడిన నేమిగతి? ఇవన్నియు సామాన్య మనుష్యునకుఁ జేయ సాధ్యమా? ఇవన్నియు నీవాలోచింపవలదా యని బోధించిరి. కాని లోభియగు వాఁడు ధనమును వదలలేనట్లు రావణుఁడు నిన్ను వదలిపెట్ట నంగీకరించిన వాఁడు కాఁడు.

ఉ. ముక్కున నూర్పు గల్గ నల♦మూర్ఖుఁడు నిన్విడువంగఁ బోఁడు, దన్
ద్రెక్కొను మృత్యులోభమున ♦ నిశ్చిత మయ్యెను వానిబుద్ధి, వాఁ
డుక్కఱి యీబిభీషికల ♦ కో తరుణీ! బెదరండు, దానునున్
రక్కసు లీల్గుదాఁక నిను ♦ రామున కప్పన సేయ నేరడున్. ౨౩౩

అర్థములు. ఊర్పు=శ్వాసము - త్రెక్కొను = త్రింగునట్టి-ఉక్కఱి =

ఉక్కు+అఱ=బలము చెడి — బిభీషికలకున్ = బెదరింపుమాటలకు — బెదరండు= భయపడండు—అప్పన=అర్పణము.

తా త్ప ర్య ము

కొనయూపిరి ముక్కునఁగూడ విడిచిపోవువరకు అనఁగా పీనుఁగై పడువఱకు నిన్ను వదలఁడు. వానికేల యటువంటి దుర్బుద్ధి యనెదవా? మృత్యుదేవత వానిని క్రమింగ నాశపడియున్నది. కావున 'వినాశకాలే విపరీతబుద్ధి' యన్నట్లు వాడట్లు నిశ్చయము చేసికొని యున్నాఁడు. ఈ బెదరింపుమాటలకు వాఁడు బలగర్వము చెడి భయపడఁడు. కావునఁ దాను దనవారు రాక్షసులందరు చచ్చుదాఁక నిన్ను శ్రీరాముని కర్పింపఁడు. ఈ కారణముచే నీకు ప్రాణభయము లేదు. నిన్ను బెదరించునే కాని చంపఁడు.

ఉ. మానిని! రాక్షసేంద్రు శిత♦మార్గణపంక్తిని గూల్చి నిన్నయో
ధ్యానగరంబుఁ దోడుకొని ♦ తప్పక పోవును నీ విభుండు, లో
మానుమి శంక యంచు సర♦మాసతి పల్కుచు నుండునంతలో
వానరశంఖభేరుల ర♦వంబులు ధారిణి దద్దఱిల్లఁగన్. ౨౩౪

అర్థములు. శితమార్గణపంక్తిని=పదునగు బాణముల వరుసచే, కూల్చి= చంపి, ఆయోధ్యానగరంబు, ఉద్దేశ్యార్థంబున ద్వితీయ, లోనన్ = మనస్సులో దద్దరిల్లఁగన్ = తబ్బిబ్బుపడఁగా.

తా త్ప ర్య ము

అర్లైన నా మగనియొద్ద నేను జేరుట యెట్లందువా? నీ మగఁడు రావణుని వాఁడి బాణముల గుంపులచే చంపి నిన్న యోధ్యకుఁ దీసికొనిపోవును. నీవు సందేహ పడవలదు. అని సరమాదేవి చెప్పుచుండు నంతలో వానరుల సింహనాదములు, శంఖముల, భేరుల ధ్వనులు భూమి తబ్బిబ్బు పడునట్లు.

కం. విన రా లంకాపురమున, మనుజాశను లెల్ల భీత ♦ మానసముల వి
న్ననిమోములనసుఖులపై, మనుజాధిపుదోషమునను♦మానిరి యాశల్. ౨౩౫

అర్థములు. వినరాన్ = వినఁబడఁగా— భీతమానసములన్ = భయపడిన మనస్సులతో—విన్నని మోములన్=వెలవెలఁబోయినముఖములతో-ఉసులులపై= ప్రాణములమీఁద — మనుజాధిపుదోషమునను = రాజదోషముచే—ఇచ్చట మనుజాధిప శబ్దము రాజశబ్ద పర్యాయమాత్ర మగును.

తా త్ప ర్య ము

వినరాఁగా లంకలోనున్న రాక్షసులు భయపడి, తెల్లని మోములు గల వారై తమ రాజుచేసిన దోషమువలన ప్రాణములమీఁది యాశ మానిరి.

-•3౫-వ సర్గము మాల్యవంతుఁడు సీతాదేవి నిమ్మని రావణునకు నీతిబోధించుట•-

తే. శంఖభేరీనినాదముల్ • సాంద్రముగను, బరపురంజయుఁ డగు రామ•భద్రుఁడేగు
దేరఁ దన్నాద మాలించి•దివిజవైరి, ధ్యానతత్పరుఁడయిముహూ•ర్తంబొకండు.

అర్థములు. సాంద్రముగను = దట్టముకాఁగా, పరపురంజయుఁడు = శత్రు పురముల జయించువాఁడు, తత్ + నాదము= ఆ ధ్వని, దివిజవైరి = రావణుఁడు, ముహూర్తంబొకండు=ఒక్క ముహూర్తకాలము, ధ్యానతత్పరుఁడయి=ఆలోచన యందు మనస్సుంచినవాఁడై.

తాత్పర్యము

వానరుల శంఖములయు, నగారాలయు ధ్వనులు దట్టముగ దిక్కులు పిక్కటిల్ల వ్యాపింపఁగా, రాముఁడు లంక ముట్టడింప వచ్చుచుండుట తెలిసికొని రావణుఁడు ఒక ముహూర్తకాలము ఏమి చేయుదునా యని యాలోచించినవాఁడై.

ఉ. అందఱ మంత్రులం గని మ•హానినదంబునఁ గ్రూరుఁడున్ జగ
ద్బృందమనోవ్యథాకరుఁడు•దిట్టుచుఁ గేకలు వేసి పల్కు మీ
రందఱు సైన్యయుక్తుఁ డయి•యంబునిధిం దరియించి భూమిభృ
న్నందనుఁ డేగుదెంచె నని•నం జుడిఁ నేఁ జెవిఁ దూఱఁబెట్టితిన్. ౨౩౮

అర్థములు. జగత్ + బృంద + మనోవ్యథాకరుఁడు = లోకసమూహముల మనస్సులకు బాధకలిగించువాఁడు, భూమిభృత్ + నందనుఁడు= రాజకుమారుఁడు— రామచంద్రుఁడు, చెవిదూఱఁబెట్టితిని = చెవులలోఁ దూఱునట్లు చేసితిని, నేనై తెలియఁగోరి విన్నదికాదు.

తాత్పర్యము

క్రూరుఁడు, లోకుల మనస్సుల బాధపెట్టువాఁడు నగు రావణుఁడు మంత్రుల నందఱఁజూచి వారిని దిట్టుచు, బొబ్బలు పెట్టుచు నిట్లనియె. మీరందఱు రాజకుమారుఁడు సేనలతోడ సముద్రము దాఁటి వచ్చెనని చెప్పినఁగదా నే నామాట చెవిలో వేసికొంటిని. అంతకుఁ బూర్వము నాకుఁ దెలియనే తెలియదని భావము. బుద్ధిలేని వారకార్యములుచేసి యవి ప్రాణగండముగా వచ్చినపుడు దిక్కుదోఁపక యితరుల పైపడి యిల్లేడ్తురు. ఎదురు చెప్పువాఁడు లేడని నోటికి వచ్చినవెల్ల వాగుదురు. ఇది దుర్బుద్ధుల లక్షణము.

చం. ధరణిసుతామనోహరుని•దర్పము వినకలి మానమూని యొం
డొరుల మొగంబుఁ జూచుకొను • చున్నను మీరలు సంగరంబునం
దరు దగు సత్యవిక్రము లటంచు నెఱుంగుదు, మిమ్ము నమ్మికా
యరగలి లేక యెంతటి మ•హాకృతి నేనియు నిర్వహించితిన్. ౨౩౯

అర్థములు. వినకలి = వినుకలి = వినుటచే, అరుదగు = ఆశ్చర్యకరమైన,

అరగలి = అర+కలిమి=సందేహము, మహాకృతి = గొప్పకార్యము, నిర్వహించితిని=నెఱవేర్చితిని.

తాత్పర్యము

సీతానాథుఁడగు రామచంద్రుని బలగర్వము విని నోరు మూసికొని యొకరి మొగ మొకరు చూచుచున్నను మీరు యుద్ధమందు నద్భుతము నిర్వంచనము నగు పరాక్రమము గలవారని నాకుఁ దెలియును. మిమ్ము నమ్మికదా సందేహములేక యెంతటి గొప్ప కార్యమైనను నెరవేర్చితిని. ఇప్పుడు మాత్రము మీరు నిండు మనస్సుతో సాహాయ్యము చేసిన నేనీ కార్యము నిర్వహింపలేక పోదునా?

కం. అని రావణుఁ డాడినఁ దజ్జననికిఁ బినతండ్రి యతులసంవిద్ఘనుఁ డి
ట్లని పలుకు మాల్యవంతుం, డను రాక్షసవరుఁడు సనయమగు మార్గమునన్.

అర్థములు. తజ్జననికిఁ బెదతండ్రి=రావణుని తల్లి తండ్రి కన్న — రావణుని తల్లి కైకసి, ఆమెతండ్రి సుమాలి, అతనియన్న మాల్యవంతుఁడు, అతుల సంవిద్ఘనుఁడు=అసమానమైన బుద్ధియందు గొప్పవాఁడు, సనయము=నీతితోఁగూడినది.

తాత్పర్యము

రావణుఁడిట్లు చెప్పఁగా మిగుల బుద్ధిమంతుఁడు నతని తల్లికిఁ బెదతండ్రి యగు మాల్యవంతుఁడు నీతియుక్తమగు మార్గమున నిట్లనెను.

తే. నృపతి ధర్మ మెఱింగించు నీతివిద్య,లందుఁ బండితుఁ డయి నయ మనుసరించు
వాఁడు చిరకాల మేలు నైశ్వర్యయుక్తి, వైరివర్గంబు నెల్ల స్వవశముఁ జేయు.

అర్థములు. నృపతిధర్మము = రాజధర్మము - నయము = నీతి - నీతి విద్యలు ఆన్వీక్షకి, త్రయి, వార్త దండనీతి యని నాలుగు గలవు.

'ఆన్వీక్షకీం త్రయీం వార్తాం దండనీతించ పార్థివః। తద్విద్భిస్తత్క్రియోపేతైశ్చింతయేద్వినయాన్వితః। ఆన్వీక్షక్యాత్మవిజ్ఞానం। ధర్మాధర్మౌ త్రయీస్థితౌ। అర్థానర్థౌతు వార్తాయాం। దండనీత్యాం నయానయౌ। విద్యాశ్చతస్ర ఏవైతా యోగక్షేమాయ దేహినాం। విద్యావినీతో నృపతిర్న కృచ్ఛ్రేష్వవసీదతి'' కామందకము.

తాత్పర్యము

రాజధర్మమును దెలుపు నీతివిద్యలందుఁ బండితుఁడయి, నీతిమార్గమనుసరించు రాజు ఐశ్వర్యముతోఁ గూడినవాఁడై చిరకాలము రాజ్య మేలుచు శత్రువులను దనవశ మొనరించుకొనును.

కం. సమయోచితముగ నరివర్గముతోఁ గావింపవలయు రణమును సంధిన్
శమితామర! యది తన పక్షము వృద్ధిం జేసి మిగులసంపదఁ గూర్చున్. ౭౮౯

తాత్పర్యము

కాలము ననుసరించి శత్రువులతో సంధిచేయ వలసినప్పుడు సంధి, యుద్ధము చేయవలసినపుడు యుద్ధము చేయువాఁడు తన పక్షమును వృద్ధిచేసికొని సంపద గలవాఁడగును.

కం. తనబలము తఱుఁగుచున్నను, దనతో సముఁడైన సంధి•తగు శత్రువుతో
దనబలము పెరుఁగుచున్నను, జన దాలము సేయఁ బగఱ•సంగరమె తగున్

తాత్పర్యము

ఎప్పుడు సంధిసేయవలయు, ఎప్పుడు యుద్ధము చేయవలయు నందువేమో- శత్రువునకంటెఁ దనబలము తగ్గిపోవుచున్నను - లేదా శత్రువు సమానుఁడైనను సంధి సేయవలయును. శత్రుబలము తగ్గి తన బలము పెరుఁగుచుండెనా శత్రువుల నుపేక్ష సేయరాదు. యుద్ధమే సేయవలయును.

చ. నయవిధ మిద్ది గాన రఘు•నాయకుతోఁ దగు సంధి యిప్పు, నీ
కయ మది, నీకు రామునకు•నయ్యె విరోధము సీతఁ దెచ్చుటన్,
రయమున నామె నిమ్ము రఘు•రామునకుం, బగ దీఱు, నంతతో
భయము దొలంగి నీవు నిర•పాయసుఖస్థితి నుండఁ గల్గెడిన్. ౭౮౩

అర్థములు. నయవిధము = నీతిపద్ధతి-అయము = మేలిచ్చు కార్యము - నిరపాయ సుఖస్థితిన్=అపాయములేని సౌఖ్యదశయందు.

తాత్పర్యము

నీవు చెప్పునది యేమి? ఇప్పుడు యుద్ధము చేయవలయునందువా, సంధి సేయవలయు నందువా, యందువేమో? ఇప్పుడు నేను చెప్పునది నీతిపద్ధతిగావున నిప్పుడు రామునితో సంధిసేయుటయే తగినకార్యము. దానికేమి సేయవలె? రాముని కాళ్ళ మీఁదఁబడుమందువా? అక్కఱలేదు. కలహకారణముసీత-సీతను మరల రాముని యొద్దకు వేగముగఁ బంపుము. దానితోఁ బగ ముగియును. అంతతో నీవు నిర్భయముగ నిరపాయసుఖము లందఁగలవు. సీతను బంపఁగానే యుద్ధము నిలుచునని యేమి నమ్మకము అందువా? రాముఁడు తనభార్యను దాను రాఁబట్టుకొనుటకై యుద్ధమునకువచ్చినాఁడు కాని నీ రాజ్యమాశించి కాదు. కావున నామె నిచ్చుటతోఁ బగ కారణము తీరిపోవును. నీ రాజ్యమున నీవు ఆయన రాజ్యమున నాయన సుఖముగ నుండవచ్చును.

కం. దేవర్షులు గంధర్వులు, నేవానికి జయము గల్గ•నిచ్చఁ దలంతురో
యా వసుధాపతితో నే, లా వైరము సంధి సేయు•నర్హము నీకున్.

అర్థములు. ఇచ్చన్=మనస్సునందు, నాలుగవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

సంధియే యేల చేయవలెను? యుద్ధమేల చేయరాదందువా- దేవర్షులు, దేవ గంధర్వులు నేవానికి గెలుపు గలుగవలయునని కోరుదురో యట్టి రాజకుమారునితో నీకు విరోధమేల? పిల్లి శాపమున కుట్లు తెగునా? వారు కోరఁగానే నేను జెడుదునా యందువేమో? పశువుల కాఁపరి పశువులను కొట్టినట్లు దేవతలు తాము చెఱుపఁ దలఁచినవానిని కట్టెలతోఁ గొట్టరు వారు సంకల్పముచేఁ గార్యములు చేయుదురు. చేయింతురు. కావున రామునకుఁ గానవచ్చు వానరబలమే గాక దైవబలముగలదు.

సీ. రెండుపక్షంబులు • సృజియించె జగతిపై, ధాత ధర్మంబు న • ధర్మ మనఁగ
నమరులు మహాత్ము•లాశ్రయించిరి ధర్మ,మసుర లధర్మంబు•నాశ్రయింత్రు
ధర్మమే వేళ న•ధర్మంబు గ్రింగునో, యదియచూ కృతయుగ•మనఁగఁబడును
ధర్మమే వేళ న • ధర్మంబుచేఁ జెడు, నదియ ఘోకలికాల•మనఁగఁబడెడి

తే. జగములను నీవు చరియించు • సమయములను
నేపుమెయి ధర్మ మెల్లను • రూపు మాపి
సంగ్రహించి తధర్మంబు • సరకు లేక
దాన మనకంటె బలులైరి • కానివారు. ౭౮౫

అర్థములు. ధాత=బ్రహ్మ, మహాత్ములు = గొప్పమనస్సుగలవారు, అన్యము=అధర్మము, ఏపుమెయి = పరాక్రమముచేత, సరకులేక = లక్ష్యములేక,

తాత్పర్యము

బ్రహ్మదేవుఁడు లోకమున ధర్మమని, యధర్మమని రెండు పక్షములు సృజించెను. దేవతలు గొప్పబుద్ధికలవారు కావున ధర్మము నాశ్రయించిరి. అసురులు, రాక్షసులు మహాత్ములు కాకుండుటచేఁ దత్కాలమునకు బాగుగఁ గనిపించు నధర్మము నాశ్రయించిరి.ఎప్పుడు ధర్మ మధర్మమునకంటె నతిశయించునో యదియే కృతయుగము. ఎప్పుడధర్మము ధర్మము నడఁగఁద్రొక్కునో యదియే కలియుగము. తన్నాశ్రయించినవారి నుద్ధరించుట ధర్మముయొక్క గుణము. తన్నాశ్రయించినవారి నధోగతుల పాలుచేయుట అధర్మలక్షణము.ఎంతెంతధర్మమెచ్చునో యంతంతదాని నాశ్రయించినవారికి మేలుగలదు.ఎంతెంత యధర్మమెచ్చగునో దానినాశ్రయించిన వారి కంతంత కీడగును.నీవు దిగ్విజయ వేళఁ బరాక్రమముచే ధర్మమునాశము చేసికొని పర్యవసాన మెట్లుండునది లక్ష్యములేక యధర్మమును సంపాదించితివి. కావున నీ యధర్మము నీకుఁ గీడు చేయక మానదు. ధర్మమందున్నవారు బాగుపడక పోరు. కావున మనపగవారు మనకంటె బలిష్ఠులైరి. వారిమూలమున మనకుఁ గీడుకలుగును.

ఉ. మానక నీ వధర్మము ప్ర•మాదముమై నభివృద్ధి చేసి త
ద్దాన నదే గ్రసించెడిని • దానవనాయక యస్మదాదులన్,
మానుగ నయ్యదే విబుధ • మండలిపక్షము వృద్ధిచేసెడిన్,
బూనుట ధర్మమున్ మనుజ•పుంగవుఁడున్ బుధపక్షపాతి యౌ ౭౮౬

అర్థములు. ప్రమాదముమై=హెచ్చరిక తప్పి, గ్రసించెడిని = మ్రింగెడిని, అస్మదాదులన్ = మావంటి వారిని, బుధపక్షపాతియౌ=దేవతల యందుఁ బక్షపాతము గలవాఁడు.

తాత్పర్యము

అధర్మమున, గీడు కలుగకదా యని గమనింపక నీవు హెచ్చరికతప్పి వదలక యధర్మమునే యభివృద్ధి చేసితివి. అది ఫలకాలమున నా వంటివారిని మ్రింగు

చున్నది. ఎప్పుడు మన యధర్మము మనలకుఁ గీడు చేయ నారంభించెనో యదే దేవతలకు మేలు కలిగించెడిని. ఒకటి తగ్గిన రెండవది హెచ్చును, రాముఁడు ధర్మము పూనినవాఁడు కావున దేవతలయందుఁ బక్షపాతము గలవాఁడు కావున వా రాయన మేలు కోరుదురు.

సీ. విషయసక్తుండ వై ♦ ఋషులకన్యలఁబట్టి, యే మే మొ చేసితి ♦ వెఱుకమాలి
వహ్నికల్పులు ఋషి ♦ వర్యుల కద్దాన, నుద్వేగ మమిత మై ♦ యుద్భవిల్లె
మండుచుండెడి వహ్ని ♦ మాడ్కిని దపము పెం, పున దురాధర్షులౌ ♦ పుణ్యమునులు
భూరితపంబునఁ ♦ బూతచిత్తులు వారు, ధర్మాభివృద్ధి నా ♦ స్థను గలారు
తే. ఆ ద్విజాతులు ముఖ్యంబు ♦ లైన యజ్ఞ, ములను గావించి వేల్చు చ ♦ గ్నులను శాస్త్ర
చోదితంబగు పద్ధతి ♦ వేదరవము నింపెదరు రక్కసులను లె ♦ క్కింపకెదను. ౭౪౭

అర్థములు. విషయసక్తుండవై = విషయ సుఖములందు మనస్సునుంచిన వాఁడవై, ఏమేమొ = కోరఁజెప్పరానివి, ఎఱుకమాలి = జ్ఞానము లేక, వహ్నికల్పులు = అగ్నితో సమానులు, ఉద్వేగము = మనస్తాపము, దురాధర్షులు = తిరస్కరింపరాని వారు, పూతచిత్తులు = పవిత్రములైన మనస్సులు గలవారు, ధర్మాభివృద్ధిన్ = ధర్మమును మిగుల వృద్ధిచేయుటయందు, ఆస్థ = ప్రయత్నము, ద్విజాతులు = బ్రాహ్మణులు, శాస్త్రచోదితంబు = శాస్త్రము విధించినది, పద్ధతి = మార్గము, లెక్కింపక = లక్ష్యము సేయక.

తాత్పర్యము

విషయ సౌఖ్యముల మఱిగి ఋషుల కన్యకలను, వారి భార్యలను, నీవు నోరఁ జెప్పరాని పనులను జేసితివి. యుద్ధమున జయింపఁదలఁచిన వారిని జయించి యంతతోఁ దృప్తిపడియుండక, యిటువంటి ఘోరకార్యములు చేయుటచే నగ్ని హోత్రునివంటి యీ ఋషీశ్వరులు దానిచే మనస్తాపము గలవారైరి. తపస్సు యొక్క యాధిక్యముచే నా పుణ్యమునులు మండెడు నగ్నివలెఁ దిరస్కరింపరాని వారు. వారు గొప్ప తపస్సుచేఁ బవిత్రములైన మనస్సులు గలవారు. వారు ధర్మము నభివృద్ధిచేయు ప్రయత్నము గలవారు. కావున నా బ్రాహ్మణులు ముఖ్యములైన యజ్ఞములను జేసి యగ్నుల వేల్చి శాస్త్రమునఁ జెప్పఁబడిన విధముగ వేదరవమును రాక్షసుల సరకుసేయక దేశమున నించుచున్నారు. ఈ కారణముచే రెండు విధముల ధర్మపక్షము వృద్ధియగుట, అధర్మము నిన్ను నణఁగఁ ద్రొక్కుట - నీకుఁ గీడు కలుగ నయ్యెను.

తే. ఉబ్బ జాఱిన వేసంగి ♦ మబ్బులట్లు, రక్కసులు పాఱుచున్నారు ♦ దిక్కులకును
వారిముంగల వహ్నిసం ♦ భవములైన, పొగలు పదిదిక్కులందును ♦ బొగటు మీఱె.

అర్థములు. ఉబ్బ జాఱిన = వృద్ధి క్షయించిన = క్షీణదశకు వచ్చిన - వేసంగి మబ్బులు = ఎండకాలపు మేఘములు - ముంగల = ముందు - అగ్నిసంభవ

ములు=హోమాగ్నులనుండి పుట్టినవి - పగటు మీఱెన్ = ప్రకాశముగ నతిశయించెను - విస్తారముగ వ్యాపించెను.

తాత్పర్యము

ఎండకాలమందు క్షీణదశకు వచ్చిన మేఘములవలె రాక్షసు లా ఋషుల యెదుట నిలువజాలక దిక్కులవెంట బరువెత్తుచున్నారు. ఋషులకు ముందు హోమాగ్నులవలనఁ గలిగిన పొగలు పది దిక్కులందును వ్యాపించినవి, హోమధూమము రక్షోవినాశకరము గావున నా పొగ వ్యాపించు స్థలముల నిలువలేక రాక్షసులు పరువెత్తుచున్నా రని భావము.

కం. ఆ పొగతాఁకునఁ దేజము, రూపఱె రక్కసులగమికి ♦ రూక్షముగ మునుల్
పాపాపహతలములఁ దప, మేపున గావింప నదియ♦యేంచె నసురులన్. ౨౪౯

తాత్పర్యము

ఆ హోమధూమము దగులుటచే రాక్షసులకుఁ దేజము నశించెను. మునులు తీవ్రముగ పాపము నాశముచేయు క్షేత్రములందుఁ దీర్థములందు నిలచి తపస్సు చేయుచున్నారు. అది రాక్షసులను బాధించుచున్నది.

ఉ. దానవయక్ష రాక్షసబు♦ధ ప్రకరంబులచే వినాశమున్
గానకయుండఁగా వరము ♦ గల్గెను నీ కిపు డాహవార్థమై
మానవవానరాచ్ఛము ల♦మానుష శౌర్యము లుల్లసిల్ల లం
కానగరంబు ముట్టెను, నిఁ♦కం గల కార్యము నూహ సేయుమీ. ౨౫౦

అర్థములు. ఆహవార్థమై=యుద్ధముకొఱకు, మానవవానరాచ్ఛములు = మనుష్యులు, కోఁతులు, ఎలుఁగులు-అమానుష శౌర్యములు=మనుష్యులందు లేని శౌర్యములు, ఉల్లసిల్లన్=ప్రకాశింపఁగా, ముట్టెను ముట్టడించెను. కలకార్యము= చేయఁగలపని.

తాత్పర్యము

నీకు దానవులచే, యక్షులచే, రాక్షసులచే, దేవతలచేఁ జావకయుండునట్లు వరమున్నది. ఇపుడు యుద్ధమునకై వచ్చినవారు వారిలో నెవ్వరుకారు. నీవు వరము పొందని మనుష్యులు, వానరులు, ఎలుఁగులు వచ్చి లంకను ముట్టడించినారు. వారైనను మనము మునుపు జూచు సామాన్యమనుష్యులు, సామాన్య మృగములు కావు. మనుష్యులందు దుర్లభములైన శౌర్యములు గలవారు. ఇట్టి సందర్భములందు నీవు చేయవలసిన కార్య మేమో యాలోచింపుము.

ఉ. ఈ తఱి నుప్పరంబున మ♦హిన్ జనియించెడి దారుణంబు లు
త్పాతములెల్లఁ గాంచినను ♦ దప్పక నాశము జెందు రాక్షస
వ్రాత మటంచు దోఁచెడి ఖ♦ర స్తనితంబులు ఘోరమేఘముల్
భీతికరంబులై కురిసె♦వెచ్చని నెత్తురు లంక నెల్లెడన్. ౨౫౧

అర్థములు. ఉప్పరంబునన్=ఆకాశమునందు ఉపరిశబ్దభవము, మహిన్= భూమియందు - దారుణంబులు = భయంకరములైన - ఉత్పాతములు = కీడును దెలుపు దుశ్శకునములు - రాక్షసవ్రాతము=రాక్షససమూహము - ఖరస్తనితంబులు = పరుషములైన యుఱుములుగల.

తాత్పర్యము

ఈ సమయమందు నాకాశమున భూమియందుఁ గీడును దెలుపు భయంకరములైన శకునంబులు గానవచ్చుచున్నవి. వానిని జూచిన నీకొకనికే కాదు, రాక్షససమూహమునకు కీడు తప్పదనియే తోఁచుచున్నది. కఠోరములుగా మేఘము లుఱుముచు లంకయందంతటను వేఁడి నెత్తురు గురియుచున్నది.

సీ. కన్నీరు గార్చె శో♦కమున వాహనములు, ధ్వజములు ధ్వస్తముల్ ♦ వన్నెఁ బాసె
లంకలోఁ గుమిగూడి♦కంకగోమాయుగృ,ధ్రంబులు భైరవా♦రవము నించెఁ
బూతనాదులు క్షుద్ర♦భూతముల్ రాత్రుల,గృహవస్తుతతుల సం♦గ్రహముచేసి
మగువలకలలలో♦నగపడి తెల్లని దంతముల్, వెలిదోఁప♦దగవులాడి

ఆ. యుపహసించుచున్న♦యవి, బలిపిండముల్,కుక్కలిండ్లఁ దూఱి♦మెక్కఁదొడఁగె
రాసభముల నాలు♦ప్రసవించెఁ దిరిగెడి, ముంగిసలను గూడి♦మూషికములు.

అర్థములు. ధ్వస్తముల్ = విఱిగిపడినవి - కంక = రాపులుఁగులు - గోమాయు = నక్కలు - గృధ్రంబులు=గ్రద్దలు - భైరవారవము = భయంకరధ్వని - పూతనాదులు = పూతన మొదలగు - క్షుద్ర భూతముల్ = నీచ పిశాచములు - గృహవస్తుతతులన్ = ఇంటియందలి పదార్థములను - సంగ్రహించి = దొంగిలించి - రాసభములను =గాడిదలను - ఆలు=ఆవులు.

తాత్పర్యము

ఏనుఁగులు, గుఱ్ఱములు లోనగు వాహనములు కన్నీరు గార్చుచున్నవి. ధ్వజములు, కాంతిచెడి విఱిగిపడుచున్నవి. రాపులుఁగులు, నక్కలు,గ్రద్దలులంకలోపల గుంపులై భయంకరధ్వనులు చేయుచున్నవి. పూతన మొదలగు నీచపిశాచములిండ్లలోని వస్తువుల దొంగిలించి రాత్రులందు స్త్రీల కలలలోఁ గనఁబడి తెల్లనిపండ్లు వెలుపలికిఁ గానవచ్చునట్లు కలహించి నవ్వుచున్నవి. దేవతలకు వేసిన బలిపిండములను నిండ్లలోఁ గుక్కలు దూఱి తినుచున్నవి ఆవులకు గాడిదలు పుట్టుచున్నవి. ఎలుకలు ముంగిసలు కలసి మెలసి తిరుగుచున్నవి.

సీ. పిల్లులు పులులతో ♦ విహరించుచున్నవి, కుక్కలు పందులు ♦ గూడి తిరిగెఁ
గిన్నరరాక్షసు♦లు న్నరు లొక్కటై, పావురంబులు రక్త♦పాదములును
దెల్లనిమేనులై ♦ తెలిపెడి రాక్షస,పాళులకు వినాశ♦కాల మనుచుఁ
బెంపుడు శారికల్ ♦ వేశ్మంబులందు చీ,చీకూచి యని రొద♦సేయఁ దొడఁగెఁ

తే. బూర్వనిర్జితములు మృగ♦ములును బక్షు,లుద్దవిడి వెండి మూఁగెడి♦యుద్ధమునకు
మృగములును బక్షిసంఘముల్♦మేర దప్పి, రాజ! వాపోవుచున్నవి♦రవిని జూచి.

అర్థములు. శారికల్ = గోరువంకలు – వేశ్మంబులందు=ఇండ్లయందు – పూర్వ నిర్జితములు=ముందు జయింపబడినవి–ఉద్దవిడి=మిక్కిలివిడి = విచ్చలవిడి–వాపోవుచున్నవి=ఏడ్చుచున్నవి.

తాత్పర్యము

పిల్లులు పులులు– కుక్కలు పందులు–కలసి మెలసి తిరుగుచున్నవి. కిన్నరులు రాక్షసులు నరులు మైత్రి కలవారై యున్నారు. రక్తపాదములు, తెల్లని దేహములు గల పావురములు రాక్షసులకు వినాశకాలమును సూచించు చున్నవి. సాకుడు గోరువంకలు గృహములందు ‘కీచి కూచి’యని కూయుచున్నవి. ముందోడి పోయిన మృగములు పక్షులు విచ్చలవిడిగా మరల యుద్ధమునకు గుంపుచేరుచున్నవి. మృగములు పక్షులు వాని మర్యాద విడిచి సూర్యుని జూచి యేడ్చుచున్నవి.

ఆ. మిట్టపండ్లవాఁడు ♦ మిడిగ్రుడ్లవాఁడును, నొఱవ మేనివాఁడు♦కఱకువాఁడు
బోడినెత్తివాఁడు♦పొంచి కన్పన్నాఁడు, వేళవేళఁ దూఱి♦కాలుఁ డిండ్ల. ౭౫౪

అర్థములు. ఒఱవమేనివాఁడు=నడ్డిగూని గలవాఁడు, కాలుఁడు=మృత్యుదేవత.

తాత్పర్యము స్పష్టము.

కం. ఇట్టివి యుత్పాతంబులు, పుట్టుచు నున్నయవి గాన ♦ బుద్ధిఁ దలఁచి యి
ప్పట్టునఁ జెట్టలు పుట్టని, యట్టిపనుల్ చేయ నీకు ♦ నర్హం బటంచున్. ౭౫౫

అర్థములు. చెట్టలు = కీడులు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఉత్తమసచివాగ్రణులం, దుత్తమపౌరుషధనుండు ♦ నొగిఁ జెప్పియుఁ ద
చ్చిత్తము శోధించియు నది, మెత్తనపడకున్నఁ జూచి♦మిన్నక యుండెన్.

ఉత్తమసచివాగ్రణులందున్ = ఉత్తమమంత్రులందు – మొదటివారిలో, ఒగిన్ = చక్కఁగా, మిన్నక=ఊరక.

తాత్పర్యము స్పష్టము.

—♦ ౩౬–వ సర్గము. రావణుఁడు మాల్యవంతుని ధిక్కరించుట ♦—

చం. అన విని కాలకింకరవ♦శాత్మకుఁ డౌటను మాల్యవంతు నీ
తిని హితబోధమున్ వినక ♦ దేవవిరోధి సరోషచిత్తుఁడై
కనుఁగవ కెంపు బొమ్మముడి ♦ కన్పడ గ్రుడ్లను ద్రిప్పి చాతనిన్
గని వచియించు దుష్టమతి ♦ కండలక్రొవ్వున నెల్లరున్ వినన్. ౭౫౭

అర్థములు. కాలకింకరవశాత్మకుఁడు = యమకింకరులకు స్వాధీనపడిన మనస్సుగలవాఁడు, కెంపు=ఎఱ్ఱనికాంతి.

తాత్పర్యము

ఈ ప్రకారము ఆలోచనయందుఁ బౌరుషమునందుఁగూడ నుత్తముఁడగు మాల్యవంతుఁడు చెప్పిన మాటలు విని యమకింకరులకు స్వాధీన పడిన మనస్సు గలవాఁడగుట యతని హితబోధము వినక రావణుఁడు కోపించి కన్నులెఱ్ఱఁజేసి కనుబొమలు ముడివేసి గ్రుడ్లుత్రిప్పుచు దుష్టబుద్ధి రావణుఁడు కండక్రొవ్వుచే పెద్దవాఁడుగదా! యనియైన గౌరవ మెంచక సభలోని యందరు వినునట్లు ఈ ప్రకారము చెప్పెను.

కం. హితమత మని యే మని యీ, గతిఁ బరుషము లహితములగు ♦ కాఱులు ప్రేలన్
మతి గల్గె? వైరిపక్షవి,జితుఁడవు నేఁ జొరఁగనీను ♦ జెవి నీ మాటల్. ౨౫౪

అర్థములు. హితమతము = మేలగు నభిప్రాయము - పరుషములు = వినఁ గఠోరములైనవి - అహితములు = కీడు గలిగించునవి - కాఱులు = వ్యర్థ ప్రలాపములు - ప్రేలన్ = వదరుటకు - మతిగల్గెన్ = మనస్సు వచ్చెను - వైరిపక్షవిజితుఁడవు = శత్రుపక్షము వారిచే లంచమిచ్చి వశపఱచుకొనఁబడిన వాఁడవు.

తాత్పర్యము

మేలైన యాలోచన విని యీ విధముగ వినుటకు కఠినములై, కీడుకలిగించునవియైన వ్యర్థపు మాటలు వదరుటకు నీకు మనస్సెట్లువచ్చెను. శత్రువులకు ననుకూలురగు వారిచే నేదో లాభము పొంది యిట్లు చెప్పుచున్నావు. కావున నీమాటలు నేను వినను.

ఉ. ఏ మని తుచ్ఛమానవుని ♦ హీనబలున్ గృపణున్ దరిద్రు శా
ఖామృగసంచయాశ్రయు బి ♦ కారిగఁ దండ్రియ వెళ్ళఁ గొట్టఁగా
దీమసమేది కానలను ♦ ద్రిమ్మరు నొంటరికాని రాము నెం
తో మెఱమెచ్చు లాడెదవు ♦ దొడ్డసమర్థత యేమి గంటివో. ౨౬౫

అర్థములు. తుచ్ఛమానవుని = నీచ మనుష్యుని, హీనబలున్ = బలము లేనివానిని, కృపణున్ = నీచ స్వభావము గలవానిని, శాఖామృగసంచయాశ్రయున్ = క్రోఁతుల నాశ్రయించినవానిని, బికారిగన్ = దిక్కులేనివానిగ, దీమసమేది = పౌరుషము లేక, మెఱమెచ్చులు = మిక్కిలి మెచ్చులు.

తాత్పర్యము

రాముఁడు నీచ మనుష్యజాతియందుఁ జేరినవాఁడు, బలహీనుఁడు, స్వభావముచే నీచుఁడు, సంపదయందు దరిద్రుఁడు, తనకంటెఁ దక్కువగు క్రోఁతుల నాశ్రయించుటచే నీచాశ్రయము గలవాఁడు. కన్నతండ్రియే దిక్కులేనివానిని జేసి యూరువెడలఁగొట్టఁగా పౌరుషము చెడి యడవులం దొంటరిగాఁ దిరుగువాఁడు. ఇట్టివానిని నీవేమో విపరీతముగ మెచ్చుకొనెదవే? వానియందు నాయందు లేని గొప్ప సామర్థ్య మేమి చూచి మాటలాడితివి.

కం. ఏ మనుచు రాక్షసేశ్వరు, సామరగంధర్వజనభ•యంకరు సర్వో
ద్దామపరాక్రమ సంయుతు, నీ మదిఁ గడు హీనుఁగా గ•ణించితి చెపుమా.

అర్థములు. రాక్షసేశ్వరున్ = రాక్షసులకుఁ బ్రభువును, సామర గంధర్వ జన భయంకరున్ = దేవతలతోఁ గూడిన గంధర్వులకు భయము కలిగించువానిని, సర్వోద్దామ పరాక్రమ సంయుతున్=అందఱికంటె హెచ్చైన పరాక్రమముతోఁ గూడిన వానిని, కడుహీనుఁగా=మిగుల నీచునిగా.

తాత్పర్యము

రాక్షసుల కందఱకు బ్రభువును. దేవగంధర్వులకు భయంకరుఁడును, విశేష పరాక్రమవంతుఁడును నగు నన్ను మిగుల నీచునిఁగా నేమని లెక్కించితివి.

కం. కనుకుట్టుందనమో యరి,జనతా ప్రోత్సాహవిధమొ•శంకింతు ద్విష
జ్జనపక్షపాతమో నీ, యనుటకుఁ బరుషోక్తి నన్ను•నగుఁ గారణముల్ ౭౬౧

అర్థములు. కనుకుట్టుందనమో = ఓర్వలేనితనమో, అరిజనతా = పగవారి సమూహముయొక్క, ప్రోత్సాహవిధమొ = ప్రేరించిన తీరో, ద్విషత్ + జనపక్షపాతమో=విరోధుల యందలి యభిమానమో.

తాత్పర్యము

నన్ను నీ విట్లు కఠినముగా మాటలాడుటకు నా మేలోర్వలేనితనమైనను, శత్రువుల వలన మేలుపొంది వారి ప్రేరణమో, లేక శత్రువుల యందలి పక్షపాతమో కారణమై యుండవలెను.

కం. అరిప్రోత్సాహము లేకయె, వరశాస్త్రాభిజ్ఞుఁ డైన•పండితుఁ డెవఁ డీ
కరణిని బ్రభావయుతుఁ డగు.పరిపక్వమనస్కునిన్ నృ•పాలుం బలుకున్.

అర్థములు. అరి=శత్రువులయొక్క, వరశాస్త్రాభిజ్ఞుఁడు=గొప్పఁగా శాస్త్రమును, జక్కఁగాఁ దెలిసినవాఁడు, ప్రభావయుతుఁడు=మహాత్వముతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

శత్రువుల ప్రోత్సాహము లేకుండెనేని నీవలె గొప్పశాస్త్రముల నెఱిఁగిన పండితుఁ డెవఁ డీ ప్రకారముగ మహాత్వము గలవానిని, చక్కఁగా సంస్కారముచే నిశ్చయజ్ఞానము గలవానిని, అందు రాజును మాట్లాడును.

కం. తామరసహీనరమఁ బోల్, భూమిజ వనిఁ దెచ్చి యేమి•మునిఁగె నటంచున్
రామునకు బెదరికొని నేఁ గామితమును దీర్చికొనక•క్రమ్మఱ నిత్తున్. ౭౬౩

అర్థములు. తామరసహీనరమ = కమలము వదలిన లక్ష్మిని, అనఁగా ఆశ్రయము లేని దానిని, భూమిజన్=సీతను (౨) ఓషధిని, వనిన్ = అడవినుండి, బెదరికొని = భయపడి.

తాత్పర్యము

ఘోరమైన యడవినుండి యోషధిని దెచ్చినట్టు నెవ్వరు కాచు దిక్కులేక

యాశ్రయరహితయై యొంటరిగా నుండిన సీతను దండకారణ్యమునుండి తెచ్చిన యిప్పుడేమి మునిఁగిపోయెనని రామునకు బెదరి నాకోరిక నేఁ దీర్చుకొనక మరల నిత్తును ?

శా. నీవే చూడఁగలాఁడ వా వనచరా ♦ స్వీతున్ ససౌమిత్రి సు
గ్రీవున్ రాముని సంగరక్షితిని నే ♦ గృధ్రాళిపా ల్సేయఁగా
నే వీరాగ్రణి ద్వంద్వసంగరమునన్ ♦ బృందారకుల్ డాయ లే
రా వీరాగ్రణి రావణుం డదరునే ♦ యా యోధనక్రీడకున్. ౭౬౪

అర్థములు. ఆయోధనక్రీడకున్=యుద్ధమను కేళికి.

తాత్పర్యము

వానరులతోను, లక్ష్మణునితోను, సుగ్రీవునితోను గూడిన రాముని యుద్ధభూమియందు నేను గ్రద్దలపాలు సేయఁగా నీవే చూడఁగలవు. వీరులందు శ్రేష్ఠుఁడైన నెనని ద్వంద్వయుద్ధమందు దేవతలు సమీపమునకైన రాలేరో యట్టి వీరాగ్రణి రావణుఁడు యుద్ధకేళికి భయపడునా ?

కం. ఏవానికి నే లొఁగను, జేవఱ నను రెండు గాఁగఁ ♦ జీల్చిన; మత్స్వా
భావికదోషం బిదియు స్వ, భావము దురతిక్రమంబు♦పాయం దరమే. ౭౬౫

అర్థములు. లొఁగను=లోనుగాను=లోపడను, ఏవానికిన్ = ఎట్టివానికైనను, చెవ+అఱన్=బలము క్షయించునట్లు, దురతిక్రమంబు=దాఁటరానిది.

తాత్పర్యము

నీవు చెప్పినట్లు రాముఁడు నీ యభిప్రాయము ప్రకారము గొప్పవాఁడగును గాక! వాఁడేకాదు, వానికి నూరంత లెక్కువ గొప్పవాఁడువచ్చి నన్ను రెండుగా నిట్టనిలువునఁ జీల్చినను నేను మఱియొకనికి లోఁబడువాఁడఁగాను. ఈదోషము నాకుఁ బుట్టుకతోడనే లభించినది. దోష మని తెలిసియు నేల సవరించుకొనరాదందువా? స్వభావగుణము దాఁటరానిది కదా! దాని నతిక్రమించి యెవఁడు పోఁగలఁడు ?

ఉ. తోయధి సేతునిర్మితిని ♦ దొడ్డగ నాడెద వేల? కాకతా
ళీయ మ దేమి యచ్చెరువు ♦ లెక్కఁగఁ జెప్పెదు భీతుఁ గొంటె? వి
స్మయుల రామభద్రుఁడు వ♦నేచరయుక్తిని నిందు వచ్చియున్
గాయముతోడ వెండియును ♦ గ్రమ్మఱునే విను బాస చేసెదన్. ౭౬౬

అర్థములు. తోయధిన్ = సముద్రమునందు, నిర్మితిని = కట్టుట, కాకతాళీయము=కాకివాలినది, తాటిపండు పడినది, అన్నట్లు కాకివ్రాలఁగనే తాటిపండుపడునా? రాముఁడు కట్టఁగానే సేతు వేర్పడునా? ఏదో యాకస్మిక; అచ్చెరువు=ఆశ్చర్యము, భీతుఁగొంటె = భయపడితివా? వనేచరయుక్తిని = వానరులతోడను, కాయముతోడ=దేహముతో, గ్రమ్మఱునే = మఱలిపోవునా? బాస = ప్రమాణము, గ్రమ్మఱును నేబాస చేసెదను వినుమని యొక యర్థము, 'సత్యా వాణీ సరస్వతీ'యని యుద్దేశము లేకున్నను సత్య మొక్కొకసారి నోరవెల్వడును.

తాత్పర్యము

సముద్రమునందు రాముఁడు సేతువు కట్టెనని యది యొక దొడ్డకార్యముగాఁ జెప్పెదవు. కాకి కూర్చుండినది, తాడిపండు పడిన దన్నట్లు అది యేదో యొక యాకస్మికము. అది యొక్క లెక్కగాఁ జెప్పెదవే, భయపడితివా? ఆ రామచంద్రుఁడు వానరులతోడ నిచ్చటికి వచ్చినను మఱల దేహముతోఁ దిరిగి పోఁడని ప్రమాణము చేసెదను.

కం. అని గర్వంబునఁ బలికిన, విని దశకంఠుండు కోప ♦ వివశుం డనుచున్
మనమునఁ దలంచి, లజ్జా, వనతశిరంబునను మాల్య ♦ వంతుం డుండెన్. ౭౬౭

తాత్పర్యము స్పష్టము.

తే. అవల నమ్మాల్యవంతుఁడు ♦ నాజ్ఞఁ గాంచి
జయము నచియించి వీటికిఁ ♦ జనియె నంత
రావణుఁడు మంత్రివర్గంబు ♦ తో విమర్శ
సలిపి కాపుంచె లంకలో ♦ సకలదిశల. ౭౬౮

తాత్పర్యము

ఇట్లు రావణుఁడు చెప్పిన పిమ్మట మాల్యవంతుఁడు రావణుచే ననుజ్ఞ వడసి జయ జయ యని యింటికిఁ బోయెను. రావణుఁడు మంత్రులతో కార్యవిధము విమర్శించి లంకలో నన్నివైపుల రక్షకుల నియమించెను.

—♦ రావణుఁడు పురద్వారంబులఁ గాపుంచుట ♦—

సీ. తూరుపుదెసఁ బుర♦ద్వారంబుఁ గావఁ బ్ర, శస్తశౌర్యాఢ్యుఁ బ్ర♦హస్తు నిలిపి
దక్షిణమున మహో♦దరమహాపార్శ్వులఁ, బడమటిగవనికి♦బహుళమాయు
సాంద్రసేనావృతు♦నింద్రజిత్తును నిల్పి, సారణు శుకుని వై♦శ్రవణు దెసకుఁ
బనిచి యా దిక్కు తా♦స్వయముగ రక్షింతు, నని చెప్పి గుల్మంబు♦నందు భూరి
తే. బలముతోడ విరూపాక్షు♦నిలిపి యిట్లు, లంక నల్గడఁ గడుఁబది♦లంబుఁ గాఁగ
దగు విధానంబుఁ గావించి♦దశముఖుండు, తలఁచె ధన్యుఁడనని విధి♦బలము పేర్మి.

అర్థములు. బహుళమాయున్ = అనేకమాయ లెఱింగిన వానిని, సాంద్రసేనావృతున్=దట్టమైన సేనతోఁ జుట్టఁబడిన వానిని, వైశ్రవణు దెసకు=ఉత్తర దిక్కునకు, విధిబలము పేర్మిన్ = దైవబలము యొక్క యతిశయము వలన, గుల్మము=పురమధ్య భాగము.

తాత్పర్యము

తూరుపు ప్రక్క పురద్వారమును రక్షించుటకు ప్రశస్తబలసంపత్తిగల ప్రహస్తుని, దక్షిణమున మహోదర మహాపార్శ్వులను నిలిపెను. పడమటి గవని పెక్కు మాయలు నేర్చిన యింద్రజిత్తును విస్తార సేనతో నిలిపెను. ఉత్తరపు గవను గాచుటకు శుకసారణులఁబంపి యచ్చటికి నేనే వచ్చెదనని చెప్పెను. ద్వీపము దక్షిణ భాగమున పడమటి దెసగా నైరృతిమూల లంకానగర మున్నది. కావున సేతు వుత్త

రమునను న్నది. కావున నుత్తరము పడమర తాఁకు డెక్కువ కావున నచ్చట నొక చోటఁ దాను నిలిచి యొకచోట నింద్రజిత్తును నిలిపెను. పురమధ్యభాగము రక్షింప గొప్పసేనతో విరూపాక్షుని నిలిపెను. ఈ ప్రకారము లంకకు నాలుగు వైపుల పదిలముగా రక్షకుల నియమించి రావణుఁడు దైవప్రేరణముచేఁ దాను కృతకృత్యుఁడ నని తలఁచెను.

తే. కెలసములు వారి వారికిఁ◆బలికి యిట్లు, వారి నెల్లరఁ బోవంగఁ◆బనిచి తాను
నఖిలసంపత్సమృద్ధమా◆నంతిపురికిఁ,జనియె నాశీస్సు పలుక నా◆సచివచయము.

అర్థములు. కెలసములు = పనులు, అఖిలసంపత్సమృద్ధము = సమస్త సంపదలతో వృద్ధిపొందినది, ఆశీస్సు=దీవన.

తా త్ప ర్య ము

వారి వారికిఁ జెప్పవలసిన పనులు వారి వారికిఁ జెప్పి వారినందరి వారివారి సంస్థానములకుఁ బొండని చెప్పి పంపి సకల సంపదలతోఁ గూడిన యంతఃపురము నకు సచివు లాశీర్వదించుచుండఁ బోయెను.

౩౭-వసర్గము. శ్రీరామునకువిభీషణుఁడురావణసేనాసన్నాహంబువిధంబుఁదెల్పుట

సీ. నరలోకభర్త వా◆నరలోకభర్తయు, బావమానియు జాంబవంతుఁ◆డంగ
దుండు మైందద్వివి◆దులు మఱి లక్ష్మణుం,డును సుషేణవిభీష◆ణులునుగజుఁడు
నలకుముదులును బ◆నసగవాక్షులుఁ గూడి, కార్య మాలోచింపఁ◆గడఁగి రప్పు
డసురేంద్రపాలితం ◆ బైన యా లంక యి,దే దుర్జయం బని ◆ దేవతాహి

తే. యక్షగంధర్వతతి కైన ◆ రాక్షసాధి
నేత రావణుఁ డిందు స ◆ న్నిహితుఁ డెపుడు
కాన కార్యంబు సిద్ధి కాఁ ◆ గల తెఱంగు
నిపుణమతిఁ జూడఁదగునంచుఁ ◆ గపిచయంబు. ౭౭౧

అర్థములు. నరలోకభర్త = రామచంద్రమూర్తి, వానరలోకభర్త = సుగ్రీవుఁడు, పావమాని=ఆంజనేయుఁడు, అనిన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తియు సుగ్రీవుఁడు ఆంజనేయుఁడు జాంబవంతుఁడు అంగదుఁడు, మైంద ద్వివిదులు, లక్ష్మణుఁడు, సుషేణ, విభీషణులు, గజనల కుముదులు, పనస గవాక్షులు అందఱొకచోటఁజేరి చేయఁదగినకార్యమాలోచింప మొదలుపెట్టిరి. అపుడు వానరులు రావణుఁడు పాలించు లంక లంక యని మన మనుకొనుచున్న లంక యిదే. వచ్చితిమి చేరితిమి. ఇది యుద్ధమందు దేవ గంధర్వ యక్ష పన్నగులకైన జయింపరానిది. రావణుఁ డిందే యుండును గావున మన కార్యము ఫలించు విధము నేర్పుగ నాలోచింపవలయును. దీనిని మనము ముట్టడిం చుట తప్ప వేఱుమార్గము లేదు. అట్లు ముట్టడించునపు డెవరెవ రేయే దిక్కున

నుండవలయును. వాఁడు బలవంతులనుంచిన దిక్కున నంతకంటె బలవంతులనుగదా వారికెదురుద్దిగానుంచవలెను. బలహీనులనుంచినఫలము లేదుగదా యనుచు నుండిరి.

తే. అనుడు నగ్రామ్యపదవంత ♦ మగుచుఁ బుష్క
  లార్థ మగువాక్యముల రావ ♦ ణానుజుండు
  పలుకు ననలుండు శరభుండు ♦ ప్రఘసుఁ డతుల
  మతులు సంపాతి యనెడి నా ♦ మంత్రివరులు. ౭౭ ౯

అర్థములు. అగ్రామ్యపదవంతములు = గ్రామ్య పదములు లేక వ్యాకరణ శుద్ధమైనవి, పుష్కలార్థములు = పూర్ణముగ నర్థముగలవి. సందేహములు కొఱఁతలు లేనివి.

తాత్పర్యము

వ్యాకరణ విరుద్ధములైన పదములు లేక శుద్ధములైన వాక్యములతో విభీషణుఁ డిట్లనెను. నామంత్రులు అనలుఁడు శరభుఁడు ప్రఘసుఁడు సంపాతి యనువారు; మాల్యవంతుని మొకటి తమ్ముని సుమాలి కూఁతురు కైకసి, రెండవతమ్ముఁడు మాలికొడుకులు అనలుఁడు, సంపాతి యనువారు ప్రహస్తుని తమ్ముఁడు ప్రఘసుఁడు.

ఉత్తరకాండమున ౯౩వ పద్యంబున అనిలుఁడు అనలుఁడు, సంపాతి, హరుఁడు ననువారు విభీషణు మంత్రు లని చెప్పఁబడెను. ప్రఘస శరభులే అనల హరులు కాఁబోలు.

సీ. పక్షి వేషంబులఁ బరిపంథిపురిఁ జొచ్చి, దళముల విహితవి ♦ ధానములను
  బరికించి వచ్చిరి ♦ పలికెద శ్రీరామ, వారలు చెప్పిన ♦ తీరు వినుము
  తూర్పు ప్రహస్తుండు ♦ దొడ్డబలంబుతో, గవనిని గావంగఁ ♦ గడఁగినాఁడు
  దక్షిణంబును మహో♦దరమహాపార్శ్వులు, పడమట నింద్రజి ♦ కడిమి నిలిచెఁ
తే. బట్టిసాసి ధను శ్శూలల ♦ పాణులైన, శూరు లెందఱో యాతనిఁ ♦ జుట్టినారు
  రావణుం డుత్తరంపుద్వా♦రంబు తాన, కాచువాఁడయ్యెనాశర♦కాండయుక్తి.

అర్థములు. పరిపంథి = శత్రువగు రావణుని, దళముల = సేనల, విహిత విధానములను = పురరక్షణమందుఁ జేయఁబడిన యేర్పాటులను, కడిమిన్ = బలముతో, ఆశరకాండయుక్తిన్ = రాక్షససమూహములతో.

తాత్పర్యము

ఈ నలుగురు పక్షి వేషములతో శత్రుపుర మగు లంకఁ బ్రవేశించి యచ్చటఁ బురరక్షణమునకై యేర్పాటు చేయబడిన సేనలవిధమును జూచి వచ్చినారు. వారు చెప్పినవిధము వినుము. గొప్ప సేనతో సేనానాయకుఁడగు ప్రహస్తుఁడు తూర్పు గవనిని గాచుచున్నాఁడు. దక్షిణమున మహోదరమహాపార్శ్వు లున్నవారు. పడమట నింద్రజిత్తున్నాఁడు. వానికి సహాయులై పట్టిసములు కత్తులు విండ్లు శూలములు

నాయుధములు గాఁగల వారెందరో యున్నారు. ఉత్తరపుగవను రావణుఁడు తానే రక్షింపఁబూనినాఁడు. వీనికి సహాయులై రాక్షససమూహము లున్నవి.

కం. శూలాయుధహస్తులు కరవాల లసత్కరులు చాప♦పాణులు గొలువన్
జాల విరూపాక్షుఁడు పురిఁ, బాలించును గుల్మమధ్య♦పరితిష్ఠితుఁడై. ౭౭౪

అర్థములు. శూలాయుధహస్తులు = శూలము లను నాయుధముల చేతి యందుఁ గలవారు, కరవాల లసత్కరులు=కత్తులచేఁ బ్రకాశించు చేతులు గల వారు, చాపపాణులు=విండ్లు చేతులందు ధరించినవారు, గుల్మమధ్య పరితిష్ఠితుఁడై= ఊరినడుమ నుండువాఁడై, ఆయుధహస్తులని చెప్పుటచే యుద్ధమునకు సిద్ధపడి యున్నారని భావము.

తాత్పర్యము

శూలములు, కత్తులు, విండ్లు చేత ధరించినవారితో విరూపాక్షుఁడు నగర మధ్య ప్రదేశమును రక్షించుచున్నాఁడు.

సీ. ప్రతిపక్షసైన్యంబు ♦ పన్నినవిధ మిది, పురమున నొక వేయి ♦ కరులు రథము
లయుతంబు నశ్వంబు ♦ లయుతంబు రాక్షస, కోటియుఁ గలదు ని♦శాటులెల్ల
నాతతాయులు సంగ♦రావని శూరులు, పంక్తికంఠుని మెచ్చువచ్చువార
లుగ్రులీ తెగలలో ♦ నొక్కొక్కదానికి, దశలక్ష పరివార♦దళము గల ద

తే. టంచుఁ జెప్పిరి మంత్రులటంచు నారి, మ్రోలనిల్చి మఱిన్ రఘు♦ముఖ్యుఁ బలుకు
విత్తపతి గెల్చెనటువడి♦వే లసురుల, నాత్మతుల్యులఁగొని రావ♦ణాసురుండు.

తాత్పర్యము

అర్థములు. ప్రతిపక్షసైన్యంబు = శత్రువులసేన, అయుతము=పదివేలు, ఆతతాయులు=పరమ దుర్మార్గులు, 'సన్నద్ధే త్వాతతాయీ వధోద్యతే' అమరము. 'పలాయమానం తను తే జిఘాంసయా గచ్ఛతీతి ఆతతాయీ' పరువెత్తు వానిని జంప నిచ్ఛచేఁ దఱుముకొని పోవువాఁడు ఆతతాయి. ఇప్పుడు మనము యుద్ధమునకు వెనుదీసిపోయెద మనిసను వారు వెంబడించి చంపుదురు. కావున యుద్ధము తప్పదని భావము. 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః। క్షేత్ర దారహరశ్చైవ షడేతే హ్యాతతాయినః' ఇండ్లకు నగ్ని పెట్టువాఁడు, విషము పెట్టు వాఁడు, చంపుటకై యాయుధము ధరించినవాఁడు, ధనము నపహరించిన వాఁడు' క్షేత్రమును భార్యను హరించినవారు ఆతతాయులు; విత్తపతిన్=కుబేరుని.

తాత్పర్యము

ఈ ప్రకారము శత్రువులు తమ సేనలఁ బన్నియున్నారు. లంకయందు వేయి యేనుఁగులు, రథములు పదివేలు, అశ్వములు, పదివేలు, పదాతులగు రాక్షసులు కోటియుగలవు (ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములన్నపుడు వానిపైనుండి యుద్ధము జేయువారని భావము) వీరందరు మహాశూరులు, హింసాసక్తులు, రావణునిచే మెప్పు పడసినవారు, భయంకరులు. ఈ తెగలలో నొక్కొక్కదానికి పదిలక్షల పరివారము

లున్నారు, అని మంత్రులు చెప్పిరని చెప్పి వారినే వారియెదుట విమర్శార్థము నిలిపెను. ఇటుచేసి రామచంద్రమూర్తితో విభీషణుఁ డిట్లనియె. తనతో సమానులయిన రాక్షసులను నఱువదివేలమందిని దీసికొని రావణుఁడు కుబేరునిఁ గెలిచెను. అప్పటిసేన యంతయే. ఇప్పుడు అంతకంటె గొప్పసేన గలదు.

కం. కినియకుము నీకు రోషం,బును గూర్పఁగ నిట్లు పలుకఁ ♦ బూనితి నీవున్
ఘనుఁడవు సమర్థుఁడవు దుర,మున వేల్పుల నేని గెలుతు ♦ పురుశౌర్యమునన్.

తాత్పర్యము

శత్రువుల నిట్లు పొగడవచ్చునా యని కోపింపకుమా, నిన్ను బెదరించి నిరుత్సాహము గూర్ప నేను జెప్పలేదు. రోషము దెచ్చుకొని వారిని జంపుటకుఁ దగిన ప్రయత్నము చేయుదు వని చెప్పుచున్నాను. నీవు గొప్పవాఁడవు. ఎంత కార్యమైన సాధింపఁగలవాఁడవు. యుద్ధమునందు నీవు ఘనశౌర్యముచే దేవతలనైన గెలువఁ గలవు. కావున దానికిఁ దగిన సన్నాహము చేయుము.

కం. రామా! చతురంగ బల,స్తోమముతో శాత్రవులను ♦ దూలింపు మనన్
రాముఁడు యోజించి బలం,బీమెయి విభజించె రిపుల ♦ నెల్ల ♦ జయింపన్. ౨౨౭

అర్థములు. చతురంగబల స్తోమము=నాలుగు విధము లగు సేనల సమూహము-రథగజ తురగ పదాతులకు చతురంగ సేన యని పేరు. దీని తద్భవము చదరంగము.

తాత్పర్యము

రామచంద్రా! నీవు నాలుగు విధములైన సేనలుగల పగవారిని వధింపుము. అని చెప్పఁగా రామచంద్రమూర్తి యాలోచించి శత్రువుల జయించుటకై తన సేన నిట్లు విభజించెను.

—♦ శ్రీరాముఁడు లంకాద్వారముల సేనల నిలుపుట ♦—

తే. తూర్పుగవనిని నీలుండు ♦ దొడ్డసేన
తోఁ బ్రహస్తునితో ననిఁ ♦ దొడరవలయు
దక్షిణపుదిక్కునన్ మహో♦దరుని వెండి
యును మహాపార్శ్వ నంగదుం ♦ డొప్పగెలువ. ౨౨౮

తాత్పర్యము

గొప్ప సేనతో నలుఁడు తూర్పు గవని యొద్ద నిలచి ప్రహస్తుని గెలువ వలయును. దక్షిణపుదిక్కున నంగదుఁడు మహోదర మహాపార్శ్వుల గెలువ వలయును.

తే. అప్రమేయబలుం డైన ♦ యాంజనేయుఁ, డమితసైన్యంబుతోఁ జని ♦ హరిహయారి
యుండు పశ్చిమదిక్కున ♦ గండుమీఱి, యహితపుటభేదనంబుఁ దా ♦ నఱుమవలయు.

అర్థములు. హరిహయ + అరి = ఇంద్రజిత్తు, అహితపుట భేదనము= శత్రువు పట్టనము, అఱుమవలయు = ఆక్రమింపవలెను.

తాత్పర్యము

అపరిమితబలముగల యాంజనేయుఁడు గొప్పసేనతోఁ జని యింద్రజిత్తుఁడున్న పడమటి గవని దిక్కున నిలచి లంక నాక్రమింపవలయును.

సీ. మహితు లౌ ఋషులకు ♦ మఱి దానవాళికి, గుండెగాలం బైన ♦ దుండగీని
వరము మైఁ గండకా ♦ వరమును గలవానిఁ, బ్రజలెల్ల నల్లాడఁ ♦ బఱచు నీచు
హతుఁ జేయువంతు నా ♦ యది గాన నతఁ డుండు, నుత్తరదిశను నే ♦ నుండువాఁడ
సౌమిత్రియుతుఁడనై ♦ జాంబవంతుండు సు, గ్రీవవిభీషణుల్ ♦ ప్రోవవలయు
తే. మధ్యమంబును, వానరుల్ ♦ మనుజరూప
ములను దాల్పంగ రా దిది ♦ వలయు నియతి
యగచరసమూహమునకుఁ జి ♦ హ్నంబు దీనిఁ
దప్ప రా దెవ్వరైన నే ♦ తరుణమునను. ౨౦౦

అర్థములు. గుండెగాలము = గుండెలలో నాటుకొనిన యినుప ములికె - అనఁగా నంత బాధాకర మని భావము. కండకావరము=దేహబలము - పొగరు. అగచర సమూహమునకున్=వానరుల గుంపునకు, చిహ్నంబు=గుర్తు, ఏతరుణమునను=ఏ సమయమందైనను.

తాత్పర్యము

గొప్పవారగు ఋషులకు దానవులకు గుండెలో నాటిన గాలమువంటి దుష్టుని, వరము గలదని గర్వించిన వానిని, లోకుల నల్లాడఁబెట్టు నీచుని, రావణుని చంపువంతు నాది. కావున వాఁడుండు నుత్తర దిశయందు నేను లక్ష్మణునితో నుండెదను. జాంబవంతుఁడు సుగ్రీవుఁడు విభీషణుఁడు సేనామధ్యమును రక్షింపవలెను. అది యునుగాక వానరు లెవ్వరును మనుష్యరూపమును ధరింపరాదు. ఇది నియమము. ఎవ్వఁడైన నెప్పుడైన దీనిని దప్పరాదు.

కం. నేనును నా తమ్ముండును, నా నెచ్చెలి యసురరాజు ♦ నలువురు సచివుల్
మానవరూపంబుల నరి, సేనం బరిమార్పఁ గలము ♦ సిద్ధ మిది సుఁడీ. ౨౦౧

తాత్పర్యము

నేను, నా తమ్ముఁడు లక్ష్మణుఁడు, నా స్నేహితుఁడు విభీషణుఁడు, ఆయన నలువురు మంత్రులు - ఈ యేడుగురు మాత్రము మనుష్యుల రూపముతో యుద్ధముచేసి శత్రువులఁ జంపగలము. మఱి యెవఁడైన మనుష్యరూపముతోఁ గనబడినాఁడా వానిని శత్రువని వెంటనే వధింపవలయును. కావున వానరు లెవ్వరు మనుష్యరూపములు ధరింపరాదు.

కం. అని సేనల నియమించియుఁ, దన కార్యము సిద్ధికొఱకు ♦ దశరథసుతుఁడున్
మనమునఁ దలఁచి సువేలా, వనిధరకూటంబు నెక్కెఁ ♦ బత్తనముఁ గనన్.

అని సేనల నేర్పాటుచేసి తన కార్యము ఫలించుకొఱకు రామచంద్రుఁ డాలోచించి లంకను జూడఁదలఁచి సువేలాద్రి నెక్కెను.

—♦ ౩౮-వ సర్గము. శ్రీరాముఁడు సుగ్రీవాదులతో సువేలాద్రి నెక్కుట ♦—

సీ. తనతోడ సౌమిత్రి ♦ చను దేర సుగ్రీవు, ననురక్తు ధర్మజ్ఞ ♦ నఖిలమంత్ర
వేత్త విధిజ్ఞు వి ♦ భీషణుఁ గనుగొని, మధురసూక్తుల నిట్లు ♦ మందలించు
వివిధధాతుచిత సు ♦ వేలాద్రిపై నెక్కి, యంద యీ రాతిరి ♦ యంత గడపి
వఱువాతఁ జూతము ♦ వాని నాశమునకై, నాపత్నిఁ గొనిచన్న ♦ పాపచరితు
ఆ. నిలయు, మయ్యొ యెంత ♦ నీచుఁడో యాతఁడు, వంశ మైన సాధు ♦ వర్తనంబు
నైన ధర్మమైన ♦ నాత్మఁ దలంపక, జగము దిట్టుపనిసి ♦ జలిపెఁ జెనఁటి. ౨౮౩

అర్థములు. అనురక్తున్=ప్రేమగలవానిని, ధర్మజ్ఞున్ = ధర్మము తెలిసిన వానిని, అఖిల మంత్రవేత్త=అన్ని యాలోచనలు తెలిసినవానిని, మందలించున్= చెప్పెను. దీనికి చివాట్లు పెట్టుట యను నర్థము గ్రంథస్థముగాదు. వివిధధాతుచిత= అనేకవిధములైన ధాతువులచే వ్యాపించిన, సువేలాద్రి = సువేల మను పేరుగల కొండ, దీనిపై నెక్కిన లంకానగరము లోపలిభాగము కానవచ్చును, వఱువాతన్= ఉదయమున, చెనఁటి=దుష్టుఁడు, సుగ్రీవ విభీషణ శబ్దములకు నడుమనున్న శబ్దములు కాకాక్షిన్యాయముచే నిరువురకు నన్వయింపవలెను. అనురక్తుఁడు, ధర్మజ్ఞుఁడు, అఖిల మంత్రవేత్త, విధిజ్ఞుఁడగు సుగ్రీవుఁడు, అట్టివాఁడే యను విభీషణుఁ డని యన్వయము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి తనతోఁడ లక్ష్మణుఁడు రాఁగా తనయం దనురాగము గలవారు, ధర్మమెఱింగినవారు, ఆలోచన లన్నియుఁ దెలిసినవారు, కార్యము లెట్లు చేయవలయునో తెలిసినవారు నగు సుగ్రీవ విభీషణులఁజూచి యిట్లనియె. నానావిధ ధాతువులుగల యీ సువేల పర్వతమెక్కి యీ రాత్రియందే యుండి యుదయము కాఁగానే తన చావు నిమిత్తమై నా భార్య నపహరించిన పాపాత్ముని స్థానమగు లంకను జూతము. అయ్యో! వీఁడెంత నీచుఁడో కదా! తాను బుట్టినవంశముగాని, పెద్దల సాధుచరిత్రముగాని, ధర్మమైనఁగాని, యాలోచింపక దుష్టుఁడై లోకము దిట్టు పనిని జేసెను.

ఉ. ఆతనిపేరు విన్నఁ దను ♦ వంతయు మండెడి, నైన నొక్క దు
ర్జాతు నిమిత్తమై సకల ♦ రాక్షసులన్ వధియించు టెట్లొకో ?
పాతకముం బొనర్చు యమ ♦ పాశవశంగతుఁ డైన యొక్కఁ డా
పాతకి నీచుహేతువునఁ ♦ బాడగు నాతనివంశ మంతయున్. ౨౮౪

అర్థములు. దుర్జాతు నిమిత్తమై=దుష్టజన్మము గలవానికొఱకు, రాక్షస వేళ యగు సంధ్యాకాలమందుఁగదా వీనితల్లి విశ్రవసుఁ గామించెను, పాతకి=పాపి,

తాత్పర్యము

వానిపేరు విన్నంత మాత్రమున నాద్యంతము దేహము మండుచున్నది. ఈయొక్క దుష్టు నిమిత్తమై రాక్షసుల నందఱ నిరపరాధు లగు వారిని గూడ నెట్లు చంపుదును. యమపాశములకుఁజిక్కి చావనున్న వాఁడొకఁడు పాపము చేయును, ఆ పాపాత్ముఁడు, నీచుఁ డగువాని హేతువున వాని వంశమంతయుఁ బాడగును. మంచి నీళ్ళ మడుఁగునందుఁ బాముచేరినఁ బాము నేకాక దానియందలి చేఁపలను గూడఁ బంపుదురుగదా! 'ఏకః పాపాని కురుతే, ఫలం భుఙ్త్తే మహాజనాః' 'ప్రల్లదుఁడైన యొక్క కులపాంసను జేసిన దానఁ దత్కులం బెల్లను దూషితం బగుట యేమి యపూర్వము' భార, ఆది. ఒక తక్షకుని నిమిత్తమైకదా సర్పము లన్నియుఁ జచ్చెను. పాములులోనైన దుష్టమృగముల వలనఁగదా యడవులలోని చెట్లు కాలిపోవుట. వడ్లతోడ తట్ట యెండవలయును. ఇనుముతోడ నగ్ని సమ్మెట పెట్లు దినవలయును.

సీ. అని యిట్లు క్రోధవ♦శాత్ముఁడై పలుకుచు, మున్నుగ నెక్కె రా♦ముండు గిరిని
నతులవిక్రమరతుం♦డైన సౌమిత్రియు, శరచాపహస్తుఁడై♦చనియె వెంట
నాతని వెన్నంటి♦హరిరాజు నామాత్యుఁ,డగు విభీషణుఁడును ♦ హనుమ వాలి
తనయనీలురును మైం ♦ దద్వివిదగజులు, గవయగవాక్షులు ♦ గంధమాద
తే. నుండు శరభుండు జాంబవం♦తుండు హరుఁడు, పనసరంభకుముదశత♦వలిసుషేణ
ఋషభదుర్ముఖు లాదిగ♦వృక్షచరులు, పెక్కు రెక్కిరి మారుత♦వేగు లఘుడు.

అర్థములు. క్రోధవశాత్ముఁడై = కోపమునకు వశపడిన మనస్సుగలవాఁడై, మారుత వేగులు = వాయువువలె వేగముగఁబోవువారు. వ్యాకరణము. వాలి తనయనీలురు-దీర్ఘపూర్వక లకారోపధ కాదంత సంస్కృత మహచ్ఛబ్ద మగుటచే బహువచనంబున లకారంబునకు రేఫంబు.

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి కోపముతో నెక్కఁగా విల్లు, బాణములు ధరించి మిగులఁ బరాక్రమ వంతుఁడైన లక్ష్మణుఁడు వెంటనే యెక్కెను. ఆయన వెనుక సుగ్రీవుఁడు, మంత్రులతోడ విభీషణుఁడు, హనుమంతుఁడు, అంగదుఁడు, నీలుఁడు, మైంద ద్వివిద గజగవయ గవాక్షులు, గంధమాదనుఁడు, శరభుఁడు, జాంబవంతుఁడు, హరుఁడు, పనసరంభకుముద శతవలి సుషేణ ఋషభ దుర్ముఖులు మొదలుగాఁగల వానర ముఖ్యులు పెక్కురు వాయువేగమున నెక్కిరి.

ఉ. అందఱు శైల మెక్కి దివి ♦ నంటిన భంగిఁ ద్రికూటకూటమం
దందము మీఱి సాలనిచ♦యంబులు నుత్తమ మైన ద్వారముల్
సందడి మీఱి రాత్రిచర♦సంఘములుం బొలుపొంద లంక వే
డ్కం దగఁ జూచి సాలగత♦కాలనిశాటులు వేఁటుకోటనాన్.

అర్థములు. దివిన్ = ఆకాశమును, త్రికూటకూటమందు = త్రికూట శిఖరమునందు, సాలనిచయములు = ప్రాకార సమూహములు, సాలగత=ప్రాకారము మీఁదనుండు, కాల నిశాటులు=నల్లని రాక్షసులు, వేఱుకోటనాన్ =మఱియొక కోటయో యనునట్లు, త్రికూట పర్వతశిఖరంబున లంక గలదు. దానికి సమీపమందే దాని యెత్తున సువేలగలదు.

తాత్పర్యము

ఇట్లందఱు కొండయెక్కి యాకాశమును దాఁకుచున్నదానివలెనుండు త్రికూట పర్వతశిఖరమునందు నందమైన ప్రాకారముల వరుసలు, ద్వారములను జూచి యీ ప్రాకారము లందున్న నల్లని రాక్షసులు వేరొక ప్రాకారమో యనునట్లు (కాంచిరి.)

ఉ. కాంచిరి; కాంచి రక్కసులు • కయ్యపు టెత్తున నుంటఁ జూచి గ
ర్జించిరి రామసన్నిధిని • వృక్షచరుల్ వివిధస్వనంబులన్;
మించినరాగవర్ణమున • నీరజబాంధవుఁ డస్తమించె; సం
ధించెను బూర్ణశీతకర•దీప్తవిభావరియున్ మనోజ్ఞమై. ౭౮౭

అర్థములు. కయ్యపుటెత్తునన్=యుద్ధప్రయత్నముతో, రాగవర్ణమునన్= ఎఱ్ఱనికాంతితో, నీరజబాంధవుఁడు=సూర్యుఁడు, అస్తమించెన్=క్రుంకెను, పూర్ణ శీతకరదీప్త విభావరియున్ = నిండు చంద్రునిచేఁ బ్రకాశించు రాత్రి, దీనిచే నీ దినము పున్నమ యనియుఁ బాడ్యమినాఁడు యుద్ధారంభమనియు మహేశ్వర తీర్థీయము. దీపములచేఁ బూర్ణచంద్రుఁడు గలరాత్రివలెఁ బ్రకాశించుచనని గోవింద రాజీయము.

హనుమంతుఁడు లంకఁ బ్రవేశించినది శుద్ధత్రయోదశి యగునేని నేఁడు బహుళాష్టమిగా నుండవలెను. కొందరు నేఁడు చతుర్దశియందురు. ఈ విషయము ముందు చర్చింపఁ బడును.

కం. వృక్షచరాగ్రేసరుఁడును, రక్షోనాథుండు గొలువ•రాముఁడు జాగ్ర
ల్లక్షణుఁ డగు లక్ష్మణుతో, ఋక్షాదులు గొల్వ గిరిని•రేయిఁ వసించెన్.

తాత్పర్యము

వానరనాథుఁడు సుగ్రీవుఁడు రాక్షస నాయకుఁడగు విభీషణుఁడు భల్లూకములగు జాంబవదాదులు గొలువఁగా హెచ్చరికయే చిహ్నముగాఁ గల లక్ష్మణునితో రామచంద్రమూర్తి యారాత్రి పర్వతమందే వసించెను. జాగ్రల్లక్షణుఁడనుటచే లక్ష్మణుఁడు నిద్రపోక కాచియుండెనని భావము. ఇది యాయన లక్షణ మనుటచే నాయన రాత్రియందు నిద్దురింపఁ డనియు నెఱుఁగనగు.

—•౩౯-వ సర్గము. శ్రీరాముఁడు లక్ష్మణ సుగ్రీవాదులతో లంకం జూచుట•—

సీ. వేవినయంత న • వ్వీరులు లంకలో, సమసౌమ్యరమ్యవి • శాలదీర్ఘ
ముల నుపవనములఁ • దిలకించి యబ్బుర, పోయి రందఱు దాని•పొలుపునకును

సాలతాలతమాల ♦ చంపకాశోకపు, న్నాగనీపార్జున ♦ నాగమాల
పాటలార్జున సప్త ♦ పర్ణ నీపావళీ, కర్ణికారతిలక ♦ కాండములను
తే. బుష్పితాగ్రలతావృత♦భూరుహముల,వింతకుసుమంబులను రక్త♦కాంతమృదుల
పల్లవంబులఁ బచ్చిక♦పట్లగముల, నీలవనరాజులను గిరి ♦ నెమ్మిఁ గూర్చె. ౭౮౯

అర్థములు. వేవిన యంతన్ = ఉదయము కాఁగానే, సమ = మిట్టపల్లములు లేనివి, సౌమ్య = క్రూరమృగములు లేనివి, రమ్య=మనోహరములైనవి, విశాల = వెడలుపైనవి, దీర్ఘములన్ = నిడుపులైనవి యగు, ఉపవనములు = లంకకు వెలుపల సమీపమందే యుండు తోఁపులను, లంకలోనని చెప్పినను ప్రాకారములకు వెలుపలనున్నను లంకకుఁ జేరినవనియే భావము, తిలకించి=చూచి, అబ్బురపోయిరి=ఆశ్చర్యపడిరి, పొలుపునకు=అందమునకు, సాల=మద్దిచెట్లు తాల=తాటిచెట్లు, తమాల=చీఁకటి మ్రాకులు, చంపక=సంపెఁగలు; పున్నాగ = సురపొన్నలు, నీప=మంకెనచెట్లు, అర్జున = ఏరు మద్దిచెట్లు, నాగమాల = నాగకేసరములు, సప్తపర్ణ=ఏడాకుల యరఁటులు, పాటలార్జున=ఎఱ్ఱ మద్దిచెట్లు, నీప = నల్ల యిరుగుడు చెట్లు, కర్ణికార=తేల చెట్లు, తిలక-బొట్టుగు చెట్లు, కాండములును= వీని సమూహములను, పుష్పితాగ్ర=పూచిన కొనలుగల, లతావృత=తీఁగలచేఁ జుట్టుకొనఁబడిన, భూరుహములన్=చెట్లను, వింత కుసుమంబులను=ఆశ్చర్యకరములైన క్రొత్తరకము పుష్పములను, రక్తకాంత = ఎఱ్ఱని చిగుళ్ళుగల, మృదుల = మెత్తని, పల్లవంబులన్ = చిగుళ్ళను, నెమ్మిన్ = సంతోషము, గిరి = సువేల పర్వతము.

తాత్పర్యము

ఉదయము కాఁగానే యా వీరులు లంకానగరమున కానుకొని ప్రాకారములకు వెలుపలనుండు సమములై క్రూరమృగములు లేనివై మనోహరములై వెడలుపులై దీర్ఘములై యుండు తోఁపులను జూచి వాని యందమునకు నాశ్చర్యపడిరి. సాలతాలాదివృక్షములను కొనలందుఁ బూవులుగల తీఁగలచేఁ జుట్టుకొనఁబడిన చెట్లను క్రొత్తరకపుఁ బూలను ఎఱ్ఱని కాంతిగల మెత్తని చిగుళ్ళను, పచ్చిక బయళ్ళను నల్లని వనరాజులను గలదై వారికి సువేలపర్వతము సంతోషము కలిగించెను.

కం. మానవులు భూషణంబుల, మానుగ ధరియించుకీతి ♦ క్ష్మాజములు సుగం
ధానూనపుష్పఫలసం, తానంబులఁ దాల్చి చూడ్కి♦తనుపుం గూర్చెన్.

అర్థములు. మానవులు=మనుష్యులు, క్ష్మాజములు = చెట్లు, సుగంధ = మంచి వాసనగలవై, అనూన=కొఱఁతలేక సమృద్ధములైన, పుష్పఫల సంతానములను = పూలయొక్కయు పండ్లయొక్కయు సమూహములను, తనుపున్ = తృప్తిని.

తాత్పర్యము

మనుష్యులు భూషణములను సొగసుగ ధరించునట్లు పరిమళము గలిగి సమృద్ధములైన పూల పండ్ల గుంపుల ధరించి చెట్లు దృష్టికిఁ దృప్తి కలిగించెను.

క. నందన చైత్రరథాభం, బిందిందిరబృందనాద ♦ మింద్రియనికరా
నందం బై సర్వర్తుక, మందలి వనరాజి గూర్చె ♦ హర్షము మిగులన్. ౭౯౧

అర్థములు. నందన చైత్రరథాభంబు=నందనముతోను చైత్రరథముతోను సమానమైనది. ఇందిందిర బృందనాదము = తుమ్మెద గుంపుల ఝంకారములు గలది, ఇంద్రియనికరానందంబై=ఇంద్రియ సమూహములకు, అన్ని యింద్రియములకు సంతోషకరమైనది, సర్వర్తుకము = అన్ని ఋతువులందుఁ బూచి కాచునది, అందలి=ఆ పర్వతమందలి, వనరాజి=తోఁపుల వరుసలు, హర్షము=సంతోషము.

తాత్పర్యము

ఇంద్రుని నందనముతోను కుబేరుని రథముతోను సమానములై, తుమ్మెదల ఝంకారములు గలవై, ఇంద్రియములకు సంతోషము గలిగించునవియై, అన్ని ఋతువులలోఁ గాచు పూచు చెట్లు గల వనములు వారికి మిగుల సంతోషము గలిగించెను.

సీ. వననిర్ఝరంబుల ♦ భరతపక్షులు చీఁకు, కొంకొరలింపుగాఁ ♦ గూయుచుండ
నెమ్మిలు గేరి నృ ♦ త్యమ్ములు గావింప, బంభరనాదసం ♦ రంభ మొసర
మత్తవిహంగము ♦ ల్మధుపసంచారము, లోకకిలసముదయ ♦ కూజితములు
విహగరుతంబులు ♦ భృంగసంగీతము, ల్సారసగానము ♦ ల్మెరమీఱు

తే. తద్వనోపవనంబులఁ ♦ దరుచరాళి, చొచ్చి చెలరేఁగి కేరుచు ♦ నిచ్చవచ్చి
నట్టిరూపంబులం గొని ♦ మట్టుమీఱి, సంతసిల్లిరి యందందు ♦ సంచరించి. ౭౯౨

అర్థములు. వన నిర్ఝరంబులన్ = వనమందలి వంకలందు - నెమ్మిలు= నెమిళ్ళు - కేరి=విజృంభించి=పురివిచ్చి - బంభరనాద సంరంభము=తుమ్మెదలధ్వనుల యాటోపము, మత్తవిహంగముల్=మదించిన పక్షులు, మధుపసంచారములు = తుమ్మెదల తిరుగుటలు - కోకిల సముదయ కూజితములు = కోవిల గుంపుల కుహూకారములు - విహగరుతంబులు = పక్షులకూఁతలు - భృంగ సంగీతముల్ - తుమ్మెదల పాటలు - సారసగానముల్ = బెగ్గురుపక్షుల సంగీతములు - తత్ = ఆ పర్వతముయొక్క, వన - ఉపవనములన్ = వనములందు - చిన్నతోఁపులందు - తరుచరాళి = క్రోఁతిగుంపు.

తాత్పర్యము

వనములలోని వంకలయందు భరతపక్షులు గ్రుడ్డికొంగలు మనోహరముగఁ గూయుచుండఁగా నెమళ్ళాడుచుండఁగా తుమ్మెదలుఝంకారములు చేయుచుండగా మదించిన పక్షుల తుమ్మెదల సంచారములు కోకిలల కోకూయమానములు పక్షుల

ధ్వనులు తుమ్మెదల సంగీతములు బెగ్గురుల పాటలు నతిశయించు నాపర్వతము నందలి పెద్ద వనములందు చిన్న తోఁపులందు వానరులగుంపు ప్రవేశించి విచ్చల విడి సందర్భములకొలఁది పొట్టి పొడుగు నగుచు నక్కడక్కడఁ దిరిగి సంతోషించెను.

కం. ఇమ్మెయి వానరు లుద్యా◆నమ్ములఁ జొరఁబాఱ పుష్ప◆నవ్యసురభిస
ర్గమ్ములు మందానిలములు, ఘమ్మని పై వీచె నపుడు◆ఘ్రాణసుఖముగన్. ౭౯-౩

అర్థములు. చొరఁబాఱన్ = ప్రకాశింపఁగా-పుష్ప నవ్య సురభి సర్గమ్ములు = పూవుల క్రొత్తావులతోఁ గూడిన - మందానిలములు = మెల్లగా వీచు గాలులు- ఘ్రాణసుఖముగన్ = ముక్కులకు సుఖము గలుగునట్లు.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము వానరు లుద్యానమ్ములందుఁ బ్రవేశించి తిరుగఁగా పూవుల క్రొత్తావులుగల మందవాయువులు వారికి ఘ్రాణసుఖము కలుగునట్లుమీఁదవీచెను.

కం. హరిరాజాజ్ఞను దక్కిన, హరివీరులు దండు వెడలి◆యరిగిరి లంకా
పురిపైఁ దద్గర్జల నా,పుర మల్లలనాడెఁ బాద◆ముల ఘట్టనచేన్. ౭౯-౪

అర్థములు. హరిరాజాజ్ఞను = సుగ్రీవుని యాజ్ఞ ప్రకారము, తక్కిన హరివీరులు=సువేలయందుండు వారుగాక తక్కిన వానరవీరులు, తత్+గర్జలన్= వారి సింహనాదములచే, పాదముల ఘట్టనచేన్ = కాళ్ళ త్రొక్కుడులచే.

తా త్ప ర్య ము

సుగ్రీవుని యాజ్ఞప్రకారము సువేలయందుండు వానరులు తప్పఁ దక్కిన వానరులు దండుగా బయలుదేఱి లంకపైకి పోయిరి. వారి సింహనాదములచేతను కాలి త్రొక్కుళ్ళచేతను లంకానగర మల్లల్ల చలించెను.

ఉ. కంపితమయ్యె భూమి, పద◆ఘాతసముత్థిత ధూళిపాళులుం
బెంపు గనెం. దదారవము◆భీతిని ఋక్షవరాహసింహముల్
అంపు లెసంగఁ బాఱె దిశ◆లం బడి యున్నతమున్ సమంబునై
సొం పయి పుష్పజాలముల◆జొంపము లంతట నిండ నోల మై. ౭౯-౫

అర్థములు. కంపితమయ్యెన్ = వణఁకెను, పదఘాత = కాలిదెబ్బలచే, సముత్థిత = లేచిన, ధూళిపాళులున్ = దుమ్ముల గుంపులు, పెంపు = అభివృద్ధి, తత్+ఆరవము భీతిని=వారి ధ్వనివలనఁ గలిగిన భయముచే, ఋక్ష = ఎలుగులు, వరాహ=అడవిపందులు, జొంపములు = గుత్తులు, ఓలము = వృక్షములులోనగు వానిచే మఱుఁగుపడిన స్థలము.

త్రికూటపర్వతమునకు మూఁడు శిఖరములు, అందొకటి కడపటిది సువేల, నడిమిది లంకాపురి యుండునది. ఇంతవఱకు సువేల వర్ణింపఁబడెను. ఇప్పుడు లంక యుండు త్రికూట శిఖరము వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము

లంకయందు భూమి వణఁకెను, కాలిదెబ్బలచే లేచిన ధూళి యతిశయించెను. ఆ ధ్వని విని భయముచే ఎలుఁగులు వరాహములు సింహములు కూఁతలు పెట్టుచు దిక్కులవెంటఁ బరువెత్తెను, ఎత్తైనదియు నందమైనదియునైన పూలసమూహముల గుత్తులు మఱుఁగుపడఁజేయు చుండె.

కం. లలితమహారజమునకుం, దులితం బై పక్షులకును ♦ దుష్ప్రాపం బై
కలిత శ్రీనిర్మలమై, చెలువారెడు దాని మిగుల♦స్నిగ్ధం బగుచున్. ౭౯౬

అర్థములు. మహారజతమునకున్ = బంగారునకు, తులితంబై = సమానమై, దుష్ప్రాపంబై = పొందరానిదై, కలిత = పొందఁబడిన, శ్రీ = శోభచే, నిర్మలమై = మలినము లేనిదై, స్నిగ్ధము = నునుపు.

తాత్పర్యము

మనోహర మగు బంగారుతో సమానమై పక్షులకుఁ గూడఁ బొందరానిదై, పరిశుద్ధమైన కాంతిగలదై మిక్కిలి నునుపై యందమైనదానిని.

కం. మనుజులు తలఁపున నేనియుఁ, జనగఁ నశక్యం బనంగ ♦ జతనంబునఁ బో
గొనసాగ దనఁగ నేలా, గొన బగు తద్ధారిణీధ్ర ♦ కూటమునందున్. ౭౯౭

అర్థములు. జతనంబునన్ = ప్రయత్నమున, అనఁగా కాలి నడక చే-పోన్ = పోవుటకు, తత్ + ధారిణీధ్ర కూటమునందును = ఆ పర్వత శిఖరమునందు.

తాత్పర్యము

ఆ లంకానగరమునకు మనస్సుతోఁ బోవుటయే యసాధ్యమైయుండఁ గాలి నడకతో పోవుట సాధ్యము కాదని చెప్పవలయునా? ఆ పర్వతశిఖరమునందు.

సీ. అసురేంద్రపాలితం ♦ బైన లంకాపురి, నిడివి నూఱామడ ♦ వెడలుపునను
ముప్పదామడ యయి♦గొప్ప వౌ వెల్లమబ్బులఁబోలుచుండు గో♦పురము లొప్పి
స్వర్ణ రాజతభూరి ♦ సాలశోభిత మయి, శ్రీ సౌధసువిమాన ♦ భాసిత మయి
ఘనములచే వాన ♦ కాలంబునందు మధ్యమ వైష్ణవపద మన్ ♦ తలఁపు గూర్చి
తే. క్రాలు చుండఁగ నందు నా ♦ కసము నంటు
రజతగిరిశిఖరాభ మై ♦ రాణమీఱు
వేయిరాడుల మాడువు ♦ వెలుఁగు నదియు
ననయ మాశరరక్షితం ♦ బగుచు నుండు. ౭౯౮

అర్థములు. స్వర్ణ రాజత = బంగారు వెండిగల - సాల = ప్రాకారముచే - శోభితమై = ప్రకాశించునదియై శ్రీసౌధ = కాంతిగల మేడలచేతను—సువిమాన = మంచి యంతస్తుల కొనలచేతను- భాసితమయి = ప్రకాశించునదియై- ఘనములచేన్ = మబ్బులచే మధ్యను వైష్ణవ పదము = ఆకాశము — త్రివిక్రమావతారంబున మూఁడడుగులలో నడిమి యడుగుచేఁగొలువఁబడినది-రజతగిరిశిఖరాభమై=కైలాస

పర్వత శిఖరముతో సమానమై, వేయిరాదుల = వేయి స్తంభముల, మాడువు = మేడ-అనయము = ఎల్లవేళ-ఆశర రక్షితము=రాక్షసులచేఁ గాపాడఁబడునది.

తాత్పర్యము

రావణుచేఁ బాలింపఁబడు లంకానగరము నిడివి నూఱామడ, వెడలుపున ముప్పదామడ గలది. అందు గోపురములు తెల్లనిమబ్బులవలె నుండును. ప్రాకారము బంగారు వెంకిచేఁ బ్రకాశించుచుండును. కాంతిగల మేడలు ఏడంతస్తుల మేడలు ప్రకాశించుచు వానకాలమందు మేఘములచే నావరింపఁబడిన యాకాశ మను తలఁపు గలిగించుచుండును. వానిలో కైలాసగిరి శిఖరమువలె నందమై వేయి స్తంభముల మేడగలదు. అది సర్వదా రాక్షసులచేఁ గాపాడఁబడుచుండును.

కం. ఆ లంక కలంకారం, బై లలితం బైన రావణాసురచైత్యం
బాలోకించెను గోలాం, గూలంబులు విస్మయంబు • గుబ్బతిలంగన్. ౭౯౯

అర్థములు. చైత్యంబు = నాలుగు వీథులు కలియు చోట నుండుమేడ—చైత్యమనఁగా నాలుగు వీథులు కలియుచోటు. అక్కడనున్నది కావున నీమేడయు చైత్యమనఁబడెను. గోలాంగూలంబులు = కొండముచ్చులు - గుబ్బతిలంగన్ = అతిశయింపఁగా.

తాత్పర్యము

ఆ లంకా నగరమునకు భూషణము వంటిదై మనోహరమైన రావణాసురు మేడ గలదు. దానిని కొండముచ్చులు మిగుల ఆశ్చర్యముతోఁ జూచెను.

శా. నానాచిత్ర విచిత్రధాతుయుతము • న్నానాసురాన్వీతము
న్నానారామవనాభిశోభితము నా • నాపక్షి సంఘుష్టము
న్నానాసత్త్వనిషేవితంబును నగేం • ద్రవ్యూహసంశోభితం
బా నీరేజవిలోచనుండు కపిసం • ఘాన్వీతుఁడై కన్గొనెన్. ౮౦౦

అర్థములు. నానాచిత్రవిచిత్ర ధాతు యుతమున్ = అనేకములైన చిత్ర విచిత్ర గైరిక ధాతువులతోఁ గూడినది, నానాసురాన్వీతమున్=అనేక రాక్షసులతోఁ గూడినది, నానా+ఆరామ వనాభిశోభితము = అనేకములైన యుద్యాన వనములచే మిగులఁ బ్రకాశించునది. నానాపక్షిసంఘుష్టమున్ = అనేక విధపక్షులచే ధ్వనింపబడినది. నానా సత్త్వ నిషేవితంబు = అనేక జంతువులచే సేవింపఁబడినది, నగేంద్ర వ్యూహసంశోభితంబు = క్రీడా పర్వతములచే శోభించునది, నీరేజవిలోచనుండు=కమలములవంటి కన్నులు గల రామచంద్రమూర్తి, కపిసంఘ+అన్వీతుఁడై=వానర సమూహమును గూడిన వాఁడై.

తాత్పర్యము

అనేక చిత్ర విచిత్ర గైరిక ధాతువులు గలదియు అనేక రాక్షసులతోఁ గూడినదియు అనేకము లగు నుద్యానవనములచేఁ బ్రకాశించునదియు అనేక

పక్షుల ధ్వనులు గలదియు అనేక జంతువులచే సేవింపఁబడునదియు క్రీడాపర్వతము లనేకములు గలదియు నగు దానిని రామచంద్రమూర్తి వానరులతోడఁ జూచెను.

కం. కనుఁగొని సురవరనగరం, బైన సెడి తత్పురము సొంపు ♦ నీక్షించి ధరా
తనయాధవుఁ డచ్చెరువుం, గొని సకలముఁ జూచుచుండెఁ ♦ గుతుకముతోడన్.

తా త్ప ర్య ము

స్వర్గలోకముతో సమానమైన యీ పురము నందముఁజూచి రామచంద్ర మూర్తి యాశ్చర్యపడి సంతోషముతో సర్వముఁ జూచుచుండెను.

♦ ౪౦-వ సర్గము. సుగ్రీవుఁడు రావణుగోపురంబునకు దాఁటి యతనితోఁ బోరుట ♦

తే. ఆమడలు రెండు విరివియా ♦ నల సువేల, పర్వతాగ్రంబునను రామ ♦ భద్రుఁ డర్క
తనయహరియూథపరివృతు ♦ డన్ని దెసలఁ జూచుచుఁ ద్రికూటగతలంకఁ ♦ జూచ నపుడు.

తా త్ప ర్య ము

రెండామడ వెడల్పుగల సువేల పర్వతము కొనను రామచంద్రమూర్తి సుగ్రీవాది వానరులతో గూడినవాఁడై యన్ని ప్రక్కలఁ జూచుచుఁ ద్రికూట పర్వతంబున నున్న లంకను జూచునపుడు.

ఉ. అందొక గోపురంబు పయి ♦ హారిమణీచయభూషితాంగుఁ డై
చందనలిప్తగాత్రుఁడయి ♦ స్వర్ణమహాధనరాజితాంగుఁ డై
కందవినీల దేహుఁ డయి ♦ కమ్రజయాతపవారణుండు నై
సుందరగౌరచామరవి ♦ శోభితుఁడై రహిఁ మీఱు దుర్జయున్. ౮౦౩

రాత్రివేళ వానరులు సువేల పర్వతము మీఁద వెలిఁగించిన దివిటీల కాంతుల చేతను వేగులు చెప్పుట చేతను రామచంద్రమూర్తి వానర వీరులతో సువేలమీఁదికి వచ్చి యున్నాఁడని తెలిసి వారిని జూచుటకై యుదయముననే రావణుఁడు తన మేడమీఁదికిఁబోయి యచటనుండి రామాదులఁ జూచుచుండెను.

అర్థములు. అందు=ఆలంకయందు-హారి = మనోహరమైన. మణీచయ = రత్నసమూహములచే-భూషిత =అలంకరింపఁబడిన - అంగుఁడై = దేహము గల వాఁడై, చందనలిప్త గాత్రుఁడయి = గంధము పూయఁబడిన దేహము గలవాఁడై స్వర్ణ=బంగారుచేఁ జేయఁబడిన-మహాధన=మిగుల విలువగల యాభరణములచే-రాజిత=ప్రకాశించు-అంగుఁడై = దేహముగలవాఁడై-కంద=మేఘమువలె(కం=జల మును ద=ఇచ్చునది)వినీల=నల్లని-దేహుఁడయి=దేహముగలవాఁడై-కమ్ర=మనో హరమైన-జయాతపవారణుండునై = జయచ్ఛత్రము గలవాఁడై-సుందర= అంద మైన గౌర=తెల్లని, చామర=వింజామరలచే విశోభితుఁడు=మిగులఁ బ్రకాశించు వాఁడు-దుర్జయున్=కష్టముచే జయింపఁదగిన వానిని.

తాత్పర్యము

ఆ లంక యందొక గోపురము మీఁద మనోహరములైన రత్నాభరణములచే నలంకరింపఁబడిన వాఁడును, ఎఱ్ఱని గంధము పూసికొన్న వాఁడును, వెలగల బంగారు సొమ్ములు ధరించిన వాఁడును, నల్ల మేఘమువలె నల్లని దేహకాంతి గల వాఁడును, జయచ్ఛత్రము పట్టించుకొను వాఁడును, తెల్లని వింజామరలచే విసరించుకొను వాఁడును, జయింపరాని వాఁడును నగు వానిని.

తే. అమరనాయక గజవిషా ♦ ణాగ్రకలిత, కిణవిరాజితవక్షు రా♦వణు దినాంత
మిహిరకాంతి సమావృత♦మేఘరాశి, నా శశాస్రాభవస్త్రంబు♦నవ్యరీతి. ౪౦౪

అర్థములు. అమరనాయకగజ=ఐరావతముయొక్క, విషాణాగ్ర=కొమ్ముయొక్క కొనచేత, కలిత=కలిగిన, కిణ = కాయచే, విరాజిత వక్షున్ = ప్రకాశించుఱొమ్ముగలవానిని, దినాంత=సాయంకాలమందలి, మిహిర=సూర్యునియొక్క, కాంతి=ప్రకాశముచే, సమావృత = చుట్టఁబడిన, మేఘరాశినాన్ = మేఘసమూహమో యనునట్లు, శశ+అస్ర + ఆభ = కుందేటి నెత్తుటితో సమానమైన, వస్త్రంబు=గుడ్డ.

తాత్పర్యము

ఐరావతము కొమ్ముతోఁ బొడువఁగాఁ గలిగిన గాయము కాయకాచి ఱొమ్ము నందున్న వానిని, సాయంకాలమునందలి యెండచేఁ జుట్టఁబడిన మబ్బుల గుమివంటి వానిని, కుందేటి నెత్తురువలె నెఱ్ఱనైన వస్త్రము (నల్లని దేహము ఎఱ్ఱని వస్త్రము కావున నీ యుపమానము శోభక్షయము సూచించెడి)

చం. ఎనసినవాని రాక్షసకు♦ లేంద్రు గపీంద్రులు రామచంద్రుఁడుం
గనుఁగొను చుండ రావణునిఁ ♦ గాంచిన మాత్రాన జాతరోషుఁడై
వనచరలోకనాథుఁడు చి♦వాలునఁ బెంపును బెంపు శౌర్యమున్
బెనఁగొన నట్టె దాఁటె సుర ♦ వీరవిరోధి వసించుమేడకున్. ౪౦౫

అర్థములు. ఎనసినవానిన్=పొందిన వానిని. ధరించిన వానిని, మాత్రన= ఈ శబ్దము కంధరాదులలోఁ జేరినది కావున మాత్రన, మాత్రమున నని రెండు రూపంబులు గలవు మాత్రా శబ్దము ఆకారాంతము, కృత్స్నావధారణంబుల నపుంసకము, జాతరోషుఁడై=పుట్టిన కోపము గలవాఁడై.

తాత్పర్యము

ధరించిన వాని, రాక్షసులందు శ్రేష్ఠుని, వానరులు రామచంద్రుఁడు చూచు చుండఁగా వారితోఁ జెప్పక రావణుని జూచిన మాత్రమున మన స్వామి రామచంద్రు నెదుట వీనికి రాజోపచారములా యని సుగ్రీవుఁడు కోపించిన వాఁడై సాహసము పెంపు మనోబలము దేహబలము కలియఁగా చివాలున రావణుఁడున్న మేడ మీఁదికి నెగిరి పోయెను.

చం. నిలిచి ముహూర్తమాత్ర మట • నిర్భయుఁడై యసురేంద్రుఁ జూచి యా
ఖిలు నొకపోకకుం గొనక • కర్ణకఠోరముగాఁగ నిట్లను
న్బలువ! త్రిలోకభర్త రఘు • నాథున కేను సఖుండ దాసుఁడన్
దలఁగకు రాముతేజమున • దర్ప మడంపక పోవనిత్తునే. ౪౧౯

అర్థములు. ముహూర్తమాత్రము=అల్పకాలము, మాత్రమే = ముహూర్తమే యని యవధారణమున నపుంసకము నిలిచి యనుటచే వానిమీఁదనే దూఁక లేదని యర్థము. పోకకుం గొనక = పోకకున్న విలువయైన వానియం దున్నదని తలంపక.

తాత్పర్యము

అల్పకాలమే నిలిచి భయములేనివాఁడై రావణునిఁజూచి యాదుష్టుని గొంచెమైన సరకు సేయక వినుటకుఁ గష్టమైన మాటల నిట్లనెను. ఓరీ! క్రూరుఁడా! మూఁడు లోకములకు నాథుఁడగు రామచంద్రమూర్తికి నేను ఆయన యభిప్రాయమున మిత్రుఁడను, నా యభిప్రాయమున దాసుఁడను, తొలఁగిపోకుము. రాముని తేజస్సు నాయందుండుటచే నీగర్వమణంపక పోనిత్తునా? రాముని తేజస్సుచే ననుటకు నాయందలి శక్తి రామునిశక్తియే కాని నాశక్తిగాదు. నే నస్వతంత్రుఁడనని భావము.

కం. అని దుమికి మీఁదికిం ద, ద్ఘనమణిమయముకుట మాడ్చి • ధర మొత్తి మఱిం
దనమీఁదికి నరుదెంచెడి, యినసుతు నీక్షించి రాక్ష • సేశ్వరుఁ డనియెన్. ౪౨౦

అర్థములు. ముకుటము = కిరీటము.

తాత్పర్యము

అని మీఁద దుమికి వానిరత్నమయమైన కిరీటము లాగి నేలపైఁగొట్టి మరలఁ దనమీఁదికి వచ్చుచున్న సుగ్రీవునిఁ జూచి రావణుఁ డిట్లనియె.

కం. సుగ్రీవా! యింతకు మును, సుగ్రీవుఁడ వీవు నాదు • చూపునఁ బడి హీ
నగ్రీవుఁడ వయ్యెదవని, యాగ్రహమున నతని విసరి • యావల వైచెన్. ౪౨౧

అర్థములు. మును=పూర్వము, సుగ్రీవుఁడవు = మంచి మెడగలవాఁడవు, హీనగ్రీవుండవు=మెడ లేనివాఁడవు, ఆగ్రహమునన్ = కోపమున, ఆగ్రహశబ్దము, నకుఁ పట్టుదల యనియు నర్థము గలదు. సత్యాగ్రహము = ఆసుదాని పట్టుదల, మొండితనమని యర్థము.

తాత్పర్యము

సుగ్రీవా! నా కంటఁబడక ముందు నీవు చక్కని మెడగలవాఁడవే. ఎప్పుడు నాకంటికిఁ గానవచ్చితివో యప్పుడే మెడలేనివాఁడ వయ్యెదవని కోపముచే నతని నెత్తి యావలఁ బాఱవైచెను.

ఉ. వైచినఁ బుట్టచెండువలె • వానరనాథుఁడు లేచి బాహులన్
ద్రోచె నిశాచరేంద్రు నిలఁ • ద్రోచినమాత్రన యాడఁబోక వే

లేచి కరాకరిం బెనఁగె • లీలగ, వా రిటు పోర నల్కమై
నేచి స్రవించె ఘర్మజల • బృందము నెత్తురు గ్రమ్మె మేనులన్. ౮౧౯

అర్థములు. పుట్టచెంకువలె=పుట్టము+చెండు=చెండువలె గుండ్రముగా లోపల గ్రచ్చకాయపెట్టి గుడ్డలతోఁ గుట్టినది. ఈడఁబోక=వెనుదీయక, కరాకరిన్= చేయిచేయికలిసి చేయు యుద్ధము, కరాకరి వ్యతీహార బహువ్రీహి. గోపురమందున్న వాఁడును. యుద్ధప్రయత్నమున లేనివాఁడు నగుట నాయుధములు రావణుఁడు ధరించినవాఁడు కాఁడు, ఏచి=అతిశయించి, ఘర్మజలబృందము=చెమట నీళ్ళసమూహము

తాత్పర్యము

ఇట్లు విసరివేయఁగా సుగ్రీవుఁడు పుట్టచెండువలె పై కెగరి చేతులతో వాని నేలఁ బడఁద్రోచెను. ఇట్లు త్రోచినమాత్రమున వెనుదీయక రావణుఁడు త్వరగా లేచి చేతులతో యుద్ధముచేయ నారంభించెను. వారిట్లు కోపముతో యుద్ధము చేయఁగా చెమట నీళ్ళు కాఱెను. దేహములందు నెత్తురుబ్బెను.

ఉ. ఒండొరుమేను మే నొఱయ • నుగ్రత నిల్చుచు వీతచేష్టులై
యొండొరుఁ గాసి దవ్వు చని • హుమ్మని తాఁకుచు మీఁద దూఁకుచున్
గండున ముష్టిఘాతముల • గాఢకరోగ్రతలంబులన్ సము
ద్దండతఁ బోరి రిద్దఱును • దర్ప మెలర్ప ననల్పధీరతన్ ౮౧౧

అర్థములు. మేను మేనొఱయన్ = దేహము దేహము రాచుకొనునట్లు, వీత చేష్టులై=చేష్టలు మానినవారై, ముష్టిఘాతములన్ = పిడికిలి పోటుల, తలంబులన్=అరచేతులన్, అనల్ప=గొప్పదగు, ధీరతన్=ధైర్యముతో.

తాత్పర్యము

ఒకరిదేహ మొకరికి రాచుకొనునట్టు లేమియుఁ జేయక నిలబడుచు కొంచెము దూరము వెనుకకుఁబోయిహుమ్మని మరలఁబైపడుచుమీఁదదూఁకుచు పౌరుషమున పిడికిలిపోటుల, అఱచేతి దెబ్బలచే నిద్దఱు గొప్పధైర్యము గలవారై యుద్ధముచేసిరి.

ఉ. నెత్తురు గాఱుమేనుల వ • నేచర రాత్రిచరాధిపు ల్మదిన్
హత్తినరోష వేగములనల్లల నాడఁగ గోపురాగ్ర ము
న్వెత్తుగ నొండొరు న్విసరి • యేయుచు వీచుచు నెత్తివేయుచున్
దత్తఱ లేక యొండొకరుఁ • దాఁచుచుఁ ద్రోచుచుఁ బెన్గులాడుచున్. ౮౧౧

అర్థములు. వనేచరాధిపుఁడు రాత్రిచరాధిపుఁడు = సుగ్రీవుఁడు రావణుఁడు, ద్వంద్వాంతమందలి యధిపశబ్దము రెండు శబ్దములతో నన్వయించును. ఉవ్వెత్తుగ=అడుగునుండి, ఉవ్వు+ఎత్తు=ఉవ్వెత్తైనదని తోఁచెడిని.

తాత్పర్యము

దేహములనుండి నెత్తురు కాఱుచుండఁగా సుగ్రీవ రావణులు కోపాతిశయమున గోపుర మూఁగునట్టు లెదుటివాని నంతయు నెత్తి దబాలున విసరివైచుచును,

ఎత్తివేయుచు, తడఁబడక యొకరి నొకరు కొట్టుచుఁ బడఁద్రోయుచు, పెనఁగులాడుచు.

కం. ఒక్కండొకనిఁ జుట్టుచు, నొక్కం డొక్కరునిఁ దిగిచి ♦ యొడికంబుగఁ బై
 నెక్కుచు మేనులు వంచుచు, నుక్కున నొండొకరు గదియ ♦ నొడిసియగడ్తన్.

అర్థములు. తిగిచి=ఈడ్చి, ఒడికంబుగ=నేర్పున, ఒడిసి=పట్టి.

తాత్పర్యము

ఒక్కని మఱియొకరుచుట్టి తిరుగుచు ఒక్కఁడు మఱియొకనిలాగి క్రిందఁద్రోచి నేర్పునఁ బై నెక్కుచు, దేహములు వంచుచు బలముగ నొకరి నొకరు పట్టుకొని యిరువురు ప్రక్కనుండు నగడ్తయందు.

కం. డొల్లిరి; వా రిరువురు ధరఁ, ద్రెళ్ళక మింటికిని నెగిరి ♦ ధృతి చెడక యొకిం
 తల్లన నిలిచి పెనంగిరి, మల్లాహవకుశలు లసుర ♦ మర్కటనాథుల్. ౪౧౩

అర్థములు. డొల్లిరి = పడిరి, మల్లాహవకుశలులు = మల్లయుద్ధమునందు నేర్పరులు.

తాత్పర్యము

అగడ్తలోఁ బడియు నేలఁ దగులక ముందే యిరువురు పైకి మరల గోపురము మీఁదికి నెగసి ధైర్యముతోఁ గొంచెము గాసిదీర నిలిచి, ద్వంద్వయుద్ధమున నేర్పరులైన యిరువురు మరల యుద్ధము చేసిరి.

ఉ. ఒండొరు బాహురజ్జువుల ♦ నుక్కిరి బిక్కిరిగా బిగించుచున్
 దండిమగంటిమిం బులుల ♦ దారిసి సింహము లట్లు మత్త వే
 దండములో యనంగఁ దెగి ♦ తాఁకుచు ఱొమ్మున ఱొమ్ముఁ దాఁచి యా
 గండరగండ లిద్దఱును ♦ క్ష్మాయుగపత్క్రియ వ్రాలి లేచుచున్. ౪౧౪,

అర్థములు. ఉక్కిరి బిక్కిరి = ఊపిరాడ కుండునట్లు, తాఁచి = కొట్టి గండర గండలు=శూరులలో శూరులు, క్ష్మాన్=భూమియందు, యుగపత్క్రియ= ఒక్కసారిగ.

తాత్పర్యము

ఒకరి నొకరు పగ్గములవలెఁ చేతులతో నూపిరి యాడకుండ బిగించుచు, పులులవలె సింహములవలె మదపు టేనుఁగులవలెఁ దెగఁబడి తగులుచు, ఱొమ్ముతో ఱొమ్ము కొట్టుచు శూరాతిశూరు లిరువురు నొక్కసారిగ నేలఁబడి లేచుచు ఱొమ్ముతో ఱొమ్ము కొట్టుకొనిన వేగమునకు నిరువు రొక రటు మఱి యొకరిటు వెల్లకిలఁబడినారని భావము.

సీ. పూచినమోదుగు ♦ బూరుగువడువున, రంజిల్లు మేనుల ♦ శ్రమము లేక
 చక్రాకృతులు గాఁగ ♦ సంచరించుచు దాటి, యట్టపై కెగిరి య ♦ న్యోన్యమెదిరి

భక్ష్యార్థమై పొంచు • బావురుఁబిల్లుల, మాడ్కిని నిల్చుచు • మఱియు మఱియు
సవ్యాపసవ్యాప • సవ్యసవ్యంబులు, లోనుగాఁగల పెక్కు • స్థానములను
తే. దిరుగుచును ముందటికిఁబోయి • మరలివచ్చి, వక్రగమనంబులను లఘు • విక్రమంబు
వెలయఁబట్టుచుఁ గొట్టుచు • విడివడుచును, బోరి రిద్దఱు సరిగాఁగ • భూరిబలులు.

అర్థములు. చక్రాకృతులుగా = గుండ్రముగా, దీనికి మండల మని పేరు. ఇది మల్లయుద్ధ గమనములందలి భేదము. 'ఏకపాదప్రచారో యస్సచారీ త్యభిధీయతే ద్విపాదక్రమణం యత్తు కరణం నామ తద్భవేత్, కరణానాం సమాయోగాత్ఖండ మిత్యభిధీయతే • ఖండైస్త్రిభి శ్చతుర్భిర్వా, సంయుక్తం మండలం భవే' త్తని భరత వాక్యము. ఈ గమనము లన్నియు నేఁటికిని జెట్టులు పోరునపుడు చూడవచ్చును. కుత్సితయుద్ధము ప్రబలమగుటచే మగతనము పౌరుషము దెలుపు నీ మల్లవిద్య యెందైన వినోద ప్రదర్శనమునకై వినియోగింపఁ బడుచున్నది. భక్ష్యార్థము=అప్పచ్చికొఱకు, బావురుఁబిల్లులు=గండుపిల్లులు, సవ్య+అపసవ్య+సవ్యాపసవ్యంబులు=కుడులు, ఎడమలు, కుడి యెడమలు.

తాత్పర్యము

నెత్తురు కాఱుటచే పూచిన మోదుగుల వలె బూరుఁగుల వలెఁ గానవచ్చుచు, అట్లున్నను గాసిలేక మండలాకారముగఁ దిరుగుచు దాఁటి పై కెగిరి పడుచు, ఒకరినొక రెదిరించుచు తిండి పదార్థమునకై పొంచుచునుండు పిల్లులవలె బొంచుచు, నిలుచుచు కుడివైపుగాఁ గొంతసేపు, ఎడమవైపుగా-కుడి యెడములుగాఁ గొంతసేపు తిరుగుచు. ఇట్లు నానాస్థానకముల నుండుచుఁ. దిరుగుచుఁ ముందటికిఁ బోయి వెనుక వెనుకకు వచ్చి వంకరగాఁ బోవుచు, చుఱుకుఁదనము పరాక్రమములు వెలయునట్టులు పట్టుచుఁ గొట్టుచు, విడిపించుకొనుచు బలవంతు లిరువురు సమానముగ యుద్ధము చేసిరి.

కం. తిట్టుచు ధరణిం ద్రోపడ, నెట్టుచుఁ గుప్పించి మీఁద • నెగయుచు ముష్టిం
గొట్టుచుఁ గికురించుచు బిగఁబట్టుచు లంఘించి లోఁగి • పడుచుం బెఱుకన్.

అర్థములు. ద్రోపడన్=ద్రోపు+పడన్ =ద్రోసినట్లు, కికురించుచున్—వంచించుచు.

తాత్పర్యము

ఒకరి నొకరు దూషించుచు, నొకరి నొకరు నేలఁ బడఁద్రోయుచు, నెట్టుచు, కుప్పించి మీఁది కెగయుచు, నొకరినొకరు పిడికిటఁ గొట్టుచు, వంచించుచుఁ గదల కుండఁ బట్టుచు నెగిరి మరల వెనుకఁ బడుచు.

మ. ఇటు లన్యోన్యముఁ గీశరాక్షసధరా •ధీశు ల్సమానోద్ధతిన్
స్ఫుటబాహాబలవృత్తిఁ బోరు నెడలన్ • సుగ్రీవుఁ బౌలస్త్యుఁడు

త్కటమాయం గొని పట్టఁగాఁ దలఁపఁ ద • ద్వ్యాపాద మూహించి తాఁ
జిటికెన్ వ్రేసెదు నంతలోనఁ బ్లవగ • శ్రేష్ఠుండు దాఁటెన్ దివిన్. ౮౧౭

అర్థములు. అన్యోన్యము=పరస్పరము, ఉత్కట మాయంగొని = గొప్ప మాయ నాశ్రయించి, తద్వ్యాపాద = ఆ ద్రోహబుద్ధి 'వ్యాపాదో ద్రోహచింతన' మ్మని యమరము.

తా త్ప ర్య ము

ఇట్లు సుగ్రీవ రావణులు పరస్పరము సమాన బలాతిశయముచే నధికమైన భుజబల వ్యాపారముచే యుద్ధము చేయునపుడు రావణుఁడు న్యాయ్యయుద్ధంబున వీని గెలువరాదు, మాయచేసి గెలువ వలయును. అనేక రావణాకారములు చూపితినా, యెవనితో యుద్ధము చేయునది తెలిసికొనలేక తికమకలాడును అప్పుడు పట్టుకొన వచ్చు నని యాలోచింపఁగా సుగ్రీవుఁడు వాని ద్రోహబుద్ధి యూహించి తెలిసికొని యున్నట్టులే చిటాలున చిటిక వ్రేసెదు నంతలో నాకాశమున కెగసెను;

క. జితకాశి జితక్లముఁడయి, ద్రుతగతిఁ జన దాన వంచి • తుం డై రక్షః
పతి యొక్కఁడ యటఁ బ్రాసా, దతలంబున నిలిచెఁ మించెఁ • దప్పె నటంచున్.

అర్థములు. జితకాశి = జితేన కాశతే ఇతి జితకాశి యని వ్యుత్పత్తి. జయముచేఁ బ్రకాశించువాఁడు, ఎప్పుడు న్యాయ్యయుద్ధమందు గెలువలేక రావణుఁడు మాయచేయఁ దలఁచెనో యప్పుడే యోడిపోయె నని భావము, జితక్లముఁడు = శ్రమము లేనివాఁడు, ఇంత యుద్ధము చేయుచున్నను శ్రమము దోఁచినది కాదు. రావణునకు శ్రమము దోఁచుటచే మాయ పన్న నాలోచించెను. సుగ్రీవు నొద్ద వాలి యిచ్చిన మూలిక కలదు. దానివలన నెంతకాలము యుద్ధము చేసినను బడలికతోఁపదు. బలము తగ్గదు. ఇఁకఁ గొంతసేపు న్యాయ్యయుద్ధము జరిగియుండిన యెడల సుగ్రీవుఁడు రావణుని చావఁదన్ని యుండును. దాన వంచితుఁడై = రావణుఁడు మోసగింపఁబోయి తానే మోసపోయె నని భావము.

తా త్ప ర్య ము

జయించిన వాఁడును, బడలిక లేనివాఁడు నగు సుగ్రీవుఁడు వేగముగ రాముని నొద్దకుఁబోఁగా, మోసగింపఁబోయి తానే మోసపోయి రావణాసురుఁ డొక్కఁడే మేడమీఁదకార్యము మించెను, చేసినయాలోచన తప్పిపోయెనని తలఁచుచుండెను.

చ. హరిచయనాథుఁ డీకరణి • నాహవకీర్తి గడించి యామినీ
చరపతి గాసిపెట్టి సువి • శాలనభోంగణమున్ మహాజవో
ద్ధురగతి దాఁటి వచ్చి నవ • తోయజనేత్రుని రాముఁ బ్రక్కఁ దా
హరివర సంఘమధ్యమున • నల్లన నిల్చె శ్రమంబు దీఱఁగన్. ౮౧౯

అర్థములు. హరిచయ నాథుఁడు=వానర సమూహమునకు రాజు, వానర ప్రభువు గావున వానరులతోఁ జెప్పిపట్టి తెండనిన వారా పని చేసియుందురు,అట్లుం

డియుఁ దానే రావణుమీఁదికిఁబోవుట రామకైంకర్యము స్వయముగఁ జేయవలయు నను తలంపుతోనే. ఆహవకీర్తిని= యుద్ధమునందలి కీర్తిని, రావణుని జంపుటకు సుగ్రీవుఁ డొకఁడే చాలును. రామవాక్యగౌరవము వలన నూరకుండినాఁడను కీర్తి గడించి = సంపాదించి యామినీచరపతిన్ = రాక్షసులకు రాజగు వానిని, ఇట్లు చెప్పుటచేనచ్చట యామినీచరులు మఱికొందఱుండినను సుగ్రీవుఁడు వారిని లక్ష్యము పెట్టలేదు. వారిచయనాథుఁడు కావున తనకు సమానుఁడైన ప్రభువుతో యుద్ధము చేయుట కీర్తిగాని క్షుద్రుల జయించినఁ గీర్తియేమిగలదని తలఁచెనని భావము. గాసి పెట్టి=బాధపెట్టి, రావణుని దాను జంపెదనని రామచంద్రమూర్తి ప్రతిజ్ఞ చేయుటచే దాను జంపనొల్లక బాధమాత్రము పెట్టెనని భావము. హరి=సూర్యుఁడు, యామినీ చర=రాత్రులందుఁ దిరుగు గూబలకు దొంగలకు తక్కినవారికి బాధకరుఁడే కదా! గాసిపెట్టి=న్యాయమువదలి మాయచే శత్రువును జయింపవలెనను నంతకష్టస్థితికి వచ్చినవాఁడు, ఎన్నఁడెఱుఁగని శ్రమ మీనాఁడీ యుద్ధములోఁ గలిగెనని భావము. సువిశాల నభోంగణమున్=మిక్కిలి విశాలమైన యాకాశప్రదేశమున సూర్యుని వలె, ఇతఁడు హరియే కదా! మహాజవోద్ధురగతిన్ = మిక్కిలి వేగముచే నిలుకడ యైన గమనముతో, భయపడి పరువెత్తినవాఁడు తొట్రుపడుచు నానాముఖములఁ బరువెత్తును, అట్లు కాదని భావము. నవతోయజనేత్రుని=క్రొత్తగా వికసించిన తామరలవంటి కన్నులు గల వానిని, ఇట్లు చెప్పుటచే శత్రుబాహుళ్యమున్న చోటికి నొక్కఁడే పోయెనే యని ప్రేమాతిశయమునఁ గలిగిన యావేగముతోఁ గన్నులు విచ్చి చూచుచుండెనని భావము. ప్రక్కనిలిచెన్=రావణుని శిరస్సును దేక, పట్టుకొనిరాక, యుత్తచేతుల వచ్చి యేమి ఘనకార్యము చేసితి నని రాము నెదుట నిలఁబడుదునని సిగ్గుపడి ముఖము చూపక ప్రక్కగుంపులో నిలఁబడెను. అల్లననిల్చెన్=తా నింతపని చేసితి నని గర్వపడక ఠీవి వదలి వినయముతో,వచ్చి నది తెలియకుండు నట్లు మెల్లన కపులముందును గాదు, హరివరసంఘ మధ్యమున-వానరులఁ గుంపునడుమ నిలిచెను. హనుమంతుఁడు రావణుని యుద్ధ మునకీడ్చి తన్నవలయునని యాలోచించెను. కాని యది నెఱవేఱినది కాదు. ఇతరులఁ దన్నిన వాని కెట్లు బుద్ధివచ్చును? వానినే తన్నవలెనని తలఁచి యుండిన వాఁడు. ఈ విషయము సుగ్రీవుఁ డెఱుఁగును గావున నతనికోరిక,బమ్మెరపోతన కోరిక వాసుదాసుఁడు నెఱవేర్చినట్లు తాను నెఱవేర్చెను.మహాత్ముల సంకల్పములు వ్యర్థములు గావు. సంకల్పించిన వారా కార్యములఁ జేయఁ గారణాంతరముల వలనుపడకుండెనేని భగవంతుఁడు మఱియొకరి మూలమున దానిని నెఱవేర్చును. మహాత్ములకు సత్కార్యనిర్వాహణము ప్రధానముగాని స్వకర్తృత్వాభినివేశము ప్రధానముగాదు.

కం. ఇయ్యనువున రావణుతోఁ, గయ్యం బొనరించి తన్నుఁ ♦ గపు లర్చింపన్
నెయ్యంబున రాఘవులకుఁ, గయ్యపుటుబ్బొనరఁజేసెఁ♦గపినాథుండున్. ౪౨౦

అర్థములు. ఇయ్యనువునన్ = ఈవిధముగ, రాఘవులకును = రామలక్ష్మణులకును, కయ్యపుటుబ్బు = యుద్ధమునందుత్సాహము; కపినాథుండున్ = రావణుఁ డెంత బలవంతుఁడో యేమో యను సందేహము రామలక్ష్మణుల బాధించుచుండినది. వానరనాథుఁడే వాని జయించి వచ్చినప్పుడు నరనాథులమైన మనము జయించుట కష్టమా యను ధైర్యము-ఉత్సాహము రామలక్ష్మణులకుఁ గలిగెనని భావము. రాఘవులకును గలిగించె ననుటచే వానరులకును గలిగించెనని సముచ్చయార్థము. ఒంటరిగ మన ప్రభువే యింత సాహసము పరాక్రమము చూపెనే, మనమూరకుండ వచ్చునా? అంతకు మించి, మనము చేయకుండిన మన మేటి యోధుల మని కపులకుఁ దోఁచెనని భావము. అర్చింపన్ = పూజింపఁగా, మెచ్చుకొనఁగా, నెయ్యంబునన్ = ఇంత కార్యము స్నేహభావముచేఁ జేసెను. గాని స్వప్రతిష్ఠకై కాదని భావము.

తాత్పర్యము

ఈ విధముగ రావణునితో యుద్ధము చేసి సుగ్రీవుఁడు వానరులు తన్ను మెచ్చుకొనుచుండ స్నేహభావముచే రామలక్ష్మణులకు యుద్ధమునందుత్సాహముఁ గలిగించెను.

♦ ౪౧-వ సర్గము. శ్రీరాముఁడు సాహసము చేయవలదని సుగ్రీవునకు బోధించుట ♦

కం. శ్రీరామచంద్రుఁ డంతట, నా రవిసుతుమేన నున్న ♦ యాహవచిహ్నల్
తీరు గని యతనిఁ గౌఁగిట, నార ముదంబునను గ్రుచ్చి♦యనె నిబ్బంగిన్. ౪౨౧

అర్థములు. ఆహవచిహ్నల్ = యుద్ధపు గుఱుతులయొక్క, గాయములయొక్క—తీరు = విధము—అరముదంబునను = సంపూర్ణ సంతోషముతో.

తాత్పర్యము

ఆ సుగ్రీవుని దేహమునందుఁ గానవచ్చు యుద్ధపు గుఱుతులు చూచి శ్రీరామచంద్రమూర్తి యతని నిండు సంతోషముతోఁ గౌఁగిలించుకొని యిట్లనెను.

కం. నాతో నాలోచింపక, యీ తెంపుం జేయఁ జెల్లు ♦ నే కపినాథా!
భూతలభర్తలు స్వయముగఁ, జేతాఁకున నిట్టి పనులు♦చేయఁగఁ జనునే. ౪౨౨

అర్థములు. భూతలభర్తలు = రాజులు—చేతాఁకునన్ = సాహసమున—'చేతాఁకున దెప్పరంబు సేసితి గంటే' భార. ద్రో. ౨ ఆ.

తాత్పర్యము

నే నీ ప్రకారము చేయఁదలఁచితిని చేయుదునా? వలదా? యని నాతో నాలోచింపక కపిరాజా? నీ విట్టి సాహసము చేయవచ్చునా? రాజు లగువారు సాహసమున నిట్టి పనులు స్వయముగఁ జేయవచ్చునా?

రాజనీతిని బట్టి సుగ్రీవుఁడు చేసినది యవివేకకార్యమే. రాజు ముందుగఁ దా నెప్పటికి యుద్ధమునకుఁ బోరాదు. ఏ కొంచె మపాయము కలిగినను సర్వము మునిఁగి పోవును. అంగదుఁడు తాను సముద్రము దాఁటెద నన్నపుడు, రావణుఁ డింద్రజిత్తును యుద్ధమునకు బంపునపుడు, నీ నీతినే యవలంబించిరి. దీనికి సమాధానము ర ౧౫ పద్యంబునఁగలదు.

సీ. ఎంతటిసాహసం ♦ బీ వొనరించితి, సాహసప్రియ! నీవు♦నల్పినట్టి
కార్యంబు నన్నును ♦ గపిసేనను విభీ,షణుని సందియంబున♦మునుగఁ జేసెఁ
గటకట యెంతటి ♦ కష్టకార్యం! బిట్లు, చేయకు మింక యో♦జించుకొనక
యొండు నీ కేదేని ♦ యొదవినచో సీత,తో నేమి పని భర ♦ తుండు నేల

తే. యేల సౌమిత్రి శత్రుఘ్నుఁ♦డేల యింత, యేల నా దేహ మైన నా♦కేటి కయ్య
నీవు రాకకు ముందిట్లు♦నిశ్చయించి, నాఁడ నెఱిఁగియు నీ శక్తి♦వాఁడిమగఁడ.

అర్థములు. వాఁడి మగఁడ = శూరుఁడ-నీ వెంతటి శూరుఁడ వైనను అనాలోచిత కార్యము చేయరాదని భావము.

తాత్పర్యము

సుగ్రీవా! యూరా నీ వెంతటి సాహసము చేసితివి? సాహసమందున్న ప్రీతి కార్యాలోచనమందు లేదాయెఁగదా! యుద్ధమునకై మనము వచ్చితిమి, యుద్ధము నేను జేసితిని, ఇందేమి సాహసము గలదందువా? నీవక్కడఁ జిక్కుకొని యుండిన యెడల సీతగతి యేమి? నాగతి యేమి? ఎటుగాక శత్రుముఖమున నిలిచియున్న వారము గదా! నాగతి యెట్లయిన నగునుగాక, యీ వానరులగతి యేమి? వీరికి నాయకుఁడెవరు? నాయకుఁడు లేక వారెట్లు యుద్ధము చేయగలరు? వారందఱు మరలిపోనా? ఉండనా? మనలను నమ్మివచ్చిన విభీషణుని గతియేమి? మన మతని నుభయత్ర భ్రష్టునిఁ జేసిన వారమేకదా! నీ యొక్కని యనాలోచిత కార్యము వలన నెందఱ కెంతకీడు సంభవించి యుండునో చూడు. ఇఁకమీఁద నాతో నాలోచింపక యిటువంటి యితరులకుఁ గష్టము దెచ్చు కార్యములు చేయకుము. అక్కడ నీకేదైన నపాయము సంభవించిన నాకు సీతతో నేమి పని? భరతునితో నేమిపని? లక్ష్మణ శత్రుఘ్నులతో నేమిపని? తుదకు నా దేహమైన నాకేల? మిత్రుని శత్రుల పాలుచేసి నే నేమని జీవింతును. ప్రాణమంత తీపా? నీవు శూరుఁడవని నీ శక్తి తెలియు శత్రుబాహుళ్యమున నీ కపాయము కలుగునేమో యని భయపడి నీవు రాకముందిట్టులాలోచించితిని. 'నాశ్లీలం కీర్తయేన్నర' యను నీతి ననుసరించి నీవు చచ్చిన యెడల నని చెప్పుటకు మాఱు ఒండు నీకేదేని యని చెప్పెను. ఏమయ్యా! నానిమిత్తమై నీ భార్యను తమ్ములను విడిచెదనంటివి. ప్రాణమే విడిచెద నంటివి. ఇది నీకుఁ దగునా? యనిన, భార్యలు కోరినంత మంది గ్రామ గ్రామంబున దొరకుదురు. నిజమైన మిత్రుఁ డెందు దొరకును?

స్థాన బలము, దేహ బలము, సహాయ బలము, సాధన బలము గల వానితో దేహబలముతప్ప మఱి యే బలము లేనివాఁడు మిత్రుని నిమిత్తమై యుద్ధమునకుఁ బోవుట యెంత మైత్రిగలవాఁడు చేయవలసిన కార్యము? అట్టివాఁడు తన నిమిత్తమై ప్రాణము విడిచెనేని తన కెట్లాహారనిద్రాదులు సుఖమీయఁగలవు. వాని మీఁద రుచిలేనివానికి భార్యతోడ నేమిపని? కావున భార్యయుండినను లేనిదే. భర్తలో సగముమాత్రమే భార్య. మిత్రులకుఁ బరస్పర భేద మే విషయంబునను లేదు. అట్టి యైక్యమునకే మైత్రియని పేరు. భార్య పోయినవాఁడు విధురుఁ డగుచున్నాఁడు. విధురుఁడనఁగా రక్షాభారము తొలఁగినవాఁడు, మిత్రుఁడు పోయినవాఁడు రక్షకుఁడు పోయినవాఁడు కావున, భార్యనైన వదలవచ్చునుగాని మిత్రుని వదలరాదు. భార్యలు గ్రామగ్రామమందు దొరకుదురు,తమ్ములు దొరకరు గదా!వారిని విడువవచ్చునా? “భ్రాతా స్వామూర్తి రాత్మనః” యని కలదే యనిన పుట్టఁగా భ్రాతలు, పెరుగఁగా జ్ఞాతులు, పెద్దవాఁడు సమర్థుఁడై గుణవంతుఁడై తమ యిష్టానుసారము వర్తించుచుండినయెడలఁ బిన్నలు గౌరవింతురు. అటుకాదేని విడనాడుదురు. మిత్రుఁడో యెంతటి కష్టదశయందును మిత్రుని విడనాడఁడు. కావున మిత్రుఁడే భ్రాతలకంటె శ్రేష్ఠుఁడు. అందఱు విడిచిన పిమ్మటఁ బిడిచెడు కూటి నిమిత్తమా యీ దేహరక్షణము, మిత్రుని వదలినవాఁడు మరణించినవానితో సముఁడే. కావున నీ విధముగ నాలోచించితి నని భావము.

ఉ. ఎట్టన యుద్ధభూమి నసు ♦ రేశ్వరు సాత్మజబంధుసైన్యుఁగాఁ
బట్టి వధించి లంకకును ♦ బట్టము గట్ట విభీషణున్, మదిన్
నెట్టన కైకయీతనయు ♦ నిల్పి స్వరాజ్యమునందు మేనిఁ బోఁ
గొట్టఁ దలంచి యుంటిఁ గపి ♦ కుంజర యన్న హరీంద్రుఁ డిట్లనున్. ౭-౮

అర్థములు. ఎట్టన=ఏమి యాలోచించితి వనిన—సాత్మజ బంధు సైన్యుగాన్=తన కొడుకులతోను బంధువులతోను సేనలతోను గూడినవానిగా—నెట్టన = అనివార్యముగ —రూ—నెట్టనము - ఇది ద్రుతప్రకృతికము గాదు. భరతుని బలవంతపఱచియైనను.

తాత్పర్యము

ఏమి యాలోచించితి వందువా? వినుము. తనకుఁ దన మిత్రునకు ద్రోహము చేసినవానిని క్షమింపరాదు. కావున యుద్ధమందు రావణుని కొడుకులతో బంధువులతో సేనలతోఁ గొలుత జంపుదును. నామాట యసత్యము గాకుండునట్లు విభీషణుని లంకారాజ్యమున నభిషిక్తుఁ జేయుదును. బలవంత పెట్టియైన నాసొంత రాజ్యమున భరతుని నిలుపుదును. ఈ రెండు కార్యములు చేసి నా ప్రాణములను విడువఁదలఁచితిని, అనిన సుగ్రీవుఁ డిట్లనియె. రామచంద్రమూర్తి యిట్లు చెప్పుటకు వాత్సల్యాతిశయము కారణ మని యెఱుఁగునది. నూతన శిశువును గల తల్లి యెడబిడ్డను గొంచెము మారముగానే యుంచును గదా.

తే. అనఘ నీ భార్య దొంగిలి • నట్టి ముచ్చు, నెదుటఁ గనుగొని నాశక్తి • నెద నెఱింగి
యూరకయ యుండ నా మన • సొప్పనెట్టు, లనిన మెచ్చుచు లక్ష్మణు • నని యెనిట్లు.

అర్థములు. ముచ్చున్ = దొంగను—నా శక్తి = నాకు గల బలము — వాలిచే దెబ్బతిని రావణుఁడు కిష్కింధలో నెల దినము లుండెను. వాని బలమే మాత్రమో సుగ్రీవుఁ డెఱుఁగును. అది గాక యింద్రదత్తహారబలము గలదు.

తాత్పర్యము

పుణ్యాత్మా! నీ వంటి వాని భార్యను దొంగిలించిన దొంగను, నెదుట కీర్తితో నుండుట చూచి నాశక్తి యేమాత్రమో తెలిసి పరాభవము లేదని నిశ్చయము గలఁవాడ నయ్యు నెట్లూరక చూచుచుండగలను? అనిన నతని నిష్కపట స్నేహభావమునకు సంతోషించినవాఁడై శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణునితో నిట్లనియె.

—• శ్రీరాముఁడు లక్ష్మణునకు శకునంబులఁ దెలుపుట •—

క. ఫలవంతము లగు వనముల, కలిమియు శీతోదకమును • గల తావులలో
బలముల నిలుపుచు మొగ్గర,ములు పన్నఁగ వలయుఁ జుమ్మ • మునుకొని యనుజా.

అర్థములు. ఫలవంతములు = పండ్లు విశేషించిన, ప్రాచుర్యార్థంబున మతుప్పు. శీతోదకమును = చల్లనీళ్ళు, బలములను = సేనలను, మొగ్గరములు = వ్యూహములు, మునుకొని=ముందుగా, అనుజా=తమ్ముఁడా!

తాత్పర్యము

మన సేనల వారికిఁ దిన నాహారము పండ్లు, గడ్డలులోనైనవి దండిగాఁగల వనములందు దప్పితీరఁ ద్రావుటకుఁ జల్లని నీళ్ళుగల ప్రదేశములందు వారిని నిలిపి మనము వ్యూహము లేర్పాటు చేయవలయును.

చ. బలిముఖ ఋక్ష రాక్షస ని • బర్హణమున్ భృశభీతిదంబు నా
ప్రలయము లోకనాశనక • రంబుగఁ దారసిలెం బరాగముల్
బలియఁగ వాయువుల్ విసరెఁ • బర్వతశృంగములున్ వణంకె నీ
యిల చలియించె నేలపయి • వృక్షచయంబులు వ్రాలెఁ గంటివే. ౯.౧౨

అర్థములు. బలిముఖ= వానరులయు, ఋక్ష = ఎలుగులయు, రాక్షస = రాక్షసులయు, నిబర్హణమున్ = మరణము కలిగించునది, భృశ = మిగుల, భీతిదంబు = భయము గలిగించునది, ప్రలయము = అపాయసూచకమైనది, లోకనాశనకరంబుగన్=విశేషజన నాశనము సూచించునదై, తారసిలెన్=తటస్థించెను, పరాగముల్=ధూళులు, బలియఁగన్=అతిశయింపఁగా.

తాత్పర్యము

వానరులకు ఎలుఁగులకు, రాక్షసులకు నాశము దెలుపుచు మిగుల భయము గలిగించు ప్రలయచిహ్నములు కానవచ్చుచున్నవి చూచితివా? అవి యేమందువా?

విస్తారముగ దుమ్ముల రేఁచుచు వాయువు విసరెను. కొండల శిఖరములు వణఁకెను, భూమి కంపించెను. చెట్ల సమూహములు నేల విఱిఁగి పడెను.

తే. భయదమాంసాదనిభములుఁ ♦ బరుషములును
బరుషరవములుఁ గ్రూరముల్ ♦ వారివాహ
నిచయములు ఘోరభంగిని ♦ నెత్రుతోడి
వృష్టిఁ గురియించె నుత్పాత ♦ హేతుకముగ. ౮-౨౮

అర్థములు. భయద = భయంకరములైన, మాంసాద = మాంసము దిను మృగ పక్షులతో, నిభములు = సమానములైన యాకారములు గలవి, పరుష ముల్=క్రూరములైన యాకారములు గలవి, పరుషరవములు = వినుటకుఁగటువు లైన ధ్వనులు గలవి, క్రూరముల్=క్రూరకార్యముల సూచించునవి, వారివాహ= మేఘములయొక్క నిచయములు=సమూహములు-ఘోరభంగిని=భయంకరరీతిగా- నెత్రుతోడి వృష్టిన్ = నెత్తురు నీళ్ళు కలిసిన వానను - ఉత్పాత హేతుకముగన్= అశుభసూచకముగ.

తాత్పర్యము

భయంకరములైన మాంసములనుఁదిను గ్రద్దడేగ మొదలైనవానిరూపములు గలవియు, క్రూరములైన యాకారములు గలవియు, కఠోరధ్వనులు గలవియుఁ గ్రూరకార్యముల సూచించునవియు నగు మబ్బుల గుంపులు రక్తములోఁ గలసిన నీళ్ళ వాన గురియించి మిక్కిలి యశుభమును సూచించుచున్నవి.

సీ. కుంకుముడాలున♦ఘోరమయ్యెను సంధ్య,సూర్యునం దొకనల్ల♦చుక్క దోఁచె
మార్తండునందుండి♦మండుచు నొక యగ్ని, మండలం బిల వ్రాలె♦దండితారి!
మృగములుఁ బక్షులు ♦నెల్లెడ దీనస్వరముల ఘోషించెను ♦ రవిని జూచి
నిజతేజ మిడియంగ♦నిశలందుఁజంద్రుఁడు, నలుపును నెఱుపును♦గలయఁగొనను

తే. విలయకాలంబునను బోలె♦వికటముగను,
దాపమును గూర్చుచున్నాఁడు ♦ ధరణికెల్ల
గుడుసు హ్రస్వంబు రూక్షంబు♦ఘోరమగుచు
వెలయుచున్నది యద్దాని ♦ విధముఁ గంటె. ౮-౨౯

తాత్పర్యము

౮౨౧ వ పద్యము చూచునది.

చ. మలినములౌచుఁ దారకలు ♦ మానని లోకవినాశ మియ్యెడన్
దెలిపెడిఁ, గాక గృధ్రములు ♦ డేఁకువ గల్గిన డేగ లెంతయే
నలుపపుఁబక్షులుం దఱుమ♦నారట మందెడి, నక్క లెయ్యెడన్
గలయఁగఁ బర్వి భీకరము ♦ గా రొదసేసెడిఁ గీడు దెల్పుచున్. ౮౩౦

తాత్పర్యము ౮౨౨ వ పద్యము చూచునది.

—• శ్రీరాముఁడు సువేలాద్రి డిగి లంక ముట్టడించుట •—

సీ. లక్ష్మణ! యిప్పుడ • లంకను బలముతోఁ, జని ముట్టడించుట • చను నటంచు
నగము తూర్ణము డిగి•నగచరవరు లెల్లఁ, గన వారి కుత్సాహ•కారణముగఁ
బౌరుష వాక్యము • ల్పలికి కాలజ్ఞుండు, కౌసలేయుఁడు కీశ • గణముతోడ
లంకాభిముఖుఁ డయి•శంక లేకరుగంగ, వానర రాక్షస • వల్లభులును
తే. బావమానిసుమిత్రాత్మ•భవుఁడునలుఁడు, జాంబవంతుండు నీలుండుఁ•జనిరితోడ
వారి వెంట ధరారుహ•ధారిణీధ్ర,తతులు ధరియించి కప్యచ్ఛ•దళములరిగె ౪౦౧

అర్థములు. ఇప్పుడ=రాక్షసులకు నాశము సూచించు నీ సమయమందే-నగము = కొండ = సువేలాద్రి, తూర్ణము = వెంటనే - కాలజ్ఞుండు = ఏకాలమున నెటు ప్రవర్తింపవలయునో తెలిసినవాఁడు-శకునములఁ దెలిసినవాఁడు, ధరారుహ=చెట్లయొక్కయు-ధారిణీధ్ర=పర్వతములయు, తతులు = సమూహములు - కపి+అచ్ఛ+దళములు=వానరులయు భల్లూకములయు సేనలు.

తాత్పర్యము

లక్ష్మణా! రాక్షసుల కనిష్టసూచకములు కానవచ్చు సమయమునందే మనము సేనలతోడఁబోయి లంకను ముట్టడింపవలెను, అని వెంటనే వానరు లందఱు చూచుచుండ వేగముగఁ గొండ దిగి వానరులారా! యివె రాక్షసులకు నపజయము కలిగించు శకునములు కానవచ్చుచున్నవి. ఈ సమయమునందే పోయి లంకను ముట్టడించితిమా యల్పకాలలో రాక్షసులను లంకను నుగ్గునూచము చేయ వచ్చును. మీకు రాఁగల యపాయము లేదు. మీ కపాయము రాకుండ నేను గాపాడెదను. రండు లంకను ముట్టడి వేయుదము. ఏమగవాఁడు మనయెదుట వచ్చి నిలచి ప్రాణముతోఁ బోవఁ గలఁడో చూతమని వారి కుత్సాహము గలుగ సమయోచితముగఁ బౌరుష వాక్యములు పలికి రామచంద్రమూర్తి వానర సమూహముతో లంక కెదురు ముఖమై మనము పోవునది యుద్ధమునకే, యెట్లగునో యను విచారము లేక స్వగ్రామమునకు బోవువానివలె బోవుచుండ సుగ్రీవ విభీషణ లక్ష్మణ హనుమంతులు నల నీల జాంబవంతులు వెంటనంటి పోయిరి. వారి వెనుక వానరసేనలు కొండలు చెట్లు ధరించి పోయెను.

ఆ. దీర్ఘకాల మరిగి • ధీరులు భ్రాతలు, వనవిరాజితంబు•ధ్వజయుతంబు
యోధదుర్జయంబు • నున్నత ప్రాకార, తోరణంబు త్రిదశ•దుర్దమంబు. ౪౦౨

అర్థములు. దీర్ఘకాలము=చాలాసేపు, కొండమీఁదినుండి కొండమీఁదికి గంతువేయుటకు నెక్కువకాలము పట్టదు. కొండదిగి నేలనడచి మరల గొండ యెక్కి పోవుటకు నంతకంటె నెక్కువకాలము పట్టునుగదా, వనవిరాజితంబు=వనములచే బ్రకాశించునది, ధ్వజయుతంబు=ధ్వజములతోఁ గూడినది, యోధ దుర్జయము =

యుద్ధమున వీరులకు కష్టసాధ్యమైనది. ఉన్నత =ఎత్తైన, ప్రాకారతోరణంబు = కోట గోడలు, ద్వారములు గలది, త్రిదశదుర్గమంబు=దేవతలకు నణఁపరానిది.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము ధీరులగు రామలక్ష్మణులు కాలినడకన దీర్ఘకాలము పోయి వనములచేఁ బ్రకాశించునదియు టెక్కెము లెగురుచుండునదియు యోధులు కష్టమునఁగాని జయింపరానిదియు, నెత్తైన కోటగోడలు ద్వారములు గలదియు దేవతలకు నణఁపరానిదియు.

ఆ. చేరిముట్టడింపఁ◆జేసి వానరసేనఁ, బురముచుట్టు నిలుప◆భూరిబలులు
ప్లవగవరులు రామ◆వాక్య చోదితులయి, నియతదేశములను◆నిలిచియుండ.

తా త్ప ర్య ము

అగు లంకాపురమును సమీపించి దానిని వానరసేన లోపలివారు వెలుపలికి రాకుండునట్లు చుట్టుకొనునట్లు నియమింపఁగా రాముని యాజ్ఞప్రకారము వారివారి ప్రదేశములందు వారువారు నిలిచియుండఁగా; ఏ యే గవని వాకిండ్ల కెదురుగా నెవరెవరు నిలువవలయునని ముందేర్పాటు చేసెనో యా ప్రకారమని భావము.

తే. శైలకూటంబు పోల్కినుఁ◆చ్చంబునైన, యుత్తరద్వారమునుఁ◆భ్రాతృ
యుక్తుఁడగుచు
రాముఁ డరికట్టె నచ్చట◆రావణుండు, తత్పురీరక్షణాసక్తిఁ◆దగవసించె. ౪౩౪

అర్థములు. శైలకూటము = కొండశిఖరము, ఉచ్చంబు=ఎత్తైనది, అరికట్టెన్=అడ్డగించెను.

కొండశిఖరమువలె నెత్తైన యుత్తర ద్వారమును రామచంద్రమూర్తి లక్ష్మణుతోడ నడ్డగించెను. ఆ ద్వారమునందే రావణుఁడు, పురరక్షణము నిమిత్తము కాపుండెను.

చం. వరుణుఁడు కాచు సాగరము◆భంగిని రాక్షసనేత యున్న యు
త్తరదిశ ద్వారమాఁగుటకుఁ◆దాశరథుం డొకరుండు దక్కనె
వ్వరు వలఁతుః? ల్భయంకరులు◆వాలుమగల్ దృఢవిక్రమాఢ్యులా
శరవరు లోలిఁ గాన బలి◆సద్మము దానవులట్లు లుగ్రులై. ౪౩౫

అర్థములు. సాగరము=సముద్రము, రాక్షసనేత = రాక్షసరాజు, ఆఁగుటకున్ = అడ్డగించుటకు, దాశరథుండు = రామచంద్రమూర్తి, ఇది సంబంధార్థకాద్ప్రత్యయాంతము. తస్యేయం; వలతుల్=సమర్థులు, వాలుమగల్=శూరులు, ఆశరవరులు=రాక్షస శ్రేష్ఠులు, బలిసద్మము=రసాతలము.

తా త్ప ర్య ము

వరుణుఁడు సముద్రమును రక్షించు నట్లు రావణుఁడు కాచుచున్న యుత్తర ద్వారమును నడ్డగింప రామచంద్రమూర్తి తప్ప మరి యెవ్వరు సమర్థులు గారు

వలన నా ప్రక్కనే భయంకరులైన శూరులు దృఢమైన పరాక్రమముగల రాక్షసులు చక్కఁగా రసాతలమును బలివలెఁ గాపాడుచున్నారు.

తే. ద్వారనికటస్థ వేదికా ♦ తతులమీఁద, యుద్ధసక్త భటాళుల ♦ కుపకరింప
వివిధకవచాయుధంబులు♦విపులముగను,నించియుండఁగ రాముఁడు గాంచె నపుడు.

అర్థములు. ద్వారనికటస్థ = ద్వారమునకు సమీపమందున్న - వేదికా తతుల మీఁదన్ = అరుఁగుల సమూహముల మీఁద - యుద్ధసక్తభటాళులకున్ = యుద్ధముచేయు భటులకు-ఉపకరింపన్ = ఉపయోగపడుటకై.

తాత్పర్యము

గోపురద్వారమునను సమీపమందున్న తిన్నెలమీఁద యుద్ధముచేయు భటులకు చెడిపోయినవాని బదులు మరల ధరించుకొనుటకుగా నుపయోగపడుటకై నానావిధములైన కవచములు-ఆయుధములు దండిగ నించియుండఁగా రామచంద్రమూర్తి చూచెను.

క. ప్లవగచమూపతి నీలుఁడు, ద్వివిదుఁడు మైందుండు నరుగు ♦ దేరఁగఁ దోడై
దివిజేంద్రాశాద్వారం, బవిరళసైన్యంబులోడ ♦ నరికట్టె వెసన్. ౧౩౭

ప్లవగచమూపతి = వానరసేనానాయకుఁడు, దివిజేంద్రాశాద్వారంబు = తూర్పుదిక్కు-ద్వారమును, అవిరళ సైన్యంబులోడన్ = దట్టమైన సేనతో.

తాత్పర్యము

వానర సేనానాయకుఁ డగు నీలుఁడు తనకు మైందద్వివిదులు తోడుగా రాగా లంకాపురము తూర్పుద్వారమును నడ్డగించెను.

క. దక్షిణపుగవని నాఁగెగ, వాక్షర్షభ గవయ గజస ♦ మన్వితుఁడై హా
ర్యక్షపరాక్రముఁ డంగదుఁ,డక్షీణబలుండు నిజబ ♦ లావళితోడన్. ౧౩౮

అర్థములు. హార్యక్షపరాక్రముఁడు=సింహము పరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు.

తాత్పర్యము

గజగవయగవాక్ష ఋషభులు తనకు సహాయులుగా రాఁగా సింహవిక్రముఁడై గొప్ప బలము గల యంగదుఁడు తన సేనతో దక్షిణపు గవని నడ్డగించెను.

సీ. ప్రఘసప్రమాథులన్♦పటువిక్రములఁ గూడి, పశ్చిమద్వారంబు♦పవనసూతి
కాచె సుగ్రీవుండు ♦ గరుడానిలోపమ, వేగులతో గుల్మ♦వీధి నిలిచెఁ
ధరణిసుతుం డున్న ♦ తావున ముప్పది, యాఱుకోట్లగచరు ♦ లమరి రంత
గవని కొక్కంటికి ♦ గవివరు లొక్కొక్క, కోటి నిల్చిరి లంక♦కోటఁ జుట్టి

తే. ఋక్షనాయక యుక్తుఁడై ♦ యినతనయుఁడు
మధ్యమున రామునకుఁ బడ ♦ మటను నిల్చె
యుద్ధకాంక్షను వానర ♦ యోధులెల్ల
వివిధ సన్నాహములతోడ ♦ వేచి రపుడు. ౧౩౯

తాత్పర్యము

ప్రఘసుఁడు ప్రమాథి యను వారలు సహాయులుగా నాంజనేయుఁడు పశ్చిమ ద్వారము నడ్డగించెను. గరుడ వేగముతోను వాయువేగముతోను సమానమైన వేగము గలవారిని సహాయులుగాఁ దీసికొని సుగ్రీవుఁడు మధ్యమందుండెను. సుగ్రీవుఁడున్నచోట ముప్పది యాఱుకోట్ల వానరు లుండిరి. ఒక్కొక్కనికి నొక్కొక్క కోటి వానరులు నిలిచిరి. జాంబవంతునితోడ సుగ్రీవుఁడు రామచంద్రమూర్తికిఁ బడమటవైపు, అనగా కుడిప్రక్క నిలిచెను. ఇట్లు నిలుచుటచేత పడమటివైపు ఉత్తరపువైపు సుగ్రీవునకుఁ గానవచ్చుచుండును. హనుమంతున కెదురుగ నింద్రజిత్తు రామచంద్రమూర్తి కెదురుగ రావణుఁ డుండుటచే నీ రెండువైపులఁ దాఁకు డెక్కువగా నుండునని యిరువురకు నడుమ సుగ్రీవుఁడు నిలిచెను. ఎప్పుడెప్పుడు యుద్ధమున కారంభింతుమా యని తగిన సాధనములతో వానరులు కాచియుండిరి.

సీ. వికృతలాంగూలురు♦వికటదంష్ట్రాయుధుల్, వికృతచిత్రాంగులు♦వికృతముఖులు
దశనాగసత్త్వులు ♦ దశ గుణోత్తర బలుల్, బదినూర్లగజముల ♦ బలమువారు
నోఘసత్త్వులును శ♦తౌఘసత్త్వులు నప్ర, మేయబలాఢ్యు ల♦జేయబలులు
గాఁ బెక్కువిధములఁ♦గపివీరు లొప్పిరి వారిసేనలు మూఁగు ♦ తీరు చూడ
ఆ. శలభసమితి కవియు♦చందంబుగా దోఁచె మిన్ను మన్ను భేద ♦ మెన్నరాక
కోట్లకొలది కపులు♦కోటవాకిలి డాయఁ గోట్లకొలది వెనుక ♦ గూడియుండ్రు.

అర్థములు. వికృతలాంగూలురు=పైకెత్తిన తోఁకలుగలవారు. వికటదంష్ట్రాయుధుల్ = మిట్టపల్లములైన కోఱ లాయుధములుగఁ గలవారు. వికృతచిత్ర + అంగులు=వికృత=కోపముచే నెఱ్ఱనైన ముఖములు కన్నులు గలవారు, గనుక నే-చిత్ర = చిత్రవర్ణమైన, అంగులు = అవయవములు గలవారు - వికృత ముఖులు-రాక్షసులకు భయము గలిగింప వికారముగఁ జేసికొన్న ముఖములు గలవారు-దశ నాగ సత్త్వులు=పదియేనుఁగుల బలముగలవారు- దశగుణోత్తరబలుల్=నూఱేనుఁగుల బలముగలవారు- ఓఘసత్త్వులును = ఓఘసంఖ్యగల యేనుఁగుల బలము గలవారు. శతౌఘసత్త్వులు = నూఱుఓఘముల యేనుఁగుల బలము గలవారు. అప్రమేయ బలాఢ్యులు = ఇంతని పరిమాణము చెప్పరాని బలము గలవారు. అజేయబలులు = జయింపరాని బలముగలవారు-శక్యార్థమున జేయ శబ్దము భారతంబునఁ బ్రయోగింపఁబడినది. మూఁగుతీరు=గుంపుగూడువిధము - శలభసమితి= మిడుతల గుంపు.

తాత్పర్యము

తోఁకలెత్తుకొనినవారు మిట్టపల్లముల కోఱలవారు కోపముచే నెఱ్ఱనైన ముఖము కన్నులు నవయవములు గలవారు, పది, నూఱు, వేయి యేనుఁగుల బలము గలవారు, ఓఘము సంఖ్యగల యేనుఁగులఁ బలము గలవారు, అంతకు నూఱంతలు

బలముగలవారు, కొలఁది చెప్పరాని బలముగలవారు, జయింపరాని బలముగలవారు, ఈవిధముగ ననేక విధములు గల వానరు లొప్పిరి. వారు గుంపుచేరు విధము చూడఁగా భూమి యాకాశములు తెలియరాకుండ మిడుతల దండు ముసరునట్లుండెను. కోట వాకిలి బ్రద్దలుగొట్టి లోపలఁ దూఱుటకై కోట్లకొలఁది కపులు వాకిటి సమీపమునకు రాఁగా వారికి వెనుక కోట్లకొలఁది కపులు సిద్ధముగా నుండిరి.

కం. కరువలికేనియు లంకం, జొరరాకుండగ వనాట♦శూరతతి గిరుల్
  ధరణీరుహములు కేలన్, ధరియించి పురంబుజుట్టి ♦ దర్ప మెలర్పన్. ౮౪౧

అర్థములు. కరువలి = గాలి-వనాట = క్రోఁతుల - ధరణీరుహములు = చెట్లు.

తాత్పర్యము

గాలియైనను లంకలోనికిఁ బోవుటకు సందులేకుండునట్లు వానరవీరుల గుంపులు చేతులందుఁ గొండలు చెట్లు ధరించి బలగర్వముచే లంకను జుట్టు ముట్టడించి యుండెను.

సీ. శక్రసికాశప ♦ రాక్రమయుక్తమై, మేఘసంకాశ మై♦మెఱయు చున్న
  వృక్షాటసైన్యంబు ♦ వీక్షించి రాక్షసు, లబ్బురపాటున నదరి ♦ రెదల
  వేల విరిసిన కంధి♦వెల్లి పాఱెడునట్లు, వారలు నడతేర ♦ భూరిరవము
  పురమునం దంతయు ♦ బోరుకొనెన్ లంకఁ, బ్రాకారతోరణ♦రాజితోడ
తే. సావనీధరవన మయి♦జలదరించె, రామలక్ష్మణసుగ్రీవ♦రక్షితాగ
  చరచమూసంఘమది సురా♦సురులకైనఁ దేరిచూడఁగ రాకుండఁ♦దేజరిల్లె.

అర్థములు. శక్రసికాశ=ఇంద్రుని పరాక్రమముతో సమానమైన- 'నిభ సంకాశ నీకాశ ప్రతీకాశోపమాదయ' యని యమరము. పరాక్రమ యుక్తమై= పరాక్రమముతోఁ గూడినదై-వృక్షాట సైన్యంబు=వానరసేన, వేల = చెలియలి కట్ట - వెల్లి = ప్రవాహము - బోరుకొనెన్ = ధ్వనించెను - స + అవనీధర + వనము=పర్వతములతో వనములతోఁ గూడినది - జలదరించెన్ = వణఁకెను. రక్షిత = కాపాడఁబడుచున్న - అగచర + చమూ సంఘము = వానర సేనా సమూహము.

తాత్పర్యము

ఇంద్రుని పరాక్రమము గలదై మేఘములవలె సర్వత్ర యావరించినదై యున్న వానరసేనను జూచి రాక్షసులు నబ్బురపోయి గుండె లదర తబ్బిబ్బులైరి. చెలియలికట్టను విఱుగఁదీసికొని సముద్రము ప్రవాహముగాఁ బాఱినపుడు పుట్టెడు ధ్వనివలె వానరులు నడచి వచ్చు గొప్పధ్వని లంకానగరమునం దంతయు ధ్వని పుట్టఁజేసెను. కోట గోడలతోను వాకిండ్లతోను లంక కొండలతో వనములతో

గడగడలాడెను. రామలక్ష్మణ సుగ్రీవులచే రక్షింపఁబడు వానరసేన దేవతలకు నసురులకైనఁ గన్నెత్తి చూడరాకుండఁ బ్రకాశించుచుండెను.

ఉ. ఈ విధి నాత్మసైన్యముల♦నెల్ల సమర్థములైన తావులన్
దా విడియించి మంత్రిజన♦తాసహితుండయి మంత్ర మొండి సీ
తావిభు డర్థకృత్యము వి♦ధంబు దలంచి సునీతివేదిర
క్షోవిభు సమ్మతిం బడసి♦శుద్ధమతి న్నృపధర్మ మెంచుచున్. ౧౪౩

అర్థములు. మంత్రిజనతా = మంత్రిజనసమూహము — సునీతివేది = మంచి నీతిపద్ధతి తెలిసినవాఁడగు - రక్షోవిభు = విభీషణుని యొక్క - నృప ధర్మము = రాజధర్మము — మంత్రముండి = ఆలోచన చేసి — ఇప్పుడు చేయఁదగిన యాలోచన యేమన: దండెత్తివచ్చిన రాజు తన శత్రురాజునకు "ఇదిగో నేనీనిమిత్తముగ నీమీఁదికి దండెత్తి వచ్చితిని, సంధికి వచ్చెదవా? రా! యుద్ధమునకు వచ్చెదవా? రా! యని చెప్పి పంపుట. ఇది రాయబారము. ముందు చెప్పక యుద్ధమారంభించిన నేమఱించి నట్లగును. అది ధర్మయుద్ధము కాదు. ఈ రాయబారమున కెవరిని పంపుదమా యని యొక యాలోచన—శత్రుబల జ్ఞానము లేకున్నప్పుడు ధీరుఁడుగానుండినను శత్రుబాహుళ్యము చూచి యుద్ధ మనర్థకరమని తలఁచి శరణాగతుఁడయ్యెనేని లంకారాజ్యము రావణునకియ్యవలెనా? విభీషణున కియ్యవలెనా? యని రెండవ యాలోచన.

తాత్పర్యము

ఈ ప్రకారముగఁ దన సేనలనెల్లఁ దగిన స్థలములందు నిలువఁజేసి మంత్రి జనములఁగూడి యిఁకఁ జేయవలసిన కార్యముల నాలోచించి రాజనీతి నెఱింగిన రామచంద్రమూర్తి నీతివేత్తయగు విభీషణు నంగీకారము దీసికొని నిర్మలమనస్కుఁడై.

—♦ అంగదు రాయబారము ♦—

క. వీరుని వాలిసుతుం గని, శూరా! లంఘించి లంకఁ ♦ జొచ్చి దశాస్యుం
జేరి మదుక్తిగ ననుమీ, భీరహితుఁడ వగుచు నీదు♦ పేరిమి నెలయన్. ౧౪౪

అర్థములు. మదుక్తిగన్ = నేను జెప్పినట్లుగ, భీరహితుఁడవు = భయము లేనివాఁడవు, నేను జిన్నవాఁడనే, శత్రువులలోనికి నొంటిగ నెట్లుపోదును? రావణుఁ డేమి చేయునో యని భయపడక, పేరిమి=గొప్పతనము, ఆలోచన పర్యవసానము చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

వీరుఁడగు నంగదునిఁజూచి హనుమంతుఁడు మరలఁ బోవుట సరిగాదు. అతనికి రెండవవాఁడితఁడేయని యాలోచించి రామచంద్రమూర్తి యిట్లనియె. శూరుఁడా! కోట గోడ దాఁటి లంకఁ బ్రవేశించి రావణు సమీపించి వాని భయము విడిచి నీ గొప్పతనమునకుఁ దగినట్లు నేను జెప్పితినని నా మాటలుగా నిట్లనుము.

సీ. ఓరి భ్రష్టశ్రీక ♦ యోరి గతైశ్వర్య, యో నష్టచేతన ♦ యో ముమూర్షు,
గర్వమోహంబులఁ ♦ గావించితివి ద్రోహ, మప్సరోగంధర్వ ♦ యక్షనాగ
నిర్జర ఋషి రాజ ♦ నిచయంబులకు నీవు, బ్రహ్మవరంబు కా ♦ వరము దీఱు
కాలంబు ఘటియిల్లెఁ ♦ గాంతాహరణకర్శి, తుండను దండధ♦రుండువోలె

ఆ. నీకు శాస్తి సేయ ♦ నీ లంకవాకిట, నిలచియున్నవాఁడ ♦ నిశిచరేంద్ర!
యేమిబలము నమ్మి♦యింతి మాయ హరించి, తట్టి బలముఁజూప♦నరుగుదెమ్ము.

అర్థములు. భ్రష్టశ్రీక = రాజ్యలక్ష్మినుండి భ్రష్టుఁడ వైన వాఁడా! సమీప భవిష్యత్తునకు భూతము, గత+ఐశ్వర్య=ఐశ్వర్యము తొలఁగినవాఁడా! రాజ్యసంపదపోయినను ధనధాన్య సంపత్తి యయిన నుండుట గలదు. నీ కదియు లేదు, నష్టచేతన=ప్రభుత్వము లేకపోయినను ధనము లేకపోయినను బుద్ధియైన నుండవచ్చును, అదియు లేనివాఁడా! ముమూర్షు = చావనున్నవాఁడా! తెలివి లేకపోయినను ప్రాణముతోనైన నుండవచ్చును. నీ కదియు లేదు. గర్వమోహంబులన్=బ్రహ్మవరము కల దను పొగరుచేతను, పొగరువలన యథార్థజ్ఞానము నాశమగుటను, బ్రహ్మవరము కావరము=బ్రహ్మవరముగల దను పొగరు, తీరు = క్షయించు, కాంతాహరణ కర్శితుఁడను=భార్య యపహరింపఁబడుటచే కృశించిన వాఁడను, దండధరుఁడువోలెన్=యమునివలె, శాస్తి=శిక్ష.

తాత్పర్యము

ఓరి రాజ్యలక్ష్మి భ్రష్టుఁడా! ఓరి యైశ్వర్య భ్రష్టుఁడా! ఓరి బుద్ధిహీనుఁడా! ఓరి యాసన్న మరణుఁడా! బ్రహ్మవరము కలదను పొగరుచే జ్ఞానహీనుఁడవై అప్సరసలకు, గంధర్వులకు యక్షులకు, నాగులకు, ఋషులకు, రాజసమూహమునకు ద్రోహము చేసితివి. నీ కా బ్రహ్మవరము పొగరు నశించు కాలము ప్రాప్తించినది. వారికి నేను ద్రోహము చేసినవారు నన్ను దండింపవలె, నీ వేలవచ్చితివందువా? నీవు నా భార్యను హరియించుటచే నా శోకమున బాధపెట్టితివి. కావున నిన్ను దండించుటకై నీ లంక వాకిట యమునివలె వచ్చియున్నాఁడను, ఓరి రాక్షస రాజా! యాఁడుదానిని నేమి బలము నమ్మి మోసగించి తెచ్చితివో యా బలముఁ జూప రారమ్ము.

కం. ఆశరనాయక దురమున, నా శరముల నీల్గి నీవు ♦ నాకుల రాజ
ర్షి శమహర్షుల పదవి ని, వేశంబుగఁ గొనెద నీవు♦వీరుఁడ వేనిన్. ౪౪౬

అర్థములు. ఆశరనాయక = రాక్షసరాజా! దురమునన్ = యుద్ధమందు, శరములన్=బాణములచే, నీల్గి = చచ్చి, నాకుల = దేవతలయు, రాజర్షి శ, మహర్షుల=రాజఋషి శ్రేష్ఠులయు, మహర్షులయు, నివేశంబుగన్=స్థానముగ.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవు వీరుఁడవై యుద్ధమునకు వచ్చితివా రమ్ము, నా బాణ

ములచేఁ జచ్చి పూతపాపుఁడవై దేవతలు రాజర్షులు మహర్షులుండు లోకమునకుఁ బోఁగలవు.

కం. కావేని సీత మరలం, గావర మఱ నిచ్చి శరణుఁ • గాంచుము, కాదేన్
నే వెస లోక మరాక్షస, మై వెలయఁగ జేయువాఁడ•నాశుగతతులన్. ౪౪౮

తాత్పర్యము

అటుచేయుట నీకు సమ్మతముగాదేని గర్వము వదలుకొని సీతను మరల నిచ్చి నా శరణు చొరుము. ఈ రెంటిలో నేదో యొకటి చేయక పోయితివా నా బాణములచే లోకమున రాక్షసులనువారు లేకుండఁ జేయుదును. నీ వొక్కఁడవు నెపముగా రాక్షసవంశమే నాశమగును. నీవు శరణాగతుఁడవైతివా బ్రదుకుదువు. రాక్షసులందఱు బ్రదుకుదురు.

తే. ధర్మచిత్తుండు రాక్షస•తతిగరిష్ఠుఁ,డగు విభీషణుఁ డిట నన్ను•నాశ్రయించె
నితఁడు శ్రీమంతుఁ డొందెలం•కేశ్వరత్వ,మసుర! నిష్కంటకముగ ని•త్యంబుగాఁగ.

తాత్పర్యము

నీవు శరణాగతుఁడవు కాకపోయితివా నీకు లంకారాజ్యముగూడ దక్కదు. అది యేల యందువా? ధర్మచిత్తుండు=ఇది మొదటి కారణము. రాజ్యము ధర్మాత్ముఁడు పాలింపవలయును గాని యధర్మచిత్తుఁడు పాలింపరాదు. నీవధర్మ చిత్తుఁడవు కావున నీవు రాజుగానుండఁదగవు. విభీషణుఁడు ధర్మాత్ముఁడు కావున రాజుగా నుండఁదగినవాఁడు. రెండవకారణ మేమన:- విభీషణుఁడు రాక్షససమూహమందు గొప్పవాఁడు, జ్ఞానసహితుఁడు. అజ్ఞానరహితుఁడెవ్వఁడో వాఁడు గొప్పవాఁడు కాని యేండ్లు విశేషించియుండఁగానే గొప్పతనము రాదు. కాకులు, పాములు నూర్లకొలఁది సంవత్సరములు బ్రతుకుటలేదా? ఇది పాపము, ఇది పుణ్యమని తెలియని కారణముచేఁ గదా నీవు దేవ గంధర్వ యక్షాదులనెల్లర బాధించితివి. కావున నీవు రాజుగానుండఁదగవు. విభీషణుఁడే రాజుగా నుండఁదగినవాఁడు. ఇఁక మూఁడవ కారణ మేమంటివా ? నన్ను నాశ్రయించినవాఁడు విభీషణుఁడు. నాయందు ద్రోహబుద్ధి గలవాఁడవు నీవు. నా యాశ్రితుని యోగక్షేమ భారము నాయందున్నది కావున నిన్నుఁ జంపియో రాజ్యమునుండి తొలగించియో రాక్షస రాజ్యాధిపత్య మతనికిచ్చెదనుగాని నీకీయను. నిన్నాశ్రయించిన కారణముచే విభీషణునికి రాజ్యమియ్యఁ బూనితివేని నేను నిన్నాశ్రయించిన నేమిచేసెదవు అందువేమో? అతనికి నా యయోధ్యరాజ్య మిచ్చెద నని భావము. నాలుగవ కారణ మేమన ఆతఁడు శ్రీమంతుఁడు, ఐశ్వర్యప్రాప్తికి వలయు సమస్త సద్గుణములు గలవాఁడు. (౨) శ్రీదేవియగు సీతాదేవి కరుణకుఁ బాత్రుఁడైనవాఁడు. నీవో శ్రీమంతుఁడవు కావు. శ్రీదేవి విషయమున అపరాధము చేసినవాఁడవు. "ఆగోపశాఖో మంతుశ్శ్" అని యామునము. ఆమెకు ద్రోహమెంచి బాధించువాఁడవు. ఆమె యనుగ్రహము సంపాదించక నీవు నాశరణుచొచ్చినను నేను నిన్ను

అనుగ్రహింపను. ఆమె విషయమున అపరాధివి. కావున ముందు నీ వామె కాళ్ళపైఁబడి యామెను ప్రసన్నురాలిని జేసితివేని నిన్ను రక్షింతును. అజ్ఞులు నావిషయమై చేయు నపరాధముల నేను లెక్కింపను. నా యాశ్రితులకుఁ జేసిన యపరాధములకుఁ గోపింతును. దండింతును. భగవంతుఁడు దుర్వాసునితో నీ వంబరీషుని విషయమున నపరాధము చేసితివి, అతని కాళ్ళపైఁ బడుమని కదా బోధించెను. ఇచ్చట నట్టులే. వారి యనుగ్రహమే నాయనుగ్రహము. వారి నిగ్రహమే నా నిగ్రహము. ఈ నాలుగు కారణములచే నోరీ లంకాధిపత్యమును శత్రువుల వలని భయములేక పాలింప విభీషణుఁ డొందెను. నీవలె నల్పకాలము మాత్రముకాదు. శాశ్వతముగ నొందఁగలిగెను. విభీషణుఁడు లంకారాజ్యము పొందె నంటివే. నేను రాజనై సింహాసనముపైఁ గూర్చుండి యున్నానుగదా యందువేమో! నియోగము జరిగినది. సింహాసనము మీఁద కూర్చుండఁబెట్టుటకే వచ్చియున్నాను. నీవు మంచితనముగా సింహాసనము విడిచి పోవేని నిన్నుఁ జంపి యతనిని గూర్చుండఁ బెట్టదను. సింహాసన మతనిది కాని నీది కాదు. విభీషణుఁడు చిరంజీవులలోఁ జేరినవాఁడు. కావున శాశ్వతముగ నని చెప్పఁబడెను. ఈవిషయ ముత్తరకాండమునఁ గలదు.

మ. వినరా మూర్ఖసహాయ! ధర్మపథమున్ వీడ్కొల్పి పాపైకగ
 ర్ధనచిత్తుండవు నస్వతంత్రమతి వై రాజ్యంబు బాలింప నో
 కకనిమేషంబు నశక్య మింక ధృతి చిక్కంబట్టి శౌర్యంబుమైఁ
 జనుదే పోరికి బూతుఁడయ్యెదవు మచ్ఛాతాస్త్రశాంతుండవై. ౪౪౯

అర్థములు. మూర్ఖసహాయ=మూర్ఖుఁడవు నీ వొకఁడవే కావు. నీకు సహాయులు మూర్ఖులే. వివేకముగల విభీషణువంటివారు నీకు సహాయులు గాఁజాలరు. కావున నీవలెనీ సహాయులు నన్యులే ధర్మపథముక్ వీడ్కొల్పి = ధర్మమార్గము వదలి, పాపైకగర్ధన చిత్తుండవు = పాపమే ప్రధానముగా నపేక్షించు మనస్సు గలవాఁడవు. అస్వతంత్రమతివి = బుద్ధిస్వాధీనత లేనివాఁడవు. నీ బుద్ధి కామము వశమున నున్నది. చనుదే = చనుదెమ్ము-ఇఁక = ఈమీఁది కాలమున - చిక్కబట్టి = చెదరకుండఁ బట్టుకొని - మత్ + శాతాస్త్రశాంతుండవై = నా వాఁడి బాణములచే జచ్చినవాఁడవై, పూతుఁడవయ్యెదవు=పరిశుద్ధుఁడ వయ్యెదవు- రణమందు వెనుదీయక చచ్చితివేని వీరస్వర్గము లభించు నని భావము.

తాత్పర్యము

మూర్ఖులను సహాయులుగాఁ గలవాఁడా! వినరా! ధర్మమార్గమును వదలి పాపము నందే యాసక్తిగలవాఁడవై కామవశుఁడవై యిఁక రాజ్యమును నొకనిముషమైనఁ బాలింపఁజాలవు. కావున ధైర్యము చెదరనీక బిగఁబట్టి శౌర్యముగలవాఁడవై యుద్ధమునకు రమ్ము. నీవు చేసిన పాపములకు శిక్ష నా వాఁడిబాణముల వలనఁ గలుగు బాధచే ననుభవించి చచ్చి వీరస్వర్గమును బొందెదవు.

చ. పావరు దొలంగి కన్మొఱఁగి ♦ పోవఁ దలంచి శకుంతమై మనో
జవమున మూఁడులోకములు ♦ జాల్ముఁడ! చొచ్చితివేసియున్ శ్రమం
బవు జుమ యంతమాత్రమె మ ♦ దక్షి పథంబును బొంది ఘోర మృ
త్యువు వదనంబునం బడక ♦ ద్రోహి! ధరన్ మనఁ జాల వేమిటన్. ౪౧౦

అర్థములు. పావరు = పొగరు, కన్మొఱఁగి = కనుచాటై, శకుంతమై = పక్షివై, జాల్ముఁడ = నీచుఁడ, యుద్ధమునకు రాక, సంధిగోరక పిఱికివై మాఱు వేషమునఁ బరుగెత్తిపోవుట నీచలక్షణముగదా? మదక్షిపథంబు=నాదృష్టిమార్గము, మనఁజాలవు=బ్రతుకలేవు.

తా త్ప ర్య ము

కండగర్వము వదలి పక్షివేషమునఁ గనుచాటై మనోవేగముతో మూఁడు లోకములందు నెంచుఁబోవఁ జూచినను నీచుఁడా! శ్రమ యొక్కటియే ఫలముగాని వేఱుఫలములేదు. ఇంత శ్రమపడి కడపట నా కాకాసురునివలె నాకాళ్ళపైఁ బడవలసిన వాఁడవే, లేదా చావవలసిన వాఁడవే. నిన్ను రక్షింపఁగలవాఁడు మూఁడు లోకములందు లేఁడు. ద్రోహీ! నా కనులకు నగపడి చావక నీ వటరా బ్రతుకఁగలవు. అది యసాధ్యము.

కం. కావున హితమాలింపుము, జీవశ్రాద్ధంబు నిపుడ ♦ చేసికొని పురిన్
నీ వలచినయవి కను నీ, జీవము నా చేతిలోనఁ ♦ జిక్కెం గుమతీ. ౪౧౧

అర్థములు. జీవశ్రాద్ధము=మరణానంతరము తన కుత్తరక్రియలు చేయఁగలవారు లేనివాఁడు తనకుఁ దానే జేసికొను శ్రాద్ధము జీవశ్రాద్ధము. నీకు నీళ్ళు విడుచువారుండరు. అందఱు చత్తురు కావున నీవిపుడే శ్రాద్ధము పెట్టుకొనుము.

తా త్ప ర్య ము

నీవు చచ్చుట నిజము కాఁబట్టి నీకంటె ముందు నీవారందఱు చత్తురు కావున నీకు శ్రాద్ధము పెట్టువాఁడుండఁడు. కనుక నీ శ్రాద్ధము నీవే పెట్టుకొని నీ నగరమున నీకుఁ బ్రియమైన వాని నెల్లఁ గడపట నొకసారి చూచి రమ్ము. నీ ప్రాణము నాచేతిలో నున్నది కాని నీ దేహమునందు లేదు.

కం. అని రాముఁడు వచియించిన, ఘనపథమున కెగిరి రూపు ♦ గాంచిన యనలుం
డనఁ దారేయుఁడు రావణు, ఘనసౌధమునందు వ్రాలి ♦ కడిమి దలిర్పన్.

అర్థములు. ఘనపథమునకున్=ఆకాశమార్గమునకు, రూపుగాంచిన యనలుఁడు=వానరాకారము గొన్న యగ్నిహోత్రుఁడు, పంచమహాభూతములు, తన్మాత్రలు, మహత్తు, అవ్యక్తము, ఇవి యన్నియు నిరాకారములు. అనఁగా మనుష్య పశు పక్ష్యాదులకువలె నిర్దిష్టమైన యొక యాకారము లేదు. కావున నిచట నగ్ని రూపవంతుఁ డనఁబడెను. ఈకారణముచేత నే భగవంతుఁడు నిరాకారుఁడనఁబడును. 'అన్ని రూపముల్ తన రూపమైనవాని రూప మేరూపమని చెప్ప సాధ్యపడును.'

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' అన్నట్లు భగవంతుఁడు ప్రపంచమునంతటను లోపల వెలుపల వ్యాపించి యున్నాఁడు. కావున నేరూపము నందు నిండియున్నాఁడో యదే యాయన యాకారము. ఆకారములేని నీళ్ళకు నదియుండు పాత్రాకారమే.

అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో, రూపంరూపం ప్రతిరూపో బభూవ
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా, రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ
వాయుర్యథైకో భువనం ప్రవిష్టో, రూపం రూపం ప్రతిరూపో బభూవ
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా, రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥

అగ్ని, వాయువు నొక వస్తువునందుఁ ప్రవేశించి యా వస్తువు నాకారము పొందునట్లు భగవంతుఁడును, కావున నన్నిభూతములు భగవత్స్వరూపములే. ఇట్టులే రామకృష్ణ నరసింహాది విగ్రహములందుండు భగవంతుఁ డొకఁడే యైనను వెలుపల రూపమును బట్టి యాయన రామమూర్తియని, యాయన కృష్ణ మూర్తియని, యాయన నరసింహుఁ డని యందుము.

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా నంగదుఁడు నగ్నిహోత్రము వలె మండుచు ఆకాశమున కెగిరి కోట దాఁటిపోయి రావణుఁడు మేడమీఁద నుండఁగా నచ్చట దిగి పరాక్రమ మతిశయింపఁగా.

కం. సామాత్యుం డగు రావణు, మోమును గని చేరఁబోయి ♦ మూర్తిమదగ్ను
ద్ధామత వెలుఁగుచు దూచా, యేమి విడక రామునూక్తు♦లెల్లనువినిచెన్. ౧౫౩

అర్థములు. సామాత్యుఁడు = మంత్రులతోఁ గూడినవాఁడు - మూర్తి మత్ = రూపముగల - అగ్ని + ఉద్ధామతన్ = అగ్నిహోత్రుని వంటి తేజో తిశయముచే-దీనిచే రాక్షసులు వీని సమీపించుటకును భయపడి రని భావము. తూచా యేమి విడవక=రామచంద్రమూర్తి చెప్పిన మాటలలో నొక యక్షర మైన వదలిపెట్టక.

"తుహిచస్మహవై పాదపూరణే"యని యమరము. తు-చ-ఇవి పాదపూర పూరణమందు నుపయోగింపఁబడును. "తు స్యా ద్భేదే௨వధారణే" ఇట్టివి యర్థవిశేష ములను ప్రయోగింపఁబడును. కావున వీనిని విడిచినఁ గొన్ని చోట్ల వాస్తవార్థ మునకే హాని కలుగును. కావున నే యర్థమున నేయక్షరమును రామచంద్రమూర్తి ప్రయోగించెనో యని యొక యక్షరమైన విడువలేదని యర్థము-వినిచెన్ = ఇది ప్రేరణార్థకరూపము. వర్ణనిర్దేశ విధానంబులందు హ్రస్వము దీర్ఘముగాఁ జెప్పఁ బడును. పావన పాఫా బాభా మావాయను నాలు లిపులు-తాను మావత్తిచ్చిన త్మయగును. ఈ కారణముచే హ్రస్వములు దీర్ఘములుగాఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

మంత్రులతోఁగూడి యుండిన రావణునిఁజూచి సమీపమునకుఁబోయి యగ్ని

హోత్రుని వలె వెలుఁగుచు రామచంద్రమూర్తి చెప్పిన మాటలలో నొక యక్షరమైన విడక సర్వము వినిపించెను.

కం. ఖ్యాతుఁ డగు కోసలేంద్రుఁడు, పూతచరితుఁడైన రామ♦భూవరమణికిన్
దూతను వాలితనూజుఁడ, నే తఱి నా పేరు వింటి♦వే యంగదుఁడన్. ౮౯౪

అర్థములు. ఖ్యాతుఁడు = ప్రసిద్ధుఁడు - పూతచరితుఁడు = పవిత్రమైన నడవడి గలవాఁడు-ఏతఱిన్=ఏసమయమందైనను.

తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన వాఁడును, కోసలదేశ రాజును నీవలెఁ బాపచరిత్రుఁడు గాక పవిత్రమైన నడవడి గలవాఁడును నగు రామచంద్రమహారాజునకు నేను దూతను, ఆయన రాయబారి మంపఁగా వచ్చితిని. నేను వాలి కుమారుఁడను. ఏ సందర్భమందైనను అంగదుఁడను నా పేరు విన్నావా? విని యుండిన వాఁడే నేను.

చం. అనఘుఁడు రామచంద్రుఁ డిటు♦లాడె దురాత్మక! పూరుషుండవే
ననికిని లేచి రమ్ము, సచి♦వాత్మజ బాంధవ మిత్రయుక్తుఁగా
నిను వధియింతు, లోకములు♦నిర్వ్యథమై సుఖియింప దేవతా
దనుజఋషీశ్వరాహివని♦తాజనకంటకు నిన్నుఁగూల్చెదన్. ౮౯౫

అర్థములు. అనికిని=యుద్ధమునకు, నిర్వ్యథమై = వ్యథ దొలఁగినదై.

తాత్పర్యము

పుణ్యాత్ముఁడైన రామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. పర్యవసానమున నేమి చెప్పెనందువా? దుష్టబుద్ధీ! మగవాఁడవైతివా? యుద్ధమునకు లేచిరమ్ము. మంత్రులతోఁ గొడుకులతో చుట్టములతో స్నేహితులతో నిన్నుఁ జంపెదను. లోకములకు నీ బాధ తొలఁగునట్లు దేవదానవ ఋషీశ్వరులకును పన్నగులకు స్త్రీలకు బాధగలిగించు నిన్ను వధించెదను.

తే. భూమిజాతను బహుమాన ♦ పూర్వకముగ, సరగఁ గొనివచ్చి
యర్పించి ♦ శరణు వేఁడ
వేని నినుఁ జంపి నీ రాజ్య♦మే విభీష,ణునకు నిత్తునటంచను♦మని యెఱుఁ గనిన.

అర్థములు. సరగన్ = త్వరగా.

తాత్పర్యము

సగౌరవముగ సీతను దెచ్చి వెంటనే నాకు సమర్పించి శరణు వేఁడక పోయితివా, నిన్నుఁ జంపి నీ రాజ్యమును విభీషణున కిచ్చెదను, అని చెప్పుమనెను అని యంగదుఁడు చెప్పఁగా.

—♦ అంగదుఁడు రాక్షసులఁ జంపి మరలి శ్రీరాముకడకు వచ్చుట. ♦—

కం. ఆపరుష భాషణము విని, కోపారుణనేత్రుఁ డసురఁ ♦ కుంజరుఁడు దురా
లాపుని వీనిని గొట్టుఁడు, వే పట్టుఁడు చంపుఁ డనుచుఁ♦బెద్దగాలు తడవల్.

అర్థములు. పరుషభాషణము = కఠినములైన మాటలు - కోపారుణ నేత్రుఁడు = కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడు-దుర్+ఆలాపుని = చెడు మాటలాడువానిని - పెక్కుఁలు తడవల్ = పలుమాఱు - ఒకటి రెండు మార్లు చెప్పిన నే రాక్షసుఁడును వానిమీఁదికిఁ బోవ సాహసించినవాఁడు కాఁడు. కావునఁ బలుమాఱు చెప్పెను.

తాత్పర్యము

అంగదుఁడాడిన నిష్ఠురవాక్యము విని కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసికొని రావణుఁడు దుర్భాషలాడు వీనిని పట్టుఁడు కట్టుఁడు కొట్టుఁడు చంపుఁడని పలుమాఱు చెప్పఁగా,

చం. పలికిన ఘోరరాక్షసులు ♦ పైపడి నల్వురు వాలిపుత్రునిన్
బెలుచనఁ బట్ట నాతఁడును ♦ స్వీయబలోద్ధతిఁ జూపఁ జిక్కిన
ట్టులు నటియించి వారలఁ ద ♦ టుక్కునఁ జంకలలోన నొక్కి తా
నలఘుజవంబునం బులుఁగు ♦ నట్టులు దాఁటెను మేఁడమీఁదికిన్. ౭౫౭

అర్థములు. పెలుచనన్ = ఆటోపముతో - స్వీయబలోద్ధతిన్ = తన బలాతిశయమును.

తాత్పర్యము

ఇట్టులు రావణుఁడు చెప్పఁగా భయంకరములైన యాకారములు గల నలువురు రాక్షసు లొక్కసారిగ నంగదునిమీఁదఁ బడి యాటోపించి పట్టుకొనఁగా నంగదుఁడు తనబలము చూపఁగా వారికిఁ జిక్కినట్లు నటించి చిక్కినాఁడని వారు కేవలము దగ్గరకురాఁగా నున్నట్టులుండి తటాలున వారిమెడలు చంకలలో నిఱికించుకొని మేడపైకి పక్షివలె వేగముగ నెగిరెను.

కం. అచ్చట నుండియు నలువురఁ, ♦ జెచ్చెర విడలింప వారు ♦ చేవ చెడంగాఁ
జచ్చిపడిరి దశకంఠుఁడు, కచ్చఱి కనుఁగొనుచు నుండఁ♦గా నంగదుఁడున్.

అర్థములు. కచ్చరి = గర్వముచెడి.

తాత్పర్యము

ఆ మేడమీఁద నుండియే వారిని నలువురను నతివేగముగ నంగదుఁడు విదలింపగా వారు రావణుఁడు గర్వముచెడి చూచుచుండ వానియెదుటనే చచ్చిపడిరి.

తే. శైలశృంగోన్నతంబు ప్రా♦సాదశిఖర, మచట వీక్షించి పదహతి♦నవనిఁ గూలఁ
దన్నె రావణుఁడీక్షింప♦నున్న వజ్రి, మంచుగుబ్బలిశృంగంబుఁ♦ద్రుంచుమాడ్కి.

అర్థములు. శైలశృంగోన్నతంబు=కొండశిఖరమువలె నెత్తైనది, ప్రాసాద శిఖరము = మేడపైభాగమును, పదహతిన్ = కాలిదెబ్బచే. వజ్రి = ఇంద్రుఁడు, మంచుగుబ్బలి = మంచుఁగొండ.

తాత్పర్యము

పర్వత శిఖరమువలె నెత్తైన మేడ శిఖరమును జూచి యంగదుఁడు కాలి

దెబ్బచే దానిని దన్నఁగా రావణుఁడు చూచుచుండఁగా నది, యింద్రుఁడు వజ్రాయుధముచేఁ గొట్టఁగా నేలఁబడిన హిమవత్పర్వత శృంగమువలె నేలఁబడెను.

తన దూతలుపోయి వానరులచే భంగపడి వచ్చుటయు, వానరుఁ డొక్కఁడే వచ్చి తన్ను భంగపఱిచి పోవుటయుఁ జూచియైన రావణుఁడు కాలపాశవశంగతుఁ డౌట బుద్ధి తెచ్చుకొన్నవాఁడు గాఁడు.

ఉ. క్రచ్చఱ నిట్లు సౌధశిఖ • రంబును ద్రుంచి పరాక్రమించి నే
వచ్చినవాఁడ నంగదుఁడ • వాలితనూజుఁడ రాముబంట సం
చచ్చుపడంగఁ బల్కి మహి • తార్భటు లుల్లసిలంగ ఱివ్వనన్
వచ్చి వియత్పథంబునను • బార్థివ వర్యుని మ్రోల వానరుల్. ౪౬౧

అర్థములు. క్రచ్చఱన్=వేగముగ, మహితార్భటులు = గొప్ప సింహనాదములు, వియత్+పథంబునను = ఆకాశమార్గమున.

తాత్పర్యము

శీఘ్రముగ నిట్లు సౌధశిఖరంబును విఱుగఁదన్ని రావణుని కన్నుల యెదుటనే తన పరాక్రమముఁ జూపి నేను రామచంద్రమహారాజు దూతను, నాపే రంగదుఁడు, వాలి పుత్రుఁడను అని యందఱు వినునట్లు స్పష్టముగఁ బలికి గొప్పగా సింహనాదములు సేయుచు నాకాశమార్గమున ఱివ్వన వచ్చి రామచంద్రుని మ్రోలనున్న వానరులు.

కం. ఉల్లాసంబున నెరలఁగఁ, బెల్లగు దుఃఖమున నసుర • వీరులు వగవన్
మెల్లన నిలిచినఁగని రఘు, వల్లభుఁ డెద మెచ్చి యాహ • వమునకుఁ దొడరెన్.

అర్థములు. ఆహవమునకున్=యుద్ధమునకు.

తాత్పర్యము

సంతోషముతో విజృంభింపఁగా రావణునియొద్ద నున్న రాక్షసులు దుఃఖముతో నేడువఁగా వినయముతో మెల్లన వచ్చి నిలువఁగా రామచంద్రమూర్తి మెచ్చుకొని యుద్ధమునకు బ్రారంభించెను.

క. ప్రాసాదభంగమునకున్, రోసము దీపింప రావ • ణుం డది భ్రష్ట
శ్రీసూచక మని తనకున్, వేసమకుఱు నాశ మనుచు • వెచ్చగ నూర్చెన్.

అర్థములు. ప్రాసాదభంగమునకున్ = మేడ విఱిగి పడుటవలన - పంచమ్యర్థక షష్ఠి-భ్రష్ట శ్రీసూచకము=చెడిన రాజ్యలక్ష్మికి చిహ్నము.

తాత్పర్యము

రావణుఁడు తనమేడ విఱుగఁబడుటవలన రోస మధికమయ్యునది తనరాజ్యలక్ష్మి తొలఁగిపోవుటకు శకునమనియుఁ దనకుఁ జేటు తప్పదనియుఁ దలఁచి వేడి నిట్టూర్పులు విడిచెను.

తే. కొండవలె నుండు నలసుషే♦ణుండు దండి, గండుమీఱిన వానర♦కాండసేన
తోడ నాలుగువంకులఁ♦దోయజారి, చుక్కఁగుమిఁబోలె త్రేనాజ్ఞఁ♦జుట్టుచుండె.

తాత్పర్యము స్పష్టము.

ఉ. వ్యూహము దీరి యున్న ప్లవ♦గోత్కరమున్ లవణాబ్ధి దాఁటు న
క్షౌహిణులన్ నిశాచరులు ♦ గాంచి భయంపడి రందు వీరు లా
సాహసికాగ్రణుల్ రణము♦సల్పఁ గుతూహల మంది రెంతొ యు
త్సాహముఁ బూని శస్త్రములు♦దాల్చి చరించుచు ఝంఝపోలికన్. ౯౪-౯౫

అర్థములు. ప్లవగోత్కరము=వానర సమూహము - అక్షౌహిణులన్ = రూ-అక్షోహిణులన్= ౨౧౮౭౦ రథములు, అన్నియే యేనుఁగులు -౬౫౬౧౦ గుఱ్ఱములు, ౧౦౯౩౫౦ పదాతులు గలసేన అక్షౌహిణి యనఁబడును. ఝంఝ= వానతోఁగూడిన గాలి, తుఫాను-'ఝంఝా వాతస్సవృష్టిక' యని యమరము.

తాత్పర్యము

వ్యూహముగా నేర్పడి యున్న వానరసమూహమును అదిగాక సముద్రమును దాఁటి యక్షౌహిణుల కొలఁది వచ్చునారిని జూచి కొందఱు రాక్షసులు భయపడిరి. ధైర్యము సాహసము గలవారు కొందఱు యుద్ధముచేయు నుత్సాహముతో శస్త్రములు ధరించి తుపానుగాలివలెఁ దిరుగు చుండిరి.

తే. వరణపరిఖాంతరంబుల♦వ్యాప్తమైన, క్రోఁతిగమిఁగని యిది వేఱు♦కోటయొకొ
యనుచు వెఱచిరి వారల♦యార్భటులకు, నడలె నసురులపిండు హా♦హా యటంచు.

అర్థములు. వరణ+పరిఖా+అంతరములన్ = కోట గోడలకు నగడ్తలకు నడిమి ప్రదేశములందు. 'ప్రాకారో వరణస్సాల' యని యమరము-వ్యాప్తమైన= ఆవరించి యుండిరి.

తాత్పర్యము

కోటగోడలకు నగడ్తలకు నడుమ నిండిన వానరసేనను జూచి యిదియేమి వేఱొక కోటయా యని వెఱచి వానరుల కేకలకు రాక్షసులు హాహాకారములు గావించిరి.

౪౨-వ సర్గము. రాక్షసులు రావణుతో లంకను వానరులు ముట్టడించి రని తెలుపుట.

తరువోజ.

అంతట రాక్షసు♦లసురేంద్రునిలయ♦మరిగి యాతనితోడ♦నగచరు ల్లంక
నంతయు రోధించి♦నట్టివిధంబు♦నఖిలంబుఁ దెల్పిన♦నాతండు కనలి
వింతగాఁ గాపెల్ల♦ద్విగుణంబుఁ జేసి♦నెన సౌధ మెక్కి త♦ద్వ్యూహమును గాంచెఁ
గాంతార శైలముల్♦గణియింపరాని♦కదనలంపటు లైన♦కపులాక్రమింప.

అర్థములు. రోధించి = అడ్డగించి, కనలి = కోపించి, ద్విగుణంబు = ఇబ్బడి, రెండంతలు, కదనలంపటులు=యుద్ధమం దాసక్తిగలవారు.

తరువోజ, ప్రాసములేని ద్విపద తరువోజ నొకపాదమగును. యతులు నాలుగు గలవు. ఇది జాతివృత్తము. ఇంద్రగణములు మూఁడు, సూర్యగణము ఒకటి. మూఁడవగణము మొదటి యక్షరము యతిస్థానము ఇట్టివి రెండు గూర్చిన తరువోజ యొక్క పాదమగును. ప్రతి మూఁడవ గణము మొదటి యక్షరము యతిస్థానము, ఇది యొకపాదము. ప్రాసముతో నిట్లు నాలుగు పాదములు చెప్పిన తరువోజ యగును.

తాత్పర్యము

ఇట్లు వానరులు లంక నలువైపుల ముట్టడించిన పిమ్మట రాక్షసులు రావణు నింటికిఁ బోయి వానరులు లంక నన్ని వైపుల ముట్టడించిన విధమంతయుఁ దెలుపఁగా నతఁడు కోపించి యిదివరకుంచిన కాపుగాక మఱింత కాపు హెచ్చించి త్వరగా తన మేడ యెక్కి యడవులు కొండలు నన్నియు యుద్ధాసక్తులైన లెక్క లేని కపు లాక్రమించిన విధమును జూచెను.

తోదకము. ధరణిని మ్రింగఁగ ♦ దాఁకెను వీరిన్
దురమున నేగతిఁ ♦ ద్రుంతు నటంచు
న్గరమును జింత నొ ♦ నర్చుచు నాత్మన్
దిరుఁడయి వారలఁ ♦ దేఁకువఁ గాంచెన్. ౪౬౪

అర్థములు. తాఁకెను=కదియు - కరమును = మిక్కిలి - తిరుఁడయి = స్థైర్యము గలవాఁడయి-తేఁకువన్=ధైర్యముతో.

భూమినే మ్రింగునట్లు వచ్చియున్న వీరిని యుద్ధమునం దెట్లు చంపుదునా యని మిక్కిలి యాలోచించి స్థైర్యము గలవాఁడై వారలను ధైర్యముతోఁ జూచెను.

తోదకము, నజజయ గణములు-ఎనిమిదింట యతి, దీనికి తామరసమనియుఁ బేరు గలదు.

కం. భూవిభుఁడును సాలసమీ, పావని డాయంగ నరిగి ♦ యన్ని దెసల ర
క్షోవీరసమావృతమై, కావఁబడి పతాకమాలి♦కాచిత్రితమై. ౪౬౫

అర్థములు. సాల సమీపావనిన్=ప్రాకార సమీప ప్రదేశమును, పతాక మాలికా చిత్రితమై=ధ్వజముల వరుసలచే నలంకరింపఁబడినదై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి ప్రాకార సమీప ప్రదేశమునకుఁబోయి యన్నిప్రక్కల రాక్షసులచే నావరింపఁబడి, రక్షింపఁబడి, ధ్వజములచే నలంకరింపఁబడినదై.

ఉ. క్రాలెడిలంకఁ గాంచి జన ♦ క ప్రభుపుత్రిఁ దలంచి యాత్మలో
జాలి వహించి యయ్యొ మృగ ♦ శాబవిలోచన నానిమిత్తమై
చాలఁ గృశించి శోకమున ♦ స్థండిలశాయిని యై తపించెడిన్
హా! లలనామణీ! యనుచు ♦ నారటపాటునఁ దత్కృపాళుఁడున్. ౮౭౦

అర్థములు. మృగశాబవిలోచన = జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత, స్థండిలశాయిని=ఉత్త నేలఁ బండుకొనినది, తత్కృపాళుఁడున్ = ఆమెయందు దయగలవాఁడు, ఇట్లు చెప్పుటచే సీతాదేవి యందలి దయచే నామెను రక్షింపఁ గోరి రాక్షససంహారము చేయఁ బూనెనే కాని రాక్షసులయందలి ద్వేషబుద్ధిని గాదని భావము.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్"అని కదా భగవంతుఁడు కృష్ణమూర్తి బోధించెను.

తాత్పర్యము

ఒప్పుచున్న లంకఁజూచి సీతాదేవిని దలంచి మనస్సులో వ్యసనపడి యయ్యో జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత నా కొఱకుఁగా మిగుల శోకించుటచేఁ జిక్కి యుత్త నేలపైఁ బండుకొని బాధపడుచున్నదిగదా. హా స్త్రీరత్నమా యని యారటపడి యామెయందు దయగల వాఁడగు రామచంద్రమూర్తి.

—♦ శ్రీరాముఁడు లంకకోటకు లగ్గలు పట్ట వానరుల కనుజ్ఞ యిచ్చుట ♦—

ఉ. ధ్వంసము సేయుఁడీ సకల వైరుల ♦ నంచు ననుజ్ఞ నీయ బా
హాంసములందు భూజశిఖ ♦ రాళులఁ దాలిచి కీశసంఘముల్
శంసితభంగి గర్జల ది ♦ శావలయంబు విదారితంబుగా
మాంసభుగోఘమండలము ♦ మార్కొనె నుద్దవిడిన్ మహార్భటిన్. ౮౭౧

అర్థములు. బాహాంసము లందున్=భుజములయందు, మూపురములందు-భూజ శిఖరాళులన్ = చెట్లను గొండశిఖరములను ధరించి — శంసిత భంగిన్ = కీర్తింపఁదగిన విధముగ—విదారితంబుగాన్ = చీల్పఁబడినదిగా — మాంసభుక్ + ఓఘ+మండలము=రాక్షస సమూహముల గుంపును-ఉద్దవిడిన్ = విచ్చలవిడిగా-మహార్భటిన్=గొప్ప ధ్వనితో.

తాత్పర్యము

విరోధుల నందఱ నాశము చేయుఁడని యనుమతి యీయఁగా భుజములందు మూపురములందు చెట్లు గిరిశృంగములు ధరించినవారై వానరులుపొగడఁదగిన విధముగ దిక్చక్రము పగిలి పోవునట్లు సింహనాదములు చేయుచు కోయనిమొక్కసారిగ నందఱు కేక వేసి విచ్చలవిడిగా వారివారి కబ్బిన విధముగ రాక్షససేనా సమూహము నెదిరించెను.

చ. పిడికిటిపోటులం గుధర♦బృందముపాటుల లంక యంతయున్
బొడవు వడంగంగఁ జేయు తమిఁ ♦ బూని రఘుప్రియ కామితార్థమై
విడివడి జీవితాశ విడి♦వింశతిబాహుఁడు చూచు చుండఁగాఁ
గడిమిని లగ్గపట్టి ప్లవ♦గప్రముఖుల్ ద్రుమశైలకోటులన్. ౧౭౨

అర్థములు. కుధర బృందము = పర్వత సమూహము — పొడువు=గొప్పతనము—తమిన్ = ఆశచే —రఘు = రామచంద్రుని యొక్క — ప్రియకామితార్థమై=ఇష్టమైనకోరిక నెఱవేర్చు నిమిత్తము, విడివడి=స్వేచ్ఛగా, విడి = వదలి, కడిమిని=బలముచే.

తాత్పర్యము

ఒంటరిగాఁ జిక్కినవానిని పిడికిటిపోటులచేతను గుంపుగా నున్నవారిపైఁ బర్వత శిఖరములు వేసియు లంక సర్వము క్షీణదశకు వచ్చునట్లు చేయు నాశతో రాముని కిష్టమైన కార్యము చేయుటకై తెగఁబడి స్వేచ్ఛగా ప్రాణములమీఁది యాశవదలి రావణుఁడు చూచుచుండఁగనే బలాతిశయముచే లగ్గపట్టి వానరశ్రేష్ఠులు చెట్లు కొండలు గుంపులుగా.

సీ. ప్రాకారతోరణా♦రణ్యతలంబులఁ, జకాకుడి నిర్మల♦సలిలపూర్ణ
పరిఘులఁ దృణకాష్ఠ♦పర్వతాగ్రద్రుమ, భూపరాగంబులఁ ♦ బూడ్చి వైచి
లక్షలు కోటులు ♦ వృక్షచరాగ్రణుల్, కోట నారోహించి ♦ గోపురములఁ
గూలిచి ద్వారముల్ ♦ వ్రీలిచి కొమ్మలు, రాలిచి భయదగ ♦ర్జలను సించి
తే. యెగిరి దాఁటులు వైచుచు ♦ నెల్లవారు
జయము శ్రీరామవిభునకు ♦ జయము లక్ష్మ
ణునకు రాఘవపాలితుం ♦ డినజునకును
జయ మటంచును ఘోషింత్రు ♦ సంతసమున. ౧౭౩

అర్థములు. ప్రాకార తోరణారణ్యతలంబులన్=ప్రాకారములను ద్వారములను వనప్రదేశములను, చకాకుడి = నేలచదరము చేసి, నిర్మల సలిల పూర్ణ పరిఖలన్=తేటనీట నిండిన యగడ్తలను, తృణ = గడ్డి చేతను, కాష్ఠ = కట్టెల చేతను, పర్వతాగ్ర=కొండశిఖరముల చేతను, ద్రుమ = చెట్ల చేతను, భూపరాగంబులన్ = నేలఘాళిచేతమ, కొమ్మలు=కోటకొమ్మలు.

తాత్పర్యము

కోటగోడలను ద్వారములను వనభూములను నేల చదరముగ నాశము చేసి తేటనీరు గల యగడ్తలను, గడ్డి, కట్టెలు, శిఖరములు, చెట్లు దుమ్మువేసి పూడ్చి లక్షలు కోటులుగఁ గ్రోఁతులు కోటపై కెక్కి గోపురములను ద్వారములను విఱుగఁ దన్ని కోటకొమ్మలు విఱిచి సింహనాదములు చేయుచు యుద్ధము వచ్చినవానిని దాఁటి యెగిరి పోవుచు జయము శ్రీరామచంద్రమూర్తికి, జయము లక్ష్మణునకు,

రామచంద్రులచేరక్షింపఁబడు సుగ్రీవునకుజయమని సంతోషముతో నఱచుచుండిరి.

క. జాంబూనదతోరణములు, త్ర్యంబకగిరిశిఖరనిభము ♦ లగు గోపురముల్
డంబఱి రూపము మాయఁ జ,లంటున నొనరించి రపుడు♦లావరులు కపుల్. ౧౨౪

అర్థములు. జాంబూనద తోరణములు=బంగారు ద్వారములు, త్ర్యంబక గిరి=కైలాస పర్వతముయొక్క ♦ శిఖర నిభములు = శృంగముతో సమానములు, డంబు+అఱి=కాంతి చెడి, లావరులు=బలవంతులు.

తాత్పర్యము

బంగారు ద్వారములు కైలాసపర్వత శిఖరములవలెనెత్తైన గోపురములు కాంతిచెడి యాకారము కూడ లేకుండునట్లు బలవంతులగు కపులు చలపట్టి చేసిరి.

తే. వీరబాహుసుబాహువుల్ ♦ వీరవరుఁడు నలుఁడు ప్రాకారమును జుట్టి♦నాల్గుదెసల
ముట్టడిని గాచి యుండిరి♦మోహరమున, నింతలోపలఁ దక్కున ♦ వృక్షచరులు

అర్థములు. మోహరమునన్=వ్యూహమునందు.

తాత్పర్యము

వీరబాహువు సుబాహువు నలుఁడు నను వారు కోటచుట్టు నాలుగు ప్రక్కలఁ దిరుగుచు వానరులు తక్కువగా నున్నచోట మరలఁ గొంతమందిని నిలుపుచు ముట్టడి యుందు నందీయక వ్యూహము చెదరనీయక కాని యుండిరి. ఈ లోపలఁ దక్కున వానరులు.

సీ. తగినపద్ధతిని స్కంధా♦వారమును దీర్చి, కుముదుండు తూర్పునఁ♦గోటికపులు
ప్రఘసుండు పనసుండు ♦ బాసటగా నుండె; వింశతికోటులు♦వీరవరులు
దనకుఁ దోడ్పడి నిల్వ ♦ దక్షిణద్వారంబు, నెదుటను శతవలి ♦ భృశబలుండు
నఱువదికోటుల♦హరిచయంబులతోను, సుషేణుండు పడమటఁ♦జేరి నిలిచె

ఆ. రామచంద్రుఁ డుత్తరద్వా♦రమునఁ బన్నెఁ, దమ్మునితోడ సూర్య♦తనయుతోడఁ
గొండ్రముచ్చు లేలు♦క్రూరదర్శనుఁడు గ,వాక్షుఁ డుండె రాము♦నంతికమున.

అర్థములు. స్కంధావారమును=వ్యూహముగా సేనను నిలుపుటను.

తాత్పర్యము

అర్హమైన విధముగా వ్యూహముగా సేనను చక్కదిద్దుచుండిరి. తానీశాన్య దిశయందుండి కుముదుఁ డనువాఁడు కోటివానరులతో ప్రఘసుండు పనసుఁడు నను వారు తనకు సహాయులుగా తూర్పుగవని నరికట్టియుండెను. ఇరువది కోటుల వీరులు తనకు సహాయులుగా శతవలి యాగ్నేయ మందుండి దక్షిణ ద్వారంబు నరికట్టెను. అఱువదికోట్ల వానరులతో సుషేణుండు నైరృతినుండి పడమటి గవని నరికట్టెను. రామచంద్రమూర్తి లక్ష్మణునితో వాయవ్యదిశనుండు సుగ్రీవునితోనుత్తరద్వారము నరికట్టెను. కొండ్రముచ్చుల ప్రభువు గవాక్షుఁడు రాము సమీపమందుండెను.

తే. ఎలుగులకు ఱేఁడు ధూమ్రుండు ♦ ఋక్షకోటి
బలియ రాముని మఱియొక ♦ ప్రక్కఁ నిలిచె
సచివసహితంబుగా విభీ ♦ షణుఁడు గదను
దాల్చి నిలచెను రఘురాము ♦ దాపునందు. ౪౭౭

తాత్పర్యము స్పష్టము.

తే. గంధమాదనశరభులు ♦ గజగవాక్ష, గవయులును సెల్ల సేనకు ♦ గాపు గాఁగ
నన్నివంకల బరువెత్తి ♦ యరయుచుండి, రంతయునుజూచి రావణుం ♦ డాగ్రహించి.

తాత్పర్యము స్పష్టము.

ఇందు, జెప్పఁబడిన గవాక్షుఁడు వేఱొకరుఁడు.

—♦ రావణుఁడు రాక్షసుల యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిచ్చుట ♦—

సీ. పొండు రాక్షసులార ♦ భండనమున కన, నామాట వెలువడి ♦ నదియు లేదో
యార్పులు పెడబొబ్బ ♦ లట్టహాసంబులు, భీమనిర్ఘోషముల్ ♦ పెల్లు రేఁ గెఁ
జంద్రపాండురముఖ ♦ చర్మభేరులు హేమ కోణాహతములుగా ♦ ఘోష లెసఁగ
భూషితాసితతనుల్ ♦ పూరింప శంఖముల్, సబలాక చంచలా ♦ జలదచయము

ఆ. పగిదిఁ దోఁచె నిట్లు ♦ వారిధిపొంగిన, వడువు దోఁప సోఁకు ♦ దడముః లెదిరె
గవులు పేరుటులివు ♦ కందరప్రస్థపూ,ర్ణముగఁ దాఁకి వీఁక ♦ రణము సేయ. ౪౭౯

అర్థములు. భండనమునకు = యుద్ధమునకు—చంద్రపాండుర = చంద్రుని వలెఁ దెల్లనైన — ముఖ=ముఖములుగల — చర్మభేరులు = తోలు నగారాలు— హేమ కోణాహతములుగాన్=బంగారు కోదుపులతోఁ గొట్టఁబడినవై —ఘోషలు= ధ్వనులు—భూషిత+అసితతనుల్ = అలంకరింపఁబడిన నల్లని దేహములుగలవారు— సబలాక=కొక్కెరలతో—చంచలా = మెఱుపులతోను గూడిన-జలద చయము = మేఘసమూహము — పగిదిన్ = వలె-పొంగినవడువు = ఉప్పొంగిన విధము — సోఁకు దడములు = రాక్షససేనలు — పేరుటులివు = గొప్పధ్వని — కందరప్రస్థ పూర్ణము=గుహలందును జఱియ లందును నిండు నట్లుగా.

తాత్పర్యము

రావణుఁడు రాక్షసులారా యుద్ధమునకుఁ బొండు అని చెప్పఁగా నామాట నతనినోర వెలువడుటే యాలస్యముగా సింహనాదములు పెడబొబ్బలు భయంకర ధ్వనులు నతిశయించెను. చక్కఁగాఁ బదును చేయుటచేఁ జంద్రునివలెఁ దెల్లనైన ముఖములు గల తోలు నగారాలు బంగారు కోదుపులతోఁ గొట్టఁబడి ధ్వనించెను. అలంకరించుకొనిన నల్లనిదేహములుగల రాక్షసులు తెల్లని శంఖములు పూరింపఁగా నల్లనిమేఘముల తెల్లని కొంగలతో మెఱుపులతోనుఱుముచున్నట్లుండెను. సముద్రముపొంగి పొరలునట్లు రాక్షససేనలు వానరులపైఁబడెను. వానరుల పెద్ద ధ్వనులు గుహలందుఁ జఱియలందు నిండెను.

శా. ఘోరం బయ్యెను సంగరంబు కపిర♦క్షోనాథయూథాళి క
  య్యారే ప్రాక్తన దేవతాసురమహా♦భ్యామర్దనీ కాశమై
  వీరుల్ కీశవరుల్ నఖాయుధులు భూ♦భృద్గ్రావవృక్షాంకులై
  పోరన్ రక్కసు లుగ్రశూలపరిఘుం♦బుల్ శక్తులున్ వైవఁగన్. ౪౪౦

అర్థములు. కపిరక్షోనాథ యూథాళికిన్=కపినాథ=సుగ్రీవుని యొక్కయు, రక్షోనాథ=రావణుని యొక్కయు, యూథాళికిన్=సేనల సమూహమునకు అనఁగా వానర రాక్షస సేనలకు, ప్రాక్తన= పూర్వమందు జరిగిన, దేవతాసుర = దేవాసురులయొక్క, అభ్యామర్దనీకాశమై, = యుద్ధముతో సమానమై, నఖాయుధులు= గోళ్లాయుధములుగాఁ గలవారు, భూ భృత్+గ్రావ+వృక్షాంకులై = కొండలు శిఖరములు చెట్లు చిహ్నములుగాఁగలవారై, వారివారి శక్తికొలఁది నని భావము. ఉగ్ర=భయంకరములైన, శూలపరిఘుంబుల్=శూలములు, గుదియలు.

తాత్పర్యము

అప్పుడు పూర్వకాలమున దేవదానవులకు జరిగిన యుద్ధముతో సమానమై వానర రాక్షసులకు యుద్ధము జరిగెను. అందుగోళ్లాయుధములుగాఁగల వానరులు కొండలు శిఖరములు చెట్లు ధరించి యుద్ధము చేసిరి. రాక్షసులు శూలములు గుదియలు శక్తులు విసరివైచిరి.

సీ. తమతమ పేర్వాడి ♦ తరుచరనాయకుల్, జయ జయ సుగ్రీవ ♦ జయము రాజ
  యంచు ఘోషించుచు♦మించికోటకుఁబ్రాఁకి ప్రాకారముననున్న ♦ రాత్రిచరుల
  నఖములఁ గోఱల ♦ నగములఁ గుజముల, మర్దించి వధియించి♦ మహిఁ బడఁద్రోయ
  రక్కసుల్ చెలరేఁగి ♦ యుక్కున లగ్గెక్కి, వారిమీఁదను భిండి♦ పాలములను
ఆ. ఖడ్గశూలములను ♦ గడువడిఁ గురియంగ, లెక్క గొనక సాల మెక్కి కపులు
  కసిమసంగి పరులు ♦ కసిమసిగొనఁ బోర, రక్తమాంస పంక♦సిక్త మవని. ౪౪౧

అర్థములు. పేర్వాడి=పేరు+ వాడి = పేరుచెప్పి, నగములన్ = పర్వతములచేతను, కుజములన్=చెట్లచేతను, భిండిపాలములను = విడిచి వాటు గుదియయలను, రూ. భిందిపాలము, కసిమసంగి=విజృంభించి, పరులు=పగవారు, కసిమసి గొనన్=తోటుపాటుచెంద, రక్తమాంస పంకసిక్తము = నెత్తురు మాంసముతోనైన బురదతోఁ దడిసెను.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులు తమతమ పౌరుషములు ప్రకాశింపఁ జేయఁ దమ తమ పేర్లు చెప్పుకొనుచు జయజయ సుగ్రీవ, జయము వానరరాజ యని కేకలు వేయుచు కోట మీఁదికిఁబోయి యందున్న రాక్షసులను గోళ్ళచేతఁ గోఱలచేతఁ గొండలచేతఁ జెట్లచేత బఱికి కొఱికి కొట్టి చంపి క్రిందఁబడఁద్రోయ సాగిరి. రాక్షసులు చెలరేఁగి బలముచే లగ్గెక్కువారి మీఁద గుదియలు శూలములును ఖడ్గములు వేవేగఁ గురి

యింపసాగిరి. దానిని సరకు సేయక వానరులు ప్రాకారమెక్కి విజృంభించి శత్రువులు తికమకలాడునట్లు యుద్ధముసేయఁగా భూమి నెత్తురు మాంసములతోఁ దడిసి బురద యయ్యెను.

—• ౪౩-వ. సర్గము వానర రాక్షస ద్వంద్వ యుద్ధము •—

క. కాంచనశిరోగ్రభూషో, దంచద్వాహములు పావ • కాభధ్వజముల్
చంచత్కవచంబులు, రవి,సంచురథంబు లయి యమర • సైన్యము మెఱసెన్. ౪౪౨

అర్థములు. కాంచన = బంగారుమయమైన, శిరః+అగ్ర+భూషా = తల పైనుంచెడి యాభరణములచే, ఉదంచత్ = మిగుల ప్రకాశించు, వాహములు= గుఱ్ఱములు పావకాభధ్వజముల్=నిప్పువంటి టెక్కెములు, చంచత్కవచంబులు= మినమినలాడు కవచములు, రవిసంచు = సూర్యునివంటి.

తాత్పర్యము

బంగారుమయమై తలలమీఁద ధరింపఁబడిన భూషణములు గల గుఱ్ఱముల చేతను, నిప్పువలె ధగధగలాడు దండములు గల టెక్కెముల చేతను, మెఱుఁగు పెట్టుటచే మినమినలాఁడు కవచంబుల చేతను, సూర్యునివలెఁ బ్రకాశించు తేర్ల చేతను రాక్షససైన్యము ప్రకాశించెను.

తే. రావణజయార్థు లగుచును • రాక్షసులును, రామవిజయార్థులయి వాన • రప్రముఖులు
రోషముల దృష్టిభీకర • వేషములను, వీఁక దాఁకిరి గర్జలు • విన్ను దన్న. ౪౪౩

అర్థములు. దృష్టి భీకర=చూచుటకు భయంకరములైన—విన్నుదన్నన్= ఆకాశము దగులఁగా.

తాత్పర్యము స్పష్టము

సీ. సంకులసమర మీ • చందాన వర్తిల్లు, నెడ వాలిపుత్రుని • నింద్రజిత్తు
త్ర్యంబకు నంతకు • నట్లు మార్కొనిపోరె, సంపాతి దాఁకెఁ బ్రజం • ఘు నసుర
జంబుమాలి యెదిర్చె • నామీఁద మిత్రఘ్నుఁ డఱిమె విభీషణుఁ • నమితకోపుఁ
డపనుండు గజుఁడును • దాఁకొనిరి నికుంభు, నీలుండు గదిసెఁ బే • రాలమునను
తే. ప్రఘసుతోడను డీకొనెఁ • బ్లవగవిభుఁడు, లక్ష్మణుండు విరూపాక్షుఁ • లగువుపఱిచె
యజ్ఞకోపుఁడు సుప్తఘ్నుఁ • డగ్ని కేతు, రశ్మికేతులు దెంపున • రాముఁ దాఁక.

అర్థములు. సంకుల సమరము=దొమ్మి యుద్ధము, త్ర్యంబకున్=మూఁడు కన్నుల శివుని, అంతకునట్లు=యమునివలె; మార్కండేయుని నిమిత్తమై శివునితో యముఁడు యుద్ధము చేసినట్లు, పేరాలము=గొప్ప యుద్ధము, లగువుపఱిచెన్ = పరిభవించెను.

తాత్పర్యము

ఈ ప్రకారము దొమ్మియుద్ధము జరుగునపుడు యముఁడు శివునితోఁ బోరినట్లు ఇంద్రజిత్తు అంగదునితో యుద్ధము చేసెను. సంపాతి యనువాఁడు ప్రజంఘుఁ

డను రాక్షసుని. జంబుమాలి హనుమంతుని, మిత్రఘ్నుఁడు విభీషణుని, గజుఁడు తపనుని, నీలుఁడు నికుంభుని, సుగ్రీవుఁడు ప్రఘసుని నెదిరించి పోరిరి. లక్ష్మణుండు విరూపాక్షుని బరిభవించెను. యజ్ఞకోపుఁడు సుప్తఘ్నుఁడు అగ్ని కేతుఁడు రశ్మి కేతు వను వారలు రాముని దాఁకుటకై.

కం. కిట్టిరి మైందద్వివిదుల, నట్టెడన్ వజ్రముష్టి • యశనిప్రభుఁడున్
బెట్టెదిరించిరి నలుఁడుం, గొట్టెన్ బ్రతపనసమాఖ్యు • ఘోరాసురునిన్. ౮౮౬

అర్థములు. కిట్టిరి=సమీపించిరి.

తాత్పర్యము

మైందద్వివిదులను వజ్రముష్టి అశనిప్రభు లనువా రెదిర్చిరి. ప్రతపనుఁ డను ఘోర రాక్షసుని నలుఁడు పడఁగొట్టెను.

తే. ధర్మసుతుఁడు సుషేణుండు • దరలఁ దాఁకె, నమితబలుని విద్యున్మాలి • యనెడు వానిఁ
దక్కు వానరరాక్షసు • లక్కజముగ, బోరి రెదురైనవారితో • ఘోరముగను.

తాత్పర్యము

ధర్ముని కుమారుఁడగు సుషేణుఁడు మహాబలశాలి విద్యున్మాలిని నెదిరించెను. తక్కినవారు వారివారి కెదురైన వారితో నాశ్చర్యకరముగ యుద్ధము చేసిరి.

ఉ. ఈ విధి రోమహర్షమయి • యల్లెడ సంకుల సంగరంబుగా
వావిరి చెల్లఁ దద్ధరణి • బర్వెను గుంతలశాద్వలంబు ని
ర్జీవశరీరకాష్ఠము న • సృక్తటినీచయ, మట్టివేళ క్షో
భావహు వాలిసూనుని గ • దాహతి శక్రజితుండు నొంచినన్. ౮౮౭

అర్థములు. రోమహర్షము = గగుర్పాటు కలిగించునది, కుంతల శాద్వలంబు=వెంట్రుక లనెడి పచ్చిక గలది. నిర్జీవ శరీరకాష్ఠము=ప్రాణములేని దేహము లనెడి కట్టెలు గలది, అసృక్+తటినీ చయము = నెత్తుటి నదుల సమూహము, క్షోభావహున్=రాక్షస సేనయందు కలవరము కలిగించు వానిని, శక్రజితుండు = ఇంద్రజిత్తు, నొంచినన్=బాధింపఁగా.

తాత్పర్యము

ఈప్రకారము చూచువారికి గగ్గురుపొడుచునట్లు దొమ్మి యుద్ధము అన్ని ప్రక్కల జరుఁగగా నా యుద్ధభూమియందు వెంట్రుకలను పచ్చికగలదై, ప్రాణము లేని దేహము లను కట్టెలు గలదై, నెత్తురను నేళ్ళు వ్యాపించెను, ఆ సమయమున రాక్షస సేనను మిగులఁ గలవర పెట్టుచున్న యంగదుని నింద్రజిత్తు గదచేఁ గొట్టెను.

ఉ. పట్టఁగ రానికోపమున • వానిరథంబున దూఁకి చాపమున్
బట్టి విదల్చి దూరముగ • వైచి జవోద్ధతి సూతుమూర్ధమున్
జట్టుకుఁ బాపి గుఱ్ఱములు • సాల్పడి చావఁగ మోఁది తేరినిన్
నట్టన నగ్గనూచముగ • నేలఁ బడన్ విఱిచెం గపీంద్రుఁడున్. ౮౮౮

అర్థములు. జవోద్ధతి=వేగముయొక్క యతిశయము- మూర్ధము=తల-చట్టకున్=శరీరమునుండి, పంచమ్యర్థమున షష్ఠి, సాల్పడి = చాలుగఁబడి = వరుసగఁబడి - నెట్టన=అనివార్యముగ.

తాత్పర్యము

ఇంద్రజిత్తు తన్నిట్లు గదతోఁ గొట్టఁగా నంగదుడు పట్టరాని కోపము గలవాఁడై వాని తేరిమీఁదికి దూఁకి వాని వింటిని బట్టుకొని యీడ్చి విదలించి దూరముగఁ బాఱవైచి యతివేగముగ సారథి తలఁద్రుంచి గుఱ్ఱములు వరుసగ నేలఁబడఁ జావఁదన్ని యడ్డము లేనివాఁడై తేరిని బిండిపిండి చేసెను.

ఉ. శాతశరత్రయంబునఁ బ్రజంఘుఁడు దోర్బల మొప్పఁ గొట్ట సం
పాతియు నశ్వకర్ణకుజ పాతముననన్ వెస వాని నొంచెఁ బ్ర
స్ఫీతరథంబుపై నిలిచి పేరొకని కింకను జంబుమాలియున్
వాతతనూజువక్షమున బాఢసముజ్జ్వలశక్తిఁ జిమ్మినన్. ౧౪౯

అర్థములు. శాతశరత్రయంబునన్ = పదునైన మూఁడు బాణములచే - దోర్బలము=భుజబలము - అశ్వకర్ణకుజపాతమునన్ = ఇనుమద్దిచెట్టు వేయుటచే- ప్రస్ఫీత=గొప్ప.

తాత్పర్యము

ప్రజంఘుఁడు సంపాతి యుద్ధము చేయునపుడు ప్రజంఘుఁడు సంపాతిని పదునైన మూఁడు బాణములచే భుజబలముకొలఁది కొట్టఁగా నతఁడు ఇనుమద్దిచెట్టుతోఁ గొట్టెను. పెద్ద యుద్ధమునందుండి పేరు చెప్పి కోపముతో జంబుమాలి హనుమంతుని ఱొమ్మునకుఁ దగుల మిగులఁ బ్రకాశించు శక్తిని వేయఁగా.

ఉ. మారుతనందనుండు నస మానజవంబున మించుమాడ్కి నా
తేరున వ్రాలి చేతికోలఁ దిన్ సురవైరినిఁ జెట్టు పెట్టఁగాఁ
దేరును వాఁడు నొక్కత్రుటిఁ దీఱ, నలుం గని తీవ్రబాణసం
దారితగాత్రుఁ జేయుచును దద్దవడిం బయిఁ బాఱుతేరఁగన్. ౧౫౦

అర్థములు. మించుమాడ్కిన్ = మెఱుపువలె, పెట్టు పెట్టఁగాన్= దెబ్బకొట్టఁగా, తీవ్ర బాణ సందారిత గాత్రున్=తీక్ష్ణములైన బాణములచేఁ జీల్పఁబడిన దేహము గలవానినిగ తద్దవడిన్=మిగుల వేగముగ, పాఱుతేఱఁగన్ = పరువెత్తిరాఁగా.

తాత్పర్యము

ఆంజనేయుఁడు అసమాన వేగముచే మెఱుఁగు మెఱసినట్లు వాని తేరిమీఁదపడి చేతికోలఁది రాక్షసుని నొక్కదెబ్బ కొట్టఁగాఁ తేరు, వాఁడు కూడ నిమిషకాలములో జావఁగా నలునిఁజూచి తీక్ష్ణములైన బాణములచే దేహమును జీల్చుచు మిగుల వేగముతోఁ బయిపడఁ బరువెత్తి వచ్చువానిని.

కం. వానిని బ్రతపనుఁ గనుఁగొని, వానరవరుఁ డైన నలుఁడు • పై కుఱికి వెసన్
వాని కనుగ్రుడ్లు రెండు న,దీనజవంబునను బెఱికి • త్రెళ్ళఁగఁ జేసెన్. ౪౯౧

తాత్పర్యము

ప్రతపనుఁ డనువానిని జూచి నలుఁడు వానిపైకిఁ బరువెత్తి యతివేగమున వాని రెండు కనుగ్రుడ్లు పీకి చంపెను.

ఉ. చూపఱు బెగ్గడిల్లఁ బ్రఘ • సుండు కపిధ్వజినీచయంబుఁ బె
ల్లేపున మ్రింగున ట్లడర • వృక్షచరాధిపుఁ డుగ్రమూర్తియై
చేపడు సప్తపర్ణమున • శీర్షము వ్రయ్యలు గాఁగ మోఁదినన్
రూప మెఱుంగరాని గతిఁ•గ్రూరనిశాటుఁడు గూలె నేలపై. ౪౯౨

అర్థములు. చూపఱు = చూచువారు - బెగ్గడిల్లన్ = భయపడంగా - ధ్వజినీ = సేన - చేపడు = లభించిన - సప్తపర్ణమునన్ = ఏడాకుల యరఁటి చెట్లచే - వ్రయ్యలు=తునుకలు.

తాత్పర్యము

చూచువారు భయపడునట్లు ప్రఘసుఁ డను రాక్షసుఁడు వానరసేనను మ్రింగు వానివలెఁ బైపడి విజృంభింపఁగా సుగ్రీవుఁడు భయంకరాకారము వహించి సమీపమున నున్న యేడాకుల యరఁటి చెట్టుతో వానితల పగులఁ గొట్టఁగా నాకారము గుర్తింపరాని విధమున నాక్రూరరాక్షసుఁడు నేలపైఁబడెను.

కం. అక్షయశరములు రిపుహృ,దక్షోభముగాఁగఁ గురిసి • యాశుగ మొకటన్
రక్షోవరుడైన విరూ,పాక్షుని వెస లక్ష్మణుండు • హతుఁగావించెన్. ౪౯౩

అర్థములు. అక్షయ శరములు = మితిమీఱిన బాణములు - రిపు = శత్రువుల నొక్క- హృదయక్షోభము=గుండెలు కలఁత పఱుచునవి - ఆశుగము= బాణము.

తాత్పర్యము

లక్ష్మణుఁడు శత్రువుల గుండెలు గడగడ లాడునట్లు మితిమీఱిన బాణవర్షము గురియించి యొక్క బాణముతో విరూపాక్షునిఁ జంపెను.

తే. యజ్ఞకోపుఁడు సుప్తఘ్నుఁ • డగ్నికేతు
రశ్మికేతులు బాణప • రంపరలను
రాము నొప్పింపఁ గినుకమై • రయము మెరయ
నల్వురను నాల్గుశరముల • నఱికె నైచె.

అర్థములు. కినుక=కోపము, రయము=త్వర.

తాత్పర్యము స్పష్టము

చం. అడరెడి వజ్రముష్టిఁ గని యాగ్రహ • మారఁగ మైందుఁ డుగ్రుఁడై
పిడికిటఁ గ్రుమ్మ రాక్షసుఁడు • పృథ్విబడెన్ సరథుండు సాశ్వుఁడై

పిడుగడువంగఁ గూలు పుట♦భేదన సౌధ మనంగ, నీలునిం
గఁడు గఱకైన ములుకులను♦గ్రచ్చర గ్రచ్చె నికుంభుఁ డత్తఱిన్. ౪౯౫

అర్థములు. అడరెడి = విజృంభించెడి = పైపడెడి, సరథుండును = రథముతోఁ గూడినవాఁడై, నాశ్వుఁడై = గుఱ్ఱములతోఁగూడినవాఁడై, అడువంగన్ = కొట్టఁగా. పుటభేదన సౌధము = నగరమున మేడ.

తాత్పర్యము

పైబడి వచ్చుచున్న వజ్రముష్టిని జూచి కోపించి మైందుఁడు భయంకర మూర్తియై ముష్టిచే గ్రుద్దఁగా వాఁడు తేరితో గుఱ్ఱములతో పిడుగు తాఁకునఁ గూలు మేడవలె నేలఁబడెను. అప్పుడు నికుంభుఁ డనువాఁడు పదునైన బాణములచే నీలుని దేహమును జీల్చెను.

చం. రవి తన యంశుజాలముల ♦ గ్రమ్మఁగను గ్రమ్చు విధంబు దోఁప న
దివిజవిరోధి వెండియును దీ ♦ వ్ర శరంబుల క్షిప్రకారియై
తవులఁగ వైచి నవ్వినను ♦ దానవవైరి విధంబు దోఁపఁగాఁ
బ్లవగవరుం డమేయతర ♦ లాఘవ మూని తదీయసారథిన్. ౪౯౬

అర్థములు. రవి = సూర్యుఁడు. అంశుజాలములన్ = కిరణసమూహములచే. గ్రచ్చు = చీల్చు, దివిజ విరోధి = రాక్షసుఁడు, క్షిప్రకారి = వేగముగఁ బని చేయువాఁడు, దానవవైరి = విష్ణువుయొక్క, అమేయతరలాఘవము = అత్యంత వేగము.

తాత్పర్యము

సూర్యుఁడు తన కిరణములచే మబ్బును జీల్చునట్లు రాక్షసుఁడు మఱియు వేగవంతుఁడై తీవ్రములైన బాణములు తగులునట్లువేసి నవ్వఁగా విష్ణువువలె వానరుఁడు మిగుల వేగముతో వాని సారథిని.

ఉ. అతని తేరి చక్రమున ♦ నంతకు నంతికసీమ కన్చె, గ్రా
వాతతశృంగ మెత్తి ద్వివి ♦ దాఖ్యుఁడు వే యశనిప్రభాఖ్య వి
ఖ్యాతసురారి వైచియసు ♦ రౌఘము చూడఁగ ధారిణీరుహ
వ్రాతములోడఁ బైఁ గవియ ♦ రాక్షసుఁడున్ శితకాండపంక్తులన్. ౪౯౭

అర్థములు. అంతకు = యమునియొక్క, అంతికసీమకు = సమీపప్రదేశమునకు, గ్రావ = పర్వతముయొక్క, ఆతత శృంగము = విస్తారమైన శిఖరము, అసురౌఘము = రాక్షససమూహము. ధారిణీరుహ = చెట్లయొక్క, వ్రాతము తోడ = సమూహముతో, శితకాండపంక్తులన్ = పదునైన బాణసమూహములచే.

తాత్పర్యము

వాని తేరి చక్రము చేతనే చంపెను. ద్వివిదుఁడు పెద్ద శిఖరమెత్తి యశని ప్రభుఁడను రాక్షసు మీఁదవేసి రాక్షసులు చూచు చుండఁగా చెట్లను దీసికొని వానిపైఁ బడఁగా వాఁడు వాఁడి బాణముల వరుసలచే.

క. వృక్షముల నతికి యాతని, వక్షంబున నారసములు ♦ పఱఁగించిన నా
వృక్షాటుఁడు సాలంబున, రాక్షసతురగములఁ జంపె♦రథయుక్తముగన్. ౪౫౭

అర్థములు. నారసములు = బాణములు, వృక్షాటుఁడు = వానరుఁడు, ఆలంబున=యుద్ధమందు.

తాత్పర్యము స్పష్టము

సీ. అపుడు విద్యున్మాలి♦స్యందనారూఢుఁడై, కాంచనభూషిత ♦ కాండములను
వర్షించుచు సుషేణు ♦ బాధించి గర్జింపఁ, జివ్వున భూధర♦శృంగ మొండు
వైచి రథంబును ♦ భగ్నంబుఁ గావింపఁ; దటుకున నేలకు ♦ దాఁటి యతఁడు
గద కొని నిలఁబడఁ♦గనలి సుషేణుండు, బండ నొక్కటి నెత్తి♦పైకి నుఱుకఁ

ఆ. దలఁగ దాఁటియతఁడు♦తనగదతోఁ గ్రోఁతి,ఱొమ్ముసూటిచూచి♦క్రుమ్మటయును
సరకు సేయ కతఁడు♦సరగున నా బండ, వానివక్ష మగల♦వైచుటయును ౪౫౮

అర్థములు. స్యందనారూఢుఁడై= ఆరూఢ స్యందనుఁడై = తేరి నెక్కిన వాఁడై, సిద్ధాంతమునకుఁ బరనిపాతము, కాంచన భూషిత = బంగారుచే నలంకరింపఁబడిన, కాండములను=బాణములను, అగలన్=పగులునట్లు.

తాత్పర్యము

అప్పుడు విద్యున్మాలి యనువాఁడు తేరెక్కి బంగారుచే నలంకరింపఁబడిన బాణములను వర్షించుచు సుషేణు నొప్పించి సింహనాదము సేయగా నతఁడు కొండ శిఖరమును వేగముగఁ దీసికొని వానిపై వేసి వాని రథమును విఱిచెను. ఆ రాక్షసుఁడు తటాలున నేలపై దుమికి గద తీసికొని నిలఁబడఁగా సుషేణుండు బండ నొక్కటిఁదీసికొని పైకిఁ బరువెత్తఁగా వాఁడు తప్పించుకొని యావలికిఁ బోయి గదతో వానరుని ఱొమ్ము గుఱిచూచి వేయఁగా దానిని వాఁడు లక్ష్యము సేయక యాబండ వాని ఱొమ్ము పగులు నట్లు విసరి కొట్టెను.

క. ముద్ద యగుచు వక్షం బా.గద్దఱికాఁ డుర్విఁ గూలెఁ♦గపిసంతతు లీ
పద్దున సోఁకులమూఁకలఁ, దద్దయు నాకమున కనిచె ♦ ద్వంద్వరణమునన్.

అర్థములు. గద్దఱికాఁడు=దిట్టతనముగలవాఁడు = విద్యున్మాలి-సోఁకుల= రాక్షసులయొక్క; నాకమునకున్ = స్వర్గమునకు — ద్వంద్వరణమునన్ = దొమ్మి యుద్ధమందు.

ఱొమ్ము ముద్దకాఁగా నా శూరుఁడగు విద్యున్మాలి నేలఁబడెను.ఈవిధముగ వానరులు ద్వంద్వయుద్ధమున రాక్షసులఁ జంపిరి.

సీ. భగ్నంబులై గదా♦పట్టిసతోమర, ఖడ్గసాధనములు ♦ కలయ వ్రాలె
వివిధాకృతులు గాఁగ♦విధ్వస్తసైంధవ, సంఘంబు పఱచిన ♦ చంద మయ్యె
భిన్నదంతంబులు ♦ ఛిన్నశుండంబులై, భూరికుంజరములు ♦ ప్రోవు పడియె
నసురవానరులచ♦యంబులమేనుల, మొండెముల్ తుండెముల్♦దండిమీఱెఁ

ఆ. దునిఁగిపడిన నొగలు•దునిసిన కాఁడులు, విఱిగిపడిన కండ్ల•విసరములును
నవనినెల్ల నెఱసెఁ•నద్భుతరూపమై; వంచకముల కుత్స•వంబు గాఁగ. ౧౦౧

అర్థములు. భగ్నంబులై = విఱిగినవై - విధ్వస్త = నాశము చేయఁబడిన, సైంధవ సంఘము = గుఱ్ఱముల గుంపు - భిన్నదంతంబులు = విఱిగిన కొమ్ములు - ఛిన్నతుండంబులు = తెగిన తొండములు - భూరికుంజరములు = పెద్ద యేనుఁగులు - ప్రోవు = కుప్ప - పంచకములకు = నక్కలకు.

తాత్పర్యము

(రెండు పద్యములచే రణభూమి వర్ణింపఁబడుచున్నది.) విఱిగిన గదలు పట్టిసములు తోమరములు మొదలగు సాధనము లంతటఁబడియుండెను. నానాకారముగఁ జీల్పఁబడిన గుఱ్ఱములు పఱచినట్లుండెను. విఱిగిన దంతములు తునిఁగిన తొండములు గలవై పెద్ద యేనుఁగులు గుప్పలై పడియుండెను, వానర రాక్షసుల దేహముల తునకలు దండిగనై యుండెను. తేరులు, నొగలు, కాఁడులు, కండ్లు భూమి యందంతయుఁ బడి యుండెను, ఇట్లద్భుత రూపమై రణభూమి నక్కలకుఁ బండువుగా నుండెను.

కం. బంధురరక్షః ప్లవగక, బంధంబులు నాట్యమాడె • భయదంబుగ ద
ర్పాంధు లగు గపులతో గత,గంధులు రాక్షసులు పోరి•కడఁక దలిర్పన్ ౧౦౨

అర్థములు. బంధుర = విశేషించిన, కబంధములు = మొండెములు, గతగంధులు = గర్వము పోయినవారు, కడక = ప్రయత్నము.

తాత్పర్యము

రాక్షసులయు వానరులయు మొండెములు విశేషముగ భయంకరముగ నాట్యమాడెను. బలముచే గర్వించిన వానరులతో గర్వము దిగిన రాక్షసులు కష్టముతో యుద్ధము చేయుచు.

ఉ. మేనుల రక్తముల్ గురియ • మేకొనఁజాలక చివ్వకెప్పుడో
కో నిశ వచ్చునంచుఁ దమ•యుల్లములం దలపోయుచుండఁగా
భానుఁడు గ్రుంకెఁ గ్రోఁతులకుఁ•బ్రాణవినాశిని రాత్రి ధ్వాంతసం
తానము పర్వఁజేయుచును•దారసిలెం గను గానకుండఁగన్. ౧౦౩

అర్థములు. చివ్వకు = యుద్ధమునకు, మేకొనఁ జాలక = పూనలేక, నిశ = రాత్రి, ధ్వాంతసంతానము = చీఁకటులగుమి, ఈనాఁడు నవమి.

తాత్పర్యము

దేహములందు నెత్తురు కాఱుచుండఁగా యుద్ధమునకుఁ బూనుకొనలేక తమకు బలకరమైన రాత్రి యెప్పుడు వచ్చునా యని, మనస్సులోఁ దలఁచుచుండఁగా సూర్యుడస్తమించెను. క్రోఁతులకుఁ బ్రాణనాశకరమైన రాత్రి చీఁకట్లు వ్యాపింపఁ జేయుచు కన్నులు గానరాకుండునట్లు తటస్థించెను.

—♦ ౪౪ వ సర్గము. వానరరాక్షసుల రాత్రియుద్ధము ♦—

కం. ఆ పెంజీఁకటి యుద్ధ, వ్యాపారము జరగె బద్ధ ♦ వైరులకు బలో
ద్దీపకులగు కీశులకుం, బాపాత్మకులైన దుష్ట ♦ పలలాశులకున్. ౯౦౪

అర్థములు. పెంజీఁకటి=పెను చీఁకటి, గాఢాంధకారము. బద్ధవైరులకు = విరోధబుద్ధిచేఁ గట్టఁబడినవారు, బల+ఉద్దీపకులకు=బలముచేఁ బ్రకాశించువారు, ఇవి కీశులకు బలలాశులకు విశేషణములు, పలలాశులు=రాక్షసులు, రాత్రియందు నింద్రజిత్తు పాపకార్యము చేయఁబోవుచున్నాఁడు కావున పాపపురాక్షసులనఁబడిరి.

తాత్పర్యము

ఆ గాఢాంధకారమందు మనస్సులందుఁ బగ గలిగినట్టియు బలము గలట్టియు వానరులకు, దుష్టులై పాపకార్యములు చేయు రాక్షసులకు యుద్ధము జరిగెను.

శా. ఓరీ రాక్షస! పోకు పోకు మన నో ♦ హో కీశ! రా నమ్మునాఁ
గ్రూరుం జంపుము చంపు మం చనఁగ నా ♦ కూళుం దిగన్ మ్రింగునా
నోరీ పాఱెద విస్సిరో యనఁగ నో ♦ హో పోనఁ బోనిత్తునా
రారా నాఁగ వినంబడెన్ రవము లా♦రాత్రిన్ సమిద్ధారిణిన్. ౯౦౫

అర్థములు. సమిత్+ధారిణిన్=యుద్ధభూమియందు.

తాత్పర్యము స్పష్టము.

కం. నీలతనూకాంతులతోఁ, మేలిపసిఁడికత్తళముల ♦ మెఱుపులతో న
వ్వేళను వనౌషధులతోఁ, శైలేంద్రము లట్టు లసుర♦సంఘము వెలిఁగెన్. ౯౦౬

అర్థములు. నీల తనూ కాంతులతోన్=నల్లని దేహముల కాంతులతో, పసిఁడి కత్తళముల=బంగారు కవచముల వనౌషధులతో = అడవిమూలికలతో.

తాత్పర్యము

నల్లని దేహకాంతులు మంచి బంగారు కవచముల మెఱుపులు గలిగిన రాక్షసుల సమూహము అడవిమూలికలతోఁ గొండలవలెఁ బ్రకాశించుచుండెను. రాత్రులందుఁ గొన్ని మూలికలు ప్రకాశించుచుండును.

ఉ. ఆ నిబిడంపుఁజీఁకటిని ♦ నాశరకోటులు మ్రింగఁ జొచ్చె న
వ్వానరపాళిఁ, గ్రోతులును ♦ వారక శత్రుతురంగ దంతిసం
తానములం బతాకలను ♦ దక్షజసంఘముఁ దీక్ష్ణదంష్ట్రిలన్
బూనికఁ దున్కతున్కలుగఁ ♦ బోఁడిమి మాపిరి బెట్టిదంబుగన్. ౯౦౭

అర్థములు. నిబిడంబు=దట్టమైన, ఆశరకోటులు=రాక్షససమూహములు, శత్రు = విరోధుల, తురంగ = గుఱ్ఱములయు, దంతి = ఏనుగులయు, సంతానములన్=సమూహములను.

తాత్పర్యము

ఆ దట్టమైన చీఁకటియందు రాక్షససమూహములు వానరులను బట్టి మ్రింగ

నారంభించిరి. క్రోతులును శత్రువుల గుఱ్ఱములను ఏనుఁగులను టెక్కెములను ధ్వజములను కఱకు కోఱలచే తునుకలు తునుకలుగ చీల్చివైచుచుండిరి.

సీ. రామలక్ష్మణు లప్డు ♦ సామర్షచిత్తులై, శింజినీనాదంబు ♦ చెవుడు గొలుప
జడివాన గురిసిన♦వడువున బాణముల్, గురియించి యించుక♦గోచరించు
పరిపంథులను గత♦ప్రాణులుగాఁ జేయ. రక్కసుల్ పెనువీఁక♦రథముఁ బఱప
గుఱ్ఱాలగొరిజల♦కొట్టుల రేఁగిన,ధూళు లిల్వాఁగు నం♦ధులను జెవిటి

ఆ. వారిఁ జేసెఁ దచ్ఛ♦రీరంబులను గాఱు,నల్ల వెల్లి పాఱెఁ ♦ గొల్లగాఁగఁ
బణవశంఖ వేణు♦బహుళ భేరీనాద, ములును బర్వెదిక్కు♦లలము కొనఁగ. ౯౦౭

అర్థములు. సామర్ష చిత్తులై = కోపముతోఁగూడిన మనస్సుగలవారై - శింజినీ నాదంబు = అల్లెత్రాటిధ్వని — ఇంచుక గోచరించు = కొంచెమైనను గాన వచ్చు-ఇట్లు చెప్పుటచే చీఁకటి నలుపులో నల్లని రాక్షసులు గుర్తింపరాకుండి రని భావము-పరిపంథులను=పగవారిని - గతప్రాణులు = చచ్చినవారు - గొరిజల = గిట్టల-నల్ల=నెత్తురు — వెల్లి పాఱెన్ = ప్రవహించెను. పణవ=తప్పెట — వేణు = పిల్లఁగ్రోవి—అలముకొనఁగన్ = ఆక్రమించునట్లు.

తా త్ప ర్య ము

రాత్రులందు రాక్షసులకు బలమెక్కువ కావున వారు విజృంభించుట చూచి కోపించి రామలక్ష్మణులు అల్లెత్రాటిధ్వని చెవుడు గలిగింప మీటుచు, జడివాన వలె బాణములు గురియించి కొంచెమైన గుర్తింపఁ జాలిన రాక్షసుల వధించిరి. రాక్షసులును బరాక్రమించి రథములు తోలఁగా గుఱ్ఱాల గిట్టల దెబ్బలచే రేఁగిన దుమ్ము చెవులలో నిండి చెవిటివాండ్రను కన్నులలోఁబడి గ్రుడ్డివాండ్రను జేసెను. ఆ దేహముల నుండి నెత్తురు వెల్లువలై పాఱెను, తప్పెటల శంఖముల పిల్లఁగ్రోవుల పెద్దనగారాల ధ్వని దిక్కులందు వ్యాపించెను.

క. చచ్చెడిరక్షఃప్లవగుల, యుచ్చావచమైన యేడ్పు ♦ టులి వెల్లడెసన్
బెచ్చయ్యెఁ గఠోరంబుగ, నచ్చటులసమిద్ధరిత్రి ♦ యా సమయమునన్. ౯౧౯

అర్థములు. ఉచ్చావచము=అనేక విధములైన, 'ఉచ్చావచం నైక భేద' మ్మని యమరము. ఉలివు = ధ్వని, చటుల = ప్రాణులచేఁ జలించుచున్న, సమిత్ +ధరిత్రి=యుద్ధభూమి.

తా త్ప ర్య ము

చచ్చుచున్న రాక్షసులయు వానరులయు నానావిధములైన యేడుపు ధ్వనులు నన్ని ప్రదేశములఁ గటువుగ హెచ్చయ్యెను.

ఆ సమయమందు యుద్ధభూమి.

క. ఘోర రాక తెలియ రాకయుఁ, బురుశోణితమాంసపంక♦ముగ శరసూనో
త్కరసముపహార యయ్యెను, హరివరపలలాదసంఘు♦హారిణి యగుచున్. ౯౧౦

అర్థములు. చొరరాక = ప్రవేశించుటకు సాధ్యపడక, తెలియరాక = భూమి కనఁబడక, పురు = విస్తారముగు, శోణిత మాంస పంకముగన్= నెత్తురు మాంసము బురదగా, శర=బాణములనెడి, సూనోత్కర —పూలసమూహ మనెడి, సముపహార = బలులు గలది, హరివర—వానర శ్రేష్ఠులయు, పలలాద = రాక్షసులయు, ప్రాణ హారిణి=ప్రాణముల హరించునది.

తాత్పర్యము

ప్రవేశించుట కష్ట సాధ్యమై, చూచుట కష్టసాధ్యమై, అధికమైన నెత్తుటిచే మాంసముచే బురదయై బాణము లనెడి పూవులను బలులుగాఁ గలదై,

—♦ శ్రీరాముఁడు రాక్షసుల వధించుట ♦—

ఆ. పొలిచెఁ గాళరాత్రి♦పోలిక నారాత్రి యట్టిసమయమునను ♦ నసురవరులు
పిండు గట్టి నిశిత♦కాండముల్ గురియుచుఁ రాముఁ దాఁకి రుగ్ర♦రభసమునను.

అర్థములు. కాళరాత్రి=భీమరథి రాత్రి, 'రాత్రి ర్భీమరథిర్నామ సర్వ ప్రాణిభయావహా' యను వాక్య మిటఁ బ్రమాణము. (౨) కాళరాత్రియని యొకానొక శక్తి. 'సతీచ కాళరాత్రిశ్చభైరవీ గణనాయికా' యను వాక్య మీ యర్థమునఁ బ్రమాణము. పొలిచెన్=ప్రకాశించెను. పిండుగట్టి = గుంపుగూడి, ఉగ్రరభసమునన్=మిగుల వేగమున.

తాత్పర్యము

ఆ రాత్రి కాళరాత్రివలె నుండెను. ఆ సమయమున రాక్షసశ్రేష్ఠులు గుంపుగూడి మిగులవేగముగ వాఁడి బాణముల గురియించుచు రామచంద్ర మూర్తిని నెదిరించిరి.

క. వారలు కోపోద్రేకిత, నారావము పేర్మి నభము♦నగలించుచు దు
ర్వారత రానాగర్జలు, పారావారములు పొంగు♦భంగిగ నమ్యెన్. ౯౧౨

అర్థములు. కోపోద్రేకితన్ = కోపాతిశయమున — నభము = ఆకాశము— అగలించుచున్=వ్రక్కలు చేయుచు — దుర్వారతన్ = అడ్డములేక — పారావారములు=సముద్రములు.

తాత్పర్యము

కోపాతిశయముచే వారు తమ కంఠధ్వనులచే నాకాశమును బగులఁజేయుచు రాఁగా వారిసింహనాదములు సముద్రములు పొంగినవా యన్నట్లు తోఁపఁజేసెను.

ఉ. వారలరాకఁ జూచి రఘు♦వర్యుఁడు చాపము చంద్రమండలా
కారము గాఁగ జ్యారవము♦కర్ణపుటీ ప్రవిదారణంబుగా
నారసముల్ దెగం దొడిగి ♦ నల్వురనిద్దర నారిటన్ వడిన్
బోరగిలన్బడన్ నఱకె♦భూరిభుజుండు నిమేషమాత్రలోన్. ౯౧౩

అర్థములు. జ్యారవము = నారి ధ్వని - కర్ణపుటీ ప్రవిదారణంబుగా = దొప్పలవంటి చెవులు పగిలిపోవునట్లుగా-నారసముల్ = బాణములు - నారాచ శబ్దభవము. తెగన్ = అల్లెయందు - తొడిగి = సంధించి.

తాత్పర్యము

వారిట్లు వచ్చుట చూచి రామచంద్రమూర్తి విల్లు చంద్రమండలము వలె గుండ్రమగునట్లు వంచి యల్లెత్రాటిధ్వని చెవులను బగులఁజీల్పఁగా బాణములాఱు సంధించి యాఱుగురు రాక్షసులు బోరగిలఁబడి చచ్చునట్లు నిమిషకాలములో వారిని నఱకెను.

సీ. అంతట బోక ఖ♦రాంతకుం డెదిరిన, యమశత్రు దుర్ధర్షు♦నమితబలు మ
హాపార్శ్వుని మహోద♦రాఖ్యు మహాకాయు, వజ్రదంష్ట్రుని భీమ♦బాహులైన
శుకసారణులఁ గ్రూర♦వికట బాణంబులా,సారంబుగాఁ గప్పఁ♦ జావు దప్పి
పాఱి రంతట రామ♦బాణావలియు నిరా,ఘాటంబుగాఁ బాఱె♦సూటి చెడక

తే. యగ్ని శిఖలకుఁబురు డయి♦హాటకాంచి,తంబులగుచును రామనా♦మంబులొప్ప
విశిఖచయముల దశలెల్ల♦వెలుగఁజేసె, వహ్నిగతశలభాళినాఁ♦బరులుమడియ.

అర్థములు. నిరాఘాటంబుగా = అడ్డములేక, పురుడు = సమానము, హాటకాంచితంబులు = బంగారుచేఁ బ్రకాశించునవి, విశిఖచయములన్ = బాణసమూహములచేత, వహ్నిగత=మంటలోఁబడిన శలభాళినాన్ = మిడుతల గుంపో యనునట్లు - పరులు=శత్రువులు, మడియన్ = చావఁగా.

తాత్పర్యము

అంతతో వదలక రామచంద్రమూర్తి తన్నెదిరించిన యమశత్రువు దుర్ధర్షుఁడు మహాబలశాలియగు మహాపార్శ్వుఁడు మహోదరుఁడు వజ్రదంష్ట్రుఁడు భయంకరమైన చేతులుగల శుకసారణులనువారిని పదునైన బాణములచే వర్షము వలెఁ గప్పఁగా జావుఁదప్పించుకొనఁ బరువెత్తిరి. అంతట రామబాణము లడ్డము లేక గురిచెడక రాక్షసులపైఁ బోయెను. అగ్నిజ్వాలకు సమానములై బంగారుచేఁ బ్రకాశించునవియై రామ నామములు చెక్కఁబడినవైన బాణసమూహములు దిక్కులను బ్రకాశింపఁజేసెను. వానిలో రాక్షసులు మంటలోఁబడిన మిడుతలైరి.

ఉ. ఏపును గోపునుం గలసి ♦ యెంతయు వింతలు సంతరింపఁగాఁ
జూపును రూపునుం బెరసి ♦ సూదుల దాడుల గోడగింపఁగాఁ
ద్రోపును దాఁపు నేక మయి ♦ రోషము వేషము భీషణంబుగాఁ
గైపును సైఁపు లేమియు నొ♦కండుగ రాముఁడు చండమూర్తియై. ౨౫౫

అర్థములు. ఏపు=విజృంభణము - కోపు = వింటికొప్పు- సంతరింపఁగా= కలిగింపఁగా - తూపు = బాణము- బెరసి = కలసి - సూదుల = విరోధుల-దాడులన్=సైన్యములను - గోడగింపఁగాన్= బాధింపఁగా = తాఁపు=దెబ్బ, కైపు =

విజృంభణము-సైపుటేమియు; చండమూర్తియై=కోపముతోఁగూడిన యాకారము గలవాఁడై.

తాత్పర్యము

వింటికొప్పుయొక్క విజృంభణ మెంతో వింతగా నుండెను. అనఁగా బాణము లాగి నపుడు వంగుట విడిచినపుడు లేచుట, యిది యెప్పుడు వంగునో యెప్పుడు లేచునో తెలియరానంతటి వేగముగాఁ బనిచేయు చుండె నని భావము. దృష్టియు బాణము కలసి యనఁగా చూపు పడినచోట బాణము పడియుండునని భావము. శత్రువుల సేనను బాధింపఁగా బాణమువిడుచుట దెబ్బతగులుట యొక్కటయి రోషముతోఁ గూడిన వేషము, భయంకరముగా విజృంభణము, తొందరపాటు నొకటి కాఁగా రామచంద్రమూర్తి చంద్రుఁడై కానవచ్చెను.

క. ఒండు గుఱి సేయఁ దొడుగఁడు, రెండవబాణమును; నే శరీరికిసేనిన్
గాండము వెన్నునఁ దగులదు, బెండుగ వృథ వోవ దొక్క విశిఖంబేనిన్.

అర్థములు. తొడుగఁడు=సంధింపఁడు - కాండము = బాణము - వెన్నునన్=వీఁపునందు-బెండుగన్=నిస్సారముగ-విశిఖము=బాణము.

తాత్పర్యము

ఒక్క గుఱి భేదించుట కొక్క బాణమేకాని రెండవ బాణము సంధింపఁడు-ఏదేహికైనను బాణము వీఁపున నాటదు- గుఱితప్పిపోయిన బాణముగాని, పగిలి వ్యర్థముగఁబోయిన బాణముగాని లేదు.

వెన్నిచ్చినవానిని రామబాణము విష్ణుచక్రము చంపవు. కావుననే కాకాసురుఁడు, దుర్వాసుఁడు పరువెత్తునపుడు కూడఁబోయి తఱిమెను గాని తగులలేదు.

తే. కనకపుంఖవిరాజిత కాండతతులు, వేనవేలుగ నెల్లెడ వెడలి పఱవఁ
బొలిచె రాతిరి మిణుఁగురు పురుగుగముల, రహి దహించిన శారద రాత్రికరణి.

అర్థములు. కనక పుంఖ విరాజిత = బంగారు పింజలచేఁ బ్రకాశించు, కాండతతులు = బాణసమూహములు.

తాత్పర్యము

బంగారుపింజలచేఁ బ్రకాశించు బాణసమూహములు వేలకొలఁదిగ నన్ని ప్రదేశములందు వ్యాపింపఁగా నారాత్రి మిణుఁగురు పురుగులచే వ్యాపించిన శరత్కాల రాత్రివలె నుండెనని భావము.

క. క్రూరాసురగర్జనముల, భూరుహచరసంచయప్రభూతరవములన్
ఘోరం బగు నా యామిన, ఘోరతరం బయ్యె నపుడు గుండెలు పగులన్.

అర్థములు. భూరుహచర=వానరులయొక్క, సంచయ = సమూహముల యొక్క, ప్రభూతరవములన్ = అధిక ధ్వనులచే.

తా త్ప ర్య ము

గాఢాంధకారము క్రమ్ముటచేతనే భయంకరమైన యా రాత్రి, రాక్షసుల క్రూరగర్జల చేతను వానరుల విస్తార ధ్వనుల చేతను, మఱింత భయంకరమై గుండెలు పగిలించు చుండెను.

తే. ధ్వాంతసీకాశ నిజతనూ♦కాంతు లెసఁగు
కొండముచ్చులు తమరొదల్ ♦ కొండ నిండ
దాపరించిన రక్కసు♦దాఁటుఁ బట్టి
పట్టు వదలక భక్షించి ♦ వైచె నపుడు. ౯౧౯

అర్థములు. ధ్వాంతసీకాశ=చీఁకటితో సమానమైన, నిజతనూకాంతులు= తమ దేహకాంతులు, రక్కసుదాఁటున్=రాక్షససమూహమును.

తా త్ప ర్య ము

చీఁకటితో సమానమైన తమ నల్లని దేహకాంతు లతిశయింపగా కొండ ముచ్చులు తమ ధ్వనులు త్రికూట పర్వతము నిండునట్లు చేయుచును, దొరకిన రాక్షసులను బట్టి వదలక తినుచుండెను.

—♦ ఇంద్రజిత్తంగదుచేఁ బరాజితుఁ డయి మాయాయుద్ధ మొనర్చుట ♦—

చ. ప్లవగులయేటు రాక్షసుల ♦ పాటు నరేంద్రులపోటు చూచి యా
దివిజధవారి రావణి మ♦దిం గనరెత్తి విలాసవిక్రమం
బవితథమై చెలంగఁ గుధ♦రాటులపైఁ గవియంగఁ దోడుతో
లివమెయి వాలిసూనుఁ డవ♦లీలను వాని హతాశ్వుఁ జేయుచున్. ౯౨౦

అర్థములు. ఏటు=దెబ్బ, ఇచ్చట దెబ్బ కొట్టెడి పరాక్రమ మని యర్థము. పాటు = నాశము, పోటు = శౌర్యము, దివిజధవారి = ఇంద్రజిత్తు, కనరెత్తి = కోపించి, అవితథమై=వ్యర్థము గానిదై, కుధరాటులపై= వానరులమీఁద, తోడు తోన్ = వెంటనే, లివమెయిన్ = అధిక లాఘవముతో, అవలీలను=అనాయాస ముగా, హతాశ్వున్ = చచ్చిన గుఱ్ఱములు గలవానిఁగా, ౯౨౨ వ పద్యమునఁ జెప్పఁబడిన దాని శేష ముపక్రమించుట గాని, వేఱొక రథము సిద్ధము చేసికొని మఱల వచ్చెనని కాని యెంచనగు.

తా త్ప ర్య ము

వానరుల పరాక్రమము రాక్షసుల నాశము రామలక్ష్మణులశౌర్యముఁజూచి యింద్రజిత్తు కోపించి తన పరాక్రమము సార్థకమగునట్లు వానరులపై గవిసెను. వాని వెంటనే యంగదుఁ డతిలాఘవముతో ననాయాసముగా వాని గుఱ్ఱములను జంపి.

కం. సారథిని జంపి రావణి, తీ రిదిగా దనుచుఁ దేరు♦దిగ దాఁటుచు మా
యారంభుండై మఱఁగిన, వీరునిఁ దారేయుఁ బొగడె♦విబుధర్షితతుల్. ౯౨౧

అర్థములు. మాయారంభుఁడు=మోసవిద్యయందుఁ దనకుఁగల యద్భుత శక్తిని జూపనారంభించినవాఁడై, మఱఁగినన్ = కానరాకపోఁగా, తారేయున్ = అంగదుని, విభుధర్షితతుల్ = దేవఋషులసమూహములు.

తాత్పర్యము

సారథిని జంపఁగా నింద్రజిత్తు ప్రత్యక్షయుద్ధమున వీరిని జయింప సాధ్యము గాదని తలంచి తేరుదిగి వంచనయందు దనశక్తిఁ జూపఁ దలఁచిన వాఁడై కానరాక పోఁగా వీరుఁడగు నంగదుని దేవర్షి సంఘంబులు పొగడెను.

కం. ధీరుం డని మాయాజి వి,శారదుఁడని ప్రధనమున న•జయ్యుండని శ
క్రారిని జగమెఱుఁగుట న, వ్వీరుని నోడుచుటకును మెచ్చె•విశ్వము కీశున్.

అర్థములు. మాయాజిన్ = మాయాయుద్ధమందు, విశారదుఁడు = పండితుఁడు, ప్రధనమునన్=యుద్ధమందు; అజయ్యుండని=గెలువ శక్యముకానివాఁడని, ఓడుచుటకున్=ఓడించుటకు - విశ్వము = ప్రపంచము.

తాత్పర్యము

ఇంద్రజిత్తు మహాధైర్యశాలి యని మాయాయుద్ధమందు సమర్థుఁడని యుద్ధమున జయింపరాని వాఁడని లోకమునకుఁ దెలియును గావున నట్టివాని నోడించుట చేత లోక మంగదుని మెచ్చెను.

ఉ. మెచ్చిరి రామలక్ష్మణులు • మే లని ఋక్షరాజుఁడున్ విభీషణుం
డిచ్చ దలిర్ప నిట్లు ప్లవ•గేశుని తాఁకున కోహటించి లో
మచ్చర మెచ్చ రక్షసుఁడు•మాయను గైకొని కానరాక కీ
శోచ్చయమున్ నిశాతవిశి•ఖోత్కరముం గురియించి యేఁచినన్. ౯_౩౩

అర్థములు. ఓహటించి=వెనుదీసి-ఇచ్చదలిర్పన్ = సంతోషమతిశయింపఁగా-కీశోచ్చయమున్ = వానర సమూహమును - నిశాత విశిఖోత్కరమున్ = పదునైన బాణముల సమూహమును - ఏఁచినన్=బాధింపఁగాఁ.

తాత్పర్యము

అంగదుఁడు చేసిన కార్యముఁ జూచి రామలక్ష్మణులు మెచ్చుకొనిరి. సుగ్రీవుఁడు విభీషణుఁడు మేలుమేలని మిగుల సంతోషించిరి. ఇట్లు లంగదుని దెబ్బకు వెనుదీసి యింద్రజిత్తు మాత్సర్య మతిశయింపఁగా పరులకుఁ గానరాకుండఁజేయు తిరస్కరణీవిద్య నాశ్రయించి యెవరికిఁ గనఁబడక వాఁడి బాణసమూహములచే వానరులను బాధింపఁగా.

ఉ. అయ్యెడ రామచంద్రుఁడు ప•వాటసమూహములార! వీఁడు రే
కయ్యమునం దసాధ్యుఁడు, జ•గత్త్రియముం బరిపీడితంబుగా
న య్యజదత్తదుర్వర బ•లాధికతం జలుపంగఁ జాలు, నా
కియ్యెడ బ్రహ్మవాక్య క్షమి•యింపఁగ నర్హము గాన మీరలున్. ౯_౩౪

అర్థములు. వనాట=వానరుల, రేకయ్యమునందు = రాత్రి యుద్ధమునందు, అజదత్త = బ్రహ్మచే నీయఁబడిన, దుర్వారబలాధికతన్ = చెడ్డవరముల బలము యొక్క యతిశయముచే.

తాత్పర్యము

అప్పుడు రామచంద్రమూర్తి యిటనియె. వానరులారా! వీఁడు రాత్రి యుద్ధమం దసాధ్యుఁడు. బ్రహ్మ యిచ్చిన దుష్టవరముల బలమున మూఁడు లోకములను బాధింప సమర్థుఁడు. ఏమి రామచంద్రా! నీకసాధ్యమైనది కలదా యందురేమో? నేను బ్రహ్మమాటను వ్యర్థము చేయరాదు. గౌరవింపవలెను. నేను గౌరవింపక వ్యర్థము చేసితినేని నతఁడు అసత్యమాడినవాఁడగును. తరువాత నాయనను దలఁచువాఁడే యుండఁడు. అట్టిస్థితి నతనికిఁ దేరాదు. కావున నేను లోపడియుండవలసి యున్నది. సర్వమాయలను నాశనముచేయు బ్రహ్మాస్త్రము, బ్రహ్మశిరోనామకాస్త్రము, నారాయణాస్త్రము లోనైన మహాస్త్రములు రామచంద్రునొద్దఁ గలవు. కాని వానిని బ్రయోగించిన నింద్రజిత్తప్పుడే చచ్చునుగాని బ్రహ్మమాట వ్యర్థమగును. ఇంద్రజిత్తు ప్రథమ యుద్ధమునందు నతని బాణములు బ్రహ్మాస్త్రమంత్రమెఱింగిన హనుమద్విభీషణుల బాధింపవయ్యె. ఆమంత్రము రామలక్ష్మణు లెఱుఁగుదురు. బ్రహ్మనిమిత్తమై కట్టుపడవలసివచ్చెను. యమ రావణ యుద్ధమునందు బ్రహ్మ కిటువంటి కష్టమే వచ్చెను. యముని దండ మమోఘముగ బ్రహ్మయే చేసెను. దేవతలచేఁ జావకుండ రావణునకు వరమిచ్చెను యముఁడు రావణునిపై దండమువైవ నెత్తెను. రావణుఁడు దానితోఁ జచ్చినను చావకున్నను బ్రహ్మమాట వ్యర్థమగును. కావున బ్రహ్మ ప్రార్థింపఁగా యముఁడు యుద్ధము చాలించి పోయెను. బ్రహ్మరుద్రులిట్టు లనాలోచితవరములిచ్చుచుందురు. రామచంద్రమూర్తి భృగువు గౌరవము దక్కింప భార్యావియోగము సహించెను. బ్రహ్మ పరువు కాపాడ నాగపాశబద్ధుఁడయ్యెను. తండ్రిమాట కాపాడుటకై కదా వనములపాలాయెను. ఇది గదా మహాపురుష లక్షణము.

కం. సుగ్రీవునికడ నిలఁబడి, జాగ్రద్దశనుండుఁ డనియె • శతమన్యుజితుం
డాగ్రహమున నంతర్హిత, విగ్రహుఁడై మింటి కెగసి • విశ్వభయదుఁడై. ౯ ౨౫

అర్థములు. శతమన్యుజితుండు = ఇంద్రజితుఁడు, నిషాంతమునఁ బరనిపాతము, జితశతమన్యుఁ డని యర్థము. ఆగ్రహమునన్ = కోపముతో, అంతర్హితవిగ్రహుఁడై = మఱుఁగుపడిన శరీరము గలవాఁడై, విశ్వభయదుఁడై = అందఱకు భయము కలిగించువాఁడై.

తాత్పర్యము

సుగ్రీవునొద్ద నిలఁబడి హెచ్చరికతో నుండుఁడని చెప్పెను. ఇంతలో నింద్రజిత్తు కోపముచే రామ వానరనాశమం దభినివేశము గలవాఁడై యంతర్ధానవిద్యచేఁ గానరానివాఁడై యాకాశమున కెగసి యందఱకు భయము కలిగించువాఁడై.

చం. పిడుగులపిండుపాటు దలఁ ♦ పింపఁగ శాతశరోత్కరంబులన్
జడిగొనఁ గీశసంఘముల ♦ సైన్యముపైఁ గురియింప వారలున్
జడిమయు ఱిచ్చపాటు కడు ♦ సంభ్రమపాటును బొంది దిగ్భ్రమన్
వడి చెడి తూలి సోలి యిలి ♦ వ్రాలి యడంగి మడంగి రెంతయున్. ౯౨

అర్థములు. పిడుగుల పిండుపాటు = పిడుగుల సమూహము పడుటను, తలఁపింపఁగన్=తలఁపునకుఁ దెచ్చునట్లు, శాత = పదునైన,శరోత్కరంబులన్ = బాణసమూహములను, జడిమయు=జడమువలె నేమియుఁ దెలియకపోవుట, ఱిచ్చపాటు=నిశ్చేష్టత, సంభ్రమపాటు=భయము, వడి = వేగము, తూలి = చలించి, సోలి = పరవశులై, వ్రాలి = పడి, మడంగిరి = కాళ్ళు చేతులు ముడుచుకొనిన వారైరి.

తాత్పర్యము

పిడుగులగుంపు పడుటను స్మృతికిఁ దెచ్చునట్టి వాఁడి బాణముల సమూహమును జడివానవలె వానరసేనపైఁ గురియింపఁగా వారు మొద్దుపారినవారై నిశ్చేష్టులై భయపడి దిక్కు తెలియక వేగము చెడి నిలిచి వెనుకకు ముందునకు నూఁగి పరవశులై నేలఁబడి యణఁగి కాళ్ళు సేతులు ముడుచుకొని యుండిరి.

ఉ. ఏరికిఁ జూడ రాక తన♦యెచ్చటియున్కియుఁ దోఁపనీక పెం
పార భయంకరాహివిశి♦ఖావళి రాము సుమిత్రనందనున్
బీరము దీఱ బాణచయ♦విద్ధసమస్తశరీరభాగులం
గా రయమారఁ జేసె దశ♦కంఠతనూజుఁ డతుల్యతీవ్రతన్. ౯౩

అర్థములు. భయంకరాహి విశిఖావళి = భయంకరములైన పాముల యొక్క యాకారములు గల బాణసమూహము, ఇవి కేవలము బాణములుకావు పాములుకావు. బాణములు పాములవలెఁ జుట్టుకొనఁజాలవు. పాములు చుట్టుకొనిన దేహబాధలేదు. ఇవి పాములవలెఁ జుట్టుకొనును. బాణములవలె బాధించును. సర్పములందు నస్త్రమంత్రము లావహింపఁ జేసెనని చెప్పనగు. కావుననే గరుత్మంతునిఁ జూడఁగానే యవి పరువెత్తెను. చూ. ౧౦౪౭ పద్యము. అచేతన బాణములందు మంత్రము లావహింపఁజేసిన యెడల నవి పరువెత్తి పోఁజాలవు-కావున నాగాస్త్రమంత్రముచేఁ బాణములనే సృష్టించి వానిచే మంత్రశక్తిచేతఁ గట్టివైచెను. బీరము దీఱన్=పౌరుషము క్షయించునట్లు. బాణచయ=బాణసమూహములచే, విద్ధ=బాధింపఁబడిన, సమస్త శరీరభాగులన్=దేహమునందలి యన్ని భాగములు కలవారలను, అతుల్య తీవ్రతన్=అసమానమైన తీక్ష్ణత్వముచే.

తాత్పర్యము

ఎవరైనను జూచుటకు సాధ్యపడక తానెక్కడ నుండునదియుఁ దెలియనీక విజృంభించి యింద్రజిత్తు భయంకరములైన పాముల యాకారము, గుణములు గల

బాణసమూహముచే వారి పౌరుషము చెడునట్లు రామలక్ష్మణుల సర్వావయవము లను మిగుల వేగముగ బాధించెను.

చం. కదనతలంబునం దభిము • ఖంబుగ నిల్చి నృపాలపుత్రులన్
మద మణఁగింపలేమి సుర • మర్దనుఁ డయ్యెడ మాయ పెంపునన్
జిదుమఁగ నెంచి వృక్షచర • శేఖరు లెల్లను జూచుచుండ న
వ్విదితపరాక్రముండు గడ • వెన్ శరబద్ధులఁ జేయ వారలన్. ౯ ౨౮

అర్థములు. ఇంద్రజిత్తు మాయ నాశ్రయింపఁ గారణము చెప్పఁబడు చున్నది. అభిముఖంబుగన్=ఎదురుగ- చిదుమఁగన్ = ఖండింపఁగా, విదిత పరాక్రముఁడు = ప్రసిద్ధి కెక్కిన పరాక్రమము గలవాఁడు, కడవెన్ - కడఁగెన్ = ప్రయత్నించెను-శరబద్ధులన్=బాణములచేఁ గట్టఁబడిన వారిని.

తాత్పర్యము

యుద్ధభూమియందు దెనుకగనిల్చి యుద్ధముచేసి రామలక్ష్మణుల జయింప సాధ్యముగాదని తెలిసికొని మాయచేత వారిని ఖండింపనెంచి ప్రసిద్ధపరాక్రము డయ్యును వానరులందఱుఁ జూచుచుండ వానినిబాణములచేఁగట్టివేయ యత్నించెను.

-• ౪౫-వ సర్గము. ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁజేయుట •-

ఉ. ఎందును దానయై, యునికి • యేమియుఁ గానఁగ రాక, మాయ మి
న్నంది పరాక్రమించు నసు • రాధిపనందను రోయ వృత్రహా
నందననందనుం ద్రుహిణ • నందను నీలు సుషేణపుత్రులన్
వందితవిక్రమున్ శరభ • వానరునిన్ ఋషభాఖ్యు వెండియున్. ౯ ౨౯

అర్థములు. ఎందును దానయై = ఇది భగవంతుని సర్వవ్యాపకత్వము వంటిది కాదు. కొఱవిని త్రిప్పినట్లని యెంచవలయును, అతివేగముగఁ గొఱవిని త్రిప్పితిమేని నిప్పు చక్రమే కానవచ్చును. ఇది గమనవేగమును దెలుపును. మాయ=అంతర్ధాన విద్యాబలముచే - మిన్నంది=ఆకాశమున నిలిచి - వృత్రహా నందన నందనున్ = వాలికుమారుఁ డగు నంగదుని-ద్రుహిణ నందను = జాంబవంతుని.

తాత్పర్యము

ఏ ప్రక్కఁజూచిన నాప్రక్కఁ దానున్నట్లు దోఁపజేయుచు తిరస్కరిణీవిద్యా బలముచే నెవరికిని గానరాక యాకాశమందుండి పరాక్రమము చూపు నింద్ర జిత్తును వెదకుటకు నింద్రునిమనుమని నంగదుని, బ్రహ్మ కొడుకు జాంబవంతుని, నీలుని, సుషేణ పుత్రులను, నందఱచే నమస్కరింపఁబడిన పరాక్రమము గల శరభుని, ఋషభుని మఱియు.

కం. వినతుని సానుప్రస్థుని, ఘను ఋషభస్కంధుఁ బంప • త్ర్యంబకగిరిసా
ధనులై మింటను నల్గడఁ, బనిగొని నెమకంగ నింద్ర • వైరియుఁ గడిమిన్. ౯ ౩౦

తాత్పర్యము

వినతుని, సానుప్రస్థుని, ఋషభస్కంధుని పంపఁగా వారు చెట్లు కొండలు సాధనములుగాఁ దీసికొని యాకాశమునందు నాలుగు ప్రక్కలఁ బనిపూని వెదఁకగా నింద్రజిత్తు బలముచే.

కం. ఱెక్కలుగల పెనుఁబాముల, మొక్కలమున ఱివ్వటన్న ♦ మ్రోఁతయె బుసగా
నొక్కవడి బాణజాలం, బక్కపితతి దిమ్మఁదిరుగ ♦ నడరించి మఱిన్. ౬౩౧

అర్థములు. మొక్కలమునన్ = బలముతో, ఒక్కవడిన్=ఒక్కసారిగ, దిమ్మఁదిరుగన్ = భ్రమపడునట్లు.

తాత్పర్యము

ఱెక్కలుగల పెద్దపాముల బలముతో ఱివ్వని మ్రోయు బాణముల మ్రోఁతయే పాముల బుసగా నొక్కసారిగ నసమాన వేగముతో బాణముల సమూహమును వానరుల సమూహము మీఁద వారు దిక్కు తెలియక భ్రమ గొనునట్లు ప్రయోగించి మఱియును.

కం. పరమాస్త్రంబుల వారల, త్వరయును గమనంబు నాఁప ♦ వనచరవీరుల్
పరికింపరైరి యాతనిఁ, బర పగు నాగడప లఱుమ ♦ భాస్కరు ననఁగన్. ౬౩౨

అర్థములు. పరపు + అగు = విశాలముగ వ్యాపించిన - ఆగడపలు = మబ్బుల గుంపులు-ఇది నిత్యబహువచనాంతము-అఱుమన్=ఆక్రమింపఁగా.

తాత్పర్యము

ఉత్తబాణముల చేతనే కాక మహాస్త్రముల చేతను వారల వేగము సంచారము నణఁపఁగా వారు పనుగురు విశాలమేఘములగుంపు క్రమ్మిన సూర్యునివలెఁ జూడలేక పోయిరి.

చ. తెఱపి యొకింత యిచ్చినను ♦ దెప్పిఱిరేనియు వీరిమ్రోలఁ గ్ర
మ్మఱ నిలఁగా నశక్య మని ♦ మానవరాజకుమారవీరులన్
గఱుకుఁగసిండికోఁతలఁ ఖ ♦ గమ్ములు మేనులు నిండ దండిగా
విఱుగడలేక యయ్యసుర ♦ వీరుఁడు నైచె సకోపచిత్తుఁడై. ౬౩౩

అర్థములు. తెఱపి = అవకాశము-సందు-తెప్పిఱిరి + ఏనియు = తెప్పఱిల్లుకొన్న యెడల - అపాయము నుండి తప్పించుకొన్న యెడల - కఱుకు = తీక్ష్ణమైన-కసిండి=కఠినమైన-శబ్దరత్నాకరమున నీ శబ్దము నిర్బిందుకముగాను, అల్పమని యర్థమనియు వ్రాయఁబడినది. కాని వరాహ పురాణము పంచమాశ్వాసము ౬౩ వ పద్యమున పూర్ణానుస్వారముతోఁ బ్రయుక్తమగుటచే సబిందుక మనియు నర్థ మనల్పమనియుఁ దోఁచుచున్నది.

"తండ్రీ సాకెకు అవ్వ నాగ్రహముమీఁదం గన్నదే గాతిగా
గుండ్రాలం గొని దాయగాక యిది నాకుం దల్లియే యెన్నఁడున్.

వీంద్రం జూచిన జాడ నన్ను యమునన్ వీక్షింప దంతంతకున్
బింద్రంబయ్యెఁగసిండి కోఁత వలదా మీకు న్విచారింపఁగన్."

ఖగమ్ములు=బాణములు; విఱుగడ=విరామము.

తాత్పర్యము

ఏమాత్రము కొంచెమైన వీరికి మార్పు పుచ్చుకొన నవకాశ మిచ్చినను నీ యపాయమునుండి తప్పించుకొని రా మరల వీరి యెదుట నిలువసాధ్యము గాదు అని తలఁచి వీరులైన యా రాజకుమారులను పదును గలిగి కఠినముగాఁ దెగఁ గోయు బాణములను దేహమున దండిగా నిండఁగా విరామము లేక యా రాక్షస వీరుఁడు కోపముతోఁ గూడిన మనస్సుగల వాఁడై వైచెను.

ఉ. ఆ చటులాస్త్రఘాతజని♦తాస్రధునీరససిక్తగాత్రులై
పూచిన కింశుకంబులను ♦ బోలెడివారల రక్తనేత్రుఁడై
యేచి విభిన్నకజ్జలసి♦తేతరగాత్రుఁ డదృశ్యకాయుఁడై
చూచుచుఁ బల్కె నైజభృశ♦శూరత వారలెఱుంగఁ జాటుచున్. ౯౩౪

అర్థములు. చటుల = చలించుచున్న - అస్త్రఘాత = అస్త్రముల దెబ్బచే-జనిత=పుట్టిన- అస్రధునీరస = నెత్తుటి యేటి ద్రవముచే - సిక్త = తడిసిన-గాత్రుఁడై = దేహముగలవాఁడై -కింశుకములు= మోదుగుచెట్లు - విభిన్న = చెదిరిన-కజ్జల=కాటుకవలె - డబ్బిలోనుంచక విడిగా నుంచిన కాటుక దుమ్ము గప్పి మీఁది భాగము బూజుపట్టినట్లుండును. పరచినట్లు నెఱపిన నల్లగా నుండును. సితేతర=నల్లని-గాత్రుఁడు=దేహము గలవాఁడు,ఇంద్రజిత్తు, అదృశ్యకాయుఁడై = కానరాని శరీరము గలవాఁడై నైజ= సహజమైన- భృశశూరతన్ = అధికమైన శౌర్యముచే.

తాత్పర్యము

జళిపించిన కత్తులవలెఁ గదలుచున్న యస్త్రములదెబ్బలవలనఁ బుట్టిన నెత్తుటి యేటి నీళ్ళచేఁ దడిసిన దేహము గలవారలై పూచిన మోదుగు చెట్లవలె నున్న వారలను రామలక్ష్మణులను నెఱ్ఱని కన్నులు గలవాఁడై విజృంభించి చెదరిన కాటుక కుప్పవంటి నల్లని దేహము గల యింద్రజిత్తు కానరాని దేహము గల వాఁడై చూచుచు మాట మాత్రము వినవచ్చునట్లు తన శౌర్యాతిశయముఁ బ్రకటించుచు నింతకార్యము చేసినవాఁడు తానని తెలియునట్లు పలికెను.

ఉ. మీరలె నన్ను మార్కొనెడి♦మేటిమగల్? ప్రధనోర్వి నుగ్రమా
యారతి నే నగోచరుఁడ♦నై చరియింపఁగ నల్ల వృత్రహుదై
త్యారియు డాయలేఁడు గన♦నైనను లేఁ డన మీరు లెక్కయే
ఘోరతరాస్త్రసంతతులఁ♦ గూల్చెదఁ జూడుఁడు మిమ్ము నిద్దఱన్. ౯౩౫

అర్థములు. మేటిమగల్=గొప్ప శూరులు, ప్రధనోర్విన్ = యుద్ధభూమి యందు, అగోచరుఁడనై=కానరాని వాఁడనై.

తా త్ప ర్య ము

మీరా నన్ను మాఱొడ్డఁగల శూరులు? యుద్ధభూమియందు మాయాబల ముచే నేను గానరాని వాఁడనై తిరుగునపుడు వృత్ర విరోధి యగు నింద్రుఁడైనను నన్ను సమీపింపను లేఁడు. చూడను లేఁడు. ఇఁక మీరా నాకొక లక్ష్యము? మమ్మిద్దఱను భయంకరములైన యస్త్రసమూహములఁ జంపెదఁ జూడుఁడు.

ఉ. రోషణభాషణంబు లిటు ♦ క్రూరనిశాటుఁడు వారిఁ బల్కి జ్యా
భీషణఘోషణం బరులు ♦ పెల్కుఱఁ జేయుచు శాత్రవస్మయ
ప్రేషణ శోషణాహిశర♦బృందముఁ బైపయిఁ గ్రమ్మి దుష్టవి
ద్వేషణభూషణాత్ములను ♦ వే శరబద్ధులఁ జేసె నీసునన్. ౯౩౬

అర్థములు. రోషణభాషణంబులు=కోపముతోఁగూడిన మాటలు- జ్యా= అల్లెత్రాఁటియొక్క - భీషణఘోషణంబు = భయంకర ధ్వనిచే- అరులు = శత్రువులు - పెల్కుఱన్=విహ్వలించునట్లు-దేహములు విరవిరపోవునట్లు- శాత్రవ = విరోధుల - స్మయ=గర్వమును ప్రేషణ = అప్పుడు పోగొట్టునవియు-శోషణ = శాశ్వతముగా మొదలంటఁ బోఁగొట్టునవియు నగు, అహిశర బృందము= పాము బాణముల సమూహము - దుష్టవిద్వేషణాత్ములను = దుష్టులగువారిని ద్వేషించుటయే భూషణముగాఁగల మనస్సుగలవారిని - 'సాధూనామసుర ద్రుహో' మ్మని కలదుగదా. దుష్టవిద్వేషణ మనఁగా దుష్టుఁడుచేయు కార్యములు కొనసాగనీయకుండఁ జేయుటయే శరబద్ధులన్ = బాణములచే గట్టఁబడిన వారినిగ- ఈసునన్ = కోపముచే - ఈసు అనునది ఈర్ష్యాశబ్దభవ మైనను దానికి ఈర్ష్యయనియు, కోపమనియు రెండర్థములు గలవు.

తా త్ప ర్య ము

క్రూరములైన కార్యములుచేయు నా రాక్షసుఁడు కోపముతో వారి నిటు పల్కి యల్లెత్రాటి భయంకరమైన మ్రోఁతచే శత్రువులు విహ్వలపడఁజేయుచు శత్రువుల గర్వము సమూలము నాశనము చేయు నాగాస్త్ర సమూహములను మీఁద మీఁదఁ బ్రయోగించి దుష్టజనద్వేషము భూషణముగఁ గలవారిని గోపముచే బాణములచేఁ గట్టివైచెను.

కం. ఆ యేతరి రాకొమరుల, కాయంబులఁ గాఁడె శరని♦కాయము వ్రేలెం
డే యెడ సం దొనరఁగ నీ, కా యుద్ధతికిం జలించి ♦ యా వీరవరుల్. ౯౩౭

అర్థములు. ఏతరి = దుష్టుఁడు, కాఁడెన్=నాటెను, వ్రేలెండు=వ్రేలెడు= వ్రేలి పరిమాణము, పరిమాణార్థంబునఁ బ్రథమైన వచనం బంద యెఁడువర్ణకంబగు సు. వ్యా. తద్ధిత. ౩౭ సూ. ఉద్ధతి=ఉత్+హతి=పెద్ద దెబ్బ.

తా త్ప ర్య ము

ఆ దుష్టుఁడు రాజకుమారుల దేహములందు వ్రేలెఁడైన నెడము లేకుండునట్లు

బాణసమూహము నాటెను. ఆ వీరు లా దెబ్బకుఁ జలించి.

చం. ముడిబిగి తూలు నింద్రు ధ్వజ•ముం దలఁపించుచుఁ గంప మందుచున్
సడలఁగ నిబ్బరంబు నిము•సంబును గన్నులు విప్పరాక పై
నడరెడి మర్మభేదనశ•రావళిఁ గర్శితులౌచుఁ గాయముల్
బుడబుడఁ గ్రక్కు నెత్తురుల•బ్రుంగి కలంగి నలంగి రెంతయున్. ౯౩౭

అర్థములు. ముడిబిగి = కట్టిన త్రాటి ముడియొక్క బిగువు - తూలి = వదలుపాఱిన - కంపమందుచున్ = వణఁకుచు - ముందు వెనుకకు నూఁగుచు - నిబ్బరంబు = ధృతి - అడరెడి = పడుచున్న - మర్మభేదన = ప్రాణస్థానముల భేదించు - శరావళిన్ = బాణ సమూహములచే - కర్శితులు = బాధపెట్టఁబడిన వారు - బ్రుంగి = మునిఁగి. కలంగి = కలఁత చెంది - నలంగిరి = నలిఁగిన వారైరి.

తాత్పర్యము

బిగువుగాఁ గట్టిన త్రాడు వదలు పాఱఁగా నూఁగుచున్న యింద్రధ్వజమును స్మృతికిఁ దెచ్చుచు వణఁకుచు ధైర్యము చెడఁగా కొంచెము సేపైనఁ గన్నులు తెఱవ సాధ్యపడక పైపై పఱచు మర్మస్థానముల నాటియున్న బాణములచే బాధ పడుచు గాయములనుండి నెత్తురు కాఱఁగా దానిలో మునిఁగి కలఁతచెంది నలఁగిరి పూర్ణావతారమూర్తులగు రామలక్ష్మణుల శరీరము లప్రాకృతశరీరములు కదా వానినుండి ప్రాకృతరక్త మెట్లు స్రవించెను ?

శ్లో॥ నభూత సంఘ సంస్థానో దేహోఽస్య పరమాత్మనః॥ నత్వస్య ప్రాకృతా మూర్తి ర్మాంసమేదోఽస్థి సంభవా" యని యిత్యాది వాక్యములచే శ్రీరాముని దివ్యమంగళ విగ్రహము అప్రాకృతమని చెప్పఁబడెను. ఇట్టిదానినుండి నెత్తు రెట్లు స్రవించె ననిన :—

బ్రహ్మమాటను దక్కింపవలసియున్నది కావున వీని యస్త్రములకు లోప డెద మని వానిని నిరసింప శక్తి గలిగియు నెప్పుడు లోపడెనో యప్పుడే యాయన చెల్లియుండియు సైరణ చేసినవాఁడు కావున రామచంద్రమూర్తి బ్రహ్మకంటెఁ బరముఁడని యేర్పడెను. ఇట్టివాఁ డప్రాకృతపురుషుఁడుగాక మఱి యెవ్వఁడగును? ఇట్టివాఁడు తన పరస్వభావము వదలకయే మనుష్యరూపమున ధర్మము స్వయముగ ననుష్ఠించి లోక మావిధముగ వర్తింపఁజేయ నవతరించెను. ఇదికదా ధర్మ సంస్థాపన మార్గము. ఇట్లు చేయఁదలఁచినవాఁడు అనుష్ఠించు వారికి సాధ్యమగు నవి చేసిననే వారనుష్ఠింపఁగలరు. కాని యమానుషచర్యలు సలిపిన నాయన భగవంతుఁడు కావున నట్లు చేయఁగలిగెను. మనుష్యులము మనమట్లు చేయఁగలమా యని నిరుత్సాహులై యాధర్మమును మనుష్యులనుష్ఠింపరు. కావునఁ దానప్రాకృతపురుషుఁ డను జ్ఞానము లోకులకుఁ గలుగనీయరాదు. అందు రావణునకు మొదలే తెలియ నీయరాదు. రాముఁడు మనుష్యుఁడను భావ ముండిననే రావణుఁడు రామునిచేఁ

జన్మించునుగాని దేవత్వబుద్ధి కలిగినా వాఁడు చావఁడు. కావునఁ గేవల ప్రాకృత పురుష నటనమే గర్భవాసాది కార్యములు చేయవలసివచ్చెను. అట్లు గాకుండిన ప్రాకృత స్త్రీకి నప్రాకృత పురుషుఁ డెట్లుదయింపఁగలఁడు? సర్వ స్వతంత్రుఁడైన చక్రవర్తి యైనను నలువురతోఁ జెండాట యాడునపుడు వారికి తానే విధించిన విధులప్రకారము తాను లోఁబడి వర్తింపవలయు గదా! అటుగాదేని యది యాటయేకాదు. అతఁ డాటకాఁడు కాఁడు. అట్టి నిర్బంధములకుఁ దాను లోఁబడుటచేఁ దన స్వాతంత్ర్యమును శక్తిని ప్రభుత్వమును గోలుపోఁడు. అట్టులే రామచంద్రమూర్తియు. కావున, లోక సంగ్రహార్థమై బంధనాదికములు, రక్తస్రావాదులు నటించె నని యెఱుంగ నగు. అట్లు చేయకున్న నవతార ప్రయోజనమే చెడును. ఇప్పుడు రామచంద్రమూర్తి చేసిన వన్నియు మనకు సాధ్యములే. కష్టములందు, సుఖములందు నాయన యెట్లు వర్తించెనో యట్లు మనము వర్తించిననే బాగుపడుదు మని మనకుఁ దోఁచుచున్నది. అటుగాక యాయన పరత్వము దివ్యశక్తి చూపియుండిన యెడల ఆయనను మనము మార్గదర్శిగా గ్రహించియుండము రామచంద్రమూర్తి చేసిన కార్యములన్నియు మనముచేయ సాధ్యమగునుగాని కృష్ణమూర్తివలె నగ్నిని మ్రింగఁగలమా? కొండ లెత్తఁగలమా? విశ్వరూపము చూపఁగలమా? కావుననే రాముఁడు చేసినట్లుచేయుము. కృష్ణుఁడు చెప్పినట్లు చేయుము. అని సూక్తి యేర్పడెను. ఈ నాగపాశ బంధనమువలన మనము నేర్చుకొనవలసిన దేమన ఎంతటి గొప్ప వారికైనను ఆపదలు రాక మానవు ధర్మమును మనము వర్తించుచుంటిమేని మనము కోరకున్నను వానిని భగవంతుఁడే తొలఁగించును. ఎవరు పిలువకున్నను గరుత్మంతుఁడు వచ్చినట్లు, పెద్దవారిని దిరస్కరింప శక్తియున్నను వారి మాట ప్రకారము పోయినఁ గొంచెము కష్టము వచ్చినను సహింపవలెఁ గాని వారిని ధిక్కరించి యవమాన పఱుప రాదనియు, ఆపదలు కాఁపురములు సేయుననియు నెఱుఁగ నగు.

కం. అనఘుల కరాంగుళంబుల, దనుక నబాధితము నప్రదారిత మనిలా
శనశరనికరాబద్ధము, తనువులఁ గన రా దెడంబు తచ్ఛరవృష్టిన్. ౯౩౯

అర్థములు. అనఘుల=పాపరహితులయొక్క - లోకములోని మనుష్యులందఱు తాము పూర్వము చేసిన పాపకర్మముల ఫలముగా నిప్పుడు కష్టము లనుభవింతురు. వీరియం దట్టి కర్మబంధము లేదనియు, లోకసంగ్రహార్థముగ నిది స్వేచ్ఛాగృహీత మనియుఁ దెలుపుచున్నది. తనువులన్=దేహములందు, కరాంగుళంబుల దనుకన్ = చేతివ్రేళ్ళవఱకు. అబాధితము = బాధింపబడనిది - అప్రదారితము= చీల్పఁబడనిది - అనిలాశనశరనికర = నాగాస్త్ర సమూహములచే - అబద్ధము = కట్టబడనిది-తత్ =ఆ యింద్రజిత్తుయొక్క - శరవృష్టిన్=బాణ వర్షముచే.

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముల దేహములందు నింద్రజిత్తు బాణవర్షముచే చేతి వ్రేళ్ళకొనల వఱకు గాయపడనిది, చీల్పఁబడనిది, నారాచముచేఁ గట్టఁబడనది యగు ప్రదేశము లేదు.

ఉ. అంజక యంతకున్ సయిఁచి • యట్టె నిలంబడ యున్న రాముని
న్గెంజిగి దొట్టు గన్గవ వి•నిర్జితనాకపుఁడున్ శితాగ్రముల్
కంజరపుంఖముల్ భయద • కాండము లుగ్రత వత్సదంతభ
ల్లాంజలికక్షురాశుగచ•యంబులు భీకరసింహదంష్ట్రిముల్. ౯౪౦

అర్థములు. అంజక = భయపడక - అంతకున్ = అంతకష్టమునకు - కెంజిగి=ఎఱ్ఱని కాంతి-వినిర్జిత నాకపుఁడున్=ఇంద్రుని జయించిన వాఁడు - ఇంద్రజిత్తు - శితాగ్రముల్ = వాఁడిగల కొనలు గలవు. కంజరపుంఖముల్ = బంగారు పింజలు గలవి - భయదకాండములు = భయంకర బాణములు - వత్సదంత = దూడల పండ్లవంటి కొనలుగలవి. భల్ల=బల్లెములవంటి కొనలుగలవి, అంజలిక = అంజలివంటివి-క్షుర=మంగలికత్తివంటి వాఁడికొనలుగలవి- ఆశుగచయంబులు = బాణసమూహములు - భీకరసింహ దంష్ట్రిముల్ = భయంకరములైన సింహము కోఱలవంటివి.

తాత్పర్యము

ఇంత బాధపఱిచినను భయపడక సహించి మునుపటివలె నిలఁబడి యున్న రాముని కన్ను లెఱ్ఱచేసి చూచి యింద్రజిత్తు వాఁడి కొనలుగల బంగారు పింజలు, దూడల పండ్లవంటివి, బల్లెముల వంటివి, అంజలి వంటివి, మంగలికత్తుల వంటివి, సింహముల కోఱల వంటివి యగు భయంకర బాణములను.

క. వ్రేసిన హెచ్చిన నొవ్వున, నా సింహబలుండు త్రిణతమై విజ్యంబై
భాసురరత్నాంచితమై, కైసడలెడి వింటితోడ • క్ష్మాశయనించెన్. ౯౪౧

అర్థములు. సింహ బలుండు = సింహమువంటి బలము కలవాఁడు, త్రిణతమై = మూఁడువంపులు గలదై - విజ్యంబై = అల్లెత్రాడు లేనిదై - భాసుర రత్నాంచితమై = ప్రకాశించు రత్నములచేఁ శోభించునదియై - కైసడలెడి=చేతి నుండి జాఱిపోవుచున్న, శయనించెన్=పండుకొనెను-పండుకొనె నని చెప్పఁబడెను గాని యవశుఁడై పడెనని చెప్పఁబడలేదు. పండుకొనుట స్వతంత్ర కార్యము గాని పరవశ కార్యముగాదు.

తాత్పర్యము

వ్రేయఁగా నొప్పి హెచ్చుగుటచే సింహబలమునంత బలముగల రామచంద్ర మూర్తియు మువ్వంపు గలిగి నారిసడలి రత్నములచేఁ బ్రకాశించుచు చేతినుండి జాఱుచున్న వింటితోడ నేలపైఁ బరుండెను.

ఉ. ఆ నళినాంబకుండు బహు♦శాక్తిని దూల్తను వీరశయ్యపై
మేను గదించె, నన్న యిటు ♦ మేదిని వ్రాలఁగఁ జూచి తమ్ముఁడున్
మాని స్వజీవితాశ శర ♦ మండలతల్పగుఁ డయ్యె, నింతకున్
వానరముఖ్యు లెల్ల నర ♦ వర్యులఁ జేరి నితాంతదుఃఖులై. ౯౪౨

అర్థములు. స్వజీవితాశ=తన బ్రతుకునందలి యాశను-శరమండల తల్పగుఁ డయ్యెన్=బాణసమూహము లనెడి పానుపును బొందినవాఁ డయ్యెను.

తాత్పర్యము

మన్మథునివంటి సుకుమారుఁడును, తామరవంటి కన్నులు గలవాఁడునగు రామచంద్రమూర్తి బాధ యతిశయమువలనఁ దూలుత బాణశయ్యపై వీరుల కుచితమగు విధమునఁ బండుకొనెను. అన్న యీ ప్రకారము నేలమీఁదఁ బండు కొనుట చూచి లక్ష్మణుఁడు తానును దన ప్రాణములమీఁది యాశ వదలి బాణ శయ్యపైఁ బరుండెను. ఇట్లగుటవలన వానరులందఱు వారి యిరువుర సమీపించి మిగుల దుఃఖముగలవారైరి.

బలధైర్య స్థైర్యములఁబట్టి లక్ష్మణుఁడు తూలుచఁ బడవలసినవాఁడు-అట్లుండ రామచంద్రమూర్తి తూలుతఁ బరుండుటకుఁ గారణ మట్లు చేసినఁగాని బ్రహ్మ వరము పూర్తి కాదు. ఇంద్రజిత్తు పోఁడు. తన నిమిత్తముగ వాఁడు వానరులను బాధించుచుండును. ఇవన్నియు నాలోచించి యాయన ముందు పండుకొనెను.

♦ ౪౯-వ సర్గము సుగ్రీవాదులు బద్ధులైన శ్రీరామ లక్ష్మణులఁ జూడవచ్చుట ♦

ఉ. క్రిందను మీఁదుచూచుచుఁ బ♦రిక్షతులై శరపూర్ణగాత్రులై
క్రిందను వ్రాలియున్న నర♦కేసరులం గనుచుండ నింతలో
మందత నొందఁ రావణజ♦మార్గణవృష్టియు వేగ భానుమ
న్నందనుఁడున్ విభీషణుఁడు ♦ దత్స్థలికిం బఱతెంచి వారలన్. ౯౪౩

అర్థములు. పరిక్షతులై=మిక్కిలి గాయపడినవారై, శరపూర్ణగాత్రులై= బాణములచే నిండిన దేహములు గలవారై, రావణజ=ఇంద్రజిత్తుయొక్క, మార్గణ వృష్టి = బాణవర్షము, మందతనొందన్ = తగ్గిపోఁగా, రామలక్ష్మణులు పడి పోగానే యింద్రజిత్తు బాణవర్షము తగ్గించెను.

తాత్పర్యము

రామలక్ష్మణుల నంక భూమియు-నింకను వీఁడేమి చేయఁదలఁచెనో యని యాకాశమును జూచుచు మిక్కిలి గాయపడి బాణములచే నిండిన దేహములు గల వారై నేలఁబడియున్న నరసింహమూర్తులను రామలక్ష్మణులను జూచుచుండ వారుపడఁగానే యింద్రజిత్తు బాణవర్షము తగ్గుటచే వేగముగ సుగ్రీవుఁడు విభీష ణుఁడు నా స్థలమునకు వచ్చి,

కం. కని యచ్చట ద్వివిదాంగద, హనుమన్మైందకుముదాద్య♦గాటయుతముగా
వనరుచుఁ దద్దురవస్థకు, మనమునఁ దికమకలుపడుచు♦మల్లడి గొనుచున్.

అర్థములు. వనరుచున్ = శోకించుచు - మల్లడి గొనుచున్ = పరితాప పడుచు.

తా త్ప ర్య ము

వారలను జూచి ద్వివిదుఁడు అంగదుఁడు హనుమంతుఁడు మైందుఁడు సుముఖుఁడు మొదలగుగాఁగల వానరులతోడ వారి దురవస్థకు శోకించుచు నేమిచేయుటకుఁ దోపక తికమక లాడుచు పరితాపపడుచు.

సీ. జాలువాఱెడు నెత్తు • జాజువాఱిన మేను, గాజు వాఱిన మోము • కళలవారిఁ
గాలు చేయి కదల్పఁ • గడిమి చాలనివారి, నొయ్యనియూరుపు • లూర్చువారి
వాఁడిములుకులు లెస్స • గాడిన మైవారిఁ, బుట్టపట్లన బుస • గొట్టువారి
నలుగులపాన్పున • నత్తమిల్లినవారి, హాటకధ్వజముల • సాటివారి

తే. వీరశయనశయానుల • వీరవరుల, మందవిక్రము లై యున్న • మనుజవరుల
నీరు గాఱెడి కనుల వ • నేచరాళి, మిడుక నెఱుఁగక స్మృతి దప్పి • పడినవారి.

అర్థములు. జాలు వాఱెడు = కాలువగాఁ గాఱుచున్న - ఎత్తు = ఎఱ్ఱని, రక్తముచే-జాలువాఱిన = ఎఱ్ఱనైన-మేను = దేహము-గాజువాఱిన = మాసిన - కళల వారిన్ = కాంతులు గల వారిని-కడిమి = బలము, ఒయ్యని=మెల్లనగా - గాఁడిన = నాటిన మైవారి = దేహములు గలవారి - పుట్టపట్లు = పాములు - అలుగుల పాన్పునన్ = బాణముల శయ్యయందు-అత్తమిల్లినవారిన్=పండుకొనిన వారిని-హాటక = బంగారు - వీరశయన = వీరులకు యోగ్యమైన శయనమందు శయానులన్=పండుకొనిన వారిని.

తా త్ప ర్య ము

నెత్తురు వెల్లువగా దేహమందంతటఁ బాఱుటచే నెఱ్ఱని దేహములు, హీనమైన మోము కాంతి గలవారిని, కాలు చేతులు కదలింప బలములేనివారిని అప్పుడప్పుడు మెల్లఁగా శ్వాసము పుచ్చువారిని, కఱకు బాణములు బాగుగ దేహమునందు నాటినవారిని, పాములవలె బుసకొట్టువారిని, అమ్ముల శయ్యమీఁదఁ బండుకొన్నవారిని, బంగారు ధ్వజములవంటి వారిని రణభూమియందుఁ బండుకొనిన వీరులను, పరాక్రమము తగ్గిన రాజులను వానరులు కన్నీరు కార్చుచు దుఃఖించుచున్నను దెలియని వారిని.

క. వగచుచు దుఃఖభరంబున, వగరుచుచున్ మిన్నుగనుచుఁ • బర్వతరిపు పె
న్పగతుని యడపొడ గానక, యగచరవరు లన్నిదిక్కు • లరసిరి పృథగన్.౫౪.

అర్థములు. వగరుచుచున్=నిట్టూర్పు విడుచుచు, పర్వతరిపు = ఇంద్రుని యొక్క, పెన్పగతుని=గొప్ప శత్రువగు ఇంద్రజిత్తుయొక్క, అడపొడ=జాడ.

తా త్ప ర్య ము

వ్యసనపడుచు దుఃఖాతిశయమున నిట్టూర్పు విడుచుచు, నాకాశము జూచుచు

నింద్రజిత్తుజాడ గానక వానరులు వ్యర్థముగ నన్ని దిక్కులు వెదకిరి.

కం. మాయావి నన్నకొడుకున్, మాయాసంఛన్ను లబ్ధ•మహితవరబలున్
మాయావేది విభీషణుఁ, డా యెడ నొకఁడ కనియె•నట రావణియున్.

అర్థములు. మాయావి=మాయగలవాఁడు, అస్మాయామేధాస్రజోవినిః। పాణిని, ౫, ౨, ౧౨౧. వి,మత్వర్థీయప్రత్యయము, మాయాసంఛన్నున్ = మాయచే మఱుఁగుపడిన వానిని, లబ్ధమహిత వరబలున్ = పొందఁబడిన గొప్ప వరబలము గలవానిని, మాయావేది=మాయ దెలిసినవాఁడు.

తాత్పర్యము

మాయ చేయుటయందు సమర్థుఁడును మాయచే మఱుఁగుపడిన వాఁడును గొప్ప వరముల బలముగల వాఁడును నగు నన్న కొడుకు నింద్రజిత్తును ఆవిద్య తెలిసిన విభీషణుఁ డొకఁడు మాత్రమే చూడఁగలిగెను.

మాయాశబ్దమునకు మొదటి యర్థము జ్ఞానము. ఇది సంకల్పరూపమైనది. కావున నిది భగవచ్ఛక్తియే. కావుననే ప్రకృతికి మాయయని పేరు. ఈ శక్తి యత్యద్భుతమై యాశ్చర్యకరమైన కార్యములు చేయునపుడు మాయ యనఁబడును. ఉన్నదున్నట్టుగాక మఱియొక విధముగాఁ గనఁబడఁజేయుట గొప్పశక్తియే కదా. సర్వ ప్రపంచము భగవత్స్వరూపమై యుండఁగా నట్లు గానరానీయక మఱియొక విధముగఁ గానవచ్చునట్లు ప్రకృతి చేయుచున్నది. కావున నిది మోసము. కావున నొకనిని మఱియొకఁడు మోసము చేసినపుడు మాయ చేసినాఁ డందుము. ఇంద్రజాల మహేంద్రజాలవిద్య లన్నియు నిట్టి శక్తి గలవే. ఈ విద్యలకు మాయ లని, యివి కలవాఁడు మాయావి యని పేరు. కావుననే భగవంతుఁడు మాయి, యని, ప్రకృతి మాయ యని చెప్పఁబడును, హాలికి—సర్వాభావము నగుటచేఁ గాను- ఈ విద్యలు మణి మంత్రౌషధములచే సాధ్యములు - అద్భుతశక్తి-ప్రకృతి యను నర్థమునందే యుపనిషత్తులందు నీ శబ్దము ప్రయోగింపఁబడెను.

ఇంద్రజిత్తును జూచిన విభీషణుఁడేల యితరులకుఁ జెప్పలేదు? ప్రయోజనము లేదుగనుక. వాఁడు చక్రమువలె దిరుగుచుండెను. విభీషణుని నోటిమాట నోర నుండఁగానే వాఁడు స్థానము తప్పించుచుండును. కన్నులు లేనివారికిఁ గన్నులు గలవాఁడు పరువెత్తు పక్షిని గుఱించి యెట్లు చెప్పఁగలఁడు ?

—• ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణులు చచ్చి రని రాక్షసులతోఁ జెప్పుట •—

కం. తనశరముల బాధితులై, తనువు లెఱుంగక ధరిత్రి • తల్పముగా వ్రా
లినభ్రాతలఁ గని పొంగుచుఁ, దనవారికి నుబ్బెసంగ•దర్పించి యనున్. ౯౪౨

తాత్పర్యము

తన బాణములచేఁ బీడింపఁబడినవారై దేహములు తెలియక భూమిపాన్పుఁగాఁ

బడిన యన్నదమ్ములఁజూచి సంతోషించి తనవారికి సంతోషము గలుగునట్లు గర్వించి యింద్రజిత్తిట్లనియె.

సీ. ఎవ్వారు ఖరుని నా ♦ మైకశేషునిఁ జేసి, రెవ్వారు దూషణుఁ ♦ ద్రొవ్వడంచి
రెవ్వారిచింతఁ బా ♦ న్పమి యంటక మూఁడు, జాము లేగెడి రేల ♦ జనకునకును
నెవ్వారు సకలక ♦ పీంద్రులతోఁ గూడి, కడలి సేతువుఁ గట్టి ♦ విడిసి రిందు
నెవ్వారి కడిమికి ♦ నీలంక కలగుండు, పడె వానకారున ♦ వాఁక పోలె
ఆ. నట్టివారి నిదిగొ ♦ నస్త్రబంధంబులఁ, గట్టి చంపినాఁడఁ ♦ గట్లు విప్ప
నఖిలనిర్జరర్షు ♦ లైనను జాలరు, తక్కువారిమాట ♦ తడవ నేల ? ౯౪౯

అర్థములు. నామైకశేషుని = పేరుమాత్రము మిగిలినవానిగా, చచ్చినవానిగా, మూఁడుజాము లేగెడిన్-రేల=రాత్రులందు మూఁడు జాములు పోవుచున్నవాఁడు, రాత్రికిత్రియామ = మూఁడు జాములు గలదియని పేరు. రాత్రి మొదటి భాగమున నరజాము, ఉదయమునకుఁ బూర్వ మరజాము పగటికాలమందుఁ జేరుచున్నది. కడలిన్=సముద్రమందు, కడిమికిన్=పరాక్రమమునకు, కలగుండుపడెన్=క్షోభ మొందెను.

తాత్పర్యము

ఎవ్వారు ఖరుని దూషణుఁ జంపిరో, ఎవ్వారి విచారముచే నాతండ్రి మూఁడు జాములు రాత్రులందు నిద్దురలేక యుండుచున్నాఁడో, ఎవ్వరు వానరులతో సముద్రమందు సేతువు కట్టి దాఁటి యిచ్చట దిగిరో, ఎవ్వారి బలముఁ దలఁచి లంకలోని వారందఱు వానకాలమున వంకవలె కలఁత పడుచున్నారో యట్టివారి నిదిగో నాయస్త్రములచేఁ గట్టి చంపినాఁడను. ఈకట్లు విప్పుటకు దేవర్షులైనను సమర్థులుగారు. ఇఁకఁ దక్కినవారి మాట యేల ?

క. ఈ రాఘవుఁ డీ లక్ష్మణుఁ, డీరాణువ చేసి యున్న ♦ యెల్ల మగతనం
బీ రే నిష్ఫల మై చనె, శారదదినములను మేఘ ♦ జాలం బనఁగన్. ౯౫౦

అర్థములు. రాణువ = సేన.

తాత్పర్యము

ఈ రాముఁడు ఈ లక్ష్మణుఁడు ఈ సేన చేసిన పౌరుషకార్యము లన్నియు నీరాత్రితో వ్యర్థమై శరత్కాల దినములందు మేఘసమూహమువలెఁ బోయెను.

—♦ ఇంద్రజిత్తు వానరవీరుల నొప్పించుట ♦—

చ. ప్లవగచమూచయంబు పని ♦ పట్టెద నిం కిటఁ జూడుఁ డంచు వా
సవపరిపంథి యూథపులఁ ♦ జక్కడుపన్ సమకట్టి ముల్కులన్
నవకము చేత నీలు మెయి ♦ నాటఁగఁ గ్రుచ్చియు మూఁట మైందునిన్
ద్వివిదుని మూఁట వైచి యొక ♦ పేరలుగుం దొడి జాంబవంతునిన్. ౯౫౧

అర్థములు. పనిపట్టెదన్=చేయవలసిన కార్యమునకుఁ బూనెదను. వాసవ

పరిపంథి=ఇంద్రజిత్తు — చక్కడుపన్ = చంపుటకు - సమకట్టి = పూని-నవకము చేతన్=తొమ్మిదింట, పేరలుగున్=పెద్దబాణమును-తొడి=సంధించి.

తాత్పర్యము

ఇఁక వానరసేనను జంప యత్నించెదను చూడుఁడు అని చెప్పి యింద్రజిత్తు యూథనాయకులఁ జంపఁబూని తొమ్మిది బాణములు తీసికొని నలునిమూఁట, మైందునిమూఁట, ద్వివిదుని మూఁట వైచి యొక్క పెద్ద బాణమును సంధించి జాంబవంతుని.

చ. ఉరమునఁ గాఁడఁ జిమ్మి జవ ♦ నోద్ధతు మారుతపుత్త్రుఁ దాఁకఁగా
 శరదశకంబు వైచి రభ ♦ సంబుమెయిన్ శరభున్ గవాక్షు భీ
 కరఖగయుగ్మతాడితుల ♦ గా నొనరించి కలంబవృష్టులన్
 గురిసెను వాలిసూనుపయిఁ ♦ గ్రోధసమేధితశౌర్యధుర్యుఁడై. ౯౫౨

అర్థములు. జవనోద్ధతున్ = వేగాతిశయముగల - శరదశకంబు = పది బాణములు-రభసంబు మెయిన్ = శీఘ్రముగా, ఖగయుగ్మ తాడితులన్=రెండు బాణములచేఁ గొట్టఁబడిన వారిని - కలంబవృష్టులన్= బాణవర్షములను - క్రోధ సమేధిత=కోపముచేతవృద్ధినొందిన, శౌర్యధుర్యుఁడు=శౌర్యాతిశయముకలవాఁడై.

తాత్పర్యము

ఉరమున నాటునట్లువైచి యతివేగముగల యాంజనేయునిపైఁబడి బాణము లతి వేగముగ వైచి శరభుని గవాక్షుని రెండుబాణములచేఁ గొట్టి క్రోధాతిశయమున నంగదుపై బాణవర్షము గురియించెను.

తే. వహ్నిశిఖలను నతిశయించు ♦ బాణములను
 బలిముఖుల మేను లెల్లను ♦ దొలులు గొట్టి
 సింహనాదంబు గావించెఁ ♦ జేవ యెడలి
 ప్లవగకుంజరములు భీతిఁ ♦ బడలు పడఁగ. ౯౫౩

అర్థములు. పడలు పడఁగన్=గుంపులుగాఁ బడునట్లు.

తాత్పర్యము

కాంతియందు నగ్నిజ్వాలలను మించు బాణములచే వానరుల దేహములు చిల్లులు పడునట్లు గొట్టి వానరశ్రేష్ఠులు సత్తువచెడి భయముచేఁ గుప్పలు పడఁగా సింహనాదము చేసెను.

ఉ. అంబరవీథి నిల్చి ప్లవ♦గావళి యుక్కు మడంచి యట్టహా
 సం బొనరించి రాక్షసుల ♦ సంఘముఁ గన్గొని యిప్డు చూడుఁడీ
 యిం బఱి నేల వ్రాలి వికి ♦ లేషునిబద్ధశరీర మైన యు
 గ్మంబు నటన్న వారతని ♦ కార్యముఁ గన్గొని విస్మితాత్ములై. ౯౫౪

అర్థములు. అంబరవీథిన్=ఆకాశమార్గమున-ఉక్కు = బలము-మడంచి= తగ్గునట్లుచేసి-అట్టహాసంబు=పెద్దనవ్వు-ఇంబు+అఱి = అందముచెడి - వికలేషు =

భయంకర బాణములచే - నిబద్ధ = కట్టఁబడిన - శరీరమైన = దేహముగల - యుగ్మంబు=రామలక్ష్మణుల నిర్వురను-విస్మిత+ఆత్ములై = ఆశ్చర్యమునొందిన మనస్సులు గలవారై.

తా త్ప ర్య ము

ఆకాశమందుండి వానరుల బలము చెఱిచి పెద్దగా నవ్వి రాక్షసులఁజూచి రామలక్ష్మణు లిర్వురు బాణములచేఁ గట్టఁబడి యందముచెడి నేలఁబడియున్నారు. చూడుఁడని చెప్పగా వా రతఁడు చేసినపనికి నాశ్చర్యపడిరి.

కం. జలదము లుఱిమెడువడువున, బలితపు గర్జలను నించి ♦ పార్థివులు సమి
త్తలమునఁ జచ్చిరికా యని, తలఁచుచు నమ్మేఘనాదుఁ♦దన్పిరి పూజన్. ॥౯౯

అర్థములు. వడువున=విధమున, సమిత్తలమునన్ = యుద్ధభూమియందు, చచ్చిరకా=చచ్చినవారే యని; చచ్చిరకా "అకానిత్యర్థకం బగు" ప్రౌ. వ్యా. క్రియా. ౩౩ సూ. 'అపజయమకా లక్షించి' భార. అర ౨ ఆ. దీనివలన సీతారామా మాచార్యులవారు అపజయము+అకాన్ అని పదచ్ఛేదము చేసి నటేర్పడుచున్నది. దీనికంటె అపజయమ+కాన్ అని విభజించి అపజయమే యని నిర్ధారించిన బాగని తోఁచుచున్నది. కాన్=అగు నని యర్థము. 'ఏను నిల్చినట్లకానూఅడిల్లు, నీవున్న నన్న రేశ్వరోత్తముండు' ద్రోణ. ౩-౨౨. ఇచ్చటను అవధారణార్థకము మీఁద కాన్ చేర్చినట్లు చెప్పుటే బాగు. ఈ ప్రయోగ మిది ద్రుతప్రకృతిక మగుట స్థిరీకరించుచున్నది. మేఘనాదున్=ఇంద్రజిత్తును, తన్పిరి=తృప్తుని జేసిరి.

తా త్ప ర్య ము

రామలక్ష్మణులు యుద్ధభూమియందుఁ జచ్చినవారే యని మనస్సులందుఁ దలఁచి రాక్షసులు మేఘము లుఱిమిన విధమున సింహనాదములు చేసి యింద్రజిత్తును గౌరవించిరి.

క. ఆడక కాలులుఁ జేతులు నాడక యుచ్ఛ్వాస మేమి ♦ యవనీగతులై
గోడుకొను నన్నదమ్ములు గూడిరి మృతి ననుచుఁ దలఁచి♦కొని రయ్యసురుల్.

తా త్ప ర్య ము

కాలుచేతులు కదలింపక శ్వాస విడువక భూమిమీఁదఁబడి యాపద నొందిన యన్నదమ్ములు చచ్చిరని రాక్షసులు దలఁచిరి.

—♦ విభీషణుఁడు సుగ్రీవునకు ధైర్యముఁ జెప్పుట. ♦—

ఉ. ఎంతయు సంతసంబున సు♦రేంద్రజితుండును లంకఁ జొచ్చి, భూ
కాంతులయునికిఁజూచి దిన♦కాంతతనూజుఁడు బెగ్గడిల్లి నే
త్రాంతములన్ జడిం గొనుచు ♦ నశ్రులు రాలఁగ శోకతప్తుఁడై
చింతను మోము వెల్ల నయి ♦ చేడ్పడి యుండ విభీషణుం డనున్. ॥౯౨

అర్థములు. దినకాంత తనూజుఁడు = సుగ్రీవుఁడు, బెగ్గడిల్లి = భయపడి, నేత్రాంతములన్ = కనుల కొనలందు, వెల్లనయి = తెల్లఁబాఱి, చేడ్పడి = నిశ్చేష్టుఁడై.

తాత్పర్యము

ఇంద్రజిత్తు రామలక్ష్మణులు చచ్చిరను సంతోషముతో లంకలోనికిఁ బోయెను. రామలక్ష్మణులుండు స్థితిఁజూచి సుగ్రీవుఁడు భయపడి కన్నీళ్ళు జడిగాఁ గాఱఁగా శోకముచేఁ దపించినవాఁడై విచారమున మోము తెల్లపాఱఁగా నిశ్చేష్టుఁడై యుండ నతనితో విభీషణుఁ డిట్లనియె.

చ. చనునె కపీంద్ర! ప్రాకృతుని ♦ చందమునన్ దిగులొంద, మానుమీ
కనుఁగవ బాష్పపూరములు ♦ గార్పకు యుద్ధము లిట్టివేకదా
యనిఁ దనగెల్పె నిశ్చయ మ♦టంచని నమ్మఁగవచ్చునయ్యె? నీ
మనమున ధైర్యమూని గతి♦మాలిన నన్నను దేర్పు మియ్యెడన్. ౯౫౪

అర్థములు. ప్రాకృతిని చందమునన్ = పామరునివలె, అనిన్=యుద్ధమందు, నమ్మఁగవచ్చునయ్యె = అయ్యా నమ్మవచ్చునా ? ఇది వ్యతిరేకార్థము సూచించు ప్రశ్నార్థకము. ఒకొ్కక్కచోఁ దద్ధర్మకక్రియ యార్యాద్యర్థపరం బయి వ్యతిరేక వ్యంజక ప్రశ్నార్థకం బగు, ప్రౌ. వ్యా. క్రియ. ౪ సూ. నమ్మరాదని యర్థము. గతిమాలిన=గతికి చెడిన, తేర్పుము=ఊరడింపుము.

తాత్పర్యము

వానరరాజా! పామరునివలె నీవు భయపడవచ్చునా? కన్నీరు కార్పకుము. యుద్ధముల లక్షణము లిట్టివేకదా! యుద్ధమందు నేనే గెలిచెదనని నమ్మవచ్చునా? కూడదు. నీకంటెఁ రెంటను జెడినవాఁడను నేను. నన్ను నీవు సమాధానపఱుపుము.

చ. మనకును భాగ్యశేషము రు♦మాధవ! యించుకయైన నున్నచో
ననఘులు భూరిశౌర్యులు మ♦హాత్ములు మూర్ఛ దొలంగువారు పొ
మ్మనయము సత్యధర్మనిర♦తాత్ముల కెం దపమృత్యుభీతి లే
దని యుదకార్ద్రహస్తమున ♦ నాతని నేత్రయుగంబుఁ దుడ్చుచున్.

అర్థములు. భాగ్యశేషము=భాగ్యమునందు శేషము, మిగిలినది, పొమ్మ= నిశ్చయము, అనయము = ఎల్లప్పుడు, సత్యధర్మ నిరతాత్ములకున్ = సత్యమందు ధర్మమందువిశేషప్రీతిగలమనస్సుగలవారికి, అపమృత్యుభీతి=అకాలమరణభయము, ఇదియే ఈ ఘట్టమున నేర్చుకొనవలసిన నీతి, అధర్మమం దుండువాఁ డెంత బలిష్ఠుఁడైనను ధర్మమందుండువాఁ డెంత బలహీనుఁడైనను ధర్మాత్మునకు తత్కాలమునఁ గొంచెము కష్టము కలిగినను తుదకు ధర్మమే జయించును. 'ధర్మస్య ప్రభు రచ్యుతః' ధర్మమునకుఁ బ్రభువు నారాయణుఁడు. కావున ధర్మము చెడకుండ నాయన రక్షించును. 'ధర్మోరక్షతి రక్షితః' ధర్మము తన్ను రక్షించువాని రక్షించును. 'ధర్మ

నిస్తారక మయ్యు సత్యఫలదాయకమయ్యును దైవముండెడున్," భార, ఉద్యో.
ఇంద్రజిత్తు మహామాయలు ధర్మాత్ములగు రామలక్ష్మణులందు వ్యర్థములయ్యెను.
ఉదకార్ద్రి హస్తమునన్=నీటితోఁ దడిసిన చేతితో.

తాత్పర్యము

సుగ్రీవా! మనకుఁగూడఁ గొంచెమైన నదృష్టము మిగిలి యుండెనా యది వ్యర్థము పోరాదు కావున పాపరహితులు, మహాశూరులు, మహాత్ములు నిజముగా మూర్ఛవిడిచి లేతురు. అంత దృఢముగా నీవెట్లు చెప్పఁగలవందువా? సర్వదా సత్య ధర్మములందుఁ బ్రీతిగలిగి వర్తించువారికి నకాలమరణభయము కలుగదు. వీరట్టివారు కావున వీరికి నపమృత్యు భయములేదు, చూడుమని చేతులు కడుగుకొని నీళ్లు మంత్రించి యాతీర్థముతో నతని కన్నులు తుడిచెను.

తే. మంత్రితాంబువులను గొని మంత్రవిదుఁడు, మార్జనము సల్పె నేత్రయుగ్మంబుకీశ
రాజునకు నెంచి కాలసంప్రాప్తమైన, వాక్యములుపల్కె మదితోఁ బ్రపాటుదొలఁగ.

తాత్పర్యము

మంత్రించిన జలముగొని మంత్రము లెఱిఁగిన విభీషణుఁడు సుగ్రీవుని రెండు కన్నులు తుడిచి కాలయోగ్యమైన మాట లిట్లు చెప్పెను.

బ్రహ్మ వరమునకు విభీషణుఁ డడ్డుపడలేకపోయినాఁడు కాని యింద్రజిత్తు చేయు మాయ విభీషణుఁడు తెలిసికొనలేకపోలేదు. ఈ కారణముచేతనే మాయకు బ్రతిమాయ యేదైనఁ జేయునేమో యను భయముచే విభీషణుని నింద్రజిత్తు కొట్టలేదు. రామలక్ష్మణులు మూర్ఛపోయిరి కాని చావలేదు. ఆ యస్త్రములకుఁ గట్టివేయునంత మాత్రము బలమే కాని చంపెడు శక్తి లేదు. విద్యుజ్జిహ్వుఁడు కల్పించిన మాయవలె, మాయచేనైనది యల్పకాలముండునే కాని దీర్ఘకాల ముండదు. మంత్రబలము తగ్గగానే కట్లూడి పోవును. ఈ లోపల బాధపడలేక ప్రాణము పోయినఁ బోవలెను. ఈ మాయాస్త్రముల లక్షణము వాస్తవము తెలిసిన సుగ్రీవుఁడు ధైర్యముతో నుండునని తలఁచి విభీషణుఁడు మంత్రజలముల నాయన కన్నులు తుడిచెను. అప్పుడు సుగ్రీవుఁడున్న వాస్తవము తెలిసికొన్న వాఁడయ్యెను.

కం. కాలంబు గాదు నీకున్, దీలు పడఁగ నిట్టిగతి, నతిస్నేహము దు
ష్కాలంబున వీక్షించుట, హేళిసుతా! మరణమునకు హేతువు సుమ్మీ.

అర్థములు. డీలుపడఁగన్=దిగులు పడఁగన్, వీక్షించుట = పాటించుట, హేళిసుతా = సూర్యపుత్రా.

తాత్పర్యము

ఈ విధముగ నీవు దిగులు పడవలసిన కాల మిదికాదు. ఇది ధైర్యముతో నుండవలసిన కాలము. అకాలంబున నతిస్నేహము పాటించుటయే మరణమునకు కారణము. అకాలమం దతిస్నేహము పూనరాదు.

సీ. కావున సర్వార్థ♦ఘాతి నధైర్యంబు, విడువుము వానర♦వీరవర్య
రామచంద్రుఁడె తమ♦ప్రాపని నమ్మిన, దళిముల నెల్లను ♦ దలఁపవయ్య
కాదేని స్మృతి తప్పి ♦ కాకుత్స్థుఁ డుండెను, దాఁక నాతనికాపు♦దలఁగ కయ్య
జనవరేంద్రులు లబ్ధ♦సంజ్ఞులైనను మన, యడ లెల్లఁ దీర్ప న♦మర్థు లయ్య
ఆ. నాగపాశబంధ♦నములు శ్రీరామున, కెట్టిబాధ నిడవ ♦ యింత నిజము
మరణభీతి వలదు♦మరణించువారి కీ, కాంతి వదనసీమఁ♦గలుగ దెపుడు. ౯౬౨

అర్థములు. సర్వార్థఘాతి=సమస్తకార్యములు చెఱుచునది, అధైర్యంబు=భయము, లబ్ధసంజ్ఞులు=మూర్ఛ తేఱినవారు, అడలు=దిగులు=దుఃఖము.

తాత్పర్యము

సుగ్రీవా! యధైర్యమున నన్నికార్యములు చెడును. కావున దానిని వదలుము. రామచంద్రుఁడే తమకు దిక్కని ఈ వానరులెల్ల నమ్మియున్నారు. నీవు దిగులుపడి కూర్చుండితివేని రామునకేమో యని వీరెల్లరు భయపడుదురు. దానివలనఁ గార్యహాని యగును. నీవు ధైర్యము వహించిన వారును ధైర్యము వహింతురు. అట్లు కాదేని వీరు మూర్ఛఁ దేఱువఱకు వీరిని కాచువారిని నియమింపక విడువకు. వీరు మూర్ఛ దేఱిరా మన దిగులు వ్యసనముఁ బాపఁగలరు. ఈ నాగపాశబంధములు రామచంద్రమూర్తికి బాధ కలిగించునవి కావు. బ్రహ్మవరము గౌరవింపవలసి యిట్లున్నాఁడు కాని నిజముగ బాధచేఁగాదు. ఈ బాధచే రామచంద్రమూర్తి మరణించునని భయపడవలదు. ఏలన మరణించువారి ముఖములం దీ కాంతి యుండదు.

ఉ. కావున సర్వకార్యములు ♦ క్రమ్మఱ నే సరిపెట్టుదాఁక సు
గ్రీవ! సమాశ్వసిల్లు మెకఁ♦గీశ సమూహము నూఱడింపుమీ
యీ వనచారులెల్ల వికచే♦క్షణులై వెఱ తొట్టగిల్లఁగా
నావల నట్టె చూచి కపి♦నాయక యొండొరు వీనులం దొగిన్. ౯౬౩

అర్థములు. వికచేక్షణులై - ఱెప్పలు పైకెత్తి కన్నులు వికసింపఁ జేసినవారై - వెఱ=భయము-నేనే యింద్రజిత్తని తొట్టగిల్లఁగా = అతిశయింపఁగా - అట్టెచూచి=ఱెప్పలువాల్పక చూచి.

తాత్పర్యము

సమస్తకార్యములు చక్కఁబెట్టి మరల నేను వచ్చువఱకు సుగ్రీవా! నీవూఱకుము. వానరసేనలను సమాధానపఱుపుము. ఏలన నీ వానరులందఱు నేనే ఇంద్రజిత్తని భయపడి కన్నులు పెద్దవిచేసికొని నన్నిగా దిగా చూచుచు నొకరి చెవిలో మఱియొకరు.

తే. గుసగుసలు పోవుచున్నారు♦వెసఁ బలాయ, మాను లగుటకు వీరిని♦మాన్పవయ్య
వనచరావళి భుక్తపూ♦ర్వస్రజంబు, పోల్కి భయమును విడువంగ♦బుద్ధి సెపుమ.

అర్థములు. పలాయమానులు = పరువెత్తి పోవువారు - భుక్తపూర్వ= ముందనుభవింపఁబడిన-స్రజంబు=పూల దండ-పోల్కి=వలె.

తా త్ప ర్య ము

గుసగుస రహస్యములు చెప్పుకొనుచున్నారు. వారి నడవడి చూచినఁ బరువెత్తి పోవుటకు సిద్ధపడినట్లు తోఁచుచున్నది. కావున ముడిచితీసిన పూలదండను మరల ధరింపక యావలఁ బాఱవైచునట్లు భయమును వదలుఁడని వీరికిబోధింపుము.

కం. అనుచు విభీషణుఁ డీగతి-వనచరపతి నూఱడిల్లఁ◆బలికి మఱి పలా
యనపరమగు ప్లవగావళి,ననునయవాక్యములఁ దేర్చె◆నడలక యుండన్.

అర్థములు. పలాయన పరము = పరువెత్తుట యందాసక్తిగల, అనునయ వాక్యములను=సమాధానపు మాటలచే.

తా త్ప ర్య ము

అని యీ ప్రకారము సుగ్రీవునకు నూఱడింపు మాటలు చెప్పి పరువెత్తి పోవ నాలోచించు వానరులకు సమాధాన వాక్యములుచెప్పి వారు భయపడకుండ వారి కలఁక దీర్చెను.

—◆ { ఇంద్రజిత్తు రావణునితోఁ దాను శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేసి వధించితి నని చెప్పుట. } ◆—

ఉ. అక్కడ నింద్రజిత్తు సక◆లాసుర సేనలు గొల్వ లంకఁ జే
రుక్కునఁ జొచ్చి తండ్రికి ర◆ఘూద్వహయుగ్మముచావుఁ జెప్పినన్
గ్రక్కునఁ బీఠి డిగ్గి కొడు◆కా! బళిరే యని మెచ్చి శీర్షమున్
మొక్కలపుంబ్రమోదమున◆మూర్కొని కౌఁగిటఁ జేర్చి పిమ్మటన్. ౯౬౬

అర్థములు. పేరుక్కునన్=మిగుల బలగర్వముతో, యుగ్మము = జంట, మొక్కలపుంబ్రమోదమునన్=సంతోషాతిశయమున, మూర్కొని=వాసనచూచి.

తా త్ప ర్య ము

అక్కడ నింద్రజిత్తు రాక్షస సేనలన్నియుఁ దన్ను సేవింపఁగా బలవిజృంభణముచే లంకలోనికిఁ బోయి తండ్రికి రామలక్ష్మణు లిరువురు చచ్చిరని చెప్పఁగా నాసనమున నుండి దూఁకి 'కొడుకా బలే బలే' యని మెచ్చి యధిక సంతోషముతో నతని శిరస్సు వాసనచూచి కౌఁగిలించి యానల.

కం. శ్రీరాఘవులవధవిధం, బారఁగ వినఁగాఁ గుతూహ◆లాత్ముం డగుడున్
నారాచబంధనంబున, వారలు నిశ్చేష్టు లగుట◆ప్రభ పాయుటయున్. ౯౬౭

తా త్ప ర్య ము

ఎట్లు చంపితివి? ఏమి యుపాయము చేసితివి? అని యావిధమంతయుఁ జెప్పుమని వినఁగోరిక గలవాఁడై యడుగఁగా నాగపాశములచే వారిని గట్టి వైచితిని.

కాలు సేతులు కదలింపలేక పడిపోయిరి. ముఖమునఁ గాంతియుఁ దొలఁగెను. దూరమునుండి తెలియవచ్చునది యింతయేకదా.

కం. వినిపించె యథావృత్తం, బును సర్వం బింద్రజిత్తు ♦ ముదమునను దశా
ననుఁ డుత్సహించి రాఘవ,జనితభయము విడిచి పుత్రు♦శ్లాఘించెఁ గడున్.

అర్థములు. యథావృత్తము=జరిగిన విధము.

తా త్ప ర్య ము

అని జరిగిన విధమంతయు నింద్రజిత్తు వినిపింపఁగా రావణుఁడు రామలక్ష్మణుల వలనఁ గలిగిన భయము విడిచి సంతోషించి కొడుకును మిగులఁ బొగడెను. ఇంతవఱకుఁ బాడ్యమినాఁటి యుద్ధమని మహేశ్వర తీర్థీయము. అయినను జీఁకటి వర్ణింపఁబడుటచే బహుళ ప్రతిపత్తు గాదని తోఁచుచున్నది. రెండవపక్షమున నిది యంతయు నవమినాఁటి యుద్ధమే. ఏలన రామలక్ష్మణులు బంధముక్తులై లేచిన తరువాత (౧౦౬౦ ప.) నిశామధ్యమని చెప్పఁబడెను. ఈలోపల పగటి వర్ణనము చెప్పఁబడ లేదు.

—♦ ౪౭-వ సర్గము. హనుమదాదులు శ్రీరామలక్ష్మణులఁ గాచి యుండుట. ♦—

తే. హనుమదంగదనీలగ ♦ వాక్ష గవయ, గజ సుషేణ కుముద నల ♦ కంజజాత్మ
జాతపృథురంభ శతవలి♦శరభ గంధ,మాదనులు ఋషభస్కంధ♦మర్కటుండు.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. కృతకార్యుం డై రావణ, సుతుఁ డరుగుడు లంక కంతఁ♦జుట్టు నిలిచి దుః
ఖితు లై మిక్కిలి జాగ్ర, న్మతితో రక్షణ మొనర్పు♦మానవనాథున్. ౯౭౦

అర్థములు. కృతకార్యుండై = చేయవలసిన పని చేసినవాఁడై - అరుగుడున్=అరిగిన యనంతరము - జాగ్రత్ + మతితోన్ = హెచ్చరికతోఁగూడిన మనస్సుతో.

తా త్ప ర్య ము

ఇంద్రజిత్తు తాను జేయవలసిన పని చేసినవాఁడై లంకకుఁబోయిన తరువాత రామలక్ష్మణులఁ జుట్టుకొని నిలిచి దుఃఖించుచున్నవారయ్యు మిగుల హెచ్చరిక గలవారై వారిని రక్షించుచుండిరి.

కం. వృక్షచరు లున్నవారలు, వృక్షంబులఁ గేలఁ బూని♦తృణము గదలినన్
రాక్షసు లని యులుకుచు మది, వీక్షించిరి దిక్కులెల్ల♦విన్నున్ మన్నున్.

అర్థములు. ఉన్నవారలు=తక్కినవారు-ఉలుకుచున్=ఉలికిపడుచు.

తా త్ప ర్య ము

తక్కిన వానరులు చేత వృక్షములు పట్టుకొని గడ్డిపోచ గదలినను రాక్షసులు వచ్చిరని యులికిపడుచు నే దిక్కునుండి వచ్చిరని పదిదిక్కులు చూచుచుండిరి.

—♦ { రావణుఁడు రాక్షసస్త్రీలతో సీతాదేవికిఁ శ్రీరామలక్ష్మణులఁ జూపుఁడని చెప్పుట. } ♦—

తే. ఆత్మజునిఁ బంచి యసుర ధ♦రాత్మజాత, రక్షిణుల రాక్షసస్త్రీల♦రా వచింపఁ
త్రిజట మున్నుగ వారలే♦తేరఁ బ్రీత, మానసంబున నిట్లను♦మానినులకు. ౯౭-౨

అర్థములు. అసుర=రావణుఁడు, రక్షిణులన్=రక్షించు స్త్రీలను.

తాత్పర్యము స్పష్టము.

ఉ. చచ్చిరి రామలక్ష్మణులు ♦ శక్రజిచే నని భూమికన్యతో
ముచ్చటమీఱఁ జెప్పి రణ♦మూర్ధతలస్థితులన్ నెలంత దా
నచ్చిక పుట్టఁ జూడ జత ♦ నంబునఁ బుష్పకయానసీమపై
నచ్చెలి నిల్పి తోడ్కొని ర♦యంబునఁ బొండటఁ జూపుఁ డంతయున్. ౯౭-౩

అర్థములు. శక్రజిచే = ఇంద్రజిత్తుచే, 'జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాష నగు,' సు. వ్యా. తత్స ౯౧ సూ. ఇందలి యింద్రజిత్తను శబ్దము తత్సమానముల కుపలక్షకము. రణమూర్ధతలస్థితులన్ = యుద్ధభూమి ముందరి భాగమున నున్నవారిని, నెలంత=స్త్రీ, సీత నచ్చిక = నమ్మకము, జతనంబునన్ = ప్రయత్నముతో, రానని చెప్పినను వదలక.

తాత్పర్యము

రామలక్ష్మణు లింద్రజిత్తుచేఁ జచ్చిరని సీతాదేవితో సంతోషముతోఁ జెప్పి యామె నమ్ముటకై యామెను బలవంతముగనైనఁ బుష్పక విమానముపై గూర్చుండఁ బెట్టుకొని యుద్ధస్థలమున ముందరి భాగమందే పడియున్న రామలక్ష్మణుల జూపుఁడు. యుద్ధరంగమంతయుఁ జూపుఁడు.

ఉ. ఎవ్వనిప్రాపు నమ్మి జల ♦ జేక్షణ కావర మెత్తి నన్నుఁ దా
గవ్వకు లెక్కసేయ దల♦కాంతుఁడు రాముఁడు భ్రాతృయుక్తుఁడై
చివ్వను జచ్చె, నింక సతి ♦ చింతయు శంకయు నాశఁ బాసి యా
మవ్వరి సర్వభూషణ సు ♦ మండిత యై నను డాయుఁ గాపుతన్. ౯౭-౪

అర్థములు. కావరము = పొగరు, భ్రాతృయుక్తుఁడై = తమ్మునితో, చివ్వను=యుద్ధమందు, మవ్వరి = సుందరి, మవ్వము+అరి = మత్వర్థీయ తద్ధితాంతము, సర్వభూషణ సుమండితయై=సమస్తాభరణములతో నలంకరించుకొన్నదై.

తాత్పర్యము

ఎవ్వడు తన కాశ్రయమని నమ్మి సీత గర్వముచే నన్ను గవ్వతో సమముగనైన లక్ష్యము సేయకున్నదో యట్టి మగఁడు రాముఁడు తమ్మునితో యుద్ధమందుఁ జచ్చెను. ఇఁకమీఁద నామె విచారము భయము రామునితో మరలఁ గలయఁగల నను నాశవదలి యాయందగత్తె సమస్తాభరణములుధరించి నన్నుసమీపించును గాక.

క. ఇపుడు కదా తమ్మునితో, విపులం బరాసువుగ నున్న ♦ విభుం గనుంగొనుటన్
వ్యపనీతాశను సతి తన, విపరీతస్థితి ననన్య♦విధగతి నెఱుంగున్. ౯౨౬

అర్థములు. విపులన్=భూమియందు, పరాసువుగన్=పీనుఁగుగ, వ్యపనీతాశను=రాముని యాశవదలినదై, విపరీతస్థితి=మాఱిపోయినస్థితి=మగఁడు లేకుండుటను, అనన్యవిధగతిన్=వేఱువిధమైన ప్రాపు లేకుండుటచే.

తాత్పర్యము

ఇప్పుడుగదా తమ్మునితోడఁ దన మగఁడు చచ్చి నేలఁబడి యుండుట చూచి రాముఁడు తన్ను రక్షించు నను నాశ పోయినదై సీత తన విధవాత్వమును, నేను దప్ప వేఱు ప్రాపు లేకుండుటను తెలిసికొనును.

ఉ. ఇప్పుడు భర్తపట్ల నిర ♦ పేక్షమనంబున నన్నుఁ దానుగాఁ
దప్పక గైకొనుం జెలువ ♦ తప్పదు పొం డన, వారు నట్టు లే
తెప్పునఁ బుష్పకంబుఁ గొని ♦ దీనత వల్లభశోకతప్తయై
ముప్పిరి గొన్న తాపమున ♦ మున్గు ధరాసుత నందు నిల్పుచున్. ౯౨౭

అర్థములు. నిరపేక్షమనంబునన్=కోరికలేని మనస్సుతో, తానుగాన్ = తనకుఁదానే, నా ప్రార్థన లేకయే. "అయి కా నవ్యయంబులు స్వాయమర్థకంబులగు", ప్రౌ.వ్యా.క్రియ ౩౩ సూ. వల్లభశోకతప్తయై=భర్తృశోకమునఁ దపించునదియై, ముప్పిరి=అతిశయించిన, మూఁడు+పిరులు=ముప్పిరి, ద్విగువు.

తాత్పర్యము

ఇప్పుడిఁక భర్త నన్ను, తన్ను రక్షించును, అను నపేక్ష వదలినదై సీత నన్నుఁ దనకుఁ దానే నేను గోరకున్నను తప్పక గ్రహించును. ఇది తప్పదు, పొండని చెప్పఁగా వారట్టులే పుష్పకము తీసికొని భర్తృవ్యసనముచేఁ దపించుచు నతిశయమునఁ దాపమున మునిఁగియున్న సీతను దానియందుంచి.

కం. పౌలికలనికిఁ దోడ్కొని చని, రలివేణియుఁ ద్రిజటతోడ♦నటఁ గనె ధరపై
బలిముఖదళములు సర్వము, విలయంబును బొంది చెడిన♦విధ; మిటఁ బరిలోన్.

అర్థములు. పౌలికలనికి—స్మశానమునకు=రామలక్ష్మణులు పడియుండు యుద్ధప్రదేశమునకు, విలయము=నాశము, బలిముఖదళములు=వానరసేనలు.

తాత్పర్యము స్పష్టము

కం. హత్తినముదమున దశముఖుఁ, డెత్తించెన్ ధ్వజము లెల్ల♦యెడఁ బ్రకటించెన్
మిత్తిని గూర్చెను వాసవ, జిత్తని రాఘవుల ననుచుఁ♦జెచ్చెర నంతన్. ౯౨౮

అర్థములు. హత్తిన = పొందిన, ముదమునన్=సంతోషముచే, మిత్తిని= మృత్యువును, వాసవజిత్తు=ఇంద్రజిత్తు.

తాత్పర్యము స్పష్టము.

—• సీతాదేవి పుష్పకంబున నుండి శ్రీరామలక్ష్మణులఁ జూచుట. •—

కం. పొంగెడి రక్కసమూఁకలఁ, గ్రుంగెడి కాకుత్స్థపార్శ్వ•గుల వానరులన్
గంగిసస్మృతి దొఱఁగిన దు, ర్భంగుల శరతల్పగతుల•రాముని ననుజున్.

అర్థములు. పొంగెడి=సంతోషముచే నుబ్బుచున్న, రక్కసమూఁకలన్=రాక్షససమూహమును, క్రుంగెడి=దుఃఖముచే నణఁగిన, కాకుత్స్థపార్శ్వగులన్=రామలక్ష్మణుల ప్రక్కలనున్నవారిని, కంగిసన్=యుద్ధమునందు, స్మృతిదొఱఁగిన=తెలివితప్పిన, దుర్భంగులన్=చెడుస్థితి గలవారిని, శరతల్పగతులన్ = బాణముల పాన్పు నందుండు వారిని, దీనికిఁ గర్తృపదము ౯౮౧ లోని అసితేక్షణ.

తా త్ప ర్య ము

సంతోషముతో నుబ్బిపోవుచున్న రాక్షసుల గుంపులను, దుఃఖముచే నణఁగి రామలక్ష్మణుల ప్రక్కలనున్న వానరులను యుద్ధమున తెలివితప్పి దుస్థితియందు నంపపానుపుపైఁ బడిన రాముని నతని తమ్ముని.

ఉ. వ్రాలినచాపముల్ రుచులు•వాడినరూపము లూడురోపముల్
చీలినవర్మముల్ దెగిన•జీవితమర్మము లాడుచర్మముల్
దూలెడి యూర్పులుం జెడిన•తోరపునేర్పులు మోముమార్పులున్
ధూళిని గ్రుంగుమేను లగు•తోయజనేత్రుల నగ్నిపుత్రులన్. ౯౮౦

అర్థములు. వ్రాలిన = నేలఁబడిన, రుచులు=కాంతులు, రోపముల్ = బాణములు, వర్మముల్=కవచములు, జీవితమర్మములు=ప్రాణములుండునాయువుపట్లు, గ్రుంగు=మునిఁగిన.

తా త్ప ర్య ము

నేలఁబడిన విండ్లు, కాంతులుఁ జెడిన రూపములు, సడలిన బాణములు, పగిలిన కవచములు, తెగిన యాయువుపట్టులు, వ్రేలాడు చర్మములు, కొంచెముగా వెలువడు శ్వాసములు చెడిన మిక్కిలి నేర్పులు, పూర్వమువలెఁగాక మాఱిపోయిన ముఖములు, దుమ్ములోఁ మునిఁగిన దేహములుగల కమలనేత్రులను నగ్నిపుత్రులతో.

కం. ఎనసెడివారల భ్రాతల, ననుపమదేవప్రభావ•హారులఁ బతి నా
యనవద్యగాత్ర సౌమిత్రిని నసితేక్షణ నితాంత•దీనాత్మిక యై. ౯౮౧

అర్థములు. ఎనసెడి =పోలుచున్న, అనుపమ = అసమానమైన, దేవప్రభావ=విష్ణువు మహిమచే, హారులన్ = మనోహరులైన వారలను, అనవద్యగాత్ర = దోషరహితమైన దేహము గలది. అనఁగా వైధవ్యచిహ్నము లేనిది. అసితేక్షణ=నల్లని చూపులుగలది, నితాంత=మిక్కిలి, దీనాత్మికయై=దుఃఖముతోఁ గూడిన మనస్సు గలదై.

తా త్ప ర్య ము

పోలుచున్న యన్నదమ్ములను, అసమానమైన విష్ణుప్రభావమువంటి ప్రభా

వము గలవారిని, దోషరహితమైన దేహముగలది, తన భర్తయగు రామచంద్ర మూర్తిని, కాటుకకంటిది లక్ష్మణుని మిగులదుఃఖముతోఁ గూడిన మనస్సుగలదై.

కం. కాంచుచు నెట్టులొకో యీ, యంచితమహిమాఢ్యు లిట్టులైరనుచు వితర్కించుచు బాష్పంబులఁ గురి, యించుచు దుఃఖాబ్ధి మునిఁగి యీవిధి నేడ్చెన్.

అర్థములు. వితర్కించుచు=ఆలోచించుచు.

తాత్పర్యము స్పష్టము.

౪౮-వ సర్గము. నాగపాశబద్ధులైన శ్రీరామలక్ష్మణులఁ జూచి సీతాదేవి దుఃఖించుట.

కం. సుతవతి నయ్యెద ననుచుం, బతిహీనత నొంద ననుచుఁ బలికిరి నన్నన్ క్షితిసురులు లక్షణజ్ఞులు, హతుఁడగుటను రాముఁ డనృతమాడిరిజ్ఞానుల్.

అర్థములు. లక్షణజ్ఞులు = స్త్రీ సాముద్రికశాస్త్రము తెలిసినవారు, క్షితిసురులు = బ్రాహ్మణులు, 'షష్ఠివదుత్తరా యోషిదంగలక్షణ' మ్మని స్త్రీ సాముద్రికము. సుతవతిని=కొడుకులుగలదానను, పతిహీనత=వైధవ్యము.

దీర్ఘాంగుళిశ్చ యా నారీ, దీర్ఘకేశీచ యా భవేత్
దీర్ఘమాయు రవాప్నోతి, పుత్రైశ్చ సహవర్తతే.'

పొడుగు వ్రేళ్ళుగలదియు పొడుగు వెండ్రుకలు గలదియు నగు స్త్రీ దీర్ఘాయుస్సు గలదై కొడుకులుగల దగును.

"శుభః కమలినీపృష్ఠ గజస్కంధోపమో భగః
వామోన్నతస్తు కన్యాదః పుత్రదో దక్షిణోన్నతః".

గుహ్యము తాఁబేటి వీఁపువలెను ఏనుఁగు మూపురమువలెను నుండిన శుభప్రదము. ఎడమప్రక్క నున్నతముగ నుండిన స్త్రీ సంతానము కుడిప్రక్క నున్నతముగ నుండిన పురుషసంతానము కలదు.

'సూతే సుతాన్ బహూన్ నారీ పృథుకుక్షిస్సుఖాస్పదమ్
క్షితీశం జనయే త్పుత్రం మండూకాభేన కుక్షినా'
'ఉన్నతే నోదరేణైవ - వంధ్యా నారీ ప్రజాయతే.

కడుపు పెద్దదిగ నుండిన బహుపుత్రులఁ గనును. కప్ప యాకారమువంటి కడుపుగలది భూమి పాలించువానిని గనును. ఉన్నతముగ నుండిన గొడ్రాలగును

'సువిశాలోదరీ నారీ-నిరపత్యా చ దుర్భగా
ప్రలంబ జఠరా హంతి – శ్వశురం చాపి దేవరమ్'॥

మిక్కిలి విశాలమైన యుదరము గలది సంతానహీనురాలును దరిద్రురాలు నగును. వ్రేలాడు పొట్టగలది మామగారిని మఱఁదిని జంపును.

'నిర్లోమ హృదయం యస్యా స్సమం నిమ్నత్వ వర్జితం
ఐశ్వర్యం చాప్యవైధవ్యం, ప్రియప్రేమచ సా లభేత్ ॥

హృదయమందు వెండ్రుకలులేక, సమమై గుంతగా లేక యుండునో యామె యైశ్వర్యము, అవైధవ్యము గలదై ప్రియుని ప్రేమ సంపాదించుకొనునది యగును.

మధ్యం స్త్రియా స్త్రివలి సార్థ మరోమశంచ
వృత్తే ఘనా వవిషమా కఠినా వురోజౌ
రోమాపవర్జిత మురో మృదు చాంగనానామ్
గ్రీవాచ కంబు నిచితార్థ సుఖాని దత్తే ॥ అని సాముద్రిక శాస్త్రము.

తాత్పర్యము

సాముద్రిక శాస్త్రము తెలిసిన బ్రాహ్మణులు నాకుఁ గొడుకు లుదయింతు రనియు నాకు వైధవ్యము లేదనియుఁ జెప్పిరి. ఇప్పుడు నాభర్త హతుఁడగుటచే నీ రెండు నసత్యము లయ్యెను. కావున జ్ఞాను లసత్యమాడిరి.

కం. క్రతుశతనిరతుం డగు సువ్రతికి మహిషి సత్రయాగ♦పరుపత్నినినై
నుతిఁ గందు నంచుఁ బలికిరి, హతుఁ డగుటను రాముఁ డనృత♦మాడిరి జ్ఞానుల్.

అర్థములు. క్రతుశత నిరతుండు=నూఱు యాగములు చేయుటయందుఁ బ్రీతి గలవాఁడు, సువ్రతి = అటువంటి మంచి వ్రతము గలవాఁడు, మహిషి = పట్టాభిషిక్తురాలగు భార్య, సత్రయాగపరు=బహు సంవత్సర సాధ్యమై యనేకులు కర్తలుచేయు యాగము సత్రయాగము. అట్టియాగము చేయువాని పత్ని; ఆయజ్ఞ సంబంధముగల భార్యను 'పత్యుర్నోయజ్ఞసంయోగే' యను పాణిని సూత్రప్రకారము పతి శబ్దమునకు నకార మంతాదేశమై జీప్ప్రత్యయము రాఁగాఁ బత్ని యని రూపము.

తాత్పర్యము

నేను నూఱు యజ్ఞములుచేయు నభిలాష గలవానికిఁ బట్టపురాణి నగుదు ననియు, సత్రయాగము చేయువాని పత్నినై కీర్తిఁగందుననియుఁ జెప్పిరి. రాముఁడు హతుఁ డగుటచే జ్ఞాను లనృతమాడిన వారైరి.

కం. మతిమంతులు దైవజ్ఞులు, క్షితిసురులే వినుచు నుండఁ♦ జెప్పిరి శుభ సం
తతిశతము నన్నుఁ గూరిచి, హతుఁ డగుటను రాముఁ డనృత♦మాడిరి జ్ఞానుల్.

అర్థములు. మతిమంతులు = బుద్ధిగలవారు, దైవజ్ఞులు = అదృష్టఫలము చెప్పఁగల జోస్యులు, శుభసంతతిశతము=అనేక శుభములు గలుగు నని.

తాత్పర్యము

బ్రాహ్మణులు, పండితులు, జోస్యులు నన్ను గుఱించి యెన్నియో శుభములు చెప్పిరి. రాముఁడు హతుఁడగుటచే జ్ఞాను లసత్యమాడిన వారైరి.

కం. అతులిత వీరవరుం డగు, క్షితిపతికిం బత్ని నగుచుఁ♦ జెలఁగెద నని స
త్కృతి నని చెప్పిరి యయ్యో,హతుఁ డగుటను రాముఁ డనృత♦మాడిరిజ్ఞానుల్.

అర్థములు. అతులిత=అసమానమైన, వీరవరుఁడు=వీరులందు శ్రేష్ఠుఁడు, క్షితిపతికిన్=రాజునకు, సత్కృతిని=పుణ్యాత్మురాల నని.

తా త్ప ర్య ము

అసమానవీరులందు శ్రేష్ఠుఁడగు రాజునకు నేను భార్యనగుదునని, పుణ్యాత్మురాలని బ్రాహ్మణులు చెప్పిరి. రాముఁడు హతుఁడగుటచే జ్ఞాను లసత్య మాడినవారైరి.

ఉ. పాదములందు నే కమల♦పాణికిఁ గ్రాలునో యట్టి పద్మరే
ఖాది సుచిహ్న సంచయము ♦ లా తరళాక్షి నరేంద్రు పత్నియై
శ్రీదయివాఱఁ బొందు నభి♦షేకముఁ బట్టముతోడ, నక్కటా
నా దురదృష్ట మిట్టివియు ♦ నాశములయ్యె నిరర్థకంబులై. ౯౭౭

అర్థములు. కమలపాణికిన్=కమలమువంటి యెఱ్ఱని యఱచేతులు గలదానికి, పద్మరేఖాది=పద్మమువంటి రేఖలు మొదలయిన గుర్తులు, శ్రీ = సంపద, దయివాఱన్=అతిశయింపఁగా, దురదృష్టము=దౌర్భాగ్యము, నిరర్థకంబులై=వ్యర్థములై.

తా త్ప ర్య ము

కమలమువంటి యరచేయిగల యే స్త్రీ పాదములందు నాకుఁగల పద్మరేఖలు మొదలగు శుభరేఖలు గలవో యా స్త్రీ రాజపత్నియై భర్తతోడఁ బట్టము కట్టుకొని యభిషేకము నొందును. దాని సంపదయు నభివృద్ధి పొందును. అయ్యో! నాదౌర్భాగ్యదశ, యిట్టి ప్రసిద్ధములైనవి కూడ వ్యర్థములైనపుడు బ్రాహ్మణు లసత్యమాడి రననేల ?

చ. తరుణులు లక్షణంబు లెవి ♦ దాల్చుటచేతను భాగ్యహీనలై
ధర విధవాత్వ మందుదురొ ♦ తత్కలుషాంకము లందు నొక్కటేన్
బొరయదు, నిట్టి దుస్థితిని ♦ బొందుట యెట్టులొ? భద్రలక్షణో
త్కరములు పద్మ చిహ్నములు♦కార్యము లేమి యదెట్లొ దైవమా. ౯౭౮

అర్థములు. భద్ర లక్షణోత్కరములు=శుభచిహ్నముల సమూహములు. పద్మచిహ్నము=పద్మాకార రేఖల గుర్తులు, కార్యము లేమి=ఫలింపక పోవుట.

తా త్ప ర్య ము

ఎట్టిచిహ్నము ధరించిన స్త్రీలు భాగ్యహీనులయి విధవలగుదురని చెప్పఁబడెనో యట్టి చిహ్నములం దొకటియైన నాయందు లేదు. నాకేల యిట్టి దుస్థితి వచ్చెను? నాయందు శుభకరములైన పద్మచామరాది రేఖలు గలవు. అవి వ్యర్థములై యేల పోయెను ?

'విధవా విపులేన స్యాద్దీర్ఘాంగుష్ఠేన దుర్భగా'

కాలి బొటనవ్రేలు వెడల్పుగ నుండిన విధవ యగును. మిక్కిలి పొడవుగ నుండిన దరిద్రురా లగును.

'పరస్పరం సమారూఢాః - పాదాంగుళ్యో భవంతిచేత్
హత్వా బహూ నపి పతీన్ - పరప్రేష్యా తథా భవేత్
యస్యాః కనిష్ఠికా భూమిం - న గచ్ఛంత్యాః పరిస్పృశేత్
సా క్రమతం స్వపతిం హత్వా - జారేణ రమతే పునః
అనామికాచ మధ్యాచ - యది భూమిం నసంస్పృశేత్
పతిద్వయం నిహంత్యాద్యా చాపరాతు పతిత్రయమ్' ॥

కాలి వ్రేళ్ళొకదానిమీఁద నొకటి యెక్కి యుండిన అనేక పతులను జంపి పరపురుషునిచేఁ దీసికొని పోఁబడును. నడచు నపుడు చిటికెనవ్రేలు భూమినిదాఁక కుండిన తన మగనిఁ జంపి జారునితోఁ గ్రీడించును. దానికిఁ బ్రక్కఁది యగు ననామిక వ్రేలు నేలను దాఁక కుండిన నిద్దఱు పతులను జంపును, నడిమివ్రేలు తాఁక కుండిన ముగ్గురు పతులను జంపును.

"ఏకరోమా రాజపత్నీ ద్విరోమాఽతి సుఖాన్వితా,
త్రిరోమా రోమకూపేషు భవే ద్వైధవ్య దుఃఖభాక్"

పిక్కలందు రోమకూపములందు నొక రోమ ముండిన రాజపత్ని యగును. రెండు రోమము లుండిన సుఖవంతురా లగును. మూఁడు రోమము లుండిన వైధవ్య దుఃఖ మనుభవించును.

"వైధవ్యం రోమశైర్యుక్తం దౌర్భాగ్యం చిపిటై రపి"

తొడలయందు వెండ్రుక లుండిన విధవ యగును. చప్పటగా నుండిన దౌర్భాగ్యవతి యగును.

"వినతా చిపిటా దీర్ఘా నిర్మాంసా శకటాకృతిః
హ్రస్వరోమయుతా నార్యా దుఃఖ వైధవ్య సూచకాః"

మొల (నడుము క్రింది భాగము) వంగినదియు చప్పిగను పొడవుగను మాంస హీనముగను శకటాకారముగను పొట్టిగను రోమములు గలదిగను నుండిన విధవయగును.

"కురంగఖురరూపో య శ్చుల్లీకోటర సన్నిభః
రోమశో వివృతాస్యశ్చ దృశ్యనాసోతిదుర్భగః."

లేడియడుగువంటి రూపముగలదియు, పొయ్యిత్రొఱ్ఱవలె నుండునదియు, రోమములచే దట్టమైనదియు, ముఖము తెఱచుకొని యుండునదియు, దృశ్యనాసయు నగు భగము దౌర్భాగ్య సూచకము.

'శంఖావర్తో భగో యస్యా - స్సా గర్భ మిహా నేచ్ఛతి'

శంఖావర్తమువంటి సుడిగల భగము గర్భమును గ్రహింపఁ జాలదు.

'వంశవేతస పత్రాభో ఘనరోమాఘ నాసికః
వికటః కుటిలాకారో లంబగల్లస్తథాఽశుభః.'

వెమురాకు, ప్రబ్బలియాకు, వీని యాకారముగలిగి ఘనమైన రోమములు గల నాసిక కలిగి హెచ్చు తక్కువయై వంకరలై వ్రేలాడుచున్న పార్శ్వస్థానములు గల భగము అశుభప్రదము.

'భగస్య జాలం జఘనం విస్తీర్ణం తుంగమాంసలమ్
మృదులం మృదురోమాఢ్యం దక్షిణావర్త పీడితమ్
వామావర్తంచ నిర్మాంసం భుగ్నం వైధవ్యసూచకమ్.'

భగమునకుఁ బార్శ్వదేశము విశాలముగను, ఉబికిన మాంసము గలదిగను మెత్తగను మెత్తని రోమములతోఁ గూడినదిగను దక్షిణపు సుడిగలదిగ నుండిన శుభసూచకము. ఆ ప్రదేశము మాంసము లేక వంగినదై యెడమసుడి కలిగి యుండిన వైధవ్యము కలుగును.

'మధ్యే క్షామాచ సుభగా భోగాఢ్యా సవళిత్రయా.'

నడుమ సన్నమై మూఁడు మడతలతోఁ గూడియుండిన సౌభాగ్యవంతు రాలును ఐశ్వర్యభోగ్యములు గలదియు నగును.

'ఋజ్వీ తన్వీచ రోమాళీ యస్యా స్సా శర్మనర్మభూః
కుటిలా కపిలా స్థూలా విచ్ఛిన్నా రోమరాజికా
చౌర్యం వైధవ్య దౌర్భాగ్యే విదద్యా దిహ యోషితామ్.

నూగారు వంకర లేనిదిగను, సూక్ష్మముగ నుండిన సుఖము ప్రీతియు గలదై యుండును. వంకరై కపిల వర్ణము గలిగి స్థూలమై నడుమఁ దెగియుండిన స్త్రీ దొంగయు, నిర్భాగ్యురాలును, విధవయు నగును.

'విస్తీర్ణహృదయా యోషా పుంశ్చలీ నిర్దయా తథా
ఉద్భిన్నరోమ హృదయా పతిం హంతి వినిశ్చితమ్
అష్టాదశాంగుళతత మురః పీవర మున్నతమ్
సుఖాయ దుఃఖాయ భవే ద్రోమశం విషమం పృథు.'

విశాలవక్షస్థలముగల స్త్రీ వ్యభిచారిణియై నిర్దయు రాలగును. ఱొమ్మునందు పైకి స్పష్టముగాఁ దెలియుచున్న రోమములుగల స్త్రీ పతిని జంపును. పదునెనిమిది యంగుళముల వైశాల్యము గలిగి బలిసియుండిన సుఖప్రదము. రోమములు హెచ్చు తక్కువగ నున్న దుఃఖకరము.

'ఘనౌ వృత్తౌసమౌ పీనౌ దృఢౌ శస్తౌ పయోధరౌ
స్థూలాగ్రౌ విరళౌ శుష్కౌ వామోరూణాం న శర్మదౌ.
దక్షిణోన్నత వక్షోజా పుత్రిణీ ష్వగ్రజా మతా
వామోన్నతకుచా సూతే కన్యాం సౌభాగ్య సుందరీం
పీవరాస్యౌ సాంతరాళౌ పృథూపాంతౌ నశోభనౌ
మూలే స్థూలౌ క్రమ కృశౌ వగ్రే తీక్ష్ణౌ ప్రశస్తకౌ

సదృశం చూచుక యుగం శస్తం శ్యామం సువర్తులం
అంతర్మగ్నంచ దీర్ఘంచ కృశం క్లేశాయ జాయతే.

చన్నులు పెద్దవిగను, వర్తులవగను, సమానములుగను, బలిసినవిగను, దృఢముగ నుండినఁ బ్రశస్తములు. మొనలు లావుగను, ఎడముగను, ఎండినవిగ నుండిన సుఖ మీయవు. కుడి చన్నెత్తై యుండిన మంచి కొడుకును గనును. ఎడమ చన్నెత్తై యుండిన మంచి సుందరి, భాగ్యవతి యగు కూఁతును గనును. కొనలు బలుపు, రెండు స్తనములకు నడుమ నెడము, స్తనములకొనలు లావుగనుండుట, స్తనముల యంత ప్రదేశములు లావుగ నుండుట ప్రశస్తగుణములు కావు. మొదట లావుగను క్రమముగ సన్నముగను మొనలు తీక్ష్ణముగనుండిన ప్రశస్తములు, చనుముక్కులు సమానములుగను, గుండ్రములుగను, నల్లగనుండిన శుభము. లోన ముడుచుకొనినవి పొడవైనవి కృశించినవి యగు చనుముక్కులు దుఃఖకరములు.

"వక్రౌ స్థూలౌ చ రోమాఢ్యౌ యది వైధవ్య సూచకౌ
నిగూఢసంధీ శస్తాగ్రౌ శుభౌ వంసౌ సుసంహతౌ
వైధవ్యదౌ సముచ్చాగ్రౌ నిర్మాంసౌ పతిదుఃఖదౌ"

వంకర గలిగినవియు, లావైనవియు, రోమములు గలవి నగు భుజ శిరస్సులు వైధవ్యము కలిగించును. గూఢములగు సందులు గలవియు, ప్రశస్తమైన కొనలు గలవియు బాగుగ గూడినవి శ్రేష్ఠములు. కొన లెత్తై యుండిన వైధవ్యము ప్రాప్తించును. మాంసరహితములైన యెడల దుఃఖకరములు.

"విధవా బహురేఖేణ విరేఖేణ దరిద్రిణీ"

అఱచేతియందు గీతలు విస్తరించి యుండిన విధవ యగును. గీతలు లేకుండిన దరిద్రురా లగును.

'అంగుష్ఠమూలా న్నిర్గత్య రేఖా యది కనిష్ఠికామ్
యది సా పతిహంత్రీ స్స్యా ద్దూరత స్తాం వివర్జయేత్.'

అంగుష్ఠ మూలమునుండి ప్రారంభించి చిటికెనవ్రేలివరకు రేఖ యుండిన మగనిని జంపునది యగును. దానిని వర్జింపవలయును.

స్థూలగ్రీవాచ విధవా హ్రస్వగ్రీవాచ కింకరీ
వంధ్యాహి చిపిటగ్రీవా కుబ్జగ్రీవాచ దుఃఖభాక్.'

మెడ స్థూలముగ నుండిన విధవ యగును. పొట్టిగానుండిన దాసి యగును. చప్పటి మెడయుండిన గొడ్డురాలగును. మఱుగుజ్జుగానుండిన దుఃఖమనుభవించును.

'శ్యామ స్థూలోధరోష్ఠ స్స్యా ద్వైధవ్య కలహప్రియః'

పెదవి నల్లగ లావుగ నుండిన వైధవ్యము, కలహమును కలుగఁజేయును.

'అధస్తా దధికై ర్దంతై ర్మాతరం భక్షయే త్స్ఫుటమ్
పతిహీనాచ వికలైః కులటా విరలై ర్భవేత్.'

క్రిందివరుస దంతము లెక్కువగా నుండిన దల్లి లేనిదగును. విఱిగినవిగను హెచ్చుతగ్గులుగ నుండిన పతిలేని దగును. ఎడములు కలవైన జారిణి యగును.

—♦ సుళ్ళు —♦

శ్లో. శిరసో దక్షిణావర్తా పితరం హంతి కన్యకా
వామేచ జననీం హంతి త్రివర్షాభ్యంతరే స్తనే ॥
స్తనద్వయే యదావర్తో యస్యాస్సాఽపతికా భవేత్
ముఖావర్తా ధవం హంతి భుజావర్తా ప్రతివ్రతా ॥
ఉదరే శ్వశురం హంతి లలాటే హంతి దేవరం
యా నారీ చూచుకావర్తా సా భవే త్పరగామినీ ॥
కర్ణమూలే యదావర్తౌ శీర్షావర్త ద్వయం భవేత్
కించిత్సౌభాగ్య మాప్నోతి సా కన్యా విధవా భవేత్ ॥
భ్రువోర్మధ్యే భ్రువోర్యుగ్మే పాదావర్తా స్తథాస్త్రియః
విధవా జారిణీ వా స్యా ద్భ్రమణంచ యథేచ్ఛయా ॥
త్రీణ్యావర్తాః ప్రదృశ్యంతే లలాటే చోదరే కటౌ
శ్వశురం చైవ భర్తారం హన్యా త్సా దేవరం క్రమాత్ ॥
భుజమధ్యే యదావర్తం సమం మధ్యేచ సంస్థితం
ప్రదక్షిణం భవేత్తచ్చ ధనపుత్ర ప్రవర్ధనం ॥
జాను ద్వయే యదావర్తో గుల్ఫావర్తోఽప్రదక్షిణః
దుశ్శీలా భ్రమతే నిత్యం పరపుంసి రతా భవేత్ ॥
పాణ్యోః ప్రదక్షిణావర్తా, ధర్మ్యా వామా నశోభనా
నాభౌ శ్రితశ్శ్రీరసివా, దక్షిణావర్త ఈరితః ॥
సుఖాయ దక్షిణావర్తః, పృష్ఠవంశస్య దక్షిణే
అతః పృష్ఠం నాభిసమం, బహ్వాయుః పుత్రవర్ధనం ॥
గుహ్యావర్తా యదా నారీ, పరపుంసిరతా భవేత్
రాజపత్న్యాః ప్రకాశశ్చ, భగమూలౌ ప్రదక్షిణః ॥
నచే చ్ఛకటభంగీ స్యా, త్తత్స్యాపత్యవినాశనః
స్యాతా ముదర దేశేచ, పృష్ఠావర్తా నశోభనా ॥
ఏకేన హంతి భర్తారం, భవే దన్యేన పుంశ్చలీ
కంఠగో దక్షిణావర్తో దుఃఖవైధవ్య హేతుకః ॥
శీర్షేవాథ లలాటేవా త్యాజ్యా దూరా త్ప్రయత్నతః
ప్రదక్షిణౌ వా వామౌ వా రోమ్ణా మావర్తకౌ స్త్రియః ॥
ఏకోవా మూర్ధని ద్వౌవా దశాహాద్ధంతి సా పతిం

సుప్తా పరస్పరం యాతు దంతాన్ కటకటాపయేత్
సులక్షణాపి నసా శస్తా వివాహే కుంభసంభవ ॥

శిరమున కుడి సుడియుండిన తండ్రియు, ఎడమ సుడి యుండిన తల్లియు లేని దగును. స్తనమునందు సుడియుండిన మూఁడు సంవత్సరములలో తల్లి మరణించును, స్తనద్వయమున సుళ్ళుండిన పతిహీనురా లగును. ముఖమునందు సుడి యుండిన మగని జంపును. భుజములం దుండిన పతివ్రత యగును. కడుపునం దుండిన మామగారిని జంపును. నుదుట నుండిన మఱఁదిని జంపును. చను మొనలయం దుండిన అంకులాడి యగును. చెవుల మొదట రెండు సుళ్ళును, శిరమునందు రెండు సుళ్ళును ఉండిన కొంచెము సౌభాగ్యమును పొంది పిదప విధవ యగును. కనుబొమల నడుమను రెండు కనుబొమల యందును పాదముల యందును సుళ్ళుండిన విధవయు జారిణియు యథేచ్ఛముగఁ దిరుగునదియునగును. లలాటము-పొట్ట-కటిప్రదేశము వీనియందు మూఁడేసి సుళ్ళుండిన మగఁడు, మామ, మఱఁది వీరిని చంపునది యగును. భుజమధ్యమునందు సమముగ ప్రదక్షిణాకారముగ నుండిన ధనమును గొడుకులను గలిగించును. రెండు మోఁకాళ్ళయందును చీలమండల యందును అప్రదక్షిణమగు సుడియుండిన నెల్లప్పుడు దుస్స్వభావము గలిగి పరపురుషాసక్తురాలయి తిరుగునది యగును. చేతులయందు సుడులు ప్రదక్షిణముగ నుండిన ధర్మముగలిగి యుండును. ఎడమ సుళ్ళుండిన నశుభకరము. బొడ్డునందును బొమ్మనందును వెన్నెముకకు దక్షిణ పార్శ్వమునను కుడిసుడి యుండిన సుఖము ఆయుష్యము పుత్రసంతానము కలుగును. గుహ్యమునందు సుడియుండిన పరపురుషులను గూడునది యగును. భగమాళియందు ప్రదక్షిణమగు సుడియుండిన రాజపత్నియగును. అదియే శకటాకారముగ నుండిన పుత్రనాశముగలదియగును. కడుపునందును వీఁపునందును రెండు సుళ్ళుండిన పతిని జంపునదియు అంకులాడియు నగును. కంఠమునందు కుడిసుడి యుండిన వైధవ్యముగలదియగును. శిరమునందును లలాటమునందును సుడులుండిన నట్టి స్త్రీని విడువవలయును. శిరస్సునందు కుడి యెడమ సుళ్ళలో ఒకటిగాని రెండుగాని వెంట్రుకలతో తిరిగియుండిన పది దినములలో మగనిఁ జంపును. నిద్రించునపుడు దంతములను కటకట కొఱికెడు స్త్రీ సులక్షణవతియైనను పురుషునకు వివాహమునకుఁ దగదు. ఇట్టి దుష్టచిహ్నములు తనయందు లేవని చెప్పి తనయందున్న శుభలక్షణములు చెప్పుచున్నది.

సీ. సమములునలుపులు♦సన్నముల్ చికురముల్, కనుబొమల్ రెండును♦గలయఁబడవు
రోమహీనములు వఁట్రువలు నాజంఘలు, పలుచా లెడము లేక♦కలిసినదియుఁ
గణఁతలు నేత్రముల్ ♦ కరచరణంబులు, నూరులు గుల్ఫంబు ♦ లుబ్బ గలవు
నిద్దముల్ గుండ్రముల్♦నెఱిసమంబులుగోళ్లు, లురుపయోధరములొం♦డొంటి

నొరయు

తే. మగ్నములు చనుముక్కులు ♦ మఱియు నాభి
యుబ్బుప్రక్కలు లోఁతును ♦ నొనరినదియుఁ
బ్రక్కలును ఱొమ్ము నుబ్బునఁ ♦ గ్రాలు నాదు
నవయవద్యుతి మణినిభ♦మై తనర్చు. ౯౦౯

అర్థములు. చికురముల్=తల వెండ్రుకలు, జంఘులు = పిక్కలు, గుల్ఫములు = చీలమండలు, పయోధరములు = చన్నులు, అవయవ ద్యుతి = అంగముల కాంతి, మణినిభమై=రత్నకాంతివంటి కాంతి గలది.

తా త్ప ర్య ము

నా తల వెండ్రుకలు సమానములుగ నీల వర్ణములుగ సన్నగా నున్నవి. కనుబొమ్మలు రెండును నొక దానితో మఱియొకటి కలియక యున్నవి. నా పిక్కల యందు వెండ్రుకలు లేవు. గుండ్రముగానున్నవి. నా దంతములు నడుమ సందు లేక యన్నియుఁ గలిసియున్నవి. కణఁతలు కన్నులు కాళ్ళు చేతులు తొడలు చీలమండలు బలిసియున్నవి. గోళ్ళు నునుపులై గుండ్రములై సమములై యున్నవి. స్తనములు పెద్దవై యొకదాని నొకటి నొరసికొని యున్నవి. చను ముక్కులు నిట్టపొడిచికొని యుండక లోపలికి ముడుచుకొని యున్నవి. నాభి ప్రక్కలం దుబ్బుగలిగి లోఁతై యున్నది. ప్రక్కలు ఱొమ్ము ఉబ్బియున్నవి. నా యవయవముల కాంతి రత్నకాంతిఁబోలి యున్నది.

కం. మృదువులు తనూరుహంబులు, పదతలములుఁ గాలిప్రేళ్ళు ♦ బాగుగ ధరణీ
పదమున నానుట భద్ర, ప్రదచిహ్నము లనుచు నన్నుఁ ♦ బలికిరి పెద్దల్.

అర్థములు. తనూరుహంబులు = వెండ్రుకలు, మృదువులు = మెత్తనివై యున్నవి.

తా త్ప ర్య ము

నా తల వెండ్రుకలు మృదువులుగా నుండుట నా కాలిప్రేళ్ళు కాలి యడుగు ప్రదేశములు నడచునప్పుడు బాగుగ నేల నానుట యివి శుభచిహ్నము లని నన్ను గుఱించి పెద్దలు చెప్పిరి.

కం. ఎఱుపులు నిరంతరంబులు, మఱియు సమగ్రయవరుచులు♦మత్కరపదముల్
చిఱునగు కల దని కన్యల, గుఱుతు లెఱుక కలుగు విప్ర♦కోటులు పలికెన్.

అర్థములు. మత్కరపదముల్ = నా చేతులు కాళ్ళు, నిరంతరంబులు= ప్రేలికి ప్రేలికి నడుమ సందు లేనివి, సమగ్రయవరుచులు=సంపూర్ణ యవకాంతులు గలవి.

తా త్ప ర్య ము

నాయడుకాళ్ళు నఱచేతులు ఎఱ్ఱని కాంతిగలవి. ప్రేలికిప్రేలికి నడుమ సందు లేదు. పూర్ణమైన యవల కాంతిగలవి. ముఖమునం దెప్పుడు చిఱునవ్వుండును. ఇవి

యన్నియు శుభప్రదము లని కన్యకల లక్షణము లెఱింగిన బ్రాహ్మణులు చెప్పి యుండిరి.

తే. అవనిదేవులు పలికి రే♦నాధిరాజ్య, మందుఁ బతితోడ నభిషేక♦మందఁ గలన
టంచుఁదత్సర్వమును వ్యర్థ♦మయ్యె నాదు, భాగ్యహీనతఁ దత్సూక్తి♦భంగమందె.

అర్థములు. అవని దేవులు =బ్రాహ్మణులు — స్వర్గముననుండు దేవతలఁ జెప్పునపుడుమాత్రమే దేవశబ్దమునకు బహువచనరూపములేదు. సు.వ్యా.తత్సమ ౬౭-సూత్రము.

తాత్పర్యము

బ్రాహ్మణులు నేను గొప్ప రాజ్యమందు నాభర్తతోడఁ బట్టాభిషేక మందఁ గలనని చెప్పిరి. అది యంతయు వ్యర్థమయ్యెను. నా నిర్భాగ్యదశవలన బ్రాహ్మణ వాక్యము కూడ భంగమయ్యెను.

కం. శోధించి జనస్థానము, సాధించి మదీయవార్త ♦ జలనిధి బలిమిన్
రోధించి గోష్పదంబున, బాధింపఁబడిరి మఱఁది ♦ ప్రాణేశ్వరుఁడున్. ౯౯౩

అర్థములు. శోధించి = వెదకి - రోధించి = అడ్డకట్టి - గోష్పదంబున = అల్పమునందు.

తాత్పర్యము

నా నిమిత్తమై జనస్థానమంతయు వెదకి నే నెచ్చట నుండునది తెలిసికొని సముద్రమున కనకట్ట కట్టి యింతటి కష్టసాధ్యకార్యములు చేసియుఁ గడపట నింద్రజిత్తు మాయ యను నావుగిట్టంత ప్రదేశమును దాఁటుటయందు మఱఁది, భర్త యిరువురు బాధ చెందిన వారైరి.

సీ. వారుణాస్త్రంబును ♦ వాయవ్యబాణంబుఁ, బావకాస్త్రంబును ♦ బ్రహ్మశిరము
నైంద్రాస్త్ర మాదిగా ♦ నఖిలాస్త్రమండలి, వీర లెఱింగిన ♦ వార మఱియు
రామునికంటికి ♦ రణమునఁ బ్రతిపంథి, యగపడి యసురుతో ♦ నరుగ లేఁడ
యతఁ డెంతటిమనోజ♦వాఢ్యుఁ డేనియు నట్టి; వీరులఁ బర్వత ♦ వైరినిభుల
తే. నిఱుముకొని మాయ మఱుగున♦నింద్రజిత్తు,దిక్కులేకుండు నాకిల♦దిక్కుగాఁగ
నున్న రాముని లక్ష్మణు♦యుద్ధవీథిఁ, బిలుకుమార్చెను నిం కేమి♦తలఁప వచ్చు.

అర్థములు. బ్రహ్మ శిరము=ఇది యొక గొప్ప యస్త్రము. ఇది పుట్టిన వారిని బుట్టఁబోవువారిని తల్లి కడుపులో నున్నవారిని కాన వచ్చిన వారిని కాన రానివారిని నందఱఁ జంపఁగలిగిన యస్త్రము. దీనినే యశ్వత్థామ పరీక్షిత్తుపైఁ బ్రయోగించినది. దీనిని బ్రయోగించి యుండిన లంక నంతయు భస్మము చేసి యుండును. అప్పుడు నిరపరాధులు యుద్ధము చేయనివారు పిల్లలు వృద్ధులు స్త్రీలు నందఱుఁ జచ్చి యుందురు. కనుచాటు వారిని గొట్టుట రామునికి సమ్మతము గాదు. కావున నా దివ్యాస్త్రములఁ బ్రయోగింపఁ లేదు. ప్రతిపంథి =

విరోధి, మనోజవాఖ్యుఁడు = మనస్సు పోవునంత వేగముతోఁ బోవఁగల గొప్ప వాఁడు. దీనివలన మనోవేగమున కంటె వేగముగ రామబాణము పోఁగలదని భావము. పర్వతవైరి నిభులన్ = ఇంద్రసమానులను, ఇఱుముకొని = డాఁగికొని, పిలుకు మార్చెను = చంపెను.

తాత్పర్యము

వారుణాస్త్రము వాయవ్యాస్త్రము ఆగ్నేయాస్త్రము బ్రహ్మశిరోనామకాస్త్రము, ఐంద్రాస్త్రము లోనుగా సమస్తాస్త్రములు వీరు తెలిసినవారే. ఏయస్త్రము ప్రయోగించినను శత్రువులు నాశమైయుందురు. అట్లేల వీరు చేయలేదో! అస్త్రిముల దాఁకఁబోవలయునా? రామచంద్రమూర్తి కంటికి నగపడి శత్రువనువాఁడు మనోవేగము గలవాఁడైనను ప్రాణముతో మరలఁ బోలేఁడు. ఆశౌర్య మేమాయెనో? ఎదుట నిలఁబడి యుద్ధము చేయలేక చాటుగా నుండి కొట్టువాఁడు పిఱికివాఁడే కదా? అట్టివానిని గొట్టరాదని యూరకుండిరి కాఁబోలు. అది యెఱిఁగి యింద్రసమానులగు వీరిని మాయచాటున నుండి యింద్రజిత్తు దిక్కులేని నాకు దిక్కుగా నుండువారిని రామలక్ష్మణులను వధించెను. దీని కేమని యనుకొనవలయును ?

కం. రాముఁడు తమ్మునితోఁ రణ, భూమిం దెగిపడుట కాల•మున కతిభారం
బేమెయిఁ గలుగదు దైవం, బే మేలుం గీడుఁ గూర్ప•హేతువు జగతిన్.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యంతటివాఁడు తనయంతటి తమ్మునితోడ యుద్ధభూమి యందు మరణించుటచేఁ గాలమునకు నసాధ్యమైనది లేదనుట సత్యము. ఇంతటి యసాధ్యకార్యము కాలము తప్ప మఱియేదియుఁ జేయఁజాలదు. మేలుగాని, కీడుగాని జేయుటకు దైవమే కారణము, కాని పౌరుషము కాదు. లోకమునం దింతకంటెఁ బౌరుషవంతులు లేరు. పురుషకారము చేయగలవారు చేసినవారు లేరు. దైవబలము దుర్బలమైనపుడు సర్వము వ్యర్థమయ్యెను. ఈనీతి రామాయణమునఁ బలుమాఱు బోధింపఁబడెను.

కం. రామునకు నంత వగవన్, సౌమిత్రికి నంత వగవ•జననికి వగవన్
నా మాత్ర కేడ్వఁ గౌస,ల్యామహిత తపస్వినికి న•లందురుదానన్. ౯౯౬

అర్థములు. అలందురుదానన్ = దుఃఖించెదను — అంత = కౌసల్య కేడ్చినంత విశేషముగ.

తాత్పర్యము

కౌసల్యకుఁ గలిగిన పుత్రశోకమునకై దుఃఖించి నంత రామునకై నేను దుఃఖింపను. ఆయన కర్మ మాయన యనుభవించెనని తలఁతును, అన్న నిమిత్తమై వచ్చి నిష్కారణముగ నిట్టి యపమృత్యువు పాలాయెఁగదా యని లక్ష్మణునకు నేను

విశేషించి దుఃఖింపను. అదియును నాయన బుద్ధిపూర్వకృతమే. నా నిమిత్తమున నన్నుఁబెంచి పెద్దచేసిన యద్దుముద్దు చూచిన నా తల్లికి నింత దుఃఖము వచ్చెనని యామెకై దుఃఖింపను. నాకిటువంటి కష్టదశ ప్రాప్తించెఁగదా యని నాకై నే నేడ్వను. 'అవశ్య మనుభోక్తవ్యం, ఫలం కర్మ శుభాశుభ'మ్మని సహించెదనుగాని మహాతపస్సులు పండ్లకోలఁది ధారపోసి 'కొడుకో కొడుకో'యని కలవరించి యింతటి గొప్ప వానిని గని, 'యీనగాచి నక్కలపాలు చేసి'నట్లు నిష్కారణముగఁ గొడుకు నిట్లు కానని దేశమునఁ బోఁగొట్టుకొనిన యేకపుత్రికకు గౌసల్యకై దుఃఖించెదను. ఈవార్త విననేని యామె కడుపులో నెట్లుండునో కదా! ఈ కాలమునందలి యత్తలు కోడండ్రు సీతాదేవి యభిప్రాయమును మనస్సునం దుంచుకొందురుగాక. కౌసల్యకు సీతాదేవియం దెంత ప్రీతి లేకున్న నామె యిట్టిమాటలు చెప్పునా? కనుక నేకదా 'కన్నతల్లికి మిన్న కరుణన్ లాలించు నత్తగారా' యని యేడ్చెను.

కం. ఎప్పుడు వ్రత మీడేరునొ, యెప్పుడొకో కనుదు సీత ♦ నే రామునితో
నొప్పెడి లక్ష్మణునని మది, నెప్పుడుఁ జింతించుఁ ద్రోవ ♦ లెదురుంజూచున్.

తాత్పర్యము

కౌసల్యనిమిత్తమై విశేషించి దుఃఖించుటకుఁ గారణము చెప్పుచున్నది. వనవాసవ్రత మెప్పుడు ముగియునాయని దినము లొక్కొక్కటిగా లెక్కించుచు నేను సీతను రామునితోఁగూడియుండు లక్ష్మణు నెప్పుడు చూతునాయని సర్వదా చింతించుచుఁ ద్రోవ లెదురుచూచుచుండును. అట్టి దీ వార్త వినిన నెట్లు ప్రాణము నిలుపఁగలదు. సీతాలక్ష్మణులతోడి రాముని నెప్పుడు చూతునాయని కాదు, కౌసల్య యెదురు చూచునది. ప్రాధాన్యము రామున కీయలేదు. సీతను లక్ష్మణుని తరువాత రామునిఁ జూడఁగోరెనని ప్రాధాన్యము తనకు లక్ష్మణునకుఁ జెప్పుకొనెను. ఇట్లు చెప్పుటచేఁ దన కన్న కొడుకు రామునియందుండు ప్రీతికంటె సీతాలక్ష్మణుల యందుఁ గౌసల్యకుఁ బ్రీతి మెండని భావము.

—♦ త్రిజట సీతాదేవికి శ్రీరామలక్ష్మణులు జీవించియున్నారని చెప్పుట ♦—

చ. అని విలపింపఁగా త్రిజట ♦ యాసతిఁగాంచి వచించె నేల యా
వనజదలాక్షి యేడ్చెదు భవ ♦ త్పతి ప్రాణయుతుండ, దుఃఖమున్
గొనకుము, రామలక్ష్మణులు ♦ కూల రటంటకు గొప్ప హేతువుల్
వినిచెద విన్మ నేఁ గనిన ♦ విన్ మును నాకు నెఱుంగనైనవిన్. ౯౯౭

అర్థములు. ప్రాణయుతుండ = ప్రాణముతో నున్నవాఁడే, కనినవిన్= కనినవియును, ఎఱుంగనైనవిన్=ఎఱుంగనైనవియును.

తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవి దుఃఖింపఁగాఁ త్రిజట యామెను జూచి యిట్లు

చెప్పెను. ఏలమ్మా నీ విట్లు దుఃఖించెదవు. నీభర్త మరణించినవాఁడు కాఁడు. ప్రాణముతోనేయున్నాఁడు. కావున నీవు దుఃఖింపకుము రామలక్ష్మణులు మరణింప లేదనుటకుఁ బూర్వము నేను జూచినవియు, నాకుఁ దెలిసినవి చెప్పెద వినుము.

సీ. పతి హతుఁ డాయెనా♦భటుల ముఖంబులఁ, గనలును ముదమేమి♦కానఁబడదు
పుష్పకం బను పేరి♦వ్యోమయానము దివ్య, మిది వీరు తెగిన ని♦న్నిందుఁగొనదు
హతవీరసైన్యంబు♦హతనావికతరి నా, నుత్సాహ మెడలి ని♦రుద్యమ మగు
నీ సేన భయ మింతె♦యెఱుఁగక, కలఁగక రాఘవులను లెస్స♦రక్ష సేయు
తే. నిన్ని తెలిపితి నీ మీఁద♦నెసఁగుప్రీతి, భద్రకారణచిహ్నముల్♦పడఁతియెఱిఁగి
నానుడిని విశ్వసింపుము♦మాను వగపు, నన్నదమ్ములు బ్రదికియ♦యున్నవారు.

అర్థములు. కనలు = కోపము, ముదము = సంతోషము, హతవీర సైన్యంబు=చంపఁబడిన వీరులు గలసేన, హతనావిక తరినా=చంపఁబడిన యోడ మాలిమిగల నావ యన్నట్లు, నిరుద్యమము = ప్రయత్నహీనము, భద్రకారణ చిహ్నముల్=శుభమునకుఁ గారణములైన గుర్తులు.

తాత్పర్యము

ప్రభువు మరణించెనేని యతని భటుల ముఖములందుఁ గోపము గాని సంతోషముగాని గానఁబడదు. ఇది నేను ముందుచూచిన విషయము. ఇచ్చటనో వానర వీరుల ముఖములందుఁ గోపము సంతోషము గానవచ్చుచున్నది. ఇఁక నాకుఁ దెలిసిన విషయము చెప్పెద విను. ఈ పుష్పకము దివ్యవిమానము. ఇది భర్త మరణించిన దానిని మోయదు. నీ భర్త మరణించి యుండెనా నిన్నిది మోసియుండదు. కావున నీ భర్త మరణింపలేదు. వీరులు చచ్చిన సేన, యోడమాలిమి చచ్చిన పడవవలె నుత్సాహము చెడి ప్రయత్నము నేమియుఁ జేయదు. వానరులు వృక్షహస్తులై యుద్ధమునకు సిద్ధపడియున్నారు. ఈ వానరసేన భయ మనునది కొంచెమైన తెలియక కలఁత పడక రామలక్ష్మణులను కాపాడుచున్నారు. వారు మరణించియే యుండిన నీ కాపేల? నీయందు నాకుండు ప్రీతిచే శుభకారణము లైన లక్షణము లన్నియు నీకుఁ దెలిపితిని. ఇవి తెలిసికొని నామాట నమ్ముము. వ్యసనము మానుము. అన్నదమ్ములు ప్రాణముతో నున్నారు. మరణింపలేదు.

కం. ఆడినది లేదు కల్లల, నాఁడుఁగఁ బోనింక నెప్పు♦డంబుజనేత్రా!
యోడకు నా మది కెక్కితి, చేడియ చారిత్రసఖ్య♦శీలత్వములన్. ౧౦౦౦

అర్థములు. కల్లలన్ = అసత్యములను, ఓడకు=భయపడకుము, నామది కెక్కితివి=నాకు సంతోషము కలిగించిన దానవైతివి, చారిత్ర=నడవడి చేతను, సఖ్య = స్నేహము చేతను, శీలత్వమునన్ = పాతివ్రత్యము చేతను, చరిత్రమే చారిత్రము. ఇది నరక, పురుషాది శబ్దములవంటిది.

తాత్పర్యము

సీతాదేవీ! నేనింతవఱకసత్యమాడిన దానఁగాను. ఇఁక మీఁద నేనాడఁబోవునదిలేదు. భయపడకుము. నామాట నమ్ముము. నీ నడవడి చేతను స్నేహము చేతను పాతివ్రత్యము చేతను నాకు మనస్సునకు సంతోషము కలిగించితివి. నిన్ను మెచ్చుకొంటిని కావునఁ జెప్పితిని.

ఉ. జానకి వీరి గెల్వఁగ న • సాధ్యము సేంద్రసురాసురాళికిన్
మానితభద్రచిహ్నములు • మానమిఁ గాంచి వచింతు వారి నె
మ్మేనులవైఖరుల్ గనుమి • మెల్లన మూర్ఛ నలంగి యుండియున్
మానదు నైజలక్ష్మి, ద్యుతి • మాఱుఁ జుమీ విగతాసుదేహులన్. ౧౦౧౧

అర్థములు. సేంద్ర = ఇంద్రునితోఁ, గూడిన, సుర + అసుర + ఆళికిన్ = దేవతలయు నసురులయు సమూహమునకు, భద్రచిహ్నములు=శుభలక్షణములు, వైఖరులు=విధములు, నైజలక్ష్మి = స్వభావకాంతి, ద్యుతి = కాంతి, విగతాసు దేహులన్=ప్రాణములేని దేహములు గలవారికి.

తాత్పర్యము

జానకీ! యీ రాజకుమారులను నింద్రునితోడ దేవతలు నసురులు వచ్చినను గెల్వ శక్యముగాదు. వారియందు శుభచిహ్నములు దొలఁగి పోకుండుట చూచి చెప్పుచున్నాను. వారి దేహముల తీరు చూడుము. మూర్ఛలో మునిఁగియుండినను సహజకాంతి మాఱినదికాదు. ప్రాణము పోయిన దేహములం దీకాంతి యుండదు.

కం. సుందరి రామసుమిత్రా, నందనులకు వగచు టుడుగు • నమ్ముము వీరిన్
ప్రమందింప నెట్టివా రా, స్కందనమునఁ జాల రేల • కళవళపడఁగన్. ౧౦౧౨

అర్థములు. ప్రమందింపన్ = చంపుటకు - ఆస్కందనమునన్=యుద్ధమందు, కళవళ పడఁగన్=కలఁత పడెదవు.

తాత్పర్యము

సుందరీ! రామలక్ష్మణుల గుఱించి నీ వేడువవలదు. వారికి వచ్చిన భయము లేదు. నామాట నమ్ముము. వీరిని యుద్ధమం దెవ్వరును వధింపఁజాలరు. ఏల యూరక కళవళపడెదవు?

తే. త్రిజట యీరీతిఁ పల్కఁన• దేవకన్య, పోని మైథిలుకన్య యా•పొలఁతిఁజూచి
యంబ నీ వచియించిన•యట్లు యగుత, మంచు నంజలిఁ గీలించి•యనియెనంత.

అర్థములు. దేవకన్యపోని = దేవకన్యవంటి - అగుతన్ + అంచు = అగుత మంచు-ఆశీరాద్యర్థకంబు లయిన ఎడు తలకు నచ్చు పరమైనపుడు ద్రుతమునకు మకారము వచ్చును.

తాత్పర్యము

త్రిజట యీ ప్రకారము చెప్పఁగా దేవకన్యవంటి (లక్ష్మి) సీతాదేవి

యమ్మా! నీవు చెప్పినదే వాస్తవ మగునుగాక యని చేతులు జోడించి నమస్కరించెను. త్రిజట వృద్ధ స్త్రీ, హితకాంక్షిణి భయమునుండి రక్షించునది కావునఁ దల్లితో సమానురాలు.

తే. మరలిచని పుష్పకము రాము♦తరుణితోడఁ, ద్రిజటతో వారిలంకలో♦దించుటయును
నసురకాంత లశోకవ♦నాంతరము ప్ర, వేశ పెట్టిరి జానకీ♦లేశమధ్య. ౧౦౪

అర్థములు. లేశమధ్య=సూక్ష్మమైన నడుముగలదానిని, అణుమధ్య.

తాత్పర్యము

పుష్పకము మరలిపోయి సీతా త్రిజటలను లంకలో దించెను. అచ్చటినుండి రాక్షసస్త్రీలు సీతాదేవిని నశోకవనమునకుఁ బిలిచికొనిపోయిరి.

కం. ఆరాక్షసలోకేశు వి, హారతలం బైన మంజు♦లారామము సీ
తారమణి చొచ్చి రాజకు,మారుల భావించి కాంచి♦మఱిమఱి వగచెన్.

అర్థములు. విహారతలంబు=వేడుకగాఁ దిరుగు ప్రదేశము, మంజులారామము=అందమైన యుద్యానవనము.

తాత్పర్యము

రావణుఁడు క్రీడార్థము తిరుగు సుందరమైన యుద్యానవన మందుండు సీతాదేవి రామలక్ష్మణులను దలఁచి వారున్న కష్టదశచూచి మిగుల దుఃఖించెను.

-♦ ౪౯-వ సర్గము. శ్రీరాముఁడు మూర్ఛ దేఱి లక్ష్మణుంజూచి దుఃఖించుట ♦-

ఉ. వీరులు కీశనాయకులు ♦ వేయివిధంబులఁ దన్నుఁ గాచుచున్
భూరితరార్తి దుఃఖమునఁ ♦ బొక్కుచు నుండఁగ నంతలోపలన్
ధీరుఁడు సత్త్వశాలి రఘు♦నేత శరోత్కరబద్ధుఁ డయ్యునున్.
గూరి స్మృతిన్ నిజాంతికపు ♦ క్షోణితలంబున నున్న తమ్మునిన్. ౧౦౬

అర్థములు. సత్త్వశాలి=బలవంతుఁడు, రఘునేత=రామచంద్రమూర్తి, శరోత్కర బద్ధుఁడు = బాణ సమూహములచేఁ గట్టఁబడినవాఁడు, స్మృతిన్ = తెలివి, నిజాంతికపు=తనకు సమీపమందలి, క్షోణితలంబునన్=భూమియందు.

తాత్పర్యము

వీరులగు వానరశ్రేష్ఠు లనేక విధములఁ దన్ను రక్షించుచుండఁగా మిగుల బాధచే దుఃఖించుచు నుండఁగా నంతలో ధైర్యవంతుఁడును, బలవంతుఁడు నగు రామచంద్రమూర్తి బాణములచేఁ గట్టుబడియు స్మృతిదెచ్చుకొన్నవాఁడై తన సమీపమందుండిన తమ్ముని.

క. నెత్తురువఱ్ఱులు వాఱఁగ, జొత్తిల్లినమేనితోడ ♦ సొలిమిడి గొని గా
ఢాత్తశరబంధనంబున, నొత్తొరు వయి నొగిలి యున్న ♦ యుత్తమవీరున్.

అర్థములు. వఱ్ఱులు వాఱఁగన్=కాలువలుగాఁ బ్రవహింపఁగా, జొత్తిల్లిన=ఎఱ్ఱఁబాఱిన, సొలిమిడి గొని = మూర్ఛపోయి, గాఢాత్తశరబంధనంబునన్ =

గట్టిగా నాటిన బాణముల కట్లచే, ఒత్తొరువు = ఒత్తు + ఒరువు = ఒత్తొరువు= మిక్కిలి పీడింపఁబడి, నొగిలి=దుఃఖపడి.

తాత్పర్యము

నెత్తురు ప్రవహింపఁగా నెఱ్ఱపాఱిన దేహముతో మూర్ఛపోయి గట్టిగా కట్టఁబడిన బాణముల కట్లచే మిగుల బాధపడి నొచ్చిపడియున్న తమ్ముని నుత్తమవీరుని.

కం. తిలకించి దుస్సహార్తిన్, నలఁగుడుపడి యేడ్చె నాయ♦నా! లక్ష్మణ! హా
యలఘుమతీ! తమ్ముఁడ! ని, న్నిల నిట్టియవస్థఁ గంటి♦నెంతటిపాపిన్. ౧౦౦౪

అర్థములు. తిలకించి = చూచి, దుస్సహ + ఆర్తిన్ = సహింపరాని దుఃఖముచే, నలఁగుడుపడి=బాధపడి.

తాత్పర్యము

చూచి సహింపరాని దుఃఖముచే బాధపడి నాయనా! లక్ష్మణా! హా గొప్ప మనస్సుగలవాఁడా! తమ్ముఁడా! నీవు ఈ ప్రకారము బాధపడుచుండఁ జూడఁ గంటిని. అయ్యో! యెంతటి పాపాత్ముఁడను.

కం. దురమున నిటు నిర్జితుఁ డై, సొరిగి పడిన కూర్మితమ్ముఁ♦జూడఁగఁ గలిగెన్
ధరణి నిఁకేటికి సీతా, తరుణియు గిరుణియును జీవి♦తము గీవితమున్. ౧౦౦౫

అర్థములు. దురమునన్ = యుద్ధమందు, నిర్జితుఁడై = జయింపఁబడినవాఁడై, సొరిగి = మూర్ఛపోయి, తరుణి గిరుణి - జీవితము గీవితము. నింద యందు గిగీ లగు.

తాత్పర్యము

మఱి దేనియందుగాదు. ఆటవంటి యుద్ధమందు నీ విధముగ జయింపఁబడుటే గాక మూర్ఛపోయియుఁ బడిన కూరిమిగల తమ్ముని నేను ప్రతిక్రియ చేయలేక రక్షింప లేక యూరక చూడవలసివచ్చెను. ఇఁక నాకు సీతయేల? ప్రాణమేల? ఇంతకంటె నవి ప్రియములైనవా?

కం. నెమకిన సీతకు సమ యగు, కమలాక్షి లభింప వచ్చు♦ క్షమ లక్ష్మణుతో
సముఁ డగు తమ్ముఁడు సచివుఁడు, సమర కళావిదుఁడు దొరక♦జాలం డెందున్.

అర్థములు. నెమకినన్ = లోకమున వెదకిన, సచివుఁడు = మంత్రియు, మిత్రుఁడు, సమర కళావిదుఁడు=యుద్ధవిద్యయందు నేర్పరి.

తాత్పర్యము

సీతకంటెఁ దన ప్రాణమునకంటె లక్ష్మణుఁ డెక్కువ యనుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు.

భూమియందు వెదకినయెడల సీతవంటి భోగ్యస్త్రీ దొరకవచ్చును. ఈ దేహముపోయినమరల దేహము రావచ్చునుగాని లక్ష్మణుతో సముఁడైనతమ్ముఁడు, మంత్రి, మిత్రుఁడు, యుద్ధవిద్యాసమర్థుఁడు నెందు దొరకును? ఇది కేవలదుర్లభము.

కం. బాణహతిఁ దమ్ముఁడే ని, ర్యాణంబును బొందఁ గలిగెఁ ♦ నా నిక్కముగన్
క్షోణిరుహాటులు గనఁగాఁ, బ్రాణంబులు విడుతుఁ గాక ♦ బ్రదు కేమిటికిన్.

అర్థములు. బాణహతిన్ = బాణముల దెబ్బలచే - నిర్యాణంబున్ = మరణమును - క్షోణిరుహాటులు = వానరులు - 'ధరా ధరిత్రీ ధరణిః క్షోణి ర్జ్యా కాశ్యపీ క్షితిః' అమరము - క్షోణిశబ్ద మీకారాంతము గలదు.

తాత్పర్యము

బాణముల దెబ్బలచే నా తమ్ముఁడే మరణింపఁ గలిగెనా నిశ్చయముగా నీ స్థలమందే వానరులందఱుఁ జూచుచుండఁ బ్రాణములు విడుతును. ఆవల నేను బ్రదికియు నేమి ప్రయోజనము. నే నెవరిని సుఖపెట్టవలయునని కోరెదనో యట్టివారు లేనప్పుడు నే నేల సుఖార్థినై ప్రాణములు ధరింపవలెను. నేను బ్రదుకుట నా నిమిత్తమైకాదు.

కం. ఏ మందును గౌసల్యకుఁ, నే మందును గైకయికిని ♦ నే మందును నా
సౌమిత్రికి భరతున కీ, సౌమిత్రిని విడిచి నేను ♦ జనితిన యేనిన్. ౧౧౨

అర్థములు. ఆ సౌమిత్రికిన్ = శత్రుఘ్నునకు.

తాత్పర్యము

బ్రదికితిని, పో, యుద్ధమందు జయించి సీతను దీసికొని యయోధ్యకుఁ బోయితిని బో, ఏమి సంతోషము — పోఁగానే కౌసల్య లక్ష్మణుఁ డేడని యడుగునే యేమని చెప్పుదును? కైక కేమి చెప్పుదును. వీని నిచ్చట విడిచిపోయి భరతున కేమి చెప్పుదును? శత్రుఘ్నున కేమి చెప్పుదును? లక్ష్మణుని లంకలో రాక్షసుల పాలుచేసి నేను నా పెండ్లాము సుఖముగా వచ్చితి మని చెప్పుదునా?

ఆ సౌమిత్రిని = అన్నా సుమిత్రాదేవి కొడుకు లిరువురు మన దాసులైరి. నా సౌమిత్రిని నేను గాపాడఁ గలిగితినే, నీ సౌమిత్రిని నీవు కాపాడలేక పోయితివా యని భరతుఁ డడిగిన నేమని చెప్పుదు నని భావము.

ఉ. ఎన్నఁడు వచ్చునో తనయుఁ ♦ డెప్పుడు గందునో యంచు నున్న స్త్రీ
మిన్నకు నేమి చెప్పుదు సు ♦ మిత్రకు, నీ చెడువార్తఁ జెప్పినన్
ఖిన్నత వేపమాన యయి ♦ క్రేపు దొలంగిన ధేను వై మహా
పన్నత నొంది యేడ్వ నది ♦ పల్కుదు నే నని యాలసించెదన్. ౧౧౩

అర్థములు. స్త్రీమిన్న = స్త్రీమణి, స్త్రీలయందు శ్రేష్ఠురాలు, ఖిన్నతన్ = ఖేదముచే, వేపమానయయి = వణకుచున్నదై, క్రేపు = దూడ, మహాపన్నత = గొప్ప విపత్తును.

తాత్పర్యము

తల్లులకు దూరమునం దుండు కొడుకులే పలుమాఱు తలంపునకు వచ్చుచుందురు. కావున నా కొడు కెప్పుడు వచ్చునో, ఎన్నడు కన్నులారఁ జూతునో యని యెదురు చూచుచుండు స్త్రీరత్నమగు సుమిత్రాదేవికి నీ దుర్వార్త చెప్పఁగానే శోకాతిశ

యముచే నిబ్బరించుకొనలేక వణఁకుచు లేఁగను బాసిన గోవువలె విపత్తుపాలై దుఃఖింపఁగా నేనేమని సమాధాన పఱుతును ?

చ. అడవుల కేగు నీకటు స ♦ సహాయునిఁగాఁ దెకతేర కేను నా
కొడుకును బుచ్చితిన్, వనులఁ ♦ గోల్పడి యాతని నీవు భార్యయున్
విడిదికిఁ జక్కఁ వచ్చితిరె ♦ వీరుఁడ యొక్కనిఁగావ నీకునున్
గడిమి దొలంగెనా? యనుచుఁ ♦ గ్రౌర్యము దోఁప సుమిత్ర పల్కఁనన్. ౧౦౧౪

అర్థములు. తెకతేరకున్=నిర్నిమిత్తముగా-ఏయుద్దేశము లేక, వీరుఁడ = ఇది యెత్తిపొడుపుమాట — ఎటువంటి వీరుఁడవని నిష్ఠురోక్తి - కడిమి=బలము.

తాత్పర్యము

నీ వడవులకుఁబోవుచుండఁ జూచి యయ్యో యొంటరిగాఁ బోవుచున్నాఁడే యని యే యితరోద్దేశములేక నీకు సహాయునిఁగా నా కొడుకును బంపితినే, అతనిని బోఁగొట్టుకొని నీవు. నీ పెండ్లాముమాత్ర మింటికి వచ్చితిరా? ఆహా! మాయొక్కని గాపాడలేని శూరుఁడవు, ఏమి శూరుఁడవయ్యా నీవు, ఆమాత్రము నీకు బలము లేదాయెఁగదా యని పరుషముగా సుమిత్ర పలికెనేని.

కం. సైరించు టెట్లొకో నా, కారణమున మడిసినట్లు ♦ క్షమఁ బడినాఁ డీ
శూరుఁ డనార్యుఁడ భృశపా,పారంభుఁడ ఛీ మనంగ ♦ నగు ఫల మేమీ. ౧౧౦౫

తాత్పర్యము

ఎట్లు సహింతును? నా నిమిత్తముగాఁగదా చచ్చినట్లు అటువంటి శూరుఁడు నేలఁబడియున్నాఁడు నేననార్యుఁడను, పాపకార్యములే చేయువాఁడను, నా నిమిత్తమై పరుల హింసించువాఁడను, ఛీ! బ్రతికి లాభ మేమి ?

సీ. అనయంబు దుఃఖించు ♦ నను నూఱడింతువే, విలపింప నిపు డేల ♦ పలుక వయ్య
యెవ్వారి రణమున ♦ నేపు మాపుదు వట్టి, యసురులచే హతుఁ డై తె తండ్రి
శరతల్పమునను నె ♦ త్తురు గాఱ శరజాల, వృతుఁడవై సంధ్యార్కు ♦ నెనసె దీవు
ఘనబాణహతమర్మ ♦ తను బలక్కజాలమి, వ్యథఁ బ్రేమదృష్టుల ♦ బలికె దీవు
తే. వనములకు నొంటిగాఁ జను ♦ వాఁడ ననుచు, వెంట నెటులీవు వచ్చితో ♦ వీరవర్య
యటుల యమలోకమునకు నీ ♦ వరుగ నొంటి, నేను దోడన వచ్చుట ♦ నీతిగాదె.

అర్థములు. శరజాలవృతుఁడవై = బాణసమూహములచేఁ గప్పఁబడినవాఁడవై, సంధ్యార్కున్ = సాయంకాలసూర్యుని, ఎనసెదవు = సరిపోలెదవు, ఘనబాణహతమర్మతను=గొప్ప బాణములచేఁ గొట్టఁబడినవాఁడ వగుటను, ప్రేమదృష్టులన్=ప్రేమను దెలుపు చూపులచే.

తాత్పర్యము

ఎల్లవేళల దుఃఖించుచుండు నన్ను నీ వూరడించుచుందువే యిప్పుడు నే నేడ్చుచున్నను ఏల సమాధానపఱుపవు? యుద్ధమునందు నెవ్వారి పరాక్రమ మణచు

చుండువో యట్టి రాక్షసులచేతనే తండ్రీ! కొట్టఁబడితివా? బాణశయ్యమీఁద నెత్తురు గాఱుచుండ బాణములచేఁ గప్పఁబడి సాయంకాల సంధ్యవేళ యందలి సూర్యునివలె నున్నావు అస్తాద్రి శరతల్పము-నెత్తురు సంజకెంజాయ-బాణములు సూర్య కిరణములు-లక్ష్మణుఁడు సూర్యుఁడు. గొప్పబాణము లాయువు పట్టులఁ దగులుటచేఁ బల్కలేక యుండినను నీ దృష్టులు, నీ ప్రేమను దెలుపుచున్నవి.

అడవులకు నే నొంటిగాఁ బోవుచున్నాననికదా నీవు నీవారి నందఱ వీడి నా వెంట వచ్చితివి. అటులే నీవు యమలోకమునకు నొంటిగాఁ బోవునపుడు నేను నీతోడ వచ్చుట నీతియేకదా!

తే. ఇష్టబంధుజనావృతుఁ ♦ డీతఁ డెప్పు, డయ్యు నేవేళ నన్నుఁ దా♦ననుసరించు
నట్టి గుణశాలి దురదృష్టుఁ ♦ డైన నాదు, తెలివిలేమిని నిట్టి దు♦స్థితిని గాంచె.

అర్థములు. ఇష్ట బంధు జనావృతుఁడు = ఇష్టులచేతను బంధువులచేతను చుట్టఁబడియుండువాఁడు—దురదృష్టుఁడు=భాగ్యహీనుఁడు.

తాత్పర్యము

ఇతఁ డెప్పు డిష్టులచేతను, బంధువులచేతను జుట్టఁబడియుండువాఁడు. అటు లుండియు నెల్లవేళలఁ దాను నన్ననుసరించి నా వెంటనే యుండును. నిర్భాగ్యుఁడ నైన నా తెలివిలేమిచేత నటువంటి గుణవంతుఁ డిట్లు దుస్థితికి వచ్చెను. నాకు మేలు చేయవలయునని యతఁడు రాఁగానే నతనికిఁ గీడు గలిగించితిని.

కం. కోపించితి నేని నయో, పాపం బీలక్ష్మణుండు ♦ ప్రతిగా నన్నుఁ దా
నేపాటనేని యహితం, బో, పరుష మొ పలుకఁ డెఱుఁగ ♦ మొగమున విఱుపేన్.

తాత్పర్యము

అయ్యో! పాపము! నేను దనపైఁ గోపించినను నీ లక్ష్మణుండు మాటకు బదులు మాటగానైన, నేవిధముగనైనను హితము గానట్టి మాటగాని, కఠినోక్తి గాని పలుకువాఁడుగాఁడు. మొగము చిట్లించుటయు నేనెఱుఁగను.

చ. అసమునఁ గార్తవీర్యుఁడు మ♦హాంబక పంచశతంబు లొక్కటన్
వెసఁ బరఁగించులోన భృశ ♦ వేగమునన్ బలుఁ డీతఁ డన్నియే
మసలక వైచుఁ, ద్రుంచు శత ♦ మన్యునియస్త్రము లస్త్రపాలి, నీ
యసమసుఖోచితుండు దెగి ♦ హా! ధరణిం బడియున్నవాఁ డయో. ౧౦౯

అర్థములు. అసమునన్ = దర్పమున, కార్తవీర్యుఁడు = కృతవీర్యుని కొడుకు, వేయి చేతులవాఁడు, మహాంబక పంచశతంబులు = ఏదువందల గొప్ప బాణములను, ఐదునూర్ల విండ్లలో నైదునూర్ల బాణములను, పరగించులోనన్= ప్రయోగించులోపల, భృశవేగమునన్=మిగుల వేగముచే, మసలక = ఆలస్యము చేయక, శతమన్యుని = ఇంద్రుని, అసమసుఖ + ఉచితుండు = అసమానమైన సుఖమనుభవింపఁ దగినవాఁడు.

తాత్పర్యము

సహస్ర బాహుబల గర్వముగల కార్తవీర్యార్జునుఁడు వేయిచేతులందు నైదు నూర్లవిండ్ల నేకకాలమున ధరించి యైదు నూర్ల బాణములను బ్రయోగించునంత మాత్రపుఁ గాలములో నీ లక్ష్మణుఁ డొక్క వింట నొక్క చేత నన్ని బాణములు వేయఁగలఁడు. ఇంద్రుని యస్త్రముల నైనను దన యస్త్రములచే ఖండింపఁగలఁడు. అటువంటి బాహుబలము, అస్త్రబలము గలవాఁడు ఎంతో సుఖ మనుభవింపఁ దగినవాఁడు చచ్చినట్లయ్యో నేలఁబడి యున్నాఁడు గదా!

తే. ప్రతిన చేసితి రాక్షస♦రాజుఁ జేయు, వాఁడ నంచు విభీషణు ♦ బాస దప్పె
నట్టి యనృతోక్తి యిపుడు నా♦యవయవముల, నిప్పువలెఁ గాల్చుచున్నది♦నేరనైఁప.

తాత్పర్యము

విభీషణుని లంకకు రాజు చేసెద నని ప్రతిజ్ఞ చేసితిని. ఆ ప్రతిజ్ఞ తప్పిపోయెను. ఆ యసత్యభాషణము నా యవయవములను నిప్పువలెఁ గాల్చుచున్నది. సహింపనేరను.

—♦ శ్రీరాముఁడు సుగ్రీవుతోఁ గిష్కింధకుఁ బొమ్మని చెప్పుట ♦—

శా. నీ వీ మూర్తమునంద యంగదు నలున్ ♦ నీలున్ బలం బెల్ల సు
గ్రీవా! తోడ్కొని పొమ్ము నిల్వకిట వార్ధిం దాటుమీ యేల నా
దేవారాతిపరీవృఢుండు కినుకన్ ♦ దృష్టించి నాలేమి నీ
పై వచ్చున్ హితసైన్యయుక్తుఁ డయి, పో ♦ వం దెప్పరం బత్తఱిన్. ౧౦౨౧

అర్థములు. దేవారాతి పరీవృఢుండు=రాక్షసశ్రేష్ఠుఁడు – రావణుండు, దెప్పరంబు=కష్టము.

తాత్పర్యము

సుగ్రీవా! నీ వీ మూర్తమునందే యంగదుని నలుని నీలుని వానరసేన నంతయుఁ దీసికొని సముద్రము దాఁటి పొమ్ము. ఇందు నిల్వవలదు. ఏ లంటివా? నా సాహాయ్యము మీకు లేకుంకుట తెలిసికొని రావణుఁడు సమస్త సేనలతోడను హితులతోడను నీపై యుద్ధమునకు వచ్చి త్రోవ యడ్డగించును. అప్పుడు పోవుట యసాధ్య మగును.

సీ. అన్యులు గావించు ♦ నట్టివా పావని, సమరానఁ జేసిన ♦ సాహసములు?
ఈ జాంబవంతుండు ♦ నీ గవాక్షుండును, జలిపినకృత్యముల్ ♦ పలుక వశమె?
తారేయు తెంపు నా♦తరమె వకాఁణింప, మైందుండు ద్వివిదుఁ డ♦మందబలులు
కేసరి సంపాతి ♦ చేసినకార్యంబు, లలఁతులా? యే మని ♦ యాడువాఁడ?
తే. గజుఁడు శరభుండు♦గవయుఁడు♦గంధమాద, నుండు లోనగుకీశు లుద్దండవృత్తి
మన్నిమిత్తంబు ప్రాణముల్♦మఱచి తెగిరి, మెచ్చితిని వీరి నెల్ల నో♦సచ్చరిత్ర!

అర్థములు. తారేయు = అంగదుని యొక్క, అలఁతులా=అల్పములా?

తెగిరి=సాహసించిరి, సాహసములు = సాహసకార్యములు, 'విశేషణంబులు కొన్ని యెడల విశేష్యలక్షకంబు లగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౧౨ సూత్రము.

తాత్పర్యము

హనుమంతుఁడు యుద్ధమునందుఁ జేసిన సాహసకృత్యము లితరులకు సాధ్యమైనవా? ఈ జాంబవంతుఁడు ఈ గవాక్షుఁడు చేసిన కార్యము లిట్టివని చెప్పుటకైన సాధ్యమా? అంగదుని సాహస మిట్టిదని నేను జెప్పలేను. మైందుఁడు ద్వివిదుఁడు కేసరి సంపాతి వీరు స్వల్పకార్యములా చేసిరి. వీరందఱు చేసినవి నేనేమని చెప్పఁగలను? గజుఁడు శరభుఁడు గవయుఁడు గంధమాదనుఁడు మొదలగు వానరులు ప్రాణములు తమ దేహములం దున్నవనుట మఱచి సాహసించి కార్యములు చేసిరి. వీరి నందఱను జాల మెచ్చుకొంటిని.

కం. నీవు సుహృత్తును మిత్రుం, డౌవాఁ డెం తెంతఁ జేయు • నగు నంతయు సు
గ్రీవా! ధర్మభయంబునఁ, గావించితి దైవ మణఁపఁ•గా నరు వశమే. ౧౦౨౩

అర్థములు. సుహృత్తు = దుఃఖే విపది సమ్మోహే కార్యకాలాత్యయేపిచ హితాన్వేషీచ హితకృ ద్యస్సుహృ త్సోభిధీయతే" దుఃఖమందును ఆపదలందును సమ్మోహమందును కార్యముకడచనినపుడును హితమైనదాని వెదకువాఁడు, హితము చేయువాఁడు, మంచి మనస్సు గలవాఁడు సుహృత్తనఁబడును. మిత్రుఁడు=ఉపకారమునకుఁ బ్రత్యుపకారము చేయువాఁడు, ధర్మభయంబునన్=ధర్మములోపించునేమో యను భయమున-పంచమీతత్పురుషము—దైవము=అదృష్టమును.

తాత్పర్యము

సుగ్రీవా! నీవు సుహృత్తు మిత్రుఁడు నగు వాఁ డెం తెంతచేయ సాధ్యమో, ధర్మము లోపించునేమో యను భయముచే నీవు నంతఁ జేసితివి కాని నా యదృష్టమును నీవు తొలగింపఁగలవా? అది నరులకు సాధ్యమా?

కం. వానరవరులారా! కడు, పూనికమై మిత్రకార్య • మును జేసితి రే
మానసమున మెచ్చితి మీ, కానతి యిడినాఁడ నరుగ•రయ్యా స్వేచ్ఛన్.

అర్థములు. అరుగరయ్యా = అరుగుఁడు+అయ్యా=అరుగరయ్య 'ప్రార్థనార్థక మధ్యమ పురుషంబున నెడాదు లనుప్రయుక్తంబు లగుచో ముడుజ్జులకు వురు లగు.' సు - వ్యా - క్రియ. ౩౮. 'సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియలమీఁది యయ్యాదు లేకవచనాంతంబుల యగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౪౪.సూ.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులారా! మిత్రకార్యమును మీరుమిక్కిలి పూనికతోఁ జేసినవారైతిరి. నేను జాల సంతోషించితిని, అనుజ్ఞ యిచ్చితిని. ఇఁక మీ మీ యిష్టప్రకారము పోవచ్చును.

చ. అనవుడు నెల్ల వానరులు ♦ హా యని కన్నులు వాఁచ బాష్పముల్
కనుఁగవనుండి వెల్లువలు ♦ గట్టఁగ నేడిచి రింతలో ననీ
కినులను నందు నందుఁ బరి ♦ కించి దృఢంబుగ నిల్పి రాఘవుల్
పెనుపఱి యున్న చోటికి వి♦భీషణుఁడుం జనుదెంచెఁ జయ్యనన్. ౧౦౨౫

అర్థములు. అనీకినులను=సేనలను, పెనుపు+అఱి=గొప్పతనముచెడి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా వారందఱు కన్నులు వాఁచునట్లు హా యని కన్నీళ్లు ప్రవాహము లగున ట్లేడ్చిరి. ఇంతలో సేనలను ఆ యా స్థానము లందుఁ గదలకుండ నిలిపి రామలక్ష్మణులు పడియున్నచోటికి శీఘ్రముగ విభీషణుఁడు వచ్చెను.

కం. అంజనధరాధరంబున,కుం జతయై గద ధరించి ♦ గొబ్బునఁ జనుదే
రం జడిసి యింద్రజిత్తని, యంజాయించుచును బాఱె♦నగచరకోటుల్. ౧౦౨౬

అర్థములు. అంజన ధరాధరంబునకుఁ = కాటుకకొండకు, జతయై = సమానమై, 'సరళంబులకు ముందున్న ద్రుతంబునకుఁ బూర్ణబిందువు' "అంజెదవు గాక నను జెంతం జేరఁగ నీక యెంతతడిసిన మిరియాలుం జొన్నలు సరిగావే" నాచన సోముఁడు. అంజాయించుచును=భయపడుచు.

తాత్పర్యము

కాటుక కొండవంటి నల్లని దేహముతో విభీషణుఁడు గద ధరించి రాగా మరల నింద్రజిత్తే వచ్చెనని భయపడి వానరులు పరువెత్తిరి.

—♦ ౫౦-వ సర్గము. కపులు విభీషణుని నింద్రజిత్తని భ్రమించి పరువెత్తుట ♦—

సీ. వాతూలహతిఁ బటా ♦ పంచ మౌ మబ్బుల, భంగిని దనసేన ♦ పరువు వెట్టఁ
గనుఁగొని సుగ్రీవుఁ ♦ డనియె నీ సైన్యంబు, కడలినడుమ సుడి ♦ గాలులకును
దిరుగుడుపడు నావ♦కరణి నల్లాడెడిఁ, గత మే మొ యనఁగ నం♦గదుఁడు పలుకు
వీరులు రాజకు♦మారులు రాముఁడు, సౌమిత్రి మార్గణ ♦ జాలనిహతు
తే.లగుటె కారణమనసుతు♦ననియెసూర్య,పుత్రుఁడదికాదుమఱియేదొ♦పుట్టఁబోలు
నాయుధంబులు విడినాడి♦యదరిబెదరి నిలువుచూపులువిన్న మో♦ములునుగలిగి.

అర్థములు. వాతూలహతిన్=సుడిగాలి దెబ్బచే, పటాపంచము = చెదరిపోయినవి, కడలి నడుమ = సముద్రమధ్యమున, మార్గణజాలనిహతులు = బాణసమూహములచేఁ గొట్టఁబడినవారు.

తాత్పర్యము

సుడిగాలి దెబ్బకు మబ్బులు చెదరి పోవునట్లు తన సేన పరువెత్తుచుండుట చూచి సుగ్రీవుఁ డిట్లనియె. సముద్రము నడుమ సుడిగాలికిఁ దిరుగుడువడు నావవలె నేల యీ సైన్యం బల్లాడు చున్నది? అనిన నంగదుఁడు రామలక్ష్మణులు బాణ

ముల తాఁకునఁ బడియుండుటే కారణమనిన నదికాదు. మఱియేదోయై యుండవలెను. ఇంతసేపు లేనిది యిప్పు డేమి వచ్చెను? ఆయుధములు పాఱవైచి యదరి బెదరి నిలువు చూపులు తెల్లని ముఖములు గలిగి.

తే. ఉఱుకుచున్నారు దెసలందు • నెఱయఁ బిఱికి, కండలందఱు నిశినాన • గండలగుచుఁ
బడినవారిని దాఁటుచుఁ • బ్రక్కవారి, నీడ్చుకొని పోవుచున్న వా • రింతయేల?

అర్థములు. నానగండలు = సిగ్గువిడిచినవారు - నిశిన్=రాత్రియందు - దీనివలన నిది యంతయు మొదటి నాఁటి రాత్రికథయే.

తాత్పర్యము స్పష్టము.

కం. అనులోన విభీషణుఁడును, దనకేలన్ గద ధరించి • తఱియఁగఁ జని దీ
వన లిచ్చి యినజునకు రా, ముని లక్ష్మణుఁ జూచుచుండె • మునుఁగుచుఁ జింతన్.

తఱియఁగఁ జని=దగ్గఱకుఁబోయి.

తాత్పర్యము స్పష్టము.

చ. వనచరలోకభర్తయుఁ బ్ల • వంగమభీషణు నవ్విభీషణున్
గని నికటస్థు భల్లుకని • కాయపతిం గని యివ్విభీషణుం
గని కపికోటి రావణియ • క్రమ్మఱి వచ్చె న టన్న శంకచేఁ
గనుకని పాఱెడిం, దెలిపి • క్రమ్మఱుపం గదె వారి నెల్లరన్. ౧౦౩౦

అర్థములు. ప్లవంగమ భీషణున్=వానరులకు బెదరు పుట్టఁజేసిన వానిని - నికటస్థున్=సమీపమందున్న వానిని - భల్లుకనికాయపతిన్=ఎలుఁగుల సమూహమునకుఁ బ్రభువును=జాంబవంతుని-కనుకని=తొట్రుపాటుచే.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వానరులకు భయము కలిగించిన యా విభీషణునిఁ జూచి తన సమీపమందున్న జాంబవంతునితో నీవానరు లింద్రజిత్తు మరల వచ్చెనని భయపడి తొట్రుపడుచుఁ బరువెత్తుచున్నారు. వాస్తవము వారికిఁ దెలిపి యందఱను మరల వచ్చునట్లు చేయుమా!

కం. అనవుడును జాంబవంతుఁడు, వనచరసంఘాతమెల్లఁ • బరువిడుమార్గం
బున కడ్డ మగుచు నిట్లనుఁ, దనచేతుల నెత్తి కడు ను • దారరవమునన్.

అర్థములు. సంఘాతము=సమూహము, ఉదారరవమునన్=పెద్ద ధ్వనితో.

తాత్పర్యము స్పష్టము.

చ. వెఱవకుఁడీ కపీంద్రములు! వి • భీషణుఁ డీతఁడు, శక్రజిత్తు గాఁ
డుఱుకకుఁడీ నిజం బరయ • కూరక యంధత గొఱ్ఱెదాఁటుగ
న్విచికితసంబు పొత్తకము • నేర్చితి రెన్నఁడు? చాలు నింకఁ గ్ర
మ్మఱుఁ డన వారు ఋక్షవిభు • మాట మెయిం జని యవ్విభీషణున్, ౧౦౩౧

అర్థములు. కపీంద్రులు = కపీంద్రులారా, మధ్యమ పురుషము గావున ఆగమము లోపించెను. గోష్ఠిదాఁటుగన్=ఒక్క గోష్ఠిదాఁటిన నన్ని గోష్ఠిలు కారణము విచారింపక దానివెంట దాఁటినట్లు, పిఱికితనంబు పొత్తకము = పిఱికి వాండ్రీ ప్రకారము పరువెత్తి పోవలయుననిచదువు పాఠము. పుస్తకశబ్ద భవము పొత్తకము.

తాత్పర్యము స్పష్టము.

కం. కని విగతభీతి నుండిరి, యనఘుండు విభీషణుండు నాశుగచితులన్
ఘనబలుల రామలక్ష్మణు,లను గని వగపాటుమెయి జలంబులఁ గనులన్.

అర్థములు. విగతభీతిన్=భయమువిడిచి, ఆశుగచితులన్ = బాణములచేఁ గప్పఁబడిన వారిని, వగపాటుమెయిన్=వ్యసనముచే.

తాత్పర్యము స్పష్టము.

—• దుఃఖించు విభీషణుని సుగ్రీవుండు దేర్చుట. •—

కం. తుడిచి భృశదుఃఖభరమున, మిడుకుచుఁ బలవించె హా యమేయబలాఢ్యుల్
కడు సాత్త్వికు లాజిప్రియు,లడఁగిరిగా కూటయోధులగు నసురుల చేన్.

అర్థములు. తుడిచి=తుడిచికొని, ఆత్మనేపద మనిత్యము కావున 'కొని' చేర్పలేదు. భృశదుఃఖభరమునన్ = విశేష దుఃఖభారముచే, అమేయబలాఢ్యుల్ = అపరిమిత బలముగలవారు, కడున్ = మిక్కిలి, సాత్త్వికులు = సత్త్వ గుణమే ప్రధానముగఁ గలవారు. ఆజిప్రియులు=యుద్ధమందుఁ బ్రీతి గలవారు, కూటయోధులు = మోసయుద్ధము చేయువారు.

తాత్పర్యము

తుడుచుకొని దుఃఖాతిశయముచేఁ దపించుచు నయ్యో పరిమితి చెప్పరాని బలముగల వీరులు మిగుల సత్త్వమే ప్రధానగుణముగాఁ గలవారు, యుద్ధప్రియులు నయ్యో మాయాయుద్ధము చేయు రాక్షసులచేఁ బడిపోయిరి గదా.

ఇంద్రజిత్తు తాను గానరాక శత్రువుల గొట్టెను. రామచంద్రమూర్తియుఁ గానరాక చాటుననుండి వాలిని గొట్టెను. ఇంద్రజిత్తు కూటయోధుఁడగునేని రామ చంద్రమూర్తి యేలఁ గాఁడు ?

ఇప్పుడు వానర రాక్షసులకు జరిగినది యుద్ధమే. కాని మఱియొండు గాదు. ధర్మయుద్ధమందు నెదురెదురుగానుండి యొకరు నొకరు కొట్టవలెను గాని కనుచాటై యుండి కొట్టుట ధర్మముగాదు. కావున ఇంద్రజిత్తు చేసినది కూటయుద్ధము. రామ చంద్రమూర్తికి వాలికి జరిగినది యుద్ధముకాదు. అధర్మప్రవర్తనముచే వధ్యుఁడగు దోషిని ప్రభువు దండించుట యగును. వధ్యుఁడగు దోషిని నే విధముగఁ జంపినను దోషముకాదు. కావున నది యుద్ధము కాదు. కూటయుద్ధ మంతకుముందే కాదు. ఈ విషయము కిష్కింధాకాండ మందుఁ జర్చితము, దీనికి దానికిఁ బోలికయే లేదు.

తే. క్రూరచిత్తుండు మాయన్న•కొడుకు వీరి, ఋజుపరాక్రములను మోస•నిజపలాశి
వక్రబుద్ధిని బీడింప • వ్రాలియున్న, వారు ములుకులతో ముండ్ల•పందు లనఁగ.

అర్థములు. ఋజుపరాక్రమమును=వంచనలేక చక్కటి యుద్ధముచేయు వారిని, మోసన్ = మోసముచే, మోసము-రూ- మోస – నిజ = స్వభావసిద్ధమైన, పలాశి=రాక్షసులయొక్క, వక్రబుద్ధిని = కుటిలబుద్ధిచే, ములుకులతోన్ = ముండ్లతో, మా యన్నకొడుకు. 'సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దములకుం గొన్నియెడల బహుత్వంబగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౭౬ సూ, 'మా యత్త పృథ్వీసమాన పృథాదేవి' భార. అర. ౫ ఆ.

తాత్పర్యము

క్రూరకార్యములు చేయుటయందు మనస్సుగల మా యన్నకొడుకు వంచన చేయక పరాక్రమము చూపు వీరిని మోస విధముగ రాక్షసులకు సహజమైన కుటిల బుద్ధిచే బాధింపఁగా బాణములు దేహము నిండ నాటుకొనఁగా ముండ్లు విచ్చిన పందివలెఁ బడి యున్నారు.

ఉ. ధీరుల నేరిఁ జేరితిఁ బ్ర•తిష్ఠను గోరి నరేంద్రుఁ డిద్ద ఱీ
తీరున మిత్తిఁగూ రెడిగ•తిం బడినా, రిఁక నేను మన్గడన్
గూరియుఁ జచ్చిన ట్లయితిఁ • గుంఠితరాజ్యమనోరథుండ నై
కోరికయుం బ్రతిజ్ఞ సమ•కూడె దశాస్యున కేమి పాపమో. ౧౦౩౬

అర్థములు. ప్రతిష్ఠను గోరి=విభీషణుఁడు రామచంద్రమూర్తి దాసుఁడు, సఖుఁడు అను గౌరవము సంపాదింపఁగోరి - మిత్తి = మరణము - మన్గడన్ = బ్రదుకుపాటు, కుంఠితరాజ్య మనోరథుండనై =వ్యర్థమైపోయిన రాజ్యాభిలాష గలవాఁడనై—ఈ మాట నాధారము చేసికొని విభీషణుఁడు రాజ్యాభిలాష శరణాగతి చేసెనని కొందఱందురు. ఏ కోరికతోనైన శరణాగతి చేయవచ్చును. అది దోషము గాదు గాని రావణుని - దటాలున విడిచి వచ్చునపుడు గాని, శరణాగతి చేసినపుడు గాని యట్టి యభిప్రాయ మతనికున్నట్లు ప్రమాణములేదు. ఇక్కడ రాజ్య మనోరథ మనునది కైంకర్య సామ్రాజ్య మనోరథ మని యర్థము చెప్పవలెను. అట్లు చెప్ప నిష్టము లేనివారు ఇది రామచంద్రమూర్తి లంకాధిపత్యమునకు నభిషేకము చేసిన తరువాత చెప్పినమాట కావున నట్టి కోరిక తదనంతరము కలిగె నని తలంపవలయును గాని యా యుద్దేశముతోనే బయలుదేఱి వచ్చె ననుటకు నాధారము శూన్యము. ఈ విషయము శరణాగతి ఘట్టంబునఁ జర్చితము. కుంఠితరాజ్యమనోరథుఁడను = రాజ్యవిషయమైన మనోరథము కుంఠిత మయ్యె నని యర్థము చెప్పరాదు. అది నిరాకరము కావున కుంఠిత రాజ్యమైన మనోరథము అనఁగా కుంఠిత రాజ్యమైన కైంకర్య మనోరథ మని యర్థము గ్రహింపవలెను. రాజునకు రాజ్యమం దెంత యభిలాషయో యంత యభిలాష విభీషణునకు కైంకర్యమునం దుండెను.

అది కుంఠిత మయ్యెను. నరేంద్రు లిద్దఱు ననుచో ఆ నరేంద్రు లిద్ద అని తచ్ఛబ్దం బధ్యాహార్యంబు,—'కొన్ని యెడలఁ దదాదులు విశేషణంబు లధ్యాహార్యంబులు' ప్రౌ. వ్యా. వాక్య. ౧౧ సూ.

తాత్పర్యము

లోకమునందు నెవ్వారియొద్దఁ జేరిన నాకు గౌరవము కలుగునని తలఁచి చేరితినో యా ధీరులు రామలక్ష్మణు లిరువురు నీవిధమున మరణించు వారివలెఁ బడినారు. నేను వ్యర్థమైన కైంకర్య రాజ్యాభిలాష గలవాఁడనై బ్రతికియుఁ జచ్చిన వానివలె నైతిని. అది యేమి పాపబలమో పాపాత్ముఁడైన రావణుని కోరికయుఁ బ్రతిజ్ఞయు ఫలించెను.

దశాస్యున కేమి పాపమో యనియు నన్వయింప నగు.

కం. అని విలపించు విభీషణుఁ, దన కౌఁగిటఁ బొదివి పలుకుఁ ♦ దరుచరవిభుఁ డ
ల్లన లంక నీవ యేలెదు, తనయులతోఁ గనఁడు కాంక్షితమురావణుఁడున్.

లంక నీవయేలెదు తనయులతో ననికాని, రావణుఁడు తనయులతోఁ గాంక్షితము గనఁడు అని కాని యన్వయింప నగు. కుంఠిత రాజ్యమనోరథుండనై యన్నమాటకు రామచంద్రమూర్తి రాజ్యమిచ్చెద నన్నమాట స్మరించి చెప్పుచున్నాఁడని సుగ్రీవుఁడు గ్రహించి ప్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము దుఃఖించు విభీషణుని సుగ్రీవుఁడు కౌఁగిలించి నీవే లంక యేలెదవు. రావణుఁడు తన కొడుకులతోఁ గోరిక నెఱవేర్చుకొనఁ జాలఁడు.

కర్ణునినమ్మి దుర్యోధనుఁడు చెడినట్లు లీ కొడుకులను నమ్మి రావణుఁడును జెడిపోవుననియు నర్థము చెప్పవచ్చును.

చ. వగవకు మయ్య వీరి కొక ♦ బాధయుఁ గల్గదు, మూర్ఛ దేఱినన్
బగతుని సైన్యయుక్తుఁడగు ♦ పంక్తిముఖున్ విదళింతు, రంచు నా
ప్పగుగతి నూఱడించుచు ని♦జాంతికవర్తి సుషేణుతోడ నో
యగచర! లబ్ధసంజ్ఞుల న♦రాధిపులం గొని కీశసేనతోన్. ౧౦౩౭

అర్థములు. పగతుని=పగవానిని, నిజాంతికవర్తి=తన సమీపమం దున్నవాఁడు, లబ్ధసంజ్ఞులన్ = స్మృతివచ్చిన వారిని.

తాత్పర్యము

విభీషణా! దుఃఖింపకుము. వీరు మూర్ఛపోయిరేకాని, ప్రాణాపాయదశ యందు లేరు. వీరు మూర్ఛదేఱఁగానే విరోధియగు రావణుని సేనతోడఁ జంపుదురు అని యూఱడించి తన సమీప మందున్న సుషేణునిజూచి యిట్లనియె. సుషేణా! వీరు మూర్ఛతేఱఁగానే వీరి నిద్దఱను వానరసేనను తీసికొని.

కం. చనుమీ కిష్కింధకు నే, దనుజేంద్రు సపుత్త్రమిత్త్రబాంధవునిన్
దునిమి కొని తెత్తు సీతన్, మును నష్టశ్రీని నమరముఖ్యునిమాడ్కిన్. ౧౦౩౯

అర్థములు. నష్టశ్రీని=నశించిన రాజ్యలక్ష్మిని, అమరముఖ్యునిమాడ్కిన్= దేవేంద్రునివలె.

తాత్పర్యము స్పష్టము.

— సుగ్రీవునితో సుషేణుఁడు సంజీవకరణిఁ దెప్పింపుమని చెప్పుట. —

సీ. అనుఁడు సుగ్రీవుతో ననియె సుషేణుండు, తొల్లి దారుణ మయి చెల్లెఁగలహ
మమరాసురుల కందు నసమదానవశర నిహతి బృందారక నిచయ మెల్ల
వాలి సొమ్మలు వోయి ప్రాణముల్ విడువంగ, నమరగురుండు వి ద్యాప్రయుక్త
మహితౌషధుల చేత మాన్పెను దద్బాధ, నవియు క్షీరాంబుధి ప్రాంతముసను
తే. గలవు సంపాతి పనసాదికపులఁ బంపి, వేగఁ దెప్పింపవయ్య కపిప్రకాండు
లెల్ల రెఱుఁగుదు రచ్చోటు నీ మరుత్తనూజుఁ బంపుము బలియుండు తేజమెఱసి.

అర్థములు. అమరాసురులకు = దేవదానవులకు, అసమ=అసమానమైన, దానవశర=దానవుల బాణములయొక్క. నిహతిన్ దెబ్బలచేత, బృందారక నిచయము = దేవతా సమూహము, సొమ్మలు = మూర్ఛలు, విద్యాప్రయుక్త = మృతసంజీవనీ విద్యచేఁ గూడిన, మహిత=ఓషధులచేత = గొప్పమూలికలచేత, క్షీరాంబుధి=పాలసముద్రము, కపిప్రకాండులు=వానరశ్రేష్ఠులు.

తాత్పర్యము

అని చెప్పఁగా సుగ్రీవుతో సుషేణుఁ డిట్లనియె. పూర్వము దేవదానవులకు ఘోరయుద్ధము జరిగెను. అందు దానవుల బాణములచే దెబ్బలు దిని దేవతలు మూర్ఛపోయిరి. కొందఱు చచ్చిరి. అప్పుడు బృహస్పతి మృతసంజీవని విద్యతోఁ గూడిన కొన్ని మూలికలచేత దేవతలబాధ మాన్పెను. ఆ మూలికలు పాలసముద్రము సమీపమున నున్నవి. సంపాతి పనసుఁడు లోనగు వానరులఁ బంపి తెప్పింపుము అవి యుండుచోటు ఈ వానరశ్రేష్ఠు లెఱుఁగుదురు. ఈ యాంజనేయుఁ బంపుము. ఆతఁడు తన పరాక్రమముచే.

తే. తెచ్చు సుధకయి దేవతల్ ద్రచ్చి రేచటఁ, గలశవారాశినచ్చోటఁ గలవు ద్రోణ
చంద్రకుధరంబు లందు విశల్యకరణి, దివ్యసంజీవకరణియుఁ దేజరిల్లు. ౧౦౪౧

అర్థములు. సుధకయి=అమృతము నిమిత్తము, ద్రచ్చిరి = చిలికిరి, కలశ వారాశి=పాలసముద్రము, మందరముచే పాలసముద్రము మథించు నపుడు కలశముగాఁ జేయఁబడినది ద్రోణచంద్ర కుధరంబులు = ద్రోణపర్వతము, చంద్ర పర్వతము.

తాత్పర్యము

తేఁగలదు. ఏ ప్రదేశమందు నమృతము నిమిత్తమై దేవతలు పాలసముద్ర

మును జలికిరో యచ్చట ద్రోణపర్వత మని, చంద్రపర్వత మని, రెండు కొండలు గలవు. అందు విశల్యకరణి, సంజీవ కరణియుఁ బ్రకాశించును. విశల్యకరణి = దేహమునందలి ములుకులను నూడదీయునది, సంజీవకరణి = ప్రాణమిచ్చునది, ఇప్పుడు కావలసిన వీ రెండని భావము.

కం. ఓషధులు నిలిపి రసుర, ద్వేషులు వేవేగ వానిఁ ♦ దెమ్మను మనుచున్
భాషించుచుండ నీలో, ఘోషము వినవచ్చెఁ జెవుకు ♦ గొలుపుచు ఘనమై.

అర్థములు. అసురద్వేషులు=దేవతలు, ఘోషము=ధ్వని.

తాత్పర్యము

దేవత లా యోషధు లందు నిల్పిరి. వానిని ద్వరగాఁ దెప్పింపుము అనుచుండఁగా నింతలో చెవుడు గలిగించునట్టి గొప్ప ధ్వని వినవచ్చెను.

—♦ గరుత్మంతుఁడు శ్రీరామలక్ష్మణులఁ జూడవచ్చుట. ♦—

కం. విడివడి మబ్బులు చెదరఁగ, కడలి కర ళ్ళెగసి యల్ల ♦ కల్లోలముగా
గడగడ లాడఁగ మేదిని, గడు సద్వీపద్రుమంబు ♦ గా లవణాబ్ధిన్. ౧౦౪౩

అర్థములు. విడివడి=విచ్చలవిడి, కడలి = సముద్రముయొక్క; కరళ్ళు = అలలు, అల్లకల్లోలముగా = గందర గోళము, మేదిని = లంకాద్వీపము, సద్వీపద్రుమంబుగాన్=ద్వీపములతోను జెట్లతోను గూడినదిగా.

తాత్పర్యము

విచ్చలవిడి మబ్బులు చెదరిపోఁగా సముద్రము నందలి యల లెగసి కలవరపడఁగా ద్వీపములతో చెట్లతో సముద్రము నందలి భూమి యదరఁగా.

కం. మూలములతోడ భూరుహ, జాలంబులు విఱిగి కూలఁ ♦ జండసమీరం
బోలి నుదయించె సుడివడి, వ్యాలంబులు బెదరి పఱచి ♦ యంబుధి దూఁకెన్.

అర్థములు. భూరుహజాలంబులు = చెట్లగుంపులు, చండసమీరము = భయంకరమైనగాలి, సుడివడి = కలఁతచెంది, వ్యాలంబులు = పాములు, పఱచి= పరువెత్తి.

తాత్పర్యము

వేళ్ళతోడ విఱిగి చెట్లు క్రిందఁబడునట్లు తీవ్రమైన గాలిపుట్టెను. కలఁత చెంది వెలుపలఁ దిరుగు పాము లన్నియు దిగులుపడి పరువెత్తిపోయి సముద్రములో దూఁకెను.

ఉ. వెంటనె సంజ్వలద్దహను ♦ పెంపున వెల్గుచు వైనతేయుఁడున్
మింటను దోఁచెఁ, దోఁచుటయు ♦ నీరజనేత్రులఁ జుట్టియున్న యా
తుంటరి పాఁపపుర్వులను ♦ దోన యథాయథలై భయంబు లో
నంటఁగఁ బాఱి దూఁకె లవ ♦ ణాంబుధి; నగ్గరుడుండు డాయుచున్. ౧౦౪౪

అర్థములు. సంజ్వలత్ + దహనః = మండుచున్న యగ్నియొక్క, పెంపునన్ = గొప్పతనముతో, వైనతేయుఁడున్ = గరుత్మంతుఁడును, తుంటరి = దుష్టములైన, పాఁపపుర్వులును = పాములు, తోన = వెంటనే, యథాయథలై = చెదరిపోయి, రామలక్ష్మణులను జుట్టియున్న పాములు పరువెత్తి సముద్రములో దూఁకెననుటచే మంత్రసృష్టము లగు పాములందు మంత్రశక్తి నావహింపఁజేసి వానిచే నింద్రజిత్తు కట్టెనని యేర్పడుచున్నది. ౯-౨౩ ప-౧౦౫ ౭-పద్యములఁ జూచునది.

గ్రంథములందు నాగాస్త్ర ప్రయోగము వర్ణింపఁబడిన చోటఁ బాము లుత్పత్తియై బయలు వెడలునట్లును గరుడాస్త్రముచే నది వారింపఁబడునట్లు వర్ణింపఁబడినది. ఇప్పుడైనను గరుడాస్త్రమును రామలక్ష్మణులు ప్రయోగించి యుండిన నీయస్త్రము వ్యర్థమైయుండును. కాని చీఁకటిలో బాణయుద్ధముచేయుచు వానిలో సందుచేసికొని నాగాస్త్రమును బ్రయోగించుటచే నది నాగాస్త్రమని రామలక్ష్మణులు గుర్తింపఁ జాలరైరని తోఁచెడిని. ఇంద్రజిత్తు కానరాకుండుటచే బాణవర్షమునకుఁ బ్రతిక్రియ చేయ సాధ్యపడ దయ్యె. కానరానివానిమీఁద నస్త్ర ప్రయోగము జేయరాదయ్యె. కావునఁ గట్టుపడవలసివచ్చెను.

తాత్పర్యము

అ క్షణమందే మండుచున్న యగ్నిహోత్రునివలెఁ బ్రకాశించుచు గరుత్మంతుఁ డాకాశమునఁ గాన వచ్చెను. ఆయన కానరాఁగానే రామ లక్ష్మణులను జుట్టుకొనియున్న పాపపుఁ బాములు చెల్లాచెదరై భయముతోఁ బరువెత్తిపోయి సముద్రములో దూఁకెను. ఆ గరుడుఁడు సమీపించి.

కం. కాకుత్స్థులఁ గని యలరుచు, శ్రీకరచంద్రాభముఖకు♦శేశయయుగ మ
స్తోకప్రేమను నివురఁగఁ, బ్రాకటగతి మాసె మేని♦వ్రణజాలంబుల్. ౧౦౪౭

అర్థములు. అలరుచున్ = సంతోషించుచు, శ్రీకర = సంపత్కరమైన, చంద్రాభ = చంద్రునితో సమానమైన, ముఖకుశేశయ యుగము = ముఖకమలముల జంట, అస్తోకప్రేమను = అధిక ప్రేమతో, వ్రణజాలంబుల్ = గాయముల సమూహములు.

తాత్పర్యము

రామలక్ష్మణులఁ జూచి సంతోషించి వారి యిరువుర ముఖకమలములను తడువఁగా వారి దేహము లందలి గాయము లన్నియు మానెను.

తే. ధిషణబలములు వీర్యంబు ♦ తేజ మోజ
ము త్తమగుణంబు నుత్సాహ ♦ మోలి స్మృతియు
సత్త్వదర్శనమును రామ ♦ చంద్రునకును
లక్ష్మణునకును రెట్టించె ♦ లలితరీతి. ౧౦౪౮

అర్థములు. ధిషణ బలములు = బుద్ధిబలము, దేహబలము, వీర్యంబు = శత్రు

వుల ధిక్కరించు శక్తి, తేజము = పరాక్రమము, ఓజము = కాంతి, ఉత్తమ గుణంబు=ఉత్సాహ విశేషము, ఉత్సాహము=లోకోత్తర కార్యములు చేయుట యందలి స్థిర ప్రయత్నము, స్మృతి = మఱపులేమి. సత్+ప్రదర్శము = మంచి సూక్ష్మబుద్ధి, రెట్టించెన్=రెండింత లయ్యెను, ఇందలి 'ధి' గాయత్రి యందలి పదునేడవ యక్షరము.

తాత్పర్యము

గరుత్మంతుఁడు దేహములు తుడువఁగానే వారికి బుద్ధిబలము, దేహబలము, వీర్యము, తేజము, ఓజస్సు, ఉత్సాహము, స్మరణశక్తి, బుద్ధిసూక్ష్మత, రామలక్ష్మణులకు నిబ్బడించెను.

తే. మేనికాంతియుఁ బసిఁడికి • మేలుచేయి, యయ్యె నంత సుపర్ణుఁడా • యనఘమతుల
నెత్తి కవుఁగిట నొత్తె నీ • తేరుఁ డనియె, నమితసంతోషమున విన • తాత్మజునకు.

అర్థములు. మేనికాంతి = దేహకాంతి, పసిఁడికి=బంగారుకంటె, మేలుచేయి=శ్రేష్ఠమైనది, సుపర్ణుఁడు = గరుత్మంతుఁడు, అనఘమతులన్=పాపరహితమైన మనస్సుగల వారిని.

తాత్పర్యము

దేహకాంతి బంగారు కాంతికంటె నెక్కువయయ్యెను. అప్పుడా గరుత్మంతుఁడా నిష్పాపమనస్కులను నెత్తికొని కౌఁగిలింపఁగా సంతోషముతో రామచంద్రమూర్తి గరుడునితో నిట్లనియె.

నాగపాశ బంధవిముక్తులై శ్రీరామలక్ష్మణులు గరుత్మంతునిఁ బ్రశంసించుట

ఉ. అయ్య! భవత్ప్రసాదమున • నాసురభర్తృసుతప్రయుక్త మౌ
నియ్యహిపాశబంధతతి • నెట్టి విపత్తును లేక యేమియున్
డయ్యక మున్నువోలెఁ బెను • ధాకయుఁ గంటిమి, నిన్నుఁజూడ మా
యయ్యను నాజిఁ దాత నజు • నాదృతిఁ గన్నటు లుల్లముబ్బెడున్. ౧౦౫౯

అర్థములు. భవత్+ప్రసాదమునన్=నీ యనుగ్రహముచే, ఆసురభర్తృసుత=రాక్షసరాజు కుమారునిచే, ప్రయుక్తము = ప్రయోగింపఁబడినది, అహిపాశబంధతతిన్=పాములనెడి త్రాళ్ళచేఁ గట్టఁబడిన కట్లసమూహముచే, డయ్యక= శ్రమపడక, ధాకయు = శౌర్యము, అయ్యను = తండ్రిని, ఆజిన్ = దశరథుని - తాత యగు నజుని, ఆదృతిన్ = ఆదరముతో, ఉల్లము = మనస్సు, ఉబ్బెడిన్= సంతోషముచేఁ బొంగుచున్నది.

తాత్పర్యము

అయ్యా, నీ యనుగ్రహముచే నింద్రజిత్తు కట్టిన నాగపాశబంధములచే నెట్టి కీడును బొందకుండుటయేకాక శ్రమము లేక మునుపటివలె గొప్పశక్తియుఁ బొంది

తిమి. నిన్నుఁజూడగా మా తండ్రి దశరథుని తాత యజమహారాజును జూచినట్లు మనస్సు సంతోషముచే నుప్పొంగుచున్నది.

తే. రూపమును దివ్యమాల్యాను♦లేపనముల, విమలవస్త్రంబులను దివ్య♦వివిధభూష
ణంబులదాల్చి దివ్యతే♦జంబుఁ గలిగి, యొప్పుచున్నాఁడ వెవ్వండ♦వో మహాత్మ!

తాత్పర్యము

మహాత్మా! నీ వెవ్వండవు? నీ రూపము మనుష్యులందుఁ గానవచ్చునది కాదు. దివ్యమైయున్నది. నీవు ధరించిన మాల్యములు చందనాదులు దేవతలు ధరించునవియై యున్నవి. వస్త్రములు భూషణములు నట్టివే యై యున్నవి. నీవు దివ్య తేజస్సు గలవాఁడవై యున్నాఁడవు. నీ వెవ్వఁడవు?

—♦ గరుడుఁడు శ్రీరామునకు హెచ్చరికఁగ యుద్ధముసేయ బోధించుట ♦—

కం. అనవుడు నానందాశ్రులు, కనుఁగొనలన్ సందడింప ♦ ఖగపతి యను మీ
కనుఁగు సఖుండను గరుడుఁడఁ, బ్రణుతయశా! నిబహిశ్చ♦ర ప్రాణంబన్. ౧౦౫౧

సీ. చనుదెంచితిని మీకు♦సాహాయ్య మొనరింప, దానవాసురులు గం♦ధర్వులైన
నింద్రుని మున్నగా ♦ నిడుకొనివచ్చినఁ బాపలే రీ శర♦బంధనములు
మాయాబలంబున ♦ మఘవారి నిర్మింపఁ, గాద్రవేయులు విష♦కఠినదంష్ట్రి
లిట్లు శరంబులై ♦ యేతెంచి బంధించి, రీ వార్త విని రయం♦బెనక మెనఁగ

తే. వచ్చినాఁడను స్నేహత♦త్పరత రాము!, వీడఁ జేసితి బంధముల్ ♦ వీరవర్య!
కూటయోధులు రాక్షస♦కులజు లెల్ల, నప్రమత్తత మీరుండు♦ టర్హమయ్య.

అర్థములు. ఆనందాశ్రులు = సంతోషముచేఁగలుగు కన్నీళ్ళు, ఖగపతి = పక్షిరాజు, అనుఁగు సఖుండను = ప్రేమగల స్నేహితుఁడను, బహిశ్చర ప్రాణంబన్ = వెలుపలఁ దిరుగు ప్రాణమును, నివాహన మగుటచే నీకు సఖుఁడ నని చెప్పరాదు. పరత్వము వెలిపఱిచినట్లగును, దేవ రహస్యము రావణవధము నఱుకు బహిరంగము చేయరాదు. కావున గూఢోక్తిగా ననెను. బహిశ్చర ప్రాణమనుటచే నీకు లక్ష్మణుఁ డెట్టివాఁడో నే నట్టివాఁడనే యని భావము. మాయాబలంబునన్ = మంత్రములవలనఁ గలిగిన యద్భుత శక్తిచే, కాద్రవేయులు = కద్రువ కొడుకులు- సర్పములు ఎనక మెనఁగన్ = అతిశయింపఁగా, కూటయోధులు = మోసయుద్ధము చేయువారు, అప్రమత్తతన్ = హెచ్చరికతో.

తాత్పర్యము

మీకుఁదోడు పడుటకై వచ్చితిని. దానవులు, అసురులు, గంధర్వులు ఇంద్రుని ముందుంచికొని వచ్చినను నీశరబంధములను వదలింపలేరు. అది యేమనిన వీని నింద్రజిత్తు మంత్రములవలనఁ గలిగిన యద్భుతశక్తిచే సృష్టింపఁగా విషముచే క్రూరములైన కోఱలుగల సర్పములు బాణములై వచ్చి మిమ్ము బంధించెను. ఈ వృత్తాంతము విని నీ యందుండు స్నేహభావముచే నేనతిశీఘ్రముగ బయలుదేఱి

వచ్చితిని. ఆకట్లను వదలించితిని. రామచంద్రా! రాక్షసులు మోసయుద్ధము చేయువారు కావున నీవు ప్రమాదపడక యుండవలెను.

కం. అసురులకు బలము మాయయె, యనఘ వినిర్మల మనస్కు-లగు మీకు బలం
బెనఁగు ఋజుత్వమె కావున, నసురుల నమ్మంగవలవ-దాహవమందున్.

అర్థములు. ఆహవమందున్=యుద్ధమందు.

తాత్పర్యము

రాక్షసులకు మోసగించుటయేబలము. అది విడిచిన వారు దేనికిఁ గొఱగారు. నిర్మలమగు మనస్సుగల మీకో ఋజుత్వము బలము-మీరు మాయ నాశ్రయింప రాదు. కావున రణమందు రాక్షసులను మీరు నమ్మరాదు. కావున మీరు ఋజుత్వము విడువక వారి మాయలకు లోపడక హెచ్చరిక కలిగి యుండవలెను. మాయలకుఁ బ్రతిమాయలు చేయవలసిన పనిలేదుగాని వారి మాయలు చెఱుచు పని చేయుట దోషముగాదు.

కం. దృష్టాంతం బిదె యనుచును, స్పష్టముగ గ్రహించి వారి-చరితము నీ ష
ష్ఠాష్టకమున మెలఁగుడు మీ,యిష్టము నెఱవేఱు శీఘ్రమ-మే రఘురామా!

అర్థములు. షష్ఠాష్టకమునన్=కలహమున.

తాత్పర్యము

నేను జెప్పిన దానికి దృష్టాంత మిప్పుడు జరిగినదియే. దీనివలననే వారి నడవడి మీకు స్పష్టపడి యుండవచ్చును. వారి మాయను జెఱుచు యత్నము మీరు చేసి యుండిన నిట్టి కష్టము ప్రాప్తించి యుండదు. అటుగాక యూరకున్న కారణమున నిట్టి బాధ పడవలసి వచ్చెను. కావున నీ కలహమందు మీరు హెచ్చరిక కలిగి యాత్మరక్షణోపాయము నేమఱక వర్తింపుఁడు.మీకు శీఘ్రముగనే మేలుకలుగును.

ఉ. నేను సఖుండ నెట్లయితి - నీ కని చూచెద నవ్విచారమున్
మానుము, తద్విధం బని స-మాప్తము నొంద నెఱుంగవచ్చు, నా
కానతి యిచ్చి దే చనఁగ - నప్రతిధర్మవిధిజ్ఞ! శత్రులం
దేనియు మాన వీవు కృప - నెప్పుడు నీరజపత్రలోచనా. ౧౦౫౫

అర్థములు. అని=యుద్ధము - అప్రతి = అసమానమైన — ధర్మవిధిజ్ఞ= ధర్మశాస్త్రము నెఱిఁగినవాఁడా.

తాత్పర్యము

నీ ముఖమే నేనెఱుఁగనే. నిన్నుఁజూచినదియు లేదే. నేను నీకు సఖుఁడ నెట్లయితి నని యడుగఁ గుతూహలపడుచున్నావు, ఆ యాలోచన మానుము, ఆ విధము యుద్ధము పూర్తియయిన పిమ్మట నీవు తెలిసికొనఁగలవు. నాకు సెల విచ్చెదవా? పోయివచ్చెదను. ధర్మశాస్త్రము నీవలె నెఱిఁగినవారులేరు. కావున నీవు నన్నుఁజంప యత్నించిన శత్రువులందు నీవు దయమానవు.

కం. బాలురు వృద్ధులు దక్క(గ, నీ లంక(గలట్టి యసుర•బృందంబుల ని
ర్మూలించి మార్గణంబుల, శీలవతిన్ సీత మఱల(•జెందెద వనుచున్. ౧౦౫౬

అర్థములు. మార్గణంబులన్ = బాణములచే.

తాత్పర్యము

పసివాండ్రు, ముసలివాండ్రు తప్ప మగవారిలో లంకలో రాక్షసుఁడను వాఁడు లేకుండునట్లు రాక్షస సమూహములను వేరుతోడ నాశముచేసి పతివ్రత యగు సీతను మరల గ్రహింపఁగలవు.

తే. పలికి వారల(దనయంక•పాళి(గ్రుచ్చి, తతముదం బొనగూర్చి ప్ర•దక్షిణించి
పవనునట్టుల యాకాశ•పథము(బట్టి, తార్క్ష్యు(డరిగిన(దేజిన•దాశరథుల.

అర్థములు. అంకపాళిన్=కౌఁగిట, తార్క్ష్యుఁడు=గరుడుఁడు.

తాత్పర్యము

ఇట్లు చెప్పి వారిని కౌఁగిలించి వారికి సంతోషము కలిగించి ప్రదక్షిణము చేసి గాలివలె నాకాశమార్గమున గరుడుఁడు పోయెను. మూర్ఛనుండి తెప్పఱిల్లి కొనిన రామలక్ష్మణులను.

—• శ్రీరామలక్ష్మణుల(జూచి కపులు సింహనాదంబులు సేయుట •—

కం. తిలకించి హర్షభరమున(, బులకించి మదించి వాల•ముల(దాఁచుచు గ
ర్జల నించి భేరినినదము, బలియించి మృదంగరవము(•బరఁగించి కపుల్.

అర్థములు. తిలకించి=చూచి-హర్షభరమునన్= సంతోషాతిశయముచే-పులకించి = గగ్గురుపాటుచెంది - మదించి=గర్వించి - తాఁచుచున్ = నేలకువేసి కొట్టుచు - గర్జలనించి=సింహనాదముల నిండఁజేసి—భేరి = నగారాల- నినదము = ధ్వని - మృదంగరవము = మద్దెలల ధ్వని.

తాత్పర్యము

చూచి సంతోషాతిశయమున గగ్గురుపాటు చెంది గర్వించి తోఁకలను నేలకువైచి బాఁదుచు సింహనాదములుచేసి నగారాల వాయించి మద్దెల రవములు వానరులు వ్యాపింపఁ జేసిరి.

కం. వాయించుచు వాద్యంబుల, మ్రోయించుచు శంఖములను•మునుపటియట్టుల్.
కో యంచును జేయంచును, మాయించుచు రాక్షసులను•మార్కొని రెలమిన్.

అర్థములు. కోయంచును కోబలీ=కోబలియని, బలితీసికో యని యర్థము, జే=జయ, మాయించుచున్=నాశము చేయుచు.

తాత్పర్యము

వాద్యముల వాయించుచు శంఖముల మ్రోయించుచు మునుపటివలె కోయని జేయని ధ్వనులుచేయుచు, రాక్షసుల వధించుచు వానరులు రాక్షసుల నెదుర్కొనిరి.

కం. జలదాగమమున వెఱగొన, జలదంబులు మ్రోయుగతి నిశామధ్యమునన్
బలిముఖులభీమనినదం,బులు కర్ణకఠోరముగనుఁబోరిఁ బోరి నెగసెన్. ౧౦౬౦

అర్థములు. జలదాగమమున = వానకాలమందు, వెఱగొన = లోకులు భయపడునట్లు, నిశామధ్యమునన్ = నడిరేయియందు, ఇట్లు చెప్పుటచే నిపుడు యుద్ధమున మొదటి దినమున నడిరేయి యైనట్లు లేర్పడెను. నాగపాశ బంధములతోనే ప్రథమదిన యుద్ధము ముగిసినదనుట విచార్యము. భీమనినదము=భయంకర ధ్వని-కర్ణకఠోరముగను=శత్రువుల చెవులకుఁ గటువుగ—పోరిఁబోరి=మిక్కిలి.

తాత్పర్యము

వానకాలమందు వినువారికి భయము కలుగునట్లు మేఘములు ధ్వనించునట్లు అర్ధరాత్రమున వానరుల భయంకరధ్వనులు రాక్షసులకుఁ వినఁగఠినములై మీఁద మీఁద నంతకంతకు నతిశయించెను.

ఇంద్రజిత్తువలన రామలక్ష్మణులకుఁ గలిగిన పరాభవమువలన నిర్మల మనస్సులు గలవారై ఋజు ప్రవర్తనము గలవారికి ప్రాణాపాయము కలిగించు నంతటి కష్టదశ ప్రాప్తించినను, వినాశములేదు, విపరీత వర్తనముగల పాపాత్ములకు తత్కాలమున మేలు గలిగినను, హస్తగతములైనవికూడ వ్యర్థములై పోవుచున్నవని గ్రహింపనగు. ధర్మాధర్మములు శాస్త్రములవలన నెఱుఁగనగును, గాని వాని ననుష్ఠాన రూపమునఁ జూపి లోకుల ననుష్ఠింపఁజేయుటచే ధర్మసంస్థాపనము చేయుటకే భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తియై యవతరించెను. ఈవిషయము పూర్వమే విశదీకరింపఁబడెను.

—•{ ౫౧-వ సర్గము. రావణుఁడు కపులసంతోషమునకుఁ గారణము విచారించుట. }•—

మ. పటుసంరంభవిజృంభమాణకపిసంవ్రాతస్ఫురద్భీషణా
ర్భటు లుద్దామగభీరకంఠనినదవ్యాపారముల్ పర్వనొ
క్కట సంసద్గతరావణుం డులికి రక్షఃకాండమున్ వానరో
ద్భటకోలాహలసింహనాదములు నాఁదన్మేఘగర్జాచ్ఛటన్. ౧౦౬౧

అర్థములు. పటు=దృఢమైన-సంరంభ = వేగముతోఁగూడిన - విజృంభమాణ = వృద్ధియగుచున్న - కపిసంవ్రాత = వానర సమూహముయొక్క - స్ఫురత్=ప్రకాశించునవియు=అందఱకు వినఁబడునట్లు సర్వత్ర వ్యాపించునవి - భీషణ = భయంకరములైన - ఆర్భటులు = సింహనాదములు = పెద్దకేకలు - ఉద్దామ = పెద్దవియు - గభీర = గంభీరములును నగు - కంఠనినద=సింహనాద ఉమడి - వ్యాపారముల్ = కార్యములు-పర్వన్=వ్యాపింపఁగా — ఒక్కటన్ = ఏకకాలమున=ఒక్కసారిగ-సంసత్ + గత = సభయందుండిన-ఉలికిపడి = భయ

పడె - రక్షఃకాండమున్ = రాక్షససమూహమును - ఆరసిరందు = పొందను దానితో (౧౦౬-౪) నన్వయము. వానర = కోతుల - ఉద్భట = అతిశయించిన, కోలాహల, సంకుల శబ్దములు - సింహనాదములు = గర్జలు - నాదత్ = ధ్వనించుచున్న - మేఘ = వర్షాకాలమునందలి మబ్బుయొక్క - గర్జాచ్ఛటన్ = ఉఱుముల సమూహమును.

తాత్పర్యము

మిక్కిలి వేగముతో సంతకంతకు వృద్ధియగుచున్న వానరులయొక్క సర్వత్ర వ్యాపించిన కేకలు అధికమై గంభీరమైన కంఠనాదములు నొక్కటిగా సభయందుఁ దన జయము గుఱించి సంతోషముతోఁ బ్రశంసించుకొనుచు నావలి కార్యమేమి చేయవలెను, అందఱ మొక్కసారి వానరసేనపైపడి ధ్వంసముచేయుదమని యాలోచించు రావణుఁడువిని యులికిపడి రాక్షసులతో నిట్లనియెను. వానరుల కలకలములు సింహనాదములు వానకాలమందలి మేఘముల యుఱుముల సమూహమును.

కం. తలపించెను బట్టణముం, దలఁకించెను సాగరంబుఁ ♦ దలరించెను లో
నలు కించుక లేక యిటుల్, తలిరుపఁగా నేది కత మొంతరుచరవీరుల్. ౧౦౬-౧

అర్థములు. తలఁపించెను = స్మృతికిఁ దెచ్చెను, తలఁకించెను = కుదిలింపఁ జేసెను, తలరించెను = కలఁత నొందఁజేసెను. లోన్ = మనస్సులలో, అలుకు = భయము, ఇంచుక = కొంచెమైనను, తలిరుపఁగాన్ = సంతోషింపఁగా, కతమొ = కారణమో.

తాత్పర్యము

స్మృతికి దెచ్చుచున్నవి. నగరమును గుదిలించుచున్నవి. సముద్రమును గలత నొందించుచున్నవి. వానరులు మన ప్రభువు పడిపోయెను గదా, ఇఁక మన కేమిగతి. శత్రువులు పైపడుదు రేమో యను భయము కొంచెమైనను లేక యీ ప్రకారము సంతోషింపఁ గారణ మేమి కలిగెను.

ఉ. ఏదియొ హర్ష హేతువు కపీంద్రులకున్ ఘటియిల్లనోపు, సీ
తాదయితుండు లక్ష్మణుఁడు ♦ దారుణనాగమహాస్త్రబద్ధులై
మేదినిఁ గూలి యుండఁగ ని ♦ మిత్తము లేకయె సేన యుబ్బునే ?
మేదుర మయ్యె సందియము ♦ మీరు వెసం జని తన్నిదానమున్. ౧౦౬-౩

అర్థములు. హర్ష హేతువు = సంతోష కారణము - ఘటియిల్లన్ - ఓపున్ = కలిగియుండవలెను. మేదురము = అధికము = దట్టము - తత్ + నిదానమున్ = దాని మూలకారణమును.

తాత్పర్యము

వానరుల కేదియో సంతోషకారణము లభించియుండవలెను. రామలక్ష్మణు లిరువురు నాగపాశబద్ధులై భూమిపైఁబడి యుండఁగాఁ గారణము లేక సేన సంతో

పించునా? ఎవరైన దేవతలు సహాయులై వచ్చిరా? వారు కట్లు విడిపించుకొనిరా-నాకు బలమైన సందేహ మధికముగా నున్నది. మీరు త్వరగాఁబోయి దాని యాది కారణమేమో.

ఉ. ఆరసి రండు పొండన భ♦యాకులతం బరువెత్తిపోయి ప్రా
కారము లెక్కి వానరని♦ కాయముఁ గన్గొని ముక్తబంధులన్
హారివిహారలోలసమ♦ రాంగణవర్తుల భీమమూర్తులన్
శూరుల రామలక్ష్మణులఁ♦ జూచి గభిల్లన గుండె లాశరుల్. ౧౦౬౪

అర్థములు. ఆరసి = విచారించి — భయాకులతన్=భయముచేఁ గలిగిన కలఁతచే-ముక్తబంధులన్=కట్టులనుండి విడివడ్డవారిని—హారి = మనోహరముగ-విహారలోల=సంచారమందు నాసక్తిగలవారై, సమరాంగణ వర్తులన్ = యుద్ధభూమియందు వర్తించువారిని, భీమమూర్తులన్=భయంకరములైన యాకారములు గలవారిని, రామలక్ష్మణులు సౌమ్యమూర్తులైనను రాక్షసులకు మృత్యుదేవతలవలె నగుటచే వారికి భయంకరులుగానే కానవచ్చిరి. ఆశరుల్=రాక్షసులు.

తాత్పర్యము

విచారించి రండు పొండని చెప్పఁగా వారు భయముచే గుండెలు కొట్టుకొను చుండఁ బరువెత్తిపోయి ప్రాకారము లెక్కి వానరుల గుంపును జూచి వారిలో బంధములు వదలించుకొని స్వేచ్ఛగా యుద్ధభూమియందుఁ దిరుగువారిని భయంకరాకారులను, శూరులను, రామలక్ష్మణులనుజూచిగుండెలు గుభిల్లుమనఁగా రాక్షసులు,

మ. వెలుకం బాఱిన మోము లొప్పఁ జని యా♦వృత్తాంతమున్ సర్వమున్
దెలియం బల్కిరి శక్రవైరిశరబం♦దీభూతనిశ్చేష్టు లా
బలధుర్యుల్ గజతుల్యవిక్రములు త♦త్పాశంబులం ద్రెంచి య
స్ఖలితాడంబరవృత్తిఁ గ్రాలెదరు రా♦జా! రాముఁడుం దమ్ముఁడున్. ౧౦౬౫

అర్థములు. వెలుకంబాఱిన = వెల్లబోయిన, శక్రవైరి = ఇంద్రజిత్తు యొక్క, శర=అస్త్రములచే, బందీభూత=కట్టఁబడినవారై, నిశ్చేష్టులు = కదలక మెదలక యున్నవారు, గజతుల్యవిక్రములు = ఏనుఁగు బలముతో సమానమైన దేహబలముగలవారు-తత్ + పాశంబులన్ = ఆ కట్టులను- అస్ఖలితాడంబర వృత్తిన్= కట్టుపడుటకు ముందున్న స్థితికంటెఁ దక్కువకాని, యెక్కువేయైన, వేగిరపాటుతోఁ గూడిన వ్యాపారముతో —

తాత్పర్యము

ముఖములు వెలవెలఁబోవఁబోయి యా వృత్తాంతము సర్వము రావణున కిట్లు చెప్పిరి. రాజా! యింద్రజిత్తు బాణములచేఁ గట్టువడి కదల మెదలలేక యుండిన రామలక్ష్మణులు, బలవంతులు, ఏనుఁగుల విక్రమము గలవారు, ఏనుగులు తమ్ముఁ గట్టిన త్రాళ్ళను త్రెంచుకొనినట్లు ఆ పాశముల ద్రెంచుకొని అంతకు ముందున్న యాడంబరమున కంటె దక్కువ కాని యాడంబరముతోఁ బ్రకాశించుచున్నారు.

-♦ శ్రీరామలక్ష్మణులు నాగపాశవిముక్తు లగుటకు రావణుఁడు వ్యసనపడుట. ♦-

చ. అనవుడుఁ జింతయున్ వ్యసన ♦ మారట పెట్ట విషణ్ణచిత్తుఁడై
యనియె దశాస్యుఁ డేమిది మ♦హాపవనాశనతుల్యముల్ వికర్తనసమముల్ పితామహవ♦రప్రతిపన్నము లప్రతీపముల్
ఘనతరమత్సుతాస్త్రములు ♦ కా వవి వ్యర్థము లెన్నఁ డేనియున్. ౧౦౬౬

అర్థములు. చింతయున్=ఇఁక మీఁద నేమి చేయవలయునా యని యాలోచన, వ్యసనము=ఇంతగొప్ప ప్రయత్నము వ్యర్థమైపోయెఁగదా యని విచారము, విషణ్ణచిత్తుఁడై = విషాదముతోఁ గూడిన మనస్సు గలవాఁడై, మహాపవనాశన తుల్యముల్=వాసుకి తక్షకుఁడు మొదలైన గొప్ప సర్పములతో సమానములైనవి, పవన+అశన= గాలి యాహారముగాఁ గలవి, పాములు, వికర్తన సమముల్ = సూర్యునివలె మండుచుండునవి, పితామహవర ప్రతిపన్నములు=బ్రహ్మవరముచేఁ బొందఁ బడినవి, అప్రతీపముల్=ఎదురులేనివి, ఘనతర=మిగుల గొప్పశక్తిగల, మత్సుత=నా కుమారునియొక్క, అస్త్రములు.

తాత్పర్యము

ఈ ప్రకారము చూచివచ్చిన రాక్షసులు చెప్పఁగా రావణుఁ డిక నేమి చేయుదునా, చేసిన దంతయు వ్యర్థమైపోయెనే యని విషాదపడుచు, నేమిది యాశ్చర్యము! వాసుకి, తక్షకుఁడు లోనగు గొప్ప సర్పములతో సమానములై సూర్యునివలె మండునవియై బ్రహ్మవరముచే సంపాదింపఁబడిన వైన నా కుమారుని మహాస్త్రము లెన్నఁడు వ్యర్థములు కావే.

కం. అట్టి శరంబుల నింద్రజి, ట్టిట్టుగఁ గట్టినను మరల♦విడివడిరి రిపుల్
చిట్టలు నా బల మిఁక న, న్నెట్టును రక్షించు ననుట♦యేమో నమ్మన్. ౧౧౬౭

అర్థములు. చిట్టలు = ఆశ్చర్యము, చిత్రశబ్దభవము. ఇది నిత్యబహువచనాంతము.

తాత్పర్యము

అటువంటి బాణములచే నింద్రజిత్తు గట్టిగాఁ గట్టినను శత్రువులు విడిపించుకొనిరి. ఇది యాశ్చర్య విషయము. నా బల మిఁక నన్ను రక్షించునని నేను నమ్మఁజాలను. అది సందేహింపఁ దగినదే. నమ్మరాదు.

కం. ఒవ్వని వారల ప్రాణము, లువ్విత్తుగఁ దీయఁ జాలు♦నుగ్రశరచయం
బవ్వాసుకిసమతేజం, బివ్విధి వ్యర్థముగఁ బోయె♦నిఁక నేమనఁగన్. ౧౦౬౮

అర్థములు. ఒవ్వని వారల=విరోధుల, ఉవ్విత్తుగ=నిశ్శేషముగ.

తాత్పర్యము

శత్రువుల ప్రాణములను నిశ్శేషముగఁ దీయఁజాలు భయంకరశరసమూ

హము వాసుకి తేజముతో సమానమైన తేజము గలవి యీ ప్రకారము వ్యర్థమై పోయినపు డిఁక ననుకొనవలసిన దేమున్నది ?

—♦ ధూమ్రాక్షుఁడు యుద్ధమునకుఁ బోవుట ♦—

కం. అని రోషకషాయితలో, చనుఁడై రోఁజుచును బాము♦చందమున దశా
ననుఁ డను ధూమ్రాక్షునితోఁ, జనుమీ దుర్వార సైన్య ♦ సంయుక్తుఁడవై.

అర్థములు. రోషకషాయిత లోచనుఁడై = కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, రోఁజుచున్ = బుసకొట్టుచు, దుర్వారసైన్య సంయుక్తుఁడవై = వారింప రాని సేనతోఁ గూడినవాఁడవై.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి పామువలె బుసగొట్టుచు నూరకుండిన వానరులు పైబడి లంకలోఁ బ్రవేశింతురని తలఁచి యిదివఱకు జరిగిన దొమ్మి యుద్ధమున రాక్షసులకు మేలు లేమి నాలోచించి కోట వాకిండ్లన్ని మూయించి యొక్కొక్కనినే యొక్కొక్క ప్రక్కకుఁ బంపఁ దలఁచి ధూమ్రాక్షుఁ డను వానిని జూచి విశేషబలముగల సేనతోఁ బొమ్ము.

ఉ. నీవు వధార్థమై మదవ ♦ నేచరయుక్తుఁడు రాము మీఁదికిన్,
నావుడు వాఁడు సమ్మదము ♦ నన్ దశకంధరు మ్రొక్కి పోయి సై
న్యావళిఁ గూర్పు తూర్ణముగ ♦ నాలము చేసెద వేల? నావుడున్
రావణు నాజ్ఞ సైన్యపతి ♦ రాణువ సిద్ధముఁ జేసి తెచ్చినన్. ౧౦౭౦

అర్థములు. మదవనేచరయుక్తుఁడు = గర్వించిన వానరులతోఁ గూడిన వాఁడగు-ఇది షష్ఠికి విశేషణము కావున ప్రథమ. 'చనుమీ నీవు వధార్థమై' యనుట యందశ్లీలము స్ఫురించుచున్నది. నీవు రాముపధార్థమై పొమ్మని రావణు నభిప్రాయమైనను 'సత్యా వాణీ సరస్వతీ' యన్నట్లు నీవు మరణించు నిమిత్తమై పొమ్మని యర్థము తోఁచుచున్నది. తూర్ణముగన్ = వేగముగ, ఆలము = ఉపేక్ష, రాణువ = సైన్యము.

తాత్పర్యము

గర్వించిన వానరులతోఁ గూడియుండు రామునిమీఁదికి నీవువధార్థమైపొమ్ము అని చెప్పఁగా వాఁడును సంతోషముతో రావణునకు నమస్కరించి సేనానాయకునితో నాతోడ రాఁగల సేనను గూర్చి యిమ్ము, ఏల యాలస్యము చేసెద వనిన వాఁడును రావణు నాజ్ఞ దీసికొని సైన్యము సిద్ధముచేసి ధూమ్రాక్షునకుఁ దెలిపెను.

కూర్పు తూర్ణముగ నాలము చేసెదవేల యనుటచే నందఱు నన్ని ప్రక్కలఁ బోయి సాధింపలేని దానిని వీఁడొక్కఁడు పోయి యేమి సాధింపఁగలఁ డని సేనాపతి సందేహించి జాగుచేసె ననియు రావణాజ్ఞ కావున మరల సేనగూర్చి యిచ్చెననియు స్ఫురించెడిని.

శా. ఘంటావ్రాతఘణంఘణంఘణఘణ ♦ క్వాణంబు నిండన్ దెస
ల్మంటల్ చిమ్మ ధగద్ధగద్ధగిత శూ ♦ లప్రాసభల్లాములున్
మింటిం దన్న ధమంధమంధమధమా ♦ మేయోరువాద్యధ్వనుల్
గంటుం గొంటరి తుంట రక్కసులమూఁ ♦ కల్ మీఱె నస్తోకమున్. ౧౦౨౧

అర్థములు. ఘంటా వ్రాత = రథములకుఁ గట్టిన గంటల సమూహముల క్వాణంబు = ధ్వని, శూల = మువ్మొన యాయుధములు, ప్రాస = ఈఁటెలు, భల్లము = బల్లెములు, అమేయోరు వాద్యధ్వనుల్ = అపరిమితమైన గొప్ప నాదములు, కంటు+గొంటరి+తుంట రక్కసులు-కంటుంగొంటరి = విరోధముచేఁ గఱినులును, తుంట=దుష్టులు నగు, రాక్షసులు, అస్తోకము=విశేషముగ.

తాత్పర్యము

రథములకుఁగట్టిన గంటల ఘణఘణ యను ధ్వనులు దిక్కులునిండు చుండఁగా శూలములు ప్రాసములు బల్లెములు వీని కాంతులు ధగద్ధగ మని మంటలు చిమ్ము చుండఁగా, ధమ ధమ వాద్యముల ధ్వను లాకాశము నంటుచుండఁగా, పగచేఁ గఱినులగు తుంటరాక్షసుల గుంపులు మిక్కిలి యతిశయించెను.

కం. క్ష్వేళాపూరితదిశులై, కాలాయసదండ పరిఘ♦కరవాల మహా
శూలపరశ్వధపట్టిస, జాలజ్వలితాంగు లగుచు ♦ సంభ్రమమతులై. ౧౦౨౨

అర్థములు. క్ష్వేళాపూరిత దిశులై=సింహనాదములచేఁ నిండిన దిక్కులు గలవారై, కాలాయస = ఉక్కుచేఁ జేయఁబడిన, దండ = కట్టెలు, పరిఘ = గుదియలు, కరవాల = కత్తులు, పరశ్వధ = గండ్రగొడ్డండ్లు, పట్టిస = దండముల వలెనుండు నాయుధములు, వీనియొక్క, జాల=సమూహముచే, జ్వలితాంగులు= వెలుఁగుచున్న దేహములు గలవారు, సంభ్రమమతులై=తొట్రుపడుచున్న మనస్సులు గలవారై.

తాత్పర్యము

సింహనాదములచే దిక్కులు నిండఁగా ఉక్కు దండములు, ఇనుపకట్ల గుదియలు కత్తులు, పెద్ద శూలములు, గండ్రగొడ్డండ్లు, పట్టిసములు వీనిచే వెలుఁగుచున్న దేహములు గలవారై తొట్రుపడుచు.

కం. కవచులు ఖడ్గులు ధ్వజులై, సవురుగ రాక్షసులు స్వర్ణ ♦ సంచయయుతముల్
వివిధాస్యఖరంబులు గల, రవిసన్నిభరథములందుఁ గ్రాలిరి ♦ కీవిన్. ౧౦౨3

అర్థములు. కవచులు=కవచములు తొడిగికొనినవారు, ఖడ్గులు = కత్తులు ధరించినవారు, ధ్వజులు=టెక్కెములఁ బట్టుకొన్నవారు,స్వర్ణసంచయయుతముల్= బంగారు సొమ్ముల సమూహములతోఁ గూడినవి, వివిధాస్యఖరంబులు = నానా విధములైన ముఖములుగల కంచరగాడిదలు, రవిసన్నిభ=కాంతియందు సూర్యునితో సమానములైన.

తాత్పర్యము

మీఁది పద్యంబునఁ జెప్పఁబడినవారు కాలిబంట్లు, ఈ పద్యంబున రథికులు చెప్పఁబడుచున్నారు.

కవచములు తొడిగికొని ఖడ్గములు ధరించి తేరిపైఁ దమ ధ్వజము లెక్కించి బంగారు నగలచే నలంకరింపఁబడిన గాడిదలు కట్టిన సూర్యునితో సమానముగ వెలుఁగుచున్న రథములందుఁ గొందఱు ప్రకాశించిరి.

కం. పరమజవోపేతము లగు, హరులపయిన్ మదకలంబు • లగు దంతుల పై
సురవైరులు వ్యాఘ్రుంబుల, కరణిన్ దుర్జయులు చనిరి • కలహోత్సుకులై.

అర్థములు. పరమజవోపేతములు = మిక్కిలి వేగముతోఁ గూడినవి. హీరాశ్వికులు, మదకలంబులు=మదముచే మనోజ్ఞమైనవి. 'మదేన కలో మనోజ్ఞః మదకలః' అని వ్యుత్పత్తి. ఇచ్చట నవయవార్థమునే గ్రహింపవలెను. కలహోత్సుకులై=యుద్ధ ప్రయత్నము గలవారై.

తాత్పర్యము

కొందఱు మిగుల వేగముగఁ బోఁగల గుఱ్ఱములపైఁ గూర్చుండియుఁ, గొందఱు మదపుటేనుఁగులపైఁ గూర్చుండియు పులులవలె జయింపరాని రాక్షసులు యుద్ధసన్నద్ధులై పోయిరి.

కం. వృకసింహాముఖ సువర్ణ, ప్రకటాలంకార యుక్త • పటుఖరరాజ
ద్వికటస్యందనగతుఁడై, చకచక ధూమ్రాక్షుఁ డరిగె•సమరంబునకై. ౧౦౨౫

అర్థములు. వృకసింహముఖ=తోడేళ్ళయు, సింహములయు ముఖములవంటి ముఖములుగల, సువర్ణ ప్రకటాలంకార=బంగారుతోఁ జేయఁబడిన ఆభరణములతో, యుక్త=కూడిన, పటు = దృఢమైన, ఖర = కంచరగాడిదలచే, రాజత్ = ప్రకాశించు, స్యందనగతుఁడై = రథమునం దున్నవాఁడై, సమరంబునకై = యుద్ధము నిమిత్తముగ.

తాత్పర్యము

తోడేళ్ళ ముఖములు, సింహముఖములుగాఁ దీర్పఁబడిన బంగారు సొమ్ములతో గూడిన దృఢమైన కంచరగాడిదలచేఁ బ్రకాశించు తేరిపైఁ గూర్చుండిన వాఁడై ధూమ్రాక్షుఁడు యుద్ధము నిమిత్తమై త్వరగాఁ బోయెను.

—• ధూమ్రాక్షున కవశకునంబు లగపడుట •—

ఉ. హారివిలాసహాసరుచి • రాననుఁడై హనుమంతుఁ డున్న యా
ద్వారముఁ జేరఁబో శకున • వారము మింటను గట్టె గ్రద్దయున్
దేరిపయిన్ దభాలునను • డ్రెళ్ళె, ధ్వజాగ్రమునందు గ్రద్దలున్
వారక వ్రాలె దెల్లనిక • బంధము దన్నికటస్థలంబునన్. ౧౦౨౬

అర్థములు. హారి = మనోహరమైన, విలాస=శృంగారముతోఁ గూడిన, హాస=నవ్వుచే, రుచిర = అందమైన; ఆననుఁడై = ముఖము గలవాఁడై, శకున వారము = పక్షిసమూహము, గ్రద్దలు మొదలైనవి, కట్టెన్ = కుడినుండి యెడమకుఁ బోయెను, కబంధము=మొండెము, తన్నికట స్థలంబునన్ = ధూమ్రాక్షుని సమీప ప్రదేశమునందు.

తాత్పర్యము

వినోదక్రీడకుఁ బోవువానివలె ధూమ్రాక్షుఁడు నవ్వుచే నందమైన ముఖము గలవాఁడై హనుమంతుఁడున్న పశ్చిమద్వారము చేరఁబోఁగా నాకాశమునఁ బక్షులు గట్టెను. తేరిమీఁద దభాలున గ్రద్దపడెను. ధ్వజముమీఁద తోలినను బోక గుంపులుగ గ్రద్దలు వ్రాలెను. అతని సమీపమందుఁ దెల్లని మొండెము.

కం. తొరఁగెడి నెత్తుటఁ దడియుచు స్వరము వికారంబుగాఁగ • సైన్యాధ్యక్షున్
బరికించి యూర్చ్వటించుచు, ధరణీతలమందుఁ బడియె•దబ్బున మఱియున్.

అర్థములు. తొరఁగెడి=కాఱుచున్న, సైన్యాధ్యక్షున్=ధూమ్రాక్షుని.

తాత్పర్యము స్పష్టము.

కం. కురిసెన్ నెత్తురు పిడుగులు, దొరలాడిగతి గాలి వీచె • దొర కెదు రగుచున్
ధరణి వణంకెను నెల్లెడ, నిరు లఱిమెను దిశలు కాంతి•హీనము లయ్యెన్.

అర్థములు. దొరకు = సేనానాయకునకు, ఇరులు=చీఁకట్లు, అఱిమెను = ఆక్రమించెను.

తాత్పర్యము స్పష్టము.

కం. వీక్షించి వాని నా ధూ, మ్రాక్షుఁడు తనలోన మిగుల • నలమట చెందెన్
రాక్షసులును మూర్ఛాగతు,లై క్షితిపైఁ బడిరి సాధ్వ•సాక్రాంతమతిన్.

అర్థములు. అలమట = వ్యసనము, సాధ్వస = భయముచే, ఆక్రాంత మతిన్ = ఆక్రమింపఁబడిన మనస్సులతో.

తాత్పర్యము

ఈ యపశకునములను జూచి ధూమ్రాక్షుఁడు తన చావు నిజమని మిగుల వ్యసన పడెను. రాక్షసులును భయపడినవారై మూర్ఛపోయి పడిరి.

కం. ఎట్టును ధృతిగొని సేనలు, చుట్టును దనుఁ గొలిచి రాఁగ•సురసూదనుఁడున్
జెట్టుంద్రిమ్మరిగమిపై, నిట్టల మగువీఁకఁ జనియె • నిబ్బర మొనరన్. ౧౦౮౦

అర్థములు. ఎట్టున్=ఎట్లెట్లో,తప్పునివని-భయపడి యేమి ప్రయోజనము. వెనుకకుఁబోయిన రావణుఁడు చంపును. ముందుపోయిన దైవము పెట్టినట్లగును అని ధృతిగొని=ధైర్యము తెచ్చుకొని, సురసూదనుఁడున్ = రాక్షసుఁడు, ధూమ్రాక్షుఁడు-చెట్టుంద్రిమ్మరిగమిపై = వానరుల గుంపుమీఁద, నిట్టలము = అధికము

తాత్పర్యము స్పష్టము.

—• ౫౨వ సర్గము ధూమ్రాక్షు సేనలు కపులతోఁ బోరుట •—

ఉ. ద్వారము దాఁటి వచ్చు సుర•వైరిని గాంచి కపీంద్రు లెల్ల హ
ర్షారభటుల్ చెలంగఁ కల•హ ప్రియులై వెస నంటఁ దాఁకినన్
వారల సంకులాహవ మ•వారితభీషణమై రహించె గో
త్రారుహ శూలముద్గరశ•ర ప్రతిఘాత మనన్యసామ్య మై ౧౦౪౧

అర్థములు. హర్షారభటుల్=సంతోషధ్వనులు, సంకులాహవము=ద్వంద్వ యుద్ధము, అవారిత=వారింపఁబడని, భీషణమై = భయంకరమై, గోత్రారుహ = వృక్షములయు, ప్రతిఘాతము=దెబ్బలుగలది, అనన్యసామ్యమై = దీనితో సమానమైనది వేఱొకటిలేనిదై.

తాత్పర్యము

ద్వారముదాఁటి వచ్చుచున్న రాక్షసునిజూచి వానరులు సంతోషముచే ధ్వనించుచు యుద్ధమందుఁ బ్రీతిగలవారై సమీపించి యెదిరింపఁగా నా వానర రాక్షసుల దొమ్మియుద్ధము నివారింపరానిభయము గలిగించునదియై చెట్ల దెబ్బలు శూలముల ముద్గరముల బాణముల దెబ్బలు గలదై యసమానమై చెలంగెను.

చ. పరశుగదాత్రిశూలశర•పట్టిసభల్లకభిండిపాలము
ద్గరముఖసాధనంబుల ము•ఖాముఖి రాక్షససేన పోరఁగాఁ
దరుగిరిశృంగహస్తు లయి • దర్పిత వానరకోటి రాక్షసో
త్కరములమీఁద దూఁకి ప్రవి•దారిత గాత్రముఁ జేసె సైన్యమున్. ౧౦౪౨

అర్థములు. ముఖాముఖి = ఎదురెదురై. తరుగిరి శృంగహస్తులు = చెట్లు కొండ శిఖరములు చేతియందుఁ గలవారు. ప్రవిదారితగాత్రము = చీల్పఁబడిన దేహము గలది.

తాత్పర్యము

గండ్రగొడ్డండ్లు గదలు త్రిశూలములు బాణములు బల్లెములు లోనైన సాధనములు గైకొని రాక్షసులు వానరుల కెదురై యుద్ధము చేయఁగా వానరులు చెట్లు కొండ శిఖరములు చేతఁ దీసికొని రాక్షససమూహములమీఁద దూఁకి వారి దేహములను జీల్చి వైచెను.

చ. కినుక సురారిసంఘములు • కేరి గదాదికసాధనాదులన్
వనచరపాళి నెత్తురులు • వఱ్ఱులు వాఱఁగఁ జేయ వారలున్
ఘనశరదారితాంగు లయి•ఖడ్గసుతాడితదేహు లయ్యునున్
వెనుచన కశ్మవృక్షహతి • వ్రీలఁగఁ జేసిరి తచ్ఛిరంబులన్. ౧౦౪౩

అర్థములు. కినుకన్ = కోపముచే, కేరి = విజృంభించి, గదాదిక సాధనాదులన్=గదలు మొదలగు నాయుధములు మొదలగు వానిచే, వఱ్ఱులు=వంకలు, ఘనశరదారితాంగులయి=గొప్పబాణములచేఁ జీల్పఁబడిన దేహములు గలవారై, ఖడ్గసుతాడిత దేహులయ్యునున్=కత్తులచే బాగుగఁ గొట్టఁబడిన దేహము గలవా

రయ్యు, వెనుచనక = వెనుకకుఁ బోక, అశ్మవృక్షహతిన్ = తాలయు చెట్లయు దెబ్బలచే, వ్రీలఁగన్=పగులునట్లు.

తాత్పర్యము

రాక్షసులు కోపముచే విజృంభించి గదాదులు సాధనములు గ్రహించి వానర సమూహములను నెత్తురు వంకలు పాఱునట్లు చేయఁగా వానరులు బాణములచేఁ జీల్పఁబడిన దేహములు,ఖడ్గములచేఁ గొట్టఁబడిన దేహములు గలవారయ్యును వెను కడుగు పెట్టక తాలదెబ్బలచే, చెట్ల దెబ్బలచే వారి తలలు పగులఁగొట్టిరి.

మ. శిరముల్ వ్రద్దలు వాఱ మోఁదుచు రయ♦శ్రీదోఁప శాఖావళిన్
కరముల్ నేలఁ దొరంగ బాఁదుచును ని♦ష్కారుణ్య చిత్తంబునన్
నరముల్ ప్రేవులుఁ ద్రెంచి వైచుచును నా♦నాభంగి దంష్ట్రాళిచే
నురముల్ వ్రచ్చిరి దొంతి గ్రుచ్చిరి జయ♦ప్రోత్సాహ మేపారఁగన్. ౧౦౮౮

అర్థములు. రయశ్రీ=వేగసంపద.

తాత్పర్యము

కొమ్మలచే నతివేగముగ రాక్షసుల తలలు వ్రద్దలగునట్లు కొట్టుచు, దయా హీనులై చేతులు విఱిగి నేలఁ బడఁగొట్టుచు, నరములు ప్రేగులు చించుచు నానావిధములుగఁ గోఱలచే యుద్ధజయము ప్రేరింపఁగా ఱొమ్ములు చీల్చిరి. దొంతిగా రాక్షసుల గ్రుచ్చిరి.

ఉ. చింతురు శత్రుకాయములఁ ♦ జీలిక లై పడ రెండు రెండుగా
దంతురు బజ్జి బజ్జి గను ♦దారరయంబునఁ జెట్ల దెబ్బలన్
నొంతురు తాల అప్పల స♦నూన మహాద్భుత వృష్టిఁ గొల్పి మ
ర్దింతురు ముష్టిఘాతములఁ♦గ్రిందఁ బడన్ మెడఁ ద్రొక్కి యాసునన్. ౧౦౮౯

అర్థములు. అనూన=కొఱతలేని, మహాద్భుత వృష్టిన్ = మిగులనాశ్చర్య కరమైన వానను, కొల్పి=కలిగించి.

తాత్పర్యము

వానరులు తమ విరోధుల దేహములను రెండు రెండు చీలికలై పడఁ జీల్తురు. చెట్ల దెబ్బలు వేగ వేగముగఁ బజ్జగఁ గొట్టుదురు. అధికమైన తాలవాన గురి యించి తాలచేత అప్పలచేత వారిని నొప్పింతురు. క్రిందఁ బడవైచి మెడఁ ద్రొక్కిపట్టి కోపించి పిడిగ్రుద్దులచే కొట్టుదురు.

కం. రక్కసులు కపులపోటులఁ గ్రక్కిరి నెత్తురులు నేలఁ ♦ గండలతోఁ దా
రుక్కిరి బిక్కిరియై చెడి, స్రుక్కిరి మక్కిరి మఱుంగు♦చొచ్చిరి భీతిన్.

అర్థములు. పోటులన్ = దెబ్బలచే, ఉక్కిరి బిక్కిరియై=ఊపిరి తిరుగక, స్రుక్కిరి=మూర్ఛిల్లిరి, మక్కిరి = చచ్చిరి, మఱుంగు చొచ్చిరి = దాఁగుకొనిరి.

తాత్పర్యము స్పష్టము.

కం. కూలినఖరముల ప్రోవుల, వ్రాలిన టెక్కెములఁ జెడిన ♦ రథములగుమిచేఁ
దూలిన గజములచే మెయి, చీలినతురగములచేత ♦ క్షితి నిండారెన్. ౧౦౮౭

అర్థములు. మెయి = దేహము.

తాత్పర్యము

నేలఁబడిన గాడిదల కుప్పలచేతను నేలకు వ్రాలిన ధ్వజములచేతను విఱిగిన రథముల గుంపులచేతను చచ్చిన యేనుఁగులచేతను దేహములు చీలిన గుఱ్ఱముల చేతను రణభూమి నిండెను.

కం. గంతుకొని చివ్వసం దమ,దంతంబులఁ గఱకుగోళ్ళ ♦ దనుజులముఖముల్
వ్రంతలుపడ చీలిచి యము,నంతికమున కనిచి రగచ ♦ రాధిపు లంతన్.

అర్థములు. చివ్వనన్=తటాలున, గంతుకొని = దూఁకి, వ్రంతలుపడ = గుంతలు పడునట్లు, అంతికమునకున్ = సమీపమునకు, అగచరాధిపులు=వానర శ్రేష్ఠులు.

తాత్పర్యము

తటాలున మీఁద దూఁకి తమ కోఱలచేతను, పదునుగల గోళ్ళచేతను, రాక్షసుల ముఖములు గుంతలుపడఁ జీలిచి వానరులు చంపిరి.

కం. వ్రేలెడు వెండ్రుకలును రుచి,మాలిన మోములును రక్త ♦ మాంసజమాదో
త్తాలకు గంధముసోఁకున, సోలెడు దేహములు నగుచు ♦ సోఁకులు పరవన్.

అర్థములు. రుచిమాలిన = కాంతి తొలఁగిన, రక్తమాంసజ = నెత్తురు మాంసమువలనఁ గలిగిన; మాదోత్తాలకుగంధమున = అధికమైన మదపు చెడు వాసన తగులుటచే, సోలెడు = పడిపోవు, సోఁకులు = రాక్షసులు, పరవన్ =పరువెత్తఁగా.

తాత్పర్యము

వెండ్రుకలు వ్రేలాడుచుండఁగా, ముఖములందుఁ గాంతి తొలఁగిపోఁగా నెత్తురుగా మాంసమువలనఁ గలిగిన మదపువాసనలు తగులుటచే దేహములు సోలి పోవుచుండ రాక్షసులు పరువెత్తిరి.

—♦ ధూమ్రాక్షుఁడు కపుల వధించుట ♦—

కం. కొందఱు రోషవశంబునఁ, గ్రందుగఁ బైపడి శతార ♦ కఠినతలములన్
డెందముల మోఁద వారల, గ్రమందించిరి కపులు చరణ ♦ మహిజాహతులన్.

అర్థములు. క్రందుగన్=గుంపుగ, శతారకఠినతలములన్=వజ్రమువంటి గట్టి యఱచేతులచే, డెందములన్=ఱొమ్ములందు, చరణమహిజాహతులన్=కాలి దెబ్బలచేతను-చెట్లదెబ్బలచేతను, మ్రందించిరి=చంపిరి.

తాత్పర్యము

కొందఱు రాక్షసులు రోషించినవారై వజ్రమువలెఁ గఠినములైన తమ

యఱచేతులతో వానరుల ఱొమ్ములపైఁ గొట్టఁగా వారు కాళ్ళతోను జెట్లతోను గొట్టి యా రాక్షసులఁ జంపిరి.

కం. రాక్షసులపాఱిపోకయు, వృక్షాటులమీఁఱిరాక ♦ వీక్షించుచు ధూ
ప్రమాక్షుఁడు రోషకషాయిత, వీక్షణుఁ డై కవిసె నహిత♦బృందముమీఁదన్.

అర్థములు. వృక్షాటులు = వానరుల, రోషకషాయిత వీక్షణుఁడై =కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, అహిత బృందముమీఁదన్ = శత్రుసమూహము మీఁద.

తాత్పర్యము

రాక్షసులు పాఱిపోవుట వానరులు పైఁబడివచ్చుట ధూమ్రాక్షుఁడు చూచి కోపించి శత్రువులపై బడెను.

ఉ. వాసవశస్త్రతుల్యశిత ♦ బాణపరంపరఁ గ్రుచ్చి కొందఱన్
ప్రాసపరశ్వధాహతులఁ ♦ బట్టి సముద్గరశూలఘాతులన్
త్రాసకరాస్త్రసంతతుల ♦ దారితగాత్రులఁ జేసి కొందఱన్
భాసురవిక్రమం బడర ♦ బల్విడి క్రోఁతుల యే పడంచుచున్. ౧౯-౨౦

అర్థములు. వాసవశస్త్ర=ఇంద్రాయుధమైన వజ్రముతో, తుల్య=సమానమైన, శిత=పదునైన, బాణపరంపరలన్=బాణముల వరుసలచే, ప్రాసపరశ్వధాహతులన్=ప్రాసములయు గండ్రగొడ్డండ్లయు దెబ్బలచే, త్రాసకర = భయము కలిగించు, దారితగాత్రులన్=చీలిన దేహములు గలవారిగ, ఏపు=పరాక్రమము.

తాత్పర్యము

వజ్రముతో సమానమైన బాణములచే గొందఱఁ గ్రుచ్చియు, కొందఱను ప్రాసములచేతను గొడ్డండ్ల చేతను పట్టిన శూల ముద్గరముల దెబ్బలచేతను, గొంద ఱను భయంకరాస్త్రముల చేతను, దేహములు చీల్చి తన పరాక్రమము ప్రకాశించుచు వానరుల పరాక్రమము నణంచుచు.

కం. ఎక్కడఁ జూచినఁ దానై, ప్రక్కలు చెక్కుచు నురంబుఁ ♦ బగిలించుచు మేన్
వ్రక్కలు వ్రక్కలు చేయుచు, నుక్కున విహరించె బలమ♦దోద్ధతి యెసఁగన్.

అర్థములు. ఉక్కునన్ = బలముతో, బలమదోద్ధతి=బలమువలన గలిగిన యధిక గర్వము.

తాత్పర్యము స్పష్టము.

కం. తెఱపి గని సోఁకుమూఁకలు, నఱకఁగఁ గీశులను వారు ♦ నలిగులి యగుచున్
బఱచిరి చచ్చిరి నెత్తుటఁ, దఱచుగఁ దోఁగిరి నరాలు ♦ తెరుగుడుపడఁగన్.

అర్థములు. తెఱపి=సందు, నలిగులి = మిక్కిలి నలఁగునట్లు, పఱచిరి = పరువెత్తిరి, తోఁగిరి=స్నానముచేసిరి—మునిఁగిరి, తఱుగుడు పడఁగన్=నఱకఁబడఁగా

తాత్పర్యము

ధూమ్రాక్షుఁడు విజృంభించుటచే రాక్షసులకుఁ గొంచె మవకాశము లభిం

పఁగా, వారు వానరులను నఱుకఁగా; వారు మిగుల నలఁగి పరువెత్తిరి. కొందఱు చచ్చిరి. కొందఱు నెత్తుట మునిఁగిరి. కొందఱు నరములు నఱుకఁబడిరి.

కం. జ్యాతంత్రీమధురము హిం కా హా తాళసమన్వితంబు ♦ గజబృంహిత సం
గీతము రణగాంధర్వం, బాతతమై వెలసె నతని ♦ యాహవకేళిన్. ౧౦౯౫

అర్థములు. జ్యాతంత్రీమధురము=అల్లెత్రా డనెడి తంత్రిచే మనోహరమై, హిం కా హా తాళ సమన్వితంబు=(౧) ఎకిలిళ్ళనెడి తాలములతోఁ గూడినదియు,(౨) గుఱ్ఱముల సకిలింత లనెడి తాళములతోఁ గూడినదియు, గజబృంహిత సంగీతము= ఏనుఁగుల ఘీంకారము లనెడి పాటలు గలది, రణగాంధర్వము = యుద్ధమనెడి సంగీతసభ, ఆతతమై=విస్తారమై.

తాత్పర్యము

అల్లెత్రాటి మ్రోఁత లనెడి మనోహరమైన వీణాతంత్రుల నాదము గలదియు, గుఱ్ఱముల సకిలింత లనెడి తాళములు గలదియు, ఏనుఁగుల ఘీంకారము లనెడి పాటలు గలదియునై యుద్ధ మనెడి సంగీతసభ యుద్ధవేళయం దొప్పెను.

కం. కార్ముకవిచ్యుతశరజా, లోర్మిపరంపరలఁ గపికు ♦ లోర్వని ముంపన్
మార్మొగ మిడుక్రోఁతులఁ గని, ధూర్మహితగ్రావ మెత్తి ♦ ద్రుతగతి
యగుచున్.

అర్థములు. కార్ముక=విల్లనెడి సముద్రము-సముద్రము అధ్యాహార్యము, విచ్యుత=వెలువడిన, శరజాల=బాణసమూహ మనెడి, ఊర్మిపరంపరలన్ = అలల వరుసలచేత, కపికుల = వానరసమూహ మను, ఉర్విని=భూమిని, ధూర్మహిత = భారముచే గొప్పదైన, గ్రావము = పెద్దఱాయి, ద్రుతగతి=వేగముతోఁ గూడిన గమనము గలవాఁడు.

తాత్పర్యము

విల్లనెడి సముద్రమునుండి వెలువడిన బాణము లనెడి యలలు వానరసేన యనెడి భూమిని ముంపఁగా వానరులు పెడముఖములు గలవారై పరువెత్తఁగా భారముగల ఱాతిని దీసికొని మిగుల వేగము గలవాఁడై.

—♦ ధూమ్రాక్షుఁడు హనుమంతునిచే హతుం డగుట. ♦—

కం. ధూమ్రాక్షునిపై మారుతి, తామ్రాక్షుం డగుచు వైచెఁ ♦ దచ్ఛిల వడి రా
వే మ్రొగ్గు జవంబున ధర,పై మ్రాన్పడ కుఱికి నిలిచెఁ ♦ బటుగదఁ గొనుచున్.

అర్థములు. తామ్రాక్షుఁడు = ఎఱ్ఱని కన్నులు కలవాఁడు, తత్+శిల= ఆఱాయి, వడి=వేగముగ, రాన్=రాఁగా, వే = శీఘ్రముగ, మ్రొగ్గుజవంబున = అధిక వేగముతో, మ్రాన్పడక = దిగులుపడక, నిశ్చేష్టుఁడుగాక.

తాత్పర్యము

ధూమ్రాక్షుని మీఁద హనుమంతుఁడు విసరివైచెను. ఆ బండ వేగముగ

వచ్చుట చూచి వాఁడు దిగులు పడక గదచేతఁ దీసికొని వేగముగ రథమునుండి భూమిమీఁదికి దుమికెను.

చ. పిడుగన వచ్చి యా శిలయుఁ ♦ బిండిగఁ జేసె రథంబుఁ గాఁడితోఁ
 దొడితొడి వింటితో ధ్వజము ♦ తో రథచక్రయుగంబుతోడఁ ద
 త్తడిగమితోడ దానిఁ గని ♦ దానవవీరులు వేగవంతులై
 యెడఁ జొరఁ బాఱి తాఁకిరి య ♦ హీనపరాక్రము మారుతాత్మజున్. ౧౧౯౮

అర్థములు. తొడితొడి=మిగుల వేగముతో, తత్తడిగమి = తేరికిఁగట్టిన గుఱ్ఱముల గుంపు, ఎడన్=సందు చేసికొని.

తా త్ప ర్య ము

ఆ బండ పిడుగువలె వచ్చి రథముపైఁబడి దానిని గాఁడితోను, వింటితోను, ధ్వజముతోను, రెండుచక్రములతోను, గుఱ్ఱములతోను బిండిగఁజేసెను. అది చూచి రాక్షసులు వేగము గలవారై సందు కలిగించుకొని మహాపరాక్రమవంతుఁడైన యాంజనేయునిపైఁ బడిరి.

ఉ. ఆతఁడు గండుమీఱి విల ♦ యాంతకుఁ డై వడి సస్కంధయుక్త భూ
 జాతముఁ ద్రిప్పుచుం గవిసి ♦ చావఁగ మోఁదుచు ఫట్ఫటారవ
 స్ఫీతముగాఁ దలల్ పగులఁ ♦ జేయుచు శోణితవాహినిన్ సము
 ద్భూతముఁ జేయ రాక్షసులు ♦ దూలిరి త్రస్తవిషణ్ణచిత్తులై. ౧౧౯౯

అర్థములు. గండుమీఱి=పౌరుష మతిశయించి, విలయాంతకుఁడై వడిన్= ప్రలయకాల యమునివలె, సస్కంధయుక్త భూజాతము=బోదెతోఁగూడిన చెట్టును, ఫట్ఫటారవ స్ఫీతము = ఫట్ ఫట్ అను ధ్వని యతిశయించు నటులు, శోణిత వాహినిన్=నెత్తుటి ప్రవాహమును, సముద్భూతము జేయన్ = సృష్టింపఁగా, త్రస్త = భయపడిన, విషణ్ణ = విషాదముతోఁ గూడిన, చిత్తులై = మనస్సులు గలవారై.

తా త్ప ర్య ము

ఆయనయుఁ బౌరుష మతిశయింప ప్రలయకాలయమునివలె కొమ్మలు బోదె గల చెట్టును ద్రిప్పుచు రాక్షసులపై పడి వారి తలలు ఫట్ ఫట్ మని పగులగాఁ గొట్టుచు, నెత్తుటి వంకఁ బాఱఁజేయఁగా రాక్షసులు భయపడి విషాదమునఁ దూలిపోయిరి.

ఉ. రాక్షసు లిట్టు పాఱుటయుఁ ♦ గ్రమ్మఱ నొక్కనగంబు కూటమున్
 దక్షుఁడు కేలఁ బట్టి భయ ♦ దత్వరితుం డయి మీఁద రాఁగ ధూ
 మ్రాక్షుఁడు సింహనాదముఖ ♦ రాననుఁడై గద యెత్తి మారుతిన్
 వక్షము వ్రయ్య నేయుటయుఁ ♦ బావని లక్ష్యము సేయ కుగ్రుఁడై. ౧౨౦౦

అర్థములు. సింహనాద ముఖరాననుఁడైఁ = సింహనాదముచే ధ్వనించు ముఖము గలవాఁడై.

తాత్పర్యము

ధూమ్రాక్షున కడ్డము వచ్చిన రాక్షసులు పరువెత్తి పోఁగా హనుమంతుఁ డొక్క పర్వత శిఖరమును చేతఁబట్టుకొని భయంకరమైన వేగము గలవాఁడై తన మీఁదికి రాఁగా ధూమ్రాక్షుఁడు సింహనాదము గావించుచు గదయెత్తి యాంజనేయుని అొమ్మపగుల వ్రేయఁగా దానిని హనుమంతుఁడు సరకు సేయక కోపించినవాఁడై.

కం. లక్షించి శృంగమును ధూ, మ్రాక్షునినడినెత్తి వైచె ♦ నతిజవమునఁ ద
ద్రక్షఃపాలుఁడు దానం, బ్రక్షీణాయుష్కుఁ డగుచుఁ♦బడియె ధరిత్రిన్.

అర్థములు. లక్షించి=గుఱిచూచి, రక్షఃపాలుఁడు = రాక్షసనాయకుఁడు, ప్రక్షీణ+ఆయుష్కుఁడు = పూర్ణముగ క్షీణించిన యాయుస్సు గలవాఁడు, చచ్చినవాఁడు.

తాత్పర్యము

గుఱిచూచి యాశిఖరమును నతివేగమున ధూమ్రాక్షుని నడినెత్తిపైవైచెను. దానితో వాఁడు ఆయుస్సు దీఱి చచ్చి నేలపైఁ బడెను.

కం. పిడు గడచిన కుధరముక్రియఁ, బడిన బలాధ్యక్షుఁ జూచి♦ప్లవగము లెగవన్
సుడివడి యెదవడి విహ్వల,పడి పఱచిరి లంకత్రోవఁ♦బట్టి నిశాటుల్. ౧౧౦౨

అర్థములు. కుధరము = పర్వతము, ఎగవన్ = తఱుమఁగా, సుడివడి= కలఁతపడి, ఎదవడి=భయపడి, విహ్వలపడి = వెలవెలఁ బోయి, పఱచిరి = పరువెత్తిరి.

తాత్పర్యము

పిడుగుదెబ్బ తగిలిన కొండవలె నేలఁబడిన తమ సేనానాయకునిఁ జూచి వానరులు తఱుముచుండఁగా భ్రమగొని దిగులుపడి వెలవెలఁబోయి రాక్షసులు లంకత్రోవఁబట్టి పరువెత్తిరి.

కం. ఈ విధి హనుమంతుఁడు ర,క్షోవీరుం బిలుకుమార్చి ♦ క్రోఁతిబలఁగముల్
వావిరిఁ బూజింపఁగఁ దన, తావునఁ జని నిలిచె యుద్ధ♦తత్పరుఁ డగుచున్.

అర్థములు. పిలుకుమార్చి = చంపి.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు రాక్షసవీరు ధూమ్రాక్షుని జంపి వానర సమూహము తన్ను గౌరవింపఁగాఁబోయి యుద్ధాసక్తితోఁ దన స్థానమం దుండెను.

—♦ ౫౩-వ సర్గము. రావణుఁడు వజ్రదంష్ట్రుని యుద్ధంబున కనుచుట. ♦—

సీ. ధూమ్రాక్షుమృతి విని♦తోరపు టలుకచే, దశకంధరుఁడు వజ్ర♦దంష్ట్రుఁ జూచి
రామలక్ష్మణుల శా♦ఖామృగ నేతతో, సంహార మొనరింపఁ♦జనుము నీవ

టన్న వల్లే యని♦యధికసైన్యముతోడ, నరిగె యుద్ధేచ్ఛ మా♦యావి యసుర
మకుటకేయూరాది♦మండితగాత్రుఁడై, కవచంబు దొడి పట్టి♦కార్ముకంబు
తే. ధ్వజసమాలంకృతోజ్జ్వల♦తప్త కనక, రమ్యభూషణభూషిత♦రథముఁ జేరి
దాని వలగొని యెక్కి గ♦దావిచిత్ర, శూలముద్గరవరకర♦వాలధరులు. ౧౧౦౪

అర్థములు. తోరము+అలుక = తోరపుటలుక=అధికకోపము, మకుట=కిరీటము, కేయూరము = భుజకీర్తులు, ఆది=ఈ మొదలైన యాభరణములచే, మండితగాత్రుఁడై = అలంకరింపబడిన దేహముగలవాఁడై; తొడి=తొడిగి, ధ్వజసమాలంకృత=టెక్కెముచే నలంకరింపఁబడిన, ఉజ్జ్వల = ప్రకాశించు, తప్త = పుటము వేయఁబడిన, కనక=బంగారుచేఁ జేయఁబడిన, భూషణ=ఆభరణములచే, భూషిత=అలంకరింపఁబడిన, వలగొని = ప్రదక్షిణించి, ముద్గరవరములు = గొప్ప రోఁకండ్లు, కరవాల=కత్తులు, ధరులు=ధరించినవారు.

తాత్పర్యము

ధూమ్రాక్షుఁడు చచ్చె నని విని కోపాతిశయమున రావణుఁడు వజ్రదంష్ట్రుఁడను వానిని జూచి నీవు పోయి రామలక్ష్మణసుగ్రీవుల సంహరింపుమని చెప్ప వాఁడట్టులే చేసెద నని చెప్పి గొప్ప సేనతో నా మాయావి యగు రాక్షసుఁడు యుద్ధము నందలి కోరికతోఁ బోయి కిరీటము, భుజకీర్తులు లోనగు నాభరణముల ధరించి కవచంబు దొడిగికొని విల్లుపట్టుకొని ధ్వజ మెత్తఁబడి బంగారు సొమ్ములచే నలంకరింపఁబడిన తేరి యొద్దకుఁబోయి దానికిఁ బ్రదక్షిణ పూర్వకముగా నమస్కరించి యెక్కె గదలు, శూలములు, రోఁకండ్లు కత్తులు ధరించిన వారు.

కం భటులు వివిధాస్త్రశస్త్రో♦ద్భటులు విచిత్రాంబరులు ము♦దంబునఁ జన ను
త్కటమదదంతావళములు, పటుగతి నడకొండ లనఁగ♦బలువిడి నడవన్.

అర్థములు. వివిధ + అస్త్ర + శస్త్ర + ఉద్భటులు = నానా విధములైన యస్త్ర శస్త్రములచే నతిశయించినవారు, విచిత్రాంబరులు = వింతయగు వస్త్రములు గలవారు, ఉత్కటమద = అధికమైన మదముగల, దంతావళములు = ఏనుఁగులు, నడకొండలు = నడచు పర్వతములు, బలు + విడి=అధికపరాక్రమముతో లేక, అధిక కోపముతో.

తాత్పర్యము

నానావిధములైన యస్త్రి శస్త్రిములచే నతిశయించినవారై చిత్ర వస్త్రిములు గట్టి పదాతులు నడవఁగా నడచుచున్న కొండలో యనునట్లు మిగుల మదించిన యేనుఁగులు మిగులఁ గోపముతో నడువఁగా.

తే. తోమరాంకుశకరులు సం♦గ్రామనిపుణు, లధికశూరులు కరులపై♦నరిగి రల్ల
బలము వర్షాగమమున శం♦పాసమేత, గర్జదంబుదనిచయంబు♦కరణిఁ బొలిచె.

అర్థములు. తోమర+అంకుశకరులు=చిల్లకోలలు అంకుశములు చేతధరిం

చినవారు, వర్షాగమమునన్ = వానకాలమందు, శంపాసమేత = మెఱుపులతోఁ గూడిన, గర్జత్+అంబుదనిచయంబు=ఉఱుముచున్న మేఘములగుంపు, కరణిన్= విధముగ-సొమ్ములకు మెఱుపులు, సింహనాదములకు ఉఱుములు, నల్లని రాక్షసులకు వానకాలపు మబ్బు లుపమానములు.

తాత్పర్యము

చిల్లకోలలు అంకుశములు ధరించినవారు, యుద్ధమునందు నేర్పుగలవారు మిగులసూరులు ఏనుఁగులమీఁదఁ బోయిరి. అప్పు డా బలము మెఱుపులతో నుఱుములతో నొప్పు వానకాలపు మబ్బువలె నుండెను.

—♦ వజ్రదంష్ట్రుఁడు యుద్ధమునకు వెడలుట ♦—

ఉ. వాలితనూజుదక్షిణపు♦ద్వారమునన్ వెడలంగ వారిపై
వ్రాలె విమేఘ మైన సుర♦వర్త్మమునుండి మహోల్క లగ్నులన్
జ్వాలలు గ్రక్కి నక్క లశు♦భంబుగ భీకరరీతిఁ గూసె ర
క్షోలయ మారఁ దెల్పుచు శ♦కుంతములున్ విహరించె మింటిపై. ౧౧౦౭

అర్థములు. విమేఘము = మబ్బులేనిది, సురవర్త్మమునుండి = ఆకాశమునుండి, మహోల్కలు = పెద్దకొఱవులు, వ్రాలెను - రక్షోలయము = రాక్షసుల నాశము, శకుంతములున్=పక్షులు.

తాత్పర్యము

వజ్రదంష్ట్రుఁ డంగదుఁ డున్న పడమటిద్వారమున బయలువెడలఁగా మేఘములు లేని యాకాశమునుండి వారిమీఁదఁ గొఱవులు పడెను. నక్కలు మంటలు గ్రక్కుచు నశుభము సూచించుచు భయంకరముగఁ గూసెను. రాక్షసులవినాశముఁ దెలుపుచు నాకాశమునఁ బక్షులు దిరుగుచుండెను.

కం. మృగములు రక్షోజాలము, దెగుటను సూచింపఁదొడఁగెఁ♦దేరకు యోధుల్
వగచెడి భయమోహితు లై, దిగులం గా ల్జాఱి పడిరి ♦ ధృతిచెడి రరుగన్.

అర్థములు. రక్షోజాలము = రాక్షససమూహము, తెగుటను = చచ్చుటను, తేరకు=కారణము లేక, వగ+చెడి=అందము చెడి, ధృతి=ధైర్యము.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆ మహితోత్పాతములకు, వ్యామోహిత మగుచు యోధ♦వర్గము దూలన్
భీమాహవదోహలుఁ డై, యేమియు నవ్వజ్రదంష్ట్రుఁ♦డెడవడ కరిగెన్.

అర్థములు. మహితోత్పాతములకున్=గొప్పయుపద్రవములకు, వ్యామోహితము = భ్రమగొన్నది, తూలన్ – భయపడి వణకఁగా, భీమాహవదోహలుఁ డై = భయంకర యుద్ధము నం దాసక్తిగలవాఁడై, ఏమియున్ = కొంచె మైనను, ఎడవడక=భయపడక.

తా త్ప ర్య ము

ఆ గొప్ప యశుభసూచకములగు రాక్షసయోధులు దిగ్భ్రమగొని భయముచే వడఁకిరి. వజ్రదంష్ట్రుఁడు గొప్ప యుద్ధమం దాసక్తి గలవాఁడై కొంచెమైన భయపడక పోయెను.

ఉ. ఆతనిరాకఁ గాంచి కపు ♦ లంబరముం బగిలించు నార్పులన్
వీతదరంబుగా నతిమి ♦ భీమము గాఁగ రణం బొనర్పఁగా
జాతరుషాత్ము లా కపి ని♦శాచరముఖ్యు లొక ళ్ళొకళ్ళ ని
ర్ఘాతసమప్రహారముల ఘాత ♦ మొనర్పఁగ బూని యుద్ధతిన్. ౧౧౧౦

అర్థములు. వీతదరంబుగాన్ = భయములేక, తతిమి = ఆక్రమించి, అంబరమున్=ఆకాశమును,జాతరుషాత్ములు=పుట్టినకోపము గలవారు,కపినిశాచరముఖ్యులు=వానరులందు రాక్షసులందు ముఖ్యులగువారు నిర్ఘాత = పిడుగులతో, సమ=సమానమైన, ప్రహారములన్=దెబ్బలచే, ఘాత మొనర్పఁగన్=చంపఁగా.

తా త్ప ర్య ము

అతఁడు వచ్చుచుండుటచూచి వానరు లాకాశము పగులునట్లు నిర్భయముగాఁ గేకలు వైచుచు వారిపైపడి భయంకరయుద్ధము చేయఁగా వానర రాక్షసులలో ముఖ్యులగువారు కోపించినవారై యొకరి నొకరు పిడుగులవంటి దెబ్బలు గొట్టి చంపఁబూనిరి.

కం. చివ్వున నువ్వున రాలును, జివ్వాలవలె వచ్చు శితవి ♦ శిఖములు దగులన్
జివ్వను నెగిరెడిమిణుఁగురు, లవ్వేళం జూపఱకు మ♦హాద్భుత మిడియెన్.

అర్థములు. చివ్వాలవలె=ఆకాశబాణమనెడి యొకానొక మందుగొట్టము, శిత విశిఖములు=వాఁడి బాణములు, చివ్వను=యుద్ధమందు.

తా త్ప ర్య ము

ఆ యుద్ధమందు రాక్షసులు ప్రయోగించిన బాణములకు వానరులు చివ్వున నువ్వున ఱాలు తగులఁగా నెగయుచున్న మిణుఁగురులు చూచువారికి నాశ్చర్యము గలిగించుచుండెను.

సీ. ఉపలద్రుమంబులు ♦ విపులకాలాయస, సాధనంబును దాఁక ♦ జరిగు రవము
సరభసంబుగఁ బాఱు♦స్యందనంబులనేమి, చయముల నుదయించు♦చప్పుడులును
భేరీమృదంగశం ♦ ఖారింఖణధ్వనుల్, జ్యాలతాటంకార ♦ శబ్దములును
గరులబృంహితములు ♦ హరుల హేషారవం, బులును గాల్బలముల♦బొబ్బరింత

ఆ. లట్టహాసములును ♦ నన్యోన్యతాడన, నాదములును సమితి♦వాదములును
గరము లప్పళింత♦బెరసి యయ్యెగువాఁగుఁ, జెవుడుపఱిచె గుండె♦చెదరఁజేసె.

అర్థములు. ఉపలద్రుమంబులు=ఱాలు, చెట్లు, విపుల కాలాయస సాధనంబును = విశాలమైన యినుప టాయుధములను, సరభసంబుగన్ = వేగముగ

స్యందనంబుల=తేర్లయొక్క, నేమి చయముల = రథచక్రముల కమ్ములసమూహముల, అరింఖణ=అధికమైన, జ్యాలతా = తీఁగవంటి యల్లెత్రాడుల, బృంహితములు-ఘీంకారములు. హేషారవంబులు=సకిలింపు ధ్వనులు, బొబ్బరింతలు = సింహనాదములు- అట్టహాసములు-పెద్దనవ్వులు, సమితి=యుద్ధమందు, కరములు= చేతులు, అప్పళింతలు=తట్టుటలు.

తాత్పర్యము

వానరులు వేసిన ఱాలు చెట్లు రాక్షసుల యొక్క-యుధములకుఁ దగులఁగాఁ బుట్టిన ధ్వనులు, వేగముగఁబోవు తేరుల చక్రముల కమ్ములు నేలకు రాచుకొనుటచేఁ గలిగిన ధ్వనులు, నగారాలు, మద్దెలలు, శంఖములు వీని యధిక ధ్వనులు, అల్లెత్రాడుల టంకారములు, ఏనుఁగుల ఘీంకారములు, గుఱ్ఱముల సకిలింపులు, పదాతుల సింహనాదములు, పెద్దనవ్వులు, ఒకరినొకరు కొట్టుకొనఁగాఁ గలిగిన ధ్వనులు, యుద్ధవీరుల వాదముల ధ్వనులు, భుజములు తట్టుకొనుటచేఁ గలిగిన ధ్వనులు కలిసి రెండుపక్షముల వారికి చెవుడు గలిగించి గుండెలు చెదరఁ జేసెను.

కం. అసురులు కొందఱు సాధన, విసరంబులఁ గపుల నొంప ♦ వృక్షాటవరుల్
కసిపూని ద్రుమములం గొని, పస మాపిరి శత్రు సైన్య♦భటవర్గములన్. ॥౧౩

అర్థములు. విసరంబులన్ = సమూహములచే, కసి=కఁగ, ద్రుమంబులం గొని = చెట్లను దీసికొని, పస = సారము

తాత్పర్యము

రాక్షసులు కొంద ఱాయుధ సమూహములచే వానరుల నొప్పింప వానరులు వారిని చెట్లతోఁ గొట్టి బలహీనులఁ జేసిరి.

ఉ. అయ్యెడ బాహుయుద్ధము మ ♦ హాద్భుతభంగిఁ జెలంగె వానరుల్
చయ్యనఁ గాలుసేతులను ♦ జానుల ముష్టుల నొంపఁ జొచ్చినన్
గుయ్యిడఁ జొచ్చె నాశరుల ♦ కూటువఁ వారలపాటుఁ గాంచి మ
బ్బొయ్యన నుర్మ్మిభంగి రథ ♦ ముద్ధతిమైఁ బఱపెన్ మదాంధుఁడై. ॥౧౪

అర్థములు. జానులన్ = మోఁకాళ్ళచే, కూటువ=సమూహము, మదాంధుఁడై = గర్వముచేఁ గన్నులు తెలియనివాఁడై.

తాత్పర్యము

ఆ సమయమందు రాక్షస వానరులకు చేతులు చేతులు కలసిన యుద్ధము మిగుల నాశ్చర్యముగా జరిగెను, అందు వానరులు రాక్షసులను వేగముగ కాళ్ళచేఁ జేతులచే మోఁకాళ్ళచే పిడికిళ్ళచే మర్దింపఁగా రాక్షసులసమూహము సహింపలేక కూఁతలుపెట్టసాగెను. వారలకష్టముచూచి వజ్రదంష్ట్రుఁడు బలగర్వముచేఁగన్నులు గానక మేఘ ముఱుమునట్లు వానరుల మీఁదికిఁ దన రథము తోలించెను.

తే. వజ్రదంష్ట్రుండు దుర్వార • బాణజాల, వృష్టిఁ బరఁగించి వానర•వీరవరులఁ
గనుపుగొట్టుచుఁ ద్రిజగతీ•కల్పసమయ, పాశహస్తకసమవర్తి•పగిదిఁ దిరిగె.

అర్థములు. కనుపు గొట్టుచున్ = తుండించుచు, త్రిజగతీ...సమవర్తి పగిది=మూఁడు లోకముల ప్రలయసమయమున పాశమును ధరించిన యమునివలె.

తాత్పర్యము స్పష్టము.

చ. వెఱ పొకయింత లేక యరి•వీరబలంబులలోని కుద్ధతిం
బఱపి రథంబు జ్యాలతిక • బంధుర మై మొరయంగ బాణము
లెడపియ లేక యుండ నవ•లీల నిగుడ్చుచుఁ గ్రోఁతిమూఁకలన్
నఱకుచుఁ బాఱఁదోలుచు వి•నాశముఁ జేయుచుఁ జేవఁ జూపినన్. ౧౧౧౬

అర్థములు. జ్యాలతిక = తీఁగవంటి యల్లెత్రాడు, బంధురమై = విశేషముగ, మొరయంగన్=ధ్వనింపఁగా, తెఱపి=సందు, చేవ=పరాక్రమము.

తాత్పర్యము

కొంచెమైనను భయములేక శత్రువులగు వీరుల సేనలోకి తేరుపోనిచ్చి యల్లెత్రాడు విశేషముగ ధ్వనించుచుండ విరామములేక బాణముల నవలీలగాఁ బ్రయోగించుచు క్రోఁతిగుంపుల నఱకుచుఁ దఱుముచు వినాశముచేయుచుఁ బరాక్రమము చూపఁగా.

—• అంగదుఁడు శత్రుసేనపై విజృంభించుట •—

ఉ. ఆతనిప్రాపునం గెరలి • యాశరవర్గ మనర్గళక్రమ
స్ఫీతమహాస్త్రధారలను • జెండెఁ బ్రచండగతిం బ్లవంగమ
వ్రాతము, దానికిం గనలి • వాలిసుతుండు యుగాంతహేతిమ
ద్భాతిని మండుచుం గదియఁ•బాఱె నుదగ్రమహీజహస్తుఁ డై. ౧౧౧౭

అర్థములు. కెరలి = విజృంభించి, ఆశరవర్గము = రాక్షససమూహము, అనర్గళక్రమస్ఫీత = అడ్డములేని సంచారముచే నధికమైన, మహాస్త్రధారలను = గొప్ప యస్త్రముల వర్షముచే, ప్లవంగమవ్రాతమున్ = వానర సమూహమును, కనలి = కోపించి, యుగాంత = మహాయుగముల కడపటి, హేతిమద్భాతిని = అగ్నివలె, కదియన్=సమీపించునట్లు, ఉదగ్రమహీజహస్తుఁడై = భయంకరమైన వృక్షమును చేతఁ గలవాఁడై.

తాత్పర్యము

వాని యాశ్రయమున రాక్షస సమూహము విజృంభించి యడ్డములేని విధముగ నస్త్రపరంపరలను వర్షమువలెఁ గురియించి వానర సమూహములను నఱకెను. అదిచూచి కోపించి యంగదుఁడు ప్రలయకాలాగ్నివలె మండిపడుచు చేత నొక పెద్ద చెట్టు తీసికొని వానిని సమీపించెను.

శా. బానాత్రిప్పు చదృశ్యుఁడై బలజవ ♦ ప్రావీణ్యముల్ దోఁపఁ గం
ఖాణస్యందన కేతుసూతయుతర♦క్షస్సైన్యసంఘంబు సం
క్షీణంబై చెడఁ గృత్తభూజములమా♦డ్కిన్ భిన్నమూర్ధాంగగీ
ర్వాణారుల్ ధర వ్రాల విక్రమకళా♦రంభైక సంరంభుఁ డై. ౧౧౧౨

అర్థములు. బానా ద్రిప్పుచు = ఆ చెట్టునే బానాకట్టె త్రిప్పువిధముగఁ ద్రిప్పుచు, బలజవప్రావీణ్యముల్=బలముయొక్కయు వేగముయొక్కయు నేర్పు, కంఖాణ = గుఱ్ఱములతోను, స్యందన = తేర్లతోను, కేతు = ధ్వజములతోను, సూత=సారథులతోను, యుత = కూడిన, రక్షస్సైన్యసంఘంబు = రాక్షస సేనా సమూహము, సంక్షీణంబై=మిగుల నశించినదై, కృత్తభూజముల మాడ్కిన్ = నఱకఁబడిన చెట్లవలె, భిన్న=భేదింపఁబడిన, మూర్ధాంగ=తలలు అవయవములు గల, గీర్వాణారుల్ = దేవ విరోధులు = రాక్షసులు, విక్రమకళా = పరాక్రమ విద్యను జూపుటయందు తొందరగలవాఁడై.

తాత్పర్యము

తన బలవేగముల సామర్థ్యము కనబడునట్లు బానాకట్టెను ద్రిప్పునట్లు చెట్టును ద్రిప్పుచు ఆ వేగమునఁ గానరాక దానితో గుఱ్ఱములు,రథములు,కేతువులు సారథులు గల రాక్షససైన్యమును క్షయించి చెడఁగా నఱకఁబడిన చెట్లవలె భేదింపఁబడిన తలలు నవయవములు గల రాక్షసులు నేలఁబడఁగా తన పరాక్రమము చూపుటయందుఁ దొందరఁ గలవాఁడై.

కం. ఎక్కడఁ జూచిన రుధిరం, బెక్కడఁ జూచిన శవంబు ♦ లెక్కడఁ గనినన్
రక్కసుల మేనితుండెము, లెక్కడ శస్త్రముల తునుక♦లెసఁగించె ననిన్.

అర్థములు. అనిన్=యుద్ధమందు, మేని తుండెములు = దేహముల తునుకలు, శవంబులు=పీనుఁగులు.

తాత్పర్యము స్పష్టము

కం. హారంబులతో మణికే,యూరంబులతోడ నంబ ♦ రోత్కరములతో
సారతరశస్త్రతతితో, శారదనిశవోలె వెలిఁగె ♦ సమరాంగణమున్. ౧౧౩౦

అర్థములు. మణికేయూరంబులతోడ = రత్నములు చెక్కిన భుజకీర్తులతో అంబర+ఉత్కరములతో=వస్త్రసమూహముతో, సారతర = మిగుల దృఢమైన, శస్త్రతతితో=శస్త్రముల సమూహములతో,శారదనిశవోలెన్=శరత్కాలరాత్రి వలె; హారాదులకు - నక్షత్రములకు, అంబరములకు- మేఘములకు నుపమానము.

తాత్పర్యము స్పష్టము.

కం. క్షుద్రమృగంబులఁ జూచిన, రుద్రాణీవాహనంబు ♦ రూపున భృశశౌ
ర్యోద్రేకస్ఫూర్తిని గపి, రౌద్రంబుగ రూపు మాపె♦రాక్షసకోటిన్. ౧౧౩౧

అర్థములు. క్షుద్రమృగంబులు=అల్పమృగములు, నక్కలు మొదలైనవి,

రుద్రాణీ వాహనము=పార్వతి వాహనము-సింహము, భృశ=అధికమైన, శౌర్యోద్రేకస్ఫూర్తిని=శౌర్యాతిశయము మిక్కుటము గుటచే, కపి=అంగదుఁడు.

తాత్పర్యము

అల్పమృగములఁ జూచిన సింహమువలె నధికమైన శౌర్యాతిశయముచే నంగదుఁడు భయంకరముగ రాక్షసులను ధ్వంసముచేసెను.

—♦ ౫౪-వ సర్గము. వానరులు వజ్రదంష్ట్రసేనఁ బోరిగొనుట ♦—

సీ. అంగదుఁ డిట్టుల ♦ భంగురవిక్రమ, మెసఁగ శాత్రవసేనఁ ♦ గసిమసంగ
నుగ్రప్రభంజను ♦ నుద్ధతి కోర్వక, విరియు మబ్బులమాడ్కి ♦ విచ్చుసేనఁ
గని వజ్రదంష్ట్రుండు ♦ కనలి శక్రాశని, సమనిస్వనం బైన ♦ జ్యారవంబు
చెవుడు గొల్పఁగ మహా ♦ శీవిషసంకాశ, నారాచవర్షంబు ♦ ఘోరభంగిఁ
ఆ. గురిసి మిగిలివచ్చు ♦ క్రోఁతుల నాఁగినఁ, దేఱి రాత్రిచరులు ♦ దివ్యశస్త్ర
సమితిఁ గీశయోధ♦సంఘంబుపైఁ జిమ్మ, యుబ్బణంప దండి ♦ నిబ్బరమున.

అర్థములు. అభంగుర విక్రమము=క్షయింపని పరాక్రమము, ఎసఁగన్ = అతిశయింపఁగా, కసిమసంగన్ = ఖండింపఁగా, ఉగ్రప్రభంజను=తీవ్రమైనగాలి యొక్క, ఉద్ధతికిన్ = దెబ్బకు, విరియు=చెదరిపోవు, కనలి=కోపించి, శక్రాశని = పిడుగుతో, సమ =సమానమైన, నిస్వనంబైన = ధ్వనిగల, జ్యారవంబు = అల్లెత్రాటిమ్రోఁత, మహాశీవిష=గొప్పపాములతో, సంకాశ=సమానమైన, నారాచవర్షంబు = బాణములవాన, ఆఁగినన్ = అడ్డగింపఁగా, తేఱి = తెప్పఱిల్లుకొని, ఉబ్బ = గర్వము - పొంగు.

తాత్పర్యము

ఈ ప్రకార మంగదుఁడు బుజువైన పరాక్రమ మతిశయింపఁగా విరోధి సేనను జంపఁగా దీవ్రమైన సుడిగాలి దెబ్బకు విచ్చు మేఘములవలెఁ జెదరిపోవుచున్న సేనను జూచి వజ్రదంష్ట్రుఁడు కోపించి పిడుగు పడునప్పుడు కలుగు ధ్వని వంటి ధ్వనిగలుగునట్టు లల్లెత్రాడు మీటి, వినువారికి చెవుడుగలిగించి, పాముల వర్షమువలె బాణవర్షము గురిసి పైపడివచ్చుచున్న వానరసేన నడ్డగించిన నింతలోఁ దేఱుకొని రాక్షసులు దివ్యశస్త్రసమూహమును వానరసేనపైఁ జిమ్మిపొంగణఁగింపఁగా మిగుల నిబ్బరమున.

కం. వేలకొలందుల సాధన, జాలంబుల సోఁకుమూఁక ♦ సం దీక వడిన్
శైలాటయోధముఖ్యుల, పై లీలన్ విసరి విసరి ♦ పస మాపంగన్. ౧౧-౨౩

అర్థములు. సోఁకుమూఁక = రాక్షస సమూహము, శైలాట యోధముఖ్యులపై=వానర యోధులందు ముఖ్యులగు వారిమీఁద, పస=సత్తువ.

తాత్పర్యము స్పష్టము.

కం. చేయంగల కీశులు గ్రావాయుధులై కోయటంచు ♦ నాప్పుచు గుములై
యా యామినీచరేంద్రుల, కాయంబుల నలియ నడిచి♦కాలునిగూర్పన్. ౧౧-౨౪

చేయంగల=సామర్థ్యముగల, కీశులు=వానరులు, గ్రావాయుధులై = పెద్ద బండలు గుండ్లు ఆయుధములుగాఁ గలవారై, అడిచి=కొట్టి, కాలునిఁ గూర్పన్= చంపఁగా.

తాత్పర్యము స్పష్టము.

సీ. గుట్టలై రాలిన ♦ కుణపరాసుల నెక్కి, తోడేళ్ళు లాడి య ♦ స్తోకరతిని
జిట్టలుగా రేఁగి ♦ యట్టలగుమి మూఁగి, గొండిలి సల్పెఁ బ్ర ♦ చండభంగి
నందిపొందినవార ♦ లందఱితోఁ గదు,పార గ్రద్దలు విందు ♦ లారగించె
నల్ల యేఱులఁ బుఱ్ఱె ♦ మొల్లంపుఁ దెప్పల, నిక్కుచు నూరేగ ♦ నక్కపిండు
తే. వాయసంబులు మింటఁ గా♦వాచరించెఁ, గాకగృధ్రంబులకుఁ బెద్ద♦కలహమయ్యె
నపుడు భూతభయానకం♦బై నరీతిఁ, బరిఢవిల్లెను వానర♦ప్లవగరణము. ౧౧౨౫

అర్థములు. కుణపరాసులు = పీనుఁగుల ప్రోవులు, రాశి, ఏక, బహు, రాసులు. అస్తోకరీతిని = అధిక ప్రేమతో, చిట్టలుగా = ఆశ్చర్యకరముగ, అట్టల గుమున్=మొండెముల రాసులందు, రేఁగి=విజృంభించి, గొండలి=నాట్యము, అంది పొందినవారలు=దూరపు బంధువులు, నల్లయేఱులన్=నెత్తుటి ప్రవాహములందు, కావా=గుండ్రముగాఁ దిరుగుట, పరిఢవిల్లెను=అతిశయించెను.

తాత్పర్యము

గుట్టలవలెఁ బడిన పీనుఁగుల కుప్పలమీఁద నెక్కి తోడేళ్ళు పరమ ప్రీతితోఁ నెక్కి యాడుకొని యాశ్చర్యకరముగా విజృంభించి మొండెముల గుంపునకై ముసురుకొని తీవ్రముగా నాట్యము సలిపెను. గ్రద్దలు తమ దూరపు బంధువులను గూడఁ బిలుచుకొని కడుపునిండ విందులారగించెను. నెత్తురు నదులలోఁ బుఱ్ఱెలను తెప్పలమీఁద నక్కలు గరువముతో నూరేఁగెను. కాకు లాకాశంబున గుండ్ర ముగాఁ దిరిగెను. ఈ పీనుఁగు నాదనిన నాది యని కాకులకు గ్రద్దలకు బెద్దజగడము జరిగెను. అప్పుడు వానర రాక్షసయుద్ధము భూతములకు భయము గలిగించెను.

—♦ వజ్రదంష్ట్రుఁడు వానరసేనపై విజృంభించుట ♦—

కం. పగులుతలన్ దెగడు మొల,ల్నొగులు మెయుల్ తునుఁగు చేతు♦లుం బాదములై
తగులు శరంబుల నెసఁగిన, నెగులునఁ జెడి పడిరి యామి♦నీచరకీశుల్. ౧౧౨౬

అర్థములు. నొగులు=నొప్పిచెందిన, మెయుల్ = శరీరములు, నెగులున= బాధచే, యామినీచరకీశుల్=రాక్షసులు, వానరులు.

తాత్పర్యము

పగులుచున్న తలలు, తెగుచున్న నడుములు, నొప్పిచెందుచున్న దేహములు, తునిఁగి పడుచున్న చేతులు కాళ్ళు కలిగి తగులుచున్న బాణములచే నతిశయించిన బాధవలనఁ జెడి రాక్షసులు వానరులు పడిరి.

ఉ. చండతరప్రతాపి కపి♦సైన్యముచేఁ దమవార లందఱున్
గండఱి తూలి తాఁ గన వి♦కావికలై చనుచుండ వజ్రదం
ష్ట్రుండు శరాసనంబుఁ గొని ♦ రోషసముజ్జ్వలభీకరప్రతీ
కుం డయి వానరుల్ బెదరఁ ♦ గ్రూరగతిం బరఁగించె నమ్ములన్. ౧౧-౨౮

అర్థములు. చండతరప్రతాపి=మిగుల తీక్ష్ణమైన ప్రతాపముగల, గండు+అఱి=పౌరుషముచెడి, తూలి = పడి, వికావికలై = చెల్లాచెదరై, రోష = కోపముచే, సముజ్జ్వల = ప్రకాశించు, భీకర = భయంకరమైన, ప్రతీకుండయి = దేహము గలవాఁడై. తాత్పర్యము

తీవ్రమైన ప్రతాపముగల వానరసేనచేత తమవారు పౌరుషముచెడి, కొందఱుపడి, కొందఱు చెల్లాచెదరై, పోవుచుండఁగాఁ జూచి వజ్రదంష్ట్రుఁడు విల్లుతీసికొని కోపముచే మండుచున్న దేహముగలవాఁడై వానరులు భయపడునట్లు బాణములఁ బ్రయోగించెను.

శా. వ్యూహంబుల్ కలఁగంగఁ బాఱ నరదం♦బుం ద్రోలుచున్ సంగరో
త్సాహం బిన్మడిగా నిశాతవిశిఖా♦సారంబునం గీశరా
డ్దేహంబు ల్తుటుమాడుచున్ నఱకుచున్ ♦ దృష్టింప దుర్లక్ష్యుఁడై
బాహాటోపముఁ జూపె నాహవకళా♦పాండిత్యముం జాటుచున్. ౧౧-౨౯

అర్థములు. వ్యూహంబుల్ = సేనలు గుంపులుగూడినతీరు, కలఁగంగఁ బాఱన్ = కలఁతచెందునట్లు, ఇన్మడి = రెట్టింపు, నిశాత = పదునైన, విశిఖ + ఆసారంబునన్ = బాణవర్షముచే, తుటుమాడుచున్ = తుటుముగాఁ జేయుచు, నన్నసన్న తునుకలుగాఁ జేయుచు, దుర్లక్ష్యుఁడై =లక్షింపరానివాఁడై, ఆహవకళా = యుద్ధ విద్యయందలి, పాండిత్యము = జ్ఞానాతిశయము.

సేనలకూర్పు చెదరిపోవునట్లు రథమును నానాదిక్కులఁదోలుచు యుద్ధమందలి యుత్సాహము రెండింతలుగాఁగా వాఁడి బాణముల వర్షముచే వానర ముఖ్యుల దేహములు పొడిపొడిగా నఱకుచు తేఱిచూడరానివాఁడై తన యుద్ధమందలి పాండిత్యము ప్రకటించుచు భుజబలముఁ జూపెను.

కం. తక్కక క్రోధావేశం, బెక్కఁగ నేవురును నేడ్వు♦రెనమండ్రుగఁ దా
నొక్కొకనారాచంబున,నక్కపులను గుదులు గ్రుచ్చి♦యామికఁ బాపెన్.

అర్థములు. గుదులు గ్రుచ్చి = ఒకరివెంట నొకరిని వరుసగా పుల్లలకు పూలు గ్రుచ్చినట్లు గ్రుచ్చి, ఆమిక = అహంకారము.

తాత్పర్యము స్పష్టము.

కం. ఒఱగుమెడల్ విఱుగుదొడల్, నఱకుడువడు కాళ్ళు నగుచు♦నగచరవర్యుల్
విఱిగి చని వాలితనయుని, మఱుఁగునఁ జొరఁబాఱి రపుడు♦మలచపు వెఱచేన్.

అర్థములు. మలదపువెఱ=అధికమైన భయము, సుఱుఁగునఁజొఱఁబాఱిరి=చాటునకుఁ బోయిరి, శరణుజొచ్చిరి.

తాత్పర్యము స్పష్టము.

—♦ వజ్రదంష్ట్రుఁ డంగదుతోఁబోరి చచ్చుట ♦—

ఉ. త్రస్తుల నాత్మయోధులను ♦ దారతనూజుఁడు గాంచి కిన్కమై
మస్తక మూఁచి చూపులనె ♦ మానవభోజి దహించునట్టిఁడై
శస్తజవంబునన్ హరి గ♦జంబుపయిం బడుమాడ్కి దూఁకి య
భ్యస్త సమస్తజన్యవిధుఁ ♦ డంకిలి లేకొక గ్రుద్దు గ్రుద్దినన్. ౧౧౩౧

అర్థములు. త్రస్తులన్ = భయపడినవారిని, మస్తకము = తల, ఊఁచి=ఊఁగులాడించి, శస్త = ప్రశంసింపఁదగిన, జవంబునన్ = వేగముచే, అభ్యస్త=అభ్యాసము చేయఁబడిన, సమస్త=అన్నివిధములైన, జన్యవిధుఁడు=యుద్ధవిధములు గలవాఁడు, అంకిలి=అడ్డము=భయము.

తాత్పర్యము

భయపడిన తనయోధులను జూచి కోపించి తల యూఁగులాడించి చూపులచేతనే రాక్షసుని దహించువానివలెనై పొగడ్త కెక్కిన వేగమున నంగదుఁడేనుఁగు మీఁదఁబడు సింహమువలె వానిమీఁద దూఁకి యన్ని యుద్ధవిధముల నలవాటుపడిన యతఁడు భయపడక వాని నొక గ్రుద్దు గ్రుద్దెను.

కం. తోమరసంఘాతంబుల సామజమును గ్రుమ్మునగతి ని♦శాచరుఁ డలుకన్
భీమశరసహస్రముల సు,త్రామజసుతు మేను నలిపె♦ రక్తమయముగన్. ౧౧౩౨

అర్థములు. తోమర=చిల్లకోలల, సంఘాతంబులన్ = సమూహములచే, సామజమును=ఏనుఁగును, గ్రుమ్మునగతి=పొడుచునట్లు, సుత్రామజసుతు = ఇంద్రుని కొడుకగు వాలిపుత్రుని, రక్తమయముగన్=నెత్తుటితో నిండునట్లు.

తాత్పర్యము

చిల్లకోలల సమూహముచే నేనుఁగును బొడుచునట్లు రాక్షసుఁడు కోపముతో భయంకరములైన యనేక బాణములచే నంగదుని దేహము నెత్తుటితో నిండునట్లు చేసెను.

ఉ. ఇవ్విధి బాణవర్షము న♦హీనగతిం గురియించి మర్మముల్
నొవ్వఁగజేయ శక్రజుత♦నూభవుఁ డొక్కవిశాలసాలము
న్రువ్వున పీచి నైవఁ గని ♦ నూర్కొని లీల సురారి భూజమున్
గ్రొవ్వున నింత లింతలుగఁ ♦ గూల్చె ధరం బడ శౌర్యసంపదన్. ౧౧౩౩

అర్థములు. విశాలసాలము = పెద్దచెట్టు, నొవ్వఁగన్=బాధ కలుగునట్లు, నూర్కొని=పురిగొని, లీలన్=అనాయాసముగా.

తాత్పర్యము

ఈ ప్రకారము విశేషముగ బాణవర్షము గురియించి ప్రాణస్థానములను బాధింపఁగా నంగదుఁడొక పెద్దచెట్టును ఉవ్వని విసరివేయఁగా రాక్షసుఁడు ఫురిగొని యవలీలగా నా చెట్టును చిన్న చిన్న తునుకలై పడునట్లు నఱకెను.

ఉ. ఆశరువిక్రమంబు తెఱఁ • గంతయుఁ గన్గొని శైల మొండు వే
కీశవరుండు గైకొని ప • కీలున వైచె ససింహనాదుఁడై
లేశముఁ గొంక కాతఁ డవ • లీల గదం గొని దిగ్గ దాఁటినన్
నాశముఁ జేసె భూధ్రము క్ష • ణంబునఁ దేరి సచక్రవాజిగన్. ౧౧౩౮

అర్థములు. ఆశరు=రాక్షసుని, పకీలున=వేయునప్పటి ధ్వన్యనుకరణము, భూధ్రము=కొండ, సచక్రవాజిగన్=చక్రములతో గుఱ్ఱములతో.

తాత్పర్యము

రాక్షసుని పరాక్రమము విధమంతయుఁజూచి పర్వత మొకటి తీసికొని సింహనాదముచేసి పకీలున వానిపై వైవఁగా వాఁడు దానిని కొంచెమైన జంకక గదతీసికొని తటాలున తేరిమీఁదినుండి క్రిందికి దాఁటెను. ఆ పర్వతము చక్రములతో గుఱ్ఱములతోఁ దేరిని నాశము చేసెను.

కం. వెండియును వాలినందనుఁ డొండొకతరుయుక్తభూధ్ర • ముద్ధతి విసరన్
గండలు గ్రక్కుచు నద్దైత్యుండు ధరన్ సోలె గదను • నూఁతగఁ గొనుచున్.

అర్థములు. తరుయుక్తభూధ్రము = చెట్లతోడి కొండను, ఊఁతగన్ = ఆధారముగ.

తాత్పర్యము

అంతతోఁ బోనీయక యంగదుఁడు చెట్లతోడ నున్న పర్వతమును నొక దానిని విసరి రాక్షసుని మీఁద వైవఁగా వాఁడు దాని తాఁకున నెత్తురు కండలు గ్రక్కుచు భూమిమీఁద తెలివితప్పి గద నాధారము చేసికొని పడెను.

తే. ఊర్పుచును వ్రాలి యొకక్షణం • బుండి లబ్ధ, సంజ్ఞుఁడై లేచి కదిసిన • శక్రపౌత్రు
ఱొమ్ములక్షించి బిట్టుగఁ • గ్రుమ్మటయును, వాలితనయుండు నగ్గదఁ • బాఱఁజిమ్మె.

అర్థములు. ఊర్పుచును = పెద్ద శ్వాస విడుచుచు, లబ్ధసంజ్ఞుఁడై=స్మృతి పొందినవాఁడై, కదిసిన=సమీపించిన, లక్షించి=గుఱిచూచి.

తాత్పర్యము

ఎగఁబోసి కొనుచుఁ కొంచెము సేపు పడియుండి స్మృతి తెచ్చుకొని లేచి తన్ను సమీపించిన యంగదుని ఱొమ్ముగుఱిచూచి గదచేఁ బొడువఁగా నంగదుఁడు దానిని గుంజుకొని దూరముగఁ బాఱవైచెను.

కం. భీమబలాఢ్యులు దెగి ము, ష్టీముష్టిరణంబు సేయ • ఛీకొన నన్యో
న్యామితఘాతములను ను, ద్దామంబగు రక్తధారఁ • దడిసె న్మేనుల్. ౧౧౩౯

అర్థములు. భీమబలాఢ్యులు = భయంకరమైన బలముయొక్క సంపద గలవారు, ముష్టీముష్టిరణంబు=పిడికిళ్ళతో యుద్ధము, పిడికిటఁ గొట్టినవానిని మరల పిడికిట గొట్టుట ముష్టీముష్టిరణము - వ్యతిహారబహువ్రీహి. చూ. మందరము ౪౧౧ ప-కిష్కింధ. అన్యోన్య + అమిత + ఘాతములను = ఒకరినొకరు మితిలేక కొట్టుటచేత, ఉద్దామము = అధికము.

తాత్పర్యము

భయంకరబలముచే నధికులగు నంగద వజ్రదంష్ట్రులు సాహసించి పిడికిళ్ళతో నొకరి నొకరు పలుమాఱు కొట్టుకొనఁగా నా దెబ్బలచే వారి దేహము నెత్తుటఁ దడిసెను.

కం. అంగారక బుధు లనఁగాఁ, జెంగక రక్షఃప్లవంగ ♦ శేఖరు లలుకన్
భంగముపడక భరంపడి, కంగా రొనరింప సందు ♦ గని ప్లవగుండున్. ౧౧౩౮

అర్థములు. చెంగక = ఓడిపోక, రక్షఃప్లవంగశేఖరులు=రాక్షస వానర శ్రేష్ఠులు, అలుకన్ = కోపముతో, భంగముపడక=ఓడిపోక, భరంపడి = అతి కష్టముతో, కంగారు=యుద్ధము, సందు=అవకాశము.

తాత్పర్యము

రాక్షస వానర శ్రేష్ఠులు అంగారక బుధ గ్రహములవలె వెనుదీయక, యోడిపోక కష్టముపై యుద్ధము చేయునెడఁ గొంచెము సందు దొరకఁగా నంగదుఁడు,

చ. అవిరళపుష్పభారసము♦దంచితభూమిరుహంబు వైచినన్
దివిజవిరోధి ఖడ్గనిహతిం♦దెగ వ్రేయఁగ జూచి యార్షభం
బవు ఫలకంబు గజ్జియల♦నందము మీఱు కృపాణముం గొనెన్
బ్లవగవరుండు దైత్యుఁడు కృ♦పాణము డాలును గొంచుఁ దాఁకినన్. ౧౧౩౯

అర్థములు. అవిరళ=దట్టమైన, పుష్పభార = పూవుల యతిశయముచే, సముదంచిత = ప్రకాశించుచున్న, భూమిరుహంబు = చెట్టును, ఆర్షభము = ఎద్దు చర్మముతోఁ జేయఁబడిన, ఫలకంబు=డాలు, కృపాణము=కత్తి.

తాత్పర్యము

బాగుగ పూచిన చెట్టు నొకదానిని దీసివేయఁగా రాక్షసుఁడు దానిని గత్తితో నఱకివైచెను. అదిచూచి యందే పడియుండిన ఎద్దుచర్మముతోఁ జేయఁబడిన డాలు, గజ్జెలువేసిన కత్తి నంగదుఁడు తీసికొనఁగా రాక్షసుఁడు నట్లె డాలు, తరవారి తీసికొనెను.

కం. జయకాంక్ష నిద్దఱును ని,ర్దయచిత్తత నేటు నోటు ♦ దాటును బలమున్
రయముం జూపుచు నొండొరు, భయపడక యుదగ్రవృత్తిఁ♦బడ నడువంగన్.

అర్థములు. నిర్దయచిత్తతన్=దయలేని మనస్సులతో.

తాత్పర్యము స్పష్టము.

ఉ. పోటులగంట్ల నెత్తుటను ♦ బూచిన మోదుగుచెట్లఁబోలి యా
మేటిమగల్ శ్రమం బడక ♦ మేదిని జానుల నూఁది నిల్చు చోఁ
బ్రేటునఁ బాముపోలె నెస ♦ రేగి కపీంద్రుఁడు దాఁటి మీఁదికిన్
బోటనబంతినా నసురు ♦ భూరి శిరంబును ఖడ్గధారచేన్. ౧౧౮౨

అర్థములు. పోటులగంట్ల = దెబ్బలవలన నైన గాయముల, జానుల = మోఁకాళ్ళను, ఊఁది = నేలకుమోపి, బ్రేటునన్ = దెబ్బకొట్టఁగా, ఎసరేఁగి = విజృంభించి, పోటనబంతి=పుట్టచెండు,పోటు+బంతి=సంధియందు వర్ణాగమము.

తా త్ప ర్య ము

పిడికిటి పోటులవలననైన గాయముల వెంటఁగాఱు నెత్తుటిచేఁ దడిసి పూచిన మోదుగచెట్లవలెనై యా శూరులు మిగులఁ బ్రయాసముతో నేలపై మోఁకాళ్ళూది నిల్చునపుడు దెబ్బదినిన పాము లేచునట్లు తటాలున నంగదుఁడు రాక్షసుని మీఁదికి దూఁకి పుట్టచెండును జిమ్మువానివలె వాని శిరస్సు కత్తిధారచేత.

కం ఖండించుటయున్ రోషో,చ్చండత గిరగిరను దిరుగు ♦ చక్షులతోడన్
నిండారు నెత్తురులతోఁ, మొండెంబును విడిచి త్రెళ్ళె మూర్థము త్రుటిలోన్.

అర్థములు. రోషోచ్చండత = కోపాతిశయముచే.

తా త్ప ర్య ము

నఱుకఁగా కోపాతిశయముచే గిరగిర తిరుగుచున్న కన్నులతో నిండిన నెత్తుటితో మొండెమును విడిచి తల నేలపై నిమిషములోఁ బడెను.

ఉ అంతకుపాలికిం దనుబ♦లాధిపుఁ డేగిన రక్కసుల్ భయా
క్రాంతమనంబులన్ నగచ♦రప్రవరుల్ దఱుమంగ లంకకున్
స్వాంతము పల్లటిల్లఁ జని ♦ రంతట నంగదుఁ డెల్ల వానరుల్
పొంతలఁ గొల్వ నొప్పె సుర ♦ పుంజసమర్చిత శక్రుకైవడిన్. ౧౧౮౩

అర్థములు. అంతకు పాలికిన్ = యమునియొద్దకు, బలాధిపుఁడు = సేనానాయకుఁడు, భయ + ఆక్రాంతమనంబులన్=భయముచే నాక్రమింపఁబడిన మనస్సులచే, నగచర ప్రవరుల్=వానర శ్రేష్ఠులు, స్వాంతము=మనస్సు, పల్లటిల్లన్= తత్తఱ పడఁగా, సురపుంజ సమర్చిత — దేవ సమూహముచేఁ బూజింపఁబడిన, శక్రుకైవడిన్=ఇంద్రునివలె.

తా త్ప ర్య ము

తమ సేనానాయకుఁడు మరణింపఁగా రాక్షసులు భయపడి తమ్ము వానరులు తఱుముకొని రాఁగా మనస్సు తత్తఱపడ లంకలోనికిఁ బరువెత్తిరి. అంతట నంగదుని వానరులెల్ల గౌరవించిరి.

—♦ ౫౯-వ సర్గము. అకంపనుఁడు యుద్ధమునకుఁ బోవుట ♦—

సీ. వాలిపుత్రునిచేత ♦ వజ్రదంష్ట్రుండు జన్యంబునఁ గూలుట ♦ యాలకించి
యమరారిభర్త ప్ర♦హస్తుతో దుర్దమ, శౌర్యధుర్యులను రా♦క్షసులఁ గూర్చి

పంపు మకంపనుఁ ♦ ప్రథనార్థ మీతఁడు, సర్వశస్త్రాస్త్ర వి♦శారదుండు
సమరసమ్మతుఁడు శా♦స్తయు గో♦ప్తనేతయు, మద్భూతికాముండు♦మహితబలుఁడు
తే. ఈతఁడు జయింపఁజాలు న♦రేంద్రవాన, రేంద్రుల నటన్న నాతఁ డ♦హీనసేన
భీమదర్శనరాక్షస♦స్తోమ మొనరఁ, గోలుతలు సేసి యిచ్చె న♦కుంఠగతిని.

అర్థములు. జన్యంబునన్ = యుద్ధమందు, దుర్దమ=అణఁపరాని, శౌర్యధుర్యులను = శౌర్యాతిశయముగలవారిని, ప్రథనార్థము=యుద్ధముకొఱకు, సమరసమ్మతుండు = యుద్ధమునందుఁ బ్రసిద్ధుఁడు, శాస్త=శత్రువుల శిక్షించువాఁడు, గోప్త=తన సైన్యమును రక్షించువాఁడు, నేత=సేనకునాయకుఁడుగానుండి నడపఁగలవాఁడు, మత్+భూతి+కాముండు = నా యైశ్వర్యము కోరువాఁడు, మహితబలుఁడు=గొప్పబలముగలవాఁడు, అహీనసేన=గొప్పదండు, భీమదర్శన=భయము కలిగించు చూపులుగల, కోలుతలు సేసి=యుద్ధమునకు సిద్ధపఱిచి, అకుంఠగతిని = లోపములేని విధముగ.

తాత్పర్యము

అంగదునిచే వజ్రదంష్ట్రుఁడు చచ్చె నని విని రావణుఁడు ప్రహస్తునితో నిట్లనియె. మిగుల శౌర్యవంతు లగు రాక్షసులఁ గూర్చి యుద్ధముకొఱకీ యకంపనుఁ బంపుము. ఇతఁడు సర్వశస్త్రాస్త్రములు తెలిసినవాఁడు, యుద్ధమునందుఁ బ్రశస్తి గన్నవాఁడు, తన సేనను రక్షించుచుఁ బరులసేనను శిక్షించుచు సేనను నడపఁగలవాఁడు, నామేలు కోరువాఁడు, గొప్పబలము గలవాఁడు, ఇతఁడు రామలక్ష్మణుల సుగ్రీవుని జయింపఁజాలును-అనిన నతఁడు గొప్పసేనను యుద్ధమునకు సిద్ధముచేసి యతని స్వాధీన పఱిచెను.

చ. కలన నిలింపకోటికి న♦కంపనుఁ డౌట నకంపనప్రథన్
జెలఁగెడివాఁడు నీరదరు♦చిన్ జలదార్భటి నొప్పువాఁడు మే
ల్దళుకుఁబసిండిపోఁగుల వి♦లాసమువాఁడు మహారథంబుపైఁ
బొలిచె సరోజబాంధవుఁడు♦ పుట్టుమలన్ వెలుగొందుచందమై. ౧౧౮౫

అర్థములు. నిలింపకోటికిన్ = దేవతా సమూహమునకు, అకంపనుఁడు=చలింపనివాఁడు, అకంపనప్రథన్ = అకంపనుఁ డను కీర్తిని, నీరదరుచిన్=మేఘకాంతితో, జలదార్భటిన్ = మేఘధ్వనితో, సరోజ బాంధవుఁడు — సూర్యుఁడు, పుట్టుమలన్ = తూర్పుకొండయందు.

తాత్పర్యము

యుద్ధమందు దేవతలైనను గదలింపలేరు కావున అకంపనుఁ డని ప్రసిద్ధి వహించెను. మేఘకాంతి మేఘధ్వని కలవాఁడు. బంగారు పోఁగుల విలాసము గలవాఁడు. ఇట్టివాఁడు తూర్పుకొండమీఁదసూర్యునివలె రథంబుమీఁదఁగూర్చుండెను.

సీ. ఈరీతి నరుగుచోఁ ♦ దేరిగుఱ్ఱంబులు, నిర్నిమిత్తంబుగ ♦ నేల మ్రొగ్గె
డాకన్ను చలియించె ♦ డగ్గుత్తిక జనించె, వదనసీమను విన్నఁ♦బాటు దోడరెఁ
బ్రతికూలవాయువు♦భయదమై వీచె దుర్దినముగాఁ దోఁచె సు♦దినమ యయ్యు
ఖగమృగంబులు నించె ♦ ఖరతరస్వరములు, శార్దూలబలుఁ డవి ♦ సరకుగొనక
ఆ. కలని కుత్సహించె ♦ బలలాశిసైన్యంబు, లబ్ధి క్షోభ మొంద ♦ నార్భటింప
నులికి కీశసేన ♦ యుర్వీరుహాద్రుల, సిద్ధపఱిచి నిలిచె ♦ యుద్ధమునకు. ౧౧౭౬

అర్థములు. మ్రొగ్గెన్ = వ్రాలెను, డాకన్ను=ఎడమకన్ను, డగ్గుత్తిక = గొంతు తడఁబడుట, ఖరతరస్వరములు=మిగుల కఠినధ్వనులు, దుర్దినము=మేఘములచేఁ గప్పఁబడిన దినము, సుదినము=ఎండకాయుచున్న దినము, ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వెలువడినప్పుడు నిశీథమని చెప్పఁబడెను. ఇప్పుడు సుదిన మనుటచే నిది పగటియుద్ధము కావున ఫాల్గుణ బహుళ దశమి యని యేర్పడు చున్నది. శార్దూలబలుఁడు = పులిబలమంత బలము గలవాఁడు, కలనికిన్ = యుద్ధమునకు, పలలాశిసైన్యంబు = రాక్షససేన, అబ్ధి = సముద్రము, క్షోభము = కలఁత, ఉలికి = భయపడి.

తాత్పర్యము

ఈ విధముగఁ బోవునపుడు కారణములేకయే తేరిగుఱ్ఱములు మోఁకాళ్ళ మీఁద ముందఱికిఁబడెను. వానికి నెడమకన్నదరెను. మాట తడఁబడెను. ముఖము తెల్లఁబాఱెను. ఎదురుగాలి భయంకరముగ వీచెను. మబ్బులులేని దినమయ్యు మబ్బుక్రమ్మి నట్లుండెను. పక్షులు మృగములు పరుషధ్వని నెసగించెను. వ్యాఘ్రబలుఁడు గావున బలమదంబున వానిని లక్ష్యపెట్టక యుద్ధమునకుఁ బోవు నుత్సాహము గలవాఁడయ్యె. రాక్షస సైన్యంబు సముద్రము కలఁతచెందునట్లు సింహనాదములు చేసెను. దానికి వానరసేన యులికిపడి చెట్లు కొండలు సిద్ధపఱిచి కొని యుద్ధమునకై సిద్ధపడియుండె.

చ. ఉభయచమూసమూహముల ♦ కుగ్రసమీక మనేక భంగియై
రభస మెలర్పఁ జెల్లునెడ ♦ రామదశాస్యజయార్థమై కపుల్
ఋభుపరిపంథులుం దనువు ♦ లీయఁ గడంగి పరస్పరంబు దో
ర్విభవ మెలర్పఁ దాఁచిరి య ♦ రీణపరాక్రమ ముల్లసిల్లఁగన్. ౧౧౭౭

అర్థములు. ఉభయచమూ సమూహములకున్=రెండుదండుల గుంపునకు, ఉగ్రసమీకము=భయంకర యుద్ధము, రభసము = త్వర, అనేకభంగి = నానా విధములు, రామజయార్థమై + దశాస్య జయార్థమై=రామదశాస్య జయార్థమై = రాముఁడు గెలుచుకొఱకు రావణుఁడు గెలుచుకొఱకు, ఋభుపరిపంథులు = దేవ విరోధులు, రాక్షసులు-‘ఆదిత్యాఋభవోఽస్వప్నా’యని యమరము. తనువులు= దేహములు, క్రమాలంకారము-రామార్థము కపులు-దశాస్యార్థము రాక్షసులు - దోర్విభవము = భుజబల సంపద, తాఁచిరి = కొట్టిరి, ఆరీణ = వంకరగాని.

తా త్ప ర్య ము

రెండు సేనలవారికి భయంకర యుద్ధము నానావిధములుగా జరుగునపుడు రామునకు జయముగోరి వానరులు, రావణునకు గెలుపుకోరి రాక్షసులు తమ దేహములు వదలిపెట్టఁబూని ప్రాణములపై నాశవదలి భుజబలముకొలఁది యొకరి నొకరు పరాక్రమాతిశయమునఁ గొట్టిరి.

సీ. వారల తర్జన•భర్త్సనగర్జలు, బధిరత్వ మొందించె • భటులకెల్ల
నొక్కచో నరుణవ•ర్ణోపమానరజంబు, పదిదిక్కులందును • బ్రాఁకఁదొడఁగె
నొకచోటఁ బదఘట్ట•నోద్ధూతధూళులు, చీఁకుల గావించె • సేనవారి
వాజి వర్మంబును • ధ్వజము పతాకయుఁ, దేరను భేదంబు • తెలియరాదు

తే. రూపమొక్కఁడుదోఁప కా•టోపజనిత,వికటసంరావమొక్కండ•వినఁగఁనయ్యె
రాక్షసులు కొట్టనాగిరి • రాక్షసులనె, ప్లవగవర్యులు ద్రుంచిరి • ప్లవగవరుల.

అర్థములు. తర్జనభర్త్సన గర్జలు=అదలింపులు బెదరింపులు గల కేకలు, బధిరత్వము = చెవుడు, అరుణవర్ణ = అరుణుని కాంతితో, ఉపమాన = సమాన మైన, రజంబు=ధూళి పదఘట్టన = కాలి త్రొక్కుడులచే, ఉద్ధూత = ఎగురఁ గొట్టఁబడిన, ధూళులు = దుమ్ములు, చీఁకులన్=గ్రుడ్డివారిని, వాజివర్మము = ఇది గుఱ్ఱము, ఇది కవచము, ధ్వజము=చిత్రము వ్రాసిన టెక్కెము, పతాక=చిత్తరువు వ్రాయని టెక్కెము, వాజివర్మము = 'ద్వంద్వశ్చ ప్రాణి తూర్యసేనాంగానామ్' పాణిని-౨-౪-౨. ప్రకారము ఏకవచనము. తోఁపక=కానరాక, ఆటోపజనిత= సంభ్రమమువలనఁ గలిగిన, వికట=భయంకరమగు, సంరావము-ధ్వని.

తా త్ప ర్య ము

వారియొక్క యదలింపుమాటలు బెదరింపుమాటలు సింహనాదములు భటులకుఁ జెవుడు కలిగించెను. ఒక్కచో నెఱ్ఱని దుమ్ము పది దిక్కులందును వ్యాపించెను. ఒక్కచోట పాదముల త్రొక్కుడుచే లేచిన దుమ్ము సేనలవారిని గ్రుడ్డివారిని జేసెను. ఏది గుఱ్ఱమో, యేది కవచమో, యేది ధ్వజమో, యేది పతాకమో, యేది తేరో తెలియదయ్యెను. రూపమేదియుఁ గానరాలేదు. కాని వారి భయంకర ధ్వనులుమాత్రము వినవచ్చుచుండెను. రాక్షసులు రాక్షసులనే కొట్టిరి, వానరులు వానరులనే కొట్టిరి. ఏల ఇట్లు జరిగె నన,

కం. తనవార లెదిరివా రని, మనమున గుర్తింపరాక • మహితాంధమునన్
తనవారి నెదిరివారిని, దునిమి రుభయయోధవరులు•దుములపుటనిలోన్.

అర్థములు. మహితాంధమునన్ = దట్టమైన చీఁకటియందు, 'విన్నేత్రేంధ స్త్రీషు ధ్వాంతే క్లీబే'-నానా.ర.అంధశబ్దము గ్రుడ్డివానికిఁ జీఁకటికిని పేరు. తుములపుటనిలోన్=దొమ్మియుద్ధమందు.

తాత్పర్యము

దుమ్ము నిండుటచేఁ గ్రమ్మిన దట్టపుఁ జీఁకటియందు వీరు తన వారని వారు శత్రువు లని గుర్తింప సాధ్యము కాని కారణమున వీరు వారు తనవారినే చంపిరి. ఎదుటి వారిని దొమ్మి యుద్ధమందు జంపిరి. చేతికి నెవఁడు దొరికిన వాఁడే శత్రువని చంపిరి.

తే. అస్రధారాప్రవాహంబు ♦ లమిత మగుడు
క్ష్మారజము రూపు మాయఁగఁ ♦ గాన వచ్చెఁ
గుణపశతములుఁ జచ్చిన ♦ గుజ్జములును
రాసులై నేలఁ గ్రాలిన ♦ వేసడములు. ౧౧౫౦

అర్థములు. అస్రధారా ప్రవాహము=నెత్తుటిధారలవెల్లువ, క్ష్మారజము=భూమిదుమ్ము, కుణపశతములు=నూర్లకొలఁది పీనుఁగులు; వేసడములు = కంచర గాడిదలు.

తాత్పర్యము

నెత్తురు ప్రవాహముగఁ బాఱుటచే నేల దుమ్మణఁగుట వలన నూర్లకొలఁదులు పీనుఁగులు, చచ్చిన గుజ్జములు, కుప్పలుగా నేలఁబడిన కంచరగాడిదలు కానవచ్చెను.

కం. ద్రుమముల శక్తిశిలాప్రాసముల గదాపరిఘపట్టి♦సంబులఁ గపియూ
ధము రాక్షసయూథంబును, సమరం బొనరించె నసమ♦సాహసలీలన్ ౧౧౫౧

అర్థములు. ద్రుమములన్ = చెట్లచేతను, అసమ = అసమానమైన, సాహస లీలన్ = తెంపుతో.

తాత్పర్యము స్పష్టము.

కం. నఖములఁ బ్లవగులు నొంపని, శిఖముల రాక్షసులు ద్రుంపఁ♦జేతులఁ ద్రోతుల్
ముఖములఁ జింప శితశిలీ ముఖములచేఁ ద్రెంచి రసుర♦ముఖ్యులు వానిన్.

అర్థములు. నఖములన్=గోళ్ళచే, ప్లవగులు=వానరులు, విశిఖములన్ = బాణములచేత, శిత=వాఁడియగు, శిలీముఖములచే=బాణములచే.

తాత్పర్యము

గోళ్ళను వానరులు నొప్పించిరి. బాణములచే రాక్షసులు శత్రువులఁ ద్రుంచిరి. వానరులు చేతులచే రాక్షసుల ముఖములు చింపిరి. వానిని కఱకు బాణములచే రాక్షసులు ఖండించిరి.

కం. అప్పు డకంపన చోదిత, మ ప్పలభుక్సమితి గపుల ♦ నడలఁగఁ జేయన్
గుప్పలు తా ల్గురియించుచుఁ, గప్పిరి వృక్షాటవరులు♦గండడఁగంగన్.

అర్థములు. అకంపన చోదిత=అకంపనునిచేఁ బ్రేరింపఁబడిన, పలభుక్ + సమితి = మాంసము దిను రాక్షసుల సమూహము, అడలఁగన్ = ఏడ్చునట్లు, కుప్పలు = కుప్పలుగా, వృక్షాటవరులు = వానరశ్రేష్ఠులు, గండు = పౌరుషము,

తాత్పర్యము

అప్పు డకంపనుఁడు ప్రేరింపఁగా ఆ రాక్షససమూహము వానరులను దుఃఖింపఁజేయఁగా వానరులు కుప్పలుగా ఱాలు గురియించుచు వారి పౌరుష మడఁగునట్లు కప్పిరి.

కం. చెట్టుల గుట్టల ఱాలం, గొట్టుచుఁ బైకుతికి భ్రాంతి ♦ గొలుపుచు వారల్
పట్టినయాయుధములఁబిగి, పట్టున లాగికొని వారి♦వసుధం గూల్పన్. ౧౧౫౪

అర్థములు. బిగిపట్టున — గట్టిగఁ బట్టుటచే, లాగికొని=గుంజుకొని, వాని చేతనే - వారిన్ = రాక్షసులను.

తాత్పర్యము స్పష్టము.

తే. ఇంతలో వారలకు బాస ♦ టేగుదెంచి, నలుఁడు కుముదుండు
మైందుండు ♦ బలియుఁడైన
ద్వివిదుఁడును వృక్షముల నరి♦వీరసమితిఁ, బీన్గుపెంటలు చేసిరి♦భీమగతిని. ౧౧౫౫

అర్థములు. బాసట = తోడు, అరివీరసమితిన్ = వీరులను శత్రువుల సమూహమును.

తాత్పర్యము స్పష్టము.

—♦ ౫౬-వ సర్గము. అకంపనుఁడు వానరసేనపైఁ గవియుట ♦—

మ. సమదప్రక్రియ వైరియోధులు భుజా♦సంరంభశుంభద్గతిన్
దమవారిన్ వధియించి మించుటయుఁ గ్రో♦ధస్ఫారతామ్రాక్షుఁడై
విమతప్రాణవినాశకారి ధనువున్ ♦ వే త్రిప్పుచున్ దీవ్ర వే
గమునం దోలుము సారథీ! మన శతాం♦గంబున్ బరుల్ బెగ్గిలన్. ౧౧౫౬

అర్థములు. సమదప్రక్రియన్ = గర్వముతోఁ గూడిన విధముగ, భుజా సంరంభ శుంభత్ గతిన్=భుజముల వేగిరపాటుతోఁ బ్రకాశించెడివిధముతో, తమ వారిన్ = రాక్షసులను, సంబంధార్థమున బహువచనము. క్రోధస్ఫారతామ్రాక్షుఁడై = కోపాతిశయముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, విమత = శత్రువుల, ప్రాణవినాశకారి = ప్రాణముల నాశముచేయునది యగు, ధనువున్=వింటిని, శతాంగంబున్ = రథమును.

తాత్పర్యము

గర్వముతోఁ గూడినవిధముగ శత్రుయోధులు భుజబలాటోపముచేఁ దమ వారిని జంపుటచూచి కోపముచేఁ గన్నులెఱ్ఱచేసి శత్రువుల ప్రాణము దీయఁజాలు ధనుస్సును తీవ్రముగాఁ ద్రిప్పుచు సారథీ! యతి వేగముగా మన తేరిని శత్రువులు భయపడునట్లు తోలుము.

ఉ. అల్లదె కీశనాథులను ♦ రాళ్ళ బడల్పడఁ ద్రుంచుచున్నవా
రల్లతలంబుఁ జేరఁ జను ♦ మా యట శైలమహీజసాధనుల్

పెల్లుగ నున్నవారు కపి♦వీరులు యుద్ధము వేచి, వారలం
జిల్లులు వాఱఁ ద్రుంపఁ దమి♦సేసెదఁ జూపఱ గుండె దిగ్గనన్. ౧౧౫౮

అర్థములు. అల్లదె = అదిగో, బడల్పడన్ = బాధ పడునట్లు, అల్ల తలంబు = ఆ ప్రదేశము, శైలమహీజసాధనుల్ = కొండలు చెట్లు ఆయుధములుగాఁగలవారు, చిల్లులు వాఱన్ = బొక్కలు పడునట్లు, తమిసేసెదన్=ఆశ పడెదను, చూపఱ=చూచువారి యొక్క.

తాత్పర్యము

అదిగో, వానరులు రాక్షసులను బాధపడఁ జంపుచున్నారు. అక్కడకు మన తేరు పోనిమ్ము. అచ్చట చెట్లు గుట్టలు నాయుధములుగా గ్రహించి యుద్ధమునకై కాచి వానర వీరులు విశేషించి యున్నవారు. చూచువారు భయపడునట్లు వారి దేహములు తూంట్లుపడఁ జేయఁ గోరిక యగుచున్నది.

చం. అనవుడు సూతుఁ డట్లు తన♦స్యందన ముద్ధతిఁ దోలఁగా నకం
పనుఁడును దీవ్రబాణచయ♦పాతపురస్సరుఁ డౌచు వారిపైఁ
జని సరఘావితానముల ♦ చందమునన్ బరగించి శస్త్రముల్
వనచరపాళి మూర్తముల ♦ లావఱి తూలఁగ నేసి యార్చినన్. ౧౧౫౯

అర్థములు. స్యందనము = తేరు, తీవ్రబాణచయపాత = తీక్ష్ణబాణ సమూహములు పడుటను, పురస్సరుఁడు=ముందుగాఁగలవాఁడు, సరఘావితానములు=తేనెటీఁగల గుంపుల, లావఱి=బలము క్షీణించి.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా సారథి తేరిని త్వరగాఁ దోలఁగా నకంపనుఁడు తనకంటె ముందు తన తీవ్రబాణములు పోవునట్లుగా వారిపైకిఁ బోవుచు తేనెటీఁగల గుంపు ముసురు కొన్నట్లుగ శస్త్రములను వానరులపైఁ బ్రయోగించి వారిబలము నణఁచి యార్చెను.

క. ఆతనికోల్తలకుం గా, కాతతదరమునను వీఁగు♦నగచరవరులన్
వాతాత్మజుండు గని యా,దైతేయున కెదుట నిలిచె ♦ దర్పమెలర్పన్.

అర్థములు. కోల్తలకున్=ఎదుట నిలిచి యుద్ధము సేయుటకు, లేక=శక్తి లేక, ఆతత దరమునను=విస్తార భీతిచే, వీఁగు — వెనుదీయు.

తాత్పర్యము

అతని యెదుట నిలఁబడి యుద్ధము చేయ శక్తిలేక వెనుకకుఁ బోవు వానర శ్రేష్ఠులఁజూచి హనుమంతుఁ డా రాక్షసుని యెదుట గర్వమతిశయింపఁగానిలిచెను. అకంపనుఁడేద్వారమునబయలు దేఱివచ్చినదిముందు చెప్పఁబడలేదు. ౧౧౫౫వపద్యమున నలకుముద మైందద్వివిదులు యుద్ధము చేసినట్లు చెప్పఁబడెను. వీరుతూర్పు గవని నరికట్టినవారు. అయినను నొక ద్వారమున నొక రాక్షసుఁడు బయలుదేరినపుడు

తక్కిన ద్వారములఁ గాచు వానరులకుఁ బనియుండదు. కావున నాయకులగు వా రెచ్చటఁబనిబడిన నచ్చటికిఁ బోవుచుండి రని తోఁచెడిని.

—♦ హనుమంతునిచే నకంపనుఁడు హతుం డగుట ♦—

కం. హనుమంతుని ప్రాపును గని, వనచర యూథాధినాథ ♦ వర్గము మోదం
బునఁ బొదలి బలము గొని క్రందనము లెసఁగ వైరిసేనఁ ♦ దాఁకెంగినుకన్.

అర్థములు. క్రందనములు = సింహనాదములు.

తాత్పర్యము

హనుమంతుఁడు తోడుపడిన కారణమున నాయనను ఆశ్రయించి వానర యూథములందు శ్రేష్ఠు లగువారు సంతోషించి సింహనాదములు చేయుచు వైరుల సేనను నెదిరించెను.

మ. తనముందేలం బవమానసూనుఁడు మహీ ♦ ధ్రప్రక్రియన్ నిచ్చినన్
జనితామర్షకుఁ డయ్యకంపనుఁడు ప ♦ ర్జన్యుండు ధారావళిన్
మునుఁగం జేయుగతిన్ శరావళులచే ♦ ముంచెం దదాసార మే
పున నార్షభ్యము వానపై తోరఁగఁ గొ♦మ్ముల్ వంచుచందంబుగన్.

అర్థములు. మహీధ్రప్రక్రియన్ = కొండవలె—జనితామర్షకుఁడు = కోప ముదయించినవాఁడు - పర్జన్యుఁడు = వర్షాధిదేవత — ధారావళిన్ = వర్షధారల గుంపులచే - శరావళులచే = బాణ సమూహములచే - తత్ + ఆసారము = ఆ వానను - ఆర్షభ్యము = ఆఁబోతు.

తాత్పర్యము

తన యెదుటఁ గొండవలె నిలువఁబడిన హనుమంతునిఁ జూచి కోపించి యకంపనుఁడు వానదేవత జడివాన గురియించునట్లు బాణవర్షమాయనపైఁ గురియఁగా వాన చినుకులు తనపైఁ బడఁగా మదించిన కోడె కొమ్ములు ప్రక్కకు వంచినట్లుగ.

కం. శిర మొక్కయోర వ్రాలిచి, సరకు గొనక వానిచక్కి ♦ సమదగజంబుం
బురిడించుచు నుద్రేకిత, నెరవడి జన రక్కసుండు♦నివ్వెర గొనుచున్. ౧౧౬ ౨

అర్థములు. ఒక్కయోర=ఒకప్రక్కగా, వాని చక్కి=వాఁడున్న చోటికిఁ జక్కఁగా, సమదగజంబున్ = మదపుటేనుఁగును, పురిడించుచున్ = పోలుచు, పురుడు + ఇంచు = ఇత్వంబుగాని యెత్వంబుగాని కాడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వంబగు, సు. వ్యా. క్రియ. ౯౬ సూ. నెరవడిన్ = అధిక వేగముగ, నెరవు + వడి = నెరవడి - యిది యుభయ రేఫములలోఁ జేరినది - నివ్వెర గొనుచున్=భ్రాంతుఁడై.

తాత్పర్యము

తల యొక ప్రక్కఁగా వంచి బాణవర్షము లక్ష్యముసేయక వాఁడుండుచోటికి సరిగా మదపుటేనుఁగువలె మిగుల వేగముతోఁ బోఁగా వాఁడు దిగ్భ్రమగొని.

కం. తొలఁగి చని బాణవర్షము, నిలుపక కురియింప మండు♦నీరజహితునిన్
దలఁపించుచు నా హనుమయుఁ, దలఁగక గర్జించి వానిఁ♦దఱుముకొని చనెన్.

అర్థములు. నీరజహితునిన్=సూర్యుని, తలపించుచున్=స్మృతికి దెచ్చుచు-సరిపోలుచు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. వెంటనె పాఱివచ్చు కపి♦వీరునిపై నసురుండు వేగియై
మంటలు గ్రుమ్మరించు శిత♦మార్గణముల్ పరఁగించి నొంచినన్
గంటున సాధనం బెదియుఁ ♦ గైకొనకుంట దలంచి పాఁతుతో
నంటఁగఁ బీఁకి శైల మొక♦హస్తమునం గొని బొబ్బ వెట్టుచున్. ౧౧౬౪

అర్థములు. శితమార్గణముల్ =వాఁడి బాణములు, కంటున = పగచే.

తాత్పర్యము

తాను దొలఁగి పోయినను దనవెంటనె పరువెత్తి వచ్చుచున్న వానరుని మీఁద నకంపనుఁడు మిగుల వేగము గలవాఁడై మంటలు చిమ్ముచున్న వాఁడి బాణములు ప్రయోగించి పగపూని నొప్పింపఁగా చేత నేదియు సాధనము లేకుండుట యాలోచించి యొక కొండను పాఁతుతోఁ బీఁకి దాని నొకచేతఁదీసికొని సింహనాదము చేయుచు.

కం. గిరగిర ద్రిప్పుచు నముచిన్. స్వరుకరుఁడై మున్ను త్రిదశ♦పతి దరిమిన యా
క్కరణి నకంపనుఁ దఱుమగ, సురవైరియు దాని జూచి♦సూటి మెఱయఁగన్.

అర్థములు. స్వరుకరుఁడై=వజ్రమును జేత ధరించినవాఁడై, త్రిదశపతి = ఇంద్రుఁడు.

తాత్పర్యము స్పష్టము.

చం. కఱకగు నర్ధచంద్ర♦విశిఖంబుల దవ్వననుండియే గిరిం
దుఱుఁ మొనరింపఁ గేసరిత♦నూభవుడుం దనకొండ మింటనే
నఱు మయిపోక గన్గొని ఘ♦నం బగు కినుకను నశ్వకర్ణమున్
బిఱబిఱ వేరుతోఁ బెఱికి♦వేగమ యెత్తి హసించి త్రిప్పుచున్. ౧౧౬౬

అర్థములు. కఱకు = పదును - అర్ధచంద్రవిశిఖంబునన్ = అర్ధచంద్రుని యాకారముగల బాణములచే - దవ్వన = దూరమునందు - తుఱుము=పొడి - నఱుము=చూర్ణము-అశ్వకర్ణము=ఇనుమద్దిచెట్టు-హసించి=నవ్వి.

తాత్పర్యము

పదునైన యర్ధచంద్రబాణములచే దూరముననుండియే యాకొండను బొడి చేయఁగా హనుమంతుఁడు తానెత్తినకొండ యాకాశమందే చూర్ణమైపోవుట చూచి మిగులఁగోపించి యొక్క యినుమద్దిచెట్టును వ్రేళ్ళతోఁ బెఱికి నవ్వుచు దానిని గిరగిర ద్రిప్పుచు.

మ. పదఘాతంబుల భూమి కంపిల భటా • శ్వస్యందనవ్యూహమున్
రది సంఘాతము నుగ్గునూచముగ రౌ • ద్రస్ఫూర్తిఁ దున్మాడుడున్
బెదరెం బాఱెఁ గృతాంతుఁ గన్న పగిదిన్ • విద్వేషిసైన్యంబు దు
ర్మదుఁడై చాపకళాప్రవీణత రహిం • పన్ రాక్షసాధీశుఁడున్.

అర్థములు. పద ఘాతంబులన్ = కాలిదెబ్బలచే-కంపిలన్ = చలింపఁగా-భట-అశ్వ-స్యందన వ్యూహమున్ = భటులయు గుఱ్ఱములయు తేరులయు సమూహమును-రది = ఏనుఁగుల - సంఘాతము = సమూహము - తున్మాడుడున్ = ఖండింపఁగా - కృతాంతున్ = యముని - విద్వేషి సైన్యంబు=వైరుల సేన - దుర్మదుఁడై = చెడ్డ మదము గలవాఁడై, చాపకళాప్రవీణతన్ = ధనుర్విద్యా పాండిత్యముచే.

తాత్పర్యము

కాలి త్రొక్కుడు దెబ్బల చేతనే భూమి చలించుచుండఁగా భటులను గుఱ్ఱములను రథములను ఏనుఁగులను పొడిపొడిగ ఖండింపఁగా, శత్రువుల సేన యమునిఁ జూచినట్లు భయపడి పరువెత్తెను. అప్పుడు దుష్టమగు గర్వముగలవాఁడై యకంపనుఁడు తన విలువిద్యయంగలి నేర్పు ప్రకాశింపఁగా.

ఉ. నాలము ద్రుంచి వైచి శర • జాలవ్రణీకృతదేహుఁ జేసినన్
గాలిసుతుండు నెత్తురులు • గారుశరీరముతో విధూమన
జ్వాలకృశానునట్లు సుమ • సంచయరంజితకింశుకాగముం
బోలి సమగ్రసత్త్వమున • భూరుహ మన్యము పట్టి త్రిప్పుచున్. ౧౧౬౪

అర్థములు. సాలమున్ = చెట్లను, శరజాల వ్రణీకృత దేహున్ = బాణ సమూహములచే వ్రణముగాఁ జేయఁబడిన శరీరము కలవానిఁగా, విధూమ=పొగ లేని, సజ్వాల=శిఖలతోఁ గూడిన, కృశాను నట్లు = అగ్నివలె, సుమసంచయ = పూలగుంపుచే, రంజిత=ఎఱ్ఱనైన, కింశుకాగమున్ = మోదుగుచెట్టును, సమగ్ర సత్త్వమునన్ = పూర్ణబలమున, బలముకొలఁది, భూరుహము=చెట్టు, అన్యము = వేఱొకటి.

తాత్పర్యము

చెట్టును ఖండించి బాణసమూహముచే గాయపడిన దేహము కలవానిఁగాఁ జేయఁగా హనుమంతుఁడు నెత్తురు కాఱు దేహముతో పొగలేని శిఖలు గల యగ్నివలె మండుచుఁ బూలచే నెఱ్ఱనైన మోదుగుచెట్టువలెనై బలము కొలఁది వేఱొకచెట్టు పీకి త్రిప్పుచు.

చ. పరులకు దుర్నిరీక్ష్యుఁ డయి • బాఢరుషాపరిపూర్ణచిత్తుఁడై
కరముల రెంట బిట్టుగ న • కంపను శీర్షము వ్రయ్యమోదినన్
సురపరిపంథి నేలపయి • సోలెను నీల్గెను దక్కురక్కసుల్
ధరణి వణంకినన్ ద్రుమమవి • తానము లట్టులు వ్రాలి నుర్విపై. ౧౧౬౫

అర్థములు. దుర్నిరీక్ష్యుఁడయి = కానరానివాఁడై, బాఢరుషాపరిపూర్ణ చిత్తుఁడై =అధిక కోపముతో నిండిన మనస్సుగలవాఁడై, రెండుచేతులతోఁ గట్టిగ నకంపను తల పగులునట్లు కొట్టఁగా ఆ రాక్షసుఁడు నేలపయి పడి చచ్చెను. తక్కిన రాక్షసులు భూకంపమునందు చెట్లవలె నేలపైఁ బడిరి.

తాత్పర్యము

గమనవేగముచే నితరులకుఁ గానరాక అధికకోపముచే నిండిన మనస్సు గలవాఁడై రెండుచేతుల గట్టిగ నకంపను తల వ్రక్కలగునట్లు కొట్టఁగా నా దేవ విరోధి నేలపయి పడిచచ్చెను. తక్కిన రాక్షసులు భూకంపమునఁ జెట్లు నేలఁబడి నట్లు పడిరి.

సీ. మోదరసావేశ♦మునఁ గపుల్ దఱుమంగ, సంభ్రాంతచిత్తులై♦చావుభీతి
విరిదలల్ దడఁబడు♦చరణంబులకు గల్గి, త్రోద్రోపులుగఁ బడఁ♦ద్రోసికొనుచు
నొండొరులను మీఱి♦యుఱికిరి లంకకు, వెనుప్రక్క మఱిమఱి ♦ కనుచునంత
హరిసమూహంబులు♦హనుమంతు శ్లాఘించె, నిరుపమబలుఁడవు♦నీవ యనుచుఁ
తే. నతఁడు ప్రతివాక్యముల వారి♦నాదరించె,మీరు దోడ్పడ నాకేది♦మేరయనుచుఁ
బ్లవగులును బొంగి యూపిరి♦పట్టునంత,బిగ్గకేకలు వైచిరి♦ప్రియము చెలఁగ.

అర్థములు. మోదరసావేశమునన్ = సంతోషరసముయొక్క యావేశ ముచే, సంభ్రాంత చిత్తులై =మిగుల భ్రమ చెందిన మనస్సు గలవారై.

తాత్పర్యము

సంతోషరసము తమపై నావేశించుటచేఁ గపులు వెంటఁబడి తఱుమఁగా దిక్కు తెలియక మతిచెడినవారై రాక్షసులు తలలు విరియఁబోసికొని కాళ్లు తడఁ బడుచుండ నొకరి నొకరు త్రోసికొనుచు నొకఱిని మీఱి మఱియొకరు వానరులు వచ్చుచున్నారేమో యని భయమునఁ దిరిగి తిరిగి చూచుచు లంకలోనికిఁ బరు వెత్తిరి. అప్పుడు వానరులు హనుమంతుని నీవే యసమానబలుఁడ వని పొగడిరి. ఆయనయు మీరు సహాయులై యుండ నాకేది యసాధ్యమని వారలకు బదులు చెప్పి వారల శ్లాఘించెను. వానరులు సంతోషించి యూపిరిపట్టగూడినంత పట్టి గట్టిగాఁ గేకలు వేసిరి.

కం. కొఱకొఱ ప్రాణంబులతో, గుఱ గుఱ మను గొంతులోని♦గుఱకలతో న
త్తఱి నుండిన రాక్షసులన్, బఱ బఱ వెస నీడ్చి పాఱ♦వైచిరి కీశుల్. ౧౧౬౧

తాత్పర్యము స్పష్టము.

చ. బలియు నకంపనుం దునిమి♦పావని తేజున మీఱె నయ్యెడన్
బలిని నడంచి మించు నల ♦ వామనుభంగిని, రామలక్ష్మణుల్
వలిముఖనేతయున్ దనుజ♦వల్లభుఁడున్ దివిజావళుల్ మహా
బలసుతు మేలివాక్యములఁ ♦ బ్రస్తుతి సల్పె ముదంబు పెంపునన్. ౧౧౬౨

అర్థములు. బలియున్ = బలవంతుని - వలిముఖనేత = సుగ్రీవుఁడు, దనుజవల్లభుఁడు = విభీషణుఁడు-దివిజావళుల్ - మహాబలసుతున్ - వాయుపుత్రుఁడైన హనుమంతుని-సల్పె నను క్రియకు - రామలక్ష్మణులు - వలిముఖనేత - దనుజవల్లభుఁడు, దివిజావళుల్-అనునవి కర్తృపదములు- ఇందుఁగడపటిది - క్రియకు సమీపమం దుండునది దివిజావళుల్ - అను నమహదర్థకపదము గావున దానికి ననుసరించి క్రియసల్పెనని ప్రయోగింపఁబడెను. "కర్తలనేకంబు లున్నచోఁ గ్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబులగు" - సు. వ్యా. వాక్య. ౩౮.

తాత్పర్యము

బలవంతుఁడై యకంపనుఁ జంపి హనుమంతుఁడు బలిని నణఁగఁద్రొక్కిన త్రివిక్రమువలెఁ బ్రకాశించెను హనుమంతుఁడు చేసిన మహాకార్యమును రామలక్ష్మణులు సుగ్రీవవిభీషణులు దేవతలు మెచ్చిరి.

—♦ ౫౮-వ సర్గము. రావణుఁడు ప్రహస్తుని యుద్ధమునకుఁ బొమ్మనుట ♦—

సీ. అనిలో నకంపనుం ♦ డంతకాతిథి యయి, చనుట దశాస్యుండు♦విని యొకింత
దీనుఁడై మంత్రివి♦తానంబుతో మంత,నం బుండి యించుక ♦ నాఁటియుదయ
కాలఁబునం బురిఁ ♦ గలయంగ నలువంక, యరిగి సేనలచొప్పు♦నరసి చూచి
కాపు లెస్సైన యుంట♦కన్గొని కపిసేన, చుట్టు ముట్టడిగొన్న♦ పట్టెఱింగి
తే. మన్యుపరిదగ్ధచిత్తుఁ డై ♦ జన్యనిపుణు, నంతికస్థుఁ బ్రహస్తుని♦నతఁడు పలుకుఁ
గోట ముట్టడి డింపించు♦ బాట యొండు,కలను దక్కఁగ వేఱొండు♦గానరాదు.

అర్థములు. అనిలోన్ = యుద్ధమందు, అంతక + అతిథి = యమునికతిథియయి=చచ్చి, దీనుఁడై = వ్యసన పడినవాఁడై, వితానంబుతోన్ = సమూహముతో, మంతనంబుండి=ఆలోచించి, నలువంక = నాలుగు ప్రక్కల, అచ్చద్విగువు, ఏకవచనము, మన్యు=కోపముచే, పరిదగ్ధ చిత్తుఁడై = మిగుల దహింపఁబడిన మనస్సు గలవాఁడై, జన్యనిపుణున్=యుద్ధమందు నేర్పరిని, అంతికస్థున్ = సమీపమందున్న వానిని, కలను = యుద్ధము, నాఁటి యుదయకాలము = అకంపనుఁడు యుద్ధమునకుఁ బోయిన నాఁటి యుదయకాలము, అకంపనుని యుద్ధము పగటి యుద్ధము, రెండవ దినము నుదయమునఁ గాపు సరిగానున్నదో లేదో యని నాలుగు ప్రక్కలు రావణుఁడు పరీక్షించెను. ఇట్లు చేయుచుండ నకంపనుఁడు చచ్చిన వార్త వచ్చెను. అప్పుడు సమీపమందున్న ప్రహస్తునితో నిట్లు చెప్పెను.

తాత్పర్యము

యుద్ధమం దకంపనుఁడు చచ్చినవార్త రావణుఁడు విని కొంచెము వ్యసనగ్రస్తుఁడై మంత్రులతోఁ గొంచె మాలోచించి యానాఁటి యుదయమందు పట్టనమంతయు నాలుగు ప్రక్కలఁబోయి పరీక్షించి కాపు చక్కఁగా నున్నదని చూచి

కపిసేన నగరమును ముట్టడించి యున్న విధము తెలిసికొని కోపముచే దహింపఁబడు చున్న మనస్సు గలవాఁడై యుద్ధమందు సమర్థుఁడును, తన సమీపమందున్న వాఁడును నగు ప్రహస్తుని జూచి యిట్లనియె. ప్రహస్తా! యీకోట ముట్టడి వదలింప వలయు నన్న యుద్ధము తప్ప వేఱొక యుపాయము కానరాదు.

సీ. ఈ మహాభారంబు ♦ నే నొండె నసుజుండు, కుంభకర్ణుండు ని ♦ కుంభుఁ డొండె
సేనాని వగు యోధ ♦ శేఖర! నీ వొండె, నింద్రజితుం డొండె ♦ నింతగాక
యేవారు చతురులు ♦ మోవఁగఁ జెప్పుమా, దాన నీ వలసిన ♦ దానవాళిఁ
గొని యని కేగుము ♦ క్రోఁతులు నీ ధాటి, విన్నంత వెఱగొని ♦ విచ్చువారు

తే. బెదరుగొడ్డులు నవినీతు ♦ లదరుగుండె, వారు కీశులు నీ మహా♦ర్భటుల విన్న
సైచువారలె? సింహగ♦ర్జనము విన్న, వారణము లట్టు లూడనిఁ♦బాడువారు.

అర్థములు. చతురులు = నేర్పరులు, మోవఁగా = భరింపఁగా, అవినీతులు = నీతిమాలినవారు, అదరుగుండెవారు = పిఱికివాండ్రు, ఊడనిఁబాడు వారు = పరుగెత్తువారు.

తాత్పర్యము

యుద్ధముచేసి జయించి వానరులఁ దఱుమఁగొట్టినఁగాని ముట్టడి పోదనుట నిజమే. ఇంత కార్యము చేయఁగలవా రెవ రనెదవా? ఇంతటి కార్యభారము నేనో నా తమ్ముఁడు కుంభకర్ణుఁడో వాని కొడుకు నికుంభుఁడో సేనానాయకుఁడవగు నీవో నా కొడుకు ఇంద్రజిత్తో యింతగాక మఱి యెవరు నీభారము మోవ సమర్థులు లేరు. కావున నీవు కావలసినంత సేన దీసికొని యుద్ధమునకుఁ బొమ్ము, నీవు వచ్చుచున్నావని విన్నంత మాత్రముచేతనే వానరులు పరువెత్తిపోదురు. నీవు యుద్ధము చేయవలసినపనికూడ నుండదు. ఏలన వానరులు బెదరుగొడ్డులు. నీతి తెలియనివారు. నీపేరు విన్న వారికి గుండె లదరును. పిఱికివారు వారా, నీ కంఠ ధ్వని విని సహింపఁగలవారు? సింహగర్జనము విన్న యేనుఁగులవలెఁ బరువెత్తిపోదురు. ఇవి యిచ్చకాలమాటలో, మాధ్యమో.

తే. సేన లేకున్న నేమొకో♦చేయువారు, రామసౌమిత్రు లెడలంగ ♦ రాజసంబు
దిక్కుగానక వడిచెడి♦దీను లగుచు, నీకు లోపడువారలు♦నిశ్చయముగ.

అర్థములు. రాజసంబు వెడలంగ = ప్రభుత్వము తొలఁగిపోఁగా, భటులుండిన ప్రభుత్వము, వారు పోయిన నదియును బోవును.

తాత్పర్యము స్పష్టము.

చ. మరణము గల్గ నిక్కముగ♦మందిరమం దిపు డూరకుండినన్,
మరణము సందియంబు రణ ♦ మండలి గెల్తుమొ యేమొ కొంతయేన్
దొరకొనినన్ శుభంబె కద ♦ దోర్బలధుర్య! హితంబుఁ బల్కుమీ
మరణము వీట మేలొ రణ ♦ మండలమందున మేలొ యోధకున్? ౧౧౭౬

అర్థములు. దొరకొనినన్=లభించినను- వీటన్ = ఇంట - యోధకున్ = యుద్ధశూరునకు.

తాత్పర్యము

యుద్ధములో మనమే జయింతుమని యెట్లు నిశ్చయింప వచ్చు నందువా గెలుపు రాకున్న మరణము వచ్చునుగదా! ఆ మరణము నీవింట నుండిన నేమి గాకున్న నింకఁ గొన్నినాళ్ళకైన వచ్చును గాని రాకపోదు. లేదా శత్రువులు పైపడివచ్చి గొంతు పిసికి చంపినను జంపుదురు. యుద్ధమునకుఁ బోయితిమా మరణము సందేహము. మనమే గెలుతుమో యేమో? గెలుపు నిశ్చయము కానపుడు ఓటమి నిశ్చయము కాదు కదా, కొంత గెలుపు వచ్చినను మేలే కదా, ఓయి బలవంతుఁడా! హితము చెప్పుము. యుద్ధశూరునకు నింట రోగముతోఁ జచ్చుటమేలా? యుద్ధమందుఁ జచ్చుట మేలా?

'యత్రాయుద్ధే ధ్రువో మృత్యు, ర్యుద్ధే జీవితసంశయః
తమేవ కాలం యుద్ధస్య, ప్రవదంతి మనీషిణః ॥

'ఎప్పుడు యుద్ధము చేయకున్నను జావు నిజమో యుద్ధము చేసిన సందేహమో యదియే యుద్ధమునకుఁ దగిన కాలమని బుద్ధిమంతులు చెప్పుదురు' అను వాక్యము స్మరింపనగు.

చ. అనవుడు వాహినీపతి దశాస్యునితో నసురేంద్రు శుక్రున
ట్లను నిదియెల్లఁ బూర్వమె సమగ్రులు మంత్రులు నేను యోజనం
బొనరిచినార, మేకమతముం గొనకుండుట యెల్లవారమున్
బని చెడియెన్ వివాదమునఁ బల్కెద నా మత మాలకింపుమీ. ౧౧౭

అర్థములు. ఏకమతము=ఒక్క యభిప్రాయము.

తాత్పర్యము

ముట్టడించుటకు యుద్ధము తప్ప వేఱుపాయము లేదని రావణుఁ డన్న మాటకుఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు. ఈ ప్రకారము రావణాసురుఁడు చెప్పఁగా అసురరాజుతో శుక్రుఁడు చెప్పినట్లు ప్రహస్తుఁ డిట్లనియె. రాజా! యీ విషయము నేను, మంత్రులు, ముందే యాలోచించినారము. మాలో మాకు వాదముతోఁ బని చెడెను గాని యేకాభిప్రాయమునకు వచ్చినవారముగాము. దానివలన నీకు నేను జెప్పలేదు. నేనొకఁడు చెప్పియుండిన విభీషణుగతియే నాకుఁ బ్రాప్తించియుండును గదా! నా యభిప్రాయము చెప్పెద వినుము.

కం. శ్రేయము జానకి నిచ్చుట, చేయవ పో యట్లు రణముఁ జేయుట శుభ మం
చీ యనువున నేఁ జెప్పిన, వైయర్థ్యము గలిగె భేదవాదముచేతన్. ౧౧౮

అర్థములు. వైయర్థ్యము = నిష్ప్రయోజకత్వము, వ్యర్థత, భేదవాదము చేతన్=తలకొక యభిప్రాయ మిచ్చుటచే.

తాత్పర్యము

సీతను మరల నిచ్చుట శ్రేయస్కరము. మన మందఱము గలసి యామాట నీకుఁ జెప్పుదము. అది నీవు వినకపోయిన యుద్ధము చేయుదము, అని నేను మంత్రులతోఁ జెప్పితిని. తక్కినవా రట్లు చెప్పఁగూడదు, యుద్ధమే శ్రేయస్కర మని చెప్పవలయునని వాదించిరి.

యుద్ధమే కూడదు, అందఱము కలసి నిన్ను బలవంతపెట్టియైన సీత నిచ్చు నట్లు చేయవలయునని వాదించినవాఁడు విభీషణుఁడు-సీతనిచ్చుట శ్రేయస్కరమే. అది నీకు రుచింపదేని యుద్ధము పర్యాయముగా నంగీకరింతు మనువారు మఱి కొందఱు తక్కినవారు సంధిమాట చెప్పనేరాదు, యుద్ధమే చేయవలయునని వాదించిరి. ఈవిధముగ నాయాలోచన వ్యర్థమైపోయెను. ఫలమనుభవమునకువచ్చెను.

చ. అది యటులుండనిమ్ము వివిధార్థములన్ బహుమానవాక్యలన్
ముదమున దన్పి వెల్లపుడ నూనగతిన్ నను సత్కరించి తీ
వద నిది నాకు నీ ఋణము నంతయు దీర్పగ నిట్టివేళ నే
బ్రదుకగ గోరి డాగుదునె పార్థివ! యంతటితీపె ప్రాణముల్ ? ౧౧౭౯

అర్థములు. ఇట్లు చెప్పుటచేఁ దనకు యుద్ధమునకుఁ బోవ నిష్టము లేదని రావణుఁ డభిప్రాయపడునని తలఁచి దానికిఁ బరిహారము చెప్పుచున్నాఁడు. అది= జరిగిపోయిన ముచ్చటలు, వివిధార్థములన్=అనేక విధములైన పదార్థములచేతను, ధనములచేతను; బహుమానవాక్యలన్ = గౌరవముతోడి మాటలచేతను తన్పి= తృప్తిపొందించి - అనూనగతిన్=కొఱతలేకుండ-సత్కరించితివి = గౌరవించితివి- అదను = సమయము.

తాత్పర్యము

రాజా ! జరిగిపోయిన ముచ్చటలిపుడేల ? అది యటులుండనీ, అది యిపుడు విచారింపవలసిన సమయముగాదు. ఇప్పుడు నేనది చెప్పిన నాప్రాణమునకు వెఱచి చెప్పుచున్నానని తలంతువు. నా యభిప్రాయ మదికాదు. నీవు నాకుఁ గావలసిన పదార్థములు ధనములు నిచ్చితివి. సగౌరవ వాక్యలచేత నన్నుఁ దృప్తునిఁ జేసితివి. నన్నెన్నోవిధముల బహూకరించితివి. ఇదంతయు నీవుచేయుట నేను నీ కక్కఱవేళ నుపయోగపడుదుననియే కదా. అట్టి నీ ఋణమును నేను దీర్చుకొనుట కిది సమ యము. ఇది తప్పఁగొట్టితి నేని నీ ఋణము నే నెట్లు తీర్చుకొనఁగలను ? కావున బ్రతుకుమీఁది యాశచేత నేనీ సమయమున దాఁగికొందునా ? ప్రాణములంత తీపా ? కావున నేనట్లు చేయను.

కం. పుత్రకమిత్ర కళత్ర, క్షేత్ర ధనావళుల నాస చేయను నీకై
గాత్రము రణసవమున నే,మాత్రము పిఱుసనక వేల్తు మదినమ్ము పతీ. ౧౧౮౦

అర్థములు. గాత్రమున్ = దేహమును, రణసవమునన్ = యుద్ధ మను యజ్ఞమున, పిఱుసనక=వెనుకకుఁబోక, వేల్తున్=హోమము చేయుదును.

తా త్ప ర్య ము

నా కొడుకులు, మిత్రులు, భార్యలు, భూములు, ధనములు వీనిని రక్షించు నిమిత్తమై నిన్ను విడువవలయునా? నీనిమిత్తమై వారి నెల్ల విడువవలయునా? యను ప్రశ్న వచ్చినపుడు నీ నిమిత్తమై వారి నందఱ విడుతును గాని వారి నిమిత్తమై నిన్ను విడువను. యుద్ధ యజ్ఞమునందు నా దేహమును కొంచెమైన వెనుదీయక హోమము సేయుదును. నా మాట నమ్ముము.

ఇచ్చట నొక ధర్మ సందేహము.

ప్రహస్తుఁడు "నీ ధనము నేను దినియున్నాను గనుక నీకై ప్రాణమిచ్చి నీ ఋణము తీర్చుకొనెదనని చెప్పెను. భారతయుద్ధమందు దుర్యోధనుఁడు భీష్మ ద్రోణులను దన పక్షమున యుద్ధమునకు రమ్మని కోరినపుడు ''మహారాజా! జను లందఱు ధనదాసులు. ధనమెవ్వరికి దాసిగాదు. నీ ధనము మేము దినియున్నాము, గనుక నీకు మేము కట్టుపడి యున్నాము. నీ పక్షమున యుద్ధము చేసెద'' మని చెప్పిరి. అట్లే చేసిరి. కాని తా మధర్మపక్షమున యుద్ధము చేయుచున్నామని వారెఱుఁగుదురు. యుద్ధకాలమందుఁ బ్రతిదినము ధర్మరాజునకు జయము కలుగును గాక యని ధ్యానించియే యుద్ధమునకుఁ బోవుచుండిరి......ప్రహస్తుఁడో రావణుఁ డధర్మమం దున్నవాఁడని తెలిసియు నా విచారము పెట్టుకొనక "వాని ధర్మా ధర్మవిచారము నాకేల? అతఁడు పోషించిన దేహము అతనికిఁ బలిపడినపుడు అతని నిమిత్తమై వినియోగపెట్టుట యతని సేవకుఁడనైన నాకు ధర్మ మని తలఁచి తన ధర్మమును దాను నిర్వహించెను. రాజు చేయు పాపకార్యములకుఁ బ్రజలు సేవకు లుత్తరవాదులు కారు. ఆ పాపము వారి నంటదు. ఇటు చూచిన భీష్మ ద్రోణుల కంటెఁ బ్రహస్తుఁడే యుత్తముఁడని చెప్పవలసియున్నది. అయినను భీష్మ ద్రోణు లధర్మవర్తనులన వలనుపడదు. ప్రభువుల ధనముచే సేవకులు దేహములఁ బోషింతురే కాని యాత్మలఁ బోషింపరు. కావున సేవకుల దేహములు ప్రభువుల సొత్తుగాని యాత్మలుగావు. తమ యాత్మలను దాము ధర్మమార్గమున నుంచుట స్వామి ద్రోహము కాఁజాలదు. ఎవఁడైనను 'ధర్మోజయతు' అనవలయునే కాని 'అధర్మో జయతు'అనరాదు. అట్లనేనేని యాత్మహాని కలిగించుకొనిన వాఁడగును కావున భీష్మ ద్రోణులు దేహములు చేయఁదగిన కార్యములు దుర్యోధను పక్షమునఁ జేసిరి. ఆత్మలను ధర్మమందే నిలిపిరి. తన కొడుకధర్మమందున్నాఁడని తెలిసియు గాంధారి 'ధర్మోజయతి' యనియెకదా, జయము కలుగ నాశీర్వదింపుమని కోరిన దుర్యోధనుని దీవించెను. కావున భీష్మద్రోణులు చేసినది తప్పుగాదు. 'నాత్మాన మవసాదయే' త్తని కదా భగవద్గీత చెప్పుచున్నది.

అట్లైనచో విభీషణుని చర్య దుష్టమేకదా. విభీషణునకు స్వార్జితములేదు పిత్రార్జితములేదు. సర్వము రావణార్జితమే. రావణదత్తధనమే. కావున భీష్మ ద్రోణులవలె నేల విభీషణుఁడు ప్రవర్తింపరాదు. సమయమున ముఖముఁ దప్పించుటే కాక శత్రువులలోఁ జేరికొనుటచే ద్రోహి యగును గదా! యను సందేహము రాకమానదు, విభీషణ విషయమై యట్లు సందేహింపఁ గారణము లేదు. భీష్మ ద్రోణులు ధర్మాత్ములే యైనను రజోగుణభూయిష్ఠులనుట వారి చర్యవలననే స్పష్టము. శ్రీకృష్ణుఁడు భగవదవతారమూర్తియని యెఱిఁగియు నాయన నేను యుద్ధమున నాయుధము పట్టనని చెప్పిన వెంటనే నే నాయనచే నాయుధము పట్టించెదనని భీష్ముఁడు ప్రతిజ్ఞ చేసెను. పూలచేఁ బూజింప వలసిన భగవంతుని బాణములచే నొప్పించెను. తన్నుఁ జంపుటకై చక్రముపూని వచ్చినపుడు ఆయుధము విడువక యే రారమ్మని పిలిచెను. ఇవి సాత్త్వికభక్తుని లక్షణములుగావు. విభీషణుఁడో రాక్షస జాతి యందుఁ బుట్టినను జన్మప్రభృతి సాత్త్వికుఁడు, ధర్మనిష్ఠుఁడు. సీతాదేవిని దెచ్చిన గడియనుండి భీ నీవు వెడలి పొమ్మని రావణుఁ డనువఱకు నయభయముల నెంతెంత చెప్పవలయునో యంతంత చెప్పెను. వ్యర్థమయ్యెను. 'గురోరప్యవలిప్తస్య కార్యాకార్య మజానతః। ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్' గురువైనను గర్వించి తెలిసి కాని, తెలియక కాని యకార్యము చేసెనేని వానిని దండింప వలయును. లేదా వదలిపెట్టి పోవలయు నను ధర్మశాస్త్రవాక్యము ననుసరించి వదలిపెట్టి పోయెను. సామాన్య ధర్మమునకు విశేషధర్మమునకు విరోధము వచ్చినపుడు విశేషధర్మము గ్రాహ్య మగును గాని సామాన్యధర్మము గ్రాహ్యము గాదు. తన యెదుట స్త్రీమానము దీయుచుండఁ జూచి సహించిన భీష్ముని కంటె, భగవత్పక్షమునకు విరుద్ధ పక్షమున నిలిచి దుష్టులకు సాహాయ్యము చేయఁ బూనిన భీష్మునికంటె విభీషణుఁడే శ్రేష్ఠుఁడు. శత్రుభావమున రావణుఁడు వెడలి పొమ్మనుటచే విభీషణుఁడుపోయెను. భీష్మ ద్రోణుల కట్టి సందర్భములు లేవు.

ఒక విధమునఁ జూచిన దుర్యోధనుని ధనము తాను దినుచున్నానని భీష్ముఁడు చెప్పినది సరియైనది కాదు. ఆచర్చ యిందనావశ్యకము. ఆ ధర్మ మనుసరించినచో విదురుఁడు ద్రోహియేకదా యగును. 'నజాతు కామాన్నభయాన్నలోభాత్। ధర్మం త్యజే జ్జీవితస్యాపి హేతోః॥' అని యేకారణముచేనైన ధర్మపక్షము వదలరాదు.

—• ప్రహస్తుఁడు యుద్ధమునకు వెడలుట. •—

తే. అనుచు సేనాని నిజబలా•ధ్యక్షుతోడఁ, జటుల సైన్యంబుఁ గొనిరమ్ము•క్షణము లోన
మచ్చి తాశుగవినిహత•మర్కటాళి, మాంసముల మెక్కు మాంసాద•మండలంబు.

అర్థములు. సేనాని=సేనానాయకుఁడైన ప్రహస్తుఁడు సర్వ సేనానాయకుఁడు. సేనానాయకుని కంటెఁ గ్రింది నాయకులు బలాధ్యక్షులు, సేనానాయకుఁ

డొకఁడే యుండును, బలాధ్యక్షు లనేకు లుందురు. చటులసైన్యంబు యుద్ధమునకై త్వరపడుచున్న సేనను, మత్ =నాయొక్క, శితాశుగ = వాఁడి బాణముల, విని హత=చంపఁబడిన, మర్కటాళిమాంసములన్=వానరుల గుంపుల మాంసమును, మెక్కన్=తినును, మాంసాద=మాంసమును దిను తోడేళ్ళు నక్కలు లోనైనవి, మండలము = సమూహము.

తాత్పర్యము

ఈ ప్రకారము రావణునకుఁజెప్పి సర్వసేనానాయకుఁడైన ప్రహస్తుఁడు తన బలాధ్యక్షునిఁజూచి క్షణములో యుద్ధమునకై సిద్ధపడియున్న సేనను దీసికొనిరమ్ము. నా బాణములచేఁ జచ్చినవానరుల మాంసము గృధ్రాదులు తినునుగాక.

తే. అబ్బలాధ్యక్షుఁ డెల్ల నా♦యత్తపఱుపఁ, దిగ్మనానావిధాయుధ♦దీప్త మసుర
బలమతంగజసైంధవా♦కులము నయ్యె,లంకయంతయుఁ బ్రదుటిలో భ♦యంకరముగ.

అర్థములు. ఎల్లన్ = సర్వము - ఆయత్తపఱుపన్ = సిద్ధముచేయఁగా - తిగ్మ = తీక్ష్ణములైన — నానావిధాయుధదీప్తము = అనేక విధాయుధములచేఁ బ్రకాశించునది- మతంగజ = ఏనుఁగులు—సైంధవ = గుఱ్ఱములు - వీనిచే - ఆకులము = కలఁత చెందినది.

తాత్పర్యము

ఆ బలాధ్యక్షుఁడు సేన నంతయు సిద్ధము సేయఁగా తీక్ష్ణములై యనేకవిధములైన యాయుధములచేఁ బ్రకాశించు రాక్షస భటులచేతను నేనుఁగులచేతను గుఱ్ఱములచేతను లంక యాకులమయ్యెను.

తే. జాతవేదుని వేల్చిన♦నేతిపొగల, వాసనలచేత బ్రాహ్మణ♦వరుల నర్చ
చేసియర్పించుసుమముల♦శ్రీసుగంధ,ములఘుమాయించెనగరంబు♦మూలమూల.

అర్థములు. జాతవేదుని=అగ్నిని, వేల్చిన=హోమము చేసిన.

తాత్పర్యము

యుద్ధమున జయముఁగోరి యగ్నులయందు నేయి హోమము చేయఁగాఁ బుట్టిన పొగవాసనల చేతను బ్రాహ్మణులఁ బూజించు పూలవాసనల చేతను, చందనముల చేతను లంక మూల మూల ఘుమఘుమ వాసన గొట్టుచుండెను.

కం. హారంబుల బలువివిధా,కారంబుల, మంత్రితముల♦గలహోద్యమహ
ర్షారంభులు మేను లలం,కారంబులు చేసికొనిరి♦క్రవ్యాదవరుల్. ౧౧౮౮

అర్థములు. హారంబుల = ముత్యాల సరముల చేతను, మంత్రితములన్= మంత్రింపఁబడిన వానిని, కలహోద్యమ=యుద్ధప్రయత్నమందు, హర్షారంభులు = సంతోష ప్రయత్నములు గలవారు, క్రవ్యాదవరుల్ = రాక్షసశ్రేష్ఠులు, క్రవ్యాదులు=మాంసము దిను వారు.

తా త్ప ర్య ము

మంత్రింపఁబడిన పలువిధములైన హారములచే సంతోషముతో యుద్ధప్రయత్నము చేయు రాక్షసవరులు తమ్మలంకరించుకొనిరి.

కం. మై మఱుపు దొడిగి కేలను, భామానిత కార్ముకములు•పట్టి నిజంబా
హామిక దశకంఠుఁడు గన, నామోదముతోడ వచ్చి•రసురవరేణ్యుల్. ౧౧౮౫

అర్థములు. మైమఱుపు = కవచము, భా = కాంతిచే, మానిత = గౌరవింపఁబడిన, కార్ముకములు=విండ్లు, హామికన్ =అహంకారముచే.

తా త్ప ర్య ము

కవచములు తొడిగికొని కాంతులు గల విండ్లను జేతులఁ బట్టుకొని, నిజమైన యహంకారము గల రాక్షసులు రావణుఁడు చూచుచుండఁగా వచ్చిరి.

సీ. సకలాస్త్రశస్త్రసం•చయసంయుతంబును, బటుతరాజానేయ•వాహితంబు
రణకళాకుశలసా•రథిచోదితంబును, నిష్ఠురజలధర•నిస్వనంబు
ప్రత్యక్షశీతాంశు•రవిభాసురంబును, హాటకజాల స•మంచితంబు
భయదదర్వీకర•ధ్వజదుర్ధరంబును, సురథగుప్తిరథాంగ•శోభితంబు
తే. నన్యవస్త్వపహాసి ప్ర•భాధికంబు, నైన రథ మెక్కి-రావణు•నాజ్ఞఁ బూని
శంఖముంముభినిర్ఘోష•సంకులంబు, నైన సైన్యంబుతోడ సే•నాని వెడలె.

అర్థములు. సంచయ = సమూహముచే, సంయుతము = కూడినది, పటుతర = మిగుల బలము గల, ఆజానేయ = ఉత్తమ గుఱ్ఱములు, వాహితంబు = మోయునది, రణకళాకుశల=యుద్ధవిద్యయందు నేర్పుగల, సారథి చోదితంబును= సారథిచేఁ దోలఁబడునదియు, నిష్ఠుర జలధర నిస్వనంబు = కఠినమైన మేఘధ్వని గలది, ప్రత్యక్షశీతాంశురవిభాసురంబును = కంటి కెదుట నున్న సూర్యచంద్రులవలెఁ బ్రకాశించునదియు, హాటకజాలసమంచితంబు = బంగారు కిటికీల సమూహముచేఁ బ్రకాశించునది, భయద = భయముకలిగించు, దర్వీకర ధ్వజ దుర్ధరంబును=పాము యొక్క ఆకారము వ్రాయఁబడిన ధ్వజమెత్తఁబడినదియు, సురథగుప్తి రథాంగ శోభితంబు = (౧) రథగుప్తి = ఉళవాయి యనెడి చక్రములోని గొట్టము;(౨)రథ రక్షణార్థమైమీఁద వేసిన మంచికప్పు,దీనిచేతను,రథాంగ= చక్రముచేతను, శోభితము = ప్రకాశించునది, అన్యవస్తు + అపహాసి + ప్రభాధికంబు=తేజోవంతములైన యితరవస్తువుల నవ్వుకాంతియొక్క యతిశయము గలది.

తా త్ప ర్య ము

అన్ని విధములైన శస్త్రములు అస్త్రములతోఁ గూడినదియు మంచి యుత్తమాశ్వములు కట్టఁబడినదియు, యుద్ధమందు నేర్పుగల సారథిచేఁ దోలఁబడునదియు, కఠోరమైన మేఘధ్వని గలదియు సూర్యచంద్రులవలెఁ బ్రకాశించునదియు,బంగారు కిటికీలచేఁ బ్రకాశించునదియు, పాము పడగ యెత్తఁబడినదియు రథగుప్తి

చేతను మంచి చక్రముల చేతను శోభిల్లునదియు తన కాంతిచే నితర వస్తువుల నపహసించునదియు నగు రథమును రావణుని యాజ్ఞప్రకార మెక్కి- శంఖములు, భేరులు మ్రోఁగుచుండ ప్రహస్తుఁడు యుద్ధమునకు బయలుదేఱెను.

కం. నిర్జరహృద్భేదకముగఁ, బర్జన్యనదోపమాన•బహుళరవముతో
గర్జిల్లుచు భుజశౌర్యా, వర్జితపరిపంథి యాహ•వస్పృహఁ జనియెన్. ౧౧౮౭

అర్థములు. నిర్జరహృత్ + భేదకముగన్ = దేవతల గుండెలు పగులునట్లు, పర్జన్యనదోపమాన = మేఘధ్వనివంటి బహుళరవమును, శంఖ భేరీకాహళ రవములతో, గర్జిల్లుచున్ = సింహనాదము చేయుచు, భుజశౌర్య = బాహుబలముచే, ఆవర్జిత = లోపఱుచుకొనఁబడిన, పరిపంథి = శత్రువులు గలవాఁడు, ఆహవస్పృహన్ = యుద్ధకాంక్షచే.

తా త్ప ర్య ము

భుజబలముచే వశపఱుచుకొనఁబడిన శత్రువులు గల ప్రహస్తుఁడు దేవతల గుండెలు పగులునట్లు మేఘధ్వనివంటి వాద్యధ్వనితో సింహనాదములు చేయుచు యుద్ధమందలి కోరికతో బయలు వెడలెను.

—• ప్రహస్తున కపశకునంబు లగపడుట •—

సీ. ఘోరస్వరముల ది•కూ్కటముల్ వ్రయ్యంగ, భీమరూపులు మహా•భీమతనులు
మున్నుగా నడువ స•మున్నతుండు నరాంత,కుండు మహానాద•కుంభహనులు
సచివులీ నల్వురు•స్వపరివారములతో, బలసి రాఁ జనెఁ దూర్పు•ద్వారమునను
వాని ప్రయాణర•వంబు సేనాక్ష్వేళ,లును లంకలో నున్న • దనుజతతికి
ఆ. గుండె లగలఁ జేసెఁ • గూపెట్టె సర్వభూ,తము లమేఘదివిఁ బ్ర•దక్షిణముగ
రథముఁ జుట్టె పక్షి • రాజులు తిరుగాడె, నదరు లుమిసె వఱదు•లతని కెలన.

అర్థములు. ఘోరస్వరములన్ = భయంకర ధ్వనులచే, దికూ్కటముల్ = దిక్ప్రదేశములు, వ్రయ్యగన్ = పగులఁగా, భీమతనులు = భయంకర దేహములు గలవారు, బలసి = చుట్టుకొని, సేనాక్ష్వేళలు = సేనలవారి సింహనాదములు, అమేఘదివి = మబ్బులేని యాకాశము, అదరులు = నిప్పుల మంటలు, వఱదులు = నక్కలు, కెలన = ప్రక్కన.

తా త్ప ర్య ము

భయంకరములైన వేషములు భయంకరములైన దేహములు గల రాక్షసులు దిక్కులు పగులునట్లు క్రూరముగ ధ్వనించుచు ముందు నడువఁగా సమున్నతుండు, నరాంతకుఁడు, మహానాదుఁడు, కుంభహనుఁడు నను నలువురు మంత్రులు తమ పరివారములతోఁ జుట్టుకొని రాఁగా తూర్పుద్వారమున బయలు వెడలెను. వాని ప్రయాణధ్వనులు సింహనాదములు లంకలో నుండు రాక్షసులకు గుండెలు పగులఁ జేసెను. భూతము లన్నియు ఘోషించెను. మేఘములు లేని యాకాశమందు పక్షులు

రథముచుట్టు తిరిగెను. (మేఘము లావరించినప్పుడు తిరుగుపక్షులు మేఘములు లేకున్నను దిరుగుట యవలక్షణము) నక్క లతని ప్రక్కనే మంటలు గ్రక్కెను.

చ. పరుషముగాఁ బ్రభంజనుఁడు♦వారక వీచె గ్రహాళు లెల్ల నం
బరమునఁ బోరఁగా దొడఁగె ♦ వ్రాలె మహోల్కలు మేఘవారముల్
ఖరతరరావముల్ నినిచె ♦ గ్రద్ద ధ్వజంబున దక్షిణాస్యమై
యిరుదెస గీఱుకొంచు హరి♦యించె నమస్తము వాని తేజమున్. ౧౧౪౯

అర్థములు. ప్రభంజనుఁడు = వాయువు, వారక = విడువక, మహోల్కలు = పెద్ద కొఱవులు; ఖరతరరావముల్ = మిగులఁ గఠినములైన ధ్వనులు, దక్షిణాస్యమై = దక్షిణముఖమై, ఇరుదెస = రెండుప్రక్కలను.

తాత్పర్యము

హోరుమని యెదురుగాలి విడువక వీచెను, ఆకాశమున గ్రహములు కలహించెను. కొఱవులు రాలెను. మేఘములు కఠినధ్వనులు నించెను. దక్షిణముగ గ్రద్ద వాని ధ్వజముపై వ్రాలి రెండు ప్రక్కల గీఱుకొనుచు వాని తేజము నెల్ల హరించెను.

తే. జాతిపడెఁ జేతిసెలగోల ♦ సారథికిని
జాఁపకట్టుగఁ బడియెను ♦ సైంధవములు
సమతలమునందు వసుదుర్ల ♦ భము స్వతేజ
మపుడు త్రుటిలోన నమసెఁ బ్ర♦హస్తునకును. ౧౧౫౦

అర్థములు. సెలగోల = కొఱడా, చాఁపకట్టుగ = నేలతో సమముగ, వసుదుర్లభము = అష్టవసువులకు లభింపనిది.

తాత్పర్యము

సారథి చేతఁబట్టుకొనియున్న కొఱడా యూరకయే జాఱి క్రిందఁ బడెను. గుఱ్ఱములు చాఁప పఱచినట్లు నేలతో సమముగ మిట్టపల్లములు లేని చదరపు నేలయందు బడెను. వసువులకును లేని ప్రహస్తుని ముఖకాంతి నిమిషములో నమసెను.

చ. పొడగని యిట్టి దుశ్శకున ♦ ముల్ మదిఁ గొంకక ఖ్యాతపౌరుషుం
డుడుగని తీవ్ర వేగమున ♦ నుగ్రగతిం జనుదేరఁ గ్రోతులున్
బుడమి వడంకు ఘోషములు ♦ పుట్టఁగఁ గొండలఁ జెట్లఁ బీకుచున్
నడచిరి వాని నెత్తికొని ♦ నాదవిదారిత దిక్సమూహులై. ౧౧౫౧

అర్థములు. పొడగని = చూచి, ఖ్యాతపౌరుషుండు = ప్రసిద్ధికెక్కిన పౌరుషముగలవాఁడు, నాద = కంఠధ్వనిచే, విదారిత = చీల్పఁబడిన, దిక్సమూహులై = దిక్కుల గుంపులు గలవారై.

తాత్పర్యము

ఇటువంటి చెడ్డ శకునములను జూచియు జంకక ప్రసిద్ధికెక్కిన పౌరుషముగల

ప్రహస్తుఁడు మిక్కిలి వేగముతోరాఁగా జూచి వానరులు భూమి యదరునట్లు కేకలువేయుచు కొండలు చెట్లు పీకి తీసికొని సింహనాదములచేఁ బదిదిక్కులు పగులజేయుచు నెదురునడచిరి.

ఉ. అంకెలు వైచు కోడెల తెఱంగున నయ్యిరువాఁగు నొండొరున్
బింకముమీఱఁ గన్గొనుచుఁ • బిల్చుచు ఱొప్పుచు యుద్ధలంపటుల్
గొంకును జంకులేని తమిఁగో•యని యార్చుచు డాసి రంత ని
శ్శంకము వహ్నిలో మిడుత•చందమునం గపిరాజవాహినిన్. ౧౧౯-౨

అర్థములు. ఇరువాఁగు=రెండుపక్షములవారు, యుద్ధలంపటుల్ = యుద్ధ కాంక్ష గలవారు, నిశ్శంకము=సందేహము భయము లేక.

తాత్పర్యము

రెండుపక్షములవారు యుద్ధమందుఁ గోరికగలవారై అంకెలువైచు కోడెల వలె నొకరినొకరు పౌరుషముతోఁ జూచుచుఁ, బిల్చుచు, హుంకరించుచు, జంకు గొంకు లేక సమీపించిరి. అప్పుడు భయములేనివాఁడై ప్రహస్తుఁడు మంటలో దూఁకు మిడుతవలె వానరసేనను.

—• ౫౮-వ సర్గము. ప్రహస్తసేనలు వానరులతోఁ బోరుట •—

కం. కుమతి ప్రహస్తుఁడు గెలువం, దమకపడుచుఁ జొచ్చె నిట్లు • తతభీమగతిన్
దమసేనలపై నడరెడు, తమిచరుఁ గని రామవిభుఁడు•దరహాసముతోన్.

అర్థములు. కుమతి = కుత్సితమనస్సు గలవాఁడు, తనశక్తి యెదిరిశక్తి యాలోచింపనివాఁడగుటచే నిట్లు చెప్పఁబడెను. తమకపడుచున్ = త్వరపడుచు, దరహాసముతోన్ =చిఱునవ్వుతో, రామచంద్రమూర్తి గొప్ప బలము కలవాఁడు కావున బలశాలి యగు శత్రువును జూచినపుడు అలక్ష్యభావముచే దరహాసము గలిగెను.

రామచంద్రమూర్తి యుత్తరపు గవని యెదుట నుండువాఁడుగదా; తూర్పు గవని యొద్దనుండు ప్రహస్తు నెట్లుచూడఁగలిగెను? రెండుస్థలములకు విస్తార దూరముగలదు. వంపు కలదుకదా యను సందేహము కలుగవచ్చును. ఉత్తరపు దిశ గాచినాఁడనిన ఉత్తరపువైపు అంతయునని గ్రహింపవలెనుగాని వాకిటి కెదురుగ నొక్కచోటనే కూర్చుండి యుండెనని యర్థము సేయరాదు. ఉత్తరపువైపున తూర్పుకోననుండి పడమటి వైపువఱకు సంచరించుచుండెనుఅని గ్రహింపవలయును. కావుననే హనుమంతుఁడు అకంపనుని జంపఁగలిగినది చూడఁగలిగెను. అట్లులే యిపుడు నుత్తరపార్శ్వమునఁ దూర్పుకోనకు వచ్చియుండుటచే ప్రహస్తునిఁ జూడఁ గలిగెను. పూర్వవ్యాఖ్యలందుఁ 'గని' యనుటకు నమ్మకముగా 'విని' యని వ్రాసి యున్నారు.

తాత్పర్యము

మతిమాలిన ప్రహస్తుఁడు శత్రువుల గెలువవలయు నని తొందరపడుచుఁ బ్రవేశించెను. ఇట్లు తన సేనలమీఁద భయంకరముగాఁ బడుచున్న యతనిఁజూచి రామచంద్రమూర్తి చిఱునవ్వుతో.

కం. పలుకు విభీషణుతోడన్, బలితపుబలములు భజింప♦బలు పగు మేనన్
గలనికి వచ్చినవాఁ డా,బలియుఁ డెవం డనఁగ నతఁడు♦వచియించె నిటుల్.

తాత్పర్యము

విభీషణుతో నిట్లనియె. బలిష్ఠమైన సేనలతో బలిసిన దేహముతో యుద్ధము నకు వచ్చిన యా బలశాలి యెవ్వఁ డనిన నతఁ డిట్టు లనెను.

ఉ. ఈతఁడె రావణాసురుని♦యెంతయు నమ్మినజోదు శూరుఁడున్
ఖ్యాతపరాక్రముండు మహి♦తాస్త్రవిదుండు సమస్తవాహినీ
నేత త్రిభాగ సైన్యయుత♦నిష్ఠురకర్ముఁడు వీర్యవంతుఁడున్
వీతభయుండు రామనృథి♦వీవర! పేరఁ బ్రహస్తుఁ డం చనన్. ౧౧౯౫

అర్థములు. జోదు = బంటు, యోధశబ్దభవము, సమస్త వాహినీనేత = సమస్తసేనకు నధిపతి, త్రిభాగ సైన్యయుతుఁడు=రావణాసురుని సేనలో మూఁడవ వంతు సేన యితని వశమున నుండును. తక్కిన రెండు భాగములు పై విచారణ యందుంచుకొని యుండును. నిష్ఠుర కర్ముఁడు=కఠిన కార్యములు చేయువాఁడు, వీర్యవంతుఁడు=బలవంతుఁడు, 'వీర్యంబలే ప్రభావేచ' యని యమరము - వీత భయుండు = భయములేనివాఁడు.

తాత్పర్యము

వీఁడె రావణాసురుని నమ్మినబంటు. శౌర్యము గలవాఁడు. పరాక్రమ మందుఁ బ్రసిద్ధుఁడు. గొప్ప యస్త్రములు దెలిసినవాఁడు. సర్వసేనాధిపతి. లంక లోని సేనలో మూఁడవవంతుసేన యితని స్వాధీనమం దుండును. కఠిన కార్యములు చేయువాఁడు. బలశాలి. యుద్ధమునందు భయ మెఱుఁగనివాఁడు. రామచంద్రా! వీని పేరు ప్రహస్తుఁడు.

శా. ఈలో వాఁడు నదత్సురారియుతుఁడై ♦ యెంతే రుషం బ్రస్ఫుట
త్క్ష్వేళాజాలవిభిన్నదిక్కుహరుఁడై ♦ జేయంచుఁ బైవచ్చినన్
గోలాంగూలచయంబు భూమిరుహముల్ ♦ గొండ ల్వేసం గొంచు ను
ద్వేలక్షిప్రగతిన్ సబీర్హ్యను గ్రుధాం♦ధీభూతచేతస్కమై. ౧౧౯౬

అర్థములు. నదత్ =ధ్వనించుచున్న, సురారియుతుఁడై = రాక్షసులతోఁ గూడినవాఁడై, ఎంతే=ఎంతేని ఏనిశబ్దమునకు హల్లు పరం బగునపుడు అంత్యవర్ణము లోపించును. "ఎం దే డెందము కందళించు"నని పెద్దన-అచ్చుపరమైనపుడు నివర్ణము మీఁది స్వరము లోపించును. ఇది కళయేగాని ద్రుతప్రకృతికముగాదు. "నను

దగిమోడు నతిథింగా, మనంబునఁ దలంచి నీవు మన్నించెదవే, నిని వచ్చెదనీపాలికి-”
భా. కర్ణ. -౨-౨౮౯-ఇత్యాది ప్రయోగంబులందు ఏనియును, దానిలో ‘యు’
లోపించి ఏనిను అని మిగిలి, ఇత్వము మీఁదిది గావున ఏనిని యయ్యె నని
యెఱుంగునది. ఇది యర్థ విశేషంబున వచ్చిన సముచ్చయము...............
రుపన్=కోపముతో, ప్రస్ఫుట=విస్పష్టమైన, క్ష్వేళాజాల=సింహనాద సమూహ
ములచే, విభిన్న = మిక్కిలి భేదింపఁబడిన, దిక్కుహరుఁడై = దిక్కుల యందలి
గుహలు కలవాఁడై, (౨) దిక్కు రంధ్రములు గలవాఁడై, సమీర్ష్యను=మిగులఁ
గోపముచే, క్రుధా=కోపముచే, అంధీభూత చేతస్కమై=ఏమియుఁ దోఁపని మనస్సు
గలదై, ఉద్వేలక్షిప్రగతిన్=అధికమైన వేగముతోఁ గూడిన గమనముతో.

తాత్పర్యము

ఇంతలోఁ బ్రహస్తుఁడు ధ్వనించు రాక్షసులతోఁ గూడినవాఁడై మిగుల రోష
ముతో స్పష్టమైన సింహనాదములచే దిగ్గుహలు పగులఁ జీల్చుచు జే యని తమ
మీఁదికి రాఁగా కొండ్రముచ్చుల గుంపులు చెట్లు కొండలు త్వరగాఁ దీసికొని
మిగుల వేగముతో నీర్ష్యాతిశయముతో కోపముచే దేహములు దెలియనివారై.

కం. ఎదురుకొనెన్ శూలంబులు గదలున్ రోఁకండ్లు శక్తి ♦ ఖడ్గాశుగముల్
గుదియలుబరిసలుబరుచులు, మొదలగు కైదువులు మెఱయ♦ మొగిరక్కసులున్,

అర్థములు. కైదువులు = ఆయుధములు, బరిస = ఇనుపకట్లగుదియ
బరుచులు = ఈఁటెలు, ఏ-బరిచి, రూ. బరిచీ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. తాఁకిరి వారువారు బల♦దర్పము లొప్పఁగ తాలవానయున్
వీఁకను బాణవర్షమును ♦ జెజ్జడిగాఁ గురియింపఁ దద్ధతిన్
మూఁకలు మూఁకలై యసుర♦ముఖ్యులు వానరులున్ వ్యథార్తులై
కూఁకలు వెట్టుచు న్నలఁగి ♦ కూలిరి భిన్నశిరఃప్రతీకులై. ౧౧౯౭

అర్థములు. తత్+హతిన్ = ఆ దెబ్బచే, భిన్నశిరఃప్రతీకులై = పగిలిన
తలలు, విఱిగిన అవయవములు గలవారై.

తాత్పర్యము స్పష్టము.

సీ. కాలాయసంబు లౌ♦శూలాయుధంబుల, గుదులుగాఁ గ్రుచ్చిరి ♦ క్రూరవృత్తిఁ
బరిఘాతనంబులఁ ♦ బ్రతిఘాతముల నిచ్చి, ప్రతిఘాతనముఁ జల్పి ♦ రతులరీతి
గండ్రగొడ్డలి వ్రేట్లఁ ♦ గండలు వగిలించి, గండ డఁగించి రు♦ద్దండ భంగి
నొత్తి పైపడి త్రొక్కి♦కుత్తుక బిగఁబట్టి, యూపొప్పవకుండఁగ ♦ నొత్తిరించి
తే. రసురవర్యులు క్రోఁతుల♦నగచరాళి యంప పోటుల హృదయమ్ము♦లగిలి ఖడ్గ
ధారలను రెండునై శూల♦వారనిహతిఁ,గృత్తపార్శ్వకమై యప్డు♦గెడసి చనియె.

అర్థములు. కాలాయసంబులు = ఉక్కుతోఁ జేయఁబడిన, గుదులుగాన్ = వరుసలుగా, పరిఘాతనంబులన్ = ఇనుపకట్ల గుదియలచే, ప్రతిఘాతములన్ = మాఱు దెబ్బలను, ప్రతిఘాతనము = చంపుట, గండు = పౌరుషము, ఊర్పోవరుండఁగన్ = ఊపిరాడకుండ, ఒత్తరించిరి = త్రొక్కించిరి, అంపపోటులన్ = అమ్ముల దెబ్బలచే, అగలి = పగిలి, కృత్త = చీల్పఁబడిన, పార్శ్వకమై = ప్రక్కలుగలదై, కెడసి = పడి.

తాత్పర్యము

ఉక్కుశూలములచే రాక్షసులు వానరులను క్రూరులై గుదులుగాఁ గ్రుచ్చిరి. ఒక్క శూలమునకే ఐదుగు రారుగురిని గ్రుచ్చిరి. వానరులు కొట్టిన దెబ్బలకు బదులుగ నినుపకట్లగుదియలతోఁ గొట్టి చంపిరి. గండ్రగొడ్డలి దెబ్బలచేఁ గండలు పగుల జీల్చి వానరుల గర్వ మడగించి రాక్షసులు వానరులపై బడి త్రొక్కి గొంతు బిగఁగట్టి యూపిరాడకుండఁ ద్రొక్కించిరి. అప్పుడు వానరులు బాణముల దెబ్బలకు ఱొమ్ములు పగిలి ఖడ్గముల దెబ్బలచే రెండుగాఁ జీలి శూలముల పోటులచే ప్రక్కలు నఱకఁబడి పడిపోయిరి.

ఉ. అజ్జగడంబునం గఫులు • హామికఁ గొండలుఁ జెట్లు ఱువ్వినన్
బజ్జలు నూరుఁబిండులును • బచ్చడులుం బెనుముద్దలున్ మఱిన్
గుజ్జులు నైరి రాక్షసులు • గూలిరి వ్రీలిరి పీటతాటమై
నజ్జుగ నైరి వజ్జఱి వి•నాశనముఁ జెందిరి మ్రంది రందఱున్. ౧౨౦౦

అర్థములు. అజ్జగడంబునన్ = ఆ యుద్ధమందు, హామికన్ = అహంకారముతో, పీటతాటమై = తాఱుమాఱై, నజ్జుగన్ = తునుకలు తునుకలుగా, వజ్జఱి = ఉపాయము తెలియక.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఫేటాకారకలిత చ•పేటఘాతకములచే, బోక్కినోళ్లైనట్టి • రక్కసులును
బిడుగుల కెనవచ్చు • పిడికిళ్ళపోటుల, గ్రుడ్లూడి గ్రుడ్డయి • కూలువారు
సిగఁ బట్టి తల వంచి • చేకొల్ది గ్రుద్దిన భోక్కన నెత్తురు • గ్రక్కువారు
నిఱుగాలు బిగఁబట్టి • గిరగిర మని త్రిప్పి, వీచివైచిన యముఁ • జూచువారు
తే. నుఱికి కఱకగు కోఱలఁ • గఱచి గోళ్ళఁ, బెఱికి వారల ఖండాల • నఱికివైవ
బిఱుసుఁ జెడి గర్వముడిగిత • త్తఱిలి వెఱచి, యఱచి పఱచిరి మడసిరి • యెఱచిదిండ్లు.

అర్థములు. ఫేటాకారకలిత = ఫేట్ అను ధ్వనితోఁ గూడిన, చపేట ఘాతములచే = అఱచేతి చెంపదెబ్బలచే, బోక్కినోళ్లు = పండ్లు రాలిపోయిన నోళ్లు, గ్రుడ్లు = కంటిగ్రుడ్లు - గ్రుడ్డివాండ్రు, ఇఱుగాలు = రెండుకాళ్లు, ద్విగువు ఏకవచనము, వారల ఖండాలు = వారు ధరించిన కత్తులచే, ఎఱచిదిండ్లు = మాంసము దినువారు, రాక్షసులు.

తాత్పర్యము స్పష్టము.

శా. బాహాస్ఫాలన మాచరించుచును శుంభద్భైరవాకారులున్
సాహంకార వివృత్త నేత్రు లయి రక్షః కీశసైన్యాళి హే
మా హేమీలు ఘటాఘటీ ల్గడఁగి సింహవ్యూహసంరంభు లై
బాహాబాహిని మల్లసంగర కళాప్రావీణ్య మేపారఁగన్. ౧౨౦౨

అర్థములు. బాహాస్ఫాలనము = భుజములు తట్టుట, శుంభత్ + భైరవాకారులున్ = భయంకరముగాఁ బ్రకాశించు నాకారములు గలవారును, సాహంకార వివృత్త నేత్రులును = కోపము కూడికచేఁ దిరుగుడు పడుచున్న కన్నులు గలవారు, రక్షః + కీశ + సైన్యాళి = రాక్షసులయు, వానరులయు సేనా సమూహము, హేమా హేమీలు, ఘటాఘటీలు = ఎంత కార్యమైన సాధించువారు, సింహవ్యూహ సంరంభులై = సింహముల గుంపుయొక్క పూనిక గలవారై, బాహాబాహిని = చేతులు చేతులు కలసి చేయు యుద్ధమున, మల్లసంగర కళాప్రావీణ్యము = మల్లయుద్ధ విద్యయందలి నేర్పు, జెట్టీల కొట్లాటకు మల్లయుద్ధ మని పేరు.

తా త్ప ర్య ము

రెట్టలరచేతులతోఁ దట్టుకొనుచు భయంకరరూపులై యహంకారముచే గ్రుడ్లు గిరగిర ద్రిప్పుచు రాక్షసులందు వానరులందు మిగుల సమర్థులగు వారు పూని సింహములవంటి ప్రయత్నముతో చేతులు చేతులు కలసిన జెట్టిపోరునందలి తమ నేర్పు విస్తరింపఁగా.

కం. పోరునెడ వారి పటుగర్జారవములు క్రందనములు జయనపరక్ష్వే
ళారభటుల్ దీనుల దుఃఖారావము లధిక మయ్యె నా సమయమునన్. ౧౨౦౩

అర్థములు. పటుగర్జారవములు = దృఢమైన పెద్ద ధ్వనులు, క్రందనములు = పిలుపులు, జయనపర = జయించుటయందాసక్తి గలవారి, క్ష్వేళారభటుల్ = సింహనాదములు, దీనుల దుఃఖారావములు = దెబ్బలు దిని బాధపడువారి యేడుపుధ్వనులు.

తా త్ప ర్య ము

యుద్ధముసేయు సమయమున వారల పెడబొబ్బలు, పిలుపులు, జయకాంక్ష గలవారి సింహనాదములు, గాయములచే బాధపడువారి యేడ్పులు విస్తరించెను.

సీ. అంతకోపమ కుంభహనుసమున్నతనరాంతకమహానాదులు దర్ప మొనరఁ
బొంగి వచ్చెడి కీశపుంగవవార్ధికిఁ, జెలియలి కట్టలై నిలువరింపఁ
గొండపేటును ద్వివిదుండు వైచిన దాన, నంతకుఁ గొల్చె నరాంతకుండు
దుర్ముఖుం డొక మహాద్రుమము ఱివ్వన వైవ, నుర్విపైఁ గూలె సమున్నతుండు
తే. ప్రస్తసుతుఁడు మహానాదు సరభసముగ, బండతోఁ దాఁచ నాతండు దండిఁ జేరెఁ
దారకరము క్ష్మాభూరుహ తాడనమునఁ, గుంభినీధర మనఁ గూలెఁ గుంభహనుఁడు.

అర్థములు. అంతక + ఉపమ = యమునితో సమానులైన, కీశపుంగవవార్ధికిన్ = వానరశ్రేష్ఠులను సముద్రమునకు, అంతకుఁ గొల్చెన్ = చచ్చెను, ప్రస్త

సుతుఁడు=జాంబవంతుఁడు, తాఁపన్ = కొట్టఁగా, దండిన్ = యముని, తారకర ముక్త=తారుని చేతితో వేయఁబడిన, భూరుహ తాడనమునన్ = చెట్టుదెబ్బచే, కుంభినీధరము=కొండ.

తాత్పర్యము

యమునితో సమానులగు కుంభహనుఁడు సమున్నతుఁడు నరాంతకుఁడు మహానాదుఁడను వారలు పొంగివచ్చుచున్న వానరులను సముద్రమునకుఁ జెలియలి కట్టలై నిలువరింపఁగా ద్వివిదుం డొక కొండపేటు వైచిన దానితో నరాంతకుఁడు చచ్చెను. దుర్ముఖుఁ డనువాఁ డొక పెద్దచెట్టు వేయగా నది తగిలి సమున్నతుఁడు చచ్చెను. జాంబవంతుఁడు మహానాదుపై నొక బండ వేయఁగా వాఁడు చచ్చెను. తారుఁడు చెట్టు నొకదాని వైవఁగా కుంభహనుఁడు కొండవలె నేలఁబడెను.

—♦ ప్రహస్తుఁడు కపుల వధించుట ♦—

ఉ. అద్రిచరక్రియం గని ప్ర♦హస్తుఁడు కార్ముక హస్తుఁ డై లయో
న్నిద్రపయోధి చందమున ♦ నిర్జరభీకరుఁ డట్టె పొంగుచున్
రౌద్రరసంబు మూర్తిగొను♦రాణ లయం బొనరించుభంగి న
క్షుద్రజవంబునం బఱపెఁ ♦ క్రోఁతులు భీతులుగా శతాంగమున్. ౧ ౨౦౫

అర్థములు. అద్రిచరక్రియన్ = వానరులు చేసిన కార్యమును, కార్ముక హస్తుఁడై=చేత విల్లుగలవాఁడై, లయోన్నిద్ర పయోధి చందమున = ప్రలయ కాలమందు హెచ్చరికగల సముద్రమువలె, నిర్జర భీకరుఁడు=దేవతలకు భయము గలిగించువాఁడు, మూర్తిగొను రాణన్=ఆకారము గొన్న విధముగ, లయంబు= నాశము, అక్షుద్ర=అల్పముగాని, జవంబునన్=వేగమున, శతాంగము=తేరిని.

తాత్పర్యము

వానరులు చేసిన తన మంత్రులఁ జంపుట యను కార్యమును జూచి దేవ భయంకరుఁడగు ప్రహస్తుఁడు చేత వింటిని ధరించి ప్రలయ కాలమునఁ బొంగు సముద్రమువలెఁ బొంగి రౌద్రరసము ఆకారముగొన్న విధమున, సర్వము నాశము చేయువానివలెఁ దన తేరిని వానరులపై మిగుల వేగముగఁ బఱపెను.

మ. ప్లవగాంభోనిధి మందరాయితరథ♦వ్యాపారపారీణుఁ డై
దివిజారాతిరణంబు కల్పసమమై ♦ దీపింపఁ దత్సాగరా
రవముంబోలెఁ జమూనినాదము కఠో♦రస్ఫారనారాచపా
తవినిర్భిన్నవలీముఖాంగ వికళ♦ద్రక్తంబు నీరంబుగన్. ౧. ౨౦౬

అర్థములు. ప్లవగాంభోనిధి=వానరులను సముద్రమునకు, మందరాయిత= మందరపర్వతమువలె నైన, రథ = తేరియొక్క. వ్యాపార పారీణుఁడు = కార్యమునందు సామర్థ్యము గలవాఁడు, కల్పసమమై=ప్రలయముతో సమానమై, తత్+సాగరారవమున్ = అప్పటి సముద్రధ్వనిని, చమూనినాదము = సేనలధ్వని,

కఠోర=కఠినములు, స్ఫార = అధికములు నగు, నారాచ = బాణముల, పాత = పడుటచే, వినిర్భిన్న = మిక్కిలి భేదింపఁబడిన, వలీముఖాంగ=వానరుల దేహము నుండి, విగళత్=కాఱుచున్న, రక్తంబు=నెత్తురు, నీరంబుగన్=నీళ్ళుగ.

తాత్పర్యము

వానరులను సముద్రమునకుఁ దన తేరు మందరమువలెఁ జేసి చరించు నా రాక్షసుని యుద్ధము ప్రలయమువలెఁ దోఁచెను. ఆ కాలమందలి సముద్రఘోషము వలె సేనాభటుల ధ్వని యుండెను. కఠిన బాణములచేఁ దెగిన దేహము గల వానరుల నెత్తురు ఆ సముద్రమందలి జలమై యుండెను.

తే. దానికిని నీడఁబోవక ♦ తరుచరాళి, జన్య మొనరించి రాక్షస♦సంఘములను
బిలుకుమార్పఁగనఁ భయసే♦నలమహీధ్ర,సమశరీరంబులొప్పెభీ♦మముగనపుడు.

అర్థములు. ఈడఁబోవక = వెనుదీయక, తరుచరాళి = వానరుల గుంపు, జన్యము=యుద్ధము, పిలుకుమార్పంగన్=చంపఁగా, మహీధ్రసమ శరీరంబులు = పర్వతములవంటి దేహములు.

తాత్పర్యము స్పష్టము.

కం. దైతేయ కీశరక్త, స్రోతస్వినిచేతఁ దడిసి ♦ క్షోణి రహించెన్
స్ఫీతగతిన్ మాధవవే,ళాతత సుమయుక్త కింశు♦కాకృతి దోఁపన్. ౧౨౦౮

అర్థములు. దైతేయ=రాక్షసుల యొక్కయు, కీశ=వానరులయొక్కయు, రక్తస్రోతస్వినిచేత=నెత్తుటియేటిచేత, మాధవవేళా=వసంతసమయమున, ఆతత = విస్తారమైన, సుమయుక్త=పూలచేఁగూడిన, కింశుకాకృతిన్=మోదుగులవలె.

తాత్పర్యము

వానరులయు, రాక్షసులయు నెత్తుటియేటిచేఁదడిసి భూమి వసంతసమయమున నిండారఁ బూచిన మోదుగువలె నుండెను.

సీ. కూలినవీరుల ♦ కోటులు దరులుగా, విఱిగిన కైదువుల్ ♦ వృక్షములుగఁ
గీలాలజాలంబు ♦ గీలాలచయముగాఁ, గారిజంబున బ్లీహ♦మాఁర బురద
ప్రేవుల ప్రోవులు ♦ శైవలవితతిగాఁ, గాలుసేతులతుండ్లు ♦ మీలు గాఁగ
గాత్రాంగనివహముల్ ♦కడిమిడి పట్లుగాఁ, జెన్నుగ్రద్ద గుమి యంచ♦పిండుగాఁగ

తే. మలయు రాపులు లుయ్యాల♦పులుఁగులుగను
మెదడు సురువుగ నేడ్పులు ♦ నదములుగను
గాపురుషదుస్తరము యమ♦కంధిగతిక
మాజిభూమయి నిమ్నగ ♦ యపుడు పాఱె. ౧౨౦౯

అర్థములు. దరులు = ఒడ్డులు, కైదువుల్ = ఆయుధములు, కీలాల జాలంబు=నెత్తుటి సమూహము, కీలాలచయముగాన్=నీళ్ళవంకగా, కారిజంబును= కడుపులోని నీరుతిత్తి క్రింద నుండెడి మాఁసఖండ విశేషము, యకృత్తు (Liver)

ప్లీహము (Spleen) కడుపులో నెడమ ప్రక్కనుండు మాంసఖండ విశేషము, శైవల వితతి = పాచిసమూహము, మీలు = చేపలు, గాత్రాంగనిహముల్ = దేహము లందలి యవయవ సమూహము. కడిమిడి సట్లుగా = పచ్చికపట్లుగా, రాపుల్లు = ఒకవిధమైనగ్రద్ద, ఉయ్యాలపులుగు = సారసపక్షులుగా, నదములు గనః=ఏటిప్రవాహ శబ్దములుగను, కాపురుష దుస్తరము=పిఱికి పందలచేఁ దాఁట రానిది, యమకంధి గతికము = యముఁడను సముద్రమును జేరఁబోవునది, ఆజిభూమయి = యుద్ధభూమియనెడి, సార్థకమయ్యడంతయు, నిమ్నగ=నది, వ్యస్త సావయవరూపకము=యమకంధిగతిక మనుచో సమస్తరూపకము.

తాత్పర్యము

యుద్ధభూమిని నేఱుగా వర్ణించుచున్నాఁడు. ఆయేటికి యుద్ధమందు జచ్చిన వీరుల గుంపులు యీవలి యావలి యొడ్డులు, విఱిగిన యాయుధములు వృక్షములు, నెత్తురే నీళ్ళు, కారిజము ప్లీహము బురద, ప్రేవులరాసులు ప్రాఁచిగుంపు, కాళ్ళు నేతుల తునుకలు వ్రేళ్ళు మొదలైనవి చేపలు, దేహమునందలి యవయవములు పచ్చిక పట్లు, గ్రద్దలు హంసములు, రాపులుగులే సారసములు, మెదడు నురుగు, ఏడ్పులు ఏఱు పాఱు ధ్వని, ఈ నదిని బిఱికివాగు దాఁటలేరు.

కం. శారదవేళను హంసక, సారసచయ సేవితంబు ♦ శైవలినివలెన్
ధీరులు, వానర రాక్షస, వీరులు తన్నదిఁ దరించి ♦ వెలసిరి బలిమిన్.౧౨౧౦

అర్థములు. శారదవేళను = శరత్కాలసమయమున, హంసక=హంసల చేతను, సారసచయ = బెగ్గురుల గుంపులచేతను, సేవితంబు = సేవింపఁబడినది, కూడినది, శైవలిని = నది.

తాత్పర్యము

ధీరులగువారు శరత్కాలమందు హంస సారసములతోఁ గూడిన నదిని దాఁటునట్లు వానర రాక్షసవీరులు నదిని దాఁటిరి.

కం. పాదరజోవిధ్వస్తము, మేదురరక్తాభ జల స♦మేతము సరసిన్
సాదరముగ నీఁదిన మద, వేదండము లనఁగ వారు ♦ వెలిఁగిరి రక్తిన్.౧౨౧౧

అర్థములు. పాదరజోవిధ్వస్తము = అడుగుల దుమ్మచేఁ బాడుచేయఁ బడినది, మేదుర = దట్టమైన, రక్తాభ=నెత్తుటితో సమానమైన, జల=నీటితో, సమేతము = కూడినది, సరసిన్ = కొలనిని, మదవేదండము=మదపుటేనుఁగు, రక్తిన్ = ఎఱ్ఱని కాంతిచే.

తాత్పర్యము

కాలి దుమ్ముచేఁ బాడుచేయఁబడినదియు, అధికమైన నెత్తుటివంటి జలముగలదియు నగు కొలనిని నీఁదిన మదపుటేనుఁగులవలె వారెఱ్ఱని కాంతిచే వెలసిరి.

—♦ నీలుఁడు ప్రహస్తుని వధించుట ♦—

ఉ. ఎందును నడ్డు లేక తను ♦ నెవ్వఁడు మార్కొనువాఁడు లేక యా
సక్రందనధాత్రిలోఁ దనదు ♦ స్యందనముం బఱపించి మీఁదమీఁ
దం దనుఁ జూచి క్రోఁతులు య ♦ థాయథ లై పరువెత్త నబ్ధిలో
నం దిరుగాడు పెన్గొఱ య ♦ నన్ విహరించు నిశాటు నీలుఁడున్. ౧౨౧౨

అర్థములు. ఆసక్రందనధాత్రిలో = యుద్ధభూమిలో, యథాయథలై = చెల్లాచెదరై, పెన్గొఱ=పెద్ద కొఱమీను, నిశాటున్=రాక్షసుని.

తాత్పర్యము

యుద్ధభూమియందు నెందును నడ్డములేక యెదిరించువాఁడును లేక, తన తేరిని దోలి తన్నుఁజూచి క్రోఁతులు పోయినదే పోకగాఁ బరువెత్తగా సముద్రములోఁ బెద్ద కొఱచేపవలెఁ దిరుగు రాక్షసుని జూచి నీలుఁడు.

చ. కనుఁగవ కెంపుపెంపు గొనఁ ♦ గాంచి సమంచితవేగుఁ డై వియ
జ్జనిత మహాబలుండు ఘన ♦ జాలముపైఁ బడురీతి నాఁగినన్
దినమణి భాసమానరథ ♦ తీవ్రజవోద్ధతి చాపనైపుణం
బును మెఱయంగ వానిపయి ♦ మొక్కలుఁ డై పడి యేపు చూపుచున్.

అర్థములు. వియత్+జనిత మహాబలుండు=ఆకాశమునఁ బుట్టినవాయువు, ఘనజాలముపై = మేఘసమూహముపై, ఆఁగినన్ = అడ్డగింపఁగా, దినమణి = సూర్యునివలె, భాసమాన = ప్రకాశించు, రథ = తేరి యొక్క, తీవ్రజవోద్ధతి = అధిక వేగాతిశయము, చాపనైపుణంబు=విలువిద్యనేర్పు, మొక్కలుఁడై=శూరుఁడై.

తాత్పర్యము

కన్ను లెఱ్ఱజేసి చూచి మిగుల వేగము గలవాఁడై ఆకాశమునందుఁ బుట్టిన మహావాయువు మేఘములపై పడినట్టులు ప్రహస్తుని నడ్డగింపఁగా సూర్యుని వలెఁ బ్రకాశించు రథముయొక్క వేగాతిశయము విలువిద్యనేర్పు మెఱయఁగఁ బ్రహస్తుఁడు శూరుఁడై వానిపై పడి తన పరాక్రమము చూపుచు.

శా. హుంకారస్ఫుటనాదుఁ డై దితిభవ ♦ వ్యూహంబు మెచ్చన్ ధను
ష్టంకారం బొనరించుచున్ నిశితకాం ♦ డంబుల్ మెయిం గ్రుచ్చి సా
హంకారోద్ధతి నార్భటించె, నవి కీ ♦ శాధ్యక్షు మేనిన్ నిరా
తంకప్రక్రియఁ జించి చొచ్చె ధరణిం ♦ దద్రక్తసిక్తంబులై. ౧౨౧౮

అర్థములు. హుంకారస్ఫుట నాదుఁడై = హుమ్మని స్పష్టమైన ధ్వనికలవాఁడై, నిశితకాండంబుల్=పదునగు బాణములు, గ్రుచ్చి=నాటి, ఆర్భటించెన్ = సింహనాదము చేసెను, కీశాధ్యక్షు మేనిన్ = వానరపతియగు నీలుని దేహమును నిరాంతక ప్రక్రియ=అడ్డములేని విధముగ, తద్రక్త సిక్తంబులై = ఆ నెత్తుటిలోఁ దడిసినవై.

తాత్పర్యము

హుమ్మని ధ్వనించుచు రాక్షసులు తన్ను మెచ్చునట్లు వింటిని టంట మ్మని మీటుచు పదునగు బాణములను నీలుని దేహమందుఁ గ్రుచ్చి యహంకారాతిశయముచే సింహనాదము చేసెను. ఆ బాణములు వానరపతి దేహమునందు నడ్డము లేక ప్రవేశించి చించి యానెత్తుటితోఁ దడిసి భూమిలోఁ దూరెను.

ఉ. వెండియు నాప్రహస్తుఁ డట♦వీచరుఁ జెంతలఁ జేరనీక యు
ద్దండశరప్రకాండముల ♦ దారుణవాహిని మీఁదఁ గొల్పనీ
లుండును సాలమొండు త్రుటి♦లోఁ గొని తానెదు రేఁది పోయి దో
శ్చండిమ శూరవర్యుఁడు ని♦శాచరుపై నొక దెబ్బ దీసినన్. ౧౨౧౫

అర్థములు. అటవీచరున్=వానరుని, నీలుని, ఉద్దండ శరప్రకాండముల= అధికమైన శ్రేష్ఠములైన బాణముల, దారుణవాహిని=భయంకర నదిని, సాలము= చెట్టు, దోశ్చండిమ=భుజబలాతిశయముచే.

తాత్పర్యము

అంతతోఁ బోక ప్రహస్తుఁడు వానరుని దగ్గఱఁ జేరనీక విశేషముగ బాణ శ్రేష్ఠములను భయంకర నదిని వలెని మీఁదఁ బ్రవహింపఁజేయఁగా నీలుఁడు చెట్టొక్కటి నిమిషములో పీఁకికొని యానదికి నెదురేఁది పోయి భుజబలము కొలఁది రాక్షసుని నొక దెబ్బకొట్టెను.

కం. క్ష్వేళాబధిరిత దిగ్గజ, జాలుండై రాక్షసుండు ♦ శరధారాక
ల్లోలిని నీరంధ్రంబుగ, నీలుపయిం బఱప నతఁడు ♦ నిశ్చేష్టుం డై. ౧౨౧౬

అర్థములు. క్ష్వేళా = సింహనాదముచే, బధిరిత=చెవుడుగా చేయఁబడిన, దిగ్గజ జాలుండై = దిక్కులందలి యేనుఁగుల గుంపులు గలవాఁడై, శరధారా కల్లోలిని = బాణపరంపర యను నదిని, నీరంధ్రంబుగన్ = సందు లేకుండునట్లు, నిశ్చేష్టుండై = చేష్ట లుడిగినవాఁడై.

తాత్పర్యము

దిగ్గజములకుఁ జెవుడు పట్టునట్లు సింహనాదము చేయుచు ప్రహస్తుఁడు బాణ పరంపరానదిని సందులేకుండునట్లు నీలునిపై బరఁగింపగాఁ నతడేమియుఁ జేయలేనివాఁడై.

శా. వారింపం దరియింపరామిని గపి♦వ్యాఘ్రుంబు క్షోణిన్ శర
ద్ధారాపాతమునన్ వృషంబువలె నే♦త్రద్వంద్వమున్ మోడ్చి దో
స్సారం బూతఁగ నిల్చియుండి యవకా♦శం బబ్బ వృక్షాహతిన్
ధీరగ్రామణి చిత్తవేగ రథవీ♦తిస్తోమముం గూల్చుచున్. ౧౨౧౭

అర్థములు. వారింపన్ = అడ్డగించుటకు, తరియింపన్ = దాఁటుటకు, రామిని=సాధ్యము కాకుండుటచే, కపివ్యాఘ్రుంబు=వానర శ్రేష్ఠుఁడు, క్షోణిన్ = భూమియందు, శరత్ =శర త్కాలమందలి, ధారాపాతమునన్=వర్ష ధారలు పడు

టచే, ముందు వానకాలమందలి ప్రవాహ మని చెప్పి యిప్పుడు శరత్కాల మందలి వాన యని చెప్పుటచే క్రమముగ వేగము తగ్గిన దని సూచన. వృషంబు వలెన్ = ఎద్దువలె, దోస్సారంబు=భుజబలము, ఊఁతగన్ = ఆధారముగ, అవకాశంబు=సందు, వృక్షాహతిన్=చెట్టుదెబ్బచే, ధీరగ్రామణి=ధీరులందు శ్రేష్ఠుఁడు, చిత్తవేగ = మనోవేగముగల, రథవీతిస్తోమమును = రథమునకు గట్టిన గుఱ్ఱముల సమూహమును, కూల్చుచున్ = చంపుచు.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన బాణనదిని నిలుపుటకుఁగాని దాటుటకుఁగాని సాధ్యము గాకుండుటచే నీలుఁడు భూమిమీఁద శరత్కాల వర్షమును నెద్దువలె సైరించి రెండుకన్నులు మూసికొని భుజబలము ఆధారముగ నిలిచియుండి సందు దొరకఁగా చెట్టుతోఁ గొట్టి మనోవేగమునఁ బోవు తేరి గుఱ్ఱాలఁ జంపుచు.

ఉ. పైపడి వాని కార్ముకముఁ ♦ బట్టి దృఢంబుగ నీడ్చి వైచి యా
టోపమునన్ నదించుచుఁ ద ♦ టుక్కున దానిని ద్రుంచివైచినన్
జాపము లేమి రక్కసుఁడు ♦ స్యందనసంస్థితసాధనాళిలోఁ
జేపడినట్టి రోఁకలిని ♦ జేకొని భూమికిఁ దాఁటెఁ జివ్వనన్. ౧౨౧౭

అర్థములు. కార్ముకము=విల్లు, ఆటోపమునన్ = సంభ్రమముతో, నదించుచు = అఱచుచు, స్యందన సంస్థిత = తేరియందుంచిన సాధనాళిలో=ఆయుధముల గుంపులో, చేపడినట్టి=లభించిన=చేతికి దొరికిన.

తాత్పర్యము

వానిపై పడి గట్టిగ విల్లుపట్టుకొని యీడ్చి సంభ్రమముతో కేకలు వేయుచు దానినివిఱిచి వేయఁగా విల్లులేమిచే రాక్షసుఁడు తేరి యందున్న యాయుధములలో చేతికి దొరకిన రోఁకలిని దీసికొని భూమిమీఁదఁ దటాలున దుమికెను.

కం. రోఁకలి ద్రిప్పుచుఁ దన్నుం, దాఁకెడు రక్కసునిఁ గాంచి ♦ తడఁబడ కేమిన్
వీఁకను నీలుఁ డెదుర్కొని, యాఁకట్టెన్ బాహుబలర♦మాధికుఁ డగుచున్.

అర్థములు. తడఁబడక = చలింపక, ఆఁకట్టెన్ = అడ్డగించెను, బాహుబలరమాధికుఁడు = భుజబల సంపత్తిచే నధికుఁడై.

తాత్పర్యము

రోఁకలి ద్రిప్పుచు తనపైకి వచ్చుచున్న రాక్షసుని జూచి నీలుఁడు తత్తఱ నొందక బలశాలియై యెదుర్కొని భుజబలసంపత్తిచే నతని రోఁకలి ద్రిప్పకుండ నడ్డగించెను. చేతులు చేతులు గలసినపుడు రోఁకలి యేమి పని చేయఁగలదు ?

ఉ. ఇద్దఱు వాహినీపతులు ♦ నిద్దఱు జాతవిరోధు లిద్దఱున్
గద్దఱికాండ్రు రిద్దఱును ♦ గాఢజవాన్వితు లొండొకండు పై

న్నుద్దులు నోలమాసగొన ♦ కోటమి చెందక యోహటింప కా
పద్దశ నొంద కేపఱక ♦ పాయక లోఁగక క్రుక్కు కాత్మలన్. ౧౨౨౦

అర్థములు. వాహినీ పతులు=సేనానాయకులు, జాతవిరోధులు=విరోధ భావము గలవారు, గద్దతికాండ్రు=ధైర్యశాలులు, గాఢ జవాన్వితులు = మిక్కిలి వేగముతోఁ గూడినవారు, ఉద్దులు=సమానులు, ఓలమాసగొనక = మఱుఁగునకు పోక, ఓటమి చెందక = ఓడిపోక, ఓహటింపక = వెనుదీయక, ఆపద్దశనొందక= కీడు చెందక, ఏపు+అఱక=పరాక్రమము తగ్గక, పాయక=తొలఁగిపోక, లోఁగక= లోపడక, క్రుక్కక = నొచ్చుకొనక.

తాత్పర్యము

ఇద్దఱు సేనానాయకులు, ఇద్దఱు విరోధభావము గలవారు, ఇద్దరు ధీరులు, ఇద్దరు వేగవంతులు, ఒకని, కొకఁడు మిక్కిలి సమానులు. వీరు మఱుఁగునకు పోక యెదుర నిలచి యోడిపోక, వెనుదీయక, కీడు చెందక, పరాక్రమము తగ్గక, తొలఁగిపోక, లోపడక, మనస్సులందు నొప్పి చెందక.

సీ. మత్తకుంజరముల♦మాడ్కిని బోరుచో, నెత్తుట మేనులు ♦ జొత్తిలంగ
నసమును గోరుచుఁ ♦ బసమెయిఁ గేరుచు, మసలక తారుచు ♦ మండలగతిఁ
గోఱలఁ గొఱుకుచు ♦ గోళ్ళను బెఱుకుచుఁ, గత్తుల నఱకుచు ♦ గండుమీఱి
డాసినఁ గొట్టుచుఁ ♦ బాసినఁ బట్టుచుఁ, దూసినఁ దిట్టుచు ♦ దొరగిల్లి
ఆ. లేచి కవియు చిట్లు ♦ లీలమై రాక్షస,ప్లవగసైన్యపతులు ♦ బలము మెఱసి
వృత్రహరులరీతిఁ♦బిఱు దివియక యాత్మ, రోస ముజ్జగింప♦కేసరేఁగి. ౧౨౨౧

అర్థములు. కుంజరములమాడ్కి = ఏనుఁగులవలె, జొత్తిలంగన్ = ఎఱ్ఱ పాఱఁగా, అసము = కీర్తి, కేరుచున్=విజృంభించుచు, మసలక = ఆలస్యములేక, తారుచున్=సమీపించుచు, మండలగతి=గుండ్రముగాఁ దిరుగుచు, దూసినన్ = వెనుకకుఁబోఁగా, తొరగిల్లి=వ్రాలి, ఉజ్జగింపక=వదలక, ఏసరేఁగి=విజృంభించి.

తాత్పర్యము

మదపు టేనుఁగులవలె బోరాడుచో నెత్తుట దేహము లెఱ్ఱఁపాఱగా, కీర్తిని గోరుచు సత్తువకొలఁది విజృంభించుచు ఆలస్యములేక మండలాకారముగ సమీపించుచు కోఱలఁ గొఱకుచు, గోళ్ళచేఁ బెఱుకుచుఁ, గత్తుల నఱకుచు, దగ్గఱకువచ్చినఁ గొట్టుచు, దూరముపోయినఁ బైబడి పట్టుచు, తొలఁగిపోయినఁ దిట్టుచు, వంగుచు లేచి, పైపడుచు నీప్రకారము రాక్షస వానర సేనానాయకులు బలము ప్రకాశింపఁ జేసి వృత్రుఁడు ఇంద్రుఁడు యుద్ధముచేసినట్లు వెనుకంజపెట్టక మనస్సులో రోషము విడువక విజృంభించి.

సీ. కొమ్ముటేనుఁగుల ♦ కొమరుల ఢీకొని, హుమ్మని తాఁకుదు ♦ రొక్కమాటు
తగరులవడువున ♦ దవ్వు దవ్వుగ వీఁగి, యురువడిఁ దగులుదు ♦ రొక్కమాటు

కోడిపుంజులరీతిఁ ♦ గూడి చుట్టుచు దాఁటు, లుగ్రత దాఁటుదు♦రొక్కమాటు
దందశూకము లనఁ♦గ్రిందు మీఁదగుచును, నుర్విని బొరలుదు♦రొక్కమాటు

తే. ఆముటాఁబోతులట్లు సిం♦హములకరణి
వ్యాఘ్రములభంగిఁ బోరుచు ♦ నసమబలులు
నజితు లాహవవిక్రాంతి♦విజయు లుండ
దితిజపరివృఢుఁ డొక్కఁ డంత ♦ తెఱపిఁ గాంచి. ౧౨౨౩

అర్థములు. తగరులు = పొట్టేళ్ళు, దందశూకములు = పాములు, ఆముటాఁబోతులు = మదము పట్టిన కోడెలు, అజితులు = జయింపఁబడని వారు, ఆహవవిక్రాంతివిజయులు = యుద్ధమునందలి పరాక్రమమందు గెలుపుకొన్నవారు, దితిజపరివృఢుఁడు = రాక్షస శ్రేష్ఠుఁడు, తెఱపి = సందు.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. తటుకున ముసలంబును గొని, పటుజవగతిఁ గీశవీరు♦ఫాలము నడిచెన్
జొట జొట నెత్తురు గాఱఁగ, ద్రుటి నీలుఁడు విసరి చిమ్మెఁ♦దోరపుఁ జెట్టున్.

అర్థములు. పటుజవ గతిన్ = మిగుల వేగముతోడి గమనముతో, ఫాలము = నొసలు.

తా త్ప ర్య ము

ప్రహస్తుఁడు తటాలున రోఁకలి తీసికొని నీలుని నొసటిపైఁ గొట్టఁగా నెత్తురు జొట జొట గాఱఁగా నిమిషముండి నీలుఁడు చెట్టువిసరి ప్రహస్తునిపైఁ గొట్టెను.

చ. మిసుగక దాని కేమి మిసి♦మింతుఁడు గాక ప్రహస్తుఁ డుగ్రుఁ డై
ముసలము రెండు కేలఁ గొని ♦ మొగ్గలపుంబస మీఁది కెత్తి రా
గసిబిసిపాటు లేక ప్లవ♦గప్రవరేణ్యుఁడు దవ్వు దాఁటి పే
ర్వ్రేస నొకగుండు ఱివ్వనను ♦ వీచి శిరంబున మొత్తె సూటిగన్. ౧౨౨౪

అర్థములు. మిసుగక = కదలక, మిసిమింతుఁడు = శ్రమనొందినవాఁడు, మొగ్గలపుంబస = అధిక బలముతో, గసిబిసిపాటు = కలఁత, పేర్వ్రేసన్ = మిగుల వేగముతో

తా త్ప ర్య ము

ప్రహస్తుఁడు దానికేమి కదలక శ్రమపడక రెండుచేతుల రోఁకలి మీఁదికి యెత్తుకొని యధిక బలమున నీలుని తల పగుల కొట్టుటకై రాఁగా నీలుఁడు తటాలున దూరముగ దూఁకి మిగుల వేగముతో నొక గుండు తీసికొని ఱివ్వన వాని తల గుఱిచూచి కొట్టెను.

కం. ఆరాతి తాఁకునను దే,వారాతిశిరంబు పగిలి ♦ యఱవఱలుగ నై
ధారిణిఁ బడె లగుడంబున ప్ర,హారంబునఁ బగులు కుంభ ♦ మన నిమిషమునన్.

అర్థములు. దేవారాతి = దేవతలకు విరోధి యొక్క, అఱవఱలు = తునకలు, లగుడంబు = దుడ్డుకట్టె యొక్క, ప్రహారంబునన్ = దెబ్బచేత.

తాత్పర్యము

ఆ రాతి దెబ్బచే ప్రహస్తుని తల దుడ్డుకఱ్ఱతోఁ గొట్టిన మట్టికుండవలెఁ దునుకలై నిమిషములో నేలఁబడెను.

కం. మూలము నఱకినఁ గుజ మన, వ్రాలె నతఁడు నేలపై శి♦రంబున మేనన్
జాలుగొనెన్ సెలయేఱుల, పోలిక నెత్తురులు భీమ♦ముగ నవ్వేళన్. ౧౨౭౬

అర్థములు. మూలము = వేరు, కుజము = చెట్టు, జాలుగొనెన్ = ప్రవహించెను, భీమముగన్=భయంకరముగ.

తాత్పర్యము

వేరు నఱకిన చెట్టువలె నతఁడు నేలపైఁబడెను. తలనుండి దేహమునుండి నెత్తురు సెలయేఱువలెఁ బ్రవహించెను.

మ. తమ సేనాపతి యిట్టు లీల్గఁగ నపే♦తప్రీతిచిత్తుల్ నిరు
ద్యములున్ దీనులునై నిశాచరులు వ్ర♦య్యఁగట్ట నీరంబునా
సమరక్షోణిని వీడి లంకకును త్రా♦సం బొత్తఁగాఁ బాఱి యా
యమరద్వేషి నృపాలుశాలఁ జని మా♦టాడంగ లే కేమియున్. ౧౨౭౭

అర్థములు. అపేత ప్రీతి చిత్తుల్=సంతోషము పోయిన మనస్సులుగలవారు, నిరుద్యముల్=యుద్ధ ప్రయత్నము లేనివారు, దీనులు=దుఃఖముగలవారు, కట్ట వ్రయ్యన్ = కట్టతెగఁగా, త్రాసంబు = భయము, అమరద్వేషినృపాలుశాలన్ = రావణుఁడున్న సభకు.

తాత్పర్యము

తమ సేనాపతి యిట్లు చావఁగా సంతోషము చెడినవారై యే యత్నము లేనివారై దుఃఖించుచు రాక్షసులు యుద్ధభూమి విడిచి కట్టతెగిన నీళ్ళుపోవునట్లు భయపాటుతోఁ బరువెత్తి రావణుఁడున్న సభకుఁబోయి యేమి చెప్పుటకు నోరురాక.

తే. ధ్యానమూకత్వమునఁ దెల్వి♦తప్పినట్లు, మహితశోకార్ణవంబున♦మగ్నులౌచు
నెత్తిచూపులు చూచుచు♦ వెడలు బాష్పధార లణఁపగనేమియు♦ నేరరైరి.

అర్థములు. ధ్యానమూకత్వమునన్=ధ్యానముచే మాటలాడనేరక, మహితశోకార్ణవంబునన్=గొప్పశోకసముద్రమందు, మగ్నులు=మునిఁగినవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. అద్భుతగతి కపివంశ, ప్రోద్భవుఁ డిటు వైరిఁ జంపి ♦ భుజబలమున సం
యద్భూమి వెలిఁగెఁ గీశులు, ముద్భావముతోడఁ బొగడ♦ మొనసినరక్తిన్.

అర్థములు. కపివంశప్రోద్భవుఁడు = వానర వంశమునఁ బుట్టినవాఁడు, నీలుఁడు, సంయత్+భూమిన్=యుద్ధభూమియందు, ముద్భావముతోడ=సంతోషచిత్తములతోడ.

తా త్ప ర్య ము

వానరశ్రేష్ఠుఁడగు నీలుఁడు ఆశ్చర్యకరమైన విధముగ భుజబలమున వైరిని జంపి యుద్ధభూమిని ప్రకాశించెను. వానరులు సంతోషముతో నతనిని బొగడిరి.

కం. రాముఁడు మెచ్చెను మే లని, సౌమిత్రియు మిగుల నతని ♦ శ్లాఘించెన్ శా
ఖామృగసేనానియు నమి, తామోదము జెందె దశరథాత్మజు కృపకున్.

అర్థములు. శాఖామృగ సేనాని = వానర సేనానాయకుఁడు, నీలుఁడు.

తా త్ప ర్య ము

రామలక్ష్మణులు నీలుని మిగుల శ్లాఘించిరి. వారి దయకు నీలుఁడును మిగుల సంతోషించెను.

—♦ ౫౯-వ సర్గము. రావణుఁడు తొలిసారి యుద్ధమునకు వెడలుట ♦—

సీ. హతశేషసైన్యంబు♦లంతయు వినిపింప, విని రావణుఁడు క్రోధ♦వివశుఁ డగుచు
శోకార్దితుం డయి ♦ సురల సంబోధించు, వృద్ధశ్రవసురీతి ♦ నిట్టు లనియె
నాకపబలనాశు ♦ నా చమూపాలునిఁ, గపు లటే చంపిరి ♦ కదనసీమ
సానుయాత్రంబుగ ♦ సహాయగజంబుగ, నింక నుపేక్షింప ♦ హితవు గాదు

ఆ. ఔర! యెంతవింత♦యగ చరులా రాక్ష,సులను జంపువారు♦చూతుఁ గాక
నేన పోయి వారి ♦ నిర్మూలితులఁజేసి, జయముఁ గొందు స్థిరయ♦శంబుఁగందు.

అర్థములు. హతశేషసైన్యంబులు = చంపఁబడఁగా మిగిలిన సేనలు, క్రోధవివశుఁడు = కోపముచే దేహము తెలియనివాఁడు; శోకార్దితుఁడు = శోకముచేఁ బీడింపఁబడినవాఁడు. వృద్ధశ్రవసురీతి=ఇంద్రునివలె, 'వృద్ధశ్రవాః సునాసీరః పురుహూతః పురందరః' అమరము. నాకపబలనాశున్=ఇంద్రుని బలమును నాశము చేసినవాని-నాచమూపాలుని=సేనానాయకుని "ధ్వజినీ వాహినీ సేనా పృతనానీకినీ చమూః వరూథినీ బలం సైన్యంచక్రం చానీక మస్త్రియాం" అమరము. ఇవి సేనకు సమష్టిపర్యాయపదములైనను పరస్పరభేదము కలదు.

"ఏకే భై కరథాత్ర్యశ్వా పత్తిః పంచపదాతికా" ఒక యేనుఁగు ఒక రథము మూఁడు గుఱ్ఱములు ఏవురు కాలిబంట్లు గలసేన పత్తి యనబడును. మూఁడు పత్తులు సేనాముఖము, మూఁడు సేనాముఖములు గుల్మము, మూఁడు గుల్మములు ఒక గణము, మూఁడు గణము లొకవాహిని, మూఁడు వాహిను లొక పృతన, మూఁడు పృతన లొకచమువు, మూఁడు చమువు లొక యనీకిని, పది యనీకినులు ఒక యక్షౌహిణి.

	ఏనుఁగులు	రథములు	గుఱ్ఱములు	కాలిబంట్లు
సేనాముఖము	౩	౩	౯	౧౫
గుల్మము	౯	౯	౨౭	౪౫
గణము	౨౭	౨౭	౮౧	౧౩౫

వాహిని	౮౧	౮౧	౨౪౩	౪౦౫
పృతన	౨౪౩	౨౪౩	౭౨౯	౧౨౧౫
చముపు	౭౨౯	౭౨౯	౨౧౮౭	౩౬౪౫
అనీకిని	౨౧౮౭	౨౧౮౭౦	౬౫౬౧	౧౦౯౩౫
అక్షౌహిణి	౨౧౮౭౦	౨౧౮౭౦	౬౫౬౧౦	౧౦౯౩౫౦

గుఱ్ఱముల సంఖ్యయందుఁ దేరికిఁ గట్టిన గుఱ్ఱములు చేరవు. పదాతి సంఖ్యయందు ఏనుఁగులమీఁద గుఱ్ఱములమీఁదరథములమీఁదనుండు మనుష్యులుచేరరు.

కపులటే=కపులా? ఆశ్చర్యమును దెలుపును. దేవతలను జయించిన వానిని క్రోఁతులు చంపుట యాశ్చర్యకరము కదా, సానుయాత్రంబుగన్ = వెంటవచ్చిన కాలిబంట్లతోను, సహాయగజంబుగన్=గుఱ్ఱములతోను ఏనుఁగులతోను, నిర్మూలితులు=నిర్మూలము చేయఁబడినవారు, పేరు కూడ లేకుండఁ జేయుట నిర్మూలము చేయుట.

తాత్పర్యము

ప్రహస్తుని వెంటఁబోయి చావఁగా మిగిలిన సేన జరిగిన వృత్తాంతమంతయుఁ దెలుపఁగా విని రావణుఁడు పరాభవము వలనఁ గలిగిన కోపముచే దేహము తెలియనివాఁడై జయించి వచ్చునని తాను నమ్మిన తనకు ముఖ్యుఁడు ఇష్టుఁడునై యున్నవాఁడు చచ్చెనను శోకముచేఁ బీడింపఁబడినవాఁడై దేవతల సంబోధించు నింద్రునివలె రాక్షసులతో నిట్లనియె, స్వర్గమునకు నధిపతియైన యింద్రుని బలము నాశనముచేసినవాని, నా సేనకు నాయకుఁడైన వానిని భటులతో, నేనుఁగులతో, గుఱ్ఱములతో యుద్ధమందు వానరులా చంపిరి!!ఔరా!యిఁకనూరకుండరాదు. ఆహా యేమి వింత! క్రోఁతులా రాక్షసులను చంపుచున్నవి! అవి యెట్టి క్రోఁతులో!! చూచెదనుగాక. నేనేపోయి వారిపేరు లేకుండఁజేసి జయము కీర్తి పొందుదునుగాక.

'అప్సు ప్లవంతే పాషాణాః మానుషా ఘ్నంతి రాక్షసాన్
వానరాః కర్మ కుర్వంతి కాలస్య కుటిలాగతిః ॥'

నీళ్ళలో మునిఁగి పోవలసిన ఱాలు తేలుచున్నవి. రాక్షసుల కాహారమైన మనుష్యులు రాక్షసులను జంపుచున్నారు. క్రోఁతులు పనిచేయుచున్నవి! కాలగతి ఎంత వంకర యయ్యెను అని రావణుఁ డేడ్చెనని యొక చాటువు గలదు.

ఇంతవఱకుఁ బ్రభువగు తాను బ్రత్యక్షముగ యుద్ధమునకుఁ బోక పరులచే వానరుల జయింపఁజూచెను. ఎంతటి బలవంతులు పోయినను బోయిన వారదే పోక గాని మరల వచ్చినవారు లేరు. ఎవరిని బంపిన నిఁక నిదేగతి యని తలఁచియుఁ దానింటఁ గదలక కూర్చుండి యితరులఁ జంపించుచున్నాఁడని నింద రాకుండుటకును రాక్షసుల కుత్సాహము కలిగించుటకును దానే బయలుదేఱఁ దలఁచెను.

ఉ. ఏఁడుర నన్నుఁ దాఁకి మని ♦ యేగెడివాఁ డికఁ జూతుఁడీ ననున్
మాఁడిచి వైచెదం గపిస♦మాజముఁ గానను గారుచిచ్చు నాఁ
జూఁడెద రామలక్ష్మణులఁ ♦ జోకఁపు ములుకుల, నింతచేసినన్
దూఁడరిపుర్వులన్ నరులఁ ♦ ద్రుంతును గాకిఁక నే సహింతునే ? ౧౨౩౨

అర్థములు. మని = బ్రదికి, కానను = అడవిని, చూఁడెదన్ = కాల్చెదను, తూఁడరి పుర్వులను = చెడుపురుగులను, తుంట+అరి = తుంటరి, ఇది తూఁటరియై రూపాంతరమున తూఁడరి యయ్యెను, వికృతి హ్రస్వంబులకు ననునాసికములు పరములగుచో రూపాంతరంబున హ్రస్వంబునకు దీర్ఘంబును ననునాసికస్థానంబున నర్థబిందువు నగు. సు. వ్యా. సంజ్ఞ ౩౨. ఈ పద్యమునందలి, మాఁడు = మండు, చూఁడు=చుండు, ఈ సూత్రప్రకారమైన రూపంబులే.

తాత్పర్యము

ఎవ్వఁడురా నన్ను యుద్ధమందు నెదిరించి బ్రతికి పోవువాఁడు? ఇంతవరకు నీ యల్పకార్యమునకు మనము పోవలెనా యని యుపేక్షించి యుంటిని. ఇఁక నుపేక్షింప రాదు. ఇఁక నే నెట్టివాఁడనో చూడుఁడు. అడవినిగారుచిచ్చు గాల్చినట్లు కోతి గుంపును గూల్చివైచెదను. చక్కని బాణములచేత రామలక్ష్మణుల శుష్కింపఁ జేసెదను. దహించెదను. చెదపురుగులను ఇఁక నేను సహింతునా ?

చ. అని జ్వలనప్రకాశ మగు ♦ స్యందనమున్ హయరాజియుక్తమున్
ఘనమణిదీప్యమానమును ♦ గ్రద్దన యెక్కి మృదంగ భేరికా
నినదము శంఖరావమును ♦ నిస్తులరాక్షససింహనాదముల్
జనశుభ వాక్యము ల్వెలయ ♦ సంగరకుర్దనలిప్సుఁడై చనెన్. ౧౨౩౩

అర్థములు. జ్వలనప్రకాశము = అగ్ని కాంతిగలది, స్యందనమున్ = తేరిని, హయరాజియుక్తమున్ = గుఱ్ఱపు సమూహములతో గూడినది, ఘనమణి దీప్యమానమును = గొప్ప రత్నములచే బ్రకాశించునది, మృదంగ భేరికానినదము = మద్దెలయు నగారాలయు ధ్వని, సంగర కుర్దన లిప్సుఁడై=యుద్ధ క్రీడయం దాసక్తి గలవాఁడై పోయెను.

తాత్పర్యము

ఈ ప్రకారము పౌరుషములు పలికి యగ్నివలె వెలుఁగుచు పెక్కు గుఱ్ఱములు కట్టఁబడి గొప్ప రత్నములచేఁ బ్రకాశించు రథమును వేగముగ నెక్కి మద్దెలలయు నగారాలయు శంఖములయు ధ్వనులును రాక్షసుల సింహనాదములు ప్రజల యాశీర్వచన వాక్యములు విస్తరించుచుండ యుద్ధమను నాటయందుఁ గోరిక గలవాఁడై పోయెను.

తే. అద్రిజలదాభరూపమాం ♦ సాదనులును, నగ్నిసందీప్తలోచను ♦ లనుగమించి
రా నిశాచరరాజేంద్రు ♦ నసురనాథు, రుద్రుభూతముల్ వెనుకొను ♦ మాడ్కిఁ దోఁప.

అర్థములు. అద్రి జలదాభ = కఠినత్వమున కొండలతో, సంకోచ వికాసాదుల యనుకూలత మేఘములతో సమానమయిన-రూప = ఆకారముగల-మాంసాదనులును=మాంసభక్షకు లగు రాక్షసులును-అగ్ని సందీప్తలోచనులు = అగ్నివలె మండుచున్న కన్నులు గలవారును - అనుగమించిరి = వెంటఁబోయిరి. అసురనాథుఁడగు రుద్రున్-భూతముల్ = పిశాచములు - రావణునకు రుద్రునకు రాక్షసులకు పిశాచములకు నుపమానములు - ఉభయత్ర అసురనాథత్వము - తమోగుణము భయంకరరూపము సమము. రుద్రుఁడు తమోగుణవంతుఁ డని శ్రుతిస్మృతి పురాణ ప్రసిద్ధి కావున నీ యుపమానము చెప్పఁబడెను. "యోహవా అస్యతామసోంశసోఽసౌరుద్రః" అని మైత్రాయణీయోపనిషత్తు సందుఁ గలదు. కావుననే భాగవతమందు ముముక్షువులు భయంకరరూపులగు భూతనాథుల వదలి సాత్త్వికుఁడగు విష్ణువును ధ్యానింతురని చెప్పఁబడెను.

తాత్పర్యము

కఠినత్వమునఁ గొండలతోను, అనుకూలత కొలఁది దేహమును పెంచుట తగ్గించుట కలవారగుటచే మేఘములను బోలియున్నవారును అగ్నివలె మండుచున్న కన్నులు గలవారును నగు రాక్షసులు అసురనాథుఁడైన రుద్రుని వెంటఁ బిశాచములు పోవునట్లు రావణు వెంటఁబోయిరి.

తే. రావణుండిట్లు వాహినీ♦ రాజి గొలువఁ, బురము వెలువడ చని కాంచె♦ భూజశైల
హస్త మర్ణవజలదర♦ వాన్వితంబు, దృష్టిభీకర మైన క♦పీంద్రసేన. ౧౩౬౫

అర్థములు. వాహినీరాజి=సేనా సమూహము, భూజశైల హస్తము=చెట్లు కొండలు చేతఁగలది. అర్ణవ జలద రవాన్వితము=సముద్రముయొక్క- మేఘముల యొక్క- ధ్వనివంటి ధ్వనితోఁ గూడినది. దృష్టి భీకరము = చూచుటకు భయంకరమైనది, కపీంద్రసేన=వానరశ్రేష్ఠుల సైన్యము.

తాత్పర్యము

సేనాసమూహము సేవింపఁగా నిట్లు రావణుఁడు పురము విడిచి బయలుదేఱి పోయి చెట్లు కొండలు చేతుల ధరించి సముద్రమేఘములవలె ధ్వనించుచుఁ జూడ భయంకరమైన వానరసేనను జూచెను.

ఉ. వ్యాలధవోపమానభుజుఁ ♦ డద్రిచరేంద్ర సమన్వితుండు సు
శ్రీలలితుండు రాముఁడు వి♦శృంఖలమై సమితి ప్రచండమై
యాలముఁ గోరివచ్చు నసు♦రాధిప సైన్యముఁ జూచి శస్త్రవి
ద్యాలసితాగ్రగణ్యు సుగు♦ణాఢ్యు విభీషణుఁ గాంచి యిట్లనున్. ౧౩౬౬

అర్థములు. వ్యాలధవ = పాములకు రాజగు శేషునితో, ఉపమాన = సరిపోలు, భుజుఁడు=చేతులు గలవాఁడు, ఇట్లు చెప్పుటచే యుద్ధోత్సాహంబున బాహువులు పెరుఁగుచున్నవని భావము. 'మూఁపులు మూఁడగున్ రిపు సమా

హముఁ గన్నపుడే కిరీటికిన్’ అని కలదుకదా, వీరలక్షణము. అద్రిచరేంద్ర సమన్వితుండు = సుగ్రీవునితోఁ గూడియుండువాఁడు, ఇట్లు చెప్పుటచే వచ్చుచున్నవాఁడు రావణుఁడని యెఱిఁగి రామలక్ష్మణ రక్షణార్థము రావణునితో యుద్ధము చేయఁగోరి సుగ్రీవుఁడు వానర ప్రముఖులతోవచ్చి రాముని జుట్టుకొని యున్నారని భావము. సుశ్రీలలితుండు=మన పరాక్రమము చూపదగిన కాలము వచ్చెఁగదా యను సంతోషముచేఁ గలిగిన ముఖశోభచే మనోహరుఁడు, రాముఁడు=ఇట్టి వీర రసముతోఁ గూడియున్నను మనోహరుఁడుగా గానవచ్చువాఁడు విశృంఖలమై = అడ్డములేనిదై; సమితిప్రచండమై= మీఁదుమిక్కిలి కోపముగలదై, ఆలమున్ = యుద్ధమును, శస్త్రవిద్యాలసితాగ్రగణ్యుల్ = శస్త్రవిద్యచేఁ బ్రకాశించువారిలో శ్రేష్ఠుని, ఇట్లనుటచే విభీషణుఁడును గద సారించి యుద్ధసన్నద్ధుఁడై యుండెనని సూచితము, సుగుణాఢ్యా=స్వామిసేవ చేయవలయునను మంచి గుణసంపత్తి గల వానిని.

తాత్పర్యము

ఆదిశేషునితో సమానమైన భుజములు గలవాఁడును, వానర నాయకునితోఁ గూడినవాఁడును, మంచి ముఖకాంతి గలవాఁడును, నగు రామచంద్రమూర్తి అడ్డములేక మిక్కిలి కోపముగలదై యుద్ధముగోరివచ్చి రావణు సైన్యముఁ జూచి శస్త్రవిద్యయందు మొదటివాఁడును సద్గుణములు గలవాఁడును నగు విభీషణునిఁ జూచి యిట్లనియె.

శా. నానాకేతుకదంబజుష్టమును నా•నాప్రాసశూలాది సం
తానాభీలము దిగ్గజోపమమహా • దంతావళాన్వితమున్
నానాయోధవితానభీమ మయి సై•న్యం బొప్పె నక్షోభ్యమై;
దానిన్ నా కెఱుఁగంగఁ జెప్పు మసురేం•ద్రా యద్ది యెవ్వారిదో. ౧౩

అర్థములు. నానాకేతుకదంబజుష్టము = అనేక ధ్వజ సమూహములతో గూడినది, నానాప్రాసశూలాది సంతానాభీలము = అనేకవిధములైన ప్రాసములు శూలములు వీని సమూహముచే భయంకరమైనది, దిగ్గజోపమ = దిక్కులయందుండు నేనుఁగులతో సమానములైన, మహాదంతావళాన్వితమున్=పెద్ద యేనుఁగులతోఁగూడినది, నానాయోధవితానభీమము = అనేక యుద్ధభటుల సమూహముతో భయంకరమైనది, అక్షోభ్యము=కలతపెట్టరానిది, అసురేంద్రా యనుటచే వీరు నీ జాతివారే గనుక నీకుఁ దెలిసియుండునని భావము.

తాత్పర్యము

పెక్కువిధముల ధ్వజములతోఁ గూడినదియు పెక్కువిధము లయిన ప్రాస శూలాది సాధనములతోఁగూడి భయంకరమైనదియు దిక్కులయందుండు నేనుఁగులతో సమానమైనదియు నగు నీ సేన కలఁపరానిదై యున్నది. ఇది యెవరి సేనయో నాకుఁ దెలియఁజెప్పుము.

—♦ విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసవీరుల నిరూపించి చెప్పుట ♦—

కం. అవపుడు విభీషణుం డా, వనజాయతలోచనునకుఁ ♦ బంక్తిముఖుని వా
హిని నిట్లని విశదంబుగ, వినిచెం దత్సేనఁ గలుగు ♦ వీరులతోడన్. ౧౨౩౮

అర్థములు. వనజాయతలోచనునకున్ = తామరలవలె దీర్ఘములయిన కన్నులు గలవానికిని, ఔత్సుక్యముచేఁ జూచుటచే విచ్చిన కన్నులు పెద్దవయ్యె నని భావము, వాహిని=సేన, వినిచెన్=వినిపించెను.

తాత్పర్యము స్పష్టము.

మ. కరటిస్కంధగతుండు పూర్వగిరిశృం ♦ గభ్రాజమానాబ్జమి
త్రరుచిస్ఫీతముఖుండు శౌర్యఖని దో ♦ ర్దర్ప ప్రథాశాలి దు
ర్ధరతేజుండు స్వభారసంచలిత వే ♦ దండోత్తమాంగుండు భూ
వరచంద్రా ! యతఁడే యకంపనుఁడు దే ♦ వద్వేషిరాట్పుత్రుఁడున్. ౧౨౩౯

అర్థములు. కరటిస్కంధ గతుండు=ఏనుఁగు మూఁపునందుఁ గూర్చున్న వాఁడు, పూర్వగిరి శృంగ=తూర్పుపర్వతము శిఖరముమీఁద, భ్రాజమాన=ప్రకాశించు, అబ్జమిత్ర = సూర్యునివంటి, రుచిస్ఫీతముఖుండు = కాంతిచే నతిశయించిన ముఖము గలవాఁడు, శౌర్యఖని=పరాక్రమమునకు గని - దోర్దర్ప ప్రథాశాలి = భుజబల గర్వంబునఁ గీర్తికన్నవాఁడు, దుర్ధరతేజుండు = సహింపరాని తేజస్సు గలవాఁడు—స్వభార=తన బరువుచే- సంచలిత = కదలుచున్న - వేదండోత్తమాంగుండు = ఏనుఁగు శిరస్సుగలవాఁడు — దేవద్వేషిరాట్ + పుత్రుఁడున్ = రావణాసురుని కొడుకు.

తాత్పర్యము

ఏనుఁగు మెడపైఁ గూర్చున్నవాఁడు తూర్పుకొండమీఁద సూర్యుని కాంతి వంటి కాంతిగల ముఖము గలవాఁడు—శౌర్యమునకు గని-భుజబలము గలవాఁడను కీర్తిచేఁ బ్రకాశించువాఁడు, శత్రువులకు సహింపరాని తేజస్సు గలవాఁడు- తన బరువును మోయలేక తల కదలించు నేనుఁగు గలవాఁడు. రామచంద్రా! వాఁడే రావణాసురుని కొడుకగు నకంపనుఁడు.

శా. జంభారాతిశరాసనద్యుతిలస ♦ చ్చాపంబుఁ దాఁ ద్రిప్పుచున్
గుంభిద్వేషిపతాకమా రథమునం ♦ గూర్చుండి ప్రాచీదిశా
కుంభింబోలి వివృత్తదంష్ట్రుఁడయి ని ♦ క్కల్ మీఱువాఁడే చుమీ
జంభారిస్మయహారి యింద్రజినరా ♦ జయ్యుండు ధాత్రీశ్వరా ! ౧౨౪౦

అర్థములు. జంభారాతి = ఇంద్రుని, శరాసన = వింటియొక్క, ద్యుతి= కాంతిచే, లసత్ =ప్రకాశించు, చాపంబున్ = వింటిని, కుంభిద్వేషిపతాకము = ఏనుఁగు విరోధియగు సింహధ్వజము, ఔ = కల, ప్రాచీదిశాకుంభిన్ = తూర్పు దిక్కునందలి ఐరావతమును, వివృత్తదంష్ట్రుఁడయి=గుండ్రని కోఱలు గలవాఁడై,

జంభారిస్మయహారి = ఇంద్రుని గర్వ మణచినవాఁడు, వరాజయ్యుండు=బ్రహ్మవరములచే జయింపరానివాఁడు, ఇంద్రజి=ఇంద్రజిత్తనువాఁడు.

తాత్పర్యము

ఇంద్రధనుస్సు కాంతిగల వింటిని త్రిప్పుచు సింహధ్వజము గల రథమునం దున్నవాఁడై, యైరావతము దంతములవంటి గుండ్రని దంతములు గలవాఁడై యుండువాఁడే, బ్రహ్మవరముచే జయింపరానివాఁడై యింద్రుని గర్వ మణఁచిన యింద్రజిత్తనువాఁడు.

చ. అతిరథసింహుఁ డుత్తమశ ♦ రాసనటంకరణోగ్రుఁ డస్తమన్
క్షితిధరమున్ మహేంద్రమును ♦ నిస్తులవింధ్యముఁ బోలువాఁడు దా
నతిపరివృద్ధకాయుఁడు శ ♦ తాంగగతుండు సమీకమం దనా
హతుఁ డతికాయనాముఁడు మ ♦ హాద్భుతకర్ముఁడు మానవేశ్వరా. ౧౭౮౧

అర్థములు. అతిరథసింహుఁడు=అతిరథులందు శ్రేష్ఠుఁడు,(౨) అతిరథుఁడును సింహమునైన వాఁడతిరథసింహుఁడు. వేయి గుఱ్ఱములు కట్టిన గొప్ప రథము గలవాఁడు అతిరథుఁడు. అతివీరుఁడు = సింహుఁడు, ఇంద్రజిత్తు మాయా బలముచే వీరుఁడు. వీఁడు మాయ లేకయు వానికంటెను వీరుఁడు. ఉత్తమ శరాసన = శ్రేష్ఠమైన వింటియొక్క, టంకరణ=టంటమ్మని మ్రోగించు, ఉగ్రుఁడు = భయంకరుఁడు, అస్తమన్ క్షితిధరము=సూర్యుడస్తమించుకొండ, మహేంద్రము= మహేంద్ర పర్వతము, నిస్తుల=అసమానమైన, వింధ్యమును=వింధ్యపర్వతమును పోలువాఁడు, అస్తపర్వత మనుటచే ఇతరుల తేజము నణఁచు శక్తియు, మహేంద్ర సామ్యముచేత నత్యున్నతత్వమును సూచితము. అతిపరివృద్ధకాయుఁడు = మిగుల వృద్ధిపొందిన దేహము గలవాఁడు, శతాంగగతుండు = రథమునం దున్నవాఁడు, సమీకమందు = యుద్ధమందు, అనాహతుఁడు = కొట్టఁబడనివాఁడు, అతికాయ నాముఁడు = అతికాయుఁడను పేరుగలవాఁడు, మహాద్భుతకర్ముఁడు = యుద్ధమందాశ్చర్యకరములైన కార్యములు చేయువాఁడు, మానవేశ్వరా!=రాజా.

తాత్పర్యము

వేయిగుఱ్ఱములు గట్టిన తేరు గలవాఁడు, అతివీరుఁడు, శ్రేష్ఠమైన ధనుస్సు మీటుచుండువాఁడు,అస్తాద్రి మహేంద్ర వింధ్యశైలములను బోలువాఁడు-మిగులఁ బెద్దదగు దేహముగలవాఁడు, రథముమీఁదనుండువాఁడు, యుద్ధమందు జయింపఁ బడనివాఁడు, యుద్ధమందు మిగులనద్భుతమగు సాహస కార్యములు చేయువాఁడు, వీని పేరు అతికాయుఁడు.

శా. బాలార్క ప్రతిమానలోచనుఁడు భా ♦ స్వద్ఘంటికానిస్స్వనా
భీలానేకపవాహనుండు నిజవి ♦ ద్విడ్భీతిసంధాత వీ

రాళీప్రాగ్రసరుండు భూరిఖరనిర్హ్రాదుండు రామావనీ
పాలా! వాఁడు మహోదరుం డనెడు దేవద్వేషి వీక్షింపుమా. ౧౨౮౨

అర్థములు. బాలార్క ప్రతిమాన = లేఁత సూర్యునితో సమానమైన, లోచనుఁడు = కన్నులు గలవాఁడు, భాస్వత్ = ప్రకాశించు, ఘంటికా నిస్వన= ఘంటానాదముచే, ఆభీల=భయంకరమైన, అనేకపవాహనుండు = ఏనుఁగు వాహనము గలవాఁడు, తొండముతో నోటితో రెంటను నీళ్ళుత్రాగును గనుక నేనుఁగునకు అనేకప మని ద్విపమనుపేరు నిజవిద్విట్=తన శత్రువులకు, భీతి సంధాత = భయము గలిగించు వాఁడు, వీర + ఆళీ = వీరుల సమూహ మందు, ప్రాగ్రసరుండు = శ్రేష్ఠుఁడు, భూరి = గొప్పదగు ఖర = పరుషమగు, నిర్హ్రాదుండు = సింహనాదము గలవాఁడు, రామావనీపాలా=రామరాజా, దేవద్వేషి=రాక్షసుడు, దేవతలకు శత్రువు.

తాత్పర్యము

ఉదయించుచున్న సూర్యునివంటి కన్నులు గలవాఁడు, గంటలు మ్రోగుచున్న యేనుఁగు నెక్కినవాఁడు, తన శత్రువులకు భయము గలిగించువాఁడు, వీరులందు శ్రేష్ఠుఁడు, పెద్ద పరుషపుధ్వని కలవాఁడు వాఁడే రామచంద్రా! మహోదరుఁ డను పేరుగల రాక్షసుఁడు.

శా. సాయాహ్నాభ్రగిరిప్రకాశవిలసజ్జాంబూనదాలంక్రియా
స్ఫాయత్సైంధవయానుఁ డై ధగధగజ్జ్వాలావలీనద్ధగాం
గేయావిష్కృతముష్టి కుంతవరముం గీలించి కేలన్ రణ
వ్యాయామాస్థను వచ్చు నాతఁడు పిశాచాఖ్యుండు సీతాధిపా! ౧౨౮౩

అర్థములు. సాయాహ్న = సాయంకాలమందలి, అభ్ర = మేఘముతో గూడిన, గిరి=కొండయొక్క, ప్రకాశ=కాంతితో, విలసత్ =ప్రకాశించు, జాంబూనద=బంగారుతో చేయబడిన, అలంక్రియా=ఆభరణములచే, స్ఫాయత్ =ప్రకాశించు, సైంధవయానుఁడై =గుఱ్ఱమును వాహనముగా గలవాఁడై, ధగధగజ్జ్వాలావళీ=ధగధగ మను కాంతి సమూహముచే-నద్ధ=కూడినదై, గాంగేయ = బంగారుచే-ఆవిష్కృత=విస్తరింపఁబడిన = ముష్టి = పిడికిలిపట్టుగల - కుంతవరమున్= కుంతమను నుత్తమాయుధమును - రణవ్యాయామాస్థను=యుద్ధ పరిశ్రమ మందలి కోరికచే-పిశాచాఖ్యుండు = పిశాచుఁ డను పేరు గలవాఁడు - సీతాధిపా = ఇది సీతను స్మృతికిఁ దెచ్చుటచే రోషము కలిగించుటకై చెప్పిన మాట.

తాత్పర్యము

సాయంకాలమందలి మేఘమును దన మీఁదఁగల కొండ కాంతివంటి కాంతిచే బ్రకాశించు బంగారు సొమ్ములు గల గుఱ్ఱముపై నెక్కినవాఁడును, ధగధగ మను కాంతులు గల బంగారు సొమ్ములు విస్తారముగాఁగల పిడికిలిపట్టుగల కుంత మను

నాయుధము చేతఁ గలవాఁడును, రణపరిశ్రమమం దభిలాష గలవాఁడై వచ్చు వాఁడే సీతానాథా! పిశాచుఁ డనువాఁడు.

ఉ. కింకరవజ్రవేగ మని ♦ కీర్తిత మైన వృషంబు నెక్కి ని
శ్శంకమతిన్ క్షణప్రభల ♦ జాలము లీనెడి శాతశూలమున్
బింకము మీఱఁ బట్టి యతి♦వేగమునం జనుదెంచువాఁడు పు
ణ్యాంక, రఘూత్తమా! త్రిశిరుఁ ♦ డ న్బలియుండు జగత్ప్రసిద్ధుఁడున్.

అర్థములు. కింకర = సేవకునివలెఁ జేయఁబడిన; వజ్రవేగ = వజ్రము యొక్క వేగముగల, వజ్రవేగమునకంటె నతిశయించిన వేగము గలదని భావము. వృషంబు = ఎద్దు, క్షణప్రభల=మెఱుపుల, జాలము=సమూహము, శాత శూలమున్=వాడియగు శూలమును, పుణ్యాంక=పుణ్యమే భూషణముగా గలవాఁడా.

తాత్పర్యము

వజ్రవేగమునకంటె మిక్కిలి వేగముగల యెద్దునెక్కి నిర్భయమైన మనస్సుతో మెఱుపుల కాంతులు గలిగించు వాఁడి శూలమును జేతఁబట్టుకొని మిక్కిలి వేగముతో వచ్చుచున్నవాఁడు త్రిశిరుఁ డను బలశాలి, లోకములందుఁ బ్రసిద్ధుఁడు.

ఉ. కుండలిరాజకేతనుఁడు ♦ కుంభుఁడు వ్యూఢసుజాతపీనవ
క్షుం డమృతాశనోత్కరని♦షూదనదక్షుఁడు తాలతుల్యకో
దండవిధూననుండు భృశ♦దారుణకార్ముకటంక్రియావిరా
వుండు ప్రచండవిక్రముఁడు ♦ భూమిసుతారమణీమనోహరా! ౧౨౪౫

అర్థములు. కుండలి రాజకేతనుఁడు = సర్పరాజు గుర్తుగల ధ్వజము గలవాఁడు, వ్యూఢ=విశాలమును, సుజాత=అందమైనదియు, పీన=బలిసిన, వక్షుండు= ఱొమ్ముగలవాఁడు, అమృతాశన = అమృతము నాహారముగాఁగల దేవతల, ఉత్కర=సమూహమును, నిషూదన = చంపుటయందు, దక్షుఁడు = సమర్థుఁడు, తాలతుల్య=తాటిచెట్టుతో సమానమైన, కోదండ విధూననుండు=వింటిని ద్రిప్పుచున్నవాఁడు, భృశదారుణ=మిక్కిలి భయంకరమైన కార్ముక టంక్రియా విరావుండు=వింటి టంకారధ్వని గలవాఁడు, ప్రచండ విక్రముఁడు=మిగుల తీక్ష్ణమైన పరాక్రమము గలవాఁడు, భూమి సుతా రమణీ మనోహరా=జానకీవల్లభా.

తాత్పర్యము

సర్పరాజు గుర్తుగల ధ్వజముగలవాఁడు, విశాలమై అందమై బలిసిన ఱొమ్ము గలవాఁడు, దేవతా సమూహములఁ జంపుటయందు సమర్థుఁడు, తాటిచెట్టునంత వింటిని ద్రిప్పువాఁడు, మిగుల భయంకరమైన వింటి టంకారధ్వని గలవాఁడు, అతి తీవ్రమైన పరాక్రమము గలవాఁడు. వీఁడె కుంభుఁ డనెడివాఁడు.

ఉ. ఆతనిసోదరుం డతిభ♦యంకరరూపుఁడు దైత్యవాహినీ
కేతనభూతుఁ డుగ్రరణ♦కేళ్యవిచింతిత ఘోరకర్ముఁడున్

ఖ్యాతబలుండు రత్నమయ ♦ హాటకజుష్టవిధూమదీప్తిమా
లాతతసంజ్వలత్పరిఘ ♦ హస్తుఁడు రామ! నికుంభుఁ డాఖ్యచేన్. ౧౨౮

అర్థములు. దైత్యవాహినీ = రాక్షససేనకు, కేతనభూతుఁడు = ధ్వజము వంటివాఁడు, ఉగ్రరణకేళి=భయంకర యుద్ధక్రీడయందు, అవిచింతిత = చింతింపరాని, ఘోరకర్ముఁడున్=భయంకరకార్యము గలవాఁడు, ఖ్యాతబలుండు=ప్రసిద్ధికెక్కిన బలము గలవాఁడు, రత్నమయ = రత్నములతో నిండిన, హాటక = బంగారుతో, జుష్ట=కూడినదియు, విధూమ=పొగలేని, దీప్తిమాలా=కాంతివరుసలు గల, ఆతత=విస్తారమైన, సంజ్వలత్=మండుచున్న, పరిఘహస్తుఁడు=ఇనుపకట్లగుదియ చేతియందుఁగలవాఁడు, ఆఖ్యచే=పేరుచే, నికుంభుఁడు.

తాత్పర్యము

ఆ కుంభుని తోడబుట్టినవాఁడు (వీ రిరువురు కుంభకర్ణుని కొడుకులు) మిగుల భయము గలిగించు రూపము గలవాఁడు, రాక్షససేనయందు శ్రేష్ఠుఁడు, భయంకర యుద్ధములందు సహింపరాని ఘోరకార్యములు చేయువాఁడు, బలవంతుఁడని ప్రసిద్ధి గన్నవాఁడు, మణులు చెక్కిన బంగారుతోఁగూడి పొగలేని కాంతి జ్వాలలచేఁ బ్రకాశించు నినుపకట్ల గుదియకలవాఁడు, వాఁడే నికుంభుఁ డను పేరుగలవాఁడు.

ఉ. చాపకృపాణ కాండముఖ ♦ సాధనసంచయ భాసమాన మై
దీపితహవ్యవాహన స ♦ దృక్షము వ్యోమచలత్పతాకమా
శ్రీ పరిణద్ధ ఘోటక వి ♦ శిష్ట శతాంగముపై నుదగ్ర మా
రూపున నున్నవాఁడు నగ ♦ రూఢసుయోధి నరాంతకుండగున్. ౧౨౯

అర్థములు. చాప=విల్లు, కృపాణ = కత్తి, కాండ = బాణము, ముఖ = మొదలైన, సాధన సంచయ = ఆయుధ సమూహముతో, భాసమానమై=ప్రకాశించునదియై, దీపిత = మండుచున్న హవ్యవాహ = అగ్నిహోత్రముతో, సదృక్షము = సమానమై, వ్యోమ = ఆకాశమందు, చలత్ = కదలుచున్న, పతాకము=ధ్వజముకలది, శ్రీపరిణద్ధ = కాంతిచేఁ గూడిన, ఘోటక విశిష్ట = గుఱ్ఱములతోఁగూడిన, శతాంగముపై=తేరిమీఁద, నగరూఢ సుయోధి=పర్వతములతో బ్రసిద్ధముగా యుద్ధముచేయువాఁడు, తనతో యుద్ధము చేయఁగలవారు లేకుండుటచే తన బలము పర్వతములపై జూపువాఁడనుట.

తాత్పర్యము

విండ్లు కత్తులు బాణములు లోనగు సాధన సమూహములచేఁ బ్రకాశించునదియై మండుచున్న యగ్నితో సమానమై యాకాశము దెగురుచున్న ధ్వజము గలదై కాంతులతోఁ గూడిన గుఱ్ఱములు కట్టఁబడిన తేరిమీఁద భయంకరమైన రూపమున నుండువాఁడు పర్వతములతో యుద్ధము చేయువాఁడు నరాంతకుఁడను వాఁడు.

సీ. నానావిధాకార♦నాగేంద్రశార్దూల, పీతిమృగోష్ట్రాస్య♦భూతచయము
బలసి రా రుద్రుని♦భాతి వెలుంగుచు, సూక్ష్మశలాకంబు ♦ సుందరంబు
సోమసంకాశంబు ♦ శుభ్రాతపత్రంబు, రహిమీఱు మకుటంబు ♦ రాణ దనరఁ
దళతళలాడంగఁ ♦ జలకుండలంబులు, ప్రాలేయధరవింధ్య♦పర్వతములఁ
ఆ. బోలు భీమతనుఁడు ♦ పురుహూతసమవర్తి, దర్పహంత యపర♦తపనమూర్తి
నాకలోకమంది♦రార్తిఘటకకీర్తి, సదయ! యతఁడె యసుర♦చక్రవర్తి. ౧౨౪౮

అర్థములు. నానావిధాకార = అనేక విధములైన రూపములు గల, నాగేంద్ర=ఏనుఁగులయు, శార్దూల =పులులయు, పీతి = గుఱ్ఱములయు. మృగ = జింకలయు, ఉష్ట్రి=ఒంటెలయు, ఆస్య=ముఖములు గల, భూతచయము=పిశాచ సమూహము, బలసి = చుట్టుకొని, రాన్ = రాఁగా, రుద్రుని భాతి = రుద్రుని వలె, సూక్ష్మశలాకంబు=సన్నని కమ్ములుగలది, సోమసంకాశంబు=చంద్రునితో సమానమైనది, శుభ్రాతపత్రము = తెల్లని గొడుగు, మకుటంబు = కిరీటము, చల కుండలంబులు = కదలుచున్న చెవిపోగులు, ప్రాలేయధర = మంచుగొండతోను, వింధ్యపర్వతములు=వింధ్యపర్వతములతోను,పోలు=సరియగుచున్న,భీమతనుఁడు= భయంకర దేహము గలవాఁడు, పురుహూత=ఇంద్రుని యొక్కయు, సమవర్తి= యముని యొక్కయు–దర్పహంత=గర్వమును జంపినవాఁడు-అపర తపనమూర్తి= రెండవ సూర్యుఁడు - నాగలోకమందిర = స్వర్గలోక మిల్లుగాఁ గల దేవతలకు - ఆర్తిఘటక=దుఃఖము గలిగించువాఁడను - కీర్తి = ప్రసిద్ధి గలవాఁడు - అసుర చక్రవర్తి = రాక్షస సార్వభౌముఁడు = రావణుఁడు.

తాత్పర్యము

౨౩౪ వ పద్యమునందుఁ జెప్పఁబడిన రుద్రోపమాన మిందు విస్తరింపఁ బడుచున్నది. నానావిధములైన యాకారములు ఏనుఁగు-పులి-గుఱ్ఱము-జింక – ఒంటె వీని ముఖములుగల పిశాచములు కొలిచి రాఁగా రుద్రునివలె వెలుంగుచు సన్నని కమ్ములు కలిగి యందమై చంద్రునివంటిదైన తెల్లని గొడుగు ప్రకాశింపఁగా కిరీట మొప్పుచుండ చెవుల పోగులు తళతళమని మెఱయుచుండ హిమవంతము వింధ్యముఁబోలు భయంకర దేహముగలవాఁడు, ఇంద్రియముల గర్వ మణఁచినవాఁడు. రెండవ సూర్యుని వంటివాఁడు, దేవతలను దుఃఖపెట్టినవాఁడు దయాశీల! వాఁడె రాక్షసరాజు రావణుఁడు.

—♦ శ్రీరాముఁడు రావణుఁ జూచి యాశ్చర్యపడుట. ♦—

కం. శ్రీరాముఁ డా నుడు ల్విని, యౌరా తేజంబు! పటుప♦రాక్రమ మరరే!!
సూరుఁడు కరములచే వలె, నీ రావణుఁ డమరె దుర్ని♦రీక్షుండగుచున్.

అర్థములు. సూరుఁడు=సూర్యుఁడు,కరములచే=కిరీటములచే,దుర్నిరీక్షుఁడు= చూడ సాధ్యముకానివాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. దేవతలయందు నేనియు, దేవారులయందు నిట్టి ♦ తేజోయుతరూ
పే వేళ వినఁగఁబడె నే, యీ వీరునిదీప్తి కలుగ ♦ దిల నెవ్వరికిన్. ౧౨౫౦

అర్థములు. దేవారులయందు = దైత్యదానవులయందు నేని.

తాత్పర్యము స్పష్టము.

కం. అందఱును శైలతుల్యులు, నందఱు నగయోధు లంద ♦ తాయుధధరులున్
మందేతరతేజులు వీ,నిం దిరు లయి కొలిచి వచ్చు ♦ నిశిచరవీరుల్. ౧౨౫౧

అర్థములు. శైలతుల్యులు=పర్వతముతో సమానులు, నగయోధులు = పర్వతములవంటి శూరులు, మందేతరతేజులు=తీక్ష్ణమైన తేజస్సు గలవారు, తిరులయి=ధీరులయి, నిశిచరవీరుల్=రాక్షసవీరులు.

తాత్పర్యము స్పష్టము.

కం. భీమపరాక్రమముం దే,జోఽమితవిగ్రహము తీక్ష్ణ ♦ మగు బహుభూత
స్తోమము గొలువఁగ నీతెం, డా మార్తండాత్మజాతు♦నట్లు వెలింగెన్.

అర్థములు. తేజోఽమితవిగ్రహము=అపరిమిత తేజస్సుగల యాకారము, ఆ మార్తండాత్మజాతునట్లు=ఆ సూర్యుని కొడుకగు యమునివలె.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈపగిది దైవవశమున, నీపాపాత్ముఁడు నాదు ♦ దృష్టిపథంబున్
బ్రాపించె వీనిపై సీ,తాపహరణజనితరోష ♦ మంతయు విడుతున్. ౧౨౫౩

అర్థములు. దైవవశమునన్ = అదృష్టకారణమున, సీతాపహరణ జనిత రోషము=సీతను హరించుటవలనఁ గలిగిన కోపము.

తాత్పర్యము

ఈ విధముగ నదృష్టవశమున నీ పాపపు మనస్సు గలవాఁడు నాకుఁ గానవచ్చెను. వీని మీఁద సీతాదేవిని వీఁడు హరించుటచేఁ గలిగిన కోపమంతయు విడుతును.

కం. అని రామచంద్రుఁ డంతట, ధనువుం గొని యెక్కు పెట్టి ♦ దారుణశరమున్
దొన నుండి దూసి కైకొని, యనుజునితో నిలిచె సంగ♦రార్పితమతి యై.

అర్థములు. దొననుండి = అమ్ముల పొదినుండి, సంగరార్పిత మతియై = యుద్ధమునం దుంచఁబడిన మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

అని చెప్పి రామచంద్రమూర్తి విల్లు తీసికొని యెక్కుపెట్టి తీక్ష్ణమైన బాణమును పొదినుండి దూసి తీసికొని యుద్ధమందు మనస్సునిలిపి తమ్మునితో నిలఁబడెను.

సీ. అసురాధినాయకుం ♦ డనుచరులను బల్కు, నరుగుఁడు మీ రెల్ల ♦ మరలి పురికి
ద్వారచర్యాగృహ♦ వారగోపురముల, నిలుఁవుఁడు మదిలోన ♦ నళుకు లేక

యెల్లరు నిటవచ్చు ♦ లెఱిఁగినచో వనచారులు తమ కిదే ♦ సమయ మనుచు
శూన్యపట్టనమును ♦ జొచ్చి ధ్వంసముఁ జేసి, పాడుచేయఁగఁ బూను ♦ వారు నుండు
ఆ. పొం డటంచుఁ బంపి ♦ దండిమగం డంత, నర్ణవంబుఁ జొచ్చు ♦ నమితరూప
ఝషముపోలెఁ గీశ ♦ సైన్యసాగరమును, వ్రచ్చి కొనుచుఁ జొచ్చెఁ ♦ గచ్చుమెఱసి.

అర్థములు. ద్వారచర్యాగృహ వార గోపురములన్=ప్రాకారము వాకి టను పురమునందును గట్టఁబడిన యిండ్ల వాకిండ్లయందు. అళుకు = భయము, శూన్యపట్టనము = కాపాడఁదగిన వీరులులేని పట్టనము, అర్ణవంబు = సముద్రము, ఝషము=చేఁప, వ్రచ్చికొనుచున్=చీల్చుచు, కచ్చు=గర్వము.

తాత్పర్యము

రావణుఁడు తనతోడ వచ్చిన వారి నందఱను జూచి యిట్లనియె. మీరందఱు మరలిపొండు. కోట గవనుల యొద్ద యిండ్ల యొద్ద గృహగోపురములందు కావలి యుండుఁడు. భయపడవలదు. అందఱు నిచ్చటికి వచ్చినారనిన వార్త వానరు లెఱిఁగిరా తమ కిదే సమయమని శూరులులేని పట్టనమునఁ బ్రవేశించి యంతయు నాశముచేసి పాడుచేయ యత్నింతురు. కావునఁ బొండు అని చెప్పి యా గొప్ప శూరుఁడు సముద్రములోఁ బెద్దచేఁప బ్రవేశించినట్లు వానరసేనను రెండుగాఁ బగుల దీసికొనుచు గర్వముతోఁ బ్రవేశించెను.

—♦ రావణుఁడు సుగ్రీవాదులతోఁ బోరుట ♦—

శా. సాహంకారకఠోరనాదదళితా ♦ శాకుడ్యభాగుండు నై
యాహోపూరుషికం బ్రదీప్తవిశిఖే ♦ ష్వాసుండు నా రాక్షస
వ్యూహాధీశ్వరుఁ జూచి సూర్యసుతుఁడుం ♦ బ్రోద్యన్మహారోషుఁ డై
బాహాటోపవిజృంభమాణుఁ డగుచుం ♦ బైవైచె శైలాగ్రమున్. ౧ ౩౫౬

అర్థములు. సాహంకార = అహంకారముతోఁ గూడిన, కఠోర=పరుష మైన, నాద = ధ్వనిచే, దళిత = చీల్చఁబడిన, ఆశాకుడ్యభాగుండు = దిక్కుల గోడల యందలి భాగము గలవాఁడు, ఇది లోకాలోక పర్వతమో బ్రహ్మాండ కర్పరమో కావచ్చును. అతిశయోక్త్యలంకారము, ఆహోపూరుషికన్=అహో పురుషిక యే, ఆహోపురుషిక, స్వార్థకప్రత్యయాంతము. 'అహోయం పురుష ఇతి బుద్ధి రాహో పూరుషిక' యని వ్యుత్పత్తి. తాను గొప్పవాఁడనను గర్వముచే వని యర్థము, ప్రదీప్త విశిఖేష్వాసుండు=మండుచున్న బాణములు గల విల్లుగల వాఁడు, రాక్షస వ్యూహాధీశ్వరున్=రాక్షస సమూహమునకు రాజు, ప్రోద్యన్మహా రోషుఁడై = విశేషముగఁ బట్టుచున్న గొప్ప కోపము గలవాఁడై, బాహాటోప విజృంభమాణుఁడు = భుజబల సంభ్రమము యొక్క యతిశయము గలవాఁడు, శైలాగ్రమున్ = కొండశిఖరమును.

తాత్పర్యము

అహంకారముతోఁ గూడిన నిష్ఠురమైన కంఠనాదముచే దిక్కులు పగులఁ జేయుచు నాకంటె గొప్పవాఁ డెవఁడను గర్వముతో మండుచున్న బాణములు విల్లు గలవాఁడైన రావణుని జూచి మిక్కిలి కోపించినవాఁడై సుగ్రీవుఁడు భుజబలము వేగము నతిశయింపఁ జేసినవాఁడై కొండశిఖర మెత్తి వానిపై వైచెను.

ఉ. వానరరాజముక్త కుజ • వారసమంచితసానుయుక్త ని
స్స్వన భయంకరాద్రి తన•పై నరుదెంచుట గాంచి రుక్మపుం
ఖానుపమానవేగవిశి • ఖావళిఁ జాపకళాప్రవీణుఁ డా
దానవభర్త యేసె శత•ధా వికలంబయి నేల రాలఁగన్. ౧౩౫౭

అర్థములు. వానర రాజముక్త=సుగ్రీవునిచే వేయఁబడిన, కుజవార సమంచిత = చెట్లసమూహముతోఁ బ్రకాశించు, సానుయుక్త = చఱులతో గూడిన, నిస్స్వన = ధ్వనిచే, భయంకర = భయము గలిగించు, అద్రి = కొండ, రుక్మపుంఖ = బంగారు పింజలు గలిగి, అనుపమాన వేగ=అసమాన వేగముగల. విశిఖావళిన్=బాణసమూహమును, చాపకళాప్రవీణుఁడు = విల్లువిద్యయందు నేర్పరి, శతధావికలంబులు = నూఱు తునుకలై.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేసిన చెట్లతోఁగూడిన చఱులుగల కొండ తనమీఁదికి రాఁగాఁ జూచి విలువిద్యయందు నేర్పుగల రావణుఁడు బంగారు పింజలు మిక్కిలి వేగము గల బాణములచే దానిని నూఱు తునుకలుగాఁ నేలఁ బడఁగొట్టెను.

ఉ. ఏసియు వానరేంద్రు వధి•యింపఁగ గోరి సరోషచిత్తుఁడై
వాసవసాధనోపమ మ•వారితమారుతతుల్య వేగమున్
భాసురశాతమార్గణముఁ • బావకతేజము గాఢముష్టి నా
యాసురభర్త వైచె హృద•యాంతరదేశము నాట సూఁటిగన్. ౧౩౫౮

అర్థములు. వాసవసాధనోపమము = వజ్రముతో సమానమైనది, అవారిత = వారింపరానిది, మారుత తుల్యవేగము=వాయువేగముతో సమానమగు వేగముగలది, విశేషణోభయపదకర్మధారయసమాసము. భాసుర = కాంతిగల, శాతమార్గణము = వాఁడిగల బాణము, పావక తేజము = అగ్ని తేజస్సువంటి తేజస్సుగలది, గాఢముష్టి=దృఢమైన పిడికిట, హృదయాంతరదేశము = ఱొమ్ము లోపలి భాగము.

తాత్పర్యము

అట్లు వేసియు సుగ్రీవుని జంపఁదలఁచి రావణుఁడు కోపముతోఁగూడిన మనస్సు గలవాఁడై వజ్రాయుధముతో సమానమైనదియు వారింపరానిదియు వాయు వేగము

గలదియు నగు బాణమును దృఢముష్టిని లాగి ఱొమ్మలోపల నాటునట్లు గుఱి చూచి వైచెను.

తే. షణ్ముఖప్రేరితం బైన ♦ శక్తి క్రౌంచ, పర్వతము నుచ్చిపోయిన ♦ పగిది గాఁగ
దశముఖవిముక్త దారుణ ♦ విశిఖ మపుడు, వేఁడి వెలుఁగులదొరపట్టిఁ ♦ గాఁడి పాఱె.

అర్థములు. షణ్ముఖ ప్రేరితము=కుమారస్వామిచేఁ బ్రయోగింపఁబడినది, శక్తి=శక్తి యను నాయుధము, ఉచ్చిపోయిన=తూటిపోయిన, దశముఖవిముక్త=రావణుచే విడువఁబడిన, దారుణవిశిఖము = తీక్ష్ణబాణము, వేఁడి వెలుఁగుల దొర పట్టి=సూర్యపుత్రుని, కాఁడి=నాటి, పాఱెన్=ఆవల వెడలిపోయెను.

తాత్పర్యము

ఆఱు తలలు కుమారస్వామి వేసిన శక్తి యను నాయుధము క్రౌంచ పర్వతము ను భేదించి యీవలనుండి యావలకు వెడలి పోయినట్లు పదితలలవాఁడు వేసిన బాణము సుగ్రీవు ఱొమ్మున నీప్రక్క నాటి యాప్రక్క వెడలి పోయెను.

రామచంద్రమూర్తి వాలి ధరించిన హారమునకు భయపడి చాటుగ నుండి కొట్టెనని కొందఱు చెప్పెడిమాట సరిగాదనియు నది దూరమందుండువారి నేమియుఁ జేయఁజాల దనియు మందరము కిష్కింధాకాండయందు చెప్పబడెను. దాని కిదే ప్రమాణము. సుగ్రీవుఁ డిప్పు డా హారము ధరించియున్నాఁడు. అది యతనిని రక్షింపఁ జాలనిది కాదయ్యెను. రావణుని బాణమునందు సుగ్రీవుని జంపునంత శక్తి లేకుండెను. కాన సుగ్రీవుఁడు మూర్ఛపోయెను. రామబాణమందు వాలిని జంపు శక్తి యుండెను. కావున నీ హారమునకు వెఱచి రాముఁడు చాటుననుండి వాలిని గొట్టెననుట సరిగాదు.

కం. ఆ సాయక వేదనచే వానరపతిసుతుఁడు కూఁత ♦ వైచుచుఁ బడినన్
మాసర మగు సంతసమున, నాసురసైన్యంబు లట్ట ♦ హాసము సేసెన్.

అర్థములు. సాయక వేదనచే = బాణము వలనఁ గలిగిన బాధచే, మాసరము=అధికము, అట్టహాసము=పెద్దనవ్వు.

తాత్పర్యము

ఆ బాణము వలని బాధచే సుగ్రీవుఁడు కూఁతవైచి నేలఁబడఁగా మిగుల సంతోషించి రాక్షస సైన్యము పెద్దగా నవ్వెను.

సీ. శాఖామృగేంద్రుని ♦ చందంబుఁ గనుగొని, తీవ్రవేగమున జ్యో ♦ తిర్ముఖుండు
గవయగవాక్షులు ♦ ప్లవగర్షభుం డైన, ఋషభుఁడు నభుఁడు మ ♦ హీధరాళిఁ
దాల్చి సుదంష్ట్రుండు ♦ దమకుఁ దోడ్పడ మేను, పెంచి రావణుమీఁద ♦ విసరివైవ
వింశతి బాహుండు ♦ వివిధఖగంబుల, నేలఁ దూలఁగ నేసి ♦ నిశితబాణ

తే. జాలముల వారి తనువుల ♦ జల్లెడలను, బోలె నొనరింప వారలు ♦ భూమిఁ బడిరి
పంక్తివదనుండు నెదిరించు ♦ వారు లేక, మూఁకపైఁబడి నుఱుమాడె ♦ వీఁక మెఱసి.

తాత్పర్యము

వానరప్రభువిధము జూచి మిక్కిలి వేగముతో జ్యోతిర్ముఖుఁడు గవయ గవాక్షులు ఋషభుఁడు ననువారు సుదంష్ట్రుఁడు తమకుఁ దోఁచునట్లుగా దేహములు పెంచి చెట్లను రావణుమీఁద విసరివైవఁగా రావణుఁడు నానాబాణముల వానిని నేలఁ బడఁగొట్టి పదునైన బాణముల వారి దేహములను జల్లెడలవలెఁ జిల్లులుపడఁ గొట్టఁగా వారు భూమిపై బడిరి. అప్పుడు తన్నెదిరించువారు లేక గుంపుమీఁద బడి వానరులను నాశముచేసెను.

చ. నగచరవీరవర్గము న•నర్గళ మార్గణవృష్టిఁ జేతఁబ
ల్విగుల వెసఁగంగ ముంప నతి•భీతిని గోఁతులు జాతదుఃఖులై
వగచెడి పాటి దీనజన•వత్సలు లోకశరణ్యు రాముసిన్
మొగి శరణంబు వేఁడ నృప•ముఖ్యుఁడు వారల భీతి మాన్పుచున్. ౧౭౬

అర్థములు. నగచరవర్గమున్ = వానరవీరుల సమూహమును. అనర్గళ = అడ్డములేని, మార్గణవృష్టిన్=బాణవర్షముచే, వగచెడి=ఏమిచేయుటకుఁ దోఁపక, దీనజనవత్సలున్ = ఆర్తులగువారియందు దయ గలవానిని, లోకశరణ్యున్ = లోకముల కన్నిటికి రక్షకుఁడగువానిని.

తాత్పర్యము

వానరవీరులను నడ్డములేక బాణవర్షముచేఁ దనచేతి బలముకొలఁది ముంచఁగా వారు భయపడి దుఃఖితులై యేమిచేయుటకు నాలోచనపోక పరువెత్తి, బాధపడు వారియందు దయగలవాఁడును, సర్వలోకరక్షకుఁడగు రామచంద్రమూర్తిని రక్షింపు మని ప్రార్థింపఁగా నాయన వారికి భయపడవలదని చెప్పి.

—• లక్ష్మణుఁడు రావణుతోఁ బోర శ్రీరామాజ్ఞఁ గొనుట •—

కం. కరుణాపరుఁడు మహాత్ముఁడు, గురుతరచాపంబుఁ గేలఁ • గొని రావణుపై
నరుగఁగ లక్ష్మణుఁ,డిట్లనుఁ,బరమార్థంబైనసూక్తిఁ•బ్రాంజలి యగుచున్.

అర్థములు. కరుణాపరుఁడు = కరుణయే పరమగుణముగాఁ గలవాఁడు, రామచంద్రుని కెందరో యనేక కల్యాణగుణము లున్నను అన్నిటికంటె దయాగుణమును గొప్పగా ననుష్ఠించువాఁడు, (౨) కరుణా+అపరుఁడు = కరుణకు నన్యము గాని వాఁడు, అనఁగా ఆయనయే కరుణ, కరుణయే యాయన, అనఁగా మూర్తీభవించిన దయయగువాఁడు, ఇతరుల దుఃఖమును జూచి సహింపలేకుండుటయేకదా దయ, మహాత్ముఁడు = గొప్ప మనస్సు, గొప్ప స్వభావము గలవాఁడు. కావుననే వారు శరణనఁగానే విల్లందుకొనెను. కేలఁగొని = చేతఁ దానే తీసికొని, యుద్ధకార్యము లేనప్పుడు విల్లు లక్ష్మణునొద్ద నుండును. 'చాప మానయ సౌమిత్రే' లక్ష్మణా! విల్లు దెమ్మని యడుగుట ఆయన యిచ్చుట యింతలో కాలము వృథాహరణ మగునని తలంచి తానే వింటిని గ్రహించెనని భావము. ఇది శరణాగత రక్షణ మందలి

త్వరను సూచించుచున్నది. ప్రాంజలి=చేతులు జోడించి నమస్కరించిన వాఁడు, అట్లు రావణు మీఁదికిఁ బోవువాఁడు లక్ష్మణుఁ డడ్డమువచ్చి చేతులు జోడింపఁగానే నిలిచె నని భావము. రామచంద్రమూర్తి కింకరకైంకర్యమును గ్రహించును గాని నిరాకరింపఁడని భావము. ఇది కాయిక కైంకర్యముఁ దెలుపును. ఇఁక వాచాకైంకర్యమును దెలుపుచున్నాఁడు. పరమార్థంబైన సూక్తిన్ = పరమ ప్రయోజనము గల మంచిమాట, అనఁగా నుపచారార్థము చెప్పినమాటగాదు. పరమార్థమైనను వ్యర్థపుమాటగాదని భావము. ఎవరికిఁ బరమప్రయోజనము ? ఇరువురకును, శరణాగతి ఫలించుట కింకరునకుఁ బ్రయోజనము. శరణాగతి ఫలింపఁజేయుట శరణ్యునకు బ్రయోజనము. "Mercy blesses him that gives and him that takes" Shakespeare.

తాత్పర్యము

దయయే పరమగుణముగాఁ గలవాఁడును దానిని వినియోగించు గొప్ప మనస్సు గొప్పస్వభావము గలవాఁడు నగు రామచంద్రమూర్తి మిగుల గొప్ప దగు విల్లు చేతఁ దీసికొని రావణుని మీఁదికి బోవుచుండ, లక్ష్మణుఁ డడ్డమువచ్చి చేతులు మోడ్చి పరమ ప్రయోజన కరమైన మంచి మాట యిట్లు చెప్పెను.

కం. దేవరలే కృతముఖు లీ, రావణు దురితాత్ముఁ జంప ♦ రణమున నైనన్
నే వధియించెద నీచుం, దేవా నా కానతిమ్ము ♦ నెమ్మి నటన్నన్. ౧-౨౬౪

అర్థములు. దేవరలే = పూజ్యార్థమున బహువచనము, కృతముఖులు = మిక్కిలి సమర్థులు, దురితాత్మ=పరస్త్రీ హరణ మను మహాపాపము చేసినవానిని, నెమ్మిన్=సంతోషముతో, ఆనతిమ్ము=అనుజ్ఞనిమ్ము, నా యనుజ్ఞయేల ? నీవే పోరాదా యందువేమో? నేను దాసుఁడను. నీ యాజ్ఞలేక యేదియుఁ జేయరాదు. అట్లు చేసితి నేని స్వతంత్రవృత్తి గలవాఁడ నగుదును. దానివలన నాకు స్వరూపహాని సంభవించును. కావున నీ యాజ్ఞ గోరెదను అని భావము.

తాత్పర్యము

దేవరవారే యీ మహాపాపిని రావణుని యుద్ధమునఁ జంప మిగుల సమర్థులు. అయినను నేను వీనిఁ జంపఁగోరెదను. సంతోషముతో దేవా! నాకనుజ్ఞ నిమ్ము.

ఉ. రాముఁడు సత్యనిస్తుల ప ♦ రాక్రముఁ డిట్లనుఁ బొమ్ము లక్ష్మణా!
యేమఱకపోకుమీ కలన ♦ నీ యసురేశ్వరుఁ డాహవైకవి
ద్యామహితాసమద్రవిణుఁ ♦ డద్భుత వీర్యుఁడు మూఁడులోకముల్
హామిక నెత్తి క్రుద్ధుఁ డగు ♦ నాతని వ్రేలిని వంపలే వనిన్. ౧-౨౬౫

అర్థములు. సత్యనిస్తుల పరాక్రముఁడు = సత్యమే సమానములేని పరాక్రమముగఁ గలవాఁడు. (౨) సత్యము అసమానమునైన పరాక్రమము గలవాఁడు, కలనన్ = యుద్ధమందు, ఆహవైకవిద్యా = కేవల యుద్ధవిద్యయందు, మహిత =

గొప్పదై, అసమ=సమానములేనిదైన, ద్రవిణుఁడు = పరాక్రమము గలవాఁడు, ద్రవిణంగేహే-విత్తే-స్వర్ణే-పరాక్రమే - నానా. ర. అద్భుత వీర్యుఁడు = ఆశ్చర్య కరమైన బలము గలవాఁడు, హేమిక= గర్వముచే, ఎత్తి=దండెత్తి.

తా త్ప ర్య ము

ఇట్లు లక్ష్మణుఁడు ప్రార్థింపఁగా సత్యమై యసమానమైన పరాక్రమము గల రామచంద్రమూర్తి యిట్లనియె. లక్ష్మణా! యుద్ధమునకుఁ బొమ్ము. యుద్ధమందు నాత్మరక్షణమం దేమఱెదవుసుమా. ఏలన యీ రాక్షసరాజు యుద్ధమే ప్రధాన విద్యగా నుంచుకొనిన గొప్పదియు నసమానమగు పరాక్రమముగలవాఁడు. ఆశ్చర్య కరమైన బలము గలవాఁడు. అహంకారముచే మూఁడు లోకములవారు వీనిపై దండెత్తినను వీఁడు కోపించెనేని వీని ప్రేలిని వంపలేరు. ఇఁక నేమి జయింపఁ గలరు?

కం. కను మాతని ఛిద్రంబులు, కను నీ లోపములు వానిఁ ♦ గనఁబడకుపకు నిన్
ధనువునఁ గన్నుల హెచ్చరికను రక్ష యొనర్చికొనుచుఁ♦గడఁగుము పోరన్.

అర్థములు. ఛిద్రంబులు=రంధ్రములు, లోపములు.

తా త్ప ర్య ము

యుద్ధము సేయుటయందు వానియందుఁ గొన్ని లోపము లున్నవి. వానిని నీవు తెలిసికో- నీయందుఁ గలవి నీవు తెలిసికొనుము. కాని వానికిఁ గనఁబడ నీయకుము. వింటిచేతఁ గంటిచేత రెంట నిన్ను నీవు కాపాడుకొనుచు యుద్ధము చేయ యత్నింపుము.

కం. నావుడు సౌమిత్రియు నీ, తావిభునిం గౌఁగిలించి ♦ తత్పదముల స
ద్భావమున మ్రొక్కి- యుద్ధము,పై వేడుక నరిగెఁ గీశ♦వరులు నుతింపన్.

తా త్ప ర్య ము స్పష్టము.

మ. ధరణీశాత్మజుఁ డేగి కన్గొనియె నుఁ♦ద్యద్భీమకాండాసనున్
బరమాశీవిషతుల్య మార్గణ కదం♦బచ్ఛాదితాత్మీయవా
నర సేనానివహున్ దశాస్యు శితకాం♦డవ్రాతనిర్భిన్నగా
త్రరవాక్రాంతదిశాంతు రక్తనయనాం♦తస్ఫీతవక్త్రాబ్జుఁ డై. ౧౨౬౮

అర్థములు. ఉద్యత్ భీమకాండాసనున్ = ఎత్తఁబడిన భయంకరమైన విల్లు గలవానిని, పరమ=శ్రేష్ఠములైన, ఆశీవిష = పాములతో, తుల్య = సమానములైన, మార్గణ కదంబ=బాణసమూహముచే, ఛాదిత = కప్పఁబడిన, ఆత్మీయ = తన, వానరసేనా నివహున్=వానర సైన్య సమూహము గలవానిని, దశాస్యున్= రావణుని, శితకాండవ్రాత = వాఁడిములుకుల సమూహముచేత, నిర్భిన్న = భేదింపఁబడిన, గాత్ర=దేహములుగల వారియొక్క, రవ = ధ్వనిచే, ఆక్రాంత = ఆక్రమింపఁబడిన, దిశాంతున్ = దిక్కుల కొనలుగలవానిని, రక్తనయనాంత

స్ఫిత+వక్త్రాబ్జుఁడై=ఎఱ్ఱని కనుఁగొనలచేఁ బ్రకాశించు ముఖకమలము గలవాఁడై, కన్గొనియెను.

తాత్పర్యము

ఇట్లు లక్ష్మణుఁడు పోయి యెత్తఁబడిన భయంకరమైన విల్లు గలవాఁడును, గొప్ప సర్పములవంటి బాణములచేఁ గప్పఁబడిన తమ వానరసేన గలవాఁడును, వాఁడి బాణములచే భేదింపఁబడిన దేహములు గలవారి యేడ్పుధ్వనిచే నాక్రమింపఁబడిన దిక్కుల కొనలు గలవాఁడును నగు రావణుని ఎఱ్ఱనగు కన్నులు గల ముఖకమలము గలవాఁడై చూచెను.

—♦ రావణ హనుమంతుల యుద్ధము ♦—

కం. కరికరబాహుఁడు లక్ష్మణుఁ, డరుదెంచుట గాంచి యడ్డ ♦ మరిగి బలువిడిన్
మరుదాత్మభవుఁడు తోఁకం, బరుశరములఁ జెదర నడిచి ♦ పటుకోపమునన్.

అర్థములు. కరికరబాహుఁడు = ఏనుఁగు తొండములవంటి చేతులు గలవాఁడు, బలువిడిన్=బలమైన పరాక్రమముతో, మరుత్+ఆత్మభవుఁడు = వాయుకుమారుఁడు,హనుమంతుఁడు, పరుశరములన్=శత్రువుని బాణములను,అడిచి=కొట్టి.

తాత్పర్యము

ఏనుఁగు తొండములవంటి చేతులు గల లక్ష్మణుఁడు యుద్ధమునకు వచ్చుట హనుమంతుఁడు చూచి దాసుఁడగు నేనుండఁగా స్వాములు ముందుగా రావచ్చునా యని రావణునకు లక్ష్మణునకు నడ్డముగ దూఁకి రావణుఁడు వేయు బాణములను తోఁకతోఁ దన్నుఁదాఁకకుండఁ జెదరఁగొట్టుచు మిగుల కోపము గలవాఁడై.

ఉ. రావణు తేరిపైకి దుమికి ♦ గ్రద్దన దక్షిణ బాహువెత్తి ర
క్షోవరుఁ డాత్మ బెగ్గిలఁగ ♦ క్రూరపుఁ జూపులఁ జూచు చిట్లనున్
రావణ! నాగయక్ష సుర♦రాక్షసదానవ పక్షిజాతిచేఁ
జావక యుందు గాక కపి♦సంఘముచే మృతి నీకుఁ దప్పునే? ౧౨౦

అర్థములు. గ్రద్దన = వేగముగ, దక్షిణ బాహువు = కుడిచేయి, బెగ్గిలఁగన్ = భయపడునట్లు.

తాత్పర్యము

రావణు తేరిపైకి దుమికి వేగముగ కుడిచేయెత్తి రావణుఁడు బెదరునట్లు క్రూరపుఁ జూపుల నతనిని జూచుచు నిట్లనియె. రావణా! నీవు నాగులు యక్షులు దేవతలు రాక్షసులు దానవులు పక్షులు వీనిచేఁజావకయుండిననుందువుగాక, వానరులచే నీకుఁ జావుదప్పునా? వారివలనఁ జావులేకుండ నీకు బ్రహ్మవరము లేదుకదా.

మ. ఇదె నాదక్షిణబాహువుం గనుము రో♦రీ! పంచశాఖాన్వితం
బిది నీ యిన్నిదినాలు కాచు నసు ఱే♦డ్పే దేహమందుండి వే
చెదరం గొట్టఁగ నెత్తితిం, దిరుఁడ వై ♦చేకొమ్ము, నా రావణుం
డుదితక్రోధుఁడు రక్తనేత్రుఁ డయి వా♦యుప్రోద్భవుం థీరతన్. ౧౨౧

అర్థములు. పంచశాఖాన్వితంబు=ఐదు వ్రేళ్ళతోఁ గూడినది, తిరుఁడవై=చలింపనివాఁడవై, ఉదితక్రోధుఁడు=పుట్టిన కోపము గలవాఁడు, వాయుప్రోద్భవున్=వాయుకుమారుని.

తాత్పర్యము

ఓరీ! ఇదిగో నా కుడిచేయి చూడుము. ఐదు వ్రేళ్ళతోఁ గూడినది. ఇన్ని దినాలుగా నీవు నీ దేహమందుఁ గాపాడుచుండిన ప్రాణమును నిప్పుడే చెదరఁగఁ గొట్ట నెత్తినాడను. ధీరుఁడవై చలింపక నిలిచి కైకొమ్ము. అని హనుమంతుఁడనఁగా రావణుఁడు కోపించి యెఱ్ఱని కన్నులు గలవాఁడై యాంజనేయునితో ధైర్యముతో నిట్లనెను.

మ. అనియెం జూచెదఁ గాక నీ కడిమి కీశా! కొట్టుమీ వేగన
న్ననుమానింపక పొందుమీ యశము నే నా వెన్క నీశౌర్యముం
గని నిన్నుం బరిమార్తు నన్న మును సంగ్రామంబునన్ ముద్ధతున్
మనమం దత్తుని సంస్మరించుకొని య స్మచ్ఛౌర్య మూహింపుమీ. ౧౨౦

అర్థములు. నీ కడిమి=నీబలము, అస్మత్=నా, శౌర్యము=పరాక్రమము.

తాత్పర్యము

వానరా! నీ బల మే మాత్రమో చూచెదను. కొట్టుము. రావణు నంతటి వానిని హనుమంతుఁడు కొట్టె ననుకీర్తి సంపాదింపుము. నీవు కొట్టిన వెనుక నీ శౌర్య మేమాత్రమో చూచి నిన్నుఁ జంపెదను. అనిన నోరీ నా శౌర్య మెట్టిదో నా చేతఁ జచ్చిన నీ కొడుకును దలఁచుకొని యూహింపుము.

చ. అనవుడు శౌర్యదర్పమహిమాన్వితుఁడై దనుజేంద్రుఁ డా మరు
త్తనయునురంబు గాఢతల తాడనపీడితమున్ ఘటింపఁగా
హనుమయుఁ దత్ప్రహారజనితాధిక బాధను సారె సారె కొ
య్యనఁ జలియించి యూఁగి నిమిషార్ధమునన్ మఱి స్థైర్య మూనుచున్.

అర్థములు. శౌర్యదర్ప మహిమాన్వితుఁడు = శౌర్యము వలనఁ గలిగిన గర్వముయొక్క గొప్ప తనముచేఁ గూడిన వాఁడు. గాఢతల = గట్టిదియగు నఱచేతి, తాడన = దెబ్బచేత, పీడితమున్ = బాధింపఁబడినది, తత్=ఆ, ప్రహార = దెబ్బచేత, జనిత=పుట్టిన, అధిక బాధను = అతిశయమైన బాధచే, సారెసారెకు = పలుమాఱు, మీఁదమీఁద, నిమిషార్ధమునన్ = అఱనిమిషమున.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా శౌర్యమువలనఁ గలిగిన విశేష గర్వముగల రావణుఁడు హనుమంతుని గట్టిగ నఱచేతఁగొట్టి బాధింపఁగా నా దెబ్బకు హనుమంతుఁడు మిగుల బాధ చెంది యఱనిమిషము ముందు వెనుకకుఁ బలుమాఱూగి మరల తెప్పిఱిల్లుకొని.

క౦. తీండ్రం బగుకోపంబునఁ, జంద్రల నిప్పుకలఁ బోలు ♦ చక్షుల నసురన్
గాండ్రించుమోమునన్ వెస, గోండ్రించుచుఁ బాణి నొక్క ♦ గ్రుద్దుం గ్రుద్దెన్.

అర్థములు. చంద్రల = చంద్రకఱ్ఱలు, నిప్పుకలు = నిప్పులు, చంద్ర నిప్పుల వేడిమి యెక్కువ కణకణలాడుచు దీర్ఘకాలముండును. తీండ్రము=ప్రచండము, గాండ్రించు = ఉబ్బు, ఇక్కడ కోపముచే నుబ్బు, గోండ్రించుచున్ = ధ్వనించుచు, పాణి = అఱచేత, వాఁడు చేతితోఁ గొట్టుటచేఁ దాను జేతితోఁ గొట్టెను.

తాత్పర్యము స్పష్టము.

క౦. ఆ కపివర్యుని పోటున, కాకంపించెను సురారి ♦ యధికవ్యథచే
భూకంపంబున గిరి యనఁ, బ్రాకటగతి వచ్చుఁబోవు ♦ ప్రాణంబులతోన్.

అర్థములు. ఆకంపించెను=దేహమంతయు మిగుల వణఁకెను.

తాత్పర్యము స్పష్టము.

క౦. హనుమత్కరతలతాడనమున గాసింబడిన యసుర ♦ ముఖ్యునిఁ గని కా
ననచరఖచరమునీంద్రులు, మనములు భృశహర్ష వార్ధి ♦ మగ్నంబులుగన్.

అర్థములు. హనుమత్ = హనుమంతుని యొక్క, కరతలతాడనమునన్= చేతి దెబ్బచేత, కాననచర = వానరులు, ఖచర = దేవతలు, మనములు = మనస్సులు, భృశహర్ష=మిగుల సంతోషమనెడి, వార్ధిన్=సముద్రమందు, మగ్నంబులుగన్=మునిఁగి పోగా.

తాత్పర్యము

హనుమంతుని చేతిదెబ్బకు మిగుల బాధపడిన రావణుఁ జూచి వానరులు, దేవతలు, మునులు మిగుల సంతోషించిరి.

క౦. కొండాడిరి రావణుఁడుం, గొండొకవడిఁ దెప్పిఱిల్లి ♦ కొని మేల్ మేల్ మా
ర్తుండవ వైనను మెచ్చితి, దండిమగఁడ వన్నఁ బవన ♦ తనయుఁడు పలికెన్.

అర్థములు. కొండాడిరి = స్తోత్రముచేసిరి, కొండొకవడిన్=కొంతసేపటికి, మార్తుఁడవు=శత్రువవు, దండిమగఁడవు=మిగుల శూరుఁడవు.

తాత్పర్యము స్పష్టము

ఉ. ఏటికి నన్ను మెచ్చెద వి ♦ సీయది యేమిటిపోటు రావణా!
కాటికిఁ బోక తక్కితివి ♦ కొల్పనె మద్భుజ శౌర్యసారముల్
పోటుల తారతమ్యమును ♦ బోల నెఱుంగని మూఢ! నన్ను నీ
మా టెది గ్రుద్దుమీఁ పిదప ♦ మద్దృఢముష్టిని నిన్నుఁ గూల్చెదన్. ౧౨౭౫

అర్థములు. ఇసీ = ఛీ, కాటికిఁబోక = చావక.

తాత్పర్యము

ఏల నన్ను మెచ్చెదవు? ఛీ రావణా! యిది యేమిపోటు? నీవు చావక బ్రదికి

యున్నావే ఏల నా భుజబలము కాల్పనా? ఓరి మూఢుఁడా! నీవు పోటుల యందుఁగల హెచ్చుతక్కువ లెఱుంగవు. ఏదీ నీ భుజబలముకొలఁది నీవు గ్రుద్దుము. ఆవల నా భుజబలముకొలఁది నేను గ్రుద్దెదను. అప్పుడు నా పోటుశక్తి చూడ గలవు. నీవు చావనే చచ్చెదవు.

ఉ. నావుడుఁ గ్రోధరక్తనయ♦నంబుల మండుచు శక్తి యంతయున్
వావిరిఁ బూని పెన్గడఁక ♦ వాయుతనూజునురంబు దక్షిణం
బౌ వరముష్టిఁ దాఁచినఁ ద♦దాహతి నాతఁడు దద్దఱింపఁగా
రావణుఁ డింతలో నుఱికి ♦ క్రచ్చఱ నీలునిఁ దాఁకి యీసునన్. ౧౨౯

అర్థములు. క్రోధరక్తనయనంబులన్=కోసముచే నెఱ్ఱనైన కన్నుల, పెను కడఁక=దృఢప్రయత్నముతో, తదాహతిన్ = ఆ దెబ్బచే, దద్దఱింపఁగా = తబ్బిబ్బులు పడఁగా, ఉఱికి=పరువెత్తి, ఈసునన్ = కోపముతో.

తాత్పర్యము

అని చెప్పఁగా రావణుఁడు కోపముచే గన్ను లెఱ్ఱజేసి మండిపడుచు తన శక్తి యంతయుఁ బూని హనుమంతుని ఱొమ్మును కుడిచేతి పిడికిటఁ గొట్టెను. ఆ దెబ్బచే హనుమంతుఁడు తబ్బిబ్బు లాడుచుండఁగా దెప్పతిల్లినఁ జంపునని భయపడి వేగముగా నీలునిమీఁదికిఁ బోయెను.

—♦ రావణుఁడు నీలునితో యుద్ధము చేయుట ♦—

శా. ఘోరాశీవిషతుల్యముల్ నిశితముల్ ♦ క్రూరంబులున్ మర్మసం
వారచ్ఛేదనదక్షముల్ భయదముల్ ♦ బాణంబు లత్యుద్ధతిన్
ధీరున్ నీలుని ముంప నాతఁడు మహా♦ధీరాగ్రముం గేల ర
క్షోరాజన్యునిమీఁద వైచెను; మరు♦త్సూనుండు నిల్లో స్మృతిన్. ౧౩౦

అర్థములు. ఘోర+ఆశీవిషతుల్యముల్ = భయంకరములైన సర్పములతో సమానములు, నిశితముల్ = పదునైనవి, క్రూరంబుల్ = కఠినములైనవి, మర్మసంవార=ఆయువుపట్టులను, ఛేదనదక్షముల్ = ఛేదించు సామర్థ్యముగలవి, భయదముల్ = భయంకరములైనవి, అత్యుద్ధతిన్ = మిగుల గర్వముతో, మహాధీరాగ్రమున్ = గొప్ప పర్వతశిఖరమును, రక్షోరాజన్యునిమీఁద = రాక్షస రాజు మీఁద, మరుత్+సూనుండు = హనుమంతుఁడు, స్మృతిన్ = తెలివిని.

తాత్పర్యము

భయంకరములైన పాములతో సమానములు, పదునైనవి, క్రూరములైనవి, ఊపిరిపట్టుల ఛేదింపగలవి, భయము కలిగించునవి యగు బాణములచే ధైర్యశాలి యగు నీలునిముంప నతఁడు పెద్ద పర్వతశిఖరమును రావణునిమీఁద వైచెను. ఇంతలో హనుమంతుఁడు స్మృతిగలవాఁడై.

కం. కని నీలునితోఁ బెనఁగెడి దనుజేంద్రునిఁ జూచి యహహ ♦ తప్పెం దప్పెన్
జనరాదు గాక పగతుం, డని సేయఁగ నన్యుతోడ ♦ నని చింతించెన్. ౧౨౮౧

అర్థములు. పగతుఁడు=విరోధి, అని=యుద్ధము.

తాత్పర్యము

నీలునితో యుద్ధముచేయు రావణునిఁజూచి యాహా సమయము తప్పెను గదా! పగవాఁడు మఱియొకనితో యుద్ధము సేయునపుడు నేను బోవుట మర్యాద గాదని తలఁచి యూరకుండెను.

ఉ. నీలవిముక్త శృంగమును ♦ నిష్ఠురమార్గణసప్తకంబునన్
నేలను ముక్కలై తొరఁగ ♦ నిర్జరవైరి ఘటింప నాతఁడున్
గాలకృశానుఁబోలి యధి♦కంబగు రోషముతోడ మండుచున్
సాలధవాశ్వకర్ణకర♦సాలతమాలజటిద్రుమాదులన్. ౧౨౮౨

అర్థములు. నీలవిముక్తశృంగమును = నీలునిచే విడువఁబడిన శిఖరమును, నిష్ఠురమార్గణ సప్తకంబునన్ = కఠినములైన యేడు బాణములచే, తొరఁగన్= పడఁగా, కాలకృశానుబోలి =ప్రళయాగ్నివలె, సాల = మద్ది, ధవ=చండ్ర, అశ్వకర్ణక = ఇనుమద్ది, రసాల = మామిడి, తమాల = చీఁకటిమ్రాను, జటి = మఱ్ఱి, ద్రుమాదులన్=చెట్లు మొదలైనవానిని.

తాత్పర్యము

నీలుఁడు వైచిన శిఖరమును రావణుఁ డేడు బాణంబులఁ ముక్కలై నేల, బడఁగొట్టఁగా నతఁడు ప్రలయకాలాగ్నివలెఁ గోపముచే మండిపడుచు మద్ది, చండ్ర లోనగు వృక్షంబులను.

ఉ. వారక పైపయిం గురియ ♦ వానిని జెక్కులు ముక్కలై పడన్
నారసముల్ గుముల్ రయము♦నం బరఁగించియు నంతఁబోక య
వ్వీరునిపైఁ గలంబచయ ♦ వృష్టి నిరంతరమై పడంగ లే
ఖారి నిగుడ్ప వానరుఁడు ♦ హ్రస్వముగా ఘటియించి రూపమున్. ౧౨౮౩

అర్థములు. వారక = నిలువక, నారసముల్=బాణములు, కలంబచయ వృష్టి = బాణసమూహవర్షము, నిరంతరమై=సందులేక, లేఖారి = దేవవిరోధి, రావణుఁడు,నిగుడ్పన్=ప్రయోగింపఁగా,హ్రస్వముగాన్=కుఱుచగా=చిన్నదిగా.

తాత్పర్యము

విడువక మీఁదమీఁద గురియఁగా వానిని తునుకలు తునుకలుగాఁ బడు నట్లు బాణములు గుంపులు గుంపులుగాఁ ద్వరగా బ్రయోగించియు నంతతో వదలక వానిపై సందులేక బాణవర్షము గురియింపఁగా నీలుఁడు తనరూపమును చిన్నదిగాఁ జేసి.

చ. ఎగసి ధ్వజంబుపైఁ బడఁగ ♦ నెందుర పోయెద వంచు వానిపై
ఖగముల వైచు లోన హరి ♦ గర్జల నించుచు వింటికోపుపై
నొగపయిఁ గేతినంబుపయి ♦ నొవ్వడరంగఁ గిరీటసీమపై
వగచెడి సైంధవాళిపయి ♦ వానికరంబులపై శిరంబుపై. ౧౨౮౮

అర్థములు. ఖగములన్ = బాణములను, గర్జలన్ = సింహనాదముల, వింటి కొప్పుపై=వింటి కొనపై, నొవ్వడరంగన్=నొప్పికలుగునట్లు, వగచెడి = బలము చెడిన, సైంధవాళిపయి = గుఱ్ఱములపంక్తిమీఁద.

తాత్పర్యము

ఎగిరి ధ్వజంబు మీఁదఁ బడఁగా నతఁడు తప్పించుకొని పోవుచున్నాఁడని తలఁచి రావణుఁ డెందురా పోయెద వని బాణములు వేయులోపల నీలుఁడు సింహనాదములు చేయుచు వింటి కొనమీఁదను తేరి కాఁడిమీఁదను ధ్వజము మీఁదను వానికిఁ దిలనొప్పి పుట్టునట్లు కిరీటము మీఁదను గుఱ్ఱముల మీఁదను రావణునిచేతుల మీఁదను తలమీఁదను.

కం. ఇక్కడ నక్కడ నక్కడ, నిక్కడనను లాఘవమున ♦ నెగురుచుఁ గపి పే
రక్కజపు లాఘవమున, నొక్కింతయు గుఱికి చిక్క ♦ కుద్ధతి మెఱసెన్.

అర్థములు. పేరక్కజపున్=మిగుల నాశ్చర్యకరమైన.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆతని జవలాఘవముల, కాతతవిస్మయము నొందె ♦ ననిలాత్మజుఁడున్
సీతానాథుండు సుమి, త్రాతనయుఁడు సంప్రమోద ♦ తత్పరమతులై. ౧౨౮౯

అర్థములు. జవలాఘవములకున్=వేగమునకు లాఘవమునకు, అనిలాత్మజుఁడు = హనుమంతుఁడుకూడ, ఇట్లనుటచే తాను వాయుపుత్రుఁడు, గావున వాయువువలె వేగము లాఘవము గలవాఁడనని హనుమంతుఁడు తలఁచి యుండెను. అట్టి వానికిఁ గూడ నీలుని జవలాఘవములు ఆశ్చర్యకరము లయినవి. సంప్రమోద తత్పరమతులై=మిక్కిలి సంతోషించిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆ నీలుని వేగమునకు లగువునకు మిగుల సంతోషించినవారై రామలక్ష్మణులును హనుమంతుఁడును మిగుల నాశ్చర్యపడిరి.

కం. వానరలాఘవ విస్మితుఁ, డౌ నరభోజనుఁడు పావ ♦ కాస్త్రము వింటన్
బూని కపినేయఁ గడఁగియు, వాని యునికిఁ దెలియలేక ♦ భ్రమ గొని యుండెన్.

అర్థములు. వానరలాఘవవిస్మితుఁడు = నీలుని లగువుచే నాశ్చర్యపడినవాఁడు, నరభోజనుఁడు=మనుష్యులఁ దినువాఁడు, రావణుఁడు, పావకాస్త్రము = ఆగ్నేయాస్త్రము.

తాత్పర్యము స్పష్టము.

కం. వికలస్వాంతంబునఁ గడుఁ దికమిక గొను నసురనేత ♦ దృష్టించి కపుల్
ప్రకటార్భటుల న్నించిరి, మెకమెకపాటునను ముదము♦మిగులఁగ నంతన్.

అర్థములు. వికలస్వాంతంబునన్ = కలవరపాటు చెందిన మనస్సుతో, కడున్=మిక్కిలి, తికమిక గొను=కలఁత చెందు, మెకమెకపాటునను=విజృంభణముచే.

తాత్పర్యము స్పష్టము.

కం. నీలునిగంతులకుం గపి,జాలము రంతులకు నసుర♦సత్త్వముఁ డెంతే
వ్యాలోలమనస్కుం డయి, తూలుచు నేమియును దిక్కు♦దోఁపక యుండెన్.

అర్థములు. రంతులకు = కేకలకు, వ్యాలోల = మిక్కిలి చలించిన, మనస్కుండై=మనస్సు గలవాఁడై, తూలుచున్=చలించుచు.

తాత్పర్యము స్పష్టము.

చ. కలవరపాటు దేఱి దశ ♦ కంఠుఁడు కేతనసంస్థు నీలునిన్
దెలిసి కపీ! లఘుత్వమునఁ ♦ దేఱినమేటివి, మాయచేతఁ బె
క్కులు నిజరూపముల్ నెఱపఁ ♦ గూడితి నీ యనలాస్త్ర మేసెదన్
దెలియుము, నీకు శక్తి గల ♦ దేనియుఁ బ్రాణముఁ గాచుకొమ్మికన్.

అర్థములు. కేతన సంస్థున్ = ధ్వజమునందున్న వానిని, మాయచేత = అత్యద్భుతమై ఆశ్చర్యకరమైన శక్తిచే, ఇట్టి శక్తికే మాయ యని పేరు. ఇచ్చట నీలుఁడు ఇంద్రజాల మహేంద్రజాల విద్య లేమియుఁ గనఁబఱుపలేదు. స్వశక్తి చేతనే యిట్లు గంతులు పెట్టెను.

తాత్పర్యము

కలఁత దేఱి రావణుఁడు స్వస్థచిత్తుఁడై ధ్వజమందున్న నీలునిఁజూచి వానరుఁడా లఘువునందు బాగుగ నాఱితేఱినాఁడవు. నీ యద్భుతశక్తిచే పెక్కురూపములు గనఁబఱచితివి. ఇదిగో నీ యాగ్నేయాస్త్రము వేసెదను. నీకు శక్తి యుండెనా ప్రాణము కాచుకొనుము.

కం. నీ వెంత యెగురు లాడిన, జీవముతో విడదు నిన్ను ♦ సిద్ధం బని యా
పావకబాణము వైచెను, బావకసుతుమీఁదఁ బంక్తి♦వదనుం డలుకన్.

తాత్పర్యము స్పష్టము.

చ. తతభయదానలాస్త్రమునఁ ♦ దాడితుఁడై పరిదహ్యమానుఁడై
స్మృతిరహితుండు నై యొఱిగె ♦ మేదిని నీలుఁడు జానుటూఁతగాఁ
బితృసుమహానుభావమున ♦ స్వీయబలంబునఁ దేజుచే నసు
చ్యుతిఁ గనఁ డయ్యె నంత బల♦సూదనగర్వహరుం డహంకృతిన్. ౧౫౯-౧

అర్థములు. తతభయద=మిగుల భయముకలిగించు, అనలాస్త్రమునన్ = ఆగ్నేయాస్త్రమున, తాడితుఁడై = కొట్టఁబడినవాఁడై, పరిదహ్యమానుఁడై =

మిగుల కాల్పఁబడువాఁడై, స్మృతిరహితుండునై=తెలివితప్పినవాఁడై, జానులు=మోఁకాళ్ళు, పితృసుమహానుభావమున = అతని తండ్రియైన యగ్నిహోత్రుని మహిమచేత, తన కొడుకుకావున నగ్ని విశేషముగ బాధింపలేదు. స్వీయబలంబున=స్వశక్తిచేత, తేజుచే=తేజస్సుచే, అసుచ్యుతి=ప్రాణముపోవుట, బలసూదన=ఇంద్రునియొక్క, గర్వహరుండు=పోగరణఁచినవాఁడు, రావణుఁడు.

తాత్పర్యము

మిగుల భయంకరమైన యాగ్నేయాస్త్రముచే గొట్టఁబడి కాల్పఁబడినవాఁడై తెలివితప్పినవాఁడై మోఁకాళ్ళ నేలయూని నీలుఁడు పడెను గాని తండ్రి మహిమచేతను తన బలము తేజస్సుచేతను జచ్చినవాఁడుకాఁడు. అంతట రావణుఁడహంకారముతో

—• రావణ లక్ష్మణ సంవాదము •—

చ. ముదిరము మ్రోయునట్లు రథ•ముం బఱపించుచుఁ గేరి లక్ష్మణుం
గదిసి గుణధ్వనుల్ చెలఁగఁ•గ్రచ్చఱ నడ్డము వచ్చువారలన్
గుదియఁగఁ జేయుచుండఁ గని•కూళ నిశాచర! బక్క క్రోఁతులన్
మదమునఁ జంపు టంతె విసు•మానపుఁ గర్మమె శూరధర్మమే. ౧౩౯౩

అర్థములు. ముదిరము=మేఘము, 'ఘనజీమూత ముదిరం జలము' కని యమరము, కేరి=విజృంభించి, కుదియఁగన్=అణఁగునట్లు, విసుమానపుఁగర్మమే=ఆశ్చర్యకరమైన కార్యమా? శూరధర్మమే=శూరులకు న్యాయ్యమా?

తాత్పర్యము

మేఘము మ్రోఁగునట్లు రథధ్వని కలుగఁగాఁ దోలించుచు విజృంభించి లక్ష్మణుఁజేరి వింటి యల్లెత్రాటిధ్వనులు విస్తరింపఁగా నాయన కడ్డమువచ్చు వానరుల నడఁగునట్లు చేయుచుండఁజూచి యోరి క్రూరరాక్షసుఁడా! బలవంతుఁడనని గర్వముచే బక్క క్రోఁతులను జంపుట యాశ్చర్యకరకార్యమా? శూరులకు ధర్మమా?

కం. ముదముద లేకే కీశుల, నదవదపడఁ జేసి యడరి•నంతనె చనెనా
గొదగొద రా రమ్మిఁక నే, సదమద మొనరింతు నీదు•స్మయ మసురేంద్రా!

అర్థములు. ముదముద = జంకు, అదవదపడన్ = కలఁత చెందునట్లు, గొదగొద=పగ, సదమద మొనరింతు=నాశము చేయుదును, స్మయము=గర్వము.

తాత్పర్యము

క్రోఁతుల నెట్లు చంపుదునా యను జంకులేక యీ వానరులను కలఁతపడఁ జేసినంతనే నీకు మాకుఁగల విరోధము పోవునా? ఇటురమ్ము. నీ గర్వము నాశము చేసెదను.

కం. అనవుడు నాతని వాక్యం, బును నుగ్రము పూర్ణఘోష•మును నగు మౌర్వీ
నినదంబును విని కినుకన్, దనుజాగ్రణియను సుమిత్ర•తనయునితోడన్. ౧౩౯౫

అర్థములు. ఉగ్రము=తీవ్రమైనది, పూర్ణఘోషము = నిండుధ్వని గలది, మౌర్వీనినదంబును=అల్లెత్రాటి మ్రోఁతను, కినుకన్=కోపముచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఎంతటిభాగ్య మౌర మను♦జేంద్రసుతా! విపరీతబుద్ధి వై
యంతకు నంతికంబుఁ జన ♦ నాత్మఁ దలంచియొ వచ్చినాఁడ, వో
క్కింత మదీయదృష్టిపథ ♦ మియ్యెడఁ బాయకు, నాదుబాణముల్
సుంతయు జాగులేక యమ♦లోకముఁ జేరగఁ బుచ్చు నిన్ననన్. ౧౨౯౬

అర్థములు. అంతకు = యముని యొక్క, అంతికంబు=సమీపము, దృష్టి పథము=చూపుమార్గము, సుంతయున్=కొంచెమైనను, జాగు=ఆలస్యము.

తాత్పర్యము

రాజకుమారా! యేమి నా యదృష్టము. యముని సమీపమునకుఁ బోవఁ దలంచి కాఁబోలు విపరీతబుద్ధివై వచ్చితివి. కొంచెముసేపు నాకుఁ గానరాక తొలఁగి పోకుము. నా బాణములు కొంచెమైన యాలస్యములేక నీ కోరిక ప్రకారము యమలోకమునకుఁ బంపును అనఁగా.

ఉ. ఏపున బొబ్బరిల్లు నసు♦రేంద్రుని వృత్తసితాగ్రదంష్ట్రినిన్
భూపతివర్యపుత్త్రుఁ డొక♦పోకకుఁ గైకొన కిట్లు పల్కెనో
పాపజనాగ్రగణ్య! యిటు♦పగ్గలు గొట్టెద వేల నీకు నీ
వే? పరమప్రభావు లిటు♦ప్రేలరు కాఱులు మున్ను మున్నుగన్. ౧౨౯౭

అర్థములు. ఏపునన్ = బలముచే, బొబ్బరిల్లు=బొబ్బలుపెట్టు, గట్టిగా నఱచు, వృత్త=గుండ్రములై, సితాగ్ర = తెల్లనగు కొనలు గల, దంష్ట్రినిన్= కోఱలుగలవానిని, పాపజనాగ్రగణ్య = పాపాత్ములలో మొదటివాఁడా! పగ్గలు కొట్టెదు=పౌరుషములు పలికెదు,ప్రజ్ఞాశబ్దభవము పగ్గె,కాఱులు=వ్యర్థపుమాటలు.

తాత్పర్యము

బలముకొలఁది గట్టిగా నఱచుచున్న వానిని గుండ్రని తెల్లని కొనలుగల కోఱలు గలవానిని లక్ష్మణుఁడు పోకమాత్రమైన లక్ష్యము చేయక యిట్లనియె. పాపాత్ములలో మొదటివాఁడా! ఏల నీకు నీవే యూరక పౌరుషములు పలికెదవు? గొప్ప మహిమగలవారు వ్యర్థపుమాటలు కార్యముచేయుటకు ముందుగా వదరరు.

చ. ఎఱుఁగనివాఁడఁ గాను నసు♦రేంద్ర! భవద్బలముం బ్రతాపమున్
గొఱలు పరాక్రమం బెఱిఁగి ♦ కోరి రణం బరుదెంచినాఁడఁ గ్ర
చ్చఱ శరచాపపాణి నయి ♦ సాధనముల్ కయి నుండ నిట్టి ప
ల్లఱపుల నేమికార్య మగు ♦ నాలము సేయఁగ రమ్ము నావుడున్. ౧౨౯౮

అర్థములు. కొఱలు = ప్రకాశించు, క్రచ్చఱన్ = శీఘ్రముగ, పల్లఱపులు = వ్యర్థభాషణములు, ఆలము = యుద్ధము.

తా త్ప ర్య ము

రాక్షసరాజా! యేనాఁడు దండకారణ్యములో సీతాదేవి యొంటరిగా నుండఁగా నీవు దొంగసన్న్యాసివై వచ్చి దొంగిలించి తెచ్చితివో యానాఁడే నీ బలము, ప్రతాపము, శౌర్యము అన్ని తెలిసికొంటిని. ఇప్పుడు నీవ చెప్పఁ బనిలేదు. తెలిసియే యిటువంటి శూరుఁడవు గనుక నీతో యుద్ధముచేయ చేతు లందు విల్లు బాణములు ధరించి వచ్చితిని. ఆయుధములు చేతనుండ నేల యూరక వదరెదవు? రమ్ము. యుద్ధము సేయుము అనఁగా.

—♦ రావణ లక్ష్మణుల యుద్ధము ♦—

ఉ. క్రోధపరీత చిత్తుఁ డయి ♦ క్రూరసుపుంఖకలంబసప్తకం
బేధిత వేగముం బఱప ♦ నింతలు నింతలు చేసె వాని దు
స్సాధపరాక్రముండు నర ♦ సత్తముఁ డుజ్జ్వలరుక్మపుంఖ ము
త్సేధము శాతధార మగు ♦ తీవ్రపృషత్కసముత్కరంబునన్. ౧౨౯౯

అర్థములు. క్రోధపరీతచిత్తుఁడు = కోపముచే చుట్టుకొనిన మనస్సుగల వాఁడు, క్రూర - సుపుంఖ - కలంబ - సప్తకంబును=మంచి పింజలుగలిగిన యేడు బాణములను, ఏధిత వేగమున్=వృద్ధిచెందు వేగముగలవి, దుస్సాధపరాక్రముండు= సాధింపరాని పరాక్రమము గలవాఁడు, ఉజ్జ్వల = ప్రకాశించు, రుక్మపుంఖ= బంగారు పింజగలది, ఉత్సేధము=పొడవైనవి, శాతధారము = పదునైన యంబు గలది, తీవ్ర = వేగముగల, పృషత్క = బాణముల, సముత్కరంబునన్ = సమూహముచే.

తా త్ప ర్య ము

క్రోధముచేఁ జుట్టుకొనఁబడిన మనస్సుగలవాఁడై రావణుఁడు మంచి పింజలు గల యేడు బాణములను మిగుల వేగముగ వేయఁగా నసాధ్య పరాక్రముఁ డగు లక్ష్మణుఁడు వానిని బంగారు పింజ గలిగి పొడవై పదునైన బాణసమూహములచే తునుకలు తునుకలుగా పడఁగొట్టెను.

సీ. సౌమిత్రి నిర్ముక్త ♦ శాతాశుగంబుల, చే దనబాణముల్ ♦ చిద్రుప లగుచు
నిర్ముక్తఫణులట్లు♦నేలఁ దొరంగినఁ, దామ్రలోచనుఁ డయి♦దశముఖుండు
వెండియుఁ గురియించె♦గాండప్రకాండ ప్ర,కాండంబులను మెండు♦దండిగాఁగఁ
దద్బాణవర్షంబు♦దశరథసుతుఁడును, గర్ణిభల్లక్షుర ♦ కాండములను

తే. నర్ధచంద్రశరంబుల♦నన్ని యంద, యంద తునుమాడి కలఁగక ♦ యంద నిలిచె
నన్నిశరములఁ దానేయ♦నన్ని వితథ,ములుగనొనరించులక్ష్మణు♦బలముఁ జూచి.

అర్థములు. నిర్ముక్త=విడువఁబడిన, శాత=పదునైన, అశుగములచేన్= బాణములచే, చిద్రుపలు = తునుకలు, ఇందు 'చి' లఘువేకాని గురువుకాదు. నిర్ముక్త=కుబుసము విడిచిన, ఫణులట్లు = పాములవలె, తొరంగినన్ = పడఁగా, కాండ ప్రకాండ ప్రకాండములను=శ్రేష్ఠములైన బాణముల సమూహములను

కర్ణి = బాణవిశేషము, భల్ల = బల్లెములవంటి, క్షుర = మంగలికత్తులవంటి, కాండంబులను = బాణములను, వితథములు = వ్యర్థములు.

'నకూటై రాయుధై ర్హన్యాత్ యుధ్యమానో రణే రిపూన్
నకర్ణిభి ర్నాపి దిగ్ధైః నాగ్నిజ్వలిత తేజనైః' మను—౭-౯౦

లోపల కత్తియుండి పైకిఁ గఱ్ఱవలెఁ గానవచ్చు నాయుధములతోఁ గాని, కర్ణి యాకారము గల బాణములచేఁ గాని విషముపూసిన యాయుధములతోఁ గాని నిప్పులోఁ గాల్చి వేఁడిచేసిన బాణములచేఁ గాని యుద్ధమందు శత్రువును గొట్టరాదు. ఇట్లు మనుస్మృతి చెప్పుచుండ లక్ష్మణుఁడు కర్ణిబాణములు ప్రయోగింప వచ్చునా ?

సమాధానము :—శత్రువులను గొట్టి చంపుటయందు వాని నుపయోగింప రాదని స్మృతి చెప్పుచున్నది. లక్ష్మణుఁడు శత్రువు వేసిన బాణములు తన్నుఁ దగులకుండఁ దప్పించుకొనుటకై వానిని ఖండించెను గాని రావణుని వానితోఁ గొట్టలేదు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వేసిన వాఁడిబాణముచేఁ దన బాణములు తునుకలు తునుకలై కుబుసము విడిచిన పామువలె నేలఁబడుటచూచి కన్నులెఱ్ఱచేసి రావణుఁడు మఱియు శ్రేష్ఠములైన బాణసమూహములను లక్ష్మణుపై దండిగాఁ గురియించెను. లక్ష్మణుఁడును ఆ బాణములను కర్ణికలచేతను బల్లెములు, మంగలికత్తులు పోలిన బాణముల చేతను అర్ధచంద్రబాణములచేతను అన్నిటిని నచ్చట నచ్చటనే విల్లువెడలి రాఁగానే ఖండించి కలఁకలిలేక నిలిచెను. ఈ ప్రకారము దా నెన్ని శరములు వేసినను అన్నిటిని వ్యర్థములుగఁ జేయు లక్ష్మణుని బలము చూచి.

ఉ. అబ్బుర మంది యయ్యనఘు♦హస్తలఘుత్వపటుత్వలక్ష్మికిన్
బొబ్బున వెండియుం గురిసె ♦ ఘోరశరంబుల వాని నెల్ల బె
న్నిబ్బరమూని లక్ష్మణుఁడు ♦ నేలను గూలఁగ నేసి పీని పె
న్గబ్బితనం బడంచి వడిఁ ♦ గాలునిఁ గూర్చెద నంచు నెంచుచున్. ౧౩౦౧

అర్థములు. అబ్బురము=ఆశ్చర్యము, అపూర్వశబ్దభవము, హస్తలఘుత్వ పటుత్వ లక్ష్మికిన్=చేతిలాఘువ సంపత్తికి, బలసంపత్తికి, గబ్బితనంబు=గర్వము, పెను+నిబ్బరము = పెన్నిబ్బరము, మిక్కిలి మనోదార్ఢ్యము, నిర్భర శబ్దభవము నిబ్బరము.

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముని చేతి లాఘవము క్రమముగాఁ దగ్గక యతిశయించు చుండుటకు నాశ్చర్యపడి యాలస్యము చేయక మఱియును భయంకరములైన బాణములను

గురిసెను. లక్ష్మణుఁడు మనోదార్ఢ్యము యొక్క యతిశయము గలవాఁడై వాని నెల్లను నేలఁబడఁగొట్టి వీని గర్వము నణఁచి వీనిని వధించెద నని యాలోచించుచు.

శా. దంభోళి ప్రతిమానదండనిభ శాత • క్రూర బాణాళి సం
రంభం బొప్పఁగ వింటఁగూర్చి హుత భు • గ్రశ్మిచ్ఛటల్ గ్రక్కు త
చ్ఛుంభ ద్వేగితతిన్ నిగిడ్చె నల ర • క్షోనాథు పై దర్పవి
స్రంభుం డాతఁడు వానిఁ ద్రుంచి మఱి వి • శ్వస్రష్టృ దత్తంబులన్. ౧౩౦ ౨

అర్థములు. దంభోళిప్రతిమాన=వజ్రాయుధముతో సమానమైన, దండనిభ = యమదండము పోలిన, శాత = పదునైన, క్రూర, బాణాళి = బాణపంక్తిని, హుతభుక్ = అగ్నియొక్క, రశ్మిచ్ఛటల్ = జ్వాలల సమూహములు, తత్ = ఆ, శుంభత్ = ప్రకాశించు, వేగితతిన్ = వేగముగల బాణముల సమూహములను, దర్ప విస్రంభుండు = నమ్మకమైన దర్పము గలవాఁడు, విశ్వస్రష్టృదత్తంబులన్=బ్రహ్మయిచ్చినవానిని, పై పద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము

వాఁడిమియందు వజ్రాయుధముతోను క్రౌర్యమందు యమదండముతోను సమానమైన బాణపంక్తిని వేగముగ వింటఁగూర్చి యగ్నిమంటలు వెలువరించుచున్న యా శీఘ్రగమనము గల బాణములను రావణునిపైఁ బ్రయోగించెను. తన బలగర్వమునందు నమ్మకముగలవాఁడు వానినిఁ ద్రుంచి మఱియును బ్రహ్మయిచ్చిన,

శా, కల్పోషర్బుధతుల్యకాంతి శరపూ • గంబుల్ లలాటస్థలిన్
గ్రొల్పెన్ గాఢముగా సుమిత్రసుతుఁడుం • గ్రూరాస్త్రసంతానజా
తాల్పానల్పవ్యథ సంచలించి శిథిలం • బౌ చాపముం బట్టి పె
న్మేల్పారం బ్రతిలబ్ధసంజ్ఞుఁ డయి ఖం • డించెం దదిష్వాసమున్. ౧౩౦౩

అర్థములు. కల్ప = ప్రలయకాలమందలి, ఉషర్బుధ = అగ్నిహోత్రముతో, 'బర్హిశ్శుష్మా కృష్ణవర్త్మా శోచిష్కేశ ఉషర్బుధః' అని యమరము. తుల్య = సమానమైన, కాంతి = ప్రకాశము గల, శరపూగంబులన్ = బాణసమూహములను, లలాటస్థలిన్=నొసట, క్రొల్పెన్ = నాటనేసెను, క్రూరాస్త్రసంతానజాత = క్రూరాస్త్ర సమూహమువలనఁ గలిగిన, అల్పానల్పవ్యథ=గొప్ప బాధచే, సంచలించి=వణకి, శిథిలంబు=జాఱిపోవుచున్న, పెన్మేల్పారన్=మిక్కిలి హెచ్చరికతో - ప్రతిలబ్ధ సంజ్ఞుఁడయి=తెలివినొందినవాఁడై, తత్=ఆరావణుని, ఇష్వాసమున్=వింటిని, ఖండించెన్=నరకెను.

తా త్ప ర్య ము

ప్రలయకాలాగ్నితో సమానమైన కాంతిగల బాణసమూహములను నొసట దృఢముగా నాటునట్లు వేసెను. లక్ష్మణుఁడా క్రూర బాణసమూహమువలనఁగలిగిన

విశేష బాధచే వణఁకి జాఱిపోవు వింటిని హెచ్చరికతోఁ బట్టుకొని స్మృతి తెచ్చుకొని వానివింటిని ఖండించెను.

శా. తుండెల్ చేసి నిరంకుశత్వరను దై♦త్యున్ మూఁడు బాణంబులన్
గుండెల్ వ్రయ్యఁగ నాటఁగా నతఁడు గ♦ర్గ్గోలొంది తబ్బిబ్బునై
ఖండీభూతశరాసనుండు భృశర♦క్తక్లిన్న గాత్రుండు మే
దోండవ్యాప్తతనుం డసంజ్ఞుఁ డయి కృచ్ఛాప్తస్మృతిం దెంపునన్. ౧౩౦౮

అర్థములు. నిరంకుశత్వరను=అడ్డములేని వేగముచే, గర్గోలొంది = కలవరపడి, ఖండీభూత శరాసనుండు = తునుకలుగాఁ జేయఁబడిన విల్లుగలవాఁడు, భృశరక్తక్లిన్న గాత్రుఁడు = విశేషముగ నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడు, మేదస్+అండ=మాంసపు ముద్దచే, వ్యాప్తతనుండు = వ్యాపింపఁబడిన దేహము గలవాఁడు, అసంజ్ఞుఁడయి=స్మృతి తప్పినవాఁడై, కృచ్ఛాప్తస్మృతిన్=కష్టము మీఁద పొందఁబడిన స్మృతిగలవాఁడై, తెంపునన్ = సాహసముచే, 'మేద వపా వసా' అమరము. హృదయమందుండు మాంసమునకు మేదస్సని పేరు.

తా త్ప ర్య ము

ఇట్లు తుంటలుగాఁజేసి యడ్డములేని త్వరనువాఁడు మరల విల్లెత్తుకొన నీయకుండునంత వేగముగ రావణుని మూఁడు బాణములచే గుండెలు పగులునట్లు నాటఁగా వాఁడు దిగ్భ్రమచెంది తబ్బిబ్బై విల్లువిఱిగినవాఁడు విశేషముగ నెత్తుటఁ దడిసినవాఁడు గుండెలలోని మాంసపుముద్దలచేత వ్యాపింపఁబడిన దేహముగలవాఁడై స్మృతి తప్పి యతికష్టముపైన మరల స్మృతి తెచ్చుకొని సాహసించి వేఱొక విల్లెత్తి యెక్కుపెట్టు లోపలఁ జంపునని భయపడి.

ఉ. తోయజగర్భుఁ డిచ్చిన వి♦ధూమ కృశానునిభం బమోఘ మ
త్యాయతశక్తి శక్తి యను ♦ నాయుధముం గపికోటి బెగ్గిలన్
జే యని వీచి వైవఁ గని ♦ నిష్ఠురవహ్నిసదృక్శరంబులన్
దాయక యుండఁ గొట్టినను ♦ దాఱక యయ్యది భీషణాకృతిన్. ౧౩౦౯

అర్థములు. తోయజగర్భుఁడు=బ్రహ్మ, విధూమ = పొగలేని, కృశానునిభంబు = అగ్నితో సమానము, అమోఘము = వ్యర్థము పోనిది, అత్యాయతశక్తి=మిక్కిలి విస్తారమైన శక్తిగలది యగు, బెగ్గిలన్ = భయపడఁగా, నిష్ఠుర = కఠినములైన, వహ్నిసదృక్=అగ్నితో సమానమైన, శరంబులన్=బాణములను, దాయక యుండన్=సమీపమున కది రాకుండునట్లు, తాఱక = నిలువక, భీషణాకృతిన్ = భయంకరాకారముతో.

తా త్ప ర్య ము

బ్రహ్మదేవుఁ డిచ్చిన పొగలేని యగ్ని సమానమైనదియు, వ్యర్థము పోనిదియు, మిగుల విస్తారమైన శక్తిగలదియు నగుశక్తి యను నాయుధమును క్రోఁతులు

భయపడుచుండఁగా జేయని విసరినైవఁగా జూచి లక్ష్మణుఁడు కఠినములైన యగ్ని సమానములైన బాణములచే నది దగ్గఱకు రాకుండఁ గొట్టెనుగాని యది యమోఘమైనది కావున నిలువక భయంకరముగా.

—♦ మూర్ఛిల్లిన లక్ష్మణు రావణుఁ డెత్తఁ బ్రయత్నించుట. ♦—

చ. సరభసవృత్తి వచ్చి సువి♦శాలభుజాంతర సీమ నాటినన్
గురుతరశక్తిశాలి రఘు♦కుంజరుఁ డుజ్జ్వలగాత్రుఁడై ధరం
దొరఁగెను సొమ్మసిల్లుచును ♦ దూర్ణమ వింశతిబాహుఁ డా మహా
పురుషుని నెత్తికొంచ చరుగ ♦ బుద్ధిఁ దలంచి కరాళి నెత్తఁగన్. ౧౩౦౬

అర్థములు. సరభసవృత్తిన్ = త్వరతోఁ గూడిన వ్యాపారముతో, సువిశాల = మిక్కిలి వెడల్పుగల, భుజాంతరసీమ = ఱొమ్మునందు, గురుతరశక్తిశాలి = మిక్కిలి గొప్ప శక్తిగలవాఁడు, దీనివలన బ్రహ్మయిచ్చిన శక్తికంటె లక్ష్మణుశక్తి మిగుల గొప్పదని భావము. అట్లులుండి యేల పడెననిన బ్రహ్మను గౌరవించుటకే యని తెలియునది. ఇది ముందు స్పష్టపడును. ఉజ్జ్వలగాత్రుఁడై = ప్రకాశించు దేహము గలవాఁడై, చావుదెబ్బ తగిలినపుడు దేహము కాంతి విహీనము గావలయునుగాని ప్రకాశింపదు. ఇట్లు ప్రకాశించుటకు హేతువు వైష్ణవ తేజము విశేషముగ నావహించుటయే యని యెఱుఁగనగు. సొమ్మసిల్లుచును = మూర్ఛపోయినట్లు, తొరఁగెను = వ్రాలెను, తూర్ణమ = శీఘ్రముగ, వింశతిబాహుఁడు=ఇరువది చేతులు గలవాఁడు, ఇట్లు చెప్పుటచే నిపుడు వాఁ డిరువది చేతులతో నుండెనని సూచన, కరాళిన్ = చేతుల సమూహముతో.

తాత్పర్యము

శీఘ్రముగ వచ్చి మిగుల వెడల్పయిన ఱొమ్మున నాటఁగా మిగుల గొప్ప శక్తిగల లక్ష్మణుఁడు ప్రకాశించు శరీరముగలవాఁడై సొమ్మసిల్లినట్లు నేల వ్రాలెను. అదిచూచి రావణుఁడు ఆ మహాపురుషుని నెత్తికొనిపోవ నిరువది చేతుల నెత్తఁగా దలఁచి.

రావణుని యీ ప్రయత్నమున కుద్దేశ్యమేమి ?

(౧) ఇంద్రజిత్తు నాగపాశముల బంధించి చంపినపుడు మరల బ్రదికి లేచిరి. ఇప్పు డూరక విడిచిన లక్ష్మణుఁడు మరల లేచునేమో? కావున సముద్రములో నిప్పుడే మూర్ఛనుండఁగనే పాఱవేయవలయునని యొక యుద్దేశ్యము. అట్లు చేసిన రాముఁడు సహాయహీనుఁడై యుద్ధము చాలించుకొనునని యతని తలంపు.

(౨) లంక కెత్తుకొనిపోయి చెఱను దుంచి యొకవేళ బ్రదికినను మరల రానీయక కట్టివేసి రామునకుఁ దెలిపిన లక్ష్మణుని విడిపించుకొనుటకై సీతను వదలు కొనెదను, లక్ష్మణు విడిపింపుమని రాముఁడు సంధికై రావచ్చునని కాని, నీవు సంధికి వచ్చెదవా లక్ష్మణుని జంపుదునాయని రాముని బెదరింపవచ్చునని కాని యుద్దేశ్యము.

ఉ. మానితశక్తి మేరువును ♦ మందరముం దుహినాచలంబు ద్యో
యానచరాన్వితం బగు స♦మస్తజగంబును గేల నెత్త నా
దానవభర్త యాభరతు ♦ తమ్ముఁ గదల్పఁగ నేరఁ డయ్యె బల్
పూనికఁ బంగటించి పెద♦వుల్బిగియించియు నీలకర్చియున్. ౧౩౦౭

అర్థములు. మానితశక్తిన్ = గౌరవింపఁ బడిన బలముచే, తుహినాచలంబు=హిమవత్పర్వతము. ద్యోయానచరాన్వితంబు = దేవతలతోఁ గూడినది యగు, ఎత్తనా=ఎత్తఁగాఁగల, భరతు తమ్మున్ = భరతుని తమ్ముని, కదలింప లేనివాఁడు భరతుని యన్ననేమి జయింపఁ గలఁడు, రావణున కీమాత్రమైనఁ దోఁచినదికాదు. పంగటించి=కాళ్ళెడమెడముగా నుంచి, ఈలకర్చియున్=ప్రాణములు బిగపట్టియు, మేరువును = సర్వపర్వతములలో శ్రేష్ఠమైన మేరుపర్వతము నైనను రావణుఁ డెత్తఁగలడు, రావణున కోడిపోయి యూడిగముచేయు వాయుదేవుఁడు మేరువు నోడించి దానిశిఖరము దెచ్చి పాఱవేయఁగా నదికదా లంక యయ్యెను. ఇఁక రావణుఁడు మేరు నెత్తుట యసాధ్యముకాదు. మందర మెత్తుటయు నసాధ్యముకాదు. రావణున కోడిపోయిన దేవతలే మందర మెత్తినపుడు దానిని రావణుఁ డెత్తుట యసాధ్యకార్యముగాదు. హిమవంతమును రావణుఁ డెత్తుట యసాధ్యకార్యము గాదు. ఏలన:— 'ధైర్యేణ హిమవా నివ' యని కదలకుండు వానిలో గొప్పదగు హిమవత్పర్వతమును నెత్తఁగలఁడు. శివుఁ డుండు కైలాసము హిమవంతములోనిదే కదా. దానిని సమూలముగా నెత్తి కుదిలించిన వాఁడు హిమవంతము నెత్తలేఁడా ? సమస్త జగంబును = పూర్వము హిరణ్యాక్షుఁడు భూమినంతయుఁ బ్రాణికోట్లతో నెత్తికొనిపోలేదా ? వాఁడేకదా వీఁడు ! ద్యోయానచరులు=దేవతలందఱు రావణు కోడుకునకు నోడిపోయిన వారేకదా ! కావున సమస్త భూమినెత్తుటయు నసాధ్యముకాదు. ఎట్లెత్తుట? కేలన్ = ఒకచేత. ఇంతయు నొకచేతితో నెత్తఁగలవాఁడు, దానవభర్త = దుష్టరాక్షసులకు వీఁడు భర్తయైన కారణముచేతనే లక్ష్మణు నెత్తఁజాలఁ డయ్యెను. భరతు తమ్ముని = రాముని తమ్ముని తమ్ముని కదల్పఁగ, ఎత్తుటకుఁగాదు, కదలించుటకైనను నేరఁ డయ్యెను. ఇఁక నెత్తుట యెక్కఁడిది ? మోసికొనిపోవుట యెక్కఁడిది ?

పగఱ కప్రకంప్యుఁడని చెప్పఁబడుటచే రావణుఁడు లక్ష్మణుని గదలింప లేకుండుట చూచి మఱికొందరు రాక్షసులుకూడ వానికి సహాయపడిరని తెలియ నగు. ఇందఱు కదలించినను లక్ష్మణుఁడు కదలిన వాఁడు కాఁడు.

మేరుమందరహిమవంతములతోడి సమస్త ప్రపంచమునకన్న మూర్ఛపోయిన లక్ష్మణుఁడు భార మయ్యెనని భావము.

ప్రతిక్రియచేయక, స్వాధీనత చెడినట్లున్న లక్ష్మణు నొకనిని రావణుఁడు కదలింప నేరఁడయ్యెఁగదా ! మేలుకనియున్న రాముని లక్ష్మణునికూడ విరాధుఁ

డెత్తుకొని పోఁగలిగెను? అది వారై యంగీకరించిన కార్యము. హనుమంతుఁడు రామలక్ష్మణుల నిరువుర నెత్తికొని సుగ్రీవునొద్దకుఁ బోలేదా? రావణుఁడు సీతాదేవి నెత్తికొని పోఁగలుగుటకు నామె విరుద్ధభావము సూచింపక వానికొంప ధ్వంసముచేయ లంకకుఁబోవ సమ్మతించుట చేతనే యని యెఱుఁగవగు.

తాత్పర్యము

గౌరవింపదగిన శక్తిచే మేరువును మందరమును హిమవంతమును దేవతలతోఁడి ప్రపంచము నొకచేత నెత్తఁగలవాఁడు రాక్షసరాజా భరతుని తమ్ముని దృఢప్రయత్నముచేసి కాళ్ళు పంగచాఁచి పెదవులు బిగించి ప్రాణములు బిగఁబట్టినను గదలించుటకును సమర్థుఁడు కాఁడయ్యె.

లక్ష్మణుఁ డింత భారమగుటకుఁ గారణ మేమన.

ఆ. వనజభవునిశక్తి ♦ వక్షంబు నాటంగ, నిట్టి దట్టి దనుచు ♦ నెన్నరాని
విబుధవినుత మైన♦విష్ణ్వంశభూతమా, స్వస్వరూప మతఁడు♦సంస్మరించె. ౧౩౦౮

అర్థములు. వనజభవునిశక్తి = బ్రహ్మశక్తి, విబుధవినుతము = దేవతలచే స్తోత్రము చేయఁబడినది, విష్ణ్వంశభూతము=విష్ణువున భాగమైన, స్వస్వరూపము=తనస్వరూపము, సంస్మరించె=తలఁచెను.

బ్రహ్మశక్తి యమోఘమని చెప్పఁబడెనే, ఇప్పుడది వ్యర్థమైనట్లేకదా, యనిన నమోఘమైన వజ్రాయుధమును నగౌరవింప రాదని గరుత్మంతుఁడు తన యీఁక నొకటి వీఁకి యిచ్చి గౌరవించి పంపినట్లు లమోఘమైన బ్రహ్మశక్తిని లక్ష్మణుఁడు మూర్ఛ నటించి గౌరవించెను. వనజభవుని శక్తి యిట్టిదట్టి దనుచుఁ జెప్ప సాధ్యమైనది. ఏలన నతఁడు ప్రాకృత మండలములోఁ జేరినవాఁడు, బ్రహ్మ కమలమందుఁ బుట్టినవాఁడు. (వనజభవుఁడుకదా). ఆకమలము నీళ్ళయందుఁ బుట్టినది. ఆనీటికయనమైనవాఁడు. దానిని దొలుత సృజించినవాఁడు (అప ఏవ ససర్జాదౌ) నారాయణుఁడు. అట్టివాని యంశము లక్ష్మణుఁడు. ఇట్టి వానిని బ్రహ్మశక్తి యేమి చేయఁగలదు? విష్ణుశక్తి యిట్టిదని బ్రహ్మకే తెలియ సాధ్యము కానపుడు తక్కిన వారిమాట యేల? ఇట్టి దట్టి దనుచు నెన్నరాని యనుటచే దాని లక్షణము నెఱుఁగ బ్రహ్మాదులకు సాధ్యముగాదు. అయినను వారు చేయఁగల దేమన, విబుధవినుతము. ఆయన చేసిన కార్యములు స్తోత్రము చేయఁగలరు. అంత కెక్కువ వారికిని దెలియదు. ఒకఁ డొక కోటిరూయలు దానము చేసినపుడు దానిని బ్రశంసింప వచ్చునే కాని వానియొద్ద నట్టికోట్లెన్ని యున్నవో యెవ్వఁ డెఱుఁగును?

స్మరించె ననిన—మఱచిన దానిని జ్ఞప్తికిఁ దెచ్చుకొనుట స్మరించుట. ఇది స్మరించుట కాదు. సంస్మరించుట. విస్మరణ మెన్నఁడు లేదు. సమ్మను నుపసర్గ స్మరణమందున్న దానినే విశేషముగ స్మరించెనని తెలుపుచున్నది. ఇట్లు లవతార మూర్తిత్వము చెప్పఁబడెను. స్మరణమందున్న దానిని మరల స్మరించుటయేమి?

భగవంతుఁ డంతర్యామిగా నన్ని పదార్థములు దున్నను బ్రహ్మాదులందుఁ దన తేజస్సును విశేషముగఁ బ్రవేశ పెట్టినట్లు పదార్థములం దన్నిట వేఁడిమి (యగ్ని యున్నను సూర్యచంద్రాగ్నులందు విశేషించి యున్నట్లు) ఇతర వేళల లక్ష్మణు మనస్సు ఇతర కార్యములందును వర్తించుచుండెను. ఇప్పు డట్లు కాక స్వస్వరూప చింతయందే యుండెననుట. దాని వలనఁ గ్రొత్తగా వచ్చినది యేదియు లేదు.

ఓయి! యిచ్చట 'సోహమ్' నేనే యతఁడని స్మరించెనని యేల చెప్పరా దనిన సోహ మనుటకు నది ముఖ్యార్థమునఁ గాదు. అది యెట్లులుండినను ఇచ్చట విష్ణ్వంశభూతము స్వస్వరూపమని చెప్పఁబడెను గాని విష్ణువగు స్వస్వరూపమని చెప్పఁబడలేదు. కావున నా యర్థము పొసఁగదు. విష్ణ్వంశ మనఁగా విష్ణువునం దొక భాగము. బాలకాండమున నవతారఘట్టము చూచునది. బాల. ౫౦౩ పద్యము లక్ష్మణుఁ డాది శేషుఁడు కదా!

ఓయి విష్ణుతేజము నిరవయవముగదా! దానియందు భాగము అంశ మెక్కడిది? సత్యము. ఇచ్చట నంశమనునది స్వరూపముచే భాగమని గ్రహింపరాదు. తారతమ్యము గుణావిర్భావ మందుచున్నది. పరవాసుదేవునందు నాఱుగుణములు సంపూర్ణముగ నున్నవి. తక్కిన ముగ్గురయందు రెండు రెండు పూర్ణముగాను దక్కినవి కొంచె కొంచెముగా నున్నవి. పూర్ణావతారములందు జ్ఞానబలములు పూర్ణముగా నుండును. తక్కినవి కొంత కొంత యుండును. కావున నంశమని చెప్పుదురు గాని స్వరూప విభాగమును బట్టికాదు.

'ఆమోదే భువనే ప్రమోద ఉత సమ్మోదేచ సంకర్షణం
ప్రద్యుమ్నంచ తథానిరుద్ధ మపి తాన్ సంహారసృష్టిస్థితీః
కుర్వాణాన్ మతిముఖ్య షడ్గుణవరైర్యుక్తాం స్త్రియుగ్మాత్మకై
ర్వ్యూహాధిష్ఠిత వాసుదేవ మపి తం క్షీరాబ్ధినాథం భజే.
గుణైష్షడ్భిస్త్వేతైః ప్రథమతరమూర్తిస్తవ బభౌ
తతస్తిస్రస్తేషాం త్రియుగయుగళైర్హి త్రిభి రభుః
వ్యవస్థాయాం చైషాం నను వరద సావిష్కృతి వశాత్
భవాన్ సర్వత్రైవ త్వగణిత మహా మంగళగుణః.

అనునవి ప్రమాణములు.

కొందఱు లక్ష్మణుఁడు పూర్వమింత బరువులేఁడనియు, తన స్వస్వరూపము స్మరించుటచే నింత బరువయ్యె నందురు. కొందఱు తనకు వచ్చిన యాపద తీర్చు కొనుటకై విష్ణువును స్మరించెనందురు. కొందఱు ఇతఁడు విష్ణువు నంశమైనను తద్భా వన యతనికి సదా యున్నచో మనుష్యభావన నడవనేరదనియు అది లేనిచో రావణ వధాదులు జరుగవనియుఁ గాఁబట్టి యతఁడు సదా మనుష్యభావనతో నుండెననియుఁ గొందఱందురు. వీనిలో నొక్కదానికైనను నిలువఁ గాళ్ళు లేవు. వీని కాధారమైన

శబ్దముగాని భావముగాని లేదు. అంతయు వారి వారి స్వకపోలకల్పితము లగు నూహలు కావున గ్రంథస్థవాక్యములే ప్రమాణములు.

రామలక్ష్మణులు మనుష్యు లను భావన రావణున కుండవలెను. గాని రామలక్ష్మణుల కుండవలసిన పనిలేదు. కావున వాని కాతత్త్వము తెలియరా కుండ నటించిరి. నాటక ప్రదర్శన మందు వలెనని యెఱుంగునది. రసానుభవము సభ్యులకే కాని పాత్రములకుఁగాదు. లక్ష్మణుఁడే రామచంద్రమూర్తితో 'కిమాత్మానం మహాత్మాన మాత్మానం నావబుధ్యసే' యని రెండుమార్లు చెప్పెను. ఇది స్వరూప విస్మృతి గలవాఁడు చెప్పెడి మాటలా ?

తాత్పర్యము

బ్రహ్మశక్తి తన వక్షమున నాఁటఁగ నింతమాత్రమైనది అట్టి విధమైనదని చెప్పసాధ్యము కానిదియు దేవతలచే స్తోత్రము చేయఁబడినదియు విష్ణువున భాగమైనదియు నగు తన స్వరూపమును లక్ష్మణుఁడు సంస్మరించెను.

ఉ. మానక వైష్ణవాంశ మటు • మానుష దేహ సమాస్థితంబుగా
దానవదర్పనాశకు ను • దారబలాఢ్యు సుమిత్ర పట్టిన
ద్దానవనాయకుండు భుజ • దండములన్ బిగఁబట్టియున్ రవం
తేనియు నెత్తఁజాలక ర • హిం బెనఁగాడుచు నుండె నింతలోన్. ౧౩౦౯

అర్థములు. మానక = వదలక, వైష్ణవాంశమునుటచే, ఈశబ్దము వైష్ణవాంశము లక్ష్మణునం దిదివఱకు లేక యిప్పుడు వచ్చినది కాదనియు సర్వావస్థల సర్వకాలముల విడువక యుండునదే యనియుఁ దెలుపుచున్నది.

మానుష దేహ సమాస్థితంబుగాన్ = మనుష్య దేహమువంటి దేహమునం దుండుటచే. గజయాన యన్నపుడు గజగమనమువంటి గమనము గలదని భావమే కాని యేనుఁగువలె నాలుగు కాళ్ళ నడుచునది యని యర్థము కాదు. ఇక్కడ నట్లులే మనుష్యాకారసమానాకార మని గ్రహింపవలయును. అటుగాక మనుష్య దేహమందు వైష్ణవాంశము ప్రవేశించెననిన నది పరశురామాద్యవతారములవలె ఆవేశావతారము లగును గాని పూర్ణావతారము గానేరదు. రామావతారము పూర్ణావతారమని రామాయణమందేకాక యితర ప్రమాణములందును గలదు.

సర్వవ్యాపకుఁడైన భగవంతుఁడు తానొక యవతార మెత్తవలయు ననిన నొక శరీరములో నున్న జీవునిపైఁ దన సర్వశక్తిత్వముచేఁ దన గుణావిర్భావము గావించి యతఁడు భగవదవతారముగాఁ గనఁబడఁజేయును. ఆయవతార ప్రయోజనము నెఱవేఱిన పిమ్మట దానియందలి భగవద్గుణావిర్భావము తొలఁగును. అర్జున పరశురామాదులందువలె. ఇది ఇనుపగుండు నిప్పులో వేసినం దత్కాలమున నిప్పువలెఁ బనిచేయునట్లు దీనినే యావేశావతారమందురు.

ఇట్లుగాక యింకొక యవతారము గలదు. భగవంతుఁ డీలోకమున మనుష్య

రూపమున నవతరింపఁ దలఁచుకొనెనేని యప్రాకృతమైన పంచోపనిషత్తులను వస్తువులను బ్రకృతి మండలము లోనికి రప్పించి దానిచే మనుష్యులవంటి యాకార మేర్పఱచి యందుఁ దాను బూర్వమే వ్యాపించియున్నను నాశరీరమూలకముగాఁ దన గుణంబుల నన్నిటినో కొన్నిటినో యావిర్భవింపఁజేయును. ఇందు జీవునిపై గుణవ్యాప్తిలేదు. ప్రాకృత శరీరములందే జీవునిపై గుణావిర్భావము. పూర్ణావతారములందు శరీరాకారము మనుష్యాద్యాకారములవలెనుండును. గాన మనుష్యాద్యవతారము లందుము. ఈరామావతార మిట్టిది. ఈ శరీరములకు పంచోపనిషన్మయశరీరము లని పేరు. దానవ దర్పనాశకున్ = రాక్షసుల గర్వము నాశము చేయువానిని, ఉదార బలాఢ్యున్=గొప్పబల సంపత్తి గలవానిని, సుమిత్ర పట్టి= సుమిత్రబిడ్డఁ డని పేరొందిన వానిని, భుజదండములన్ = ఇరువది చేతులతోను.

తాత్పర్యము

ఏ వేళల నే దశల వదలక వైష్ణవాంశమైన తేజస్సు మనుష్య సమానాకారము నందుండుటచే రాక్షసగర్వనాశకుఁడును, గొప్ప బల సంపత్తి గలవాఁడునగు లక్ష్మణుని రాక్షసరాజు ఇరువది చేతుల బిగఁబట్టియు నేకొంచెమైనను నెత్తఁజాలక ప్రతిష్ఠకై యవమానము వచ్చునే యని విడిచి పోలేక పెనఁగాడుచు నుండెను. ఇంతలో.

-♦ హనుమంతుఁడు రావణుఁదన్ని లక్ష్మణు నెత్తికొని శ్రీరామునొద్దకుఁ బోవుట ♦-

ఉ. పరువున వచ్చి వాయుజుఁడు ♦ వజ్రనిభం బగుముష్టి ఱొమ్మునం
 బురుతరశక్తి గ్రుద్దుటయు ♦ మోములఁ గన్నుల వీనులందు నె
 త్తురు లురలంగ దిక్కెఱిఁగియుఁ ♦ దోపక చేష్టలు దక్కి సోలి తా
 నరదములోనఁ గూలఁబడి ♦ యైనను గానఁడు పూర్వ సుస్థితిన్. ౧౩౧

అర్థములు. వజ్రనిభంబు = వజ్రాయుధముతో సమానమైన, ముష్టిన్= పిడికిట, పురతరశక్తిన్=మిగుల గొప్పదగు శక్తిచే, మోములన్=ముఖములందు పదిముఖములందలి భావము. వీనులందున్=చెవులందు, ఉరలంగన్ = బయలు వెడలఁగ, అరదములోనఁ గూలఁబడి యనుటచే హనుమంతునిఁ జూడఁగానే రథమెక్కఁబోయెనని సూచన, పూర్వసుస్థితిన్=మునుపుండిన స్వస్థావస్థను, తేరిలోఁ గూలఁబడి నాఁడనుటచేఁ దే రెక్కు సమయంబున గ్రుద్దినాఁడనియు నా దెబ్బదిని తేరిలోఁ బడిపోయినాఁడే కాని కూర్చుండుటకు శక్తిలేనివాఁడయ్యె నని భావము.

తాత్పర్యము

హనుమంతుఁడు పరువెత్తుచు వచ్చి వజ్రముతో సమానమైన పిడికిటఁ దన శక్తికొలఁది ఱొమ్ముపై గ్రుద్దఁగా (దీనివలన వంగి లక్ష్మణుఁ గదలించుచున్న రావణుఁడు హనుమంతుని రాక చూచి నిలఁబడి తేరెక్కఁబోయెనని సూచన) నిరువది నోళ్ళఁ గన్నులఁ, జెవుల నెత్తురు బయలు వెడలఁగా దిక్కు దెలియక కాళ్లు చేతులు

కదలించుట మాని మూర్ఛపోయి తన రథములోఁ గూలఁబడినను మునుపటి స్వస్థావస్థ చెందినవాఁడు కాఁడు. హనుమంతుఁ డప్పటి కసి యిప్పుడు తీర్చుకొనెను.

ఆ. అతుల శౌర్యధుర్యు ♦ నరసాపు చచ్చిన, పంక్తివదనుఁ జూచి ♦ ప్లవగతతులు
ఋషులు వాసవాది♦ఋభువితానంబులు, నెలమిఁ బొంగి కేక♦లిడియె నంత.

అర్థములు. అరసాపు సచ్చిన=మూర్ఛపోయిన, వాసవాది = ఇంద్రుఁడు మొదలుగాఁగల, ఋభువితానంబులు = దేవతా సమూహములు, ఎలమిన్= సంతోషముచే.

తాత్పర్యము

అసమానమైన శౌర్యాతిశయము గలిగి మూర్ఛపోయి పడిన దశకంఠుని జూచి వానరులు ఋషులు ఇంద్రుఁడు మొదలగు దేవతలు సంతోషముచే నుప్పొంగి కేకలు వేసిరి. ఆ పిమ్మట.

తే. రావణశరార్దితుని సుమి♦త్రాతనూజు, ననఘతేజస్వియైన వా ♦ తాత్మజుండు
బాహువుల నెత్తికొనిచని ♦ స్నేహగరిమ, రామచంద్రుని యంతిక♦సీమ నిలిపె.

అర్థములు. రావణ శరార్దితుని = రావణు బాణముచేఁ బీడింపఁబడిన వానిని, అనఘ తేజస్వి=పాపరహితమైన తేజస్సుగలవాఁడు, దీనివలన రావణుఁడు పాపపుఁదేజస్సు గలవాఁడని సూచన, స్నేహగరిమన్ = స్నేహాతిశయముచే, అంతికసీమన్ = సమీపప్రదేశమందు.

తాత్పర్యము

రావణు బాణముచేఁ బీడింపఁబడిన లక్ష్మణుని పాపసంపర్కము లేక తేజస్సు గల హనుమంతుఁడు స్నేహాతిశయముచే దన చేతుల నెత్తికొనిపోయి రామునొద్ద నుంచెను.

తే. పవనతనయుండు సుహృదుండుఁ♦బరమభక్తి, గలుగువాఁడునునగుట
లఁ♦క్ష్మణుఁడు పగఱ
కప్రకంప్యుండు నయ్యె వ♦నాటునకును, దేలికగ నయ్యె నంత నా♦ధీరవర్యు.

అర్థములు. సుహృదుండు=హితముఁగోరి హితముచేయువాఁడు, అంతేకాదు. పరమభక్తిగలుగువాఁడు=విశేషభక్తిగలుగువాఁడు, ఆపత్కాలమం దెవ్వఁడైన గ్రొత్తవాఁడైనను హితము చేయవచ్చును. అది తాత్కాలికప్రీతి. ఇది యట్టిది కాదు. పరమభక్తి...'పరానురక్తిరీశ్వరే' 'సా పరమప్రేమరూపా' 'స్నేహపూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే' యన్నట్లు నిరంతరమైన పరమానురాగము. అదియు నీశ్వరబుద్ధితో. పగఱ = శత్రువులకు, పగవారు = పగఱు, ఇది బహువచనరూపము. ఇట్లుచెప్పుటచే రావణునకు లక్ష్మణు నెత్తుటయందు మఱికొందఱు తోడుపడిరని సూచన. వనాటునకును=అడవియందుఁ దిరుగువానికిని, ఇట్లు చెప్పుటచే భగవత్ప్రీతికి భక్తియే కారణమనియు జాతి, ధనైశ్వర్యాదులు కావనియు

భావము, తేలికగ నయ్యెన్=వాస్తవముగ స్మృతి తప్పిపడిన వాఁడొకనికిఁ దేలిక గను మఱియొకనికి భారముగను దానుగనగు శక్తి, తెలివి, కలవాఁడు కాఁజాలఁడు కావున నిది మూర్ఛానటనమెకాని నిజమైన మూర్ఛకాదు. బ్రహ్మశక్తి నగౌరవింపరాదు గావున దానిని సమ్మానింప నాగపాశబంధములందు వలె నీ మూర్ఛ మాయామనుష్యనటనమే. అప్రకంప్యుఁడు = కదలింపరాని వాడు, ధీర వర్యున్=ధైర్యము గలవారిలో శ్రేష్ఠుని, ఇట్లు లక్ష్మణుఁడు భర్తనకుఁ దేలిక యగుట విరోధికి బరువగుట చెప్పుటచే నాయన కా యవస్థయందును జ్ఞానబలము లను నేకొఱఁతయుఁ గలుగ లేదనుట స్పష్టము. ఇచ్చట సంపూర్ణజ్ఞాన బలములు చెప్పుటచే స్థలాంతరములందు రామలక్ష్మణులు నజ్ఞానులవలెను దుర్బలులవలె వర్తించిరనుట నటనమనియు మనుష్యభావనానిర్వాహార్థ మనియు నెఱుంగనగును.

తాత్పర్యము

హనుమంతుఁడు హితము కోరువాఁడును బరమభక్తి కలవాఁడు కావున లక్ష్మణుఁడు శత్రువులకుఁ గదలింపరాని వాఁడైనను భక్తి గలవానికి నడవియందు దిరుగు క్రోఁతికి తేలికగా నయ్యెను.

కం. దుర్జయుఁ డగు లక్ష్మణుని వి,సర్జించి విధాతృశక్తి ♦ చయ్యనఁ జనియెన్
నిర్జరకంటకు తేరికి, వర్జితశల్యుండు తేఱి ♦ బడలిక దీఱన్. ౧౩౧౪

అర్థములు. దుర్జయుఁడు = జయింపరానివాఁడు, ఇట్లనుటచే లక్ష్మణుని శక్తి తనశక్తికంటె మించినదనియు నతనిని బాసేమియుఁ జేయఁజాలనని యది తెలిసికొనెనని భావము, విసర్జించి = వదలి, విధాతృశక్తి = బ్రహ్మశక్తి, నిర్జర కంటకు = రావణుని యొక్క, వర్జిత శల్యుఁడు = వదలి పెట్టఁబడిన మేకు వంటి బాణము గలవాఁడు, తేఱి=మూర్ఛ విడిచి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు తనకు జయింపరాని వాఁడని తెలిసికొని బ్రహ్మశర మతనిని వదలి రావణు తేరి మీఁదికిఁ బోయెను. బాణము వదలిపోఁగా లక్ష్మణుఁడు మూర్ఛ చాలించి లేచి తెప్పరిల్లుకొని బడలిక క్షయింపఁగా.

తే. మనములోపల స్మరియించు♦కొనుచు నుండె, విష్ణు నచింత్యమైనట్టి♦స్వీయభాగ
మంత సురవైరి తెప్పిఱి♦యాశుగములఁ గార్ముకంబును ధరియించి♦కడఁగెననికి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు మనస్సులోఁ దన విష్ణుని యచింత్యమైన భాగమును స్మరించు చుండెను. ఇంతలో రావణుఁడు లేచి విల్లుబాణముల ధరించి యుద్ధమునకుఁ బ్రయ త్నించెను.